అసురుడు

పరాజితుల గాథ

రావణుడూ, అతని ప్రజల కథ

ఆనంద్ నీలకంఠన్

అనువాదం : ఆర్. శాంతసుందరి

Telugu translation of Anand Neelakantan's #1 National Bestseller

ASURA - TALE OF THE VANQUISHED

The Story of Ravana and His People

అసురుడు

పరాజితుల గాథ

రావణుడూ, అతని ప్రజల కథ

ఆనంద్ నీలకంఠన్

అనువాదం: అర్. శాంతసుందరి

మంజుల్ పబ్లిషింగ్ హౌస్

First published in India by

Manjul Publishing House

Corporate and Editorial Office

● 2nd Floor, Usha Preet Complex, 42 Malviya Nagar, Bhopal 462 003 - India

Sales and Marketing Office

● 7/32, Ansari Road, Daryaganj, New Delhi 110 002 - India

Website: www.manjulindia.com

Distribution Centres

Ahmedabad, Bengaluru, Bhopal, Kolkata, Chennai, Hyderabad, Mumbai, New Delhi, Pune

English edition originally published in India by Platinum Press an imprint of Leadstart Publishing Pvt. Ltd.

© Story: Anand Neelakantan, 2012

© Illustrations: Leadstart Publishing, 2012

Abridged Telugu translation of Anand Neelakantan's *ASURA - Tale of the Wanquished*

This edition first published in 2014

Fifth impression 2018

ISBN 978-81-8322-422-2

Translation by Santha Sundari

No part of this publication may be reproduced, stored in or introduced into a retrieval system, or transmitted, in any form, or by any means

(electronic, mechanical, photocopying, recording or otherwise) without the prior written permission of the publisher. Any person who does any unauthorized act in relation to this publication may be liable to criminal prosecution and civil claims for damages.

Disclaimer

This is a work of pure fiction. All the characters depicted are fictitious and any resemblance to real persons living or dead, is purely coincidental. The author has used iconic names, dates, and events to aid story-telling. There is no intention to imply anything else. The content of this book is the sole expression and opinion of its author and a work of his imagination and does not claim scriptural authenticity. This work does not represent the views of the Publisher, nor endorses them in any way. The publisher makes no representations or warranties as to the completeness or accuracy of the information used in this work. Readers are requested to bear in mind that this work is fiction and does not purport to any religious or spiritual instruction or advocacy.

నా తలిదండ్రులు
స్వర్గీయ శ్రీ ఎల్. నీలకంఠన్
శ్రీమతి చెల్లమ్మాళ్ నీలకంఠన్లకి
భారతీయ పురాణ సాహిత్యం తాలూకు
అద్భుత ప్రపంచాన్ని నాకు పరిచయం చేసినందుకు.

రచయిత గురించి

నేను పుట్టింది త్రిపూనితుర అనే ఒక మారుమూల గ్రామంలో. అది కేరళలో కొచ్చిన్ ఊరిబైట శివార్లలో ఉంది. వేంబనాడ్ సరస్సు అవతల ఎర్నాకులానికి తూర్పున ఉన్న ఈ ప్రాంతంలో కొచ్చిన్ రాజవంశం ఒకప్పుడు నివసించేది. అక్కడ ఉండే వందకిపైగా దేవాలయాలవల్ల ఆ గ్రామం ప్రసిద్ధి చెందింది. అక్కడ శాస్త్రీయకళలు వర్ధిల్లాయి, కళాకారులు మంచి పేరుప్రతిష్ఠలు సంపాదించుకున్నారు, ఒక సంగీత విద్యాలయం కూడా స్థాపించబడింది. దేవాలయాల్లోనుంచి వినిపించే 'చెండా' వాద్యం ధ్వనులూ, సంగీత విద్యాలయం గరుకు గోడలని తప్పించుకుని వినిపించే వేణునాదాలూ నా చిన్నప్పుడు వినటం నాకింకా గుర్తే. ఆ పాతకాలంనాటి మధురమైన క్షణాల అవశేషాలని వేగంగా పెరుగుతున్న కొచ్చిన్ నగరం, గల్ఫ్ దేశాలనుంచి వచ్చిన డబ్బూ మాయం చేస్తోంది. భారతదేశమంతటా పరచుకున్న నరకకూపాల్లాటి నగరాలలాగే, ఎటువంటి ప్రత్యేకతాలేని ప్రాంతంగా మారిపోయింది మా గ్రామం.

అవసరమైనదానికన్నా ఎక్కువ దేవాలయాలున్న ఊళ్లో పెరగటంవల్ల రామాయణం నన్ను ఆకట్టుకోవటంలో వింతేమీలేదు. కానీ విచిత్రంగా నాకు ఆ మహాకావ్యంలోని ప్రతినాయకుడి మీద ఎక్కువ ఆసక్తి కలిగింది. రావణుడూ, అతని జాతికి చెందిన అసురులూ నాకు ఆసక్తికరంగా కనిపించారు. వాళ్ల మాయాప్రపంచం గురించి ఆలోచించేవాడిని. కానీ ఆ ఆసక్తి చాలాకాలం వరకూ నిద్రాణంగానే ఉండిపోయింది. మా కుటుంబసభ్యులు కలుసుకున్నప్పుడు అప్పుడప్పుడూ ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు చేసే మా మేనత్తని విసిగించేందుకు మాత్రమే నేను నా ఆసక్తిని బైటపెట్టేవాడిని. జీవితం గడుస్తూ పోయింది - నేను ఇంజనీరునయాను, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లో ఉద్యోగం సంపాదించుకున్నాను. బెంగళూరుకు మకాం మార్చాను. అపర్ణని పెళ్లి చేసుకుని, నా కూతురు అనన్యకీ, కొడుకు

అభినవ్ కీ స్వాగతం పలికాను.

కానీ అసుర చక్రవర్తి నన్ను వదల్లేదు. ఆరేళ్లపాటు నా కలల్లోకి వచ్చి పీడించాడు, నాతో కలిసి నడిచాడు, రామాయణకథని తన వైపునుంచి రాయమని ఒత్తిడి చేశాడు. ఒక్కొక్కరుగా రామాయణంలోని అంత ప్రాముఖ్యం లేని అసందర్భపు పాత్రలు తలలెత్తి తమ గురించి కూడా రాయమని కోరటం ప్రారంభించాయి. రావణుడి నాయకత్వాన్ని అంగీకరించి, అతన్ని అనుసరించి చివరికి మోసపోయిన భద్రుడు ఒక సామాన్యమైన అసురుడు. అతను చెప్పిన కథ అతని మహారాజు చెప్పిన కథకి పూర్తి భిన్నంగా ఉంది, అయినా చాలా విశిష్టమైనది. గత మూడు సహస్రాబ్దాలనుంచీ ఆసియా అంతటా, వెయ్యిరకాలుగా చెప్పుకుంటూ వస్తున్న రామాయణగాథకీ, వీళ్లిదరూ చెప్పిన కథకీ పొంతన లేదు. అందుకే ఇది 'అసురాయణం', అసురుల కథ, పరాజయం పాలైనవారి కథ.

ఆనంద్ నీలకంఠన్, ఈమెయిల్ mail@asura.co.in

దశముఖుడు

రావణుడిని పదితలలున్న వ్యక్తిగా ఎందుకు చిత్రిస్తారు?

పది తలలూ, ఇరవై చేతులూ గల రావణుడి రూపం ప్రతి భారతీయుడికీ, భారతీయ పురాణాలలో పాండిత్యం సాధించిన ప్రతి వ్యక్తికీ, ఒక గొప్ప ప్రతినాయకుడిగా సుపరిచితమే. కానీ అతన్ని ఈ విధంగా ఎందుకు చిత్రిస్తారన్న విషయం గురించి నిజం చెప్పాలంటే ఎవరికీ తెలీదు. సాంప్రదాయిక భారతీయ జ్ఞానం, మనిషి భావోద్రేకాలమీద నిగ్రహం ఉంచాలన్న దానికి ప్రాముఖ్యం ఇస్తుంది. బుద్ధిని ఉపయోగించటం ఒకటే ముఖ్యమని అంటుంది. బలిచక్రవర్తి తుచ్ఛమైన తొమ్మిది భావోద్రేకాలని - **క్రోధం, అహంకారం, ఈర్ష్య, ఆనందం, దుఃఖం, భయం, స్వార్థం, ఉద్రేకం, అత్యాశ** - విడిచి పెట్టమని రావణుడికి సలహా ఇస్తాడు. మేధస్సు మాత్రమే గౌరవించదగినది. భారతీయ ఆధ్యాత్మిక గురువులు ఎల్లప్పుడూ స్వప్రయోజనాన్ని అధిగమించాలన్న విషయాన్ని పదేపదే చెప్పారు. ఈ పై చెప్పిన భావోద్రేకాలు ఆత్మోన్నతికి అడ్డంకులని భావించారు.

కానీ బలిచక్రవర్తి మాటలకి జవాబుగా రావణుడు ఈ పది ముఖాలనీ కలిగి ఉండటం వల్లే తను పరిపూర్ణ వ్యక్తిగా రూపొందగలడని అంటూ, అలా ఉన్నందుకు తాను సంతోషిస్తున్నానని సమర్థించుకుంటాడు. పురాణాలలో ఆ విధంగా రావణుడిని దశముఖుడిగా చిత్రించటం జరిగింది. మరోవైపు అతని ఇరవై చేతులూ పరాక్రమాన్నీ, శక్తిసామర్థ్యాలనీ సూచిస్తాయి. రావణుడి దృష్టిలో తాను పరిపూర్ణుడైన మానవుడికి ప్రతీక. ఎటువంటి పవిత్రతా ఉందని నటించకుండా, సామాజిక, మతపరమైన బంధనాలకి తలఒగ్గకుండా జీవించాలని అనుకునే వ్యక్తి. ఇతరులలో ఏ రకమైన మంచి చెడ్డలున్నాయో అవన్నీ అతనిలోనూ ఉన్నాయి. ప్రకృతి మనిషిని ఆ విధంగానే సృష్టించింది. రాముడిని చిత్రించినట్టు రావణుడిని చిత్రించటంలో సమాజం అతని

మిగతా తొమ్మిది ముఖాలనీ పైకి లేవకుండా అణచలేకపోతోంది. అందుకే రాముడిని దేవుడిలా అనుకోవటం సాధ్యం. కానీ రావణుడు పరిపూర్ణ మానవుడు. మన పురాణాల్లో తన భావోద్రేకాలమీద నిగ్రహం లేని వ్యక్తిగా చిత్రించేందుకు రావణుడి పది తలలనీ ప్రతీకగా వాడుకున్నారు. మొత్తం జీవితాన్ని ఆత్రుతగా కౌగలించుకుని అనుభవించాలని ఆరాటపడే వ్యక్తి అతను.

రావణుడి అసుర సామ్రాజ్యం ఉచ్చదశలో ఉన్నప్పటి ప్రాచీన భారతదేశం


YAKSHAS
AMARAVATHI
Various DEVA Kingdoms
CHINESE
GANDHARVAS
ALAKAPURI
AYODHYA
MITHILA
NAGAS
MLECHAS
CITY OF KALI
HEHEYA
KARTHIVEERARJUNA
RAVANA'S ASURA EMPIRE
KINNARAS
VANARAS
KISHKINDHA
GOKARNA
Great Shiva Temple
by Maya
Mahabalipuram
ASURA empire
PATALA
MUZURIS
PATTANAM
LANKA, RAVANA'S
CAPITAL
Lankini's Palace at
Kumari

విషయసూచిక

1 ముగింపు

2 బీజం

3 బంధితులు

4 గురువు

5 దశముఖుడు, పది తలలు గలవాడు

6 దెయ్యం దాడి

7 పరాజితుల సంప్రదాయాలు

8 మహారాజు

9 ప్రియమైన మారీచుడు

10 ముత్యాలదీవి పిలుస్తోంది

11 సముద్రపు దొంగల ముట్టడి

12 తియ్యగా మాట్లాడేవాడు

13 సముద్రపు దొంగల బెడద

14 మంగళవాయిద్యాలు

15 విప్లవకారులు

16 విప్లవకారుడి మరణం

17 అస్పృశ్యుడైన రాజు

18 అసుర రాజకుమారి

19 ఆమెని సజీవంగా ఉండనీయండి

20 దేశభక్తుడు

21 చీకటి పుత్రుడు

22 ఉపద్రవం

23 ద్వంద్వయుద్ధం

24 రాజ్యం తమ వీరుడికి ధన్యవాదాలు అర్పించింది

25 ఒక కుమార్తె వివాహం

26 ఆ సమయం ఆసన్నమైంది

27 అసుర రాజకుమారి వెనక్కి వచ్చింది

28 ఇక సెలవు మారీచా!

29 రక్షకభట నిలయం

30 మృత్యుదూత

31 నా నగరం తగలబడిపోని

32 శాంతి దూత

33 కమ్ముకుంటున్న యుద్ధ మేఘాలు

34 నా ప్రజల కోసం

35 నైతిక నియమాలు లేని యుద్ధం

36 పుత్రులందరిది ఒకటే తీరు

37 మృత్యువు మళ్లీ తలుపు తట్టింది

38 ఎవరికోసం?

39 ఒక వీరుడి పునరాగమనం

40 ఒక ప్రధానమంత్రి నిర్వహించిన బృహత్కార్యం

41 అతిక్రమణ

42 ఒక ఆదర్శవాది అంతం

43 కుంభకర్ణుడి ఆక్రమణ

44 వాళ్లు ప్రార్థిస్తూ ఉండగా

45 మృతవీరులకు దహన సంస్కారం

46 ఒక రాజుగా నేను వైఫల్యం పొందానా?

47 నేను కోరుకున్నది నీ చావునే!

48 ఒక కల ముగిసింది

49 విజేతలూ, వారి తీరుతెన్నులూ

50 జీవితం మళ్లీ మొలకెత్తింది

51 ధర్మఖడ్గం

52 ఆరంభం

కృతజ్ఞతలు

1. ముగింపు

రావణుడు

రేపు నాకు అంత్యక్రియలు జరుగుతాయి. నన్ను ఒక గజ్జి కుక్కని పూడ్చిపెట్టినట్టు పూడ్చిపెడతారో, ఒక చక్రవర్తికి - ఒకనాటి చక్రవర్తికి - చెయ్యవలసిన రీతిలో అంత్యక్రియలు జరిపిస్తారో నాకు తెలీదు. కానీ అదేమంత పట్టించుకోవలసిన విషయం కాదు. నక్కలు కాళ్లీడుస్తూ చేసే చప్పుడు నాకు వినిపిస్తోంది. నా స్నేహితులనీ, కుటుంబ సభ్యులనీ తినటంలో మునిగి ఉన్నాయవి. నా కాళ్లమీదినించి ఏదో గబగబా పరిగెత్తింది. ఏమిటది? తలెత్తి చూసే శక్తి లేదు నాలో. పందికొక్కులు. పెద్దవి, నల్లటివి, ఎలుకలు. వాటి ఒళ్ళంతా బొచ్చు ఉంటుంది. బుద్దిలేని మనుషులు ఒకళ్లని ఒకళ్లు చంపుకోవటం అయిపోయాక, యుద్ధభూములని అవి ఆక్రమిస్తాయి. ఇవాళ వాటికి పెద్ద విందు, అసలు గత పదకొండు రోజులుగా అవి విందారగిస్తూనే ఉన్నాయి. కుళ్లుతున్న మాంసం, చీము, నెత్తురు, మూత్రం, మృత్యువు, అన్నీ కలగలిసి భరించలేనంత దుర్గంధాన్ని వ్యాపింపజేస్తున్నాయి. ఈ దుర్గంధం మావాళ్ల శవాలనించీ, శత్రువుల శవాలనించీ వస్తోంది. కానీ అదేం పెద్ద విషయం కాదు. అసలు ఇప్పుడు దేన్నీ పట్టించుకోవాల్సిన అవసరం లేదు. నేను ఇంకొద్దిసేపట్లో స్పృహ కోల్పోతాను. నొప్పి భరించలేకపోతున్నాను. అతని బాణం నా పొత్తి కడుపులో, ఆయువుపట్టుమీద, దిగింది. నాకు చావంటే భయంలేదు. కొన్నాళ్లుగా దాన్ని గురించి ఆలోచిస్తూనే ఉన్నాను. గత కొన్ని రోజుల్లో వేలకొద్దీ మనుషులు హత్యకి గురయ్యారు.

ఎక్కడో సముద్ర గర్భంలో, నా తమ్ముడు కుంభకర్ణుడి శవం ఉంది, దాన్ని సొరచేపలు సగం తినేసి ఉంటాయి. నిన్న నా కొడుకు మేఘనాదుడి శవానికి దహన సంస్కారాలు చేశాను. లేక అది మొన్నటి

రోజా? నాకు కాలం గురించి అవగాహన లేకుండా పోయింది. అసలు చాలా విషయాల గురించి అవగాహన లేకుండా తయారయాను. విశ్వాంతరాళాల్లో ఎక్కడో ఒక నక్షత్రం ఎర్రగా వెలుగుతోంది. అది దేవుడి కన్నులా ఉంది. చూసేందుకు అచ్చం శివుడి మూడోకన్నులా ఉంది, అన్నిటినీ హరించే, నాశనంచేసే మూడోకన్ను. నా ప్రియమైన లంకానగరాన్ని నాశనం చేస్తున్నారు. ఒకప్పటి ఆ అందమైన నగరంలో ఆరిపోతున్న నిప్పుకణికలు నాకింకా కనిపిస్తూనే ఉన్నాయి. నా రాజధాని, త్రికోట ఈ లోకంలోకల్లా గొప్ప నగరం. అతి అందమైన నగరం. అది ఆ వానర మానవుడు వచ్చి నిప్పు ముట్టించటానికి ముందు. త్రికోట రోజుల తరబడి తగలబడుతూనే ఉంది. దుకాణాలూ, ఇళ్లూ, భవనాలూ, స్త్రీలూ, పురుషులూ, పసిపిల్లలూ, అందరూ... అన్నీ కాలిపోయాయి. కానీ మేం మళ్లీ నగరాన్ని పునర్నిర్మించి మునుపటి స్థితికి తీసుకొచ్చాం, ఒంట్లో శక్తి ఉన్న ప్రతి వ్యక్తీ దానికి దోహదం చేశాడు. ఆ తరవాత వానరసేన తమ నాయకులవెంట వచ్చి మళ్లీ మొత్తం ధ్వంసం చేసింది. మాపట్ల అలా ప్రవర్తించినది, హనుమంతుడు. ఆ వానరుడు మాకు మృత్యువునీ, నాశనాన్నీ, ఓటమినీ కలిగించాడు.

దాన్ని గురించి నాకు ఎక్కువ ఆలోచించాలని లేదు. నా కుమారుడు వాణ్ణి బంధించినప్పడే నేను వాణ్ణి చంపి ఉండవలసింది. అలా చెయ్యకుండా నన్ను తుదముట్టించేందుకు కుట్రపన్నిన నా తమ్ముడి మాట విన్నాను. కానీ రాజద్రోహమూ, నమ్మకద్రోహమూ అసురులకి కొత్తేమీ కాదు. అమాయకంగా, తెలివితక్కువగా, నా తమ్ముళ్లూ, నా ప్రజలూ నన్ను ఎప్పుడూ ప్రేమిస్తూనే ఉంటారని నమ్మేశాను. నాకు వాళ్లు ద్రోహం చేస్తారని ఎప్పుడూ అనుకోలేదు. నాకు నవ్వొస్తోంది. కానీ పేగులన్నీ తెగిపోయి బైటికొచ్చినప్పుడు నవ్వటం అంత తేలిక కాదు. నా నగరంలో జనం ఆనందిస్తున్నారు. వాళ్ల గొంతులు నాకిక్కడికి వినిపిస్తున్నాయి. నా శత్రువు విజయోత్సవం జరుపుకుంటున్నాడు.

వానరులు త్రికోటని దోచుకోవడం ప్రారంభించి ఉంటారు. నా దేవాలయాలని దోచుకుంటారు. ధాన్యాగారాలకి నిప్పంటిస్తారు,

పాఠశాలలనీ, వైద్యశాలలనీ తగలబెడతారు. గెలిచినవారు అలాగే ప్రవర్తిస్తారు. మేంకూడా సురుల ఊళ్లని అలాగే మట్టుపెట్టాం, ఇంకా ఘోరమైన పనులు కూడా చేశాం. అప్పుడు విజయలక్ష్మి నన్ను వరించింది. వికారంగా ఉన్న కొన్ని వానర సమూహాలు నా అంతఃపురంలోకి ప్రవేశించి ఉంటాయి. ఏదైనా ఘోరం జరగకముందే కొండ మీదినించి దూకే తెలివితేటలు నా పట్టపురాణికి ఉంటాయని ఆశిస్తున్నాను. నేనిప్పుడు దేన్నీ నియంత్రించలేను. నా ముఖంమీద మృత్యువు తాలూకు వేడి ఊపిరి తగలటం తెలుస్తోంది. నక్కలు కూడా వచ్చేశాయి. ముందుగా అవి నా శరీరంలో ఏ భాగాన్ని తింటాయి? బహుశా నా పేగుల్నే తింటాయి. ఎందుకంటే వాటినించి ఇంకా రక్తం కారుతూనే ఉంది. నా ఛాతీలోని ఎముక ఏ నక్క గొంతులోనో ఇరుక్కుంటే ఎలా? ఆ ఆలోచనకే నాకు నవ్వొచ్చింది. ఇంతలో ఒక నక్క తన వాడి పళ్లని నా బుగ్గలోకి దించింది. బుగ్గలోని కండరాన్ని కొరికి పీకేసింది. అంతే, ఈ పందేన్ని కూడా నేను ఓడిపోయాను. అవి ముందు నా ముఖాన్నే తినటం ప్రారంభించాయి. ఎలుకలు నా కాలివేళ్లని కొరుకుతున్నాయి.

నేను, రావణాసురుణ్ణి, చాలా దూరం వచ్చేశాను. ఇక పోరాడేందుకు

నా దగ్గర ఏమీ లేదు – ఈ నక్కలతో చేసే యుద్ధం తప్ప. రేపు నగర వీథుల్లో ఊరేగింపు జరుగుతుంది. నేను రథమెక్కి వేగంగా ప్రయాణించిన అదే వీథుల్లో, నా తలని ఒక గుంజకి గుచ్చి ఊరేగించటం చూస్తారు జనం. నా ప్రజలు ఆ దృశ్యాన్ని భయంతోనూ, వికృతమైన ఆనందంతోనూ తిలకిస్తారు. నా ప్రజలగురించి నాకు తెలుసు. అది వాళ్లకి ఒక గొప్ప ప్రదర్శనలా అనిపిస్తుంది.

ఒక విషయం మాత్రం నాకు అర్థం కాదు, నేను ఒరిగిపోయాక రాముడు నా పక్కన వచ్చి ఎందుకు నిలబడ్డట్టు? నన్ను ఆశీర్వదిస్తున్నట్టు వచ్చి నిలబడ్డాడతను. ఈ ప్రపంచంలోకెల్లా ఎక్కువ పాండిత్యంగలవాడిని నేనేనని, గొప్ప రాజుననీ, పరిపాలించటం అనే కళని ఎవరైనా నా దగ్గరే నేర్చుకోవాలనీ, నా గురించి రాముడు తన తమ్ముడికి చెప్పాడు. నేను గట్టిగా నవ్వబోయాను. నేను ఎంత గొప్పగా పరిపాలించానంటే, నా సామ్రాజ్యం నా చుట్టూ ధ్వంసమై కనిపిస్తోంది! నా సైనికుల శవాలు కాలుతున్న వాసన నాకు తెలుస్తోంది. ఇంకా నా మేఘనాదుడి చల్లటి, నిర్జీవమైన శవాన్ని పొదివి పట్టుకున్నట్టే అనిపిస్తోంది నాకు. మండుతున్న త్రికోట కమురు వాసన నా పంచేంద్రియాలని ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. ఈ ఇద్దరు యోధులనించీ, వాళ్ల వానరసేననించీ నా ప్రజలని నేను కాపాడుకోలేకపోయాను. అయినా అతను నన్ను గొప్ప వీరుడని పొగుడుతున్నాడే? అందులో వ్యంగ్యం నాకు అర్థమవుతోంది. నా శత్రువుని చూస్తే నవ్వొచ్చింది. నా చుట్టూ తలలు తెగీ, చేతులూ కాళ్లూ తెగీ, ప్రాణాలు పోగొట్టుకుని పడి ఉన్న జనం ఒకప్పుడు బుద్ధిహీనులై నన్ను నమ్మారు, వాళ్లని చూసి నవ్వాలనిపించింది. సర్వమానవ సమానత్వం అనే ఆదర్శమైన భావన తాలూకు పునాది మీద నేను నిర్మించిన నా సామ్రాజ్యం చూసి నవ్వాలనిపించింది. నిజంగా అది పరిహసించవలసిన భావనే. కానీ ఒక చక్రవర్తికి ఇలాంటి మరణం తగదు. నేను చాలా కష్టపడి దేవతలతోనూ, వారి అనుచరులతోనూ పోరాడాను. నవ్వువల్ల చనిపోయేవారికి స్వర్గంలో చోటు ఉంటుందా అన్నది నాకు అనుమానమే.

నక్కలూ, ఎలుకలూ ఎంత హఠాత్తుగా నా శరీరం మీద దాడిచేశాయో, అంతే హఠాత్తుగా ఎటో పారిపోయాయి. చీకటి రాత్రికన్నా చిక్కటి నల్లటి నీడ నామీద పడింది. ఉంగరాల జుట్టున్న ఒక నల్లటి తల నాకూ ఆకాశంలో ఉండే ఒంటరి నక్షత్రానికీ మధ్యకి వచ్చింది. ఇతను మృత్యుదేవత కాలుడా? నన్ను తీసుకుపోయేందుకు వచ్చాడా? కళ్లు తెరిచి చూసేందుకు కష్టపడి ప్రయత్నించాను. కానీ ఎండిపోయిన రక్తంతో నా కనురెప్పలు అతుక్కుపోయాయి. రాముడి తుచ్ఛ సేవకులలో ఇతను ఒకడు కాదుకదా? నా తలకాయని నరికి విజయ చిహ్నంగా తీసుకెళ్లటానికి వచ్చాడా? నేనతని ముఖంలోకి చూడాలని అనుకున్నాను. కళ్లలోకి సూటిగా చూడాలనుకున్నాను. నా చివరి క్షణాల్లో ఎంతమాత్రం తొట్రుపాటు పడకుండా, స్థిరంగా నా చూపుల్ని అతని ముఖంమీద నిలపాలనుకున్నాను. ఆ తలా, ఉంగరాల జట్టూ ఎందుకో నా గతాన్ని గుర్తుచేసింది. నాకు ఇతను తెలుసా? అతను వంగి నా ముఖంలోకి చూశాడు.

ఓ! ఇతను భద్రుడు. నా స్నేహితుడు, నాకు మిగిలిన ఒకేఒక స్నేహితుడు, కానీ వాడిని నా మిత్రుడని అనవచ్చో లేదో నాకు తెలీదు. ఒకప్పుడు వాడు నా సేవకుడు, కాల్బలాలలో ఒక సైనికుడు. కానీ మధ్యలో నేను వాడి సంగతి మర్చిపోయాను. నా జీవితంలోకి వాడు అలా వచ్చి పోతూ ఉండేవాడు. ఒక్కోసారి కొన్ని ఏళ్లవరకూ కనిపించేవాడే కాదు. నేను ఒక జట్టుకి నాయకుడుగా ఉన్నప్పుడు భద్రుడు నన్ను కలుస్తూ ఉండేవాడు. ఆ జట్టు ఒక క్రాంతి సైన్యంలా కాకుండా, దారి దోపిడీ చేసే దొంగల ముఠాలా ఉండేది. నేను ఒక చిన్న దీవికి రాజుగా ఉన్నప్పుడు, నా ఏకాంత శిబిరంలోకి కూడా వచ్చేవాడు. చివరిగా నేను ఒక దేశాన్ని పరిపాలించే సమయంలో వాడికి నా పడకగదిలోకి కూడా ప్రవేశించే అనుమతి దొరికింది. అంతకన్నా ముఖ్యమైనది, నా మనసులోని చీకటి మూలల్లోకి వాడికి ప్రవేశం లభించింది. ఆ చీకటి మూలలని నా తమ్ముళ్ల దగ్గరా, భార్య దగ్గరా, ప్రియురాలి దగ్గరా, ప్రజల దగ్గరా, చివరికి నా దగ్గర కూడా నేను వెల్లడి

చెయ్యలేదు.

భద్రుడు ఇక్కడేం చేస్తున్నాడు? కానీ నాకింత ఆశ్చర్యం ఎందుకు? వాడిలాంటి వాళ్లు నీడల్లో కదిలే ప్రదేశాలు ఇలాంటివే కదా! వాడు వెక్కి వెక్కి ఏడవటం నాకు వినిపిస్తోంది. భద్రుడు భావోద్రేకాలకి గురవుతున్నాడా? వాడు ఎప్పుడూ కోపం, బాధ, ఆనందం ప్రదర్శించేవాడు కాదు. ప్రస్తుతం భావోద్రేకంలో ఉన్నట్టు ప్రవర్తిస్తున్నాడు. కానీ వాడికి అలాంటిదేం లేదని నాకు తెలుసు. నాకు తెలుసని భద్రుడికి కూడా తెలుసు. "భద్రా, నన్నిక్కణ్ణించి మోసుకెళ్లు, నన్ను మోసుకెళ్లి....." అంటూ శక్తిలేక ఆగిపోయాను. అసలు ఆ మాటలు నా నోటంట వచ్చాయా, లేక లోపల్లోపలే అణిగిపోయాయా అన్న విషయం నాకు తెలీదు. భద్రుడు తల అడ్డంగా ఆడించాడు. నేను చల్లబడిపోయాను, విపరీతంగా చలి వేస్తోంది నాకు. నా ప్రాణాలు కడతేరుతున్నాయి. అప్పుడు భద్రుడు నా తలని తన ఛాతీకి పొదువుకున్నాడు. వాడి దగ్గర నాకు చెమట వాసన వచ్చింది. నా శరీరంలోని ప్రతి అవయవం నుంచీ భరించలేనంత నొప్పి బైలుదేరి విషంతో నిండిన తన పొడవాటి వేళ్లని నా నరాల్లోకి చొప్పించింది. నేను మూలిగాను. భద్రుడు నన్ను మళ్లీ తడినేలమీద పడుకోబెట్టాడు, ఆ నేల నా రక్తంతో, నా బంధువుల రక్తంతో, నా కలల రక్తంతో, నా మొత్తం జీవితానికి ఆధారమైన రక్తంతో తడిసింది. అంతా అయిపోయింది! ఒకరకమైన విచారం, శూన్యం నన్ను ఆక్రమించాయి.

"మీరు మొదలుపెట్టిన పని నేను పూర్తి చేస్తాను, ప్రభూ! విచారించకండి. ప్రశాంతంగా తరలిపొండి. మన జాతికోసం నేను బాధ్యతగా పనిచేస్తాను. నా పద్ధతులు వేరుగా ఉండొచ్చు, మీతో పోలిస్తే అవి అంత ఉదాత్తంగా కూడా ఉండకపోవచ్చు. నేను కూడా ఒకప్పుడు యుద్ధాలు చేశాను, కానీ ఇప్పుడు వృద్ధుడినైపోయాను. ఆయుధాలు ఇప్పుడు నాకు భయం కలిగిస్తున్నాయి. యుద్ధం పేరు వింటేనే హడలిపోతున్నాను. చిన్నపిల్లవాడికి కూడా హాని చెయ్యలేను. అయినప్పటికీ నా పద్ధతులు ప్రాణాంతకమైనవి. మీకు జరిగినదానికి

నేను ప్రతీకారం తీసుకుంటాను. నాకూ, నా జాతికీ జరిగిన అన్యాయానికి పగ తీర్చుకుంటాను. మనకి చేసిన హానికి రామున్ణి నేను వదిలిపెట్టను. నా మాట నమ్మి, ప్రశాంతంగా పైలోకాలకి వెళ్లండి."

భద్రుడు అన్న మాటల్లో చాలామటుకు నేను వినలేదు. అయినా విచిత్రంగా నాకు ఉపశమనం లభించినట్టనిపించింది. దుర్వాసన వేస్తున్న ఈ అసురుడిని వదిలి నేను నా బాల్యంలోకి జారిపోయాను. కొన్నివేల రూపాలు నన్ను చుట్టుముట్టాయి. చిన్నప్పుడు నేను ఎదుర్కొన్న సంఘర్షణలూ, ప్రేమించటంవల్ల కలిగిన విరహ బాధలూ, విడిపోవడాలూ, పోరాటాలూ, యుద్ధాలూ, సంగీతం, కళలూ, అన్నీ ఒక క్రమం అంటూ లేకుండా మనసులో మెరిశాయి. వాటికి అర్థం లేదు, అర్థం కనిపించలేదు, సరిగ్గా జీవితం లాగే,

భద్రుడు నా కాళ్లకి దణ్ణం పెట్టేందుకు వంగటం తెలిసింది. ఆ తరవాత వాడు నన్ను విడిచి వెళ్లసాగాడు. "భద్రా..." అని పిలిచాను. నన్ను వైద్యుడి దగ్గరికి తీసుకెళ్లి, వేలాడుతున్నపేగుల్ని పొట్టలో మళ్లీ పెట్టి, ఎడమ కన్నులోంచి బైటికి వచ్చి వేలాడుతున్న కనుగుడ్డుని మళ్లీ సరిగ్గా అమర్చేట్టు చెయ్యమని వాడిని అడుగుదామని అనుకున్నాను. ఎలాగో ఒకలాగ నా శరీరంలోకి మళ్లీ ప్రాణాలని నిలిపేట్టు చేసే వైద్యుడి దగ్గరికి తీసుకెళ్లమని అడుగుదామనుకున్నాను. ప్రధాన భూభాగంలో ఉన్న సహ్య అడవుల్లోకి వెళ్లి దాక్కుని అకస్మాత్తుగా శత్రువు మీద పడి దాడి చెయ్యాలనుకున్నాను. ఎన్నో ఏళ్లక్రితం మహాబలి చక్రవర్తి అలాంటి పనే చేశాడు. జీవితాన్ని మళ్లీ ప్రారంభించాలని అనుకున్నాను. అవేతప్పులు మళ్లీ చేసి, అదే మనుషులని మళ్లీ ప్రేమించి, అదే శత్రువులతో మళ్లీ తలపడి, అదే మిత్రులతో మళ్లీ స్నేహం చేసి, అదే భార్యలని మళ్లీ పెళ్లి చేసుకుని, అదే పిల్లల్ని మళ్లీ కనాలని అనిపించింది. రాముడు నా కోసం స్వర్గంలో అట్టే పెట్టిన ఆసనం నాకు అక్కర్లేదు. అందమైన నా సీమే నాకు కావాలి. అదే జీవితం మళ్లీ జీవించాలన్న కోరిక కలిగింది.

అలాంటివి జరిగే అవకాశం లేదని నాకు తెలుసు. నా వయసు

అరవై, పదహారు కాదు. ఒకవేళ ప్రాణాలు పోకుండా ఉంటే, ఒంటికంటితో, అసహ్యంగా, ఏ మారుమూల గుడిలోనో ముసలి బిచ్చగాడిలా, కంపు కొడుతూ చిరిగిపోయి, చివికిపోయిన బట్టలతో బతకాలి. ఒకప్పుడు జీవించిన జీవితానికి చాలా వ్యతిరేకంగా బతకాలి. నాకు ప్రస్తుతం చనిపోవాలనే ఉంది. ఇదంతా ముగిసిపోతే బావుండుననిపించింది. వెళ్లిపోవాలనిపించింది. మండుతున్న నగరాలని తమ బాగోగులు తామే చూసుకోనీ, అసురులని తమ యుద్ధాలు తామే చేసుకోనీ, దేవతలతోపాటు వాళ్లని కూడా నరకంలో మగ్గనీ అని అనుకున్నాను. నాకు మాత్రం నా బాల్యంలోకి మళ్లీ వెళ్లిపోయి జీవితాన్ని కొత్తగా ప్రారంభించాలనిపించింది. ప్రతిచిన్న విషయమూ, మళ్లీ ఒకసారి, మళ్లీ... మళ్లీ... మళ్లీ...

2. బీజం

రావణుడు

ఎత్తైన కొండ అంచున ఎప్పుడు పడిపోతుందా అన్నట్టు ఉన్న ఒక చిన్న పర్ణశాల చుట్టూ వర్షాకాలపు పవనాలు జోరుగా వీస్తున్నాయి. గర్జించే ఆ గాలి ఒక్క తోపు తోస్తే కింద ఆకలిగొన్న సుళ్లు తిరిగే నల్లటి ప్రవాహంలో పడిపోయేట్టు ఉందా పర్ణశాల. ఆ తరవాత ఆ మరణం మమ్మల్ని గడ్డిపోచల్లా ఒడ్డున పడేస్తుంది. మా జీవితాలు అలా ముగిసిపోయినా బావుండేది. కానీ ఇది కేవలం ముగింపుకి ఒక ప్రారంభం మాత్రమే! చరిత్ర పుటల్లోంచి సునాయాసంగా నేను తుడిచిపెట్టుకు పోతానా? ఓడిపోవటం అనేది నా లక్ష్యంకాదా? అప్పుడు నాకా విషయం తెలీదు, నేను పుట్టింది ఇంకొకరి భవితవ్యాన్ని ఈడేర్చేందుకు. వేరెవరో దేవుడు అని పేరు తెచ్చుకునే అవకాశాన్ని కల్పించేందుకు. ముగ్గురు తోబుట్టువులూ, దిగులుగా ఉండే తల్లితో ఆ పర్ణశాలలో ఒదిగిపోయి, దేదీప్యమానంగా వెలిగిపోతున్న నా సవతిఅన్న భవనాన్ని చూశాను. అది మాకు చాలా దగ్గర్లోనే ఉంది, కానీ మా ఇద్దరి మధ్యనా అనంతమైన దూరం! రెండు ప్రపంచాలూ వేరు. ఒకసారి నేను ఆ భవనంలోకి వెళ్లాను. మా నల్లటి తల్లి శాలువ వెనక దాక్కుని, నా తమ్ముళ్లు నా వేళ్లు పట్టుకుని లాగుతూంటే అక్కడ నిలబడ్డాను. మా చెల్లెలు నిస్త్రాణగా, పాతబడిన అలుగ్గుడ్డలాగ, అలిసిపోయి, ఆకలితో మా అమ్మ భుజంమీద వాలిపోయింది. మేం పేదవాళ్లం, నిరుపేదలం. మా దగ్గర ఎక్కువగా ఉన్నది పేదరికమే. ఆకలీ, అవమానం కూడా.

ఇక ఆఖరి ప్రయత్నం చేసేందుకు అమ్మ మమ్మల్ని వెంటపెట్టుకుని తన సవతి కొడుకు దగ్గరికి వెళ్లింది. అతని పేరు కుబేరుడు. అన్నిరకాల సంపదలకీ అధిపతి, ఈ లోకంలో అందరికన్నా ధనవంతుడు. మెరిసిపోతున్న ఆ భవనంలో, ఎక్కడ చూసినా కలిమి తాలూకు వాసన

వెగటు పుట్టిస్తూంటే, మేం భిక్ష పాత్ర పట్టుకుని నిలబడ్డాం. మాకు భిక్ష దొరికింది, కాసిని బంగారు నాణాలు వాటితోబాటు మా సవతి అన్న భార్యలు చూసిన అపహాస్యంతో నిండిన చూపులు కూడా దొరికాయి. మా అవసరాలు చాలా కొద్దివి. అతని సమయం చాలా విలువైనది, దాన్ని మాకోసం అతను వ్యర్థంగా వెచ్చించలేడు. అతని చెయ్యి ఒక్కసారి కదిలింది, కొంత చిల్లర మాకు దొరికింది, ఆ తరవాత అతను మా గురించి ఆలోచించలేదు. మళ్లీ ఇంకొకరోజు నేను కరకుగా, గట్టిగా మా ఉనికిని అతనికి గుర్తు చేసేంతవరకూ, అతను మమ్మల్ని పట్టించుకోలేదు. కానీ అది చాలాకాలం తరవాత జరిగిన సంఘటన. ఆలోపల మేం బిచ్చగాళ్లలా బతకటం మానేశాం.

అత్యాశకీ, లోభానికీ నిలయమైన, అహంకారంతో నిండిన, ఆ ఐశ్వర్యంతో నిండిన రాజభవనం నుంచి నేను సంపాదించుకున్న అన్నిటికన్నా గొప్ప ఆస్తి - ఉన్నతస్థితికి చేరుకోవాలన్న తీవ్రమైన ఇచ్ఛ. ఆ భవనం నాలో రేపిన ఆ ఇచ్ఛ తాలూకు జ్వాలలని ఆకలి మంటలు ఆర్చలేకపోయాయి. అతని ఆధిపత్యంలో ఉన్న ఆ ప్రపంచమే కాక, ఇంకా ఎక్కువ నాది... కేవలం నాదేనని నాకు అప్పుడే తెలుసు. ఈ రోజు నేను మా అమ్మతో గడిపే చివరి రోజే కావచ్చు. రేపటికి ఇంకా మా చిన్న పర్ణశాల పడిపోకుండా నిలిచి ఉంటే, ఈ గాలిని తట్టుకోగలిగితే, మా ప్రయాణాన్ని ప్రారంభిస్తాం. నేను గెలిచి సొంతం చేసుకునేందుకు బైట ఒక ప్రపంచం ఉందని నా నమ్మకం. ఇంతకన్నా మెరుగైన ప్రపంచం మాకోసం వేచి ఉంది.

నా తమ్ములూ నేనూ పెద్దగా చదువుకోలేదు. ఉచితంగా వాళ్లకి పనులు చేసి పెడతామని అన్నా కూడా బ్రాహ్మలెవరూ మమ్మల్ని శిష్యులుగా చేసుకోటానికి ఒప్పుకోలేదు. మేం అడవి మనుషులం, మాది నల్లటి రంగు, దుష్ట స్వభావులం. మాది సంకరజాతి అనేది మాకు తెలిసింది. మా తండ్రి పేరుపొందిన మహర్షి, కానీ మమ్మల్ని ఎంతమాత్రం పట్టించుకోలేదు. తన సంతానం గురించి ఆలోచించ టానికి బదులు తన పాండిత్యాన్ని పదును పెట్టుకునే పనిలో నిమగ్నుడయి

ఉండేవాడు. ఆయన బ్రాహ్మణుడు. మా అమ్మ ఊరూ పేరూ లేని అసురుల జాతికి చెందింది. ఆయన ఆవిడతో బాహాటంగానే సంబంధం పెట్టుకున్నాడు. సంస్కృత వేదాల గురించి ఆయనకి బాగా తెలుసు. ప్రపంచంలోని జ్ఞానమంతా వాటిలోనే ఉందని బ్రాహ్మణులు అంటారు.

మా నాన్న చెడ్డవాడేమీ కాదు, నిజం చెపుతున్నాను. ఆ కులంలోని అందరిలాంటివాడే ఆయన కూడా - గొప్ప స్వార్థపరుడు. ఆయన మా ఇంట్లో ఉండటమే మేం చేసుకున్న పుణ్యం, అదే మహద్భాగ్యం అనుకోమన్నట్టు ప్రవర్తించేవాడు. మనుషులకి తినటానికి తిండి కావాలన్న విషయం ఎంతో సులువుగా మర్చిపోయాడు. అన్నట్టు, ఆయన చెప్పే పాఠాల్లో మేం ఆసక్తి కనబరచలేదని మాకందరికీ అసురుల పేర్లే పెట్టాడాయన. మేం చాలాసార్లు ఆయన్ని వెక్కిరించే వాళ్లం. నేనైతే ఆయన తన మిత్రులతోపాటు వేదాలని వల్లిస్తూంటే, వాటిలో చెప్పిన విషయాల గురించీ, ఆయన నమ్మకాల గురించీ ధైర్యంగా వాదించేవాణ్ణి. మా మట్టి ఇంటి వసారాలో కూర్చుని కుంభకర్ణుడూ, శూర్పణఖా, నేను వాళ్లని అనుకరించి నవ్వుకునే వాళ్లం. అందరికన్నా చిన్నవాడు, విభీషణుడు మాత్రం భయం భయంగా చూస్తూ ఉండేవాడు. బ్రాహ్మలు వాగే అర్థంలేని వాగుడు వింటూ, కళ్లప్పగించి శ్రద్ధగా వాళ్లనే గమనించేవాడు.

మా నాన్న తన దగ్గర ఉన్న సంపదనంతా మా సవతి అన్న కుబేరుడికి ధారాదత్తం చేసేశాక, ఇక మా దగ్గర ఏమీ మిగల్లేదు. ఎన్నో కష్టాలు అనుభవిస్తూ పెరిగాం, నిరంతరం ఏదో చెప్పలేని బాధ - నెమ్మదిగా ప్రారంభమై ఒక మనిషి ఆత్మ చుట్టూ తన నల్లటి వేళ్లని పాకించి బంధించే బాధ అది! అయినప్పటికీ మేం ఎన్నడూ ధర్మమార్గాన్ని వదల్లేదు. చదువుకున్న వాళ్లూ, ధనవంతులూ న్యాయమని నమ్మేవాటికి మా న్యాయం వ్యతిరేకంగా ఉండేది. మా ధర్మాన్నీ, హక్కులనీ మాదైన పద్ధతిలో మేం నిర్వచించుకున్నాం. అవసరాలకి అనుగుణంగా సత్యాన్ని వంచటం సాధ్యమని తెలుసుకున్నాం. మా ధర్మం సరళమైన విషయాలమీద ఆధారపడి

ఉండేది: మనిషి తన మాటకి కట్టుబడి ఉండాలి; మనస్ఫూర్తిగా మాట్లాడాలి, తాను తప్పని అనుకున్న పని చెయ్యకూడదు. సాఫల్యం దక్కదని తెలిసినా మోసం చెయ్యకూడదు. స్త్రీలని గౌరవించాలి, ఎవరినీ అనుమానించకూడదు. అన్యాయం అనేది జరిగితే శాయశక్తులా దాన్ని ఎదిరించాలి. సురాసురుల్లో ప్రాచీన రుషులూ, మునుల గొప్ప బోధనలేవీ మాకు తెలీదు. మేం ఎటువంటి సంప్రదాయాన్నీ పాటించలేదు. వేశ్య కొడుకుల్లాగే పెరిగాం.

రేపు మేం ఈ దీవిని వదిలి వెళ్లిపోతాం. ఉత్తర దిశన ఎన్నో గొప్ప సామ్రాజ్యా లున్నాయని విన్నాను. దేశం నలుమూలలకీ ప్రయాణం చేస్తాను. మంచు కప్పిన హిమాలయ పర్వతాలని అధిరోహించాలనీ, వర్ష రుతువులో పరవళ్లు తొక్కే గంగానదిలో ప్రమాదకరమైన ప్రవాహానికి ఎదురీదాలనీ, నా కోరిక. వింధ్య, సహ్య పర్వతాలమీది దట్టమైన అడవుల్లో ప్రయాణం చేస్తూ వానరులనీ, యక్ష కిన్నరులనీ చూడాలని కలలుకన్నాను. గంధర్వుల సంగీత ప్రపంచంలో ఓలలాడాలని కలలు కన్నాను. అబ్బా, గెలవాలంటే ఎంత ప్రపంచం ఉంది! జీవితాన్ని ఎంత ఆనందంగా గడపవచ్చు! ఒకరోజు రావణుడు ప్రపంచాన్నంతటినీ పరిపాలిస్తాడు. ఉత్తుంగ హిమాలయాలనుంచి లంక దాకా. కాదు కాదు, లంకనుంచి హిమాలయాలదాకా. నేను ప్రపంచానికి అధినేతని అవుతాను, అందరికీ న్యాయం, శాంతి, సమృద్ధి లభించేట్టు పరిపాలిస్తాను.

నాకు ఉన్న లెక్కలేనన్ని కలల నీడల్లోంచి ఒక చిన్న సందేహం తొంగి తొంగి చూడసాగింది. ఈ అద్భుతమైన కలలన్నీ ఆకలివల్ల కలుగుతున్న అర్థంలేని భ్రమలేనా? నల్లటి అలలు నా శరీరాన్ని నిమురుతూండగా, గర్జించే ఈ ప్రవాహంలో పడి కొట్టుకుపోతూ నేనీరోజు చనిపోవచ్చు. నా ప్రాణాలు ఒక్క క్షణం మినుకు మినుకుమని చీకటిగా ఉన్న నిశ్శబ్దంలో ముగిసిపోవచ్చు. ఆ తరవాత నాకు ఎంతో ప్రియమైన తీవ్ర వాంఛలనీ, ఆకాంక్షలనీ ఎవరు తెలుసుకోగలరు? నా ప్రజల కోసం నేనెంత గొప్పగొప్ప ప్రణాళికలు వేశానో ఎవరు గ్రహించగలరు? కింద నురుగులు

కక్కుతున్న నల్లటి ప్రవాహం మీది నురగలా ఉండిపోతుంది నా జీవితం. ప్రస్తుతం ఉవ్వెత్తుగా లేస్తూ, విస్తరిస్తున్న ఆ ప్రవాహం నామరూపాల్లేకుండా ఎక్కడో కనుమరుగవుతుంది.

మా అమ్మ కన్నీళ్లు నా ఆత్మని తూట్లు పొడిచాయి. మేం ఈ ప్రపంచాన్ని జయించాలని ఆమె ఆశించింది, కానీ మళ్లీ మేం తనకి సమీపంలోనే ఉండాలనీ అనుకుంది. బహుశా నా కళ్లల్లో చెలరేగుతున్న జ్వాలల్ని ఆమె చూసినట్టుంది, అందుకే మమ్మల్ని ఆపకూడదని నిశ్చయించుకుంది. వెనక్కి తిరిగి చూస్తే అమ్మ కనిపించింది. చిరిగిపోయిన బట్టల్లో నడుం ఒంగిపోయి ఉంది. మా చెల్లెల్ని పొదివిపట్టుకుని నిలబడి ఉంది. మా చెల్లాయికన్నా అందమైన పాప మా దృష్టిలో ఇంకెవరూ లేరు. కానీ మా అమ్మ మాకు నేర్పించిన నిష్పక్షపాత దృష్టితో చూసినప్పుడు, మా చెల్లెలికన్నా అందవికారమైన ప్రాణిని తాను చూడలేదని మా నాన్న అన్న మాటలతో మేం కూడా ఏకీభవించవలసి వచ్చేది. ఆయన ఆ మాట అన్నందుకు నాకు ఆయనమీద అసహ్యం వేసింది. కానీ ఆ మాట యథార్థం కావటంవల్ల ఆయనంటే అసహ్యం మరింత పెరిగింది.

మా సవతి సోదరుని రాజభవనం ద్వారపాలకుడు తన స్నేహితులతో సముద్రతీరాన కూర్చుని ఉన్నాడు. సముద్రంమీద చిన్న తెప్పలో అవస్థ పడుతూ వస్తున్న మమ్మల్ని చూసి వాళ్లు గట్టిగా నవ్వారు. మేం చిన్నవాళ్లం, తెప్ప పాతకాలం నాటిది, దాన్ని నడపటం మాకు కష్టంగా ఉంది. అది చూసి అట్టహాసం చేస్తూ వాళ్లు మా మృత్యువుకోరుతూ తాగటం మొదలుపెట్టారు. అశ్లీలమైన పాటలు పాడుతూ మా అమ్మని కూడా అవమానించారు. వాళ్ల గొంతులు నులిమెయ్యాలని అనిపించింది నాకు! కానీ లోకరీతి పట్టుబడేదాకా, నా శక్తిని నిష్పక్షపాతంగా, న్యాయంగా ఉపయోగించుకోవటం నేర్చుకునేవరకూ నేను హింసకి పాల్పడనని అమ్మకి వాగ్దానం చేశాను. కన్నీళ్లు నిండిన కళ్లతో ఆ దూరతీరాన్ని చూశాను - నిర్దయతో నిండిన ఈ లోకంలో విజయం సాధిస్తానన్న నా ఆశ, నా ప్రపంచం, నా

గురువు... అన్నీ ఆ తీరంమీదే ఉన్నాయి మరి.

నేనూ, నా తమ్ముళ్లూ దట్టమైన, సతత హరిత సహ్యా అడవుల్లోంచి నడిచాం. అద్భుతమైన రాజభవనాలనీ, రేవులనీ, చందన వృక్షాలనీ, ఏనుగులనీ, నెమళ్లనీ, కోతులనీ చూశాం. రంగురంగుల తెరచాపలున్న ఓడలని చూశాం. అవి దూరదేశాలకి బంగారాన్నీ, వజ్రాలనీ, మిరియాలనీ, సుగంధ ద్రవ్యాలనీ చేరవేసే ఓడలు. మనుషులు శ్రమకోర్చి సంపాదించే ధనంలో తమ వాటా ఇమ్మని దబాయించి మరీ తీసుకునే దేవుళ్ల దేవాలయాలు చూశాం. అలాగే ఆ దేవుడి తాలూకు ప్రతినిధులు దేవుడి పేరుతో దోచుకోవటం కూడా చూశాం. దీపాలతో దేదీప్యమానంగా, రాత్రి కూడా సూర్యుడు ఉదయించాడా అన్నట్టు నగరాలు వెలిగిపోతున్నాయి. అక్కడి స్త్రీలు స్వర్గంలోని అప్సరసలంత అందంగా ఉన్నారు. మా సవతి అన్న పతాకాలను ఎగరవేస్తూన్న ఓడలను చూసి నా మనసులో రకరకాల భావాలు, గర్వం, ఈర్ష్య, కోపం, ఒకేసారి కలిగాయి. ఏ నగరానికి వెళ్లినా కుబేరుడు చేస్తున్న వ్యాపారాలు అక్కడ కనిపించాయి. దీవి మీదున్న తన రాజభవనంలోంచే ఈ వ్యాపారాలన్నిటి మీదా అతను పెత్తనం చలాయిస్తున్నాడు. అతని వార్తాహరులు గుర్రాలమీద ప్రయాణంచేసి ముఖ్యమైన సందేశాలని వ్యాపారంలో అతనికి భాగస్వాములుగా ఉన్నవారికీ, ఇతర వర్తక సంఘాలకీ చేరవేసేవారు. అతని దగ్గర 130కన్నా ఎక్కువ ఓడలు ఉన్నాయి. అవి గ్రీసు, ఈజిప్టు, చైనా దేశాలకి ప్రయాణం చేసేవి. మేము కుబేరుడి తోబుట్టువులమని చెప్పుకుని ఉంటే వ్యాపార సంఘాల్లోని చిన్న అధికారి కూడా మమ్మల్ని పట్టు, జరీ వస్త్రాలని అమ్మే తమ కార్యాలయంలోకి ఆనందంగా ఆహ్వానించి ఉండేవాడే. కానీ నేనలా చెయ్యదల్చుకోలేదు, నాకది ఇష్టంలేదు. మా సవతి అన్న స్థాపించిన వ్యాపార సంస్థల్లో దేనిలోనైనా నేను సులభంగా ఉద్యోగం సంపాదించుకుని ఉండవచ్చు. అలా చేసి ఉంటే మా కుటుంబానికి ఒక పూటైనా తినటానికి తిండి దొరికేది. కానీ కాసిని బంగారు నాణాలు మా చేతిలో పెట్టి మమ్మల్ని తన రాజభవనం నుంచి

పంపివేసినప్పుడు నా సవతి అన్న ముఖంలో కనిపించిన నిర్లక్ష్య భావాన్ని నేనెలా మరిచిపోగలను? అతని వాణిజ్య సామ్రాజ్యంలో ఒక చిన్న ఉద్యోగం సంపాదించుకునేందుకు అతన్ని బతిమాలటంకన్నా ఆకలికి అలమటించి చనిపోవటానికే ఇష్టపడతాను. అది నా దురహంకారమే కావచ్చు. ఈ లోకంలో బతకాలంటే చాలామంది లోకజ్ఞానం ఉన్నవాళ్లు ఉన్నదానితో తృప్తిపడి, నలుగురూ నడిచిన దారిన నడవటమే తెలివైనపని అని అన్నారు. కానీ నేనొక స్వాప్నికుడిని. ఏదో విధంగా జీవితం వెళ్లదీయాలని లేదు నాకు. ఈ ప్రపంచాన్ని సొంతం చేసుకోవాలని ఉంది.

మావాళ్లు ఎందుకంత పిరికిగా, అణిగిమణిగి ఉంటారు? నాకెప్పుడూ ఆ విషయం ఆశ్చర్యం కలిగిస్తుంది. అధికారం, ధనం కొంతమంది చేతుల్లోనే ఎందు కుండిపోయింది, మిగతా వాళ్లందరూ వాళ్ల చెప్పుచేతల్లోనే ఎందుకుండాలి? తమనీ, తమ పిల్లలనీ ఈ చిన్న సమూహం అణిచివేసి, దోచుకుంటూంటే, వీళ్లు వాళ్లకి సహాయం చేస్తూ, తమ ప్రాణాలని కూడా అర్పించేందుకు ఎందుకు సిద్ధపడతారు? అది భయమా? నాకు తెలీదు. కానీ ఎక్కడ చూసినా నాకు అణచివేతే కనిపించింది. ధనం, కులం, ఆచారాలు, సంప్రదాయాలు, నమ్మకాలు, మూఢనమ్మకాలు. అన్నీ కలిసికట్టుగా కుట్రపన్ని అధిక సంఖ్యాకులైన పేదవారిని అణగదొక్కటమే కనిపించింది. ఇంకాస్త న్యాయంగా జీవించేందుకు మార్గమే లేదా?

ఎందుకు అని అడగటం ప్రారంభించగానే నాకు పొగరుబోతున్న పేరు వచ్చేసింది. ఒకసారి మా నాన్న బ్రాహ్మణ మిత్రులు, నన్ను భూతప్రేతాలు పూనాయనీ, నేను రాక్షసుణ్ణి, పిశాచాన్ని అనీ అంటూ నన్ను ఊళ్లోంచి బహిష్కరించేందుకు ప్రయత్నించారు. బహుశా నేనప్పుడు మరీ చిన్నవాడిని. దుడుకు స్వభావం, ప్రపంచం గురించి ఇంకా సరైన అనుభవం లేదు. ఎప్పుడూ శాంతంగా ఉండే నా చిన్నతమ్ముడు విభీషణుడిలో తప్ప మిగతా మా అందరిలోనూ అదే తొందరపాటు నాకు కనిపించేది. విభీషణుడు మందమతి అని

అనుకునేవాణ్ణి. కానీ మేం పెరిగి పెద్దవాళ్లమవుతున్న రోజుల్లో ఊళ్లో అందరికీ విభీషణుడంటే చాలా ఇష్టంగా ఉండేది. పెద్దవాళ్లు చెప్పినట్టు నడుచుకుంటూ దేన్నీ ప్రశ్నించేవాడు కాదు వాడు. చాలాసార్లు విభీషణుడు ఈ సమాజంలో చక్కగా ఇమిడిపోగలడనీ, జీవితంలో చాలా పైకి వెళ్లగలుగుతాడనీ నాకు అనిపించేది. నాకు కూడా వాడంటే ఇష్టమే. వాడు చాలా అర్భకంగా, బలహీనంగా ఉండేవాడు. క్రూరమైన ఈలోకంనించి వాడిని రక్షించాలని నాకు ఎప్పుడూ అనిపించేది. కొంత ఆత్మవిశ్వాసం చాలా అవసరమని అనిపించేది నాకు. మామూలుగా అందరూ అనుకునే తెలివితేటలు కూడా నాలో ఉండేవి కావు. విభీషణుడు వేదాల్లో ఏ భాగాన్నైన్నా వెనకనించి ముందుకి కూడా అవలీలగా వల్లించేసేవాడు. అది నా వల్ల అయేదికాదు. అయినా, వేదాల్లో ఏమీ లేదనీ, వాటిని ఎలా వల్లించినా ఒకటేనని అనుకునేవాణ్ణి. మా నాన్నలాంటి ఉద్యోగంలేని ఏ బ్రాహ్మడో, కొన్ని వేల సంవత్సరాలక్రితం వాటిని రాశాడు. సమాజానికి పనికివచ్చే పనులు చెయ్యటానికి బదులు, బ్రాహ్మలు వానకీ, ఎండకీ, గుర్రాలకీ, ఆవులకీ, ధనానికీ... ఇంకా చాలావాటికి తామే సృష్టించిన దేవుళ్లకి ప్రార్థనలు చేస్తూ కాలం గడిపేవారు. ఏ శాపగ్రస్తమైన ప్రదేశాలనించి వాళ్లు వచ్చారోగాని, అక్కడ విపరీతమైన చలి ఉండి ఉండాలి. లేకపోతే రకరకాల కట్టెపుల్లలు అగ్నిలో వేసి, కప్పల్లా అరుస్తూ, దేవుళ్లకి ఎందుకు నివేదించుకునేవాళ్లు?

బహుశా నా అభిప్రాయం తప్పేమో! వాళ్లు చేసే యజ్ఞాలు అంత పనికి మాలినవి కావేమో! నిజానికి, వాటివల్ల బోలెడంత ధనం సంపాదించుకునేందుకూ, భౌతికమైన ప్రయోజనాలు పొందేందుకూ అవకాశం దొరికింది. ఆ బ్రాహ్మలు అంత తెలివితక్కువ వారేమీ కారు. కట్టేపుల్లల్ని మంట పెట్టటం లాంటి లౌకికమైన రోజువారీ పనులని ఎంతో అద్భుతమైన పనుల్లాగ, ఈ ప్రపంచాన్నే మార్చివేసే శాస్త్రీయమైన ఆవిష్కారాలలాగ ప్రదర్శించటం, ఈ ప్రపంచాన్ని శాసించే శక్తులని వశపరుచుకోవటం వాళ్లకి తెలుసు. ప్రయోజనకరమైన పనులు చేసే

వడ్రంగులూ, తాపీ పనివారూ, రైతులూ లాంటి అధికసంఖ్యాకులు కప్పల్లాగ బెకబెకమనే ఈ హాస్యగాళ్లకి వంగి వంగి దండాలు పెట్టటం చూస్తే నవ్వొస్తుంది. ఈ బ్రాహ్మలు చేసే గొప్పపనల్లా, చెమటలు కక్కుకుంటూ, భగభగమండే నిప్పముందు ఎవరికీ అర్థంకానివి ఏవో వల్లించటమే, అదేమిటో ఆ దేవుడికే తెలియాలి! ఈ భూ ప్రపంచంలో ఏ విషయాన్ని తీసుకున్నా దానికి వాళ్ల దగ్గర యజ్ఞమో, పూజో ఉంటుంది. మీకు కుష్ఠువ్యాధి ఉన్నా మామూలుగా జలుబు చేసినా, దానికి మీరు సంతృప్తి పరచవలసిన ఒక దేవత ఉంటాడు, అతనికి మీరు విశేషమైన పూజ చెయ్యాలి. మిమ్మల్ని పీడించే భార్య, మిమ్మల్ని ఇబ్బందికి గురిచేసే పొరుగువాడితో కలిసి లేచిపోవాలని అనుకుంటోందా? దానికి కూడా ఒక పూజ ఉంటుంది. మీ ఆవు ఈనాలన్నా, మీ భార్య కడుపుతో ఉండాలన్నా, బ్రాహ్మలు మీకు సహాయం చేస్తారు. ఆయన కేవలం పూజ చేస్తాడు. అంతే! ఆ తరవాత మీకు దైవాంశ సంభూతుడైన పత్రుడో, మీ ఆవుకి దూడో పుడుతుంది. బ్రాహ్మలని మీరు పొగడ్తలతో ముంచెత్తితే చాలు, మీ కొడుకు పదహారేళ్లు వచ్చేసరికి ఈ ప్రపంచంలోకెల్లా గొప్ప పండితుడయిపోతాడు. అలా చెయ్యకపోతే, బహుశా నాలాగ జగడాలమారిగా తయారవుతాడు, బ్రాహ్మలనీ, వాళ్ల ఆచారకర్మలనీ గౌరవించడు. వాడు రాక్షసుడిగా మారిపోతాడు. అసలు మన మధ్య ప్రస్తుతం రాక్షసులు ఎక్కువమందే ఉన్నారని అనుకుంటాను. బహుశా అలా జరగటానికి కారణం, 'ఎందుకు?' అనే మహమ్మారి ప్రబలింది. మా బుర్రల్లో పాపపు ఆలోచనలు సమసిపోయేందుకు బ్రాహ్మలు ఏవైనా పూజలు చెయ్యలేకపోయారా? నాకు సమయం దొరికినప్పుడు దీన్ని గురించి ఆలోచించాలి.

నేను ప్రయాణాలు చేసినప్పుడల్లా మారువేషాల్లో మోసగాళ్లు తమకి దేవుడితో సంబంధం ఉందని చెప్పి జనాన్ని మోసం చేసి డబ్బు దోచుకోవటం చూస్తూ ఉంటాను. పూర్వకాలపు రాజులు హఠాత్తుగా దేవుళ్లుగా ఎలా మారారో అని చాలా ఆశ్చర్యం వేస్తుంది. ఇక ప్రత్యేకమైన వరాలిచ్చే దేవుళ్లలా ఎలా తయారయారో ఇంకా పెద్ద

విడ్డూరం. నేను నాస్తికుణ్ణి కాను. దేవుడిలో నాకు గట్టి నమ్మకమే ఉంది. నా భౌతిక ప్రగతికోసం, ఆధ్యాత్మిక ఉన్నతికోసం ఎప్పుడూ దేవుణ్ణి ప్రార్థిస్తూనే ఉండటానికి ఇష్టపడతాను. కానీ నా దృష్టిలో, దేవుడు ఒక వ్యక్తిగతమైన విషయం. ప్రార్థన అనేది నా మనసులో మౌనంగా ఉచ్చరించవలసిన మాటలు.

3. బంధితులు

రావణుడు

అసురుల సమాజంలో కులం అనేది లేదు. చాలా ప్రజాతంత్ర పద్ధతి ప్రకారం, రాజుకి బదులు ఒక ఎన్నుకోబడ్డ శాసనసభ ఉంటుంది. అధికారమంతా దాని చేతుల్లోనే ఉంటుంది. అంతేకాక వాళ్లది ఒక సంచార తెగ, బతుకుతెరువుకోసం వేటమీదా, దాడులు చేసి దోపిడీ చెయ్యటం మీదా ఆధారపడతారు. కానీ 2000 ఏళ్ల క్రితం ఎక్కడో, ఎప్పుడో వాళ్లు నదీతీరాల్లో నగరాలూ, చిన్నచిన్న ఊళ్లూ నిర్మించుకుని స్థిరపడ్డారు. అసురుల రాజ్యంలో వీధుల్లో బంగారం పరిచేవారని చెప్పుకుంటారు. కానీ ఎంత గొప్ప సామ్రాజ్యాన్ని నిర్మించారు వాళ్లు! పడమటి దిక్కున సింధునది నించి, తూర్పున బ్రహ్మపుత్ర నది వరకూ, ఉత్తరాన హిమాలయాల నించి దక్షిణాన నర్మదానది వరకూ విస్తరించి ఉండేది అది. ఆ కాలంలో ఈ భూతలం మీద అదే అన్నిటికన్నా పెద్ద రాజ్యం అయి ఉండే అవకాశం ఉంది. ఈజిప్టు రాజులు తమని పాతిపెట్టేందుకు బ్రహ్మాండమైన సమాధులు కడుతున్న సమయంలో, ప్రజా తాంత్రికమైన అసుర సమాజం వీధులనీ, వైద్యశాలలనీ, మురికినీటి కాలవలనీ, ఇంకా ప్రజలకి ఉపయోగపడతాయనే ఎన్నో రకాల నిర్మాణాలని నిర్మించటంలో మునిగి ఉండేది.

మా అమ్మ తను ఒక విశిష్టమైన అసురుల తెగకి చెందినదానినని చెపుతూ ఉండేది. దాని పేరు హెతిస్. ఎవరూ ఆమె మాటలు నమ్మలేదు. కానీ ఒక గొప్ప తెగకి చెందిన అసురుడినని నాకు మాత్రం గర్వంగా ఉండేది. అసురులలో మతపరమైన భక్తి భావం అంత ఎక్కువగా ఎప్పుడూ లేదు, కానీ మాకు కూడా మా దేవుళ్లు ఉండేవాళ్లు. వాళ్లలో ముఖ్యమైనవాడు శివుడు. ప్రాచీనకాలంలో శివుడు ఒక గొప్ప అసుర రాజనీ, అసురులు సంచారులుగా ఉండేకాలంలో ఆయన

రాజుగా ఉండేవాడనీ మాకు తెలిసింది. ఆయనే మాకున్న ఒకేఒక దేవుడని అనుకోవటం నాకు ఇష్టం. ఆయనంటే వ్యక్తిగతంగా నాకెంతో ఇష్టం. బహుశా 1000 సంవత్సరాల క్రితం అనుకుంటాను, విస్తారమైన మైదాన ప్రాంతాల్లో గుర్రాలెక్కి వచ్చిన మధ్య జంబూ ద్వీపవాసులు, బర్బరులు, అసురుల నగరాలని కొల్లగొట్టారు. ఆ శక్తిశాలి అసురుడితోపాటు పదిమంది రాజులు బైలుదేరి జీలం నది దగ్గర ఆ బర్బర జాతితెగని కలుసుకున్నారు. అలా కొల్లగొట్టిన తెగ నాయకుడి పేరు ఇంద్రుడు. తను చేసే అత్యాచారాలవల్ల అతనికి 'పురందరుడు' లేదా 'నగరాలని నాశనం చేసేవాడు', అనే పేరు వచ్చింది. కొన్నివేలమంది చంపబడ్డారు; వయసుతో నిమిత్తంలేకుండా స్త్రీలమీద అత్యాచారాలు జరిగాయి, పిల్లల్ని సజీవ దహనం చేశారు, ధాన్యాగారాలని దోచుకున్నారు. గొప్ప గొప్ప నగరాలు నేలమట్ట మయ్యాయి. ఒక నాగరికత ధ్వంసం అయింది. ప్రగతి తాలూకు కాలయంత్రం కొన్ని శతాబ్దాలు వెనక్కితిప్పబడింది. అసురులు అన్నీ కోల్పోయి దక్షిణదిశగా పారి పోయారు. నాగజాతి జనులు తూర్పున ఉన్న కొండలవైపు పారిపోయారు, కిన్నరుల రాజ్యమూ, యక్షుల రాజ్యమూ తుడిచిపెట్టుకుపోయాయి. గంధర్వులు సంచారజాతిగా మారిపోయారు, చాలా త్వరగా చరిత్ర, పురాణాలూ వాళ్లని మర్చిపోయాయి.

దాడి జరిగిన సమయంలో అసురుల నాగరికత పై శిఖరాలకి చేరుకుని ఉంది, కానీ యుద్ధం చేసే శక్తిని వాళ్లు కోల్పోయారు. సంస్కృతీ, సంగీతం, చిత్రకళా, భవన నిర్మాణ కళా కలగలిసి అసురుల యుద్ధ కౌశలాన్ని మొద్దుబారేలా చేశాయి. యుద్ధాన్ని కూడా ఒక క్రీడలాగే సైనికులు భావించేవాళ్లు. వాళ్లకి మంచి సామర్థ్యంగల నాయకుడు లేడు, దేశరక్షణకి అవసరమైన యుద్ధకళ తెలిసిన సైన్యాధిపతికాని, యుక్తియుక్తులతో వేసుకున్న ప్రణాళికగాని లేవు. బలశాలియైన ఇంద్రుడి నాయకత్వంలో దాడిచేసిన కొద్దిమంది దురాక్రమణదారులు శక్తివంతమైన పెద్ద అసుర సైన్యాన్ని మట్టి కరిపించటంలో ఆశ్చర్యం

ఏముంది? అయినా, అసురజాతి ఆధిపత్యం గురించి మరీ ఎక్కువగా గొప్పలు చెప్పుకుని ఉండవచ్చు. ఓటమికి గురైన జాతి మనుషులు తరచు తమ అవమానాన్ని కప్పిపుచ్చుకునేందుకు, సాంస్కృతికంగా తాము ఎంత ఉన్నతులో నిరూపించే ప్రయత్నం చేస్తారు. గెలిచిన వాళ్లని ఎప్పుడూ క్రూరులుగా, అనాగరికులుగా చిత్రించి, మోసం, మాయ సాయంతో గొప్ప సంస్కృతిని ఎలా ధ్వంసం చేసి ఓడించారో వర్ణిస్తారు.

కానీ అసురులు ఊరుకోలేదు, తమపై విజయం సాధించిన వారితో మళ్లీ యుద్ధం చేశారు. తాము కోల్పోయిన ప్రాంతాన్ని చేజిక్కించుకునేందుకు దక్షిణ దిక్కునించే యుద్ధం ప్రారంభించారు. అప్పుడప్పుడూ విజయం సాధించారు. ఒక్కోసారి మొత్తం రాజ్యాన్నే తమ ఆధీనంలోకి తెచ్చుకోగలిగారు. అయినప్పటికీ, బుద్ధికుశలతకి సంబంధించిన యుద్ధంలో మాత్రం వాళ్లు ఓడిపోతూనే వచ్చారు. ఉత్తర-ప్రాచ్య ప్రాంతాలనించి వచ్చిన తెగలు తమ స్థావరాలని కోల్పోవటం మొదలుపెట్టి, అసురులతో కలిసిపోవటం ప్రారంభించాయి. అసురుల దేవుడు శివుణ్ణి వాళ్లు దొంగిలించారు. గురువైన బ్రహ్మ కూడా వాళ్ల దేవుడైపోయాడు. కానీ, హఠాత్తుగా ఎక్కడినించో ప్రత్యక్షమైన విష్ణువు అందరికన్నా ఎక్కువ ప్రాధాన్యతని సంపాదించుకున్నాడు. దేవతలకి ఆధికారికంగా పురోహితుల స్థానాన్ని పొందిన బ్రాహ్మణులు, క్లిష్టమైన ఆచారకర్మలని రూపొందించటం ప్రారంభించారు. అసురుల నగరాలకి ఉన్న అసలు బలం విశ్వజనీనమైన సంస్కృతేనని వాళ్లు కనిపెట్టారు. అసురులు స్వతంత్రులు. వాళ్ల కల్పనాశక్తి చాలా గొప్పది. ఏమీ కోరని ప్రేమించదగ్గ దేవుడిగా శివుణ్ణి వాళ్లు కల్పన చేశారు. ఆయన్ని ప్రార్థించేందుకు ఎటువంటి ఆచారకర్మలూ అవసరం లేదు. ఆయన అసురులకి మిత్రుడు, బంధువు, కుమారుడు, తండ్రి, ఇంకా ఏమైనా ఊహించుకోగలిగితే ఊహించుకోవచ్చు. ఎన్నో నగరాలలో శివుణ్ణి లింగరూపంలో ప్రదర్శించారు, మగతనానికీ, ఫలన సామర్థ్యానికీ అది ప్రతీక.

ఒకసారి నగరాలని చేజిక్కించుకుని, దేవాలయాలని ధ్వంసం చేశాక, తాము ఓడించిన ప్రజలు రూపంలేని ఒకేఒక దేవుడు, ప్రజాపతి బ్రహ్మ అనే ఆయన్నే ప్రార్థించాలని ఒత్తిడి చేశారు గెలిచినవారు. ఈ ఆలోచన అసురులకి పరిచయం లేనిది. అందుకని వాళ్లు తిరగబడి పోరాటం చేశారు.

స్వదేశీయుల మతం గురించి పట్టించుకోకుండా వదిలెయ్యాలని వాళ్లు నిర్ణయించుకున్నారు. కానీ విజేతల పక్షం తరపు ప్రచారకులు అత్యుత్సాహంతో పనిచెయ్యటం ప్రారంభించారు. వాళ్లు తమ నాయకులకి దేవత్వం ఆపాదించటం మొదలుపెట్టారు. త్వరలోనే పరిపాలించే వర్గం తమని తాము దేవుళ్లమని చెప్పుకో సాగారు. ఈ దేవుళ్లు వేలసంఖ్యలోకి, లక్షల సంఖ్యలోకి చేరుకున్నారు. రాజుల తర్వాత స్థానాన్ని బ్రాహ్మణులు ఆక్రమించుకున్నారు, తమని తాము దేవతలమని చెప్పుకోవటం మొదలుపెట్టారు. ఏది ఏమైనా, సమాజం మరింత క్లిష్టంగా మారుతున్నకొద్దీ అర్థంలేని ఆచారకర్మలు పెరిగాయి. సమాజం మీద బ్రాహ్మణుల అదుపు ఎక్కువయింది. ఇది కొన్ని శతాబ్దాలపాటు వచ్చిన పరిణామం. కానీ ఆశ్చర్యం ఏమిటంటే, బ్రాహ్మణుల ఈ ప్రచార యంత్రాంగానికి ఎన్నడూ అలసట అనేది కలగలేదు. తాము గెలుచుకున్న ప్రజలమీద ఆధిపత్యం వాళ్లదే అయింది. గెలుచుకున్నవాళ్లని దాసులు అని పిలవసాగారు. పాలక వర్గమూ, బ్రాహ్మలూ నిరంతరం సుఖ సంతోషాలతో ఆనందంగా జీవించేందుకు అవసరమైన అన్ని పనులూ ఈ దాసులు చెయ్యవలసి వచ్చేది. పాలకులు చేతకానివాళ్లు, పరిపాలనా విధానం ఎంతమాత్రం తెలీనివాళ్లు, వాళ్ల స్వార్థపూరితమైన పాలనవల్ల జనాభాలోని పెద్దసంఖ్య తిరుగుబాటు సైన్యంతో చేరిపోవలసివచ్చింది. పిరికివాళ్లూ, అశక్తులూ, అసమర్థులూ మాత్రమే నగరాల్లోని మురికివాడల్లో ఉండిపోయారు.

నేను ఎప్పుడూ ఉత్తరదిశగా ఇంతదూరం ప్రయాణం చేసే సాహసం చెయ్యలేదు. కానీ వెళ్లిన ప్రతిచోటా నాకు అలజడులూ, ఆందోళనలే

కనిపించాయి. అకస్మాత్తుగా దాడిచేసే వాళ్లవల్ల దేవతల సామ్రాజ్యం నెమ్మదినెమ్మదిగా కూలిపోసాగింది. పెద్దసంఖ్యలో జనం తిరుగబాటు చెయ్యటం, మేఘ గర్జనలా దూరంగా నాకు తెలియసాగింది. ఏళ్ల తరబడి ఓడిపోయిన అసురుల తెగలు ఘోరంగా పోరాడుతున్నాయి, కానీ తమ భూమిని తిరిగి పొందటంలో వాళ్లకి పాక్షికమైన విజయమే లభించింది. కేరళ పుత్రుల తెగకి చెందిన మహాబలి లాంటి వ్యక్తి కొన్నేళ్లపాటు అసురుల ప్రాణంలేని కలలకి మళ్లీ జీవం పోశాడు. ఆయన తన రాజ్యాన్ని 18 సంవత్సరాలు తిరుగులేకుండా పరిపాలించాడు. అపరాజితులైన కవలలు హిరణ్యకశిపుడూ, హిరణ్యాక్షుడూ కూడా తమ ప్రాంతంలో అదే పని చేశారు. కానీ వాళ్లందరూ త్వరగా కూలిపోయారు.

మొదట్లో అసురులకి గొప్ప యుద్ధతంత్రం తెలిసి ఉండేది, యుద్ధానికి కావలసిన యంత్రాలు తయారుచేసేందుకు మంచి సాంకేతిక నిపుణులు ఉండేవారు, ధైర్యసాహసాలతో యుద్ధాలకి నాయకత్వం వహించే గొప్ప సేనానాయకులు ఉండేవారు. కానీ దేవతల కుయుక్తులూ, తమవారి నమ్మకద్రోహమూ విజయం సాధించే సామర్థ్యం ఉండికూడా ఓడిపోవటానికి కారణమయాయి. అసురులలో ఐకమత్యం లేదని తెలిసిపోయింది. అందరికన్నా నేనే గొప్ప అనే దురహంకారం, దురభిమానం, తమ బలం గురించి మితిమీరిన ఆత్మవిశ్వాసం, ఆ తరవాత దేవతలు న్యాయబద్ధంగా యుద్ధం చేస్తారన్న నమ్మకం (దేవతలు అలాంటి యుద్ధం చెయ్యాలని ఎప్పుడూ అనుకున్నప్పటికీ దాన్ని చాలా అరుదుగా ఆచరణలో పెట్టేవారు) అసురులు 1000 సంవత్సరాలవరకూ ఎడారులవెంటా చెట్లూపుట్టలూ పట్టుకుని తిరిగేలా చేసింది.

ఆ తరవాత తెగలు ఒకదానితో ఒకటి కలిసిపోసాగాయి. ఎవరూ కూడా మాది నూటికి నూరుపాళ్లు దేవతల రక్తమని గాని, అసురుల రక్తమని గాని చెప్పుకో లేకపోయేవారు. చిక్కటి గోధుమవర్ణపు అసురులు పాలిపోయినట్టున్న దేవతలతో సంబంధాలు

కలుపుకున్నారు. ఇక దేవతలు రకరకాల వర్ణాలతో కలిశారు. పచ్చని పసుపు రంగున్న గంధర్వులతోనూ తెల్లటి తెలుపు వర్ణాల కిన్నరులతోనూ, నల్లటి నలుపు రంగు ఉండే యక్షులతోనూ సంబంధాలు కలిగి ఉండటం ప్రారంభించారు. నీలి కళ్లున్న నల్లటి దేవజాతి కన్యలూ, పసుపుగా ఉండి గోధుమరంగు జట్టున్న అసురులూ కనిపించటం సర్వసాధారణమైపోయింది. ఒకే తల్లికి బూడిదరంగు కళ్లూ బొగ్గు నలుపు శరీరమూ నిడుపాటి కురులూ కలిగిన కుమారుడూ, నల్లటి కళ్లూ, తెల్లటి చర్మమూ, ఒంకుల జుట్టూ ఉన్న కుమార్తే, వాళ్లిద్దరికీ పసుపు రంగు చర్మమూ, నల్లటి ఉంగరాల జుట్టూ ఉన్న మరో తోబుట్టువూ ఉండటం అసాధారణం అనుకునేవారు కాదు. నామటుకు నేను తెల్లగా, దట్టమైన ఒంకుల జట్టుతో, నల్లటి పెద్దపెద్ద కళ్లతో పుట్టాను. నా చెల్లెలు అర్ధరాత్రంత నల్లగా, నిడుపాటి కురులూ, గోధుమరంగు కళ్లూ కలిగి ఉంటుంది. కుంభకర్ణుడు లావుగా నల్లరంగులో, నల్లటి ఉంగరాల జుట్టుతో ఉంటాడు. విభీషణుడు తేలిక గోధుమరంగులో, నీలి కళ్లూ గోధుమరంగు ఒంకుల జుట్టూ కలిగి ఉంటాడు.

అంతకుముందు సంకరజాతిని నీచంగా చూసేవారు. దేవతలు వాళ్లని కుష్ఠురోగుల్లా దూరంగా తరిమేవారు, అసురులు వాళ్లని గేలిచేసేవారు. సమాజం సానుభూతికి నోచుకోక, తిరస్కారానికి గురై, ఈ సంకరజాతికి చెందిన కొందరు గుంపుగా వేరే ప్రాంతంలోని అడవుల్లోకి వెళ్లిపోయారు. వాళ్లు బలహీనంగా, సంస్కారం లేకుండా, ఎటువంటి ప్రయోజనకరమైన పనులూ చెయ్యకుండా ఎప్పుడూ వసపిట్టల్లా ఏదో ఒకటి వాగుతూనే ఉండేవారు. వాళ్లు చాలా మోటుగా, భయంకరమైన జీవితాన్ని గడిపేవారు. అడవుల్లో కాసే కాయలూ, పళ్ళూ, తేనే సంగ్రహించి, చెట్లమీదా, గుహలలోనూ నివసిస్తూ, దరిదాపుల్లో ఉన్న ఊళ్లమీద అప్పుడప్పుడూ దాడిచేసి, బంగారాన్నీ, స్త్రీలనీ ఎత్తుకుపోయేవారు. వాళ్లది కోతుల తెగ - వానరులు - అని పిలిచేవారు. వాళ్లని ఎవరూ అంతగా లక్ష్యం చేసేవారు కాదు,

అనాగరికులకింద జమ చేసేవారు. దేవతల భాషలోనూ, అసురుల భాషలోనూ, వానరుడు అనేది ఒక తిట్టుగా మారింది. ఎవరినైనా వానరుడు అంటే దాన్ని పెద్ద అవమానంగా భావించి, ద్వంద్వయుద్ధాలకి పాల్పడేవారు. ఒక్కోసారి ఆ యుద్ధంలో మరణం కూడా సంభవించేది.

వాలి రంగంలోకి వచ్చేదాకా వానరులు దయనీయమైన జీవితం గడిపారు. గ్రీష్మకాలపు మేఘగర్జనతో వాలి హఠాత్తుగా ప్రత్యక్షమయాడు. వాలి మంచి యుక్తి పరుడు, గొప్ప సేనాధిపతి. వానరజాతిలో లేచిన తిరుగుబాటుని అణచివేశాక, అతను గొప్ప నాయకుడిగా ఎదిగి, క్రూరుడైన నియంతగా తయారయాడు. తన తమ్ముడు సుగ్రీవుడితో కలిసి, అతను తన రాజధాని కిష్కింధనించి చాలాసార్లు అసురులపైకీ దేవతలమీదికీ దండెత్తి వచ్చాడు. కిష్కింధ తుంగభద్ర నదీతీరాన ఉండేది. త్వరలో వానర రాజ్యం పడమటి కొండలనించి తూర్పు కొండలవరకూ విస్తరించింది. వాళ్లు లంక సరిహద్దుల్ని కూడా దాటుతామని బెదిరించసాగారు. ఉత్తరదిశలో గంగానది వరకూ ఉన్న దేవతల చిన్న చిన్న రాజ్యాలు నిరంతరం భయాందోళనలతో ఉండేవి. కానీ వాలి, కార్త వీర్యార్జునుడనే గొప్ప శక్తిశాలి అయిన చక్రవర్తితో శాంతియుతమైన సంబంధం పెట్టుకున్నాడు. కార్తవీర్యార్జునుడు, ఆసీమలో మొట్టమొదటస్థిరనివాసం ఏర్పరుచుకున్న ఒక ఆదిమతెగకి సంబంధించిన వ్యక్తి, ఆయన పడమటి తీరాన వింధ్యాచలాలకి రెండువైపులా ఉన్న సముద్రానికీ, ఎత్తైన పీఠభూమికీ మధ్యలో, నర్మదానది ఒడ్డున ఉన్న చిన్న భూభాగాన్ని పరిపాలించాడు.

పరిస్థితి చాలా ప్రమాదకరంగా పరిణమించింది. అధికారం ఎప్పుడు పడిపోతుందా అన్నట్టుండేది. పడమరన కార్తవీర్యార్జునుడు, మధ్య ప్రాంతంలో వాలి, ఉత్తరదిశన ఉన్నత హిమాలయాలకీ గొప్ప నదులకీ మధ్య ఇంద్రుడి సామ్రాజ్యం విచ్ఛిన్నమైన తరవాత ఏర్పడిన దేవతల చిన్నచిన్న రాజ్యాలూ, దక్షిణాన ఎప్పుడూ పోరాటం చేస్తూ ఉండే అసురుల తెగలూ - వీటి మధ్య అధికారం ఎప్పుడు ఎవరి చేతుల్లోకి

మారుతుందో తెలిసేది కాదు.

అసురుల పరిస్థితి అందరికన్నా దయనీయంగా ఉండేది. పేదరికం, వ్యాధులూ, కరువు కాటకాల బాధా, ఒకప్పటి ప్రసిద్ధ నగరాలని పట్టిపీడించసాగాయి. భవన నిర్మాణ కళలో అద్భుతాలు సృష్టించటమే కాక, ముచిరపట్టణం, కావేరీ లాంటి రేవు పట్టణాల్లో పెద్దఎత్తున వ్యాపారాలు చేసేవారిని వదిలేస్తే, మిగతా ప్రాంతాల్లోని అసురులందరూ దుర్భరమైన పేదరికంలో జీవిస్తూ, ఆత్మాభిమానాన్ని పొందే ఆశని పూర్తిగా పోగొట్టుకున్నారు. ఉన్న సంపద మొత్తం నా సవతి అన్న కుబేరుడిలాంటి కొద్దిమంది చేతుల్లోకి చేరుకుంది. సేనాధిపతులు దేవతలతోనూ, ఆదివాసులతోనూ, వానరులతోనూ మూర్ఖంగా యుద్ధాలు చేస్తూ కాలాన్నీ, ప్రాణాలనీ వ్యర్థం చేసుకున్నారు. ఇంకా తరచుగా, వాళ్లు ఎటువంటి ప్రణాళికనీ, యుద్ధనీతినీ పాటించకుండా తమలోతాము పోరాడుకుని నాశనం అయేవారు.

మేం పూర్ణ నదిని దాటాం. అడవి మరీ దట్టంగా, లతలతోనూ, తీగలతోనూ అడ్డదిడ్డంగా అల్లుకుపోయి, దారి కనబడకుండా ఉండిపోయింది. నాకు కాస్త భయం వేసింది. హఠాత్తుగా దాడి చేసే ఎన్నో అసుర తెగలకి ఈ అడవులు దాక్కోవటానికి ఉపయోగపడేవి. మేము ముందుకే పోవాలని నిశ్చయించాం, కానీ కొందరు సాయుధులైన మనుషులు మమ్మల్ని చుట్టుముట్టారు. వాళ్లు ఎంత చాకచక్యంగా మమ్మల్ని చుట్టుముట్టారో చూస్తే నాకు ముచ్చట వేసింది. ఎక్కుపెట్టిన ఇరవై విల్లంబులు దాడిచేసేందుకు సిద్ధపడ్డాయి. నేను ఒక్కచూపుతో కుంభకర్ణుడిని ఆపాను. ఆ మూర్ఖుడు చినిగిన ఒరలోంచి తుప్పుపట్టిన కత్తిని తీసేందుకు ప్రయత్నిస్తున్నాడు. నేను పిరికివాడిని కాను, కానీ మేం ముగ్గురం, మమ్మల్ని చుట్టుముట్టిన ఇరవైమంది విలుకాళ్లతో సరితూగలేం. ఇది సాహసం చూపించే సందర్భం కాదు, పైగా వాళ్లు కార్త వీర్యార్జునుడి రక్షకభటులా లేకా అసురులా అన్నది నాకు తెలీలేదు. మరీ నల్లగా ఉండటంచేత వాళ్లని దేవతలని అనుకోలేకపోయాను.

ఒడూ పొడుగూ ఉన్న ఒక దృఢకాయుడు మా దగ్గరకి వచ్చాడు.

అతని జుట్టు కొద్దిగా నెరిసింది. తన కత్తిని నా మెడమీద పెట్టాడు. ఆ తరవాత, అతనికన్నా తక్కువ వయసున్న ఒక వ్యక్తి మమ్మల్ని సోదా చెయ్యటం ప్రారంభించాడు. అతని పొత్తి కడుపు కింది భాగంలో తన్ని, గొంతు పట్టుకుందామా అనిపించింది నాకు. ఇంతలో మరొకడు తన కత్తి మొనని విభీషణుడి గొంతుక్కి ఆనించాడు. ధీశాలి నా తమ్ముడు భయంతో ఏడుపుమొహం పెట్టాడు. నేను శాంతంగా చూస్తూ ఉండిపోయాను. ఇది శూరత్వం చూపించటానికి అనువైన సందర్భం కాదని అనుకున్నాను మనసులో, తరవాత, మమ్మల్ని బంధించి, కళ్లకి గంతలు కట్టి, తోసుకుంటూ, నెట్టుకుంటూ పొదల్లోంచీ అడ్డదిడ్డంగా పెరిగిన మొక్కల్లోంచీ లాక్కెళ్లారు.

4. గురువు

రావణుడు

ఎవరైనా వస్తారేమోనని ఎదురుచూస్తూ మేం గుహలో వణుకుతూ నిలబడ్డాం. ఆ గుహ లోతుల్లోంచి ఏవో చప్పుళ్లు వస్తున్నాయి. హఠాత్తుగా ఆ చప్పుళ్లన్నీ ఆగిపోయి భయంకరమైన నిశ్శబ్దం ఆవరించింది. నా గుండె అతివేగంగా కొట్టుకోసాగింది. విభీషణుడు ఏడవటం చూసి నాకు సిగ్గనిపించింది. కానీ నాకు వాడిమీద ఎనలేనంత జాలి కూడా వేసింది. వాడు లోకం పోకడలేవీ బొత్తిగా తెలీని అమాయకుడు. ఇంతలో గంభీరమైన ఖంగుమని పలికే గొంతు ఒకటి మా కళ్లకి కట్టిన గంతలు విప్పెయ్యమని ఆజ్ఞాపించింది. గంతలు తొలగిపోయి, గుహలో చీకటికి మా కళ్లు అలవాటుపడ్డాక, ఒక పెద్ద రాతి ఆసనంమీద ఒక వృద్ధుడు కూర్చుని ఉండటం కనిపించింది. ఆయన తీవ్రంగా మాకేసి కన్నార్పకుండా చూశాడు. నేను తల నిటారుగా ఎత్తి తదేకంగా ఆయనవైపే చూశాను. కనీ కనిపించకుండా, నెమ్మదిగా ఆయన మొహంలో చిరునవ్వు పొటమరించి, తరవాత మొహమంతా పరుచుకుంది. ఏదో మంత్రదండం ఆయన్ని స్పృశించినట్టు, అంత వరకూ కరకుగా, నీచుడిలా కనిపించిన ఆయన బలంగా, శక్తిమంతుడిలా మారిపోయాడు. మాటల్లో చెప్పలేని స్థిమితమేదో ఆయన మొహంలో కనబడింది. ఆయన చిరునవ్వు కొన్ని యుగాల జ్ఞానాన్ని అందించింది. నెమ్మది నెమ్మదిగా ఆయన ఎవరో నేను గుర్తుపట్టసాగాను, ఆయనే మహాబలి చక్రవర్తి! నా ఎదురుగా అసురుజాతికి చెందిన రాజులందరిలోనూ బలశాలి, శక్తిశాలి అయిన వ్యక్తి ఉన్నాడు. జ్ఞాని, బలశాలి, పండితుడు, దయగలవాడు, సామాజిక న్యాయం అమలుజరిగేట్టు చూసినవాడు, ధర్మానికి మారుపేరు - మహాబలి గురించి కొత్తగా పొగడాలంటే స్తుతిగీతాలు సరిపోవు. కానీ నా

మనసులో ఏమూలో ఈయనమీద ద్వేషం నీడలా కదులుతోందా? బలి చక్రవర్తి అద్భుతమైన దండయాత్రలు చేశాడు. తన శత్రువులని ఓడించి భూమండలాన్ని న్యాయంగా పరిపాలించాడు, కానీ ఆ శక్తిమంతుడైన చక్రవర్తి యాచనకోసం వచ్చిన ఒక పేద బ్రాహ్మణుడు వామనుడికి ఇచ్చిన మాట తప్పటం ఇష్టంలేక తన సామ్రాజ్యాన్ని కోల్పోయాడు.

బలిచక్రవర్తి ఏలుబడి అత్యున్నత స్థితిలో ఉండగా, ఆయన తన అధికారాన్ని ప్రకటించుకునేందుకు రాజసూయయాగం చేశాడు. రాజులూ, జాతి నాయకులూ, సామంత రాజులూ, మహారాజులూ, అన్ని తెగలవాళ్లూ, చిన్న రాజ్యాలని ఏలే పాలకులూ, అసురుల రాజధాని ముచిర పట్టణంలో రారాజు మహాబలి చక్రవర్తి సమక్షంలో, ఆయనకి విధేయత తెలుపుకునేందుకు వేంచేశారు. ఆ యాగం ఆచారకర్మలని అనుసరించి, చక్రవర్తి ఆరోజు ఎవరు ఏ వరం కోరుకున్నా ఇస్తానని వాగ్దానం చేశాడు. ఆ సమయంలోనే విష్ణువు వామన రూపంలో, పేద బ్రాహ్మడిలా వేషం ధరించి, రాజధాని నగరంలో ఒక బ్రాహ్మణ విద్యాకేంద్రం నెలకొల్పేందుకు మూడడుగుల నేల ఇమ్మని కోరాడు. మాటతప్పటం ఇష్టంలేని బలిచక్రవర్తి, తన అసుర రాజధానిలో దేవతల జాతి బ్రాహ్మణులు తమ మతాన్ని బోధించుకునేందుకు అనుమతినిచ్చాడు. త్వరలోనే ఆ చిన్నకేంద్రం, బ్రహ్మాండమైన మత ప్రచారక కేంద్రంగా పెరిగిపోయింది. అది కుట్రలకీ, కుతంత్రాలకీ ప్రోత్సాహాన్నిచ్చే ముఖ్య కేంద్రం అయింది. చివరికి అసుర ప్రముఖులు తమకి హాని కలిగించింది ఎవరో తెలుసుకునే లోపలే, దేవబ్రాహ్మలు చివరి అసుర సామ్రాజ్యాన్ని తమ వశం చేసేసుకున్నారు. బలిచక్రవర్తిని బహిష్కరించి పాతాళలోకానికి పంపేశారు, రెండు దశాబ్దాలు కష్టపడి ఆయన నిర్మించిన సామ్రాజ్యం, కొద్దికాలంలోనే చిన్నచిన్న రాజ్యాలుగా ముక్కలైపోయి, అవి ఒకదానితో ఒకటి కొట్లాడుకోసాగాయి. కానీ బలిచక్రవర్తి పేరుమాత్రం చరిత్రలో నిలిచిపోయింది.

చిన్నతనంలో నేను ఆదర్శంగా భావించిన వీరుడు రక్తమాంసాలతో నా ఎదుట కనబడేసరికి నేను నిర్ఘాంతపోయాను. కానీ మరోపక్క నాకు

నిరాశకూడా కలిగింది. చిన్నప్పుడు విన్న వందలకొద్దీ జానపదగాథల్లోనూ, చారిత్రక గాథల్లోనూ నేను ఊహించుకున్న అతిసుందరుడైన బలిచక్రవర్తికీ ఈయనకీ ఎక్కడా పోలిక కనిపించలేదు.

"గత కొన్ని వారాలుగా మిమ్మల్ని వెంబడిస్తున్నాం. ఎవరూ కాలుపెట్టేందుకు సాహసించని ఈ ప్రదేశానికి మీరు రావటానికిగల కారణం ఏమిటి? రోజులు చాలా ప్రమాదకరంగా ఉన్నాయి. మీలాంటి మూర్ఖులు ఊరికే తిరిగేందుకు పనికివచ్చే ప్రదేశం కాదిది," ఆ గంభీరమైన గొంతు గుహలో ప్రతిధ్వనించి, పాత జ్ఞాపకాల్లో మునిగిపోయిన నన్ను ఉలికిపాటుకి గురిచేసింది.

నా ఎదురుగా ఉన్న మహాత్ముడికి వంగి నమస్కరించి, "రాజాధిరాజా, మేం మా అదృష్టాన్ని వెతుక్కుంటూ ప్రయాణం చేస్తున్నాం. లంకలోని దక్షిణ సముద్ర ప్రాంతపు ముత్యాలదీవి నివాసులం," అన్నాను. అలా అంటున్నప్పుడు నా నోరు చేదుగా అనిపించింది, కానీ మా మూలాలనించి తప్పించుకోవటం నాకు సాధ్యం కాలేదు. చివరికి మా చిరునామా కూడా అరువు తీసుకున్నదే అయింది, "మేం కైకేశి పుత్రులం, కుబేరుడి సవతి తమ్ములం. నాపేరు రావణుడు, వీళ్లు నా తోబుట్టువులు, కుంభకర్ణుడూ, విభీషణుడూ."

ముడతలుపడ్డ ఆయన ముఖంమీద భ్రుకుటి ముడిపడింది. విశాలమైన నుదిటిమీద దీర్ఘాలోచనవల్ల ముడతలు తేలాయి. ఆయన గొంతులో కర్కశత్వం స్పష్టంగా వినిపించింది, "రావణా, నీకన్నా ముందు నీ అపకీర్తి నాదాకా వచ్చింది. నేను కూడా అనుకుంటూనే ఉన్నాను. గత కొన్నేళ్లుగా నువ్వు చేసిన దుర్మార్గాల గురించి నాకు కొందరు సమాచారాన్ని అందించారు. అసురజాతిలో నీలాంటి పనికిమాలిన పొగరుబోతులు పుట్టటం నిజంగా దురదృష్టకరం. నా మనుషులు నిన్ను ఎనిమిది రోజులుగా వెంబడిస్తున్నారు. పోయినవారంలోనే వాళ్లు ఎన్నోసార్లు నీ గొంతు కోద్దామనుకున్నారు. నువ్వు యోధుణ్ణని చెప్పుకుంటున్నావా? నీలో రక్తం సంకరమవటం వల్లే ఇంత అసమర్థుడిగా తయారయావు. మూర్ఖుడిలా ప్రవర్తించటం మానేసి నీ

మనసులో రగులుతున్న తీవ్రమైన ఆకాంక్షకి తగినట్టు ప్రవర్తించు."

నాలో కోపం ఉవ్వెత్తున లేచింది. ఈ పరాజితుడికి నన్ను ఇలా తీసిపారేసే అధికారం ఎక్కణ్ణించి వచ్చింది? కానీ నాకు ఆయన అన్నది నిజమేనని తెలుసు. నా మనసులో రకరకాల భావాలు తరుముకొస్తూంటే, ఆ చక్రవర్తి ఎదుట నేను చేష్టలుడిగినట్టు నిలుచుండిపోయాను. నన్నెవరో నగ్నంగా చేసి, నా రహస్యాలు బైట పెట్టినట్టు అనిపించింది. ఆయన చూపు నన్ను ఎత్తిపొడుస్తున్నట్టు, సవాలు చేస్తున్నట్టు, ఓదారుస్తున్నట్టు, భయపెడుతున్నట్టు అనిపించింది.

"ఈ ప్రపంచానికి నీవల్ల ఉపయోగం ఉంటుందనే అనుకుంటున్నాను. మొదట్లో అందరూ మర్చిపోయి వదిలేసిన అసురుల రాజ్యం శివార్లలో, క్రిమికీటకా ల్లాగ, చీడపురుగుల్లాగ ఉండే అడుగూ బొడుగూ మనుషుల్లో నువ్వు కూడా ఒకడివని అనుకున్నాను. ఊరికే గొప్పదనం గురించి కలలుకంటూ నిష్క్రియగా కూర్చునుండే రకం అనీ, గతాన్ని తల్చుకుని గర్వపడటంతో సరిపెట్టుకుంటావనీ, ఊహల్లో తేలిపోతూ, తమనీ, తమ జాతినీ ఏదైనా మహాద్భుతం జరిగి మార్చెయ్యాలని ఆశిస్తూ ఎదురుచూసే రకం అనీ అనుకున్నాను. కానీ, రావణా, చాలా చిన్నదే అయినప్పటికీ, నాకు నీలో ఒక నిప్పురవ్వ కనిపిస్తోంది. సరైన గాలి తగిలేట్టు చేస్తే అది రగిలేజ్వాలగా మారే అవకాశం ఉంది. నువ్వు మా జాతికి, దీనావస్థలో ఉన్న అసురులకి, ఆశాకిరణానివో, శాపానివో నాకు తెలీదు. నీతి నియమాలు పాటించని శత్రువు కాళ్లకింద నలిగిపోతున్న ఆ ప్రజల గురించే నేను చెప్పేది. రావణా, దుస్థితిలో ఉన్న బలిచక్రవర్తి గృహానికి స్వాగతం. నీకు ఇష్టం ఉన్నన్ని రోజులు ఇక్కడ ఉండవచ్చు. కానీ ఉంటే సరిపోదు, నేర్చుకో. మనసులో ఎటువంటి సందేహాలూ పెట్టుకోకుండా రా, ఈ ప్రదేశం నీకు ఎన్నో విషయాలు నేర్పగలదని గుర్తుంచుకో."

ఆ వృద్ధుడి మాటల్లో ఏదో ఆకర్షణ ఉంది. ఆ తరవాత చెయ్యి ఊపి, చిరునవ్వు నవ్వుతూ ఆ చక్రవర్తి మమ్మల్ని వెళ్లమన్నాడు. అప్పుడతని

పెదవుల చివర్లు ఎత్తి పొడుస్తున్నట్టు వంకర తిరిగాయి.

నిడుపాటి తెల్లటి గడ్డం ఉన్న బక్కపల్చని మనిషి వెంట ఆ బ్రహ్మాండమైన గుహ లోపలికి వెళుతూ, నేను బలిచక్రవర్తి గురించే ఆలోచించసాగాను. బలిచక్రవర్తి అలా పరాజితుడవటం చాలా పరిహాసాస్పదంగా తోచింది. ఆయన ముందు ధ్వంసం అయిన అసుర సామ్రాజ్యాలకి ఉండిన గొప్పదనమూ, శౌర్యమూ ఈయన ఓటమిలో కనిపించలేదు. హిరణ్యకశిపుడూ, హిరణ్యాక్షుడూ లాంటి ప్రసిద్ధిచెందిన కవలల గొప్ప సామ్రాజ్యాలు, మొత్తం రాజ్యం మీద ఆధిపత్యాన్ని దాదాపుగా సాధించాయి, ఆ సమయంలో హిరణ్యాక్షుడిని ఒక అడవిపంది కొమ్ముతో పొడిచి చంపేసింది, హిరణ్యకశిపుడిని అతని కన్నకొడుకు ప్రహ్లాదుడే దేవతల రాజైన ఇంద్రుడితో కలిసి కుట్రచేసి చంపించాడు.

ప్రహ్లాదుడు బలహీనమైన రాజు. అతని సామ్రాజ్యం తొందరగానే నశించి పోయింది. ప్రజలమీద పెద్దమొత్తాల్లో పన్నులభారం వేశాడు. వ్యవసాయం, పశుపాలనా, ధ్వంసమయాయి, వర్తక సమాజాలు వలస వెళ్లాయి, కళలు నశించాయి. ఈ లోపల ఒక కొత్త బెడద రంగంలోకి దిగింది పరశురాముడనే ఒక బ్రాహ్మడు – వ్యక్తిగతమైన ఫలితాన్ని సంపాదించుకునేందుకు గొడ్డలి పట్టుకుని బైలుదేరిన రాముడు. దక్షిణాన ఉగ్రవాద దురాక్రమణలు చేసేందుకు కొందరు దుండగులని కూడగట్టుకున్న వ్యక్తి.

పరశురాముడు ఒక భూభాగాన్ని గెలుచుకున్నప్పుడల్లా, బ్రాహ్మణులకే అత్యున్నత పదవులు దక్కేలా చూసేవాడు. మలయనులూ, వణ్ణన్ లూ లాంటి ఒకప్పటి పురోహితులని నగరాలనించి బహిష్కరించి గ్రామాలకి తరిమేశాడు. ఎందుకూ కొరగాని రాజైన ప్రహ్లాదుడు పరశురాముడినించి శాంతిని సంపాదించు కున్నాడు, కానీ దానికి చాలా అవమానకరమైన మూల్యాన్ని చెల్లించి, అసురుల సమాజంలో బ్రాహ్మలకి ఉన్నత స్థానాలు దొరికేట్టు హామీ ఇచ్చాడు.

ప్రహ్లాదుడు మరణించి, బలిచక్రవర్తి సింహాసనాన్ని అధిరోహించాక, మార్పు వచ్చింది. ఒక్క దశాబ్దంలోనే మహాబలి ఇంద్రుడి సామ్రాజ్యం వెన్ను విరగొట్టి కొన్ని సంవత్సరాలలోనే మొత్తం ఉపఖండాన్ని జయించాడు.

మేము ఒక మలుపు దగ్గరికి రాగానే వృద్ధుడు ఉన్నట్టుండి ఆగి, మావైపు తిరిగి, "మీరు పడుకునే గదులు ఇవే. రేపట్నించీ పాఠాలు మొదలు పెడతాం," అన్నాడు.

మేము ఆయనకి ధన్యవాదాలు తెలిపేలోపలే, ఆయన వెళ్లిపోయాడు. మేం పడుకుని మా భవిష్యత్తు గురించి ఆలోచించాం. నాకు మా అమ్మా, చెల్లెలూ జ్ఞాపకం వచ్చారు. కొండ అంచున ఉన్న మా కుటీరాన్ని ఏ గాలివానా కూలదోయ కూడదని ఆశించాను. ఇరుగు పొరుగువారు ఇచ్చిన పాసిపోయిన ఆహారం కూడా ఆకలితో ఆవరావురుమంటున్న మాకు రుచిగా అనిపించిన దీనాతిదీనమైన మా బాల్యం నాకు గుర్తొచ్చింది. మా సవతి అన్న రాజభవనంలో మేం నలుగురం పందుల్లా ఆబగా మెక్కిన తరవాత కడుపునొప్పితో బాధపడటం గుర్తొచ్చింది. పళ్లూ, నెయ్యీ అలవాటు లేని మా కడుపులు పాపం ఎదురు తిరిగాయి, ఒక వారం రోజులవరకూ అవస్థపడ్డాం.

మా అమ్మ వెక్కిళ్లు పెట్టి ఏడుస్తూంటే, నా మనసు కూడా ఎక్కడో కలుక్కుమని మా దుస్థితికి నేను కూడా ఏడ్చాను. మా అజ్ఞానాన్నీ, మావాళ్ల గొప్పదనం గురించి అల్లుకున్న ఊహలనీ, పదిలంగా దాచుకున్న ఆ జ్ఞాపకాలనీ, మా అసహాయ స్థితినీ, నిస్పృహతో కూడుకున్న పరిస్థితులనీ, నాశనమైన జీవితాలనీ తల్చుకుని ఏడ్చాను. మా ఒంటిరంగు నల్లగా ఉందని కూడా ఏడ్చాను. భవిష్యత్తులో చెయ్యవలసిన పోరాటాలనీ, గతం తాలూకు ముక్కలు చెక్కలయిన ఆశలనీ, మా వాళ్లనీ, మా తెగలనీ తల్చుకుని వెక్కి వెక్కి ఏడ్చాను. పేదరికంలో కూడా మేము కాపాడుకున్న శౌర్యం తాలూకు రంగులనీ, ఏదైనా ఒక గొప్ప ప్రయోజనంకోసం ప్రాణాలు అర్పించాలన్న మావాళ్ల మతిలేని తీర్మానాన్ని కన్నీళ్లు కడిగెయ్యలేక పోయాయి. అలాగే

లేమినించి తనని తను కాపాడుకునే నా సవతి అన్నలాంటి మనుషుల క్రూరత్వాన్ని కూడా అవి కడిగెయ్యలేకపోయాయి. తరవాత నాకోసం ఏడ్చాను. ఆ తరవాత మమ్మల్ని దుప్పటిలా కప్పిన చీకటిలోంచి, రెండు వైపులనించీ రెండు చేతులు నన్ను కావలించుకున్నాయి – నా తమ్ముల అలసిపోయిన చేతులు. వాళ్లని ప్రాణాలొడ్డి రక్షిస్తానని ప్రతిజ్ఞ చేశాను, వాళ్లు కూడా నాకోసం తమ ప్రాణాలర్పిస్తారని నమ్మాను.

నెమ్మదిగా ఒక విషయం నాకు అర్థం కావటం మొదలుపెట్టింది. ఒక చిన్న ఆశని అలవోకగా బలిచక్రవర్తి నా మనసులో నాటాడు. అది విత్తనంలా మొలకెత్త సాగింది. దిక్కులేని ఒక పేద పిల్లవాడు ఈ మొత్తం ప్రపంచాన్ని జయించానని చెప్పటం కేవలం ఒక పగటికల కాదని అనిపించసాగింది. నా ఇద్దరు తమ్ములనీ గుండెలకి హత్తుకున్నాను. ఏమో, భవిష్యత్తు బావుందేమో! రేపు ఎలా ఉంటుందో ఎవరు చెప్పగలరు? అది ఒక కొత్త ప్రారంభం కావచ్చు.

5. దశముఖుడు, పది తలలు గలవాడు

రావణుడు

పొడవాటి తెల్లగడ్డం ఉన్న వృద్ధుడు మమ్మల్ని తెలవారుతుండగా నిద్రలేపి, కాలకృత్యాలు తీర్చుకునేందుకు దగ్గర్లో ఉన్న ఒక కొండవాగు దగ్గరికి తీసుకెళ్లాడు. మంచి మాటకారిలా కనిపించాడు. అకస్మాత్తుగా కథ చెప్పాలనిపించింది ఆయనకి. మేంకూడా శ్రద్ధగా వినే శ్రోతలమని గ్రహించినట్టున్నాడు, ఇలా చెప్పటం మొదలుపెట్టాడు, "నన్ను అందరూ బ్రహ్మ అని పిలుస్తారు. అది నా ఇంటిపేరు. బోధించటం అనేది మా వంశంలో తరతరాలుగా ఉన్నది. ప్రాచీనకాలంనించీ మా వంశంలోని వారందరూ గురువులే. జ్ఞాన సభలో నలుగురు గురువులు ఉండేవారు. అసుర సామ్రాజ్యమంతటా విస్తరించిన వందలాది పాఠశాలల్లో ఏ విషయాలు బోధించాలో వాళ్లే నిర్ణయించి పాఠ్యక్రమాన్ని తయారుచేసేవారు. ఈరోజు మనమందరం చూస్తున్నఅసుర ప్రపంచాన్ని సృష్టించింది మేమే. నా కుటుంబంలోని వారే చట్టాన్నీ, న్యాయాన్నీ తయారుచేశారు. వాళ్లని అందరూ దేవుళ్లలాగ కొలిచేవారు. శివుడి కుటుంబంతోపాటు అందరూ కలిసి సింధునది తీరాన గొప్ప సామ్రాజ్యాన్ని నెలకొల్పారు. పొలాలనీ, ఆస్తులనీ, జంతువులనీ కాపాడారు. సమాజంలో వాళ్లు చేసిన పనులనిబట్టి వాళ్లని పశుపతులు అని పిలిచేవారు. మేం ఒక నాగరికతని వికసింపజేశాం."

ఆయన ఇంకా అలా చెప్పుకుంటూ పోయాడు, "ఆ తరవాత దేవతల దురాక్రమణ ప్రారంభమైంది. ఇంద్రుడు చేసిన మొట్టమొదటి పని, మన నగరాలనీ, పాఠశాలలనీ, దేవాలయాలనీ నిప్పు ముట్టించి కాల్చెయ్యటం-ప్రగతిని ప్రోత్సహించే అన్నిటినీ అన్నమాట. ఆ సమయంలో మేము మయుని అనుచరులతో కలిసి వాళ్ల శిల్పకళనీ, సాంకేతిక నిపుణులనీ సంప్రదించి, సాంకేతికరంగంలో గొప్ప పురోగతిని

సాధించాం. మేం ఆకాశంలో ఎగిరే యంత్రాన్ని కూడా తయారుచేశాం. దానిపేరు పుష్పక విమానం. అయినా అది ఒక నమూనా మాత్రమే. ఆక్రమణకి గురైన తరవాత అంతా మారిపోయింది. మా కుటుంబ పెద్దనీ, విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం విషయాలకి బాధ్యుడైన నాలుగో సభ్యుడినీ ముందుగా ఆ బర్బరులు తుదముట్టించారు. అతనితోపాటు విజ్ఞానం కూడా నశించింది. మాయా విద్యాలయం ప్రముఖుడు సరిగ్గా ఆఖరి నిమిషాన విమానం ఎక్కి తప్పించుకుని పారిపోయాడు. అతని వారసులకి మీ సవతి అన్న ఆశ్రయం ఇచ్చి ప్రస్తుతం తన రక్షణలో ఉంచుకున్నాడు. పుష్పకవిమానాన్ని కూడా అతనే హస్తగతం చేసుకున్నాడు. మళ్లీ మనిషి ఆకాశంలో విహరించే నైపుణ్యం సంపాదించేందుకు ఎన్ని శతాబ్దాలు పడుతుందో నాకు తెలీదు. నా పూర్వీకులు ఆయుధాలనీ, సైన్యానికి కావలసిన పరికరాలనీ తయారుచెయ్యటంలో ప్రత్యేక నైపుణ్యం సంపాదించారు. బ్రహ్మ కుటుంబీకులు కళలూ, వృత్తి విద్యలూ, సంగీతంలో విశేషమైన కృషిచేసి గంధర్వ సామ్రాజ్యంలో రక్షణ పొందారు. గొప్ప వానరరాజు వాలి, శిల్పకళలో ఆరితేరిన బ్రహ్మ గురువులని రక్షించి గొప్ప నగరాలని నిర్మిస్తున్నాడు. నాలుగో బ్రహ్మ తెగవారు దేవతలతో కలిసి, తత్త్వజ్ఞాన ప్రసంగాలు చెయ్యటంలో సిద్ధహస్తులుగా తయారయారు. ప్రస్తుతం వాళ్లే దేవతలకి జ్ఞానాన్నిఅందించే గురువులు. అందుచేత మీకు అన్ని విషయాలలోనూ పరిజ్ఞానాన్ని అందించే ప్రయత్నం చేసినప్పటికీ, నేను ప్రత్యేకంగా ఆయుధాలమీదా, సైనిక యుక్తియుక్తులమీదా దృష్టి కేంద్రీకరిస్తాను. యోధులు అవాలనుకునే మీరు తెలుసుకోవలసిన ముఖ్యమైన విషయాలు అవేనని నా నమ్మకం."

ఆయన మాటలు మమ్మల్ని ఆకట్టుకున్నాయి. బ్రహ్మ తెగ ఎలా వికాసం పొందిందో మాకు కొద్దిగా అవగాహన ఉంది, కానీ మాముందు పద్మాసనం వేసుకుని కూర్చున్న ఆ వృద్ధుడు, స్వయంగా అంత ప్రాచీన జ్ఞానాన్ని మాకు అందించబోతున్నాడనేది అర్థమై మాకు ఆశ్చర్యం వేసింది. చూసేందుకు ఆయనలో గొప్ప గురువుకుండే లక్షణాలేవీ లేవు.

చాలా మామూలుగా, పొట్టిగా, బట్టతలా, బానపొట్టతో ఉన్నాడు. కానీ పొడవాటి తెల్లటి గడ్డం, కళ్లల్లో మెరుపూ ఆ క్షీణించిన వృద్ధ శరీరంలో దాగి ఉన్న గొప్ప ప్రతిభని బైటపెడుతున్నాయి.

ఆనాటినుంచీ, సహ్యా పర్వతాలమీద సూర్యోదయం అయి, పచ్చని కొండల్లో మలుపు తిరిగి రాజసం ఉట్టిపడుతూ ప్రవహించే పూర్ణ నది నీళ్లు ఊదారంగులోకి మారగానే, మా జీవితాల్లో ఒక కొత్త యుగం ప్రారంభమైంది. బ్రహ్మ ఎప్పుడో మేం కోల్పోయిన మా తండ్రి, ఇంటిదగ్గర వదిలేసివచ్చిన మా అమ్మ, మా గురువు, మా దేవుడు, రక్షకుడు. బ్రహ్మ కుటుంబానికి చెందిన ఎన్నో తరాల జ్ఞాన పిపాసువుల మస్తిష్కాలలో సంస్కరించబడి, అతి స్వచ్ఛమైన రూపాన్ని సంతరించుకుని, ఆ వృద్ధుడి నోటివెంట జాలువారింది. ప్రకృతిలో ఉన్న సంగీతం వినటం నాకు ఆయనే నేర్పాడు. పక్షుల కిలకిలారాగాలు ఎలా వినాలో, ఎగిసిపడే వాగుల గలగలలతో నా మనసు ఎలా నృత్యం చెయ్యాలో, ఆకాశంలో ఉవ్వెత్తున ఎగిరే గ్రద్దతో కలిసి నా అంతరాత్మ ఎలా గగనవీధుల్లోకి ఎగరాలో ఆయనే నేర్పాడు. నాకు లోపలా, బైటా ప్రక్షాళన జరిగినట్టు అనిపించింది. నా జీవితంలో ఎవరికైనా, దేనికైనా రుణపడి ఉన్నాను అంటే అది నా గురువుకే. ఆయన నా ఆకాంక్షకి ఒక ఆకారాన్ని అందించాడు, నా కలలకి రెక్కలు తొడిగాడు, నా దృష్టికి స్పష్టత కలగజేశాడు, నా బాహువులకి బలాన్నిచ్చాడు.

బాధ్యతారహితమైన కౌమారదశలో వేదాలూ, ఉపనిషత్తులూ అబద్ధాలనీ, మోసంతో నిండినవనీ తీసిపారేసేవాణ్ణి. కానీ బలిచక్రవర్తీ, బ్రహ్మ ప్రాచీనకాలపు అసురులవీ, దేవతలవీ, పవిత్ర గ్రంథాలలోని అద్భుత ప్రపంచాన్ని మా కళ్లకి కట్టినట్టు చూపించారు. ఆ ఉద్గ్రంథాలలో ఉన్న తాత్త్విక పరికల్పనలు చూసి నేను ఆశ్చర్యంతో నిలబడి ఉండిపోయాను. ఆ గ్రంథాలు రాసిన వాళ్లు మహాజ్ఞానులు, అద్భుతమైన ప్రతిభాసంపన్నులు. వేదాల పేరుతో మా నాన్నలాంటి వారు ప్రచారం చేస్తున్న అల్పమైన విషయాలకీ వీటికీ అసలు పోలికే లేదు.

ఆచార కర్మలూ, జంతు బలులూ, కులభేదం అనే శాపం - వీటిలో దేన్నీ వేదాలు సమర్థించలేదు, అలాగే అవి దైవశాసనాలూ, రాజశాసనాలూ, ఆజ్ఞా కూడా కావు. మహాబలీ, బ్రహ్మ అథర్వవేదం వ్యాఖ్యానించటం ప్రారంభించాక, వేదాలని ఔపోసన పట్టామని చెప్పుకునే అబద్ధాలకోరు పండితులని ఎవరినైనా సవాలు చెయ్యగలనన్న ఆత్మవిశ్వాసం నాకు కలిగింది. ఆ పవిత్ర గ్రంథాల అసలు అర్థం నాకు బోధపడిన తరవాత పురోహితుల వర్గం ప్రచారం చేసిన కులం, జంతుబలులు, ఇతర ఆచార కర్మలూ లాంటి దుర్మార్గాలని ఎదిరించాలన్న సంకల్పం దృఢంగా మనసులో నాటుకుంది. అర్థంలేని ఆచారకర్మలనీ, బలులనీ అణచివెయ్యాలని నిర్ణయించుకున్నాను. కులం అనే శాపాన్ని తుదముట్టించాలని నిశ్చయించుకున్నాను.

మా విద్య దాదాపు ముగిసిపోవచ్చింది. చివర్లో కొన్ని పాఠాలు స్వయంగా చక్రవర్తే నేర్పాడు. మనసుని నిగ్రహించటం, ఇంద్రియాలని జయించటం లాంటి విషయాలమీద ఆయన చాలా వివరంగా మాట్లాడాడు. ఆయన ప్రతిపాదించిన దారి కఠినమైనది, న్యాయమైనది. దాన్ని అనుసరించటం చాలా కష్టం, సవాళ్లతో నిండి, ఆచరణ యోగ్యమైనది కాదు. "కోపం అన్నిటికన్నా తుచ్ఛమైన భావం. అది తెలివితేటలని కప్పేస్తుంది, మూర్ఖంగా ప్రవర్తించేట్టు చేస్తుంది. మంచీ చెడూ, విచక్షణా జ్ఞానం కోల్పోయి, ఆలోచించకుండా శరీరంతో మాత్రమే ప్రతిస్పందిస్తారు. అన్ని విషయాలలోనూ ఓటమిని చవిచూస్తాం. మీ శరీరంలోంచీ, మనసులోంచీ దీన్ని నిర్మూలించండి."

"తుచ్ఛమైన భావనకి తరవాతి స్థానం గర్వానిది. గర్వంనించే అహంకారం పుడుతుంది. స్పష్టంగా ఆలోచించే శక్తినీ, దృష్టికోణాన్నీ అది నాశనం చేస్తుంది. గర్వంవల్ల మీరు మీ శత్రువులని తక్కువగానూ, మిమ్మల్ని ఎక్కువగానూ అంచనా వేసుకుంటారు. ఈర్ష్య చాలా చెడ్డ భావన. దాన్ని నియంత్రించి అదుపులో ఉంచుకోవటం మనిషికి ఉండే అతికష్టతరమైన పనులలో ఒకటి. ఈర్ష్యవల్ల మీరు అవతలి వ్యక్తి

రాజ్యాన్ని హస్తగతం చేసుకోవాలని ఆరాటపడతారు, వాళ్ల సంపదనీ, భార్యనీ, పేరు ప్రతిష్టలనీ సొంతం చేసుకోవాలని తహతహలాడతారు. ఈర్ష్య కారణంగా ఎంతో కాలంగా ఎన్నో యుద్ధాలు జరిగాయి, రక్తం ధారలై పారింది, కన్నీరు కాల్వలు కట్టింది."

"పగలూ రాత్రీలాగ సంతోషం, దుఃఖం అనేవి ఎప్పటికీ నిలిచిపోయే శాశ్వతమైన భావనలు. గొప్ప తెలివితేటలున్న వ్యక్తి వీటి ప్రభావానికి లోనుకాడు. అవి తుచ్ఛమైన భావనలు ఎంతమాత్రమూ కావు. మన ఆలోచనలని ప్రతిబింబిస్తాయి, మనం చూసే, వినే, చేసే వాటిగురించి మనకి ఉన్న దృష్టి కోణానికి ప్రతిస్పందనలు అవి. ఒక యుద్ధ వీరుడికి సమదృష్టి ఉండటం హర్షించదగిన విషయమే కాదు, అత్యవసరం కూడా. అదే లేకపోతే యుద్ధభూమిలో మీరు మరణించిన వారితో సమానం.?

"భయం అనేది భావన కాదు, అది ఒక వ్యాధి. అది నాయకుడినించి అతని అనుచరులకీ, అనుచరులనించి నాయకుడికీ వ్యాపిస్తుంది. భయం చంపినంతమందిని యుద్ధంలో ఇంకేదీ చంపలేదు. ఒక యోధుడు దేనికి భయపడాలి? మరణానికా? కానీ అందరూ చివరికి పొందేది మరణమే. మరి గాయాలని చూస్తే భయమా? ఏది ఎక్కువ ముఖ్యం? కొంత మోత్రాదులో మీ రక్తాన్ని కోల్పోవటమా, లేక విజయం అనే మకరందాన్ని సంపాదించుకోవటమా? ఆలోచించండి. ఆలోచిస్తే అలాంటి సందేహాలు పటాపంచలవుతాయి."

"స్వార్థంకన్నా గర్వించదగినది మరేదీ లేదు. తనని గురించి మాత్రమే ఆలోచించే వ్యక్తి అందరికన్నా దురదృష్టవంతుడు. ఎవరైనా ఎందుకు పుడతారు? తిండి తింటూ లావెక్కేందుకా? పందుల్లాగ పిల్లల్ని కంటూ పోయేందుకా? ఈ అందమైన పృథ్విని శరీరంలోని వ్యర్థాలతో మలినపరచి, ఈ ప్రపంచంలో ఎలాంటి చిన్న మార్పులూ చెయ్యకుండా చనిపోయేందుకా? మన వాళ్లని తొక్కేస్తున్న చీకటిని ఛేదించేందుకు ఒక్కచిన్నదీపమైనా వెలిగించలేనివాడు జీవించి ఏమిటి ప్రయోజనం? రావణా, ఈ స్వార్థం అనే చెడు భావనని ద్వేషించు!"

"ప్రేమ సంకెళ్లలాంటిది. అది నిన్ను ఊహాలోకం అనే గుదిబండకి కట్టివేస్తుంది. ఒక యోధుడు కేవలం విజయంమీద మాత్రమే దృష్టిని కేంద్రీకరించాలి. నీ ధర్మం, నీ కర్తవ్యం అదొక్కటే. మీ వాళ్లకి, తలిదండ్రులకీ, భార్యలకీ, తోబుట్టువులకీ, దేవుళ్లకీ బద్ధుడవై కర్తవ్యం నిర్వహించు, కానీ ఎప్పుడూ వాళ్లని ప్రేమించవద్దు. ప్రేమ నిన్ను బలహీనుణ్ణి చేస్తుంది. విజయం, ఓటమీ అనేవి త్రాసులో ఉన్న కీలకమైన పరిస్థితుల్లో ప్రేమ అనేది నిన్ను కనబడని తాళ్లతో కట్టేసి ఓటమి అనే అగాథంలోకి తోసేస్తుంది. ప్రేమని చూసి భయపడు."

"చివరిగా నీ తీవ్రమైన ఆకాంక్షలని అదుపులో ఉంచుకో. రావణా, నీ కళ్లలో నాకు తీవ్రమైన ఆకాంక్ష రగలటం కనబడుతోంది. కానీ తొందరపాటు పనికిరాదు. జీవితం నీకు ఇచ్చేది మాత్రమే నీ సొంతం అనుకుని స్వీకరించు. జీవితాన్ని తన గమ్యం తాను వెతుక్కోనియ్యి. లక్ష్యాలని ఏర్పరుచుకుని వాటిని సాధించే ప్రయత్నం చెయ్యి, కానీ నీ కాళ్లు ఎప్పుడూ స్థిరంగా నేలమీదే ఉండేట్టు చూసుకో. ఆలోచించు, ఏపనైనా చేసే ముందు ఒకటికి పదిసార్లు ఆలోచించు."

"దాచుకోవలసినది నీ మనసు మాత్రమే. నీ గురువుల దగ్గర పుస్తకాలు, జీవితం నుంచి నేర్చుకునే జ్ఞానాన్ని అది పదిలపరుచుకుంటుంది, ఆ తరవాత దాన్ని గొప్ప తెలివితేటల రూపంలో సంస్కరిస్తుంది. నువ్వు అభివృద్ధి చేసుకోవలసినది దానినే. జీవితంలో ప్రతినిమిషం నీ మనసుకి కొత్త, సానుకూలమైన విషయాలని అందించటానికి ప్రయత్నించు. దీనివల్ల నీ దృష్టికి స్పష్టతా, నువ్వు చేసే పనులకి విపరీతమైన శక్తి లభిస్తాయి. తక్కువ తప్పులు చేస్తావు, చేసిన తప్పలనించి త్వరగా గుణపాఠం నేర్చుకుంటావు. రావణా, నీ భవితవ్యం చాలా గొప్పది. విరిగిపోయిన నా కలలని బాగు చెయ్యగలవారిని ఎవరినీ నేను చూడలేదు. పాపం అసురులని ఇంతకుముందు ఎన్నడూ తమకి విజయాన్నీ, శాశ్వతమైన కీర్తినీ సంపాదించిపెట్టే విజయంవైపుకి ఎవరూ తీసుకువెళ్లలేదు. రావణా, వాళ్లకి వివేకంతోనూ, భావతాదాత్మ్యంతోనూ నాయకత్వం వహించు.

వాళ్లు కోల్పోయిన సామ్రాజ్యాన్ని తిరిగి ఇచ్చి, మరిచిపోయిన నాగరికతని వాళ్లకి మళ్లీ గుర్తుచేసి, వాళ్ల ఆశలకి రంగులద్ది, వాళ్ల ఊహాశక్తిని రగిలించు. నిప్పులుకక్కేవేగంతో కదిలే గుర్రమెక్కి నువ్వు సవారి చెయ్యటం నేను చూడగలను. చేతిలో విచ్చుకత్తితో, నీ దట్టమైన కేశాలు సుడిగాలికి ఎగురుతూ ఉంటే, దేవతల బలగాలని ఎదుర్కొనేందుకు అతి ధైర్యసాహసాలుగల యోధులకి నువ్వు సేనానాయకత్వం వహించటం నా దూరదృష్టికి తెలుస్తోంది. దేవతల నగరాలు కూలిపోవటం నాకు కనబడుతోంది. అవును, రాబోయే ఝుంఝూమారుతం తాలూకు అలజడి నాకు వినిపిస్తోంది. అవి అంత స్పష్టంగా ప్రస్తుతం వినిపించటం లేదు, కానీ పవిత్రమైన ఈ భరతభూమిలో అది విడుదల చేయబోయే శక్తి అత్యంత భయంకరమైనదిగా ఉండబోతోంది. అది ప్రస్తుత వ్యవస్థని సమూలంగా పెకలివేస్తుంది, లక్షలకొద్దీ ఉన్న కట్టుకథల్ని ధ్వంసం చేసి చరిత్రని తిరగరాస్తుంది. రావణా, నేను ఇంతకుముందు నేర్పిన పది పాఠాలనీ నువ్వు మరిచిపోతే తప్ప, ఈ ప్రపంచం నీదే అవుతుందని నేను నమ్ముతున్నాను. నీకు ఆలోచించటానికి ఇచ్చిన తలలలో తొమ్మిదింటిని పోగొట్టుకునేందుకు బ్రహ్మచేసిన ప్రయత్నం సరిపోతుందనుకుంటున్నాను. అన్నిటికన్నా ముఖ్యమైనదిమనసు – మాత్రం మిగిలి ఉంది. నీకు లభించిన విద్య అత్యుత్తమమైన త్యాగం, నీ తపస్సు. తెలివితేటలు సంస్కరించబడి, ప్రస్తుతం నువ్వుగా అతి స్వచ్ఛమైన రూపం దాల్చాయి. ఇక స్పష్టమైన తర్కంతోనూ, చర్యలతోనూ, అసురులు గతంలో పోగొట్టుకున్నప్రఖ్యాతిని తిరిగి పొందేందుకు నువ్వువాళ్లకి నాయకత్వం వహిస్తావు. వెళ్లు రావణా, వెళ్లి ఈ ప్రపంచాన్ని జయించు!"

యుక్తవయసు వల్ల బుద్ధిలేకుండా మాట్లాడానో, లేక నాలో ఏదో నన్ను మాట్లాడమని ఉసికొల్పిందో తెలీదుగాని, ఆ సార్వభౌముడి మాటలని వ్యతిరేకించమని నా మనసు నన్ను తొందరపెట్టింది. కారణం ఏదో నేనింకా తేల్చుకోవలసి ఉంది. కానీ ఇప్పుడు, బతికుండగానే నన్ను

ఎలుకలూ, నక్కలూ పీక్కు తింటూంటే, అప్పుడు నేను ఆయనతో అన్నమాటలు నిజమేనని నాకింకా నమ్మకమే. ఇప్పటికీ ఆయన మొహంలో అప్పుడు కనిపించిన ఆశ్చర్యం, కోపం, ఆ తరవాత నమ్మశక్యం కానంత విచారం నాకు కళ్లకి కట్టినట్టు ఉన్నాయి. ఆ వృద్ధడి మొహంలో ఆ భావాలన్నీ స్పష్టంగా కనిపించాయి నాకు. దాన్ని గురించి ఆలోచిస్తేనే నాకెంతో బాధగా ఉంటుంది, కానీ అప్పుడు ఆ వయసు నన్ను ఇంకా అలాగే మాట్లాడమని ప్రోద్బలం ఇచ్చింది.

'మహాప్రభూ, ఇవన్నీ చాలా ఉదాత్తమైన ఆలోచనలు, కానీ మీరు అడుగుతున్నది అసాధ్యమైనది. నన్ను క్షమించండి, కానీ ఆ తొమ్మిది భావనలనీ, మీ భాషలో ఆలోచించే తలలనీ, విజయంకోసం వదిలివెయ్యటం, సాధ్యమైన పనేనా? నేను మంచి విద్యార్థిని, అన్ని పాఠాలూ చక్కగా నేర్చుకున్నాను, అయినా అన్ని విషయాల గురించీ నేను సొంతంగా అభిప్రాయాలు ఏర్పరచుకుంటాను. దయచేసి నాకు అహంకారమని అనుకోకండి. నేను చెప్పేది పూర్తిగా వినండి."

"మీరు క్రోధం గురించి చెప్పారు, మహారాజా! మీతో ఏకీభవిస్తున్నాను. క్రోధం వక్రమార్గాన వెళితే హాని జరుగుతుంది. కానీ అది జీవితంలో ఒక ముఖ్యమైన భావన కాదా? అసురజాతి అధోగతి పాలైనందుకు నేను కోపం తెచ్చుకోనట్టయితే ఒకప్పుడు ఈ భూప్రపంచంలో ఎవరికీ తెలియనంతటి గొప్ప నాగరికతని సృష్టించిన అసురజాతికి చెందిన వాడినని, వారసుడినని గొప్పగా ఎలా చెప్పుకోగలుగుతాను? కొన్ని వేలమంది అసురులు దేవతలకీ, వాళ్ల సామంతులైన అసురులకీ లొంగిపోయి అమానుషమైన పరిస్థితులలో జీవిస్తూ ఉంటే నేను కోపం తెచ్చుకోకూడదా? మరుగునపడిన అసుర కళల గురించి నాకు నిస్పృహ కలగకపోతే, ధ్వంసమైన అసుర మతాన్ని గురించీ ధూళిలో కలిసిపోయిన మన దేవాలయాల గురించీ, ధ్వంసమైన రాజ్యం గురించీ, దేవతల రాజులముందు ఒంగి ఒంగి దండాలు పెడుతూ నేలమీద పాకే పిరికిపందల గురించీ, అసురుల మంచికోసమే పాటుపడుతున్నామని అబద్ధాలు చెప్పే నీచులైన

కులీనుల గురించీ నేను ఏమనుకోవాలో చెప్పండి మహారాజా! నా ఆలోచనల్లో శక్తిని నింపగలది, నన్ను క్రియాశీలుడిని కమ్మని ప్రోత్సహించేది క్రోధం కాదా? నన్ను క్షమించండి, కానీ ఈ భావాన్ని రేకెత్తించే శిరస్సుని - క్రోధంతో నిండిన నా తలని - నేనెన్నటికీ వదులుకోలేను.

"గర్వమూ, అహంకారమూ తిరస్కరించవలసిన భావాలని ఎందుకు అనుకోవాలి? నాకు నావాళ్లని - అసురులని - చూస్తే, గర్వంగా ఉంటుంది, మన జాతినీ, మన సంస్కృతినీ, భాషనీ, చిత్రకళలనీ, సంగీతాన్నీ చూసి నేను గర్వ పడతాను. నాలో ఉన్న గొప్ప శక్తినీ, విజయాన్ని సాధించాలన్న పట్టుదలనీ చూసి గర్విస్తాను. ఎవరైనా గాని పిరికిగా, ఆహారంకోసం బిచ్చమెత్తుతూ, శాశ్వతంగా పేదరికంలో మగ్గాలని నేను అనుకోను. బ్రాహ్మలు చెప్పే మాటలన్నీ మనం వినాలా, వాళ్లు మాత్రం వాటిలో ఏ ఒక్కటీ పాటించరా? జీవితంలో పోరాటం చేసి దాన్ని గురించి గర్వపడే హక్కు నాకు పూర్తిగా ఉంది. అహంకారంతోనూ, ఐశ్వర్యంతోనూ ఆనందాన్ని అనుభవించే హక్కు నాకు ఉంది. ప్రాచీనకాలంలో రాజులు దేవాలయాలనీ, నగరాలనీ ఎందుకు నిర్మించారు? కులీనులు దానధర్మాలు ఎందుకు చేశారు? తమ అహంకారాన్ని ప్రదర్శించుకుని గర్వపడేందుకు కాదా? వినయాన్ని ప్రదర్శించే వాళ్లలో ఎక్కువమంది నిజాయితీ లేనివాళ్లో, లేక అలా అణిగిమణిగి ఉండటానికి సరైన కారణం ఉన్నవాళ్లో అయిఉండాలి. విజయం గర్వాన్ని పుట్టిస్తుంది, అహంకారాన్ని కలిగిస్తుంది. ఇక విజయానికి దక్కే బహుమతి కేవలం గర్వమే."

"ఈర్ష్య అనేది మానవజాతికి ప్రేరణ కలిగించే అతిపెద్ద శక్తి. సామ్రాజ్యాలు ఒకదానితో ఒకటి ఎందుకు పోటీపడతాయి? రాజులు శక్తియుక్తులని ఉపయోగించి ఒకరికన్నా ఇంకొకరు ఇంకా తెలివిగా పనిచేసేందుకు ఎందుకు ప్రయత్నిస్తారు? దానికి కారణం వాళ్లలో ఒకరిపట్ల ఒకరికి ఉండే ఈర్ష్యా భావమేగా? ప్రగతిని సాధించే మార్గంలో మనని ముందుకి తీసుకుపోయే శక్తి ఈర్ష్య, అసూయ జీవితాన్ని

ప్రేరేపించే శక్తి. మనిషికి ఆహారం, ఆశ్రయం, మైథునంలాంటి ప్రాథమిక శారీరక మైన కోరికల తరవాత ప్రాముఖ్యత సంపాదించుకోవటం అనేది అన్నిటికన్నా ముఖ్యమైన కోరిక. అసలు ప్రాథమిక అవసరాలైన ఆ మూడూ కూడా ఈర్ష్యనించే పుడతాయి. ఈర్ష్యని నిరాకరించటం అంటే మనిషికి ఉన్న ప్రాథమిక సహజజ్ఞానాన్ని నిరాకరించటమే. నన్ను క్షమించండి, మహారాజా! కానీ మీరు కోరేది ఆచరణ యోగ్యమైనది ఎంతమాత్రమూ కాదు."

"దుఃఖాన్నీ, ఆనందాన్నీ సమదృష్టితో చూడాలని మీరు అన్నారు. అసలు ఇది సాధ్యమేనా? నాకు ప్రియమైన వాళ్లు ఈ లోకం విడిచి వెళ్లిపోతే, నేను ఏమీ జరగనట్టు శాంతంగా ఉండాలా? ఏడ్చి ఓదార్పుపొందే అవకాశాన్ని కూడా నాకు లేకుండా చేసుకోవాలా? ఇక ఆనందాన్ని అనుభవించే గుణాన్ని వదులుకుంటే నేనేమై పోవాలి? ఉదయించే సూర్యుడిలో సౌందర్యాన్ని చూసి ఆనందించలేకపోతే, పసిపాప నవ్వు చూసి సమ్మోహితుడినవలేకపోతే, సంగీత మాధుర్యంలో నన్ను నేను మరిచిపోలేకపోతే, ఇక జీవించి ప్రయోజనం ఏముంది?"

"భయం అనేది మనిషికీ, జంతువుకీ ఉన్న అన్నిటికన్నా గొప్ప సహజగుణం. రాజా, మీరు ఆ భయాన్ని లక్ష్యం చెయ్యొద్దని నాకు చెపుతున్నారు. నేను భయ పడ్డానని చెప్పేందుకు భయపడను. నాకు భయం కలిగించేవి చాలానే ఉన్నాయి. నేను పిరికిపందని కాను, కానీ నా మనసులో ఏ మూలో భయం అనేది నిద్రాణంగా ఉంటుంది. చావుని చూస్తే భయం, మృత్యువుని చూసి భయపడం అని అనేవాళ్లని చూసినా నాకు భయమే. వాళ్లు మూర్ఖులై ఉండాలి, తమతోపాటు ఇతరులని కూడా పతనానికి గురిచేసేవాళ్లయి ఉండాలి, లేదా అందర్నీ ద్వేషించే దుష్టులైనా అయి ఉండాలి.

"ఎన్నిటినో పోగొట్టుకుంటానేమోనని భయపడుతూ ఉంటాను. అవి పనికి మాలినవే కావచ్చుగాక, కానీ వాటిని నా చెమటా, రక్తం ధారపోసి సంపాదించు కున్నాను. నాకు ప్రియమైన వాళ్లని ఏదైనా వ్యాధి

కబళిస్తుందేమోనని భయపడతాను. నాపట్ల ఎంతో విశ్వాసంతో మెలిగే నా తమ్ములని యుద్ధాలు బలిగొంటాయేమోనని భయపడతాను. గాలివాన వచ్చి నా తల్లినీ, చెల్లినీ సముద్రంపాలు చెయ్యవచ్చు. ఒక్కొక్కసారీ ఊపిరి తీసుకున్నప్పడల్లా, ఒక్కొక్క అడుగే మృత్యువువైపు వేస్తూ కదులుతున్నానని నాకు తెలుసు. కానీ భయాన్ని చూసి, అలాంటిది ఎక్కడా లేదనేంత భయం నాకు లేదు. నేను ఎదుర్కోవలసిన ప్రమాదాలకి ఈ భయమే నన్ను సంసిద్ధుణ్ణి చేస్తుంది. ఈ సృష్టిలో కొన్నిటిని నేను అదుపు చెయ్యలేనని అర్థం చేసుకునేందుకు సహాయం చేసేదీ, దేవుడ్డీ, నన్ను నేనూ అర్థం చేసుకునేందుకు సహాయం చేసేదీ ఈ భయమే.

"స్వార్థం చాలా నీచమైన భావన అని అంటున్నారు మీరు. కానీ ప్రపంచ వ్యాప్తంగా పెద్దపెద్ద నగరాలని నిర్మించింది ఈ ధోరణే. అదే తీవ్రమైన ఆకాంక్షకి పునాది. అహంభావం అనేది మనసులో లేనట్టయితే, ఈ ప్రపంచంలోని సంపదలన్నీ సొంతం చేసుకోవాలన్న కోరికే లేనట్టయితే, జీవితంలో ఎవరైనా విజయం సాధించగలరా? ఒక అందమైన అమ్మాయిని గాని, మనోహరమైన ప్రదేశాన్నిగాని, ఆకర్షణీయమైన గ్రామాన్ని గాని, ఒక ధగధగలాడే వజ్రాన్ని గాని, సమృద్ధి సాధించిన సీమను గాని చూసినప్పుడు కోరికతో మనసు తహతహలాడుతుంది. ఈ లోకంలోని అందాలన్నిటినీ సొంతం చేసుకోవాలనీ, అవన్నీ నాకు మాత్రమే దక్కాలనీ అనిపిస్తుంది. మీరు నా ఈ తుచ్ఛమైన ఆలోచనలని ఖండించవచ్చు, కానీ మహారాజా, నాది అధిక ప్రసంగం అనుకోకుండా మన్నించి ఒక విషయం నిజాయితీగా చెప్పండి, మీరు మాత్రం అంత పెద్ద సామ్రాజ్యాన్ని నిర్మించింది స్వార్థంతో కాదా? మీరు సన్యాసిలా మారలేదు, ప్రపంచానికే చక్రవర్తి అయ్యారు. తుచ్ఛమైన ఈ స్వార్థబుద్ధితో కాకపోతే, కొన్నివేలమందిని యుద్ధంలో ఎందుకు చంపారు? దేవతల మీదికి మీ బలగాలని ఎందుకు పంపారు? మీరు ఒకే ఒక లక్ష్యంతో ఆ పని చేశారు. మీకూ, మీ తెగకీ, మీ జాతికీ ప్రఖ్యాతి కోరారు, ఎలా చూసినా మీరు అనే మాటే ప్రధానంగా

కనిపిస్తోంది. మీరు సాధించిందంతా నాకూ సాధించాలని ఉంది, ఇంకా ఎక్కువ కూడా సాధించాలని ఉంది. నిస్వార్థపరుడిలా జీవించి ఊరూ పేరూ లేకుండా చనిపోవటం బదులు, ఈ ప్రపంచంలోకల్లా స్వార్థపరుడినన్న పేరు తెచ్చుకునే సాహసం చెయ్యటమే నాకు ఇష్టం."

ఆ వృద్ధుడు కళ్లతో నిప్పులు చెరుగుతూ కూర్చుని ఉండిపోయాడు. నేను భయంతో ముడుచుకుపోవటం నాకు తెలిసింది. కానీ నేను ముందే చెప్పినట్టు, నా మనసులోని మాటలు చెప్పకుండా ఉండటం సాధ్యం కాలేదు. ఆలోచనలని కూడగట్టుకుని చెప్పటం కొనసాగించాను, "మీరూ, బ్రహ్మ ప్రేమ అనే భావాన్ని అంత తక్కువగా అంచనా వేసి తుచ్ఛమని అనటం చాలా విచారకరం. ప్రేమ లేకపోతే, భావాలన్నిటికీ రాజులాంటి ప్రేమే లేకపోతే ఇంకేదీ ఉండదు. తన బిడ్డపట్ల తల్లికి ఉండే ప్రేమకన్నా స్వచ్ఛమైన ప్రేమ మరొకటి ఉండదు. తన ప్రియురాలితోగాని, ప్రియుడితోగాని ఉండాలన్న కోరిక ఎంత బాధపెడుతుంది! అలాగే మీ తల్లిపట్లగాని, తోబుట్టువులపట్ల గాని, ప్రేమ లేకపోతే, మీ పుట్టుకకి కారణమైన మీ తండ్రీ, తొమ్మిది నెలలు గర్భంలో మోసి, తన రక్తాన్ని పంచి మీకు పాలిచ్చి పెంచిన తల్లీ, మీతో కలిసి ఎన్నో మరిచిపోలేని క్షణాలు పంచుకున్న స్నేహితులూ, మీతో జీవితాన్ని పంచుకున్న మీ భార్యా, మీ జీవితాన్ని కొనసాగించిన మీ పిల్లలూ, వీళ్లందరిపట్లా మీకు ప్రేమ లేనట్టయితే జీవితం నిరర్థకం కాదా? అందరి మనసుల్లోనూ ప్రదేశం, తెగా, భాషా, మతం, దేవుళ్ళూ లాంటి ఇంకా ఎన్నో విషయాలపట్ల, అవి ఎంత తుచ్ఛమైనవిగా కనిపించినా సరే, ప్రేమ, మమకారం ఎంత భద్రంగా దాగి ఉంటుంది! వాటివల్లే కదా లోకంలో ఇంత రక్తపాతం, ఇన్ని యుద్ధాలూ జరిగాయి? గతంలో ప్రేమకోసం మనుషులు చనిపోయారు, ఇకమీదట కూడా ఈ ప్రపంచం ఉన్నంతవరకూ అలాగే చనిపోతారు. నేను మీకు చెప్పిన వాటిని నేను ఎప్పుడూ ప్రేమిస్తూనే ఉంటాను. కానీ నిజం ఏమిటంటే నాకు వాటన్నిటిమీదకన్నా ఎక్కువ ప్రేమ నామీదే. నేనే లేకపోతే నేను ప్రేమించేవన్నీ నిరర్థకమే. నేను జీవించి ఉన్నాను కాబట్టి ప్రేమిస్తాను,

ప్రేమిస్తాను కాబట్టి జీవించి ఉంటాను - నామీద నాకు ప్రేమ.

"తీవ్రమైన ఆకాంక్ష ప్రగతికి కీలకమైనది. ఆకాంక్షే లేనట్టయితే, ఇప్పుడు ఈజిప్టు రాజులు ఆ పిరమిడ్లని ప్రస్తుతం నిర్మించే పనిలో ఉండరు. ఆకాంక్ష లేకపోయినట్టయితే మనుషులు ఇంకా వేటాడి ఆహారం సంపాదించే దశలోనే ఉండేవారు. చక్రాలు ఉండేవి కావు, గుర్రబ్బళ్ళూ, రథాలూ, అద్భుతమైన మహా నగరాలూ, దేవాలయాలూ, రాజభవనాలూ, పెద్దపెద్ద తెరచాపలతో నడిచే ఓడలూ ఉండేవి కావు. ఆకాంక్ష లేనట్టయితే మహాబలి, ఇంద్రుడు మా మధ్య ఉండేవారు కాదు. ఆకాంక్ష అనే అశ్వమే మన జీవితాలని ముందుకి లాక్కెళుతుంది. కొద్దిమంది వ్యక్తుల మస్తిష్కాలలో ఆకాంక్ష అనే చిన్నిజ్వాల రగిలి ఉండనట్టయితే గత కొన్నేళ్లలో మానవుడు సాధించిన ప్రగతి సాధ్యమయేది కాదు. మీరు నన్ను విడిచిపెట్టమని చెప్పిన మిగతా భావాలు ఆకాంక్ష అనే జ్వాలకి ఊపిరి పోసి దాన్ని ఇంకా పెద్ద జ్వాలగా చెయ్యకపోయి ఉంటే, ఇదంతా సాధ్యం అయేది కాదు.

"తమ సామర్థ్యాన్ని చూసి గర్వపడటం మనుషులకి ఎదిగేందుకు ఆత్మ విశ్వాసాన్నీ ఆకాంక్షనీ పెంచింది; ఇంకొకరు తమని మించిపోతారేమో అన్న ఈర్ష్య ఇంకా కష్టపడి పనిచేసేందుకూ, ఇంకా సమర్థంగా కృషి చేసేందుకూ ప్రోద్బలాన్ని అందించింది; ఆనందాన్ని వెతికే ప్రక్రియ ఆకాంక్షని నిరంతరం విస్తృతం చేసింది; విచారాన్ని గురించి భయంవల్ల అతను ఇంకా జాగ్రత్తగా, దేవుడిపట్ల భయభక్తులతో మెలిగాడు; స్వార్థం అతని కుటుంబాన్నీ నగరాన్నీ తెగనీ, జాతినీ, దేశాన్నీ కలిపి ఉంచింది, ఇంకా బాగా కష్టపడి పనిచేసేందుకు అతన్ని ప్రేరేపించింది. జీవితం పట్లా, ఆ జీవితానికి విలువనిచ్చిన వాటిపట్లా ప్రేమ అతను తను సాధించిన వాటిని కాపాడుకునేట్టు చేసింది. ఇంకా ఎక్కువ సాధించాలన్న ఆకాంక్ష తపన ఎక్కువైనకొద్దీ మానవజాతి మరింత ప్రగతిని సాధించే వీలు ఉంటుందని నా నమ్మకం. మనకి దొరికిన ఈ చిన్నజీవితకాలంలో మనం ఎన్నటికీ అర్థం చేసుకోలేనిది అది, మనం ఊహించలేనంత ప్రగతి.

"నా ప్రియమైన సార్వభౌమా! నా మనసులో మాట చెప్పినందుకు బాధ పడకండి. తెలివితేటలున్న తల ఒక్కటే ఉంచుకుంటే చాలని మీరు అన్నారు. అది ముఖ్యమేనని అంగీకరిస్తున్నాను. కానీ చరిత్ర మనకి నేర్పేదేమిటో చూడండి, మిగతా భావాలేవీ లేనట్టయితే, ఆ తల కేవలం ఒక శూన్యమైన కంకాళం తప్ప మరేమీ కాదు, అందులో జీవం ఉండదు. నాగరికతలని నిర్మించింది మునులూ, మహర్షులూ కాదు, మహానుభావా! తమ భావాలని ఎన్నడూ అదుపు చెయ్యకుండా, ప్రకృతి నిర్దేశించిన దిశగా వాటిని ప్రవహింపజేసిన అసాధారణ వ్యక్తులే వాటిని నిర్మించారు. అడవిలో నివసించే ఏ సన్యాసీ ఒక గొప్ప నగరాన్ని గురించి కల్పన చెయ్యలేదు, ఏ మునీ గొప్ప దేవాలయాలని నిర్మించాలని నిర్ణయించలేదు, ఏ బ్రాహ్మణుడూ వాణిజ్యం, వర్తకం చేసేందుకు పనికివచ్చే పెద్దపెద్ద ఓడలని నిర్మించాలని కోరుకోలేదు. నరనరానా గర్వం, మనసులో క్రోధం ఉన్న మనుషులు, బాధ పడినప్పుడు ఏడ్చేవాళ్ళూ, ఆనందంగా ఉన్నప్పుడు నవ్వేవాళ్ళూ తమని భయపెట్టేంత, తమకన్నాపెద్ద శక్తులూ, సంఘటనలూ ఎదురైనప్పుడు భయపడేవాళ్ళూ, అయినా తాము ప్రేమించి సొంతం చేసుకున్న వాటికోసం పట్టుదలతో, స్వార్థంతో ముందుకి పోయేవాళ్లూ - వాళ్లే నిరంతరం తమ ఆకాంక్ష స్థాయిని పెంచుకుంటూ పోయారు. తెలివితేటలు మన భావాలకి తోడ్పడే ఒక పరికరం మాత్రమే. మనిషి ఎలా బతకాలని అనుకుని దేవుడు అతన్ని సృష్టించాడో నాకు అలాగే బతకాలని ఉంది.

"నా లక్ష్యం దేవుడుగా మారాలనీ కాదు, మోక్షం సాధించాలనీ కాదు. నాకు తెలిసినంతవరకూ అవన్నీ కట్టుకథలు. ఈ లోకంలో కావాలని మనం వదులుకున్న వన్నీ స్వర్గంలో లభిస్తాయంటే నేను నమ్మను. పునర్జన్మలో నాకు నమ్మకం లేదు. ఈ జన్మలో పుణ్యకార్యాలు చేస్తే పై జన్మలో బ్రాహ్మణుడిగా పడతానని (ఆ పుణ్య కార్యాలన్నీ బ్రాహ్మణులు చెప్పేవే) కూడా నేను నమ్మను. ఒకవేళ బ్రాహ్మణకులంలో పుట్టటమే అత్యుత్తమమైన బహుమతి అయినట్టయితే, మళ్లీ మరో

జన్మ ఉంటుందేమోనన్న భయంతో నేను మరణాన్నే తిరస్కరించవచ్చు.

"మీకు నిరాశ కలిగించినందుకు విచారిస్తున్నాను, కానీ నేను ఒక మనిషిగా బతికి మనిషిగానే చనిపోవాలని కోరుకుంటున్నాను. ఎప్పుడూ కూడా నేను దేవుడిని అవాలని ప్రయత్నించను. నా భావనలు చెప్పిన మాటలు తుచ తప్పకుండా పాటించి జీవిస్తాను. రాబోయే తరాలు నన్నొక ఆదర్శ వ్యక్తిగా భావించి నన్ను అనుకరించాలని కోరను. నా జీవితం నాతోనే ప్రారంభమై నాతోనే ముగిసిపోతుంది. కానీ నా జీవితాన్ని పూర్తిగా అనుభవిస్తూ జీవించి మనిషికి తగిన రీతిలో మరణిస్తాను. అందుచేత మీరు అన్న మాటలనే అరువు తీసుకుంటూ, నేను పది ముఖాల వ్యక్తిగానే ఉంటాను- నేను దశముఖుణ్ణి."

దట్టమైన నిశ్శబ్దం ఆవరించింది. పాదరక్షలు లేని తన కాలివేళ్లవైపు చూస్తూ బ్రహ్మ నిలబడ్డాడు. లోతుకి పోయిన చక్రవర్తి ఎర్రటి కళ్లు నావైపు తీక్షణంగా చూశాయి. నా నరాల్లో కొత్త శక్తి ఏదో హఠాత్తుగా ప్రవహించటం ప్రారంభించినట్టు అనిపించింది. ఆ సుదీర్ఘ ఉపన్యాసం ఇచ్చేవరకూ నా జీవితం తాలూకు తత్త్వం ఏమిటో నాకే ఇదమిత్థంగా తెలియలేదు. అంతవరకూ ఆ వృద్ధుడు నాలో ఉంచిన గొప్ప నమ్మకాన్ని వమ్ము చేస్తున్నానా అనే సందేహమే ఉండేది. కానీ హఠాత్తుగా ఆయనని కొత్త కళ్లతో చూస్తున్నానా, అనిపించింది. నేను ఆయన గురించి అంచనా వేసుకున్నప్పుడు చాలా గొప్పవాడని అనుకున్నాను. ఇప్పడాయనలో ఆ గొప్పదనం తగ్గిపోయినట్టు అనిపించింది. ఆయన కేవలం కుంచించుకుపోయిన, ఓడిపోయిన, జీవచ్ఛవంలాంటి వృద్ధుడు, పైకి బింకంగా, గొప్పవాడిలా నటిస్తున్నాడు, తనే ఈ దేశాన్ని పరిపాలిస్తున్నట్టు డాంబికం ప్రదర్శిస్తున్నాడు. కొండ ఎలుకలాంటివాడు ఆయన. దేవతల కంటపడకుండా దాక్కుని, తన పెరట్లో యుద్ధం ఆట ఆడు తున్నాడు, అంతే!

ఆ తరవాత నాకు వినిపించిన గొంతు బలహీనంగా గొణిగింది. లేవాలని ప్రయత్నించాడు కానీ నాముందు మళ్లీ కూలబడిపోయాడు.

నేను హడలిపోయి చూస్తూ ఉండిపోయాను. పాలిపోయిన ముఖంతో ఆయన నెమ్మదిగా తన మోకాళ్లమీద లేచాడు. గాజుగోళాల్లాంటి కళ్లతో నావైపు కాకుండా ఎటో చూస్తున్న వాడల్లా నాటకీయంగా తల ఎత్తి నాకేసే తదేకంగా చూశాడు. ఆ ముసలాయన ప్రేలాపన వినేందుకు నాకు తీరిక లేకపోయింది. నేను వెనుదిరిగి, కావాలనే తల జాడించి, నా తమ్ములు వెంట రాగా బైటికి నడిచాను. విభీషణుడు తడబడే అడుగులతో నడుస్తూ చాలాసార్లు వెనక్కి తిరిగి ఆయనవైపు చూశాడు. ఆ వృద్ధుడు రెండు చేతులూ పైకెత్తి అసందర్భంగా ఏదో అంటున్నాడు. కానీ కుంభకర్ణుడు వేసే అడుగులు నా అడుగులకన్నా దృఢంగా పడుతున్నాయి. అతని పెదవులమీద చిరునవ్వు కనిపించింది. మహాబలి సైనికుల్లో ఒక చిన్న సమూహం నావెంట బైలుదేరింది. నడుస్తున్నప్పుడు వాళ్ల కత్తులూ, డాళ్లూ చప్పుడు చెయ్యసాగాయి.

నా అనుచరులతోపాటు నేను బైటికి రాగానే ఎండ విపరీతంగా కాస్తోంది. అంతకుముందే కురిసిన వానతో మట్టి కొత్తగా, చల్లగా ఉంది- సృష్టికర్త అప్పుడే తన పని ముగించి స్నానానికి వెళ్లినట్టు. అడవి పువ్వుల సువాసననీ, ఎర్రటి తడినేల సుగంధాన్నీ ఆఘ్రాణించాను. పక్షుల కిలకిలారావాలు నా చెవులకి సంగీతంలా సోకాయి. నా ముందు ప్రపంచం రా రమ్మని చేతులు బార్గా చాపి పిలుస్తున్నట్టు, జీవనయానం ఉత్సాహం, ఉల్లాసంతో నిండి ఉందనీ, అందులో నన్ను కూడా ఒక ప్రయాణీకుడిని కమ్మనీ అంటున్నట్టు అనిపించింది. నేను మొదటి అడుగు వెయ్యగానే, నా వెనక గుహలోంచి కెవ్వుమన్న పెద్ద కేక వినబడింది. నా వెన్ను జలదరించింది, కానీ నేను నడక ఆపలేదు. ఆ దుర్గంధ పూరితమైన గుహ లోతుల్లోంచి నా ఆత్మని ఛిద్రం చేస్తూ వచ్చిన ఆ వృద్ధుడి కేకని వినకుండా చెవులు మూసుకునేందుకు ప్రయాసపడుతూ ముందుకి సాగాను.

"నేను దేన్ని వదిలించుకున్నాను?" ఆ మతిభ్రమించిన వృద్ధుడు అలా శోకంతో కేకలు పెడుతూనే ఉన్నాడు. త్వరగా నేను నా మనసులోంచి, ఆ వృద్ధుడినీ, అతను ప్రాతినిధ్యం వహించిన అతని

ప్రపంచాన్నీ తుడిచేశాను. అది కలల్లో నన్ను వెంబడించే దాకా చాలాకాలం దాని విషయం నేను మరిచిపోయాను. కానీ అది జరిగింది చాలాకాలం తరవాత. నేను తరవాతి విషయాలు ముందుగా చెప్పేస్తున్నట్టు ఉన్నాను.

6. దెయ్యం దాడి

భద్రుడు

ఈ నిరుపయోగమైన యుద్ధాన్ని నేను గత కొన్ని సంవత్సరాలుగా చేస్తున్నాను. మహాబలి సైన్యంలో చేరి ఆరు సంవత్సరాలు పోరాడాను, తరవాత నేనే ఒక సైనికదళాన్ని కూడగట్టుకునేందుకు ప్రయత్నించి విఫలమయాను. ఆ తరవాత సుమాలి నాయకత్వంలో యుద్ధం చేశాను. నేను గొప్ప యోధుణ్ణీ కాలేకపోయాను, గొప్ప నిర్దేశకుణ్ణీ కాలేకపోయాను. పొట్టిగా, బొద్దుగా, మెత్తటి చేతులతో నేనొక మామూలు మనిషిని. కూరగాయలు అమ్మేవాడిలాగానో, ఎద్దుబండి తోలుకునేవాడి లాగానో, అంగడిలో సరుకులు అమ్మేవాడిలాగానో, ఇంకా చెప్పాలంటే ఒక చాకలి వాడిలాగానో ఉండవలసినవాణ్ణి. నేనొక అనామకుణ్ణి. తీక్షణంగా చూడలేను, విల్లులా వంగిన కనుబొమ్మలు లేవు నాకు. నా ముక్కు గద్ద ముక్కులా వంగిలేదు, నిశ్చయాన్ని తెలిపే బిగబట్టిన పెదవులు లేవు నాకు. నా బుగ్గల్లో ఎముకలు పొడుచుకొచ్చినట్టుండవు, నా గడ్డం మధ్యలో గుంట లేదు. మొదట్లో నాకు వేరే పేరు ఉండేది, కానీ ప్రస్తుతం నాపేరు భద్రుడు.

నాకెప్పుడూ గొప్ప ఆకాంక్షలు ఉండేవి కావు. పూర్ణానది ఒడ్డున నేను వ్యవసాయం చేసుకునేవాణ్ణి. నా పొలాల్లో కొన్ని మిరియాల తీగలూ, కొన్ని కొబ్బరిచెట్లూ, రెండు ఆవులూ ఉండేవి. నా భార్యతోనూ, ఎంతో చురుగ్గా ఉండే నా మూడేళ్ల కూతురుతోనూ ఆనందంగా జీవించేవాణ్ణి. మా గ్రామం చిన్నదే అయినప్పటికీ అక్కడ అన్నీ ఉండేవి- పరిరక్షించబడిన ఒక తోపూ, శివుడి మందిరం, తాటికల్లు దుకాణం, ఒక చిన్న పాఠశాల- ఆ పాఠశాలలో తాపీపనీ, వ్యవసాయం, గణితం, ఇంకా ముఖ్యమైన కొన్ని విషయాలు బోధించేవారు. వినోదగృహం కూడా ఒకటి ఉండేది. ఒక దొంగ వైద్యుడు ఉండేవాడు, వైద్యశాస్త్రం

తెలియకుండానే చికిత్సకు పూనుకునేవాడు! మా దగ్గర డబ్బులు దోచుకునే పురోహితుడు ఉండే వాడు. బహిరంగ స్నానవాటిక ఒకటి ఉండేది. అక్కడ మా గేదెలతోపాటు మేము కూడా స్నానం చేసేవాళ్లం. నేను మా నాన్నలాగే జీవించాను. ఆయన కూడా వాళ్ల నాన్నలాగే జీవించాడు. నా పిల్లలు కూడా నాలాగే జీవిస్తారు, అదే వీధిలో పెరిగి పెద్దవారవుతారు, అదే చెరువులో స్నానం చేస్తారు, గ్రామంలోని అందమైన నల్లటి అమ్మాయిలతో ప్రేమలో పడతారు. పెళ్లి చేసుకుని, పిల్లల్ని కని, నిశ్శబ్దంగా ఈ లోకంలోంచి నిష్క్రమిస్తారు. వాళ్లు పోయినందుకు ఏ కొద్దిమందో దుఃఖించవచ్చు, కానీ ప్రపంచానికి వాళ్లు లేకపోవటం వల్ల ఎటువంటి లోటూ కనిపించదు.

నా జీవితం ఎటువంటి మలుపులూ, మార్పులూ లేకుండా సాఫీగా గడిచిపోయి, ముగిసిపోయేదే. కానీ దేవతల రాక అన్నిటినీ మార్చివేసింది. వాళ్లు వచ్చి మమ్మల్ని ఓడించిందాకా అసలు వాళ్లెవరో కూడా మాకు తెలియదు. ఆ రోజులని గుర్తుచేసుకుంటే భయంతో ఒళ్లు జలదరిస్తుంది. యుద్ధం రాబోతోందన్న దూరపు గర్జనలని, మా దగ్గరికి అప్పుడప్పుడూ మిరియాలు కొనేందుకు వచ్చే వర్తకుల నోటివెంట విన్నాం. విష్ణువు అనే దేవతల నాయకుడి ఆధ్వర్యంలో దేవత లందరూ గుమిగూడి సైన్యాలని ఎలా సమకూర్చుకుంటున్నారో, బలిచక్రవర్తి యుద్ధానికి ఎలా సన్నద్ధమవుతున్నాడో వాళ్లు మాకు చెప్పారు. కానీ అవి కేవలం పుకార్లు అనుకుని వాటిని మేము లక్ష్యపెట్టలేదు. ఇవి ఏమాత్రం ప్రాముఖ్యంలేని వార్తలనీ, సుదూరాన ఉన్న ఇంకెవరికో జరిగే సంఘటనలనీ పెడచెవిన పెట్టాం. రాజులు యుద్ధాలు చేసి తమ రాజ్యాలని గెలుచుకున్నారు, కోల్పోయారు, ప్రాణాలనీ కోల్పోయారు. మేము అంత గొప్పవాళ్లం కాము. కుతంత్రాలతో నిండిన రాజకీయాలతో మాకు సంబంధం లేదు. బలిచక్రవర్తి అజేయుడని నేను భావించాను. ఆయన చాలా న్యాయంగా, తన ప్రజలని దృష్టిలో పెట్టుకుని పాలించాడని చెప్పుకుంటారు.

కనీసం మా గ్రామంలోని పెద్దలు మాకు అలా అనే చెప్పారు. వాళ్ల

మాటలని నమ్మకపోవటానికి మాకు కారణమేదీ కనిపించలేదు. దూరంగా ఉన్న రాజధానిలో పరిపాలన ఎవరిదైనప్పటికీ మేము మాత్రం ఒకేరకంగా జీవించాం. మా జీవితాల్లో మార్పు లేదు. మమ్మల్ని వాళ్లు ఇబ్బంది పెట్టనంతవరకూ, వాళ్లు మంచి రాజులనే అనేవాళ్లం.

ఒక సాయంకాలం, దుమ్ము రేగుతూండగా మేము పొలం పనులు ముగించు కుని ఇళ్లకి వెళ్లేప్పుడు ఒక వార్తాహరుడు గుర్రమెక్కి వచ్చాడు. అతను పొడుగ్గా, ముఖంమీద స్ఫోటకం మచ్చలతో ఉన్నాడు. అతని కళ్లల్లో ఒక విచిత్రమైన భావం కనబడింది. మా శివుడి మందిరాన్ని పడగొట్టమనీ, విష్ణువుకి లొంగిపొమ్మనీ అన్నాడు అతను. అతనితో గ్రామస్తులు మర్యాదగానే ప్రవర్తించారు, కానీ శివుడి క్రోధానికి గురికావద్దని హెచ్చరించి అతన్ని వెనక్కి పంపేశారు. నిజానికి, ఆ వార్తాహరుడు వెళ్లేముందు శివుడి మందిరంలోకి వెళ్లి ప్రార్థనా, పూజలూ చేశాడు. ఆ రోజంతా దేవతల గురించి మాట్లాడుకున్నాం.

బలిచక్రవర్తి ఓడిపోయాడనీ, పాతాళానికి వెళ్లిపోయాడనీ, విష్ణువు మా కొత్త చక్రవర్తి స్థానాన్ని ఆక్రమించాడనీ కొందరు అన్నారు. తమ మాటలకి ఆ వార్తాహరుడే రుజువు అని అన్నారు. ఇంకా కొందరు, బలిచక్రవర్తి దేవతలతో చేరిపోయాడనీ, త్వరత్వరగా అన్ని శివాలయాలనీ విష్ణుదేవాలయాలుగా మార్చేస్తున్నా డనీ అన్నారు. కల్లు దుకాణంలో పెద్ద రగడ జరిగింది. నా స్నేహితుణ్ణి వీరశైవుడొకడు కోపంతో ముక్కుమీద గుద్దాడు.

ఎప్పుడూ నిద్రపోతున్నట్టుండే మా గ్రామంలో కొంత సందడి ఏర్పడటం చూసి నేను సంతోషించాను. సామాన్యంగా ఇక్కడ ఆసక్తికరమైన సంఘటనలు ఏవీ జరగవు. ప్రతిరోజూ ఈసురోమంటూనే గడుస్తుంది. ఒకరోజు రాత్రి నా భార్య నన్ను లేపేదాకా పరిస్థితి అలాగే ఉంది. అలా హఠాత్తుగా నిద్రలేపినందుకు ఆమె మీద కోపం వచ్చింది నాకు, అలాంటి పని చేసినందుకు నా భార్యని చావగొట్టాలని అనిపించింది.

ఇంతలో నాకు మా పడకగదిలో అపరిచితులు ఉండటం కనబడింది. నాకు మొట్టమొదట వచ్చిన ఆలోచన, 'భగవంతుడా! వీళ్లకి తినటానికి ఏమివ్వాలి? భోజన సమయం దాటి వచ్చారే!' అన్నది నాకింకా స్పష్టంగా గుర్తుంది.

మరుక్షణం కోపం వచ్చింది. వీళ్లెవరో నా పడకగదిలోకి ఎలా వచ్చారు? నెమ్మదిగా మనసులో భయం చోటుచేసుకోసాగింది. ఎవరు వీళ్లు? ఇక్కడికెందు కొచ్చారు? నా పొరుగున ఉన్న తెలివితక్కువ దద్దమ్మని, ఎప్పుడూ నా ఆవరణలో ఎర్రటి తాంబూల రసం ఉమ్మేస్తూ, ఆ తరవాత కొట్లాట జరిగితే వినోదం చూసే అతన్ని, సజీవంగా ఎవరో కాలుస్తున్నారు. అతని శరీరానికి అంటుకున్న మంటలు అతని ఇంటి ముంగిటిని వెలుగుతో నింపుతున్నాయి. దేవతల సైనికులు మా గ్రామాన్ని హస్తగతం చేసుకున్నారు. మొత్తం గ్రామంలో ఎక్కడ చూసినా మంటలే. భయపడిన కోడిపెట్టల్లా జనం ఇటూ అటూ పరిగెత్తుతున్నారు. కొందర్నికత్తులతో నరకటం చూశాను. ఇళ్లు తగలబడుతున్నాయి. గుర్రాలమీద వచ్చిన యోధులు, తెల్లటి దెయ్యాల్లాంటి ముఖాలతో, ఎగతాళి చేస్తున్నారు, పెడబొబ్బలు పెడుతున్నారు, జనాన్ని చంపుతున్నారు. ఇక మా పడకగదిలోకి వచ్చిన అపరిచితులు నా భార్యని చూసి లేకిగా నవ్వుతూంటే ఆమె భయంతో వణికిపోవటం నాకు తెలిసింది.

నేను పాకుతూ లేచి నిలబడి, నా కుటుంబ సభ్యులని కాపాడేందుకు నా చేతుల్ని వాళ్ల చుట్టూ వేశాను. ఆ దెయ్యాలు అట్టహాసం చేశాయి. తరవాత నాకు నిప్ప రగిలే చప్పుడు వినిపించింది. మరుక్షణం ఎండుగడ్డి కప్పిన నా ఇంటి పైకప్ప దగ్ధమైంది. ఎవరో కత్తి పిడితో నన్నుకొట్టారు. నా ముక్కు ఎముక విరిగి విపరీతమైన బాధతో నా మొత్తం శరీరం గిలగిల్లాడింది. ఒక కుర్రవాడు, పదిహేనేళ్లు కూడా ఉంటాయో లేదో, నా కూతుర్ని కాళ్లు పట్టుకుని పైకి ఎత్తాడు, చింకి పాతని ఊపినట్టు ఊపి, మట్టిగోడకి వేసి గట్టిగా బాదాడు. నా చిట్టితల్లి తల పగలటం నాకు వినిపించింది. దాని రక్తం, మెదడూ మా

ముఖాలమీద చిందాయి. ఆ దెయ్యాలు మళ్లీ నవ్వాయి. నా మనసూ, శరీరం మొద్దుబారినట్టు అయి, నేలమీదికి కుంగిపోయాను. నా భార్య మూర్ఛపోయింది. నా భార్యని వాళ్లు చీకట్లోకి లాక్కుని వెళ్తూంటే, నేను నా శాయశక్తులా ఆపేందుకు ప్రయత్నించాను. ఆమె చెయ్యి గట్టిగా పట్టుకున్నాను. నా గోళ్లు గీరుకుని, ఆమె చేతిమీద రక్తపు చారలు తేలాయి, కానీ పట్టు సడలిపోయింది. నేను లేచి నిలబడేందుకు ప్రయత్నించాను. ఎక్కడ చూసినా రక్తం. నేను రక్తంలో జారిపడ్డాను. నా చేతికి పగిలిన నా కూతురు తల తగిలింది. నేను వణికిపోయాను. అటు చూడాలనిపించలేదు. ఏదైనా ఆయుధం దొరుకుతుందేమో వెతకాలి. ఆ రాక్షసుల తలకాయలని పగల గొట్టటానికి పనికి వచ్చేది ఏదైనా సరే. ఏదోవిధంగా నా భార్యని రక్షించుకోవాలి.

గ్రామంలో ఎన్నో మూలలనించి కీచుగా వినిపించే కేకల్లో నా భార్య కేక కూడా కలిసిపోయింది. నా లోని శక్తి ఉడిగిపోతున్నా పట్టించుకోకుండా నడవటం ప్రారంభించాను, వసారాలోని ఒక స్తంభాన్ని పట్టుకోవాలని ప్రయత్నించాను. అది గట్టి వెదురు బొంగు, కానీ దాన్ని నేను ఎత్తలేకపోవటం చూసి నిర్ఘాంతపోయాను. ఇక దాన్ని ఒక గదాయుధంలాగ ఎలా ఉపయోగించగలుగుతాను? నా భార్యమీద అత్యాచారం చేస్తున్న ఆ పందులమీదికి లంఘించాను. ఏ ఆయుధమూ లేకుండా చేతులతోనే శక్తి కొద్దీ పోరాడాను. కానీ దేవతల యోధులముందు నా బలం చాలలేదు. ఒక్క క్షణంలో నన్ను కిందపడేసి పిడికిళ్లతో గుద్దటం ప్రారంభించారు. మొద్దుల్లాంటి కర్ర చెప్పులతో నా ముఖంమీద కొట్టారు. బురదలో నన్ను పట్టి ఈడ్చారు. అదృష్టం కొద్దీ, ఒక ధూర్తుడు తన కత్తిని లోతుగా నా పొట్టలోకి దించాడు. అంతే, మరుక్షణం నా కళ్లు చీకట్ల కమ్మాయి.

నాకు స్పృహ వచ్చేసరికి ఇంకా చీకటిగానే ఉంది. అంతటా మంటలు కనిపించాయి, కానీ నెమ్మదిగా అవి ఆరిపోతున్నాయి. దూరంగా నక్కల ఊళలు వినిపించాయి. తెల్లవారబోతోంది, నేను లేచి వెళ్లి పాలు పిండాలి అనుకున్నాను అయోమయంగా. అయినా

లేవకుండా అలాగే పడి ఉండిపోయాను. నేలమీది మట్టి హాయిగా, చల్లగా, సుఖంగా ఉంది. తరవాత నెమ్మదిగా, చాలా నెమ్మదిగా వాస్తవం మళ్లీ కళ్ల ముందుకి వచ్చింది, ఒక్క ఉదుటున లేచి కూర్చున్నాను. నా శరీరం నాదిలా అనిపించలేదు, కానీ అవయవాలన్నిటినీ సూదులతో పొడుస్తున్నంత బాధ! రక్తం ఎండిపోయి నా కనురెప్పలు అతుక్కుపోయాయి. వాటిని తెరిచేందుకు చాలా ప్రయత్నించాను. ఒక చెట్టకింద ఆ దుర్మార్గులు-దేవతలు-కూర్చుని తప్పతాగుతూ కనిపించారు.

నా చుట్టూ నా మొత్తం గ్రామం, నా కుటుంబం చెల్లాచెదురై కనిపించింది. నేను లేచి నిలబడటానికి చేసిన ప్రయత్నంలో ఏదో ఎండు కొమ్మ మీద నా కాలు పడి, అది విరిగిన శబ్దం వచ్చింది. ఆ చిన్న శబ్దం నా చెవులకి పిడుగుపాటులా వినిపించింది. ఆ దెయ్యాలు వెనక్కితిరిగి చూశాయి. నేను కదలకుండా కూర్చున్నాను. నేను ప్రాణాలలో ఉన్నానని వాళ్లకి తెలుసు, నన్ను చంపేస్తారు,' అనుకున్నాను మనసులో.

కానీ వాళ్లు లేచివచ్చి చూడకపోయేసరికి నాకు కాస్త తెరిపి అనిపించింది. అప్పుడు వాడిని చూశాను. పొడుగ్గా, నల్లగా ఉన్న ఒక ఆకారం నావైపు నడిచివస్తోంది. వాడి చేతిలో కత్తి ఉంది. నేను చాలా కంగారు పడ్డాను. వాడు నాకింకా దగ్గరకి వచ్చాక, నా కూతుర్ని గోడకి వేసి కొట్టి చంపిన కుర్రవాడు వాడే అని గుర్తించాను. వాడు బాగా తాగి ఉన్నాడు. తూలుతూ నడుస్తున్నాడు. చేతికి ఏదైనా ఆయుధంలాంటిది దొరుకుతుందా అని అటూయిటూ చూశాను. వాడు నాతల దగ్గర నిలబడ్డాడు, కొంచెం ఊగుతున్నాడు. ఎవరో వాణ్ణి పిలిచారు. వాడు కొంచెం తడబడ్డాడు. ఆసరికి నా చేతికి ఒక పాత కత్తి దొరికింది. దాన్ని ఎవరో అక్కడ పారేసినట్టు ఉన్నారు. దాంతో వాడి తొడల మధ్య ఒక్క పోటు పొడిచాను. చడీ చప్పుడూ చెయ్యకుండా వాడు నామీద పడిపోయేసరికి నాకు ఆశ్చర్యం వేసింది. కత్తిని బైటికిలాగి మళ్లీ వాడి మెడ వెనకభాగంలో పొడిచాను.

మా ఇద్దరి శరీరాలూ పెనవేసుకు పోవటం చూసిన ఒక వ్యక్తి మావైపు పరిగెత్తి వస్తూ "ఏయ్!" అని అరిచాడు. ఇంకొంత మంది అతని వెనకాలే రావటం కనిపించింది. ఆ కుర్రవాడి కిందినించి లేచేందుకు కష్టపడి ప్రయత్నించాను, కానీ వాడు చాలా బరువుగా ఉన్నాడు. వాణ్ణి పక్కకి త్రోసి క్రింది.నించి లేచేసరికి చెమటతోనూ, రక్తంతోనూ పూర్తిగా తడిసి ముద్దయి పోయాను. అసంకల్పితంగా గ్రామం సరిహద్దుల్లోని అడవిలోకి పారిపోయాను. నా ఒంట్లో మిగిలిన శక్తినంతా కూడదీసుకుని, ఆ పిశాచాలకి దూరంగా, నా గతాన్ని అక్కడే వదిలేసి, నాకు తెలిసిన జీవితాన్ని విడిచి పరిగెత్తాను. నా ప్రాణాలని, పనికిమాలిన, అర్థంలేని, తుచ్ఛమైన, శూన్యమైన జీవితాన్ని గుప్పిట్లో పట్టుకుని పరిగెత్తాను. ఆయాసంతో ఒగరుస్తూ సురక్షితమైన ప్రాంతానికి, నా అన్నదమ్ముల, స్నేహితుల శవాలని దాటుకుంటూ, పడుతూ లేస్తూ పరిగెత్తాను. అప్పుడు అదేమంత పట్టించుకోవాల్సిన విషయంలా కనిపించలేదు. అవి కేవలం శవాలు, దేవతలు ప్రారంభించినదాన్ని రాబందులు పూర్తి చెయ్యటంకోసం వేచిఉన్న ప్రాణంలేని శరీరాలు. మృత్యువు నన్ను వెంటాడుతూంటే, త్వరగా నానుంచి పారిపోతున్న జీవితాన్ని నేను వెంబడించ సాగాను.

నా భుజంలో హఠాత్తుగా భరించరాని నొప్పి పుట్టింది. కొత్తగా రక్తం కారటం కనిపించింది నాకు. ఆ దుర్మార్గులు నామీద బాణాలు వేస్తున్నారు. బాణాలు నా చెవులపక్కనించి రివ్వున దూసుకుపోతున్నాయి, చుట్టూ ఉన్న చెట్లబోదెల్లో అసహ్య కరమైన శబ్దంతో దిగబడుతున్నాయి. వాటిలో ఒకటి నా గొంతులో గుచ్చుకుని దాన్ని చీల్చివేస్తే ఈ పీడకల ముగిసిపోతుంది. ఇంతలో అంతా మసకగా అయింది, నాకు గాలిలో తేలిపోతున్నట్టు అనిపించింది. ముదురు ఆకుపచ్చ సముద్రం నన్ను మింగేసింది. కొమ్మలు నా ముఖానికి కొట్టుకున్నాయి. నేను పడిపోసాగాను, వేగంగా ఒక నల్లటి అగాధంలోకి పడిపోసాగాను. అయితే మృత్యువంటే ఇలాగే ఉంటుందన్నమాట! అంత హఠాత్తుగా, దయగా! నా ముఖాన్ని ఎవరో ప్రేమగా

నిమురుతున్నారు, నాకు నా శరీరం బరువులేనట్టు తోస్తోంది, గాలిలో తేలిపోవటం ఎంతో హాయిగా ఉంది, ఇంతలో గట్టిగా ఏదో తగిలింది. నేను స్పృహ కోల్పోయాను.

నాకు తెలివి వచ్చేసరికి, ఒక దుర్గంధపూరితమైన గుహలో, తాళ్లతో పేనిన మంచంమీద పడుకుని ఉన్నాను. నా చుట్టుపక్కల చాలామంది మూలుగుతూ ఉండటం వినిపించింది. లేచి కూర్చునేందుకు ప్రయత్నించాను, కానీ నొప్పి తన పంజాలతో నొక్కిపెట్టటంవల్ల మళ్లీ ఒరిగిపోయాను. నెమ్మదిగా తలతిప్పి చూశాను. గుహలో చాలామంది రకరకాల మృత్యుదశలో పడి ఉండటం కనిపించింది. నేను వణికిపోయాను. నేను యుద్ధంలో బందీగా నా శత్రు దేవతలకి చిక్కానా? వాళ్ల దయాదాక్షిణ్యాలమీద ఆధారపడి ఉండాలా? కానీ దేవతలు అసలు ఎప్పుడైనా ఇలా బందీలని పట్టుకున్నారా? పైగా, నేను సైనికుణ్ణి కాను, పౌరుణ్ణి. అలాంటి పనికి మాలిన ఆలోచనలు నా బుర్రలో రొదచేస్తూంటే, వాటిని అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తూ పడుకుని ఉండిపోయాను. మనుషులు మాట్లాడుకోవటం ఎక్కడినించో నా చెవులకి సోకింది: "వీళ్లలో సగంమంది చనిపోవటం ఖాయం. మిగతావాళ్లు లేచి నడవగలిగేందుకు కనీసం ఒక నెలరోజులు పడుతుంది." ఆ మాట్లాడే వ్యక్తి మంచి తమిళం మాట్లాడుతున్నాడు, నగరాల్లో ఉండే డంబాలు పలికేవాళ్లూ, చదువుకున్న వాళ్లూ మాట్లాడే భాష అది. నేను శత్రువులమధ్య లేనని అర్థమైంది. కానీ ఆ గొంతుల్లో ఎటువంటి భావమూ వినబడలేదు. నిరాశతో నిండిన వాళ్ల భవిష్యవాణి విని వర్ణించలేని భయంతో వణికిపోయాను. నెమ్మదిగా, పూర్ణానది అలలు ఒడ్డుని తాకినంత సుతారంగా, ఔషధాలతో మొద్దుబారిన నా మనసులో జ్ఞాపకాలు బుడగల్లా లేచి, నా చైతన్యంలో పగిలిపోసాగాయి. వాటి బాధ భరించ లేక నేను శోకాలు పెట్టాను. మృత్యువుకోసం ఎదురుచూస్తున్న ఎంతోమంది గొంతు ల్లోంచి వెలువడిన కేకలు ఆ గుహ అంతటా ప్రతిధ్వనించాయి. ఓటమికి గురైన ప్రజలు తమ జీవితాలలో ఎన్నడూలేని సరళత్వాన్నీ, అర్థాన్నీ కోల్పోయి

ఏడ్చే ఏడుపు అది. బహుశా, నా వాళ్ల ఏడుపుల మధ్య నన్ను నేను మరిచిపోయిన ఆ క్షణంలోనే, దేవతలమీద ప్రతీకారం తీర్చుకుంటానని ప్రతిజ్ఞ చేశాను.

7. పరాజితుల సంప్రదాయాలు

రావణుడు

నాలుగు నెలలుగా మేము అలా నడుస్తూనే ఉన్నాం. బాగా అలసిపోయి ఆకలిగొని ఉన్నాం. మామూలుగా ఉదయం నేను ఇచ్చే ఉపన్యాసం వినటానికి వచ్చిన యోధుల్లో చాలామందికి అది వినటం విసుగ్గా ఉందని గ్రహించాను. నా ఉపన్యాసాన్ని ప్రారంభించాను, "ఈనాడు మనం పదిమంది రాజులు చేసిన యుద్ధం గురించి తెలుసుకుందాం. ఆ యుద్ధంవల్లే చివరికి అసురుల సామ్రాజ్యం నేలకూలి, దేవతల రాజ్యం ప్రారంభమయింది. మొదట్లో దేవతలు శక్తిమంతులైన అసుర రాజులకి ఒక తలనొప్పిగా ఉండేవారు. సరిహద్దు ప్రాంతాల్లోని గ్రామాలని కొల్లగొడుతూ, ప్రజలని హతమారుస్తూ అప్పుడప్పుడూ సమస్యలు తెచ్చిపెట్టేవారు. కానీ, ఇంద్రుడు రంగంలోకి దిగగానే అన్నీ చాలా త్వరగా మారిపోసాగాయి. ఇంద్రుడికి కలగబోయే నష్టమేమీ లేదు. అతనికంటే ముందు అతని పాశవిక కృత్యాల కథలు మనుషులకి చేరేవి. హిమాలయాలకి ఉత్తర పాశ్చాత్య దిక్కున ఉన్న చిన్నచిన్న దేశాలెన్నిటినో అతను కొల్లగొట్టాడు, అందమైన నగరాలని తగలబెట్టాడు. తను లోబరుచుకున్న నగరంలో ప్రజలనీ, అక్కడి ప్రాణులన్నిటినీ హతమార్చి, పెద్దపెద్ద సామూహిక చితులని రగిలించాడు. వాటి చుట్టూ దేవతలు పాటలు పాడుతూ నృత్యం చేశారు.

"అసుర సభలోని పదిమంది రాజులూ ఆ క్రూరులకి గుణపాఠం చెప్పే తరుణం వచ్చిందని నిశ్చయించే లోపల, దుర్గమమైన, మంచుతో కప్పబడిన గాంధార పర్వతప్రాంతంలో విలువిద్యలో ఆరితేరిన తన సేనతో ఇంద్రుడు తన రాజ్యాన్ని ప్రతిష్టించాడు. అసుర సైన్యానికి గొప్ప యుద్ధ కౌశలం లేనప్పటికీ, దేవతల ముఠాని సంఖ్యాబలంతోనే

ఎదుర్కొని, తమ దగ్గర ఉన్న ఆయుధాల సాయంతో ఆ దోపిడీదారుల చిన్న సమూహాన్ని మట్టపెట్టి ఉండేవారు. కానీ గాంధార పర్వతాల ఇరుకు లోయల్లో ఆ పది రాజుల దగ్గర ఉన్న ఏనుగులూ నడవలేకపోయాయి. గంగానదికీ, సింధునదికీ మధ్యనున్న విశాలమైన మైదాన ప్రాంతాల్లో యుద్ధం చెయ్యటమే అసురులకి అలవాటు. గజసైన్యమూ, బరువైన గదలూ, ఖడ్గాలూ పట్టుకుని యుద్ధం చేసే కాల్బలమూ, సామాన్లు తీసుకెళ్లే బళ్లలాంటి రథాలూ, వాటిలో అదనపు సైన్యమూ, ఆయుధాలూ, విశాలమైన మైదాన ప్రాంతాల్లో యుద్ధం చేసేందుకు అనువుగా ఉండేవి.

"కానీ ఇంద్రుడు తన అద్భుతమైన తెలివితేటలు ఉపయోగించుకుని అసుర రాజులని ఇరుకులోయల్లో ఎదిరించటానికి పూనుకున్నాడు. పర్వతాలమీద వేచి ఉండి, అసురులు పైకివచ్చి తనతో, తన పద్ధతిలో యుద్ధం చెయ్యాలని ఎదురు చూశాడు. ఫలితం గురించి అసురులు చాలా విశ్వాసంతో ముందుకి సాగారు. ఉత్తరదిక్కునించీ, ఉత్తర పాశ్చాత్యదిక్కునించీ ఇంతకుముందు లెక్కలేనన్ని దాడులని వాళ్లు ఎదుర్కొన్నారు. ఇది కూడా అలాంటిదే ఇంకొక సరదా పర్యటన అనీ, తాము శత్రువుని అణచివేస్తామనీ, శత్రువుల నాయకుడిని బంధించి, తరవాత ఉదారంగా అతన్ని క్షమించేసి, పరాజితులకి తమ రాజభవనంలో విందు భోజనం ఏర్పాటు చేస్తామనీ అనుకున్నారు.

"పాపం, పిచ్చివాళ్లు! వాళ్లు ఎదుర్కొంటున్నది ఎవరినో వాళ్లకి తెలియలేదు. ఈ శత్రువు ఇంకోరకమైన వాడు - నీతిభ్రష్టుడు, క్రూరుడు, జయించాలన్న అతని కోరికని అణచటం అసాధ్యం. నేనెప్పుడూ గాంధారదేశానికి వెళ్లలేదు. కానీ బ్రహ్మ దగ్గర మేము తెలుసుకున్న వివరాలనిబట్టి, పదిమంది రాజులు యుద్ధంచేసిన ఆ కాలంలో ఆ ప్రాంతం ఎలా ఉండేదో అన్న విషయంపై మాకు స్పష్టమైన అవగాహన ఉంది."

ఇసుకలో దేశ వాయవ్యభాగం పటాన్ని స్థూలంగా గీశాను.

నాచుట్టూ నా తమ్ములూ, సమర్థుడూ, మధ్యవయస్కుడూ అయిన ప్రహస్తుడు చేరారు. ప్రహస్తుడు మా సైన్యాధిపతి. మిగిలిన యోధులు శ్రద్ధగా విన్నారు. ప్రహస్తుడు మా అమ్మకి దూరపు బంధువుననీ, నాకు వరసకి మేనమామ అవుతాననీ అనేవాడు. కానీ నాకా విషయం అనుమానమే. మా అమ్మకి చాలామంది బంధువులు ఉండేవారు, వాళ్లందరూ అసురులే, మరి అలాంటప్పుడు అతను అన్నమాట నిజమే కూడా కావచ్చు. నేను రాజయిన తరవాత అతనికి ఏమైనా ప్రత్యేకంగా సహాయం చేస్తానని ఆశిస్తే మాత్రం అతను నిరాశ చెందుతాడు. కానీ ప్రహస్తుడు సమర్థుడు, బుద్ధికుశలత గలవాడు, అందుకని అతనంటే నాకు గౌరవం ఉండేది.

కొందరు సైనికులు చికాకు పడటం చూసి నేను నా ఉపన్యాసం ఆపాను. వాళ్లని చూస్తే జాలివేసింది. సైనికుల్లో అధికశాతం చదువుసంధ్యలు లేని పేదవారు. మామూలుగా అయితే వాళ్లు వ్యవసాయదార్లో వర్తకుల దగ్గర పనిచేసేవాళ్లో అయి ఉండేవాళ్లు, కానీ తమ స్వదేశంనుంచి వాళ్లని వెళ్లగొట్టటంవల్ల, ఒకనాటి తమ సార్వభౌముడి వెంట వచ్చేశారు. మునుపటి సురక్షితమైన ప్రపంచాన్ని మళ్లీ వాళ్లకి అందిస్తానని ఆయన మాట ఇచ్చాడు. వాళ్లు మోసపోయి తమ ఆశలన్నీ నాలాంటి ఇల్లూ వాకిలీ లేని నిర్భీకుడిమీద పెట్టుకున్నారు. ఏనాడో వాళ్లు పోగొట్టుకున్న ప్రపంచాన్ని నేను వాళ్లకి తిరిగి ఇప్పించగలనని నమ్మారు.

"ఇంద్రుడు మొదట్లోనే వ్యూహరచనలో పొరపాటు చేశాడు. నాలుగుగోడల మధ్యన వున్న ప్రగ్య అనే పురం మీదకి దాడిచేశాడు. సరస్వతీనదీ తీరాన ఉన్న ఆ నగరం ప్రమ్యుధుడు అనే మహారాజు రాజ్యంలోని ముఖ్యమైన ఒక రేవు పట్టణం. ఆయన ఏ పనీకూడా అసంపూర్తిగా చేసే వ్యక్తి కాడు. తన మొత్తం సేనని ఇంద్రుడిమీదికి పంపాడు. 500 ఏనుగులూ, బరువైన ఖడ్గాలూ, గదలూ పట్టుకున్న 10,000 మంది కాల్బల సైనికులూ, ఎదుబళ్ల మీద 500 మంది విలుకాండ్రూ, నగరం గోడల్లోంచి పెల్లుబికి వచ్చారు. ఇంద్రుడి దగ్గర

గుర్రాలమీద స్వారీ చేస్తున్న 600 మంది విలుకాండ్రు మాత్రమే ఉన్నారు. వాళ్లలో 200 మందిని ఇంద్రుడు ముఖద్వారాన్ని ఆక్రమించేందుకు పంపాడు, వెనకవైపునించి నగరంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించాడు. ప్రమ్యుధుడు నాలుగు ద్వారాలనీ తెరిచాడు. శక్తివంతమైన అతనిసేన ముందు విభజన చెంది, తరవాత ముఖద్వారం దగ్గర వచ్చి కలిసింది. ఈ సాహసోపేతమైన చర్యకి ఇంద్రుడు దిగ్భ్రాంతి చెందాడు. పారిపోయేందుకు దారిలేని ఎలుకలలాగ, దేవతల సైన్యం ప్రాణభీతితో భయంకరంగా పోరాడింది. కానీ అసురసేన మరీ పెద్దది, పైగా విశాలమైన మైదాన ప్రాంతాలు అసురసేనకి యుద్ధ విన్యాసాలు చేసేందుకు అనువుగా ఉన్నాయి. గుర్రాలమీదున్న దేవతల సైనికులు చాలా సులభంగా అసురుల ఆయుధాలకి గురై ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఏనుగుల మీదినించి యోధులు బరువైన ఈటెలనీ బల్లేలనీ విసిరారు, బలమైన బాణాలు దేవతల కవచాలని ఉల్లిపొరల్లా ఛేదించాయి. ఇంద్రుడు సైన్యాన్ని వెనుదిరగమని ఆజ్ఞాపించాడు, కానీ అతను పడవేసిన చిక్కు పరిస్థితినించి సైన్యం వెనుదిరగటం అసాధ్యం అయింది. అతని సైన్యంలో 80 శాతం సైనికులు హతమార్చబడ్డారు. అయినా ఇంద్రుడు కత్తి పట్టుకుని చాలా శౌర్యంతో పోరాడి, ప్రమ్యుధుణ్ణి గాయపరచగలిగాడు.

"తన ఏనుగు దిగి ఇంద్రుణ్ణి యుద్ధానికి రమ్మని సవాలు చెయ్యటం ప్రమ్యుధుడు చేసిన మూర్ఖపు పని. ప్రమ్యుధుడు ఇంద్రుడితో యుద్ధం చేస్తూ ఉండగా, బుద్ధిలేని అసుర సైనికులు వలయాకారంగా నిలబడి ఆ ఇద్దరూ కత్తి తిప్పినప్పడల్లా చప్పట్ల కొట్టి ఉత్సాహపరిచారు. వాళ్లకి అదేదో ఒక వినోదంలాగ కనిపించింది. ఇంద్రుడి ఖడ్డ వినాసాలని కూడా వాళ్లు ప్రోత్సహించారు! ప్రమ్యుధుడు సంప్రదాయబద్ధంగా కత్తియుద్ధం చేశాడు. కత్తిని గాలిలో తిప్పినప్పడూ, పొడుస్తున్నట్టు కత్తిని ముందుకి పోనిచ్చినప్పడూ అతని కాళ్లు సరైన పద్ధతిలో కదిలాయి. కానీ ఇంద్రుడు తన ప్రాణాలు కాపాడుకునేందుకు పోరాడాడు, అతని పద్ధతి చాలా భిన్నంగా ఉండింది. హఠాత్తుగా, ఎదురుచూడని విధంగా, అతను తన

డాలుతో ఇసుక ఎత్తి శత్రువు కళ్లలోకి చిమ్మాడు. అదే సమయంలో నేర్పుగా కత్తితో గాయం చేశాడు. ఎంతో సామర్థ్యంగల ఖడ్గవీరుడు, ప్రమ్యుధుడు కిందికి వంగాడు కానీ అప్పటికే ఆలస్యమైపోయింది. భుజానికి లోతైన గాయం తగిలి అతను యుద్ధభూమిలో మూర్ఛ పోయాడు. ఆ తరవాత ఏర్పడిన గలభాలో ఇంద్రుడు మ్రాన్పడిపోయిన గుంపుని చీల్చుకుంటూ, శ్రన దారికి అడ్డువచ్చిన ముగ్గురు అసుర వీరులని కత్తితో పొడిచి బైటికి పారిపోయాడు. త్వరగా తన గుర్రం మీదెక్కి క్షణంలో మాయ మయాడు. దేవతల సైన్యంలో బతికి బైటపడ్డ కొద్దిమంది సైనికులూ అతన్ని అనుసరించారు," అన్నాను.

"ఓడిపోయిన ఏ రాజు గురించైనా నాకు చెప్పండి, అతను ఎంత మూర్ఖుడో, అంతకు రెట్టింపు ఎంత దురభిమానం కలవాడో చెపుతాను," అన్నాడు ప్రహస్తుడు.

"నిజమే", అని నా ఉపన్యాసాన్ని కొనసాగించాను. "పరాజితుడైన రాజు గతంలో జరిగినదంతా మరిచిపోయి తన రాజ్యాన్ని మళ్లీ పరిపాలించి ఉంటే, ఇంద్రుడు చేసిన దాడి చరిత్రలో ఒక చిన్న పాదపీఠికగా మిగిలిపోయేది. కానీ అతని అహంకారం అడొచ్చింది. మిగతా నగరాల్లోలాగ ఇంద్రుడి పరిపాలనలో ఉండే దుస్థితి తన రాజ్యంలోని ప్రజలకి తప్పిందని అతను తృప్తి చెందలేదు. వ్యక్తిగతంగా తను శత్రువు చేతిలో పరాజయం పొందాడే తప్ప, దేవతల సేనని తన సైనికులు ఫరోరంగా మట్టుపెట్టారని సంతోషించలేకపోయాడు. అతని పేరు ప్రతిష్టలు దెబ్బ తిన్నాయి. ఆ రోజుల్లో అసుర రాజులకి దైవబలంవల్ల రాజ్యాన్ని పొందే హక్కు ఉండేది కాదు. రాజుని ప్రజలే ఎన్నుకునేవారు. నగరంలో అందరికన్నా ప్రవీణుడైన వ్యక్తి గొప్ప యోధుడు మాత్రమే రాజుగా ఎంపిక అయేవాడు, అంతే."

"తన ఆస్థానంలోని గూఢచారుల ద్వారా, ప్రజల దృష్టిలో తను పేరు ప్రతిష్టలని కోల్పోయాననీ, మళ్లీ రాజుగా ఎన్నుకోబడే అవకాశం లేదనీ, ప్రమ్యుధుడికి తెలిసింది. పోయిన తన ప్రతిష్టని మళ్లీ పొందేందుకు అతను కఠినమైన చర్యలు తీసుకోవలసి వచ్చింది. అటువంటి

ఆలోచనలు రాజుని పూర్తిగా కుంగదీస్తాయి. వ్యక్తిగతమైన పరాజయాలూ, విజయాలూ ఉండకూడదు. మీ సేన విజయం సాధిస్తే చాలు, మీ శత్రువు ఖడ్గ విద్యలో మీకన్నా మెరుగైనవాడైనా ఏమీ పరవాలేదు. కానీ అసురులు ఎప్పుడూ అహంకారాన్ని భుజకీర్తుల్లా ధరించారు. అందువల్ల వాళ్లు స్పష్టంగా ఆలోచించలేకపోయేవారు, ఆ తరవాత వాళ్ల యుక్తియుక్తులన్నీ పెడదోవ పట్టనారంభించాయి," అన్నాడు ప్రహస్తుడు, నేను ముంతలోంచి నీళ్లు తాగేందుకు ఆగగానే.

శ్రోతలు మా మాటలని ఇప్పుడు చాలా శ్రద్ధగా వింటున్నారని గ్రహించాను. సంతోషంతో నేను మాట్లాడటం కొనసాగించాను, "రాజు అన్నివైపులకీ గూఢచారులని పంపాడు. ఎలాగో ఒకలాగ ఇంద్రుడి జాడ కనిపెట్టి ప్రతీకారం తీర్చుకోవాలని అనుకున్నాడు. ప్రమ్యుధుడు కూడా అసుర రాజుల సమష్టి సభకు వెళ్లాడు. ఆ సభలో దేశం నలుమూలలనించీ సమాన హోదా గల రాజులు సభ్యులుగా ఉంటారు. సంవత్సరానికి ఒకసారి పదిమంది రాజులూ, నీటిని పంచుకోవటం, సుంకాలూ, పన్నులూ విధించటం, రేవుల్లో వసూళ్లు నిర్ధారించటం, సంగీత విద్వాంసులనీ, కళాకారులనీ ఒకరికి ఒకరు మార్పిడి చేసుకోవటం లాంటి విషయాల గురించి చర్చించేవారు. అత్యావశ్యకమైన పరిస్థితుల్లో సభ్యులు సభ జరపటమనేది చాలా అరుదుగా సంభవించేది. ఏ రాజ్యానికైనా అనుకోని ఆపద సంభవించి, దాన్ని రక్షించుకోవాలన్నప్పుడు తప్ప, హఠాత్తుగా సభ కూడటం అనేది ఉండేది కాదు. సామాన్యంగా అన్ని రాజ్యాలలోనూ సైన్యం సిద్ధంగా ఉండేది, కానీ సాంస్కృతిక వికాసం వేగం పుంజుకోవటంవల్ల, వాళ్ల యుద్ధకౌశలం చాలామటుకు తగ్గిపోయింది.

"ఈ దేశం చాలా విచిత్రమైనది. విజయాన్ని సాధించిన గొప్ప సేనలు తమ లక్ష్యాన్ని సాధించగానే సింధునదికీ, గంగానదికీ మధ్యనున్న మైదాన ప్రాంతాల్లో స్థిరపడేవి. ఆ తరవాత వాళ్లలోని మొరటు స్వభావం మారిపోయి, సౌమ్యంగా, స్త్రీత్వంతో నిండినట్టు మారిపోయేవారు. దేశం వాళ్లని మార్చివేసేది. క్రూరులుగా ఉన్నవాళ్లు సాధుస్వభావులుగా మారి,

జీవితంలోని అందమైన మంచి విషయాల పట్ల అభిరుచిని పెంచుకునేవారు. అసురులకన్నా ముందు దండెత్తి విజయాలని సాధించిన వారందరూ ఇదే ధోరణి కనబరిచారు. ప్రస్తుతం ఉత్తరాన ఉన్నదేవతల రాజ్యాల్లో కూడా ఇదే వైఖరి కనిపిస్తోంది. అసురుల విషయంలో కూడా ఇలాగే జరిగింది. కానీ రాజులు, ఈ దేశాన్నంతా తమ ఆధీనంలోకి తెచ్చుకున్న గొప్ప యోధులకి తాము వారసులమని అనుకునేందుకే ఇష్టపడ్డారు. తమ సేనాబలం గురించి వాళ్లకి అమితమైన విశ్వాసం. కానీ వాళ్ల సైన్యం ఎంతో పెద్దదైనప్పటికీ, అందులో సంగీత విద్యాంసులూ, నాట్యకత్తెలూ, ఇంద్రజాలికులూ, గారడీవాళ్ళూ పిల్లిమొగ్గలు వేసేవాళ్ళూ వంటవాళ్లూ, పువ్వులు అమ్మేవాళ్లూ, వర్తకులూ, పురోహితులూ మాత్రమే ఉండేవాళ్లు. కథల్లో మనం విన్న సంఖ్యలన్నీ అబద్దాలు. 10,000 మంది ఉన్న సైన్యంలో నిజానికి యోధులు చాలాకొద్దిమందే ఉండేవారు. మిగతావాళ్లు సైన్యంతోబాటు యుద్ధభూమికి వెళ్లి, అక్కడ గలభా చెయ్యటం తప్ప ఇంకేమీ చేసేవారు కాదు.

"ఇంద్రుడి దాడి అంతగా భయపెట్టలేదన్న విషయాన్ని సమష్టి సభలోని పదిమంది రాజుల్లో ఆరుగురు అంగీకరించలేదు. సమృద్ధి సాధించిన ఏ నగరమైనా ఆక్రమణకి గురయే అవకాశం ఉందని వాళ్లు అనుకున్నారు. కానీ ప్రమ్యుధుడు తన వాదనలతో ఆరోజు అందరినీ ఒప్పించగలిగాడు. సింధునదీ మైదాన ప్రాంతాల్లో సరిహద్దు ప్రాంతాన గల ఊళ్లమీద దాడిచేసే తెగలు, పేరుపొందిన రాజ్యం తాలూకు రాజధానిమీద దాడిచేసే ధైర్యం ఏనాడూ చెయ్యలేకపోయాయని అన్నాడు. దాడిచేసిన సమూహం మామూలుగా ఎప్పుడూ దాడికి పాల్పడి, ధాన్యాగారాలు దోచుకుని చేతికి అందినది దొంగిలించి పారిపోయే సమూహం వంటిది కాదని ప్రమ్యుధుడు భావించాడు. నిజానికి వీళ్లు సమానమైన ధైర్య సాహసాలూ, జిత్తులమారితనం చూపించారనీ, తాము దోచుకుని తీసుకుపోతున్న వాటిని మోసేందుకు వింత జంతువులని ఉపయోగించుకున్నారనీ అన్నాడు. ఆ జంతువుల

చురుకుతనాన్ని చూసి అసురులు అబ్బురపడ్డారు. ఎద్దులలాగ కాకుండా అవి చాలా త్వరగా, చురుకుగా కదిలాయి. ఈ శత్రువుని మట్టుపెడితే తప్ప, మన ప్రజలు ఎప్పుడూ ఈ అనాగరికుల దాడికి భయపడుతూనే జీవించవలసి వస్తుంది అంటూ ప్రమ్యుధుడు వాదించాడు. అయినప్పటికీ, ఆ రాత్రి ఎటువంటి తీర్మానమూ చెయ్యకుండానే సభ ముగిసిపోయింది. ఉదయం, ఉత్తర పశ్చిమ ప్రాంతపు అసుర రాజు శిబిరానికి ఒక వార్తాహరుడు వచ్చి, గుర్రాలమీద వచ్చిన ఒక దండు ముల్లముఖం అనే నగరాన్ని తగలబెట్టారని చెప్పేసరికి, మళ్లీ సభ జరిగింది. ఆ నగరం బాగా పెద్దది, గంగానది నుంచి గాంధార రాజ్యం దాటి ఇంకా దూరం వెళ్లే వర్తకమార్గాల్లో ఇది కూడా ముఖ్యమైనది. ఆ దాడివల్ల అంతా తారుమారైంది. పది మంది రాజులూ కలిసికట్టుగా గొప్ప సైన్యాన్ని సమకూర్చుకుని, గుర్రాలమీద వచ్చిన దండుని మాత్రమే కాకుండా, ఈజిప్టు, మెసపొటేమియా లాంటి గొప్ప నగరాలకి వెళ్లే వర్తక మార్గాలన్నిటిమీదా దాడి చేసే చిన్నకారు సముద్రపు దొంగలనీ, బందిపోటు దొంగలనీ కూడా శాశ్వతంగా నాశనం చెయ్యాలని నిశ్చయించారు.

"మూడో రోజు కూడా సభపెట్టి యుద్ధ ప్రణాళికలని తయారుచేశారు. ప్రమ్యుధుణ్ణి సేనానాయకుడిగా ఎన్నుకున్నారు, అతను అందరికన్నా వయసులో పెద్దవాడనీ, నిపుణుడనీ మాత్రమే కాదు, పరిచయం లేని స్థలంలో శత్రువుని ఎదుర్కొనేందుకు రెండోసారి ఆలోచించాల్సిన అవసరం లేదన్నది అతనొక్కడే. దాదాపు అన్ని రాజ్యాలూ సుఖంగా ఉన్నాయి, ఎవరికీ యుద్ధం చెయ్యాలన్న కోరిక లేదు. వర్తక వ్యాపారాలు చాలా చక్కగా సాగుతున్నాయి, జనజీవనం సాఫీగా గడిచిపోతోంది. ఒకనాడు శివుడివెంట తమ ఎద్దులనెక్కివెళ్లిన ఎంతో సాహసవీరులైన సైనికులు, మట్టినేల మీద పడుకుని నిద్రపోయారు, వారానికి ఒకసారే భోజనం చేశారు. అలాంటివారు ప్రస్తుతం కనిపించటంలేదు. ఈ మనుషులు జీవితంలో మాధుర్యాన్ని చవిచూశారు, ఎటువంటి నష్టాన్నీ అనుభవించబోని తెగలతో ఎడతెరిపి

లేని యుద్ధాలు చెయ్యటం వీళ్లకి ఇష్టం లేకపోయింది.

"ప్రమ్యుధుడు సింధునదీ తీరం నుంచి బైలుదేరాడు. లక్షకు పైగా విలుకాండ్రూ, గదాధరులూ, బల్లేలూ, గండ్రగొడ్డళ్లూ పట్టుకున్న వీరులు అతనివెంట ఉన్నారు. 10,000 ఏనుగులూ, 3,000 ఎద్దుబళ్లూ, 10,000 మంది డప్పులు వాయించేవాళ్లూ, మురళి వాయించేవాళ్లూ, నాట్యకత్తెలూ, శిబిరాలు నిర్మించేవాళ్లూ, అసురుల సాహసగాథలని రచించి పాడే కవులూ, వీళ్లు కాక సామాన్యంగా అసురసేనలవెంట వెళ్లే మిగతా వాళ్లూ బైలుదేరారు. ఈ బ్రహ్మాండమైన సమూహం - దానికి మరో పేరు లేదు - సింధు నదినీ, సరస్వతీ నదినీ దాటి చిన్నకారు దొంగలనీ, బందిపోటు ముఠాలనీ వేటాడసాగింది. సేన విజయాలని సాధిస్తూ ముందుకి సాగింది. దారి పొడుగునా గ్రామాలకి వార్తలు అందించే వార్తాహరులని ప్రమ్యుధుడు గొప్ప నేర్పుతో పరిగెత్తించాడు. శత్రువుల రహస్య స్థావరాల గురించి అసుర రాజుకి గూఢచారులు ఎప్పటికప్పుడు సమాచారం అందించారు. శత్రు గూఢచారులకి ఆశ్రయం ఇచ్చారన్న అనుమానం ఉన్న ప్రతి గ్రామం మీదా సేనలు మెరుపుదాడులు చేశాయి, క్రూరాతిక్రూరంగా వాళ్లని హతమార్చాయి. ప్రమ్యుధుడికి విజయం తాలూకు మత్తు బాగా తలకెక్కింది. ఇంద్రుడు తన కొద్దిపాటి సైనికులతో ఉత్తర పశ్చిమాన ఉన్న గాంధార పర్వతాలవైపు పారిపోతున్నాడని గూఢచారులు అతనికి తెలిపారు. ప్రమ్యుధుడి గొప్పదనాన్ని గురించి గొప్పగా కీర్తిస్తూ పాడారు. దీనివల్ల మిగతా తొమ్మిది మంది రాజుల అహం దెబ్బతిన్నది. వాళ్లు అయిష్టంగానే ఈ యుద్ధంలో పాల్గొన్నారు. తాము ప్రమ్యుధుడి కింద చిన్న నాయకులుగా మిగిలామని తెలుసుకున్నారు. రోజురోజుకీ ప్రమ్యుధుడు కూడా గర్విష్ఠిగా తయారవసాగాడు. మొదట్లో అతను మిగతా రాజుల సలహాలని వినిపించుకోలేదు. ఆ తరవాత బాహాటంగా వాళ్లని విమర్శించటం, వాళ్ల యుద్ధనీతిని వెటకారం చెయ్యటం ప్రారంభించాడు."

దాదాపు 1000 ఏళ్ల క్రితం, ఆనందంగా విధ్వంసం వైపు నడిచిన

ప్రమ్యుధుడి సేనల మార్గాన్ని చూపించాను. నేను వేసిన పటం ఇంకా బాగా కనబడేందుకు సైనికులు ముందుకి వంగారు.

దాహంతో నానోరు ఎండిపోవటం వల్లనూ, నాకు కాస్త విశ్రాంతి అవసరం అయినందువల్లనూ, ప్రహస్తుడు అందుకున్నాడు. తన బొంగురు గొంతుతో ఇలా చెప్పటం ప్రారంభించాడు, "హిందూకుష్ పర్వతాల కింది భాగానికి చేరేసరికి సైన్యం కుదురుగా ఏకమై లేదు. ఆ పర్వత ప్రాంతం చాలా ఎగుడుదిగుడుగా, రాళ్లతో నిండి ఉంది. యుద్ధం ఆపెయ్యకపోతే తమ సేనలతో కలిసి వెళ్లిపోతామని ముగ్గురు రాజులు తిరగబడి బెదిరించారు. ఆ సమయంలో ప్రమ్యుధుడు ఈజిప్టుతో సహా పాశ్చాత్యదేశాలని జయిస్తానని అనసాగాడు. తనని తాను ప్రపంచానికంతటికీ చక్రవర్తినని ప్రకటించుకోవటం ప్రారంభించాడు. ముగ్గురు రాజులూ తిరుగుబాటు చేసేసరికి రాజద్రోహుల కింద వాళ్లని బంధించి, చిన్న విచారణ జరిపి వాళ్లకి బహిరంగంగా మరణశిక్ష విధించాడు. అది చూసి సైన్యం వణికిపోయింది. వాళ్ల మనోస్థైర్యం అప్పటికే అథఃపాతాళానికి చేరిపోయింది. ఆ పోరాటం వాళ్లు అనుకున్నంత సరదాగా లేదు. మైళ్లకొద్దీ కదిలి వెళ్లటం చాలామందిని బలిగొంది. కొంతకాలానికి మరణశిక్షకి గురైన రాజుల సైనికులు కూడా తిరుగుబాటు చేసి, యుద్ధభూమిని వదిలివెళ్లిపోయారు. ప్రమ్యుధుడు పాశవికంగా వాళ్లని హతమార్చాడు. అతను తన సైన్యంలోనే 9,000 మంది సైనికులని నరికివేశాడని కవులు గానం చేశారు. పారిపోయిన సైనికులని తరిమి పట్టుకుని వచ్చేందుకు ఒక పెద్ద సైనికదళాన్ని పంపాడు. అబద్ధపు విచారణ జరిపి వాళ్లని చంపించి వేశాడు. ఆ సమయంలో కొంతమంది యోధులు నిష్పక్షంగా ఉండిపోయారు. ఇలా పిచ్చికుక్కల్లా తమలోతామే పోట్లాడుకుంటూ అసుర సైన్యం తమ పరాజయానికి తామే కారణం అవుతారని అనిపించింది. చివరికి ప్రమ్యుధుడు ఆరుగురు రాజులని తన పక్షాన ఉండమని ఒప్పించగలిగాడు. చాలా కష్టపడ్డాక తిరుగుబాటుని అణచటం సాధ్యమైంది. కానీ ఆ క్రమంలో ఎంతో విలువైన సమయం వృథా

అయింది. ఇంద్రుడినీ, అతని సైన్యాన్నీ వెతికేందుకు ఆ చలిప్రదేశం లోపలికి చొచ్చుకుపోవాలని అతను నిర్ణయించేసరికే శీతాకాలం వచ్చేసింది.

"కాశీ రాజు, విభోగుడు, ప్రమ్యుధుడితో గ్రీష్మకాలం వచ్చేదాకా ఆగమన్నాడు, కానీ ప్రమ్యుధుడు వినిపించుకోలేదు. సాధ్యమైనంత త్వరగా ఇంద్రుణ్ణి బంధించి తన రాజధానికి లాక్కుపోవాలని అనుకున్నాడు. ప్రపంచానికే సార్వభౌముడు అవాలని అనుకున్నవాడు, ఎత్తైన పర్వతాలనీ, మంచుకొండలనీ చూసి భయపడడు. ఇంకా కొందరు కూడా అలాంటి సలహానే ఇచ్చినా వినకుండా, ప్రమ్యుధుడు తన సైన్యాన్ని ఉత్తర పశ్చిమ దిశగా వెళ్లమని అన్నాడు. ఇరుకుగా ఉన్న కొండ దారులు జారుడుగా ఉన్నాయి. ఏనుగులు లోతైన లోయల్లోనూ, దారుల్లోనూ జారి పడిపోయాయి. అవి గంటలకొద్దీ అలా దారికి అడ్డుగా ఉండటంతో ముందుకి వెళ్లటం అసాధ్యమైపోయింది. ఎద్దుబళ్లనీ, ఏనుగులనీ ఆ సన్నని ఇరుకుదారిలోకి మళ్లించలేక వదిలివేయాల్సి వచ్చింది. కాల్బలంలోని సైనికులు చెదిరిపోయి ఇష్టం వచ్చినట్టు నడవసాగారు. బరువైన గొడ్డళ్లనీ, గదలనీ, విల్లులనీ మొయ్యటం కష్టమనిపించింది, వేడిగా ఉండే నిప్పలు చెరిగే మైదానం నుంచి రావటం వల్ల చాలామంది సైనికులకి గడ్డకట్టించే ఆ చలి భరించటం సమస్య అయింది. వాళ్లకి ఉన్న ఈ కష్టాలకి తోడు, ప్రమ్యుధుడు సరుకులన్నిటినీ ఎద్దుబళ్లలో ఉంచాడు. వాటిని మోసుకుని సైనికులు కొండలమీదికి ఎక్కవలసి వచ్చింది. నాట్యకత్తెలూ, కవులూ, గాయకులూ, ఇంద్రజాతికులూ, పురోహితులతో కలగాపులగంగా ఉన్న గుంపు వేగంగా ముందుకి పోయేందుకు అడ్డంకిగా ఉండి, తలనొప్పిగా తయారైంది."

అక్కణ్ణించి కథ నేను చెప్పటం మొదలుపెట్టాను, "తప్పించుకుపోయిన ఇంద్రుడినీ, అతని అనుచరులనీ వెతికేందుకు సైనికుల గుంపు నెలరోజులకి పైగా ముందుకి నడిచింది. చాలామంది ఆ గుంపుని వదిలి వెళ్లిపోయారు, కొందరు వాతావరణ పరిస్థితులనీ,

అలసటనీ తట్టుకోలేక మరణించారు. తమవెంట తెచ్చుకున్న ఆహారపదార్థాలు దాదాపు అయిపోయాయి. కొండ మీద ఉండే మేకనో, పక్షినో చంపి తినేవారు, అక్కడ అవి తప్ప తినదగిన వస్తువులేవీ వాళ్లకి దొరకలేదు. సగంపైగా ఏనుగులు చనిపోయాయి, అలసిపోయి, ఆకలితో అలమటిస్తున్న సైనికులకి ఆహారం సమకూర్చేందుకు ఎద్దులని చంపారు. సైనికులు తమ దగ్గరున్న పెద్ద పెద్ద ఆయుధాల్లో చాలామటుకు కోల్పోయారు. అడుగూ బొడుగూ వెనక్కి ఉండిపోయినా సైనికుల వరుసలు ఏడుమైళ్ల పొడుగున సాగాయి. ఆ గుంపులో ఉన్న సైనికులు దుమ్ముతో నిండి, చిరిగిపోయిన బట్టలతో, బరువైన ఆయుధాలని మోస్తూ నెమ్మదిగా, అతికష్టం మీద, అంతుపట్టని ఆ పర్వతాల చిక్కుదారులవెంట కాళ్లు ఈడ్చుకుంటూ నడవసాగారు. గత ఏడాదికాలంలో వాళ్లకి ఒక్క దేవతల సైనికుడు కూడా కనబడలేదు. అసుర సైనికులు ఆయుధాలు పటుకున్నది వాళ్లలో వాళ్లు కొట్లాడుకోటానికో, దారిదోపిడీ దొంగలని ఎదుర్కోవటానికో తప్ప ఈ కవాతులో వాళ్లు దేవతలతో యుద్ధం చెయ్యనేలేదు. ఆసరికి ప్రమ్యుధుడికి కూడా తను చేసిన తప్పు అర్థమైంది. అందమైన తన వెచ్చటి నగరానికి వెనక్కి వెళ్లిపోవాలని అనిపించింది. కానీ సైన్యం ఘోరంగా దారి తప్పింది. మంచుగడ్డలూ, కొండచరియలూ విరిగిపడటం వల్ల, చాలా దారులు మూసుకుపోయాయి. ప్రమ్యుధుడు వరసగా ఎంతోమంది వార్తాహరులని పంపాడు. వీలైనన్ని దిక్కులకి, చిన్న చిన్న అసుర సామంతులనీ, ప్రముఖులనీ ఆహారం, సహాయం కోరుతూ సందేశాలు పంపాడు. కానీ ఒక్క వార్తాహరుడు కూడా వెనక్కి రాలేదు. వాళ్లని ఇంద్రుడి సేన పట్టుకుందని అనుకున్నారు. ఇక అసురసేన మనోస్థైర్యం పాత్రాళం అట్టడుక్కిచేరుకుంది. ఆ సమయంలో, చలిగా, పొగమంచుతో నిండి ఉన్న ఒక ఉదయాన, గుర్రాలమీద వచ్చిన ఇంద్రుడి సైనికులు వాళ్ల మీద అగ్ని బాణాల వర్షం కురిపించసాగారు. ప్రమ్యుధుడి సైన్యం ఇరుగ్గా ఉండే ఒక కొండ లోయ అడుగున చిక్కుకుపోయింది. ఒకరి వెనక ఒకరుగా పదిమైళ్ల వరకూ సైనికులు బారులు తీరి నిలబడ్డారు."

నేను చెప్పిన విషయాన్ని మరింత స్పష్టం చేసేందుకు పటంలో ఒక చోట గుండ్రంగా వలయం గీశాను. "సంఖ్యాబలం ఉన్న అసురుల సేనలని ఇంద్రుడు ఇరుకైన కొండ లోయల్లో, ఒకవైపు లోతైన అగాధాలూ, మరోవైపు మొనదేలిన శిలలతో నిండిన కొండరాళ్ల మధ్య దొరకబుచ్చుకున్నాడు. వేగంగా పరిగెత్తే గుర్రాలమీద నించి దేవతల విలుకాండ్రు, అసహాయులైన అసురుల మీద తేలికైన బాణాలని రువ్వారు. 50,000 మంది సైనికులున్న అసురుల సేనని తన 500 మంది యోధులతో ఇంద్రుడు ఎదుర్కొన్నాడు. ఆ తరవాత జరిగిందానిని నరసంహారం అనే అనాలి. అసురుల బరువైన బాణాలు భూమ్యాకర్షణ శక్తిని కాదని కొండలమీదున్న దేవతల సైనికులని తాకలేకపోయాయి. గొడ్డళ్లూ, గదలూ, ఈటెలూ నిష్ప్రయోజన మయాయి. పైనించి దొర్లుతూ వచ్చి ఇరుకుదారిలో చిక్కుకున్న సైనికులని చితగ్గొట్టిన పెద్దపెద్ద బండరాళ్లని వాళ్లు ఆపలేకపోయారు. ఒక్కొక్కరూ తమవంతు వచ్చేదాకా ఆగటం తప్ప ఇంకేమీ చెయ్యలేకపోయారు. పోరాడేందుకు చిన్న ప్రయత్నం చేశాక, సైన్యం పడుతూ లేస్తూ వెనక్కి మళ్లింది.

"ప్రమ్యుధుడు, ఎన్నో పొరపాట్లు చేసినప్పటికీ, పారిపోతున్న తన సైనికులకి ధైర్యం చెప్పేందుకు సాహసంతో దేవతల విలుకాండ్రు నిలబడ్డ అతిపెద్ద శిలమీదికి ఎక్కేందుకు ప్రయత్నించాడు. నేర్పుగా, బాణాలని గురి తప్పకుండా అతి సూటిగా వేసి చాలామంది దేవతలని చంపగలిగాడు. తమ రాజు శౌర్యం చూసి, వందలకొద్దీ అసురులు విల్లంబులతో రాజుని అనుసరించారు. కానీ అతని సైన్యంలో ఎక్కువ మంది పారిపోయారు. ప్రమ్యుధుడు యుద్ధం చేసి గెలవలేడని సలహా ఇచ్చి అతని చేత యుద్ధం మాన్పించేందుకు ప్రయత్నించిన ధీశాలి కాశీరాజు మాత్రం అతన్ని వదిలిపోలేదు. మిగతా ఐదుగురు రాజులూ తమ సైన్యాలతో బాటు యుద్ధభూమి వదిలి పారిపోయారు.

"ఆ తొక్కిసలాటలో కొన్ని వేలమంది నలిగిపోయి ప్రాణాలు వదిలితే ఇంకా చాలామంది అగాధమైన లోయల్లో అంతిమ శ్వాస విడిచారు.

కొద్ది వేలమంది సైనికులతో ప్రమ్యుధుడూ, విభోగుడూ పోరాడుతూ కొండపైకి చేరుకున్నారు. ఎంతో కృతనిశ్చయంతో పోరాడే ఈ చిన్న సైన్యం కూడా దేవతల సైన్యం కన్నా పెద్దదే అనిపించుకుంది. ఇంద్రుడు ప్రమాదాన్ని పసిగట్టి త్వరగా రంగంలోకి దిగి పోరాటానికి నాయకత్వం వహించాడు. మళ్లీ ఒకసారి ఇంద్రుడూ, ప్రమ్యుధుడూ ముఖాముఖి పోరాటం సాగించారు. విభోగుడు పైకి వసూ, ప్రమ్యుధుడిని తప్పకోమనీ, సైన్యానికి తాను నాయకత్వం వహిస్తాననీ అరిచాడు. కానీ పోయినసారి ఇంద్రుడి చేతిలో యద్ధంలో అవమానకరమైన పరాజయం పాలైన ప్రమ్యుధుడికి ప్రతీకారం తీర్చుకునే అవకాశం దొరికింది. అతను ఇంద్రుడిని వెనక్కి నెట్టుతూ ఇరుకులో పెట్టాడు. ఇంద్రుడు కొద్దిసేపట్లోనే అలసిపోయి, తన ప్రత్యర్థి కత్తిపోట్లనీ, బలంగా గాయపరిచే అతని ఖడ్గ కౌశలాన్నీ ఎదుర్కోలేకపోయాడు. కానీ అసురుల్లాగ దేవతలు తమ నాయకుడి ప్రాణాలకి ముప్పు వాటిల్లితే వలయాకారంలో నిలబడి చప్పట్లు కొడుతూ అతన్ని ఉత్సాహపరచరు. తెలివిగా వదిలిన ఒక బాణం వచ్చి ప్రమ్యుధుడి కంఠంలో దిగింది, దాని మొన అతని కుడి కంటిలోంచి బైటికి పొడుచుకొచ్చింది. అది చూసి విభోగుడు నిశ్చేష్టుడై మ్రాన్పడిపోయాడు. ఆ క్షణాంశంలో దేవతల ఖడ్గాలు ఏడు అతన్ని ముక్కలు ముక్కలుగా నరికేశాయి.

"ప్రమ్యుధుడు ఇంకా కొన్ని క్షణాలు అలాగే పోరాటాన్ని కొనసాగించాడు, కానీ ఇంద్రుడు, తన ఖడ్గాన్ని ఝళిపించి, ఒక్క వేటుతో తన శత్రువు తలని నరికేశాడు. గెలిచిన ఉత్సాహంతో అతను వేసిన పెనుకేక మిగిలిన అసుర సైనికులలో విపరీతమైన వణుకు పుట్టించింది. నరికేసిన ప్రమ్యుధుడి తలని ఇంద్రుడు తన కత్తిమొనకి గుచ్చి, పైకెత్తి శత్రువులకి చూపించాడు. అసురసైన్యం వెన్ను చూపి పారిపోసాగింది. కొన్ని వేలమందిని పారిపోనిచ్చాక, ఇంద్రుడు దురదృష్టవంతులై చివరన ఉండిపోయిన వాళ్లని చుట్టుముట్టి ఊచకోత కోశాడు. ఆ రోజు విధి వక్రించి వేలమంది ప్రాణాలు కోల్పోయారు. ఆ ప్రాంతమంతా బాగా తెలిసిన దేవతల సైనికులు అస్తవ్యస్తంగా మారిన

అసురుల సైన్యాన్నికొండలమీదినించి తరిమికొట్టారు. మైదాన ప్రాంతానికి చేరేసరికి వేగంగా పారిపోతున్న అసురుల సైనికులని గుర్రాలమీద వస్తున్న దేవతల సైనికులు తరిమికొడుతూనే ఉన్నారు. ఇక అసురుల సైనికుల సంఖ్య 200 కి పడిపోయింది. పారిపోయిన ఐదుగురు రాజులూ మళ్లీ వెనక్కి వచ్చి వాళ్లని ఎదుర్కోవటంలో తమ సైనికులకి నాయకత్వం వహించి ఉండవచ్చు. దేవతల సైన్యం మైదానాల వరకూ వచ్చింది కాబట్టి అసురుల భారీ ఆయుధాలు వాళ్లని తుదముట్టించి ఉండేవే. అందుకే ఇంద్రుడు చాలా తెలివిగా తన సైన్యాన్ని అసురుల ఆయుధాల నుంచి దూరంగా ఉంచాడు, తేలికైన తన సైనికుల బాణాలు మాత్రం అసురులని హతమార్చేంత దూరాన్ని పాటించాడు. త్వరలోనే అసురుల పక్షాన ఉండే సైనికుల్లో తమ అదృష్టాన్ని వెతుక్కునేవాళ్ళూ, స్వామి ద్రోహులూ దేవతలతో కలిసిపోయి వాళ్ల సైన్యాన్ని పెంచారు. ఇలాంటి వాళ్లు ఎప్పుడూ గెలిచినవాళ్ల పక్షానే ఉండాలని అనుకునే రకం. అసురులు ఘోరంగా పరాజయం పొంది పారిపోతున్నారనీ, దేవతలు వాళ్లని తరిమికొడుతున్నారన్న వార్త వేగంగా అంతటా పాకిపోయింది. దోపిడీదొంగలూ, ఇతర ఆటవిక తెగలూ అసురులు పోరాడుతున్నంతవరకూ ఎక్కడో దాక్కుని, ఈ వార్త వినగానే బైటికి వచ్చి దేవతలతో చేరిపోయారు.

"దేవతల శక్తిని మొట్టమొదట రుచి చూసిన వాళ్లు, డప్పులు వాయించేవాళ్లూ, నాట్యకత్తెలూ, ఇతర పనికిమాలిన మనుషులతో నిండిన గుంపు. తమ సైన్యానికి పట్టిన అధోగతి గురించి ఏమాత్రం అవగాహన లేకుండా వాళ్లు తమ ప్రాంతానికి తిరిగి వెళ్లేందుకు బైలుదేరారు. ముందు వాళ్లని అసురసైనికులు దాటి వెళ్లిపోయారు. ఆ తరవాత మహమ్మారిలా దేవతల దండు వాళ్లమీద ఆక్రమణ చేసింది. ఆ బ్రహ్మాండమైన గుంపుని అదుపు చెయ్యటం సాధ్యం కాలేదు. మొదట ఇంద్రుడివెంట ఉన్న వందమంది సైనికులు తప్ప అతని మాట ఎవరూ వినలేదు. వాళ్లలో అధికశాతం ఆదివాసీ తెగలకి చెందినవాళ్లు,

బందిపోట్లు. వాళ్లు ప్రతి ఊళ్లోనూ ఆగి ఇష్టవచ్చినట్టు కొల్లగొట్టారు. ఇళ్లలో దూరి అందినదల్లా ఎత్తుకుపోయారు, నగరాలని దోచుకున్నారు, కొన్నివేలమంది సామాన్య పౌరులని నరికి పారేశారు, స్త్రీలపై సామూహిక అత్యాచారాలు చేశారు. పరాజితులైన అసుర సైనికులు నగరాలకి చేరుకునేలోపలే జనం అక్కణ్ణించి పారిపోసాగారు. మనుషులు పెద్ద ప్రవాహంలా ఊళ్లని ముంచెత్తి అల్లర్లు సృష్టించసాగారు. గుప్పెడు అనాగరికులకి భయపడి దేశంలోని ప్రజలందరూ కాలికి బుద్ధి చెప్పటం ప్రారంభించేసరికి కల్లోల పరిస్థితి ఏర్పడింది.

"ఆ తరవాత పారిపోతున్న అసురసేనలు కూడా దేవతల చేతికి చిక్కకుండా ఉండేందుకు నగరాలని తగలబెట్టటం ప్రారంభించాయి. అప్పుడు సామాన్యజనం కూడా ఆయుధాలు పట్టి, నగర రక్షణకోసం ఏర్పాటుచేసిన సైనికులతోబాటు, అసుర సైనికులని తమ నగరాలని తామే దోచుకోకుండా అడ్డుకున్నారు. అంతర్యుద్ధం మొదలైంది.

"ఐదుగురు అసుర రాజులు దేవతలతో చేరిపోయి మిగతా ఐదుగురు రాజులనీ హతమార్చారన్న వదంతి బైలుదేరింది. అందరినీ ఆకట్టుకునే సామర్థ్యంగల ప్రమ్యుధుడిని కూడా వాళ్లే చంపారని అనుకున్నారు. త్వరలో దేవతలు తమ బలాన్ని పెంచుకుంటూ పోయారు, అసురులు మాత్రం వాళ్లలో వాళ్లు పోరాడుకుంటూ ఉండిపోయారు. అసురుల పరాజయం తరవాత ఇంద్రుడి పేరు ప్రతిష్టలు విపరీతంగా పెరిగిపోయాయి. ఎప్పుడూ సంచారం చేస్తూ ఉండే దేవతల మూకలు కూడా అతనితో వచ్చి కలిశాయి. వాళ్లు చూస్తూండగానే అసురుల సామ్రాజ్యం ధ్వంసమై పోయింది.

"ఏ మహాసామ్రాజ్య నిర్మాణానికీ, అభివృద్ధికీ వెయ్యి సంవత్సరాలు పట్టిందో, అది కూలిపోయేందుకు కేవలం ఏడునెలల కాలం సరిపోయింది. అసురుల సామ్రాజ్యం బలహీనమైపోయిందని నిర్ధారణ చేసుకున్న తరవాత, అంతవరకూ సురక్షితమైన స్థితిలో ఉన్న అసురుల అస్తిత్వపు కవచాన్ని ఇంద్రుడు అవలీలగా ఛేదించాడు. గెలుచుకున్న దేశంతో ఎలా వ్యవహరించాలనే విషయాన్ని - యుద్ధకళనీ,

రాజకీయాలనీ అభ్యసించే ప్రతి విద్యార్థికీ నేర్పించే గొప్ప పాఠం అది. ఒక గొప్ప నాగరిక సమాజం తాను నిర్మించిన నగరాలనీ, తను రచించిన గ్రంధాలనీ, పోషించిన కళలనీ, కళాకారులనీ, నిర్మించిన దేవాలయాలనీ చూసి గర్విస్తుంది. గెలుపొందిన వాడు మొట్టమొదట సాధ్యమైనంత బలంగా ఇలాంటి నాగరికతా చిహ్నాలనే ధ్వంసం చేస్తాడు. ఇంద్రుడు ఆపని బహుచక్కగా చేశాడు. సాధ్యమైనంత వరకూ అన్నిటినీ ధ్వంసం చేశాడు. గ్రంథాలయాలని తగలబెట్టాడు, కవులనీ, శిల్పకారులనీ హతమార్చాడు, దేవాలయాలని కూలగొట్టాడు, స్త్రీలనీ, పిల్లలనీ ముక్కలు ముక్కలుగా నరికాడు. అసురులు ఎంతో అమూల్యమైనవని భావించినవి అన్నీ త్వరలో నాశనం అయాయి. అప్పట్నించీ ఇంద్రుడి పేరు పురందరుడు అంటే శత్రు పురాలని ధ్వంసం చేసేవాడు: గా మారింది. అసురులు అధోలోకంలోకి వెళ్లిపోక తప్పలేదు. అప్పుడప్పుడూ ఎదురు తిరిగినప్పటికీ దానివల్ల ఫలితమేమీ లేకపోయింది. అసురుల నాగరికత అనే అస్థిపంజరాలనే పునాదిగా చేసుకుని ఇంద్రుడు తన సామ్రాజ్యాన్ని నిర్మించాడు. దాదాపు 300 సంవత్సరాలపాటు దేశంలో ఇంద్రుడి వంశంవారి పరిపాలనే కొనసాగింది.

"ఆ మూడు శతాబ్దాలకాలంలో మైదాన ప్రాంతాలు దేవతల ఆవేశాన్ని తగ్గించాయి. కళలూ, సంస్కృతీ మళ్లీ ఒకసారి తమ మునుపటి దశకి చేరుకున్నాయి. దేవతలు తమ భయంకరమైన స్వభావాన్ని కోల్పోసాగారు. వాళ్లుకూడా సుఖ సౌకర్యాలని కోరుకోసాగారు. అసురుల నగరాలంత గొప్పవి కాకపోయినా, పెద్ద పెద్ద నగరాలని నిర్మించారు. రెండవ ఇంద్రుడి పరిపాలనాకాలం చివరికి చేరేసరికి సమన్వయం ప్రారంభమైంది. అందరికన్నా ముఖ్యమైన అసురుల దేవుడు శివుణ్ణి, దేవతలు కూడా స్వీకరించారు. అసురజాతిలోని గొప్ప గురువు బ్రహ్మని కూడా దేవుడని వాళ్లు అంగీకరించారు. ఆ తరవాత వచ్చిన దేవతల రాజులు బలహీనులై విష్ణువు చేతిలో కీలుబొమ్మల్లా మిగిలారు. మూడవ ఇంద్రుడి సైన్యానికి

విష్ణువు ముఖ్యసైన్యాధిపతి. తొమ్మిదవ ఇంద్రుడి శాసనకాలం నాటికి దేశ పరిపాలన మొత్తం విష్ణు వంశం చేతుల్లోకి వెళ్లిపోయింది. ఇంద్రులు కేవలం నామమాత్రంగా రాజులుగా ఉండిపోయారు: అసురుల తెగల్లా శైవరాజుల్లాగ. వాళ్లు హిమాలయాల్లో ఉన్నత శిఖర ప్రాంతాల్లో, పదిమంది రాజుల పరిపాలన ప్రారంభమవటానికి చాలా ముందు, కైలాసంలో చిన్న చిన్న రాజులుగా ఉండేవారు.

"విష్ణు వంశం వాళ్లు ఇంద్రుడి పేరు చెప్పుకుని దాదాపు 700 సంవత్సరాలు పరిపాలించారు. ఇంద్రుడి పేరునీ, దేవతల సంస్కృతినీ వాళ్లు చక్కగా నిలబెట్టారు. సామాజిక వ్యవస్థని పరిరక్షించిన వాళ్లని బ్రాహ్మణులు కొనియాడారు. ఇంతలో కొన్ని విచిత్రమైన ఆలోచనలు కలగా పులగంగా కలిసిపోయాయి. జ్ఞానానికి నిలయమని అనుకున్న బ్రహ్మని సృష్టికర్త అని కీర్తించారు; విష్ణువుని వ్యవస్థకి రక్షకుడనీ, విచిత్రంగా సామ్రాజ్యాన్ని ధ్వంసం చేసిన ఇంద్రుణ్ణి వదిలేసి, దాన్ని నిర్మించిన శివుణ్ణి విలయకారుడనీ పొగిడారు. వాళ్లు ముగ్గురూ తమ ప్రాంతంలో దేవుళ్లకింద - త్రిమూర్తులుగా పేరుపొందారు. ఆ కుటుంబాలలో మొదటితరం వారిని దేవుళ్లకింద భావించి ఈనాటికీ దేవతలు ఆరాధిస్తున్నారు. మనం శివుడినీ, మొదటి బ్రహ్మనీ దేవుళ్లని అంగీకరిస్తాం. కానీ దేవతల సైన్యాధిపతీ, దేవతల రాజుకి కేవలం సేవకుడూ అయిన విష్ణువుని దేవుడిగా కొలవమని బ్రాహ్మణులు బలవంతపెడితే అంగీకరించటం మనకి కష్టమనిపించింది. విష్ణువుకి వ్యతిరేకంగా పోరాడటానికి అధీనులై జీవిస్తున్న అసురులు గొప్ప ప్రయత్నాలే చేశారు. హిరణ్యాక్షుడూ, హిరణ్య కశిపుడూ లాంటి కవలలూ, బలిచక్రవర్తీ వంటి గొప్ప వ్యక్తులు పాతకాలంనాటి సామ్రాజ్యాలకి దీటైన విశాలమైన సామ్రాజ్యాలని స్థాపించటంలో కృతకృత్యులయారు. కానీ ఆ తరువాతి కాలంలో, పది రాజ్యాలుగా విడిపోయిన అసుర సామ్రాజ్యంలాగే, దేవతల సామ్రాజ్యం కూడా చిన్నచిన్న రాజ్యాలుగా విడిపోయింది.

"ఒక సామ్రాజ్యం కూలిపోయి చిన్నచిన్న ప్రాంతాలుగా

తలెత్తినప్పుడు, ఒక కొత్త సామ్రాజ్యాన్నిస్థాపించేందుకు సమయం ఆసన్నమైందని తెలుస్తుంది. కిష్కింధలో వాలి లాంటి సంకరజాతులూ, సహ్య పర్వత ప్రాంతంలో కార్తవీర్యార్జునుడి లాంటి ఆదివాసులూ, దేవతల సామ్రాజ్యంలోంచి పెద్దపెద్ద రాజ్యాలని విడిగా స్థాపించుకోగలిగినప్పుడు, చరిత్ర చర్విత చర్వణం అయిందని మనకి తెలుస్తుంది. ఎంతో శక్తివంతమైనదైనప్పటికీ, విభజింపబడ్డ అసుర సామ్రాజ్యాన్ని ఇంద్రుడు తన చిన్న సైన్యంతో వశం చేసుకోగలిగాడు. ఆ ముఖ్యమైన యుద్ధంనుంచి మీరు గుణపాఠం నేర్చుకున్నారనే భావిస్తాను. మన ప్రజలు ఆ యుద్ధంలో సమస్తం కోల్పోయారు. ఇప్పుడు జరిగిన ఆ నష్టానికి సమాధానం చెప్పవలసిన తరుణం ఆసన్నమైంది.

"అంత శక్తిమంతమైన విషువంశం కూడా అంతర్యుద్ధాలతో బలహీనమై పోయిందనీ, సరయూనదీ తీరాన అయోధ్యా నగరం రాజధానిగా వున్న ఒక చిన్న రాజ్యాన్ని ఏలే ఒక సమూహం తప్ప చెప్పుకోదగ్గ రాజ్యాలేవీ లేవని గుర్తుంచుకోండి. అందుకని మనం గుర్రాలనీ, ఆయుధాలనీ సమకూర్చుకునే వరకూ సంఘర్షణ కొనసాగిద్దాం. ఆ తరవాత దేవతలకి చరిత్ర నేర్చిన పాఠాలని వాళ్లు మరిచిపోయారన్న విషయం తెలియచేద్దాం."

నేనిచ్చిన ఉపన్యాసం మాముందు గుమిగూడిన వారికి మరీ క్లిష్టంగా అనిపించినట్టుంది. వాళ్లకి సరళమైన చిన్న చిన్న ఆదేశాలు ఇస్తేనే సులభంగా ఆచరించగలరు అనుకున్నాను. సులభంగా జీర్ణం చేసుకోలేని చరిత్రపాఠాలు చెప్పి ప్రయోజనం లేదని అనిపించింది. అంత సుదీర్ఘమైన ఉపన్యాసం ఇచ్చినా ఎవరూ నాకు అడ్డు చెప్పకపోవటం, నేను చెప్పిన మాటలని ఖండించకపోవటం, ఎటువంటి ప్రశ్నలూ వెయ్యకపోవటం చూసి నాకు నిరాశ కలిగింది.

యోధులుగా శిక్షణపొంది సైనికులుగా కాబోయే ఆ సమూహానికి నేను భోజన విరామం ప్రకటించాను. నా తమ్ములతోనూ, దాయాదులతోనూ కలిసి ఒక మర్రిచెట్టుకింద కూర్చున్నాను. మాకు దగ్గర్లోనే నా ఉపన్యాసం విన్న యువకులు పచ్చికమైదానంలో

గుమిగూడి, సరదాగా గడుపుతూ, మోటు హాస్యోక్తులు చెప్పుకుంటున్నారు. మేం కొన్నాళ్లక్రితం అర్థాంతరంగా వదిలేసిన చర్చని మళ్లీ ప్రారంభించాం. మా పోరాటాన్ని ఎక్కణ్ణించి ప్రారంభించాలి?

8. మహారాజు

రావణుడు

సుమాలివెంట వస్తున్నప్పటినుంచీ ఆ వ్యక్తిని నేను గమనిస్తున్నాను. వాడిలో గమనించాల్సినంత గొప్ప విషయం ఏమీ లేదు. ఏ సైన్యంలోనైనా అవసరమైన తక్కువస్థాయి సైనికుడిలాంటివాడే వాడు, కానీ వాడిలాంటి వాళ్లని అందరూ త్వరగా, ఎంతమాత్రం కృతజ్ఞత చూపకుండా మరిచిపోతారు. వాడు ఎప్పుడూ నాకు దగ్గర అవాలని ప్రయత్నించేవాడు. నాకు ఏదో చెప్పాలన్న తహతహ వాడిలో కనబడేది. వాడిని పిలిచి, ఏంకావాలని అడిగాను. ఎన్నో వారాల క్రితమే ఆ పనిచేసి ఉండవలసింది, కానీ సైన్యాధికారులకీ, తక్కువ స్థాయి సైనికులకీ మధ్య దూరం ఉంచాలనేది నా అభిప్రాయం. మొదట్లో మేం ముగ్గురం అన్నదమ్ములం, మా సహచరులతో కలిసి బాగా తాగేవాళ్లం. కానీ అలాంటి సాన్నిహిత్యం చూపించటం క్రమేణా నాకు అసౌకర్యం కలిగించసాగింది.

కానీ త్వరలోనే మా తాతా, మేనమామా తమ సైన్యాలతో వచ్చి నాతో కలిశాక, నా సైనికుల సంఖ్య పెరిగింది. మేము వీధుల్లో తిరిగే అల్లరిమూకలా కాకుండా నిజమైన సైనికుల్లా ఉండాలని మా తాత సుమాలి నిర్ణయించాడు. మాకు ఒక దీర్ఘోప్రన్యాసం ఇచ్చాడు. అసురులకున్న బలహీనతల్లోకల్లా ఇదే పెద్ద బలహీనత - అదే పెద్దపెద్ద ఉపన్యాసాలు ఇచ్చే స్వభావం! సైన్యంలో క్రమశిక్షణ ఉండాలని ఆశించినట్టయితే అధికారక్రమం పాటించవలసి ఉంటుందని నాకు ఆయన బాగా నూరిపోశాడు. అలాటిది పాటించదలుచుకుంటే ముందు నేను దాన్ని సృష్టించాలి. నేను ఆ విద్యని త్వరగానే నేర్చుకోగలిగాను. అందరినీ చులకన భావంతో చూడటం మొదలుపెట్టాను, వాళ్లుకూడా మారుమాటాడకుండా నా వైఖరికి తలబగ్గారు.

ఆ నల్లటి యువకుడు నా దగ్గరకివచ్చి, గౌరవంగా వంగి, తినుబండారలని నాకు అందుబాటులో ఉంచాడు. నాకు వాడి ముఖం చూడాలని అనిపించలేదు. అలా దీక్షగా చూస్తే ఆ వర్గంవాళ్లు చూపించే అర్థంలేని అతివినయం, మర్యాదల వెనక వాళ్ల మనసుల్లో ఉన్న ద్వేషం కనబడిపోతుందని భయపడ్డాను. కాసేపు నా పక్కనే అలా నిలబడ్డాడు, నేను అతన్ని అసలు గమనించకపోవటం చూసి, మౌనంగా అక్కడినించి నిష్క్రమించాడు. అవతలివాళ్లు నన్ను గౌరవిస్తున్నారా లేదా అనే విషయాన్ని నేనెందుకు అంతగా పట్టించుకుంటాను? అసహ్యకరంగా కనబడే ఆ మనిషిని గురించి ఆలోచించటం మానేసి, నా సైన్యాన్ని సుస్థిరం చేసుకుని ఒక పద్ధతి ప్రకారం తయారుచేసుకోవటం మీద దృష్టి కేంద్రీకరించాను.

మేమందరం ఏకాభిప్రాయంతో పదిమంది అధికారులు ఉన్న ఒక సభని ఏర్పాటు చేసుకున్నాం. అందులో మా తాత సుమాలి, మేనమామలు ప్రహస్తుడు, మారీచుడూ, లంకకి తూర్పుదిక్కున ఉన్న ముత్యాలదీవికి ఒకప్పుడు అధిపతిగా ఉండిన జంబుమాలి, మేము ముగ్గురు సోదరులం, తరవాత బలిచక్రవర్తికి అంగరక్షకుడుగా పనిచేసిన రుద్రకుడు వున్నారు. బలిచక్రవర్తి మీద వామన విష్ణువు దాడి చేసినపుడు, భిక్షకుడి వేషంలో ప్రాణాలతో బైటపడ్డ ఒకే ఒక వ్యక్తి ఈ రుద్రకుడు. ఇంకా బలిచక్రవర్తి సైన్యంలో సరుకులు సరఫరా చెయ్యటం, అందరికీ అందేట్టు చూడటం అనే పనిని నిర్వహించిన ధూమ్రాక్షుడు, బలిచక్రవర్తి సైన్యానికి ముఖ్య సేనానాయకుడు అయిన వజ్రదంష్ట్రుడూ ఉన్నారు. ఇంకా కొంతమంది చిన్న అధికారులని చిన్న చిన్న సైనికదళాలకి అధిపతులుగా నియమించాం. నేను మౌనంగా ఉండటంవల్ల ముఖ్య సైన్యాధికారి పదవి నాకే దక్కింది. అలా ఆ పదవికి ఎంచుకోబడిన తరవాతే, నాకు అది లభించినందుకు ఎంత ఆనందంగానూ, గొప్ప ఉపశమనం లభించినట్లుగానూ అనిపించిందో, ఆ పదవిని నేను ఎంతగా కోరుకున్నానో తెలిసివచ్చింది. ప్రహస్తుడూ, వజ్రదంష్ట్రుడూ ఆందోళనకి గురవటం నేను గ్రహించాను, కానీ వాళ్లకీ,

ఇతరులకీ కూడా, ఆ పదవికి అర్హులైనవారు ఇంకెవరూ లేరన్న విషయం తెలుసు. ఆరేళ్లపాటు ఎటువంటి ఫలితాలనీ ఇవ్వని యుద్ధం చేస్తూ ఉంటే సైనికుల్లో ఆత్మవిశ్వాసం పుంజుకోదు. అందుకని వాళ్లు పెద్దమనుషుల్లా నా నాయకత్వానికి తలవంచి అంగీకరించారు.

ప్రతి నిర్ణయాన్నీ అధికసంఖ్యాకులు వెలిబుచ్చే అభిప్రాయాన్నిబట్టే తీసుకుంటా మనీ, నేను నామమాత్రంగానే ముఖ్యుడిగా ఉంటాననీ అందరూ అంగీకరించారు. దేవతలు ఏర్పాటు చేసుకున్నట్టు దానవులకి ఇంకా రాజకీయ కార్యనిర్వహణ గురించి పరిపక్వత సాధించిన పరిపాలనా విధానమేదీ ఏర్పడలేదు. ఈ విషయంలో మాత్రం నేను దేవతలని అనుకరించాలని అనుకున్నాను. వాళ్లకి స్పష్టమైన పాలనా విధానం ఉంది, అందులో రాజే అందరికన్నా సర్వోన్నతమైన అధికారి. దైవత్వం ఆయన చర్యల ద్వారా వెలువడుతుంది, ఈ భూమిమీద అతనే దేవుడు-భూసురుడు! తన ప్రజలకి ఏది మంచిదో ఆయనే నిర్ణయిస్తాడు. దీనివల్ల ఒక ప్రయోజనం ఉంది, నిర్ణయాలూ, వాటిని అమలు చెయ్యటం త్వరితగతిన జరుగుతాయి. నష్టం కూడా లేకపోలేదు, రాజు అయోగ్యుడైతే అతని నిర్ణయాలు సవ్యంగా ఉండవు. వాటిని త్వరగా అమలు చెయ్యటం వల్ల దేశానికి నష్టం వాటిల్లుతుంది. మా వాళ్లు యుద్ధ సమయంలో కూడా సభ నిర్ణయాలకోసం ఎదురుచూసూ కూర్చుంటే, దేవతలు మా దేశాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఏది ఏమైనా, ఈ మధ్య నేను దైవాంశగలవాడినని తరచు నాకు నేనే అబద్ధాలు చెప్పుకోవటంవల్ల, నా పక్కన నల్లగా లావుగా నిలబడి ఉన్నయువకుడికీ, నాకూ మధ్య నా అబద్ధాలు అడుగోడలా నిలిచాయి. నాకు ఏమీ పాలుపోక ఆ విషయం సుమాలితో చర్చించాలని అనుకున్నాను. ఒకవేళ ఈ నల్లటి వ్యక్తి గూఢచారి అయినా కావచ్చు. గద్ద కళ్లతో వాడు అన్నీ గమనిస్తున్నాడు. మా సభలు జరిగే సమయంలో వాడు కావాలని ఏదో ఒకపని కల్పించుకుని అక్కడే తచ్చాడటం నేను చూశాను.

నేను నా ఆలోచనలలో నిండా మునిగిపోయి కూర్చున్నాను. భవిష్యత్తులో లంకమీద మేము చెయ్యబోయే దాడి గురించి స్పష్టమైన ప్రణాళికని రూపొం దించేందుకు ప్రయత్నిస్తున్నా. అది సాధ్యం కావటం లేదు. నాలో ఒత్తిడి పెరిగిపోయి, దేన్నైనా బద్దలు కొట్టాలన్న ఆవేశం, గట్టిగా అరవాలన్న కోరికా కలిగాయి. అలాగన్నానా మనసులో స్పష్టమైన ఆలోచనలు వస్తాయని ఆశించాను. క్షణికావేశంలో లంకని మా సవతి అన్ననుంచి వశం చేసుకోవాలని అన్నాను. కానీ ఇప్పుడు అలా అనటం నేను చేసిన పొరపాటని అర్థమవుతోంది.

"అయ్యా, నేను మీతో మాట్లాడవచ్చా?" అన్నాడు ఆ యువకుడు. నేను విసుగ్గా వాడివైపు చూశాను. నల్లగా, లావుగా ఉన్న ఆ వ్యక్తి తన చూపులతో నన్ను కొన్నాళ్లుగా వెంటాడుతున్నాడు.

"నీకేం కావాలి? నీకు ఇంకేం పని లేదా?" అంత కఠినంగా మాట్లాడినందుకు నాకే ఆశ్చర్యం వేసింది.

వాడు అలాగే నిలబడి సూటిగా నా కళ్లలోకి చూశాడు. నేను వాడికన్నా బారెడు పొడుగున్నాను, కానీ వాడు కన్నార్పకుండా నాకేసి చూశాడు. వాడి కళ్ళకి బెదిరింపు కాని భయంకాని కనబడలేదు. వాడు కళ్లు దించుకునే వరకూ వేచి చూద్దామనుకున్నాను. భయంతో తన కాలివేళ్లవైపు చూపులని మరలుస్తాడని అనుకున్నాను. కానీ నా ముందు నిలబడిన ఆ వ్యక్తిలో ఏ కోశానా భయం అనేది కనబడలేదు నాకు.

వాడిలో ఏదో ఎక్కుపెట్టినట్టు బిగుసుకుని ఉందనీ, ఏ క్షణాన్నైనా అది బైటికి దూసుకు రాగలదనీ అనిపించింది. తన భావోద్రేకాలని అణచుకుని, చుట్టూ ఉన్న వాతావరణంతో మమేకమై పోగల వ్యక్తిలా కనిపించాడు వాడు. గడ్డిలో దాగి ఉన్న నాగుపాములా ప్రాణాంతకమైన విషం కక్కుతూ, నిశ్శబ్దంగా, నిర్ణయగా, ఆవేశంతో కాటు వెయ్యగల వాడిలా కనిపించాడు. నావైపు తదేకంగా చూస్తున్న వాడి కళ్లు గాజుగోళాల్లా ఉన్నాయి. హఠాత్తుగా నాకు భయం వేసింది.

నా చేతులు కత్తిపిడిని గట్టిగా పట్టుకున్నాయి. ఈ నాగుపాము హఠాత్తుగా దాడిచేస్తే కాచుకునేందుకు సిద్ధమయాను. ఎటువంటి హెచ్చరికా లేకుండా నా కాళ్లమీద పడిపోయి వాడు నన్ను దిగ్భ్రాంతికి గురిచేశాడు. నాకు కోపమూ వచ్చింది, ఉపశమనమూ కలిగింది. వాడు దాసోహం అంటూ నా అధికారం ముందు తలవంచినందుకు, ఆ అసురుల స్వభావానికి కోపం వచ్చింది. ఉపశమనం ఎందుకంటే వాడికి ఉన్న ఆదిమ శక్తితో పోరాడటం నాకు ఇష్టం లేకపోయింది. ఆ మనిషిలో ఏదో మొరటుతనం, అపరిపక్వత, అనుభవలేమి కనిపించాయి. వాడు ప్రకృతి సహజమైన మూలశక్తి, ఈ ప్రపంచానికి ఆదర్శంగా ఉండదగినవాడు. వాడు సాధారణ వ్యక్తి అవటమే వాడిలోని ప్రత్యేకత.

"నన్ను నమ్మండి, ప్రభూ! మహారాజా, ఇంతవరకూ ఎవరూ చెయ్యనంతగా నేను మీకు సేవచేస్తాను. మీకోసం నా ప్రాణాలు అర్పిస్తాను. నన్ను మీ సేవకుడిగా చేసుకోండి. మీరే మమ్మల్ని ఉద్ధరించగలరు, అని నాకు తెలుసు. మాకోసం దేవుడు పంపిన రాజు మీరు. దేవతల పట్టునించి అసురులని విడిపించేందుకు వచ్చిన మహనీయులు," అని ఉన్నట్టుండి వాడు వెక్కివెక్కి ఏడవసాగాడు. ఆ వెక్కిళ్లతో నిలువెల్లా వణికిపోయాడు. అలా అకస్మాత్తుగా వాడు భావోద్రేకానికి గురవటం చూసి నాకు ఏం చెయ్యాలో పాలుపోలేదు. వాడు నా కాళ్లు గట్టిగా పట్టుకున్నాడు. వాడికి ఏం చెప్పాలో, ఎలాంటి ప్రతిస్పందన తెలియజేయాలో నాకు తెలీలేదు. నేను ఎదురు చూసినది ఇది కాదు. ఇంతలో ప్రహస్తుడు మావైపు పరిగెత్తుకు రావటం కనిపించింది. అతని చేతిలో కత్తి ఉంది. చిన్న చిటికె వేసి అతన్ని ఆగమన్నాను. కానీ నేను వేసిన ఆ చిటికెకి అతను వెంటనే ఆగిపోవటం చూసి ఆశ్చర్యపోయాను.

ఎంత ఆశ్చర్యం! ఇంకా ఎక్కువమంది ఇలా నా కాళ్లమీద పడటం ప్రారంభిస్తే అది నాకు ఆనందాన్నివ్వటమే కాకుండా, అలా పడమని నేనే అడిగే పరిస్థితి రావచ్చేమో. మొదట్లో కలిగిన జాలి మాయమై, నా కాళ్లమీద అసహాయంగా పడి ఉన్న ఆ జీవిమీద ప్రేమా, ద్వేషం

కలగలిసిన భావమేదో నా మనసులో తలెత్తింది. వాడు పూర్తిగా నాకు లొంగిపోయాడని అనిపించింది. నేను వాడిని కాలితో తన్నినా, ఈడ్చి పారేసినా, చివరికి వాడి తల తీసేసినా ఎవరూ వేలెత్తి చూపించరు. నాకు హడలు పుట్టుకొచ్చింది. నా గతి ఏమవుతుంది? ఇటువంటి అధికారం బరువు బాధ్యతలతో కూడుకుని ఉంటుంది. ఒక రాజు స్థానంలో ప్రజల కష్టాలన్నీ వింటూ వాటికి పరిష్కారాలు వెతకవలసిన బాధ్యత నాది. నేనాపని చేస్తాను. ఈ లోకంలోకల్లా దయామయుడైన రాజుగా పేరు సంపాదిస్తాను.

నేను వాడిని నా చేతులతో లేవనెత్తి వాడివైపు తదేకంగా చూశాను. వాడి కళ్లు ఎర్రగా ఉన్నాయి. వాడి భావాల్లో నిజాయితీ ఉందని అనుకున్నాను.

"నీకోసం నన్ను ఏం సహాయం చెయ్యమంటావు?" అని గొంతులో ఎంతో దయాభావం ఒలికిస్తూ అడిగాను, ఒక రాజు అంత కీచుగా మాట్లాడవచ్చా అన్న అనుమానంతో.

"మహాప్రభూ! మీరు అసురులకి రాజు అవటం గురించి మేం చర్చించుకున్నాం. వీలైనంత త్వరగా మీకు పట్టంకట్టాలని అనుకుంటున్నాం. బలిచక్రవర్తికి సరైన వారసుడు మీరేనని సైనికులందరూ అభిప్రాయపడ్డారు. మీరే మాకు నాయకత్వం వహించాలన్నది మా కోరిక. మీ విజయంకోసమే జీవించి ఉండాలనీ, ప్రాణాలు అర్పించాలనీ కోరుకునే సైనికులందరికీ ప్రతినిధిగా నేను మీ దగ్గరకి వచ్చాను," అన్నాడు వాడు.

"నేను మీ ముఖ్య సేనాధిపతిననీ, నాలాగే నువ్వు కూడా మన లక్ష్యసాధనకోసం బతుకుతున్నావనీ, ప్రాణాలు అర్పించేందుకు వెనకాడకూడదనీ నీకు తెలుసు కదా!" అన్నాను కరకుగా, కానీ నా ఉత్సాహాన్ని మాత్రం దాచుకోలేకపోయాను. సామాన్య సైనికులు కూడా నేనే వాళ్లకి రాజు కావాలని అనుకుంటున్నారు. సభ నాకు వయసు చాలదనీ, అటువంటి బాధ్యతాయుతమైన పదవిని చేపట్టేందుకు నా

దూకుడు స్వభావం తగినది కాదనీ అనుకోవచ్చు, కానీ నా సైనికులు నన్నే నాయకుడు కావాలని అనుకోవటం నాకు ఎక్కువ ముఖ్యమని అనిపించింది. సభలో నన్ను నేను బలవంతంగా నాయకుడిగా ప్రకటించినందుకు ఆదుర్గా పడసాగాను.

ఈ యువకుడు ఇప్పుడు నన్ను మామూలుగా 'అయ్యా అనకుండా 'రాజా' అంటున్నాడు. అసురసేనలో సైనికులు తమ ఉన్నతాధికారిని అలాగే పిలుస్తారు. నాకు సంతోషం వేసింది కానీ ప్రహస్తుడు మొహం చిట్టించటం కనిపించింది, దాన్ని నేను గుర్తుపెట్టుకున్నాను.

"మహాప్రభూ! మీరే మాకు రాజుగా ఉండాలని కోరుకుంటున్నాం. సభకోసం మేం చాలాసార్లు పోరాటాలు చేశాం. ప్రతిసారీ మేం ఓడిపోవటానికి కారణం సభ్యుల్లో ఎవరో ఒకరు రాజద్రోహిగా మారటమే. దేవతల రాజులాంటి రాజు మాకు కావాలి, మమ్మల్ని పరిపాలించే రాజు, లంక నించి గాంధారదేశం దాకా వున్న సీమనంతా పరిపాలించగల రాజు. మహాబలి చక్రవర్తి పరిపాలనకి దీటైన విధంగా పరిపాలించగల చక్రవర్తి మాకు కావాలి. ప్రభూ! ఈ గొప్ప కల తప్ప ఇంకేదీ మమ్మల్ని ప్రేరేపించలేదు. మీరు నిర్మించబోయే గొప్ప అసుర సామ్రాజ్యంకోసం మేం సంతోషంగా ప్రాణాలు అర్పిస్తాం."

"ఈ విషయాన్ని మేం సభలో చర్చించవలసి ఉంటుంది. నీ పేరేమిటి?"

"భద్రుడు, మహాప్రభూ! పూర్ణానదీ తీరాన ఉన్న ఒక గ్రామం మాది. మీ నిర్ణయం కోసం ఎదురుచూస్తూ ఉంటాం, ప్రభూ! నేను అనుచితంగా ప్రవర్తించి ఉంటే దయచేసి మన్నించండి, కానీ మాకు వేరే మార్గం కనిపించలేదు," రాజుకి ఇవ్వవలసిన మర్యాదపాటిస్తూ వాడు వెన్ను తిప్పకుండా, వెనక్కి, నడిచాడు.

ప్రహస్తుడు వచ్చి తన చేతులని నా భుజం మీద వేసి, "సభని పిలుద్దాం," అన్నాడు. అతని గొంతు కర్కశంగా పలికింది, కానీ నాకు అదేమీ పట్టలేదు. సైనికుల శిబిరాలలోంచి "మహారాజు రావణుడు

వర్ధిల్లాలి!" అనే నినాదాలు నా చెవులకి ఇంపుగా తోచాయి.

"సభని రద్దు చేస్తున్నాను," అన్నాను. ప్రహస్తుడి ముఖంలో దిగ్భ్రాంతి చూసి నవ్వుతూ, "మీరే నాకు ముఖ్యమంత్రి," అన్నాను.

ప్రహస్తుడిని ఆలోచించుకునేందుకు అక్కడే వదిలేసి, నేను వెళ్లిపోయాను. నా మనసులో ఏమూలో నన్ను వీళ్లు ఉపయోగించుకుంటున్నారు అన్న భావం మెదిలింది. శిబిరాలవైపు దృష్టి సారించాను. తన తోటి సైనికులు సరదాగా వేడుక చేసుకుంటూ ఉంటే, భద్రుడు మాత్రం ఒంటరిగా నిలబడి ఉండటం కనిపించింది. వాడి పెదవుల అంచుల్లో విజయం సాధించిన భావం చిరునవ్వుగా లీలగా మెరిసింది. మా ఇద్దరి కళ్లూ కలుసుకోగానే ఆ చిరునవ్వు మాయమైంది. వాడు వంగి నమస్కరించాడు. ఆ శిబిరం పక్కనుంచి నడిచి వెళ్లాను, నా నడకలో రాజసం ఉట్టిపడుతోందని అనుకున్నాను. సైనికులు నాకు జయజయ ధ్వానాలు పలుకుతూంటే వాళ్ల మధ్యనించి నా శిబిరంవైపు నడిచాను. పోరాటం మొదలుపెట్టే ముందు మా అమ్మనీ, చెల్లినీ ఇక్కడికి తీసుకురావాలి. గాఢ నిద్రలోకి జారిపోయే ముందు నా మనసులోకి వచ్చిన ఆలోచన అదే.

9. ప్రియమైన మారీచుడు

రావణుడు

వాళ్లు మా మేనమామ మారీచుడివెంట రావటం చూశాను. నా చెల్లి పెద్దదయింది; పెద్ద అందగత్తె కాదు కాని తనలో ఉత్సాహం ఉరకలేస్తోంది. నేను నా మంత్రులతో సభ తీరి ఉన్నాను. ఇక అది ప్రజాస్వామ్య చర్చావేదిక రూపాన్ని కోల్పోయింది, అయినా వాళ్ల అభిప్రాయాలు కూడా లెక్కలోకి తీసుకుంటామన్న విషయాన్ని నేను స్పష్టం చేశాను. అదంతా కేవలం నాటకమేననీ, నా మాటే చెల్లుబడి అవుతుందనీ అందరికీ తెలుసు. అయినప్పటికీ మంచి వాగ్వివాదమూ, చర్చా చెయ్యాలన్న అసురుల కోరిక మాత్రం తీరింది.

సభ ముగిసింది, అందరూ లేచి నిలబడ్డారు. వయసు మళ్లిన నా మేనమామ మారీచుడు, చిరునవ్వు నవ్వుతూ మమ్మల్ని చూసి చేతులు ఊపసాగాడు. ఆయన కవలపిల్లలు తప్పటడుగులు వేస్తూ ఆయన వెనకే వస్తున్నారు. ఇప్పటికీ అందంగా ఉన్న ఆయన భార్య ఆ పిల్లలవెంట ఉంది. వాళ్లవెనక మా అమ్మ, చెల్లీ ఉన్నారు. ముఖ్యమైన మా సభ ఎప్పుడు ముగుస్తుందా, ఎప్పుడు మా దగ్గరకి వద్దామా అని వాళ్లందరూ ఎదురుచూస్తున్నారు- తప్పిపోయిన కుక్క పిల్ల తల్లి కనబడగానే పరిగెత్తినట్టు వీభీషణుడు సంతోషంతో కేరింతలు కొడుతూ వాళ్ల దగ్గరికి పరిగెత్తాడు. నాకు కూడా పరిగెత్తి వెళ్లి మా అమ్మనీ, చెల్లినీ వాటేసుకోవాలని అనిపించింది, కానీ రాజులు అలా ప్రవర్తించవచ్చో, కూడదో తేల్చుకోలేక ఆగిపోయాను. కుంభ కర్ణుడు విభీషణుడి వెనకాలే పరిగెత్తాడు. కవలలు వాళ్ల దగ్గరికి పరిగెత్తుకొచ్చారు. ఆ పిల్లలు ఆనందంతో అరిచే అరుపులు అడవిలో దట్టమైన చెట్లమీద ఉన్న పక్షులని భయపెట్టాయి. రాజులా నడవాలని ప్రయత్నిస్తూ ముందుకి నడిచాను. పొడవుగా, హుందాగా ఉండే ప్రహస్తుడూ, ఎప్పుడూ ముఖం

చిట్లించుకుని ఉండే సుమాలీ నా వెనకాలే వచ్చారు.

"దారిలో ఏమైనా సమస్యలు ఎదుర్కోవలసి వచ్చిందా?" అన్నాడు ప్రహస్తుడు. అతను అధిక ప్రసంగం చెయ్యకుండా సూటిగా మాట్లాడే రకం.

"వరుణుడు తన ఓడలతో అడ్డుకున్నాడు, కానీ చిన్న కానుక ఇచ్చి మేం తప్పించుకున్నాం."

"సులక్షణ మెడలోని ముత్యాల హారం ఆ సముద్రపు దొంగలకి ఇచ్చేశాడు. ఆమె దాన్ని సంపాదించుకునేందుకు పాపం నేతగాళ్లతో ఏడేళ్లు కష్టపడి పనిచేసింది," మా అమ్మ గొంతు చాలా ఆప్యాయంగా పలికింది. సముద్రపు దొంగలకి ముత్యాలహారాన్ని ఇవ్వటం అంత ముఖ్యమైన విషయం ఏమీ కాదన్నట్టు మారీచుడు భుజాలు ఎగరేశాడు. నేనాయన పాదాలకి నమస్కరించి, ఆయన్ని కౌగిలించుకున్నాను.

"అయితే, నువ్వు రాజయావన్నమాట?" అంటూ మా మేనమామ నా వీపు గట్టిగా చరిచాడు. పరీక్షలో చక్కటి సమాధానాలు చెప్పి విజయం సాధించిన చిన్నపిల్లవాడిలా నేను పళ్లికిలిస్తూ నిలబడ్డాను.

"ఇప్పుడిక నీకోసం ఒక రాజ్యాన్ని వెతకాలి."

సైనికులు నవ్వారు, నా ముఖంమీది చిరునవ్వుని చెదరనీయకుండా ఉండటానికి కష్టపడాల్సి వచ్చింది. ఆయన హాస్యం ఎంత గాయపరచినా, ఆ ముసలాయన మీద నాకు ఎనలేని ప్రేమ. మేము యుక్తవయస్కులుగా ఉండగా మా మేనమామా, ఆయన భార్యా మా పూరి గుడిసెకి తమ ఇద్దరు చంటిపిల్లలతో రావటం నాకింకా స్పష్టంగా గుర్తుంది. అప్పుడు భయంకరమైన గాలీ వానా వస్తోంది. దాని తాకిడికి మా పూరిపాక ఎగిరిపోకుండా ఉండాలని మేము శివుణ్ణి శ్రద్ధా భక్తులతో ప్రార్థిస్తున్నాం. వచ్చినవాళ్లు బాగా డస్సిపోయి ఉన్నారు. మా మేనమామ బట్టలు బాగా చిరిగిపోయి ఉన్నాయి, తలకి కట్టుకట్టుకుని, ఒక చేతికీ మెడకీ కలిపి గుడ్డకట్టుకుని ఉన్నాడు, చెయ్యి

విరిగిపోయినట్టుంది. ఆయన భార్య మరుక్షణం కిందపడి ప్రాణాలు పోగొట్టుకునేంత నీరసంగా ఉన్నా ఆమె ముఖాన చిరునవ్వు అలాగే ఉంది. వాళ్లిద్దరూ చంటిపిల్లల్ని ఎత్తుకుని ఉన్నారు. అవతలివ్యక్తి ఏమీ చెప్పకుండానే గ్రహించే స్వభావం మా అమ్మది. అలసిపోయిన వాళ్ల చేతుల్లోంచి పసివాళ్లనిద్దర్నీ ఆవిడ తీసుకుంది. మాకున్న కలోగంజో మేం వాళ్లతో పంచుకున్నాం ఆ రాత్రి వాళ్లు ఆదమరిచి నిద్రపోయారు.

చంటిపిల్లలిద్దరూ ఏడ్చేందుకు కూడా ఓపిక లేనంత బలహీనంగా ఉన్నారు. కానీ మా అమ్మ వాళ్ల ఆకలి తీర్చేందుకు ఏం చెయ్యాలా అని ఆందోళన పడటం నాకు గుర్తుంది. మా అత్త పిల్లలని కనే వయసు దాటిపోయింది. ఆ పిల్లలిద్దరూ వాళ్ల పెంపుడు పిల్లలని మాకు అర్థమైంది. మా మేనమామ తన రాజ్యాన్ని కోల్పోయిన తరవాత వాళ్లు పేదరికాన్ని అనుభవించసాగారు, అయినా వాళ్లవి దయార్ద్ర హృదయాలు, కష్టాల్లో ఉన్నవారికి సాయం చెయ్యటం వాళ్ల స్వభావం. మా ఊళ్లో ఆ పిల్లలకి కాసినిపాలు ఇచ్చేంత జాలిగల మనుషులు మాకు ఎవరూ కనిపించలేదు. మా ఇరుగుపొరుగు వారికి సొంత ఆవుని ఉంచుకునేంత స్థోమత లేదు, అందరూ నిరుపేదలే. పాలుతాగటం అనేది వాళ్లకి అపురూపం. ఎప్పటిలాగే కుంభకర్ణుడికే ఒక ఉపాయం తట్టింది. ఆవులున్న ఒకే ఒక వ్యక్తి దగ్గర పాలు దొంగిలించాలని అనుకున్నాం, నిజానికి అతని దగ్గర వందలకొద్దీ ఆవులు ఉన్నాయి. అది కష్టమే కాని సాధ్యమైన పనే. ఆ పని చెయ్యటంలో ఉన్నప్రమాదం మా సాహసాన్ని గొప్ప ఉత్కంఠభరితం చేసింది. విభీషణుడు వెనకాడాడు, కానీ వద్దంటే మేము పిరికివాడని అంటామని వాడు ఏమీ అనలేదు. కానీ వాడు పిరికివాడు అన్నదే నిజం. మేము కంచెదాటి, కుబేరుడి ఆవరణలోకి దూకినపుడు తను బైట కాపలాకాసి, ఎవరైనా అటుగా వస్తే మమ్మల్ని హెచ్చరిస్తానని అన్నాడు. అంతా కటిక చీకటి, ఆ చీకట్లో తడుముకుంటూ ఒక ఆవుకోసం వెతికాం. మాలో ఎవరికీ పాలుపిండటం రాదు. ఇది పనికిమాలిన ఉపాయంలా తోచి, బైటపడటానికి నిశ్చయించాం. బైట ఎవరిదో దగ్గు వినిపించేసరికి మా

పైప్రాణాలు పైనేపోయాయి. చిన్నగా ఎవరో ఈలవెయ్యటం విని గాభరాపడ్డాం. విభీషణుడే ఈలవేసి ఎవరో వస్తున్నారని మమ్మల్ని హెచ్చరించాడు. పరుగు లంకించుకున్నాం, కానీ ఎటుపోవాలో అర్థంకాలేదు. ఆవులు మేల్కొని "అంబా" అని అరవసాగాయి. కాగడాలు వెలిగాయి. ఎవరో తిన్నగా పశువులశాల వైపే వస్తున్నారు. ఎలాగో బైటపడ్డాం, కానీ రాజభటులకి చిక్కిపోయాం. మేము పోరాడి ఇద్దరు ముగ్గుర్ని పడదోశాం, కానీ మరుక్షణం పట్టుపడిపోయాం. మమ్మల్ని కట్టేసి కొట్టటం ప్రారంభించారు. గదలతో మోదారు; కుంభకర్ణుడి పళ్లు ఊడగొట్టారు; కాగడాలతో మా శరీరాలని కాల్చారు. కాసేపు హుందాగా మౌనంగా ఆ చిత్రహింసని భరించాక, మేం గావుకేకలు పెట్టసాగాం. తెల్లవారేదాకా వాళ్లు మమ్మల్ని అలా కొడుతూనే ఉన్నారు.

నాకు స్పృహ వచ్చేసరికి, నా ముఖం మీద రక్తం ఎండిపోయి ఉంది, నా చర్మం మీది అణువణువూ నొప్పితో బాధపెట్టసాగింది. కుంభకర్ణుడు నాకన్నా ముందే స్పృహలోకి వచ్చి, కదుము కట్టి వాచిపోయిన కళ్లతో నాకేసే చూస్తూ కనిపించాడు. వాడి ముఖం పూర్తిగా ధ్వంసమైంది. ముక్కూ, పళ్లూ విరిగిపోయాయి, పెదవులు చిట్లిపోయాయి. వాడు నాకు కన్ను మలిపి, చిరునవ్వు నవ్వాడు. ఆ క్షణంలో వాడిమీద నాకు ఉప్పొంగిన ప్రేమ ఈ లోకంలో ఇంకెవరిమీదా కలగలేదు. ఏదో ఒక రోజు మా ఇద్దరిలో ఎవరో ఒకరం మరొకరి కోసం ప్రాణాలు అర్పిస్తామని నాకు రూఢిగా అనిపించింది. నేను కూడా వాడిని చూసి చిరునవ్వు నవ్వాను. పశువుల శాలలోని స్తంభాలకి మమ్మల్ని కట్టేసి, అందరూ వెళ్లిపోయారు. విభీషణుడు ఏమయాడా అన్న అనుమానం వచ్చింది. గాఢంగా ప్రేమించుకునే ఇద్దరు వ్యక్తులు మాటలు లేకుండానే ఆలోచనలని పంచుకోగలరు, కుంభకర్ణుడి ముఖంలో కూడా విభీషణుడి గురించి నేను పడుతున్న ఆందోళన కనిపించింది. మేము హడిలిపోయాం! విభీషణుడిని కూడా మాలాగే స్తంభానికి కట్టి కొట్టారా అని మెడలుచాచి మరీ చూడటానికి ప్రయత్నించాం. కానీ వాడు ఎక్కడా కనిపించక

పోయేసరికి, భటులు వాడిని చావగొట్టి పాతిపెట్టి ఉంటారన్న నిర్ధారణకి వచ్చాం. లేక వాడు వెళ్లి అమ్మకి గాని, ఊరి పెద్దలకి గాని చెప్పి, మమ్మల్ని విడిచిపెట్టమని కుబేరుడి దగ్గరకి వెళ్లి బతిమాలమని అడిగి ఉంటాడా? అని కూడా అనిపించింది.

మేము ఇంకా చిన్నవాళ్లం అయివుండటం చేత పెద్ద వాళ్లకి వేసే శిక్షలు – కారాగారంలో పెట్టటం, చేతులు నరికెయ్యటం లాంటివి - మాకు వెయ్యలేదు. కానీ కుబేరుడి నూనె గానుగల దగ్గరో, పొలాలలోనో కొన్ని నెలలపాటు బానిసలుగా పనిచెయ్యవలసిన కఠిన శిక్ష మాకు వెయ్యవచ్చు. లక్షాధిపతి కుబేరుడికి ఇది లాభసాటి బేరంగా తోచింది. ఇలాంటి శిక్ష వల్ల అతని ఖజానాలోని డబ్బు ఖర్చు పెట్టవలసిన అవసరం ఉండదు. అతను సగం గంధర్వుడూ, సగం బ్రాహ్మణుడూ, అసురుడు కాడు, అయినా తను అన్ని అసుర నియమాలనీ పాటించేవాడు - స్థానికుల మతంలోనూ, నమ్మకాల్లోనూ జోక్యం చేసుకోకుండా ఉండటం అని అంటాడు వాటిని అతను. దానివల్ల వర్తకం, వాణిజ్యం మీద అతను దృష్టి కేంద్రీకరించటం సాధ్యం అయేది.

కుంభకర్ణుడు నిశ్శబ్దంగా శూన్యంలోకి చూస్తూ విభీషణుడు జీవించి ఉండాలని ప్రార్థించటం కనబడింది నాకు. అతని బుగ్గలమీది నించి కన్నీళ్లు కారిపోతున్నాయి, నేనది గమనించానని తెలిసినా వాడు ముఖం మరోవైపుకి తిప్పకోలేదు. నా కళ్లు కూడా కన్నీళ్లతో నిండాయి. ఒక వయసు మళ్లిన కాపాలాదారు వచ్చి మా కట్లు విప్పాడు. వెంటనే కుంభకర్ణుడు నేలమీద కూలిపోయాడు. ఆ కాపలాదారు వాడిని మొరటుగా లేవదీసి ఎవరైనా సాయం చేసేందుకు రమ్మని పిలిచాడు. నాకు అడుగుతీసి అడుగు వెయ్యటమే కష్టమనిపించింది. ఇద్దరు కాపలాదారులు కుంభకర్ణుడిని అప్పుడే వేటాడిన అడవిజంతువులా వెదురుబొంగుకి కట్టి మోశారు. వర్షాకాలం మిట్ట మధ్యాహ్నం కావస్తోంది. గాలి వేడిగా, తేమతో నిండి ఉంది. ఎర్రటి బురదనేల మబ్బుల చాటు నుంచి తొంగిచూసే సూర్యుడి వేడికి కొన్ని గంటలపాటు ఎండి పెచ్చులు కడుతోంది.

ధన దేవత, న్యాయాధిపతి అయిన కుబేరుడు తన సింహాసనం మీద కూర్చుని తాళపత్రాల మీద రాజముద్ర వేసూ - వర్తకానికి సంబంధించిన మార్పుల గురించీ, ఓడలలో సామాన్లని చేరవేసేందుకు అయే ఖర్చుల గురించీ, మిరియాల ధర గురించీ, ఏలకుల బరువుకి సరితూగే బంగారం గురించీ, వాటిని దీవిలోని ఏఏ రేవులకి, చేరవేసి, ఏ అధికారుల దగ్గరికి తీసుకువెళ్లాలి? ఆ తరవాత వేగంగా పరిగెత్తే అరబ్బు గుర్రాల మీద వార్తాహరులని వెనక్కి తన దగ్గరకి ఎలా పంపించాలి? అనే విషయాల గురించి - ఆదేశాలు ఇవ్వటంలో మునిగి ఉన్నాడు. ఇంకొక పక్క కొందరు నేరస్తులు, ధనదేవత తమకి అందించబోయే ఉపదేశం కోసం, చెయ్యబోయే న్యాయం కోసం వేచి ఉన్నారు. కానీ వర్తకానికీ, వ్యాపారానికీ పెద్ద పీట వేసిన ఆ ప్రపంచంలో మిగతావి అన్నీ అప్రధానమైనవే.

కుంభకర్ణుడు స్పృహ కోల్పోయాడని గమనించి, నాకూ అదే జరుగుతుందేమోనని భయపడ్డాను. ధనదేవత రాజభవనం ప్రాంగణంలోకి ప్రవేశించి నందుకు మాకు ఎటువంటి శిక్ష పడుతుందో వినాలని అనుకున్నాను. మా ఎదురుచూపు ఎంతకీ ముగిసేలాగ కనిపించలేదు. నా జీవితంలో మొట్టమొదటిసారి నా మృత్యువు గురించి ఆలోచన వచ్చింది. మృత్యువు గురించి ఆలోచించేందుకు నాది మరీ చిన్న వయసు, కానీ నా శరీరంలో ప్రతి అంగుళం నొప్పితో బాధ పడుతూంటే చనిపోవటం గురించి ఆలోచనలు చాలా సులభంగా మనసులో చోటు చేసుకున్నాయి. సరిగ్గా అప్పుడే అక్కడ ఉన్న గుంపులో మా మేనమామ నాకు కనిపించాడు. న్యాయం ఎప్పుడు చెబుతారా అని ఆయన ఆత్రుత పడుతున్నాడు. మా ఇద్దరి కళ్ళూ కలుసుకున్నాయి, వెంటనే ఆయన అందంగా నవ్వాడు. ఆ నవ్వులోని ఆప్యాయత నా నొప్పిని మరిపించింది. ఆయన ముందరి పళ్లు కొన్ని ఊడిపోయాయి, అయినా ఆ నవ్వులో నాకు ఆయనలోని నిజాయితీ కనిపించింది. ఆయన చాలా ఆందోళనలో ఉన్నట్టు కనిపించాడు, కానీ మరోపక్క ఆయన మాతో ఉంటే మాకు ఎటువంటి చెడూ జరగదని కూడా అనిపించింది.

"తరవాత ఎవరు?" అంటూ సింహాసనం పక్కనే నిలబడ్డ భటుడు మొరిగినట్టు అరిచాడు. ఈ లోపల కుబేరుడు వ్యాపారానికి సంబంధించిన పత్రాలేవో చూసు కుంటున్నాడు. అతను సమయాన్ని చాలా సమర్థంగా ఉపయోగించుకుంటాడు. కొందరు భటులు మమ్మల్ని ముందుకి నెట్టారు. "రాజభవనంలోని పశువుల శాలలోకి అనుమతి లేకుండా జొరబడి ఆవులని ఎత్తుకుపోవటానికి ప్రయత్నించారన్న నేరారోపణ వీళ్లమీద ఉంది," అంటూ రక్షక శాఖ అధికారి కరుకుగా అన్నాడు.

"మేము నేరం చెయ్యలేదు," అని గట్టిగా అరవాలనిపించింది నాకు, కానీ గొంతులోని చిన్న పిల్లవాడు కీచుగా అరిచిన అరుపు మాత్రమే బైటికి వచ్చింది. అకస్మాత్తుగా ఆ స్థానంలో నిశ్శబ్దం అలుముకుంది. రాజుగారు ఉండగా సభలో మాట్లాడే సాహసం ఇంతవరకూ ఎవరూ చేసి ఉండలేదు. కుబేరుడు ఇంకా తాళపత్రాలు చూడటంలోనే మునిగిపోయి ఉన్నాడు. సభనిశ్శబ్దంగా అయిపోయిందని గమనించటానికి అతనికి కొన్ని క్షణాలు పట్టింది. కావాలనే పత్రాలని పూర్తిగా చదవటం ముగించి పక్కన పెట్టాడు. ఆ తరవాతే తలెత్తి చూశాడు. అతని ముఖంలో చిరునవ్వు చోటు చేసుకుంది. అసలే అందగాడు, నవ్వితే ఇంకా అందంగా కనిపించాడు.

కానీ అతని కదలికలు సాలీడు కదలికల్లా చూసేవాళ్ల ఒళ్లు గగుర్పొడిచేలా ఉన్నాయి. "ఓహోహో! నా సవతి తమ్ములు సభకి విచ్చేశారే! నాకు ఎంతో గర్వంగా ఉంది. నన్ను అడిగి ఉంటే మీకు కొన్ని ఆవులని బహూకరించి ఉండేవాడిని. అలా కాకుండా మీరు దొంగిలించేందుకు ప్రయత్నించారు. అది సహజమేలే, మీ అమ్మ పోలికలు మీకు కూడా వచ్చాయని తెలుసూనే ఉంది. అయితే మీకు ఎలాంటి శిక్ష వెయ్యమంటారు? చేతులు నరికెయ్యమంటారా? ముక్కులు తెగోయమంటారా? లేక మీ బుగ్గల మీద "వీళ్లు దొంగలు' అని వాతలు పెట్టించమంటారా? బంధుప్రీతి చూపించానని నామీద ఎవరూ నింద మోపకూడదు కదా!" అన్నాడు.

"అయ్యా నాదొక్క విన్నపం!" అంటూ మారీచుడు సభ మధ్యకి వచ్చాడు. ఒక వంద జతల కళ్లు అతన్ని గుచ్చిగుచ్చి చూడసాగాయి. దేవతల రాజసభ మర్యాదకి ఆయన భంగం కలిగించాడని నాకు అనిపించింది. ఈ అనాగరికులైన అసురులు! చిన్నపిల్లల్లా ప్రవర్తిస్తారు వీళ్లు. మమ్మల్ని సంస్కరించాల్సిన బరువు బాధ్యతలన్నీ పాపం దేవతల మీద ఉన్నాయి. మా మేనమామ చేస్తున్న పనిని చూసి నేను హడిలిపోయి నిలబడిపోయాను. గొంతు చించుకుని అరిచి ఆయన్ని ఆపాలని అనిపించింది. కానీ శిక్షకి భయపడి అరవలేదు. ఆ పెద్దాయన మూర్ఖంగా ఒక తప్పకి పది తప్పలు చేస్తూపోయాడు. ఆయన అంటే నాకు విపరీతమైన ప్రేమ! తరవాత మా మేనమామ జోక్యం చేసుకోవటం వల్ల మాకు పడబోయే శిక్ష తగ్గుతుందని ఎందుకో అనిపించింది. "అయ్యా! వీళ్లు చిన్న పిల్లలు. ఏదో తెలీక చేశారు. తప్ప చేస్తున్నామని తెలిస్తే చేస్తారా?" అన్నాడు మారీచుడు.

తెలివితక్కువగా ప్రవర్తించిన కుర్రవాడు ఎవరా అని అందరూ నావైపు చూస్తూ ఉండేసరికి నా ముఖం వేడెక్కి కందిపోసాగింది. నా వయసు పదహారు, అయినా నన్ను కుర్రవాడనే అంటున్నారు వాళ్లు, ఒకవేళ ఈ చిక్కులోంచి తప్పించుకుని బైట పడినా, ఇక జీవితాంతం నా మిత్రులు నన్ను హేళన చేస్తూనే ఉంటారు. యుక్తవయసులోని ఆవేశంలో పడి కొన్ని వాక్యాలు సరిగ్గా వినలేక పోయాను. మా మేనమామ అంటున్న మాటలు ఎంత భయంకరమైనవో అర్థం చేసుకునేందుకు కొంత సమయం పట్టింది.

"అయితే ఈ అనాకారి అల్లరిపిల్లల బదులు మిమ్మల్ని కారాగారంలో పెట్టి వీళ్లని వదిలెయ్యమనా మీరు అంటున్నది? నిన్న రాత్రి బాగా తాగేసిన మత్తు ఇంకా వదలక అలా మాట్లాడుతున్నారా, లేక అన్నీ తెలిసే అంటున్నారా? ఒక సైనికుడిని అని మీరు అంటున్నారు, కానీ దాన్ని నిరూపించేందుకు మీ ముందరి పళ్లు విరగొట్టుకుని, చేతికి కట్టు కట్టుకున్నట్టున్నారే!" సభ నవ్వులతో మార్మోగిపోయింది. మా మేనమామ చేతికి కట్టుతో అక్కడ నిలబడి

ఉండటం చూసి నా రక్తం ఉడికి పోయింది, విదూషకుడిలా ప్రవర్తిస్తున్న ఆ రాజు తలని దాటి ఆయన చూపులు కొన్ని అంగుళాల పైకి, ఎటో చూస్తున్నాయి.

"ఆరేళ్లు నూనె గానుగ ఆడించాలి." అని తీర్పు చెప్పగానే నామీద పిడుగు పడ్డట్టు వణికిపోయాను. కుంభకర్ణుడిలో నిద్ర మేల్కొంటున్న లక్షణాలు కనిపించాయి. మారీచుడు కూడా నిర్ధాంతపోవటం గమనించాను. మేము చేసిన చిన్న నేరానికి ఇది మరీపెద్ద శిక్ష. పెద్దాయన కళ్లలో నీళ్లు చిప్పిల్లటం చూశాను. ఆయన భార్య ముఖం, కవలపిల్లల ముఖం నాకు కనిపించింది. పాపం నావల్లే ఈయనకి ఈ కష్టం వచ్చింది. అయినా ఈయనకి వయసు ఎంతుంటుందో? ముప్పయ్యో, ముప్పై ఐదో ఉంటాయి. పదహారేళ్ల వయసు వాళ్లకి ఇరవై దాటిన వాళ్లందరూ ముసలివాళ్లలాగే కనిపిస్తారు మరి. ఆరేళ్లంటే, ఆయన శిక్ష అనుభవించి బైటికొచ్చేసరికి ఆయన వయసు నలభై ఒకటి ఉంటుంది, అదీ బతికి బైట పడితే! అన్ని శిక్షలలోకీ భయంకరమైనది నూనెగానుగ శిక్ష. గానుగకి ఎద్దులకి బదులు మనుషులని కడతారు. నువ్వులనో, ఎండుకొబ్బరి చిప్పలనో గానుగలో వేసి వీళ్లు అలా గుండ్రంగా తిరుగుతూ వాటినించి నూనె తియ్యాలి. అది వాళ్ల ప్రాణాలని తోడేస్తుంది. రోజుకి ఇరవై గంటల చొప్పున, 365 రోజులూపని చెయ్యాలి. మా మేనమామ అలా ఆరేళ్లు గానుగ ఆడించాలి. నడుం విరిగిపోయేంత శ్రమ. గొప్ప వ్యాపారవేత్త, కుబేరరాజు పశువుల శాలలోకి అతని సవతి తమ్ములు పొగరెక్కి కళ్లు నెత్తికెక్కి జొరబడ్డందుకు, పాపం ఈయనకి ఇలాంటి శిక్ష!

"ఇంకా, రాజుగారిని ఎలా పిలవాలో తెలీని ఈ ముసలి కుక్కకి అదనంగా మరో సంవత్సరం శిక్ష వేస్తున్నాం. 'అయ్యా, ట, 'అయ్యా!. ఆ తరువాతి నేరస్థుడు ఎవరు?"

నేనది విని హడిలిపోయాను. ఇదా న్యాయమంటే? అంత త్వరగా, వెనువెంటనే. రాజసభలో మర్యాద పాటించనందుకు మా మేనమామకి మరో ఏడాదిపాటు శిక్ష వేశారు... బానిసలా పని చెయ్యాలి! భటులు

వచ్చి ఆయన చేతులకి సంకెళ్లు వేశారు. తరవాత ఆయన్ని గొలుసులతో కట్టి తోసుకుంటూ తీసుకుపోయారు. అందరూ ఎకసక్కెంగా నవ్వారు. నా వాళ్లు, అసురులు, చెయ్యని తప్పకి తమలో ఒకణ్ణి జంతువులా లాక్కెళ్తూంటే అది చూసి నవ్వారు. ఎవరో ఈల వేశారు. మమ్మల్ని సభలోంచి బైటికి ఈడ్చి బైట పారేశారు. ఇక ఆ రాజ్యానికి మాతో పని లేదు. మా ఎముకలు విరిగిపోయాయి, శరీరం లోపలి భాగాలు దెబ్బతిన్నాయి. అందుకే కోడి ఎముకల మీది మాంసం తినేశాక, బొమికలని పారేసినట్టు మమ్మల్ని బైట పారేశారు. ఇంతలో మొదటి రాయి వచ్చి నాకు తగిలింది. మరుక్షణం రాళ్లవరం ప్రారంభమైంది. మా మేనమామని కఠినమైన శిక్షకి గురిచేసినందుకే నావాళ్లే నన్ను రాళ్లతో కొడుతున్నారు. నిస్సహాయంతో కూడుకున్న వాళ్లకోపం ఇద్దరు కుర్రవాళ్లమీదికి మళ్లింది. అంతే, ఇక ఇదే ముగింపు, అనుకున్నాను. అనామకంగా, దొంగ అనే పేరు తెచ్చుకుని, ఎంతో ప్రియమైన మా మేనమామని కారాగారానికి పంపి, నావాళ్ల చేతుల్లోనే చనిపోబోతున్నాను! ప్రపంచాన్నే జయించి, నావాళ్లకి స్వాతంత్ర్యం ప్రసాదించాలని కోరుకున్న నాలాంటి మూర్ఖుడికి ఎలాంటి మృత్యువు రాసిపెట్టి ఉంది!

ఎంత అకస్మాత్తుగా ప్రారంభమైందో, అంతే అకస్మాత్తుగా రాళ్ల వర్షం ఆగిపోయింది. నా ముఖం రక్తంతో తడిసిపోయింది. ఆ రక్తధారల్లోంచి, స్పృహ లేకుండా పడి ఉన్న కుంభకర్ణుడిని గుండెలకి హత్తుకుని విపరీతమైన దుఃఖంతో ఏడుస్తున్న అమ్మ నాకు కనబడింది. అదృష్టం కొద్దీ, స్త్రీలని రాళ్లతో కొట్టి చంపేటంత 'ఉన్నత నాగరిక స్థితి'కి మా వాళ్లింకా చేరుకోలేదు, ఇలాంటి చిన్నచిన్న కనికరాలు మామీద చూపుతున్నందుకు దేవుడికి కృతజ్ఞతలు చెప్పుకున్నాను. నెమ్మదిగా మమ్మల్ని మా గుడిసెలోకి చేర్చారు. మా మేనమామ భార్య స్పృహ కోల్పోయింది. కవలలిద్దరూ కేరుమని ఏడుస్తున్నారు. మా పొరుగింట్లో ఉండే లావుపాటి అనాకారి స్త్రీ, వాళ్ల ఏడుపు ఆపించేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తోంది. ఆమె మనసు ఎంత వెన్నలాంటిదో, నోరు

అంత దురుసు. ఒక మూల కూర్చుని మావైపు చూడను కూడా చూడకుండా ఏదో సంస్కృతం పుస్తకం చదువుకుంటూ ఉన్న విభీషణుడిని చూడగానే నాకు పట్టరాని కోపం వచ్చింది. అయితే భటులు వీడిని పాతిపెట్టలేదన్న మాట. బుద్ధిగా చదువుకునే మంచి బాలుడు ఇంటికొచ్చి సుఖంగా నిద్రపోయాడు! మేమేమో అక్కడ చావుదెబ్బలు తిన్నాం. మంచి వయసులో ఉన్న తన సొంత మేనమామని ఎదులు చేసేపని చేసేందుకు గానుగ దగ్గరకి ఈడ్చుకెళూంటే, దరిద్రుడు కూర్చుని కప్పలాగ దేవతలు రాసిన పుస్తకంలోని వాక్యాలు వల్లిస్తున్నాడు.

అక్కడికక్కడే వాడి పీక నులిమి చంపేయ్యాలన్నంత కోపం వచ్చింది నాకు. వాడు చదువుతున్న రుగ్వేదం పుస్తకాన్ని వాడి గొంతులో కుక్కాలని అనిపించింది. ఇంకా ఏదేదో చెయ్యాలని అనుకుంటూండగా, వాడి మీద నా చూపు పడింది. వాడువచ్చి నా కాళ్లదగ్గర నేలమీద కూర్చున్నాడు. నా కాలెత్తి నాకు అసహ్యం కలిగిస్తున్న వాడి ముఖంమీద తన్నాలనిపించింది. కానీ నా గొంతులోంచి మూలుగు మాత్రమే బయటకి వచ్చింది. కుబేరుడి భటులకి మాత్రం ఎక్కడ తన్నాలో తెలుసు. ఇంతలో విభీషణుడు పసిపిల్లవాడిలా ఏడవటం ప్రారంభించాడు. వాడు నా కాళ్లని గట్టిగా వాటేసుకునేసరికి, నా గాయాలు భగ్గుమన్నాయి. భయంకరమైన నొప్పి, కానీ వాడు నా కాళ్లు వదల్లేదు. వాడికి క్షమాపణ కావాలిట, దొంగ వెధవ! తనకి చాలా భయం వేసిందనీ, ధైర్యం కూడగట్టుకుని మామయ్యకి చెప్పేసరికి తెల్లారి పోయిందనీ అన్నాడు. చేసినవాటికి అన్నిటికీ క్షమించమనీ, నేను పెద్దవాడిని కాబట్టి, తమ్ముడిని క్షమించి కావలించుకోవాలనీ అన్నాడు.

నాకు లేచి వాడిని రెండుగా చీల్చాలని అనిపించింది. లేచి కూర్చునేందుకు ప్రయత్నించాను. గొంతులోంచి గురగురమని శబ్దం వచ్చింది. అదివిని అమ్మ భయపడి ఉంటుంది. ఆమె కుంభకర్ణుడిని వదిలి నా దగ్గరకి వచ్చింది. కోపంతో, అవమానంతో రగిలిపోతున్ననా మనసుని శాంతింపజేసేందుకు, నేను పసిపిల్లవాడిగా ఉన్నప్పుడు తను

పాడిన పాటలు పాడింది. ఆమె దగ్గర పాలు తాగేందుకు ప్రయత్నించే ఉయ్యాల్లోని పసికందులా నేనామెకి కనిపించి ఉంటాను. అసురుల శౌర్యం గురించీ, వాళ్లు కోల్పోయిన గొప్పదనం గురించీ దుఃఖంతో నిండిన పాటలు కూడా పాడింది. నా తమ్ముడిపట్ల నాకు కలిగిన ద్వేషాన్ని పోగొట్టి ఆ స్థానంలో ప్రేమని నింపాయి అమ్మ పాటలు. నేను నిద్ర లేచేసరికి నా కోపమంతా పోయింది.

మా అత్త మర్నాడు మా ఊరు వదిలి వెళ్లిపోయిందనీ, నేతగాళ్ల సమూహంతో కలిసి ఉంటోందనీ నాకు తెలిసింది. సంపాదన అంతగా లేకపోయినా, ఆమెకి ఉండేందుకు చోటూ, రెండుపూటలా భోజనం దొరికింది. ఒకనాడు చిన్న అసుర రాజ్యానికి రాణిగా జీవించిన ఆమెకి అది సరైన జీవితం కాదు, కానీ పైకప్ప లేచిపోయి, రాత్రిళ్లు నక్షత్రాలూ, చంద్రుడూ కనిపించే పూరిపాకలో జీవించటం కన్నా నయమేకదా!

నా వాళ్లని నేను చాలాకాలం తరవాత కలుసుకున్నాను. దొంగనవ్వు నవ్వే ఆ పెద్దమనిషి దయవల్లనే అది సాధ్యమైంది. తన భార్య ఏడు సంవత్సరాలు కష్టపడి పనిచేసి సంపాదించుకున్న ముత్యాలహారాన్ని క్షణంలో ఇచ్చేసేందుకు వెనకాడని మనిషి ఆయన. ఆ హారాన్ని ఇచ్చేసి తన సోదరి కుటుంబాన్ని సురక్షితంగా ఒడ్డుకి చేర్చాడు. తన మేనల్లుడు కారాగారంలో ఉండకుండా తప్పించేందుకు క్రూరుడైన రాజుకి బానిస అయి నువ్వులని ఆడించి నూనె తీసే అతికష్టమైన పనికి ఒప్పకున్నాడు. వయసుపైబడటం వల్ల ఆయన నోట్లో ఇంకొన్ని పళ్లు ఊడిపోయిన మాట నిజమే కానీ, పోయినసారి బందీగా చూసినప్పటికన్నాయిప్పుడు ఆరోగ్యంగా కనబడ్డాడు. మా అందరికన్నా ఎక్కువ సంవత్సరాలు బతుకుతాడేమో అనిపించింది. ప్రస్తుతం ఆయన వయసు నలభైరెండు, కానీ ఎప్పటిలా చాలా సరదాగా ఉన్నాడు. ఒకప్పుడు రాజులా జీవించినవాడు ఆయన. తన సొంతవాళ్లకోసం ఎప్పుడూ త్యాగం చేసేందుకు సిద్ధంగా ఉండే దయార్ధ హృదయుడు. నేను ఆ విషయాన్ని ఎప్పటికీ జ్ఞాపకం ఉంచుకుంటాను.

10. ముత్యాలదీవి పిలుస్తోంది

రావణుడు

మర్రిచెట్టు కింద సభకూడింది. నేనే సభకి అధ్యక్షత వహించాను. ప్రహస్తుడు మధ్యవర్తిగా వ్యవహరించాడు. వాగ్వివాదం చాలా తీవ్రంగా సాగింది. ఎవరూ కూడా ఏ విషయాన్నీ స్పష్టంగా చెప్పలేకపోయారు. లంకని తిరిగి సంపాదించు కోవాలని అందరూ అన్నారే కాని, అది ఎలా చెయ్యాలో చెప్పేందుకు మాత్రం ఎవరిదగ్గరా నిరుష్టమైన ప్రణాళిక లేకపోయింది.

"మహాప్రభూ! మనం వర్తకుల్లా అక్కడికి వెళ్లలేమా?" భద్రుడు అలా అడిగేసరికి నేను ఉలిక్కిపడ్డాను. వాడు అక్కడికి రావటం నేను చూడనేలేదు. అంత పొట్టిగా ఉన్నప్పటికీ భద్రుడు చప్పుడు చెయ్యకుండా నడుస్తాడు.

"ఎలాంటి వస్తువులు తీసుకెళ్లి అమ్ముతాం?" అని అడగకుండా ఉండలేక పోయాను.

"ముచిర పట్టణంలో ఉండే అరబ్బుల దగ్గర గుర్రాలు సంపాదించవచ్చు. పర్వతప్రాంతాలనుంచి మిరియాలూ, తూర్పుతీరాన కెంపులూ దొరుకుతాయి, ముచిరపట్టణంలోని గ్రీకు శిబిరంలో బంగారం దొరుకుతుంది. ధనవంతులైన వర్తకుల దగ్గర ఓడలు అద్దెకి తీసుకుందాం... ద్వీపకల్పాన్ని చుట్టుతిరిగి వెళ్లి దేశం ఆగ్నేయం కొసమీదుగా లంకలో ప్రవేశించవచ్చు. అక్కడ సముద్రం విశాలంగా ఉండదు. రెండు ఓడలు సరిపోతాయి. వాటిలో నాలుగు వందలమందిమి ప్రయాణం చెయ్యగలుగుతాం..."

"మూర్ఖుడా, లంకని నాలుగు వందలమంది మతిలేని వాళ్ల సాయంతో గెలుచుకుందామని అనుకుంటున్నావా నువ్వు?" కోపాన్ని

అణుచుకోలేకపోయాను.

నా కోపం తగ్గేదాకా ఆగి భద్రుడు మళ్లీ ఇలా అన్నాడు, "వెనక్కివచ్చేప్పుడు మనం ఓడల్లో దంతం, ముత్యాలూ తెచ్చుకోవచ్చు. ఒక్కో ఓడలోనూ కనీసం మరో ఇరవైమందిని అదనంగా ఎక్కించుకుని రావచ్చు. వాళ్లు మళ్లీ రాజ్యంలోని ముఖ్య భూభాగానికి చేరుకుని వాటిని అక్కడ అమ్ముతారు. మిగతావాళ్లు రాజు దగ్గరికి వెళ్లి సముద్రతీరాన, వీలైతే త్రికోట తూర్పు ద్వారం దగ్గర, నేతగాళ్ల వీధిలో ఒక వర్తక సమాజాన్ని నెలకొల్పమని కోరవచ్చు.

"మొదట వెళ్లినవాళ్లు అక్కడ స్థిరపడగానే మనం చిన్నచిన్న పడకల్లో, ఒక్కో దానిలోనూ పది-పదిహేనుమంది చొప్పున, కొన్ని వందల మందిని, జాలరి వాళ్లలాగ పంపవచ్చు. ఓడలు మళ్లీ వచ్చేప్పుడు వాటిలో ఇంకా కొంతమంది సైనికులు వచ్చి, ఉత్తరాన ఉన్న ద్వారం దగ్గర మరో వర్తక సమాజంగా స్థిరపడతారు. అలాగే కొనసాగించగలిగితే, నెలరోజుల్లో మన సైన్యంలో సగభాగం లంక చేరుకోగలదు. మూడోసారి ప్రయాణంలో మనం గుర్రాలనీ, ఆయుధాలనీ మాత్రమే కొని రేవులకి దూరంగా, సముద్రం లోతుగా ఉన్నచోట లంగరు వేసి ఓడలని నిలపవచ్చు. గాలివాటు అనుకూలంగా ఉన్నట్టయితే తీరాన్నిచేరుకునేందుకు ఇంకా గంటసేపు ప్రయాణం ఉంది అన్నచోట లంగర్లు దింపవచ్చు." వాడి ఈ ప్రణాళిక నాకు నచ్చింది.

"ముందుగా నాకు లంకకి వెళ్లాలని ఉంది, ప్రభూ! అక్కడ మీకు నేను చాలా ఉపయోగకరంగా ఉంటాను."

అంటే వాడు గూఢచారిగా వెళ్లబోతున్నాడన్నమాట. వాడు అక్కడి పరిసరాల్లో ఊసరవెల్లిలా కలిసిపోగలడు. వాడు మా శిబిరానికి ద్రోహం చెయ్యడు కదా? మమ్మల్ని ఉచ్చులో పడేసేందుకు వచ్చిన కుబేరుడి గూఢచారి కాదు కదా?

అకస్మాత్తుగా నాకు అనుమానం పెనుభూతంలా పట్టుకుంది. వాడు ఎక్కడికీ వెళ్లేందుకు వీల్లేదని అన్నాను. రాత్రి వాడితో మాట్లాడాలనీ,

కావాలంటే మర్నాడు ఉదయం వాడు బైలుదేరవచ్చనీ అన్నాను. ఆమాట విని వాడు తొట్రుపాటుపడటం గమనించాను. నాకు నమస్కరించి వాడు వెళ్లిపోయాడు. ఎప్పటిలాగే సభలో చర్చ, వాదనలూ అనంతంగా కొనసాగాయి. కానీ చివరికి నామాటే నెగ్గేట్టు నిర్ణయాన్ని తెలియజేశాను.

నా శిబిరంలోకి వెళ్లేముందు భద్రుడిని బంధించవలసిందని ఆజ్ఞాపించాను.

భద్రుడు

నేను ఈ ప్రదేశాన్ని విడిచి వెళ్లిపోవాలి. లంకకి చేరుకోవాలి. నేను బైటికి తొంగి చూశాను. రాత్రి బాగా చీకటిగా, నిశ్శబ్దంగా ఉంది. డేరా గుడ్డని చిన్న చాకుతో పొడిచి రంధ్రం చేశాను. భటులు నావైపు చూడటంలేదు. అంతే పరుగులంకించు కున్నాను. ఈదురుగాలి చేసే రొదలో నా అడుగుల చప్పుడు వినిపించదని ఆశించాను. నా తలకి కొన్ని అంగుళాలపైనించి ఒక బాణం దూసుకెళ్లింది. మరో ఆలోచన లేకుండా నదిలోకి దూకేశాను. నా శరీరం మంచులా ఉన్న నీటికి తగలగానే మొద్దుబారింది. ఇనపసూదుల్లా వర్షం పడుతోంది. ఎండుటాకులా ప్రవాహం వెంబడి కొట్టుకుపోసాగాను. ఒకసారి మునుగుతూ, మళ్లీ పైకి తేలుతూ, మళ్లీ మునుగుతూ చాలా దూరం కొట్టుకుపోయాక, హఠాత్తుగా, ఏం జరుగుతోందో నేను గ్రహించేలోపల, చీకటిగా, నల్లగా ఉన్న అగాథంలోకి వేగంగా పడిపోసాగాను. నా చుట్టూ హోరెత్తుతున్న తెల్లటి నురగలు కక్కుతున్న నీటి స్తంభం ఏర్పడింది. అది నన్ను అణచి ఉంచింది. నన్ను ఎటూ కదలనివ్వక బంధించింది. పూర్ణానది నన్ను కబళించేందుకు చాలా గట్టి ప్రయత్నమే చేసింది.

నేను కళ్లు తెరిచేసరికి ఒక దుంగమీద తేలుతున్నాను. ఆకాశం నిర్మలంగా ఉంది. హోరెత్తే జలపాతం చాలా దూరంలో ఉండిపోయింది.

అప్పుడు నేను విపరీతంగా అలసిపోయానని తెలిసింది. అంతే వెల్లకిలా పడిపోయాను. దుంగ అలలమీద లేసూ, పడుతూ మహాసముద్రంవైపు వెళూంటే, నేను దానిమీద పడుకుని నిద్రపోయాను.

ఎండకి కళ్లు మండుతూంటే నిద్రలేచాను. నది నెమ్మదిగా కుడివైపుకి మలుపు తిరిగింది. అప్పుడు కనిపించింది నాకు ముచిర పట్టణం. అచిరకాలంగా ఉన్న నగరం, ఒకప్పుడు బలిచక్రవర్తి రాజధాని అది. కళలకీ, సంస్కృతికీ కేంద్రంగా వర్ధిల్లిన, ప్రపంచంలోకల్ల విశ్వజనీనమైన నగరం. గ్రీకు, రోము, సిరియా, సుమేరియా, మెసపొటేమియా, చైనా, అరబ్బు దేశస్థులకేకాక, యూదులకీ, దేవతలకీ, వివిధ అసుర తెగలకీ, ఈజిప్టు దేశస్టులకీ, వాళ్ల సొంత వీధులూ, దేవాలయాలూ ఉండేవి. ఎన్నో రకాల వ్యాపార సంస్థలు ఉండేవి. నేను తీరంవైపు నడిచి, దగ్గరలో ఉన్న సత్రానికి వెళ్లాను. జనం నన్నే చూడసాగారు. నా అవతారం విచిత్రంగా ఉండి ఉంటుంది. అది ఒక పాతకాలంనాటి పూరిల్లు, చిన్నదే కాని శుభ్రంగా ఉంది. తాటాకులు కప్పిన పాక, కొందరు అక్కడ అటూ ఇటూ తిరుగుతున్నారు. వాళ్లలో చాలామంది నావికులే. నేను స్నానంచేసి, నా గాయాలని ఎవరైనా వైద్యుడికి చూపించాలని అనుకున్నాను. సత్రం యజమాని దయగలవాడు, ధాన్యం తీసుకెళూంటే జడివానలో నా పడవ మునిగిపోయిందని నేను చెప్పిన కథని అతను నమ్మాడు.

ఆ సత్రానికి వెళ్లినప్పడే నాలో ఉన్న ఒక ప్రత్యేకమైన కళని నేను తెలుసుకోగలిగాను. అనుకోకుండా, నేను వంట బాగా చెయ్యగలనన్న విషయం తెలిసింది. ఒకరోజు సత్రం వంటమనిషి మాటా పలుకూ లేకుండా ఉన్నట్టండి ఎటో వెళ్లిపోయాడు. సత్రంలో చాలామంది ఉన్నారు. నేను వంట చేస్తానని అన్నాను. చాలా కొద్దిరోజుల్లోనే వంట బాగా చేస్తానన్నపేరు సంపాదించుకున్నాను. 'భద్రుడి చేపల వేపుడు' ప్రతిరోజూ సాయంకాలం తప్పనిసరి సంబరం అయింది. నేను బాగా ఉప్ప, కారం దట్టించి చేసే చేపలవేపుడు తాటికల్లుతో పాటు తింటే అద్భుతంగా ఉంటుందన్నారు అందరూ. కొద్దికాలానికి ఆ ప్రదేశానికి

వచ్చే రకరకాల ఓడల నౌకాధ్యక్షులు నాకు ఆహ్వానాలు పంపసాగారు.

కానీ నేను ఓర్పు వహించాలని తెలుసు నాకు. లంకకి వెళ్తున్న కుబేరుడి ఓడల్లో ఒకటి నాకు సరైన ఆహ్వానం పంపేదాకా వేచి ఉన్నాను. అది రాజుగారి విహారనౌక. చాలా పెద్దదీ, గట్టిదీ. వర్షాకాలంలో సముద్రపు ఆటుపోట్లని తట్టుకుని నిలబడగలది. ఆరు రోజులు ప్రయాణం చేశాక మేం లంకానగరానికి చేరుకున్నాం. కుబేరుడి పాకశాలలో వంటచేసే ప్రముఖుడికి సహాయకుడిగా స్థానం సంపాదించుకునేందుకు కొన్నాళ్లు పట్టింది.

కుబేరుడి దగ్గర పనికిచేరి నెల గడిచింది. మా ఓడల జాడలు ఎక్కడా కనిపించలేదు. రేవు దగ్గర్లో ఉన్న మసాలా దినుసులు అమ్మే బజారుకి చల్లగా జారుకునేవాడిని. ఓడలుకాని, తెలిసిన వారెవరైనా గాని కనిపిస్తారేమోనని వెతికేవాడిని.

చివరికి ఒకరోజు వాళ్లని చూశాను. సరుకులని మోస్తున్న కొన్ని గుర్రాలని తోలుకుంటూ, అంగడి వీధుల్లోంచి వెళ్లూ కనిపించారు. వాళ్లు ఎన్నో చిన్న చిన్న సమూహాలుగా విడిపోయారు, అయినా నేను రావణుడిని సులభంగానే గుర్తుపట్టాను. నేను హడిలిపోయాను. అతని భంగిమ వ్యాపారి భంగిమలా లేదు. గుర్రంమీద రాజులా కూర్చున్నాడు. మరి బజారులో రాజులు ఎందుకు ఉంటారు? రావణుడు తన హావభావాలతో వ్యూహాన్ని బైట పెట్టేస్తాడు.

"అయితే నువ్వు ఇక్కడికి వచ్చింది ఇందుకోసం అన్నమాట, ఆఁ?" కుబేరుడి అంగరక్షకుల ముఖ్యుడు విక్రముడి గొంతు విని ఉలిక్కిపడ్డాను. అతను నా వెనకై నిలబడి గడ్డిపోచ నములుతున్నాడు. ఆ చుట్టుపక్కల పరిసరాలకి తగినట్టు వ్యాపారస్థుడి దుస్తుల్లో బాగా కలిసిపోయాడు.

అతను నన్ను ఏమైనా చేసేలోపల నేనే అతని కాలివేళ్లని బలంగా తొక్కి ఒక్క తోపు తోశాను. అతను నిలదొక్కుకోలేక వెల్లకిలా పడ్డాడు. వెంటనే మళ్లీ లేచేశాడు. కానీ ఈలోపల నేను కాలికి బుద్ధి చెప్పాను.

అతని చేతిలోని బాకు ఎండపడి తళతళ మెరవటం నాకు కనిపించింది. జనం కేకలు పెట్టారు. వీలైనంత వేగంగా నేను జనం మధ్యనించి తప్పించుకుంటూ పరిగెత్తాను. దారిలో బళ్లనీ, వాటిమీదున్న పళ్లనీ తలకిందులు చేసూ, పసుపు కుప్పలని తొక్కుకుంటూ, అమ్మకందార్ల తిట్లని వింటూ పరిగెత్తాను.

రావణుడు నావైపు చూశాడు. అతని మొహంలో అయోమయం పొడసూపింది. మరుక్షణం నన్ను గుర్తు పట్టినట్టున్నాడు, అతని అందమైన ముఖంలో ద్వేషం తాలూకు ఛాయలు కనిపించాయి. జనం అన్నివైపులనించీ మమ్మల్ని చుట్టుముట్టటం చూశాను. మారువేషాల్లో ఉన్న రాజభటులు మమ్మల్ని చుట్టుముడుతున్నారు. విక్రముడు ఏపనినైనా సమగ్రంగా చేస్తాడు, మమ్మల్ని నిమ్మకాయని పట్టుకున్నట్టు తన పిడికిట్లో బంధించాడు, బలంకొద్దీ పిండటం ప్రారంభించాడు.

"పారిపోండి!" అని గొంతుచించుకుని అరిచాను. రావణుడి చేతిలో కత్తి మెరవటం కనిపించింది. మరుక్షణం జనంలోంచి వందలాది కత్తులు పైకి లేవటం చూశాను. రావణుడూ, అతని పరివారం పారిపోయేందుకు చేసే ప్రయత్నంలో బజారు నలుమూలలా దుమ్ము లేచింది. నేను గుర్రం మీదున్న రాజుగారిని చేరుకుని, "నన్ను కూడా మీతో తీసుకెళ్లండి, ప్రభూ!" అన్నాను.

విక్రముడు చాలా సమీపంలోకి వచ్చేశాడు. ఏ క్షణంలోనైనా నన్ను బందీగా పట్టుకోవటమో, చంపటమో జరగవచ్చు. రావణుడు, "ద్రోహీ! దుర్మారుడా, నరకంలో కుళ్లి చావరా!!" అంటూ నా ముక్కు మీద తన్నిన తన్ను కన్నా అతని మాటలు నన్ను ఎక్కువ బాధపెట్టాయి. నేను విక్రముడిమీద దాదాపు పడినంత పనిచేశాను. కానీ అతను నన్ను పక్కకి తోసేసి రావణుడి వెంట పడ్డాడు. గుర్రం కళ్లాలు దొరకబుచ్చుకుని అతన్ని కత్తితో పొడవబోయాడు. రావణుడు ఈసారి తన్నిన తన్నుకి విక్రముడు నేలమీద బొక్కబోర్లా పడ్డాడు. రావణుడి అనుచరులు, భటుల వరసలని ఛేదించటం చూసి నాకు ఉపశమనం లభించింది. రావణుడు తన కత్తి ఝళిపిస్తూ, అడ్డం వచ్చిన భటులని నరికేస్తూ,

పొడిచేస్తూ గుంపులోంచి బైటపడి వెనక్కి వెళ్లమని తన వాళ్లకి ఆదేశాలివ్వటం గమనించాను. కొద్దిసేపట్లో మా రాజు తన అనుచరులతో శరవేగంగా అంగడివీధిని వదిలి గుర్రంమీద వెళ్లిపోయాడు. కొందరు అనుచరులు గుర్రాలమీదా, కొందరు పరిగెత్తుతూ ఆయన్ని అనుసరించారు. ఆ చిన్నసమూహం అక్కణ్ణించి వెళ్లిపోతూంటే కొద్దిమంది భటులు మాత్రం అనాసక్తంగా వాళ్లని వెంబడించారు.

నేను పిచ్చికుక్కలా పరిగెత్తాను. నేను పరిగెత్తుతున్నది రాజమార్గంలో అని గ్రహించేందుకు నాకు కొన్ని క్షణాలు పట్టింది. అశ్వారోహులైన భటులు నాకు ఏ క్షణాన్నైనా ఎదురుపడచ్చు, అంతలో నాకు గుర్రపుడెక్కల చప్పుడు కూడా వినబడింది. మధ్యలో కుడివైపు ఉన్న సందులోకి తిరిగాను. అక్కడ అంతా చీకటిగా ఉంది, వీధి దీపాలు ఆరిపోయి ఉన్నాయి. ఆ సందు చివర్లో ఒక కిటికీలోంచి నలుచదరపు వెలుగు పరుచుకుని ఉంది. అటువైపు నడవటం మొదలుపెట్టాను. ఎవరివో మాటలు వినిపించాయి. తాగిన మత్తులో ఉన్న ఒక వ్యక్తితో ఒక స్త్రీ వాదిస్తోంది. నాకు భయంవేసి దాక్కునేందుకు అనువైన స్థలం కోసం చూశాను.

ఆ ఇంటి తలుపు హఠాత్తుగా దఢాలున తెరుచుకుంది, నేను వెంటనే నీడలోకి తప్పుకున్నాను. ఒక లావుపాటి వ్యక్తిని ఎవరో బైటికి తోశారు. అతను లోదుస్తులు మాత్రమే తొడుక్కుని ఉన్నాడు. అతను కొంతదూరం తడబడుతూ అడుగులువేసి, దీపస్తంభానికి కొట్టుకుని, బొక్కబోర్లా పక్కనున్న మురికి కాలువలో పడ్డాడు. అతన్ని ఇంకా ఇంట్లో ఉన్న స్త్రీ తిడుతూనే ఉంది. ఆ మనిషి కదలక మెదలక అలాగే ఉండిపోయాడు. అయితే ఈ ఇల్లు అతనిది కాదని కచ్చితంగా చెప్పొచ్చు. మర్యాదస్తురాలైన ఏ ఆడదీ అలాంటి తిట్లు తిట్టదు. బహుశా ఏ నాట్యగత్తె ఇల్లో వేశ్యావాటికో అయిఉంటుంది. ఆమె తలుపు మూసేలోపల నేను చీకటిలోంచి వెలుతుర్లోకి వచ్చి తలుపు ముయ్యకుండా కాలు అడ్డుపెట్టాను.

ఒక్క క్షణంపాటు ఆమె నివ్వెరపోయింది. ఆమె వయసు పద్దెనిమిదో, ఇరవయ్యో ఉండవచ్చని అనుకున్నాను. ఆమె కళ్లు తేనె రంగులోనూ, నిడుపాటి కురులు నల్లగానూ ఉన్నాయి. దేవతాస్త్రీ లానో, సంకరజాతి స్త్రీ లానో ఆమె తెల్లగా ఉంది. ఆమె తొడుక్కున్న పట్టు రవికె ఆమె వక్షాన్ని పూర్తిగా కప్పలేకపోతోంది, పట్టులంగా కూడా బొడ్డుకిందికి కొన్ని అంగుళాలు జారిపోయి ఉంది. రెండు రొమ్ములమధ్యాసన్నని బంగారు గొలుసుకి చిన్నవజ్రం తాపినపతకం వేలాడుతోంది. ఆమె అరిచేలోపల నేను ఆ ఇంట్లోకి ప్రవేశించాను. ఎడమచేత్తో తలుపుని మూసూ, కుడిచేతిలోని కత్తిమొనని ఆమె కంఠం మీద ఉంచాను.

"నన్ను నీ గదిలోకి తీసుకెళ్లు," అన్నాను. ఆమె మత్తెక్కించే అందంచూసి నాలో కోరికలు బుసలు కొట్టసాగాయి. ఆ తరవాత కొన్ని వారాలపాటు ఆ వేశ్య ఇల్లే నాకు శరణ్యమైంది. నా బాధలనీ, కలలనీ ఆమె దగ్గరే వెళ్లబోసుకుని సేదతీరాను.

ఆమె పేరు మాల, ఒకసారి మాటల్లో విక్రముడు తన దగ్గరకి తరచు వసూ ఉంటూడని చెప్పింది.

నా మనసులో ఒక ప్రణాళిక రూపుదిద్దుకోసాగింది. నెమ్మది నెమ్మదిగా, ఆమెకి నా జీవిత ధ్యేయం గురించి చెప్పటం ప్రారంభించాను. మొదట్లో ఆమె ఆసక్తి చూపలేదు, కానీ రెండు వారాలు నా మాటలు విన్న తరవాత, ఆమెకి నేను చెప్పే విషయంలో ఆసక్తి మొదలైంది. ఆ తరవాత నా ఉత్సాహాన్ని అందిపుచ్చుకుంది, ఆమెకి ద్వేషించటం నేర్చాను. ఆమె నాకు ప్రేమని పంచితే దానికి బదులు ఆమెకి ద్వేషాన్ని నేర్చాను. ఆమె నా పక్షాన ఉండాలని అనుకున్నాను. ఆమెతో కలిసి కుట్రపన్నాను.

ఒకరోజు సాయంకాలం ఆమె నా గదిలోకి వచ్చి ఆరోజు రాత్రి విక్రముడు తనని కలిసేందుకు వస్తున్నాడని చెప్పింది. నేను అసూయతో రగిలిపోయాను, కానీ మా ప్రణాళికని అమలుపరిచే సమయం ఆసన్నమైందని అనుకున్నాను. మందంగా ఉన్న తెరల

వెనకాల దాక్కుని వణికిపోతూ నిలబడ్డాను. విక్రముడు గదిలోకి రావటం చూశాను. మాల లేచివెళ్లి అతని పెదవులని ముదుపెట్టుకుంది.

కొన్ని నిమిషాల్లో విక్రముడు మంచంమీద పడుకున్నాడు. కండలు తిరిగిన అతని తెల్లని శరీరం మాల పొందుకోసం తహతహలాడుతోంది. ఆమె తన శాలువతో అతని చేతులని కట్టేసింది. ఆ తరవాత చీర విప్పేసి, దానితో అతని కాళ్లుకూడా కట్టేసింది. అప్పుడు నేను తెరల వెనకనుంచి బైటికివచ్చి నెమ్మదిగా విక్రముడి దగ్గరకి నడిచాను. మాల మంచం దగ్గర్నించి వెళ్లిపోయింది. "ఏమిటిది...?" విక్రముడి ముఖం కోపంతో ఎర్రబడింది. అప్పటికిగాని ఏం జరుగుతోందో గ్రహించలేదు అతను. నేను మృత్యువు రూపంలో అతన్ని సమీపిస్తున్నాను. అతను కొయ్యబారిపోయాడు. నేను వీలైనంత అందంగా నవ్వుతూ, కావాలనే ఒక్కొక్క అడుగే అతనివైపు వెయ్యసాగాను. అతను లేచేందుకు ప్రయత్నించాడు, గింజుకున్నాడు. కానీ మాల అతన్ని గట్టిగా కట్టేసింది.

అతన్ని నేను కొంచెం కొంచెంగా చంపసాగాను... చిత్రహింసలు పెట్టాను. తెల్లవారేసరికి నేనూ, మాలా అతని శరీరభాగాలని నేలమీదనించి ఏరసాగాం. ఆ ముక్కలని ఒక గోనెసంచిలో వేసి, పంచదార కూడా పోసి తగలబెట్టాం. అలా చేస్తే శరీరాన్ని కాల్చిన గుర్తులేవీ మిగలవు. నేను బైటికి వెళ్లి రెండు వీధికుక్కలని చంపి, కాలుతున్నవిక్రముడి శరీరభాగాలతోపాటు వాటినికూడా పడేశాను. ఇరుగుపొరుగు వారెవరైనా చూసినా అనుమానం రాకుండా ఉండేందుకు ఆపని చేశాను.



రాజభవనం ప్రధాన అంగరక్షకుడు విక్రముడు, ఆ విధంగా అంతం అయాడు. అతని జేబులో ఉన్న తాళం చెవులని ముందే తీసి

పెట్టుకున్నాను. కోటలోకి ప్రవేశించాలన్నది నా ఆశయం. విక్రముడు మాయమయాడని వాళ్లు గమనించకముందే ఆ పని చెయ్యాలి. నేను రాజభవనం చేరుకుని రక్షణ ద్వారం దగ్గర ఇద్దరు ద్వారపాలకులు ఉండటం చూశాను. అయినా నేను పెద్ద అధికారిలా వాళ్ల పక్కనించే ద్వారంవైపు వెళ్లాను. ఇద్దరూ నాకు అభివాదం చేసి నిటారుగా నిలబడ్డారు. చప్పుడు చేసూ ద్వారం తెరుచుకుంది. నేను లోపలికి నడిచాను, ద్వారపాలకులకి ధన్యవాదాలు చెప్పి, వెంటనే ద్వారం మూసేశాను. నా చేతిలోని చిన్నమట్టి పాత్రవైపు చూశాను. దాన్ని తయారుచేసేందుకు నాకు పది రోజులకన్నా ఎక్కువ సమయం పట్టింది. అధికార వేషాన్ని విప్పేసి, దాన్ని మూటలా చుట్టి, ఒక పొదలో దాచాను. ఆ తరవాత నా బట్టలు తొడుక్కుని, ఇంతకుముందు పనిచేసిన రాజుగారి వంటశాలలోకి అడుగుపెట్టాను. వంటవాళ్లందరూ పనుల్లో మునిగి ఉన్నారు, నావైపు చూడకుండా నన్ను పలకరించారు. ఎవరూ నావైపు చూడటంలేదని నిర్ధారణ చేసుకున్నాక, మట్టి పాత్రని బైటికి తీసి ఉడుకుతున్న అన్నంలో అందులో ఉన్న పదార్థాన్ని కలిపేశాను.

సైనికులకి రకరకాల కూరలు ఇష్టం, కానీ అన్నం మాత్రమే అందరూ తింటారు. అందుకే అన్నంలో దాన్ని కలిపాను. నేను ఊపిరి బిగబట్టి ఎదురుచూస్తూ కూర్చున్నాను. వరసగా ఎద్దుబళ్లు వచ్చి అన్నంతో నిండిన బుట్టలనీ, కూరలతో నిండిన పాత్రలనీ సైనికుల శిబిరాలకి తీసుకెళ్లాయి. రాజధానికి దగ్గర్లో సముద్రం మధ్యలో లంగరువేసిన నౌకల్లోకి ఒడ్డున ఉన్న నావలు వాటిని చేరవేస్తాయి.

గంటసేపు గడిచాక బైట నాకు కోలాహలం వినిపించింది. వాళ్లు సైనికులని మోసుకొస్తూ కనిపించారు. కొందరు వాంతులు చేసుకుంటున్నారు. కొందరు చావుబతుకుల్లో గిలాగిలా కొట్టుకుంటున్నారు. నగరంలోని మూలమూలలనించి ఎద్దుబళ్లలో, గుర్రపుబళ్లలో మనుషులని తీసుకొచ్చి, రాజభవనం ఆవరణలో రాజవైద్యులు వాళ్లని పరీక్షచేసేందుకు, పడేస్తున్నారు. నేను బైటికి పరిగెత్తాను. నన్నెవరూ చూడలేదు. నా ప్రభువు దగ్గరకి వెళ్లాలని

అనుకున్నాను, నా రాజు రావణుడు, వచ్చి నగరాన్ని ఆక్రమించాలని కోరుకున్నాను. వాంతులు చేసుకుంటున్న సైనికులూ, మురికి కాలవల్లో తలలు మునిగిన వాళ్లూ పొట్టలు పట్టుకుని మూలుగుతున్న వాళ్లూ బాధతో మెలికలు తిరిగిపోతూ చావుకి బెత్తెడు దూరంలో ఉన్నవాళూ కనిపించారు. గుర్రంమీద ఉన్న ఒక సైనికుడు, ఒకచేతో గుర్రాన్ని పట్టుకుని, మరోపక్కకి తిరిగి వాంతి చేసుకుంటున్నాడు, నేను ఆ గుర్రం కల్లెం పట్టుకున్నాను. అతన్ని కిందపడేసి, గుర్రం ఎక్కాను, సుబేల కొండలవైపు గుర్రాన్ని దౌడు తీయించాను. మామూలు జనం వీధుల్లో గుమిగూడటం మొదలుపెట్టారు. చనిపోతున్న సైనికులని తొంగితొంగి చూస్తున్నారు. ఒక వ్యాపార ప్రభువు నిరంకుశపాలన నుంచి విడుదల చేసే ప్రయత్నం సాగుతోంది.

నేను సుబేల పర్వతాన్ని ఎక్కుతూంటే, నా కళ్లు నీళ్లతో నిండాయి. గొంతు పెగల్లేదు. నా ప్రభువు కనబడగానే, "మహాప్రభూ! ఇక ఈ నగరం మీదే. నేను కుబేరుడి సైన్యాన్ని మట్టపెట్టాను..." అని అరిచాను.

"వీడిని బంధించండి." ఆయన గొంతు నా హృదయాన్ని ముక్కలు చేసింది. ఎప్పటినుంచో నా పక్షం వాళ్లు అని నేను అనుకుంటున్న సైనికులు, నన్ను చుట్టుముట్టి చంపేందుకు సిద్ధమయారు.

'రావణా, ఒకసారి వాడు చెప్పేది విను," వృద్ధుడు, కులీనుడు, ప్రహస్తుడు మావైపే వసూ నాకు కనిపించాడు. మారీచుడు కూడా వచ్చాడు. ఆయన సైనికులని వెనక్కినెట్టి నన్ను ఎత్తుకుని, కావలించుకుని వెన్నుతట్టాడు. పసిపిల్లవాడిలా వెక్కివెక్కి ఏడ్చాను. మారీచుడి కన్నీళ్లు ఆచ్ఛాదనలేని నా వెన్నుని తడపటం నాకు తెలిసింది.

11. సముద్రపు దొంగల ముట్టడి

రావణుడు

భద్రుడు ద్రోహి కాదనీ, మిత్రుడేననీ తెలుసుకునేందుకు కొంత సమయం పట్టింది. నన్ను కాపాడేందుకు వస్తాడని నేను ఎదురుచూస్తున్న వ్యక్తి అతనే. తిండీతిప్పలు లేకుండా చస్తూ ఉన్న సైన్యం ఎంత హుందాగా కవాతు చెయ్యగలదో, అంత హుందాగా మేము నూతనోత్సాహంతో గబగబా కొండ దిగాం, రాజమార్గంలోకి ప్రవేశించగానే, కొన్నివేలమంది వీధులకి ఇరువైపులా నిలబడి జయజయధ్వానాలు చెయ్యటం కనబడింది. నేను ఉప్పొంగిపోయాను. ఇటువంటి విజయ ఘడియ కోసమే ఇన్నాళ్లుగా ఎదురు చూశాను. లెక్కలేనంత సంపద నాకోసం వేచి ఉంది. ఈ రాజ్యంలోని గొప్ప వనరులతో నేను మళ్లీ సైన్యాన్ని సమకూర్చుకోగలుగుతాను. ఆ తరవాత పూర్తిగా ఈ ఉపఖండాన్ని అంతా నా అధీనం చేసుకుంటాను. అంతేకాక, నా సవతి సోదరుని వీధులపాలు చేస్తాను. అతనికి తగిన శాస్తి జరుగుతుంది, నా వేళ్లని విదిలించి కాసిని బంగారు నాణాలు అతనివైపుకి విసిరేస్తాను. మా నాన్నని చూసి ఎగతాళిగా నవ్వగలుగుతాను. ఇంకా ఎన్నో చెయ్య గలుగుతాను. నేను రాజుని, రారాజుని. రావణుడిని, లంకకి చక్రవర్తిని అనుకుంటే చాలా సంతోషం అనిపించింది. రావణుడిని, దేశానికే చక్రవర్తిని అనుకుంటే ఇంకా బావుంది. నేను మరీ అత్యాశకి పోతున్నానా? లేదు, లేదు, నాకెప్పుడూ ఆత్మవిశ్వాసం ఎక్కువే. ఇంతలో హఠాత్తుగా నాకు బాధ వేసింది. ఈ విజయం బోలుగా ఉన్నట్టు అనిపించింది. దీన్ని ఒక అనాకారి రైతు, చదువు సంధ్యలు లేని ఒక మోటు గ్రామస్థుడు, జిత్తులమారి నక్క, పళ్లెంలోపెట్టి నాకు బహుకరించాడు.

నేను రాజభవనంలోపలికి ప్రవేశించగానే, ఒక నిరుపేద స్త్రీ, ఆమె

నలుగురు పిల్లలూ, వ్యాపార రాజు ముందు భిక్షాపాత్ర పట్టుకుని నిలబడిన సంఘటన, నా మనసుని కమ్మేసింది. కుబేరుడు అసహ్యంగా మావైపు చూడటం, అతని చేతుల కదలికా గుర్తుకొచ్చి నాలో మంటలు చెలరాగాయి. నాకు విపరీతమైన భయం వేసింది. పశువులశాలవైపు ఒకసారి చూసి, మారీచుడివైపు చూశాను. అతను అది చూసి, చిరునవ్వు నవ్వుతూ నాకేసి చూశాడు. ఆ చిరునవ్వు చాలు, నేను ఆయన్ని ప్రేమించేందుకు.

"అతనెక్కడ?" అన్నాను గట్టిగా కుబేరుడి గురించి అడుగుతూ. ప్రహస్తుడు ఒక నిమిషంపాటు నావైపు తదేకంగా చూసి, దూరంగా నీలంగా ఉన్నసముద్రంవైపు వేలెత్తి చూపించాడు. అక్కడ, సగం దించిన కుబేరుడి బంగారు రంగు పతాకం కనిపించింది. ఒక పెద్ద నౌక రేవుని వదిలి వెళ్తూండటం చూశాను. విజయం నా మనసులో విలీనమై పోయింది.

'మహాప్రభూ, వరుణుడి నౌకాదళాలు మన తీరానికి వస్తున్నాయి." నాకు కొన్ని అడుగుల దూరంలో నిలబడి పిచ్చికుక్కలా వగరుస్తూ వార్తాహరుడు ఆయాస పడుతూ చెప్పిన ఆ వార్త. నన్ను కుదిపి లేపి, నా బద్ధకాన్ని వదిలించింది. మొత్తం రాజభవనంలో అందరూ మ్రాన్పడి పోయారు. అంతే, ఇంక నాకు పట్టాభిషేకం జరిగే అవకాశం లేదు! సంబరాలన్నిటినీ వెంటనే ఆపెయ్యమని ఆజ్ఞాపించాను.

మా సభ అత్యవసర పరిస్థితిని గురించి చర్చించేందుకు సమావేశమయింది. మా దగ్గర చెప్పుకునేంత పెద్ద సైన్యం ఏదీలేదు. కుబేరుడు అన్ని నౌకాదళాలనీ తనవెంట తీసుకుపోయాడు. మిగిలిన వాళ్లలో చాలామంది విషానికి గురై చనిపోయారు, ఇంకా అనేకమంది భయంకరమైన బాధని అనుభవిస్తున్నారు. అందుకని సముద్రపు దొంగల రాజుని ఎదిరించేందుకు మా దగ్గర దాదాపు 300 మంది సైనికులు మాత్రమే ఉన్నారు. ఒక బొట్టు రక్తం చిందకుండా రాజ్యాన్ని కైవసం చేసుకోవటం నాకు అంతగా నచ్చలేదు. వరుణుడితో తలపడాలని అనుకున్నాను; ఎవరితోనైనా యుద్ధం చెయ్యాలని

అనిపించింది. ఎటువంటి శౌర్యమూ ప్రదర్శించకుండానే రాజునై పోయానని నమ్మలేకపోయాను. సైన్యాన్ని మోసం చేసి, వాళ్లని రోగాలబారిన పడవేసి, రాజ్యాన్ని సంపాదించుకోవటం అసహ్యం అనిపించింది!

సముద్రపు దొంగల రాజుతో తను చెయ్యబోయే బేరం గురించి మాతో ప్రహస్తుడు చాలాసేపు వాదించాడు, చివరికి అందరికీ తన ప్రణాళిక గురించి చెప్పి ఒప్పించాడు. క్షితిజం దగ్గర చుక్కల్లా కనిపిస్తున్న నౌకలవైపు ప్రహస్తుడు, ఇద్దరు సహాయకులతో చిన్న పడవలో బైలుదేరి వెళ్లాడు, నేను కోపంతో రగిలిపోవటంతప్ప ఏమీ చెయ్యలేకపోయాను. నా కోపం తారస్థాయికి చేరుకునే వేళకి ఒక సేవకుడు వణుకుతూ నా దగ్గరకి వచ్చి, "ప్రభూ! మయుడు మిమ్మల్ని కలవాలనుకుంటున్నారు," అన్నాడు.

అంకెలని లెక్కపెట్టుకుంటూ, కర్రముక్కతో కొలతలు తీసుకుంటూ జీవితం వెళ్లదీసే మనిషిని కలుసుకోవటం నాకెంత మాత్రం ఇష్టం లేకపోయింది. కానీ అలా అని చెప్పి సేవకుడిని పంపేసే లోపలే, మయుడు వంకర నవ్వుతో లోపలికి వచ్చాడు. సేవకుడు మర్యాదగా వెళ్లిపోయాడు.

నేను ఆశ్చర్యంతో చూస్తూ ఉండిపోయాను. బట్టతలతో ఉన్న ఆ వృద్ధుడు మర్కటంలా వటవట తాగటం మొదలుపెట్టాడు. వాస్తుకళ గురించీ, నిర్మాణకళ గురించీ వివరాలు చెప్పుకుంటూ పోయాడు. నన్ను అతను రావణా, అని పిలవటం కూడా గమనించాను. నేను అడక్కుండానే ఆ గురువు నిర్మాణ కళలో నాకు పాఠం నేర్పటం నాకెంత మాత్రం నచ్చలేదు. లేచి అతని మెడలు వంచి, అతని ముక్కుని నేలకి వేసి రుద్దాలని అనిపించింది. అలా చెయ్యకుండా, వీలైనంత మర్యాదని గొంతులో పలికిస్తూ, "మీరు యింతకూ నా దగ్గరకు ఎందుకు వచ్చారో చెబుతారా?" అన్నాను. గొంతులో నా మనసులోని భావాలేవీ తెలియకుండా ఉంటాయనీ, గౌరవనీయుడైన ఆ వాస్తుకళా నిపుణుడితో సరిగ్గానే మాట్లాడి ఉంటాననీ ఆశించాను.

"ఇటువైపుగా వెళూంటే, నీతో ఒక మాట చెప్పాలని అనిపించింది," అని ఆగాడు మయుడు. ఐదు నిమిషాలు గడిచాయి. నేనక్కడే నిలబడ్డాను. ఆ వృద్ధుడు తనలో తను ఏదో గొణుక్కుంటూ, ఏదో రాసుకుంటున్నాడు. మధ్యమధ్యలో ఆశ్చర్యాన్నీ, బాధనీ, ఆనందాన్నీ తెలియజేస్తూ కేకలు పెడుతున్నాడు. ఆయనకి ఏదేదో జరుగుతున్నట్టు ఊహించుకున్నాను - పెద్ద స్తంభం ఆయనమీద కూలిపోయినట్టూ, ఆ స్తంభంలో దాక్కున్న విష్ణువు, సింహం తొడుగుని ముఖానికి తగిలించుకుని, ఆయన మీదికి దూకుతున్నట్టూ, ఆయనకింద పడిపోయి మిగిలిన రెండు పళ్లూ విరగ్గొట్టుకున్నట్టూ! అప్పుడు హఠాత్తుగా నాకు ఒకటి గుర్తుకొచ్చింది. ఆయన నా తల్లీ, చెల్లీ వెంట, మొండిఘటంలాంటి తన కూతురితోపాటు ప్రధాన భూభాగంలో ఉండి ఉండాల్సింది. మరి ఈ దీవికి ఎలా వచ్చాడు? ఇంకా ముఖ్యమైన ప్రశ్న, మా అమ్మా, చెల్లీ ఎక్కడున్నారు? వరుణుడి చేతిలో హతం అయారా? మా అమ్మకి ఏమైనా హాని జరిగిఉంటే వరుణుడి తోలు వలిచేస్తాను. ఇక ఒప్పందాలూ, శాంతికోసం సంధి చేసుకోవటం జరగని పని. మా ఇరుపక్షాల బలాలూ, ప్రహస్తుడి మంత్రాంగ చాతుర్యమూ, క్లిష్టమైన రాజకీయ యుక్తులు పన్నగల అతని నేర్పూ, ఇవన్నీ మామధ్య సంధి కుదర్చటం కల్ల.

"శివశివా! సోదరా, మయుడా, నువ్వింకా వాడికి అసలు విషయం చెప్పలేదా?" మా అమ్మ గొంతు విని నాలోని ఒత్తిడి తగ్గిపోసాగింది.

ఆవిడ వెనకాలే మా చెల్లి చేటంత ముఖంతో నవ్వుతూ నిలబడింది. వాళ్లిద్దరి వెనకా కర్రలా బిగుసుకుపోయి నిలబడి ఉన్న మరో స్త్రీని కూడా చూశాను. ఆమె కళ్లు నావైపు సూటిగా, ఎటువంటి సంకోచమూ లేకుండా చూస్తున్నాయి.

"ఆ వరుణుడు ఎంత పెద్దమనిషో! ప్రయాణం చాలా ఆనందంగా జరిగింది," అంది అమ్మ నిర్లక్ష్యంగా.

"మరి జంబుమాలి ఏడీ? మిమ్మల్ని ఇక్కడికి తీసుకురావటానికి

నేనెవరినైనా పంపేలోపలే మీరు ఎందుకు బైలుదేరారు?" అని అడిగాను.

"జంబుమాలి ఇంకా వరుణుడి నౌకలోనే ఉన్నాడు. నువ్వు లంకని స్వాధీనం చేసుకోవటం అతనికి చాలా సంతోషాన్ని కలగజేసింది. అందరూ అతన్ని సముద్రపు దొంగ అంటారు, కానీ అతని ప్రవర్తన వేలెత్తి చూపించలేనంత మర్యాదగా ఉంది. నువ్వు చిరకాలం గొప్పగా లంకని పరిపాలించాలని కోరుతూ నీకు అభివాదనలు తెలపమని అన్నాడు."

"ప్రహస్తుడు అతనితో మాట్లాడేందుకు వెళ్లాడు."

"రాజకీయాలు మీ మగవాళ్లకే వదిలేస్తున్నాను. నాయనా, నీకు ఇప్పుడు పెళ్లాడే వయసు వచ్చింది. నీ అంత యోగ్యుడైన బ్రహ్మచారి ఈ ప్రాంతాల్లో ఇంకొకరు లేరని కొందరు అనవచ్చు. మరి పెళ్లి చేసుకోవటం గురించి నీ అభిప్రాయం ఏమిటి?

"అప్పుడే పెళ్లికి సిద్ధంగా లేననుకుంటాను. అమ్మా, నాకు పరిపాలించేందుకు ఒక దేశం దొరికింది, ఇప్పుడే మొదలుపెట్టాను," అన్నాను ఆమె మాటని నిరాకరిసూ.

నా మాట అసలు చెవిన పెట్టకుండా "అందుకని, తన కూతురు, మండోదరిని, నీకిచ్చి పెళ్లి చెయ్యటం ఇష్టమేనా అని మయుడిని అడిగాను," అంది అమ్మ.

నేను నిర్ఘాంతపోయాను. అలాంటి కొరకరాని కొయ్యని పెళ్లిచేసుకోవటం నావల్ల కాదని అనిపించింది. ఆమెవైపు చూశాను, తలదించుకోవటం, సిగ్గుగా నవ్వటం వంటిది ఏమీ కనిపించలేదు. నా చూపులతో తన చూపులని తీవ్రంగా కలపటం చూసి నాకు అమితమైన ఆశ్చర్యం కలిగింది. ఆమె కళ్లు నల్లగా, చురుగా ఉన్నాయి. కనుబొమ్మలు దట్టంగా ఉన్నాయి. నాజూకుగా లేకపోయినప్పటికీ అందంగానే ఉంది. ఆమెలో ఒక రకమైన పొగరుబోతుతనం కనిపించింది. ఆమెని తయారు చేసేందుకు ఆమె తండ్రి ఉలినీ, కొలతబద్దనీ ఉపయోగించినట్టుగా ఉంది ఆమె.

"వీళ్లిద్దరూ మాట్లాడుకుని ఒకరిగురించి ఒకరు తెలుసుకునేందుకు ఏకాంతం కల్పిస్తే బావుంటుందేమో. మనం పెద్దవాళ్లం అలా తోటవైపు వెళ్లామా?"

ఆ మాట అని అమ్మ మండోదరినీ, నన్నూ అక్కడ వదిలి వెళ్లిపోయింది. నాకు పరిగెత్తి వెళ్లి కిటికీలోంచి బైటికి దూకి మాయమై పోవాలని అనిపించింది. మండోదరి, అదేం పేరు అసలు?

"ఈ గదిలోంచి బైట కనిపించే దృశ్యం చాలా బావుంది," అంది ఆమె. తండ్రీ, కూతురూ ఒకే రకం. "అవును," అన్నాను. ఆ తరవాత ఆమె ఏమీ మాట్లాడలేదు. నేను ఏం మాట్లాడాలా అని ఆలోచనలో పడ్డాను, ఏదైనా ఒక్కమాట దొరకదా అని వెతికాను. గదిలో ఉక్కపోత ఎక్కువై పోసాగింది, గాలి ఆడటం లేదు. పెళ్లి చేసుకునే పద్ధతి ఇది కాదు అని మాత్రం నాకు కచ్చితంగా తెలిసిపోయింది.

"ఆఁ.... నేను బ్రహ్మదగ్గర విలువిద్య నేర్చుకున్నాను. సంగీతం అంటే నాకు ప్రాణం. పిల్లలకి వచ్చే వ్యాధులకి చికిత్స కనిపెట్టటం నా అభిరుచి. ఇంకా..." అంటూ నట్టుతూ మాట్లాడి, ఆగిపోయాను.

ఆమె నావైపు తిరిగి, చేతులు కట్టుకుని, నా కళ్లలోకి స్థిరంగా చూస్తూ, మీరే నా కాబోయే భర్త అని మా నాన్న చెప్పాడు. నాన్న చెప్పే మాట వినే కూతుర్ని కాబట్టి ఒప్పుకున్నాను. దేవతల వేదాలన్నీ నాకు వచ్చు. దేవతల చరిత్రా, అసురుల చరిత్రా చదివాను. మా నాన్న శిక్షణలో నిర్మాణకళా, వాస్తుకళా కూడా అభ్యసించాను. కవిత్వం రాస్తాను, చిత్రలేఖనం చేస్తాను. నాకు వేటాడటం అంటే చాలా ఇష్టం. విలువిద్యలో నైపుణ్యం సాధించాను."

ఈ నడయాడే విజ్ఞాన సర్వస్వాన్ని పెళ్లి చేసుకోవటం నాకు ఇష్టమా, ఇష్టం లేదా అని ఎవరూ నన్ను అడగలేదు. ఆమె అంతటితో ఆపింది. ఇంకా ఏమైనా చెపుతుందా అని వేచి చూశాను. ఆమె ముందు నేను హీనుడిననీ, సంస్కారం లేనివాడిననీ, ఏమీ సాధించని నిష్ప్రయోజకుడిననీ అనిపించింది నాకు. నేను మంచి యోధుడినని

నాకు తెలుసు, కానీ రుద్రకుడి పర్యవేక్షణలో శిక్షణ పొందిన 300 మంది సైనికులకీ ఆ ప్రతిభ ఉంది. నాకు బ్రహ్మశిక్షణ ఇచ్చాడు, కానీ అతను నేర్చిన విద్యని చాలామటుకు నేను తిరస్కరించి వదిలేశాను. ఈ పరిచయం ముగిసిపోతే బావుండునని అనిపించింది. ప్రహస్తుడు ఆ సముద్రపు దొంగతో చేసుకోబోయే ఒప్పందం ఎలా ఉండబోతోందా, అంత పెద్ద మొత్తాన్ని అతనికి ఎలా ఇస్తామా, ఎలా తప్పించుకుంటామా అనే ఆలోచనలో పడిపోయాను. ఆ సమయంలో నేను నిర్ఘాంతపోయేట్టు మండోదరి పాట అందుకుంది. పాట చాలా బావుంది, బలిచక్రవర్తి పరిపాలన గురించి గొప్పగా వర్ణించే పాట అది. ఆమె చాలా చక్కగా పాడింది. ఆమె గొంతు శ్రావ్యంగా ఉంది, లయ అద్భుతంగా ఉంది. భావానికి తగ్గట్టు పైకీ కిందికీ పలుకుతోంది. పాటలో ఎటువంటి లోటూ లేదు, కానీ ఆ గొంతులో ఆత్మ లేదు. ఆమె పాట మరీ నిర్దుష్టంగా ఉంది, అందుకే ఆ పాటలో ఆత్మ లోపించింది. గొంతులో భావస్ఫోరణ లేదు. ఆమె పాడే పాట తాలూకు అర్థం ఆమెకి తెలిసినట్టు లేదు. అదొక యాంత్రికమైన పనిలా, భావం, అర్థం ఎంతమాత్రం తెలీకుండా చేసే ఒక క్రియలా అనిపించింది. ఏ సంగీత విద్వాంసుడూ ఆమె పాటలో తప్పులు ఎత్తి చూపించలేడని చెప్పవచ్చు కానీ ఎక్కడో దానిలో చెవికి కటువుగా అనిపించే ధ్వని పొడసూపింది.

ఎంత హఠాత్తుగా పాడటం మొదలుపెట్టిందో అంతే హఠాత్తుగా మండోదరి పాడటం ఆపేసింది. మా ఇద్దరిమధ్యా ఇబ్బందికరమైన నిశ్శబ్దం నెలకొంది. నాకు ఏం చెయ్యాలో పాలుపోలేదు. ఆమెని ప్రశంసించాలా? పాట బావుందని అభినందించాలా? వీపు తట్టి నునుపైన ఆమె చర్మ సౌందర్యాన్ని స్పృశించాలా? లేక చిరునవ్వు నవ్వి ఊరుకోవాలా? బహుశా ఆమెకి జవాబుగా నేను కూడా పాడాలేమో? నేను అయోమయంలో పడి అలా నిలబడిపోయి, ఎవరైనా వచ్చి నన్ను రక్షిస్తారా అని ఎదురుచూడసాగాను. ఆ పరిస్థితి నాకు చాలా ఇబ్బందికరంగా మారింది. ఇంతకుముందు నా గదిముందునించి జనం వెళ్తున్నారనీ, నాతో మాట్లాడేందుకు వస్తున్నారనీ విసుకున్నాను. కానీ

ఇప్పుడు ఎవరైనా వస్తే బావుండునని ప్రార్థించాను, అది ముసలాయన మయుడైనా పరవాలేదు, ఆయన వచ్చి నన్నీ స్థితిలోంచి బైట పడేస్తే చాలు.

"అయితే, పరిచయాలు ముగిశాయా? వచ్చే వారమే మీ ఇద్దరికీ పెళ్లి. నేను మన బంధువులందరికీ సమాచారం అందించేందుకు వార్తాహరులని పంపాను. మిగతావారికి తరవాత చెబుతాం," అంటూ అమ్మ గదిలోకి వచ్చింది. ఆ నిర్మాణ నిపుణుడు ద్వారం దగ్గర నిలబడి కిటికీ పక్కన అలంకరణకోసం నిర్మించిన స్తంభం బాగాలేదని గొణుక్కుంటున్నాడు. నా చెల్లెలు గుమ్మంలో నిలబడి కాబోయే వదిన గారిని మహదానందంగా చూస్తోంది.

'కాని, అమ్మా...", ఉన్నట్టండి అడుగుల చప్పుడు వినిపించి నేను మధ్యలో ఆగిపోయాను. అందరం మౌనంగా ఉండిపోయాం. ప్రహస్తుడూ, జంబుమాలీ, వాళ్ల వెనకే మారీచుడూ లోపలికి వచ్చారు. మా ఏకాంతాన్ని వీళ్లందరూ భంగం చేశారని మొదట కోపం వచ్చినా, అదే సమయంలో సంతోషంకూడా కలిగింది. మా అమ్మని చూడగానే ప్రహస్తుడు వంగి నమస్కరించి, కుశల ప్రశ్నలు వేశాడు. మారీచుడు తిన్నగా మా అమ్మ దగ్గరకెళ్లి,"చెల్లీ, సంబంధం నిశ్చయమైనట్టేనా? చూడు, వాడెలా సిగ్గు పడుతున్నాడో!" అన్నాడు. ఆయన కళ్లు కొంటెగా మెరిశాయి.

ఆయన్ని గొంతునులిమి చంపాలనిపించింది నాకు.

కుంభకర్ణుడూ, విభీషణుడూ గదిలోకి పరిగెత్తుకుని వచ్చారు. కుంభకర్ణుడు నన్ను వాటేసుకున్నాడు. రెండు రోజులుగా గడ్డం గీసుకోలేదు లాగుంది, వాడి గరుకు చెంపలు నా ముఖానికి గుచ్చుకున్నాయి. వాడి దగ్గర తాటికల్లు వాసన గుప్పుమంది.

"సరే... మేం మగాళ్లం రాజ్యానికి సంబంధించిన ముఖ్యమైన విషయాలు మాట్లాడుకోవాలి, మీ ఆడవాళ్లకి అభ్యంతరం లేకపోతే ఇక్కడినించి వెళతారా?" అన్నాను.

నా చెల్లి మూతి ముడుచుకుని బైటికి వెళ్లింది. అమ్మ బైటికి వెళ్లేముందు నా దగ్గరకొచ్చి, నుదుటిమీద ముద్దుపెట్టుకుంది. మండోదరి నవ్వు ఆపకునేందుకు ప్రయత్నించటం చూసి నా ముఖం ఎర్రబడింది. మయుడు బైటికిపోకుండా అక్కడ ఉన్న వాస్తుకళని చూసి ఆనందించాలని ప్రయత్నం చెయ్యబోయాడు. మారీచుడు ఎంతో దయగా ఆయన్ని గదిబైటికి తీసుకుపోయాడు. అంత సౌమ్యంగా ప్రవర్తించటం ఆయనవల్లే అవుతుంది. మేము మౌనంగా కూర్చున్నాం. నిశ్శబ్దం భరించటం కష్టమనిపించి ప్రహస్తుడు మోటుగా ఉండే పాటలు పాడటం మొదలుపెడతాడేమో అని అనుకుంటూ ఉండగానే మారీచుడు తల ఆడిస్తూ, కళ్లు తిప్పుతూ లోపలికి వచ్చాడు.

"మారీచా, నీ అల్లరి చేష్టలు అయిపోతే, మనం కాస్త పని విషయం చూద్దామా?" అన్నాడు ప్రహస్తుడు. ప్రహస్తుడు తనతో సమానహోదా కోసం పోటీ పడుతున్నాడని గ్రహించి మారీచుడు చిన్నగా నవ్వాడు. "ఆ సముద్రపు దొంగతో బేరం చాలా కష్టమయింది. అతను ఒక పట్టాన దేనికీ ఒప్పుకోలేదు. మీకు నేను చెప్పేది నచ్చకపోవచ్చు, కానీ బలాలని సమకూర్చుకునేందుకు మనకి సమయం కావాలి," అని ప్రహస్తుడు ఆగాడు. నా ముఖం తెల్లగా పాలిపోయింది. అతను పెట్టిన షరతులేమిటో నాకు వినాలనిపించలేదు. నాకు యుద్ధం చెయ్యాలని చాలా తహతహగా ఉంది. కానీ వివేకం నన్ను అడ్డుకుంది, మూర్ఖంగా త్వరపడి తెగువ చూపటంవల్ల ఎటువంటి ప్రయోజనమూ ఉండదని హెచ్చరించింది. ఎంతోమంది అసురులు అందుకే ప్రాణాలు కోల్పోయారనీ, వాళ్లపేర్లు పల్లెపాటల్లో మాత్రమే మిగిలి ఉన్నాయనీ, గ్రహించాను.

ప్రహస్తుడు శాంతంగా ఇలా చెప్పాడు, "ఇప్పుడు మనం రెండు లక్షల స్వర్ణముద్రలు ఇవ్వాలి, మూడునెలలకి ఒకసారి 20,000 స్వర్ణముద్రలూ, మన నౌకల్లో అన్నిటికన్నా మంచి నౌకలు ఏడూ, మనం పండించే మిరియాలలో మూడవవంతూ, ఏలకులు, లవంగాలలో ఐదవ వంతూ, రేవుల్లో మనం వసూలు చేసే రుసుములో నాల్గవ వంతూ

ఇచ్చుకోవాలి."

"ఈ చిన్న చిన్న వాటికి మనకి దొరికే ప్రతిఫలం ఏమిటట?" నేను వ్యంగ్యంగా అన్నమాటలు ఆ ముసలాయనకి కోపం తెప్పించవని ఆశించాను.

'మహాప్రభూ! మనం ఏమీ అడిగే స్థితిలో లేము," అన్నాడు ప్రహస్తుడు నిర్లిప్తంగా, "అతను అన్ని రకాల దాడులనించీ రక్షణ కల్పిస్తానని అన్నాడు. సముద్రం మీద రక్షణకోసం దళాలని పంపి, సముద్రపు దొంగలు రాకుండా చేస్తానన్నాడు."

మళ్లీ మౌనం తాండవించింది. అందరికీ అది ఇబ్బందిగానే ఉంది. మనసులో లెక్కలు వేసుకోవటం ప్రారంభించాం. మొత్తం ఎంత ఇచ్చుకోవాలో ఎవరికీ స్పష్టంగా అర్థం కాలేదు. కోశాగారంలో ఎంత ధనం ఉందో ఎవరికీ తెలీదు. మా ధాన్యాగారాల్లోనూ, గిడ్డంగుల్లోనూ ఎంత ఉందో తెలీదు. పన్ను ఎంత వసూలవుతోందో తెలీదు, అసలు ఆదాయం వివరాలే తెలీవు. యోధులైన మేము అవి మా తాహతుకి తగనివని అనుకున్నాం. ఆ పని చాలా హీనమైనదనీ, గణకులు చూడవలసిన పని అనీ భావించాం.

12. తియ్యగా మాట్లాడేవాడు

భద్రుడు

ఆ రోజు, నేను ఆమె ఇల్లు కనుక్కునేసరికి రాత్రి బాగా పొద్దుపోయింది. అప్పటికే తప్పతాగి ఉన్నాను. దారిలో మూడు కల్లు దుకాణాల్లో ఆగి బాగా తాగాను. తలుపులని బాదుతూ నోటికొచ్చినట్టు తిట్టసాగాను. మాల తలుపు తెరిచి, గిన్నెడు నీళ్లు నా తలమీద కుమ్మరించింది. ఆ చల్లటి నీళ్లు నన్ను కొయ్యబారిపోయేట్టు చేశాయి. అప్పుడు నా నడుముకి ఉన్న పట్టీని పట్టుకుని తడిసి మద్దయి ఉన్న నన్ను ఆమె లోపలికి లాగింది. గదిలోని మంచం దగ్గరకి మేము చేరేసరికి నేను పసిపాపలా ఏడుస్తున్నాను. ఆమె నన్ను బుజ్జగిస్తూ ఓదార్చింది. నేను ప్రేమలో పడ్డాను అని తెలుసుకున్నాను.

చాలాకాలంగా ఎవరైనా వచ్చి నన్ను నా ప్రభువు దగ్గరికి తీసుకెళ్లారేమో అని ఎదురు చూశాను. వీధిలో జనం గుంపులు గుంపులుగా నడుస్తున్నారు, కబుర్లు చెప్పుకుంటూ, రాజకీయాల గురించీ, తమ భవిష్యత్తు గురించీ చర్చించుకుంటూ వెళ్తున్నారు. నేను కూడా వాళ్లతో చేరి సామాన్య జనం ఏమనుకుంటున్నారో తెలుసుకోవాలని అనుకున్నాను. కానీ నన్ననా ప్రభువు దగ్గరికి తీసుకుపోయేందుకు ఎవరైనా వార్తాహరుడు వస్తే నన్ను కలుసుకోకుండానే వెళ్లిపోతాడన్న భయంతో ఎక్కడికీ కదల్లేకపోయాను. ఒకవేళ ప్రభువు తానే స్వయంగా వచ్చి నన్ను తనవెంట తీసుకెళ్లాడేమో! నన్ను దగ్గరకి తీసుకుని నేను చేసిన సహాయానికి నాకు ధన్యవాదాలు తెలుపుతాడు అతను. అదంతా ఆ శివుడి కృపవల్ల సాధ్యమైందని అంటాను. ఆయన లీలలో నేనొక పావుని మాత్రమే అని అంటాను. నేనలా కలలుకంటూనే ఉన్నాను. కానీ ఎవరూ రాలేదు. నా ముఖంమీంచి చెమట ధారలు కట్టి నా ఛాతీని తడిపివేస్తుంటే, అలాగే

కూర్చుండిపోయాను. అయినా అక్కడినించి కదిలే ధైర్యం చెయ్యలేకపోయాను. నా ప్రభువు నన్ను మరిచిపోయాడు. నాకది నమ్మశక్యం కాలేదు. లేదు, ఆయన పనిలో ఉన్నాడు, తన కుటుంబసభ్యులు వెళ్లిపోయాక ఆయన నన్ను పిలుస్తాడు. కానీ సాయంకాలం అయేసరికి నా నమ్మకం సడలటం ప్రారంభించింది. వెళ్లి నా ముఖం ఆయనకి చూపించేందుకు కూడా భయం వేసింది. నేనెవర్ని? తుచ్ఛుడిని, చిన్న క్రిమి కీటకం లాంటి వాడిని. నామీద నాకే ఉమ్మేసుకోవాలనిపించింది.

చేసేందుకు పనేమీ లేకపోవటంతో, ఒక రోజు నేను కూరగాయలు కొనేందుకు మాలవెంట అంగడికి వెళ్లాను. వెనక్కి వచ్చేసరికి ఆమె ఇంటి ఆవరణలో ఒక ధనవంతుడు తన గుర్రం జూలుని ప్రేమగా నిమురుతూ కనిపించాడు. మేము సమీపించేసరికి అతను మావైపు చూసి చిరునవ్వు నవ్వాడు. మాల ముఖం సంతోషంతో వెలిగిపోవటం చూశాను. మరుక్షణం ఆమె కూరల బుట్టలు నాచేతికి ఇచ్చి, అతనికి దగ్గరకి పరిగెత్తి, బార్లా చాచిన అతని బాహువుల్లో కేరింతలు కొడుతూ ఇమిడిపోయింది. ముసురుకుంటున్న చీకటిలో నిలబడి, కదల్లేక మ్రాన్పడిపోయి, ఆ ఇద్దరూ సిగ్గులేకుండా ముద్దులుపెట్టుకోవటం చూశాను. చేతులతో కూరలు బుట్టలు పట్టుకుని నేనింకా అలాగే నిలబడి ఉండగా, వాళ్లిద్దరూ తమ గూటిలోకి వెళ్లి తలుపులు మూసుకున్నారు. గుర్రం నన్ను చూసి సకిలించింది. నా మనసు శూన్యంతో నిండింది, నామీద నాకే విపరీతమైన జాలివేసింది, జీవితం చేసే అన్యాయంపట్ల కోపమూ, నిస్పృహ పెరిగిపోయాయి. గుర్రం దగ్గరకి నడిచి, కూరలన్నిటినీ దానిముందు కుమ్మరించాను.

మళ్లీ వెనక్కి అంగడివీధిలోకి వెళ్లాను. మూడురోజులు పస్తులు ఉన్నాక, ఒక సత్రంలో వంటవాడిగా పని దొరికింది.

చలికాలం ముగిసిపోయే వేళకి, ఒక చిన్న సంఘటన నగరంలో పెద్ద అలజడిని సృష్టించింది. ఆ గొడవలకి, ప్రస్తుతం రాజ్యానికి నిర్మాణ నిపుణుడిగా ఉంటూ, నిగర్విగా నమ్రతతో తనపని చేసుకుంటూ ఉండే

మయుడు కారణమవుతాడని ఎవరూ అనుకుని ఉండరు. కానీ నిర్మాణకళలో తనకి ఉన్న ప్రతిభని ప్రదర్శించి, ఆయన అసలే ఒత్తిడితో, గాభరాతో, పస్తులతో బతుకుతున్న ప్రజల మనసుల్లోని సున్నితమైన భావాలని దెబ్బతీశాడు. శీతాకాలం ఉదయం ఆకాశం స్వచ్ఛంగా ఉంది. వీధిలో ఏదో గోల అవుతూంటే నాకు మెలకువ వచ్చింది. ఆ గోల భరించలేనంతగా పెరిగిపోయేసరికి కష్టంమీద మంచం దిగాను. బైట ఎవరో గట్టిగా శోకాలు పెడుతున్నారు. ఇంకా నిద్రమత్తు వదలకపోవటం వల్ల నాకు చికాకుగా ఉంది. పెద్దగా ఆవలించబోయి మధ్యలో ఆపెయ్యవలసి వచ్చింది. పైన ఆకాశంలో విమానం, అందులో మయుడు ఎగురుతూ కనిపించారు. ఆకాశంలో ఆ ఎగిరే విమానంతో రకరకాల విన్యాసాలు చేస్తూ ఆయన ఆనందం పొందుతున్నాడు. కింద జనంలో ఆయన చేష్టలవల్ల రేగుతున్న కోపం గురించి ఆయనకి ఏమీ తెలీటం లేదు. పెద్ద జనసందోహం భయాశ్చర్యాలతో ఆయనని చూసి కేకలు పెడుతున్నారు.

అది పుష్పక విమానం. పెద్దాయన మయుడు నిర్మించిన ప్రసిద్ధిగల ఎగిరే యంత్రం, అంటే దాన్ని కనిపెట్టింది ఇప్పుడు ఉన్న మయుడి తాతగారు. ఇలాంటి యంత్రాన్ని మొట్టమొదట రూపొందించి, దాన్ని మరింత వృద్ధి చేసే ప్రయత్నం చేసినది కుబేరుడు అని నేను విన్నాను. దానికి అతను ఎవరో మయుడు అనే వ్యక్తి సాయం తీసుకున్నాడనీ, ఆమయుడు గుర్రపుదౌడు పందెంలో అకాల మృత్యువువాత పడేసరికి ఆ విమానం తయారుచేసే పనిని ఆ లక్షాధికారి వ్యాపార ప్రభువు మధ్యలోనే వదిలేశాడనీ అన్నారు. ఇలాంటి యంత్రాన్ని తయారుచేసేందుకు కుబేరుడు అమితమైన ధనం ఖర్చుపెట్టాడు కానీ దీన్ని ఎగిరేట్టు చెయ్యలేకపోయాడని విన్నాను. నేనలా చూస్తూ ఉండగానే పుష్పకవిమానం అందంగా వయ్యారాలు పోతూ రాజభవనంవైపు తిరిగి ఎగురుతూ వెళ్లిపోవటం చూసి చకితుడినయాను.

అప్పటికి గాని జనం గోల తగ్గలేదు. లోగొంతులతో ఏదేదో అన్నారు.

అప్పుడు నా దృష్టి అతనిమీద పడింది - మాల ప్రియుడిమీద, అతను ఒక గోడమీద ఎక్కి నిలబడి గట్టిగా ఏదో అరుస్తున్నాడు. అతను ఏమంటున్నాడో వినాలని, జనాన్ని తప్పించుకుంటూ అతనివైపు నడిచాను. గోల క్రమక్రమంగా పూర్తిగా అణిగిపోయింది. అక్కడక్కడ ఎవరో గొణగటం, రహస్యంగా మాట్లాడటం వినిపిస్తోంది, అంతే. అప్పుడు నా విరోధి కోపంగా అరిచాడు.

"ఇది పూర్తిగా పనికిమాలిన పని, సోదరులారా! మనకి ఇది అవసరమా? మనం తిండిలేక మాడుతూ ఉంటే మన రాజు విలాసాల్లో తేలిఆడుతున్నాడు." జనం అతనితో ఏకీభవిస్తూ గొంతు కలిపారు. "రావణుడు మీ కర్మఫలం, అలాంటి రాజు మనకి అవసరమా?

"లేదు, లేదు, లేదు?" అందరితోపాటు నేను కూడా గొంతు కలిపాను.

"మీ పిల్లలు పస్తులు పడుకుంటూ ఉంటే, కోటలో ఉన్న విదూషకులు గాలిలో ఎగరాలని అనుకుంటున్నారు," అని అతను అందరూ నిశ్శబ్దంగా అయేవరకూ లేచి చుట్టూ చూశాడు. "ఇతను దేవతలని ధిక్కరిస్తున్నాడు. దేవుళ్లు కూడా ఆకాశంలో ఎగరటం లేదు, అలాంటప్పుడు ఈ రాజు ఇలాంటి వెర్రి శాస్త్రజ్ఞులు ఎగిరే యంత్రాలు తయారుచేసేందుకు ధారాళంగా ధనం వెచ్చిస్తున్నాడు." జనం తిరస్కారం ప్రకటిస్తూ ఛీకొట్టారు. "మీ పిల్లలు ఆకలితో చనిపోతే, మీ పొలాలు మీ బంధువుల శవాలతో నిండిపోతే, మీ పశువులు దాహంతో చనిపోతే, మీ రాజు పైన ఆకాశంలో ఎగురుతూ మీ వినాశనాన్ని తిలకిస్తాడు. ఎందుకు?"

"ఎందుకు? ఎందుకు?" వేలగొంతులు అతని ప్రశ్నని ప్రతిధ్వనించాయి.

"ఎందుకంటే రాజుకి మీరంటే భయం. మీలాంటి సామాన్య జనంతో కలవటానికి కిందికి దిగిరావటం అతనికి ఇష్టంలేదు. రావణుడు సిగ్గుపడాల్సిన విషయం ఇది!" అతను రొమ్ముమీద గట్టిగా

గుద్దుకుంటూ గట్టిగా హూంకరించాడు.

"సిగ్గు! సిగ్గు!" జనం కూడా అదేమాటను వల్లించి గుండెలమీద పిడికిళ్లతో గుదుకున్నారు.

"వరుణుడివల్ల మీ జీవితాలు ఇలా ఘోరంగా తయారయాయని అంటున్నాడు అతను. ఈ వరుణుడు ఎవరు? లంక ప్రజలమీద అతనికి ఏం హక్కుంది? అతనొక సముద్రపు దొంగ. ఇది మీ దురదృష్టం, కాదు కాదు, మీ బలహీనత, అందుకే రావణుడిలాంటి పిరికిపంద మీ రాజయాడు."

జనం గుంపు వెనకవైపున గలభా మొదలైంది. ఏం జరుగుతోందో చూసేందుకు నేను పైకీ, కిందికీ గెంతాను. ఏదో చిన్న కొట్లాట, అంత ముఖ్యమైనది కాదు. అందుకే మళ్లీ మాట్లాడుతున్న వ్యక్తివైపు తిరిగాను. "మనం రావణుడిని ఇక్కడికి రమ్మని పిలిచామా? వచ్చి మనని పరిపాలించమని కోరామా?

"లేదు, లేదు, లేదు!" జనం గర్జించారు.

"ఇంతకుమునుప పరిపాలించిన రాజు దుష్టుడే, కానీ అతను ధైర్యవంతుడైన దుష్టుడు."

"అవును, అవును!"

"అతను సముద్రపు దొంగలని దేశం ఛాయలకి రానివ్వలేదు. మిమ్మల్ని అతను దోచుకున్నాడు, కానీ అతనికి మనస్సాక్షి ఉంది. మిమ్మల్ని వంగదీశాడు కానీ నాశనం చెయ్యలేదు. తనకోసం విలాసవంతమైన జీవితాన్ని ఏర్పరచుకున్న తరవాత, మీకోసం తినేందుకు కొంత ఆహారం వదిలాడు. ఈ పిరికిపంద, రావణుడు, మోసంచేసి రాజ్యాన్ని చేజిక్కించుకున్నాడు. ఆ తరవాత తన రాక్షస నీతిని మీమీద బలవంతంగా రుద్దాడు. పసిపాప నోటిదగ్గర పాలు లాక్కునే రకం. మీ రక్తం తాగుతాడు. తన విలాసాలకోసం డబ్బు సరిపోదనుకుంటే మీ భార్యలని సైతం అమ్మేయగలడు. అతను

బలహీనుడు, క్రూరుడు, అన్నిటికన్నా ముఖ్యంగా, పిరికిపంద."

అతని వాగ్ధాటికి నేను అప్రతిభుడినైపోయాను. అతని ఉపన్యాసం నిర్దుష్టంగా ఉంది, గొంతుని భావాలకి తగ్గట్టు పైకి లేపుతూ, కిందికి దింపుతూ పలికిస్తున్నాడు, హావభావాలు ఆకట్టుకునేట్టు ఉన్నాయి, జనం భావోద్రేకంతో ఊగిపోవటం గ్రహించగలిగాను.

"లంకాపరి పౌరులారా, లేవండి! మన అసురులకి క్రూరులైన, బలహీనులైన రాజులు అక్కరలేదు. ఈ వంచకుడిని తొలగించి, అతని కూటమిలో ఉన్న వారందరినీ సముద్రంలో పారేద్దాం. అప్పుడు వరుణుడితో పోరాడి అతని స్థానం ఏమిటో తెలియజేద్దాం. పదండి, రాజభవనానికి వెళ్లి ఆ రాక్షసుడిని సింహాసనం మీదనించి లాగి కింద పడేద్దాం. పదండి, అందరం కలి..." హఠాత్తుగా మాటలు ఆగిపోయి నిశ్శబ్దం అలుముకుంది. నెమ్మదిగా అతను ముందుకి పడిపోవటం చూశాను. అతని ఛాతీ ఎర్రబడింది. అప్పటికిగాని అతను తన చేతిలో పట్టుకున్న బాణం కొస నాకు కనబడలేదు. దాన్ని తన ఛాతీలోంచి బైటికి లాగి చేత్తో పట్టుకున్నాడు అతను. జనం భయభ్రాంతులై చూస్తూనే ఉండగా, అన్నివైపులనుంచీ సైనికులు గుర్రాలమీద వచ్చి, జనాన్ని కత్తులతో నరకటం ప్రారంభించారు. అక్కడ పరిస్థితి అంతా గందరగోళంగా తయారైంది. రుద్రకుడు గుర్రంమీద వేగంగా రావటం నాకు కనబడింది. దారిలో వచ్చిన వాళ్లందరినీ తొక్కుకుంటూ తన నల్లరంగు గుర్రాన్ని ఉపన్యాసం ఇచ్చిన వ్యక్తివైపు దౌడు తీయించాడు. నేను అక్కడినంచి పారిపోవాలనుకున్నాను, కానీ ఏదో ఆకర్షణకి గురయి, సంఘటనా స్థలం మధ్యకి చేరుకున్నాను. నా విరోధి చనిపోవటం చూడాలనిపించింది నాకు. అందుకోసం, ఎదురుగా పరిగెడుతూ వస్తున్న వాళ్ల శరీరాలు తగిలి నాకు నొప్పెట్టినా లెక్క చెయ్యకుండా, అటుకేసి పరిగెత్తాను.

నేను గోడ దగ్గరకి చేరుకునేసరికి, ఎంతోమంది నా కాళ్లు తొక్కేశారు. రుద్రకుడు కోపంతో, నిస్పృహతో వణికిపోవటం చూశాను. దెబ్బతిన్న వ్యక్తి రక్తసిక్తమై అక్కడ పడి ఉండటం అతనికి కనిపించలేదు. ఆ

కోపంలో రుద్రకుడు ఒక సైనికుడిని తన కత్తిపిడితో కొట్టాడు. దెబ్బ తగిలిన సైనికుడి గాయంలోంచి రక్తం కారుతున్నా లెక్కచెయ్యక, మిగతా సైనికులకి తిరుగుబాటుదారుని తక్షణం పట్టుకోమని కర్కశంగా ఆజ్ఞలు జారీ చేశాడు. అతను ఎంతోదూరం వెళ్లిఉండడని అన్నాడు. నేను నిరాశచెందాను. బాణం గురిగా తగిలి ఉండాలనీ, కొన్ని గంటల్లో అతను ప్రాణాలు కోల్పోవాలనీ ప్రార్థించాను. కానీ అలాగే జరుగుతుందని నిశ్చయంగా అనుకోలేకపోయాను. జీవితంలో నన్ను అదృష్టం ఏనాడూ వరించలేదు. అప్పుడు నగరంలో చాలాచోట్ల మంటలు లేవటం కనిపించింది. లంక తగలబడు తోంది. దీవిలోని ఆ నగరం అలా తగలబడటం భవిష్యత్తులో కూడా జరగవచ్చనీ, అదే మొదటిసారి కాదనీ అనుకున్నాను.

13. సముద్రపు దొంగల బెడద

రావణుడు

"తిరుగుబాటుని బలాలతో అణగతొక్కండి. దేశద్రోహుల నెవరినీ విడిచిపెట్టవద్దు," నా వాళ్ల నాశనాన్ని కోరుతూ అలాంటి ఆదేశాన్ని ఇచ్చి నేను సముద్రంవైపు తలతిప్పి చూశాను. 'నా ప్రజల మేలుకోసం,' అని నాకు నేను సర్దిచెప్పుకున్నాను. అప్పుడు నా అంతరాత్మ మాట్లాడటం మొదలుపెట్టింది. 'కానీ, ప్రతి నిరంకుశ ప్రభువూ చెప్పింది అదేనని చరిత్రని తిరగేస్తే తెలుస్తుంది, రావణా!' అంది. నన్ను వెక్కిరించే నా అంతరాత్మని గొంతునులిమి చంపెయ్యాలని ఎంతో అనిపించింది.

ఒక్కరొక్కరుగా అందరూ గదిలోంచి వెళ్లిపోయారు. నాకు ఒంటరితనం అనిపించింది, చాలా ఒంటరివాడినని అనిపించింది. దూరంగా బూడిదరంగు ఆకాశంలో పొగ మెలికలు తిరుగుతూ పైకి పోవటం కనిపించింది. అక్కడ కొందరి జీవితాలు కాలిపోతూ ఉండవచ్చు. నేను చాలా న్యాయబుద్ధీ, ధర్మాన్నీ, నీతినీ, నిలబెట్టే స్వభావమూ కలవాడినని అనుకుంటూ ఉంటాను. కానీ ఇప్పుడు అదంతా నాచుట్టూ, నా భవనం చుట్టూ పొగలా కమ్ముకుని ఆకాశంలోకి వెళ్లిపోతోందన్న భావన కలిగింది. రాజుగా ఇప్పుడిప్పుడే జీవితం ప్రారంభించాను, అప్పుడే అన్నీ కోల్పోయానని అనుకోనక్కర్లేదని నాకు తెలుసు. ఇంకా చాలా దూరం ప్రయాణం చెయ్యవలసి ఉంది. ఇంకా ఎంతోమందిని చిత్రహింసలకి గురిచెయ్యాలి, ఎందరి జీవితాలనో ధ్వంసం చెయ్యాలి, నన్ను నేను సమర్థించుకోవలసిన సందర్భాలు ఎన్నో ముందున్నాయి, ఇంకా భయంకరమైన పనులు చెయ్యవలసి ఉంది. అప్పుడే పశ్చాత్తాపానికి గురైన నాయకుడిలా బాధపడాల్సిన అవసరంలేదు. వరుణుడి ఓడలో ఏదైనా చిన్న ఉద్యోగానికి ఖాళీ ఉందేమో?

నెమ్మది నెమ్మదిగా నాలో ఏదో కొరవడిందన్న భావం నన్ను ముంచెత్తింది. నా చుట్టూ జరిగే సంఘటనల మీద నా పట్టు ఉండటం లేదు. నా విధిని నేనే అదుపు చేస్తానని అనుకుని ఎక్కువకాలం అవలేదు, ఇతరుల భవితవ్యాన్ని కూడా నా చేతుల్లోనే ఉంచుకుంటానని అనుకున్నాను. కానీ ప్రస్తుతం కృతజ్ఞత లేని రాజ్యం మాత్రం నాకు మిగిలింది. అది కూడా నన్ను అణిచివెయ్యాలనే ప్రయత్నిస్తోంది. సముద్రం మీదుగా చల్లటి ఉప్పగాలి తెర వచ్చి గదిలోని చిన్న దీపాన్ని ఆర్పేసింది. అలలు తీరానికి కొట్టుకుని విరిగిపడటం నాకు వినిపిస్తోంది. సముద్రంమీద నెమ్మదిగా మంచుతెర పైకి లేచింది. దూరాన ఉన్న దీపాలు నృత్యం చేస్తున్నట్టు కనిపించసాగాయి. బహుశా అవి వరుణుడి నౌకలోని దీపాలు అయి ఉండవచ్చు. నా మస్తిష్కంలో ఒక వ్యూహం రూపుదిద్దుకోసాగింది. నేను ఏదో ఒకటి చెయ్యాలి. ఊరికే కూర్చుని ఉండకూడదు. ఎవరో నా జీవితం గురించి ప్రణాళికలు వెయ్యటం నాకు నచ్చదు. కిటికీ దగ్గర్నించి ఇవతలికి వచ్చానో లేదో...

"ఎవరది?" అంటూ ఒరలోంచి కత్తి బైటికి తీశాను. గుమ్మం దగ్గర మసక వెలుగులో ఒక చిన్న ఆకారం కనిపించింది. గదిలోని చీకటిలోకి అది వేగంగా ప్రవేశించేసరికి, నేను తడబడి, ఆ చీకటిలో చూసేందుకు కష్టపడి ప్రయత్నించాను. నేను ఒక మూలకి గెంతి, కత్తి తిప్పసాగాను. నా వెన్ను గోడకి ఆన్చి, ముందుభాగాన్ని రక్షించుకునే ప్రయత్నం చెయ్యాల్సివచ్చింది. వెన్నుపోటు పొడుస్తారన్న భయాన్ని విడిచిపెట్టాను.

"మహాప్రభూ! నేను."

"ఎవరు నువ్వు?"

నిశ్శబ్దం... వచ్చినవాడు శత్రువు అయినట్టయితే, అలా మాట్లాడి తనని తాను బైట పెట్టుకుని ఉండడు. నేను కాస్త స్థిమితపడ్డాను, కాని కొన్ని క్షణాలే, "నిన్ను ఏమీ చెయ్యను, వెలుతురులోకి రా!" అన్నాను అడుగుల చప్పుడు వింటూ. గుమ్మం దగ్గరకి వస్తాడని అటువైపు చూస్తూండగా, ఒక చెయ్యి నా మణికట్టుని గట్టిగా పట్టుకుంది.

వచ్చినవాడు నా చెవిదగ్గర రహస్యం చెప్పినట్టు, "క్షమించండి మహాప్రభూ!" అన్నాడు. నేను అతని తొడలమధ్యన కాలితో తన్నబోతూంటే తప్పించుకుని, "నేను మీ శత్రువుని కాను, మీ సేవకుడిని, నన్ను నమ్మండి," అన్నాడు.

వసారాలోని మసక వెలుతుర్లో అప్పుడు చూశాను వాడిని. ఇంతకుముందు వాడిని ఎక్కడో చూశానని అనిపించింది. పాములాంటి ముఖం... పడగవిప్పిన నాగుపాము, కాటువేసేందుకు సిద్ధంగా ఉన్న విషసర్పం.

"భద్రుడివా..."

"మీ సేవకుడిని మహాప్రభూ!"

"ఎంత ధైర్యం నీకు?"

"క్షమించండి, ప్రభూ! కానీ నేను చెప్పేది కాస్త వినిపించుకోండి." ఏం చెయ్యాలా అని ఆలోచిస్తూ అలాగే నిలబడ్డాను.

ఆ క్షణంలో వాడిని చంపేసి ఉంటే, చరిత్ర మరోవిధంగా ఉండేది. ఆహా, చరిత్ర... అది ఒక్కొక్కరికీ ఒక్కోరకంగా ఉంటుంది. దాని గమనం అదే నిర్ణయిస్తుంది. బహుశా ఏదో ఒకరోజు అంతా నిరర్థకమనే అనిపించవచ్చు. ఈ యుద్ధభూమిలో రక్తం ఓడుతూ, చనిపోబోతూ ఉన్న నేను చరిత్రలో ఒక గొప్ప అధ్యాయం సృష్టించానని అనుకోవచ్చు. ఒక వీరుడిలా జీవించాననీ, దుర్మారుడిలా మరణించాననీ, లేదా దానికి పూర్తిగా భిన్నంగా జరిగిందనీ కూడా అనుకోవచ్చు. కానీ వైభవంగా జీవించాననీ, గొప్ప మరణాన్ని పొందాననీ అనుకోవటం కేవలం నా భ్రమే అయిఉండవచ్చు.

ఒక చిన్న రాజ్యపు రాజకుమారుడు రాముడితోనూ, అతని వానరసేనతోనూ చేసిన ఈ యుద్ధం నా జీవితాన్ని నాశనం చేసింది. నేను సాధించినదంతా బూడిదలోపోసిన పన్నీరైపోయింది. కానీ ఇది మానవజాతి చరిత్రలో ప్రాముఖ్యత ఎంతమాత్రం లేనిదిలా

మిగిలిపోవచ్చు. అయినా చరిత్ర గురించి నేనెప్పుడు పట్టించుకోవటం ప్రారంభించాను? చరిత్ర నాతోనే మొదలై నాతోనే ముగిసి పోతుంది. నా అవయవాలని తింటున్న నక్కకి తాను చరిత్రలో ఒక భాగాన్ని కబళిస్తున్నానని తెలిస్తే అది ఆశ్చర్యపోవచ్చు. అయినా దీనివల్ల ఒరిగేదేముంది? ఒకసారి చక్రవర్తిలాగానూ, మరోసారి విదూషకుడిలాగానూ ప్రవర్తిస్తూ, లేదా ఒకేసారి రెండు పాత్రలూ పోషిస్తూ జీవించిన నాలాంటి తుచ్ఛుడు ఏం చేశాడో, ఏం చెయ్యటం మరిచిపోయాడో ఈ క్రూరమైన ప్రపంచానికి ఏంపట్టింది? దేనినీ లక్ష్యం చెయ్యని ఈ జగత్తు నేను పుట్టకముందు కూడా ఉంది, నేను చనిపోయి మట్టిలో కలిసిపోయాక కూడా దాని అస్తిత్వం కొనసాగుతూనే ఉంటుంది.

కానీ అప్పట్లో నాకు అంత జ్ఞానం లేదు, వయసు తక్కువ, ఇప్పుడు వయసు మరీ పెరిగిపోవటంచేత దాన్ని పట్టించుకునే ఓపికలేదు. అందుకే వాడు చెప్పేది పూర్తిగా విన్నాను. తన గతంలోని చీకటి వీధుల్లోకీ, అడ్డదిడ్డంగా అల్లుకున్న వర్తమానం తాలూకు సందుగొందుల్లోకీ వాడు నన్ను తీసుకుపోయాడు. వాడు ఏడుస్తూ ఉంటే నేను నిర్లిప్తంగా ఉండిపోయాను. లంకని జయించాక వాణ్ణి వదిలేసినందుకు నన్ను నిందిస్తూ ఉంటే, నాకు నిజంగా ఆశ్చర్యం వేసింది. నా విజయానికి కారణం నేను వేసుకున్న వ్యూహం కాదా? దానితో అసలు ఈ మనిషికి ఏమిటి సంబంధం? కానీ వాడిమీద నాకు జాలి కలిగింది, నా సవతి అన్న రథం కిందపడి, గాయాలతో రాత్రంతా మూలిగిన కుక్కపిల్లమీద కలిగిన జాలిలాంటిది. వీణ్ణి నేను పెంపుడు కుక్కపిల్లలా దగ్గర ఉంచుకోవచ్చు, ప్రహస్తుడిమీద పగ తీర్చుకునేందుకైనా సరే. ఆ ఆలోచనే నాకు ఆనందాన్ని ఇచ్చింది. నేను చిరునవ్వు నవ్వాను. నేను ఒప్పుకున్నానని అనుకున్నాడు ఆ మూర్ఖుడు, భద్రుడు. నా కాళ్లమీదపడి నా పాదాలను ముద్దుపెట్టుకోసాగాడు.

నేను నిర్ఘాంతపోయాను. ఎవరైనా ఇంతగా ఎలా దిగజారగలరు?

నా పాదాలని వెనక్కి తీసుకోవాలని ప్రయత్నించాను, కానీ విచిత్రంగా వాడు అలా చెయ్యటం నాకు ఆనందాన్నే కలగజేసింది. లోపల ఎక్కడో ఎవరో చక్కిలిగింతలు పెట్టినట్టు సంతోషించాను. అంతలోనే అపరాధభావం ఆ కాస్త సంతోషాన్నీ మింగేసింది. వాణ్ణి పట్టుకుని కుదిపాను. వాణ్ణి చూస్తే అసహ్యం వేసింది, నామీద నాకే వెగటు పుట్టింది.

"నువ్వు నా అంతరంగ సేవకుడివి. వ్యక్తిగత సహాయకుడిలాంటి గొప్ప పదవులేవీ నీకు ఇవ్వలేదు. నా పనులు చేసిపెట్టే ఉత్తసేవకుడివి, అంతే."

"పెంపుడు కుక్కలాగ మీకు సేవచేసుకుంటాను, మహాప్రభూ!"

నాలో ఏదో కలుక్కుమంది. నా ఆలోచనలని ఇతను పసిగట్టాడా? నాలో ఉప్పొంగుతున్న ద్వేషాన్ని ఇతని మనసు గ్రహించగలిగిందా? నా కుక్కపిల్ల, నా ఆటవస్తువు, భద్రుడు! నా దృష్టిలో నేనే దిగజారిపోయాను. లేదు నేను ఇతన్ని మిత్రుడిలా, నాతో సమానంగా - సరే, మరీ సమానంగా కాకపోయినా దాదాపు అలాగే భావిస్తాను. ఒక బానిసకి తన యజమానితో సమానమైన హక్కులా? నేను నవ్వలేక పొట్టచెక్కలై చనిపోతాను. 'కానీ, రావణా! ఇతని ముఖానికేసి చూడు, ఆ సన్నని చేతులూ, బానలాటి పొట్టా చూడు, ఇతను నీతో సమానంగా ఉండగలడా? భద్రుడు పనికిమాలినవాడు, నీ పరిపాలనలో ఉన్న అతినీచమైన వాళ్లలో ఒకడు.' కాదు ఇతను నా అసురజాతి తాలూకు ప్రతినిధి, సామాన్య జనులకీ నాకూ మధ్య ఉండే వారధి. ఇతను జనాభిప్రాయాలని నాకు అందజేస్తాడు. అప్పుడు నేను అందరికీ న్యాయం, సమృద్ధి అందేటట్టుగా పరిపాలిస్తాను.

"నువ్వు ఇక వెళ్లవచ్చు," అన్నాను. వాడు వంగి వంగి నమస్కరిస్తూ నెమ్మదిగా నిష్క్రమించాడు.

నేను ఇప్పుడు ఏదో ఒకటి చెయ్యటం అత్యవసరం. అసంపూర్తిగా వదిలేసిన ప్రణాళికలని మళ్లీ ఒకసారి పరిశీలించాను. వివరాలని బాగా

నెమరువేసుకునే క్రమంలో నాకు నిద్రపట్టేసింది. మర్నాడు ఉదయం, నాకు మరిన్ని సమస్యలు ఎదురయాయి. మారీచుడు నాతో కుంభకర్ణుడి గురించి మాట్లాడాలని కోరాడు.

"కుంభకర్ణుడికి ఏమైంది? మీ ఉద్దేశం పవిత్రుడైన విభీషణుడి గురించి కాదు గదా?" నా చిన్న తమ్ముడిమీద మమకారం ఉప్పొంగుతుండగా అడిగాను.

"విభీషణుడి గురించి ఇంకొక రోజు మాట్లాడుతాను. ముందు ఈ బుద్ధిహీనుడి గురించే తక్షణం మాట్లాడాల్సిన పని ఉంది." కుంభకర్ణుడిని అతను అలా అనటం విని నాకు నవ్వు వచ్చింది. "ఇది నవ్వవలసిన విషయం కాదు, రావణా! వాడు చెడు అలవాట్లు నేర్చుకుంటున్నాడు. యువతులంటే వాడికి బలహీనత ఉందని మనకందరికీ తెలుసు. వాడు చాటుమాటుగా ఎలాంటి వ్యవహారాలు నడిపినా మనం విచారించక్కర్లేదు. వాడు మద్యం దుకాణాలకి వెళ్లి నాటుసారాని ఏనుగులా తాగేసి, డబ్బు చెల్లించటం గురించి నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నాడు."

"చిన్నతనం కదా, ఏదో సరదాకి అలా ప్రవర్తిస్తున్నాడు. ఎవరినైనాపంపి ఆ అప్పు తీర్చెయ్యమనండి. ఆ ఖర్చునా ఖాతాలో జమ చెయ్యండి- అంటే నా ఉద్దేశం, లంక మీదకి దండెత్తకముందు మనం పోగుచేసిన ఖాతాలోంచి- నా తమ్ముడి తాగుడు ఖర్చులు రాజ్యం భరించాల్సిన పనిలేదు."

"అంతేకాదు, రావణా! వాడు మత్తు పదార్థాలకి కూడా అలవాటు పడ్డాడు. నల్లమందుతో రకరకాల మత్తుపదార్థాలు తయారుచేసే స్నేహితులు ఉన్నారు వాడికి. సోమలత ఆకుల పసరుని కూడా వాళ్లు వాడతారు. కుంభకర్ణుడిని వాళ్లు చెడుతోవన తీసుకెళ్తున్నారు... నా దగ్గరున్న మెరికల్లాంటి అధికారులని కుంభకర్ణుడి చేష్టలు తెలుసుకుంటూ ఉండమని పంపాను. కొన్నాళ్లుగా నాకు కలుగుతున్న అనుమానాలు నిజమేనని వాళ్లు చెప్పారు. ఎప్పుడు చూసినా ఆ

మూర్ఖుడు మత్తుగా నిద్రపోతూనే ఉంటాడు, రావణా!"

"వాడు త్వరగా స్నేహం చేస్తాడు," అన్నాను. అసలు కుంభకర్ణుడు గొప్ప స్నేహశీలి. యజమాని ముద్దు చేసేందుకు ఎదురుచూసే కుక్కలాగ ఎప్పుడూ స్నేహం చేసేందుకు సిద్ధంగా ఉంటాడు.

"అసలు వాళ్లని స్నేహితులు అనవచ్చో, లేదో కూడా నాకు తెలీదు. వాళ్లు ఈ బుద్ధిహీనుడిని ఉపయోగించుకుంటున్నారు, కానీ ఈ దద్దమ్మకి ఆ సంగతి తెలీటం లేదు."

"అయితే, నన్నేం చెయ్యమంటారు, మామయ్యా?"

"వాడికి ఏదైనా అధికారం ఇయ్యి. నీ కొలువులో ఏదో ఒక పని ఇచ్చి చెయ్యమను."

"బంధుప్రీతి చూపిస్తున్నానన్న విమర్శ నాకు ఇష్టం ఉండదు."

"తెలివిమాలిన మాటలు మాట్లాడకు, రావణా. నీ రాజ్యంలో అధికార హోదాల్లో ఉన్నవాళ్లు చాలావరకు నీ బంధువులే, ప్రహస్తుడిలాగ, నాలాగ."

"మీ విషయం వేరు. మీకు దీర్ఘకాల అనుభవం ఉంది. రాజ్యాలని ఏలారు. కుంభకర్ణుడూ, విభీషణుడూ ఇంకా చిన్నవాళ్లు."

"వాళ్లు అలాగే ఉండిపోవాలని కోరుకుంటున్నావా? వాళ్లు ఎదగాలని నీకు అనిపించదా? రావణా, ఆ పదవులని నీ పిల్లలకోసం అట్టే పెడుతున్నావా? నీ రాజ్యాధికారాన్ని నీ తమ్ములు సవాలు చేస్తారని భయపడుతున్నావా?"

"ఇప్పుడు మీరు తెలివితక్కువగా మాట్లాడుతున్నారు. నేను అలాంటి వాడిని కానని మీకు తెలుసు. ఎల్లకాలం నేనే పరిపాలించాలన్న ఆశ నాకు లేదు. నాకు కొన్ని సిద్ధాంతాలూ, ఆదర్శాలూ ఉన్నాయి..."

"నాయనా, నువ్వు కూర్చున్న సింహాసనానికి నీ సిద్ధాంతాలని నీకు

అనువుగా తిప్పకునే శక్తి ఉంది."

"అధికారంవల్లభ్రష్టపడిపోతానని ఎందుకు అందరూ నన్ను నిందిస్తుంటారు? అసలు నాకు ఎటువంటి అధికారం ఉంది? పరిపాలించేందుకు నాకు ఒక నగరం ఉన్నంత మాత్రాన, జనంలో సగంమంది నా చావు కోరుకునే వాళ్లే అయినంత మాత్రాన... నీచుడూ నిరంకుశుడైన అసుర రాజుని కానని నేను నిరూపించు కోవాల్సిన అవసరం లేదే." 'కానీ నేను నా అధికారాన్ని నా తమ్ముడి లాంటి మూర్ఖులతో ఎందుకు పంచుకోవాలి?'

"అధికారం వల్ల నువ్వు పాడైపోవని నీకు అంత నమ్మకంగా ఉంటే..."

"ప్రహస్తుడిలా మాట్లాడటం మానండి. నేను మిమ్మల్ని పిలిచింది ఒక ప్రణాళిక గురించి చర్చించేందుకు. నాకు దాన్ని గురించి మీ అభిప్రాయం తెలుసుకోవాలని ఉంది. కుంభకర్ణుడు కూడా ఇక్కడ ఉండాలని కోరుతున్నాను."

కుంభకర్ణుడు కూడా వచ్చి మాతోపాటు కూర్చున్నాక నేను వాళ్లకి నా ప్రణాళిక గురించి చెప్పాను. ఇద్దరూ నోరు విప్పలేదు.

కాసేపటికి, "కానీ రేపు నీ పెళ్లి జరగబోతోంది. ఇప్పుడు ఈ పని చెయ్యటం చాలా ప్రమాదకరం," అన్నాడు మారీచుడు. ఆయన ముఖంలో ఆందోళన క్షణక్షణానికీ పెరగటం చూసి, మొదటిసారి నా ప్రణాళిక సవ్యమైనదేనా అన్న అనుమానం వచ్చింది.

"నాకది చాలా నచ్చింది. అద్భుతమైన ప్రణాళిక!" అంటూ కుంభకర్ణుడు కుప్పిగంతులు వేశాడు.

"ఎంతమంది మనుషులు కావాలి నీకు?" అన్నాడు మారీచుడు.

"మనం నలుగురమే. మామయ్యా మీరు, నేను, కుంభకర్ణుడు, భద్రుడు... బహుశా ఇంకో పది పన్నెండు మంది గజ ఈతగాళ్లు."

"ఊహు! ఇది మరీ ప్రమాదంతో కూడుకున్నది," అన్నాడు

మారీచుడు తల అడ్డంగా ఆడిస్తూ, "పైగా భద్రుడిని ఎంత వరకూ నమ్మవచ్చు?" అన్నాడు మళ్లీ తనే.

"మనకి వేరే మార్గం లేదు," అన్నాను.

"నేను దీనికి ఒప్పకోను," అని కుంభకర్ణుడిని వెంటపెట్టుకుని ఆయన బైటికి వెళ్లిపోయాడు.

ఈ ప్రణాళిక బొత్తిగా అర్థం లేనిది. పెద్ద నౌకాదళాన్ని కొద్దిమంది సైనికుల సాయంతో స్వాధీనం చేసుకోవటం అనే ఆలోచన మూర్ఖత్వానికి పరాకాష్ఠ. పైగా నేనిప్పుడు సైనికుడిని కాను. రాజైనవాడు మరీ అంత అజాగ్రత్తగా ఉండకూడదు. రాజు ఒక చిన్న సైనికుల గుంపుని వెంటపెట్టుకుని, ఈ లోకంలోనే అతి భయంకరుడైన సముద్రపు దొంగతో తలపడేందుకు అర్థరాత్రి బైలుదేరి వెళ్లాడన్న వార్త విని ప్రహస్తుడి ముఖంలో కదలాడే భావాలని ఊహించాను. ఆ ఊహకే నాకు నవ్వు వచ్చినంత పనయింది. ప్రహస్తుడి మీద పగ తీర్చుకోవటానికైనా సరే, ఆత్మహత్య లాంటి ఈ ప్రయత్నాన్ని కొనసాగించవలసిందే.

దూరాన ఉన్న సముద్రపు దొంగల నౌకలని చూశాను. వాళ్ల సందడి సద్దుమణిగింది. నౌకల్లో దీపాలు ఆర్చేశారు. సముద్రపు దొంగలందరూ తప్పతాగి, నిద్రమత్తులో ఉంటారని ఆశించాను. వాళ్ల రాజు, వరుణుడు ఏ నౌకలో ఉన్నాడో నాకు రూఢిగా తెలీదు. అన్నిటికన్నా ముఖ్యమైన విషయం మా దాడితో ఆశ్చర్య పరచటం. రాజుగా, నేను దానిమీదే ఆధారపడ్డాను. అది చాలా పెద్ద ప్రమాదమనీ, ఒక వేళ నేను గాని సముద్రపు దొంగలకి పట్టుబడితే లంక ద్వారాలు వాళ్లకి బార్గా తెరిచి స్వాగతం పలుకుతాయనీ, నా రాజ్యాన్ని వాళ్లు పూర్తిగా కొల్లగొడతారనీ నాకు తెలుసు. నాకు ఒక పక్క భయం కూడా వేసింది. మెదడునీ, శరీరాన్నీ మొద్దుబారేట్టు చేసే భయం. అసహాయులై బందీలుగా అతని చేతికి చిక్కితే వరుణుడు వాళ్లని ఎటువంటి చిత్రహింసలకి గురిచేస్తాడో, జనం కథలు కథలుగా చెప్పుకుంటారు. అంత పాషాణ హృదయం

కలవాడు కనుకే, అతన్ని దేవుళ్ల శ్రేణిలో చేర్చారు. నాలోని భయాన్ని నా ప్రజల పట్లా, బంధువుల పట్లా నాకు ఉన్న ఆందోళన అని సర్ది చెప్పుకోవాలని ప్రయత్నించాను.

నా వెనకే ఎవరో దగ్గటం విని ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూశాను. భద్రుడి అసహ్యకరమైన ముఖం కనిపించింది.

"మహా ప్రభూ! మీ ప్రజలు మీ సేవకైసిద్ధంగా ఉన్నారు," అన్నాడు భద్రుడు. వీడితోపాటు ఇంకో ఇరవైమంది నేను ఆజ్ఞాపిస్తే చాలు చనిపోవటానికైనా సరే సిద్ధంగా ఉన్నారు. కానీ ఒక సైన్యాన్ని యుద్ధరంగం వైపు నడిపించినప్పుడు కలిగిన భావన ఇప్పుడు ఎందుకు కలగటం లేదు?

నా భుజాలని నిటారుగా ఉంచి, తలపైకి ఎత్తిపెట్టి మౌనంగా గదిలోంచి బైటికి నడిచాను. ఆత్మవిశ్వాసంతో ప్రాచీన కాలపు యోధుల్లా కనిపించేందుకు ప్రయత్నించాను. వాళ్లు కూడా నా అంత భయంతోనే జీవించారా?

నాలో ఏదో నిస్పృహ జోలపాడుతున్నట్టు నేను నిష్క్రియుడినై ఆదమరచి ఉన్నాను. ఒడ్డున ఉన్న రాళ్లకి కొట్టుకుని అలలు చేసే చప్పుడు వినబడి నా సుషుప్తావస్థలోంచి మేల్కొన్నాను. భద్రుడూ, బక్కపల్చగా ఉన్న ఇంకొక వ్యక్తీ మూడు పడవలని సముద్రంలోకి తోశారు. ఒక్కొక్కరుగా, మొలలోతు నీళ్లలో ఈదుకుంటూ వెళ్లి ఆ పడవల్లోకి ఎక్కారు. నేను ప్రమాన్పడిపోయి చూస్తూ నిలబడ్డాను. ఉప్పొంగుతున్న సముద్రపు అలలని చూసి, మేము చనిపోవటం తథ్యం, అనుకున్నాను. వరుణుడి నౌకలు తీరానికి దగ్గర్లోనే లంగరు దింపి ఉన్నాయి. అయినా నా కళ్లకి అవి క్షితిజానికి దగ్గరగా, ఎక్కడో దూరంగా ఉన్నట్టు కనిపించాయి. నేను అలలలోకి దిగగానే నీట మునిగాను. అలలు నన్ను మళ్లీ తీరానికి చేర్చాయి. నన్ను నేను తిట్టుకుంటూ లేచి నిలబడి మళ్లీ పడవల వైపుకి ఈదాను. నా సైనికుల నల్లటి ముఖాలమీద కనిపించిన వెటకారపు నవ్వులని లక్ష్యపెట్టకుండా

ఉండేందుకు ప్రయత్నించాను. మొట్టమొదటి పడవలోకి దూకి కూర్చున్నాను. మరుక్షణం పడవ నడిపేవాళ్లు దాన్ని నౌకలవైపుకి నడపటం ప్రారంభించారు. మిగతా రెండు పడవలూ మమ్మల్ని అనుసరించాయి. దూరంగా ఉరుములు వినిపించాయి. ఆకాశంలో ఒక మెరుపు మెరిసి సముద్రపు దొంగల రాజు నౌకని ఒక్క క్షణం కనబడేట్టు చేసింది. సముద్రం అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. మిగతా రెండు పడవలూ వెనక ఉండిపోయాయి, కానీ వేగంగా తెడ్లువేస్తూ అందులో ఉన్నవాళ్లు వాటిని నడిపిస్తున్నారు. నెమ్మదిగా అలల ధాటికి తట్టుకుంటూ, మేము నౌకలకి కొన్ని గజాల దూరానికి చేరుకున్నాం.

ఇంకొక మెరుపు ఆకాశాన్నీ పొంగుతున్న అలలనీ మెరిపింపజేసింది. మొలకి చుట్టుకున్న గుడ్డ తప్ప, మిగతా బట్టలన్నీ విప్పేసి, నా కత్తిని పళ్ల మధ్య ఇరికించి, మంచులా చల్లగా ఉన్న నీటిలోకి దూకి నౌకలవైపు ఈదటం మొదలు పెట్టాను. నా వెనకే నా సైనికులు ఈదుకుంటూ వస్తున్న చప్పుడు వినిపించింది. పెద్ద పెద్ద అలలు ఒకదాన్ని ఒకటి తరుముకుంటూ వస్తూ ఉంటే నౌకలు వాటితోపాటు వేగంగా ఎగసి పడుతున్నాయి. వాటిని చేరుకోవటం అసాధ్యం అనిపించింది నాకు. వరుణుడు ఉండే నౌక ఇదే అని అనుకుని, నేను ఒక నౌక వైపు ఈదాను. నేను వాళ్లకి సంకేతం అందజేసినట్టు, ఇద్దరు సైనికులు నౌకలోకి ఎక్కేందుకు ప్రయత్నించారు. నిటారుగా ఉన్న ఓడ పక్కభాగాన్ని ప్రత్యేకంగా తయారుచేసిన పంజాల సాయంతో, పట్టుకుని ఎక్కుతున్న వాళ్లని చూడటం నాకు అద్భుతమనిపించింది. వాళ్లు వేగంగా, బల్లుల్లా, పైకి ఎగబాకారు. కానీ పైనించి రెండు తాళ్లు కిందికి పాముల్లా వేలాడేందుకు యుగాలు గడిచినట్టు అనిపించింది నాకు.

నేను ఎగిరి ఒక తాడుని దొరకబుచ్చుకుని పైకి ఎక్కసాగాను. భద్రుడు రెండో తాడు సాయంతో ఎక్కసాగాడు. ఆ తరవాత మిగతావాళ్లు కూడా పైకి ఎక్కటం మొదలుపెట్టారు. నౌక పై భాగానికి నేనే మొదట చేరుకున్నాను. అక్కడ కనిపించిన దృశ్యం చూసి హడిలిపోయాను. మొట్టమొదట నౌకలోకి ఎక్కిన ఇద్దరు

సాహసవీరులూ హత్యకి గురయారు - వాళ్ల నిర్జీవ శరీరాలు నౌక పైభాగంలో వెల్లకిలా పడి ఉన్నాయి. "వెనక్కి పదండి! మనని పట్టుకునేందుకు వీళ్లు ఉచ్చు పన్నారు!" అని అరిచాను.

ఇంతలో వర్షం కురవటం మొదలుపెట్టింది. హఠాత్తుగా పెద్ద తుఫాను వచ్చి నౌక భయంకరంగా ఊగసాగింది. నా సైనికులలో కొందరు సముద్రంలో పడిపోయారు, కానీ మరికొందరు ఓడపైకి ఎక్కినా దగ్గరకి వచ్చారు. హోరుమని వీచే ఈదురుగాలి శబ్దం తప్ప అంతటా నిశ్శబ్దం పరుచుకుంది. దాదాపు నగ్నంగా ఓడమీద అలా నిలబడి, తడిసి మద్దయి చావుకోసం ఎదురుచూడటం హాస్యాస్పదం అనిపించింది. నేలమీది రక్తాన్ని వర్షపు నీరు కడిగేసింది. అదే విధంగా నాలోని దుస్సాహసాన్ని కూడా అది తుడిచిపెట్టింది. 'భగవంతుడా! ఏం పని చేశాను?'

ఇంతలో ఆ చిమ్మచీకటిలో వికటాట్టహాసం మారుమోగింది. ఆకాశంలో మెరిసిన మెరుపు వెలుతురులో, మా చుట్టూ సాయుధులైన సముద్రపు దొంగలు నిలబడి ఉండటం చూశాను. వాళ్ల సంఖ్య ముందు మేము ఎందుకూ పనికిరామని తెలిసిపోయింది. తప్పించుకునేందుకు మార్గం కూడా కనబడలేదు. విపరీతమైన సంకల్పబలంతో నేను ఒక్క దూకు దూకి భయంకరమైన ఒక సముద్రపు దొంగ పొట్టలో కత్తితో పొడిచాను. అది చూసి నా సైనికులు ఉత్సాహం పుంజుకున్నారు. ఊగిపోతున్న ఆ నౌక పై భాగాన యుద్ధం ప్రారంభమైంది. నేను ఎవరినీ లక్ష్య పెట్టకుండా పోరాడసాగాను. ఆశ్చర్యకరంగా, నా భయం నన్నువదిలివెళ్లిపోయింది. మనస్ఫూర్తిగా యుద్ధం చెయ్యటం ప్రారంభించాను. ఎంతమందిని తెగనరికానో నాకే లెక్క తెలీలేదు. నౌక పైభాగం రక్తంతో తడిసి జారుడుగా తయారైంది. దానికి తోడు వేలాడుతున్న తాళ్లు మా ప్రాణాలకి ప్రమాదకరంగా పరిణమించాయి. మూడుసార్లు గాయపడ్డాను. గాయాలనించి ధారాపాతంగా రక్తం కారుతోంది. నెమ్మది నెమ్మదిగా, ఆ ఓడని మేం వశం చేసుకోవచ్చన్న నిజాన్ని గ్రహించసాగాను. కానీ మిగతా నౌకలన్నీ మమ్మల్ని చుట్టు

ముట్టటం చూసి, ఆందోళనకి గురయాం. సముద్రపు దొంగలు అల్లకల్లోలంగా ఉన్న సముద్రంలోకి దూకి, పిచ్చివాళ్లలా మా నౌక వైపుకి ఈదుకుంటూ రాసాగారు. వాళ్లు కనక మా దగ్గరకి చేరుకోగలిగితే ఇక మేము బతికి బట్టకట్టే ఆశ ఉండదు.

ఆ దుర్మారుడు, వరుణుడు ఎక్కడ ఉన్నట్టు? నాకే కనక వాడు చిక్కితేనా! మిగతా నౌకల్లోంచి దూకిన మొట్టమొదటి సముద్రపు దొంగలు మా నౌకపైకి ఎక్కసాగారు. ఒకడిని కాలితో ముఖం మీద తన్నేసరికి కింద సుళ్లు తిరుగుతున్న సముద్రంలో పడిపోయాడు. బహుశా వరుణుడు నౌక కింద భాగాన ఏదో ఒక గదిలో ఉండి ఉండాలి. మెట్ల మీదికి తెరుచుకునే తలుపుమీద బలంగా తన్నేసరికి అది తెరుచుకుంది. కిందికి దూకాను. నగిషీలు చెక్కిన తలుపు మూసి ఉంది. తలుపు సందుల్లోంచి సన్నని వెలుతురు కనిపిస్తోంది. వంపు తిరిగిన ఓడ గోడల మీద నీడలు పెద్దవిగా, దెయ్యాల్లా కనిపిస్తున్నాయి. పైన జరుగుతున్న యుద్ధం తాలూకు ధ్వనులు నా చెవులకి చిన్నగా సోకుతున్నాయి. వరుణుడు ఈ గదిలో ఉన్నాడా? ఒక్క తన్నుతో తలుపు తెరిచి కత్తిని ఝళిపించాను. గదిలో ఎవరూ లేరు. గాలికి ఎగురుతున్న పట్టు తెరలలోకి కత్తితో పొడిచాను.

నేలమీద పడుకుని, ఆ పిరికిపంద మంచం కింద దాక్కున్నాడేమో అని చూశాను. సరిగ్గా అదేక్షణంలో చల్లటి ఇనప కత్తి మొన నా మెడ వెనకభాగాన్ని తాకింది. "ఓహో! అసురుల చక్రవర్తిగారు ఈ పేద బెస్తవాడిని కలిసేందుకు వచ్చినట్టున్నారే! ధన్యుడిని, మహాప్రభూ!"

నేను అమితంగా ద్వేషించే ఆసముద్రపుదొంగల రాజు ముఖం చూసేందుకు పైకి తలతిప్పే ప్రయత్నం చేశాను, కానీ అతను తన కర్ర పాదరక్షలతో నా ముఖం మీద తన్నాడు. నా ముక్కులోంచి రక్తంకారి నేలమీద పరుచుకుంది. నాకు మళ్లీ భయం వెయ్యసాగింది. చిక్కుకుపోయాను! నా పని అయిపోయింది. నా నిస్పృహ, అణచిపెట్టుకున్న కోపం ఒక్కసారిగా ఉప్పొంగి, నేను పోరాడసాగాను. కానీ దాదాపు నలభై సంవత్సరాల వయసు ఉన్న వరుణుడు, నా

దెబ్బలనీ, పిడిగుద్దులనీ అవలీలగా తట్టుకున్నాడు. నాతో యుద్ధం చెయ్యటం అతనికి విసుగా ఉన్నట్టు ప్రవర్తించాడు. యుద్ధ విద్యలో చిరకాల అనుభవం ఉన్న అతని ఆత్మవిశ్వాసం, హుందాతనం ముందు ఇరవయ్యోపడిలో ఉన్న నా శక్తిసామర్థ్యాలు నిలబడలేక పోయాయి.

"వరుణా! సముద్రపు దొంగా, వెంటనే లొంగిపో, లేదా నీ తల ముక్కలై పోగలదు!"

నేను పక్కకి తిరిగి చూశాను. ద్వారం దగ్గర ఇద్దరు విలుకాండ్రు నిలబడి ఉండటం చూసి అచ్చెరువొందాను. వాళ్లని గుర్తు పట్టేందుకు నాకు కొన్ని క్షణాలు పట్టింది. మారీచుడూ, కుంభకర్ణుడూ విల్లంబులతో వచ్చారు. వాళ్లు బాణాలని వరుణుడి మీదికి గురిపెట్టారు. మొదటిసారి వరుణుడు కంగారు పడటం చూశాను. నేను ఏమైనా చేసే లోపల అతను తెరిచిఉన్న కిటికీలోంచి సముద్రంలోకి దూకేందుకు ప్రయత్నించాడు. నేను అతని కాళ్లు గట్టిగా పట్టుకునేసరికి అతను నేలమీద బొక్కబోర్లా పడ్డాడు. వరుణుడు నా పట్టు వదిలించుకునే లోపల కుంభకర్ణుడు అతనిమీదికి లంఘించాడు. ఇద్దరం అతన్ని కదలకుండా పట్టుకుని మారీచుడు చింపి ఇచ్చిన పట్టతెరలతో చేతులు వెనక్కి విరిచి కట్టేశాం.

"సరిగ్గా సమయానికి మీరిద్దరూ ఎలా వచ్చారు?" నన్ను కాపాడేందుకు జానపద కథల్లో లాగ ఆఖరి క్షణాన వచ్చిన ఆ వీరులిద్దర్నీ చూస్తుంటే నాకు ఇంకా ఆశ్చర్యం తగ్గలేదు.

మారీచుడు ఆయాసపడసాగాడు, అయినా అతను మాట్లాడకుండా ఉండలేక పోయాడు, "ఈనాడు ఉదయం నువ్వుమాతో నీ ప్రణాళిక గురించి చర్చించినప్పుడు, ఒక పక్కనేను దాని గురించి ఆలోచించడం మొదలుపెట్టాను. ఆలోచించిన కొద్దీ నీది చాలా ప్రమాదకరమైన ప్రణాళిక లాగానూ, నువ్వు చాలా మూర్ఖంగా ఆలోచిస్తున్నటూ తోచింది. ఈ బుద్ధిలేని పని చెయ్యవద్దని నిన్ను హెచ్చరించాలని నీ గదికి వచ్చాను. కానీ నువ్వు అక్కడ కనబడలేదు. నువ్వు ఎక్కడికి వెళ్లావో

ఊహించేందుకు ప్రహస్తుడిలా మేధావి అవాల్సిన అవసరం లేదు. అర్ధరాత్రి వాహ్యాళికి వెళ్లి ఉండవని కచ్చితంగా తెలుసు. ఈ మొద్దుని నిద్రలేపాను, ఆ తరవాత పిచ్చికుక్కలా పరిగెత్తి యుద్ధ శంఖం పూరించాను. కొన్ని వందలమంది సైనికులని మాత్రమే కూడగట్టుకోగలిగాను. వారిలో సగంమంది తప్పతాగి ఉన్నారు. ఈ అసురులు...! ఆ తరవాత వేగంగా పడవ నడుపుతూ సముద్రం మధ్యలో నువ్వు చేస్తున్న వింత విన్యాసాలు చూసి ఆనందించేందుకు బైలుదేరాం!"

"మనవాళ్లు ఎవరైనా చనిపోయారా?"

"చెప్పటం చాలా బాధగా ఉంది, కానీ ఇంకొక ఆరుగురితోబాటు, నీకు ప్రీతిపాత్రుడైన భద్రుడుకూడా మునిగిపోయాడని అనుకుంటున్నాను. ఆసేనకి నాయకత్వం వహించిన వ్యసుడు, భద్రుడు నీళ్లలో పడిపోవటం చూశాడు. ఆ తరవాత అతన్ని ఎవరూ చూడలేదు," అని జవాబిచ్చాడు కుంభకర్ణుడు.

"తమ్ముడూ, ఈ సముద్రపు దొంగని ఏం చేద్దాం?"

"కాళ్ళూ చేతులూ కట్టేసి సముద్రంలోకి తోసేద్దాం – సముద్రపు దొంగల రాజుకి తగిన అంతం అదే!" అన్నాడు మారీచుడు ఒక్క క్షణం కూడా సంకోచించ కుండా,

"అవును, అదే తగిన శాస్తి... వద్దు, ఒక్క క్షణం ఉండండి. మనం వీడిని లంకకి తీసుకుపోదాం. మొలకి మాత్రం గుడ్డచుట్టి, నగ్నంగా పురవీధుల్లో ఈడ్చుకుంటూ తీసుకెళదాం," అన్నాను. నాలో ఉత్సాహం పెల్లుబకసాగింది.

మారీచుడు నావంకే తదేకంగా చూసి, ఏదో ఆలోచన వచ్చినట్టు, "ఈ సముద్రపు దొంగల రాజుని సముద్ర గర్భంలోకి త్రోసేసి, కానుకగా ఇవ్వటమే మంచిది," అన్నాడు.

నేను ఆయన మాటలని పెడచెవిన పెట్టాను. కానీ నాకే కనుక నా

జీవితాన్ని తిరగరాసే అవకాశం దొరికితే, ఆ క్షణం నుంచే మళ్లీ మొదలుపెట్టి, వరుణుడిని ఎత్తి సముద్రంలో పడవెయ్యటానికి మారీచుడినీ, కుంభకర్ణుడినీ సాయం చెయ్యమని క్రోనాడిని.

14. మంగళవాయిద్యాలు

రావణుడు

మాకన్నా ముందు, శక్తిశాలియైన లంక రాజు - సముద్రపు దొంగల రాజు వరుణుడిని బంధించాడన్న వార్త లంకకి చేరుకుంది. సముద్రపు దొంగలందరి బట్టలు ఊడదీసి, మొలగుడ్డలతో నిలబెట్టాం. వాళ్ల ఒంటినిండా మట్టీ, బురదా పులిమి, ఉమ్మేసి, క్రూరంగా చావబాది, ఓడిపోయిన తమ రాజు వెనకే పంక్తిలో నడిపించాం. ఈ ఊరేగింపుని చూసేందుకు కొన్నివేలమంది వీధికి ఇరువైపులా నిలబడి విజయోత్సాహంతో అరిచారు.

భయంకరమైన సముద్రపు దొంగలబారినుంచి వాళ్లని రక్షించిన వీరుడిని నేను. నా మనసు గర్వంతో ఉప్పొంగింది. వరుణుడి ముఖంమీద గట్టిగా కొట్టాను. అతని ముక్కులోంచి రక్తం కారింది. అబ్బ, ఎంత ఆనందంగా ఉంది! మళ్లీ ఒకసారి కొట్టి, కత్తి పైకెత్తాను. జనం, "రావణుడు వర్ధిల్లాలి, మా మహారాజు వర్ధిల్లాలి!" అంటూ నినాదాలు చేశారు. ఎవరో పాపం వచ్చి నా పాదాలమీద పడ్డాడు. నా సైనికుల్లో ఒకడు వాడిని తన్నాడు. జనం హర్షధ్వానాలు చేశారు. నా పక్కనే ఎవరో వెక్కిరించారు. నేను జనానికేసి చూసేసరికి, అక్కడ ఉన్నంతమందీ భయంతో ఒదిగారు. వాళ్లలో పేరుకున్న భయం నాకు తెలిసింది. ఈ జనమే ఒకప్పుడు నన్ను లంకనించి తరిమేసేందుకు తిరుగుబాటు చెయ్యాలని అనుకున్నారు. కానీ ప్రస్తుతం నన్ను చూసి భయపడుతున్నారు. విజయం ఎంత మధురంగా ఉంటుంది! జనం నాముందు మోకరిల్లుతున్నారు.

నేను వెనక్కి తిరిగి చూడగానే, అంతవరకూ నవ్వుతూ కేకలు పెడుతున్న నా సైనికులు హఠాత్తుగా నవ్వటం, అరవటం ఆపేశారు. నేను వాళ్లకేసి సూటిగా చూసేసరికి వాళ్లు కూడా తలలు

దించుకున్నారు. నేను కుంభకర్ణుడివైపు చూశాను, వాడు నన్ను చూసి చిరునవ్వు నవ్వాడు. నేను జవాబుగా నవ్వలేదు, మారీచుడివైపు చూశాను. ఆయన విచారంగా తల ఆడించాడు. 'వీడు నాకు తలవంచి నమస్కరించడేం?' అని లోలోన మండిపడ్డాను. వరుణుడు, ముఖంనిండా రక్తం కారుతూ, నన్నుచూసి దెయ్యంలా నవ్వాడు. వాడి నవ్వు చూస్తే నాకు భయం వేసింది. అంతకన్నా ఎక్కువగా నన్ను చూస్తేనే నాకు భయం వేసింది.

'నేను ఏవిధమైన పిశాచంలా మారిపోతున్నాను? నావాళ్లతో ఇలా ప్రవర్తిస్తున్నానేమిటి? నాకు మర్యాదగా తలవంచలేదని మారీచుడిమీద కూడా నాకు కోపం వస్తోందేమిటి?' హఠాత్తుగా పరిగెత్తుకెళ్లి అతన్ని కౌగిలించుకుని క్షమాపణ అడగాలని అనిపించింది. కానీ ఏదో శక్తి నన్ను వెనక్కిలాగి ఉంచింది. నేను ఇంకా వేగంగా నడుస్తూ రాజభవనం ముఖద్వారం ప్రవేశించాను.

పొడవాటి వసారా కొసన ప్రహస్తుడు నిలబడి నాకోసం ఎదురుచూస్తున్నాడు. అతని కనుబొమలు ముడిపడి ఉన్నాయి. ముఖంలో లీలగా అయిష్టం కనబడింది. ప్రహస్తుడి చుట్టూ నృత్యం చెయ్యాలనిపించింది. ఆ మూరుడు నన్ను అప్రమత్తంగా ఉండమన్నాడు. అవును, అప్రమత్తంగా ఉండటంవల్ల అతనికీ, అతనివెంట ఉండే అసుర మూర్ఖులకీ చాలా మంచి జరిగింది కదా! అతను దగ్గర పడేవేళకి నేను నడకవేగం తగ్గించి అతని కళ్లలోకి చూశాను.

'మహాప్రభూ, రాజసభలో అందరూ సిద్ధంగా ఉన్నారు," అంటూ భటుడు గొంతు చించుకుని అరిచాడు. నన్ను ప్రహస్తుడినించి తప్పించినందుకు మనసులో కృతజ్ఞతలు చెప్పుకుంటూ, అతని పక్కనించి ముందుకి నడిచాను. ప్రహస్తుడూ, మిగతా సభ్యులూ లేవదీయబోయే ప్రశ్నలు ఎలాటివి అయిఉంటాయో, వాటికి ఎలాటి జవాబులు చెప్పాలో ఆలోచిస్తూ సభలోకి ప్రవేశించాను.

'మహాప్రభూ! మొట్టమొదట మేము అడగదల్చుకున్నది. అంటే, మీరు నిర్ణయించవలసినది. వరుణుడిని ఏం చెయ్యదల్చుకున్నారు, అనేది," అన్నాడు ప్రహస్తుడు. అతని గొంతు అస్పష్టంగా పలికింది.

"మీ సలహా ఏమిటి, మహామంత్రీ?" అని అడిగాను. అతను తప్పక వరుణుడిని గౌరవంగా కానుకలతో సత్కరించి, రాజమర్యాదలతో అతిథి సత్కారాలు జరిపి, మర్యాదగా సాగనంపమని అంటాడని అనుకున్నాను. తనమాటని సమర్థించుకునేందుకు కొన్ని శతాబ్దాల క్రితం ఉండిన ఎవరో రాజు గురించి అతను నిజంగా ఉన్నాడో లేడో కూడా తెలీదు - బందీలుగా పట్టుకున్న వాళ్లతో ఆ రాజు ఎంత గౌరవంగా ప్రవర్తించాడో ఉదాహరణగా చెపుతాడు. అలా మర్యాదగా, ఉదారంగా ప్రవర్తించిన ఆ రాజు కొన్ని సంవత్సరాల తరవాత ఏమయాడో తెలుసుకోవాలని అనిపించింది నాకు. బహుశా, అలా వదిలేసిన ఆ బందీ, మరిన్ని బలాలని సమకూర్చుకుని వెనక్కివచ్చి, ఆ రాజుని ఓడించి విజయం సాధించి ఉంటాడు. తరవాత తనని అంత మర్యాదగా చూసిన ఆ రాజు గురించి ఏమాత్రం జాలిపడకుండా, అమానుషమైన శిక్షలు విధించి ఉంటాడు. కానీ చరిత్ర అందించే పాఠాలని ఎవరూ నేర్చుకోరు.

ప్రహస్తుడు చెప్పటం కొనసాగించాడు, "మహాప్రభూ! సముద్రపు దొంగల రాజుకి మరణదండన విధించాలనే మా ఉద్దేశం. అతన్ని వదిలేస్తే చాలా ప్రమాదం. మనం అతిబలహీనంగా ఉన్న స్థితిలో అతను మనమీద దాడిచేసే ప్రమాదం ఉంది. దూరదృష్టితో ఆలోచిస్తే అతనికి కఠినశిక్ష వేస్తేనే రాజ్యద్రోహులకీ, శత్రువులకీ గుణపాఠం నేర్పినట్టు అవుతుంది. మొత్తంమీద మా మంత్రులందరి సలహా అతనికి మరణదండన విధించాలనే."

ఈ లోపల విభీషణుడు లేచి నిలబడి అసురుల ఔదార్యం గురించీ, యుద్ధంలో చిక్కిన బందీలపట్ల మానవత్వంతో వ్యవహరించటం గురించీ దీర్ఘమైన ఉపన్యాసం ఇచ్చాడు. ఆ ఘోరమైన సముద్రపు దొంగకి ఎటువంటి శిక్ష వెయ్యాలో నేను ముందే నిర్ణయించాను.

నేను నిశ్చేష్టుడనయాను. ఇది నేను ఎదురుచూసిన దానికి పూర్తిగా భిన్నంగా ఉంది. నేను సంకట పరిస్థితిలో ఇరుక్కుపోయానని అనిపించింది. వరుణుడిని విడిచిపెట్టేస్తే నేను విభీషణుడి పక్షం వహించానని అంటారు. అతన్ని చంపిస్తే, ప్రహస్తుడు చెప్పినట్టు వింటున్నాననీ, నామీద అతని ప్రభావం ఉందనీ అనిపించవచ్చు. అబ్బ ఏం చిక్కు వచ్చిపడింది!

ప్రహస్తుడి వాడి చూపులు నాకు గుచ్చుకున్నాయి, తన మాటకి ఎదురుచెప్పమని సవాలు చేస్తున్నట్టు ఉన్నాయి ఆ చూపులు. సముద్రపు దొంగల రాజు ఏమాత్రం తొణకకుండా అక్కడ అలాగే నిలబడ్డాడు. అతని ముఖంలో ఎటువంటి భావమూ లేదు. అతని స్థిర్యానికి అతన్ని అభినందించినంత పనిచేశాను.

"నేను ఇతనికి మరణదండన విధించబోవటం లేదు," అన్నాను. వెంటనే సభ సద్దుమణిగింది. కొంతసేపు చీమచిటుక్కుమన్నా వినబడేంత నిశ్శబ్దం తాండవించింది. ఆ తరవాత నా మంత్రులు ఒక్కొక్కరే లేచి నిలబడసాగారు. "నేను మీకు సంజాయిషీ ఇచ్చుకోవలసి ఉంది. ఈ సముద్రపు దొంగని విడిచిపెట్టాలన్నది నా అభిమతం కాదు. వరుణుడి నౌకలన్నిటినీ స్వాధీనం చేసుకుని మన నౌకలతో కలుపుకోవలసిందని ఆజ్ఞాపిస్తున్నాను. సముద్రపు దొంగలు అందరికీ యుద్ధవిద్యలో తగిన శిక్షణ ఇచ్చి మన నౌకాదళంలో చేర్చుకోవాలి. ఇక సముద్రపు దొంగల రాజు విషయానికొస్తే..." అంటూ వరుణుడివైపుకి నడిచాను. అతను నాకన్నా ఒక అడుగు ఎత్తున్నాడు. అతని కళ్లలోకి సూటిగా చూస్తూ పళ్లుబిగబట్టి, "ఇతన్ని నేను పురవీధుల్లో ఈడ్చుకుంటూ పోవాలనీ, సగం జుట్టు తీయించెయ్యాలనీ, గాడిదమీద వెనక్కి తిప్పి కూర్చోపెట్టి ప్రతి వీధిలోనూ ఊరేగించాలనీ ఆజ్ఞాపిస్తున్నాను. ఆ తరవాత ఈ సముద్రపుదొంగల రాజుకి ఒక పందితో వివాహం జరిపించబోతున్నాను. దానికి అయ్యే ఖర్చు రాజ్య కోశాగారం భరిస్తుంది. ఈ పెళ్లి కూడా నా పెళ్లితోబాటే జరుగుతుంది," అన్నాను.

వరుణుడి పెదవులమీద చిరునవ్వు లీలగా కదలాడింది. అతను ఏమాత్రం సంకోచించక నా కళ్లలోకి చూస్తూ, "ఓహో! ఆ రోజు పందులన్నిటికీ వివాహం జరుగుతుందన్నమాట!" అన్నాడు.

నా మంత్రుల నవ్వు నా చెవులకి కటువుగా తోచింది. విపరీతమైన కోపంతో వరుణుడి ముఖంమీద గట్టిగా కొట్టాను. అప్పుడు వరుణుడి ఎదురు జవాబులోని హాస్యం అర్థమయి నేను కూడా నవ్వసాగాను. ప్రహస్తుడు మాత్రం మిన్నకుండి పోయాడు. ఉన్నత వంశంలో పుట్టిన వాడిలా ఉన్న ఆయన ముఖంమీద చిరునవ్వు తాలూకు ఛాయకూడా కనబడలేదు.

'మహాప్రభూ! మీరు ఈ సముద్రపు దొంగకి మరణశిక్ష విధించకపోయినట్టయితే, జీవితాంతం ఇతన్ని చీకటి కొట్లో బంధించి ఉంచమనీ, బహిరంగంగా అతన్ని ఎటువంటి అవమానాలకీ గురిచెయ్యవద్దనీ, నా సలహా."

"నా ఇష్టం వచ్చినట్టు చేస్తాను. మీరు మీ అభిప్రాయం చెప్పారు. మీ సలహాలు మీ దగ్గరే ఉంచుకోండి," అంటూ ప్రహస్తుడి నోరు మూయించి, అంతటితో ఆ విషయాన్ని ముగించాను. లేక, అది ముగిసిపోయిందని నేను అనుకున్నానని అనాలేమో. నా మంత్రులు నావెంట రాగా సభలోంచి బైటికి నడిచాను. తల గొరిగించి మిగతా అవమానాలకీ, యాతనలకీ గురిచేసేందుకు భటులు వరుణిడిని బైటికి లాక్కుపోయారు.

నాలుగు రోజులు పోయాక వివాహానికి ముహూర్తం నిర్ణయించారు. నేనే స్వయంగా ఏర్పాట్లన్నిటినీ పర్యవేక్షించాను. పెళ్లికి సంబంధించిన ఏర్పాట్ల కాదు, వరుణుడికి వీలైనంత ఘోరమైన అవమానాన్నీ శిక్షనీ అమలు చేయించేందుకు జరగవలసిన ఏర్పాట్ల, కానీ అతని ధైర్యాన్ని మనసులోనే అభినందించకుండా ఉండలేకపోయాను. మౌనంగా అన్నిటినీ భరించాడు. రక్తసిక్తమైన అతని పెదవుల మీద వున్న చిరునవ్వు చెరిగిపోలేదు. చిరునవ్వు నవ్వుతూంటే అతని విరిగిన పళ్లు

కనబడ్డాయి. కావాలనే నన్ను చూసి నవ్వుతున్నాడని గ్రహించి మళ్లీ అతని ముఖం మీద గట్టిగా కొట్టేందుకు చెయ్యి ఎత్తి, అతని కళ్లలోకి చూసి ఆగిపోయాను. నాకు అసహ్యం వేసింది. నేనెంత నీచానికి పాల్పడ్డాను!?

అప్పుడు నాకు మా నాన్న అక్కడికొచ్చి ఒక పెద్ద ఆసనంలో కూర్చుని ఉండటం కనిపించింది. అమ్మ నేలమీద కూర్చుని ఆయన పాదాలని ఒత్తుతోంది. తమ్ముడు విభీషణుడు కూడా వినయంగా ఆయన పక్కన నిలబడి ఉన్నాడు. ప్రహస్తుడు తప్ప మిగతా మంత్రులు అందరూ అక్కడే అతివినయంగా, ఎవరో చక్రవర్తి మా రాజ్యానికి అతిథిగా వచ్చినట్టు, చేతులు కట్టుకుని నిలబడ్డారు. ఆయన ఎంతమాత్రం పట్టించుకోనప్పటికీ, శూర్పణఖ ఆయన దృష్టిని ఆకర్షించేందుకు శతవిధాల ప్రయత్నిస్తోంది.

"గర్విష్టి అయిన తండ్రి గొప్ప విజేతని కలుసుకోబోతున్నాడు. ఆహా! ఎంత అతినాటకీయమైన దృశ్యం!" అన్నాడు కుంభకర్ణుడు పళ్లికిలిస్తూ,

"అయితే నువ్వు ఈ మహత్తరమైన పునస్సమాగమంలో పాలు పంచుకోలేదా?" అన్నాను కోపాన్ని దాచుకోలేక,

"లేదు, తప్పించుకోవాలనే అనుకున్నాను. కానీ మన కుటుంబ గీతంలోని పంక్తులు మరచిపోయినట్లు వున్నాను!" అని అంటూ కుంభకర్ణుడు నవ్వటం మొదలుపెట్టాడు. వాడిదగ్గర నాటుసారా వాసన గుప్పమని వచ్చింది.

నేను అసహ్యం నిండిన కళ్లతో వాడివైపు చూశాను. లావుగా, అనాకారిగా, బానపొట్టతో, ఇరవైయేళ్లవాడిలా కాకుండా నలభైయేళ్లవాడిలా కనిపించాడు. "ఇంతలా ఎలా తాగుతున్నావు?" అంటూ వాడిమీద అరిచాను. వాడి జుట్టు పట్టుకుని తలని గోడకేసి బాదాను. 'పనికిమాలిన వెధవా! దుర్మారుడా." అలా వాడి తలని గోడకి కొడుతూనే ఉన్నాను. వాడు నా దెబ్బలనుంచి తప్పించుకునేందుకు విఫల ప్రయత్నం చెయ్యసాగాడు.

గుమిగూడిన మా కుటుంబసభ్యులందరూ ఆ గోల విని గదిలోకి పరిగెత్తుకుని వచ్చారు. కుంభకర్ణుడు నేలమీద మట్టికుప్పలా పడిపోయాడు. వాడి ముక్కులోంచి రక్తం కారుతోంది. బాధతో మూలుగుతున్నాడు. మారీచుడు నన్ను కదలకుండా పట్టుకున్నాడు. రక్తం చూసి శూర్పణఖ కెవ్వమంది. రప్! నేను ఒక్క క్షణం నిశ్శేష్టుడినయాను. నా చెవికి ఉన్నకమ్మ తగిలి మా అమ్మ చేతికి గాయం అయింది, నా చెవి ఒక పక్క మండుతున్నా ఆవిడవైపు ఆశ్చర్యపోతూ చూశాను. ఆమె నన్ను కొట్టింది - నా మంత్రుల ఎదుట, నా సేవకులు కూడా అది చూశారు. ఇక ఈ వార్త కార్చిచ్చులా దేశమంతటా వ్యాపిస్తుంది. తల్లి కొంగుచాటున ఉండే రాజు! అతని తల్లి అతన్ని యింకా పసిపిల్లవాడిలా భావిస్తూ ప్రవరిస్తూంటుంది!

నేను మారీచుడిని పక్కకి తోశాను. అతను వెనక్కిపడ్డాడు. అతని తల నేలకు కొట్టుకుంది. దాన్నినా కనుకొలకులలోంచి చూశాను. కానీ ఆ విషయాన్ని పట్టించు కోలేదు. మా అమ్మ జుట్టు పట్టుకుని ఆ సభలోంచి బైటికి ఈడ్చాను. రెండు చేతులూ వెనక్కికట్టుకుని, ప్రహస్తుడు నావైపే గుడ్లరిమి చూస్తూ ఉండటం చూసి, మధ్యలో ఠక్కున ఆగిపోయాను. మా అమ్మమీద ఉన్న నా పట్టు సడలింది. ఆవిడ లేచి నిలబడింది. నేను చేసిన భయంకరమైన నేరం పిడుగుపాటులా నన్ను తాకింది. ఒక పక్క నిర్ధాంతపోతూ, చేసిన పనికి సిగ్గుతో కుంచించుకుపోయాను, కానీ మనసులో ఏ మూలో సంతృప్తి, సంతోషం కూడా కలిగాయి.

"నేరస్తుడు మీరు వెయ్యబోయే శిక్షకి సిద్ధంగా ఉన్నాడు, మహాప్రభూ!" అన్నాడు ప్రహస్తుడు కొద్దిగా వంగి. ఒక్క క్షణం నాకు ఏమీ అర్థం కాలేదు. నేరస్తుడా, ఏ నేరస్తుడు? వరుణుడి వ్యవహారం చనిపోయేదాకా నన్ను వదిలేట్టు లేదు.

"ముందు నా సంగతి చూడు, మొదటి బందీని నేనే!" అని అరిచింది అమ్మ వెనకనుంచి. "నా తల గొరిగించి, నగర వీధుల్లో నగ్నంగా గాడిదమీద కూర్చోపెట్టి ఊరేగించు, ఆగిపోయావేరా, త్రాష్ట్రుడా?" అంది అమ్మ

నేను సిగ్గుతో తల వంచుకున్నాను. అమ్మ కేకలు వెయ్యటం మానేసి పిచ్చిదానిలా వెక్కివెక్కి ఏడవసాగింది. నా చేతులు వణికాయి. ఎవరికీ ముఖం చూపించలేకపోయాను. ఎవరో నా భుజం మీద చెయ్యి వేశారు. కైకసీ, వీడు ఏమీ మారలేదు. నేను ఈ రాక్షసుడికి తండ్రినని చెప్పుకునేందుకు సిగ్గుగా ఉంది. ఈ దెయ్యం వివాహానికి నా పండిత మిత్రులతో వచ్చాను. ఈ శనేశ్వరం నా మిత్రుల ఎదుటే తన తల్లి మీదే చెయ్యి చేసుకున్నాడు, సొంత తమ్ముడిని చంపేటంత పని చేశాడు!"

నా నరాలు కోపంతో ఉద్రిక్తమయాయి. వసారాలోని స్తంభాన్ని గట్టిగా పిడికిలితో బిగించి పట్టుకున్నాను. మేము ఆకలితో అలమటిస్తున్నప్పుడు ఈ పనికిమాలిన బ్రాహ్మడు ఎక్కడ ఉన్నాడు? మా అమ్మ కూడూ గుడ్డ కోసం బిచ్చం ఎత్తుతున్నప్పుడు ఏమయాడీయన? వర్షాకాలం గాలివానలో, కొండ అంచున ఎప్పుడు కూలిపోతుందా అన్నట్టు నిలబడి ఉన్నపూరిపాకలో మేము ఉంటున్నప్పుడు ఈయన ఎక్కడికి పోయాడు?

"అయినా, వీడిని మాత్రమే నిందించి లాభం లేదు. ఎంతైనా అసురుడే కదా! ఇంతకన్నా అధ్వాన్నపు జాతిని నేనింతవరకూ చూడలేదు. వ్యభిచారం, స్వలింగ సంపర్కం, ధన వ్యామోహం, ఏ అవగుణమైనా చెప్పండి, ఈ రాక్షసజాతికి వాటన్నిటిమీదా ఏకఛత్రాధిపత్యం ఉంది! నల్లతోలు వెధవలు, అనాకారి జాతి..."

నేను నిటారుగా నిలబడి బెదిరిస్తున్నట్టు మా నాన్నవైపు నడిచాను. ఆయన కుంచించుకుపోయాడు. ఆయనకన్నా రెండడుగులు పొడుగా ఉన్నాను. ఒక్క దెబ్బతో ఆయన్ని చంపిపారెయ్యాలన్నంత కోపం వచ్చింది నాకు. కానీ అమ్మ పట్ల నేను ప్రవర్తించిన తీరుకి ఇంకా సిగ్గుపడుతూనే ఉన్నాను. ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలన్న క్షణం ఆసన్నమైందని అమ్మకి అనిపించినట్టు ఉంది, ఆవిడ మా ఇద్దరి మధ్యనా వచ్చి నిలబడింది. నా గుండెలమీద చేతులు పెట్టి నన్ను వెనక్కి తోసింది. ఆవిడ ముఖం వైపు చూడగానే, మళ్లీ నాకు సిగ్గు ముంచుకొచ్చింది.

"నేను వెళ్లిపోతున్నాను. మీ నాన్న తమ్ములూ, చెల్లీ, నేనూ ఇంక ఎప్పటికీ నీ ఇంట్లో కాలుపెట్టం. మాకు నిన్ను మళ్లీ చూడాలని లేదు. మేము చనిపోతే మా శవాలని చూసేందుకు కూడా నువ్వు రావద్దు. అధికారం నిన్ను పిశాచంగా మార్చేసింది. నీకు... నీకు... ఎప్పటికీ మనశ్శాంతి దొరకదు..." అంది అమ్మ.

నేను తడబడుతూ వెనక్కి వెనక్కి వెళ్లి, పడిపోకుండా ఉండేందుకు ఒక స్తంభాన్ని పట్టుకున్నాను. అమ్మ శూర్పణఖ చెయ్యి పట్టుకోవటం కనిపించింది. అమ్మ తన చెయ్యి పట్టుకుని లాగుతూంటే నా చెల్లి ఏడవసాగింది. నావైపు, నా కళ్లనించి ధారగా కారుతున్న కన్నీటివైపూ చూసింది. నెమ్మదిగా, దృఢంగా అమ్మ పట్టునుంచి తన చేతిని విడిపించుకుంది. అమ్మ ముఖంలో ఆశ్చర్యం కనబడింది నాకు. నేలమీద అచేతనంగా పడి ఉన్న కుంభకర్ణుడి దగ్గరకి వెళ్లింది అమ్మ.

"కుంభకర్ణా, కుంభా, లేవరా! లేవరా!" అని అమ్మఎంతసేపు అరిచినా మత్తు నిద్రలోంచి కుంభకర్ణుడు మేలుకోలేదు. నాకు నవ్వవచ్చినంత పనయింది. "వీడిని చంపేశావురా! రావణా... నీ సొంత తమ్ముడిని చంపేశావా!", అంటూ అరిచింది అమ్మ.

పరిస్థితి దాదాపు హాస్యాస్పదంగా తయారైంది. "వాడు చావలేదమ్మా! వాడు తాగేసి పడిపోయాడు. వాడిని భుజంమీద మోసుకుని వెళ్లమని అందమైన, నీ తెల్లతోలు భర్తని అడుగు," అనగానే నాకు పెద్దపెట్టున నవ్వు వచ్చింది. ఆ లావుపాటి హాస్యకాడు ఏనుగులా ఉన్న కొడుకుని భుజంమీద మోసుకెళ్లటం ఊహించుకుని నవ్వు ఆపుకోలేకపోయాను.

"విభీషణా, ఈ దేవతల పెద్ద మనిషితో వెళ్లాలని అనుకుంటున్నావా? ఈయన గొప్ప పాండిత్యం గల బ్రాహ్మడు కదా?" అన్నాడు నా చిన్న తమ్ముడి వైపు నడుస్తూ.

"లేదు, లేదు అన్నా... అంటే నేననుకున్నది..." విభీషణుడు తడబడ్డాడు. వాడి నుదుటిమీద ఉన్న పవిత్రమైన విభూతి రేఖల

వాసన తెలిసేంత దగ్గరగా వెళ్లాను. వాడికి చెమటలు పడుతున్నాయి.

మా నాన్న శాపనార్థాలు పెట్టాలని అనుకున్నాడు. కానీ భయం చేత ఆయన నోరు కూడా తెరవలేకపోయాడు. మా అమ్మ వీలైనంత హుందాగా ఉండేందుకు ప్రవర్తిస్తూ, వణుకుతున్న నాన్న చేతులని తన చేతుల్లోకి తీసుకుని, తనకి సాధ్యమైనంత అతి నాటకీయతని ప్రదర్శిస్తూ, "నేను చనిపోయాక కూడా ఈ నరకంలోకి అడుగుపెట్టను. నువ్వు గాని, నీ తోబుట్టువులుగాని నా శవాన్ని చూసేందుకు అనుమతించను. నీ తలిదండ్రులని అవమానించినందుకు ఫలితంగా నువ్వు తగిన మూల్యం చెల్లిస్తావు. ఈ లోకంలోనా, పైలోకంలోనా అనేది నాకు తెలీదు, కానీ దీనికి ఇంతకింతా అనుభవిస్తావు!" అంది.

మా నాన్న తోకలా అనుసరిస్తూ ఆవిడ నా భవనంలోంచి బైటికి నడిచింది. గది మూలనించి ముఖానికి చేతులు అడ్డం పెట్టుకుని భోరుమని ఏడుస్తున్న నా చెల్లి వెక్కిళ్లు వినిపించి అటు చూశాను. విభీషణుడు అయోమయంగా ఆమె ముందు నిలబడి ఉన్నాడు. నేను చెల్లి దగ్గరకెళ్లి నా రెండు చేతులనీ ఆమె భుజాల మీద వేశాను. వెంటనే ఆమె నా గుండెలమీద తలవాల్చి నన్ను గట్టిగా హత్తుకుంది. ఆమెని మోసం చేశానా? ఆమెకి అన్యాయం చేశానా? నాలో ఏదో ఘర్షణ. 'నా ప్రియాతి ప్రియమైన చెల్లీ! నీ దగ్గర్నించి నేను దోచుకున్నది ఏమిటి తల్లి?'

నెమ్మదిగా ఆనందం నా మనసులో బుడగలా రూపుదాల్చి క్షణంక్షణం పెద్దదికాసాగింది, అది నా మనసుని పూర్తిగా ఆక్రమించింది. చివరికి స్వేచ్ఛ లభించింది! తల్లి పక్షి రెక్కల రక్షణ నుంచి విముక్తి దొరికింది. ఇక నన్ను ఆపగలిగింది ఏముంది? భవిష్యత్తులో మళ్లీ ఎన్నో కలలు కంటాను. యావనం అనే అమృతాన్ని కనుక్కున్నాను. పెద్దపెద్ద కలలని కన్నంత కాలం ఆ అమృతం అయిపోవటం అనేది జరగదు. నా కలలే నా కథగా మారాయి.

15. విప్లవకారులు

భద్రుడు

"ఈయన బతుకుతాడా?" ఒక గంభీరమైన గొంతు పలికింది.

"బతుకుతాడనే అనిపిస్తోంది," అంది ఒక స్త్రీ గొంతు. మెరుపు మెరిసినట్టు ఆ గొంతు ఎవరిదో గుర్తుకొచ్చింది - మాల! నా ప్రియురాలు, మాల. ఆమె గురించి మరిచేపోయాను. నేను కూర్చునేందుకు ప్రయత్నించబోతుంటే ఆమె నన్ను వెనక్కి నెట్టింది. ఆ ద్రోహి కోసం నన్ను ఎందుకు విడిచిపెట్టి వెళ్లిపోయావు అని అడగాలనుకున్నాను. కానీ, నిర్వీర్యుడిలా, అలా పడి ఉండిపోయాను, అలసిపోయి, దెబ్బతిన్న అసురుడిని!

ఆమె వెనకాల ఏదో నీడ కదలాడింది, అది మినుకుమినుకుమంటున్న దీపం వైపు నడిచింది. ముఖంలో సగ భాగం మీద వెల్తురు పడుతోంది. నాకు నోరు తెరిచి మాట్లాడే ఓపిక కూడా లేకుండా చేసినందుకు శివుడికి కృతజ్ఞతలు తెలుపుకున్నాను. అతను ఇంకెవరో కాదు, విద్యుజ్జిహ్వుడు. నేను తప్పించుకుని వచ్చిన తుఫానుకన్నా బలంగా కోపమూ, ఈర్ష్యా నన్ను చుట్టు ముట్టాయి. ఈ వ్యభిచారిణి వీడితో ఉంటోంది!

మంచం మీద పడుకుని ఈగ మీదికి దూకటానికి సిద్ధంగా ఉన్న ఒక బల్లివైపు చూడసాగాను. అదే సమయంలో ఒడ్డూ పొడుగూ ఉన్న విద్యుజ్జిహ్వుడు లోపలికి వచ్చాడు. "కూర్చో కూర్చో" అన్నాడు నాతో మళ్లీ తనే, "నువ్వు ఉద్యోగం కోసం వెతుక్కుంటున్నావని మాల చెప్పింది. మాది యుద్ధాలు చేసే సంస్థ, వ్యాపారసంస్థ కాదు. ఒక్కొక్కళ్లకీ ఫలానా పని అంటూ ఏదీ ఇవ్వటం కుదరదు." అన్నాడు. ఉన్నట్టుండి ఉద్రిక్తుడయి అటూ ఇటూ పచార్లు చెయ్యసాగాడు, అతని చేతులు

ఆవేశంతో ఊగిపోసాగాయి. "మేము ఇక్కడ ఒక న్యాయమైన, సమసమాజాన్ని సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాం. మేము సృష్టించదల్చుకున్న ప్రపంచంలో రావణుడి లాంటి నిరంకుశులకి స్థానం లేదు. అందరూ సమాన హోదా కలిగి ఉంటారు. రాజులూ, భూస్వాములూ ఉండరు. పురోహితులూ, ఇంద్రజాలికులూ, వర్తకులూ లాంటి ప్రజాపీడకులు ఉండరు. నేను సృష్టించబోయే ప్రపంచంలో అందరూ సమానులే" అంటూ ఊపిరి పీల్చుకునేందుకు ఆగాడు. 'మేము' అనే మాట నేనుగా మారటం నా దృష్టిని దాటిపోలేదు. "కులవ్యవస్థ అనే దురాచారాన్ని రూపుమాపుతాను. వర్తక సంస్థలని నిషేధిస్తాను. ఒక్కొక్కరి దగ్గరా ఏమి ఉండాలో నిర్ణయించేందుకు ఒక సమితిని ఏర్పాటు చేస్తాను. ఎటువంటి దోపిడీనీ సహించను. జలగల్లా రక్తాన్ని పీల్చే కుబేరుడు లాంటి వాళ్లని హతమారుస్తాను. ప్రపంచంలో ఉన్న రావణుడి లాంటి వాళ్లందరినీ అణచివేస్తాను. దేవుళ్లు ఉండరు. ఇంద్రుడనే వాడు ఇక ఈ ప్రపంచంలో ఎక్కడా లేకుండా చూస్తాను. దేవతల ప్రతినిధులు కూడా ఉండరు, ధనం ఉండదు. ప్రజలు ఒకరికొకరు సేవ చేసుకుంటూ ఆనందంగా జీవిస్తారు. ఈ ప్రపంచం భద్రుడిలాంటి మామూలు మనుషులకే సొంతం అవుతుంది. భద్రా! నీలాంటి వాళ్లకోసం నేను ఈ భూమి మీద స్వర్గం సృష్టిస్తాను. ఆదర్శ లోకం కోసం నువ్వు కూడా మాతో చేతులు కలుపు!" అన్నాడు.

అతని మాటలకి నేను చలించిపోలేదని అనలేను. ప్రపంచాన్ని సొంతం చేసుకోవటం అనే ఆలోచన చాలా బావుంది. నా దగ్గర సొంతం అని చెప్పుకునేందుకు ఒక జత మంచి దుస్తులైనా లేవు, ఇక మొత్తం ప్రపంచం గురించి చెప్పేదేముంది! కానీ నేను తెలివితక్కువ దద్దమ్మని కదా, అతని మాటల్ని నమ్మలేదు. బైటికి అతని ఆలోచన నాకు ఎంతో ఉత్సాహాన్ని కలిగించినట్టు నటించాను, కానీ మనసు లోతుల్లో అతను కూడా భవిష్యత్తులో నిరంకుశుడుగానే తయారవుతాడని నాకు తెలుసు. ఆ గొప్ప వ్యక్తికి ఉన్న దూరదృష్టిని పరిమితమైన నా బుద్ధి అర్థం చేసుకోలేకపోయింది.

అతను నా భుజాలని గట్టిగా చరిచి, నన్ను వాటేసుకున్నాడు, కానీ మా శరీరాలు ఒకదాన్నొకటి తాకకుండా జాగ్రత్త పడ్డాడు. అందరు మనుషులూ సమానమే కావచ్చు, కానీ అంత సమానులు కారు. "మా శిక్షణా తరగతులకి రా, మాలా, ఇతనికి మంచి ఆహారం, దుస్తులూ అందేట్టు చూడు. ఇతన్ని స్నానం చెయ్యమను."

తన పటు వస్త్రాలు గాలికి అల్లల్లాడుతూండగా విద్యుజ్జిహ్వుడు బైటికి వెళ్లిపోయాడు. అతనితో సమానుడైన భద్రుడు, ప్రియురాలితో అక్కడే నిలబడి ఉండిపోయాడు.

"నువ్వు అతన్ని నమ్మటం లేదా?" అంది మాల,

"నువ్వో?" అన్నాను. మాల నిట్టూర్చి బైటికి వెళ్లిపోయింది. నేనూ ఆమెని అనుసరించాను. తిరుగుబాటుదార్లు ఎటువంటి శిక్షణ ఇస్తున్నారో చూడాలన్న కుతూహలం కలిగింది. నా స్నానానికి కొన్ని మూలికలూ, ఒళ్లు తుడుచుకునేందుకు ఒక మెత్తటి బట్టా ఇచ్చారు. అవి ఇచ్చింది విద్యుజ్జిహ్వుడు తనతో సమానమని భావించే మరొక వ్యక్తికి. అతనొక బక్కపల్చగా, పొట్టిగా ఉన్న అసురుడు. అతని కాళ్లకి పాదరక్షలు లేవు, పుళ్లు ఉన్నాయి. అతను చిరిగిపోయిన దుస్తులు ధరించాడు. అక్కడ ఉన్న చిన్న బావి దగ్గరకి స్నానం చేసేందుకు వెళ్లాను. విద్యుజ్జిహ్వుడు తాకిన నా శరీర భాగాలని బాగా రుద్దుకుని కడుక్కున్నాను. కానీ సమానత్వం అనే దుర్గంధం వదల్లేదు. కొంత కాలానికి నేను కూడా దానికి అలవాటు పడిపోయాను.

కొద్దిరోజుల్లోనే నేను విద్యుజ్జిహ్వుడికి ఆంతరంగికుడిని అయిపోయాను. తిరుగుబాటు చేసిన నాయకుల గూఢచారులు రాజభవనంలో జరుగుతున్న విషయాల గురించి ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నారు. నేనింకా ఎవరిని నా యజమానిగా భావించాలో నిర్ణయించుకోలేదు, నా భవిష్యత్తుని రావణుడితో ముడిపెట్టాలా, విద్యుజ్జిహ్వుడితో కలిసి పనిచెయ్యాలా అని తేల్చుకోలేదు. అప్పుడప్పుడూ రహస్యంగా మాలని ముదుపెట్టుకునే

వాడిని, కానీ ఆమె సాంగత్యం మాత్రం ఇంకా దొరకలేదు. తిరుగుబాటు నాయకుడిని వదలకుండా ఉండటానికి ఈ ఆకర్షణ కూడా ఒక కారణం అయింది.

ఒకనాడు విద్యుజ్జిహ్వుడు నన్ను సముద్రతీరానికి రమ్మని పిలిచాడు. సాయంకాలం బాగా పొద్దువాలింది, పౌర్ణమి రాత్రి. సముద్రం వెండిలా మెరిసిపోతోంది, గాలిలో మల్లెపూల పరిమళం నిండింది. శిబిరాల వైపునించి బద్ధకంగా ఒకపాట చెవులకి సోకింది, విరహమూ, కలయిక గురించిన పాట. చివరికి ప్రేమికులు మళ్లీ కలుసుకున్నారు, పరమానందం పొందారు. కడుపులు నిండుగా ఉన్నప్పుడూ, శరీరాలు ఆరోగ్యంగా ఉన్నప్పుడూ ఇలాంటి పాటలే పాడాలన్న వాంఛ కలుగుతుంది మనుషులకి, సముద్రంలోకి చొచ్చుకుపోయిన ఒక శిలమీద నిలబడ్డాడు నాయకుడు. నేను కూడా దానిమీదికి ఎక్కాను. కానీ భయం వేసింది. "నావలో ఈ రాత్రి ప్రయాణం చేసేందుకు సిద్ధంగా ఉన్నావా?" అని అడిగాడతను. నాకు అతని ముఖం కనిపించలేదు.

"అలాగే," అని గొణిగాను. అతను నన్ను పక్కకి నెట్టి, ఎగుడుదిగుడుగా ఉన్న రాతిమెట్ల మీదినించి కిందికి దిగాడు. సముద్రం నీళ్లలో ఒక తెప్ప అల్లల్లాడు తోంది. అతను గెంతి అందులోకి ఎక్కాడు, నేను కూడా తడబడుతూ ఎక్కాను. తెడ్లని బలంగా వేస్తూ అతను తెప్పని ముందుకి నడిపాడు. కొన్ని నిమిషాలు గడిచాక, నన్ను తెడ్లు వెయ్యమని సైగ చేశాడు. నేను తెడ్లు వేస్తూ అతను చూపించిన దిశగా తెప్పని నడపసాగాను.

తీరానికి దగ్గరగా చేరుకునేసరికి నాకు ఒక కొండ శిఖరం మీద ఒక కోట ఆకారం కనిపించింది. త్రికోట పర్వతం పైన ఉన్న సానువుల మీద పొగమంచు కమ్మి ఉంది. రాత్రి చీకట్లో ఆ కోట భయం గొలిపేట్టు ఉంది. అదొక దెయ్యాల కొంపలా కనిపించింది. నేను ఎప్పుడో విన్న దెయ్యాల కథలూ, రాక్షసుల కథలూ నా మనసులో ఏవేవో భయంకరమైన ఊహలు రేపాయి. నెమ్మదిగా తెప్ప తీరాన్ని తాకింది.

"నేను వచ్చేదాకా ఇక్కడే ఉండు," అని విద్యుజ్జిహ్వుడు కోట వెనక ద్వారంవైపు కదిలాడు. ఈ పని ఇంతక్రితం వందసార్లు చేసిన మనిషిలా, ఆత్మ విశ్వాసంతో అతను నడకసాగించాడు. నేను నా పాత యజమాని భవనంలోకి తిరుగుబాటుదార్ల నాయకుడి వెంట వచ్చాను. నేను పట్టుబడితే చనిపోవటం తథ్యం. అంతఃప్రేరణ సాయంతో నేను శిలల నీడల్లోకి ఒదిగాను. నా యజమాని రావటానికి గంటసేపు పట్టింది.

ఈ రాత్రిపూట జరుగుతున్న ఈ ప్రయాణంలో నా నాయకుడిని మళ్లీ అనుసరించాను. ఏం జరుగుతోందా అనే కుతూహలం క్షణం క్షణం పెరిగిపోసాగింది. ఎవరూ చూడకుండా ఇతను రావణుడి కోటలోకి ప్రవేశించి, ఎటువంటి ప్రమాదాన్నీ ఎదుర్కోకుండా, మళ్లీ వెనక్కి ఎలా వచ్చాడా అని ఆశ్చర్యపోయాను. లోపలున్న వారెవరో ఇతనికి సాయం చేశారని తెలుస్తూనే ఉంది. కానీ అతను చాలా ప్రమాదాన్ని కొనితెచ్చుకున్నాడు. అతనికోసం రాజు సైన్యం మొత్తం గాలిస్తోంది. ప్రాణాలతో గాని, చంపిగాని అతన్ని పట్టుకురమ్మని రాజాజ్ఞ. అలాంటప్పుడు ఇతను తనకి ఎలాంటి ప్రమాదమూ లేనట్టు రాజభవనమంతా తిరిగివచ్చాడు. అతని దుస్సాహసాన్ని చూసి విస్తుపోయాను.

కుతూహలాన్ని అణచుకోవటం ఇంక సాధ్యం కాదనిపించి ఒకరోజు అతన్ని వెంబడించాలని నిర్ణయించుకున్నాను. అతను బైలుదేరిన కొన్ని క్షణాల తరవాత అతన్ని అనుసరించాను. ఒక్క క్షణంలో అతను ఎత్తైన గోడదూకి మాయమయాడు. గోడ దగ్గరకి వెళ్లి, అతను ఉపయోగించిన తాడుని పరీక్షించాను.

నేను తాడు సాయంతో ఎక్కేందుకు చాలా కష్టపడవలసి వచ్చింది. పైకి చేరుకునేప్పటికి చెమటతో తడిసి మద్దయి విపరీతంగా ఆయాసపడటం మొదలు పెట్టాను. నెమ్మదిగా కోట ఆవరణలోకి దిగుతూ తిట్టుకున్నాను. దగ్గరలోనే దుస్తుల రెపరెపలూ, ఎవరో రహస్యంగా మాట్లాడుతున్న శబ్దం వినిపించింది. ఆ శబ్దాలు వస్తున్న వైపుకి నెమ్మదిగా కదిలాను. చీకట్లో రెండు ఆకారాలు ఒకదాన్ని ఒకటి

పెనవేసుకుని గాఢంగా ముద్దు పెట్టుకుంటున్నాయి. పొడవుగా ఉన్నవిద్యుజ్జిహ్వుడిని గుర్తుపట్టాను. ఆ స్త్రీని కూడా ఎక్కడో చూసినట్టు అనిపించింది. రాజకుమార్తె శూర్పణఖ! నేను నిర్ఘాంతపోయాను.

నా మనసులో ఒక ప్రణాళిక రూపుదిద్దుకోసాగింది. నా ప్రత్యర్థిని అంత మొందించేందుకు ఇదే మంచి అవకాశం. ఆ క్షణాన ఇద్దరిలో ఎవరిని నా యజమానిగా ఎంచుకోవాలో నిర్ణయించుకున్నాను. విద్యుజ్జిహ్వుడు మూర్ఖంగా రావణుడి కోటలో ఒంటరిగా ప్రవేశించాడు - మానసికంగానూ, శారీరకంగానూ ఎటువంటి జాగ్రత్తలూ పాటించకుండా, ఆత్మరక్షణకోసం ఎటువంటి చర్యలూ తీసుకోకుండా. నేను అతన్ని దెబ్బతీసేందుకు అదే మంచి అదను. రాజుని ఒంటరిగా కలుసుకుని ఈ సమాచారాన్ని ఆయన చెవిన వెయ్యాలి.

రాజభవనాన్ని ఒకసారి చుట్టివచ్చాను. నడిచేప్పుడు పొదలమాటున ఉంటూ, లోపలికి పోయేందుకు మంచిమార్గం ఎక్కడుందా అని వెతికాను. ఒక మామిడిచెట్టు ఎక్కి, పైన డాబా తలుపులు తెరిచి ఉంటాయని ఆశించాను. వాతావరణం వేడిగా, ఉక్కపోతతో నిండి ఉంది. ఎవరో దగ్గేసరికి నేను కొయ్యబారిపోయాను. నా గుండె చప్పుడు నాకే వినిపంచసాగింది. కొన్ని నిమిషాలు కదలకుండా అలాగే ఉండి, మళ్లీ ఎక్కసాగాను. ఒక కిటికీ తెరిచి ఉంది. దాని దగ్గరకి చేరుకున్నాను. లోపల మంచంమీద ఎవరో పడుకుని ఉన్నారు. ఆ మనిషి పక్కన పెళ్లికూతురు లేనందువల్ల ఆ పడుకున్నది రాజో కాదో తెలీలేదు. కానీ ఒక పక్కకి తిరిగిఉన్న అతని ముఖం రాజు ముఖంలాగే ఉంది. నేను తటపటాయించాను, కానీ అట్టే సమయం లేదని నాకు తెలుసు. మంచం దగ్గర ఒక చిన్న ప్రమిదె వెలుగుతోంది. అతని ముఖంమీద నీడ కదలాడుతోంది.

నేను గదిలో ప్రవేశించి రహస్యంగా, "మహాప్రభూ!" అని పిలిచాను. జవాబు రాకపోయేసరికి అక్కడ పడుకున్నది రావణుడేనా, కాదా అని నిశ్చయించుకునేందుకు కాస్త దగ్గరగా వెళ్లాను. హఠాత్తుగా, పులిలా నామీదికి ఉరికి ఆ వ్యక్తి నా గొంతు పట్టుకున్నాడు. నాకు భయంతో

నోటమాట రాలేదు. అతను ఇంకొక చేత్తో దీపం వత్తిని పెద్దది చేశాడు.

నా గొంతు పట్టుకున్నది విభీషణుడు. ఆ భవనంలో అన్ని గదులుంటే నేనీ దైవభక్తుడైన ద్రోహి గదిలోకే రావాలా? అతను నెమ్మదిగా తన పట్టు సడలించి నన్ను కిందికి దింపాడు. నేను నేలమీద పడిపోయాను. అతను కత్తిని బైటికి తీసి నామీద దాడి చెయ్యబోయేవాడిలా నిలబడ్డాడు.

"నన్ను చంపొద్దు, ప్రభూ! దయచేసి నన్నేమీ చెయ్యకండి!" అన్నాను ఏడుపు గొంతుతో.

"ఒరే, భద్రా, నన్ను హత్యచేద్దామనుకున్నావు కదూ... త్రాష్టుడా!"

అతను కూడా అయోమయంలో ఉన్నట్టు కనబడ్డాడు. అతన్ని ఆ పరిస్థితిలో చూసి, నేనింకా దీనంగా బతిమాలసాగాను. అతను కోపంతో నేలని కాలితో తన్నాడు. నేను ఏడవటం మానేసి గోడదగ్గరకి పాకుతూ వెళ్లి ముడుచుకుని కూర్చున్నాను. నాకింకా వణుకు తగ్గలేదు. అతని కోపం చూసి హడలిపోయాను. నాకు ఎప్పుడూ అతని గురించి అనుమానంగానే ఉండేది, అతను ప్రమాదకరమైన వాడనీ, పైకి చూపించే శాంతం, హుందాతనం కేవలం ముసుగులు మాత్రమేననీ అనిపించేది. కానీ అతను కత్తిని నాకు గురిపెట్టి ఏ క్షణాన్నైనా పొడవబోతున్నట్టు కనబడినప్పుడు, అతని కళ్ళలో పిచ్చికోపం తాలూకు మెరుపు కనబడినపుడు, నేనింతవరకూ ఇంత జిత్తులమారినీ, క్రూరుడినీ చూడనేలేదని నాకు రూఢిగా తెలిసిపోయింది. గొప్ప పాండిత్యంగల రావణుడి మంత్రులెవరూ కనిపెట్టలేకపోయిన విషయం, పల్లెటూరి బైతు భద్రుడు గ్రహించాడు. ఏదో ఒక రోజున, అవకాశం దొరికితే, ఈ దరిద్రుడు తన ఆత్మని కాస్త భూమికోసమో, నాలుగు బంగారు నాణాల కోసమో అమ్మేసుకోగలడు.

నేను మళ్లీ అతని కాళ్లమీద పడ్డాను.

"నా గదిలో ఏం చేస్తున్నావు నువ్వు?" అన్నాడు. అతని గొంతులో భయంకరమైన బెదిరింపు వినబడింది.

"ఇది మీ చెల్లెలికి సంబంధించిన విషయం. ఆమె ఎవరినో కలుసుకుంటోంది. దయచేసి నన్ను తన్నకండి."

అతను నా గొంతు పట్టుకుని నేలమీదనించి నన్ను పైకి ఎత్తాడు. "ఒరే తుచ్చుడా! నా చెల్లి విషయం నీకు ఎందుకు కావల్సొచ్చింది?" అని చెవిలో గొణిగాడు, కానీ ఆ గొంతు నన్ను హడలగొట్టింది.

ఒక పక్క ఊపిరి ఆడటం లేదు, దగ్గు వస్తోంది, అయినా, "కొన్ని నెలలుగా మీరు ఎవరికోసం గాలిస్తున్నారో ఆ రాజద్రోహి, విద్యుజ్జిహ్వుడు, తిరుగుబాటుదార్ల నాయకుడు ప్రస్తుతం తోటలో మీ చెల్లితో ఉన్నాడు," అన్నాను లోలోపల సంతోషిస్తూ, ఆ మాటలు అన్నాక వ్యంగ్యంగా నవ్వాను. నువ్వు గొప్ప కులీనుడినని అనుకుంటున్నావు కదూ, నీకు కావల్సిందే!' అనుకున్నాను మనసులో,

అతను నన్ను మళ్లీ నేలమీదికి తోశాడు, కానీ అతని బలం తగ్గిపోయిందని అనిపించింది నాకు. ఇంకొక మాట కూడా చెప్పుకుండా ఉండలేకపోయాను, "వాళ్లు ఇంకా అక్కడే ఉండి ఉంటారు, వాళ్లు చేస్తున్న పని పూర్తి అయి ఉండదు!" అతను నావైపు గుడ్లరిమి చూశాడు. మళ్లీ కొడతాడని అనుకున్నాను కానీ, అతను గదిబైటికి వెళ్లిపోయాడు. అతని వెనకే నేనూ వెళ్లాను. మారీచుడు కింది అంతస్తులో తన కుటుంబంతో ఉంటాడు. మేము చెక్కమెట్లు దిగాం, మారీచుడి గదిముందు అతను కొన్నిక్షణాలు ఆగాడు. తర్వాత నెమ్మదిగా తలుపుతట్టాడు. తలుపు చప్పుడు చేస్తూ తెరుచుకుంది. మారీచుడు నిద్రకళ్లలో తలుపుదగ్గర నిలబడ్డాడు. అతని ముఖంలో విసుగు స్పష్టంగా కనిపించింది.

"మామయ్యా, శూర్పణఖ మనకో సమస్య సృష్టించింది," అన్నాడు విభీషణుడు. తక్షణం మారీచుడు అప్రమత్తం అయాడు. తలుపు మూసేసి బైటికి వచ్చాడు. విభీషణుడు విషయం వివరంగా చెప్పాడు. నా పేరు చెప్పగానే మారీచుడి కళ్లు ఆశ్చర్యంతో విప్పారాయి. అంతా విని ఆయన గదిలోకి వెళ్లాడు. మళ్లీ బైటికి సాయుధుడై వచ్చాడు.

గురకపెట్టి నిద్రపోతున్నకాపలా భటుల పక్కనించి భవనం బైటికి వచ్చాం, తోటలోకి రాగానే రావణుడి సోదరి కనిపించిన స్థలాన్ని చూపించి నెమ్మదిగా వెనక్కితగ్గాను. ఇద్దరు యోధులూ చెరోవైపునుంచీ ఆ స్థలంవైపు వెళ్లారు. హఠాత్తుగా చెవులు చిల్లులు పడేట్టు కెవ్వమని కేకవేసి రాజకుమార్తె భవనంవైపు పరిగెత్తటం కనబడింది. ఆమె దాదాపు నగ్నంగా ఉంది. ఆ తరవాత మనుషులు కలబడిన చప్పుడు వినవచ్చింది. రాజకుమార్తె సురక్షితంగా భవనం చేరుకున్నదని రూఢి చేసుకొన్నాక మారీచుడు భటులని కేకవేసి పిలిచాడు. విద్యుజ్జిహ్వుడు ధైర్యంగా పోరాడాడు. విభీషణుడిని హతమార్చేవాడే, కానీ అంతలోనే చాలామంది భటులు సాయుధులై వచ్చి అతన్ని పట్టుకున్నారు. భటులు నిద్రమత్తులో ఉన్నారు, తాగేసి ఉన్నారు, చురుగా లేరు, కానీ పెద్ద సంఖ్యలో ఉండటంవల్ల వాళ్లకి అది సాధ్యం అయింది.

చివరికి నేను స్వతంత్రుడినయాను! ఇంక మాలని నాదాన్ని చేసుకోవచ్చు. తాము చాలా గొప్పవాళ్లమని విర్రవీగే కులీనులతో ఆమెని పంచుకోనక్కర్లేదు. నాకు గట్టిగా అరుస్తూ నాట్యం చెయ్యాలనిపించింది. పాడాలనిపించింది. కానీ నేను పొదల్లోనే దాక్కున్నాను. విద్యుజ్జిహ్వుడు సాహసం చేసి తప్పించుకుంటేనో, ఘర్షణలో అతనిదే పై చెయ్యి అయితేనో నేను ఇబ్బందిలో పడతాను.

16. విప్లవకారుడి మరణం

రావణుడు

నేను మంచంమీద అటూ ఇటూ దొర్లుతూ ఉండిపోయాను. ఎంతసేపటికీ నిద్ర పట్టలేదు. బైటతోటలో ఎక్కడో శబ్దాలు అవుతున్నాయి. అలసటగా మంచంమీదనించి లేచి కిటికీ దగ్గరకెళ్లాను. గదిలో అంత వేడిగా, ఉక్కగా ఉన్నా కిటికీలు మూసే ఉన్నాయి. నా భార్య వాటిని తెరిచేందుకు అనుమతించదు.

ఎవరో తలుపుతట్టారు. తలుపు తెరిచేందుకు వెళ్లేలోపల ఇంకా గట్టిగా తట్టసాగారు. నా భార్యవైపు తలతిప్పి చూస్తూ తలుపు తెరిచాను. ఆమె పసిపిల్లలా నిద్రపోతోంది. చుట్టూ ఎంత గోలగా ఉన్నా ఆమెకి నిద్రాభంగం కాలేదు. మారీచుడు బైట నిలబడి ఉన్నాడు, సాయుధుడై ఉన్నాడు. నేనేదో అడిగేలోపలే నన్ను మాట్లాడవద్దని సైగ చేశాడు. నా ఎడమచేతిని పట్టుకుని బైటికి లాగాడు.

"మనకి ఒక సమస్య వచ్చి పడింది," అన్నాడు ఆయన నా చెవిలో రహస్యంగా, ఏ దేవతల సైన్యమో దాడిచేసిందనో, వరుణుడు ఎదురు తిరిగాడనో చెపుతాడని, అటువంటి వార్త వినేందుకు సిద్ధం అయాను. ఆ సమస్య నా చెల్లికి సంబంధించినది అని కాస్త కూడా ఊహించలేకపోయాను. ఇక ఈ భూప్రపంచంలోని దుర్మార్గులూ, దుష్టులందరిలోనూ పరమనీచుడైన విద్యుజ్జిహ్వుడితో నా చెల్లెలికి సంబంధం ఉంటుందని అసలే ఊహించలేదు. నా చెల్లెలి అర్ధరాత్రి ప్రణయకలాపాలని గురించి వింటున్నకొద్దీ నాలో ఆశ్చర్యం, కలత, ఆగ్రహం పెరిగిపోసాగాయి. ఆమె తన గది తలుపులు మూసేసుకుని బైటికి రానని భీష్మించుకుని కూర్చుంది. ఆ రాత్రి నేను విన్న ఒకే ఒక మంచివార్త, విద్యుజ్జిహ్వుడు పట్టుబడ్డాడనేది మాత్రమే. అమితాశ్చర్యం కలిగించే మరొక విషయం ఏమిటంటే, ధర్మనిష్ఠాపరుడైన నా తమ్ముడు,

విభీషణుడు, తన జీవితంలో మొదటిసారి ఈ గొప్పకార్యాన్ని సాధించాడనేది.

నేను పాదరక్షలు గాని, శాలువగాని వేసుకోకుండానే బైలుదేరాను. మంత్రు లందరినీ సభలో సమాయత్తం అవమనీ, వెంటనే విచారణ జరపబోతున్నామనీ కబురు పెట్టమని మారీచుడికి చెప్పాను. సభవైపుకి వీలైనంత వేగంగా నడిచాను. నేను పెద్ద శబ్దంచేస్తూ తలుపు ముయ్యటం కూడా నా భార్యకి వినబడి ఉండదని కచ్చితంగా చెప్పగలను. అదృష్టవంతురాలు!

నా మంత్రులందరూ కొద్దిసేపట్లో సభకి విచ్చేశారు. ప్రహస్తుడు ఎప్పటిలాగే భావరహితమైన గొంతుతో, కచ్చితమైన ఆలోచనలని ప్రకటించి అందర్నీ విసిగించాడు. మర్నాడు ఉదయమే నేరస్తుడి తల తీయించెయ్యాలనీ, రాజ్యాధికారాన్ని ఎదిరించాలని అనుకునే వాళ్లందరికీ అది ఒక గుణపాఠం అవుతుందనీ సలహా ఇచ్చాడు. మొదటిసారి ప్రహస్తుడి అభిప్రాయంతో ఏకీభవించాను. కానీ అతను మాట్లాడటం అయిపోయిన వెంటనే సభని ముగించటం నాకు ఇష్టం లేకపోయింది. కానీ ఎవరూ లేచి అతని మాటని ఖండించలేదు. చేసేదేమీలేక, సభ ముగించి నా మందిరంలోకి వెళ్లిపోయాను.

నా భార్య ఇంకా నిద్రపోతూనే ఉంది. వెన్నెల కిరణం ఒకటి వెండి తీగలా ఆమె ముఖంమీద పడుతోంది. ఆమె దేవకాంతలా, ఎంతో అమాయకంగా కనిపించింది. ఆమె ముఖంలోని అందంచూసి నాలో కవిత్వం పొంగింది. పెళ్లి అయిన గత నాలుగు నెలలుగా నాకే తెలియకుండా, నాలో ప్రేమ బీజం నాటుకుంది. నాకు ఎంత ఇష్టం లేకపోయినా, అలా జరగకూడదని ఎంత గట్టిగా తీర్మానించుకున్నా, నా భార్యమీద వెర్రిప్రేమ నా మనసులో తలెత్తింది. ఆమెని ముట్టుకోకుండా ఉండేందుకు జాగ్రత్తపడుతూ, ఆమె పక్కనే పడుకున్నాను. భద్రుడి గురించి ఆలోచించసాగాను. అతను మళ్లీ నా జీవితంలోకి ఎలా ప్రవేశించాడో ఆలోచిస్తూ ఉంటే నా ఆలోచనలు నా చెల్లెలివైపు మళ్లాయి. పాపం ఆమెకి జీవితంలో కోరుకున్నది ఏదీ లభించలేదు.

చిన్నపిల్లగా ఉన్నప్పుడు ఏ రకమైన సౌకర్యాలూ, ప్రేమాభిమానాలూ దొరకలేదు. అందుకే ఆమె ప్రేమవలలో పడటం పెద్ద ఆశ్చర్యపోవలసిన విషయం కాదు. అమ్మ ప్రేమలో సింహభాగం నేను సంపాదించుకున్నాను. తరవాత పెరిగి పెద్దయాక, నేను పెద్ద పెద్ద ఆకాంక్షలలోనూ, నన్ను నేను ప్రేమించుకోవటంలోనూ మునిగిపోయాను. ఆ సమయంలో అసలు నాకొక చెల్లెలు ఉందన్న విషయాన్నేవిస్మరించాను. తను చిన్నప్పట్నించీ ఒంటరిగానే పెరిగింది. చూసేందుకు అందంగా ఉండదు, నల్లగా బొద్దుగా ఉంటుంది. హఠాత్తుగా లంకకి రాజకుమార్తె అయేదాకా ఆమె జీవితం నిస్సారంగా, నిరాసక్తంగా గడిచింది. అప్పుడు చాలామంది ఆమెని పెళ్లి చేసుకునేందుకు ముందుకి వచ్చారు. నేను పరిపాలనలో పూర్తిగా మునిగిపోయి ఆమెని అసలు పట్టించుకోనేలేదు. ఇప్పుడు ఎక్కువగా తుళ్లుతూ, సంతోషంగా ఉందని అనిపించింది కానీ, అది హఠాత్తుగా ఆమె హోదా పెరగటంవల్లే అనుకున్నాను. అంత సంతోషంగా ఎందుకు కనిపించిందో ఇప్పుడు అర్థం అవుతోంది. ఆమె ప్రేమలో పడింది, కనీసం తను ప్రేమలో పడ్డానని అనుకుంటోంది. ఆ ప్రేమ ఆ త్రాష్టుడివైపునుంచి కూడా ఆమెకి దొరికిందా లేదా అనేది నాకు తెలీదు. రాజు చెల్లెలితో ప్రేమవ్యవహారం సాగించటానికి వాడికి ఎంత ధైర్యం! అదీ రాజ్యం దృష్టిలో వాడి ప్రాణానికి అపాయం ఉన్నప్పుడు! నా చెల్లిని వాడు ఎరగా ఉపయోగించుకుంటున్నాడా? ఈ దుస్సాహసానికి వాడు తగిన మూల్యం చెల్లించేట్టు చూస్తాను. రుద్రకుడికి రేపు చేతినిండా పనే.

మర్నాడు ఉదయం నేను రాజ్యసభకి చేరుకునేసరికి నా మంత్రులు నాకోసం ఎదురు చూస్తున్నారు. నేను ఆలస్యంగా చేరుకోవటంవల్ల గబగబా సింహాసనంవైపు నడిచాను. వాతావరణంలో ఉన్న ఒత్తిడిని గ్రహించాను. అప్పుడు చూశాను ఆమెని. నాకు అది నచ్చలేదు, ఎంతమాత్రం నచ్చలేదు. సభలో శూర్పణఖ నిలబడి ఉంది. జుట్టు చెదిరిపోయి, కళ్లు ఎర్రగావాచి, చాలా కోపంలో ఉన్నట్టు కనిపించింది. ఒక సోదరుడిగా నానుంచి జాలినీ, సానుభూతినీ పొందే ప్రయత్నం

ఆమె చెయ్యటం నాకు ఎంతమాత్రం ఇష్టంలేదు. నా పరిపాలనలో వ్యక్తిగత విషయాలు కలిసిపోవటం నాకు అసహ్యం. ఎటుచూసినా నాకు ఓటమే లభించేట్టు అనిపించింది. తన ప్రియుడిని విడిచిపెట్టేట్టు చేసేందుకు నామీద అన్నిరకాల యుక్తులూ ప్రయోగిస్తుందని నాకు తెలుసు. సభలో జనం మాటలు సర్దుమణిగేసరికే నాలో కోపం తలెత్తింది. నేను అటూ ఇటూ చూశాను. మారీచుడి దృష్టిని ఆకర్షించాను. ఆయన తల అడ్డంగా ఆడిస్తున్నాడు. ఏం జరిగినా తట్టుకునేందుకు సిద్ధం అయాను. ప్రహస్తుడు ఛాతీమీద చేతులు కట్టుకుని కూర్చున్నాడు. గట్టి నిర్ణయం తీసుకున్నవాడిలా అతను తలఎత్తి ఉన్నాడు. అతని ముఖంమీద విపరీతమైన అహంకారం, తిరస్కారం గోచరించాయి. కుంభకర్ణుడు నోరువెళ్లబెట్టుకుని తన ఆసనంలో కూర్చున్నాడు. విభీషణుడు ఏవో తాళపత్రాలు పరిశీలిస్తున్నాడు.

"నాకు విద్యుజ్జిహ్వుడిని వివాహం చేసుకోవాలని ఉంది!" సభలో చీమ చిటుక్కుమంటే వినబడేంత నిశ్శబ్దం నెలకొంది. శూర్పణఖ కొన్ని అడుగులు ముందుకి వచ్చి నా కళ్లలోకి సూటిగా చూస్తూ మళ్లీ, "నేను అతన్ని వివాహం చేసుకుంటాను, ఆ తరవాత నువ్వు అతన్ని ఉరి తియ్యచ్చు. కానీ అతన్ని నువ్వు హతమారిస్తే, నేను కూడా అతనితోపాటు సహగమనం చేస్తాను," అంది.

అసంకల్పితంగా నేను జంకాను. ఒక అసుర స్త్రీ భర్త మరణం తర్వాత దేవతావితంతు స్త్రీలు ఆచరించే సతీసహగమనాన్ని అనుకరించటమా! ఆమె నా సోదరి కాకపోయినా ఆ ఆలోచనే నన్ను విభ్రాంతికి గురిచేసి ఉండేది. మా జాతి మొత్తం అపహాస్యానికి గురవుతుంది. "మన ఇద్దరికీ ఉన్న అన్నాచెల్లెళ్ల సంబంధాన్ని అనుచితంగా నీ స్వార్థానికి ఉపయోగించుకోవద్దు!" అని గొంతు చించుకుని అరిచాను.

అప్పుడు ఆమె పిచ్చిదానిలా ప్రవర్తించసాగింది. తలని రెండు చేతులతోనూ బాదుకోవటం, జుట్టు పీక్కోవటం, గట్టిగా కేకలు పెట్టటం

మొదలుపెట్టింది. పెద్ద గలభాని సృష్టించింది. సేవకులూ, భటులూ నవ్వకుండా ఉండేందుకు కష్టపడి ప్రయత్నించటం నాకంట పడింది. నా ముఖంలో కత్తి వాటుకి నెత్తురు చుక్కలేదు. ఆ పరిస్థితిలో ఏంచెయ్యాలో పాలుపోలేదు. నాకు చాలా అవమానంగా అనిపించింది.

శూర్పణఖ నన్ను అనరాని మాటలు అని, తన తల నరికెయ్యమని సవాలు చేసింది. నా చెల్లెలి పిచ్చి కేకలూ, అరుపులూ, తిటమ్లో తప్ప ఇంకేమీ శబ్దాలు లేవు. రాజభవనం పూర్తిగా నిశ్శబ్దంలో మునిగింది. నేను అసహాయుడిలా, కోపంతో, అలసటతో ఏం చెయ్యాలో తోచకుండా ఉండిపోయాను. కానీ అన్నిటికన్నా నన్ను బాధపెట్టిన విషయం - నేను మంచి సోదరుడిని కాలేకపోయినందుకు నాకు కలిగిన అపరాధభావం. నా కుటుంబాన్ని పట్టించుకోనందుకూ, తలిదండ్రులనుంచి నా తోబుట్టువులని విడదీసినందుకూ, అంత స్పష్టంగా నా తీవ్ర ఆకాంక్షని ప్రదర్శించినందుకూ బాధపడ్డాను. నా మనసు బలహీనపడుతోందని గ్రహించాను.

మారీచుడూ, విభీషణుడూ, కుంభకర్ణుడూ తప్ప ఒక్కరొక్కరుగా నా మంత్రు లందరూ నిష్క్రమించారు. చేతులతో తల పట్టుకుని నేను సింహాసనం మీద కూర్చుని ఉండిపోయాను. తలకాయ పగిలిపోతుందేమో అన్నంతగా తలనొప్పి మొదలైంది. మారీచుడు నా దగ్గరకొచ్చి నా భుజం తట్టి, నా మనస్సాక్షి ఏ నిర్ణయం తీసుకోమంటే అదే తీసుకోమని అన్నాడు. ఆ తరవాత అన్నీ నాచెయ్యిదాటిపోయాయి. విభీషణుడూ, కుంభకర్ణుడూ, మా చెల్లి సంతోషం కన్నా ఇంకేదీ ముఖ్యం కాదని అన్నారు. సొంత చెల్లెల్ని సంతోష పెట్టలేకపోతే, ఇంక ఈ రాజ్యం కూడా మాకు పనికిరానిదే అనే అభిప్రాయాన్ని నొక్కి చెప్పారు. నా చెల్లెలు అతన్ని ప్రాణాలతో విడిచిపెట్టమని కోరినంత మాత్రాన, రాజద్రోహిని శిక్షించకుండా వదల్లేనని అభ్యంతరం చెప్పాలని నాకు అనిపించింది. ఒక రాజుగా నేను తప్పగా ప్రవర్తించి ముందు తరాలకి చెడు ఉదాహరణని అందించలేను. విద్యుజ్జిహ్వుడిని ఊరి తియ్యటం ఎందుకు సమంజసమో చెప్పేందుకు

నా దగ్గర ఎన్నో వాదనలు ఉన్నాయి, కానీ నేను మౌనంగా ఉండిపోయానని చెప్పటానికి చాలా సిగ్గు పడుతున్నాను. శూర్పణఖ విద్యుజ్జిహ్వుడిని ఎందుకు పెళ్లి చేసుకోవాలి అనే విషయం గురించి వాళ్లు నన్ను ఒప్పించే ప్రయత్నం చేస్తూంటే, నేను అభ్యంతరం చెప్పలేదు. అలా, నా నిర్ణయానికి విరుద్ధంగా, మంత్రుల సలహాలని పెడచెవిన పెట్టిన, ధర్మాన్నీ న్యాయాన్నీ నీతి నియమాలనీ, చివరికి లోకజ్ఞానాన్ని కూడా కాదని, నా చెల్లెలి పెళ్లి నా శత్రువుతో జరగటానికి అనుమతించాను. పూర్తిగా మనసు విరిగి, విభీషణుడిని శూర్పణఖకి ఆ వార్త తెలియజేయమని చెప్పి, నా గదిలోకి వెళ్లిపోయాను.

17. అస్పృశ్యుడైన రాజు

భద్రుడు

విద్యుజ్జిహ్వుడు రావణుడి సోదరికి భర్త అయి ఆరునెలలు గడిచాయి. నా జీవితం ఎప్పట్లాగే దీనాతిదీనంగా గడుస్తోంది. నేను రాజభవనంలో నా ముఖం చూపించేందుకు భయపడ్డాను. విద్యుణ్జిహ్వుడు నన్ను చంపిస్తాడన్న భయం. రావణుడి గురించి కూడా నాకు సందేహాలు ఉన్నాయి. వాళ్లిద్దరికీ బంధుత్వం కలిసింది కాబట్టి ప్రస్తుతం నా పరిస్థితి ఏమిటో తెలీలేదు. కొన్నాళ్లు అడవిలో దాక్కుని ఆ తరవాత ఆకలి తరిమితే తాత్కాలికంగా ఊళ్లోకి వచ్చాను. కొన్ని వారాలు పట్టుబడతానేమో అని హడిలిపోతూ బతికాను. ఏ సైనికుడు కనబడినా, రక్షకభటుల రథాల చప్పుడు వినిపించినా, వీధిలోంచి తప్పుకుని దాక్కోసాగాను. కొంతకాలానికి నా భయం తగ్గిపోసాగింది. రాజు కాని, రాజు బంధువులు కాని పట్టించుకునేంత గొప్పవాడిని కానని అనిపించింది.

అలా మరికొన్ని వారాలు వీధులవెంట పనిలేకుండా తిరిగి, మాల ఇంటికి వెళ్లి ఆమెతో ఉండటం ప్రారంభించాను. మొదట్లో ఆమె చాలా ఉదాసీనంగా, నేనంటే తనకి ఎంతమాత్రం ఇష్టం లేనట్టు ప్రవర్తించింది. విప్లవకారుల సంఘం లన్నిటినీ విడగొట్టేశారు. నిరాశ చెందిన ఆదర్శవాదులందరూ గ్రామాలకి తరలి పోయారు. అవకాశవాదుల సంఖ్యే ఎక్కువగా ఉండటంతో వాళ్లందరూ రావణుడి సైన్యంలో చేరి ఉన్నత పదవుల్లో స్థిరపడ్డారు. తన ప్రియుడు అనాకారి రాజకుమార్తె కోసం తనని వదిలి వెళ్లినందుకు మాల అపహాస్యం పాలయింది.

క్రమక్రమంగా నా మనసులో ఒక వ్యూహం రూపుదిద్దుకోసాగింది. ఎలాగైనా రావణుడిని కలుసుకోవాలి. నేను చూసేందుకు బిచ్చగాడిలా ఉన్నాను. జుట్టని వేళ్లతో దువ్వి నుదుటిమీద విభూతి అదుకున్నాను.

అప్పుడు రాజభవనం వైపు నడిచాను. ముఖద్వారం దగ్గరకి చేరుకునేసరికి, బైట ఒక పెద్ద గుంపు కనిపించింది. అక్కడ ఏం జరుగుతోందో తెలుసుకోవాలని అనిపించింది. ఆ జన సందోహంలో ఎంతోమంది మిఠాయిలూ, వేరుశెనగలూ అమ్ముతూ, అటూ ఇటూ తిరుగుతున్నారు. యుక్త వయసు కుర్రవాళ్ల జట్టు ఒకటి ఆ జనసమూహంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తోంది. పొడుగా, నల్లగా, ఎముకల గూడులా ఉన్న ఒక యువకుడిని విషయం ఏమిటని అడిగాను,

"మీకు తెలీదా?" అన్నాడు అతను, ఆశ్చర్యంతో కళ్లు పెదవి చేసి.

"సరేలే, నాకెలా తెలుస్తుంది?"

"పరవాలేదు. మీకు బాగా వయసు ముదిరింది, మీరు దీన్ని గురించి పట్టించుకోవక్కర్లేదు లెండి," అన్నాడు అతను. నాకు కోపం వచ్చింది. నాకింకా ముప్పై ఐదేళ్లే, కానీ పంతొమ్మిదేళ్ల యువకుడి దృష్టికి ఇరవై ఏళ్లు దాటిన వాళ్లందరూ వయసు ముదిరినవాళ్లలాగే కనిపిస్తారేమో, నా కోపాన్ని వీలైనంత దాచుకుంటూ, "ఆ మూర్ఖులు దేన్ని గురించి పోట్లాడుకుంటున్నారు?" అని అడిగాను.

"ఒరే, ముసలాడా! చక్రవర్తిసేనలో మేమందరం సైనికులుగా చేరబోతున్నాం." "చక్రవర్తా? ఏ చక్రవర్తి..." అంటూ మధ్యలో ఆపేశాను. రాజు బహుశా తనని తాను చక్రవర్తి స్థాయికి పెంచుకున్నాడేమో. అతను నన్ను ఇబ్బంది పెట్టనంతకాలం తనను తాను మహారాజు అనుకున్నా, చక్రవర్తి అనుకున్నా, ఇంకేమనుకున్నా నాకు పరవాలేదు.

"నిజంగా బాబాయి! నువ్వుట్టి బైతువి! మన చక్రవర్తి ఉత్తరాన ఉన్న ప్రాంతం మీద దండెత్తే ఆలోచనలో ఉన్నాడు. అసురులం అందరం కలిసి ప్రతీకారం తీర్చుకోబోతున్నాం. ఆ దొంగవెధవలు, దేవతలకి, వాళ్లు జీవితాంతం మరిచిపోలేని గుణపాఠాన్ని నేర్పిస్తాం," అన్నారు నాతో మాట్లాడిన యువకుడి మిత్రులు.

మరుక్షణం జనంలో ఉత్సాహం విద్యుత్తు వేగంతో ఎగసిపడింది.

అలలు అలలుగా పెద్దగా కేకలు వినిపించాయి. రాజభవనం పైన డాబా మీద స్ఫురద్రూపి అయిన ఒక ఆకారం మిరుమిట్ల గొలుపుతూ కనబడింది. "మా చక్రవర్తి వర్ధిల్లాలి! అసురులని విజయం వరించాలి! దేవతలు నాశనమైపోవాలి!" అనే కేకలు మిన్నుముట్టాయి. ఒంటినిండా ఆభరణాలతో, సమ్మోహనాకారంతో నిటారుగా నిల్చుని ఆజానుబాహువు రావణుడు ఒరలోంచి కత్తిని పైకితీసి పట్టుకుని, "హరహర మహాదేవ!" అని అరుస్తూ శివుని స్తుతించాడు. జనం అతని మాటలని అందుకున్నారు. "హరహర మహాదేవ!" అనే నినాదాలు అన్ని వైపులనుంచీ వినిపించాయి. జనం ఉవ్వెత్తున ముందుకి సాగారు. నేను వాళ్ల మధ్యన ఉండి పోయాను. ఇంతలో రావణుడికన్నా కూడా ఆకర్షణీయంగా ఉన్న మరో ఆకారం అతని పక్కన వచ్చి నిలబడింది. కనులపండువుగా అలంకరించుకున్నవిద్యుజ్జిహ్వుడు తన బావమరిది పక్కకి వచ్చి నిలబడ్డాడు. అతని వెనకే లావుగా ఉన్న కుంభకర్ణుడు వచ్చాడు. ఆ తరవాత అతనికన్నా సన్నగా ఉన్న విభీషణుడు వచ్చి నిలబడ్డాడు. తరవాత రావణుడి సేనాధిపతులూ, మంత్రులూ ఒక్కరొక్కరుగా వచ్చి ఆ డాబామీద చక్రవర్తి సరసన నిలబడ్డారు. జనం ఉత్సాహంతో వెర్రెత్తిపోయారు. భేరీలు మోగాయి. తూర్యనాదం మారుమోగింది. వాతావరణం ఉద్రిక్తంగా మారింది. బాకాలూ, యుద్ధ శంఖాలూ పూరించబడ్డాయి.

నా ఒళ్లు ఆవేశంతో జలదరించింది. ఇన్నాళ్లుగా నా మనసులో రహస్యంగా పోషించుకుంటూ వస్తున్న కోరిక తీరబోతోంది. నా చిన్నారికూతురి తల బద్దలుకొట్టి, నా భార్యమీద అత్యాచారం చేసిన దేవతలమీద పగ తీర్చుకునే సమయం వచ్చింది. ఈ క్షణం కోసమే ఇన్నాళ్లుగా ఎదురుచూశాను. నేను కూడా గొంతు చించుకుని, "హరహర మహాదేవ! దేవతలని హతమార్చాలి! ఇంద్రుడిని మట్టపెట్టాలి! మహేశ్వరుడికి విజయం సిద్ధించాలి!" అంటూ అరిచాను.

అన్నివైపులా మోహరించిన ఉత్సాహం అసామాన్యంగా అనిపించింది. ఇది గంటకు పైగా కొనసాగింది. సూర్యుడు దాదాపు

నడినెత్తిమీదికి వచ్చాడు. నల్లటి శరీరాలు నిగనిగలాడసాగాయి. నా ఇంద్రియాలకి వేడిమి, ఉక్కపోతతోపాటు వాసనలు కూడా స్పష్టంగా తెలియవచ్చాయి. గొంతునొప్పి పుట్టి బాధ కలిగినా, నేను అరవటం మానలేదు. ఇంకెవరైనా నా స్థానాన్ని ఆక్రమిస్తారని భయం వేసింది. ఇంతలో హఠాత్తుగా జనం చేసే గోల తగ్గిపోయింది. దయలేని సూర్యుడి కిరణాల వేడికి తట్టుకోలేక ముఖ్యులందరూ డాబా దిగి వెళ్లిపోయారు. చల్లగా ఉన్న గదులలోపలికి వెళ్లిపోయారు. వెనకాల ఉన్న ఎవరో శివుడి పేరు చెప్పి మళ్లీ నినాదాలు చేశాడు. కొందరు గుర్రాలమీద జనం మధ్యకి రావటం చూశాను. ఆ గుర్రాల దగ్గర జనం ఆత్రుతగా మూగారు. గుర్రాలమీద వచ్చిన భటులు ఆహారం పొట్లాలు విసిరివేస్తున్నారు. వాటిని అందుకునేందుకు కొన్ని వేల నల్లని చేతులు పైకి లేచాయి. నేను కూడా అందర్నీ తోసుకుంటూ ఆ పొట్లాలని అందుకునేందుకు పోటీ చేశాను. తీరా చూస్తే అందులో ఎప్పుడో వండిన మాంసం, అన్నం, మసాలా దట్టించిన చేపకూరా ఉన్నాయి. అవన్నీ ఎండిపోయిన అరటి ఆకుల్లో చుట్టి ఉన్నాయి. నేను ఆబగా దాన్ని తినేశాను. మధ్యాన్నం అయేసరికల్లా, జనం అక్కడినించి వెళ్లిపోయారు. నేలమీదంతా ఎంగిలి అరిటి ఆకులూ, చేప ముళ్లూ, అన్నం మెతుకులూ పడేసిపోయారు.

సాయంకాలపు ప్రార్థనలూ, ఆలయాలలో మోగే చిరుగంటలూ, ఆలయాల మెట్లు ఎక్కే అందమైన అమ్మాయిల గాజుల గలగలలూ కలిసి వినబడసాగాయి. అంతటా ఆనందోత్సాహాలు తాండవించాయి. అయినా ఈ అందమైన సాయంకాలం పొగమంచులా కరిగిపోతుందేమో అని నాకు భయం వేసింది. నాకు రక్తం వాసనా, యుద్ధమూ, మృత్యువు తాలూకు నీడలూ లీలగా తోచాయి. అన్నిటికన్నా ఎక్కువగా భయంకరమైన విశ్వాసఘాతం, కుట్రా, నాశనం జరగబోతున్నాయని అనిపించింది. పాపం, శాపగ్రస్తమైన మా జాతి కల నిజమవకుండానే కరిగిపోతుందని అనిపించింది.

నేను కాళ్లీడ్చుకుంటూ రాజభవనం చేరుకుని చక్రవర్తిని కలుసుకునే అవకాశం ఇవ్వమని ప్రార్థించాను. నేను పిచ్చివాళ్ల గృహం నుంచి

తప్పించుకు వచ్చిన వాడిని అన్నట్టు నావైపు చూసి, ఆ లావుపాటి ద్వారపాలకుడు వెంటనే నన్ను బైటికి గెంటాడు. బైట కోటచుట్టూ ఉన్న తోటలో అశోక వృక్షం కింద నిలబడి ఏ డాబా మీదినించో, కిటికీలోనుంచో చక్రవర్తి నన్ను చూస్తాడనీ, లోపలికి రమ్మంటాడనీ ఆశిస్తూ ఎదురుచూశాను. నేనింకా పాఠం నేర్చుకోలేదని ఈ నా ప్రవర్తన నిరూపించింది. ఆ రాత్రికి దట్టమైన ఆ వృక్షంకిందే నిద్రపోయాను, తెల్లారగట్ల వర్షం ప్రారంభమయేసరికి లేచి నడుస్తూ నా గుడిసెకి వెళ్లిపోయాను. మళ్లీ సాయంకాలం అవగానే అదే అశోకవృక్షం కిందికి వచ్చి నిలబడి ఎదురు చూడసాగాను

☼

రావణుడు

నెమ్మదిగా పొద్దుగూకటం ప్రారంభించింది. అప్పుడే వేడినీళ్లలో ఉతికిన బట్టలా ద్వీపం వేడిగా ఉంది. నేను చాలా భయాందోళనలకి గురయి ఏం జరుగుతోందో చూస్తున్నాను. యుద్ధానికి అవసరమైనవన్నీ కొన్ని వారాలనుంచీ సిద్ధం చేసుకుంటున్నారు. అది నాకు ఒక తీర్థయాత్రలా అనిపించింది. నేను ఎన్నడూ నర్మదానది దాటి ఎక్కడికీ వెళ్లలేదు. ఒక్కసారి హిమాలయాలకి వెళ్లి ఒకటిరెండు రోజులు గడిపి వచ్చాను, అంతే. ఆ ప్రయాణం అడవుల గుండా జరిగింది. చరిత్ర ప్రసిద్ధి పొందిన సరస్వతీ, సింధూనదుల తీరాన నిర్మించబడిన గొప్ప నగరాలని చూడాలని కుతూహలపడ్డాను. ఆ నగరాలన్నిటినీ అసురుల నాగరికత ఉచ్చదశలో ఉన్నకాలంలో వాళ్లు నిర్మించారు. వాటిలో ఎక్కువ భాగం ఇప్పుడు శిథిలమైపోయాయి. సింధూనది అలల తాకిడికీ, సరస్వతీనది ఎండిపోవటం మూలానా, వరసగా జరిగిన దాడుల కారణంగానూ, ఆ నగరాలు మా జాతికీ, నాగరికతకీ అతిపెద్ద శ్మశాన వాటికలుగా మారిపోయాయి.

కానీ ధనం ఎక్కడినించి సమకూర్చుకుంటారు, యుద్ధతంత్రం ఏ

రకంగా ఉంటుంది అనే విషయాలకన్నా, నన్ను ఎక్కువ కలవరపెట్టింది, నా చిట్టితల్లికి జరిగిన అన్యాయం. ఆ పిల్లని ప్రసవించేందుకే నా భార్య చాలా యాతన అనుభవించింది. అది బతికి బట్టకడుతుందని అనుకునేందుకు మాకు ధైర్యం చాలలేదు. ఆ పసికందు చిన్నిదేహాన్ని ఏళ్లతరబడి యుద్ధం చేయటంవల్ల మోటుగా మారిన నా చేతుల్లోకి తీసుకున్నప్పుడు నాకు చెప్పలేనంత సంతృప్తి కలిగింది. ఈ ప్రపంచమంతా నాదేననిపించింది. నా భార్య పాపని ఆడిస్తూ చేసే శబ్దాలు వింటున్నప్పుడూ, పాపకి పాలుపట్టి, స్నానం చేయించేప్పుడూ, నాకు ఇంకేమీ అక్కర్లేదని అనిపించేది. జీవితాంతం ఆ ఆనందాన్ని అనుభవిస్తూ ఉండిపోగలిగే వాడినే.

కానీ ఒకరోజు అదంతా పూర్తిగా మారిపోయింది. మా నాన్న మిత్రుడినని చెప్పుకుంటూ ఒక జ్యోతిష్కుడు నా రాజభవనానికి వచ్చి నా కూతురిని చూసి, ఆ పిల్ల అసురులకి వినాశాన్ని కొని తెస్తుందని అందరి ఎదుటా ప్రకటించాడు. ఆరోజు నుంచీ నా కుటుంబసభ్యులూ, సేవకులూ, మంత్రులూ అందరూ విచిత్రంగా ప్రవర్తించటం మొదలుపెట్టారు. నా కూతురు నా ఒళ్లో ఉన్నా, మండోదరి దగ్గర ఉన్నా దానిపట్ల ఎంతో గౌరవంగా, ప్రేమగా ప్రవర్తించేవాళ్లు. కానీ వాళ్ల మనసుల్లో దానిపట్ల ఉన్న ద్వేషాన్నీ భయాన్నీ నేను గ్రహించగలిగాను. అసురులకి ఎప్పుడూ మూఢనమ్మకాలు ఎక్కువే. నా కూతుర్ని భవనంలో వదిలి, దండయాత్రలకి వెళ్లేందుకు నాకు భయం వేసేది. అది పుట్టి ఇంకా కొన్ని వారాలే అయింది. అసురులు ఎంతకైనా తెగించగలరు. దాన్ని చంపేస్తారేమో అని భయపడ్డాను. దాన్ని నావెంట తీసుకువెళతానని మండోదరిని ఒప్పించటం చాలా కష్టం. కానీ ఏదో ఒక మార్గం చూడాలి. యుద్ధ శిబిరాల్లోకి చంటిపిల్లని తీసుకెళ్లే నవ్వుతారు. కానీ నేను రాజ్యవిస్తరణలో మునిగి ఉండగా దానికి ఎవరైనా విషం పెట్టటం, కత్తితో పొడిచి చంపటంకన్నా అదే నయం. అది నావెంట ఉంటే దానిమీద ఒక కన్నువేసి ఉంచవచ్చు. భద్రుడికి దాని రక్షణ భారాన్ని అప్పజెపితే బావుంటుందేమో. కానీ వాడిని నమ్మవచ్చా?

నేను పడుకునేందుకు వెళుతూంటే మసక వెలుతుర్లో, ఒక మనిషి కుంటుకుంటూ భవనం విడిచి వెళ్లటం కనిపించింది. సన్నగా, నల్లగా ఉన్న ఆ ఆకారం నాకు పరిచయం ఉన్న వ్యక్తిదే అనిపించింది. హఠాత్తుగా మెరుపు మెరిసి ఆ ప్రాంతమంతా పగటి వెలుతుర్లో కనిపించినంత స్పష్టంగా కనిపించింది. ఆ ఆకారం భయంభయంగా పైకి చూడటం స్పష్టంగా కనబడింది. భద్రుడు! వీడికి ఎప్పటికీ మరణం ఉన్నట్టు లేదు. నాలో ఎలాంటి భావాలు రేగాయో స్పష్టంగా చెప్పలేను, ద్వేషమా? ఉపశమనమా? జాలా? మరయితే, నా సేవకుడిని పిలిచి ఆ అర్ధరాత్రివేళ ఆ మనిషిని నా గదిలోకి తీసుకురమ్మని ఎందుకు అడిగినట్టు?

భద్రుడు

అలాకపురి మీద చేసిన దండయాత్రలో పారినంత రక్తం నేను పాల్గొన్న మరే యుద్ధంలోనూ పారలేదు. కుబేరుడి రాజ్యాన్ని చేరుకునే సమయానికి అసుర సైనికుల సంఖ్య లక్షకి పైగా చేరుకుంది. ఆ మారణ హోమంలో ఎన్నో గ్రామాలని తగలబెడుతూ, నగరాలని కూల్చేస్తూ వాళ్లు ముందుకి సాగారు, ఆసరికి అరవై చిన్న రాజ్యాలూ, సామంత రాజులూ రావణుడి అధికారాన్ని అంగీకరిస్తూ, విజేతతో చేరిపోయారు. ఎన్నో నగరాల్లో విష్ణువు విగ్రహాలని పగలగొట్టారు, ఆ తరవాత వాటిమీద ఎక్కి తొక్కారు. వాటి స్థానంలో శివలింగాలని ప్రతిష్టించారు. అసురుల గౌరవాన్ని పునరుద్ధరించే ప్రయత్నం అది. అది దేశాన్ని మొత్తంగా ఆవేశానికీ, ఉద్రేకానికీ లోనుచేసి, దేవతలకి వ్యతిరేకంగా, అణచివేతని ఎదిరిసూ ఉప్పెనలా లేచింది. రావణుడు ముందుండి తన ధైర్యసాహసాలతో అందరినీ ఉత్సాహపరిచాడు. అతని సాహసం ఒక్కోసారి నిర్భీతి స్థాయికి చేరుకుందని అనిపించేది. కానీ మృత్యువుని లెక్కచెయ్యని నాయకుడికన్నా అసురులని ప్రేరేపించేందుకు ఇంకేదీ లేదని కూడా అనిపించింది.

వెనువెంటనే ఆత్మహత్యకి వెరవని సైనికుల జట్లు చిన్న చిన్న కోటలమీద దాడిచేసి, ఒక్కొక్క కోటనీ వశపరుచుకున్నారు. ఒక్కోసారి ఆపని అవలీలగా చేస్తే, ఇంకొకసారి భయంకరంగా పోరాడి గెలిచారు. ప్రహస్తుడూ, రుద్రకుడూ, వజ్రదంష్ట్రుడూ, మారీచుడూ, విద్యుజ్జిహ్వుడూ, కుంభకర్ణుడూ, ధూమ్రాక్షుడూవీళ్లందరూ నిర్దయగా రావణుడి వ్యూహాలని అమలుపరచి తమకంటూ పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న అసుర వీరులు. కొన్ని వేలమంది దేవతలుగాని అసురులుగాని ప్రాణాలు కోల్పోయినంత మాత్రాన నష్టమేమీ లేదు అని అనుకున్నారు వాళ్లు. వాళ్లకి ప్రఖ్యాతి కావాలి, దాన్ని సంపాదించుకునేందుకు రక్తపాతం జరిగినా, భీకరమైన హింస జరిగినా పట్టించుకోలేదు. కొందరు అసుర యువకులు చనిపోవటం యుద్ధంలో భాగం, పెద్ద ప్రాముఖ్యం ఇవ్వాల్సిన విషయం కాదని అనుకున్నారు.

మేము కుబేరుడి సైన్యం మీద మెరుపుదాడి చేశాం. వాళ్లు బాగానే పోరాడారు. కానీ మేము కోటని అన్నివైపులనుంచీ ముట్టడించాం. అంగుళం అంగుళం కదులుతూ ముందుకి పోయాం. తూర్పున సూర్యుడి మొదటి కిరణాలు ప్రసరించేవేళకి కుబేరుడి సైనికులు చాలామంది ప్రాణాలు కోల్పోయారు, మిగతా వాళ్లు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పారిపోయారు. కుబేరుడి గది దగ్గరకి చేరుకునే సరికి అది తగలబడుతోంది. రాజు చనిపోయాడనుకుని హర్షధ్వానాలు చేశాం. కానీ ప్రహస్తుడు ఆ స్థలాన్ని బాగా పరీక్షించిన తరవాత, అది కేవలం మమ్మల్ని మోసం చేసేందుకే అనీ, రాజు పారిపోయాడనీ అన్నాడు. ఆ తరవాత ఆ పక్కగదిలోంచి అడవిలోకి వెళ్లే ఒక రహస్య మార్గం కనిపించింది. కానీ అప్పటికే మేము ఆలస్యం చేశాం. కుబేరుడు తప్పించుకున్నాడు. గుర్రపు గిట్టల గుర్తులు అతను ఎక్కడ గుర్రం ఎక్కాడో, ఎటువైపు దాన్ని దౌడు తీయించాడో తెలిపాయి. మా కావలి సైనికులు చుట్టుపక్కల ఉన్న గ్రామాలన్నిటినీ గాలించి వచ్చారు, కానీ తమతోటివారు రాజభవనాన్ని దోచుకుంటూ ఉంటే, తాము మాత్రం అలా వెతకటానికి వెళ్లటం వాళ్లకి రుచించలేదు. అలకాపురిలో మేము

దోచుకున్న సంపద అంతా రావణుడు మరింత పెద్ద సైన్యాన్ని సమకూర్చుకునేందుకు ఉపయోగపడింది.

అలకాపురి విధ్వంసం తరవాత మళ్లీ జీవితం మామూలు స్థితికి వచ్చింది. మేము దేవతల రాజ్యాలని ధ్వంసంచేసి పారేశాం, విష్ణువు ఆలయాలని తగలబెట్టాం, సాధ్యమైన చోటనల్లా శివాలయాలు లేపాం, యుద్ధంలో సామాన్యంగా జరిగే అత్యాచారాలనన్నిటినీ- నిప్పు ముట్టించటం, స్త్రీలమీద అత్యాచారాలు చెయ్యటం లాంటివి- నిబద్ధతతో చేశాం.

సరయూ నదీతీరాన ఉన్న అతిచిన్న రాజ్యం, అయోధ్యకి చేరుకునే వేళకి వర్షాకాలం ముగిసిపోయింది. నదీజలాలు నల్లగా, పరవళ్లు తొక్కుతున్నాయి. కొంత దూరాన కుటీరాలూ, పాడుపడిన కట్టడాలూ, చిరిగిపోయి గాలికి ఎగురుతున్న ఒక పతాకం కనిపించాయి. ఆ పతాకం మీద ఉదయించే సూర్యుడి చిహ్నం ఉంది. కానీ ఆ నగరం స్థితి చూస్తే అస్తమించే సూర్యుడి నగరం అనటమే సమంజసమేమో అనిపించింది. అయోధ్య రాజు అనరణ్యుడికి లొంగిపొమ్మని రావణుడు సందేశం పంపాడు.

ఆరు రోజులు గడిచిపోయినా దానికి సమాధానం రాలేదు. ఓరిమి నశించి రావణుడు మమ్మల్ని నదిదాటి నగరంమీద దాడి చెయ్యమని ఆదేశించాడు. కానీ మేము నగరంలోకి ప్రవేశించాక అక్కడి దృశ్యం మమ్మల్ని ఆశ్చర్యచకితులని చేసింది. నేను ఇంతవరకూ ఎన్నడూ ఇంత దారుణమైన విధ్వంసాన్ని చూసి ఎరుగను. వీధులన్నీ మురికికూపాల్లా ఉన్నాయి, అలగా పిల్లలు బట్టల్లేకుండా అటూఇటూ పరిగెత్తుతున్నారు. వీధికుక్కల కుళ్లిన శవాలమీద ఈగలు జుమ్మని ముసురుతున్నాయి. పందులు అశుద్ధం తింటున్నాయి. జనం వీధుల్లో నివసిస్తూ అక్కడే మల మూత్రాలు విసర్జిస్తున్నారు. వీధులు ఇరుగ్గా, వంకర టింకరగా ఉన్నాయి. దుమ్మూ ధూళితో నిండి ఉన్న పాత్రలా ఉందా నగరం. అది మా దారిలో తగలకపోయినట్టయితే, ఆ మురికికూపంలోకి అడుగుపెట్టేవాళ్లమేకాము. అక్కడ దోచుకునేందుకు ఏమీ లేదు. మాకు

ఆహ్వానం పలికేందుకు అక్కడ శత్రుసేన ఏదీలేదు. పైగా, ఒక పెద్ద గుంప బిచ్చగాళ్లు మా దగ్గరకి చేతులు చాపుతూ పరిగెత్తుకుని వచ్చారు. మాకేం చెయ్యాలో పాలుపోలేదు. చిల్లర నాణాలు ఉన్నాయేమోనని దుస్తుల్లో దాచుకున్న సంచీలలో వెతికాం.

లంకలోనూ, అలకాపురిలోనూ వైభవంగా ఉన్న రాజభవనాలని చూసిన తరవాత, శిథిలావస్థలో ఉన్న ఈ రాజభవనాన్ని చూసి దిగ్భ్రాంతికి గురయాము. మా పాదరక్షల కింద నేల కుంగిపోసాగింది, స్తంభాలకి చెదలు పట్టాయి, ద్వారాలకి ఉన్న తెరలు దుమ్ముకొట్టుకుని ఉన్నాయి. పైకప్పనిండా రంధ్రాలు పడ్డాయి. ఒక వృద్ధుడు విష్ణువు విగ్రహంముందు పద్మాసనం వేసుకుని కూర్చుని ఉన్నాడు. ఏవో మంత్రాలు సన్నగా వల్లిస్తున్నాడు. రావణుడు కాసేపు వేచిచూసి ఆయన భుజం తట్టాడు. కొన్ని క్షణాలు ఆయన దగ్గర్నుంచి ఎటువంటి స్పందనా రాలేదు. తరవాత ఆయన నెమ్మదిగా వెనక్కితిరిగి తడబడుతూ లేచి నిలబడ్డాడు. ఆ వృద్ధమహారాజుకి రావణుడు తన చెయ్యి అందించి సాయం చేయబోయాడు, కానీ ఆయన ఆ చేతిని విదిలించి అంత వయసు పైబడినా దృఢమైన గొంతుతో "అస్పృశ్యుడా... శూద్రుడా... నన్ను తాకి అపవిత్రం చెయ్యకు" అని అరిచాడు.

మేము నిర్ఘాంతపోయాం. ఒక శక్తిమంతుడైన రాజు, ప్రపంచంలో సగభాగాన్ని స్వాధీనం చేసుకున్నవాడు, క్షీణించిపోయినట్టు కనిపిస్తున్న ఒక వృద్ధుడిముందు నిలబడ్డాడు. విధ్వంసానికి గురైన తన చిన్న ఊరికి తను రాజునని ఆ వృద్ధుడు ఏమాత్రం జంకూ గొంకూ లేకుండా చెప్పుకుంటున్నాడు. భయంతో ముడుచుకు పోకుండా ఆయన రావణుడు తనని తాకితే తాను అపవిత్రం అయిపోతానని అంటున్నాడు. నేను నా రాజువైపు కన్నార్పకుండా చూశాను. ఒక్కక్షణం నా రాజు వెనక్కితగ్గాడు, ఆయన గొణుగుతూ ఏదో అన్నాడు, 'మా నాన్నలాగే ఈయన కూడా బ్రాహ్మణుడు,' అన్నాడని అనిపించింది.

"ఓరీ, అస్పృశ్యుడా, మీ తల్లి కులంలేనిది అయినట్టయితే, నువ్వుకూడా అంతే." అంటూ అరిచినంత పనిచేశాడు ఆ వృద్ధుడు.

రావణుడి కళ్లలో కోపజ్వాలలు లేచాయి. ఆ వృద్ధుడి గొంతు పట్టుకుని కత్తిమొనని మెడమీద ఆనించాడు. "ఎదురుతిరిగి పోరాడలేని వృద్ధుడిని చంపటం నాకు ఇష్టం లేదు. నాకు లొంగిపోతే ప్రాణాలతో విడిచిపెడతాను." అన్నాడు.

"ఒక శూద్రుడికి నేను లొంగను."

"అయితే ఒక శూద్రుడి చేతిలో మరణించు," అంటూ రావణుడు గర్జించాడు.

"ఓరీ శూద్రుడా, విష్ణువు పేరు చెప్పి నిన్ను శపిస్తున్నాను, నువ్వు నన్ను అపవిత్రం చేసినందుకు నా వారసులు ప్రతీకారం తీర్చుకుంటారు. నీ నగరాన్ని సర్వనాశనం చేస్తారు. నీ జాతినీ, నీ భార్యల మానాన్నీ, నీ పుత్రులనీ, నీ.."

ఒక్క వేటుతో రావణుడు అయోధ్య రాజు అనరణ్యుడి తల నరికేశాడు.

దాని సైగగా అర్థంచేసుకుని సైన్యం చనిపోయిన రాజు తాలూకు చిన్న మందిరాన్ని సమూలంగా ధ్వంసం చేసింది. ఆ విగ్రహం లోపల కెంపులు దొరికాయి. ఆ విగ్రహాన్ని అలంకరించిన హారాలు స్వచ్ఛమైన బంగారంతో చేసినవి. వాటిలో వజ్రాలు పొదిగి ఉన్నాయి. ఆ రాజు మమ్మల్ని అపవిత్రులని అవమానించటం మాకు విపరీతమైన కోపం కలిగించి, దేవుళ్ల నగలనీ, ఆయన దేవేరుల వస్త్రాభూషణాలనీ దొంగిలించేందుకు పురికొల్పింది. కానీ నా మనసులో ఏ మూలనో ఒక బ్రహ్మరాక్షసి తన వాడిఅయిన గోళ్లతో గుచ్చటం ప్రారంభించింది. దానికి కారణం చక్రవర్తి, దాదాపు మన్నించమని వేడుకుంటున్నట్టు, చనిపోయిన దేవతల రాజుతో ఏదో అంటున్నాడు. అంత శక్తిమంతుడూ, అసురులని ఉద్ధరించిన వీరుడూ పుట్టినది ఒక బ్రాహ్మణుడికి. అదే నన్ను కలతపెట్టింది.

18. అసుర రాజకుమారి

రావణుడు

ధ్వంసమైన ఆ భవనాన్ని నా సైనికులు దోచుకునేందుకు వదిలి నేను వెళ్లిపోయాను. అంగడివీధిలోంచి నేను నడుస్తూ వెళుతూ ఉంటే జనం నానుంచి దూరంగా పోయారు. విజేత అయిన చక్రవర్తిపట్ల అది వాళ్లు చూపే గౌరవమని మొదట అనుకున్నాను. కానీ నేను శూద్రుడిని కావటంవల్లే వాళ్లు అలా చేస్తున్నారని అర్థమైంది. వాళ్ల అద్భుతమైన నగరాన్ని నేను అపవిత్రం చేస్తున్నాను. మమ్మల్ని కళ్లతో చూడటమే మహాపాపం! మురికి దుస్తులు వేసుకున్న బ్రాహ్మలు అపవిత్రమైన కులంవాళ్లని పారదోలేందుకు నేలమీద తమ కర్రలని బలంగా కొడుతూ నడవటం చూశాను. ఆ బజారులోని వ్యాపారస్తులందరూ బోలెడన్ని ఆచారకర్మలు చేస్తూ తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఒకరినొకరు తాకి అపవిత్రం చెయ్యకుండా ఉండేందుకు తీసుకునే జాగ్రత్తలు అవి. ఆ దృశ్యం అంత జాలిగొలిపేదిగానూ, ఆశించినదానికి భిన్నంగానూ ఉండి ఉండకపోతే చూసేవాళ్లకి నవ్వు తెప్పించేదే. ఈ కులాచారాల తీవ్రతని నేను ఆపకపోయినట్టయితే, ఇది దేశం అంతటా విస్తరించిపోతుంది. అలా విస్తరించినట్టయితే ఇక మాకు స్వేచ్ఛ దక్కటం కల్ల.

ఒకరోజు మధ్యాన్నం బాగా అలసిపోయి నిద్రపోతూండగా నా శిబిరం బైట జరిగే ఏదో గొడవ నన్ను నిద్రలేపింది. నేను బైటికి వచ్చి తక్షణం నిశ్చేష్టుడిని అయాను. నలుగురైదుగురు అసురులు ఒక స్త్రీని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. నాకు విపరీతమైన కోపం వచ్చింది. భయంకరమైన యుద్ధం ముగిసి, మీరు విజయం సాధించాక ఎవరైనా ఒక స్త్రీని లోబరుచుకోవటం సమంజసమే, ముఖ్యంగా ఆమె దేవతల స్త్రీ అయినప్పుడు. నా అంగరక్షకులు ఏమయారు? అప్పుడు నాకు వాళ్లు అసురులతోపాటు ఆ స్త్రీ కోసం పోరాడుతూ కనిపించారు.

"ఆమెని వదలండి!" అని గర్జించాను. నేలమీద బురదలో పొర్లుతున్నవాడితో సహా, ముగ్గురు అసురులు తడబడుతూ లేచి పారిపోయారు. నేను ఒరలోంచి కత్తి బైటికి తియ్యటం చూసి మిగతా ఇద్దరూ పారిపోయారు. అప్పుడు చూశాను వాళ్లు వేటాడుతున్న స్త్రీ ఎవరో. ఆమె మేలిముసుగు తొలగిపోయింది. అబ్బ, ఎంత అందమైన ముఖం! నల్లటి కళ్లు నిప్పుకణికల్లా మెరుస్తున్నాయి, వంపు తిరిగిన దట్టమైన కనురెప్పలలోని వెంట్రుకలు ఆమె అమాయకురాలని సూచిస్తున్నాయి సన్నగా సూటిగా ఉన్న ముక్కుకింద పెదవులు దొండపళ్లలా ఎర్రగా ఉన్నాయి. నల్లటి ఉంగరాల జుట్టు నుదుటిమీద నాట్యమాడుతూ ఉంది. ఆమె చర్మసౌందర్యం మచ్చలేనిది. బుంగమూతి పెట్టి వయ్యారంగా చూస్తోంది. ఆమె వైపే తదేకంగా చూశాను. స్త్రీత్వం, మృదుత్వం మూర్తీభవించినట్టుగా ఉంది ఆమె. నాకు ఆమెని పొందాలని అనిపించింది. ఆమె తన దుస్తులు సర్దుకోవటం చూసి నేను నా దృష్టిని మరల్చుకున్నాయి.

ఈ స్త్రీ నాలోని కోరికని రేకెత్తించింది. ఆమె దగ్గరకివెళ్లి రెండు చేతుల మణికట్లనీ గట్టిగా పట్టుకున్నాను. ఆమె చేతులు విడిపించుకునేందుకు ప్రయత్నిస్తే నేను మళ్లీ పట్టుకున్నాను. అంతే, నా ముఖంమీద చాచికొట్టింది. నా బుగ్గలు మంటపుట్టాయి. నేను నిర్ఘాంతపోయాను. మళ్లీ ఆమెని పట్టుకునేసరికి, మళ్లీ వెంటనే నా ముఖంమీద కొట్టింది. ఈసారి నా ముక్కులోంచి రక్తంకారేట్టు కొట్టింది. ఈమె చాలా ధైర్యవంతురాలే! ఆమెని విడిచిపెట్టేస్తున్నట్టు నటిస్తూ మరుక్షణం వెనుతిరిగి వేగంగా ఆమెని అమాంతం ఎత్తుకుని, ఆమె నన్ను రక్కుతున్నా కేకలు పెడుతున్నాపట్టించుకోకుండా నా శిబిరంలోకి తీసుకుపోయాను. నాకు బాగా కోపం వచ్చింది, కానీ అంతకన్నా ఆమెమీద కోరిక బలీయంగా ఉంది. ఆమెని మంచంమీద పడవేశాను. లేవటానికి ప్రయత్నిస్తున్న ఆమె ముఖంమీద బలంగా కొట్టాను. ఆమె నామీద ఉమ్మివేసింది. పట్టు దుప్పటి తీసి దానితో ఆమె చేతులనీ, కాళ్లనీ బంధించాను. ఆమె నన్ను మళ్లీ రక్కింది, మూడుసార్లు కొరికింది,

కానీ నేనామెని బంధించి మంచంమీద పడిఉండేలా చెయ్యగలిగాను.

ఆయాసంతో రొప్పుతూ, రోజుతూ పక్కనే ఉన్న ఆసనంలో కూలబడ్డాను. ఆమె నావైపు వెన్నుపెట్టి పడుకుంది. ఆమె శరీరపు ఒంపుసొంపులు నాలో మళ్లీ కోరికని రగిల్చాయి. 'ఈమె నన్ను ఎందుకు నిరాకరిస్తోంది? నేను ఈ దేశానికి చక్రవర్తిని. శక్తిమంతుడైన అసుర మహారాజు, రావణుడిని.'

కొద్దిక్షణాల మౌనం తరవాత ఆమెని నావైపు తిప్పుకోవాలని ప్రయత్నించాను. "నీ పేరేమిటి?" అని అడిగి, మరుక్షణం నాకు బుద్ధిలేదు అని అనుకున్నాను. ఆమె నెమ్మదిగా ముఖాన్ని నావైపు తిప్పింది. ఆమె నల్లని ఉంగరాల జుట్టు ఆమె నుదుటి మీద రకరకాల ఆకారాలని సృష్టించింది. ఆమె కళ్లు నాలోకి గుచ్చి చూస్తూంటే నాకు భయం వేసింది. నా వెన్ను నిలువెల్లా జలదరించింది.

"ఒక అమ్మాయిని బలాత్కరించే ముందు, ఆమె జీవితచరిత్ర నువ్వు తెలుసు కోవటం అవసరమా?" అని అడిగింది. నాకు సమాధానం ఏం చెప్పాలో అర్థం కాలేదు. ఆమె అన్నమాటల్లో హాస్యం ఉందని నాకు ఏమూలో అనిపించింది. నాకు నవ్వు వచ్చింది. కానీ ఏమీ అనకుండా మూర్ఖుడిలా లేచి నిలబడ్డాను, నాకు మాటలు కరువయాయి. దగ్గాను, మాటలు తడబడ్డాయి, ఆమెకి దూరంగా వెళ్లిపోయాను.

"నాతో పని అయిపోయాక కొన్ని నిమిషాలు నన్ను ప్రాణాలతో ఉండనియ్యి. నేను మీ రాజు, రావణుడిని కలుసుకోవాలి, ఆయన గొప్ప అసుర రాజుట కదా?" అని, ఆమె నేలమీద ఉమ్మింది.

"కానీ... ఆ రావణుడిని నేనే..." అన్నాను బలహీనంగా.

ఆమె దెబ్బతిన్న జంతువులా అరిచింది. నేను చకితుడినయాను. బంధనాల నుంచి విడిపించుకునేందుకు విఫల ప్రయత్నం చేసి సాధ్యంకాక చివరికి, వెక్కివెక్కి ఏడవసాగింది. నేను దూరంగా నిలబడి ఆమెనే చూడసాగాను. కొంతసేపటికి ఆమె దగ్గరికి నడిచాను. ఆమెని తాకాలని అనిపించింది, కానీ సంకోచంతో చేతులు కంపించసాగాయి.

చివరికి నెమ్మదిగా ఆమె భుజంమీద చెయ్యి వేశాను. ఆమె కదిలి నావైపు అసహ్యంగా చూసింది. నేను చెయ్యి తొలగించాను.

"దేవతా జాతి వితంతువు ఎలా జీవిస్తుందో నీకు తెలుసా?" అని అడిగింది ఏడుపు గొంతుతో, నేనేమీ జవాబివ్వలేదు. మళ్లీ తనే, "దేవతాజాతి వితంతువులకి ఎటువంటి హక్కులు ఉంటాయో నీకు తెలుసా...? అయినా నీకెలా తెలుస్తుందిలే! నువ్వు విజేతవి కదా? ఎక్కడో ఎవరో ఎలా బతికితే నీకేమిటి...?" అంది.

అనుకోకుండా నేను విపరీతంగా చలించిపోయాను. కానీ నా సంస్కృతి భిన్నమైనది. దేవతా స్త్రీల దుఃస్థితి గురించి నేను విన్నాను, కానీ అవన్నీ మరీ ఘోరంగా ఉండటంవల్ల అవి అసురులూ, నాగులూ అల్లిన కట్టుకథలనీ, దేవతలని నీచంగా చూపించేందుకే అలాటివి కల్పించారనీ అనుకునేవాడిని.

"మీవాళ్లు నా భర్తని చంపారు. ఆయన పేదవాడు... ఎవరికీ ఎటువంటి హానీ చెయ్యని బ్రాహ్మణుడు... మీవాళ్లు ఆయన్ని ఎందుకు చంపారు?"

నాకు చురుక్కుమనిపించింది. 'నేను ఈ బ్రాహ్మణ వితంతువుని ఇక్కడికి ఎందుకు తీసుకొచ్చినట్టు? ఆమె బ్రాహ్మణ యువతి కాబట్టే నాకు ఆమెమీద కోరిక కలిగిందా? ఆమె తెల్లని శరీరం చూసి మోహవివశుడిని అయానా?'

"మా అత్తవారింట్లో మేము బానిసల్లా బతికినా అది మాకు ఇష్టమే... మాకు తలలు గొరిగి, చేతులూ, మెడా బోసిగా చేసి... కావాలనే అందవిహీనంగా తయారుచేసి... జీవచ్ఛవంలా బతకమంటారు. మా నుదుటన తిలకం ఉండదు, గాజులు వేసుకోరాదు, రంగు చీరలు ధరించకూడదు, తెల్లని ముతకచీరలే కట్టాలి... బతుకే ఉండదు... జీతంలేని పనిమనుషులం... జీవచ్ఛవాలం..."

నేను కదిలిపోయాను. అసుర స్త్రీలకి అటువంటి జీవితాన్ని

ఊహించటం కూడా నాకు కష్టమనిపించింది, భర్త చనిపోతే, మర్యాదకోసం కొంతకాలం శోకంలో ఉండి, మరొక జీవిత భాగస్వామిని వెతుక్కుని జీవితాన్ని కొనసాగిస్తుందామె.

"అబ్బో! నువ్వు చాలా శక్తిమంతుడవైన రాజువి కదా... నీకు తెలుసు, నా భర్త చితిలోకి దూకి నేనో దేవతని, గుణవంతురాలైన ధర్మపత్నిని అయిపోయి ఉండవచ్చు...! అప్పుడు ఈ మనుషులే... నన్ను పశువుకన్నాహీనంగా చూస్తున్న వీళ్లే... నాకు ఆలయాలు కట్టించి నన్ను ఆరాధించి ఉండేవారు!"

"నీ పేరేమిటి?" అని అడిగాను. ఆమె దగ్గరకి నడిచి చుబుకం పట్టుకుని పైకి ఎత్తాను. ఆమె నల్లని కళ్లలో నీళ్లునిండి అవి మరింత మెరుపుని సంతరించు కున్నాయి. ఆ కన్నీటిలో నా ప్రతిబింబం చిన్నదిగా, ఎటువంటి ప్రాముఖ్యమూ లేనట్టు కనిపించింది. ఆమె చాలాసేపు నా ముఖంవైపు కళ్లార్పకుండా చూసింది. చివరికి కనీకనిపించని చిరునవ్వు ఒకటి ఆమె ముఖాన్ని వికసింపజేసింది. నేను కరిగిపోయాను. "వేదవతి," అంది చాలా మామూలుగా. మరుక్షణం ఈ దేవతా బ్రాహ్మణ యువతి ప్రేమలోపడి మనకలు వెయ్యసాగాను.

☼

భద్రుడు

కాపలాదారు నన్ను నిద్రలేపేసరికి అతన్నీ, అతని తాతముత్తాతలనీ శాపనార్థాలు పెట్టాను. నా నోరు ఇంకా నాటుసారా వాసన వేస్తూ ఉండటం చూసి, ఇంకొకసారి నోరు పుక్కిలించి, ప్రధానమంత్రి కార్యాలయంవైపు భారంగా అడుగులు వేస్తూ కదిలాను. నన్నెందుకు రమ్మని కబురంపివుంటారు? గత కొన్ని నెలలుగా మా జాతి వినాశాన్నే ఎదుర్కొంటూ ఉంది. ఈ యుద్ధంపట్ల సైన్యంలో ఎక్కువ మందికి ఆశలేమీ మిగల్లేదు. నర్మదానది అవతలి తీరాన ఉన్న అడవిలో శిబిరాలు వేసుకున్నాం. అడవిలో దొరికే ఫలాలనీ, పొరపాటున

అప్పుడప్పుడూ మా శిబిరాల దగ్గర తచ్చాడే తెలివిమాలిన కోతులనీ తిని పొట్ట నింపుకుంటున్నాం. సరిగ్గా పులియబెట్టని సారా తాగుతూ, ఏమైనా జరుగుతుందా అని ఎదురుచూస్తున్నాం.

ప్రహస్తుడిలాంటి మేధావులు ఒక దగ్గర చేరి రహస్యంగా ఏదో మాట్లాడుకుంటున్నారు. కానీ మా రాజు రావణుడికి మూడినట్టుంది. ఆయన ఆ బ్రాహ్మణ యువతిని వశపరుచుకోవటంలో మునిగి ఉన్నాడు. ఈ యుద్ధంలో పాల్గొనేందుకు తన వెంటవచ్చిన మూర్ఖులందరినీ పూర్తిగా మరిచిపోయాడు. మంత్రులని కలుసుకునేందుకు నిరాకరిస్తున్నాడు, సైన్యాన్ని పర్యవేక్షించటం మానేశాడు, వీరులని ఉత్సాహపరిచే ఉపన్యాసాలు ఇవ్వటంలేదు. ఆమె పద్మాసనం వేసుకుని నదీతీరాన కూర్చుంటుంది. ఒక్కొక్కసారి ధ్యానంలో ఉంటుంది, ఒక్కొక్కసారి తన వాళ్లపట్ల అసురుల రాజు ప్రవర్తించిన తీరుకి ఆయన్ని భయంకరంగా దూషిస్తూ ఉంటుంది. రాజు యుక్తవయసులో ఉన్న కుర్రవానిలా ప్రేమావేశంలో ఆమె ముందు మోకరిల్లి ప్రేమభిక్ష పెట్టమని వేడుకుంటాడు. తనవెంట వచ్చిన పసిపిల్ల, తన కుమార్తెని కూడా రావణుడు మరిచిపోయాడు, ఆ ప్రేమ మత్తులో, ఆ పసిపిల్ల ఆకలికి ఏడవటం కూడా ఆయనకి తెలీలేదు. ఆయనపట్ల ఆ బ్రాహ్మణ స్త్రీ ఎంతమాత్రం ఆకర్షితురాలు అవలేదు, అందువల్ల అతని ఆత్రుత మరింత పెరిగింది. ఆమెని బలవంతంగా ఆయన ఎందుకు లోబరుచుకోలేదో నాకైతే అర్థంకాలేదు.

యుద్ధం ఒక లక్ష్యం అంటూ లేకుండా సాగింది. పెద్ద రాజ్యాలని వదిలేసి, అడవి పొలిమేరలకే పరిమితమై, అప్పుడప్పుడూ గ్రామాల్లోని ధాన్యాగారాలమీద దాడులు జరిగాయి. చివరికి ఎన్నో నెలలు అలా ఇటూ అటూ అర్థంలేకుండా తిరిగాక, మేము నర్మదానదీ తీరానికి చేరుకున్నాం. అప్పుడు మా రాజు ఈదటంలో తనకి ఉన్న సామర్థ్యాన్ని చూపి వేదవతిని ఆకట్టుకోవాలని అనుకున్నాడు. దుస్తులు విడిచి ఆయన వేగంగా ప్రవహిస్తున్న నదిలో దిగాడు, ప్రవాహం అతన్ని తనవెంట లాక్కుపోయింది. మంత్రిమండలికి ఆమె చెప్పింది మాత్రం

అదే. మా చక్రవర్తి తన అంగరక్షకులని పంపివేశాడు, అందుచేత జరిగినది ఏమిటో ఎవరూ చూడలేదు.

కొన్నాళ్లకి కార్తవీర్యార్జునుడి దగ్గరనుంచి ఒక వార్తాహరుడు వచ్చాడు. అసుర మహారాజు తనకి బందీ అయాడని ఆయన వార్త పంపాడు. మొత్తం సైన్యం ఆయన వశమై పోయింది. మంత్రులందరూ మూడు రోజులదాకా ప్రధానమంత్రి శిబిరంలోనే ఉండిపోయి, ఏం చెయ్యాలా అని చర్చించుకోసాగారు. ఈలోగా శిబిరాలు రెండుగా విడిపోయాయి. విద్యుజ్జిహ్వుడి అనుచరులు రావణుడు చనిపోయాడన్న అపవాదును ప్రచారం చెయ్యసాగారు. లంకకి తిరిగి వెళ్లిపోవటమే మంచిదని వాదించసాగారు.

మరోవైపు రుద్రకుడి అధీనంలో ఉన్న వాళ్లు కార్తవీర్యార్జునుడి దుర్గంమీద దాడిచేసి ఆ సంకరజాతి వారికి గుణపాఠం చెప్పాలన్న ప్రస్తావనని ప్రకటించారు. మన రాజు ప్రాణానికి అపాయం వచ్చినా పరవాలేదని అన్నారు. సుమాలి, మాల్యవంతుడులాంటివారు వాళ్లని సమర్ధించారు. అసురుల గౌరవ ప్రతిష్టలకి అపాయం వాటిల్లిందనీ, నిశ్చయమైన ఫలితాన్ని ఇవ్వగల యుద్ధం తప్పనిసరి అన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. కానీ ఇవన్నీ లోపల మంత్రుల సభ జరుగుతూ ఉంటే కాపలా కాసూ బైట నిలబడిన రక్షకభటుల అంచనాలే!

నేను శిబిరంలోకి వెళ్లినప్పుడు ఆ గొప్ప వ్యక్తులందరూ ఆసనాల్లో మెత్తని దిళ్లమీద కూర్చుని ఉండటం చూశాను. నేను వంగి అభివందనం చేసి, నా నోటికి చెయ్యి అడుపెట్టుకుని, నేలచూపులు చూస్తూ, వాళ్ల ముఖాలకేసి సూటిగా చూడకుండా వెన్నువంచి నిలబడ్డాను. రాజసింహాసనం ఖాళీగా ఉంది, కానీ సింహాసనం పక్కన ఉన్న ఆసనంలో ప్రహస్తుడు కూర్చుని ఉన్నాడు. అక్కడ ఇబ్బందికరమైన నిశ్శబ్దం పరుచుకుని ఉంది.

ప్రహస్తుడు ఇలా అన్నాడు, "భద్రా, ఒక ముఖ్యమైన కార్యాన్ని మేం

నీకు అప్పగిస్తున్నాం. ఆ పని చెయ్యగలవాడివి నువ్వు ఒక్కడివే అని అనుకుంటున్నాం."

"అది చాలా అసహ్యకరమైన పనిలా అనిపించవచ్చు, కానీ నువ్వు ఆ పని చెయ్యవలసి ఉంటుంది," అంటూ మారీచుడు నా దగ్గరకి వచ్చి, నచ్చజెపుతున్నట్టు నా భుజంమీద చెయ్యివేశాడు.

విద్యుజ్జిహ్వుడు నావైపు బెదిరిస్తున్నట్టు వచ్చాడు, నేను భయంతో ముడుచుకు పోయాను. నిటారుగా నిలబడి అతని ముఖంలోకి చూడాలని అనిపించింది, కానీ నా శరీరం వంగినట్టే ఉండిపోయింది. "ఆ దేవతా స్త్రీని మనం వదిలించు కోవాలి, నువ్వు ఆ విషయం చూడు. అలాగే ఆ అదృష్టహీనురాలైన చిన్న రాకుమార్తె విషయం కూడా," అన్నాడు ఏవగింపుగా చూసూ.

నేను విన్న ఆ మాటలు నన్ను దిగ్భ్రాంతికి గురిచేశాయి, దెబ్బతిన్నట్టు వెనక్కి తగ్గాను. ఆమె అంటే నాకు ఎప్పుడూ ఇష్టంలేదు, కానీ మా మహారాజు ఆమెని ప్రేమించాడు.

"అంటే మనం ఆమెనీ, రాకుమార్తెనీ చంపెయ్యాలా...?" అని గొణిగాడు మారీచుడు.

"అబ్బా!" అన్నాడు విద్యుజ్జిహ్వుడు చిరాకుగా." రాజు సిగ్గులేకుండా ఆ స్త్రీ చుట్టూ తిరుగుతూ ఉండటంవల్ల, మనకి ఇప్పటికే చాలా నష్టం జరిగింది. మీరు జ్యోతిష్కుడి భవిష్యవాణి గురించి మరిచిపోయారా? అసురజాతి మొత్తానికి ఆ పసిపిల్ల, రావణుడి కుమార్తె, అపశకునమని చెప్పలేదూ? ఆమెవల్ల మనం నాశనం అయిపోతాం, జాతి మొత్తం తుడిచిపెట్టుకుపోతుంది. ఇవన్నీ మూఢనమ్మకాలని మన రాజు అభిప్రాయం. కానీ నేను వాటిని నమ్మకుండా ఉండి ప్రమాదాన్ని కొనితెచ్చుకోవాలని అనుకోవటంలేదు"

మారీచుడి గొంతు చాలా బలహీనంగా పలికింది. ఒకే సమయంలో ఏదో మింగుతూ మాట్లాడటానికి ప్రయత్నిస్తున్నట్టు ఇలా అన్నాడు, "మనం చేస్తున్న యుద్ధం ఎంతో సంకటస్థితికి చేరుకుంది. మనం

పూర్తిగా అపజయంపాలయే ప్రమాదం సంభవించవచ్చు. మన రాజుని శత్రువులు బంధించారు, ఆయన్ని విడిపించుకునేందుకు కార్తవీర్యార్జునుడికి పెద్ద మొత్తాన్నే చెల్లించవలసి రావచ్చు. మన సైన్యం మనోస్థైర్యం బాగా దిగజారింది, అందుకే ఈ సభ బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చింది. మన రాజు దృష్టిని మళ్లించి ఏకాగ్రతని భంగం చేసినది ఆ స్త్రీ అనే మా అభిప్రాయం. ఆమె మన అసురజాతికే ఒక గుదిబండలా తయారైంది."

ప్రహస్తుడు నావైపు నడిచివచ్చి, అంతెత్తు మనిషీ వంగి నా చెవిలో రహస్యంగా, "ఆమెని తీసుకువెళ్లి అంతం చేసెయ్యి" అన్నాడు యమకింకరుడిలా.

విద్యుజ్జిహ్వుడు ఇంకా దగ్గరకి వచ్చి, "ఆ పసిపిల్ల విషయం మరిచిపోవద్దు," అన్నాడు పాములా బుసకొడుతూ.

ప్రహస్తుడు అంతటితో నన్ను వెళ్లిపొమ్మని సైగ చేశాడు. నేను బరువెక్కిన గుండెతో బైటికి నడిచాను. నా శిబిరం చేరుకుని మంచంమీద పడిపోయాను. ఈ మనుషులకి కుక్కలా పని చెయ్యటం నాకు అలసటగా తోచింది.

'ఈ దుర్మార్గులు తామేదో దేవుళ్లు అయినట్టు నామీద ఆధిపత్యం చెలాయిస్తా రేమిటి! వీళ్లకి ఆ హక్కు ఎవరిచ్చారు?' నాలో కోపం క్షణం క్షణం పెరిగిపోసాగింది. సరిగ్గా అది పొంగి బైటికి వచ్చే సమయానికి ఒక సైనికుడు నా శిబిరంలోకి ప్రవేశించి రుచికరమైన ఆహారపదార్థాలతో నిండి ఉన్న పళ్లాన్ని నా పక్కన పెట్టాడు. చప్పుడు చేస్తూ ఒక కంచుపాత్రని నేలమీద పెట్టి అందులో నాణ్యమైన ద్రాక్షసారా పోశాడు. నేను మంచంమీద లేచి కూర్చుని అతను చేస్తున్న పనిని ఒక మాదిరి ఆసక్తితో గమనించాను.

"నువ్వు వాళ్లముందు దాసోహం అన్నట్టు ప్రవర్తించావుగా, అందుకే నిన్ను బాగా మేపుతున్నారు!" అని చీదరించుకుని అతను వెళ్లిపోయాడు.

కొన్నాళ్లుగా మాకు పిడికెడు అన్నమూ, నీళ్లలా ఉన్న పప్పు తప్ప తినేందుకు ఇంకేమీ ఇవ్వటంలేదు. అది కూడా ఏనాడూ సరిపోయేంత పెట్టేవారు కాదు. కానీ ముఖ్యమైనవాళ్లకి మాత్రం ఎంత కావలిస్తే అంత ఆహారం ఎప్పుడూ సిద్ధంగా ఉండేది. వాళ్లకి కావలసిన పనులు చేసిపెడితే తమ ఆహారంలోంచి కొంత విదిలించేవాళ్లు, చాలాసేపు ఆ పల్లెంవైపే చూస్తూ ఉండిపోయాను. హఠాత్తుగా ఆకలివేస్తున్నట్టు అనిపించింది. నా అంగవస్త్రంతో చేతులు తుడుచుకుని నాకు అందిన విందుభోజనాన్ని ఆత్రుతగా తిన్నాను. చివరికి పళ్లాన్ని శుభ్రంగా నాకివేశాను. ఒక్క గుక్కలో పాత్రలోని ద్రాక్షసారాని తాగేసి, పాత్రని బైటికి విసిరేశాను. అది బైట చీకట్లో ఎక్కడో పడిన చప్పుడు వినిపించింది.

తాగిన మత్తులోంచి నన్నెవరో కుదిపి లేపారు. అప్పటికి ఇంకా చీకటిగానే ఉంది. నాకు తాగుడు మత్తు ఇంకా వదల్లేదు, పైగా తలపోటు కూడా వచ్చింది. ఎద్దుబండీ సిద్ధం చేస్తున్న చప్పుడు నాకు వినిపించింది. బైటికి వెళ్లి చల్లటి నీళ్లతో ముఖం కడుకున్నాను. చలికి ఒళ్లు వణికింది. ఒళ్లు విరుచుకున్నాను. మారీచుడి పొడవైన ఆకారం నా దగ్గరకి వస్తూ ఉండటం కనిపించింది.

"భద్రా, నీకు ఈ పని అప్పజెప్పాల్సి వచ్చినందుకు మమ్మల్ని మన్నించు. మన జాతికోసం, మన రాజు కోసం ఏదో విధంగా ఈ పని చేసెయ్యి," అన్నాడాయన.

నేనేమీ జవాబు చెప్పలేదు. ఇంకా తెల్లవారకుండానే ఎక్కడో ఒక కోడి కూసింది. "మనం చెయ్యబోతున్న పని సరైనదే అని అనుకుంటాను... పసిపిల్ల గురించే నాకు బాధగా ఉంది... ఆ బ్రాహ్మణ యువతిని చూసినా అలాగే అనిపిస్తోంది. త్వరగా వెళ్లు భద్రా, వీలైనంత వేగంగా బండి నడుపు... నీ కర్తవ్యం నువ్వు నెరవేర్చు అనవసరమైన విషయాల గురించి ఆలోచించి నీ మనసు పాడుచేసుకోవద్దు, నీకు అంత తెలివితేటలు లేవు. అన్నీ మాకు వదిలెయ్యి," అని ఆయన మరుక్షణం వెనుతిరిగి వెళ్లిపోయాడు.

నేను కొంతసేపు అలాగే ఒంగి నిలబడ్డాను. "నాకు తెలివితేటలు లేవా?" నా చేతులకి రక్తం అంటినట్టు అనిపించింది. నిటారుగా నిలబడిన తరవాత నాకు శక్తినీ, మనశ్శాంతినీ ఇమ్మని ప్రార్థించాను. నా కర్తవ్యం నేను నిర్వర్తిస్తున్నాను అన్న విషయం నా మనసు స్వీకరించి ఉల్లాసం నన్ను ముంచెత్తేదాకా ఆగాను. కానీ నా మనసులోకి భయం, నామీద నాకు జాలీ, చిరాకూ తప్ప ఇంకే భావమూ రాలేదు. ఆ స్థితిలో బండి నడపటానికి పైకి ఎక్కి కూర్చుని ఎదురు చూడసాగాను.

ఆమెని వాళ్లు తీసుకువచ్చేసరికి తూర్పు దిక్కున ఎర్రటి వెలుగు విచ్చుకుంటోంది. ఆమెకి మత్తుమందు తినిపించి ఇద్దరు మనుషులు మోసుకుని వచ్చారు. ఆమెని బండి వెనకభాగంలో పడవేసి, నాకు కన్నుకొట్టి వెళ్లిపోయారు. మారీచుడు ఎంతో జాగ్రత్తగా ఒక చిన్న మూటని చేతుల్లో పట్టుకుని వచ్చాడు. ఆ పసిపాప నుదుటిని చుంబించి నెమ్మదిగా ఆ స్త్రీ పక్కన పడుకోబెట్టాడు. నా కళ్లని తప్పించుకునేందుకు ప్రయత్నిస్తూ వెనుతిరిగాడు. ఆ పసిపాప తొడమీద నాకు ఒక కన్నీటి చుక్క కనిపించింది. ఆ పాప కొద్దిగా కదిలి, నిద్రలో అద్భుతమైన చిరునవ్వు నవ్వి హాయిగా పడుకుంది.

నేను ఎద్దులని అదిలించేసరికి, ఒక్క ఊపుతో బండి కదిలి అటూ ఇటూ ఊగుతూ ప్రయాణం మొదలుపెట్టింది. నేను ఉరకలెత్తుతున్న నర్మదానది దగ్గరకి చేరుకునే సరికి సూర్యోదయమై ఆకాశం అరుణ కాంతులని పులుముకుంది. ఉదయపు కాంతిలో వర్షపు చిరుజల్లు బంగారు రంగుకి మారింది. దూరంగా, నింగీనేలా కలిసేచోట పెద్ద హరివిల్లు విరిసింది. నేను దానినించి చూపులు తిప్పకున్నాను. బండి ఇరుకైన అడవిదారిలో కుదుపులతో దేవతల రాజ్యం వైపు సాగింది. నేను బలి ఇవ్వబోయే స్త్రీ మత్తుమందు ప్రభావం వల్ల ఇంకేదో ప్రపంచంలో ఉంది. అడవి అందాలు నా మనసుకి ఆనందాన్ని కలిగించాయి. కాసేపు నా దిగుళ్లనన్నిటినీ మరిచిపోయాను. చల్లటి వర్షపు జల్లు ముఖం మీద పడుతూంటే నాకు హాయి అనిపించింది. పరిమళంతో నిండి వీస్తున్న గాలి నా శరీరాన్ని ముద్దాడింది, నాకు

అప్పగించిన పనిని మరిచిపోయాను. నేను తెలివిలేనివాడిని కదా?

విశ్రాంతి కోసం ఆగే వేళకి చీకటి పడింది. సూర్యుడు దూరపు కొండల చాటుకి కిందికి దిగిపోతున్నాడు. ఆమె ఇంకా నిద్రపోతూనే ఉంది. నాలో కామభావాలు నిద్రలేవటం గ్రహించాను. వణుకుతున్న నా చేతిని ఆమె వైపు చాచేసరికి ఆమె పక్కనే పడుకున్న పసిపాప కదిలింది. దాంతో నన్ను నేను సంబాళించుకుని నా చేష్టకి సిగ్గుపడ్డాను.

అప్పుడు మళ్లీ కోపం వచ్చింది. ఈమె ఇప్పుడు నా సొంతం. నా ఇష్టం వచ్చినట్టు ఈమెని ఉపయోగించుకోవచ్చు. ఈమెని వదిలించుకోమని నాకు ఒక కార్య భారాన్ని అప్పగించారు. ఈమెకీ, పసిపిల్లకీ జ్వరం తగిలిందనీ గ్రామంలో ఉన్న వైద్యుడి దగ్గరకి తీసుకెళ్తన్నామనీ, కానీ వైద్యుడి దగ్గరకి చేరుకునేలోపలే ఇద్దరూ చనిపోయారనీ అందరికీ చెప్పాలన్నది పెద్దల నిర్ణయం. అప్పటికే నేను మా స్థావరం నుంచి ఎన్నో యోజనాలు దూరం వచ్చేశాను. ఆమెని నేను అనుభవిస్తే ఎవరికి తెలుస్తుంది? అసలు నేను చేసిన పనికి మంత్రులు సంతోషించవచ్చేమో. నేను మళ్లీ ఆమె దగ్గరకి వెళ్లి ఆమె దుస్తులని గట్టిగా పట్టుకున్నాను. ఆమె వక్షం మీద కట్టుకున్న వస్త్రానికున్న ముడి విప్పేందుకు ప్రయత్నించాను. కానీ నా ఆత్రుతలో అది కష్టమనిపించింది. నేను దాదాపు సఫలీకృతుడనయే సమయానికి ఆమె కళ్లు తెరిచింది. గోవుకళ్లలా దీనంగా ఉన్న కళ్లతో నావైపు తదేకంగా చూసింది. నేను జంకాను. ఆమెని వదిలి లేచి నిలబడ్డాను. ఆమె కళ్లలో కన్నీళ్లు ఉబికి ఒక చుక్క బండిలోపల పరచిన ఎర్రటి పట్టు వస్త్రం మీద పడింది. నాకు సిగ్గు వేసి ముఖం తిప్పేసుకున్నాను. అప్పుడు ఆమె భయంకరంగా అరిచింది. ఆ అరుపు ఎంతో బాధలో ఒంటరిగా ఉన్న జంతువు అరిచిన అరుపులా ఉంది. చుట్టుపక్కల ఉన్న పక్షులు ఆ అరుపుకి బెదిరి ఎగిరిపోయాయి.



నేను వెంట తెచ్చుకున్న చిన్న నూనెదీపం ఒరిగిపోయి పట్టు వస్త్రం

మీద నూనె చింది మరకలు అయాయి. నేను దాన్ని మళ్లీ నిటారుగా పెట్టేందుకు ప్రయత్నించాను కానీ నా చేతులు భయంతో విపరీతంగా వణకటం మొదలుపెట్టాయి. "ఓరీ రాక్షసుడా! నన్ను తాకటానికి నీకెంత ధైర్యం రా?" అని కీచుగా అరిచింది. ఆ అరుపుకి పసిపిల్ల లేచి ఏడవసాగింది.

"మీ రాజు నన్ను ముట్టుకునే ప్రయత్నం కూడా చెయ్యలేదు... దుర్మార్గుడా! ఎంత ధైర్యం రా నీకు?"

నాకు మళ్లీ కోపం వచ్చింది. ఆమె అడవిలో ఒంటరిగా ఉంది. ఆమెని చంపివెయ్యమని నాకు ఆదేశం ఇచ్చారు. ఆమె దూరంగా జరుగుతూ ఉంటే నేను ఆమెని సమీపించసాగాను. ఆమె బండిలోంచి దిగటానికి ప్రయత్నించింది, కానీ నూనెదీపం ఒరిగిపోయి ఆమె దుస్తులమీద కూడా మరకలు అయాయి. గాలికి దీపం ఒక్కసారి భగ్గుమంది, ఆమె దుస్తులకి నిప్పు అంటుకుంది. అసంకల్పితంగా నేను మంటలు ఆర్పేందుకు ప్రయత్నించాను, కానీ ఆమె నన్ను చెంపదెబ్బ కొట్టి నదివైపు పరిగెత్తింది. కోపంతో, బాధతో అరుస్తూ పరిగెత్తే ఒక అగ్నిగోళంలా కనిపించింది ఆమె. కానీ నదిని చేరుకోలేకపోయింది. వీలైతే ఆమెని పట్టుకుని రక్షించేందుకు ఆమె వెనకాలే పరిగెత్తాను. ఆమె అలా అరుస్తూ కాలిపోతూనే ఉండిపోయింది. నది ఇంక కొంత దూరంలో ఉందనగా ఆమె నేల మీద ఒరిగిపోయింది. ఇక ఆమెని రక్షించటం, ప్రాణాలు కాపాడటం అసాధ్యం అనిపించింది. అందుకే ఆ ప్రయత్నాన్ని విరమించాను. ఎంతైనా నా కర్తవ్యం ఆమెని తుదముట్టించటమే కదా. అయినా ఆమె వెంటనే చనిపోలేదు. చాలాసేపు ఆ నది ఒడ్డున మృత్యువుతో పోరాడుతూ సగం కాలిన మాంసం ముద్దలా ఉండి పోయింది. చూసేందుకు భయం గొలిపేట్టు ఉంది ఆమె ఆకారం. ఆమె మొత్తం అసురజాతిని శాపనార్థాలు పెట్టసాగింది. రావణుడే తనని ఈ స్థితికి చేర్చాడనీ, అతన్ని వచ్చే జన్మలో తను తప్పకుండా పట్టి పీడిస్తాననీ కేకలు పెట్టింది. నేను ఎటువంటి భావోద్రేకాలకీ లోనుకాకుండా, ఆమె చనిపోవటం చూస్తూ

ఉండిపోయాను. చనిపోయేలోపల ఆమె భయంకరంగా కేకలు పెడుతూ, తన ఆత్మ చిన్నారి అసుర రాకుమార్తెలో ప్రవేశిస్తుందనీ, తన కోపమే జ్యోతిష్కుల భవిష్యవాణిని నిజంచేసి, అసురులందరినీ నాశనం చేస్తుందనీ, ఆ వినాశానికి రాకుమార్తే కారణం అవుతుందనీ, తన పవిత్రతే అలా జరిగేట్టు చూస్తుందనీ యింకా ఏదేదో వాగింది. తూర్పు దిక్కున వెలుగు రేకలు పొడసూపే వేళకి ఆమె ప్రాణాలు విడిచింది.

పసిపాప ఏడుపు ఆపేసింది. నేను బండి దగ్గరకి పరిగెత్తాను. పాప నన్ను చూసి అమాయకంగా నవ్వింది. నాకేం చెయ్యాలో పాలుపోలేదు. దగ్గరలో ఉన్న బండరాతికేసి కొట్టి పాప తల పగలగొట్టాలని అనుకున్నాను. మరుక్షణం దేవతల చేతుల్లో మరణించిన నా పసిపాప తల ఖండఖండాలుగా నా ఇల్లంతా పరుచు కోవటం గుర్తుకొచ్చింది. ఈ పాపని నేను అదేవిధంగా చంపాలని అనుకుంటున్నానా? పాపని ఎత్తుకున్నాను. పాప బుల్లి పిడికిళ్లు నా చిటికెనవేలిని గట్టిగా పట్టుకున్నాయి. లేదు, నా వల్ల కాదు. నేను ఆ పని ఎంతమాత్రం చెయ్యలేను. పసిపాపతోబాటు కింద కూలబడి ఏడవసాగాను.

నా ఒళ్లో ఉన్న పాప ఏడుస్తూ ఉంటే అలాగే చాలాసేపు కూర్చుండిపోయి నిద్రలోకి జారిపోయాను. అలా ఎంతసేపు నిద్రపోయానో తెలీదు, ఏదో చప్పుడు అవుతూ ఉంటే ఉలిక్కిపడి లేచాను. వేట ఆడుతూ ఒక పెద్ద గుంపు అటుకేసి వస్తోంది. వందలమంది గుర్రాలమీదా, కాలినడకనా, ఆయుధాలు పట్టుకుని వస్తూ కనిపించారు. నది పక్కన ఉన్న ఖాళీ స్థలంలో వాళ్లు శిబిరాలు వేసుకుంటున్నారు. పసిపిల్ల నీలంగా మారి నా ఒళ్లో వేలాడబడిపోయింది. చనిపోయిందేమో అనుకున్నాను. కానీ ముందు ఇక్కడినించి తప్పించుకుపోవాలి.

కానీ నేను పారిపోయేందుకు వెనుతిరిగి, కాలుజారి పొదల్లో పడ్డాను. పసిపాప నా చేతుల్లోంచి పట్టుతప్పి బంకమట్టితో నిండిన గుంటలో పడిపోయింది. అలా పడగానే కెవ్వుమని అరిచింది. అక్కడ

ఉన్న సైనికుల్లో ఒకడు మావైపు తిరిగి ఇటు చూపిస్తూ మిగతావారితో ఏదో అనటం కనిపించింది. వెంటనే ఏమయిందో చూసేందుకు వాళ్లు మావైపుకి రాసాగారు. వాళ్లు నన్ను చూసి ఉండరని ఆశిస్తూ, అక్కడే ఉన్న పెద్ద మర్రిచెట్టు మీదికి ఎక్కాను. ఆ భటులు పైకి చూడకపోవటం నా అదృష్టం. ఇంకా కొంతమంది సైనికులు ఇటుకేసి రావటం చూశాను. అప్పుడు భయంతో ఎవరో అరవటం నాకు స్పష్టంగా వినబడింది. నది ఒడ్డున కాలిపోయి పడి ఉన్న బ్రాహ్మణ స్త్రీ శవం వాళ్లకి కనిపించింది. సైనికుల్లో ఒకడు వాళ్ల ముఖ్య శిబిరం వైపు పరిగెత్తాడు. అందరూ హడావిడి పడటం, పాపని గుంటలోంచి పైకి తీసేందుకు ప్రయత్నించటం చూశాను. అది మరీ లోతైన గుంట కాదు, కానీ పాప నెమ్మది నెమ్మదిగా లోపలికి కూరుకుపోతోంది. తాము కనక గుంటలోకి దిగితే మరుక్షణం ఆ ఊబిలో పూర్తిగా మునిగిపోతామని ఆ సైనికులకి తెలుసు.

పొట్టిగా లావుగా ఉండి, ముఖ్యమైన వ్యక్తిలా కనిపించే ఒకాయన అక్కడికి రాగానే అందరూ ఆయనకి వంగి నమస్కారం చేసి గాభరాగా మాట్లాడటం ప్రారంభించారు. ఆయన గుంటలోకి తొంగిచూసి, తన అనుచరుల్లో ఒకడిని నాగలి తీసుకురమ్మని పంపించాడు. దాన్ని తీసుకువచ్చాక, పాపని దాని సాయంతో అతి జాగ్రత్తగా బైటికి తీశాడు. పాప గుండెమీద చెయ్యిపెట్టి కొట్టుకుంటోందా లేదా అని చూశాడు. వెంటనే తన భటులకి ఏవేవో తీసుకురమ్మని ఆదేశించాడు. వాళ్లు చెరోవైపుకీ వెళ్లారు. కాసేపటికి పాప మళ్లీ ఏడవటం ప్రారంభించింది. అందరూ హర్షం వెలిబుచ్చారు. చెట్టు పైన కొమ్మల్లో దాక్కున్న నాకు కూడా ఆనందంగా అరవాలనిపించింది.

అక్కడినించే వేదవతికి వాళ్లు అంత్యక్రియలు జరపటం చూశాను. వాళ్లు మాట్లాడుకుంటూంటే గొప్ప వ్యక్తిలా కనిపించే ఆయన మిథిలకి రాజనీ, ఆయన పేరు జనకుడు అనీ తెలిసింది. ఆ రోజు మధ్యాన్నం అందరూ తమ రాజు చుట్టూ చేరారు. బ్రాహ్మణ పురోహితులు మంత్రాలు చదువుతూ ఉంటే రాజు వంగి పాపకి తను పెట్టిన పేరును మంద్రస్థాయిలో ఉచ్చరించాడు. అక్కడ ఉన్న వాళ్లందరూ

హర్షధ్వానాలు చేశారు. పాపకి సీత అని పేరు పెట్టారు. 'సీత' అంటే నాగటి చాలు అని అర్థం. వాళ్లు చేసిన హర్షధ్వానాలు మిన్నుముట్టటం చూసి నాకు చాలా ఆనందం కలిగింది. ఏదో అడవి జంతువుకి ఆహారంకాకుండా, ఇక ఆ పాప రాజభవనంలో రాకుమారిలా పెరుగుతుంది. ఈ పాప అదృష్టవంతురాలు. ఆ అదృష్టం జీవితాంతం ఆమెని వెన్నంటే ఉంటుందని ఆశించాను. ఆ పాప నా ప్రభువు కూతురు. లంకా రాజ్యపు రాకుమారి. అసురుల రాకుమారి. కానీ శాపాన్ని వెంటపెట్టుకుని పుట్టింది. తన జాతి మృత్యువుకీ, నాశనానికీ కారణం కాబోతోంది.

తరవాత, వాళ్ల సందడి సర్దుమణిగాక కొంతమంది పూటుగా తాగేశారు. ఇంకొందరు నిద్రలోకి జారుకున్నారు. అప్పుడు నేను చెట్టుమీదనుంచి నెమ్మదిగా కిందికి దిగి శిబిరంలోకి చప్పుడు చెయ్యకుండా ప్రవేశించాను. వంటఇంటిలోంచి ఆహారం దొంగిలించి తిన్నాను. చిందరవందరగా పడిఉన్న పాత్రలలో మిగిలిన ద్రాక్షసారాని తాగాను. ఆ తరవాత నాకు రాకుమారిని చూడాలన్న కోరిక బలీయంగా కలిగింది. అన్నిటికన్నా వైభవమైన సౌకర్యాలు ఉన్న శిబిరంలోకి ప్రవేశించాను. మిణుకు మిణుకుమని వెలుగుతున్ననూనె దీపం వెలుగులో చిన్నారి పాప తెల్లటి పట్టువస్త్రంలో చుట్టబడి, గట్టిగా గురక పెడుతున్న రాజు పక్కన పడుకుని ఉండటం కనిపించింది. ఇంకా దగ్గరగా వెళ్లి అందమైన ఆ పాప ముఖంలోకి చూశాను. వంగి ఆ పాప బుగ్గమీద సుతారంగా ముద్దుపెట్టుకున్నాను. బహుశా నా తాగుడు వాసన ఆ పాపకి ఇబ్బంది కలిగించినట్టుంది, ఎందుకంటే వెంటనే బుంగమూతిపెట్టి తాను చనుబాలు తాగుతున్నట్టు పెదవులని కదిలించింది. కొంతసేపు అక్కడే నిలబడి ఆమె బుల్లి చేతులనీ, కాళ్లనీ చూశాను. తరవాత కదల్లేక కదల్లేక అయిష్టంగా అక్కడినుంచి బైటికి వెళ్లిపోయాను. నా కళ్లు ధారాపాతంగా వర్షించసాగాయి, భావోద్రేకంవల్ల కాళ్లు వణకసాగాయి.

బయలు ప్రదేశానికి చేరుకున్నాక ఒక్కసారి వెనుతిరిగి చూశాను. నా

సొంత కూతురిని వదిలివెళ్తున్నట్టు అనిపించింది. ఆమె ఆనందంగా ఉండేట్టు చెయ్యమని శివుడిని ప్రార్థించాను. ఆమె అందమైన యువతిగా ఎదిగి, దేవతల రాకుమారుడిని పెళ్లాడాలనీ, అతను ఆమెని జీవితాంతంగా సంతోషంగా ఉండేట్టు చెయ్యాలనీ ప్రార్థించాను. ఈ రాజు సాధువులా, పండితుడిలా, తెలివైనవాడిలా ఉన్నాడు. అడవిగుండా అసురుల శిబిరాలవైపు నడుస్తూ ఉంటే, ఆ పాపని వెళ్లి తెచ్చుకోవాలనీ, నా సంతానంలా పెంచుకోవాలనీ అనిపించింది.

స్పష్టంగా ఆలోచించగలిగినంత దూరం వెళ్లాక, ఆ పాపని చంపేసి ఉండాల్సింది అన్న ఆలోచన వచ్చింది. ఆ ఆలోచనకే ఒళ్లు జలదరించింది, కానీ ఏదో ఒకరోజు ఆమె వెనక్కి వస్తుందనీ, జాతి వినాశనానికి దారితీస్తుందనీ మనసు శంకించింది. ఆమె తండ్రి దేనికోసమైతే పోరాడాడో, దాన్నంతా నాశనం చేసేందుకు ఆమె తన జాతివారి దగ్గరకి వెనక్కి వస్తుందని అనిపించింది. ఆ విషయం నాకెలా తెలిసిందో చెప్పలేను, కానీ ఆ ఆలోచన మళ్లీమళ్లీ నా మనసులోకి రాసాగింది. కాపాడమని శివుడిని ప్రార్థించాను, కానీ శివుడు కూడా అసహాయుడే అని మనసు లోలోపల నాకు తెలుస్తూనే ఉంది.

బహుశా అదే ఆమె తీర్చుకోబోయే ప్రతీకారమేమో! జీవితం అంటే ఏమిటో ఇంకా తెలియకముందే ఆమెని చంపివెయ్యాలని అనుకున్న కఠిన హృదయమూ, అహంకారమూ గల జాతి మీద ఒక అసుర రాకుమారి తీర్చుకోవాలనుకున్న ప్రతీకారం. మానవజాతి చరిత్రనే ఆమె మార్చివేస్తుంది. కానీ నేను మరీ అతిగా ఆలోచిస్తున్నట్లు ఉన్నాను. నాకు నిజంగా అంత అవగాహన ఉందా లేక నాది జ్ఞానదృష్టా అనేది స్పష్టంగా నాకే తెలీలేదు. అదంతా ఎప్పుడో జరగబోయేది. మమ్మల్నందరినీ కబళించి, మా రాజ్యాన్ని ఎన్నో శతాబ్దాలపాటు అంధకారంలో ముంచెయ్యబోతున్నది.

19. ఆమెని సజీవంగా ఉండనీయండి

రావణుడు

నా ముఖం ఎవరికీ చూపించాలని అనిపించలేదు. సంతలో ఎద్దుని అమ్మినట్టు సరుకులకోసం నన్ను అమ్మివేశారు. దండయాత్ర చేసి మేము సంపాదించినదంతా చెల్లించి నావాళ్లు నన్ను వెనక్కి తెచ్చుకున్నారు. పూర్తిగా అవమానం పాలయాను. ఒక్కదెబ్బతో కార్తవీర్యార్జునుడు నా సేనని నిర్వీర్యులని చేశాడు. లంకకి తీసుకెళ్లేందుకు మా దగ్గర ఏమీ మిగలలేదు. మా సొంత ఖడ్గాలూ, గుర్రాలూ, ఏనుగులూ, బంగారం తప్ప మా ఆయుధాలన్నింటినీ వాళ్లకి సమర్పించుకోవలసి వచ్చింది. దీనికి బదులుగా మాకు దొరికింది ఎటువంటి విలువాలేని నా ప్రాణాలు. నాకు చనిపోవాలనిపించింది. కానీ ఆ త్యాగంవల్ల ఎటువంటి ప్రయోజనమూ ఉండదు. అన్నిటికన్నా విచారకరమైన విషయం, నేను ఎదురు తిరగలేకపోవటం.

ధైర్యం ఉంటే ఉరవళ్లు తొక్కుతున్న నర్మదానదిని దాటమని వేదవతి సవాలు చేసింది. నేను మూర్ఖుడిలా ఎగసిపడుతున్న ఆ నదిలోకి దూకాను. యుక్తవయసులో ఉన్న కుర్రవాడు తన ప్రియురాలి మెప్పుకోసం సాహసం చేసినట్టు, అలాంటి మతిలేని పనిచేశాను. కానీ ప్రవాహవేగాన్ని సరిగ్గా అంచనా వెయ్యలేకపోయాను. అలాంటి సమయంలో నదిలో దూకి నన్ను నేను సంబాళించుకునే లోపలే నాతల నీళ్లలో ఉన్న బండరాయికి కొట్టుకుంది. మునిగిపోయి ఉండేవాడినే, కానీ ప్రవాహ వేగం నన్ను తనవెంట లాక్కుపోయింది. కళ్లు తెరిచి చూసేసరికి నేను ఒక నేలమాళిగలో ఉన్నాను. మతిస్థిమితం లేని మనిషిని బంధించినట్టు ఒక ఇనప మంచానికి నన్నుగొలుసులతో బంధించారు. నన్ను బంధించినవాడు కార్తవీర్యార్జునుడే అయి ఉంటాడనుకుని, అతని మీదా, నా మీదా, వేదవతి మీదా, అసురుల మీదా నాకు కోపం

వచ్చింది. కానీ తేమగా ఉన్న ఆ నేలమాళిగలో ఆ కోపం ఆట్టేసేపు నిలవలేదు. తలుపుతీసి పాసిపోయిన ఆహారం నాకోసం ఎవరో లోపల పడవేసినప్పుడు, నా మనసులో కాస్త ఆశపొడసూపింది. కొన్నాళ్లకి అదికూడా మిగల్లేదు. నాకు రోజుల లెక్క తెలీకుండా పోయింది, కాలం గురించి అవగాహన లేకుండాపోయింది. చివరికి నా ఆకాంక్ష ఏమిటో కూడా మరిచిపోయాను. నా ఆత్మగౌరవాన్నీ, గర్వాన్నీ వదులుకున్నాను. ప్రాణాలతో ఉండేందుకు ఆ చీకటికొట్లో ఎలకలాగ అటూ ఇటూ తిరుగుతూ ఉండిపోయాను.

కొన్నాళ్లకి వాళ్లు నా గొలుసులు విప్పేశారు. నా ఆత్మ అప్పటికే చనిపోయింది. కానీ మతిస్థిమితం కోల్పోకుండా ఉండేందుకు చీకటికొట్టు బైట కాపలాభటుల అడుగుల చప్పుడు వింటూ వాటిని లెక్కపెట్టసాగాను. పారిపోయేందుకు ప్రయత్నించి ఘోరంగా విఫలమయాను. మామూలు భటుల చేతుల్లో దెబ్బలు తిన్నాను. వాళ్లు నన్ను పెట్టే చిత్రహింసలని పర్యవేక్షించేందుకు కార్తవీర్యార్జునుడు స్వయంగా వచ్చి ఉంటే నేను అంత బాధపడేవాడిని కాను. ఆయన్ని దిగ్భ్రాంతికి గురిచేసే మాటలని నేను మనసులో అభ్యాసం చేసుకున్నాను. నేను ఎంత బాధనైనా ఓర్చుకోగలగటం, నా శరీరాన్నే తప్ప నా ఆత్మని వాళ్లెన్నడూ జయించలేరని నిరూపించగలగటం కార్తవీర్యార్జునుడు కళ్లారా చూడాలని కోరుకున్నాను. కానీ అతను రాలేదు. నన్ను అన్నిటికన్నా ఎక్కువ బాధపెట్టిన విషయం అదే. ఆ చీకటికొట్లో చిన్నపిల్లవాడిలా ఏడ్చాను. పోగొట్టుకున్ననా వైభవాన్నీ, స్వేచ్ఛనీ, ఆకాంక్షలనీ తలుచుకుని ఏడ్చాను. ఒక్కోసారి లంకారాజ్యం, దాదాపు నేను మరిచిపోయిన నా భార్య మండోదరీ గుర్తుకొచ్చేవారు. పండిన మామిడి పళ్ల వాసనకోసం తహతహలాడాను. పసుపు పచ్చని పనసతొనల రుచిని ఊహల్లో అనుభవించాను. పూర్ణానది జలపాతంనుంచి చిందే తుంపర్లని నా శరీరంమీద పడుతున్నట్టు ఊహించుకున్నాను. ముచిర పట్టణం దగ్గర్లో తెల్లటి ఇసుకని ముద్దాడే అలలనీ, వెన్నెల రాత్రిళ్లలో గాలికి ఊగే కొబ్బరిచెట్ల ఆకులనీ, మల్లెపూల

పరిమళాన్నీ ఊహల్లోనే అనుభవించాను.

నా ఆశలన్నీ పూర్తిగా కుళ్లి, కృశించి, అడుగంటిపోయాక ఒకనాడు బైటి ప్రపంచానికి ద్వారాలు తెరుచుకున్నాయి. నన్ను సాగనంపేందుకు కార్తవీర్యార్జునుడి సైనికులూ, సేవకులు చీకటికొట్టు బైట వరసగా నిలబడి నన్ను అపహాస్యం చెయ్యసాగారు. పగటి వెలుతురు నా కళ్లలో గుచ్చుకుంది, నా కళ్లని మూసుకున్నాను. అంధుడిలా తడుముకుంటూ, స్వేచ్ఛా ప్రపంచంలోకి నడిచాను. ఆ క్షణంలో ప్రతీకారం తీర్చుకుంటానని ప్రతిజ్ఞచేసి, నా శత్రువమీద పగతీర్చుకునేందుకు కుట్ర పన్ని ఉండవలసింది, కానీ నాకు క్షౌరం చేయించుకోవాలన్న ఆలోచన తప్ప ఇంకేదీ రాకపోవటం చాలా విచారకరం. నా గడ్డం బాగా పెరిగిపోయింది. ఆ క్షణంలో ఇంకే ఆలోచనా రానందుకు ఇప్పుడు కూడా నాకు సిగ్గేస్తుంది.

మళ్లీ నేను శిబిరానికి తిరిగి వెళ్లాను కానీ ఎవరూ నన్ను పట్టించుకోలేదు. నేను ఇప్పుడు రాజునికాను - కనీసం వాళ్ల మనసుల్లో, నా ప్రియురాలికోసం, నా కుమార్తె కోసం అంతటా వెతికాను. నా మంత్రుల్లో ఎవరికీ ఎదురుపడే ధైర్యం నాకు లేకపోయింది. వాళ్లందరూ ఇళ్లకి తిరిగి వెళ్లేందుకు సామాన్లు సర్దించటంలో మునిగి ఉన్నారు. ఏమీ సాధించకుండానే తిరుగుముఖం పడుతున్నాం. ఇక ఆగలేక నేను మారీచుడిని నిలదీశాను. ముందుచెప్పి తీరాలని ఒత్తిడి చేశాను, ఆ తరవాత బతిమాలాను. వేదవతీ, నా కుమార్తె ఏమయారో చెప్పమని అడిగాను.

"నేను చెప్పేది గుండె రాయిచేసుకుని విను, నాయనా!" అన్నాడు ఆయన. అంతే, నేను భయపడ్డంతా అయింది అని రూఢిగా తెలియగానే అసలే అవమానాల పాలయి వెనక్కివచ్చిన నేను కుప్పకూలిపోయాను.

"ఎప్పుడు, ఎలా జరిగింది? అని మాత్రం అడగగలిగాను.

"ఈ అడవుల్లో చాలామంది వ్యాధిగ్రస్తులయారు, ఎంతోమంది

చనిపోయారు. ఆ బ్రాహ్మణ స్త్రీ కూడా వ్యాధిగ్రస్తురాలై చనిపోయింది. నీ కుమార్తె విషయంలో కూడా అదే జరిగింది. వాళ్లిద్దరినీ కొంత దూరాన ఉన్న గ్రామవైద్యుడి దగ్గరకి తీసుకువెళ్లాం కానీ ఇద్దరూ విషజ్వరంతో చనిపోయారు," అంటూ ముఖం మరొవైపుకి తిప్పుకున్నాడు మారీచుడు.

నేను ఏడ్చాను. ఇక నటించవలసిన అవసరం లేదు. నాకు రాజ్యం అక్కర్లేదు, వైభవం అక్కర్లేదు, అసురజాతి తన విషయం తానే చూసుకోనీ. ప్రహస్తుడికో, విద్యుజ్జిహ్వుడికో రాజు అవాలన్న కోరిక ఉంటే, ఆ పదవిని తీసుకోనీ. అలా వాగుతూనే ఉన్నాను. మారీచుడి వెచ్చటి కన్నీళ్లు నా భుజంమీద పడటం తెలిసింది. అప్పుడు నా మనసుని పీక్కుతినే ఒక అనుమానం పెనుభూతంలా తలెత్తింది. 'లేదు, అది నిజం కావటానికి వీలులేదు. కనీసం నా స్నేహితుడు మారీచుడు అలా జరగనిచ్చి ఉండేవాడు కాదు.' ఒక్కసారి తల జాడించి మారీచుడిని నిలదీశాను, "ఆమెని వైద్యుడి దగ్గరకి ఎవరు తీసుకుని వెళ్లారు?"

మారీచుడి కళ్లలో జీవం మాయమైంది. ఆయన ఎదుట ఉన్న గోడవైపు శూన్యంగా చూస్తూ, "ఎవరో సైనికుడో... ఇంకెవరో... నేను కనుక్కుని నీకు చెపుతాను. కానీ నాయనా, నువ్వు ఇక ఆ విషయాన్ని మర్చిపోవాలి. గతం గతః", అన్నాడు.

"లేదు! చెప్పండి, వాళ్లని వైద్యుడి దగ్గరకి తీసుకుని వెళ్లింది ఎవరు?" అని అరుస్తూ ఆయన్ని పట్టుకుని కుదిపాను. ఆయన కళ్లలో నాకు భయం కనిపించింది. కానీ ఆయన పెదవులు బిగించి చూపులు తిప్పుకున్నాడు. "భద్రుడేనా?" అని గట్టిగా అరిచాను. ఆ దరిద్రుడి పేరు ఉచ్చరిస్తుంటే నా పేగుల్లో భయం సుళ్లు తిరిగింది.

నిశ్శబ్దం... తరవాత ఆయన మళ్లీ ఇలా అన్నాడు, "రావణా! దయచేసి ఇక ఆ విషయాన్ని వదిలెయ్యి..."

ఆయన్ని కింద పడదోసినంత పనిచేసి బైటికి పరిగెత్తాను. నా కత్తిని

ఒరలోంచితీసి ఝళిపిస్తూ భద్రుడి పేరు అరిచాను. గుంటనక్కలా భద్రుడు వచ్చాడు. నేను వెనక్కి తిరిగి వాడిని నావెంట రమ్మన్నాను. నా శిబిరంలోకి ప్రవేశించగానే వాడి గొంతు పట్టుకుని, కత్తిమొనతో కంఠంమీద గుచ్చాను. ఒక చుక్క రక్తంకూడా వచ్చింది. వాడు భయంతో పిచ్చి పిచ్చిగా అస్పష్టంగా ఏదో గొణగసాగాడు.

"నా వేదవతినీ, నా చిట్టితల్లినీ ఏం చేశావు?" అని అరిచాను. వాడు ఏడుస్తూ తనని క్షమించమని బతిమాలాడు. వేదవతికి జరిగిన ప్రమాదం గురించీ, నా కుమార్తె గురించీ చెప్పాడు. జరిగిన ఘోరం తాలూకు వివరాలు వింటూ నేను కొయ్యబారిపోయి, చేష్టలుడిగి నిలుచుండిపోయాను. అంతకుముందు వాళ్లు మరణించి ఉంటారని భయపడినమాట నిజమే! కానీ నేను యిప్పుడు వింటున్న విషయాలు నాకు మరింత లోతైన శోకాన్నీ, బాధనీ కలిగించాయి. నా కాళ్ల దగ్గర దొర్లుతున్న ఆ త్రాష్టుడిని తాపులు తన్నాలనిపించింది. కానీ వాడు నా కాళ్లని కొండచిలువలా చుట్టేశాడు. అలా నిర్విరామంగా పిచ్చివాగుడు వాగుతూ, అర్థంలేని శబ్దాలు చేస్తూనే ఉన్నాడు వాడు. వాటిలో కొంతభాగం మాత్రమే నా మనసులోకి ఇంకింది, దాన్ని అర్థం చేసుకునేందుకు ప్రయత్నించాను. చాలా నెమ్మదిగా నాకు ఒక విషయం తెలియవచ్చింది. 'నా కుమార్తె చనిపోలేదు. ఆమెని దయాళువైన ఒక రాజు, దేవతల రాజు దత్తత చేసుకున్నాడు. అయినా ఆయనకూడా ఒక రాజే. నా కుమార్తె దేవతల రాకుమారిలాగే పెరిగి పెద్దదవుతోంది.'

ఒక్కక్షణం నాకు సంతోషం వేసింది. నా కుమార్తె జీవించే ఉంది. కానీ ఇప్పుడామె శత్రువులరాకుమారి. ఒక కొత్త శక్తి నాలో ప్రవహించింది. నేను సేనని కూడగట్టుకుని జనకుడి రాజ్యంమీదికి దండెత్తి వెళ్తాను. అతని సేనలని మట్టు పెట్టి, రాజ్యాన్ని దోచుకుని, నా కుమార్తెని మళ్లీ నా సొంతం చేసుకుంటాను. ఆమె అసురులరాకుమారి, ఏ దేవతల రాజూ ఆమెని నానుంచి వేరు చెయ్యలేడు. ఆమె లంకా రాజ్యపు రాకుమారి, అసుర రాకుమారిలాగే పెరగాల్సి ఉంటుంది. ఇంతలో నాకు భయం వేసింది. ఆమెని మళ్లీ ఇక్కడికి తీసుకురావాలంటే ముందు నా బలాన్ని

పెంచుకోవాలి.

'నా సేనకి అంత శక్తి ఉందా? అసలు నాకంటూ ఒక సేన ఉందా?' ఒకవేళ నా ప్రయత్నం ఫలించినా, నా రాజ్యంలో ప్రహస్తుడూ, విద్యుజ్జిహ్వుడిలాంటి విష నాగులు స్వేచ్ఛగా తిరుగుతున్నంత కాలం ఆమెని సురక్షితంగా ఉంచి కాపాడటం సాధ్యమేనా? నేను ఎంత అసహాయుడినో అని అనుకోగానే నిస్పృహ ముంచు కొచ్చింది. నేను భద్రుడిని కాలితో గట్టిగా తన్నేసరికి వాడి ముక్కులోంచి రక్తం కారసాగింది. 'నీచుడు... తుచ్ఛుడు!' అటువంటప్పుడు దేవతలు అనుసరించే కులవ్యవస్థలో అర్థం ఉందని నాకు అనిపిస్తుంది. వీడూ, నేనూ సమానులం ఎలా అవగలం?

నా చిన్నారి కుమార్తె గురించి ఆలోచనలు నా మనసుని కమ్మేశాయి. 'ఆమె నాలా ఉంటుందా, మండోదరిని పోలి ఉంటుందా?' మండోదరిని తలుచుకోగానే పూర్ణానదీ, కావేరీనదీ తీరాలలో గడిపిన ఆహ్లాదకరమైన సాయంకాలాలు గుర్తుకి వచ్చాయి. పూలతో నిండిన చెట్ల పరిమళం అంతటా నిండి ఉండటం, మండోదరి తెల్లని, నునుపైన శరీరం, మల్లెల సువాసన, చల్లటి గాలి హాయిగా తాకటం, వందలకొద్దీ తుమ్మెదల ఝుంకారం, ఉడతల కిచకిచలూ వింటూ, అనుభవిస్తూ ఒకరినొకరం కౌగిలించుకుని సున్నితమైన ప్రేమని పంచుకుంటూ...

నేను ఆ నీచుడి పటు విడిపించుకునేందుకు పెనుగులాడాను. వాడిని వదిలించుకున్నాక నదివైపు భారంగా నడిచాను. నా జ్ఞాపకాలతో ఒంటరిగా గడపాలని అనిపించింది. నా ఆత్మపడే క్షోభలో నా అవసరాలు మరుగున పడిపోయాయి.

భద్రుడు

యుద్ధంలో ఓడిపోయి రిక్తహస్తాలతో వెనక్కి వచ్చాం, మా రాజుమీదా, సైన్యంమీదా, మంత్రులమీదా, మామీద మాకే అలవికానంత కోపం

వచ్చింది. నా పరిస్థితి మరీ అధ్వాన్నంగా తయారయింది. రాజు కారాగారం నుంచి విడుదలఅయి రావటానికి ఎంతో ముందే విద్యుజ్జిహ్వుడు కొందరు మంత్రులతో మమ్మల్ని వదిలి వెళ్లిపోయాడు. విద్యుజ్జిహ్వుడు మాలతో మళ్లీ తన ప్రేమ వ్యవహారం ప్రారంభించి ఉంటాడని నాకు కచ్చితంగా తెలుసు. అందుకే నాకు ఈర్ష్య కలిగింది.

లంకకి తిరిగి వస్తూండగా మా అవమానాలకి మరొకటి అదనంగా చేరింది. దక్షిణ వింధ్య పర్వతాల పాదాలదగ్గర, సంకరజాతికి చెందిన వాలి పరిపాలన కొనసాగుతోంది. అతన్ని వానరరాజు అనీ, అతని ప్రజలని వానరులనీ హేళన చేసేవారు. కిష్కింధ రాజధానిగా ఆ ప్రాంతాన్ని ఏలుతున్న వానరజాతి, ఉత్తరాన ఉన్నదేవతలకీ, దక్షిణాన ఉన్న అసురులకీ కూడా ప్రమాదకరంగా తయారయింది. కానీ తమ ప్రాంతంలోని అడవులకే వాళ్లు పరిమితమై జీవిస్తున్నందువల్ల, ఉత్తరదిశగా మేము యుద్ధం చేసేందుకు సముద్రతీరం వెంబడి ముందుకి సాగినప్పుడు, వాళ్లు మాకు దారిలో తగలలేదు.

వాలి తమ్ముడు, సుగ్రీవుడు, వానరరాజుకి శత్రువు అన్ననిజం, హనుమంతుడి వంటి పేరుమోసిన యోధులు వాలిని వదిలి సుగ్రీవుడి సైన్యంతో కలిసిపోయారన్న విషయం మా రాజు రావణుని ఉసిగొల్పి ఉండవచ్చు. ఎందుకంటే, ఆయన ఏదో విధంగా కనీసం చిన్న విజయాన్నైనా సాధించి, పోయిన గౌరవాన్ని తిరిగి పొందాలని ఆత్రుతపడుతున్నాడు. రావణుడి పరిస్థితి ప్రమాదకరంగా తయారయింది. ప్రహస్తుడుగాని, విద్యుజ్జిహ్వుడుగాని రాజ్యాన్ని స్వాధీనం చేసుకుంటారన్న భయం ఆయన్ని నిరంతరం వెంటాడుతోంది. తనకన్నాముందే వాళ్లు లంకకి వెళ్లిపోయారన్న విషయం ఆయన మనసులో సందేహాలని రేకెత్తించి భయపడేట్టు చేసింది. అందుకే కిష్కింధమీద దాడిచేసి, పోయిన పేరుప్రతిష్ఠలని సంపాదించుకోవాలని ఆయన ఆశించాడు.

నిరుత్సాహంలో కూరుకుపోయిన సైన్యం అమావాస్య రోజు రాత్రి దండెత్తి మరుక్షణం ఘోరంగా ఓడిపోయింది. మేము సులభంగా

లొంగిపోయాం. మర్నాడు ఉదయం, బందీలని చూసేందుకు వానరరాజు వచ్చినప్పుడు, తనమీద దాడిచేసినది అసురసైన్యమని తెలిసి ఆశ్చర్యపోయాడు. ఎవరో దారిదోపిడీగాళ్లు రాత్రి చీకట్లో దాడిచేశారని అనుకున్నానని అతను అనటం, యుద్ధాలలో తగిలిన గాయాలకన్నా ఎక్కువగా మమ్మల్ని బాధపెట్టింది. అంతకన్నా అవమానకరంగా అనిపించిన విషయం - అతను మాతో వ్యవహరించిన తీరు, మా అందరికీ సమాన గౌరవం చూపించి మాకు కలిగిన ఇబ్బందికి క్షమాపణ కూడా చెప్పుకున్నాడు. గౌరవనీయులైన అతిథులని సత్కరించినట్టు విందుభోజనం పెట్టించాడు. మేము ఆబగా పెట్టినదంతా తిని, గొంతువరకూ తాగాం. వానరుల ఆటవిక దరువులకి తెల్లవారేదాకా నృత్యం చేస్తూ ఉండిపోయాం. ఉదయానికల్లా అన్ని అవమానాలనీ మరిచిపోయి వాళ్లకి ఆత్మీయ మిత్రులం అయిపోయాం. వానరులూ, అసురులూ ఆచంద్రతారార్కం మైత్రిని నిలుపుకుంటామని వాగ్దానాలు చేసుకున్నారు. ఆ తరవాత వానరరాజ్యాన్ని వదిలి వెళ్తున్నప్పుడు, వింతగొలిపే దృశ్యాలు మా కంటబడ్డాయి. రావణుడు వానరరాజుని కౌగిలించుకున్నాడు, వానరరాజు అసురరాజుకి సలహాలిస్తూ కనిపించాడు. ఎంతో ఉత్సాహంతో ఉరకలు వేస్తూ ఆ ప్రాంతాన్ని వదిలాం. వానర సామ్రాజ్యంతో శాశ్వతమైన సంధి పత్రంమీద సంతకాలు పెట్టుకున్నామనీ, మా రాజుకి వాలి మిత్రుడూ, గురువూ, మార్గనిర్దేశకుడూ అయాడనీ ఇతరులు చెప్పుకునే మాటలు విన్నాం. అది నాకు చాలా విచిత్రంగా తోచింది, కానీ నాలాంటి తెలివితక్కువ వాడికి అలాంటి విషయాలు అర్థంకావు అని సరిపెట్టుకున్నాను. నా ఆందోళన ఎప్పుడూ రెండోపూట భోజనం గురించే.

భూభాగం దక్షిణ ప్రాంతానికి చేరుకునేందుకు దాదాపు నెలరోజులు పట్టింది. సముద్రం దాటి ఎంతవేగంగా మా ప్రియమైన దీవికి చేరుకుందామా అని అందరికీ ఆత్రుతగా ఉంది. కానీ మమ్మల్ని ఈ భూభాగానికి చేర్చిన వరుణుడి నౌకలు ఎక్కడా కనిపించలేదు. మేము పక్షం రోజులు వేచిచూశాం. ఒక్కొక్కరోజూ గడుస్తున్నకొద్దీ మా ఆత్రుత

పెరిగిపోసాగింది. చివరికి రావణుడు ముందుకివచ్చి వ్యవహారాన్ని తన చేతిలోకి తీసుకున్నాడు. చెట్ల నరకమని మాకు పురమాయించాడు. త్వరగా కొన్ని నావలు తయారుచేశాం. అది చాలా సాహసంతో కూడుకున్న ప్రయత్నమే. మారీచుడి మనసు మనసులో లేదు.

చివరికి, కొంతమంది మాత్రమే లంకకి ప్రయాణం కట్టే సాహసం చెయ్యాలని ఆయన నిర్ణయించాడు. మారాజు ఇక లంకకి రాజు కాదనీ, విద్యుజ్జిహ్వుడో, ప్రహస్తుడో లంకని ఈసరికి స్వాధీనం చేసుకునే ఉంటారనీ ఆయన అనుమానించాడు. ఆ అనుమానం ఆయన మనసుని పట్టిపీడించసాగింది. అన్నీ సిద్ధం చేసుకుంటూ ఉండగా, మేము విడిదిచేసిన కావేరీ నదీముఖం దగ్గరకి వస్తూన్న కొన్ని నౌకలు కనిపించాయి.

రావణుడు మమ్మల్నందరినీ మళ్లీ అడవిలోకి వెళ్లమని ఆదేశించాడు. అక్కడ దాక్కుని నౌకలు లంగర్లు దించటం చూశాం. వాళ్లు చిన్న చిన్న పడవలని నీటిలో వదిలారు. వాటిలో మనుషులు ఉన్నారు. వేగంగా తెడ్లువేస్తూ మేం శిబిరాలు వేసుకున్న తీరంవైపు రాసాగారు. వాళ్లు వచ్చేందుకు కొంత సమయం పట్టింది. అంతసేపూ మేము వేచి ఉన్నాం. అప్పుడు కనిపించారు వాళ్లు. ప్రహస్తుడూ కొందరు భటులూ నీళ్లలో నడుచుకుంటూ మావైపు రాసాగారు. దాక్కున్న చోటునుంచి రావణుడూ, మారీచుడూ బైటికి వచ్చారు. ఒరల్లోంచి కత్తులు దూసి ప్రహస్తుడివైపు నడిచారు.

ప్రహస్తుడు గర్వంగా తలెత్తుకుని రావణుడివైపు చూశాడు. అతని ముఖంలో రావణుడిపట్ల ఉన్న ద్వేషం స్పష్టంగా కనిపించింది. రావణుడు ముఖం పక్కకి తిప్పుకోవటం నాకు కనిపించింది. మారీచుడు త్వరగా తనని తాను సంబాళించుకుని ప్రహస్తుడికీ రావణుడికీ మధ్యన వెళ్లి నిలబడ్డాడు. ప్రహస్తుడు పక్కకి తొలగి గౌరవంగా రావణుడికి వంగి నమస్కారం చెయ్యటం చూసి మేమందరం ఆశ్చర్య పోయాం. అందరం మిన్నంటే విధంగా హర్షధ్వానాలు చేశాం. మారీచుడు తడబడి ఆనందాశ్చర్యాలతో వాళ్లిద్దరినీ చూడసాగాడు.

ఆయన ప్రహస్తుడిని కౌగలించు కున్నాడు.

క్రమశిక్షణ మరిచిపోయి మేమందరం ముందుకి పరిగెత్తాం. ప్రహస్తుడు ఇబ్బందిలో ఉన్నట్టు కనిపించాడు, కానీ మారీచుడు అతనికి ధైర్యంచెప్పి ఏం జరిగిందని అడిగాడు. ప్రహస్తుడు అయిష్టంగా చెప్పటం ప్రారంభించాడు, "రావణుడిని వదిలి విద్యుజ్జిహ్వుడి వెంట వెళ్లాలని నిశ్చయించుకోవటం నేను చేసిన పెద్ద పొరపాటని ఇప్పుడు అనుకుంటున్నాను. నా ఉద్దేశం మహాప్రభువునీ, మిమ్మల్నీ వదిలేసి వెళ్లి ఉండకూడదు. నాకు ఎప్పుడూ ఆ దుర్మార్గుడిమీద అనుమానంగానే ఉండేది, కానీ వాడు ఇంత నీచానికి దిగజారగలడని నేను ఎప్పుడూ ఊహించలేదు. లంకకి చేరుకునే వరకూ నాతో ఎంతో ఆప్యాయంగా, మంచిగా మాట్లాడాడు, కానీ అక్కడికి చేరుకున్న మరుక్షణంనుంచీ, మీరు వచ్చేవరకూ తనని రాజప్రతినిధిని చెయ్యమని ఒత్తిడి చెయ్యసాగాడు. అసుర సంప్రదాయంలో అలాంటి ఆలోచనే లేదనీ, అలాటిది వీలుకాదనీ అన్నాను," అని ఆగి రావణుడివైపు చూశాడు. రావణుడు చూపులు తిప్పేసుకున్నాడు.

"కానీ అతను మాటకారి అనీ, తియ్యగా మాట్లాడగలడనీ మీకందరికీ తెలుసు. అతను సభ్యులందరికీ లంచం ఇవ్వజూశాడు, బెదిరించాడు, నయానా భయానా ఒప్పించేందుకు ప్రయత్నించాడు. జంబుమాలీ, నేనూ మాత్రమే ఒప్పుకోలేదు. నిరసన తెలియజేస్తూ సభ్యత్వం రద్దు చేసుకున్నాను. కొత్త రాజు విద్యుజ్జిహ్వుడు ప్రజలని భయంకరమైన అణచివేతకు గురిచేసి ఉండకపోతే అసలు రాజకీయాలనుంచి పూర్తిగా తప్పుకుని ఉండేవాడినే. అతను ఎన్నో అనవసరమైన పనులు చేశాడు. మూడు మాసాలలో అతను రాజ్యంలో ఆర్థిక సంక్షోభాన్ని సృష్టించాడు, తలుచుకున్నప్పుడల్లా పన్నులనీ, వసూళ్లనీ పెంచివేస్తున్నాడు. సముద్రపు దొంగల రాజుని యధేచ్ఛగా దోచుకోమని చెప్పి, ఆ దోచుకున్నదానిలో తనవంతు తీసుకుంటున్నాడు. కానీ ప్రస్తుతం ఇద్దరికీ చెడింది. వరుణుడు ఆ ఓడలో రావ... నా ఉద్దేశం మహారాజుగారి కోసం వేచి ఉన్నాడు. మహారాజు వచ్చి నౌకాదళాన్ని

తన చేతుల్లోకి తీసుకోవాలని వరుణుడు అనుకుంటున్నాడు. ప్రతీకారంకోసం తహతహలాడిపోతున్నాడు," అన్నాడు ప్రహస్తుడు.

రావణుడు ముందుకి వచ్చి ప్రహస్తుడిని ఇలా అడిగాడు, "కానీ నా తమ్ములూ, భార్యా, చెల్లీ ఏమయారు?"

"మహాప్రభూ! మీ సోదరి సురక్షితంగా ఉంది, కానీ సంతోషంగా లేదు. ఆమె ఇంకా తన భర్తని పిచ్చిగా ప్రేమిస్తోంది. మీ భార్యని నేను ముందు పర్వత ప్రాంతంలో దాచిపెట్టి తరవాత ఆమె తండ్రి దగ్గరకి పంపేశాను. అసలు మనం ఎక్కువ ఆందోళన పడవలసినది కుంభకర్ణుడి గురించి. ఎందుకంటే తన బావగారి దౌర్జన్యానికి వ్యతిరేకంగా గొంతు ఎత్తి మాట్లాడినది అతను ఒక్కడే. కుంభకర్ణుడు ధైర్యశాలి. కానీ మహారాజా, మీరు మన్నిస్తే అతనికి ఉద్రేకం ఎక్కువ అంటాను. తేలికగా మోసానికి గురి అయే నైజం... అతనికి అతని స్నేహితులే నమ్మకద్రోహం తలపెట్టారు, పట్టుకున్నారు, చిత్రహింసలు పెట్టారు, యముడి సామ్రాజ్యానికి పంపారు. అతను చనిపోలేదు. తూర్పుకనుమల్లో ఉన్న సహ్యకి అతన్ని పంపారు. నల్లమందు వ్యాపారానికి కేంద్రంగా ఉంటున్న రాజ్యం అది. అడవిలోపలికి చాలా దూరం వెళితే, అక్కడ యముడు అనే ఒక దారిదోపిడీ దొంగ విషపదార్థాలతో తయారుచేసే పానీయాలూ, పొగ తాగేందుకు పనికివచ్చే మూలికలూ, నల్లమందూ తయారుచేస్తూ కనిపిస్తాడు. ఆ యముడి శిష్యుడే విద్యుజ్జిహ్వుడు. తన గురువు చేసే ప్రయోగాలకి గాను అతను ఒక అసుర రాకుమారుడిని ఆయనకి కానుకగా సమర్పించుకున్నాడు."

ఆసరికి రావణుడు కోపంతో ఊగిపోసాగాడు. మారీచుడు అతన్ని శాంతింపచేసేందుకు అతని భుజంమీద చెయ్యివేశాడు. కానీ రావణుడు దురుసుగా దాన్ని తోసివేశాడు. "యుద్ధానికి సన్నద్ధం అవండి. ఈ వంచకుడి పని పడదాం," అని అరిచాడు.

అంతే హడావిడి మొదలైంది. ఇప్పుడు మాకొక ధ్యేయం ఉంది, ఇది

ఒక వ్యక్తి పేరు ప్రతిష్ఠలు సంపాదించుకునేందుకు చేసే అర్థంలేని యుద్ధం కాదు. మా సోదరులనీ, సోదరీమణులనీ విడిపించేందుకు, మా భార్యాబిడ్డలకీ, తలిదండ్రులకీ ఒక నిరంకుశుడి దౌర్జన్యం నుంచి విముక్తి కలిగించేందుకు చెయ్యబోయే యుద్ధం.

కానీ ప్రహస్తుడు చెయ్యిపైకి ఎత్తగానే అంతా సద్దుమణిగింది. "మహాప్రభూ, ముందు మనం రాకుమారుడు కుంభకర్ణుడిని విడిపించాలి. వాళ్ల ప్రయోగాల బారినపడి అతను ఇప్పుడు ఎలాటి స్థితిలో ఉన్నాడో మనకి తెలీదు," అన్నాడు.

జవాబు చెప్పేముందు రావణుడు కొన్నిక్షణాలు ఆగాడు. తరవాత వినమ్రంగా కొద్దిగా వంగి, "ప్రధానమంత్రీ, మీ సలహాకి నేను విలువ ఇస్తాను. మీ వివేకంపట్ల నాకు గౌరవం ఉంది. మీరు నాకు మార్గనిర్దేశం చెయ్యాలి," అని ఆనందంగా నవ్వుతున్న మారీచుడివైపు తిరిగి, "మామయ్యా, మన మిత్రుడు వాలి దగ్గరకి వార్తాహరుడిని పంపి, నల్లమందు వ్యాపారి యముడిని తుదముట్టించేందుకు ఆయన సాయం కోరుతున్నామని చెప్పండి. ఆయన సాయం మనకి అవసరం," అన్నాడు. మారీచుడు నమస్కరించి, అతివేగంగా వెళ్లే వార్తాహరుడిని పంపేందుకు వెళ్లిపోయాడు.

అప్పుడు రావణుడు ఏదో జ్ఞాపకం వచ్చినవాడిలా ప్రహస్తుడిని, "మరి మా ఆఖరి తమ్ముడు, విభీషణుడు ఎలా ఉన్నాడు?" అని అడిగాడు.

ప్రహస్తుడు నవ్వు ఆపకుంటూ, "మహాప్రభూ, అతను తను స్వయంగా నిర్మించిన ఒక ఆలయంలో తలుపులు మూసుకుని దాక్కున్నాడు. దేవతల దైవం విష్ణువుని ఈ పాపాలనుంచి గట్టెక్కించమని ప్రార్థిస్తూ ఉంటాడు. అలా ప్రార్థించటం తప్ప అతను ఇంకేమీ చెయ్యడు," అన్నాడు.

"ఛీ!" అన్నాడు రావణుడు చీదరించుకుంటూ, మాలో చాలామందిమి వ్యంగ్యంగా ఇకిలించాం.

20. దేశభక్తుడు

రావణుడు

యముడి దుర్గాన్ని స్వాధీనం చేసుకున్న తరవాత మా తమ్ముడు కుంభకర్ణుడి కోసం వెతకటం ప్రారంభించాం. నా ఒళ్లంతా గాయాలతో రక్తం కారుతూ, మగతగా గుర్రంమీద కూర్చున్నాను. ఆ ప్రదేశమంతా దెయ్యాలు తిరుగాడుతున్నట్టు నిశ్శబ్దంగా ఉంది. ప్రాణాలుపోతున్న మనుషుల, జంతువుల మూలుగులు తప్ప ఇంకేమీ వినపడటం లేదు. రక్తం వాసనకి అలవాటు పడిపోయాం కాబట్టి అది మమ్మల్ని అంతగా ఇబ్బంది పెట్టలేదు. ప్రహస్తుడూ, మారీచుడూ కనబడేసరికి నేను వాళ్లవైపు గుర్రాన్ని నడిపించాను. మారీచుడు చిరునవ్వు నవ్వాడు, కానీ ప్రహస్తుడు నాకు ఒక చిన్న నమస్కారం చేసి తన పనిలో మునిగిపోయాడు. అతను అన్నివైపులకీ మనుషులని పంపి కుంభకర్ణుడిని వెతికించే పనిలో ఉన్నాడు. ఉన్నట్టుండి మారీచుడు నావైపు తిరిగి, "కోటని పడమటి నుంచి ముట్టడించాలని నిర్ణయించినది ప్రహస్తుడే. కోటలో ఉన్న అతని మిత్రుడే మాకు పడమటి ద్వారం తెరిచాడు. యుద్ధం ప్రారంభం అయిన వెంటనే మేము పడమటి దిశకి చేరుకున్నాం. అసలు యుద్ధం ఇంకా ప్రారంభం అవకముందే ప్రహస్తుడు చాలామంది సైనికులని పడమటి ద్వారానికి దగ్గరలో ఉండేట్టు నిలబెట్టాడు," అన్నాడు. నేను కోపంతో రగిలిపోయాను. నాచేత మామూలు సైనికుడిలా యుద్ధం చేయించి, నా మంత్రులు తమ యుక్తులని ప్రదర్శించేందుకు, శత్రువు దృష్టిని మరల్చేందుకు నన్ను ఉపయోగించు కున్నారు. అలాంటి ప్రణాళిక నేను వెయ్యలేకపోయినందుకు నాకు కోపం వచ్చింది. పైగా ఆ ప్రణాళికలో ఎన్నివేల తప్పులు దొర్లేందుకు అవకాశం ఉందో ఆలోచించటంలో మునిగిపోయాను. ఎవరో గట్టిగా కొట్టిన చప్పట్లు వినిపించాయి. అవి

కోట పడమటివైపునుంచి వచ్చాయి. సైనికులు కొందరు ఒక మహాకాయుడిని భుజాలమీదికి ఎత్తుకుని నృత్యం చేస్తూ ఉండటం కనిపించింది. వాళ్లు దగ్గరకొచ్చేసరికి, సైనికుల నల్లటి భుజాలమీద దాదాపు స్పృహలో లేనట్టు ఉన్న కుంభకర్ణుడు పైకీకిందికీ ఊగటం నాకు కనిపించింది. ఆ దృశ్యం నవ్వు పుట్టించేట్టు ఉందని అనిపించింది. నేను చిరునవ్వు నవ్వుతూ మారీచుడివైపు చూశాను. ప్రహస్తుడు అలవాటు ప్రకారం ముఖం గంభీరంగా పెట్టుకుని పక్కనే నిలబడ్డాడు. అసలు విషయం నాకు చెప్పకుండా ఎందుకు దాచావని అతన్ని అడగాలనిపించింది, నాకు మళ్లీ కోపం వచ్చింది. అలా అడుగుదామని అనుకుంటూ ఉండగా, మారీచుడు నా దృష్టిని ఆకర్షించి, నా చెవిలో రహస్యంగా, "మనలోనే ఎవరో శత్రుగూఢచారులు ఉన్నారని మాకు అనుమానం వచ్చింది. నీకు తెలియజేయాలనే అనుకున్నాను, కానీ ప్రహస్తుడు నీకు చెప్పవద్దని వారించాడు. నీకు తెలిసిపోతే సైన్యానికి నాయకత్వం వహించి నువ్వు సమర్థంగా యుద్ధం చెయ్యలేవనీ, శత్రువు మన వ్యూహం పసిగట్టి ఉండేవాడనీ నన్ను ఒప్పించాడు. అందుకే నిన్ను శౌర్యంతో యుద్ధం చెయ్యనిస్తూ మేము వెనకనుంచి దొంగతనంగా ప్రవేశించాం," అన్నాడు.

అయినా నేను మోసపోయాననే అనిపించింది. చాలా హీనంగా, నన్ను వాళ్లు ఉపయోగించుకున్నారు అనే భావన కలిగింది. 'రాజుని నేను, ఈ వృద్ధులు నామీదే యుక్తులు పన్నుతున్నారు.' ఆ వృద్ధులమీద అరవాలని అనిపించి, వాళ్లగురించి నేను ఏమనుకుంటున్నానో చెప్పేలోపల, ప్రహస్తుడు నావైపు తలతిప్పి చిరునవ్వు నవ్వాడు. మారీచుడు కూడా నవ్వాడు.

"మనం జయించాం, రావణా! జయించాం! అంత గొప్పగా యుద్ధం చేసి ఉండకపోతే అది సాధ్యం అయేదే కాదు," అన్నాడు ప్రహస్తుడు అవసరమైన దాని కన్నా గట్టిగా. మొత్తం సైన్యం అంతా హర్షధ్వానాలు చేసింది. సైనికుల పంక్తులు అలల్లా ఆయుధాలు పైకి ఎత్తి, "హరహర మహాదేవ!" "శివుడికి జయము జయము!" "అసుర మహారాజు,

శక్తిశాలి రావణుడికి జయము జయము!? "అసురులకి జయము జయము!" అంటూ నినాదాలు చేశారు.

నా మనసు గర్వంతో ఉప్పొంగింది. ఏంచెయ్యాలో తెలియలేదు నేనుకూడా నా కత్తిని పైకి ఎత్తాను. నా సైన్యం అత్యుత్సాహంతో అరిచింది. హఠాత్తుగా నాకు ఒక విషయం గుర్తొచ్చింది, 'ఈ ఇద్దరు వృద్ధులకీ నేను ఎంతో రుణపడి ఉన్నాను,' అనుకున్నాను. అంతలోనే వాళ్లమీద కోపం ముంచుకువచ్చి నా మనసు మార్చు కున్నాను. "మామయ్యా, యముడిసేనలో మనకి సాయంచేసిన గూఢచారి ఏడీ?" అని అడిగాను. ఆయన కళ్లు ఆశ్చర్యంతో పెద్దవవుతూ ఉంటే పట్టించుకోలేదు నేను. నా మెడలోని వజ్రాల హారాన్ని తీసి, "అతనికి దీనిని బహూకరించాలని ఉంది," అన్నాను.

"రావణా! నీకేమైనా మతిపోయిందా?"

నాకు కోపం వచ్చింది, "మీరు చెపితే చెప్పండి, నేనే అడిగి తెలుసుకుంటాను," అన్నాను పొగరుగా. మారీచుడు విచారంగా తల ఆడిస్తూ "రావణా, ఒక్కొక్కసారి నిన్ను చూస్తే నాకు ఆశ్చర్యం వేస్తుంది. మేము కోటమీద దాడిచేసిన వెంటనే ప్రహస్తుడు కత్తితో పొడిచి మొట్టమొదట చంపినది అతన్నే," అన్నాడు.

నేను నిర్ఘాంతపోవటం చూసి, "రావణా, రాజకీయాల్లో నేర్చుకోవలసిన ఎంతో ముఖ్యమైన పాఠం అది. నీచమైన పనిని నీకోసం చేసిన ఆ రాజద్రోహిని ఎప్పుడూ నమ్మకూడదు. రేపు వాడు నీకే ఎదురు తిరగవచ్చు," అని ఆగి మళ్లీ ఇలా అన్నాడు, "అయినా అలాంటి విషయాల గురించి ఆలోచించకు. యముడు పారిపోయినప్పటికీ మనమే యుద్ధం గెలిచాం, నీ తమ్ముడు సురక్షితంగా ఉన్నాడు."

వజ్రాల హారాన్ని చేతిలో పట్టుకుని నిలబడిన నేను నాకే మూర్ఖుడిలా కనిపించాను. ప్రహస్తుడు తలతిప్పి నా చేతిలో ఆ హారాన్ని చూసేలోపల దాన్ని వదిలించుకోవాలని అనుకున్నాను. అతను వినయంగా నవ్వటాన్ని నేను భరించలేను. చుట్టూ చూశాను. ఒక

భటుడు కోటగోడకి ఆనుకుని, కాళ్లు ఎడంగా చాపి కూర్చుని కనిపించాడు. వాడి ముక్కులో కొంతభాగం నరకబడింది. ఆయాసంతో రొప్పుతూ, చూసేందుకు వికారంగా ఉన్నాడు. వాడి ఒంటినిండా రక్తం కారుతూన్న గాయాలు కనిపించాయి. వాడిని చూస్తే విపరీతమైన జాలి కలిగింది నాకు. నాకోసం ఇన్ని కష్టాలు భరించాడు, తన ప్రాణాలనే పణంగా పెట్టాడు వీడు.

నేను వాడిని పిలిచాను. కొన్ని క్షణాలు అర్థంకానట్టు కళ్లు మిటకరించి చూశాడు. మరుక్షణం విపరీతమైన భయానికి లోనయాడు. లేచేందుకు ప్రయత్నించి కూలబడిపోయాడు. తరవాత నావైపు పాకుతూ రాసాగాడు. నాకు వాడిని చూస్తే అసహ్యం వేసింది. గాయపడిన కుక్కలా నావైపు దేకుతూ వచ్చాడు. నా చేతిలోని వజ్రాలహారంవైపు చూశాను. ఇలాంటి అయోగ్యుడికి అది మరీ విలువైన బహుమతి అనిపించింది. మెడలో ఉన్న ముత్యాల హారాన్ని తడిమాను. దానివైపు కొంచెం బాధగా చూశాను. కానీ నా మనసు మారేలోపల దాన్ని ముడుచుకుని పడివున్న ఆ భటుడివైపు విసిరివేశాను. అది వాడికి కొన్ని అడుగుల దూరంలో ఇవతల పడింది. ఆ మనిషి గుడ్లగూబలా కళ్లార్పుతూ చూశాడు, తన ముందు పడిన వస్తువు ఏదో అతనికి అర్థం అయినట్లు లేదు. తరవాత దాన్ని ఒక్క ఉదుటున అందుకుని కోతిలా వాసన చూశాడు. 'వీడికి నేనిచ్చిన కానుక విలువ తెలీదు, నచ్చలేదు, ఎంత ధైర్యం వీడికి?' నెమ్మది నెమ్మదిగా వాడికి అసలు విషయం తెలిసింది. నిర్ఘాంతపోతూ నాకేసి చూశాడు, మొదట వాడి చూపులో నాపట్ల తృణీకారభావం ఉందని భయపడ్డాను. కానీ ఆ తరవాత చాలా వినయంగా, కృతజ్ఞతా భావంతో వంగి నమస్కరించి, నేలని ముద్దు పెట్టుకున్నాడు.

వాడి శరీరం కంపించటం చూసి చనిపోతాడేమో అని భయపడ్డాను. నెమ్మదిగా తలెత్తి బుగ్గలమీదినించి కన్నీళ్లు కారిపోతూంటే, నన్ను చూసి చిరునవ్వు నవ్వాడు. వాడి ముందుపళ్లు రెండు విరిగిపోయినట్టున్నాయి, వాడి నవ్వు చాలా అస్వాభావికంగా

కనిపించింది. నాకు అసహ్యం వేసింది, కానీ ఏదో ఒక మూల వీడు నాకు తెలిసిన మనిషే అన్న ఆలోచన నన్ను వదలకుండా పీడించింది. ఇంకాస్త దగ్గరనుంచి చూడాలని అనుకున్నాను. కింద బోర్లా పడిఉన్న ఆ మనిషి దగ్గరకి నా గుర్రాన్ని నడిపించాను.

భద్రుడు! 'ఎందుకు ఎప్పుడు చూసినా ఈ దిక్కమాలిన వెధవ నా జీవితంలో జోక్యం కలిగించుకుంటూ ఉంటాడు?' అనిపించింది. ఆ ముత్యాలహారాన్ని వెనక్కి లాగేసుకోవాలనీ, ఆ అనాకారి వెధవ ముఖంమీద కాలితో తన్నాలనీ, వాడి నల్లటి శరీరాన్ని కొరడాతో కొట్టాలనీ కోరిక కలిగింది. అప్పుడు వాడు ఆ కానుకని అందుకుంటున్నప్పుడు చూపించిన కృతజ్ఞతా భావం జ్ఞాపకం వచ్చింది, శాంతించాను. 'అయిందేదో అయింది,' అనుకున్నాను. వీడికి కూడా చిన్న చిన్న బహుమానాలు ఇవ్వవచ్చు. దానికి వీడు అర్హుడే. నేను సరైన పని చేశానన్న సంతోషం, సంతృప్తి కలిగాయి. తరవాత మా సంబరాలన్నీ ముగిసిపోయి మేము విశ్రాంతి తీసుకునేందుకు వెళ్లిపోయాం. నిద్రా మెలకువల మధ్య జోగాడుతున్నప్పుడు, నా మనసులో మెదిలింది కృతజ్ఞత నిండిన భద్రుడి ముఖం కాదు, మొదటిసారి నేనిచ్చిన బహుమతిని తాకినప్పుడు వాడి ముఖంలో కనిపించిన తృణీకారం. అటూ ఇటూ అసహనంగా పొర్లుతూ, మనసుని నల్లటి, వికారమైన అసురుల ముఖాలమీంచి తప్పించి, నా భవితవ్యంవైపు, భవిష్యత్తులో నేను సాధించబోయే పేరు ప్రఖ్యాతులు, నా ఆకాంక్ష, బంగారం తాపటం చేసిన నా భవిష్యత్ మార్గాల గురించిన కలలవైపు మళ్లించాను.

భద్రుడు

మేము ప్రధాన భూభాగాన్ని వదిలి వచ్చేశాం. ఆ ప్రదేశాన్ని దోచుకుంటున్న విద్యుజ్జిహ్వుడినీ, అతని అనుచరులనీ రావణుడు

బెదిరించాడు. విద్యుజ్జిహ్వుడు హడిలిపోయి లంకా రాజ్యపు దక్షిణ ప్రాంతాన్ని మాత్రం తనకి ఇమ్మనీ, రావణుడు స్వయంగా గెలుచుకున్న మిగతా భూమండలాన్నంతా ఉంచుకోమనీ సంధి చేసుకునేందుకు ఉద్యుక్తుడయాడు. రావణుడు రాజ్యం మొత్తం తనకే కావాలని అనుకున్నాడు, కాని శూర్పణఖ కోరిక అతనికి అడ్డుపడింది. ఇరుపక్షాలూ విందులూ, వినోదాలలో మునిగి బేరాలు చేస్తూ ఉంటే, సామాన్య ప్రజలు తిండీ, నీళ్ళూ, వైద్యమూ లేక అలమటించసాగారు, కొందరు శోషవచ్చి పడిపోయి చనిపోసాగారు.

ఇంతలోనే నేను భయపడుతున్నట్టుగానే నాకు పిలుపు వచ్చింది. నేను దాచానని అనుకున్న చిన్నపెట్టెలోని ముత్యాలహారం కోసం వెతికాను. 'ఎక్కడికి పోయింది?' ఆ రోజు శిబిరంలో దేక్కుంటూ మంచంమీదికి చేరినప్పుడు దాన్ని నేలమీదకి విసిరేశాను. ఇప్పుడు ఆ హారం వేసుకోకుండా రాజుకి నేను కనిపిస్తే తను ఇచ్చిన కానుకని నేను పట్టించుకోలేదని అనుకుంటాడు, నిజం కూడా అదే! దాన్ని మెడలో వేసుకుని అద్దంలో చూసుకున్నాను. ఆ అద్దం నాకున్న విలువైన ఆస్తుల్లో ఒకటి. అది వేసుకుంటే నేనెలా ఉన్నానో తెలుసుకునేందుకే అద్దంలో నా ప్రతిబింబాన్ని చూసుకున్నాను. సగం తెగిపోయివున్న ముక్కు, ఎడమ బుగ్గమీద అడ్డంగా కత్తిగాటుతో, ఒకటిన్నర చెవితో వికారంగా కనిపించాను. నోరు తెరిచి నవ్వేసరికి, ముందు పళ్లు రెండు ఊడిపోయి, నా ముఖం నాకే నవ్వు తెప్పించేట్టు, అదే సమయంలో భయంకొలిపేట్టూ ఉందని అనిపించింది.

నేను కూర్చున్న మంచంమీదినించి అతికష్టంమీద లేవగలిగాను. వేళ్లతో జుట్టు దువ్వకున్నాను, మండలిసభ జరుగుతున్న శిబిరంవైపు నడిచాను. లోపలికి ప్రవేశించాక నాకు వీలైనంత వంగి, అందరికీ నమస్కరించాను.

"భద్రా, మళ్లీ ఒకసారి అసురజాతి మొత్తం నీమీద ఆధారపడబోతోంది. నీ రాజూ, నీరాజ్యం..." మారీచుడు మృదువైన గొంతుతో, అలా ఏదేదో మాట్లాడుతూనే ఉన్నాడు. వాళ్లు నాకు

ఎటువంటి అసహ్యకరమైన పని అప్పగించబోతున్నారు అనేది మాత్రమే చెపితే బావుండేది. దేశభక్తి, జాతి గౌరవంలాంటి మాటలు విని నాకు చిర్రెత్తుకొచ్చింది, కానీ నా మనసులో ఉన్న తృణీకారాన్ని బైటపెట్టే ధైర్యం నాకు లేకపోయింది. మా రాజ్యంలోని లక్షలమంది నల్లతోలు మనుషుల్లా తెలివితక్కువతనం, నిరక్షరాస్యత అమాయకత్వం వలన నీచమైన జీవితం వెళ్లబుస్తూ లోపల, లోపల లక్షలకొద్దీ తిరుగుబాటు చెయ్యాలన్న కోరికలు బుసలు కొడుతున్నప్పటి కీ, పాలకుల ముందు శాంతంగా, వినయంగా అణకువగా ఉండటం నేర్చుకున్నాను.

నాకు వాళ్లు అప్పగించిన పని విద్యుజ్జిహ్వుడిని తుదముట్టించటం అనేది అర్థం అయేందుకు కొంత సమయం పట్టింది. నా మనసు ఆనందంతో ఉరక లేసింది. బహుశా ఈ మంత్రిమండలి గురించి మరీ త్వరపడి తప్పుగా అర్థం చేసు కున్నట్టున్నాను. ఇది దేవుడే నాకిచ్చిన అవకాశంగా భావిస్తాను. నేను వంగి వాళ్లకి నమస్కరించి, వెనక్కి తిరిగి వెన్నుచూపకుండా బైటికి నడిచాను.

బాగా చీకటిపడే దాకా నేను వేచి ఉండవలసి వచ్చింది. నేను చెయ్యబోయే పని ఉద్రేకపూరితమైనది, ప్రమాదకరమైనది. రహస్యంగా కోటలోకి ప్రవేశించి విద్యుజ్జిహ్వుడిని హత్యచెయ్యటం అంత సులభం కాదు. కానీ అతనిమీద నాకు ఉన్న ద్వేషం, ఒక మంచిపని చెయ్యాలన్న ఆకాంక్షా నన్ను పురికొల్పాయి. సభ వదిలి బైటికి రాగానే ఒరలోంచి బాకు బైటికి తీసి పదునుగా ఉందా లేదా అని పరీక్షించాను.

తెల్లవారక ముందు బాగా చీకటిగా ఉన్న ఘడియలని పని పూర్తి చేసేందుకు ఎంచుకుని సూర్యోదయానికి మూడు ఘడియల ముందు శిబిరం నుంచి బైటపడి వెనక ద్వారం దగ్గర వేచి ఉన్నాను. అక్కడ ఉన్న కాపలాదారుల్లో ఇద్దరు నిద్రపోతున్నారు, కానీ కుర్రవాడిలా ఉన్న మూడోవాడు చేతిలో బల్లెం పట్టుకుని ఆత్రుతగా అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు. బహుశా కొత్తగా పనిలో చేరాడేమో, తన యజమాని మెప్పపొందాలని చాలా ఉత్సాహంగా ఉన్నాడు. అతని పక్కనించి రహస్యంగా నిద్రపోతున్న కాపలాదార్ల దగ్గరకి వెళ్లాను. వాళ్లలో ఒకడి

నడుముకి ఉన్న పట్టీకి కోటద్వారం తాళం చెవులు వేలాడుతున్నాయి. చీకట్లో తడుముతూ ఉంటే తాళాల గుత్తి చేతిలోంచి జారి కిందపడి శబ్దం వచ్చింది. నేను కొయ్యబారి పోయాను. నిద్రపోతున్న కాపలాదారు కదిలాడు కానీ లేవలేదు. వెంటనే ద్వారం దగ్గరున్న పెద్ద స్తంభాల నీడలోకి తప్పకున్నాను. నేను మాయమైనవైపు, చీకట్లోకి ఆ కుర్రవాడు జాగ్రత్తగా చూశాడు. అతనికీ నాకూ మధ్యన కొన్ని అడుగులదూరం మాత్రమే ఉంది. ముందు నావైపు కొన్ని అడుగులు వేసి, తరవాత ఆగిపోయాడు. తన పై అధికారులని లేపాలా, లేక తనే స్వయంగా ఏం జరుగుతోందో పర్యవేక్షించాలా అని తేల్చుకోలేని సంధిగ్ధావస్థలో ఉన్నట్టు కనిపించాడు. చివరికి వాడు నావైపుకి కదిలాడు, కానీ నాకు ఈలోపల ఎంతో సమయం గడిచినట్టు అనిపించింది. వాడు చీకట్లో చూసేందుకు గట్టిగా ప్రయత్నిస్తున్నాడు. అరక్షణంలో నేను ఏదో ఒకటి చెయ్యాలి. మరుక్షణం నా బాకుని వాడి కంఠంలోకి లోతుగా పొడిచేశాను. కిక్కురుమనకుండా నేలకి ఒరిగాడు వాడు.

నేను గబుక్కున వెనక్కి తిరిగి నిద్రలేచిన మిగతా ఇద్దరు కాపలాదారులనీ ఎదుర్కొన్నాను. నా బాకునుంచి రక్తం కారుతూ ఉండటం చూశారు. వాళ్లలో ఒకడు కళ్లార్పకుండా నావైపే చూడసాగాడు. వాడు వెయ్యబోయిన కేక వాడి గొంతులోంచి బైటికి రాలేదు. నేను చప్పుడు చెయ్యకుండా వాడి దగ్గరకి వెళ్లి వాడి గొంతు కోసేశాను. అందరికన్నా అనుభవం ఉన్నవాడిలా కనిపించిన మూడోవాడు, తన కత్తి తీయబోయాడు. నేను వాడిమీదికి లంఘించాను. కానీ వాడు చాలా చురుగ్గా నన్ను బలంగా తన్నాడు. ఆ దెబ్బకి నేను వెల్లకిలా పడిపోయాను. వెంటనే వాడు కత్తి పైకి ఎత్తి నా గుండెల్లో బలంగా పొడవబోయాడు. నా పని అయిపోయిందని అనిపించింది, కానీ ఇక నాకు పోయేదేమీ లేదు అనుకుని నా బాకుని విసురుగా వాడి ముఖంమీదికి విసిరాను. వాడు భయంకరమైన భంగిమలో అలాగే కొయ్యబారి పోయాడు. బాకు వాడికి తగలలేదేమో అనుకుని నాకు భయం వేసింది. అప్పుడు చూశాను, బాకు మొన వాడి

ఎడమకంట్లో గుచ్చుకుని వాడి ముఖం వంకరపోయి వికారంగా కనిపించింది. ఒక్కసారి నిలువెల్లా వణికిపోయి వాడు నామీదికి ఒరిగిపోయాడు. వాడి కత్తి మట్టిలో దిగింది, కొద్దిలో నా తలకి తగలకుండా తప్పించుకున్నాను. నేను పొట్టిగా ఉండటంవల్ల కూడా లాభాలు ఉన్నాయి. ఆ భారీకాయం కిందినుంచి లేచి, వాడి కంట్లోనుంచి బాకుని బైటికి లాగాను.

అప్పుడు వినిపించింది నాకు ఎవరిదో అడుగుల చప్పుడు. మిగతా భటులు ఏం జరిగిందో చూసేందుకు వస్తున్నారు. నేను హడావిడిగా పారిపోయేందుకు దారి వెతుకుతూ తాళం చెవులతో ద్వారాన్ని తెరిచేందుకు ప్రయత్నించాను. 'తాళం ఎంతకీ తెరుచుకోలేదు.' అరచేతులకి చెమటలు పట్టాయి, భయంతోనూ, ఉద్రేకంతోనూ కంపించాను. 'సరైన తాళంచెవి ఏది?'

"ఏయ్, ఎవరది?" ఎవరో కేకపెట్టారు. నేను మళ్లీ తడబడే వేళ్లతో తాళంచెవి వెతకసాగాను. నా మెడకి రెండు అంగుళాల దూరంనించి ఒక బాణం దూసుకుని వచ్చి ద్వారానికి గుచ్చుకుంది. అదిరే దాని రెండోకొస నా చెవులని గింగుర్లెత్తించింది. తరవాత ఇంకొక బాణం నా ఎడమ భుజంపక్కనించి రయ్యిమని దూసుకుని వచ్చింది. దాని ఈకలు నా భుజాన్ని ముద్దాడాయి. నావైపు ఎవరో పరుగెత్తుకు వస్తూన్న చప్పుడు వినిపించింది, కానీ ఈలోపల తాళం తెరుచుకుంది. నేను కోటలోపలికి దూరుతూ ఉండగా ఒక బాకు వచ్చి పెద్ద శబ్దం చేస్తూ రాగి ద్వారబంధానికి తగిలింది. తాళం చెవులు వెనక్కి తీసుకుని నేను ద్వారాన్ని మూసేశాను. వాళ్లు అవతలివైపునుంచి ద్వారాన్ని నెడుతున్నారు, కానీ నా శక్తినంతా ఉపయోగించి, నేను ద్వారాన్ని మూసి నొక్కి ఉంచాను. చివరికి తాళం బిగించటంలో కృతకృత్యుడనయాను. ఆ తరవాత ప్రాణాలు అరచేత పెట్టుకుని పరిగెత్తాను.

కోటలో చాలాచోట్ల కాగడాలు వెలిగించటం చూశాను. భవనంవైపు, పై అంతస్తులో ఉన్న రాజు మందిరంవైపు పరిగెత్తాను. గోడకి

వేలాడుతున్న తీగలసాయంతో పైకి ఎగబాకి, పిల్లిలా వసారాలోకి దూకాను. నాది కూడా ఒక విధంగా కసరత్తు చేసినట్టు బలిష్టంగా ఉండే శరీరమే. ఆ మందిరంలో ఉన్న కాపలాభటులు ప్రాకారం అంచుమీది నుంచి వంగి, కింద జరిగే కోలాహలం ఏమిటని చూడసాగారు. వాళ్లిద్దరినీ అంచుమీదినించి తోసి కింద పడవేసి మందిరం ద్వారాలు ఒక్కతోపుతో తెరిచాను. చేతిలో బాకుతో సిద్ధంగా నిలబడ్డాను కానీ ఏమీ జరగలేదు. ఎక్కడా ఎటువంటి కదలికా లేదు.

మంచంమీద నల్లటి ఆకారం పడుకుని ఉంది. పక్కనే చిన్న నూనెదీపం మినుకు మినుకుమంటోంది. తలుపు చప్పుడు కాకుండా మూసి, గడియపెట్టాను. నెమ్మదిగా దీపం దగ్గరకి వెళ్లి వత్తిని పైకి లాగి దీపం పెద్దది చేసేందుకు ప్రయత్నించాను. రాకుమారి శూర్పణఖ! 'ఆ త్రాష్ట్రుడు ఏడీ? పారిపోయాడా?' నాకు నిరాశ కమ్ముకుంది. నేను ఇక్కడ ఉంటే ప్రతిక్షణం మృత్యువు దగ్గర పడుతుంది. నిస్పృహతో గావుకేక పెడదామనుకుంటూ ఉండగా చిరుగజైలు మోగినట్టు ఎవరో కిలకిలా నవ్వటం వినబడింది. అది చాలా అస్పష్టంగా ఉన్నప్పటికీ కోసుదూరం నుంచైనా ఆ నవ్వుని నేను గుర్తుపట్టి ఉండేవాడిని. 'మాల? తను ఇక్కడ ఏం చేస్తోంది?' పొంచి ఉన్న వన్యమృగంలా ఆ నవ్వు వింటూ ఉండిపోయాను. అది పక్కమందిరంలోంచి వస్తోందని పసికట్టాను. వెంటనే మాల విద్యుజ్జిహ్వుడితో ఉందన్న విషయం అర్థమైంది. ఆ మందిరంలోకి వెళ్లే దారి ఎక్కడ ఉందా అని ఆత్రుతతో వెతికాను. భటులు నాకోసం వెతుకుతూ వస్తున్న చప్పుడు వినిపించింది. నేను తప్పించుకునే అవకాశం క్షణం క్షణం సన్నగిల్లుతోందని గ్రహించాను. ఎవరో తలుపు తట్టారు. మంచంమీద ఉన్న రాకుమారి కదిలింది. నేను గోడకి అతుక్కుపోయాను. ఆమె కళ్లు తెరిచి ద్వారంవైపు చూసింది. పక్కనే తన భర్త ఉన్నాడనుకుని చేతో తడిమి చూసి, అతనక్కడ లేకపోవటంతో నొసలు చిట్లించింది. తలుపుల మీద బాదటం ఎక్కువయింది. నేను పక్క మందిరంలోకి వెళ్లే ద్వారం తలుపల గడియకోసం వేళ్లతో ఆత్రుతగా వెతకసాగాను.

"ఎవరది?" అని అడిగిందామె.

"ఎవరో మీ గదిలోకి వచ్చారు, రాకుమారీ!" అని అరిచింది ఒక గొంతు. నా గుండె దడదడలాడింది. తను విన్నది ఏమిటో అర్థం అయేందుకు ఆమెకి కొంత సమయం పట్టింది. అప్పుడు మెల్లిగా లేచికూర్చుని, తటపటాయిస్తూ మంచం దిగి ద్వారంవైపు నడిచింది. 'నా పని అయిపోయింది!' అనుకున్నాను. భటులు రాకుమారిని పక్కకి నెడుతూ లోపలికి దూసుకొచ్చారు. నా చేతికి రహస్య ద్వారం గడియ తగిలింది. వెంటనే దాన్ని బలంగా లాగి తెరిచాను. తలుపు తెరుచుకుంది. నేను వెల్లకిలా పడిపోయాను. అసంకల్పితంగా తలుపుని కాలితో తన్ని మూసేశాను, లేచి దాన్ని గడియపెట్టాను. మరుక్షణం వెనక్కి తిరిగాను. అక్కడ నా ప్రియురాలితో విద్యుజ్జిహ్వుడు కనిపించాడు. ఇద్దరూ నన్ను చూసి హడలిపోయి కొయ్యబారిపోయారు.

బైట భటులు తలుపు బాదసాగారు. ఏ క్షణాన్నైనా వాళ్లు తలుపు బద్దలుకొట్టి లోపలికి రావచ్చు. నేను ఎడమచేతో మాల ముఖంమీద బలంగా కొట్టేసరికి ఆమె మూడడుగుల దూరంలో ఉన్న గోడకి వెళ్లి కొట్టుకుంది. నేను విద్యుజ్జిహ్వుడిమీదికి లంఘించి అతని పొత్తికడుపు మీద కూర్చున్నాను. నవ్వు ఆపుకోలేకపోయాను. నాలో అంత కసీ, కోపం ఉన్నాయని అనుకోలేదు నేను. విషం పూసిన కత్తితో అతన్ని ముఖాన్ని ఎడాపెడా గాయపరిచాను.

తన ప్రియుడిని కాపాడేందుకు మాల నా వీపుని గోళ్లతో రక్కటం కాని, భటులు తలుపులు తీసేందుకు లాగటం కాని నాకు తెలీలేదు. రాకుమారి కెవ్వుమని అరిచినపుడు కాని నేనీలోకంలోకి రాలేదు. భటులు ఆ దృశ్యాన్ని చూసి నిర్ఘాంతపోయి నామీద దాడిచెయ్యటం కూడా మరిచిపోయారు. రాకుమారి కేక పెట్టటానికి కారణం తన భర్త హత్యకి గురవటమా, లేక అతను నమ్మకద్రోహం చేశాడనా అని నాకు ఇదమిత్థంగా తెలీలేదు. ఆమెమీద నాకు జాలి కలిగింది. నా ఒళ్లు రక్తంతో తడిసిపోయింది, బాగా అలసిపోయాను.

ఇంతలో శూర్పణఖ గొంతు చించుకుని అరిచింది, "భద్రా... భద్రా! మా అన్న నా భర్తని చంపమని నిన్ను పంపించాడు కదూ? రావణా... ఎందుకు... ఎందుకలా చేసావు?? అంటూ తన తలని రెండు చేతులతోనూ బాదుకుంది.

భటుల దృష్టి కేకలు పెడుతున్న రాకుమారివైపు మళ్లింది. కిటికీ తీసి ఉంది, మరుక్షణం నేను కిటికీలోంచి బైటికి దూకేశాను. నేను కిందికి పడిపోతూ ఉంటే భటుల నాయకుడు అరిచాడు. నేను ఒక పెద్ద అశోకవృక్షం కొమ్మలకి కొట్టుకుని నేలమీదికి దొర్లిపోయాను. అప్పుడు నాకు తెలీలేదు కాని అలా పడటంవల్ల నా మూడు పక్కటెముకలూ, ఎడమచెయ్యి విరిగిపోయాయి. కానీ ఆ సమయంలో అదేమీ నాకు పట్టలేదు. ప్రాణాలు అరచేత పట్టుకుని పరిగెత్తాను. నా యజమాని కోసం, మా జాతికోసం, నా రాజ్యంకోసం, నాకోసం ఒక గొప్ప కార్యాన్ని సాధించానన్న ఉత్సాహం నాలో ఉరకలు వేసింది. అన్నివైపులనుంచీ బాణాలు దూసుకుని వచ్చాయి, కానీ ఆశ్చర్యకరంగా ఒక్కటి కూడా నాకు తగల్లేదు. ఉత్తరాన ఉన్న గోడలో ఒకచోట సందు ఉందని నాకు తెలుసు. అక్కడికి చేరుకోగలిగితే నేను సముద్రంలోకి దూకెయ్యవచ్చు. నాలో మిగిలిఉన్న శక్తినంతా కూడదీసుకుని పరిగెత్తాను. ఇంకొన్ని అడుగులు, ఇంకా కొన్ని అడుగులు, అంతే సముద్రం తల్లిలా నన్ను తన అక్కున చేర్చుకుంటుంది. గోడలో ఉన్న సందు దగ్గరకి చేరుకునేసరికి వింత భావన కలిగింది- ఎవరూ నన్ను తరమటం లేదు. 'ఇది కలా?' ఆగి వెనక్కి చూసేందుకు భయం వేసింది.

ఇంతలో శంఖాలు ఊదుతున్న చప్పుడు వినిపించింది. ఆశ్చర్యంతో ఆగి వెనక్కి తిరిగి చూశాను. కోట ముఖద్వారం బార్గా తెరిచి ఉంది. ఆ ద్వారంగుండా ఒక ఊరేగింపు లోపలికి ప్రవేశించింది. ఒక ఏనుగు మీద రావణుడు సవారీ చేస్తున్నాడు, చక్రవర్తిలాగ. అతనివెంట ఏనుగులు, గుర్రాలు, రథాలు, కాల్బలాలూ, సంగీత విద్వాంసులూ, అందరూ వైభవంగా తరలి వస్తున్నారు. ఢంకాలు వాయిస్తున్నారు, బాకాలు ఊదుతున్నారు, కంచు తప్పెటలు మోగిస్తున్నారు. విద్యుజ్జిహ్వుడి

భటులు ఒక్కరొక్కరుగా తమ ఆయుధాలని కిందపెట్టసాగారు. 'జయ జయ శంకరా! హరహర మహాదేవ! రావణుడికి జయము జయము! విజయం! చివరికి విజయం లభించింది!' ఇందులో నా పాత్ర ఉంది. గర్వంతో నా ఛాతీ ఉప్పొంగింది. నా శరీరం బాధపెడుతున్నా పట్టించుకోకుండా ఆ ఊరేగింపవైపు పరిగెత్తాను.

అక్కడికి చేరుకుంటూ ఉంటే నాకు సిగ్గేసింది. నేను గోచీ మాత్రమే ధరించి ఉన్నాను. నల్లగా, వికారంగా ఉన్నాను. ఒళ్లంతా రక్తం కారుతున్న గాయాలతో నిండి ఉంది. వీళ్లంతా అసుర సంస్థానాధిపతులు. గొప్ప ఊరేగింపుతో తరలి వస్తున్నారు. వాళ్లు వచ్చేదారికి అడ్డంగా ఊగుతూ నిలబడిన నావైపుకి ఇద్దరు సైనికులు పరిగెత్తుకుంటూ వచ్చి, ఆ విజయోత్సాహంతో నిండిన ఊరేగింపు దారిలోంచి నన్ను పక్కకిలాగి పడవేశారు. సిగ్గుతో చితికిపోతూ, నమ్మకద్రోహం చేశానన్న భావం నా మనసుని పట్టిపీడిస్తూంటే అలాగే ఉండిపోయాను. పట్టపు ఏనుగు మెడలోని గంటల నాదం దగ్గరగా వస్తున్నట్టు గ్రహించి తలపైకెత్తి చూసేసరికి రావణుడు నావైపు చూడటం కనిపించింది. 'అతని ముఖంలో ఉన్నది అసహ్యమా, ద్వేషమా లేక కృతజ్ఞతా?' రావణుడు నన్ను గుర్తు పట్టనట్టే ఉండి పోయాడని అనిపించింది.

నేను వికటాట్టహాసం చేస్తూ మళ్లీ గుంటలో పడిపోయాను. సూర్యోదయమై కొంతసేపటికి ఎండ తీవ్రంగా మారి ఉక్కపోయటం మొదలుపెట్టాక, నా గుడిసెకి కాళ్ళీడ్చుకుంటూ వెళ్లగల శక్తిని పుంజుకోగలిగాను. నా చుట్టూ సంబరాలు జరుపుకుంటున్న సందడి వినవచ్చింది. నేను గుంటలో పడి ఉండగా కొందరు నావైపు నాణాలు రువ్వారు. మొదట కొంచెం సంకోచించినా తరవాత వాటిని ఏరుకున్నాను. గాయాలు సలపటం ఎక్కువ అవటంవల్ల ఇంక కొన్ని రోజులవరకూ ఏ పనీ చెయ్యలేనని అనిపించింది. ఈ నాణాలు నాకు బాగా ఉపయోగపడతాయి. అంతటా పండగ వాతావరణం నెలకొంది. చక్రవర్తీ, రాజులూ, సంస్థానాధిపతులూ, అందరూ ఆనందంగా

ఉన్నారు. వాళ్లు విజయం సాధించారు. కానీ నేను నా గుడిసెకి పోవాలి, ఆ కొంపలో దూరి నా గాయాలకి నేనే మందు రాసుకుని నయం చేసుకోవాలి. కృతఘ్నురాలైన స్త్రీని సంబాళించుకోవాలి, జీవికకోసం ధనం సంపాదించుకోవాలి. నా ఉద్దేశంలో చక్రవర్తికి జరిగే రాజ్యాభిషేకం కన్నా ఇవే ఎక్కువ ముఖ్యమైనవి. అందుకే నడక కొనసాగించాను.

21. చీకటిపుత్రుడు

రావణుడు

ఆమె పిచ్చిపట్టినట్టు ప్రవర్తించింది. శూర్పణఖ నా ముఖాన్ని చేతులతో కొట్టి, రక్కి గాయపరిచింది. తన దగ్గరకి రావటానికి ప్రయత్నించిన వారినందరినీ పళ్లతో కసితీరా కొరకబోయింది. జుట్టంతా చెదిరిపోయి, బాధతో ముఖం కమిలిపోయి, ఆమె నన్నూ. లంకలోని నా మంత్రులనీ శాపనార్థాలు పెడుతూ ఉండి ఉండి తన రొమ్ముని పిడికిళ్లు బిగించి బాదుకోసాగింది. వేటకుక్కలా విద్యుజ్జిహ్వుడి శవంపక్కనే కూర్చుని కాపలా కాసింది. పురోహితుడిని దగ్గరకు రానివ్వలేదు, శవంమీద లేపనాలు తనే స్వయంగా పూసింది. శవానికి కొత్త దుస్తులు తొడిగింది, ఆ పనులు చేస్తున్నంతసేపూ మమ్మల్ని శాపనార్థాలు పెడుతూనే ఉంది, ముఖ్యంగా నన్ను. ఆమెని ఓదార్చాలని నాకు అనిపించలేదు. నిజమే, ఆమె భర్త చనిపోవాలని కోరుకున్నాను, దానికి నేనే బాధ్యుడిని. కానీ అతనికి అది తగిన శిక్షే. ఎప్పుడైతే నా సింహాసనాన్ని అన్యాయంగా లాక్కున్నాడో ఆనాడే అతనికి చావు మూడింది. కోరి తెచ్చుకున్నాడు చావుని.

నాకోసం ఆపని భద్రుడు చేశాడు. ఈ మొత్తం వ్యవహారంలో నాకు రోత కలిగించిన విషయం ఆ మూర్ఖుడికి నేను రుణపడి ఉన్నాను అన్నదే. 'అసలు నేను అనుకుంటున్నది సరైనదేనా? వాడు కేవలం ఒక బానిస, చెప్పింది చెయ్యటమే వాడి పని, అంతే?' నా బావ శవంవైపు చూశాను. శవాన్ని వాళ్లు శుభ్రం చేశారు, అయినా ఇంకా భయంకరంగానే ఉంది. మొదటిసారి ఆ శవాన్ని చూసినప్పుడు నాకు వాంతి అయినంత పనయింది. అలాంటిపని చెయ్యటానికి ఎవరికైనా ఎంతో వక్ర బుద్ధి ఉండాలి. భద్రుడు ఎలాంటి మనిషి? ఛీ, అసహ్యం వేస్తోంది! కెవ్వుమన్న కేక నా ఆలోచనలకి భంగం కలిగించింది. నేను

ఉలిక్కిపడ్డాను. శూర్పణఖ తల నేలకివేసి బాదుకుంటోంది.

ఆమె వెనక కాస్త కీచుగొంతుతో ఏడుస్తూ మా అమ్మ నిలబడి ఉంది. అమ్మ ఇంత త్వరగా అక్కడకి వస్తుందని నేను ఎదురుచూడలేదు. "ఇప్పుడు తృప్తిగా ఉందా నీకు? రక్త పిపాసి రాక్షసుడా?" అంది నాతో. హఠాత్తుగా అమ్మ అలాంటి మాటలు అనేసరికి నా ముఖం పాలిపోయింది. "నీ సొంత చెల్లెలిని విధవని చేసేశావు. నువ్వు నా కడుపున చెడబుట్టావు కదరా! నిన్ను కన్నందుకు సిగ్గు పడుతున్నాను."

కోపం పట్టలేక విరుచుకు పడకుండా ఉండేందుకు పిడికిళ్లని బిగించాను. ఆమె అంటున్న ఒక్కొక్క మాటకీ శూర్పణఖ ఏడుపు తారాస్థాయికి చేరుకోసాగింది. "నిరంకుశుడా... కుక్కా... నా కూతుర్ని ఇలా ఏడిపించినందుకు ఇంతకు ఇంతా అనుభవిస్తావు చూస్తూ ఉండు... చాలా పెద్ద మూల్యం చెల్లిస్తావు." అలా అరగంటసేపు నన్ను శాపనార్థాలు పెడుతూనే ఉంది ఆవిడ. మరోవైపు తన అల్లుడి గుణగణాలని పొగడసాగింది. ఆ ప్రహసనంలోకి నన్ను కూడా ఒక పాత్రధారిని చేసి ఉండకపోతే, అది నాకు నవ్వు తెప్పించి ఉండేదే. "నీకు అధికారమదం తలకెక్కింది. గొప్పపనులు చెయ్యాలన్న ఆకాంక్షతో అన్నీ మరిచిపోయావు. నన్ను చంపు! చంపరా, నన్ను కూడా చంపెయ్యి. నీ రాజకీయ విజయాలమెట్లు ఎక్కేందుకు నన్ను తొక్కుకుంటూ వెళ్లు. నా ముసలి శరీరాన్ని ఉపయోగించుకో." అలా అంటూ అమ్మ తన తలనీ, రొమ్మునీ బాదుకోసాగింది. తరవాత నా గుండెలమీద పిడికిళ్లతో గుద్దటం మొదలుపెట్టింది.

మా నాన్నకూడా వచ్చి ఒక మూల కూర్చున్నాడు. ఎప్పుడూ తనవెంటే ఉండే ఇద్దరు బ్రాహ్మలతోనూ ఏదో చర్చించటంలో మునిగిపోయాడు. తన అల్లుడికి దేవతల తరహా అంత్యక్రియలు చెయ్యాలని అనుకుంటున్నాడు. అందులో అస్పష్టమైన ఏవో ఆచారకర్మలూ, బ్రాహ్మణులకి దక్షిణా అవీ ఉంటాయి. ఏదోవిధంగా ఆ తతంగం ముగిసిపోతే చాలని నేను అనుకున్నాను.

శూర్పణఖ ప్రవర్తన ఎంత ఇబ్బంది కలిగించినప్పటికీ, కుంభకర్ణుడితో పోలిస్తే అది తక్కువే అనాలి. యమకూపంలో బందీగా ఉండటం వాడిలో ఘోరమైన మార్పు తీసుకువచ్చింది. ఎప్పుడూ నల్లమందు మత్తులోనే ఉంటున్నాడు. దాదాపు రోజంతా నిద్రపోతూ, నిద్రలేస్తే రభస చేస్తూ ఉంటాడు.

నాకు నా చెల్లిని చూస్తే జాలివేసింది. ఎంతైనా ఆమె భర్త చనిపోయాడు. నా గురించి ఆమె అలా అనుకోవటం భావ్యమే. పాపం! 'నేను మరీ అంత క్రూరంగా ప్రవర్తించి ఉండవలసినది కాదేమో!' ఆమె భర్తని కారాగారంలో పెడితే సరిపోయేది. దానితో రాజీ పడిపోవలసింది.

విద్యుజ్జిహ్వుడి ముఖాన్ని కత్తితో అడ్డదిడ్డంగా నరికేశాడు భద్రుడు. నాకు వాడిమీద చెప్పలేనంత అసహ్యం వేసింది. 'ఇలాంటి పని ఎలా చెయ్యగలిగాడు వాడు? ఒక అసురజాతి సజ్జనుడిని అడవి జంతువుని చంపినట్టు, అలా నరికి పారేశాడు! అదీ నీచజాతి క్రిమిలాంటి ఆ తుచ్ఛుడు చేసిన పని అది!' వాడికి ఆపని అప్పగించినందుకు నేనంటే నాకే సిగ్గువేసింది.

వాడు సాధించిన విజయంలో శౌర్యం ఏమీ లేదు. 'నేను కూడా పనికిమాలిన వాడినే భద్రుడికన్నా మెరుగైనవాడినేమీ కాను. అసలు నేను ప్రహస్తుడి మాట ఎందుకు విన్నాను! పెద్ద ధర్మపరుడినని అనుకున్నాను. హా, శివా! నా చెల్లెలికి ఎంత ద్రోహం చేశాను?' ఆమెకి ఉన్నఆ కాస్త సంతోషాన్ని కూడా తుడిచిపెట్టేశానే? ఈ సామ్రాజ్యం సంపాదించుకోవటానికి ఆ పని చెయ్యటం ఉచితమేనా? నా ఆకాంక్షని తృప్తి పరచేందుకు లంక గాని, ఈ పూర్తి భూమండలం గాని సరిపోతుందా? నా వాళ్ల శవాలమీద నేను నిర్మించబోయేది ఏమిటి? ఇంకా ఎన్ని మరణాలకి నేను బాధ్యత వహించాల్సి ఉంటుంది? ఆ కొండ అంచున ఏ క్షణాన్నైనా పడిపోయేట్టు ఊగిసలాడే ఆ గుడిసెలో ఉన్నప్పుడే మేమందరం ఇంకా సంతోషంగా జీవించలేదా? జీవితంలో పెరిగి పెద్దవారయి, చిన్నతనంలో కన్న కలలని నిజం చేసుకోవటమే జీవితంలోని అతిపెద్ద విషాదం.

అలా అపరిపక్వమైన వేదాంత ధోరణిలో ఆలోచిస్తున్న నా ముఖంపైన ఎవరో గట్టిగా కొట్టటంతో నేను ఈ లోకంలోకి వచ్చాను. కళ్లు తిరిగి, కింద పడబోయాను. కొంతసేపు నా కళ్లు బైర్లు కమ్మి మెదడు మొద్దుబారింది. లేచి నిలబడదామని ప్రయత్నించేలోపల నా తొడల మధ్య ఎవరో గట్టిగా తన్నారు. "ఓరీ, దుర్మారుడా!" అని కుంభకర్ణుడు అరవటం ఎక్కడో బావిలోపలినుంచి వచ్చినట్టు వినిపించింది. నిలబడపోయేసరికి తల గిర్రున తిరిగింది. ఇంతలో మళ్లీ నన్ను కాళ్లతో తన్ని కింద పడవేశాడు వాడు. నా కళ్లు వాచాయి, పెదవులు చిట్లిపోయాయి. ఎలాగో కష్టపడి లేచి నిలబడ్డాను. గది మధ్యలో ఉన్న స్తంభాన్ని పట్టుకుని, ఎలాగో కష్టపడి పడిపోకుండా నిలబడగలిగాను. నెమ్మది నెమ్మదిగా నా కళ్లకి చుట్టూ ఉన్నది మొత్తం కనిపించటం మొదలుపెట్టింది.

మారీచుడు ముగ్గురు భటుల సాయంతో కుంభకర్ణుడిని నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నాడు. కుంభకర్ణుడు నల్లమందు మత్తులో ఉన్నాడు. రక్తం కళ్లజూసేందుకు సిద్ధంగా ఉన్నట్టు కనిపించాడు. వాళ్లపట్టువిడిపించుకుని నామీదికి లంఘించేందుకూ, నన్ను మళ్లీ తన్నేందుకూ ప్రయత్నించాడు కానీ అది సాధ్యం కాలేదు.

నేను పక్కకి తిరిగి చూసేసరికి మా నాన్నా, ఆయనవెంట ఉన్న ఇద్దరు లావుపాటి బ్రాహ్మణులూ నన్ను చూసి వ్యంగ్యంగా నవ్వుతూ, ఆనందిస్తున్నట్టు కనబడ్డారు. మా అమ్మ అతినాటకీయత ప్రదర్శిస్తూ చేతులతో తల బాదుకోసాగింది. శూర్పణఖ ఏ భావమూ లేకుండా శిలలా శూన్యంలోకి చూస్తూ ఉండిపోయింది. కొందరు భటులు నవ్వు వస్తున్నా ఆపుకునేందుకు ప్రయత్నిస్తూ మామూలుగా ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. సమాజంలోని అట్టడుగు వర్గాలకి మా కుటుంబ కలహాలు కుతూహలాన్ని కలిగిస్తాయి. సాయంకాలానికల్లా జరిగిన సంఘటనకి చిలవలూ పలవలూ జోడించి నగరంలో జనం అందరూ చెప్పకుంటారు. శరీరానికి బాధ కలిగించే ఈ దెబ్బలకన్నా జరగబోయే అవమానాన్ని తలుచుకుని నేను విలవిలలాడి పోయాను.

నా ముఖం క్రమంగా నల్లబడటం చూసి మారీచుడు నా తమ్ముడిని బైటికి ఈడ్చుకుపోయాడు. వాడిని అక్కడికక్కడే హతమార్చి ఉందును, కానీ నాలోని అపరాధభావం నన్ను కదలనివ్వలేదు. నరనరానా అవమానం, అపరాధభావం కాల్చివేస్తూంటే అలా నిలబడిపోయానే తప్ప ఒక్క అంగుళం కూడా కదలలేదు. కుంభకర్ణుడు, నా ఆకాంక్షల గురించీ, నన్ను నేను ఎంతో గొప్పగా అనుకోవటం గురించీ, నాలోని స్వార్థం గురించీ, సామాన్య జనులపట్ల నాకు ఉన్న ఏహ్యభావం గురించీ, పనికిమాలిన నా అహంకారం గురించీ, నాలో నిజంగా ఉన్న దుర్గుణాల గురించీ, ఉన్నాయని వాడు ఊహించుకుంటున్న దుర్గుణాల గురించీ ఇంకా అరుస్తూనే ఉన్నాడు. నన్ను శాపనార్థాలు పెడుతూ నా చావుని కోరుకోసాగాడు.

ఇంక దాన్ని భరించలేక, నా గదిలోకి వెళ్లి స్పృహ కోల్పోయే వరకూ మద్యం తాగాలనుకున్నాను. వెనుతిరిగి తోటవైపు చూశాను. అక్కడ పవిత్రుడైన నా తమ్ముడు విభీషణుడు పద్మాసనం వేసి, కళ్లు మూసుకుని, ముఖంలో ఎంతో సంతృప్తి కనబరుస్తూ మూర్ఖుడిలా కూర్చుని ఉండటం కనిపించింది. 'మొత్తం కుటుంబమంతా విపరీతమైన వేదనతో తల్లడిల్లుతూ ఉంటే వీడికి ఇంత తృప్తీ, ఆనందం ఎక్కడినుంచి వస్తున్నాయి?' వాడి దగ్గరకి వెళ్లి వాడి ముఖంమీద చెరగకుండా ఉండిపోయిన ఆ కృత్రిమమైన చిరునవ్వుని తుడిపి వెయ్యాలని అనిపించింది. కానీ మా వంశంలో ఎవరికీ హాని చెయ్యనివాడు వాడొక్కడే నేమో! వాడికి పెద్ద పెద్ద ఆకాంక్షలనేవి ఏ కోశానా లేవు. ఎప్పుడూ తనపట్ల సంతృప్తితో, జీవితం నుంచీ, జీవితం సృష్టించే కష్టాలనుంచీ దూరంగా, తామరాకుమీద నీటిబొట్టులా జీవిస్తాడు. కుంభకర్ణుడూ, శూర్పణఖా, మా అమ్మా నేను చాలా సులభంగా భావోద్రేకాలని ప్రదర్శిస్తాం. అందుకే అందరికన్నా చిన్నవాడు భిన్నంగా ఉండటం మాకు బాగానే ఉందని అనిపిస్తుంది. నాది సరళ స్వభావం కాదు, తమ్ముడిలో ఆ సంతృప్తినీ, నిరాడంబరంగా జీవించే పద్ధతినీ చూస్తే నాకు అసూయవేస్తుంది. బహుశా ఎటువంటి అత్యాశలూ లేని

జీవితమే అసలైన జీవితమేమో! అలా జీవించటమే మంచిదేమో! కానీ కావాలని అనుకున్నా విభీషణుడిలా నేను ఉండలేను. అయినా నేను నేనులా... రావణుడిలా కాక ఇంకెవరిలాగో ఉండాలని ఎన్నడూ అనుకోలేదు.

నేను నిటూర్చి నా తమ్ముడిని వాడి పరమానందకరమైన మూర్ఖత్వంలో వదిలి నా మందిరంలోకి నడిచాను. నాకు మద్యం తాగాలనిపించింది. లోపలికి వెళ్లగానే మండోదరి మంచంమీద కూర్చుని ఉండటం కనబడింది. మెరిసిపోయే దుస్తులు వేసుకుని, వజ్రాలు పొదిగిన బంగారు నగలతో ధగధగ మెరిసిపోతూ, నడయాడే కోశాగారంలాగ ఉందామె. నన్ను చూడగానే ఆమె ముఖం వెలిగిపోయింది.

వెంటనే ఏదో అపరాధభావం నన్ను చుట్టుముట్టింది. నామీద నాకే అసహ్యం వేసింది. వేదవతి తెల్లని ముఖం నాకు ఇంకా స్పష్టంగా జ్ఞాపకం ఉంది, ఆమెని నా భార్యతో పోల్చకుండా ఉండలేకపోయాను. మండోదరి కూడా అందమైనదే, కానీ ఆమె ముఖంలో కాఠిన్యం ఉంటుంది. పైగా ఆమెలో స్త్రీ సహజమైన శృంగార భావం, సొగసూ బొత్తిగా లేవు. ఆమె దాదాపు విరాగినిలా ఉంటుంది. ఆమె అంటే నాకు జంకూ, భయమూ, నా ఆత్మని ఆమె అద్దంలో చూపిస్తున్నటూ, దాగి ఉన్న వికారమైన మచ్చలూ, కురుపులూ అందులో కనిపిస్తున్నట్టూ అనిపిస్తుంది నాకు. నా భయాన్ని దాచుకునేందుకు కోపాన్నీ, అసహ్యాన్నీ ప్రదర్శించాను. దీర్ఘకాలంపాటు యుద్ధాలు చేస్తున్నప్పుడు కాని, చివరికి కార్తవీర్యార్జునుడి చీకటి భూగృహంలో బందీగా ఉండగా ప్రాణాలు కాపాడుకునేందుకు పోరాడుతున్నప్పుడు కాని, ఒకసారి కూడా నాకు మండోదరి జ్ఞాపకం రాలేదన్న విషయం తలుచుకుంటే నాకు ఆశ్చర్యం వేసింది. నేను తహతహలాడింది వేదవతినీ, నా మొదటి సంతానాన్నీ చూడాలని మాత్రమే.

నేను ఇబ్బందికి గురై అలా నిలబడిపోయేసరికి ఆమె దీనంగా నవ్వుతూ లేచినిలబడింది. నవ్వటంవల్ల ఆమె ముఖం పూర్తిగా

వెలుగుతో నిండింది. నేను ఆమెవైపు సూటిగా చూడలేకపోయాను. బైటికి దృష్టి సారించాను. నా తమ్ముడు ఇంకా ధ్యానంలో ఉండటం చూసి నాకు ఇంకా ఎక్కువ కోపం వచ్చింది. మళ్లీ వెనక్కి తిరిగేసరికి ఆమె నాకు చాలా దగ్గరకి వచ్చేసింది. ఆమె శరీరం నుంచి మల్లెపూవులూ, కర్పూరమూ కలగలిసిన సువాసన వస్తోంది. ఆమె కళ్లు కన్నీళ్లతో నిండాయి. కనురెప్పలు అల్లల్లాడాయి. ఆమె సిగ్గుపడుతున్నట్టు అమాయకంగా అనిపించింది. ఆమెని హత్తుకుని అందమైన కళ్లలోని కన్నీళ్లు తుడవాలని నాకు అనిపించింది, కానీ నా శరీరం కదల్లేదు. ఏదో అజ్ఞాతశక్తి నన్ను ఆపింది.

"మద్యాన్ని ఎక్కడ పెట్టావు?" నా మాట నాకే మోటుగా తోచి చూపులు మరల్చుకున్నాను. ఆమెకి బాధ కలిగిందని తెలుసు, అందుకే ఆమెవైపు చూడాలని అనిపించలేదు. ఆసనంవైపు నడిచి, కూర్చుని పైకి చూడసాగాయి. 'ఆమెకి ప్రస్తుతం ఏమనిపిస్తోంది? విద్యుజ్జిహ్వుడు ఆమెపట్ల ఎలా ప్రవర్తించాడు? ఆమెకి నేను గుర్తుకొచ్చి ఉంటానా?' నాలో వందలకొద్దీ ప్రశ్నలు సుడులు తిరగసాగాయి, కానీ నేను మౌనంగా ఉండిపోయాను. నేను చేసిన యుద్ధాల గురించి గొప్పలు చెప్పాలని అనిపించింది, నేను చూసిన దృశ్యాలని ఆమెకి వర్ణించి చెప్పాలని అనిపించింది, దేవతలు నివసించే విచిత్రమైన, అద్భుతమైన ప్రదేశాలగురించీ, ఓడిపోయిన తెగలగురించీ, బందీ అవటంలోగల బాధగురించీ, వానరరాజు వాలి చేతిలో అనుభవించిన పరాజయంగురించీ, ఇంకా ఒక బ్రాహ్మణజాతి దేవతా స్త్రీతో నా ప్రేమ వ్యవహారం గురించీ చెప్పాలని అనిపించినప్పటికీ, నేను పైకి చూస్తూ అలా కూర్చుని ఉండిపోయాను.

మండోదరి నాకోసం ద్రాక్లాసవం పోసి, పట్టెమంచం నీడల్లోకి వెళ్లిపోయింది. ఒక్కమాట కూడా మాట్లాడకుండా నేను ఒక్క గుక్కలో మొత్తం ద్రాక్షాసవాన్ని తాగేసి, బల్లమీద వేళ్లతో తట్టాను. ఆమె గబాగబా వచ్చి మళ్లీ నా పానపాత్రలో ద్రాక్షాసవాన్ని నింపింది. నేనలా తాగుతూనే ఉండిపోయాను. భవనమంతా భయంకరమైన నిశ్శబ్దం ఆవరించింది.

అప్పుడప్పుడూ దూరం నుంచి మా అమ్మ చెల్లీ ఏడవటం వినిపిస్తోంది. జాలిగొలిపే ఆ ఆర్తనాదాలు వినిపించినప్పుడు, అపరాధం చేశానన్న భావంతో ఇంకా ఎక్కువ తాగుతూ నన్ను నేను మరిచిపోవాలని ప్రయత్నించాను. కొంతసేపటికి శవాన్ని పడుకోబెట్టిన స్థలంనుంచి వేదమంత్రాల ఘోష వినిపించింది. ఆ బ్రాహ్మణులు నా బావ ఆత్మరకరకాల నదులని దాటేందుకూ, దేవతల స్వర్గానికి చేరుకునేందుకూ సాయం చేస్తున్నారు. ఎవరో ఒక సేవకుడు వచ్చి, విద్యుజ్జిహ్వుడి శవాన్ని దహనక్రియలు జరిపించటంకోసం శ్మశానవాటికకి తరలిస్తున్నారనీ, నన్ను వచ్చి చివరిచూపుచూడమనీ సందేశం అందించాడు.

నేను కోపంగా లేచేసరికి పానపాత్రలు బల్లమీదనించి క్రిందికి దొర్లిపోయాయి. కింద పరిచిన తివాసీమీద ద్రవంపడి మరకలు అయాయి. పాపం ఆ సేవకుడిమీద గట్టిగా అరిచి, పాత్రని వాడిమీదకి విసిరివేశాను. అది వాడికి తగిలిఉంటే అక్కడికక్కడే ప్రాణాలు వదిలేవాడే. ద్రాక్లాసవం తుళ్లింది. సేవకుడు ప్రాణభయంతో పరిగెత్తాడు. వాడు వెళ్లగానే ద్వారాన్ని బలంగా మూశాను. కిటికీ మూద్దామని వెళ్లేసరికి నా తమ్ముడు నవ్వుపుట్టించే యోగాసన భంగిమలోంచి తన శరీరాన్ని విడిపించి ఎక్కడో మాయమయాడు. బహుశా బ్రాహ్మణులకి సాయం చేసేందుకే వెళ్లి ఉంటాడు.

అప్పుడు నా భార్యకేసి చూశాను. ఆమె భయంతో వణికిపోతోంది. ఆమె నడుముచుట్టూ చేతులువేసి దగ్గరకి లాక్కున్నాను. కానీ ఆమె నన్ను ఆశ్చర్యపరుస్తూ బలంగా తోసింది. తాగుడు మత్తులో ఉన్న నేను నిలదొక్కుకోలేక పడిపోయాను. "నన్ను తాకకండి!" అంది ఆమె నెమ్మదిగా, కానీ ఆమె గొంతు దృఢంగా పలికింది. మూర్ఖుడిలా నేలమీద కూర్చుని ఆమెవైపు కళ్లు మిటకరిస్తూ చూస్తూ ఉండిపోయాను. అంత భయస్తురాలిలా కనిపించే ఆమెలో అంతబలం ఉండటం చూసి నాకు ఆశ్చర్యంవేసింది. "ఇలా తాగిన మత్తులో ఉన్నప్పుడు నన్ను తాకటానికి ప్రయత్నించవద్దు," అంది. అలా తలపైకి ఎత్తుకుని, నన్ను ఎదిరిస్తూ,

తాకి చూడు ఏంచేస్తానో, అన్న ధోరణిలో అక్కడే నిలబడింది.

నాకు కోపం నసాళానికి అంటింది. లేచి మళ్లీ ఆమెని పట్టుకోబోయాను. పక్కనే పెద్ద పాత్రలో ఉన్న పళ్లుకోసే కత్తిని తీసి నావైపు చూపించింది. 'ఆహా, ఇది నాకు బావుంది. ఈమె అణిగి ఉండేరకం కాదు. నాకు ఇది చాలా సరదాగా ఉంది,' అనుకున్నాను. ఇంతలోనే నేను నిర్ఘాంతపోయేటట్టు ఆమె కత్తిని తన పొత్తికడుపువైపు తిప్పి, "ఒక్క అడుగు ముందుకి వేసి నన్ను తాకటానికి ప్రయత్నించారంటే..." అంటూనే వెక్కివెక్కి ఏడవసాగింది. ఆ వెక్కిళ్లకి ఆమె శరీరం మొత్తం కంపించి పోసాగింది. ఆ వ్యవహారమంతా నాకు అసహ్యంగా అనిపించింది.

నేను సులభంగా ఆమెని ఆక్రమించుకుని ఉండేవాడినే, కానీ ఇక నాలో ఆ కోరిక చచ్చిపోయింది. దానికి బదులు నేను పిచ్చికోపం ప్రదర్శించాను. దిండ్లని చింపాను, మంచంమీది పట్టు దుప్పటిని తీసి కిండపడేసి కాళ్లతో మట్టగించాను. కొంతసేపటికి నేను చేస్తున్నపని నాకే తెలివి తక్కువదిలా అనిపించింది. నా భార్యని శాపనార్థాలు పెడుతూ, ద్వారాన్ని పెద్ద చప్పుడుతో మూసేసి బైటికి వెళ్లిపోయాను.

నాకు ఎవరినైనా హత్య చెయ్యాలన్నంత కోపం వచ్చింది. నా నిస్సహాయత మీద మరింత కోపం వచ్చింది. అదే సమయంలో దురదృష్టంకొద్దీ అతిసౌందర్యవతి అయిన ఒక సేవకురాలు వసారాని ఊడుస్తోంది. రాజమందిరంలోనుంచి సుడిగాలిలా బైటికి వచ్చిన నన్ను చూసి నోరు తెరుచుకుని, చీపురు అక్కడ పారవేసి పరిగెత్తింది. ఆమెని నేను గమనించనేలేదు, కానీ ఆమె భయం నా దృష్టిని ఆకర్షించింది. ఆమెని తరుముతూ ఆమెని పట్టుకునేందుకు ముందుకి ఉరికాను. ఆమె కేకలు పెట్టకుండా అరచేతితో ఆమె నోరు మూసి పక్కనే ఉన్న గదిలోకి లాక్కెళ్లాను. తరవాత ఆమెని బలవంతంగా అనుభవించాను, మొదట్లో ఆమె అడ్డుచెప్పింది, తనని నేను చంపేస్తానని భయపడిందేమో. కానీ తరవాత నాకు అనుకూలంగా ప్రవర్తించింది. నా చెల్లి చనిపోయిన తన భర్తకోసం శోకాలు పెడుతూ ఉంటే, మా అమ్మ నన్ను శాపనార్థాలు

పెడుతూ ఉంటే, మా బావ శవానికి నా తమ్ములు అగ్ని సంస్కారం చేస్తూ ఉంటే, నా భార్య బాధతో ఏడుస్తూ ఉంటే, నేను, రాజుని, చక్రవర్తిని ఒక నీచజాతి స్త్రీతో రమిస్తున్నాను. ఆ పాపంనుంచే, ఆ అపరాధ భావంనుంచే, నల్లటి, లావాటి, అనాకారి పత్రుడు, అతికాయుడు నాకు జన్మించాడు.

22. ఉపద్రవం

భద్రుడు

నేను కోలుకునేందుకు దాదాపు సంవత్సరం పట్టింది. అసురులు ఒకరిని ఒకరు దోచుకుంటూ, పోరాడుతున్న సమయంలో నా గుడిసె కాలి బూడిదైపోయింది. నేను ఉన్న ప్రదేశంలోనే కాదు, చాలావరకు అంగళ్లనూ, ఇళ్లనూ తగలబెట్టేశారు. విద్యుజ్జిహ్వుడూ, రావణుడూ అధికారంకోసం కరాళనృత్యం చేస్తున్న సంకట పరిస్థితుల్లో ఈ విధ్వంసం జరిగింది. నేను కొన్నాళ్లు చాలా బాధపడ్డాను. రాజమార్గం పక్కన ఉన్న బ్రహ్మాండమైన మర్రివృక్షం కింద నేను నిర్మించిన కుటీరంలోకి మాల మళ్లీ వచ్చింది. అంతకుముందు ఆమె గురించి చాలామందిని సమాచారం అడిగాను. రాజభవనంలో చిన్న దాసీగా పనిచేస్తోందని తెలిసింది. రావణుడివల్ల ఆమె గర్భవతి అయిందనీ, రావణుడు ఆమెని చిన్నరాణిగా చేసుకున్నాడనీ జనం చెప్పుకోగా విన్నాను. నాకు అసూయ కలిగింది, బాధపడ్డాను. ఆమెని హత్య చెయ్యాలన్నంతకోపం వచ్చింది, కానీ ప్రస్తుతం ఆమె నాకు అందనంత ఎత్తులో ఉంది.

తరవాత ఒకరోజు ఆమె వచ్చింది. చూసేందుకు ఎంతమాత్రం రాణిలా లేదు. చాలా సాదా దుస్తుల్లో, మురికిగా, భుజంమీద పాతబట్టల మూటతో వచ్చింది. తరిగిపోతున్న అందం ఆమెని మరింత అనాకారిని చేసింది. రాజుగారి ఉపపత్ని ఉండాల్సినంత డాబుగా లేకుండా, జాలిపడవలసిన స్థితిలో ఉన్నట్టు కనిపించింది. ఆమె నాకు ద్రోహం చేసిందన్న కోపం ఇప్పుడు బాధగా మారింది, తిండికోసం, చిన్నచిన్న సంతోషాలకోసం బహుశా అమ్ముడుపోయిందేమో! లేక రావణుడు, విద్యుజ్జిహ్వుడు లాంటి రాజుల అండన ఉండే ఏ అందమైన పేద స్త్రీకి అయినా జీవించి ఉండేందుకు అదొక్కటే

మార్గమేమో! నా సాహసకార్యాలు పూర్తిచేసుకుని వెనక్కివచ్చాక నేను ఎన్నో నెలలు కోపం, అసూయ, మధనతో బాధపడ్డాను. కానీ ఆమె వచ్చేసరికి నా ఉద్రేకం చల్లారిపోయింది. ఆమె నా గుడిసెకి తిరిగి వచ్చినరోజున నేను తీవ్ర జ్వరంతో పడకవేశాను. ఒక్కమాట కూడా మాట్లాడకుండా ఆమె నాకు సుశ్రూష చెయ్యసాగింది. ఆమె బిచ్చం ఎత్తి తీసుకువచ్చిందో, దొంగతనమే చేసిందో తెలీదు కాని కొంచెం జావ కాచింది. ఆకుతో ఆమె దాన్ని నా నోట్లో పోస్తున్నప్పుడు ఎందుకోగాని నాకు ఏడుపు ముంచుకువచ్చింది. ఆమె ఏమీ అనకుండా ఆకుదొన్నెలోంచి నాచేత తాగిస్తూ ఉండిపోయింది.

నేను కోలుకునే వేళకి ఇక ప్రశ్నించటం అనవసరం అనిపించింది. నాకు ఆమె అవసరం, ఆమెకి నా అవసరం ఉన్నాయని అనిపించింది- కనీసం ఇంకెవరైనా కులీనుడు తనని తృప్తి పరచమని ఆమెని పిలిచేవరకూ, నెమ్మదిగా నా జీవితం గాడిలో పడింది. గతంతో పోలిస్తే జీవితం ప్రశాంతంగా, ఒడిదుడుకులు లేకుండా గడిచిపోతోంది. కనీసం ఒకపూట అయినా భోజనం చేసేంత సంపాదించగలుగుతున్నాం. నగరంలో సరుకులు కొనేందుకు వచ్చే బిచ్చగాళ్లు, ఇంద్రజాలికులూ, పాములాడించేవాళ్లూ వీధుల్లో తిరుగుతూ దేవాలయాలని సందర్శిస్తూ అలసిపోయి సామాన్యంగా ఈ మర్రిచెట్టకిందే విశ్రాంతి తీసుకునేవారు. నాకు ఏమీ తోచకపోవటంతో రకరకాల వంటకాలు వండి అలా దారినపోయే వాళ్లకి ఇచ్చేవాడిని. మిఠాయిలూ, ఇతర తినుబండారాలూ అమ్మేందుకు ఒకపాక వేసుకున్నాను. మాల కూడా నాకు సాయం చేసింది. కానీ అప్పుడప్పుడూ రాజభవనంలో ఆపనీ, ఈపనీ చేసేందుకు వెళ్తూ ఉండేది. తనవెంట తన కొడుకు అతికాయుడిని తీసుకెళ్లేది. అలా చేస్తున్నందుకు ఆమెని నేను అసహ్యించుకున్నప్పటికీ, కడుపునిండా చాలారోజుల తరవాత భోజనం దొరుకుతున్నందువల్ల ఊరుకున్నాను. అనవసరంగా గొడవచేసి ఉన్న సుఖాన్ని పాడుచేసుకోదలుచుకోలేదు.

వంటపనీ, వచ్చినవారికి వడ్డించేపనీ మాల నిర్వహించసాగింది.

నాలో మరొక నైపుణ్యం ఉందని కనిపెట్టాను- కొంతసొమ్ము తీసుకుని ప్రయాణీకుల బట్టలు ఉతకటం ప్రారంభించాను. ఏ మొక్కలూ, గింజలూ వాడితే బట్టలు బాగా శుభ్రపడతాయో నాకు తెలుసు. నేను వాటితో ప్రయోగాలు చెయ్యసాగాను. ఒకటి రెండుసార్లు బట్టలరంగు వెలిసిపోవటం కూడా జరిగింది. కానీ త్వరగానే సరైన వాళ్లలో వాటిని వాడటం నేర్చుకుని, నేను బట్టలు బాగా ఉతుకుతుతానన్న పేరు సంపాదించుకున్నాను. నాచేత తమ బట్టలు ఉతికించుకునే వాళ్ల హోదా కూడా మారింది. ధనవంతులైన వర్తకులు తమ విలువైన దుస్తులని, దూర ప్రదేశాలనుంచి, వేరే రాజ్యాలనుంచి తెప్పించిన పట్టువస్త్రాలనీ, పల్చని నాజూకైన బట్టలనీ శుభ్రపరచేందుకు నాకు ఇవ్వటం ప్రారంభించారు.

రాజమార్గం పక్కన ఉన్న నా చిన్న దుకాణం త్వరలో జనానికి, కబుర్లు చెప్పుకునేందుకూ, సరదాగా గడిపేందుకూ కేంద్రంగా మారింది. రాకుమారి శూర్పణఖ తన తలిదండ్రులతో లంకారాజ్యం వదిలి వెళ్లిపోయిందని విన్నాను. ఇక జన్మలో తన అన్న రావణుడి ముఖం చూడనని శపథం పట్టిందని కూడా జనం చెప్పుకోగా విన్నాను.

రాజభవనానికి వెళ్లకుండా మాలని చాలాసార్లు అడ్డుకున్నాను. అయినా ఎలాగో నాకు తెలీకుండా వెళ్లిపోయేది. ఆమె వెనక్కివచ్చాక నేను ఆమెకి నరకం చూపించేవాడిని. కానీ నా దెబ్బలనీ, తన్నులనీ చాలా ఓర్పుతో సహించేది. చివరికి, రావణుడు తనని బలాత్కరించాడనీ, అతికాయుడు రావణుడి కొడుకేననీ చెప్పేసింది. కానీ ఆ సంఘటన తరవాత రావణుడు తనని ఎంతమాత్రం పట్టించుకోలేదనీ. పైగా చాలా తృణీకారభారం ప్రదర్శించేవాడనీ చెప్పింది. ఆమెని తరచు మహారాణి మండోదరి రాజభవనానికి పిలిపించుకుంటోందని చెప్పింది. అతికాయుడిపట్ల రాణీ కనబరిచే ప్రేమవల్లే తనకి రాజభవనానికి వెళ్లాలని అనిపిస్తుందని చెప్పింది. ఆమె రాజభవనానికి వెళ్లివచ్చిన ప్రతిసారీ ఆమెని చావబాదటం నాకు ఒక అలవాటుగా మారింది. మా వైవాహిక జీవితం, దాన్ని అలా అనటం

సబబే అయితే, బతికి బట్టకట్టింది.

రావణుడికి ఈ అక్రమ సంతానం పుట్టిన దాదాపు నెలరోజులకి రాణీ ఒక అందమైన మగశిశువును కన్నది. ఆ శిశువు పుట్టినది ఉరుములతో మెరుపులతో నిండిన ఒక చీకటి రాత్రి. అందుకే వాడికి మేఘనాదుడని, 'ఉరుమువంటి కంఠస్వరం కలవాడు' అని పేరుపెట్టారు.

వెనువెంటనే కుంభకర్ణుడికి ఒక అందమైన ఆడశిశువూ, విభీషణుడికి ఆరోగ్యంగా, చురుగ్గా ఉన్న ఆడశిశువూ పుట్టారు. ఇవన్నీ మా జీవితంలో ముఖ్యమైన సంఘటనలు, రాజవంశం అభివృద్ధి మాకు సంబంధించిన విషయమని కాదు, వాటివల్ల రాజ్యానికి మిగతా ప్రాంతాలనుంచి జనం రాకపోకలు ఎక్కువ అవుతాయని, అది మా వ్యాపారానికి లాభదాయకం కనుక, నెమ్మది నెమ్మదిగా ప్రజాభిప్రాయం రాజుకి అనుకూలం అవసాగింది. బహుశా తనకి సహజంగా ఉన్న అత్యాశని అతను అణచుకున్నాడో, లేక పత్రుడి జననం యుద్ధం చెయ్యాలన్న దాహాన్నీ, భూమిని ఆక్రమించుకోవాలన్న ఆర్తినీ తగ్గించివేశాయో! క్రమక్రమంగా దీవి ప్రాంతమూ, ప్రధాన భూభాగమూ పోగొట్టుకున్న వైభవాన్ని తిరిగి సంతరించుకోసాగాయి. వర్తక వ్యాపారాలు జోరుగా సాగటం మొదలుపెట్టాయి.

మొదట్లో విభీషణుడంటే అందరికీ చాలా ఇష్టంగానే ఉండేది. అందరూ విస్మరించిన వీధిని పునరుద్ధరించేందుకూ, శివుడివీ, ఇతర చిన్నదేవుళ్లవీ ఆలయాలని పునర్నిర్మించేందుకూ, ఆలయ నిర్వహణని పటిష్టం చేసేందుకూ అతను చేసిన ప్రయత్నాలని అందరూ కొనియాడారు. కానీ ఇంతలోనే అతను చిన్నచిన్న విష్ణువు ఆలయాలని నిర్మింపజేసి, అసురులకి పరిచయం లేని దేవతల ఆచార వ్యవహారాలని వాళ్లకి పరిచయం చెయ్యాలని ప్రయత్నించాడు. అతను కొందరు బ్రాహ్మణులని కూడా తీసుకొచ్చాడు, వాళ్లు దేవతల దిక్కుమాలిన కులవ్యవస్థని జనానికి నేర్పటం మొదలుపెట్టారు. చాలామంది మూర్ఖులైన విభీషణుడి అభిమానులు త్వరలోనే ఆ బ్రాహ్మణ ఆచారాలని పాటించటం మొదలుపెట్టారు. ధనికులు గొర్రెలమందలా,

బ్రాహ్మణులు ఎల్లప్పుడూ ఉంచుకునే యజ్ఞోపవీతాన్ని వేసుకోసాగారు. ఉపయోగ కరమైన పనులు చేసే వారందరినీ వాళ్లు హీనంగా చూడటం మొదలుపెట్టారు.

మేము సమాజంలోని అధికసంఖ్యాకులకి దూరం చెయ్యబడుతున్నామని గ్రహించేసరికి చాలా ఆలస్యం అయింది. రాకుమారుడు విభీషణుడు ఒక ప్రచ్ఛన్న పోరాటం ప్రారంభించి, రాజ్యంలోని ముఖ్యమైన ఉద్యోగాలన్నీ బ్రాహ్మణులకే దొరికేట్టుగా చూశాడు. మూడు సంవత్సరాలలో వాణిజ్యానికి సంబంధించిన ముఖ్యమైన ఉద్యోగాలన్నీ దాదాపు బ్రాహ్మలుగా మారినవారి చేతుల్లోకీ, ఉత్తరదిశ నుంచి వలసవచ్చిన బ్రాహ్మల చేతుల్లోకీ వెళ్లిపోయాయి. అసంతృప్తి పెరగసాగింది. ఉత్తరదిశనుంచి తెల్లరంగు చర్మం ఉన్న బ్రాహ్మణులు తండోపతండాలుగా రావటం మొదలుపెట్టారు. ముఖ్యమైన పట్టణాలలోనూ, ఊళ్లలోనూ వాళ్లు తమ స్థావరాలని ఏర్పాటు చేసుకోసాగారు.

దేవతల పద్ధతులని పాటించని వర్తకులని రాజభవనం నుంచి తొలగించటం ప్రారంభమైంది. వీధులూ, ఆలయాలూ, మొదలైన వాటిని నిర్మించేందుకు బ్రాహ్మణ కులంలోకి మారినవారికి మాత్రమే అనుమతి లభించసాగింది. ఆ తరవాత మాలాంటివారికి వీధుల్లో సంచరించటం నిషిద్ధమైంది. జరుగుతున్న వాటికి నిస్సహాయంగా కోపాన్ని ప్రదర్శించటం నా అంగడికి వచ్చేవారిలో కనిపించసాగింది. మాకు సొంతమైన మా రాజ్యంలో ఎంతో అద్భుతంగా కట్టించిన దేవాలయాల్లో మాకే ప్రవేశం లేకుండా పోయింది. పాత పురోహితులని హడావిడిగా బైటికి పంపేసి, వారిస్థానే బ్రాహ్మణులని నియమించారు. జనం బలిచక్రవర్తి పరిపాలనని తలుచుకుని అలాంటిది మళ్లీ రావాలని తహతహలాడారు. అందరినీ ఆయన సమానంగా చూసేవాడు. పాత వైభవం మీద దుమ్ము పేరుకుపోయింది!

అణచుకున్న కోపం, అసంతృప్తీ చివరికి ఉపద్రవంగా బైటికి వచ్చింది. కొన్నివేలమంది భటుల చేతుల్లో చనిపోయాకగాని మేము

పాఠం నేర్చుకోలేదు. త్వరలో ఈ లోకంలో మా స్థానం ఎలాంటిదో తెలిసివచ్చింది. మేము కుక్కలకన్నా హీనులం!

23. ద్వంద్వయుద్ధం

రావణుడు

ఎంత ప్రయత్నించినా నాకు నిద్రపట్టలేదు. భద్రుడి వికారమైన నల్లటి ముఖం భయంకరమైన రకరకాల రూపాలతో నా కళ్లముందు కదలాడసాగింది - ఒక్కోసారి వంకరగా నవ్వుతున్నట్టు, మరోసారి దీనంగా బతిమాలుతున్నట్టు. నేను పక్కమీద దొర్లుతూ ఉండిపోయాను. రేపు మారీచుడిని వాడి దగ్గరికి పంపుతాను. బహుశా కొన్ని బంగారు నాణాలు నా అపరాధభావాన్ని శాంతపరుస్తాయేమో. కానీ వాడి మీద నాకు కోపం కూడా వచ్చింది. వాడు చేసే పనులు నాకు ఇబ్బందికరంగా ఉన్నాయనిపించింది. అదంతా ఒక బలహీన క్షణంలో మొదలైంది. నేను అంతగా ఎలా దిగజారిపోయాను? నేను చేసిన పనిక్షమించరానిది. కానీ దాన్ని మరిచిపోయి, జీవితాన్ని వెళ్లదీసి ఉండేవాడినే, కానీ శివుడి వరం అలా జరగటానికి వీల్లేని పరిస్థితి కల్పించింది. ఒకేఒక భావోద్రేక క్షణంలో నేను చేసిన పని ఒక శిశువుకి ఎలా జన్మనిచ్చిందో నాకు అర్థం కావటంలేదు. మరోపక్కమా కుమారుడు మేఘనాదుడికి మరో తోబుట్టువుని ఇచ్చేందుకు నేనూ, నారాణీ పన్నెండేళ్లు కష్టపడి ప్రయత్నించాల్సి వచ్చింది. చాలాకాలం తరవాత అక్షయకుమారుడు జన్మించాడు. కానీ మేఘనాదుడికి ఆ సరికే సవతి తమ్ముడు ఉన్నాడు, అతికాయుడు. మండోదరికి ఆ విషయం తెలిసి వాడిపట్ల విపరీతమైన ద్వేషాన్ని పెంచుకుంది. ఆ ద్వేషం మరీ ఎక్కువయిపోయి ఆమె ఆ సేవకురాలిపట్లా, ఆమె కుమారుడిపట్లా విపరీతమైన దయాదాక్షిణ్యాలు చూపించసాగింది. చీకట్లో కొన్ని నిమిషాలు నా భార్యమీదా, నా జాతిమీదా, నా జీవితంమీదా ఒళ్లు తెలియని కోపంతో ఊగిపోయాను. అంతే, చిన్న కారణంవల్లే నాకీ చీకటి పుత్రుడు, అతికాయుడు జన్మించాడు. రాజాజ్ఞ పేరుతో తల్లినీ,

పిల్లవాడినీ నేను మాయంచేసి ఉండవచ్చు. కానీ ఏదో శక్తి నన్ను ఆపింది – బహుశా నాలో ఇంకా కాస్త మానవత్వం మిగిలిఉండిపోయిందేమో. లేక నేను పోగొట్టుకున్న ప్రియురాలూ, బురదగుంటలో పడి, ఒక దేవతల రాజుచేత రక్షింపబడ్డ నా చిన్నారిపాప నాకు గుర్తుకొచ్చారేమో. ఎంతైనా, నల్లగా, వికారంగా, ఎత్తుపళ్లతో ఉన్న అతికాయుడు కూడా నా కుమారుడే. నేను పరిపక్వత చెంది వివేకం సంపాదించుకున్నానో, లేక అటువంటి నీచమైన పనిచేసేంత తెలివిలేని మూర్ఖుడినో నాకే తెలీదు. ఉత్తర ప్రాంతంలోని దేవతల రాజ్యంలో నా కుమార్తెలాగే, నేను చేసిన పాపంవల్ల జన్మించిన ఈ పత్రుడు కూడా త్వరగా పెరగసాగాడు.

దైనందిన పరిపాలనపట్ల నేను అంత శ్రద్ధ చూపటంలేదన్నది వాస్తవమే. నా మంత్రులు సమర్థులు, అందుకే నేను నా కుటుంబానికి సంబంధించిన విషయాలలో మునిగిపోయాను. నా కోశాగారాలు నిండుగా ఉన్నాయి, ఇంకా విజయాలు సాధించాలన్న ఆకాంక్షనాలో లేకుండా పోయింది. నేను యాభైయోపడిలో, సంతృప్తిగా జీవిస్తున్నాను. నేను మంచి ప్రభువుననీ, నేను చనిపోయిన చాలాకాలం తరవాత కూడా ప్రజలు నా పరిపాలన గురించి తలుచుకుంటారనీ నాకు తెలుసు. మధ్యవయస్కులైన అందరు రాజుల్లాగే నేను కూడా నా రాజ్యాన్ని నా వారసులకి వదిలి వెళ్లాలని అనుకుంటున్నాను. మృత్యువు ఇంక ఎంతో దూరంలో ఉన్నట్టు తోచలేదు నాకు. నా మెడమీద దాని ఊపిరి తగులోంది. ఇంక నేను అజేయుడినీ, అమరుడినీ కాదని గ్రహించాను. ఆశ్చర్యం ఏమిటంటే, ఇప్పుడు నాకు జీవితం విలువ తెలుస్తోంది. ప్రతిక్షణాన్నీ ఆనందంగా గడుపుతున్నాను. ఆలయాల్లో గంటలు మోగటం, నా ప్రియపుత్రుడు మేఘనాదుడు కత్తిసాము చేస్తున్నప్పుడు వినిపించే ఆ కత్తి చప్పుడూ, నా చిన్న రాకుమారుడు అక్షయకుమారుడిని ముద్దు చేస్తూనా భార్య నోటితో ఏవేవో అర్థంలేని శబ్దాలు చెయ్యటం, యుక్తవయస్కురాలైన త్రిజట కోట వసారాల్లో పరిగెత్తుతున్నప్పుడు అయే ఆమె గాజుల గలగలలూ వినటంలాంటి చిన్నచిన్న ఆనందాలు నాకు అంతులేని ఆనందాన్ని ఇవ్వసాగాయి.

వీటన్నిటి మధ్యామాల ద్వారా నాకు పుట్టిన అతికాయుడు పెద్ద ప్రశ్న అయి కూర్చున్నాడు. ఈ లోకంలో అన్నిటికన్నానేను ఎక్కువగా ప్రేమించేది మేఘనాదుడిని. నాపట్ల నాకున్నప్రేమకన్నామేఘనాదుడిమీద ఎక్కువ ప్రేమ నాకు. మేఘనాదుడికీ, అతికాయుడికీ మధ్య హస్తి మశకాంతరమంత తేడా ఉంది. మేఘనాదుడి అందం నా కళ్లని మిరుమిట్లుగొలుపుతుంది. అతికాయుడు నల్లగా, పర్వతకాయంతో ఉంటాడు. ఇంత అనాకారి మనుషులు కూడా ఉంటారా అని అనుకున్నట్టు జనం వాడిని నోరు తెరుచుకుని చూస్తారు. మంచి మేలుజాతి గుర్రంలా మేఘనాదుడి ప్రతికదలికా కనులకి ఇంపుగా ఉంటుంది. మాల కొడుకు అవకతవకగా, వంకరకాళ్లతో నడుస్తాడు. మేఘనాదుడు తెలివైనవాడిలా, ఆకర్షణీయంగా ఉంటే, అతికాయుడు రోజురోజుకీ మరింత మూర్ఖంగా ప్రవర్తిస్తూ ఉంటాడు. ప్రకృతి తనకున్నది అంతా మేఘనాదుడికే ఇచ్చేసి, అతికాయుడికి ఏమీ మిగల్చలేదని అనిపిస్తుంది. ఒకే తండ్రికి పుట్టిన ఇద్దరు కొడుకుల్లో అంత తేడా ఉండటం నాకు అర్థమయేది కాదు. మేఘనాదుడిపట్ల నాకు ఎంత ప్రేమ ఉందో, అతికాయుడిపట్ల అంత ఏవగింపు ఉంది. కానీ శాపగ్రస్తుడైన ఆ కుమారుడే నేను ఎక్కడికి వెళ్లినా కుక్కపిల్లలా నా వెంటే ఉండేవాడు. నేను వాడిని వదిలించుకోవాలని ఎంత ప్రయత్నించినా ఎందుకోగాని నాకు అతుక్కుపోయాడు వాడు. చాలాసార్లు వాడిపట్ల నేను క్రూరంగా ప్రవర్తించేవాడిని. అందరి ఎదుటా వాడిని తన్నేవాడిని, చెంపదెబ్బ కొట్టేవాడిని, వాడిమీద కేకలు వేసేవాడిని, అయినా వాడు బుద్ధిహీనుడిలా అసహ్యమైన పసుపు పచ్చటి ఎత్తుపళ్లు కనిపించేట్టు నవ్వేసేవాడు. ఆ చుట్టుపక్కల మేఘనాదుడు ఉంటే పగలబడి నవ్వేవాడు. అతికాయుడు నాకు వినోదం కలిగించేవాడు. బుద్ధిలేని ఈ రాకుమారుడిపట్ల కూడా నా మనసులో ఒక రకమైన ప్రేమ ఉందని, కొన్నిసంవత్సరాల క్రితం గ్రహించని విషయాన్ని వయసు పెరిగాక తెలుసుకున్నాను. మేఘనాదుడి పట్లా, మండోదరి పట్లా, నా తమ్ములపట్లా, వాళ్ల పిల్లలపట్లా ఉన్న ప్రేమలాంటిది కాదు ఇది. వీధికుక్క చూసేందుకు

అసహ్యంగా, మురికిపట్టి ఉంటుందని దాన్ని పెంచుకునేందుకు ఏమాత్రం ఇష్టపడరు, కాని అప్పుడప్పుడూ దానికి తిండిపెడుతూ ప్రేమ చూపిస్తారే, అలాంటి ప్రేమ!

భద్రుడి జోక్యం లేకపోయి ఉంటే ఎప్పుడో వీడిని వదిలించుకునేవాడినే. వాడిలాంటి మనుషుల గురించి ఆలోచించే తీరుబాటు లేనంత గొప్పవాడిగా నేను ఎదిగిన తరవాత, భద్రుడు మళ్లీ నా దగ్గరకి వచ్చాడు. బ్రాహ్మణుల మీద అసురులు చేసిన తిరుగుబాటుని అణచివేసేందుకు విభీషణుడు జరిపించిన నరసంహారం తరవాత అది సంభవించింది. నాకు బ్రాహ్మణులంటే అభిమానమేమీ లేదు. ఆ తిరుగుబాటుని చూసి నేను లోలోపల సంతోషించాను. వందలమంది రక్తసిక్తమైన బ్రాహ్మణులని వెంటపెట్టుకుని విభీషణుడు రాజ్యసభలోకి వచ్చినప్పుడు, మొట్టమొదట నాకు నవ్వు వచ్చినంత పనయింది. కానీ ఎప్పటిలాగే ప్రహస్తుడే నాకు దారి చూపాడు. అప్పటికి ప్రహస్తుడు యాభైయోపడి, చివరిదశలో ఉన్నాడు. ఆయన తన ఉపదేశాలతో నాకు చీకాకు కలిగిస్తుండేవాడు. ఇద్దరం వాదించుకుంటూనే ఉండే వాళ్లం, కానీ నేను ఆయనమీద ఆధారపడసాగాను. దైనందిన పరిపాలనకి సంబంధించిన లౌకిక వ్యవహారాల బాధ్యత మొత్తం ఆయనకే అప్పజెప్పాను. కానీ ముఖ్యమైన సందర్భాలలో మాత్రం తుది నిర్ణయం నాదే అయేట్టు చూసుకునేవాడిని. మా ఇద్దరి మధ్యా మైత్రిలాంటిది ఏమీ లేదనే అనాలి, కానీ ఆయన వయసుకి నేను గౌరవం ఇచ్చేవాడిని. నన్ను చూసి భయపడని వారిలో ఆయనకూడా ఒకడు, కానీ అలాగని భజనపరుడు కాదు. తన స్వభావానికి తగ్గట్టు, ఇతర మంత్రుల సమక్షంలో నాతో వాదించకుండా, తిరుగుబాటు జరిగిన రోజున ఆయన సభకి విరామం ప్రకటించి, నా దగ్గరకి వచ్చి 'మనం ఎదురుచూస్తున్నది ఇలాంటి అవకాశం కోసమే', అని నెమ్మదిగా అన్నాడు. ఈ తిరుగుబాటుని మళ్లీ తలెత్తకుండా అణచివేయాలనీ, అసురులు ఇంకెన్నడూ న్యాయాన్నితమ చేతులలోకి తీసుకోకుండా వాళ్లకి

బుద్ధిచెప్పాలనీ సలహా ఇచ్చాడు. పాలకుడైన ప్రభువు మాటకి తిరుగు ఉండదనీ, ఆయన ఆదేశమే సర్వోన్నతమైనదీ అనీ ప్రహస్తుడు నన్ను ఒప్పించాడు.

ఆ పరిపాలించే చక్రవర్తిని నేనే కాబట్టి ఆయన చెప్పినట్టు వినటానికి నాకేమీ అభ్యంతరం లేకపోయింది. కానీ బ్రాహ్మణుల పక్షం వహించేందుకు మాత్రం నాకు ఇబ్బందిగా అనిపించింది. అప్పుడు పామూ చావకుండా, కర్రా విరగకుండా ఒక ఉపాయం నాకు తట్టింది. కొన్ని ఘడియలపాటు నగరాన్ని తగలబడనిచ్చి అల్లరిమూకని తమ ఇష్టంవచ్చినట్టు ప్రవర్తించనిచ్చాం. తరవాత మేమే వాళ్లమీద దాడిచేశాం. నా సైనికులు ఏమాత్రం పక్షపాతం చూపించకుండా అసురుల తలలూ, బ్రాహ్మణుల తలలూ నరికి పారేశారు. నా సైనికులు విష్ణువు ఆలయాలని దోచుకుంటూ ఉంటే చూస్తూ ఊరుకున్నాను. వాళ్లు అమితోత్సాహంతో ఆ పనిచేసి, ఆలయాలని శివాలయాలుగా మార్చివేశారు. బ్రాహ్మణులు గుంపులు గుంపులుగా దీవి వదలి పారిపోసాగారు. వరుణుడు తన నౌకల్లో వాళ్లని ప్రధాన భూభాగానికి తీసుకుని వెళ్లాడు. దానికి అతను ఎప్పటిలాగే పెద్దమొత్తాన్ని వాళ్ల దగ్గర వసూలు చేశాడు. ఎటువంటి పరిస్థితిలోనైనా వరుణుడు తనకి లాభం వచ్చేలా చూసుకోగలడు. రుద్రకుడు ఆ తిరుగుబాటుని మళ్లీ తలెత్తకుండా పూర్తిగా అణచివేశాడు. నా రాజ్యంలో మళ్లీ తిరుగుబాటు అనేది నేను చూడలేదు. విభీషణుడు కొంతకాలంపాటు అలిగిన మాట వాస్తవమే, కానీ దాన్ని ఎవరూ కూడా ఎంతమాత్రం పట్టించుకోలేదు. నాకే నా తమ్ముడిమీద జాలివేసి, పారిపోకుండా నా రాజ్యంలోనే ఉండిపోయిన బ్రాహ్మణులని నేను పీడించనని చెప్పి వాడిని ఓదార్చాను. నెమ్మదిగా వాడు అలకమాని మామూలు మనిషి అయాడు. వాడికి ఉన్న విపరీత బుద్ధులని నేను అదుపు చేశాననే అనుకున్నాను. కనీసం అప్పుడు నాకు అలాగే అనిపించింది.

భద్రుడు నా దగ్గరకి వచ్చినప్పుడు వాడు కోపంతో రగిలిపోతున్నాడని గ్రహించాను. వెంటనే నా చెయ్యి కత్తిమీదికి వెళ్లింది.

చిన్నపిల్లవాడిలా నా కత్తికి చంద్రహాసం అని పేరు పెట్టాను, దాన్ని క్షణం కూడా వదిలిపెట్టను. బాగా పేరుపొందిన ఒక కమ్మరి దాన్ని అద్భుతంగా తయారుచేశాడు. అది ఎప్పుడూ నా దగ్గరే ఉంటుంది. ఇంతలో భద్రుడు ఏడవటం ప్రారంభించాడు. వాడు ఎందుకు ఏడుస్తున్నాడో నాకు తెలీలేదు. ముందు వెక్కిళ్లలాగ వచ్చాయి, ఆ తరవాత నిలువెల్లా వణికిపోతూ పొగిలి పొగిలి దుఃఖించసాగాడు. ముందు మోకాళ్లమీద కూలబడి నా పాదాల దగ్గర సాష్టాంగపడ్డాడు. ఇలాంటిది ఇంతకుముందు ఎప్పుడైనా జరిగిఉంటే వాడి ముఖాన్ని కాళ్లతో తన్ని ఉండేవాడిని. బలహీనతని ఏ మనిషిలోనూ నేను సహించలేను. కానీ భద్రుడు విలపిస్తున్నది బలహీనతవల్ల కాదనీ, ప్రాణాలు కాపాడుకునేందుకనీ గ్రహించాను. అహంకారాన్ని అణచుకుని ఇంకొక మనిషి పాదాలమీద పొర్లేందుకు ఎంతో సంకల్పం అవసరం. లోపల కోపం, ద్వేషం రగిలిపోతూ ఉన్నప్పుడు, తలవంచి దీనంగా ప్రవర్తించేందుకు ఎంతో మనోబలం ఉండాలి. ఆత్మగౌరవాన్నికోల్పోయి ప్రాణాలని కాపాడుకోవటానికి ఎంతో మనోధైర్యం ఉండాలి. చివరికి వచ్చేసరికి విజయాలూ, ఆత్మగౌరవం, అహంకారం లాంటివి ఏవీ ముఖ్యం కావు, ప్రాణాలు నిలుపుకుని జీవించి ఉంటే చాలు అనిపిస్తుంది. తన జీవితం, వారసులు, తెగ, జాతి, భాష, ఇవే ముఖ్యమని ఆ వ్యక్తికి అనిపిస్తాయి. మిగతావన్నీ నిరుపయోగమైనవే. కానీ నేను నేనే, వాడికి తోచినట్టుగా వాడు తయారయాడు. దాన్ని గురించి ఇద్దరమూ చేయగలిగింది ఏమీ లేదు. అందుకే వంగి వాడిని లేవనెత్తాను.

"భద్రా!" అంటూ వాడి బొగ్గులాంటి నల్లని కళ్లలోకి చూశాను. అక్కడ ఒక్క క్షణం ద్వేషం లాంటి భావం మెరిసి మాయమైంది. తక్షణం ఏ భావమూ లేకుండా నావైపు చూశాడు. నేను ద్వేషాన్ని పట్టించుకోలేదు. దుర్వాసనని లక్ష్యపెట్టలేదు. అలాంటివాటికి ఈ జీవితాన్ని ఖర్చు చెయ్యకూడదు. జీవితం చాలా చిన్నది. నాకు నేనే చాలా ఉదారంగా కనిపించాను.

"భోజనం చేశావా?" అని అడిగాను. చాలా దయగా అడిగానని అనుకున్నాను. వాడు తల అడ్డంగా ఆడించాడు. "భోజనశాలకి వెళ్లి ఏమైనా తిను. నేను వాళ్లకి ఆదేశం పంపుతాను."

వాడు ఇంకా అక్కడే నిలబడ్డాడు. పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. వాడు నాకు నోరు తెరిచి మాట్లాడలేదు, నాకు ఇక ఏం మాట్లాడాలో తోచలేదు. వాడి దగ్గర్నించి వచ్చే దుర్వాసన భరించటం నాకు సాధ్యం కాకుండా ఉంది. వాడిమీద నాకు కలిగిన దయనీ, జాలినీ కోల్పోకుండా ఉండాలని ప్రయత్నించాను, కానీ నాలో అసహ్యం పెరిగిపోసాగింది. దాన్ని తొక్కిపట్టాలని ప్రయత్నించాను. నల్లగా పగుళ్లు బారిన వాడి చర్మాన్నీ, మాసిన వాడి తలనీ, అట్టలు కట్టుకుపోయిన జుట్టునీ, వాడి కాళ్లమీద ఉన్న పుళ్లనీ, బానపొట్టనీ, పాచిపట్టిన పళ్లనీ చూడకుండా ఉండేందుకు చూపులు తిప్పకున్నాను. కానీ దుర్వాసన మాత్రం వస్తూనే ఉంది. నా చేతులు కడుక్కోవాలని అనిపించింది. నా ఒళ్లే నాకు అపరిశుభ్రంగా అనిపించింది. అసంకల్పితంగా నా చేతులని పట్టువస్త్రంతో తుడుచుకున్నాను. వాడు నేను చేసినపని చూస్తున్నాడని తెలిసి ఇబ్బందికి గురయాను.

అదే సమయంలో మూడేళ్ల మేఘనాదుడు కిలకిలా నవ్వుతూ నా మందిరంలోకి పరిగెత్తుకుంటూ వచ్చాడు. వాడు హఠాత్తుగా ఆగిపోయాడు. మురికిపట్టి నల్లగా ఉన్న ఒక అసురుడు తన తండ్రి ఎదుట వినయంగా నిలబడి ఉండటం చూసి వాడి పెద్ద పెద్ద కళ్లు ఆశ్చర్యంతో మరింత విప్పారాయి. వాడిని ఎత్తుకోవాలనిపించి వాడివైపు రెండు అడుగులు వేశాను. కానీ భద్రుడిని తాకటంవల్ల మురికి అంటుకున్న నా చేతులతో పిల్లవాడిని తాకాలనిపించలేదు. మళ్లీ చేతులు తుడుచుకునే సరికి ఆ మురికి వెధవ వ్యంగ్యంగా నవ్వాడు. నాలో కోపం ఉవ్వెత్తు అలలా లేచింది, మండిపడుతూ వాడివైపు తిరిగాను. అప్పుడు వచ్చాడు అక్కడికి నా అక్రమ సంతానం. నల్లగా, వికారంగా ఉండే అతికాయుడు కూడా నా మందిరంలోకి పరిగెత్తుకుంటూ వచ్చాడు. వాడి శరీరం మీద గోచీ తప్ప ఇంకే

ఆచ్చాదనా లేదు. మూడేళ్లు నిండినవాడి చేతి వేళ్లనిండా సగం తిన్న మామిడిపండు గుజ్జు అంటుకుని ఉంది. వాడు సూటిగా భద్రుడి కళ్లలోకి చూశాడు. వాడి చిన్న బుర్రలో ఏ ఆలోచన తలెత్తిందో తెలీదు, ఆకలిగా ఉన్న భద్రుడి దగ్గరకెళ్లి తన చేతిలో ఉన్న మామిడిపండుని వాడికి అందించాడు. నేను ఏమైనా అనేలోపల భద్రుడు దాన్ని తీసుకుని ఆబగా తినసాగాడు. ఇంతలో మేఘనాదుడు తన చిన్న చిన్న చేతులని భద్రుడివైపు చాపటం, భద్రుడు తను చీకిన మామిడిపండుని వాడి చేతికి ఇవ్వటం చూసి నేను హడిలిపోయాను. నేను వాడి చేతులని బలంగా తన్నేసరికి ఆ పండు గవాక్షంగుండా బైటికి పోయింది. భద్రుడి ముఖంమీద చాచి ఒక్కటి కొట్టాను. నాలోని పరహితత్వం ఒక్క దెబ్బతో మాయమైంది. 'ఈ నీచుడు నా భవనంలోకి వచ్చి తాను ఎంగిలి చేసిన మామిడిపండుని రాకుమారుడికి తినమని ఇస్తాడా? ఎంత ధైర్యం వీడికి?' భద్రుడు కింద పడిపోయాడు. వాడి ముఖం చిన్నబుచ్చుకున్నట్టు ఉన్నప్పటికీ ఆ భావం వెనక నాకు ఒకరకమైన సంతృప్తి కూడా కనిపించింది.

ఇద్దరు పిల్లలూ అరవసాగారు. నేను అతికాయుడి భుజాలు పట్టుకుని వాడిని గట్టిగా కుదిపాను. మేఘనాదుడు తన సవతి సోదరుడిని నా పట్టునుంచి విడిపించేందుకు ప్రయత్నించాడు. తన చిన్న పిడికిళ్లతో నన్ను గుద్దటం ప్రారంభించాడు. అప్పుడు మండోదరి పరిగెత్తుకుంటూ వచ్చి అతికాయుడిని నా చేతుల్లోంచి లాగి విడిపించింది.

"రావణా, మీకేమైనా పిచ్చా? వీడిని చంపెయ్యదలుచుకున్నారా?" అని గట్టిగా అరిచింది ఆమె.

నేలమీద పడి గుక్కపట్టి ఏడుస్తున్న అతికాయుడిని అలాగే వదిలేసి, మేఘనాదుడిని దగ్గరకి లాక్కుంది. నా కుమారుడు వాళ్లమ్మని గట్టిగా కరుచుకుని ఏడవసాగాడు. అదిచూసి అతికాయుడు మరింత గట్టిగా ఏడ్చాడు.

"మేఘనాదుడిని ఈ మురికి వెధవతో ఎందుకు ఆడుకోనిస్తావు?" అన్నాను. నా మాటలు నాకే పసలేనట్టు అనిపించాయి.

నా భార్య గుడ్లురిమి చూస్తూ, "ఈ మురికి వెధవ మీకు పుట్టినవాడే, రావణా!" అనేసి ఏడుస్తున్న తన కొడుకుని ఎత్తుకుని వేగంగా బైటికి వెళ్లిపోయింది. నేను నిర్ఘాంతపోయాను. 'నాతో అలా మాట్లాడేందుకు ఆమెకి ఎంత ధైర్యం?' నా దగ్గరకి వచ్చేందుకు కూడా మునుపు భయపడేది. కానీ కొడుకు పుట్టాక నా మీద ఆధిపత్యం ఉన్నట్టు ప్రవర్తిస్తోంది. ఇంక నన్ను చూసి భయపడటం మానేసింది. నన్ను పేరుపెట్టి పిలవటానికీ, తన పని సాధించుకోటానికీ, నా దగ్గర కోపతాపాలు చూపించటానికీ వెరవటంలేదు. నేను చాలా మృదుస్వభావుడిగా మారిపోయాను. ఎపుడోగాని కోపం రావటంలేదు. కొందరు నన్నుభార్యాదాసుడినని అంటారేమో. పోరాటాలు చేసే, కేకలు పెట్టీ నేను నా స్వభావాన్ని దాచుకోవాలని ప్రయత్నించి నప్పటికీ, చాలాసార్లు ఆమే తన పట్టుదల సాధించుకునేది. తన మీదా, నా కుమారుడిమీదా నాకు ఉన్న ప్రేమని నన్ను అదుపులో పెట్టేందుకు ఆయుధంగా ఉపయోగించేది. నిజానికి నేను కూడా సంతోసంగానే దాన్ని భరించాను.

ఎక్కడా చడీచప్పుడూ లేదని గ్రహించేందుకు కొన్ని క్షణాల సమయం పట్టింది. చుట్టూ చూశాను. అతికాయుడూ, భద్రుడూ నన్ను ఒంటరిగా వదిలేసి మాయమయారు. నేను మేడమీది పిట్టగోడ మీదినించి తొంగిచూశాను. నల్లని ఆకారం ఒక మురికి వీధి కుర్రవాడి చెయ్యి పట్టుకుని కుంటుకుంటూ భోజనశాలవైపు వెళ్తూ ఉండటం కనబడింది. సముద్రం మీదుగా వీచే ఆహ్లాదకరమైన గాలి వాళ్ల మాటలని నా చెవులదాకా మోసుకుని వచ్చింది. వాళ్లిద్దరూ నవ్వుకుంటున్నారు. ఆ నవ్వుల మధ్యలో వాళ్లు అన్న ఒకమాట బాణంలా దూసుకువచ్చి నా మనసులోని సున్నితమైన ప్రదేశంలో దిగబడింది. నేను ఎప్పుడూ వద్దనుకునే అతికాయుడు, అమాయకమైన గొంతుతో భద్రుడిని 'నాన్నా' అని పిలుస్తున్నాడు. భద్రుడే తనని అలా పిలవమని అడిగాడో, లేక

వాడికే అలా పిలవాలని తోచిందో నాకు తెలీదు. కానీ అది నాకు బాధ కలిగించింది. కానీ ఆ అనాకారి వెధవ ఇంక నా జోలికి రాడనీ, నా ప్రియ కుమారుడు మేఘనాదుడికి దూరంగా ఉంటాడనీ అనుకున్నాక నా మనసు శాంతించింది.

అతికాయుడు నా కొడుకేనని అందరికీ తెలిసినప్పటికీ, ఏనాడో నేను బలాత్కరించిన దాసీని భద్రుడు వివాహం చేసుకోవటం ఇప్పుడు పనికివచ్చింది. అంటే భద్రుడికీ, అతికాయుడికీ మధ్య అలాంటి సంబంధం ఉచితమైనదే. నా సేవకుడి భార్యని బలాత్కరించి ఆ కుటుంబానికి ఒక కొడుకుని ఇచ్చానన్న విషయం నేను సిగ్గుపడేలా చేసింది. కానీ అలాంటి వాటికి నేను అలవాటు పడిపోయాను. ఒక ప్రత్యేకమైన సదుపాయం కలిగించాను, రాజాస్థానంలోని గురువులు అతికాయుడికి కూడా విద్య బోధించే ఏర్పాటు చేశాను. రాకుమారులకి బోధించటం అయిపోయాక వాళ్లు అతికాయుడికి విద్య నేర్పేవారు. ఆయుధాలని ఉపయోగించటంలో వాడే అందరికన్నా మెరుగా, త్వరగా నేరుస్తున్నాడని విని నేను ఆశ్చర్య పోయాను. అది వాడికి నానుంచి వారసత్వంగా అబ్బి ఉంటుంది. యుద్ధసమయంలో వాడు నా కుమారుడికి కుడిభుజంలా ఉండేట్టు శిక్షణ ఇప్పించవచ్చన్న ఆలోచన వచ్చింది నాకు.

కాలం గడిచింది, పిల్లలు పెరిగి పెద్దవారయారు. ఎంతో గర్వంగా మేఘనాదుడి విద్య పూర్తయిందని అందరికీ ప్రకటించాను. ఆ పండగని శ్రావణ మాసంలో పౌర్ణమినాడు జరుపుకోవటానికి నిశ్చయించాం. ఆ ఉత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొనేందుకు నా సన్నిహిత మిత్రుడు వాలిని ఆహ్వానించాను. యుక్తవయసులో వైఫల్యానికి గురై నేను అపహాస్యం పాలయాక, మా ఇద్దరిమధ్యా మైత్రి మరింత బలపడింది. వాలి మీద నాకు గౌరవం పెరిగింది. అతనికి కూడా నామీద గౌరవమే. అతని భార్య తారా, నా భార్యా మంచి స్నేహితురాళ్లు. వాలికీ, నాకు పెడదారిపట్టిన సోదరులు ఉన్నారు. మా చర్చల్లో అదే చాలాసార్లు ముఖ్యమైన విషయం అయేది. నీతిమాలిన నా చెల్లెలిమీద వాలి ఒక

కన్నువేసి ఉంచాడు. ఆమె అతని రాజ్యపు పొలిమేరల్లో నివసిస్తోంది. ఆమె చాలా స్వార్థపరురాలనీ, మా అందరికీ ఏదో ఒకనాడు వినాశం కలగజేస్తుందనీ వాలి అనేవాడు. కానీ శూర్పణఖలో అంత శక్తి లేదని అనుకుని నేను వాలి మాటలు పట్టించుకునేవాడిని కాను. ఆమెకి పురుషుల పొందు కావాలి. ఎవరితోపడితే వారితో ఆమె తన కోరిక తీర్చుకునేది. మా కుటుంబానికే ఆమె ఒక మచ్చ. కానీ నా చెల్లెలూ, తల్లీ, జిత్తులమారి మా నాన్న లంకకి దూరంగా ఉన్ననాళూ అందరూ ఏమనుకుంటారు అనే విషయాన్ని నేను పట్టించుకోలేదు. నా కుమారుడి స్నాతకోత్సవానికి త్రికోటకి వచ్చినప్పుడు వాలి పేరుప్రతిష్టలు ఉన్నతస్థితిని చేరుకొని ఉన్నాయి. అతని కుమారుడు అంగదుడు, మేఘనాదుడికన్నా కొన్ని సంవత్సరాలు పెద్ద. అంగదుడు కూడా వాలివెంట వచ్చాడు. కౌమారదశలో ఉండటంవల్ల అతనికి కాస్త తిరగబడే ధోరణి ఉంది, కానీ ధైర్యసాహసాలున్న ఆ వయసు కుర్రవాళ్లు అందరూ అంతేకదా? నా మిత్రుడు తన కొడుకుపట్ల మరీ కఠినంగా ప్రవర్తిస్తున్నాడని నాకు అనిపించింది.

పిల్లలకి ఎదిగేటందుకు స్థలం కావాలి. తండ్రి పెద్ద మర్రి వృక్షంలా ఉంటే పిల్లలు సరిగ్గా ఎదగటం కష్టం. ఆ వృక్షంకింద ఏదీ పెరగదు. ఆ కుర్రవాడు ఎప్పుడూ మౌనంగా, ఏదో ఆలోచనల్లో మునిగినట్టు ఉంటూ, అందరి ముందూ తండ్రిని ఎదిరిస్తూ ఉండేవాడు. అంగదుడితో పోలిస్తే నా కుమారుడు చాలా సౌమ్యుడు, మంచివాడు. నిజానికి వాడు నేను చూసిన కుర్రవాళ్లందరిలోకీ సౌమ్యుడు. వాడు అంగదుడితో స్నేహం చెయ్యటం చూసి నేను భయపడేవాడిని. కానీ మేఘనాదుడు బలహీనుల హక్కులకోసం వారి పక్షం వహించాడు. మేము జీవిస్తున్న వర్తమాన కాలానికి అది అనుచితమేమో అని అనుకునేవాడిని. నా కుమారుడికి పాతకాలంనాటి, సాంప్రదాయకమైన అభిప్రాయాలూ, నీతులూ నచ్చేవి. వాడు వాటినే పాటించేవాడు. నా మనసులో వాడి భవిష్యత్తు గురించి భయం ఉండేది. కానీ వాడు అందరు మనుషులూ స్వభావరీత్యా మంచివారేననీ, ఉదాత్తులేననీ, కులం, జాతి, మతం

ఏదైనప్పటికి మానవులందరూ సమానులే అనీ వాదించేవాడు. విలువలూ, తథ్యాలూ, నైతికతా, రుజువర్తనమూ, శాశ్వతమైనవనీ, మానవుడు ఎంత ప్రగతి సాధించినప్పటికీ అవి మారవనీ వాదించేప్పుడు వాడు ఉద్రేకపడిపోయేవాడు. నాకు వాడిని చూస్తే ఒక పక్క గర్వంగానూ, మరోపక్క భయంగానూ ఉండేది.

దురదృష్టవశాత్తూ నా భయాలు నిజమయాయి. పాపం మోసాలు చేసే జిత్తులమారి మనుషుల గురించి వాడికేం తెలుసు? సోదరులూ, మిత్రులూ చేసే ద్రోహం గురించి వాడికి ఏం తెలుసు? రెండు నాల్కలున్న ఈ అసహ్యకరమైన, ప్రపంచం అవతలి వ్యక్తిని అణచివేసేందుకు ఎంతకైనా తెగిస్తుందని వాడికి ఏం తెలుసు? అవును, నేను కూడా ఈ ప్రపంచాన్ని మార్చేస్తానని గొప్ప గొప్ప కలలుకన్నాను. వాడి వయసులో ఉన్నప్పుడు ఒక గొప్ప సమృద్ధితో కూడిన సమాజాన్ని నిర్మించాలని అనుకున్నాను. తరవాత వయసు పెరిగాక ఆ కలలలోంచి బైటపడ్డాను. మేఘనాదుడికి అన్ని రకాల వైభోగాలూ అందుబాటులో ఉన్నాయి. నేను ఆ వయసులో ఉండగా నాకు తెలిసినది ఆకలి ఒక్కటే.

కానీ ఏమిటి నా ఆలోచనలు ఇంకో దారిన పోతున్నాయి? నక్కలు ప్రస్తుతానికి నన్ను వదిలి వెళ్లిపోయాయి. అవి నా మెదడుని తినేస్తే ఇక ఈ ఆలోచనలు రావు కదా? గుర్తు తెచ్చుకోవలసిన విషయాలు చాలానే ఉన్నాయి. శివా! నన్ను నీ సన్నిధికి పిలిపించుకోవయ్యా! నువ్వు నిజంగా ఉంటేనే సుమా! త్వరలోనే నాకు ఎలాగూ తెలుస్తుంది. కానీ ఏవేవో దృశ్యాలు కళ్లముందుకి వస్తున్నాయి... ఎన్నో విషయాలు. వాటిలో మరీ స్పష్టంగా కనిపిస్తున్నది నా కుమారుడు విద్య పూర్తి చేసినప్పుడు జరిగిన ఉత్సవం. మండోదరి ముఖంలో కనిపించిన గర్వంతోకూడిన సంతృప్తి నాకింకా గుర్తుంది. తన కొడుకు అందంగా ఉన్నాడని కాని, వాడు మా పక్కనించి గుర్రంమీద వెళ్తున్నప్పుడు మెరిసిపోయే వాడి రూపం, ఎగిరే వాడి కురులూ చూసికాని, ఎంతో ఒడుపుగా విల్లంబులు పట్టుకుని పక్షులనీ, స్వారీ చేస్తూనే మడుగులోని చేపలనీ కొడుతున్నాడని కానీ ఆమె గర్వించటంలేదు. తన

స్నేహితురాలు తార కొడుకుకన్నా తన కొడుకే మెరుగైనవాడుగా ఎదిగాడనీ, నా అక్రమ సంతానం అతికాయుడికన్నా మేఘనాదుడు ఎన్నోరెట్లు గొప్పవాడనీ ఆమెకి గర్వం. నాకూ గర్వంగానే ఉంది, కానీ మండోదరి ధోరణి చూస్తూంటే పోటీలో తానే విజయం సాధించినట్టు అనుకుంటున్నట్టు అనిపించింది. అసలు తలిదండ్రుల మధ్య ఈ పోటీ ఏమిటి? ఇది ఎప్పుడు ప్రారంభమైంది?

సరిగ్గా ఆ సమయంలోనే నా జీవితంలో నాకెంతో ఇబ్బంది కలిగించే ఒక సంఘటన జరిగింది. నా కుమారుడు గుర్రపు జీను మీదినించి జారాడు. జనం కంగారు పడ్డారు. వాలికీ తారకీ మధ్యలో కూర్చున్న అంగదుడు పగలబడి నవ్వాడు. నా కుమారుడు మళ్లీ గుర్రంమీద సర్దుకుని కూర్చుని సవారీ చెయ్యసాగాడు. నాకు లోపల మండిపోతున్నా అంగదుడి పరిహాసాన్ని పట్టించుకోలేదు. కానీ ఆ తరవాత ఒక పెద్ద ఉపద్రవం ముంచుకొచ్చింది. అది నా దేశాన్ని యించుమించు యుద్ధంవైపుకి నడిపిస్తూ నా రాజ్యానికి వినాశనం కలిగించేది! ఎవరో పోట్లాడు కుంటున్నట్టు గొడవ వినిపించింది. ఆ శబ్దం వచ్చినవైపు తలతిప్పి చూసి కొయ్యబారిపోయాను. అంగదుడు నేలమీద పడిపోయాడు. కొంతసేపు ఇబ్బంది కరమైన నిశ్శబ్దం తాండవించింది. మేఘనాదుడు కొంతదూరాన గుర్రాన్ని ఆపాడు. మా వెనక లావుపాటి నల్లటి అతికాయుడి ఆకారం లేచి నిలబడింది. ఆ తరవాత కావాలనే నెమ్మదిగా నడుచుకుంటూ వాడు అక్కడినుంచి నిష్క్రమించాడు. 'ఈ మూర్ఖుడు చేసిన పనేమిటి? ఈ నీచజాతి స్త్రీ కొడుకు!'

"ఆ వెధవని పట్టుకోండి!" అని గర్జించాను. వందలమంది భటులు కత్తులు బైటికి తీశారు. అంగదుడినీ, అతికాయుడినీ చుట్టుముట్టారు. వాలి ముఖం ఎర్రగా కందింది.

అతికాయుడు తన నల్లని, మోటైన పెదాలని తెరుచుకుని ఉండిపోయాడు. వాడి ఉంగరాల జుట్టులోంచి కొన్ని వెంట్రుకలు గాలికి ఎగురుతున్నాయి. ఏమీ అర్థం కానట్టు చూస్తూ నిలబడిపోయాడు

వాడు. వాడు బుద్ధిలేని ఎద్దులా కనిపించాడు, కాని వాడి పిడికిళ్లు బిగిసి ఉండటం చూశాను. రుద్రకుడు కత్తి రుళిపిస్తూ వాడికేసి నడిచాడు.

"వాడు... వాడు... నా సోద... నా ఉద్దేశం, రాకుమారుడు మేఘనాదుడిని అవమానించాడు," అన్నాడు అతికాయుడు తడబాటుతో. జనం తమలో తాము మాట్లాడుకోసాగారు. మేఘనాదుడి ముఖంలో వినోదం, ప్రేమా తొణికిసలాడాయి.

"వీడిని భూగృహంలో పడవేయండి. వీడి విషయం రేపు నిర్ణయిస్తాం," అని అరిచాను, కొనకంటితో కోపంగా ఉన్న వాలి ముఖాన్ని చూస్తూ.

"వాడి సంగతి నేను చూస్తాను," అన్నాడు అంగదుడు.

"అంగదా..!" వాలి గొంతు వినేవారి రక్తం గడ్డం కట్టించేట్టు పలికింది, కానీ అంగదుడు తన తండ్రి ఆగ్రహాన్ని లెక్కచెయ్యలేదు. నా తండ్రిపట్ల నాకు ఉన్న లాంటి ద్వేషమే నాకు అంగదుడి కళ్లలో కనిపించింది. పరిస్థితి నా చెయ్యి దాటిపోతోందని గ్రహించి నేను నా ఆసనంలో కూలబడిపోయాను. మూరుడైన ఈ అతికాయుడిని అంగదుడు త్వరగా తుదముట్టించి నన్ను ఈ గడు పరిస్థితినుంచి గట్టెక్కించమని ప్రార్ధించటం తప్ప మరేమీ చెయ్యలేకపోయాను.

"ఓరీ, మూర్ఖుడా!" అని బుసకొట్టాడు వాలి. కానీ అంగదుడు తనని తాను నిగ్రహించుకోలేక పోయాడు. వాడు నాటకీయంగా భటులందరినీ తప్పుకోమని సైగ చేశాడు. రుద్రకుడు నా ఆదేశం కోసం నావైపు చూశాడు. నేను జోక్యం చేసుకో వద్దని సంకేతాన్నిస్తూ తల ఊపేసరికి అతను భటులని వెనక్కి తగ్గమని చెప్పాడు.

"వీడు నన్ను తన్నాడు. నేను కోల్పోయిన మర్యాదని మళ్లీ సంపాదించు కోవాలి," అన్నాడు కోపంగా అంగదుడు వాలితో. తరవాత గొంతు చించుకుని అరుస్తూ అక్కడ గుమిగూడిన జనంతో, "లంకా రాజ్య పౌరులారా, తను సింహాన్ని అనుకునే ఒక గాడిదతో మా వానరులు ఎలా వ్యవహరిస్తారో చూడండి!" అన్నాడు. అతికాయుడు

గుడ్లగూబలా కళ్లు ఆర్పుతూ తెలివితక్కువ దద్దమ్మలా నిలబడి చూస్తూ ఉండిపోయాడు. మేఘనాదుడు గుర్రందిగి అతికాయుడి దగ్గరకి వచ్చాడు. వాడి చేతులు పట్టుకుని, చెవిలో ఏదో రహస్యం చెప్పి, ప్రాంగణం మధ్యకి తీసుకొచ్చాడు. నా పాపఫలితంగా కలిగిన కొడుకు, నా ప్రియ తనయుడు మేఘనాదుడి వెంట నడిచి వస్తూ ఉంటే జనం హర్షధ్వానాలు చేశారు. రాకుమారుని ఆ ఒక్క చేష్టవల్ల అతికాయుడు ప్రజలకి ప్రేమపాత్రుడు అయాడు. మేఘనాదుడు తన కత్తిని ఒరలోనించి తీసి విసరగానే అతికాయుడు అవలీలగా దాన్ని అందుకున్నాడు. అది చూసి నేను దిగ్భ్రాంతికి గురయాను. వీడిలో సహజంగానే నైపుణ్యం ఉంది అని అనుకున్నాను. అప్పుడు నేను అయోమయంలో పడ్డాను. ఒకవైపు నా రాజ్యాన్నీ వాలితో నా స్నేహాన్నీ కాపాడుకునేందుకు అతికాయుడు చనిపోవాలని కోరుకున్నాను. కానీ మరోవైపు మనసులోతుల్లో ఎక్కడో నేను వాడి తండ్రిని అనే గర్వంతో అతికాయుడు గెలవాలని కోరుకున్నాను. ఎంతైనా వాడు నా రక్తం పంచుకుని పుట్టినవాడు మరి.

అంగదుడు గుండ్రంగా తిరగసాగాడు. వాడిని ఎగతాళి చేస్తూ జనంవేసే ఈలలూ, కూతలూ వినిపించాయి. మరుక్షణం జనం, "వానరులు నశించాలి! నరకానికి పోవాలి వానరులు!" అని గొంతెత్తి అరవసాగారు. వాలి వైపు చూశాను. అతని చేతులు ఆసనాన్ని గట్టిగా పట్టుకుని ఉన్నాయి. అతని పెద్ద పెద్ద బాహువుల్లో నరాలు బిగుసుకుని ఉబ్బి ఉన్నాయి. కానీ అతని ముఖంలో మాత్రం ఏ భావమూ కనిపించలేదు. జనం వానరులని తిట్టటం ప్రారంభించారు. వాళ్లది సంకరజాతి అనీ, కోతి మనుషులనీ అన్నారు. కొందరైతే వానరరాజునే అవమానించారు. నేను రుద్రకుడికోసం వెతికాను. కానీ రుద్రకుడు నావైపు వీపుపెట్టి ద్వంద్వ యుద్ధం ఎప్పుడు ప్రారంభమవుతుందా అని శ్రద్ధగా ఎదురు చూడటం కనిపించింది. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. జనం చెవులు చిల్లులు పడేటట్టు అరుస్తున్నారు. కానీ కత్తులు ఢీకొన్న చప్పుడు మొదటిసారి వినబడేసరికి గోల అణిగిపోయింది. అప్పుడు

ఇద్దరి మధ్యా యుద్ధం ప్రారంభమైంది- జగడాలమారి స్వభావం ఉన్న నా మిత్రుడి కొడుకుకీ, దాసీ పత్రునికీ మధ్య. మొదట కొన్ని నిమిషాలలో అంగదుడు ప్రత్యర్థిని గాయపరిచి రక్తం కళ్లచూడసాగాడు. అతను చురుగ్గా, త్వరగా కదులుతున్నాడు. అతికాయుడు ఒక్కోసారి చాతుర్యం లేనివాడిలాగానూ, మరోసారి గొప్ప వీరుడిలానూ కత్తి తిప్పాడు. కానీ వాడి కత్తి మొన కూడా అంగదుడిని తాకలేకపోయింది. నా ఒత్తిడి కొంత తగ్గింది, కానీ బాధ కూడా కలిగింది. జనం మౌనంగా ఏం జరుగుతుందా అని ఉత్కంఠతో ఉన్నారు. వాతావరణంలో ఉద్రిక్తత పేరుకున్నట్టు నాకు తోచింది. వాలి కాస్త స్థిమిత పడినట్లు కూడా గమనించాను. ఈసారి అంగదుడు అతికాయుడిని తొడలమధ్య కాలితో తన్నేసరికి, వాడు అంత ఎత్తు ఎగిరికింద పడిపోయాడు. నేలమీద వాడు దబ్బున పడిన చప్పుడు మా చెవులకి భయంకరంగా వినిపించింది. జనం ఎగఊపిరి విడిచిన చప్పుడు వినిపించింది. అంగదుడు వికటాట్టహాసం చేశాడు.

అతికాయుడు కుప్పకూలిపోయాడు. స్పృహ కోల్పోయాడో,

చనిపోయాడో! అంగదుడు జనంవైపు చూసి తన కత్తిని ఝళిపించాడు. కావాలంటే వాడు కత్తితో పొడిచి అతికాయుడిని చంపివేసి ఉండవచ్చు. కానీ అలాంటి పనేదీ చెయ్యలేదు. అది మరీ చేతకానివాళ్లు చేసే పనిలా తోచిందేమో. అసురుడిమీద వానర రాకుమారుడు సాధించిన విజయాన్ని వాడు తనివితీరా, దాని తాలూకు ప్రతిక్షణాన్ని సంతోషంగా అనుభవిస్తున్నాడు. వాలి ముఖంలో చిరునవ్వు తాలూకు సన్నని రేఖ కనిపించింది నాకు. దానితోపాటు గర్వం కూడా తళుక్కున మెరిసి మాయమైంది. నాకు బాధ వేసింది కానీ ఒత్తిడిలోనుంచి విముక్తి లభించింది. ఒక పెద్ద సంకట పరిస్థితి తప్పిపోయింది. కానీ ఇంతలో కిందపడిపోయిన తన సవతి సోదరుడివైపు నా కుమారుడు పొడుగ్గా, హుందాగా నడవటం కనిపించింది. అంగదుడు తన చేష్టలు మాని కోపంగా నా కుమారుడివైపు చూశాడు. అంగదుడు మేఘనాదుడిని ద్వంద్వయుద్ధానికి రమ్మని పిలవకూడదని దేవుడిని ప్రార్థించాను. అప్పుడు మేఘనాదుడు ఒప్పకోక తప్పదు, ఫలితం ఏదైనప్పటికీ ఘోరంగానే ఉంటుంది. నేను వాళ్లిద్దరినీ గమనిస్తూ నిలువెల్లా కంపించి పోతున్నానని గ్రహించాను. 'వాలి కొడుకు మూర్ఖుడు. వాడిని నేను చంపగలను. ఎవరైనా తమ పిల్లలని సవ్యంగా ఎందుకు పెంచరో?'

మేఘనాదుడు అతికాయుడి తలని తన ఒళ్లోపెట్టుకుని వాడి చెవిలో ఏదో చెప్పాడు. కాసేపు ఇబ్బందికరమైన నిశ్శబ్దం నెలకొంది. కాలం ఆగిపోయింది. ఆరోజు ఎండా, ఉక్కపోతా ఎక్కువగా ఉన్నాయి. సముద్రం మీదినించి వీచేగాలి కూడా స్తంభించింది. ఎక్కడో దూరాన ఒక మేక అరిచింది, వెంటనే మేకపిల్ల దానికి జవాబుగా 'మే! మే!' అంది. నా వీపు చెమటతో తడిసిపోయింది. అతికాయుడు కదలగానే జనంలో సందడి వినిపించింది. ఆ తరవాత అతికాయుడు మేఘనాదుడి భుజాన్ని పట్టుకుని సాయంతో లేచి నిలబడేందుకు ప్రయత్నించాడు. రెండుసార్లు పట్టు జారిపోయేసరికి మేఘనాదుడు బలంగా వాడిని పట్టుకున్నాడు. అప్పుడు వాడు మేఘనాదుడిని పక్కకి తోసేసి

తడబడుతూ అంగదుడివైపు రెండు అడుగులు వేశాడు. నిలదొక్కుకుని నిలబడి పెద్దగా గర్జించాడు. ఆ గర్జన మనిషి గొంతులోనుంచి వచ్చినట్టు అనిపించలేదు. ఆ ప్రాంతమంతా ప్రతిధ్వనించి క్షణం సేపు ఆవరించిన నిశ్శబ్దంలో కలిసిపోయింది. వెనువెంటనే జనం పదివేల గొంతులతో గర్జించారు. ఆ ధ్వనికి నా రక్తం గడ్డకట్టింది.

మేఘనాదుడు మారీచుడి దగ్గర్నించి గద తీసుకుని కావాలనే అతికాయుడి దగ్గరికి నడిచాడు. కానీ వాడి కళ్లు మేఘనాదుడిని కాదు, తన ప్రత్యర్థినే తదేకంగా చూస్తున్నాయి. అతికాయుడు ఎడమచేతితో గదని అందుకుని కుడిచేతికి మార్చు కున్నాడు. కాళ్లు రెండూ ఎడంగా పెట్టి నిలబడ్డాడు. ఒళ్లంతా గాయాలు రక్తం ఓడుతున్నాయి. వాడి పెద్ద ఎడమచెయ్యి నడుముమీద ఆని ఉంది. అందవికారమైన వాడి నల్లని ముఖంలో అంగదుడిపట్ల ఆగ్రహం కనిపిస్తోంది. అంగదుడికి వేరేదారి లేకపోయింది. అతికాయుడు గద చేతపట్టుకున్నాడు కాబట్టి తను కూడా కత్తికింద పడేసి గద తీసుకోవటమే మర్యాదస్తులు చెయ్యవలసిన పని అని అంగదుడు అనుకున్నాడు. వాడు గద పట్టుకోగానే జనం ముక్తకంఠంతో, "వానరుడు నశించాలి. కోతి మనిషి నశించాలి!" అంటూ నినాదాలు చెయ్యసాగారు.

పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అతికాయుడు కత్తి యుద్ధంలో నిపుణుడు కాడు. వాడి బండ శరీరం అంగదుడి శరీరమంత చురుగ్గా కదలలేదు. కానీ వాడి భారీ శరీరం గద తిప్పేందుకు బాగా పనికివస్తుంది. అయినప్పటికీ అంగదుడు ఎంతో వేగంగా, చాకచక్యంగా అతికాయుడు గాయపడేట్టు గదా యుద్ధం చేశాడు. అతికాయుడి చేతిలో అంగదుడికి తగిలిన దెబ్బలు తక్కువే అనాలి. కానీ అతికాయుడు కొట్టిన దెబ్బలు సూటిగా, బలంగా తగలటంచేత, కొట్టిన దెబ్బలు తక్కువే అయినా అవి ప్రత్యర్థికి తగిలి గాయపరిచాయి. అంగదుడు దెబ్బకొట్టి వెనక్కి దూకేవాడు, భారీకాయుడైన తన శత్రువుకి చిక్కేవాడు కాదు. ఆ పద్ధతి కత్తియుద్ధంలో పనికి వస్తుంది. కానీ గదతో కొట్టిన దెబ్బ బలంగా, సూటిగా తగలకపోతే, దానివల్ల పెద్ద ఫలితం ఉండదు, ముఖ్యంగా

అతికాయుడిలాంటి కండలు తిరిగిన శత్రువుతో తలపడినప్పుడు. జనం వాడిని ఉత్సాహపరుస్తూ అరిచినకొద్దీ అతికాయుడి బలం విపరీతంగా పెరిగిపోయింది.

నాకు నాకుమారులని చూస్తే గర్వం అనిపించింది. 'సంకరజాతి నరవానరుడు పశువులాంటి తన కుమారుడితో వచ్చి మాలాంటి యోధులని చావగొట్టగలననే అనుకున్నాడా?' ఇంతలో నా ఆలోచనలకి ఆనకట్ట పడింది. ఒకవేళ అతికాయుడు గెలిస్తే ఏమవుతోందోనని భయం వేసింది నాకు. వాలితో నాకు మైత్రి కావాలి. వాలి మంచి యుక్తిపరుడు. అతను అనాగరికులైన దేవతల గుంపుని గంగానదీతీర మైదానప్రాంతాలనుంచి కిందివైపుకి రాకుండా ఆపుతున్నాడు. అటువంటి మిత్రులని కోల్పోకూడదు. అక్రమ సంతానాన్ని సులభంగా వదిలించుకోవచ్చు, కానీ వాడిలో నా రక్తం ప్రవహిస్తోంది. ఈ పర్వతాకారుడు, అనాకారి, దాసీ పత్రుడు ఇలాగే విజృంభించాడంటే వాడు వాలిని నాకు అతిపెద్ద శత్రువుగా మార్చెయ్యగలడు.

అంగదుడు నేలకూలాడు. వాడి రెండు చేతులూ విరిగిపోయి మళ్లీ సరిచెయ్య లేనంతగా వంకరపోయాయి. అతికాయుడు గాయపడి రక్తం ఓడసాగాడు. వాడి ఎడమకాలికింద రక్తం మడుగు కట్టింది. ఆయాసంతో రొప్పతున్న అంగదుడి గుండెలమీద వాడు తన కుడికాలిని నొక్కిపెట్టాడు. వాలి తను కూర్చున్న ఆసనం మీదినించి లేచి నిలబడ్డాడు. అతని పిడికిళ్లు బిగుసుకున్నాయి, ముఖం ఒత్తిడితో కఠినంగా మారింది. అతని భార్య ముఖం భయంతో బిగుసుకుంది. జనం వెర్రిగా కేకలు పెట్టారు, "చంపెయ్యి! చంపెయ్యి! వానర పుత్రుడిని చంపివెయ్యి" అనే కేకలు అంతటా మారుమోగాయి.

అతికాయుడు తన గదని పైకి ఎత్తాడు. ఆ విసురుకి అది దాదాపు వాడి వెన్నుని తాకింది. వాడు ఆ గదతో బలంగా అంగదుడి తలమీద బాది దాన్ని ముక్కలు చేసి ఉండేవాడే.

'రుద్రకా!" అని గొంతు చించుకొని అరిచాను. నా అరుపు వాడికి

వినిపించిందో లేదో నాకు తెలీలేదు. కాలం ఆగిపోయినట్టు అనిపించింది. అప్పుడు అతికాయుడు నాకేసి చూశాడు, 'వాడి కళ్లలో నాకు కనిపించింది ఏమిటి? ద్వేషమా, ఆశ్చర్యమా, జాలా లేక కల్తీలేని తిరస్కార భావమా?' అరక్షణంపాటు నాకేసి చూస్తూ నిలబడిపోయాడు వాడు. జనం నిశ్శబ్దంగా చూడసాగారు. ఆ రూపం నా మనసులో శాశ్వతంగా నిలిచిపోయింది. అప్పుడు రుద్రకుడి కళ్లు నా కళ్లతో కలిశాయి. అతను నా భావాన్ని అర్థం చేసుకున్నాడు. అతను చిటికె వెయ్యగానే ఇరవైమంది భటులు బిలబిలా రంగంలోకి దూకారు. అతికాయుడి నా హృదయంలోకి తొంగిచూస్తూ అక్కడే నిలబడ్డాడు. నేను వద్దని అనుకున్న నా కుమారుడు వాడు. ఇరవైమంది భటులూ వాడిని నలువైపులనుంచీ కర్రలతోనూ, గదలతోనూ కొట్టసాగారు. కానీ వాడు ఒక పెద్ద వటవృక్షంలా చెక్కుచెదరక అలాగే నిలబడి ఉండిపోయాడు. మృత్యువు చేస్తున్నవిలయతాండవాన్ని తనమీద పడుతున్న దెబ్బల వరాన్ని ఏమాత్రం లక్ష్యపెట్టకుండా నిలబడ్డాడు. వాడి బలమైన పెద్ద కాలికింద అంగదుడు ఇంకా నలిగిపోతూనే ఉన్నాడు. జనంలోనుంచి ఒక నల్లటి ఆకారం హఠాత్తుగా అతికాయుడిని చేరుకుంది. కానీ రుద్రకుడు తన కత్తిపిడితో బలంగా కొట్టేసరికి, ఆ ఆకారం మట్టికరిచింది. ఆ ఆకారం భద్రుడిదేనని నాకు తరవాత తెలిసింది. పరిగెత్తే భటుల కాళ్లకింద వాడు నలిగిపోయాడు. కొంతసేపు గిలగిలా కొట్టుకుని కదలకుండా ఉండిపోయాడు. మేఘనాదుడూ, మారీచుడూ రుద్రకుడిని ఆపటానికి ప్రయత్నించటం నాకు కనబడింది. జనం ప్రతిస్పందించ లేనంతగా మ్రాన్పడిపోయాను. గొప్ప అన్యాయం జరిగిపోతోంది. నిశ్చేష్టులైన జనం మళ్లీ మేల్కొంటే ఎలాంటి అనర్థం వాటిల్లుతుందో అని ఆలోచించేసరికి నాకు భయం వేసింది. ప్రహస్తుడు భటులని ఆదేశించటం నాకు వినబడింది. త్వరగా అతికాయుడిని అక్కడినించి తొలగించే ఏర్పాట్లు చేస్తున్నాడు అతను. ఇంతలో నా సొంత మేనమామా, నా ప్రియమైన కుమారుడూ విశ్వాసపాత్రుడైన నా సేనాధిపతితో పోరాడటం చూసి హడిలిపోయాను. వాళ్లు పోరాడేది నా అక్రమసంతానం, అతికాయుడిని

కాపాడేందుకు! ఇదేదో పీడకలలా తోచింది నాకు. జనం భటులతో కలియబడ్డారు. కొన్ని చోట్ల అగ్గి రాజుకుంది. తొక్కిసలాట ప్రారంభమైంది.

వాలి రంగంలోకి పరిగెత్తి రావటం అప్పుడు కనబడింది నాకు. మారీచుడు రుద్రకుడితో హోరాహోరీ పోరాడుతున్నాడు. మేఘనాదుడు భటుల వలయాన్ని దాదాపు ఛేదించాడు. అదే సమయంలో వాలి అడ్డం వచ్చిన వాళ్లందరినీ నరుకుతూ లోపలికి ప్రవేశించాడు. మేఘనాదుడు వాలిని అడ్డుకున్నాడు. అప్రయత్నంగా నా చెయ్యి నా ఒరలోని కత్తిమీదికి వెళ్లింది. కానీ నేను ఏమైనా చేసేలోపలే వాలి చురుకుగా మేఘనాదుడి మణికట్టని పట్టుకుని వాడి కత్తిని లాగేసుకున్నాడు. తరవాత రుద్రకుడిని కాలితో బలంగా తన్ని కింద పడవేశాడు. మేఘనాదుడిని బలంగా నెట్టేసరికి వాడు నిలదొక్కుకోలేక వెల్లకిలా పడిపోయాడు. ఆ తరవాత ధీశాలి అయిన నా మేనమామ వంతు వచ్చింది. వాలి ఆయన్ని ఎత్తి పది అడుగుల దూరం విసిరేశాడు. మిగిలిన భటులందరూ హడిలిపోయి ఆయనకి దారి ఇచ్చారు. అతికాయుడు రొప్పుతూ రోజుతూ అంగదుడిమీద కుప్పకూలిపోయాడు. వాలి సునాయాసంగా అతికాయుడి భారీశరీరాన్ని పైకెత్తి పట్టుకున్నాడు. 'వీడిని ఈయన నేలకేసి కొట్టబోతున్నాడు. నా రాజ్యానికి వచ్చి నా కొడుకునే చంపేందుకు ఈయనకి ఎన్ని గుండెలు?' అనుకున్నాను.

జనం వానరుల రక్తం కళ్లజూడాలన్న ఉద్రేకానికి గురయారు. రక్షణ వలయాన్ని ఛేదించుకుంటూ చాలామంది మధ్యలోకి పరిగెత్తి వచ్చారు. తన కొడుకు విషయం చూసేముందు వాలి అతికాయుడిని నేలకేసి కొట్టి హతం చేస్తాడని అనుకున్నాను. కానీ అందరినీ ఆశ్చర్యపరిచే విధంగా వాలి నా కొడుకుని ఎత్తుకుని వెనక్కి నడిచివచ్చాడు- అతని చేతుల్లో రక్తసిక్తమై, చావుదెబ్బలుతిన్న గాయపడిన, అనాకారి, నల్లటి నా కొడుకు! జనం మళ్లీ నిశ్శబ్దంగా ఉండిపోయారు. పోరాటం జరుగుతున్నచోటికి పరిగెత్తుకుని వచ్చినవాళ్లు అక్కడే ఆగిపోయి ఏం

జరుగుతుందా అని చూడసాగారు. తార వెక్కివెక్కి ఏడవసాగింది. నా భార్యకూడా ఆమెతో కలిసి ఏడవసాగింది. మరి, నా కళ్లలోకూడా నీళ్లు నిండాయి. వాటిని దాచుకునే ప్రయత్నంలో వెనక్కి తిరిగి నా భటులకి గట్టిగా ఆదేశాలు ఇచ్చాను.

కానీ ఎవరూ నా మాటలు వినిపించుకోలేదు. ఇక నా మిత్రుడు, ధీరోదాత్తుడు, నా జీవితంలో నేను చూసిన వాళ్లలో అందరికన్నా న్యాయమూర్తి అయిన వ్యక్తి, వాలి– ఈలోకంలో నిజంగా గొప్పవాడు అనదగిన వ్యక్తి- ఓడిపోయిన నా కొడుకుని ఎత్తుకుని నా దగ్గరకి వచ్చాడు. అతని కుమారుడు పడిపోయినచోటనే ఉండిపోయాడు. వాడు చనిపోయాడో బతికే ఉన్నాడో మాకు తెలియలేదు. కానీ ఆ వ్యక్తి హృదయం గొప్పది. ఆయన న్యాయాన్నే పాటించాడు. నేను చేసినపని చాలా నీచమైనది. అలా ప్రవర్తించినందుకు సిగ్గుపడ్డాను. శక్తిమంతుడైన అసురరాజుని నేను, కానీ ఆరోజు కన్నీళ్లు కార్చాను, అదీ వేలమంది నా పురజనుల ఎదుట. లోకానికి నా ముఖం చూపించకుండా ఒంటరిగా ఏడ్చాను.

అతికాయుడిని వాళ్లు రాజవైద్యుడి దగ్గరికి తీసుకెళ్లారు. ఆ బుద్ధిహీనుడు, భద్రుడిని కూడా తీసుకెళ్లారు. అతికాయుడు కొట్టిన దెబ్బలకన్నా సిగ్గుతోనూ, భయంతోనూ సగం చచ్చిన నా స్నేహితుడి కొడుకుని వాళ్లు అక్కడినించి తీసుకెళ్లి పోయారు. వాళ్ల గాయాలు మానిపోతాయి, కానీ మా హృదయాలకి తగిలిన గాయాల మాటేమిటి? అవి ఎప్పటికైనా అసలు మానుతాయా? స్నేహం మిత్రద్రోహాన్ని తట్టుకుని మనగలదు, కానీ అంత అసాధారణమైన దయనీ, ఉదాత్త హృదయాన్నీ తట్టుకోగలదా?

జనం అక్కడినించి వెళ్లిపోసాగారు, కానీ వాళ్లు గోలగా మాట్లాడుకుంటూ కదులుతూ ఉండగా, భవిష్యత్తులో జరగబోయే సంఘటనలని సూచించే ఒక విషయాన్ని నేను వినటం తటస్థించింది. ఆ దుష్టుడు, అంగదుడు తన తండ్రి పక్కనుంచి వెళ్తూ, "బలహీనుడా! నీ పని పడతాను చూస్తూ ఉండు..." అంటూ పళ్లు బిగించి ఇంకా ఏదో

అన్నాడు. కానీ వాలి అవేమీ వినన‌ట్టు దూరంగా ఎటో చూస్తూ ఉండిపోయాడు. రాణి తార ద్వేషం నిండిన కళ్లతో తన భర్తవైపు చూడటం గమనించి, నా ప్రాణస్నేహితుడి క్షేమం గురించి భయపడ్డాను. ఆ క్షణంలో నాకు తెలిసిన లోకం మారిపోయిందన్న భయం కలిగింది. మా తరం, దాని విలువలను, నీతినియమాలు లేని, అహంకారంతో నిండిన అంగదుడిలాంటి నవయువతరం లక్ష్యపెట్టటం లేదని అనిపించింది. రాబోయే కాలంలో మాలాంటి ముసలివాళ్లు తుడిచిపెట్టుకు పోతారని భయపడ్డాను. నేను మరీ త్వరగా వృద్ధుడిని అయిపోతున్నా నని అనిపించింది. నెమ్మదిగా నా భార్య చెయ్యిపట్టుకుని రథంవైపు నడిచాను. ఆ రాత్రి నా భార్య నన్ను ఒంటరిగా, నా ఆలోచనలకి వదిలివేసింది. నాలోని చీకటిలోకి నేను ఒక క్రిమిలాగ ముడుచుకుపోయాను. మర్నాడు తెల్లవారగానే, వాలీ, తారా, గాయపడిన తమ కుమారుడిని వెంటపెట్టుకుని వెళ్లిపోయారు. ఆ తరవాత నేను నా స్నేహితుడిని మళ్లీ ఎప్పుడూ చూడలేదు.

24. రాజ్యం తమ వీరుడికి ధన్యవాదాలు అర్పించింది

భద్రుడు

ఒళ్లంతా గాయాలకి కట్టిన కట్లతో ఉన్న వాడిని ఇంటికి చేర్చేసరికి దాదాపు తెల్లవారింది. వాళ్లు తనని మోసుకొస్తూ ఉంటే వాడు సన్నగా మూలగసాగాడు. మౌనం వహిస్తూ వాళ్లు సుతారంగా అతికాయుడిని పడుకోబెట్టారు. అలాగే ఒక్కమాట కూడా మాట్లాడకుండా నిష్క్రమించారు. అతికాయుడు నా చేతుల్లో పెరిగాడు. మూడేళ్లు వచ్చినప్పట్నించీ వాడు నన్ను నాన్నా అని పిలవసాగాడు. మొదట్లో నేను హడిలిపోయాను. అక్రమ సంతానమే అయినప్పటికీ వాడు రాకుమారుడు, ఇక నేను మాత్రం నేనే. వాడిని కోప్పడ్డాను, బతిమిలాడాను, నన్ను అలా పిలవవద్దని ఏడ్చాను కూడా, కానీ వాడు మాత్రం నా మాట వినలేదు. నా మనసులో వాడు నన్ను అలాగే పిలవాలన్న కోరిక మాత్రం నాకు ఉండింది. ఇప్పుడు వాడు నా కొడుకు. ఏ రాజూ వాడిమీద తనకి హక్కు ఉందని అనలేడు. నన్ను వాడు ఈ మట్టితో బంధించాడు. ఇద్దరం కలిసి త్రికోట నగరాన్నీ అక్కడి అడవులనీ, ఉప్పటేరులనీ, చుట్టూ ఉన్న కొండలనీ చూడటానికి వెళ్లేవాళ్లం. వాడికి ఆయుధాలు ఉపయోగించటం నేర్చాను. నా పూరిగుడిసెకి వాడే రాజు, వాడే నా భవిష్యత్తు, నాకు గర్వకారణం.

వాడిని ఎవరైనా ఎగతాళి చేస్తే బాధపడేవాడిని. న్యాయంగా రాజ్యానికి వారసుడైన పొగరుబోతు, అన్నీ తెలుసునని అనుకునే మేఘనాదుడివెంట కుక్క పిల్లలా వెళ్లే అతికాయుడిని చూసి నా మనసు విలవిలలాడేది. కానీ అతికాయుడికి తన సవతి సోదరుడిపట్ల ఎనలేని ప్రేమ ఉండేది. నాకు అది చూసీ, వాడికి నా భార్యపట్ల ఉండే ప్రేమని చూసీ అసూయ కలిగేది. వాడిని రాజభవనంవైపు పోవద్దని

వారించేందుకు ప్రయత్నించాను, కానీ అక్కడినించి తరచు వాడికి పిలుపు వచ్చేది. రాజో, రాకుమారుడో వాడిని పిలిపించి ఆపనీ ఈపనీ చేయించుకునేవారు. వాడికి రాజుపట్లా, రాకుమారుడిపట్లా ఒక కుక్కకి ఉన్న విశ్వాసం లాంటిది ఉండేది. వాడు వెర్రిబాగులవాడు, చాలా అమాయకుడు. శారీరక బలమే తప్ప బుద్ధిబలం లేనివాడు. అందరికీ సాయపడేందుకు మితిమీరిన ఉత్సాహం చూపించే వాడు. కానీ సమాజంలో కిందివర్గంలో ఉండేవాళ్ల మంచితనాన్ని అపార్థం చేసుకున్నట్టే వాడిలోని మంచితనాన్ని చేతకానితనమని అనుకునేవాళ్లు,

అందరూ వాడిని మూర్ఖుడికిందే జమకట్టారు. కానీ ఆ మెత్తటి, దయగల ముఖం వెనుక ఒక బలమైన వ్యక్తిత్వం దాగి ఉందన్న నమ్మకం నాకు ఉండేది. ఒక్కోసారి దాగిఉన్న ఆ ఉక్కు స్వభావం తాలూకు ఛాయలు నాకు కనబడేవి. కానీ చాలామటుకు అతికాయుడు తేలికగా మోసపోయే చిన్న పిల్లవాడిలాగే కనిపించే వాడు. ఈలోకంలోని జిత్తులమారి మనుషులు వాడిని మోసపుచ్చి తమ పనులు సానుకూలం చేసుకుంటారని అనిపించేది నాకు. దయ, ధైర్యం, నీతినియమాలూ, సానుభూతిలాంటి గుణాలు మా సామాజిక వర్గానికి చెందినవారికి ఉంటే ప్రమాదం. నల్లటి చర్మంకింద బంగారు హృదయం ఉండటం ప్రమాదకరం. అవి ధనవంతులకే సొంతమైన వైభవాలు. కులీనులూ, ఉన్నతజాతి వారూ, తెల్లటి తోలు ఉన్నవారూ వాళ్లకి లాభం చేకూరేందుకు అలాంటి విలువలని ఉపయోగించు కుంటారు. పెద్ద ఎముకలతో, నల్లగా, అనాకారిగా ఉన్న నా కొడుక్కి అలాంటి గుణాలు లేకపోవటమే మంచిది. కొంత వ్యక్తిపూజ, కాస్తంత క్రూరత్వం, బతికి ఉండేందుకు ఎలాంటి యజమానినైనా సేవించుకోవటం, రగిలే కోపాన్ని దిగమింగి బలవంతులముందు తలవంచటం, మా లోకంలో ప్రాణాలు నిలుపుకునేందుకు ఉపయోగించే సాధనాలు. కానీ మూరుడైన అతికాయుడిని ఆ విషయం చెప్పి ఒప్పించలేకపోయాను.

వాతావరణం చాలా వేడిగా ఉంది. నేను చెమటతో తడిసి

మద్దయిపోసాగాను. లేచి కూర్చునేసరికి ఒళ్లంతా నొప్పిపెట్టింది. ఆకలి పేగుల్ని మెలిపెడుతోంది. లేచి నిలబడేందుకు ప్రయత్నించేసరికి కళ్లు తిరిగాయి. గోడ పట్టుకుని రొప్పతూ కాసేపు అలాగే నిలబడ్డాను. తరవాత కిందపడిపోయి కదలకుండా ఉండిపోయాను. నా కన్నీళ్లనీ, కోపాన్నీ దిగమింగుతూ, నన్ను చూసి నేనే జాలిపడేంతగా కుంగిపోయాను. అది నన్ను ఒక పెద్ద అలలా ముంచెత్తింది. నేను పక్కకి తిరిగి వంటశాలవైపు పాకసాగాను. గరుకుగా ఉన్న నేలమీద మునుపెన్నడూ గమనించని గుంటలూ, అంతటా దుమ్మూ ధూళీ కనిపించాయి. నేలమీద పాకుతూ ఉండటంవల్ల దాని వాసన నాకు తెలిసింది. 'ఇంటిని శుభ్రంగా ఎందుకు ఉంచదు ఈమె?' అని నా భార్యమీద కోపం వచ్చింది నాకు. 'ఆమె వెనక్కి వచ్చాక ఇల్లు ఎలా ఉంచుకోవాలో నేర్పుతాను.'

నేను వంటశాలలోకి ప్రవేశించేసరికి ఒక పెద్ద, నల్లటి సాలెపురుగు గబగబా పాకుతూపోయి దాక్కుంది. దానివైపే కన్నార్పకుండా కొన్నిక్షణాలు చూశాను, కానీ అలా చూసినంత మాత్రాన సాలెపురుగులు చావవని గ్రహించాను. నెమ్మదిగా పాకుతూ పొయ్యి దగ్గరకి చేరుకుని, కాళ్లు బారజూపి కూర్చున్నాను. ఒక్కొక్క పాత్రమీద ఉన్న మూతనీ తీసి చూశాను. ఖాళీ, ఏమీ లేదు. నా పొట్ట ఆకలితో నకనకలాడుతోంది. ఒక మూల ఉట్టిమీద మరొక పాత్ర వేలాడుతోంది. బహుశా అందులో పెరుగు ఉండవచ్చు. ఎలుకలకి అందకుండా మాల దాన్ని ఎత్తులో పెట్టి ఉంటుంది. లేక బెల్లంలాంటి తీపి పదార్థాలేవైనా ఉన్నాయో! దాన్ని ఎలా అందుకోవటం? లేచి నిలబడలేను. అప్పుడు నాకు నవ్వు వచ్చింది. ఇక్కడ తీపి పదార్థాలుంటాయా? ఒక అస్పృశ్యుడి ఇంట్లో? రావణాసురుడికి ఉండే దురభిమానం నాకు కూడా కొంత అంటుకున్నట్టు ఉంది. మరీ పెద్ద కలలు కంటున్నాను.

'మాల ఎక్కడికి వెళ్లింది?' ఇంతలో ఒక బండి వచ్చి ఇంటిముందు ఆగిన చప్పుడు వినిపించింది. అయితే రాజు ఆమెని రథంలో ఇంటికి పంపటం మొదలు పెట్టాడా? నేను వీథిగుమ్మంవైపు పాకుతూ వెళ్లాను.

ఎవరో బైట రహస్యంగా మాట్లాడుకుంటున్నారు. వెనువెంటనే సగం మూసిఉన్నతలుపుమీద చిన్నగా తట్టిన శబ్దం వినవచ్చింది. నేను నిశ్శబ్దంగా వేచి చూడసాగాను, ఉంగరాలూ, ఆభరణాలూ ఉన్న చెయ్యి తలుపుని నెట్టి తెరిచింది. తలుపు కిర్రుమంటూ తెరుచుకుంది. ఆ తెరిచిన తలుపులోంచి సూర్యరశ్మి నేలమీదా, గోడలమీదా పరుచుకుంది. నా కొడుకు మళ్లీ మూలిగాడు. దుమ్ముతో నిండిన గాలి లోపలికి వచ్చింది. మూలనున్న పాతబట్టలు ఆ గాలికి రెపరెపలాడాయి. ఆ గాలి ఎదురుగా ఉన్న కిటికీలోంచి బైటికి పోయింది. ఎండవల్ల కళ్లు చికిలించి చూశాను. మేఘనాదుడు హుందాగా లోపలికి ప్రవేశించటం కనిపించింది. అతని వెనకే గంభీరంగా, డాబుగా, మంచి ఒడ్డూ పొడవూ ఉన్న మారీచుడు కూడా లోపలికి వచ్చాడు. ఉద్దరు రాజవంశీయులు ఈ అస్పృశ్యుడి పూరిగుడిసెలోకి వచ్చారు! నా కళ్లని నేనే నమ్మలేకపోయాను. అసంకల్పితంగా లేచి నిలబడబోయాను, కానీ మళ్లీ కుప్పకూలిపోయాను. చిరునవ్వు నవ్వుతూ మారీచుడు నా దగ్గరకొచ్చి నన్ను లేపాడు, నా ఇంట్లోవున్న ఒకే ఒక విరిగిపోయిన ఆసనంమీద నన్ను సుతారంగా కూర్చోపెట్టాడు. నేను వారించి నిలబడేందుకు ప్రయత్నించాను. కానీ ఆయన నన్ను మళ్లీ నెమ్మదిగా ఆసనంమీదకి నెట్టాడు. 'భగవంతుడా! వీళ్లకి నేను ఏం అతిధి మర్యాదలు చెయ్యగలను?' నా గుడిసెలో రాజ కుటుంబీకులా? నా దారిద్ర్యాన్నీ విరిగిపోయిన ఆసనాన్నీ చింకిపాత్రలనీ, చిరిగిపోయిన పక్కబట్టలనీ, బీటలు వారిన గోడలనీ, నేలనీ, బలహీనమైన నా శరీరాన్నీ చూశారని నాకు వాళ్లమీద కోపం వచ్చింది. ఇది నా ఇల్లు, నా వైఫల్యాన్ని ఈ రాజకుమారుల కళ్లలోనుంచి, ఈ క్రూరమైన ప్రపంచం నిండా ఉన్న ఇలాంటి పాలకుల కళ్లబడకుండా కాపాడుకోవాలని అనిపించింది నాకు. నా దీనావస్థని చూసి ఆనందించాలనే దుర్బుద్ధితో వచ్చారా వీళ్లు? గుడ్లగూబలా కళ్లు మిటకరిస్తూ, మాటా పలుకూ లేకుండా కూర్చుండిపోయాను.

"ఎలా ఉన్నావు, భద్రా?" మారీచుడి కంఠంలో దయ ఏమాత్రం

కొరవడలేదు

'మీ భటులు నన్ను చావగొట్టినందుకు ధన్యవాదాలయ్యా!' అని జవాబివ్వాలని అనుకున్నాను. కానీ నోటమాట రాకుండా అక్కడే కూర్చుని ఉండిపోయాను. మేఘనాదుడు మంచంమీద అతికాయుడి దగ్గర కూర్చుని వాడి గాయాలని చూడసాగాడు. అతను నెమ్మదిగా అతికాయుడితో ఏదో మాట్లాడుతూ ఉంటే అతికాయుడు తప్పిపోయిన కుక్కపిల్లకి తన యజమాని దొరికినంత సంబరపడుతూ జవాబు చెప్పసాగాడు.

నాకు అసహ్యం వేసింది, 'అతికాయుడికి తోక ఉండి ఉంటే ప్రస్తుతం దాన్ని వాడు ఊపుతూ ఉండేవాడు!' అనుకున్నాను.

"నాకు తెలుసు భద్రా, మేము నీకు ద్రోహం చేశాము," అన్నాడు మారీచుడు నా భుజాలమీద తన రెండు చేతులు వేసి. ఆయన నాకు ఎంత దగ్గరగా నిలబడ్డా డంటే ఆయన ఒంటిమీది సుగంధద్రవ్యాల పరిమళం వాసన నాకు తెలిసింది. నేను కళ్లు దించుకున్నాను, అంత దయని నేను భరించలేకపోయాను. రావణుడిలాగే మారీచుడు కూడా నా నల్లతోలుని తాకిన తరవాత తన చేతులని తుడుచుకున్నాడా అని కనుకొలకులనుంచి చూశాను. కానీ ఆయన అలా చెయ్యలేదు. నాకు నిరాశ కలిగింది. బహుశా తన భవనానికి వెళ్లాక స్నానం చేస్తాడేమో అనుకున్నాను.

"నువ్వు అపార్థం చేసుకుని మన రాజుగురించి నిర్దయగా ఆలోచించకూడదు, భద్రా!" నాకు ఆయన మాటలు నచ్చలేదు. ఆ వృద్ధుడు నన్ను కౌగలించుకున్నప్పుడు ఆయన కళ్లలో నీళ్లు కనిపించాయి. బహుశా నన్ను కౌగలించుకోవటం, తాకటం, గొప్ప విషయాల గురించి నాతో మాట్లాడటంవల్ల తాను చాలా ఉదాత్తుడినన్న భావం ఆయనకి కలిగిందేమో. తన గురించి అలా అనుకుని సంతోషించాననీ, అనుకున్నాను. బహుశా వయసుతోపాటు నేను కఠినంగా మారానేమో, అతికాయుడు గట్టిగా ఏడవటం నాకు

వినబడింది. వాడు జరుగుతున్నది చూసి చలించిపోయాడు పాపం. ఇంకా ఇటువంటి డంబాలని నమ్మగలగటం వాడి అదృష్టం. నా తరం వాళ్లకి ఉన్న అనారోగ్యం - చికిత్సకి లొంగని దోషాలని వెతికే స్వభావం- వీడికి ఇంకా సోకలేదు. కానీ నా పేదకొంపలో ప్రవేశించిన వాళ్లు శక్తిమంతులు, ముఖ్యమైన వ్యక్తులు. అందుకే నా నటనని కొనసాగించాను. విపరీతమైన కృతజ్ఞతా భావాన్ని ప్రకటించాను. వృద్ధుడి ముఖం చూస్తే ఆ మూర్ఖుడు నన్ను నమ్మినట్టే కనిపించాడు. పాపం బుద్ధిహీనుడు, ఎవరైనా ఆయన్ని సులభంగా మోసం చెయ్యొచ్చు. మరుక్షణం నాకు ఆయనమీద విపరీతమైన జాలి పుట్టుకొచ్చింది. వంచకులైన మా మంత్రులందరిలో నిజాయితీగల వ్యక్తి ఎవరైనా ఉన్నారూ అంటే అది ఈ కొరకరాని కొయ్య, చెక్కుచెదరని మారీచుడు ఒక్కడే.

"మా సుహృద్భావానికి సూచనగా, సార్వభౌముడు ఈ చిన్ని కానుకని నీకు ఇమ్మని మమ్మల్ని ఇక్కడికి పంపారు. నువ్వు అందించిన సేవలన్నిటికీ ప్రతిగా ఇది సరిపోతుందని కాదు, మన జాతికోసం, రాజ్యంకోసం నువ్వు అనుభవించిన కష్టాలతో పోలిస్తే ఇది చాలా చిన్న కానుకే. కానీ రాజుగారు కృతజ్ఞతతో ఇచ్చిన ఈ కానుకని స్వీకరించు," అంటూ మారీచుడు ఒక పెద్ద సంచీని నా ఒళ్లో పెట్టాడు. దానినిండా నాణాలు గలగల్లాడుతున్నాయి. ఆయన ముఖంలో తృప్తి కనిపించింది. నేను మనసారా కృతజ్ఞతలు తెలుపుకుంటానని వేచిచూశాడు. కానీ నేనేమీ అనలేదు. ఆ సంచీని తదేకంగా చూస్తూ ఉండిపోయాను.

మేఘనాదుడు అతికాయుడికి వెళ్లివస్తానని చెప్పాడు. అప్పుడు ఆ రాకుమారుడితో నా కొడుకు ఇలా అనటం విన్నాను, "మీకోసం ఆపని చెయ్యమని మీరు నన్ను కోరినప్పుడు నేను మిగతావన్నీ మరిచిపోయాను. మీకోసం ప్రాణాలు అర్పించమన్నా సంతోషంగా అర్పిస్తాను, ప్రభూ!" ఆ తరవాత వాడు మేఘనాదుడి చేతులని ముద్దుపెట్టుకున్నాడు. నా మనసు అది విని బాధపడింది, 'ఈ మూర్ఖుడు రాకుమారుడికోసం ప్రాణాలు వదులుకుంటాడా?' ఇది మా

కర్మ-శ్రమ చెయ్యటం, బతికి ఉండటం, సంఘర్షణ చెయ్యటం, చనిపోవటం - అంతా ఉన్నతస్థాయిలో ఉండే శక్తిమంతులకోసమే! ఈ రాకుమారుడి తండ్రికోసమే నేను ఒకప్పుడు ఆ పనులన్నీ చేశాను. బహుశా మళ్లీ చెయ్యవలసిన తప్పనిసరి పరిస్థితి ఏర్పడవచ్చు. శివా! దీనినుంచి విముక్తి లేదా? ఇప్పుడు నా కొడుకు కూడా తననీ, తన తలిదండ్రులనీ మరచి రాకుమారుడికోసం ప్రాణాలు వదిలిపెట్టేందుకు సిద్ధంగా ఉన్నానంటున్నాడు. మాలాంటి తుచ్ఛమైన క్రిమికీటకాలు తమకోసం ప్రాణాలర్పిస్తూ ఉంటారని వీళ్లు గొప్పలు చెప్పుకుంటారా? తమ భవిష్యత్తు కోసం మావంటి కొందరు నల్లని, శాపగ్రస్తులైన, మరుగుజ్జులని లెక్కచెయ్యకుండా, తమ విజయాలనీ, ధనాన్నీ సంపాదించుకునే మార్గంలో, తొక్కుకుంటూ తమ లక్ష్యంవైపు సాగిపోతారా?

నేను లేచి నిలబడ్డాను. కళ్లు చీకట్లు కమ్మాయి. కానీ దెబ్బలుతిన్న బలహీనమైన నా శరీరం నాలో సుడులు తిరుగుతున్న క్రోధంవల్ల కొత్త శక్తిని సంతరించుకుంది. "వెళ్లండి! దుర్మార్గుల్లారా, వెళ్లిపోండి!"అని అరిచాను. నాణాల సంచీని విసిరికొట్టాను. అది తెరచిఉన్న ద్వారంలోంచి శరవేగంతో వెళ్లి బైట పడింది. సంచీ చిరిగిపోయి, మురికి వీధిలోనూ, కాలవలోనూ నాణాలు చెల్లాచెదురయాయి. బిచ్చగాళ్ళూ ఇల్లూ వాకిలీలేని అలగా పిల్లలూ గుమిగూడారు, కానీ ఆ మెరిసే నాణాలని తాకే ధైర్యం వాళ్లకి లేకపోయింది. అక్కడ ఒక మంత్రీ, ఒక రాకుమారుడూ ఉండటం, ఒక ముసలాడు అసభ్యంగా అరుస్తూ గొడవ చెయ్యటం లాంటి అద్భుతమైన దృశ్యం చూసి వాళ్లు వెండినాణాలు ఏరుకోవటం కూడా మరిచిపోయారు.

నేను అప్పటికే మితిమీరి మాట్లాడేశాను. అందుకని నా మనసులోని మాట చెప్పదలుచుకున్నాను. "మీరు నా గుడిసెకి వచ్చి నన్ను ఉద్ధరించామని అనుకుంటున్నారా? మీవల్ల నా ప్రాణాలూ, నా కొడుకు ప్రాణాలూ పోయే పరిస్థితి ఏర్పడింది. మీ నాణాలు ఎవరికి కావాలి? వాటిని మీరే ఉంచుకోండి. రాజు చాలా సానుభూతిపరుడని

అంటున్నారు," అంటూ నా ద్వేషాన్ని ప్రదర్శించేందుకు ఉమ్మేసి మళ్లీ మాట్లాడటం కొనసాగించాను, "అవతలివాడు అంటురోగి అయినట్టు ప్రవర్తించటం అతన్ని ఎంత బాధపెడుతుందో ఆయనకి తెలుసా? ఆకలి బాధ ఎలా ఉంటుందో తెలుసా? ఓడిపోవటం ముల్లులా గుచ్చుకుంటుంది తెలుసా? నిస్సహాయత మనసుని ఎలా మెలిపెడుతుందో తెలుసా? ఇల్లూ వాకిలీ లేని దీనుల వేదన అర్థమవుతుందా? నిరుపేదలైన నల్లటి అసురులని అస్పృశ్యుల్లాగ చూడటం ఆయనకి ఇష్టంలేదు. మేము నగరంలోనే ఉండాలని కోరుకుంటాడాయన. దానికి కారణం ఏమిటో నాకు తెలుసు. మీరు కులీనులు, ధనికులు, కపట బ్రాహ్మలు. మేము అపరిశుభ్రంగా ఉంటామనీ, మా చర్మం నల్లగా ఉంటుందనీ, మా దగ్గర దుర్వాసన వేస్తుందనీ మమ్మల్ని తిడతారు. కానీ మాకు మీ అవసరంకన్నా మీకే మా అవసరం ఎక్కువ. మమ్మల్ని వెలివేస్తే మీ చెత్తని ఎవరు మోస్తారు? మీ వీధులని ఎవరు ఊడుస్తారు, బళ్లని ఎవరు లాగుతారు, మీ పనికిమాలిన పోరాటాలలో ఎవరు ప్రాణాలను పోగొట్టుకుంటారు?"

నా కంఠానికి చల్లగా లోహం తగిలింది. మేఘనాదుడి మెరిసే కళ్లలోకి సూటిగా చూశాను. నాకు వణుకు పుట్టింది. నా కోపం ఎటోపోయింది. మళ్లీ ఒక్క కుదుపుతో ఈలోకంలోకి వచ్చాను. నేను అన్న మాటలు ఎంత దారుణమైనవో అన్న అవగాహన నన్ను పిడుగుపాటులా తీవ్రంగా తాకింది. కాలిపోతున్నట్టున్న నా బుగ్గలమీదినించి భయంతోనూ, నిస్సహాయతతోనూ నేను కార్చిన కన్నీళ్లు ధారలు కట్టాయి. అంతా అయిపోయింది. కత్తిమొన మరింత గట్టిగా నా కంఠాన్ని తాకింది. వెచ్చని రక్తం బొట్లు కారటం నాకు తెలిసింది. నా అధిక ప్రసంగం తప్పక నా ప్రాణాలు తీస్తుంది అని అనుకున్నాను.

"వాడిని వదిలెయ్యి, మేఘనాదా. వాడు తాగి ఉన్నట్టున్నాడు," అని మారీచుడు అనటం వినిపించింది నాకు. నెమ్మదిగా కత్తిని నా కంఠం మీదనించి తీసి, మేఘనాదుడు దానికి అంటుకున్న నా రక్తాన్ని

తన వేళ్లతో తుడిచి, నావైపే తదేకంగా చూస్తూ కత్తిని ఒరలో పెట్టుకున్నాడు. నేను వణికిపోతూ ఆసనంలో కూలబడ్డాను.

"భద్రా, మేమిక వెత్తాం. నీ ఆరోగ్యం జాగ్రత్త. విపరీతంగా తాగటం మాను. నీలని కాపాడుకో, తెలిసిందా?" అన్నాడు మారీచుడు చిరునవ్వు నవ్వుతూ. కానీ ఆయన కళ్లలో ఆ చిరునవ్వు నాకు కనబడలేదు. ఉత్త తిరస్కారభావం మాత్రమే కనబడింది. మేఘనాదుడు వెళ్లి ఏడుస్తున్న అతికాయుడిని కౌగలించుకున్నాడు. తరవాత రాకుమారుడూ, మంత్రీ బైటికి ఎండలోకి నడిచారు. గుర్రాలని కొరడాతో అదిలించిన చప్పుడు వినిపించింది. వెంటనే రథం ఇరుకుగా, ఎగుడుదిగుడుగా ఉన్న సందులోనుంచి బైటికి వెళ్లిపోయింది. నా మనసంతా శూన్యంతో నిండి పోయింది. అలాగే ఆసనంలో కూర్చుని ఉండిపోయాను. ఇంతలో ఎవరో ఘర్షణ పడటం నాకు వినిపించింది. ముందు అదేమిటో నాకు అర్థం కాలేదు. ఆ తరవాత వాళ్లు నేను పారేసిన వెండి నాణాలకోసం దెబ్బలాడుకుంటున్నారని అర్థమైంది. అవి నా నాణాలు. లేచి నిలబడటానికి ప్రయత్నించి, నిలదొక్కుకోలేక బోర్లబొక్కలా పడిపోయాను. తరవాత పాక్కుంటూ బైటికివెళ్లి, ఆ మనుషుల మధ్యలోకి జారబడి నా నాణాలని చేజిక్కించుకుందామని ప్రయత్నించాను. వాటిలో చాలామటుకు మాయమయాయి. నేను నా చేతులతో అందరినీ పక్కకి తోస్తూ ముందుకి పోయేందుకు ప్రయత్నించాను. ఇద్దరు అలగా పిల్లలని కాళ్లతో తొక్కాను. ఒక ముసలి బిచ్చగాడిని బలంగా తన్నాను. వాడిచేత తన్నులు తిన్నాను. కానీ నాకు నొప్పి తెలీలేదు. అది నా డబ్బు, కష్టపడి సంపాదించుకున్న ధనం. చివరికి మురికి కాలవలోపడిన గుప్పెడు నాణాలని చేజిక్కించుకున్నాను. వాటికి బురదా, మట్టి అంటుకున్నాయి. ఎందరో వాటిని నా దగ్గర్నుంచి లాక్కోవాలని ప్రయత్నించినప్పటికీ, ఆ తన్నులూ, దెబ్బలూ భరిస్తూనే వాటిని గట్టిగా పట్టుకున్నాను. చివరికి నా ఇరుగు పొరుగు వారూ, బిచ్చగాళ్ళూ తమ ప్రయత్నాలు విరమించి నిష్క్రమించారు. నన్నూ, ఒకళ్లని ఒకళ్ళూ తిట్టుకుంటూ తమ దారిన

పోయారు వాళ్లు. నేను మురికి కాలవలోంచి నెమ్మదిగా బైటపడి నాణాలని లెక్కపెట్టాను. మొత్తం ఇరవై ఒకటి ఉన్నాయి. బహుశా సంచీలో ఉన్న మొత్తం దీనికి వందరెట్లు అయి ఉండవచ్చు. చాలాసేపు ఆ నాణాల వైపే చూస్తూ ఉండిపోయాను. నాకు జీవితం అందించిన ఎన్నో సదవకాశాలని ఇంతకు మునుపు కూడా ఇలాగే చేజార్చుకున్నాను. బహుశా నాకు ఇది తగిన శాస్తే, ఏమైనా, వీధి మొగలో పానశాల ఇంకా తెరిచే ఉంటుంది. బోలెడంత నాటుసారా దొరుకుతుందక్కడ. ఆహా, నాకిప్పుడు కావలసింది అదే. సూర్యుడు అస్తమిస్తూ ఉండగా, నేను పోరాడి సంపాదించుకున్న నాణాలతో అటుకేసి తడబడే అడుగులతో నడిచాను. ఒక మంచి సారాయి – ఎంతైనా ఈ జీవితానికి కావలసినది అదే కదా!

25. ఒక కుమార్తె వివాహం

రావణుడు

నా మనసుని కలవరపరిచే వార్తలు వినవస్తున్నాయి. నేను వేస్తున్న కుడ్యచిత్రాలమీద మనసు నిలుపుదామన్నా అది నాకు సాధ్యం కావటంలేదు. రంగులూ, ఛాయలూ నేను అనుకున్న విధంగా కుదరటం లేదు. నాకు అందిన వార్త నా మనసుని అల్లకల్లోలం చేస్తోంది. దాన్ని ఎవరితో పంచుకోను అన్న అయోమయానికి గురయాను. కానీ అది చాలా పెద్ద రహస్యం. మారీచుడికి చెప్పనా? వద్దు, అతనికి కూడా చెప్పకూడని రహస్యం అది. ఆ సంబంధం గురించి అతను ఎంతమాత్రం సానుభూతి కనబరచడు. అసలు నా గోడు వినటానికే ఇష్టపడడు.

నాకు మానసికంగానూ, శారీరకంగానూ కూడా వృద్ధాప్యం వచ్చేసినట్టు అనిపించింది. ఆమెని ఒక్కసారే చూశాను. అదీ చాలా సంవత్సరాల క్రితం. అప్పుడామె వయసు పదహారో పదిహేడో ఉంటుంది. ఆ సంగతి ఒక్కమారీచుడికి మాత్రమే తెలుసు. ఆ ప్రయాణం చాలా ప్రమాదకరమైనది. నా కుమారుడి చదువు సంధ్యలు ముగిసిన వెంటనే జరిగింది అది. అతికాయుడిపట్ల నేను ప్రవర్తించిన తీరు నా హృదయాన్ని ముక్కలు చేసింది, పశ్చాత్తాపంతో విలవిలలాడిపోయాను. చివరికి మారీచుడు వచ్చి నన్నుబైట పడేసేదాకా అలాగే బాధపడుతూ ఉండిపోయాను. అతను చాలా నిర్దయగా, స్పష్టంగా ఇందులో బాధ పడవలసినది ఏమీ లేదని అన్నాడు. ఎందుకంటే, దయలేకుండా నా మొదటి సంతానాన్ని నేనే స్వయంగా దూరం చేసుకున్నానని గుర్తుచేశాడు. నాకు పిచ్చిపట్టినట్టు అనిపించి, మంత్రులందరూ కలిసి ఇచ్చిన సలహావల్లే అలా చెయ్యవలసి వచ్చిందని నేను అతనికి గుర్తుచేశాను. ఆ తరవాత నేను ఏమీ చెయ్యకుండా ఉండిపోయాను అని ఆయన ఎదురు జవాబు చెప్పాడు.

అంతే, ఇంక ఏమనాలో తెలీక ఊరకుండిపోయాను. కోపంగా ఆయన్ని వెళ్లిపొమ్మని చెప్పి మళ్లీ ఏకాంతంలోకి ముడుచుకుపోయాను. భార్యని కసురుకుని మేఘనాదుడిని సైతం గదిలోంచి బైటికి పొమ్మన్నాను. అర్ధరాత్రి ఒళ్లంతా చెమటలు పట్టి నాకు మెలకువ వచ్చింది. నాకొక భూతం కనిపించింది. అసుర చక్రవర్తి రాజభవనంలో భూతం ఉందని ఎవరైనా అంటే నేను నవ్వి ఉండేవాడిని.

అంతవరకూ దెయ్యాలూ, భూతాలూ అనేవి చిన్నప్పుడు విన్న కథల్లో పల్లికిలిస్తూ కనిపించేవి అనుకునేవాడిని. కానీ ఆ రాత్రి మాత్రం ఒక భూతాన్ని స్పష్టంగా చూశాను. అది ఒక స్త్రీ భూతం. ఆమె ముఖాన మేలిముసుగు ఉంది. కిటికీ బైట నిలబడి నావైపే కన్నార్పకుండా చూస్తున్న ఆమె నాకు పరిచయం ఉన్న స్త్రీలాగ కనిపించింది. నా కాళ్లూ చేతులూ కొయ్యబారిపోయాయి. నా భయం నాకే తెలిసింది. నెమ్మది నెమ్మదిగా ఆ ముఖం మరింత స్పష్టంగా కనిపించసాగింది. మండోదరిని కుదిపి లేపాలనుకున్నాను. కానీ నా చేతులు కదల్లేదు. క్షణం క్షణం ఆ ముఖం మరింత స్పష్టంగా కనిపించటం మొదలుపెట్టేసరికి అది పూర్తిగా కనిపించేంతవరకూ అలా హడిలిపోతూ వేచి ఉన్నాను. సరిగ్గా అప్పుడే గాలివీచి మేలిముసుగు తొలగిపోయింది. ఆమె వేదవతి! నా గొంతు ఎండిపోయింది. నాలో అణచి ఉంచిన భావోద్వేగాలన్నీ ఒక్క ఉదుటున నా గొంతుదాకా వచ్చి ఆగాయి. వేదవతి పిచ్చిపట్టినట్టు తెరలు తెరలుగా నవ్వింది. తరవాత నెమ్మదిగా పొగమంచులో విలీనమైపోయింది. నేను పూర్తిభయంలో మునిగి అలాగే నిశ్చేష్టుడనై ఉండిపోయాను. తీరని నా ప్రేమా, ఆ తరవాత జరిగిన విషాద సంఘటన తాలూకు ప్రతిబింబాలు నన్ను ఉక్కిరిబిక్కిరి చేశాయి.

నెమ్మదిగా, అతికష్టంమీద, నా అవయవాలని కదిలించి మంచం మీదినించి దిగి చీకట్లో నా పాదరక్షలకోసం వెతికాను. ఎటువంటి భావమూ, ఆలోచనా లేకుండా, వెండి వెన్నెలలో నిశ్చలంగా మెరుస్తున్న కొబ్బరి ఆకులవైపు చూస్తూ కొంతసేపు అలాగే నిలబడ్డాను. తరవాత ఏం చెయ్యాలో నాకు అర్థమైంది. తలుపు తీసి ఉంచి గబగబా బైటికి

నడిచాను. గురకపెడుతున్న భటులని పట్టించుకోకుండా మారీచుడి మందిరంవైపు పరిగెత్తాను. అతని గది తలుపులని బాదాను. ఆ పెద్దాయన లేచివచ్చి తలుపు తీసేదాకా బాదుతూనే ఉన్నాను. శాపనార్థాలు పెట్టబోయిన ఆయన పెదవులు నన్ను చూడగానే ఆగిపోయాయి.

"మనం ఇప్పుడు వెళ్లాలి... ఇప్పడే నేనామెని చూడాలి," అన్నాను అతనితో.

"ఎవరిని?"

"దుస్తులు వేసుకుని త్వరగా రండి, మీరు నాతో వస్తున్నారు. నేనామెని వెంటనే చూడాలి."

"ఎవరిని?"

నేను ఆయన్ని గదిలోంచి బైటికి లాక్కెళ్లాను. తోటలోకి నెట్టి, మారీచుడితో, "ఆమెని చూశాను... వేదవతిని..." అంటూ మారీచుడి ముఖంలో విస్మయాన్నీ, అయోమయాన్నీ లెక్కచెయ్యకుండా చెప్పసాగాను, "నా కూతురిని వెంటనే చూడాలి."

"నువ్వు మత్తులో ఉన్నావా? తాగావా?" అంటూ నా పట్టునుంచి విడిపించు కునేందుకు ప్రయత్నించాడు మారీచుడు.

నేను కాలు బలంగా నేలకి తాటిస్తూ, "ఆ పెద్ద కొట్టు తాళం చెవులు ఎవరి దగ్గరున్నాయి?" అని అడిగాను.

"రావణా, స్పృహలో ఉండే మాట్లాడుతున్నావా? ఇప్పుడు మిథిలకి వెళ్తావా? మిథిల దేవతల ప్రదేశం, అందులో ప్రవేశిస్తావా? మతిలేని నీ మామగారు తయారుచేసిన ఆయంత్రంలో నన్ను కూడా నీతోపాటు ఎగరమంటావా? నువ్వు దాన్ని నడిపి ఎన్నాళ్లయింది?"

"తాళం చెవులు తెచ్చి నాకు ఇచ్చి మయుడిని లేపండి!" అన్నాను పిచ్చిగా,

ఆ గొడవవిని ఒక భటుడు పరిగెత్తుకు వచ్చాడు. మా మామగారు, పుష్పకవిమానం అని ముద్దుగా పిలుచుకునే ఎగిరే వాహనం ఉన్న కొట్ట తాళం చెవులు తెమ్మని వాడిమీద అరిచాను. మారీచుడు నావైపే తదేకంగా చూస్తూండగా భటుడు తాళం చెవులకోసం పరిగెత్తి వెళ్లాడు.

"మనం ఇప్పడే బైలుదేరుతున్నాం," అన్నాను అదే తుది నిర్ణయం అన్నట్టు. మారీచుడు తల అడ్డంగా ఆడించి అక్కడినుంచి వెళ్లిపోసాగాడు. నాకు నిమిష నిమిషానికీ కోపం పెరిగిపోసాగింది. "ఎక్కడికెళ్తున్నారు?" అని అరిచాను. అలా నాకు జవాబు చెప్పకుండా అతను వెళ్లిపోవటమేమిటి అని కోపం వచ్చింది.

"దుస్తులు మార్చుకోవటానికి," అని కేకపెట్టి దఢాలున తన గది తలుపు మూశాడు ఆయన. ఆ వృద్ధుడిని చూస్తే నాకు నవ్వు వచ్చింది. ముందు జరగబోయే దాన్ని గురించి ఆలోచిస్తూ అక్కడే నిలబడ్డాను. మారీచుడు అన్నట్టు ఈ ప్రయాణం పెను ప్రమాదాలతో కూడుకున్నది. అసలు నేను పుష్పకవిమానం నడిపి చాలా కాలమైంది. నాకు గాలిలో ఎగరటం ఇష్టంలేదు. మనిషి ఎగిరేందుకు సృష్టించబడలేదు. అలా అయినట్టయితే శివుడు మనిషికి రెక్కలు ఇచ్చి ఉండేవాడే. ఎగిరే యంత్రం వాడటం దేవుడినే ధిక్కరించటం లాంటిది. అలాగే నా కుమార్తెని చూడాలన్న నా కోరికని నేను ప్రశ్నించుకున్నాను. ఆమె పెరిగి పెద్దదవుతున్నంత కాలం ఆమె మీద ఒక కన్నువేసి ఉంచాను, కానీ కుమారులు పుట్టిన తరవాత నాకు గూఢచారులు పంపిన సందేశాలని కూడా చదవకుండా పక్కన పడవేశాను.

శక్తివంతమైన నా రాజ్యం దినదిన ప్రవర్థమానంగా భాసిల్లుతోంది. దానితో పోలిస్తే మిథిల చాలాదూరంలో ఉన్న చిన్న రాజ్యం. నా కుమార్తె అంతదూరాన ఉండటంవల్ల అరుదుగా ఆమె గురించి ఆలోచించేవాడిని. త్వరలోనే ఆమె జీవించి ఉన్నా లేకపోయినా ఒకటే అనే అభిప్రాయానికి వచ్చాను. ఇంకా చెప్పాలంటే ఆమె అసలు పుట్టనేలేదని అనిపించేది; అందుచేత నా సేన వెంటలేకుండా శత్రురాజ్యంలో ప్రమాదాన్ని ఎదుర్కొంటూ ప్రవేశించటం

బాధ్యతారహితంగా మొండి ధైర్యం చూపించటమే అనిపించుకుంటుంది.

"వత్సా, రావణా! నాకు ఎంతో ఆనందంగా ఉంది... నిజంగా ఆనందిస్తున్నాను..." అంటూ నా మామగారు వగరుస్తూ, నాముందు చిన్నపిల్లవాడిలా సంబరపడుతూ వచ్చి నిలబడ్డాడు. నడుముకి తాళాలగుత్తి కట్టుకుని ఆ వృద్ధుడు పరిగెత్తుకుంటూ వస్తూఉంటే తాళంచెవులు గలగలలాడాయి. ఈ పరధ్యానపు ఆచార్యుడిమీద నాకు ఇష్టం కలగసాగింది. ఆయన గోకర్ణం దగ్గర బ్రహ్మాండమైన ఆలయ నిర్మాణాన్ని చేపట్టకముందు ఆయన మాటలని నేను పట్టించుకోనేలేదు. ఆ తరవాత మా పవిత్రమైన నదీతీరాన ఆయన అలాంటివే మరెన్నో ఆలయాలు నిర్మించాడు. ఆయన గొప్ప నిర్మాణ కళాకారుడు, నిర్మాణ నిపుణుడు.

ఆ వృద్ధుడు అతి ఉత్సాహంగా చిన్న కుర్రవాడిలా, పుష్పకవిమానం ఉన్న కొట్టవైపు పరిగెత్తాడు. గుత్తిలోంచి తాళంచెవి వెతికి తలుపులు తీశాడు. ఆ వింత యంత్రం పైభాగం నునుపుగా ఉంటుంది. దాన్ని నేనెప్పుడూ అభినందిస్తాను. దానికి పెద్దపెద్ద రెక్కలు ఉన్నాయి, కానీ అవి టపటప కొట్టుకోవు, విపరీతమైన వేగంతో గుండ్రంగా గిర్రున తిరుగుతాయి. అది చూసేందుకు పక్షిలా ఉంటుంది, కానీ చేప ఆకారాన్ని కూడా పోలి ఉంటుంది. దానికి కొన్ని మీటలున్నాయి. కొన్నేళ్లపాటు అభ్యసించి వాటిని ఉపయోగించటంలో నేర్పు సాధించాను. నేను అంత గొప్పగా వాయుయానం చెయ్యకపోవచ్చు కానీ ఆ యంత్రాన్ని ఉన్నంతలో బాగానే నడపగలను. మయుడు రకరకాల మీటలని ఎలా ఉపయోగించాలో చెపుతూ పోయాడు. కొంత ఎత్తుకి చేరాక తెరచాపని ఎలా తెరవాలో చెప్పాడు. అప్పుడది గాలిలో తేలుతుందని అన్నాడు. కానీ నేను ఆయన మాటలు వినిపించు కోలేదు. 'మండోదరికి చెప్పాలా?' 250 యోజనాలు ప్రయాణం చెయ్యాలి. మూడు రోజులు పట్టవచ్చు.

చివరికి ఆరేడు రోజుల్లో వస్తానని ఒక చిన్న పత్రం ఆమె పేర

రాశాను. ఏదో అపరాధభావం చుట్టుముట్టి, ఆ పత్రం చివర్లో ఆమెని నేను ఎంతగా ప్రేమిస్తున్నానో రాశాను. అంతలో మారీచుడు వచ్చి, తన వస్తువులతోబాటు నా దుస్తులూ, ఆహార పానీయాలూ, నా ఆయుధాలూ సర్దాడు. ఆ సామానంతా విమానం వెనుకభాగంలో పడేసి, ఇంకా ఆశ చావక, "రావణా నిజంగా నీకు వెళ్లాలని ఉందా?" అని అడిగాడు.

నేను విమానంలోకి ఎక్కాను. ఆయన తల అడ్డంగా ఆడిస్తూ నా వెనుకే విమానం ఎక్కి కూర్చున్నాడు. ముందు కొంత భయం వేసింది కానీ మౌనంగా శివుణ్ణి ప్రార్థించి మీట నొక్కగానే విమానం నెమ్మదిగా కదలసాగింది. మరోమీట నొక్కగానే చక్రాలు గిర్రున తిరిగి వేగాన్ని పుంజుకున్నాయి. ఒక్క కుదుపుతో పుష్పకవిమానం గాలిలోకి లేచింది. మారీచుడు ఇనప చువ్వలని గట్టిగా పట్టుకుని కూర్చోవటం చూశాను. నాకు కూడా భయంగానే ఉన్నప్పటికీ విమానం ఆకాశం మధ్యలో ఆగిపోతుందేమో అన్న ఆలోచనలని మనసులోంచి తొలగించాను. పక్షి రెట్టల్లాగ మేమిద్దరం కింద పడిపోవచ్చుననే ఆలోచన, కింద ఉన్న బండరాళ్లమీద పడి మా ముఖాలు చితికిపోవచ్చన్న భయం హడలెత్తించింది.

కింద లంక కనుమరుగవసాగింది. వెన్నెలలో నల్లటి వెండిలా తళతళ లాడుతున్న సముద్రం మధ్యలో లంకాపరి పచ్చటి కన్నీటి బొట్టులా ఉంది. ఆకాశం చిక్కటి నలుపురంగులో ఉంది. దానినిండా వేలకొద్దీ నక్షత్రాలు వెదజల్లబడి ఉన్నాయి- దేవుళ్లు తమ దుప్పట్లకి ఉన్న రంధ్రాలలోనించి తొంగిచూస్తున్నట్టు ఉంది. పల్చటి మేఘాలు మా పక్కనుంచి తేలుతూ పోతున్నాయి. నా నిడుపాటి కేశాలు హోరుగాలికి ఎగరసాగాయి. చూసేవారికి నేనెంత ఆకర్షణీయంగా కనిపిస్తానో కదా, అన్న ఆలోచనకి నాకే నవ్వు వచ్చింది. మారీచుడు కూడా కాస్త స్థిమితపడ్డాడు. ముఖ్య భూభాగంపైన ఎగురుతూంటే ఆనందం పట్టలేక అరిచాను, మారీచుడు కూడా నాతో గొంతు కలిపాడు. యుక్తవయసులో పాడుకున్న బూతుపాటలు గుర్తు చేసుకునేందుకు ప్రయత్నించాను.

అలాంటి పాటలు పాడుకుంటూ దాదాపు అరవైఏళ్లున్న వృద్ధుడూ, నలభైఏళ్లున్న నేనూ, ఎలాంటి చీకూచింతా లేకుండా, పెద్దవాళ్లు వెంటలేకుండా విహారానికి వెళ్లే కుర్రవాళ్లలాగ, ఉత్తర దిక్కున ఉన్న అనాగరిక ప్రదేశాలవైపు ఎగురుతూ వెళ్లాం.

నేను తెరచాపలని తెరిచాను. స్థిరమైన వేగంతో మా విమానం గాలిలో ఎగరసాగింది. చక్రాలు మళ్లీ విమానం దిగినప్పుడే తిరగాల్సి ఉంటుంది. కింద భూభాగం తన సంపదలతోనూ, వేదనలతోనూ విస్తరించి ఉంది. పొగమంచుతో నిండిన ఎత్తైన చెట్లతో దట్టంగా ఉన్న కీకారణ్యాలు దాదాపు పడమటి సముద్రాన్ని తాకుతున్నట్టుగా విస్తరించాయి. తూర్పున విశాలమైన మైదాన ప్రాంతాల్లో అక్కడక్కడా చిన్నచిన్న కొండలూ, గుట్టలూ కనిపిస్తున్నాయి. నదీ ముఖద్వారాలూ, ఉప్పటేరులూ, వాటిపక్కనే సైనికుల్లా నిలబడిన ఎత్తైన కొబ్బరిచెట్లూ, అంతకన్నా ఎత్తుగా ఉన్న ఆలయగోపురాలూ కనిపించాయి. వెండి నదులు మెలికలు తిరుగుతూ ప్రవహిస్తున్నాయి. వరి పొలాల్లోని ఆకులమీద లక్షలకొద్దీ చంద్రుళ్లు ప్రతిఫలనం చెందుతూ కనిపించారు. అత్యంత ఆహ్లాదకరమైన అందమైన దృశ్యం అది. ఒకప్పుడు ఎండి బీటలువారిన ఆ భూభాగాన్ని నేను ఎంత సమృద్ధంగా ఉండేటట్టు మార్చగలిగానో చూస్తే నాకు గర్వంగా తోచింది. అది నా ప్రాంతం, నా రాజ్యం, ప్రాచీనకాలపు అసురులకి చెందిన భూమి అది. మర్నాడు రాత్రికి నేను ఎవరికీ చెందని అనామకమైన ప్రాంతంమీద ఎగురుతూ ఉంటానని నాకు తెలుసు. అక్కడంతా ముళ్లపొదలూ, అడ్డంగా పెరిగిన అడవీ, మధ్య భూభాగంలోని ఎడారిలో ఇసుక మేటలూ ఉంటాయి. అవి నా రాజ్యాన్ని అనాగరీకులైన దేవతల రాజ్యాలనుంచి విడదీసేవి. ఆ ప్రదేశాలు గంగా, యమునా, సరస్వతీ పవిత్ర నదుల తీరాలలో వెలసినవి. శివుడి నివాసం వరకూ నా రాజ్యాన్ని విస్తరించలేకపోయినందుకు నేను విచారించాను.

గంగలాగే హిమాలయాలు కూడా అసురులవే. అసురుల దేవుడు శివుడి జటాజూటం నుంచి గంగ ప్రవహిస్తుంది. శివుడు అందరికన్నా

గొప్ప దేవుడు, దేవదేవుడు, పరమేశ్వరుడు. నేను నా దండయాత్రను కొనసాగించకుండా ఎందుకు ఆపేశాను? మా ప్రాచీనుల భూభాగాన్నంతా నా ఆధీనంలోకి తెచ్చుకోవలసింది. సరస్వతీనదీ, సింధునదీ అవతలికి దేవతలని కీకారణ్యంలోకి విసిరివేయవలసింది. ఎంత ఆకాంక్షతో ప్రారంభించాను! కానీ కాలం గడిచినకొద్దీ నా ఆకాంక్షా, కలలూ కుంచించుకుపోయాయి. సగం భూభాగాన్ని సమృద్ధితోనూ, సంపదలతోనూ సుసంపన్నం చెయ్యటంలోనే ఆనందం పొందాను. బహుశా అది తెలివైన నిర్ణయమేనేమో!

మారీచుడు మౌనం దాల్చి, నిద్రకి జోగటం మొదలుపెట్టాడు. మళ్లీ కిందికి చూసి భూమాత వైశాల్యానికి అచ్చెరువొందాను. నేను చాలా చిన్న ప్రాణిని అనిపించింది. ఈ పృథ్వితో పోలిస్తే వైభవం గురించిన నా కలలూ, నేను చేసిన యుద్ధాలూ, సంపాదించిన రాజ్యాలూ, అన్నీ ఎంతో తుచ్ఛమైనవిగా కనిపించాయి. ఈ ధరిత్రి శాశ్వతమైనది, మిగతావి అన్నీ అంతమొందుతాయి. నాలాగ పెద్దపెద్ద కోరికలూ, కలలూ ఉన్నవాళ్లు ఎంతమందో! వాటిని సాధించినవారు ఎంతమంది? నిధి నిక్షేపాలని సమకూర్చుకున్నవారు ఎంతమంది? ఈ భూమి ఎంతమంది రాజులని చూసింది? ఇంకా ఎంతమందిని చూడబోతోంది? చివరికి వాళ్ల శ్రమ గురించి ఈ భూమాత ఏమైనా పట్టించుకుందా? మానవుడి తుచ్ఛమైన శ్రమకి ఆమె దూరంగానే ఉండిపోయింది. మానవులు మోసం చేస్తారు, ద్రోహం తలపెడతారు, ప్రేమిస్తారు, కష్టపడతారు, సంఘర్షణకి గురవుతారు, ఓడిపోతారు, కుంగిపోతారు, మళ్లీ లేస్తారు, మళ్లీ అవే పనులు చేస్తూ చివరికి చనిపోయి కనుమరుగవుతారు. లేదా మళ్లీ జన్మిస్తారు. కానీ భూమి ఇదంతా లెక్కచెయ్యకుండా అంటీముట్టనట్టు తటస్థంగా, ఏ మార్పూ లేకుండా ఉండిపోతుంది. ఈ బ్రహ్మాండమైన విశ్వంలో నేనొక ధూళికణంతో సమానం. రేపో మరు నిమిషమో నేను లేకుండా పోయే అవకాశం ఉంది. దానివల్ల ఎవరికైనా తేడా వస్తుందా? కొద్దిమంది బాధపడవచ్చు, ఇంకొందరికి అది సంతోషాన్ని కలిగించవచ్చు, కానీ అదీ కొంతకాలం

వరకే. కాలం గడిచేకొద్దీ నా సాఫల్యాలూ, నా పుట్టుకా, మరణం అన్నీ లెక్కలోకి లేకుండా పోతాయి. అందుచేత నా రాజ్యం విస్తారం గురించి నేను పట్టించుకోనక్కర్లేదు, ఇంకా రక్తపాతానికి ఒడిగట్టటం అనవసరం. జీవితం చాలా చిన్నది. దాన్ని యుద్ధాలు వేళ్లి వృథా చెయ్యకూడదు. తెలివితక్కువగా పెద్దపెద్ద అత్యాశలకోసం అంత మధురమైన జీవితంలో చేదు నింపకూడదు. నాకు మృత్యువంటే భయంలేదని నన్ను నేను నమ్మించాలని అనుకున్నాను. ఏదో ఒకరోజు అందరూ చనిపోయేవారే. అది ప్రకృతి ధర్మం. మీ తరువాత రాబోయే ప్రాణులకోసం మీరు ఈ స్థలం వదిలి వెళ్లాలి. నా మనసులో ఎప్పుడూ మృత్యువు గురించి భయపడలేదు. అయినప్పటికీ ఈ అందమైన జీవితాన్ని వదిలి ఎలా వెళ్లను? గాలి నా చెవుల పక్కనించి ప్రవహించింది. ఉదయంపూట వీచే ఈ చల్లటిగాలిని గుండెలనిండాపీల్చుకున్నాను. ప్రాణవాయువుని ఊపిరితిత్తుల్లో నింపుకున్నాను.

ఎర్రరంగు దూదిపింజల్లా మబ్బులు ఎర్రబడిన తూర్పు దిక్కున ఆకాశంలో తేలసాగాయి. పడమర ఇంకా చీకటినే పలుముకుని ఉంది. మసకబారిన తెల్లటి చంద్రుడు అస్తమించబోతున్నాడు. మారీచుడు నిద్రలో కదిలాడు. మిగతావారందరి కన్నా నాపట్ల విశ్వాసంగా మెలిగిన ఆయనవైపు చూశాను. నెరుస్తున్న ఆయన జుట్టువైపూ, తొంగిచూస్తున్న బట్టతలవైపూ, ఇప్పటికీ బలంగా ఉన్న ఆయన చేతుల వైపూ చూస్తూ ఉంటే నాకు దిగులు ముంచుకొచ్చింది. జీవితం వేగంగా మా అందరినీ దాటుకుంటూ వెళ్లిపోతోంది. ఏదో ఒకరోజు ఈయన చనిపోతాడు, అప్పుడు నేను ఒంటరివాడినైపోతాను. 'నా కుమార్తె ఇప్పుడు ఏం చేస్తూ ఉంటుంది? ఆమె ఎవరి పోలికలో ఉంటుంది? తల్లి పోలికలోనా?' నన్ను విడిచి వెళ్లిపోయిన నా ప్రియ పుత్రికని తలుచుకోగానే నాలో ఏదో అలజడి ప్రారంభమైంది. సామ్రాజ్యం కోసం ఆమెని వదులుకుని తప్ప చేశానా? అది అంత ముఖ్యమా? కావచ్చు. అన్నిటికన్నా ఎక్కువగా నా కుమార్తెని చూడాలన్న కోరిక నాకు బలంగా కలిగింది. ఆ ప్రాంతంనుంచి

వచ్చిన సమాచారాన్ని నేను శ్రద్ధగా చదవలేదు, కానీ ఆమె వివాహానికి ఏర్పాట్ల జరుగుతున్నాయని చదివినట్టు మాత్రం లీలగా గుర్తుంది.

ఈ ఉత్తరాది వారికి ఒక వింత ఆచారం ఉంది. పెళ్లికూతురి తండ్రి తగిన వరుడిని ఎంపిక చేసేందుకు పోటీ నిర్వహిస్తాడు. అది చాలా అనాగరికం అనిపిస్తుంది నాకు. పెళ్లికూతురిని పోటీలో గెలుచుకునేందుకు ఆమె ఏమైనా బహుమానమా? అసలు దేవతా పురుషులు తమ భార్యలని దాసీలుగా అమ్మివేస్తారని కూడా విన్నాను. వాళ్లని తాకట్టు పెట్టటం, పందేలలో పణంగా పెట్టటం లాంటివి కూడా చేస్తారట. అది పరమ అసహ్యమైన పని, కానీ నాగరికతలేని సంచార తెగలనుంచి అంతకన్నా ఏం ఆశించగలం? దేవతాపురుషులు స్త్రీలని వస్తువులకన్నా భిన్నంగా చూడరు. నేను పూర్తిగా విభిన్నమైన సంస్కృతికి చెందినవాడిని కనుక పక్షపాత బుద్ధిని ప్రదర్శిస్తున్నానేమో. కానీ స్త్రీలనీ, పీడితులనీ గౌరవించే సమాజమే అసలైన నాగరిక సమాజమని నేను ఎప్పుడూ నమ్ముతూనే ఉన్నాను. కులం అనేది వంగనిది. కింది వర్గాలకి చెందిన జనం పరిస్థితి ఊహకి అందనిది.

అసురులకి కూడా సమస్యలు లేకపోలేదు. అసురులలో పురుషులకి వస్తువులమీద వ్యామోహం. అసుర స్త్రీలు దుందుడుకు స్వభావం కలవారు, నైతికత పాటించరు. కానీ మాలో మగపిల్లలనీ, ఆడపిల్లలనీ ఒకేవిధంగా పెంచుతారు. అసురులలో కూడా కులవ్యవస్థలాంటి సామాజిక వ్యత్యాసాలు ఉన్నాయి, కానీ అవి పుట్టుకమీదా, చర్మంరంగుమీదా ఆధారపడి ఉండవు. శ్రమా, అదృష్టంవల్ల ఎవరైనా అధికారం పొందేస్థాయికి చేరుకోవచ్చు. దానికి అన్నిటికన్నా మంచి ఉదాహరణ నేనే.

నా కుమార్తె స్వయంవరానికి పోటీ ప్రారంభమయే సమయానికి మిథిలకి చేరుకోగలనని ఆశించాను. నా మనసు స్థిమితంగా ఉండలేకపోతోంది. 'ఏ అనాగరికుడైన దేవతా పురుషుడు నా కుమార్తెని వివాహం చేసుకోబోతున్నాడు? ఆమె జీవితం ఎంత భిన్నంగా ఉండబోతోంది?' ఆమె జీవితం సుఖంగా సాగబోదని నాకు ఎందుకో

అనిపించింది. దానికి కారణం ఇదీ అని నేను చెప్పలేను కానీ ఆ ఆలోచన నన్ను తొలవటం మానలేదు. వేదవతి వెర్రిగా నవ్వటం నాకింకా గుర్తుంది. ఆమె శాపం నన్ను వెంటాడింది. నా కుమార్తె అసురుల మరణానికీ, వినాశానికీ కారణం అవగలదన్న జోస్యం నిజమైతే ఎలా? వేదవతి అగ్నికి ఆహుతి అవుతూ ఇచ్చిన శాపం ఫలిస్తే ఏం చెయ్యాలి? ఇదంతా పూర్తిగా అర్థంలేని ఆలోచన. నేను ఏతో చిత్త భ్రమలో ఉన్నట్టున్నాను.

నేను నర్మదానదికి చేరుకుంటూ ఇంకా ఒక రోజంతా ప్రయాణం చెయ్యాల్సి ఉంటుందని అనుకున్నాను. విమాన ప్రయాణం తాలూకు ఉత్సాహం మందగించింది. కింద మైదానప్రాంతాలు కూడా ఎండిపోయి ఏమాత్రం ఉల్లాసాన్ని కలిగించటం లేదు. చాలాసార్లు నిద్రకి జోగాను. మధ్యలో కిష్కింధకి వెళ్లి వాలితో నా స్నేహాన్ని మళ్లీ దృఢతరం చేసుకోవాలని అనిపించింది. కానీ నా అహంకారం గుదిబండలా నామెడకి వేలాడుతూ ఉండటంవల్ల వాలి రాజ్యాన్ని తాకకుండా మరోదారిన వెళ్లాం. తుంగభద్రనదీతీరాన కొంతసేపు విశ్రమించటానికీ, ఫలహారం సేవించటానికీ ఆగాం. నా కుమార్తె స్వయంవరం జరిగే సమయానికి అక్కడికి చేరుకోవాలన్న ఆత్రుతవల్ల త్వరగా మళ్లీ బైలుదేరాం.

26. ఆ సమయం ఆసన్నమైంది

రావణుడు

తెల్లవారేసరికల్లా మేము మిథిలలో దిగాం, నగరానికి కొన్నియోజనాలు దూరంగా, నిర్మానుష్యంగా ఉన్న ప్రదేశాన్ని నేను ఎంచుకున్నాను. పుష్పకవిమానాన్ని పొదల మాటున దాచి, దేవతల వస్త్రాలు ధరించి, రాజప్రాసాదం వైపు నడిచాం. చాలామంది జనం అటువైపే వెళ్తున్నారు. వీధుల్లో తిరుగుతున్న మనుషులనీ, ఆవులనీ తోసుకుంటూ వందలమంది సరుకులు అమ్మేవాళ్లు వీధులవెంట వెళ్తున్నారు. వీధులు ఇరుకుగానూ, వంకరటింకరగానూ ఉండటం, మురికినీరు పోయేందుకు కాలవలు లేకపోవటం గమనించాను. ఇళ్లు నాటురకంగానూ, రాజుగారి భవనం లంకలోని మధ్యతరగతి రైతు ఇల్లులాగానూ ఉన్నాయి. నాకు ఆ నగరం ఎంతమాత్రం నచ్చలేదు, కానీ ఇంతకన్నా గొప్పగా ఉంటుందని కూడా నేను అనుకోలేదు. అక్కడ వెనకబాటుతనం ఉంది, సాంస్కృతికంగానూ, ఆర్థికంగానూ వెనకబడిన నగరం అది. అయినప్పటికీ ఉత్తరాదిన ఉండే మేలైన నగరాలలో ఇదీ ఒకటని భావిస్తారు. చాలామంది జుట్టు గోధుమరంగులో ఉంది, పాలిపోయినట్టు తెల్లగా ఉన్నారు. కానీ ఎంతోమంది నల్లగా కూడా ఉన్నారు. రాజభవనంలోనే నల్లగా ఉన్న స్త్రీపురుషులు నాకు కనిపించారు. వాళ్లు మరో దారిన వచ్చి పోతారు లాగుంది. వీళ్లు అస్పృశ్యులని గ్రహించాను. మంచి దుస్తులు తొడుక్కున్న తెల్లచర్మం వాళ్లు ఈ దీనులకి దూరంగా తొలగిపోతున్నారు. వాళ్లు అస్పృశ్యులని అసలు మనుషుల్లాగే చూడరు. వీళ్లు కూడా పాపం కులీనులు వెళ్లేదాకా పక్కకి తొలగి దారి ఇస్తున్నారు. ఇదేం సంస్కృతి? నా పరిపాలనలో ఎన్నడైనా ఇలాంటిది జరుగుతుందా?

జ్ఞానసంపన్నులైన రాజులలో జనకుడు కూడా ఒకడు,

అయినప్పటికీ ఈ వ్యాధినుంచి అతను కూడా విముక్తుడు కాలేకపోతున్నాడు. నేను ఇంతకన్నా చాలా మెరుగైన రాజుని. రావణుడు మాత్రమే సుభిక్షమైన, న్యాయమైన సమాజాన్ని ఏర్పరిచాడు. అలా గర్వమూ, తిరస్కారమూ కలగలిసిన భావంతో నేను రాజసభలో ప్రవేశించాను. సభ మధ్యలో వింత ఆకారంగల ఒక విల్లు పెట్టి ఉంది. 'ఇది మరీ బరువుగా ఉన్నట్టుంది. ఎందుకూ పనికిరాదు,' అనుకున్నాను. చాలామంది గొప్ప హోదాలో ఉన్నవారు తమతమ ఆసనాలలో ఆసీనులై ఉన్నారు. చెక్కతో చేసినట్టున్న సింహాసనం మీద ఎంతో హుందాగా నా వయసు వ్యక్తి ఒకాయన కూర్చుని ఉన్నాడు. ఆయన కూర్చున్నచోటికి పైన ఉన్న మిద్దెమీద మేలిముసుగులు కప్పుకున్న స్త్రీ ఆకారాలు కనిపించాయి. నా గుండె దడదడలాడింది. వాళ్లలో నా కూతురు కూడా ఉండే ఉంటుంది. ఎంతో ఆత్రుతతో నా కళ్లు ఆమెకోసం వెతికాయి. 'ఆమె చూసేందుకు ఎలా ఉంటుంది?' స్త్రీలకి ముసుగులు వేసి ఉంచే ఆ దిక్కుమాలిన దేవతల ఆచారాన్ని తిట్టుకున్నాను.

జనకమహారాజు లేచి నిలబడ్డాడు. ఆయన ప్రకటించబోయే విషయం వినేందుకు అందరూ వేచి ఉన్నారు. ఆ పెద్ద ప్రాంగణంలో ఆయన గొంతు ఖంగు మని పలికింది, "శక్తిమంతులైన మహారాజులారా, రాజకుమారులారా, ఈరోజు శుభదినం. నా ప్రియపుత్రిక, సీతకి ఈరోజు స్వయంవరం. మీలో అందరికన్నా బలవంతుడూ, ధీశాలీ, నిపుణుడూ మాత్రమే ఈవేళ నా కుమార్తెని గెలుచుకో గలుగుతాడు." అంతవరకూ చెప్పి ఆయన ఆగాడు. నేను చుట్టూ కలియ జూశాను. ఎంతోమంది బానపొట్టలతో ఉన్నవాళ్ళూ ఎముకల పోగుల్లా ఉన్నవాళూ ఆత్రుతతో ఎదురుచూస్తూ కనిపించారు. "ఈ పోటీ తాలూకు నియమాలు చాలా సరళమైనవి. ఇక్కడ ఉన్న ఈ బరువైన విల్లని ఎత్తి నారి సారించాలి. మహాశయులారా, అదంత సులభం కాదు. ఈ విల్లు పేరు త్రియంబకం. దీన్ని ఒకానొకప్పుడు పరమశివుడు స్వయంగా ఉపయోగించాడు. ఎవరైతే దీన్ని ఎత్తి నారి తగిలించగలుగుతారో వాళ్లకి నా కుమార్తెతో

వివాహం జరుగుతుంది."

నవ్వుతో ఉక్కిరిబిక్కిరయేంత పనయింది నాకు. 'వీళ్లకి శివధనుస్సు ఎలా దొరికింది?' శివుడి ధనుస్సుట, నా ముఖం! బహుశా ఎవరైనా శివుడి విల్లని ఎత్తగలరన్నభావనకే వీళ్లు పలకరించిపోతున్నట్టున్నారు. ఎంతైనా శివుడు ఆదికాలపు అసుర రాజు, దేవుడు. "మహారాజులారా, రాకుమారులారా నా కుమారెవైపు చూడండి." జనకుడి మాటలు నా ఆలోచనలకి అడ్డుకట్ట వేశాయి. నేను వణుకుతూ వేచి చూడసాగాను. జనంలో నిశ్శబ్దం అలుముకుంది. ఇంతలో బోలెడన్ని చిరుగంటలు మోగిసూ ఒక తలుపు తెరుచుకుంది. పొడవుగా, ఒళ్లంతా నగలు ధరించిన ఒక స్త్రీ బైటికి వచ్చింది. ఆమె వెనకాలే ఆమె చెలికత్తెలు బోలెడుమంది వచ్చారు. నేను మారీచుడి చేతిని గట్టిగా పట్టుకున్నాను. నా ముఖంలోని కండరాలు బిగుసుకోవటం నాకు తెలుస్తోంది. నా గుండె వేగంగా కొట్టుకోసాగింది. ఆమె వచ్చి వందలమంది పురుషుల మధ్య సన్నగా వణుకుతూ నిలబడింది. కోరికతో నిండిన ఎన్నోకళ్లు ఆమెని నిలువెల్లా తడమటం మొదలుపెట్టాయి. ఒక పనికిమాలిన పోటీ తాలూకు బహుమానం కదా ఆమె! ఒక చెలికత్తె ముందుకొచ్చి ఆమె మేలిముసుగుని నెమ్మదిగా పైకెత్తింది. జనం ఊపిరి పీల్చటం మరిచిపోయారు. ఆమె అందంతో వెలిగిపోతూ అలా నిలబడేసరికి నేను ఏడ్చినంత పని చేశాను. సీత, ఆమె తల్లిని పోలి ఉంది, కానీ ఆమె శరీరం రంగు నలుపు... తేనె రంగు. ఆమె జుట్టు నల్లగా పొడుగ్గా ఉంది. ఆమె నా కుమార్తె, ఒక అసుర రాకుమారి.

నా కుమార్తె, సీత మీదినుంచి కళ్లు తిప్పకోలేకపోయాను. ఆమె సిగ్గుతో తలపైకెత్తి అక్కడ గుమిగూడిన జనం కోరిక నిండిన కళ్లతో తననే చూడటం గమనించింది. ఏ ముఖం మీదా ఆమె చూపు ఒక్క క్షణం కన్నా ఎక్కువసేపు నిలవలేదు. ఆమె నావైపు చూసేసరికి ఒక్క క్షణం నా గుండె కొట్టుకోవటం ఆగింది. ఆమె తదేకంగా నావైపు చూసూంటే నాకు భయం వేసింది. నాలో ఏదో అలజడి, అది అపరాధభావమా, భయమా? నాకు తెలీలేదు, వెంటనే చూపు

మరల్చుకున్నాను. మళ్లీ ఆమెవైపు చూసేసరికి ఆమె ఒక పద్దెనిమిది సంవత్సరాల యువకుడివైపు గాఢంగా చూడటం కనిపించింది. అతను రాకుమారుడు కాదు. మామూలు దుస్తులే ధరించాడు, కానీ భుజాన విల్లు వేలాడుతోంది. అతని జుట్టపైకి ముడివేసి ఉంది. అతను పొడుగ్గా, దృఢంగా ఉన్నాడు. అతని రూపం చూపరులని ఆకట్టు కునేట్టు ఉంది. అతను శాంతంగా, సాధుస్వభావం కలవాడిలా కనిపించాడు. అంత పిన్నవయసున్న ఆ కుర్రాడిలో అంత గాంభీర్యం ఉండటం అరుదే.

నా కుమార్తె కళ్లు అతని కళ్లతో కలిసి ముడిపడటం కనిపించింది నాకు. ఆమె ముఖం సిగ్గుతో ఎర్రబడింది. బుగ్గమీద పడిన సొట్ట ఆమె ముఖాన్ని దేదీప్య మానం చేసింది. వెంటనే ఆమె కళ్లు దించుకుంది. వెనుతిరిగి వెళ్లిపోయింది. ఆ నల్లటి కుర్రవాడిని నేను శ్రద్ధగా గమనించసాగాను. నా నరాలలో విచిత్రమైన ఈర్య ద్వేషం ప్రవహించటం అనుభూతి చెందాను. అతనికి నా మనసులోని భావాలు అర్థమైనట్టున్నాయి, నావైపు చూసి చిరునవ్వు నవ్వాడు. నేను ఎందుకో జంకాను. ఎప్పుడు, ఎందుకు అలా అనిపించిందో గాని ఈ కుర్రవాడు ప్రమాదకరమైనవాడని గ్రహించాను. అతను తప్పకుండా నా కుమార్తెని గెలుచు కుంటాడని నాకు తెలిసింది. నా కుమార్తె గురించీ, నా గురించీ భయం వేసింది. నేను వెంటనే వెళ్లి ఆమెని ఆపదనుంచి రక్షించాలనుకున్నాను. ఆమెని తక్షణం లంకకి తీసుకెళ్లిపోవాలని అనిపించింది. కానీ నిలబడ్డచోటినుంచి కదలలేకపోయాను. ఒంటరిగా నా భయాలతో, ఆందోళనలతో అలా నిలబడి ఏదైనా అద్భుతం జరిగి నా కుమార్తె రక్షింపబడాలని ప్రార్థించాను.

పొడవాటి తెల్లటి గడ్డం ఉన్న ఒక వృద్ధ బ్రాహ్మణుడు ఆ కుర్రవాడి పక్కనే నిలబడి ఉన్నాడు. మరొక యువకుడు నావైపు చూశాడు. అతని ముఖంలో శాశ్వతంగా విసుగు చోటుచేసుకుని ఉంది. నా కళ్లు అతని కళ్లతో కలుసుకోగానే అతని ముఖంలో విపరీతమైన ద్వేషం కనబడి నేను వెనక్కి తగ్గాను. 'ఈ చిన్న వయసులో వీళ్లకి ఇంత ఆత్మవిశ్వాసం, అహంకారం ఎలా అలవడ్డాయి?' నేను కూడా ఒకప్పుడు

ఈ వయసువాడినే. కానీ నాలో ఇటువంటి ఆత్మవిశ్వాసం, అహంకారం ఎన్నడూ లేవు. పెద్దల యెడల ఎప్పుడూ వినయవిధేయతలతో, మర్యాదగా ప్రవర్తించేవాడిని.

పోటీ ప్రారంభమైంది. ఒక్కొక్కరుగా పోటీచేసేవారు ముందుకి వచ్చి భారీ విల్లని ఎత్తటానికి ప్రయత్నించి వైఫల్యం పొంది వెనక్కి వెళ్లసాగారు. కొందరు ఆ విల్లని ఎత్తటానికి ప్రయత్నించటం చూశాక ఆ విల్లు రెండు కొసలకీ వేర్వేరు బరువున్న రాళ్లు తగిలించి ఉండటం గమనించాను. ముందు దాన్ని సరిగా ఎలా పట్టుకోవాలో అర్థం చేసుకోవాలి, ఆ తరవాత ప్రయత్నించాలి. కొద్దిసేపట్లోనే ఆహ్వానితులందరూ ప్రయత్నం చేసి దాన్ని సాధించటంలో విఫలమయారు. ఆ ప్రాంగణంలో ఇబ్బందికరమైన నిశ్శబ్దం పరుచుకుంది. కానీ నా మనసు కుదుటపడింది.

ఇక ఏ పశువూ నా కుమార్తెని వివాహమాడలేడు. జనకుడికి నేను ఎవరనేది తెలియజేసి నా కుమార్తెని నాకు ఇచ్చెయ్యమని అడిగే తరుణం ఆసన్నమయింది. ఆమెని లంకకి తీసుకుపోయి ఒక అసుర రాకుమారికి అర్హమైన జీవితాన్ని అందిస్తాను. తను ప్రేమించినవాడిని ఆమె వివాహం చేసుకుంటుంది, లేదా నేనే ఒక మంచి వరుడిని చూసి వివాహం జరిపిస్తాను. మండోదరికి అసలు విషయం చెప్పి క్షమించమని వేడుకుంటాను. యౌవనంలో నేను చేసిన తప్పలన్నిటికీ నేనే ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. నేను అడుగు ముందుకి వేశాను.

రాజువైపు నేను నడిచి వెళూ ఉంటే జనం నన్నే చూడటం గమనించాను. అప్పటికిగాని నేను చేస్తున్న పొరపాటు ఏమిటో అర్థం కాలేదు. నేను కూడా ప్రోటీతో పాల్గొనటానికే వచ్చానని అందరూ అనుకున్నారు. జనకుడు ముందు నావైపు ఆశగా చూసి మరుక్షణం నొసలు చిట్టించాడు. తన కుమార్తెకి భర్త అయే వయసు నాకు దాటిపోయిందని అనుకున్నాడు కాబోలు. నా వయసు అప్పటికి కేవలం నలభైఆరు సంవత్సరాలే. కానీ ఆడపిల్లలకి ఆరేళ్ల వయసులోనే పెళ్లిళ్లు చేసే వాళ్ల సమాజంలో, నేను వృద్ధుడికిందే లెక్క. విల్ల దాకా వచ్చి

ఆగాను. నాకు కుతూహలం కలిగింది. దాని వంపులని చేతివేళ్లతో నిమిరాను. దాన్ని పట్టుకున్నాను. దాన్ని అంత బాగా తయారుచెయ్యలేదు. ఆ వింటికి నారిని సంధించటం అసంభవ మని నాకు కచ్చితంగా తెలుసు. దాన్ని ఎవరైనా ఎత్తగలిగితే అది విరిగిపోతుంది. ఇటువంటి అతిసామాన్యమైన వింటిని శివుడు ఉపయోగించి ఉండటం కల్ల,

ఆయుధాలు తయారుచేసే శిక్షణ కేంద్రంలో ఎవరో విద్యార్థులు తయారుచేసిన ఈ వింటిని జనకుడు తెచ్చి ఇక్కడ పెట్టి ఉంటాడు. ఆ విల్లు నిరుష్టంగా తయారు చెయ్యబడినది కాదు. దీనితో పోటీ నిర్వహించి నా కుమార్తెని అమ్మటానికి వీళ్లు ప్రయత్నిస్తున్నారు!

"తమరు ప్రయత్నించదలుచుకుంటే త్వరపడండి," అన్నాడు ఒక మంత్రి నాతో నేను అతనివైపు నిశ్చలంగా చూశాను. 'దీన్ని ఎత్తగలిగితే నేనేం చేస్తాను? నా కుమార్తెనే వివాహమాడతానా?' అప్పుడు ఆ నల్లటి అందమైన యువకుడు ముందుకొచ్చిరాజుకి నమస్కరించాడు. నేను కల్లెత్తి చూశాను. సీత తన మేలిముసుగు తొలగించి ఆత్రుతగా ఎదురుచూస్తోంది. నా మనసులో ఏ మూలో ఈ యువకుడు గెలిస్తే బావుండునని ఉంది. నా కుమార్తెకి తను ప్రేమించినవాడు కాకపోయినా, తనకి నచ్చినవాడు భర్తగా లభిస్తాడు. నా మనసులోనే ఉన్న మరో చీకటి కోణం, ఇతన్ని వివాహం చేసుకుంటే సీత ఎన్నటికీ సంతోషంగా ఉండలేదన్న భావం కూడా నన్ను కలవరపెట్టసాగింది. ఈ యువకుడు వింటిని ఎత్తటంలో కృతకృత్యుడైనప్పటికీ నారి సంధించే ప్రయత్నం చేస్తే అది తప్పకుండా విరిగిపోతుందని నాకు తెలుసు. అలా జరిగినట్టయితే సీత ప్రస్తుతానికి ప్రమాదంనుంచి తప్పించుకున్నట్టే.

నేను వేచి చూడసాగాను. "ప్రభూ! నేను రాముడిని, అయోధ్యానగర రాకుమారుడిని. దశరథ మహారాజు జ్యేష్టపుత్రుడిని," అని ఆ యువకుడు మళ్లీ జనకుడికి నమస్కరించాడు. "అయోధ్యానగరమా? హ్రూఁ... ఆ పేరు ఎక్కడ విన్నాను? బహుశా ఉత్తరదిక్కున ఉన్న మైదానప్రాంతాల్లో ఉన్న ఏదో ఊరూ పేరూ లేని చిన్న

రాజ్యం కావచ్చు!"

అప్పుడు హఠాత్తుగా గుర్తుకొచ్చింది. అనరణ్య మహారాజు... ఆయనతో చేసిన యుద్ధం. 'దేవుడా! భయంకరమైన ఆ అతిచిన్న గ్రామమా? అది మిథిలలో సగం కూడా ఉండదే!' అది ఎంత ఆదిమ ప్రాంతమో నాకు తెలుసు. చాలాకాలం క్రితమే అక్కడ పరిపాలిస్తున్న ఆఖరి రాజుని నేను అంతమొందించాను కదా? ఈ మైదానప్రాంతాల్లో రాజులు పుట్టగొడుగుల్లా మొలుచుకు వస్తారు!

నేను వెనక్కి తగ్గాను. రాముడు ఆ వింటి చుట్టూ రెండు మూడుసార్లు ప్రదక్షిణ చేశాడు. దాన్ని నిశితంగా పరిశీలించాడు. నేను అతని తెలివితేటలని మనసులోనే అభినందించాను. ఇతను తెలివైనవాడు, సమయస్ఫూర్తి గలవాడు. తన బలాన్ని చూపించేందుకు ఆత్రుత చూపలేదు. తన మధ్యవేలినీ బొటనవేలినీ ఉపయోగించి విల్లు ఒక చివరినించి రెండో చివరిదాకా కొలిచి చూశాడు. వింటి మధ్యభాగానికి మూడు అంగుళాల దూరాన్ని ఎంచుకుని ఒక్క ఊపులో వింటిని ఎత్తాడు. దాని బరువుకి పడిపోబోయి త్వరగా నిలదొక్కుకున్నాడు. నాకు చెమటలు పట్టసాగాయి. 'ఇతను దీన్ని సాధిస్తాడా?' ఆయుధాల గురించి నా పరిజ్ఞానం నమ్మదగినదే అయితే ఈ విల్లు విరగాలి. దానికి నారిని సంధించటం అసాధ్యం. సీతవైపు చూశాను. ఆమె గొప్ప ఒత్తిడికి గురైనట్టు కనిపించింది. రెండు చేతులూ జోడించి మౌనంగా ప్రార్థిస్తోంది.

రాముడు కిందనున్ననారిని తీసి వింటి పైభాగానికి కట్టటానికి ప్రయత్నించాడు. అతని కండరాలు బిగుసుకున్నాయి, అతని ముఖంలో ఆ ప్రయత్నం వల్ల కలిగిన ఒత్తిడి కనిపించింది. నేను మంత్రముగ్ధుడిలా చూస్తూ ఉండిపోయాను. 'ఈ యువకుడు మంచి యోధుడే బహుశా మేఘనాదుడికి ఉన్నంత శౌర్యమూ ఇతనికి ఉన్నట్టు తోస్తుంది' విల్లు వంగింది. రాముడు నారిని ఒకసారి చుట్టాడు. వాతావరణంలో ఉన్న ఒత్తిడిని గ్రహించగలిగాను. ఆ యువకుడు చేసే అసాధ్యమైన పనిని అందరూ చూడసాగారు. ఆ విల్లు విరగకుండా

ఉండటం గొప్ప అద్భుతం! అదెలా సాధ్యమైందో నాకు అర్థం కాలేదు. 'నాకున్న పరిజ్ఞానం మొద్దుబారిపోయిందా?' నిటారుగా నిలబడ్డ అయోధ్యా రాకుమారుడి మీదినించి నా చూపులని నా కుమార్తె మీదికి మళ్లించాను. సరిగ్గా అదే సమయంలో కిర్రుమన్న ధ్వని వినిపించింది. వెంటనే తిరిగి చూశాను. నా గుండె వేగంగా కొట్టుకోసాగింది. ఆ శబ్దం నాకు పరిచయమైనదే. మరుక్షణం కొరడాతో కొట్టినట్టు ఫెళ్లమని విల్లు రెండు ముక్కలయింది. ఒక్క నిమిషం రాముడు తికమకపడ్డట్టు కనిపించాడు. అందరూ నోటమాట రానట్టు కొయ్యబారిపోయారు. నేను ఆనందం పట్టలేకపోయాను. ఆ వింటికి ఎవరూ నారి సంధించలేరు. ఇప్పుడు నేను సీతని నావెంట లంకకి తీసుకుపోగలుగుతాను. మారీచుడివైపు చూశాను, కానీ ఆయన విచారంగా తల ఆడించాడు. నాకు అయోమయం అనిపించి, ప్రశ్నార్థకంగా ఆయనవైపు చూశాను.

ఇంతలో ఆ ప్రాంగణంలో చెవులు చిల్లులు పడేలా జయజయధ్వానాలు మిన్నుముట్టాయి. నా కుమార్తె అయోధ్య రాకుమారుని దగ్గరకి వెళ్లి అతని మెడలో వరమాల వెయ్యటం చూసి ప్రమాన్పడిపోయాను. ఆ క్షణంనుంచీ సీతారాములు భార్యాభర్తలయారు. నా కళ్లలో నీళ్లు నిండాయి. ఆ యువదంపతులవైపు చూశాను. అనుకోకుండా సాధించిన విజయానికీ, సీత బహుమతిగా లభించినందుకూ రాముడి ముఖంలో నాకు గర్వం కనిపించింది. అది నన్ను బాధపెట్టింది, 'నీకు ఆమెని పొందే అర్హతలేదు యువకుమారా!' అని అరవాలనిపించింది. ఇంతలో సీత కళ్లలో స్వచ్ఛమైన, అమాయకమైన ప్రేమ కనిపించింది. నేను నిస్సహాయుడినై పోయాను, అనిపించింది. ఆమె ఆనందాన్ని భగ్నం చేసే హక్కు నాకేం ఉంది? 'అమ్మా! నీకు నేను ఎటువంటి సాయమూ చెయ్యలేకపోయాను!' అనుకున్నాను. ఆమె అంతగా ప్రేమించిన వ్యక్తితో సంతోషంగా జీవిస్తుందని ఆశించాను. ఆమెని అతను ప్రేమగా, గౌరవంగా చూసుకుంటాడనీ, తిరిగి ఆమెని అంతే ఎక్కువగా ప్రేమిస్తాడనీ ఆశించాను. అతను ఆమెకి తగిన భర్తగా ఉండాలని

కోరుకున్నాను. నా కుమార్తె మీద నాకు ఎటువంటి హక్కూ లేదు, కానీ ఆమె ఆనందంగా జీవితం గడపాలని మాత్రం ప్రార్థించాను. ఆమె ఎంచుకున్న భర్త ఇంకా చెప్పాలంటే ఆమెని పోటీలో బహుమతిగా గెలుచుకున్న ఆ యువకుడు ఆమెకి దుఃఖాన్నే కలిగిస్తాడని నాకెందుకో అనిపించింది. నా ఆలోచన తప్పవాలని కోరుకున్నాను. కానీ ఇకనుంచీ ఆమెని రక్షించేందుకు ఒక కన్ను ఆమెపై వేసి ఉంచుతాను. ఈ భూమ్మీది అతిపరాక్రమవంతుడైన చక్రవర్తి కుమార్తె ఆమె. ఆ యువకుడు ఆమెకి తగనివాడని ఏ క్షణానైనా నాకు తెలిస్తే, వెంటనే ఆమెని నా భవనానికి ఎత్తుకెళ్లి గుండెల్లో దాచుకుని కాపాడుకుంటాను. వాళ్లని తోసుకుంటూ ఆ జనసందోహం నుంచి నేను బైటపడ్డాను. చెమటతో తడిసి, అలసిపోయిన నాకు కన్నీళ్లు ఆగలేదు. సీతని గురించిన ఆలోచనలని మనసులోంచి నెట్టివెయ్యటానికి ప్రయత్నిస్తూ ఇక్కడికి వచ్చినందుకు నన్ను నేను తిట్టుకున్నాను.

మేము పుష్పకవిమానాన్ని దాచిన పొదల దగ్గరికి నడిచాను. ఈ దేవతల రాజ్యం, వాళ్ల ఆచారాలూ నాకు విసుగు పుట్టించాయి. లంకకి తిరిగి వెళ్లిపోవా లనిపించింది. నా భార్యనీ, కుమారులనీ, ప్రజలనీ చూడాలనిపించింది. విమానం దాచిన చోటికి వెళ్లాకగాని మారీచుడు నావెంట రాలేదన్న నిజాన్ని గ్రహించలేదు నేను. ఆయన కాసేపాగి వచ్చాడు. నాకు ఇంకా నా కుమార్తె గురించి ఆందోళనగానే ఉంది. 'కనీసం ఆమె భర్త మంచి యోధుడిలాగే కనబడ్డాడు. చూద్దాం పరిస్థితులు ఎలా పరిణమిస్తాయో.' పుష్పకవిమానంలోకి ఎక్కుతూ, మారీచుడిని ఎక్కమని సైగ చేశాను. కానీ నా మనసులో ఉన్న ఆదుర్దా, అనుమానాలూ నన్ను వదల్లేదు.

"మన సిబ్బందిని వాళ్లమీద ఒక కన్నువేసి ఉంచమని చెప్పండి, మారీచా! ముఖ్యంగా ఆ కుర్రవాడిని జాగ్రత్తగా గమనించమనండి," అన్నాను మారీచుడితో. ఆయన గంభీరంగా తల ఊపాడు. "ఇన్నాళ్లు ఆమెని మన వెంట తీసుకెళ్లకుండా ఆగి ఉండవలసింది కాదు," అన్నాడు మారీచుడు. నాకూ అలాగే అనిపించింది. కానీ ఆ విషయం

గురించి ఇప్పుడు ఆలోచించి ఏమీ లాభం లేదు.

రెండు రోజుల్లో లంకకి చేరుకున్నాం. దేవతాజాతి బ్రాహ్మణస్త్రీ గురించి మండోదరికి చెప్పేశాను. చెప్పటం ఎంతో కష్టం అనిపించినప్పటికీ అన్ని విషయాలూ పూసగుచ్చినట్టు చెప్పాను. నా కుమార్తె గురించీ, ఆమె గురించి నాకు ఉన్న భయాల గురించీ చెప్పాను. మండోదరి నేను తనకి ద్రోహం చేసినందుకు ఏడ్చింది, కానీ నన్ను క్షమించింది. ఎప్పటినుంచో మండోదరికి ఈ విషయం తెలుసుననీ, నా దగ్గర ప్రస్తావించలేదనీ నాకు ఎందుకో అనిపించింది. నేను ఉన్నది ఉన్నట్టు చెప్పటంవల్ల మాకిద్దరికీ మంచే జరిగింది. ఆరోజు తరవాత ఆమెకి నామీద గౌరవం ఇనుమడించిందని అనిపించింది. మా కుమార్తెని లంకకి పిలిపించు కోవాలని తనకి ఎంతో కోరికగా ఉందనీ, కానీ ఆమెకి వివాహం అయిపోవటం వల్ల ఆమె భర్త దగ్గర ఉండటమే మంచిదనీ మండోదరి నాతో అంది. ఎన్నాళ్ల తరువాతో ఆనాడు నేను ప్రశాంతంగా నిద్రపోగలిగాను.

ముందే మాట ఇచ్చినట్టు నేను సీతని ఒక కంట కనిపెడుతూనే ఉన్నాను. తన సవతి తల్లి తన కొడుకుని రాజు చెయ్యాలని కోరిందనీ, రాముడు రాజ్యాన్ని వదులుకున్నాడనీ విని నిర్ఘాంతపోయాను. ఆమె తన భర్త దశరథుడి చేత వాగ్గానం చేయించుకుంది. ఆ వాగ్గానం ప్రకారం రాముడు పధ్నాలుగు వత్సరాలు వనవాసం చెయ్యాలి, ఆమె కుమారుడు భరతుడికి పట్టం కట్టాలి. నా జామాత మూర్ఖుడిలా తన హక్కుని వదులుకుని అడవులమ్మట తిరిగేందుకు వెళ్లిపోయాడు. అయోధ్యానగర ప్రజలు రాముడినే తమ రాజుగా చూడాలని కోరుకున్నప్పటికీ, భార్యావిధేయుడైన తన తండ్రిని తృప్తిపరిచేందుకు జనం కోరికని తోసిపుచ్చాడు. రాముడి దురహంకారం, ప్రపంచానికి తన న్యాయబుద్ధిని చాటుకోవాలన్న అతని ఆత్రుతా కారణంగా నాకు అతనిమీద అసహ్యం వేసింది. అతను అలా ఎందుకు చెయ్యవలసి వచ్చిందో నాకు అసలు అర్థం కాలేదు. పైగా అతని తండ్రి అంత అన్యాయమైన వాగ్గానం ఎలా చేశాడు? రాజైనవాడు అలాటి పని

చెయ్యకూడదు. అది రాజధర్మానికే విరుద్ధం. ఒక వారసుడిగా తండ్రి చేసిన అన్యాయాన్ని ఎదిరించవలసిన బాధ్యత రాముడి మీద ఉంది. తన తండ్రి దగ్గర్నించి రాజ్యాన్ని హస్తగతం చేసుకుని సింహాసనాన్ని అధిష్టించి ఉండవలసింది. అలా చెయ్యకుండా తన సవతి తమ్ముడికోసం రాజ్యాన్ని పరిత్యజించాడు. ఇక అతని ఇంకో తమ్ముడు, లక్ష్మణుడు అతనివెంట అడవులకి వెళ్లాడు. తమతోబాటు నా అందమైన కుమార్తెని కూడా అడవుల్లోకి లాక్కెళ్లారు.

ఆ ముగ్గురినీ శత్రువులనుంచి కాపాడుతూ ఉండమనీ, ఎప్పటికప్పుడు నాకు సమాచారాన్ని అందిస్తూ ఉండమనీ నా భటులని ఆదేశించాను. రాముడు అన్ని ప్రాంతాలూ తెగ తిరుగుతున్నాడనీ, సీత చాలాసార్లు ఏకాంతంగా కన్నీళ్లు కారుస్తూ ఉందనీ నాకు సమాచారం అందింది. లక్ష్మణుడు అనాగరికమైన పశువులాంటి వాడనీ, వాడివల్ల నా కుమార్తెకి హాని జరుగుతుందనీ నాకు సందేహంగా ఉండేది. కానీ నా భయాలు నిరాధారమైనవని తెలిసింది. లక్ష్మణుడు రాముడిపట్లా సీతపట్లా విధేయుడై మెలిగాడు. ఈ లోపల లంక అభివృద్ధి చెందింది. నేను రకరకాల సంస్కరణలని ప్రవేశపెట్టాను. కానీ నా మనసులో ఎప్పుడూ సీత గురించిన ఆలోచనలే. నాకు ఆందోళనగా ఉండేది. తరవాత ఒకనాడు శూర్పణఖ పరిగెత్తు కుంటూ నా రాజసభలోకి వచ్చింది. ఆ సమయం ఆసన్నమైంది.

27. అసుర రాజకుమారి వెనక్కి వచ్చింది

భద్రుడు

నాకు దాదాపు యాభై సంవత్సరాలు నిండాయి. బట్టతల వచ్చేసింది, శరీరంలో బలం తగ్గిపోయింది, మానసికంగా కూడా బలహీనుడినై పోయాను. ఒక రోజుకీ, మరో రోజుకీ తేడా లేకుండా పోయింది. తెల్లవారుతుంది, నిద్ర లేస్తాను, రోజువారీ పనులు చేసుకుంటాను, తింటాను, జీవితంలో ఎప్పుడో చూసిన అందమైన అమ్మాయిలని తలుచుకుంటాను, పరిస్థితుల గురించి ఆలోచిస్తూ దిగులు పడతాను, తాగుతాను, ప్రపంచం తీరుని విమర్శిస్తాను, యావనంలో నేను నిజంగా చేసినవీ, చెయ్యనివీ, సాహసకృత్యాల గురించి అందరికీ చెప్పి చెప్పి విసిగిస్తాను. రాత్రి పొదుపోయి పక్కమీద వాలిపోయి మళ్లీ మర్నాడు ఉదయం నిద్రలేస్తాను. ఇలాగే ప్రతిరోజూ గడుస్తుంది. రావణుడి విప్లవం వల్ల మాకేమీ లాభం చేకూరలేదు. మా జీవితాలు కొద్దిగా మెరుగయి ఉండవచ్చు. కానీ మమ్మల్ని ఉంచాల్సిన చోట ఉంచి, సరైన ప్రవర్తన నేర్చుకునేట్టు చేశాడు. కులీనులు ఒక వర్గం, మిగతా వారందరూ మరో వర్గం. కొందరికి ప్రత్యేకమైన సౌకర్యాలు లభించాయి, మేము అట్టడుగునే ఉండిపోయాం. మా స్థానంలో మేం ఉన్నంతవరకూ ప్రాణాలకి ముప్పలేదు. కానీ మాలోనే చాలామంది గట్టిగా ప్రయత్నించీ, కొంత అదృష్టం బావుండీ, ముఖస్తుతి చేసే పైస్థాయికి ఎదగగలిగారు. సైన్యంలో నాతోపాటు పనిచేసిన చాలామంది నాలాగే నిరుపేదలుగా మిగిలిపోయారు. కానీ కొందరు నిజంగా ప్రాముఖ్యం సంపాదించుకున్నారు.

ఈ మధ్య కొన్ని ఏళ్లుగా బ్రాహ్మణుల ఎదుగుదల నిజంగానే చికాకు పుట్టిస్తోంది. ఆకస్మికంగా జరిగిన తిరుగుబాటూ, ఆ తరవాత జరిగిన ఊచకోత్రా వల్ల బ్రాహ్మలు దక్షిణప్రాంతానికి రావటం తాత్కాలికంగా

ఆగింది. వాళ్ల మతాన్ని అనుసరించేవాళ్లు కూడా తగ్గిపోయారు. కానీ ఎక్కువకాలం గడవకముందే మళ్లీ వాళ్లు మావైపు రావటం మొదలైంది. ఆసరికి గొప్ప రారాజు ఎలా ప్రవర్తించాలి అనే విషయంలో రావణుడికి సొంత ఆలోచనలు స్థిరపడిపోయాయి. అగస్త్యుడు అనే మహాముని వెంట అతని అనుచరులైన ఒక బ్రాహ్మణ సమూహం అసుర రాజ్యానికి శరణుకోరి వచ్చింది. వాళ్లకి ఆశ్రయం ఇవ్వవద్దని ప్రహస్తుడు అడు చెప్పాడు. ప్రజలు కూడా దానికి విముఖత చూపారు. కానీ రావణుడు రాజుగా తన తెలివితేటలని ప్రదర్శించి వాళ్లకి ఆశ్రయం ఇచ్చాడు.

కొన్ని సంవత్సరాలపాటు అగస్త్యుడూ అతని వెంట ఉన్న బ్రాహ్మణ మూకా నగరాలకి దూరంగా ఉంటూ చడీచప్పుడూ చెయ్యకుండా జీవించారు. తమ పనులేవో తాము చేసుకుంటూ మాకు ఎటువంటి ఇబ్బందినీ కలిగించలేదు. మా రాజ్యంలో తమని గ్రామాలు నిర్మించుకోనివ్వమని అగస్త్యుడు రావణుడి వద్దకి దాదాపు ప్రతిరోజూ వెళ్లి బతిమాలుకునేవాడు. ఆయన కోరికని విభీషణుడు కూడా సమర్థించేవాడు. చివరికి దక్షిణప్రాంతాన తూర్పుతీరానా, పడమటితీరానా బ్రాహ్మణులు గ్రామాలు నిర్మించుకున్నారు. వాటిని లంకలో కూడా నిర్మించారు. అది సన్నని ధారగా మొదలైంది. తెల్లచర్మం గల బ్రాహ్మణులు నెమ్మదినెమ్మదిగా మా సామ్రాజ్యంలోని చిన్న ఊళ్లలోనూ, నగరాల్లోనూ తమకంటూ స్థిరనివాసాలు ఒక సమూహంగా ఏర్పాటు చేసుకోసాగారు. ఏం జరిగిందో మేము గ్రహించేలోపలే, ప్రభుత్వోద్యోగాలలో ముఖ్య హోదాలని చేజిక్కించుకున్నారు, ఆలయాలని కైవసం చేసుకున్నారు, ఆ తరవాత చాలా సమర్థంగా మిగతావారిని ముఖ్యమైన పదవుల్లోంచి బైటికి గెంటేశారు.

ప్రపంచం తనని గౌరవించాలంటే, తను నిష్పక్షపాతంగా అన్నిమతాలవారినీ గౌరవించాలనీ, సహించాలనీ రావణుడు అనుకున్నాడు. నావంటి అసురులెందరో ఏ ఆదర్శాలకోసం పోరాడారో, వాటిని మరిచిపోవటం సంభవించింది. రావణుడి సహనం ఎంతదాకా వెళ్లిందంటే, ప్రదేశంలోని వనరులపైన అల్పసంఖ్యాకులకి కూడా

సమానమైన అధికారం ఉందనీ, ఒక రాజుగా వాళ్లని రక్షించటం తను పాటించటం ధర్మమనీ అనేవాడు.

జనం మండిపడ్డారు. అసురుల ప్రతిష్ట కోసం పోరాడి, ఆదర్శవంతమైన అసుర సామ్రాజ్య నిర్మాణం కోసం సర్వం ధారపోసిన మాకు చివరికి దక్కేది ఇంతేనా? కేవలం అల్పసంఖ్యాకుల హక్కులకీ, వాళ్ల మతపరమైన భావాలకీ మాత్రమే ప్రాధాన్యం ఉందనీ, మేము లెక్కలోకి రామనీ అనిపించింది మాకు. బ్రాహ్మణుల పుణ్యమా అని అసురుల ప్రధాన ఆహారం గోమాంసం పైన నిషేధం విధించబడింది. బ్రాహ్మలు మా ఆలయాలలోకి వచ్చి మా దేవుళ్లని అవమాన పరచవచ్చు, లేదా అసలు ఆలయాన్నే తమ అధీనం చేసుకోవచ్చు. ఆ దేవాలయం దగ్గర మంచి ఆదాయం ఉంటే వాళ్లు ఆ పనే చేసేవారు. చివరికి మా ఆలయాలలో మాకే ప్రవేశం లేకుండా చేశారు వాళ్లు, ఎంతైనా మేము అపవిత్రులం! అల్ప సంఖ్యాకుల హక్కులు అనేది పరిపాలించేవారికి ఒక వెర్రిభావనగా మారింది. ఎందరో అసురులు దేవతల మతంలోకి మారారు. కానీ నావంటి మొండి శిఖండులు మాత్రం మారటానికి అంగీకరించలేదు.

దంద్వయుద్ధం జరిగినప్పుడు నేనూ, అతికాయుడూ చావుదెబ్బలు తిన్న తరవాత నాకింక రాజభవనం వైపుకి వెళ్లాలనిపించలేదు. కాలికింది చెప్పులా ఉండీ ఉండీ విసిగిపోయాను. నా వ్యాపారాన్ని మళ్లీ ప్రారంభిద్దామనుకున్నాను, కానీ ఆ స్థలం ఇప్పుడు అక్కడ లేదు. వీధులని వెడల్పు చేసేశారు. నా పాత మర్రిచెట్టు ఉండినచోట ప్రస్తుతం తోటలు వెలిశాయి. త్రికోట అన్ని వైపులా విస్తరించింది, దాంతో మమ్మల్ని మరింత దూరంగా తరిమివేశారు. బైటి ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణీకులు ప్రధాన రేవుపట్టణం అయిన ముచిరపట్నం కన్నా మా నగరమే ఎక్కువ అందంగా ఉందని అనసాగారు, కానీ నావంటివారికి జీవితాల్లో ఎటువంటి మార్పూ రాలేదు. మేమింకా చూసేవాళ్లకి కంటగింపుగానే ఉన్నాం, ముఖ్యమైనవాళ్ల కంటపడకుండా మమ్మల్ని మరుగునే ఉంచేవారు. అయినా వాళ్లకి మా అవసరం కూడా ఉంది.

లేకపోతే వాళ్ల తోటలని ఎవరు సంరక్షిస్తారు? వాళ్ల ఇళ్లలో పనిచేసేందుకూ, పిల్లల్ని సాకేందుకూ ఎవరు దొరుకుతారు? నీళ్లు ఎవరు తోడిపెడతారు, కట్టెలు ఎవరు కొట్టిపెడతారు, వీధులెవరు ఊడుస్తారు, మల మూత్రాలని ఎవరు అవతల పారబోస్తారు?

అందుకని మేమంటే వాళ్లకి ఇష్టం లేకపోయినా మమ్మల్ని భరించేవాళ్లు. వాళ్లకి కనబడకుండా మాయమవటం ఎలాగో నేర్చుకున్నాం. నగరం మేల్కొనక ముందే చాకిరీ అంతా చేసేసి కనబడకుండా తప్పుకునేవాళ్లం. అలాగే మా జీవితం గడిచిపోయింది. నా కొడుకునీ, నన్నూ వాళ్లు చావగొట్టి పధ్నాలుగు సంవత్సరాలు గడిచిపోయాయి. త్రికోట నగరం విస్తరించి పెరుగుతూ ఉంటే, నగరం దక్షిణ దిశకి నా భార్యతోపాటు వెళ్లి అక్కడ కొన్ని మైళ్లదూరంలో ఒక గుడిసె వేసుకుని ఉండసాగాను. ఆ కొత్తచోట పొలం పండించేందుకు ప్రయత్నించాను. కొంత అడవిని నరికి చదును చేసి మిరియాలూ, ఏలకులూ పండిదామనుకున్నాను. నా దగ్గర విత్తనాలు లేవు, అందుచేత వడ్డీవ్యాపారి దగ్గర కొంత అప్పు తీసుకున్నాను. అప్పుడు మేము ధనవంతులం అవాలన్న కలలు కనసాగాం. కొంతకాలానికి ఆ కలలు, సుఖంగా జీవిస్తే చాలు అనే కలలస్థాయికి దిగిపోయాయి. ఇంక కొంత కాలం గడిచేసరికి రెండుపూటల భోజనం దొరికితే చాలుననీ, కనీసం ఒక పూటైనా తింటే చాలనీ అనుకునే స్థితికి చేరుకున్నాం. ఆ అప్పు ఏదో విధంగా తీరిపోతే బావుండునని కలలు కన్నాం. చివరికి అసలు కలలు కనటమే మానేశాం.

కానీ కులీనులు మాత్రం ఇంకా అభివృద్ధి సాధించసాగారు. తమ సంపదని ఎంతో ఆడంబరంగానూ, గర్వంగానూ ప్రదర్శించుకోసాగారు. రావణుడి పరిపాలనలో అసుర సామ్రాజ్యం చాలా వేగంగా అభివృద్ధిచెందుతోందని అందరూ అనుకోసాగారు. అది నిజమే. సంఘంలో శ్రేష్ఠులు అభివృద్ధి చెందారు కనుక రాజ్యం కూడా అభివృద్ధి చెందింది. అధికసంఖ్యాకులు కష్టాలు పడ్డా, అన్యాయంగా తమ భూములని ధనవంతులు ఆక్రమించుకున్నప్పుడు రైతులు

ఆత్మహత్యలు చేసుకున్నా ఎవరికైనా పట్టిందా?

మేం అదృశ్యంగా ఉండే మనుషులం అందుకే లెక్కలోకి రాము. నా రాజ్యం ఈ ప్రపంచంలోనే అత్యధికమైన వేగంతో ఎదుగుతున్న రాజ్యం అనే వాస్తవాన్ని తలుచుకుని నేను ఓదార్పు పొందాను. దానివల్ల నా కడుపు నిండిందని కాదు, కానీ గొప్పలు చెప్పుకోవటానికీ, అహంకారం తృప్తిపరచుకునేందుకూ అది పనికి వచ్చింది. నాలాంటి స్నేహితులు నాకు చాలామందే ఉన్నారు. స్థానికంగా ఉన్న కల్లు దుకాణంలో రోజూ పూటుగా తాగి, మా రాజూ, అసుర సామ్రాజ్యం వర్ధిల్లాలని నినాదాలు చేసేవాళ్లం.

ఆ రోజు కూడా అన్ని రోజుల్లాగే ఉంది. వేడిగా, ఉక్కపోతగా, ఏ పనీ చెయ్యాలనిపించకుండా, విసుగా ఉంది. ఎక్కడా గాలి ఆడటంలేదు. లెక్కలేనన్ని ముంతల కల్లు తాగి, కల్లు దుకాణంలో స్పృహలేనట్టు పడిపోయాను. ఇంటికి వెళ్లాలని అనిపించలేదు. ఇక్కడ కాసేపు కూర్చోగలిగితే బావుండునని అనిపించింది. ఎవరో ఒక మూర్ఖుడు వచ్చి నాకు కల్లు కొనివ్వకపోడు. అందుకని అక్కడే కూర్చుని శూర్పణఖ ప్రేమవ్యవహారాల గురించి ఎవరో చెప్పుకునే పసందైన మాటలు వినసాగాను. అడవిలోని తిరుగుబోతులెవరి చేతిలోనో ఆమె అవమానానికి గురైందనీ, ఆమె స్తనాలూ, ముక్కూ కోసి, ఆమెని బలాత్కరించిన ఆ పురుషులు నాగులో, వానరులో లేక దేవతలో అనే వదంతులు పుట్టాయనే అనుకోసాగారు. తన చెల్లికి జరిగిన ఆ అవమానానికి ప్రతీకారం తీర్చుకునేందుకు రావణుడు వాళ్లమీదికి పెద్దెత్తున దండెత్తి వెళ్లబోతున్నాడని కూడా వాళ్లు చెప్పుకోవటం విన్నాను. సరిగ్గా అప్పుడే పైన ఎగిరే విమానం చప్పుడు చెవులు చిల్లులు పడేలా వినిపించింది. అందరం బైటికి పరిగెత్తాం. ఒక పెద్ద గుంపు ఆకాశంవైపే చూస్తూ నిలబడి ఉంది. అందరూ ఒకరిని ఒకరు తోసుకుంటూ ఉంటే, ఆ దృశ్యాన్ని బాగా చూసేందుకు నేను కూడా వాళ్లని తోసుకుంటూ చోటు వెతుక్కోసాగాను.

వీధిలో వాహనాలు నిలిచిపోయాయి. వెర్రిబాగుల ఆచార్యుడు

మయుడు మళ్లీ ఆకాశంలో గిరికీలు కొడుతున్నాడా? ఇంతలో జనం ఆశ్చర్యంతో ఉక్కిరిబిక్కిరి అవటం నాకు తెలిసింది. చాలా భీకరంగా ఉన్న రావణుడి ముఖం నాకు కనిపించింది. ఆ క్లిష్టమైన యంత్రాన్ని అదుపు చేసేందుకు విశ్వప్రయత్నం చేస్తూండగా ఆ బ్రహ్మాండమైన పక్షి మా తలలమీదినించి ఎగరసాగింది. కానీ ఆ విమానంలో ఒక స్త్రీ ముడుచుకొని కూర్చుని ఉండటం చూడగానే నా మత్తు పూర్తిగా దిగిపోయింది. ఆమె తల వంచుకుని ఏడుస్తున్నట్టు కనబడింది. ఆ పెద్ద ఇనుప పక్షి మేము నిలబడిన చోట ఆకాశంలో గిరికీలు కొట్టసాగింది. జనం గగోలుగా అరవసాగారు. అస్తమిస్తున్న సూర్యుడి అరుణకాంతిలో ఆ స్త్రీ అందమైన ముఖం స్పష్టంగా కనిపించింది. నేను నిలువెల్లా కంపించిపోయాను. నా గతంలో చాలాకాలం క్రితం ఆ ముఖాన్ని నేను చూశాను. ఆమె మండోదరి అయి ఉంటుందా? ఆ వయసులో రాణీ ఎలా ఉండేదో ఈమె కూడా అచ్చం అలాగే ఉంది, కానీ ఈమె చర్మం రంగు ఇంకా నలుపు, అంతే తేడా. 'ఈసారి రాజు ఏం నాటకం ఆడబోతున్నాడు?' నాకు తెలీలేదు. నా కాలివేళ్లనుంచి ప్రారంభమైన భయం తలదాకా పాకటం మాత్రం తెలిసింది. ఏదో ఉపద్రవం, పెనుముప్పు ముంచుకు రాబోతోందని మాత్రం నా మనసుకి తెలిసింది.

28. ఇక సెలవు మారీచా!

రావణుడు

మారీచుడు మరణించాడు. నిజానికి ఆయన దారుణ హత్యకి గురయాడు. దానికి నేనే బాధ్యుడిని. నేను ఆయన్ని కాపాడుకోలేకపోయాను. నేను పన్నిన యుక్తి పూర్తిగా తెలివితక్కువది, ఎంతో ప్రమాదకరమైనది. యుక్తవయసులో వున్నవాడిలా సాహసకార్యం చెయ్యబోయి, ఏమాత్రం జాగ్రత్తపడకుండా ప్రవర్తించి ఆ క్రమంలో ఆయన్ని కోల్పోయాను. అలాటి పని తలపెట్టవద్దని ఆయన నన్ను ముందే హెచ్చరించాడు. నా ప్రియపుత్రికని రాముడి దగ్గర్నించి తీసుకెళ్లిపోయాను, కానీ దానికోసం ప్రియమైన నా మేనమామని బలి ఇచ్చాను. వెనక్కి తిరిగి చూసుకుంటే, మొత్తం ఆ ప్రణాళిక అంతా తెలివితక్కువగా వేసుకున్నదే. చేసినవన్నీ బుద్ధితక్కువ పనులే. శూర్పణఖ తన స్తనాలనీ, ముక్కునీ పోగొట్టుకుని నా సభకి వచ్చి శోకాలు పెట్టటం చూసి వెంటనే ప్రతిస్పందించాను. మొత్తం సభలోని వారందరూ దిగ్భ్రమకి లోనయారు. కొన్ని నిమిషాలపాటు ఆమె పిచ్చిగా వాగుతోందని తప్ప, ఏం చెపుతోందో మాకు అర్థమే కాలేదు. ఆమె పిచ్చికోపంతో జరిగినదానికి తట్టుకోలేని స్థితిలో ఏడుస్తూ, అరుస్తూ ఉంటే, ఆమె మాటలు అర్థం చేసుకునేందుకు మాకు కొంత సమయం పట్టింది. అర్థం అవగానే నేను కోపంతో రగిలిపోయాను. 'ఆ పనికిమాలిన వాడికి నా చెల్లిని తాకేందుకు ఎంత ధైర్యం?' ఆమెని చూస్తే నాకు చాలా జాలివేసింది. ఆమె ఏనాడూ పెద్ద అందగత్తెగా పేరు సంపాదించలేదు, యావనంలో ఉన్నప్పుడు కూడా, కానీ ఇప్పుడు, ముప్పయ్యవ పడి ఆఖరిదశలో ముక్కు కోసివేస్తే ఇంకా ఫరోరంగా ఉంది ఆమె రూపం. ఆమె తన ధోరణిలో చెప్పుకుపోసాగింది, ఒక అందమైన స్త్రీ ఇద్దరు పురుషులతో అడవిలో తనకి కనిపించిందనీ, తన అన్న,

అసుర చక్రవర్తికి భార్యగా ఉండేందుకు ఆమెకి సమ్మతమేనా అని మాత్రమే తను అడిగాననీ చెప్పింది.

అలా అడిగినందుకు ఇద్దరిలో చిన్నవాడైన పురుషుడు తనమీదికి లంఘించి, ప్రస్తుతం అందరికీ కనబడుతున్న ఘోరం చేశాడని అంది. నేను ఆమెని ఓదార్చేందుకు ఆమె భుజాలమీద చేతులు వేశాను, కానీ ఆమె సుడిగాలిలా చెలరేగిపోయి, నాలాంటి వెన్నెముకలేని సోదరుడు తనకి లభించినందుకు శాపనార్థాలు పెడుతూ బైటికి వెళ్లిపోయింది.

నా చెల్లికి జరిగిన అవమానం నన్ను ముల్లులా బాధపెట్టింది. కానీ అంతకన్నా సిగ్గుపడాల్సిన విషయం నాకు అలాంటి చెల్లెలు ఉండటం. మా దాయాదులు, ఖర దూషణులతో ఆమె కలిసి ఉండటం ప్రారంభించింది. వాళ్లు నా సామంతరాజులుగా ఉండేవారు. ఉత్తరాన ఉన్న దేవతల రాజ్యపు సరిహద్దుల్లో ఉండే రెండు చిన్న చిన్న రాజ్యాలు వాళ్లవి. మొదట్లో ఆమె ఎంతోమంది పురుషులతో శారీరక సంబంధం పెట్టుకోవటం చూసి నవ్వుకునేవాడిని, కానీ కాలక్రమాన అది నాకు అసహ్యం పుట్టించసాగింది. అసుర సామాజిక నియమం ప్రకారం అది నేరం కాదు, కానీ కాలం మారుతోంది. దేవతల నైతిక విలువలు కొన్ని నామీద కూడా ప్రభావం చూపించసాగాయి. బహుశా ఎవరో పురుషుడివెంట పడి పోతూ నా చెల్లి ఆ ఇద్దరు పురుషులనీ, ఆ స్త్రీనీ దారిలో కలుసుకుని ఉంటుంది. ఆ అమ్మాయి నా కూతురే అనీ, ఆ పురుషుల్లో ఒకరు ఆమె భర్త అనీ, రెండవ వ్యక్తి ఆమె మరిది అనీ నాకు కచ్చితంగా తెలిసింది. కానీ శూర్పణఖకి మాకున్న సంబంధం గురించి ఏమీ తెలీదు, తెలిస్తే నాకు ఆమె ఇంకో రకమైన అబద్ధం చెప్పి ఉండేది.

మరొక ఆలోచన కూడా నాకు ఆందోళన కలగజేసింది. 'ఆ ఇద్దరు ప్రమాద కరమైన పురుషులవెంట ఉన్న నా కుమార్తె ఎంత సురక్షితంగా ఉంది?' ఇక సభ జరిపేందుకు మనసు రాలేదు. సభని రద్దుచేసి నా మందిరంలోకి వెళ్లిపోయాను. మండోదరికి కబురు పంపి పిలిపించి, నా నిర్ణయాన్ని ఆమెకి తెలియజేశాను. అది అంత సులభమైన పని అనిపించలేదు. నేను తలపెట్టిన కార్యం గురించి విని ఆమె

సంతోషించలేదు. ఒక స్త్రీ ముక్కూ చెవులూ కోసిన పురుషులతో నా కూతుర్ని వదలటం నాకు ఇష్టంలేదని ఆమెతో అన్నాను. ఆమె క్షేమం గురించి నాకు ఆందోళన కలిగింది.

అప్పుడు మండోదరి వాళ్లమీద యుద్ధం ప్రకటించి సీతని ఎత్తుకు రమ్మని సూచించింది. ఏమాత్రం ప్రాముఖ్యతలేని ఇద్దరు పురుషులమీద యుద్ధానికి తరలివెళ్లటం గురించి ఆలోచిస్తే నాకు నవ్వు వచ్చింది. అంత అవస్థపడక్కర్లేదు, పైగా బోలెడు డబ్బు కూడా వ్యయం అవుతుంది. నేనేం చెయ్యాలో నిర్ణయించుకున్నాను, ఇక వెనక్కి తిరిగేది లేదు.

మారీచుడికి నా ఉపాయం వివరించాను. ఆయనకి అది నచ్చలేదు. నేను భావోద్రేకంతో, పరిపక్వత ఏమాత్రం లేకుండా ఆలోచిస్తున్నానని అన్నాడు. నాకు మండిపోయింది. ఆ వృద్ధుడి కళ్లలో బాధా, వేదనా నాకు కనిపించాయి, కానీ ఆయన నాతో వాదించటం మానలేదు. నాకు విపరీతమైన కోపంవచ్చి, ఆ కార్యాన్ని ఒంటరిగానే సాధించాలని అనుకున్నాను. చివరికి ఆయన నావెంట రావటానికి ఒప్పుకున్నాడు. ఇద్దరం నా కుమార్తెని వెతికేటందుకు ఆకాశమార్గాన ఎగరసాగాం. ఉత్తరదిశగా ఎగురుతూ ఉండగా మారీచుడు మళ్లీ నాచేత ఆ ప్రయాణం ఆపించాలని ప్రయత్నించాడు. నేనాయన మాటలు పట్టించుకోలేదు. "నువ్వు రామలక్ష్మణులిద్దరినీ హతమార్చి, సీతకి ఆమె పుట్టుక గురించి నిజం చెప్పి ఆమెని వెంటపెట్టుకుని లంకకి వెళ్లచ్చు కదా?" అన్నాడు. కానీ రాముడిని చంపటం నాకిష్టంలేదు. నా కుమార్తెకి అతనంటే ఆరాధన, ఆమెకి దుఃఖం కలిగించటం నావల్ల కాదు.

రాముడు స్వయంగా వనవాసం చెయ్యాలని రాజ్యం వదిలాడు. ఆ వనవాసం గడువు పూర్తి అయేదాకా మాత్రమే సీతని లంకలో ఉంచాలని అనుకున్నాను. తన అతి చిన్న రాజ్యానికి మళ్లీ అతను రాజయిన తరవాత ఆమె అతని దగ్గరకి వెళ్లిపోవచ్చు. నా మనసులో రహస్యంగా నేను కోరుకున్నది వేరు, సీత ఒకసారి లంకకి వచ్చి, నా వైభవాన్నీ, కళ్లు మిరుమిట్లుగొలిపే సంపదనీ, ఐశ్వర్యాన్నీ చూశాక, భర్తని కూడా లంకకి వచ్చి ఇక్కడే ఉండిపొమ్మంటుందని ఆశపడ్డాను. ఆ

వ్యక్తిమీద నాకు హఠాత్తుగా ఇష్టం పట్టుకొచ్చిందని అనను, కానీ అతన్ని సీత భర్తగా అంగీకరించేందుకు నేను సిద్ధమే. నా సామ్రాజ్యంలో ఉత్తరాన ఉన్న కొంత భాగాన్ని రాముడికి ఇవ్వటానికి కూడా నేను సుముఖంగానే ఉన్నాను.

కానీ మొదటినుంచీ పరిస్థితులు అనుకున్నట్టు సానుకూలంగా లేవు. రాముడు తన తమ్ముడితోనూ, సీతతోనూ విడిదిచేసిన ప్రాంతానికి మేము చేరుకునే సరికి తెల్లవారింది. అడవి అత్యద్భుతమైన అందాలతో అలరారుతోంది. మరో సందర్భంలో అయితే నా మనసు ఆహ్లాదంతోనిండి బాధలన్నిటినీ మరిచి ఉండేది. నేను తాళపత్రమూ, కుంచే తీసుకుని ఆ అడవిలో దాగి ఉన్న అందాలన్నిటినీ చిత్రాలుగా రూపొందించేవాడిని. పల్చని పొగమంచు తెర చెట్లమీద పరుచుకుంది. ప్రతి గడ్డిపరకా ఉదయపు నీరెండలో తళుకులీనసాగింది. రెల్లుగడితో కప్పిన చిన్నపాక కొండవాలుమీద నిలబడి ఉంది. అక్కడినుంచి పరవళ్లు తొక్కుతున్న సెలయేటివరకూ దారి ఉంది. రంగు రంగుల సీతాకోకచిలుకలు వేలసంఖ్యలో అంతటా ఎగురుతున్నాయి. సూర్యుడి బంగారు కిరణాలు చల్లటిగాలికి ఊగుతున్న చెట్ల ఆకుల సందుల్లోనుంచి జాలువారుతున్నాయి. పక్షులూ, కీచురాళ్లూ, ఝుమ్మని ఎగిరే తుమ్మెదలూ, తూనీగలూ అన్నీ కూడా అడవిలోనుంచి వచ్చే రకరకాల మధురమైన ధ్వనులకి తమవంతు సాయం చేస్తున్నాయి. జింకలు బద్ధకంగా గడ్డి మేస్తున్నాయి. చెవుల పిల్లులు మెరుస్తూన్న గడ్డిపరకల మొనలని అనుమానంగా కొరుకుతూ అర్థం లేకుండా అటూ ఇటూ పరిగెత్తుతున్నాయి. ఒక పెద్ద బండరాతి మీద రెండు చేతులూ పొత్తికడుపు మీద ముడుచుకుని, నున్నటి, నల్లని కాళ్లమీద సెలయేటి నీళ్లు చిందటంవల్ల పద్ద నీటిబిందువులు మెరుస్తూ ఉండగా నా కుమార్తె సీత వనదేవతలా ఆలోచనల్లో మునిగి కూర్చుని ఉంది.

మారీచుడు నా భుజం తట్టేసరికి మంత్రముగ్ధుడినై ఆ దృశ్యాలని చూస్తున్న నేను ఈ లోకంలోకి వచ్చాను. అప్పటికిగాని నేను చూసి ఆనందిస్తున్న దృశ్యం గురించి నిజం గ్రహించలేదు నేను. అది శత్రువుల

స్థావరం. శత్రువు సమీపంలోనే ఉండవచ్చు. రాముడు ఎదురుపడితే నేను అతన్ని చంపవలసి వస్తుంది.

నా గూఢచారులు అందించిన సమాచారానికి విరుద్ధంగా సీత సంతోషంగా ఉన్నట్టే కనిపించింది. 'ఆ పిరికిపందలు, వాళ్లు నేను వినాలని అనుకున్నదే నాకు చెప్పారు!' ఆ అమ్మాయి మీద నాకు ఆసక్తి ఉందని వాళ్లు ఊహించుకుని ఉంటారు. ఏవో మాటలు వినిపించి అటువైపు చూశాను. మారీచుడు కూడా అటే చూస్తున్నాడు. చెట్లమధ్యనుంచి ఇద్దరు పురుషులు బైటికి వచ్చారు. చూసేందుకు వాళ్లు వేటగాళ్లలా ఉన్నారు. వాళ్లే రామలక్ష్మణులని గుర్తించగానే నేను ఉలిక్కిపడ్డాను. ఆ అన్నదమ్ము లిద్దరూ నేను మునుపు చూసినప్పటికన్నా నల్లబడ్డారు, వయసు పెరిగినట్టు కనిపించారు. నేను వాళ్లని చూసి పధ్నాలుగు వత్సరాలయింది మరి. నా కళ్లకి వాళ్లు నల్లగా అందవికారంగా కనిపించారు, కానీ రాముడి ముఖంలో ఇంకా ఏదో కాంతి లేకపోలేదు. 'దేవతల రాకుమారులు ఇంత నల్లగా ఎలా ఉన్నారు? వాళ్లకన్నా నేనే తెల్లగా ఉన్నాను.'

"రాకుమారి దగ్గర్నించి రాముడిని నేను దూరంగా తీసుకుపోతాను. నువ్వు ఆ చిన్నవాడిని చూసుకుంటావుగా?" అని నా చెవిలో రహస్యంగా చెప్పి, మారీచుడు మెరుపులా అడవిలోకి మాయమయాడు. వాళ్లిద్దరి పనీ నేను చూసుకోగలనని ఆయనకి చెప్పాలనిపించింది, కానీ అప్పటికే ఆయన అక్కణ్ణించి వెళ్లిపోయాడు. ఆ తరవాత నేను ఆయన్ని మళ్లీ చూడలేదు. నేను ముందే చెప్పినట్టు, మారీచుడిలాటి తెలివైన వ్యక్తికి అలాంటి ఉపాయం తట్టి ఉండకూడదు. చాలా మూర్ఖంగా, తొందరపడి చేసిన యుక్తి అది. నాకు కూడా అనుభవం లేకపోలేదు. కానీ ఆరోజు మాత్రం, దాన్ని విధి అంటారో, దురదృష్టం అంటారో కాని, ఒకదాని తరవాత ఒకటిగా పొరపాట్లు జరిగిపోతూనే ఉన్నాయి. నేను రెండుగంటలసేపటి నుంచీ వేచి ఉండటంవల్ల ఓర్పు నశించసాగింది. 'గబగబా వెళ్లి వాళ్లిద్దరినీ పడగొట్టి నా కుమార్తెని ఇక్కడినుంచి తీసుకెళ్లిపోనా?' దాదాపు ఆ పని

చేసేద్దామని నిశ్చయించుకునే లోపల ఏటి ఒడ్డుకి అవతలివైపు ఏదో మెరుపులా మెరిసింది. నేను ముగ్ధుడినై చూస్తూ ఉండిపోయాను. అది ఒక బంగారు లేడి. దాని శరీరం ముందు భాగం, వంపు తిరిగిన కొమ్ములూ మాత్రమే నాకు కనిపించాయి. కానీ అది స్వర్గలోకం నుంచి వచ్చిన ప్రాణిలా తోచింది. అది నెమ్మదిగా, మధురంగా అరిచి పొదల్లో మాయమైంది. ఆ ఇద్దరు పురుషులూ, సీతా వెంటనే శబ్దం వచ్చిన వైపు తిరిగి చూశారు. గాలికి కదిలే ఆకుల గలగలలూ, పక్షుల అరుపులూ తప్ప అడవిలో మరే చప్పుడూ వినబడటం లేదు, అంతా నిశ్శబ్దంగా ఉంది. ఆ బంగారు లేడి మళ్లీ ఒకసారి పైకి గెంతి పొదల్లోకి పారిపోయింది. సీత ఆనందం పట్టలేక అరిచింది. లక్ష్మణుడు తన విల్లంబులు అందుకుని పొదవైపు బాణం గురిపెట్టటం కనిపించింది నాకు. కొన్ని క్షణాలు రాముడూ, సీతా మంత్రించినట్టు ఆ పొదలవైపే చూస్తూ ఉండిపోయారు. ఎంతో సమయం గడిచిపోయినట్టు అనిపించింది నాకు. అప్పుడు మళ్లీ ఆ బంగారులేడి పొదలమాటునుంచి తొంగిచూసింది. లక్ష్మణుడు వేసిన బాణం కొన్నిక్షణాల క్రితం ఆ లేడి నిలబడిన చెట్టు బోదెకి వెళ్లి గుచ్చుకుంది. బోదెలో దిగబడిన బాణం కొంతసేపు కంపించింది. లక్ష్మణుడి వైపు ప్రశంసా పూర్వకంగా చూశాను. 'ఇతను నాగరికత తెలియనివాడే కావచ్చు, కానీ మంచి శిక్షణ పొందిన విలుకాడు.'

నాకు నవ్వొచ్చినంత పనైంది. మారీచుడే ఆ బంగారు లేడి అనీ, అతన్ని బాణంవేసి పడగొట్టటం అసాధ్యమనీ నాకు తెలుసు. మారీచుడు ఒక లేడిని చంపి, దాని చర్మాన్ని తనమీద కప్పుకున్నట్టున్నాడు. అది చాలా సరళమైన, అద్భుతమైన మారువేషం. సీత లక్ష్మణుడిని కోప్పడటం, ఆ లేడిని పట్టితెచ్చి తనకి ఇమ్మని రాముడిని బతిమాలటం చూశాను. రాముడు కొంతసేపు తటపటాయించి, లేడి దాక్కున్నవైపుకి బైలుదేరటం కనబడింది నాకు. అవతలి గట్టుకి అతను చేరుకునే సమయానికి ఆ లేడి శరవేగంతో పరిగెత్తి పారిపోసాగింది. రాముడు అవతలి గట్టుకి కష్టపడి ఎక్కాడు.

తన లేడి వెంట దాన్ని వెతుక్కుంటూ వెళ్తున్నాననీ సీతని జాగ్రత్తగా చూసుకోమనీ అక్కడినించే అరిచి లక్ష్మణుడికి చెప్పాడు.

గురిచూసి లక్ష్మణుడిమీదికి బాణం వదలాలని అనుకున్నాను. నాకు ఆ పని చెయ్యాలన్న కోరిక చాలా బలంగా కలిగింది, కానీ మగవాడన్నవాడు అలా దాడి చెయ్యకూడదు. చెట్టవెనకాల దాక్కుని ఆదమరచి ఉన్న శత్రువుని బాణంవేసి కొట్టటం నపుంసకులు చేసే పని. నేను అసురుడిని, ఒక చక్రవర్తిని. అటువంటి చేష్టలు నా వ్యక్తిత్వానికి తగినవి కావు, నేను పాటించే ధర్మానికీ, న్యాయవర్తనకీ వ్యతిరేకమైనవి. కానీ ఆ సమయంలో రాముడూ, అతని సోదరుడూ ఎంత నీచానికి దిగజారగలరో గ్రహించగలిగి ఉన్నట్టయితే, అప్పటికప్పుడే తప్పకుండా వారిద్దరినీ అంతమొందించి ఉండేవాడిని. నేనొక మూర్ఖుడిని, అవకాశం అందుబాటులో ఉన్నప్పుడు దానిని ఉపయోగించుకోలేకపోయాను. అందుకే ఇప్పడిలా ఇక్కడ పడి ఉన్నాను, ద్రోహానికీ, మోసానికీ గురై, రక్తం ఓడుతూ, ఎలుకలు పీక్కుతింటూ ఉంటే, మోసాలకు పాల్పడి హత్యలు చేసి, విజయాలని సాధించే నీచమానవుల చేతుల్లో హతం అయే స్థితికి చేరుకున్నాను. నాకు బహుశా ఇలా రాసిపెట్టి ఉందేమో, ఎందుకంటే విధి ఈ ఇద్దరు పురుషులనీ హతమార్చే అవకాశం నాకు అందించింది, నా అహంకారం తృప్తిపరుచుకునేందుకు నేనే న్యాయం, ధర్మం అంటూ దాన్ని జారవిడుచుకున్నాను. నాకు మార్గదర్శనం చేసినవారు తప్పుదారిన తీసుకెళ్లారు, అందుకే నేను వైఫల్యం పొందాను. న్యాయానికీ, సత్యసంధతకీ ప్రతిరూపమైన వాలి, సత్యం కోసం రాజ్యాన్నే కాలదన్నుకున్న బలిచక్రవర్తిలాంటి వాళ్లని నేను గురువులుగా భావించాను. అందుకే నాకు కూడా వారికి పట్టిన గతిలాంటిదే పట్టింది. ఆ ఇద్దరినీ మట్టుపెట్టి ఉన్నట్టయితే, నన్ను నమ్ముకుని, దుష్టులనుంచి నేను వారిని కాపాడతానని అనుకున్న ఎందరో స్త్రీపురుషులు కన్నీరు కార్చకుండా వారిని కాపాడగలిగేవాడిని.

ఆ రోజు నా చేతులు వణికినప్పుడే జీవితంలో వైఫల్యం పొందానని నాకు తెలిసిపోయింది. కానీ ఇక్కడ ఇలా రక్తసిక్తమై పడి ఉన్న నేను నా

రక్తంలోనే కాక నా సంబంధీకుల రక్తంలో కూడా తడిసి ముద్ద అయి ఉన్నాను. నా ప్రియ పుత్రుల చితులకి స్వయంగా అగ్ని ముట్టించి, జీవితకాలమంతా ఏది సాధించాలని ప్రయాస పడ్డానో అదంతా కోల్పోయాను. రాముడూ, లక్ష్మణుడూ సులభంగా చెట్టు వెనక నక్కి ఉన్న నా బాణానికి ఎర అయి అడవిలో నిలబడివున్న ఆ రోజు నాకు మళ్లీ దొరికినట్టయితే, అలాంటి పరిస్థితి మళ్లీ వస్తే, నేను వాళ్లనిగాని, ఇంకెవరినైనా గాని బాణం వేసి చంపను. అది పిరికివాళ్లు చేసే పని. బహుశా అందుకే నాకు ఇప్పుడు చావు మూడినట్టుంది. కానీ గర్వంగా తల ఎత్తుకుని మరీ చనిపోతాను. దైవత్వం సంపాదించుకునేందుకు అంత నీచానికి దిగజారిన అతన్ని చూసి నాకు విచారం తప్ప మరే భావమూ కలగలేదు. 'రామా, దీనివల్ల నీకు ఏమైనా ప్రయోజనం కలిగిందా?' నువ్వు ప్రవహింపజేసిన రక్తం నిన్నూ ఈ రాజ్యాన్నీ సంవత్సరాలపాటు ప్రశాంతంగా ఉండనీయక వెంటాడుతుంది, మేమందరం చనిపోయాక కూడా చాలాకాలం వరకూ నిన్ను వదలదు. అన్యాయంగా సంపాదించు కున్న దైవత్వాన్ని నువ్వే ఉంచుకో. నేను పౌరుషంతో, ఒక యోధుడిలా, వీరుడిలా మరణిస్తాను.

ఆరోజు అక్కడ అలా కూర్చుని లక్ష్మణుడిని అంతమొందించాలా వద్దా అన్న మీమాంసలో ఉండగా, రక్తం గడ్డకట్టేంత భయంకరమైన కేక వినవచ్చింది. లక్ష్మణుడూ, సీతా కూడా దాన్ని విన్నారు. మేమందరం మ్రాన్పడిపోయాం. ఆ గొంతుని గుర్తుపట్టాను. కానీ ఆ క్షణంలో అది నా ప్రియమైన మేనమామ హత్యకు గురై చేసిన ఆర్తనాదమని నాకు తెలీలేదు. ఏం చెయ్యాలో తెలియక కొయ్యబారి పోయాను. అది కూడా ఆయన పన్నిన పన్నాగంలో భాగమే అయి ఉంటుందని నాకు నేను నచ్చజెప్పుకోవటానికి ప్రయత్నించాను. సీత కెవ్వుమని కేకపెట్టటం, లక్ష్మణుడు గట్టిగా అరవటం వినిపించింది. తన అన్న వెళ్లిన దారినే అతను కూడా బైలుదేరటం చూశాను. కానీ ఎందుకో అప్పటికీ వెనుకంజ వేశాను. ఇతన్ని వెంబడించి, మారీచుడికి ప్రమాదం వాటిల్లినట్టయితే ఆయన్ని రక్షించనా? అనుకున్నాను. కానీ మారీచుడు ఆరితేరిన

అనుభవజ్ఞుడు. తనని తాను రక్షించుకో గలడు. అప్పుడు వేగంగా కదిలాను. ఆమెని భయపెట్టకూడదు అనుకుని నా ఆయుధాలని దాచివేశాను. నా ఆభరణాలన్నీ తీసి నడుం దగ్గర మూటలా కట్టుకున్నాను. నా నుదుట విభూతితో గీసిన అడ్డరేఖలు ముందే ఉన్నాయి, ఒక శివభక్తుడిలా, కానీ ఆభరణాలు తీసివేస్తే నేను అచ్చం భిక్షాటన చేసుకునే సన్యాసి లాగుంటానని నాకు తెలుసు. ఆమె నన్ను తిరిగి చూసేసరికి నేను ఆమెకి సమీపంలో ఉన్నాను. ఆమె తన అందమైన నల్లని కళ్లతో నావైపే చూసేసరికి, నా గొంతుకి ఏదో అడ్డం పడినట్టు అయింది. ఆమెని తాకి, కౌగిలించుకోవాలని అనిపించింది నాకు. 'సీత, నా కుమార్తె! సీత, నా చిట్టితల్లి!' నేను వెనక్కి తిరిగి కళ్లు మూసుకుని నిలబడ్డాను. నా ప్రాణాలు నా చేతోనే తీసుకోవాలని అనిపించింది. 'ఎందుకు నేనీ పిల్లని వదిలేశాను? ఈమెని ఎందుకు మరిచిపోయాను? ఈమె చిన్నతనాన్ని చూసి ఆనందించకుండా చేజార్చుకున్నాను. మిథిల మీదికి దండెత్తి ఈమెని నా దగ్గరకి ఎందుకు తీసుకుపోలేదు?' నేను జనకుడికి ఆనాడే నిజం చెప్పేసి ఉంటే ఇంత రక్తపాతం జరిగుండేది కాదేమో కదా! దేవతల రాజుల్లోని అతి ఉదాత్తమైన రాజుల్లో జనకుడు కూడా ఒకడు. జ్ఞాని, పండితుడు. ఆయన నా కుమార్తెని నాకు అప్పగించి ఉండేవాడు. కానీ నాకు ఆమె భర్తమీద నమ్మకం లేదు. నా చెల్లిపట్ల ఆ పురుషులు ఇద్దరూ ప్రవర్తించిన తీరుని నేను క్షమించలేక పోయాను. సీత వాళ్ల దగ్గర ఉండటం మంచిది కాదు, ఆమెకి భద్రత కరువవుతుంది. అదీగాక ఒక అసుర రాకుమారి, రావణుడి కుమార్తె, అడవులమ్మట ఇలా తిరగటం జీవితాన్ని వృథాగా గడపటమే అనిపించుకుంటుంది. ఆమె ఒక బిచ్చగత్తెలా జీవిస్తోంది. నేను సంపాదించినదీ, సాధించినదీ అంతా, స్వర్ణలంక, అసుర సామ్రాజ్యం మొత్తం ఆమెదే.

కానీ ఒకవేళ ఆమె నా సంపదనంతా తిరస్కరిస్తేనో? నా రాజ్యాన్నీ నా ప్రేమనీ కాదంటేనో? ఆమె మనసులో తన భర్త పట్ల ఉన్న గాఢమైన అనురాగమూ, ఆరాధనా నాకు భయం కలిగించాయి. చాలాకాలం క్రితం

జ్యోతిష్ములు చెప్పిన ఆ అలౌకిక శక్తులని నేనే విడుదల చేస్తానేమోనని భయపడ్డాను. వేదవతి చనిపోతూ అన్నమాటలు తలుచుకుని భయం వేసింది. అంతలో అలాంటి అసామాన్యమైన ఆలోచనలు, వచ్చినవి వచ్చినట్టే మాయమయాయి. మనసులో ప్రార్థన చేసుకుంటూ వెనుతిరిగాను. అక్కడ సీత లేదు. నాకు భిక్ష తీసుకువచ్చేందుకు కుటీరం లోపలికి వెళ్లింది. మళ్లీ నావైపు వచ్చి భిక్షాపాత్ర కోసం చూసింది. కానీ నేను ఆమెని నా మీదికి లాక్కుని, ఆమె సన్నని నడుమని నా చేతులతో చుట్టి, ఆమెని భుజాలమీదికి ఎత్తుకుని, పుష్పకవిమానం దాచిన పొదలవైపు పరిగెత్తాను. తక్షణం స్పందించే స్పృహ లేకుండా సీత స్తంభించిపోయింది. కానీ ఆ తరవాత నా పట్టనించి విడిపించుకునేందుకు పోరాడుతూ అరవసాగింది. గోళ్లతో నా ముఖాన్నీ వెన్ననీ రక్కి గాయపరిచింది. రక్తం బొట్లుబొట్లుగా కారటం నాకు తెలిసింది. ఆమెని వదిలిపెట్టినందుకు నాకు తగిన శాస్తే జరుగుతోందని సంతోషం వేసింది నాకు. ఏదో అశాస్త్రీయమైన జ్యోతిష్యాన్ని నమ్మి భయపడినా సొంత కుమార్తెనే వదిలేశాను. ఒక తండ్రిగా ఆమెకి నేనేమీ ఇవ్వలేదు. అందుకు నాకు ఈ శిక్ష పడవలసిందే అని అనుకున్నాను.

చివరికి ఆమెని విమానంలో పడవేసి తలుపు మూసేశాను. కొంతసేపు మారీచుడు వస్తాడని ఎదురుచూశాను. సూర్యుడు ఆకాశంలో పడమటిదిశకి దాదాపు చేరుకునేదాకా వేచి చూశాను. నా కూతురు వెక్కివెక్కి ఏడవటం, దూరంగా అడవి జంతువులూ, పక్షులూ అరవటం తప్ప మరే శబ్దాలూ నాకు వినపడలేదు. ఆమెని వదిలి మారీచుడిని వెతికేందుకు వెళ్లటం నాకు ఇష్టం లేకపోయింది. చివరికి భారమైన మనసుతో, నా అత్తయ్యకి ఏం సమాధానం చెప్పాలా, ఆవిడ ఎదుటికి ఎలా వెళ్లాలా అని భయపడుతూనే పుష్పకవిమానం ఎక్కి లంకకి తిరుగుప్రయాణం ప్రారంభించాను. ఈసారి ఈ తిరుగుప్రయాణం నరకమే అనిపించింది. ఒక పెద్ద పక్షి, భయంకరమైన రాబందు, విమానాన్ని నడిపించే చక్రాలు ఒక దానిలో ఇరుక్కుంది. అది

భయంగొలిపే పరిస్థితి. చక్రం తిరగటం ఆగిపోవటంవల్ల విమానం వేగంగా కిందికి దిగిపోసాగింది. కిందపడే రాళ్లలా మేము వేగంగా భూమివైపు దూసుకుపోసాగాం. భూమి మమ్మల్ని తన మృత్యు పరిష్వంగంలోకి తీసుకునేందుకు పైకి వస్తున్నట్టు అనిపించింది. పక్షి ప్రాణాలు కాపాడుకునేందుకు విలవిలా కొట్టుకుని మరింత ఘోరంగా చక్రంలో చిక్కుకు పోయింది. నిష్క్రియుడినై మంత్రించినట్టు, మృత్యువు మావైపు శరవేగంతో రావటం చూస్తూ ఉండిపోయాను. సీత కేకలు నన్ను మళ్లీ ఈ లోకంలోకి తెచ్చాయి. కత్తి తీసి పక్షిని నరకటానికి ప్రయత్నించాను. పుష్పకవిమానం కుదుపులకి గురైంది. హఠాత్తుగా విమానం తలకిందులైగిరికీలు కొడుతూ కింద పడిపోసాగింది. సీత కిందికి జారిపడి ప్రాణాలు కోల్పోయేదే, నేను ఒక చేతో ఆమె నడుమని పట్టుకున్నాను.

నా చేతిలో ఉన్న కత్తి కూడా జారిపోయింది. మా విమానం ఇంకొక్కసారి గిరికీ కొడితే ఆ కత్తికింద పడుతూ మా ఇద్దరిమీదా పడి మమ్మల్ని నరికేసి ఉండేదే. గాలి హోరుమంటూ వీసూ ఉంటే సీత విమానంలోనుంచి బైటికి వంగింది. ఒక్కసారి గుంజి ఆమెని లోపలికి లాగాను. మళ్లీ విమానం అటూ ఇటూ ఊగింది. ఇదంతా క్షణాల్లో జరిగిపోయింది. తరవాత నా రెండు చేతులతోనూ నా కుమార్తె సన్నని నడుమును గట్టిగా వాటేసుకుని చంద్రహాసాన్ని కాలితో పైకి లాక్కున్నాను. తరవాత ఒక చేతిలో కత్తి పట్టుకుని పక్షిని ఇష్టంవచ్చినట్టు నరకసాగాను. దాని శరీరం ముక్కలై కింద పడటం కనిపించింది. భూమి వేగంగా దగ్గరకి రావటం మొదలెట్టింది. చెట్ల ఆకులు స్పష్టంగా కనిపించసాగాయి. నా బలాన్నంతా ఉపయోగించి పక్షిని కత్తితో నరకసాగాను. విమానం అడ్డదిడ్డంగా అటూ ఇటూ ఊగిపోసాగింది. తెరచాపలు ఊడిపోయినట్టయితే ఇక మేము జీవించి ఉండటం కల్ల.

చివరికి ఆ పక్ష్మి అంటే దాని అవశేషాలు చక్రంలోనుంచి ఊడి కింద పడిపోయాయి. మా ఒంటినిండా దాని రక్తం చిమ్మింది. నేను ఒళ్లు

విరుచుకుని, మీటల్ని లాగి విమానాన్ని మళ్లీ మామూలు స్థితికి తీసుకు వచ్చేందుకు శాయశక్తులా ప్రయత్నించసాగాను. చక్రాలు తిరగటం లేదు. నేను మీటలని నొక్కాను, లాగాను, అయినా విమానం కదల్లేదు. ఎత్తుగా పెరిగిన చెట్లు ఎంత సమీపంలో ఉన్నాయంటే, మా బ్రహ్మాండమైన ఇనపపక్షి వాటికి దగ్గరగా వచ్చాయన్న భయంతో పక్షులు దూరంగా ఎగిరిపోసాగాయి. 'అయిపోయింది. ఎవరికీ తెలియకుండా, ఒక అనామక ప్రదేశంలో అసువులు బాయబోతున్నాను. అదీ నా కుమార్తె నాకు దక్కిన తరుణంలో!' అనుకున్నాను. నా జీవితమంతా ఒక్కసారి నా కళ్లముందు గిర్రున తిరిగింది. నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయాను. సీత అకస్మాత్తుగా వెక్కిళ్లు పెట్టే సరికి ఉలిక్కిపడ్డాను. 'లేదు, ఆమెని చనిపోనివ్వలేను. ఆమెది పిన్నవయసు, మంచి యౌవనదశలో ఉంది. ఆమెని తన భర్తనుంచి నేను కాపాడింది చనిపోనిచ్చేందుకా?' నా బలాన్నంతా ఉపయోగించి మీటని పైకీ కిందకీ వేగంగా కదిపాను. చక్రం తిరిగింది మళ్లీ ఒకసారి మీటని నొక్కి లాగాను. ఒక్కసారి కంపించి చక్రం మళ్లీ తిరగటం ప్రారంభించింది. నేను హాయిగా కళ్లు మూసుకున్నాను. మళ్లీ కళ్లు తెరిచేసరికి హఠాత్తుగా హడలు పట్టుకొచ్చింది. 'లేదు, మరీ ఆలస్యం అయిపోయింది! చక్రంలోని రెక్కలు చెట్టు పైకొమ్మలని నరికెయ్యసాగాయి. మేము ప్రాణాలతో బైటపడతామా? ఓ పరమశివా!' నెమ్మదిగా, అతినింపాదిగా విమానం పైకి లేచింది. అన్నిటికన్నా ఎత్తైన చెట్లకి కొన్ని అడుగుల పైకి చేరుకున్నాం. ఇంకా దానిని పైకి లేపటం మొదలుపెట్టాను. పది అడుగులు... ఇరవై అడుగులు... సరిగ్గా మేము ప్రమాదంనుంచి బైటపడ్డాం అనుకునే సమయానికి ఒక పెద్ద కొండరాయి విమానం దారికి అడ్డంగా కనిపించింది. మేము వేగంగా దానివైపే వెళ్తున్నాం. 'దీన్ని దాటి పోగలుగుతామా?' నేను చెమటతో తడిసిపోయాను. నా వేళ్లు నొప్పి పుట్టసాగాయి. ఆ కొండరాయి ప్రస్తుతం ఇరవై అడుగుల దూరంలో మాత్రమే ఉంది. దాన్ని దాటిపోవాలంటే ఇంకా ముప్పై అడుగులు పైకి వెళ్లాలి. చక్రం ఆ కొండరాతిని తాకేంత దగ్గరకి చేరుకున్నాం. ఇక మా విమానం ఆ రాతికి తగిలి ముక్కలవుతుంది అని నేను అనుకుంటూ

ఉండగా, కొన్ని అంగుళాల తేడాతో విమానం రాతిపైనుంచి వెళ్లింది. ఇంకా ఎత్తుకి వెళ్లసాగింది. ఇక గాలిలో తేలుతూ పోగల ఎత్తుకి చేరుకోగానే నేను చక్రాన్ని మడిచివేసి తెరచాపలని తెరిచాను. అలసటతోనూ, ఆపద తప్పినందుకు ఆనందంతోనూ నేను వెనక్కి జారగిలబడ్డాను. నా కుమార్తె రాయిలా కూర్చునే ఉంది. నాకు ఆమెని చూస్తే జాలివేసింది. అప్పటికిగాని నాకు మారీచుడు జ్ఞాపకం రాలేదు. నేను ఆయన్ని కోల్పోయాను. ఎవరి బాధలో వాళ్లం, తండ్రీకుమార్తెలం, మౌనంగా విషాదంలో కూరుకుపోయి, దగ్గరగా ఉన్నా ఎంతో దూరంగా ఉన్నట్టు, లంకవైపు ప్రయాణం కొనసాగించాం.

లంకని మొదటిసారి చూడగానే సీత కళ్లు ఆశ్చర్యంతో పెద్దవి అవటం నాకు కనిపించింది. ఒక్క క్షణం ఆమె తన దుఃఖాన్ని మరిచింది. నా గుండెలు గర్వంతో పొంగాయి. ఆమె కోసం ఎటువంటి గొప్ప అద్భుతాలు దాచి ఉంచానో చూపించాలని అనిపించింది. 'సీతా, నా తల్లీ, నీ లంకని చూడమ్మా!' స్వర్ణమందిరంలో ఆమె నివాసం ఏర్పాటు చేస్తాను. ఆమె నా తోటలని చూడాలనీ, సముద్రపు గాలులని ఆఘ్రాణించాలనీ, వెలుగులతో నిండిన దుకాణాలనీ, పచ్చని పైరులతో అల్లల్లాడే వరిపొలాలనీ, గాలికి ఊగే కొబ్బరిచెట్లనీ, లవంగాలూ, ఏలకులూ పండించే తోటలనీ, విశాలమైన రాజమార్గాలనీ, ఆకాశాన్నంటే కోటలనీ, రాజభవనాలనీ చూసి ఆనందించాలనీ కోరుకున్నాను. ఇవన్నీ చూసి తన భర్త రాజభవనం అని పిలుచుకునే చిన్న నివాసానితో వీటిని ఆమె పోల్చుకోవాలి. కానీ నేను మౌనంగా ఉండిపోయాను. ఆశ్చర్యం నిండిన ఆమె కళ్లనే చూస్తూ ఉండిపోయాను. అస్తమించే సూర్యుడు నా భవనంమీది బంగారు గుమ్మటం మీద పడి ప్రతిఫలిసూ ఉంటే, విమానాన్ని సావకాశంగా దింపాను. చక్రం పూర్తిగా తిరగటం మానకముందే, నేను కిందికి దూకాను. సీత గురించి పూర్తిగా మరిచిపోయాను! మండోదరి పరిగెత్తుకుని వచ్చింది. ఆమె వెనకే త్రిజట, మేఘనాదుడు వచ్చారు. కొత్తగా వచ్చిన అతిథిని చూడాలని వాళ్లకి కుతూహలం కలిగింది.

మా అత్తయ్య కళ్లు తన భర్తకోసం వెతికాయి, కానీ నేను మరోవైపుకి చూపులు తిప్పకున్నాను. నేను భయపడ్డ క్షణం రానే వచ్చింది, నాకేం అనాలో తెలీలేదు. మెదడు మొద్దుబారిపోయినట్టు అనిపించింది. మారీచుడు మరణించాడు. నేను చేసిన సాహసయాత్ర దుష్పరిణామంగా ఆ సంఘటన జరగటం ఒక నగ్నసత్యం. ఆ అడవి లోపల ఎక్కడో ఆ వృద్ధుడు ప్రాణాలు కోల్పోయి పడి ఉన్నాడు. ఆ ఇద్దరు కిరాతకుల చేతుల్లో ఆయన్ని నేను వదిలిపెట్టాను. ఆ సమయంలో ఆయనకి నాపట్ల ఉన్న నిస్వార్థ ప్రేమ గురించీ, నన్ను ఇంతవాడిని చేసినందుకు ఆయన చేసిన త్యాగాల గురించీ నాకు ఆలోచనే రాలేదు. ఆయన పెట్టిన కేక విని కూడా నేను కదల్లేదు. రాముడి బాణం ఆయన అలసిన వృద్ధ శరీరాన్ని ఛేదించటం నాకు వినబడింది. తుదిశ్వాస విడుస్తూ కూడా ఆ చివరిక్షణాల్లో ఆయన నా గురించే ఆలోచించి ఉంటాడని నాకు తెలుసు. అయినా నేను కదల్లేదు. ఆయన లక్ష్మణుడిని పిలిచినప్పుడు ఆ గొంతు అచ్చం రాముడి గొంతులాగే ఉంది. అందుకే సీత లక్ష్మణుడిని బలవంతపెట్టి తన అన్నని వెదకమని పంపింది. నేను ఆమెని చేజిక్కించుకుని త్వరగా లంకకి చేరుకున్నాను. మారీచుడి గురించి ఒక్కసారి కూడా ఆలోచించలేదు. వెనక్కి వచ్చేటప్పుడు అడ్డువచ్చిన ఆటంకాలూ, నా కుమార్తెని లంకకి తీసుకుని వస్తున్నానన్న ఆనందం, మారీచుడి మరణం గురించిన బాధాకరమైన ఆలోచనలని మనసులోకి రానివ్వలేదు. కానీ మా అత్త ముఖం చూడగానే నా వైఫల్యం, అపరాధభావం, నేను ఎందుకూ కొరగానన్న విషయం నన్ను నిలవనీయ లేదు. ఆమెని కౌగలించుకుని, నా కన్నీళ్లని ఆపుకునేందుకు నా రెండు పెదవులనీ గట్టిగా నొక్కిపెట్టాను. ఆమె నా కళ్లలోకి చూసింది, అక్కడ స్పష్టంగా కనిపిస్తున్న విషయాన్ని గ్రహించింది, అంతే నా చేతుల్లోనే కుప్పకూలిపోయింది.

సీత నా భవనంలో ప్రవేశించేందుకు నిరాకరించింది. మేఘనాదుడు చిన్నతనంలో ఆడుకున్న అశోకవృక్షం నీడలో ఒక మూలని తన నివాసస్థానంగా చేసుకుంది. ఆమెని నా భవనంలోకి రమ్మని బతిమాలి,

ఒప్పించేందుకు శతవిధాల ప్రయత్నించి కూడా ఓడిపోయి, ఆమెని చూసుకుంటూ ఉండమని త్రిజటకి విరక్తిగా చెప్పాను. ఆ పని చేసేముందు నా మందిరంలో తలుపులు మూసుకుని, ఒంటరిగా కూర్చుని నా ప్రియ మిత్రుడూ, సలహాదారూ అయిన మారీచుడి కోసం తనివితీరా దుఃఖించాను. భర్తని కోల్పోయిన మారీచుడి భార్యకీ, నా మాటలు నమ్మని మండోదరికీ నేను మారీచుడిని శత్రువుల బారిన ఎందుకు వదిలేయవలసి వచ్చిందో వివరించాను. వాళ్లు వెళ్లిపోయాక, నా మేనమామకి అన్యాయం చేసినందుకు అపరాధ భావాన్ని అణుచుకోలేక బాధపడ్డాను. ఆ తరవాతే సీత విషయం చూశాను.

రాత్రి గడుస్తూ ఉంది. నేను మంచంమీద అటూ ఇటూ పొర్లుతూనే ఉండిపోయాను. చంద్రుడు లేని ఆ రాత్రి బాగా ఉక్కపోతగా ఉంది, మండోదరికి కూడా నిద్రపట్టటం లేదని గ్రహించాను. నేను ఆమెకి దగ్గరగా జరిగి ఆమెని తాకాను, కానీ ఆమె కదల్లేదు. ఆమె ప్రతిస్పందన కోసం వేచి చూశాను. నన్ను కౌగలించుకుని నేను చేసినది సరైన పనే అని అంటుందని ఆశించాను. కానీ ఆమె కదలనే లేదు. నెమ్మదిగా ఆమె శరీరంమీదినుంచి నా చేతిని తొలగించి దూరంగా జరిగాను. మరోవైపు తిరిగి పడుకున్నాను.

ఉలిక్కిపడి మేల్కొన్నాను. ఎవరో వెక్కివెక్కి ఏడుస్తున్నట్టు అనిపించింది. ఆ శబ్దం మండోదరి దగ్గర్నించి రావటం లేదు. 'అయితే అది కేవలం నా ఊహేనా?' కిటికీ వద్దకు వెళ్లి బైటికి తొంగిచూశాను. బైట కన్ను పొడుచుకున్నా ఏమీ కనిపించనంత చీకటిగా ఉంది. తోటలో వెలుగుతూ ఆరిపోబోతున్నట్టు ఉన్న కొన్ని కాగడాలు ఆ చీకటి రాత్రిని మరింత అంధకారమయం చేస్తున్నాయి. ఇంతలో ఎటువంటి హెచ్చరికా లేకుండా హఠాత్తుగా వర్షం పడసాగింది. కాగడాలు తుస్సుమంటూ ఆరిపోయాయి, ఎక్కడో ఒక కిటికీ రెక్క గాలికి కొట్టుకోసాగింది. అది ఒక లయలో చేసే శబ్దం శూన్యంగా ఉన్న వసారాల్లో ప్రతిధ్వనించసాగింది.

నా మనసు లోతుల్లో ఏదో భయం తలెత్తసాగింది. నా కుమార్తె, ఒంటరిగా, తడిసి ముద్దయి, దీనంగా, ఆ చీకట్లో, ఆరుబైట ఉండటం

ఊహించాను. కానీ నేను కదల్లేదు. నాకు భయం వేసింది. నన్ను చూస్తే నాకే భయం వేసింది. ఆకాశం గర్జిస్తూ వర్షిస్తోంది, ఆకాశం కార్చే కన్నీటికి నిలువెల్లా తడిసిపోయి పృథ్వి వణికిపోతోంది. నేను నా మంచంమీద ఒంటరిగా కూర్చుని జ్యోతిష్కులు చెప్పిన ఆపదనీ, వేదవతి శాపాన్నీ తలుచుకుని హడిలిపోసాగాను.

29. రక్షకభట నిలయం

భద్రుడు

ఆరోజు నేను ఒక విచిత్రమైన దృశ్యాన్ని చూశాను. దాన్ని గురించి ఎవరైనా పెద్ద ప్రభుత్వాధికారికి చెప్పాలేమో అనిపించింది నాకు. ఆలస్యం అయిపోతోంది. రోజంతా ఏపనీ చెయ్యకుండా అటూ ఇటూ తిరుగుతూ, డబ్బున్న ఒక వర్తకుడి రథం శుభ్రంచేసి సంపాదించిన నాలుగు నాణాలూ తాటికల్లుకి ఖర్చు చేసేశాను. నాకు ఆకలిగా ఉంది, కానీ ఇంట్లో తినేందుకు ఏమీ లేదని నాకు తెలుసు. నిజం చెప్పాలంటే, నేను మంచి తిండితిని దాదాపు ఆరునెలలు కావస్తోంది.

మారీచుడి దహనక్రియలు ఎంత గొప్పగా జరిగాయో గుర్తుచేసుకున్నాను. మొదట్లో రాజవంశీయుడు, మారీచుడు ఎలా మరణించాడో మాకెవరికీ తెలీలేదు. ఆయన వృద్ధుడేకానీ అనారోగ్యంతో బాధపడుతూలేడు. చివరిసారి ఆయన్ని నేను చూసినప్పుడు తన నల్లగుర్రం మీద స్వారీచేస్తూ చాలా ఉత్సాహంగా కనిపించాడు. ఆయన మరణం మమ్మల్నందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. అధికారవర్గం మారీచుడు వృద్ధాప్యంవల్లనే చనిపోయాడని ప్రకటించింది. అసురరాజ్యం ఉత్తర సరిహద్దుల్లో ఉన్న ప్రధాన భూభాగంలో ఆయన చనిపోయాడని అన్నారు. ఆయన దహన సంస్కారం కూడా అక్కడే జరిగిందని అన్నారు. చనిపోయేముందు ఆయన అంతదూరం ఎందుకు, ఎలా వెళ్లాడో ఎవరికీ అర్థంకాని రహస్యం. అంతకు ముందురోజే జనం ఆయన్ని చూశారు. ఒక్కరోజులో అంతదూరం అంత త్వరగా ప్రయాణం చెయ్యటం మానవమాత్రులకి సాధ్యం కాదు. మయుడి విమానం ఎగరటం గురించి ఎవరికి తోచినట్టు వాళ్లు మాట్లాడారు. ఆ ఉక్కుపక్షిలో కూర్చుని చక్రవర్తీ, మారీచుడూ ఆకాశమార్గాన వెళ్లటం చూశామని కొందరు అన్నారు. కానీ నిజంగా ఏం జరిగింది అనేది నాకు అంత

ముఖ్యం కాదని అనిపించింది. రాజభవనంలో ఆరోజు పేదలకి కడుపునిండా భోజనం, కొత్త బట్టలూ దొరుకుతాయని తెలిసింది, ఊరికే ఒకచోట నిలబడి పోచికోలు కబుర్లు చెప్పుకునే తీరికలేదు! నేనూ, నా భార్యా రాజభవనంవైపు వడివడిగా నడిచాం.

రాజభవనానికి వెళ్లే దారులన్నీ జనంతో పూర్తిగా నిండిపోయాయి. నేను భవనానికి చేరుకునేసరికే అక్కడ పెద్ద జనసమూహం ఉండటం కనబడింది. జనం చోటుకోసం ఒకరిని ఒకరు తోసుకుంటున్నారు. చెవులు చిల్లులు పడేటంత రణగొణధ్వని, కోపంతో ఒకరిమీద ఒకరు భయంకరమైన తిట్ల వర్షం కురిపిస్తున్నారు. జనం తోసుకుంటూ, తొక్కుకుంటూ కొట్టుకుంటున్నారు. ఒళ్లంతా చెమట జిడ్డ, కాళ్లనిండా బురద అంటుకుంది, ఊపిరితిత్తుల్లోకి దుమ్ము వెళ్లి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అయినా జనం నెమ్మదిగా ముందుకి కదులుతూనే ఉన్నారు. వెనక కొత్తగా వచ్చి చేరుతున్న వాళ్లు వాళ్లని ముందుకు నెడుతున్నారు. సూర్యుడు ఏమాత్రం జాలి చూపటంలేదు. కొన్నివేల ఆకలిగొన్న శరీరాలనుంచి వెలువడే చెమటకంపు భరింపశక్యం కాకుండా ఉంది. నా భార్య ఎడమచేతి మణికట్టుని గట్టిగా పట్టుకున్నాను, కానీ ఎవరివో కొన్ని చేతులు ఆమె శరీరాన్ని తడమటం నాకు తెలుసూనే ఉంది. ఆమె మెలికలు తిరిగి తప్పించుకోవటానికి ప్రయత్నించ సాగింది. కానీ ఆ జనంలో ఉన్న మిగతా స్త్రీలలాగే ఆమెకీ అలాటివి భరించక తప్పలేదు. ఉచితంగా, అయాచితంగా దొరుకుతూ ఉండటంవల్ల నెట్టినా, మోచేతులతో పొడిచినా, రొమ్ములని తాకినా, పిరుదులని గిల్లినా ఎవరూ అంతగా పట్టించుకోలేదు. అందరం ముందుకే నడవసాగాం.

ఆ స్థలానికి దగ్గరయినకొద్దీ తోపులాటా, తొక్కిసలాటా ఎక్కువయాయి. నేను కూడా దారికి అడ్డంవచ్చిన వాళ్లని కాళ్లతో తంతూ, పిడికిళ్లతో గుద్దుతూ, వెళ్లి అక్కడవాళ్లు నాకిచ్చిన మూటని, నా ముందు కొట్లాడుకుంటున్న స్త్రీ పురుషుల తలలమీదినించి అందుకున్నాను. దాన్ని నా భార్యకి అందించి, నా వాటా

తీసుకునేందుకు మళ్లీ జనంలో దూరాను. ఒక భటుడు నన్ను నెట్టేసరికి కింద పడ్డాను. జనం నన్ను తొక్కుకుంటూ పోసాగారు. వాళ్లని శాపనార్థాలు పెడుతూ ఎలాగో లేచి ఇవతలికి వచ్చాను. మా ఇద్దరికీ కలిపి ఒక్క మూటే దొరికిందని నిరాశపడ్డాను. రాజుగారు చనిపోయిన తన మేనమామ జ్ఞాపకార్థం పంచిపెడుతున్న నిధిని అందుకోవటానికి సముద్రపు అలల్లా ఎగసిపడుతున్న జనాన్ని తప్పించుకుంటూ, వాళ్లకి వ్యతిరేకదిశగా మేమిద్దరం కదిలాం, రాజుగారు ప్రతిరోజూ ఒక మేనమామని కోల్పోతే బావుండునని ఆరోజు నాకు అనిపించింది.

ఆ తరవాత మధ్యాన్న భోజనం వడ్డించారు. రాజమార్గానికి ఇరువైపులా నేలలో చిన్నగుంటలు తవ్వి, ఆ గుంటల్లో అరిటాకులు పరిచారు. ఆ తాత్కాలికమైన పాత్రల్లో జావ వడ్డించారు. దాన్నే పరమాన్నంగా భావించి నాలాంటివాళ్లు కొన్నివేల మంది సంతోషంగా ఆరగించారు. మేము తింటూ ఉండగా లంకా నగరంలోని గొప్ప వ్యక్తులని ఎక్కించుకున్న రథాలు వేగంగా భవనంవైపు వెళ్లసాగాయి. అవి వేగంగా వెళ్తున్నప్పుడు మార్గంమీది దుమ్మూ ధూళీ మా అరటి దొన్నెలో పడ్డాయి. ఈగలు ముసరసాగాయి, కొన్ని ఊరకుక్కలు మా ఆహారాన్ని లాక్కుపోయే సాహసానికి ఒడిగట్టాయి. సాయంకాలం, చెక్కతో చేసిన పీపాలనిండా తాజా తాటికల్లు తీసుకొచ్చి భవనంలోని సేవకులు కిందికి దొర్లించారు. అప్పుడు మళ్లీ తొక్కిసలాట ప్రారంభమైంది. అర్థరాత్రి అయేసరికి, స్త్రీ పురుష భేదం లేకుండా, అందరం మత్తులో కూరుకుపోయాం. ఎన్నోచోట్ల రేగిన ఆ గొడవల్లో నలుగురు ప్రాణాలు పోగొట్టుకున్నారు. కానీ మర్నాటిదాకా మాకు ఆ సంగతి తెలీలేదు. అయినా నేను దాన్ని అంతగా పట్టించుకున్నానని అనటంలేదు!

రోజురోజుకీ నా పరిస్థితి అధ్వాన్నంగా తయారవసాగింది. నేను సంపాదించిన డబ్బు ఒక వారం రోజుల్లో అయిపోయింది. అందులో చాలా భాగం కల్లుదుకాణంలోనే ఖర్చయిపోయింది. కానీ నాకు తెలీకుండా మాల కొంత డబ్బు దాచుకుంది. దానిని నాకిమ్మని అడిగితే

నానా యాగీ చేసింది. ఆమె అరిచి గగ్గోలు పెడుతున్నాపట్టించు కోకుండా ఆమె దగ్గర్నుంచి దాన్ని లాక్కుని, వేగంగా కల్లుదుకాణంవైపు పరిగెత్తాను. నేను పండగ చేసుకున్న ఆఖరిరోజు అదే.

మర్నాడు ఉదయం నుంచీ ఆకలి మమ్మల్ని వదలని నీడలా వెంటాడింది. అప్పుడప్పుడూ నాకు ఏదో ఒక చిన్నపని దొరికేది, అప్పుడు తినేవాళ్లం. కానీ ఆకలి మమ్మల్ని వెంటాడుతూనే వుండేది. మేము దిక్కులేని వాళ్లం. ఆ వాస్తవం నెమ్మది నెమ్మదిగా అర్థం అవసాగింది. బహుశా బ్రాహ్మణులు చెప్పే మాటల్లో కొంత నిజం లేకపోలేదేమో! మనిషి గతజన్మలో చేసిన కర్మకి ఫలితాలు ఈ జన్మలో అనుభవించాలేమో! మాకూ అలాంటిదే జరుగుతూ ఉండాలి. ఎక్కువమంది జనం పేదవారే. అంటే పూర్వజన్మలో పాపాలు చేసినవారే ఎక్కువగా ఉన్నారన్నమాట.

కానీ అందరూ అలాటివారు కారు. వర్తకులు, ప్రభుత్వాధికారులూ, ఉద్యోగులూ, నటులూ, సంగీత విద్వాంసులూ, వాళ్లందరూ రోజురోజుకీ తమ శరీరాలని పెంచుకుంటూ లావుగా తయారవుతున్నారు. భవనాలు లేవటం, అక్కడ తళతళ మెరిసే దుస్తులూ, అధునాతనమైన పాదరక్షలూ అమ్మకానికి పెట్టటం, చక్కటి మెరిసిపోయే రథాలెక్కి అందమైన వాళ్లు వాటిని కొనేటందుకు రావటం, ఇదంతా మాకు కనబడుతూనే ఉంది. వాళ్ల ఇళ్లకి అసలు సిసలు పైకప్పులు ఉన్నాయి, కూర్చునేటందుకు మంచి ఆసనాలు ఉన్నాయి, పడమటివైపు ఉన్న దూరదేశాల్లో తయారయే తివాసీలు ఉన్నాయి, అలాంటి ఒక్క తివాసీకి ఖర్చుపెట్టిన డబ్బుతో ఒక గ్రామానికి ఏడాదిపాటు ఆహారం అందించి ఉండవచ్చు, ధనవంతుల సంతానానికి మాత్రమే చదువులు చెప్పే గురువుల దగ్గరకి చురుకైన పిల్లలు వెళ్లేవారు. అక్కడ నాటకశాలలు ఉండేవి, కానీ వాటి దరిదాపులకి వెళ్లే ధైర్యం చేసిన మాబోటి వారిని రక్షకభటులు తరిమికొట్టేవారు.

ఒకప్పుడు నాకు చదవటం, రాయటం వచ్చేది. మంచి యోధుడిగా శిక్షణ కూడా పొందాను. ఇది నిజమా, లేక ఇవన్నీ ఒకనాటి గొప్ప

విషయాలుగా, సాహసకృత్యాలుగా వృద్ధాప్యంలో ఊహించుకుని గర్విస్తున్నానా? ఆ విషయం కచ్చితంగా చెప్పలేను. ప్రస్తుతం బక్కచిక్కిన నా శరీరాన్నీ పగుళ్లతేలిన చర్మాన్నీ బట్టతలనీ, లోతుకిపోయిన బుగ్గలనీ చూసిన వాళ్లెవరూ, నేను ఒకప్పుడు యోధుడినంటే ఎంతమాత్రం నమ్మరు. ఇప్పుడు ఒక్క అక్షరం కూడా చదవలేను. దానివల్ల ప్రస్తుతం నష్టమేమీ లేదనుకోండి. నాకు యాభై ఏళ్లు దాటాయి, ఇక చేసేందుకు పెద్దగా ఏమీ మిగలలేదు. ఏదో ఒకరోజు నన్ను కూడా నలుగురు మనుషులు మోసుకుని వెళ్లి దహనక్రియలు జరిపిస్తారు. ఆ కోరికని ఎన్నోసార్లు బైటపెట్టినప్పటికీ అలాంటి చివరి ప్రయాణం కోసం నేను ఎదురుచూస్తున్నానని చెప్పటం నా ఉద్దేశం కాదు. చనిపోయేంత వయసు మీకు ఎక్కడ వచ్చింది అని నా భార్య అనాలనీ నన్ను ఓదార్చాలని ఆశించి అలా అనేవాడిని. కానీ ఈ మధ్య నేను చనిపోవటం గురించి ఎప్పుడు మాట్లాడినా ఆమెనుంచి ఎలాటి జవాబూ రావటం లేదని గమనించాను. బహుశా నేను చనిపోవాలని ఆమె కోరుకుంటోందేమో! అదీ మంచి ఆలోచనే. కానీ నాకు భయం వేసేది. నాకు చనిపోవాలని లేదు. శాశ్వతంగా జీవించే ఉండాలని అనుకునేవాడిని.

ఇంటికి నడిచి వస్తూ, మిరుమిట్లు గొలుపుతూ వెలుగుతున్న దీపాలు ఇంద్రధనుస్సు రంగుల నీడలు వీధుల్లో విరజిమ్మటం నోరు తెరుచుకుని చూడసాగాను. అందమైన ఒక స్త్రీ నా పక్కనుంచి నడిచి వెళ్లినప్పుడు ఆమె తన ఒంటికి రాసుకున్న పరిమళం నా ముక్కుని తాకింది. చుట్టూ మంద్రస్థాయిలో సంగీతం వినిపిస్తోంది. కొన్ని కుటుంబాలు వీధిపక్కన పక్కలు పరుచుకుంటున్నాయి. పాపం పేదవాళ్లు! బహుశా వాళ్లు గ్రామాలనుంచో, ప్రధాన భూభాగంనుంచో వచ్చి ఉంటారు. త్వరలోనే వాళ్లని రాజభటులు అక్కడినుంచి తరిమివేస్తారు. వీధుల్లో అలాంటి మురికిగా ఉన్న అనామకులు నిద్రపోకూడదు. వీధులు అందంగా ఉంటాయి, వాటి అందం చెడకూడదు. నదీతీరాన ఉన్న నా ఇంటివైపుకి దుకాణాల పక్కనుంచి

నడిచాను. దుకాణాలలో ఉన్న రకరకాల పదార్థాలూ, సుగంధ ద్రవ్యాలూ నా నాసికాపుటాలమీద దాడిచేశాయి! దుకాణాలు మూసివేసే సమయం కావచ్చింది. కొందరు దుకాణాలు మూసేస్తున్నారు, కొందరు ఆరోజు రాబడి లెక్కపెట్టుకుంటున్నారు. ఆ దుకాణాలబైట నిలబడి ఉన్న దోపిడీదొంగలు నావైపు గుర్రుగా చూస్తూ ఉంటే, నేను వాళ్లవైపు చూడకుండా గబగబా నడిచి వెళ్లిపోయాను. దుకాణాల వరుస చివర్నఎడమవైపుకి మలుపు తిరిగాను. ఆ మూల కుళ్లిపోయిన కూరగాయలూ, చేపలూ దుర్వాసనతో ఎప్పటిలాగే నాకు స్వాగతం పలికాయి. కొన్ని కుక్కలు ఆ చెత్తలోంచి ఏరుకుని తింటున్నాయి. ఒకటి సంకోచిస్తూనే నన్నుచూసి మొరిగింది. నేను నేలమీద ఉన్న రాయి అందుకోబోయేసరికి అది తోకముడిచి పారిపోయింది. నన్ను చూసి ఈ మధ్య భయపడుతున్న ప్రాణి అదొక్కటే.

దూరంగా రావణుడి ఎత్తైన కోట హుందాగా, అభేద్యంగా కనిపించింది. నా కొడుకు, అతికాయుడు తన యజమాని, మేఘనాదుడి వెంట ఉండి ఉంటాడు. మూర్ఖుడు! వాడిని చూసి దాదాపు ఆరునెలలు కావస్తోంది. వాడు ఆ రాజభవనానికి చెందిన వాడనీ, నేను కేవలం వాడి బాగోగులు చూసేవాడిననీ అనుకుంటే బాధ వేసింది.

ఒకవేళ నేను పూర్ణానదీ తీరాన నా గ్రామంలోనే ఉండిపోయి, నా భార్యా, కూతురూ జీవించి ఉంటే ఏమయేది? మా కుగ్రామాన్ని ఆ దుష్ట దేవతాజాతి ఆక్రమించకుండా ఉండి ఉంటే ఎలా ఉండేది? తప్పకుండా నా జీవితం ఇంతకన్నా మెరుగ్గానూ, భిన్నంగానూ ఉండేది. దానికి బదులు నేను ఒక రాజుకన్న కల కోసం పోరాడాను. నా జీవితంలోని హెచ్చైన భాగాన్ని రావణుడిలాంటి మోసగాళ్లు ధనంతోనూ, హోదాతోనూ, అధికారంతోనూ విర్రవీగేందుకు ధారపోశాను. అయ్యో! జీవితంలో ఎన్ని తప్పలు చేశాను! నా జీవితం తన ఇష్టంవచ్చిన మార్గంలో నడిచింది. కనీసం నా కొడుకు కడుపునిండా తింటున్నాడు, రాకుమారుడిలా జీవిస్తున్నాడు. కానీ ఆ ఆలోచన ఓదార్పుని

ఇవ్వటంలేదు. 'ఎందుకు వాడు మాత్రమే అలా జీవించాలి? నేనెందుకు అలా లేను?' నా మనసంతా చేదుతో నిండిపోయింది. మళ్లీ ఒకసారి దేదీప్యమానంగా ఉన్న రాజభవనంవైపు చూశాను. అప్పుడు కనిపించింది నాకు ఆ విచిత్రమైన దృశ్యం.

ఆగి అటువైపే చూశాను. మొదట అదేమిటో అర్థం కాలేదు. ఏదో కోట మీదికి ఎగబాకుతోంది. దొంగ అయి ఉంటాడా? ఏ మూర్ఖుడు అసుర చక్రవర్తి భవనంలోకి దొంగలా ప్రవేశించాలని అనుకుంటాడు? అంత ధైర్యం ఎవరికి ఉంటుంది? దొరికిపోతే తోలు వలిచెయ్యరూ? ఇంకా ఏవైనా కదలికలు కనిపిస్తా యేమోనని వేచి చూశాను, కానీ అంతటా నిశ్శబ్దం అలుముకుంది. బహుశా నేను అనుకున్నదానికన్నానేను తాగిన కల్లు ఘాటుగా ఉందేమో! చూపులు మరల్చుకుని నా పనికిమాలిన బతుకు గురించి ఆలోచిద్దామనుకుంటూ ఉండగా వాడు కనిపించాడు.

వెలిగిపోతున్న భవనం ముందున్న వాడు నల్లటి నీడలా ఉన్నాడు. వాడి ముఖం నాకు కనిపించలేదు. కానీ బాగా బలశాలిలా ఒడ్డూ పొడుగూ ఉన్నాడు. కోటపైకి ఎక్కి భవనాన్ని పరిశీలిస్తున్నవాడి భుజంమీద ఒక పెద్ద గద కూడా ఉంది. 'ఎవడు వీడు?'

గొప్ప వానరరాజు వాలి గుర్తుకొచ్చి ఉలిక్కిపడ్డాను. వీడు ఆయనలాగే ఉన్నాడు. కానీ వానరరాజు అసుర చక్రవర్తి భవనంలోకి దొంగతనంగా ప్రవేశించాల్సిన అవసరం ఏముంది? ఆ గొప్ప వానర రాజుని ఎవరో దేవతాజాతి వేటగాడు, దొంగతనంగా చెట్టు వెనక నక్కి బాణంవేసి చంపాడన్న వదంతులు విన్న జ్ఞాపకం వచ్చింది నాకు. వీడు తల తిప్పగానే వాడి చెవికున్న ఖరీదైన ఆభరణంమీద వెలుతురుపడి ప్రతిఫలించింది. 'వీడు వాలి కాడు.' ఇంతలో వానరులకి మాత్రమే సాధ్యమయే లాఘవంతో వాడు కిందికి దూకాడు. వాడి బరువుకి చెట్ల గుబురు కంపించటం నాకు కనిపించింది. నేను కొయ్యబారిపోయి శూన్యంలోకి చూస్తూ ఉండిపోయాను.

ఎవరో ఇప్పుడే రావణుడి భవనంలో ప్రవేశించారు. నాకు ఏం చెయ్యాలో పాలుపోలేదు. 'ఎవరికైనా ఆ విషయం చెప్పాలా? లేక మాట్లాడకుండా ఇంటికి వెళ్లి పడుకోవాలా?' రాజభవనంలోకి పరాయివాళ్లు ఎవరైనా ప్రవేశిస్తే అది రాజుకి సంబంధించిన సమస్య దాన్ని నేనెందుకు పట్టించుకోవాలి? ఇంతలో నా ఇంట్లోకి ఇదే విధంగా దేవతలు ప్రవేశించిన దృశ్యం నాకు గుర్తుకొచ్చింది. వెంటనే వచ్చిన దారినే వెనక్కి పరిగెత్తాను.

ఈ విషయంలో జోక్యం చేసుకునేవాళ్లని ఎవరినైనా పట్టుకోవాలి. ఆపద మలుపులో పొంచి ఉంది. నేను రాజవీధిలోని రక్షణనిలయం చేరుకునేసరికి ఆయాసంతో కుక్కలా రొప్పసాగాను. తీరా అక్కడికి చేరుకున్నాక లోపలికి వెళ్లేందుకు సందేహించాను. లోపల ఒక కాగడా వెలుతురు విరజిమ్ముతోంది. నలుగురు రక్షకభటులు దగ్గరగా కూర్చుని పాచికలు ఆడటంలో మునిగి ఉన్నారు. లావాటి రక్షణశాఖ అధికారి బల్లమీద తన రెండు కాళ్ళూ చాచి నిద్రపోతున్నాడు. ఒక మూల జిగేలుమని వెలుగుతున్న కాగడా చుట్టూ రెక్కల పురుగులు ముసురుతున్నాయి.

"అయ్యా!" అని పిలిచాను. జవాబు లేదు. "అయ్యా!" మళ్లీ పిలిచాను. భటుల్లో ఒకడు తలెత్తి చూశాడు, వెంటనే ఆశ్చర్యంతో వాడికళ్లు పెద్దవి అయాయి. నా కాళ్లు వణికాయి, భయంతో కుంచించుకుపోయాను. 'నేను నేరస్థుడిని కాను!' కానీ పేదవాడిని, అది అన్నిటికన్నా పెద్ద నేరం.

"ఏం కావాలి?" అని మొరిగినట్టుగా అడిగాడు ఆ భటుడు. నేను అక్కడికి రావటం అతనికి కోపం తెప్పించిందని తెలుస్తూనే ఉంది.

"అయ్యా! నాకు ఒక మనిషి కనిపించాడు..."

"నాకు కూడా కనిపిస్తూనే ఉన్నారు మనుషులు," అంటూ తను చమత్కారంగా అన్న చచ్చు హాస్యానికి తనే నవ్వాడు, మిగతావాళ్లు కూడా నవ్వారు. రక్షకభటుల శాఖ అధికారి కళ్లు తెరిచాడు, కొన్నిసార్లు

కళ్లు ఆర్చి, మళ్లీ నిద్రపోయాడు. నాకు అక్కడినించి వెళ్లిపోవాలని అనిపించింది. రాజు తనని తానే కాపాడుకుంటాడు అని అనుకున్నాను. బైటికి నడవబోయాను. "ఏయ్, ఎవర్రా నువ్వు? ఏదో పిచ్చి కథ చెప్పేందుకు లోపలికి వచ్చి, అలా వెళ్లిపోయేందుకు ఎన్ని గుండెలురా నీకు?" అని ఆ రక్షకభటుడు నామీద అరిచాడు.

"నేను మిమ్మల్ని ఏమీ అనలేదు కదండీ!" కాస్త ఆత్మగౌరవం ప్రదర్శించ బోయాను.

"నాకే ఎదురు జవాబు చెపుతావురా?" అన్నాడు. దాని తరవాత నేను ఎదురుచూడనిది జరిగింది.

మరుక్షణం అతను నామీదికి లంఘించి నా తొడల మధ్య గట్టిగా తన్నాడు. నేను కింద కుప్పకూలాను. కోపంతో, అవమానంతో, విపరీతమైన నొప్పితో కళ్లలో నీళ్లు తిరిగాయి. మిగతా భటులు ఆట మానేశారు. ఇంకా మంచి వినోదం దొరికింది వాళ్లకి - అదే నేను! "ఒరే ముష్టి వెధవా, తిరుగుబోతూ, ఈ వేళప్పుడు రాజమార్గంలో ఏం చేస్తున్నావురా?"

తరువాతి దెబ్బని తప్పించుకునే ప్రయత్నం చేశాను కానీ బాగా నీరసం ఆవహించేసింది. "అయ్యా... అయ్యా! కొంచెం నా మాట వినిపించుకోండి. ఎవరో రాజభవనంలో దొంగతనంగా ప్రవేశించారు." కానీ నా ముఖంమీద వాళ్లు కొట్టిన దెబ్బకి నేను వెల్లకిలా పడిపోయాను. నేను నిస్సహాయంగా పడిఉంటే వాళ్లు నన్ను కాళ్లతో తన్నారు, చేతులతో చావబాదారు. ఇంతలో హఠాత్తుగా ఆపేశారు. నేను తలెత్తి చూసేసరికి రక్షకనిలయం అధికారి తాడిచెట్టులా నిలబడి కనిపించాడు. అతను నా తలమీద ఉన్న కాసిని వెంట్రుకలూ పట్టి నన్ను పైకి లేపాడు. నా ముఖంలో కత్తివాటుకి రక్తంచుక్కలేదు. తరవాత అతను నన్ను తన బల్ల దగ్గరకి తోశాడు. నేను మళ్లీ కింద పడిపోయాను. పైకి చూస్తే ఆయన భారీ శరీరం బల్ల అంచున కూర్చుని ఉండటం కనిపించింది. అతని బరువుకి అది కిర్రుమని చప్పుడు చెయ్యసాగింది. బల్ల

విరిగిపోతే బావుండునని అనుకున్నాను.

"చెప్పు!" అని ఆజ్ఞాపించినట్టు అన్నాడు అతను. నేనేమీ జవాబు చెప్పకపోయే సరికి తన్నాడు. అప్పుడు నేను చూసినదంతా మొత్తం చెప్పేశాను. అతను ముఖం చిట్టించాడు. ఏదో నములుతూ ఆలోచిసూ ఉండిపోయాడు. తరవాత ఒక భటుడితో, "వెళ్లి రాజభవనం కాపలాకాసే భటుల నాయకుడికి ఇదంతా చెప్పు," అని మళ్లీ ఏదో జ్ఞాపకం వచ్చినట్టు, "వీడిని కారాగారంలో పడెయ్యండి. పందిలా పూటుగా తాగేసి ఉన్నాడు," అన్నాడు.

మిగతా ఇద్దరు భటులూ నన్ను మూలనున్న చీకటికొట్టు దగ్గరకి ఈడ్చుకెళ్లి ఒక మూలకి విసిరేశారు. ఆ కొట్టు తలుపులకి తాళం కూడా వెయ్యకుండా మళ్లీ ఆటలో మునిగిపోయారు. సమాచారం అందించేందుకు వెళ్లవలసిన భటుడు నన్ను శాపనార్థాలు పెడుతూ భవనంవైపు నడిచాడు. మరీ నిజాయితీగా ఉండేందుకు ప్రయత్నించి ఇంత శ్రమ తీసుకున్నందుకు నన్ను నేను తిట్టుకున్నాను. 'రాజు తన భవనాన్ని ఏం చేసుకుంటాడు అనేది నాకు సంబంధించిన విషయం కాదు!' నేనెంత మూర్ఖుడిని! ఆ చీకటి కొట్ట మరో మూలలో ఎవడో చిన్నకారు దొంగ పడుకుని ఉన్నాడు. రక్షక నిలయం అధికారి మళ్లీ కుర్చీలో వెనక్కివాలి గుర్రు పెట్టసాగాడు. నా ఒంట్లో ఉన్నాయని కూడా తెలియని భాగాలు నొప్పి పుట్టసాగాయి. ఎంత బుద్ధిలేదు నాకు! నా కర్మనీ, బుద్ధిలేని తొందరపాటు తనాన్నీ తిట్టుకుంటూ నెమ్మదిగా నిద్రలోకి జారిపోయాను.

నేను మళ్లీ నిద్రలేచి చూసేసరికి లంకకి నిప్పంటుకుంది.

30. మృత్యుదూత

రావణుడు

నా తోటలో కేకలూ, గోలా విని నిద్ర మేల్కొన్నాను. జనం పిచ్చిగా అటూ ఇటూ పరిగెత్తుతున్నారు. భటులు అరుస్తూ ఒకరిని ఒకరు తిట్టుకుంటున్నారు. భవనాన్ని వందలకొద్దీ కాగడాలతో వెలిగించినట్టు ఉంది. మండోదరి మేలుకునే ఉంది. ఆమె ఏమీ అర్థం కానట్టు చూస్తోంది. తలుపు తెరిచి చూస్తే భటులు వసారాలోనుంచి తొంగి చూడటం కనిపించింది. వాళ్లు ఎందుకో అరుస్తున్నారు. నేను వాళ్ల దగ్గరకి వెళ్లేసరికి అందరూ నిటారుగా నిలబడ్డారు.

"ఈ గొడవంతా ఏమిటి?"

ఒక భటుడు వంగి నమస్కరిస్తూ చురుగా ముందుకి వచ్చి, "ప్రభూ! ఒక నరవానరుడు రాజోద్యానంలోకి జొరబడ్డాడు. వాడు దేవతా స్త్రీతో మాట్లాడటం కనిపించింది. కొందరు భటులు వాడిని పట్టుకునేందుకు ప్రయత్నించేసరికి, వాడు ఎదురు తిరిగి ఒక భటుడిని చంపి, ఇద్దరు ముగ్గురిని గాయపరిచాడు. ప్రస్తుతం చెట్లమాటున మాయమయాడు," అన్నాడు.

నేను నిర్ఘాంతపోయాను. నరవానరులు నా రాజభవనం ఉద్యానవనంలోకి జొరబడటం అనేది నా ఊహకి అందని విషయం. నా కుమార్తె సీత గురించి నాకు దిగులు పట్టుకుంది. ఆ అశోకవృక్షం కింద ఉన్న ఆమె, నా భటులు ఎంతగా ఆమెని కనిపెట్టుకుని ఉన్నా ఆపదకి గురయే అవకాశం ఎక్కువ. ఏదో తెలీని ఆందోళన నన్ను స్థిమితంగా ఉండనివ్వలేదు. వాలి హత్య గురించి విని నాలుగు నెలలైనా కాలేదు. నరవానరుల రాజుని హతమార్చింది ఆ రాముడే. ప్రస్తుతం వానరులని పరిపాలిస్తున్నది భ్రష్టుడూ, నీతి నియమాలూ పాటించని దుష్టుడూ

అయిన సుగ్రీవుడు, వాలి సోదరుడు. వాలి అధికారాన్ని నా జామాత తుదముట్టించిన పద్ధతి చాలా రోత కలిగిస్తుంది. చెట్టు వెనక నక్కి వాలి గుండెని చీల్చేట్ట బాణంవేసి చంపాడు. సుగ్రీవుడు వాలితో ద్వంద్వ యుద్ధం చేస్తూ ఓడిపోతూ ఆశవదులుకునే పరిస్థితి వచ్చినప్పుడు, రాముడు ఇలాటిపని చేశాడని తెలిసి నాకు మరింత కోపం వచ్చింది.

వానర రాజుని పదవీభ్రష్టుడిని చేసి నా మిత్రుడి మరణానికి పగతీర్చుకోవాలన్న కోరిక నాకు బలంగా కలిగింది. వానరుల మీదికి దండెత్తి వెళ్లమని నా సైన్యానికీ, నౌకాదళానికీ ఆదేశాలు కూడా పంపాను. కానీ సముద్రతీరాలనుంచి ఉన్నత హిమాలయాల దాకా ఉన్న భూభాగాన్నినా కుమారుడు గెలుచుకున్నాక, నా యుద్ధ పిపాస తగ్గిపోయింది. అదీగాక, మేఘనాదుడికి కప్పం కట్టేందుకు సుగ్రీవుడు అంగీకరించాడు, వర్షాకాలం కూడా ప్రారంభమైంది. మా ప్రణాళికని వాయిదా వేసుకున్నాం. కానీ వర్షాకాలం ప్రారంభమవగానే, తుచ్ఛడైన సుగ్రీవుడు మళ్లీ వ్యభిచారిలా జీవించసాగాడు. క్రమశిక్షణలేని నరవానరసేనతో కలిసి రాముడు ఎటువంటి సాహసకృత్యానికీ పూనుకోడని నాకు కచ్చితంగా తెలుసు. నేను మరీ మూర్ధంగా ఆ విషయాన్ని నమ్మనని వేరే చెప్పనక్కర్లేదు. నా ఉద్యానవనంలోకి ప్రవేశించిన నరవానరుడే దానికి నిదర్శనం. ముందుచూపు లేకుండా ప్రవర్తించి నందుకు నన్ను నేను తిట్టుకున్నాను.

ఇది ఒక అత్యవసర పరిస్థితి. సభని ఏర్పాటు చేయాల్సిన సమయం. కిటికీలూ, తలుపులూ మూసివెయ్యమని నా భార్యకి చెప్పాను. నేను ఎప్పుడూ లేనంత జాగ్రత్తపడటం చూసి ఆమె కంగారు పడింది. కానీ నేను ఆమెని పట్టించు కోకుండా బైటికివెళ్లి తలుపు దఢాలున మూసేశాను. మేఘనాదుడి మందిరంవైపు నడిచాను. ఆ మందిరం తలుపులు తెరిచి ఉన్నాయి. లోపల అన్ని దీపాలూ వెలుగు తున్నాయి. భటులు వాళ్ల వాళ్ల స్థానాల్లో నిటారుగా నిలబడి ఉన్నారు. నా మంత్రులు అందరూ గుమిగూడి ఆందోళనగా మాట్లాడుకుంటూ కనిపించారు.

"రాకుమారుడు మేఘనాదుడు ఎక్కడ?" అన్నాను నా కుమారుడి అందమైన ముఖం ఎక్కడుందా అని వెతుకుతూ.

"ప్రభూ! ఆయన ఉత్తరదిశలో వెతకటానికి వెళ్లిన రాజభటులకి నేతృత్వం వహిస్తున్నాడు," అన్నాడు ప్రహస్తుడు.

"కోట రక్షణ విషయంలో అటువంటి పొరపాటు ఎలా జరిగింది?" అంటూ ఉంటే మళ్లీ నాకు కోపం తన్నుకొచ్చింది. పిడికిలితో అరచేతిలో గుద్దుతూ నేను అలా అడిగేసరికి అందరూ మౌనంగా ఉండిపోయారు. "నాకు వెంటనే జవాబు కావాలి!" అని అరిచాను. నా ఆందోళనస్థానంలో కోపం చోటు చేసుకోవటంతో కాస్త స్థిమితపడ్డాను.

"కాపలా భటులు నిద్రపోతూ ఉండగా, పడమటి కోటగోడ మీదుగా లోపలికి దూరాడు వాడు. వాళ్లని హతమార్చి అశోకవనంలోకి ప్రవేశించాడు. ఆ భటుల శవాలు కాలవలో దొరికాయి. వాళ్ల గొంతుకలు కోసి చంపాడు వాడు," అన్నాడు ప్రహస్తుడు నెమ్మదిగా.

"అద్భుతం! ఇది చాలా బావుంది! రావణుడి కోటలో వాడు ప్రవేశించటం ఒక్క అసురుడు కూడా చూడలేదా? నా కాపలా భటులని నిద్రపోతూ ఉండగా చంపాడు వాడు. నా దగ్గర 50,000 మంది సైనికులు ఉన్నారు. ఒకే ఒక నరవానరుడు ఎవరికీ పట్టుబడకుండా తప్పించుకోవటమే కాక, ఇంతవరకూ ఎవరూ వాడిని పట్టుకోనేలేదు. మీ కాపలాకీ, అప్రమత్తతకీ ఇదేనా నిదర్శనం?"

నా వాగ్ధాటి ఆగిన తరవాత ప్రహస్తుడూ, జంబుమాలీ ఒకరివైపు ఒకరు చూసుకోవటం గమనించాను.

"ప్రభూ, నిజానికి దారినపోయే ఒక తాగుబోతు రాజమార్గంలో ఉన్న ఒక రక్షక నిలయానికి వెళ్లి, కోటలోకి ఎవరో దొంగతనంగా ప్రవేశించటం చూశానని చెప్పాడట. కానీ..."

"కానీ అక్కడ ఉన్న అధికారి కూర్చున్నచోటినించి లేచేందుకు ఇష్టపడలేదట. ఎటువంటి చర్యా తీసుకోకుండా నిర్లక్ష్య వైఖరి

కనబరిచారు. అదేనా మీరు నాకు చెప్పదలుచుకున్నది?"

మేఘనాదుడు ఎక్కడున్నాడు? నాకు ఆందోళన ఎక్కువ అవసాగింది. ఆ నరవానరుడు ఎక్కడైనా దాక్కుని ఉండవచ్చు. చీకట్లో ఏ చెట్టమీదినుంచో దొంగతనంగా వేసిన బాణం నా కుమారుడి గొంతులో దిగబడవచ్చు. ఇది చాలా ప్రమాదకరమైన ఆట. ఇది నియమాలని అనుసరించి చేసే యుద్ధం కాదు. ఆ సమావేశంలో ఇబ్బందికరమైన నిశ్శబ్దం తాండవించింది. బైట అయే శబ్దాలు మాకు వినిపిస్తున్నాయి. మనుషులు పరిగెత్తటం, ఒకరిని ఒకరు హెచ్చరించు కోవటం, కత్తులు ఒరుసుకునే చప్పుడూ వినిపిస్తున్నాయి.

హఠాత్తుగా నాకు హర్షధ్వానాలు గట్టిగా వినిపించాయి. అందరూ పైకి చూడసాగారు. అందరూ, "రావణుడికి జయము జయము... ఇంద్రజిత్తుకి జయము జయము," అని అరవసాగారు. నేను ఉత్సాహం పట్టలేక లేచి నిలబడ్డాను. సభలో అందరూ లేచి నిలబడ్డారు. బైటికి పరిగెత్తి నా కుమారుడు నాకోసం తెస్తున్న బహుమతిని చూడాలనిపించింది. కానీ అక్కడే నిలబడి నా అత్యుత్సాహాన్ని అణచుకునేందుకు ప్రయత్నిస్తూ, చేతులు నలుపుకుంటూ ఆనందంగా ఎదురు చూడసాగాను. పొడవుగా, గర్వంగా, చేతిలో వింటిని గట్టిగా పట్టుకుని, నా కుమారుడు ఊరేగింపు ముందు నడుస్తూనా సభలోకి ప్రవేశించాడు. సభికులందరూ లేచి నిలబడి హర్షధ్వానాలు చేశారు. అసురజాతి భటులు మా చుట్టూ నృత్యం చేశారు. ఢంకాల చప్పుడు తారస్థాయికి చేరుకుంది. నేను కిందికి దిగి నా కుమారుడిని కౌగలించుకున్నాను.

అప్పుడు చూశాను, పొడవుగా, కండలు తిరిగిన నల్లటి వానరుడు నా కుమారుడి వెనుక నిలబడి ఉన్నాడు. వాడి చేతులూ, కాళ్ళూ తాళ్లతో బంధించి ఉన్నాయి. వాడి శరీరంమీది కండలు జవజవలాడాయి. 'నాకూ యౌవనంలో అటువంటి శరీరమే ఉండేది, చెక్కిన శిల్పంలా!' నా పొట్టని లోపలికి లాక్కున్నాను.

ఆ వానరుడు దాదాపు మేఘనాదుడంత ఎత్తుగానూ ఉన్నాడు. ఒంటినిండా ఉంగరాలు ఉంగరాలుగా వెంట్రుకలు ఉన్నాయి, ముఖానికి రెండువైపులా ఉంగరాల జుట్టు వేలాడుతోంది. వాడు మహాబలశాలి అయిన యోధుడిలా కనిపించాడు. వాడు రాముడి చేతిలో మరణించిన నా మిత్రుడు వాలిని పోలి ఉండటం చూసి ఉలిక్కిపడ్డాను.

కావాలనే నెమ్మదిగా ఒక్కొక్క అడుగే ఎత్తివేస్తూ నా సింహాసనం దగ్గరికి నడిచాను. మంత్రులు కూడా వెళ్లి తమకి నిర్దేశించబడిన స్థానాల్లో కూర్చున్నారు. మేఘనాదుడు కత్తి చేతో పట్టుకుని వానరుడి దగ్గర నిలబడ్డాడు. చెయ్యి ఊపి ధంకాలు మోగించేవాళ్లనీ సభలో ప్రముఖులు కాని వాళ్లనీ అక్కడినించి పంపివేశాను. అప్పుడు, కొన్నిక్షణాల నిశ్శబ్దం తరవాత, నేరస్తుడిని ప్రశ్నించటం ప్రారంభించాను. మొదట కొన్ని ప్రశ్నలకి వానరుడు జవాబు చెప్పలేదు. నిర్లక్ష్యంగా ఎదిరిస్తున్నట్టు నావైపే చూస్తూ నిలబడ్డాడు. వాడు నిలుచున్న భంగిమా, ఆత్మవిశ్వాసం చూసి నేను కాస్త తడబడ్డాను.

ఈలోకంలోకెల్లా శక్తిమంతుడైన ఒక రాజు సభలో ఉన్నాడు వాడు. గూఢచారి రూపంలో వచ్చి పట్టుబడ్డాడు. మరణదండనకి తక్కువకాకుండా వాడికి శిక్ష పడే అవకాశం ఉంది. అయినప్పటికీ, పిల్లలు ఆడుకుంటూ ఉంటే చూస్తూ నిలబడినంత నిశ్చింతగా నిలబడ్డాడు. ప్రహస్తుడు ఏమంటాడా అని అతనివైపు చూశాను. అతను లేచి నిలబడ్డాడు, కానీ అతను మాట్లాడేలోపల వానరుడు గంభీరమైన గొంతుతో ఇలా అన్నాడు-

"నా పేరు హనుమంతుడు, మారుతి పుత్రుడిని. నా ప్రభువు, రక్షకుడు శ్రీరామచంద్ర మహారాజు పంపగా దూతనై ఇక్కడికి వచ్చాను. ఒక రాజు వద్దకి మరో రాజు పంపిన దూతకి ఇవ్వవలసిన మర్యాద నాకు దొరుకుతుందని ఆశిస్తున్నాను. అసుర చక్రవర్తి, గొప్ప మేధావీ, పండితుడూ, యోధుడూ అయిన రావణ ప్రభువు రాజధర్మాన్ని అనుసరించి ఈ దూతకి తగిన గౌరవాన్నిఅందించగలడు అనటంలో నాకు ఎటువంటి సందేహమూ లేదు," అంటూ తను చెప్పదలుచుకున్న

నాలుగు మాటలూ చెప్పి చిరునవ్వు నవ్వాడు. ఆ చిరునవ్వుతో అతని ముఖం వెలిగిపోయింది.

"దూతలు అర్ధరాత్రి దొంగతనంగా జొరబడరు శ్రీ హనుమాన్! మీరు గూఢచారి అని అనుకునేందుకు మాకు గట్టి ఆధారాలే ఉన్నాయి. మీరు చెప్పిన రాజధర్మం నియమాలని అనుసరించి మీరు గూఢచారిలా వచ్చినందుకు మరణశిక్షకి అరులు. ఇక మాకు తెలిసినంత వరకూ మీ ప్రభువు రాజధర్మాన్ని అంత నిక్కచ్చిగా పాటించేవ్యక్తి కాడు. ఇద్దరు యోధులు ద్వంద్వయుద్ధం చేస్తూ ఉన్నప్పుడు ఆపదని ఎదురుచూడని ఒక యోధుడిని చెట్టు వెనకాల నక్కి బాణంవేసి చంపటం రాజధర్మం కాదని మీరు కూడా ఒప్పుకుంటారు," అన్నాడు ప్రహస్తుడు దృఢంగా.

నరవానరుడు ఇబ్బందికి గురయాడు. అతను తనకే మనస్తత్వ శాస్త్రం బాగా తెలుసునని ప్రదర్శించటానికి ప్రయత్నిస్తే, నా ప్రధానమంత్రి చాలా చక్కగా దానిని ఖండించాడు. అప్పుడు వాడు మరొక ఉపాయాన్ని ప్రయోగించాడు. "ఇలా నన్ను తాళ్లతో బంధించి ఉంచితే, మీతో మాట్లాడటానికి ఇష్టపడను, రావణ మహారాజా! నాకు ఒక ఆసనం చూపించండి, ఈ కట్లు విప్పండి, అప్పుడు మీ ప్రశ్నలన్నిటికీ సమాధానాలు చెపుతాను."

"వీడిని తీసుకెళ్లి భూగృహంలోని చీకటికొట్టులో పడెయ్యండి. ఈ నల్ల వానరుడిమీద రుద్రకుడు తన ప్రతాపం చూపించటం మొదలుపెట్టాక అప్పుడు వీడు మాట్లాడతాడో లేదో చూద్దాం," అన్నాను, హనుమంతుడి కళ్లలోకి సూటిగా చూస్తూ ఆ కళ్లలో భయం తాలూకు ఛాయలకోసం వెతికాను. కానీ నాకు అలాటిదేమీ కనబడలేదు. వాడు ప్రశాంతంగా, చెక్కుచెదరకుండా ఉండిపోయాడు. నా భటులు వాడిని సమీపించి వాడి రెండు మోచేతులనీ పట్టుకున్నారు.

అప్పుడు నా తమ్ముడు విభీషణుడు మాట్లాడేందుకు లేచి నిలబడ్డాడు. నా చికాకుని అణచుకునేందుకు ప్రయత్నిస్తూ అతనివైపు

చూశాను. "ప్రభూ, ఒకసారి తను రాజదూతగా వచ్చాననీ, గూఢచారిని కాననీ ఎవరైనా ప్రకటించినప్పుడు, బుద్ధిపూర్వకంగా ఎటువంటి నేరమూ అతను చెయ్యనప్పుడు, అతనితో రాజదూతతో వ్యవహరించినట్టే ప్రవర్తించాలని మన నైతిక ధర్మాలు చెపుతున్నాయి," అన్నాడు.

"చిన్నాన్న గారూ!" మేఘనాదుడు తను ఉన్నది రాజసభ అనే విషయం మరిచిపోయి గట్టిగా అరిచాడు. "వీడు మన భటులిద్దరిని హత్య చేశాడు, మన ఉద్యానవనాన్నిధ్వంసం చేశాడు. వీడొక గూఢచారి, నేరస్థుడు, దానికి తగినవిధంగానే వీడితో వ్యవహరించాలి," అన్నాడు కోపంగా,

"ఆ భటులని చంపినది హనుమంతుడే అని చెప్పగల సాక్షులు ఎవరైనా ఉన్నారా? ఇతను అపరాధి అని నిరూపణ కానంతవరకూ, ఇతను నిర్దోషే. ఇతన్ని వదిలిపెట్టెయ్యమని నేను అడగటంలేదు. నా ఉద్దేశం, అనాగరికుడైన వానరుడి గురించి నిర్ణయించేటప్పుడు అసుర చక్రవర్తి ఔచిత్యాన్నీ రాజధర్మాన్నీపాటించలేదని ఎవరూ నిందించకూడదనే" చివరి వాక్యం ముగించేటప్పుడు విభీషణుడు నావైపు చూశాడు.

"ఈ గూఢచారితో ఎలా వ్యవహరించాలో చక్రవర్తె నిర్ణయించాలి అనేది నా సలహా," అన్నాడు ప్రహస్తుడు ఆసనంమీదనించి లేస్తూ.

'అసురులు! ఈ ప్రపంచంలోని ఏ ఒక్క విషయంలోనూ ఇద్దరు అసురులు ఏకాభిప్రాయానికి రాలేరు. ఎప్పుడూ కూడా వాదించుకుంటూ, తమ ఇష్టప్రకారమే పని జరగాలన్న మొండితనాన్ని ప్రదర్శిస్తారు, తెలివైన మూర్ఖుడిలా ఇద్దరినీ సంతృప్తి పరచాలని నిర్ణయించుకున్నాను. "ఇతని కట్ల విప్పండి. ఒక్క చేతులకీ, కాళ్లకీ ఉన్న కట్లని మాత్రం అలాగే ఉండనివ్వండి. ఏదైనా చెప్పాలనుకుంటే లేచి నిలబడి చెప్పమనండి. ఆ తరవాత ఇతని విషయం ఏం చెయ్యాలన్నది నిర్ణయిస్తాను."

"కానీ, నాన్నగారూ..." నేను మేఘనాదుడివైపు కళ్లెర్రచేసి చూసేసరికి అతను మౌనంగా ఉండిపోయాడు. ఒక భటుడు హనుమంతుడి శరీరాన్ని బంధించిన తాళ్లని విప్పాడు.

తాళ్లు తొలగించగానే, హనుమంతుడు ఇలా అన్నాడు, "నేను, హనుమంతుడిని, మారుతి తనయుడిని, కిష్కింధకి చెందినవాడిని, వానరరాజు సుగ్రీవుడి మంత్రిని, అయోధ్య రాజు శ్రీరామచంద్రుడి సేవకుడిని, శక్తిమంతుడైన రాజు, ఘనత వహించిన మహాప్రభువు, లంకేశ్వరుడికి ఒక సలహా ఇవ్వదలిచాను. ఈ సలహా ఇమ్మని నన్ను ఆదేశించినది నా ప్రభువు. ఆయన సతి, అయోధ్యరాణిని అన్యాయంగా అపహరించి, బంధించి ఉంచారు. నా ప్రభువు, తన రాణిని తనకి సగౌరవంగా తిరిగి అప్పగించమనీ, ఆయననుంచి క్షమాపణ కోరమనీ సందేశం పంపారు. ఈ విషయాన్ని నిర్లక్ష్యం చేసినట్టయితే, లంకమీదా, అసురులమీదా యుద్ధం ప్రకటించే అధికారం ఆయన నాకు ఇచ్చారు. అటువంటి పరిస్థితే వస్తే మేము అసురులని కాలరాస్తామనీ, మీ పాపకూపాల్లాంటి నగరాలని ధ్వంసం చేస్తామనీ, మా రాణిని మళ్లీ మాతో తీసుకుపోతామనీ వాగ్గానం చేస్తున్నాను."

సభలో కలకలం ప్రారంభమైంది. వందకత్తులు ఒరల్లోంచి బైటికి లాగిన శబ్దం వినవచ్చింది. మేఘనాదుడు తన కత్తిని అధిక ప్రసంగం చేసిన నరవానరుడి కంఠానికి ఆనించి నొక్కిపెట్టాడు. వీడు ఎన్నో రకాలుగా అవమానించాడు. ఈ వానరుడికి అసురుల చక్రవర్తి అయిన నా దగ్గరకి వచ్చి నన్నే సవాలు చేసేందుకు ఎంత ధైర్యం? ఇంకా పూర్తి నాగరికత సాధించని వానరులూ, తాగుబోతు వానరరాజూ తరపున వచ్చి ఇలాంటి మాటలు మాట్లాడటానికి వీడికి ఎన్ని గుండెలు? స్థిరనివాసం లేకుండా దేశదిమ్మరిలా వేటాడుతూ తిరిగే వాడి దూతగా వచ్చి ఈ ప్రపంచంలో ఇంతవరకూ ఎవరూ చూడనంత బలవంతుడైన చక్రవర్తిని సవాలు చేయగల ధైర్యం ఎలా వచ్చింది వీడికి? నా సభలో, నా వారందరి ఎదుటా నన్నే సవాలు చేసేంత సాహసమా?

"రాళ్లు వేసి కొట్టి చంపండి!" అని గర్జించాను. సభలో అందరూ

నాతో కలిసి గర్జించారు. నేను శిక్ష ప్రకటిసూ ఉంటే వాడు ఏ మాత్రం తొణక్కుండా, అక్కడే నిలబడ్డాడు.

"అన్నయ్యా, మనం కూడా ఇతనిద్వారా సందేశం పంపించటం తెలివైన పనేమో కదా? ఇతను దుస్సాహసంతో అవకతవకగా ప్రవర్తిస్తే లంక కూడా తగిన సమాధానం ఇస్తుందని ఇతని ప్రభువుకి కూడా తెలియచేద్దాం. ఇతన్ని ఊరికే చంపినంత మాత్రాన, మనం వాళ్లకి తగిన సమాధానం ఇవ్వటం సాధ్యం కాదు కదా! అనవసరంగా యుద్ధం పరిస్థితిని కూడా నివారించినవారం అవుతాం. పశుప్రాయుడైన తన తమ్ముడు, లక్ష్మణుడిని మనకి అప్పగించేవరకూ రాముడి భార్యని ఇక్కడే బందీగా ఉంచుతామని వీడిద్వారా సందేశం పంపుదాం. మన సోదరిపట్ల అతను అమానుషంగా ప్రవర్తించినందుకుగాను అతన్ని విచారించి సరైన దండన విధించవచ్చు."

'ఇతను చెప్పేది బాగానే ఉంది,' అనుకున్నాను విభీషణుడివైపు చూస్తూ, అయినా, ఆ వానరుడు నన్ను అవమానిసూ అన్ని మాటలు అన్నందుకు లోలోపల రగిలిపోతూనే ఉన్నాను.

ప్రహస్తుడు లేచి నిలబడి నావైపు చూసూ, "మహాప్రభూ, మనం తొందరపడి ఇతన్ని చంపటమో, వెనుకకు పంపటమో చేసే ముందు, ఈ మహాశయుడి దగ్గర్నుంచి కొంత సమాచారాన్ని రాబట్టాలి. శ్రీరామచంద్రుడి వద్దనుంచి వచ్చిన గౌరవనీయులైన ఈ దూతగారిని విచారించే మహత్కార్యాన్ని నాకు అప్పగించమని కోరుతున్నాను," అన్నాడు.

నేను చేతితో సైగ చేసి నా నిర్ణయాన్ని తెలియజేశాను. ఆ క్షణంలో నేను అన్నిటికన్నా ఎక్కువగా కోరుకున్నది, హనుమంతుడి మీద ప్రతీకారం తీర్చుకోవటమే. నా సభకి వచ్చి నన్నే అవమానించి ఫలితం అనుభవించకుండా వీడు తప్పించుకుని పోలేడు. మళ్లీ విభీషణుడే దీనినుంచి బైటపడే మార్గం కనుక్కున్నాడు.

"మనం వీడికి వాతలు పెడదాం," అన్నాడు విభీషణుడు క్లుప్తంగా,

ఎర్రగా కాలిన ఇనుముతోనో, నిప్పుతోనో వాతలు పెట్టటం యుగయుగాలుగా వాడుకలో ఉన్న అసురజాతి సంప్రదాయం. అది చాలా బాధాకరమైన, అవమానకరమైన శిక్ష ఆ వాతల తాలూకు మచ్చలు శాశ్వతంగా ఉండిపోతాయి. ఆ బాధనీ, అవమానాన్నీ శిక్షింపబడిన వ్యక్తి జీవితాంతం భరించవలసి ఉంటుంది. ఒక వ్యక్తి మీద పడిన ఆ వాత తాలూకు మచ్చ అతను గొప్పనేరం చేశాడని ప్రపంచమంతటికీ చాటుతుంది. ప్రపంచంలోని వారందరూ చూసి హేళన చేసేవిధంగా ఆ వ్యక్తి వైఫల్యమూ, అపరాధమూ ఆ మచ్చ ద్వారా తెలిసిపోతాయి. దాన్ని గురించి ఆలోచించినకొద్దీ ఆ ఆలోచన నాకు బావుందని అనిపించసాగింది. ఈ వానరుడు తన ప్రభువు దగ్గరకి రావణుడు పెట్టిన వాతతో వెళతాడు... మరి ఆ వాత వీడి ఒంటిమీద ఎక్కడ పెట్టించాలి... విశాలమైన ఛాతీమీదా... బిగుతుగా కండలు తిరిగిన పొట్టమీదా... లేక వెడల్పుగా ఉన్న వెన్నుమీదా?

"వీడి బటలు విప్పేసి తోకమీద వాత్ర పెటండి!"

"మహాప్రభూ, ఇటువంటి హీనమైన, అనాగరికమైన కార్యం చెయ్యవద్దని నా మనవి. ఇతన్ని ఒక గూఢచారిగా భావించి, ఆ విధంగానే ఇతనితో మనం వ్యవహరించాలి. ఇటువంటి నీచత్వానికి దిగజారకుండా ఉండటమే మంచిది." అన్నాడు ప్రహస్తుడు మళ్లీ నాకు చికాకు కలిగిస్తూ.

"వీడి తోకకి నిప్ప అట్టించి కాల్చెయ్యండి. వాడికి కూర్చున్నా, నిల్చున్నా, పడుకున్నా, నడుస్తున్నా ఆ యమబాధ తెలుస్తూనే ఉండాలి. అసుర చక్రవర్తిని అవమానిస్తే ఎంత బాధపడవలసి వస్తుందో వీడికి తెలిసేట్టు చెయ్యాలి," అన్నాను. నా సభికుల జయజయధ్వానాలు నాకు ఎక్కడలేని హాయినీ కలిగించాయి. ప్రహస్తుడు విచారంగా తల అడ్డంగా ఆడించటం చూసి కూడా నేను పట్టించుకోలేదు.

నా భటులు రుద్రకుడిని పిలుచుకు వచ్చేందుకు పరిగెత్తారు.

రక్షకభటుల నాయకుడు తన అనుచరులతో వచ్చిసభకి వంగి నమస్కరించాడు. హనుమంతుడు అలాగే చెక్కుచెదరకుండా నిలబడ్డాడు. వీడు చాలా ఘటికుడైన వానరుడే. నిమిషనిమిషానికీ నాకు కోపం పెరిగిపోసాగింది. రుద్రకుడి అనుచరులు కరిగిన సీసాన్ని వాతలు పెట్టేందుకు తయారుచెయ్యసాగారు. నిప్పు రాజుకుని మంట పెద్దది అయింది. ఇంతలో అనుకోనిది జరిగిపోయింది. కట్టుతాళ్ల గట్టిదనాన్ని లెక్కచెయ్యనంత సునాయాసంగా నరవానరుడు కాళ్లకి ఉన్న కట్లని తెంచుకుని మేఘనాదుడి చేతిలోని కత్తిని ఒక్క తన్ను తన్నాడు. ఒక్క క్షణం అందరూ నివ్వెరపోయారు. ఆ ఒక్కక్షణం ఆ వానర యోధుడు సరుకునేందుకు సరిపోయింది. వాడు తన చేతులని మంటల్లో దూర్చి చేతికున్న కట్లని కాల్చేశాడు. చేతులకి ఉన్న కట్లు విడిపోగానే కరిగిన సీసం ఉన్నపెద్దపాత్రని ఎత్తిదాన్ని నామీదికి విసిరివేశాడు. నేను కిందికి వంగాను, కానీ ఆ పాత్ర నా సింహాసనం వెనక ఉన్న పట్టతెరలకి వెళ్లి బలంగా గుద్దుకుంది. మరుక్షణం తెరలు అంటుకుని తగలబడసాగాయి. నా ఉన్నతాసనం మీదనించి ఆఖరిక్షణంలో నేను దూకెయ్యటంతో నా సింహాసనం మీద ఉన్న ఛత్రంలాంటి ఆచ్ఛాదన మంటలు అంటుకుని కింది పడిపోయింది. తరవాత నా సభాభవనం కాలిపోవటం మొదలెట్టింది. అందరూ గోలచేస్తూ అటూ ఇటూ పరిగెత్తసాగారు. హనుమంతుడు రుద్రకుడిని మంటలలోకి తోశాడు. దృఢంగా ఉన్న ఆ రక్షకభటుల అధికారి ప్రాణాలు కాపాడుకునేందుకు శాయశక్తులా ప్రయత్నించాడు. అతని అనుచరులు అతన్ని మంటలలోనించి బైటికిలాగి వాటిని ఆర్పేలోపల, హనుమంతుడు కొన్నిమండుతున్న కట్టెలతో భవనానికే నిప్పంటించాడు. భటులు బెదిరిపోయిన కుందేళ్లలాగ పరుగులు పెట్టారు. నా సింహాసనం కాస్తో కూస్తో కాలిపోకుండా మిగిలితే, దానిమీద కొందరు నీళ్లు పోశారు. ఈ గడబిడలో హనుమంతుడు రెండు చేతుల్లో మండుతున్న కర్రలు పట్టుకుని నగరంలోకి తప్పించుకు పోయాడు. అలా పారిపోతున్న నేరస్తుడి మీదికి బాకు విసరాలన్న అప్రమత్తత ప్రదర్శించింది ప్రహస్తుడు ఒక్కడే. కానీ అది హనుమంతుడి

చెవి పక్కనుంచి వెంట్రుకవాసి దూరంగా, సభా భవనం ద్వారానికి తగిలి ఖంగుమని చప్పుడు చేసింది. మేఘనాదుడు వేగంగా ఆ వానరుడి వెంటపడ్డాడు. కానీ కాలిపోయి కింద పడుతున్న దూలాలు అతని వేగాన్ని బాగా తగ్గించేశాయి.

నేను, ఉత్త పిరికిపందని, అలా వెంబడిస్తున్న మేఘనాదుడిని వెనక్కి వచ్చెయ్యమని పిలిచాను. ఆ వానరుడిని మేము ఎప్పుడైనా పట్టుకోవచ్చు, కానీ ప్రస్తుతం మా రాజభవనం కాలిపోతోంది. అదొక పీడకలలా తోచింది. అంతటా అలజడీ, భయమూ అలుముకున్నాయి. నేను అంతఃపురంలోకి పరిగెత్తాను, నా తమ్ముడూ, ఇతరులూ నా వెంటవచ్చారు. తన అనుచరులలో క్రమశిక్షణ మేలుకొలిపేందుకు ప్రయత్నిస్తూ రుద్రకుడు గట్టిగా అరిచాడు, కానీ భటులు అతని ఆదేశాలని పెడచెవిని పెట్టి, ప్రాణాలు అరచేత పట్టుకుని పరుగులు పెట్టారు. కాలుతున్న ఒక పెద్ద దూలం మాకు కొన్ని అడుగుల దూరంలో పడిపోయింది. వెంట్రుకవాసిలో ఆ ప్రమాదాన్ని తప్పించుకున్నాం. ఆ దూలం ప్రాణం ఉన్నట్టుగా బుసలు కొడుతూ చిటపటలాడసాగింది. దానినుంచి వస్తున్న వేడిని భరించ శక్యం కాలేదు. అంతటా దట్టమైన పొగకమ్ముకుంది. నేను కాలితో తన్ని ఒక కిటికీని తెరిచి బైటికి దూకి పన్నెండు అడుగులకింద ఉన్న రాతినేలమీద పడ్డాను. నా కాళ్ల చీలమండలలోంచి నొప్పి ఒళ్ళంతా పాకింది, అయినా నేను పరిగెత్తటం మానలేదు. నా అంతఃపురంలోనుంచి స్త్రీలు పెట్టే కేకలు వినబడ్డాయి. మంటలు నా సభని దాదాపు పూర్తిగా కాల్చి బూడిద చేసేశాయి. అవి పక్కనున్న భవనాలకి పాకసాగాయి. నా కల్లెదుటే నా నగరం కాలిపోసాగింది. నారింజరంగు జ్వాలలు గడ్డికప్పిన పైకప్పులని పూర్తిగా కాల్చేశాయి. వెయ్యి గొంతుకలు పెట్టే కేకలూ, మృత్యువుకి చిక్కి విలవిలలాడుతూ అరిచే అరుపులూ మిన్నంటాయి. జనం ఇళ్లలోంచి బైటికి పరిగెత్తారు. కొందరు ధైర్యవంతులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు, కానీ వాళ్ల ప్రయత్నాలు ఫలితాలని ఇవ్వలేదు. మాంసం కాలుతున్న కమురు వాసనా, కర్రలూ, దుస్తులూ కాలుతున్న వాసనా

గాలిలో నిండిపోయింది. గుర్రాలు అశ్వశాలలనుంచి దౌడు తీశాయి, వీధుల్లో వెర్రిగా అటూ ఇటూ పరిగెత్తసాగాయి. పరిగెత్తే వాటి కాళ్లకిందపడి కొందరు నలిగిపోయారు.

నేను అంతఃపురంవైపు పరిగెత్తాను. నా భార్యా, కుమారులూ అక్కడ ఉన్నారు. వాళ్లని నేను కాపాడాలి. కానీ ఆ పరుగుపందెంలో మంటలే గెలిచాయి. భవనం పైకప్పమీద అంతటా మంటలు లేచాయి. ఆదేశాలు ఇచ్చి ఇచ్చి నా గొంతు బొంగురు పోయిందే తప్ప, వాటిని వినేవారెవరూ లేరు. 'నా భటులు ఏమయారు? నా సైన్యం ఎక్కడుంది? నా మంత్రులెక్కడ?' నేను అసహాయుడిలా, నా రాజభవనం కాలిపోవటం చూస్తూ నిలబడ్డాను.

అప్పుడు చూశాను మంటలు లేస్తున్న అంతఃపురంవైపు ఏమాత్రం లక్ష్యం లేకుండా పరిగెత్తుతున్న ఆ పెద్ద నల్లటి ఆకారాన్ని. ఆ పిచ్చివాడిని ఆగమని అరిచాను, కానీ ఎగసిపడుతున్న మంటల్లోకి దూకి వాడు మయామయాడు. ఆ సాహసాన్ని చూసి నేను మ్రాన్పడి ఉండిపోయాను. 'బహుశా వీడికి మతిస్థిమితం లేదేమో!' ఈలోపల ప్రహస్తుడితోసహా నా మంత్రులలో కొందరు నా దగ్గరకొచ్చారు. కానీ నాకు వాళ్లతో ఏమైనా చెప్పే ధైర్యంలేకపోయింది. రుద్రకుడు కొందరు భటులని కూడగట్టుకుని మంటలని ఎలాగో ఒకలాగ ఆర్చటానికి ప్రయత్నించసాగాడు. భవనంలో కొంతభాగం పూర్తిగా కాలిపోయింది. కానీ కనీసం తూర్పువైపు భాగంలో మంటలు అదుపు చెయ్యబడుతున్నట్టు కనిపించింది. కానీ ఆ మంటలు నా అంతఃపురాన్ని పూర్తిగా ధ్వంసం చేసేశాయి. నా కుటుంబం పరిస్థితి గురించి ఆలోచించకుండా ఉండేందుకు ప్రయత్నించాను.

ఆ మంటలని ఆర్పేందుకు దాదాపు అరవై ఏనుగులని తీసుకువచ్చారు. ఇంతలో అంతఃపురంలోకి మాయమైన ఆ పెద్ద ఆకారం మొదటి అంతస్తు గవాక్షంలోనుంచి కిందికి దూకి, మంటలని తప్పించుకుంటూ బైట ఉన్న పచ్చగడ్డి మీదికి దొర్లుకుంటూ పడిపోయింది. ఆ వ్యక్తి తన వీపుమీద నా రాణి, మండోదరిని మోస్తూ

ఉండటం చూశాను. మేము అతనివైపు పరిగెత్తాం. కాస్త దగ్గరకి వెళ్లాక వాడిని గుర్తుపట్టి ఉలిక్కిపడ్డాను. వాడు ఇంకెవరో కాదు, నా అక్రమ సంతానం, అతికాయుడు. వాడు మూర్ఛపోయిన మండోదరిని స్పృహలోకి తీసుకువచ్చేందుకు ప్రయాస పడుతున్నాడు. వాడి చేతులు బాగా కాలిపోయి ఉండటం గమనించాను. కానీ నేను ఏమైనా అనేలోపల అతికాయుడు మళ్లీ భగభగ మండుతున్న భవనంలోకి పరిగెత్తాడు.

ఈసారి భటులందరూ వాడిని అనుసరించారు. మంటల ఉధృతి తగ్గింది కానీ ఇంకా పరిస్థితి ప్రమాదకరంగానే ఉంది. భవనంలోపలి మంటలు కొద్దిగా అదుపులోకి వచ్చాయి, కానీ బైట మాత్రం ఇంకా లేసూనే ఉన్నాయి. నా మనసులో ఏమూలో మేఘనాదుడూ, జంబుమాలీ భవనం వదిలి నగరంలో రాజుకున్న మంటలని ఆర్పే ప్రయత్నాలని పర్యవేక్షించేందుకు వెళ్లారన్న విషయం గుర్తుండి పోయింది. ఇంత విధ్వంసం సృష్టించిన ఆ నరవానరుడిని వెతికేందుకు రుద్రకుడు మళ్లీ నడుంకట్టాడు. కానీ ప్రతీకారం, శిక్షా లాంటివి ఆలోచించే స్థితిని నేను దాటిపోయాను. హఠాత్తుగా జరిగిన ఈ భయంకరమైన సంఘటనలకి నేను చలించిపోయాను, నా మెదడు మొద్దుబారింది. నా భార్య గురించి తీవ్రమైన ఆందోళనకి గురయాను. భటులు అంతఃపురంనుంచి శరీరాలని బైటికి మోసుకుని వచ్చారు. కొందరు ప్రాణాలతో ఉన్నప్పటికీ వాళ్ల శరీరాలు బాగా కాలిపోయాయి, కొందరు స్పృహ కోల్పోయారు, ఇంకా కొందరి శరీరాలు గుర్తుపట్టేందుకు వీలు లేనంతగా మాడిపోయాయి.

నెమ్మదిగా నా భార్య కళ్లు తెరిచింది. నేను ఆమెని పొదివి పట్టుకున్నాను. నాకు కన్నీళ్లు ఆగలేదు. కానీ ఆమె నన్ను తోసివేసి లేచి నిలబడబోయింది. "అక్షయుడు, నా అక్షయుడు ఏడీ?" అంటూ గొణిగినట్టుగా అంది. నేను చుట్టూ చూశాను. నా చిన్న కుమారుడు, ఎనిమిదేళ్ల అక్షయ కుమారుడు ఎక్కడున్నాడు?- నేను లేచి నిలబడ్డాను కానీ ఏమి దుర్వార్త వినవలసి వస్తుందోనని భయపడ్డాను. నా భార్య

ముఖంలోకి చూసే ధైర్యం నాకు లేకపోయింది.

ప్రహస్తుడు వంగి నమస్కరించి భటులని పిలిచి రహస్యంగా ఏదో చెప్పాడు. వాళ్లు భవనంవైపు పరిగెత్తారు. కానీ అందరూ నాకేసి చూడకుండా ఉండేందుకు ప్రయత్నిస్తున్నారని గమనించాను. ధైర్యం కోల్పోవద్దని నాకు నేనే చెప్పుకున్నాను. శివుడు నా కుమారుడిని రక్షిస్తాడు. నిరాశని దగ్గరకి రానివ్వకుండా ఉండేందుకు ప్రయత్నించాను. 'ఇక్కడ వెతకండి, అటు వెళ్లి చూడండి,' అంటూ ఆదేశాలు ఇచ్చాను... అదంతా ఊరికే. ఏమీ లాభం లేదని నాకు తెలిసిపోయింది. కానీ ఏదో చెయ్యాలన్న ఆరాటం నాకు. నా వెనకాల ఎవరో గట్టిగా ఏడవటం వినిపించింది, కానీ వెనక్కి తిరిగి చూడటానికి నాకు భయం వేసింది. ఎవరో ఓదార్పుగా నా భుజంమీద చెయ్యివేశారు, కానీ అది నన్ను ఓదార్చలేకపోయింది. నాకు కోపంగా ఉంది. ఆ ఏడుపుకి అర్థం ఏమిటో, దానికి కారకుడు ఎవరో నాకు తెలుసు. కానీ అంతలోనే నా కోపం తగ్గిపోయి పాత చింకి బట్టలాగ కుప్పకూలిపోయాను. వెచ్చటి బూడిదతో నిండిన నేల నా ముఖానికి గట్టిగా కొట్టుకుంది. అలాగే ముఖంనుంచి రక్తం కారుతూ, దానిలో నా కన్నీళ్లు కలిసిపోతూ ఉంటే అక్కడేపడి ఉండిపోయాను. అడుగుల చప్పుడూ, గుసగుసగా మాట్లాడుకోవటం నాకు వినిపిస్తూనే ఉంది. నా అనుచరులు నా దగ్గరకి వచ్చేందుకు భయపడసాగారు. బహుశా నా దుఃఖాన్ని చూసి గౌరవంతో అలా చేశారేమో,

రావణుడి దుఃఖం అతనికే సొంతమైనది. లెక్కచెయ్యని ఈ క్రూరమైన ప్రపంచంలో దానిని నేనెందుకు పంచుకోవాలి? నా కుమారుడు, నా చిన్ని రాకుమారుడు, కోడిపిల్లలా సజీవంగా కాలిపోయాడు. లేదు, ఇప్పుడు నాకు వాడిని చూడాలని లేదు. చివరిసారి చూసినప్పుడు అందంగా చిరునవ్వు నవ్వుతున్న వాడి ముఖం తాలూకు జ్ఞాపకాలే మనసులో ఉండిపోనీ. వాడి అమాయకత్వం, ప్రాపంచిక విషయాలపట్ల కుతూహలం, వాడు అల్లిన అందాలూ-నాలాంటి అహంకారంతో నిండిన పశుప్రాయుడికి ఈ క్రూర

ప్రపంచాన్ని భరించే శక్తిని ఇచ్చాయి. నా దగ్గర్నించి ఇప్పుడు అవి దోచుకోబడ్డాయి. నేను తడబడుతూ లేచాను. మసకగా ఉన్న వెలుతురులో నా భార్య ఎవరినో కొట్టటం కనిపించింది. ఒంగి ఉన్న నల్లటి అతికాయుడి శరీరం నుంచి ఆమెని విడదీసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. "నన్ను మాత్రమే ఎందుకు కాపాడావు,... నామీద తన చిన్నచేతులు వేసి పడుకున్న నా చిన్ని కుమారుడిని ఎలా వదిలేశావు రా... పశువా...."

ఆక్రోశంతో ఆమె ఆ పర్వతకాయుడిని బలంకొద్దీ గుద్దటం మొదలుపెట్టింది. వాడు అలా నిలబడే ఉండిపోయాడు. వాడి తల సిగ్గుతోనూ, తప్ప చేశానన్న భావంతోనూ దించుకుపోయింది. లేక తన ప్రాణాలని సైతం లెక్కచెయ్యకుండా తను కాపాడిన ఆమె తనని ఇంత నిర్దయగా, అనుచితంగా కొడుతోందని వాడికి కోపం వస్తోందా? నాకు తెలీలేదు, అసలు అది నాకు అనవసరం అనుకున్నాను. కొంతసేపటి క్రితమే పసివాడిని పోగొట్టుకున్నాను. ఒకప్పుడు పచ్చదనంతో కళకళలాడిన నా భవనం ఆవరణలోకి నడిచాను. అక్కడ శవాలని వరసగా పేర్చారు. భయంకరమైన ఆకారాలు నాకోసం వేచిఉన్నాయి. వాటి పక్కనుంచి నడుస్తున్నప్పుడు ఒక చిన్నమూట కనిపించింది- నా కుమారుడి శవం.

భటులు గౌరవంగా వంగి నమస్కరించారు. వాళ్లు నా ముఖంమీద ఉమ్మివేసినా నాకేమీ అనిపించేది కాదు. కాలినకట్టెలా ఉన్న ఆ చిన్ని శరీరాన్ని ఎత్తుకున్నాను. నల్లగా కమిలిపోయిన ఆ ముఖం నన్ను గుర్తుపట్టి నవ్వుతున్నట్టు అనిపించింది. నాకు సంబంధించిన విషయాలన్నిటినీ నా కుమారుడు ఎగతాళి చేస్తున్నాడు... నా దురభిమానం, నా జీవితం, నా సాఫల్యాలు, నా అహంకారం! నాకు ఆ విషయం తెలుసు. విధిమీదా, ఈ దుస్థితి కలిగించిన దేవుళ్ల మీదా నాకు కోపం వచ్చింది. నేను మోస్తున్న నా కుమారుడి శరీరాన్ని నా చేతుల్లోంచి తీసుకునేందుకు నా సేవకులు వచ్చారు, కానీ నేను ఇవ్వలేదు. ఇది నేను మోయవలసిన బరువు, దీన్ని నేనే మోస్తాను. ఈ లోటు దేనితో

పూరించగలను? నా రాజ్యం దీన్ని పూరించగలదా? ఒక సంతానాన్ని కాపాడేందుకు మరొక కుమారుడిని బలిచేశాను. నేను రక్షించవలసిన ప్రజలకి ఘోరమైన వినాశనాన్ని కలిగించాను.

ఇంతలో మృత్యువులాంటి నిశ్శబ్దం ఆవరించిన ఆ రాత్రిని ఛేదిస్తూ, నా కుమార్తె సీత క్రూరంగా నవ్వటం నాకు వినిపించింది. "రావణా! దుర్మార్గుడైన అసురా! నీకీ శాస్తి జరగవలసిందే. నువ్వూ నీ వాళ్ళూ అయోధ్య రాముడి చేతుల్లో ఘోరమైన చావు చస్తారు."

'నాకిది కావలసిందే అంటున్నావా తల్లీ! నాకిలా జరగవలసిందేనా? నీకోసం నీ చిన్న తమ్ముడిని బలిచేశాను. నాకు ఉన్నదంతా పోగొట్టుకున్నా నీ పక్షానే నిలబడతాను. ఒకసారి నిన్ను వదులుకున్నాను, మళ్లీ అలాటి పని ఎన్నడూ చెయ్యను. నీ వృద్ధుడైన తండ్రి రక్షణ నువ్వు కోల్పోయినపుడుగాని నీ భర్త ఎలాటివాడో నీకు అర్థమవదు. కానీ అయ్యో, తల్లీ, అప్పటికి చాలా ఆలస్యం అయిపోతుందమ్మా!'

ఇవన్నీ గొంతుచించుకుని సీతకి చెప్పాలనిపించింది కానీ నాలో శక్తి పూర్తిగా నశించింది. ఒంటరిగా అక్కడినించి నడిచాను. నా చిన్ని రాకుమారుడి శవాన్ని మోసుకుంటూ ఆ రాత్రి చీకట్లోకి వెళ్లిపోయాను. బహుశా అక్కడ నాకు కాస్త ఓదార్పు దొరుకుతుందేమో. నా కన్నీళ్లు తుడిచేందుకు ఎవరైనా ఉంటారేమో, చీకటి ఒడిలో తలపెట్టుకుని పడుకుంటాను. అలా నడుస్తూనే ఉన్నాను, మరణించిన నా పసివాడు ప్రశాంతంగా నా చేతుల్లో శాశ్వతంగా నిద్రపోతున్నాడు.

31. నా నగరం తగలబడిపోని

భద్రుడు

నగరం కాలిపోతోంది. రక్షకభటులందరూ ఎటో మాయమయారు. రక్షకభట నిలయం ముందుభాగానికి మంటలు అంటుకున్నాయి. నేను తప్పించుకునే మార్గం మూసుకుపోయింది. ఏ క్షణాన్నైనా మంటలు నా చీకటికొట్టుదాకా రావచ్చు. నేను ఉక్కిరిబిక్కిరి అవుతూ దగ్గసాగాను. దట్టమైన పొగ సుళ్లు తిరుగుతూ అంతటా కమ్ముకోసాగింది. నేను లోపల చిక్కుకుపోయాను. ఎగసిపడుతున్న మంటలలోనుంచి పరిగెత్తాలని ప్రయత్నించాను, కానీ ఆ అగ్నిగుండంలోనుంచి వస్తున్న తీవ్రమైన సెగని ఎదుర్కొనే ధైర్యం లేకపోయింది. ఊపిరి పీల్చటం కష్టమైపోయింది. ఏం చెయ్యాలో తోచలేదు, ఎన్నో ప్రమాదాలనుంచి ప్రాణాలతో బైటపడ్డాను, కానీ ఈసారి కచ్చితంగా అలా జరుగుతుందని చెప్పలేకపోయాను. నారింజరంగు మంట నాలుకలు ఆబగా వాటి దారికి అడ్డంవచ్చిన దానినల్లా మింగేస్తున్నాయి. పైకప్పులో కొంతభాగం కూలిపడింది. గదిలోపలికి నల్లటి ఆకాశం చొచ్చుకుని వచ్చింది. పొగ ఆ ఖాళీస్థలంలోనుంచి బైటికి పోసాగింది. కొద్దిగా ఊపిరి ఆడటం మొదలెట్టింది.

గోడమీదికి ఎక్కాలని ప్రయత్నించాను, కానీ ఎక్కడా పట్టుచిక్కకపోయేసరికి మళ్లీ వెల్లకిలా పడిపోయాను. ఎక్కి నిలబడేందుకు ఏదైనా దొరుకుతుందేమోనని వెతికాను. పైనుంచి పెద్దదూలం కాలిపోతూ విరిగి రక్షకభట నిలయం అధికారి బల్లమీద పడింది. బల్లని దాని కిందినించి పక్కకి లాగేందుకు ప్రయత్నించాను. చాలాసార్లు ప్రయాసపడి, నా బలాన్నంతా ఉపయోగించి ప్రమాదకరమైన ఆ పనిలో సాఫల్యం సాధించాను. దాన్ని బలంగా గోడ దగ్గరికి నెట్టాను. నా చేతులు కాలాయి కానీ ఆ మంట నాకు

ఎంతమాత్రం తెలీలేదు. అది తరవాత తెలుస్తుంది. నేను ఆ బల్లమీద ఎక్కి గోడ అవతలివైపుకి దూకి ప్రాణాలు అరచేత పట్టుకుని పరిగెత్తాను.

బైట అంతటా కోలాహలం, గడబిడ, ఇళ్ళూ దుకాణాలూ, వీధుల్లో ఉన్న ప్రతిదీ కాలిపోతోంది. దూరంగా ఉన్న రాజభవనం కాలిపోతూ కనిపించింది. నా ఇంటివైపు పరుగు లంకించుకున్నాను. జ్వాలలు పక్షపాతం లేకుండా, వ్యత్యాసం చూపకుండా, అందరినీ పొట్టన పెట్టుకున్నాయి. బ్రాహ్మలూ, అస్పృశ్యులు, బానిసలు, క్షురకులు, వర్తకులు, తాగుబోతులు, ధర్మనిష్ఠులు, భటులు, జూదరులు, వేశ్యలు, వృద్ధ స్త్రీలు, శిశువులు, సాధువులు, దుండగులు - అందరూ ప్రాణాలు పోగొట్టు కున్నారు. కాలే మాంసం కమురువాసన ఆకాశం నిండా అలుముకుంది. చాలామంది తొక్కిసలాటలో గాయపడి, కొసప్రాణాలతో ఉన్నారు. కొందరు మంటలని ఆర్చేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. ఇంకొందరు తమ ఆపలని కోల్పోయీూ, తమ దగ్గర ఉన్నదంతా కోల్పోయీూ విలపిస్తున్నారు. మృత్యువు కరాళ నృత్యం చేసిన, కాలిపోతున్న వీధిగుండా పరిగెత్తాను. నాకు ఒక పక్క భయం, మరోపక్క ఆకలీ వేస్తున్నాయి, అయినా అలా పరిగెత్తుతూనే ఉన్నాను. ఎందుకు అలా జరిగిందో ఎలా జరిగిందో తెలీదు కానీ ప్రధానవీధిని వదిలి, పూరిళ్లున్నవైపు తిరగగానే, అక్కడ మంటలవల్ల ఎక్కువ నష్టం జరగలేదని గ్రహించాను.

జనం బైటికి వచ్చి మంటలు తన నాలుకలు చాచి కబళిస్తున్న మా నగరంవైపు నోళ్లు వెళ్లబెట్టి చూస్తున్నారు. చాలామంది నన్ను ఆపాలని చూశారు, ఏం జరుగుతోందో అడగాలని ప్రయత్నించారు. నేను ఆగకుండా పరిగెత్తుతూనే ఉన్నాను. ముందు నా ఇంటికి చేరుకోవాలి, రాజులూ, వాళ్ల భవనాలూ, గూఢచారులూ, వాళ్లు ప్రాణాలతో ఆడే చెలగాటాలూ, వీటన్నిటినుంచీ పారి పోవాలని పరిగెత్తాను. నగరం కాలిపోనీ, స్త్రీ పురుషులు చనిపోనీ. నేను నా ఇంట్లో సురక్షితంగా ఉంటే చాలు. మా ఇల్లు ఉన్నవీధికి చేరుకునేసరికి నేను చూసినదంతా ఒక

పీడకలలా అనిపించింది. మా మురికి కాలవలో ఉండే పెద్దపెద్ద ఎలుకలని తరుముతూ పరిగెత్తే ఊరకుక్కలు చేసే చప్పుడు తప్ప అంతటా నిశ్శబ్దంగా ఉంది.

నేను ఇల్లు చేరుకుని, వీధి తలుపు ఓరగా వేసి ఉండటంచూసి ఉలిక్కిపడ్డాను. నెమ్మదిగా లోపలికి ప్రవేశించాను, ఆ పాత తలుపు తెరుస్తూంటే కిర్రుమని అది చేసిన చప్పుడు పట్టించుకోలేదు నేను. మసక వెలుగులో పడుకుని గురకపెడుతున్న నా భార్య ఆకారం నీడలా కనబడింది. తన నగరాన్ని కాల్చి బూడిద చేస్తున్న భయంకరమైన జ్వాలలగురించి ఎంతమాత్రం తెలీకుండా, హాయిగా నిద్రపోతోంది ఆమె. ఆమెని తిట్టుకుంటూ నా మంచం దగ్గరకి నడిచాను. మళ్లీ ఒకసారి ఉలిక్కి పడ్డాను. కాలిపోతున్న నగరంలోనుంచి వస్తున్న వెలుగు అక్కడ ఉన్న వ్యక్తిమీద పడటంలేదు. నేను నా బాకుకోసం వెతికాను, కానీ నా నడుముకున్న పట్టీలో అది కనబడలేదు. నేను భయంతో కొయ్యబారిపోయాను. "నాన్నా." అని ఆ గొంతు కంపిసూ పలికింది.

"ఎవరు?" నేనూ వణికాను.

"అతికాయుడిని..."

"ఏమయింది... ఒరే... మూర్ఖుడా! నువ్వు.... నువ్వు..." మంచంమీద లేచి కూర్చున్న ఆకారంవైపు నడిచాను. వాడు తన తలని రెండు చేతులతో పట్టుకుని, 'రాకుమారుడిని నేనే చంపాను... నేనే..."

"ఆఁ?!" ఏమిటి వీడు చేసినపని? ఈ తెలివితక్కువ దద్దమ్మ మేఘనాదుడిని హతమార్చాడా?

ఇప్పడేం జరగబోతోంది? నేను బెదిరిపోయాను. 'మొత్తం సైన్యం మమ్మల్ని వేటాడి పట్టుకుంటుందా?' నా భార్య నిద్రలేచి ఏదో వాగసాగింది. నేను ఆమె మీద అరిచేసరికి నోరు మూసుకుంది. అతికాయుడిని పట్టుకుని కుదిపి గట్టిగా లెంపకాయ కొట్టాను. "మూర్ఖుడా! నిద్ర లే! పిచ్చివాగుడు మాను. బుద్ధిలేని గాడిదా!"

ఆ తరవాత ఏం జరిగిందన్న విషయాన్ని వాడి దగ్గర్నించి కొద్దికొద్దిగా రాబట్టాను. చిన్న రాకుమారుడి మరణం విషయంలో ఈ మూర్ఖుడు, నా కొడుకు, ఎటువంటి పాత్రా వహించలేదని తెలిసి స్థిమితపడ్డాను. ఇంకా చెప్పాలంటే రాణిగారిని కాపాడింది వీడే... ఈ వీరుడే. అప్పుడు నాకు బాధ అనిపించింది. 'రాజు కానీ, అతని చుట్టూ ఉండే తెల్లతోలు పరివారం కానీ ఎవరూ మాలాంటి వారు చేసే సాహసకృత్యాలకి కృతజ్ఞత తెలపరు. మాలాంటి సామాన్యులు నిస్వార్థంగా చేసే పనులని ఏ కవులూ కొనియాడరు. అసలు కవులని మరిచిపోదాం. వాళ్లు ఎవరికి కావాలి?'

ఏవేవో ప్రేలాపనలు చేస్తున్న నా కొడుకుని నా భార్యకి అప్పజెప్పాను. బైట తూర్పు దిక్కున ఆకాశంలో ఎరుపురంగు కనిపించింది. అక్కడ ఉదయించే సూర్యుడి ఎరుపూ, పడమటి దిక్కున కాలిపోతున్న నగరం ఎరుపూ, అలసటతో ఒళ్లు విరుచుకున్నాను- అమాయకులైన శిశువులనీ, స్త్రీలనీ, పురుషులనీ హతమార్చి అందమైన భవనాన్ని తగలబెట్టి నరవానరుడు ఏం సాధించాడా అనుకుంటూ నదివైపు నడిచాను. శవవాహనం వెంట నడుస్తున్న జనం ముఖాలు నాకు కనిపించలేదు. కానీ వాళ్లు ఏడుస్తూ ఉండి ఉంటారని ఊహించాను. మొదటి చితికి నిప్పంటించినప్పుడు నాకేమీ సంబంధం లేనట్టు చూశాను. దట్టమైన పొగ ఆకాశంలోకి లేచింది. నగరం మీద లేస్తున్న పొగని చూసేందుకు ఇంటికెళ్లి వసారాలో కూర్చున్నాను.

32. శాంతి దూత

రావణుడు

నన్ను బైటకి వచ్చి నగరాన్ని ఒకసారి చూడమని ప్రహస్తుడే బలవంతపెట్టాడు. ఆ సమయంలో అతనిమీద నాకు కోపం వచ్చింది, అయినా అతను నన్ను వదల్లేదు. తన ప్రజలు ఎటువంటి బాధలకి గురయారో చూడటం రాజుగా నా కర్తవ్యం అనీ, ఆ బాధలని పోగొట్టేందుకు తగిన చర్యలు తీసుకోవటం నా బాధ్యత అనీ అన్నాడు. నేను అతనిమీద అరిచి, అతన్ని పదవిలోనుంచి తొలగిస్తాననీ, తల తీయించేస్తాననీ బెదిరించాను. కానీ అతను ఎంతమాత్రం బెదరకుండా, ఇంకేమీ జవాబు చెప్పకుండా, నా కర్తవ్యం నన్ను నిర్వర్తించమని పదేపదే అన్నాడు. చివరికి నేను అలిసిపోయి, అతన్ని శాపనార్ధాలు పెడుతూ, అంగీకరించాను.

నా ప్రజలు ఘోరమైన యాతనలకి గురి అయి ఉండటం కనిపించింది. సాధారణమైన దుస్తులు వేసుకుని, ఒక రాజులా కాకుండా, ప్రహస్తుడివెంట వెళ్లాను. నేను కూడా బాధితులలో ఒకడిగా మారాను. ఇళ్లు కాలిపోయి నేలమట్ట మయాయి. వీధులనిండా రకరకాల చింకిపాతలూ, కాలిపోయిన ఆసనాలూ, తల్పాలూ, గృహోపకరణాలూ - అక్కడక్కడా కుప్పలు కాలుతున్నాయి, చూసేందుకు అది మాంసమా అనే సందేహం కలుగుతోంది. ఎన్నో భవనాలు కూలిపోయాయి, విరిగి మసిబారిన గోడలు అడ్డదిడ్డంగా ఉన్నాయి. కొన్నిటికి క్రిటికీలూ, ద్వారబంధాలూ మాత్రమే ఉన్నాయి, పైకప్పులు లేవు. ఇంకొన్ని కట్టడాలు పూర్తిగా కాలిపోయి, బూడిదయాయి, కానీ అక్కడక్కడా స్తంభాలు మాత్రం నిలిచిఉన్నాయి. అవి తమ ఆపల చితిచుటూ విషాదంగా నిలబడ్డ బంధువుల్లా ఉన్నాయి. స్త్రీలూ, పురుషులూ వీధి మలుపుల్లో నిలబడి ఉన్నారు.

తాము అంతా కోల్పోయామన్న బాధ, అదీ హఠాత్తుగా జరిగిందన్న అవగాహన వాళ్ల జీవితాలని ధ్వంసం చేసేసింది. మందమైన ఇంటిగోడల వెనకనుంచి వెక్కిళ్లల్లా, శోకాలూ వినవచ్చాయి. ఆ ఇళ్లు ఏ క్షణాన్నైనా కూలిపోయేట్టు కనిపించాయి. సగం కాలిన జంతువుల కళేబరాలు అంతటా పడిఉన్నాయి. అది చూసి మనసు వికలమైపోయింది. ఆ దృశ్యాలనుంచీ, భయంకరమైన ఆ మానవ విషాదంనుంచీ పారిపోయి నా భవనంలోకి వెళ్లిపోవాలనిపించింది నాకు. దీనితో పోలిస్తే నేను నా చిన్న కుమారుడిని కోల్పోవటం చాలా చిన్న విషయంలా తోచింది.

కానీ నా కుమారుడు చనిపోయాడన్న విషయం మనసులో మొదలగానే దుఃఖం ఉప్పెనలా మంచుకొచ్చింది. నేను బతిమాలుతున్నట్టు ప్రహస్తుడివైపు చూశాను, కానీ అతని ముఖంలో నాకు కాఠిన్యం తప్ప ఇంకేమీ కనిపించలేదు. నాకు కన్నీళ్లు ఆగలేదు. ప్రహస్తుడిమీదా, నరవానరుడిమీదా, ఈ లోకం మీదా నన్నీ స్థితికి తీసుకువచ్చినందుకు కోపం వచ్చింది. కానీ నేను కొయ్యబారిపోయి కదల్లేకపోయాను. వీధినిండా మసి, నీళ్ళూ బురదా. అవి నా దుస్తులకీ, పాదరక్షలకీ అంటుకున్నాయి. మృత్యువు తాండవిస్తున్న ఈ వీధుల్లో వీస్తున్న గాలి కూడా చీదర కలిగిస్తోంది. దాన్ని భరించలేక నేను పొట్టని చేతో అదిమి పట్టుకుని వీధిలోనే వమనం చేసుకున్నాను. అప్పుడు ఒక వృద్ధ స్త్రీ నన్ను గుర్తు పట్టింది. తన ఇంట్లోనుంచి పరిగెత్తుకుంటూ వచ్చి కీచుగా అరిచింది. నేను ఖంగుతిని వాంతి చేసుకోవటం ఆపేశాను.

"ఒరే, రాక్షసుడా! నీ కామం, మోహం మమ్మల్ని ఏ స్థితికి తెచ్చిందో చూడు!? అంటూ అరిచింది. ప్రహస్తుడు ఆమెకి అడ్డం వెళ్లాడు, కానీ ఆమె అమితమైన బలంతో అతన్ని పక్కకి నెట్టేసింది. తన రొమ్ముల్నిబాదుకుంటూ, శోకాలు పెడుతూ, "ఎన్నో త్యాగాలు చేసి ఇద్దరు చక్కటి కొడుకులని పెంచి పెద్దచేశాను. వాళ్ల భార్యలూ, నా మనుమలూ అందరూ పోయారు. నీ కామజ్వాలలో కాలి బూడిద అయిపోయారు... దేవతలాంటి భార్య ఉండగా దేవతా స్త్రీలవెంట

పడవలసిన ఖర్మ నీకేమిటి? ఇప్పుడు చూడు ఆమె అసురులకి ఎలాంటి స్థితి కల్పించిందో!"

ఆమె చుట్టూ ఒక గుంపు ఏర్పడింది. కొందరు కోపంగా ఏదో అంటున్నారు, కొందరిపిడికిళ్లు బిగుసుకున్నాయి. నేను పాతుకుపోయినట్టు అక్కడే నిలబడిపోయాను. నన్ను నిలువునా నరికి చంపేస్తారని భయంవేసింది. నేను ఎలాంటి రాజుని? నామీద నాకే అసహ్యం వేసింది. లంక అన్నివైపులనుంచీ కాలిపోతోంది. నేను నిర్మించినదంతా, నావాళ్లు నిర్మించినదంతా, తమ కలలతో, ఆశయాలతో, తీవ్రమైన కాంక్షతో, కష్టపడి నిర్మించుకున్నవి అన్నీ నా చుట్టూ శిథిలాలుగా మారి నేలమట్టం అయిపోయాయి. ఒక రాజుగా నేను వైఫల్యం పొందాను. ఒక తుచ్ఛమైన వానరుడినుంచి నా ప్రజలని రక్షించుకోలేకపోయాను. ఒక తండ్రిగా నేను పరాజయం పొందాను. నా చిన్ని కుమారుడు సజీవంగా కాలిపోతుంటే కాపాడుకోలేక పోయాను. నేను పనికిమాలిన వాడిని. బైటికి వచ్చి నాలాగే నష్టపోయి, విషాదంలో కూరుకున్న వారి బాధని పంచుకోమని నాకు ప్రహస్తుడు చెప్పవలసి వచ్చింది. నా మోకాళ్లు జవజవలాడటంతో నేను నేలమీద కూలబడిపోయాను. వణికే చేతులతో కోపంగా ఉన్న ఆ వృద్ధ స్త్రీ పాదాలు తాకటానికి ప్రయత్నించాను.

"అమ్మా... నన్ను మన్నించు... నేను... నేను..." అది చూసి జనం ఆశ్చర్య పోయారు.

ప్రహస్తుడు నన్ను పట్టుకుని లేపాడు, కానీ ఆ స్త్రీ నా కాళ్లమీద పడింది. "నన్ను మన్నించండి, మహాప్రభూ! మీరు మా చక్రవర్తి. మీరు నా పాదాలమీద పడకూడదు," అంటూ ఆమె ఇక మాట్లాడలేక ఏడవసాగింది. నన్ను చీల్చి చెండాడేంత కోపంలో ఉన్న జనం అంతలోకే నన్ను అసలు పట్టించుకోకుండా అక్కడినించి నిష్క్రమించారు. నేను తడబడుతూ నడుస్తూ, నా ప్రధానమంత్రి భుజాలని ఆసరాగా చేసుకుని భవనంవైపు కదిలాను. వృద్ధుడైనప్పటికీ ఆయన భుజాలు దృఢంగా ఉన్నాయి.

"రావణుడికి జయము జయము!" అని ఎవరో అరిచారు. వెంటనే జనమంతా "హరహర మహాదేవ", "మా ప్రాణాలు పోయేదాకా మిమ్మల్నే అనుసరిస్తాం మహారాజా!" అంటూ గొంతులు కలిపారు. "దేవతలు నశించాలి..." అంటూ ఇంకెవరో గట్టిగా అరిచారు.

"అసురులని విజయంవైపు నడిపించండి... ఈ పాశవికమైన దాడికి మనం ప్రతీకారం తీర్చుకోవాలి ప్రభూ! ఒక్కొక్క ఇటుకనీ పేరుస్తూ మళ్లీ ఈ నగరాన్ని నిర్మించుకుందాం."

"హరహర మహాదేవ!" అని వంద గొంతులు ఏకగ్రీవంగా అరిచాయి. "శత్రువు నశించాలి, నరవానరులు నశించాలి!" అంటూ అందరూ ఎలుగెత్తి అరిచారు.

నా నరాల్లోకి శక్తి మళ్లీ ప్రవహించటం నాకు తెలిసింది. నా దుర్గం చేరుకుని పైకి ఎక్కసాగాను. నాకింక ప్రహస్తుడిని చూస్తే భయం వెయ్యలేదు. వీధులనిండా నా ప్రజలు కనిపించారు. ఆ జనంలో ఉత్సాహం విద్యుత్తులా ప్రవహిస్తోంది. వేలాది ఖడ్గాలు ఎండలో మెరవసాగాయి. నేను చేతులు ఊపేసరికి జనంలోనుంచి పెనుతుఫానులాంటి గర్జన వినవచ్చింది.

“పదండి, లంకని మళ్లీ నిర్మించుకుందాం!” అంటూ నేను అరవగానే

దానికి సమాధానంగా జనం మళ్లీ'హరహర మహాదేవ!" అని నినాదాలు చేశారు. 'శివుడి మీద ఆన! నరవానరులూ, దేవతలూ కలిసి మనమీద చేసిన ఈ పాశవిక దాడికి ప్రతీకారం తీర్చుకుంటాం," అన్నాను మళ్లీ,

"అవును, తప్పక తీర్చుకుంటాం!" అన్నారు జనం.

ప్రహస్తుడు చిరునవ్వు నవ్వుతూ నా పక్కనే నిలబడ్డాడు. నేను అతనితో రహస్యంగా, "మనం నగరాన్ని పునర్నిర్మించటం ప్రారంభిద్దాం," అన్నాను. అతను నాకు నమస్కరించి, ఎప్పటిలాగే నేర్పరిలా ఆ ఏర్పాట్ల చూసేందుకు వెళ్లిపోయాడు. ఎప్పుడూ హడావిడిగా తిరుగుతూ ఉండే మేధావి, యంత్ర నిపుణుడు అయిన మయుడు మా నగర కార్యనిర్వాహక మంత్రి. ఆయనకి పిలుపు వెళ్లగానే చిన్న పిల్లవాడికి తాయిలం ఇస్తామని పిలిస్తే పరిగెత్తుకుంటూ వచ్చినట్టు వెంటనే సంతోషంగా వచ్చేశాడు. నగరాలు పెరిగి అభివృద్ధిచెందటంవల్ల వాటి కార్యనిర్వహణ భారం చూసే విసుగు పుట్టించే పనిని ఆయనకి అప్పగించవలసి వచ్చింది. ఇప్పుడు కాలిపోయిన నగరాన్ని మళ్లీ నిర్మించే పనిని, దానికి మళ్లీ పూర్వపు వైభవాన్ని సమకూర్చే బాధ్యతని ఆయనకి అప్పగించాం. నా ఇద్దరు మంత్రులనీ సలహాలూ సంప్రదింపులూ చేసుకోమని అక్కడే వదిలి, నేను వెళ్లిపోయాను.

భవనంలో చిమ్మచీకటి నెలకొంది. నా కుమారుడు చనిపోవటం అన్న వాస్తవం, నా వ్యక్తిగతమైన దుఃఖం మళ్లీ నన్ను చుట్టుముట్టాయి. నా భవనం గుమ్మంలో అడుగుపెట్టగానే, జనం కేకలతో నేను మళ్లీ సమకూర్చుకున్న ఉత్సాహం, కొన్నివేలమంది 'ఓటమికి లొంగిపోము" అంటూ నాలో నింపిన స్ఫూర్తి, నన్ను విడిచి వెళ్లిపోయాయి. మృత్యువాతపడిన వారిని వదిలి ముందుకి కదిలే నగరం చేస్తున్న శబ్దాలు నా భవనానికి ఉన్న తెరలగుండా నా చెవికిసోకాయి. కానీ ఒంటరిగా నా వ్యక్తిగత విషాదం అనుభవిస్తూ కూర్చున్న నేను, కేవలం తన చిన్న కుమారుడిని కోల్పోయిన తండ్రిగా మాత్రమే మిగిలిపోయాను. నా ప్రజలకి నాపట్ల ఉన్న ప్రేమ కూడా నాకు చాలా

తుచ్ఛమైనదిలా కనిపించింది. చివరికి వీధిలో నాకు కనబడిన ఆ స్త్రీ దుఃఖంతో పోలిస్తే నా దుఃఖం కూడా! 'విలపిస్తున్న ఆ స్త్రీ పట్ల నాకు నిజంగా సానుభూతి కలిగిందా? లేక అది నన్ను చీల్చి చెండాడేందుకు మూగిన జనం కోపాన్ని తప్పించుకునేందుకు నేను చేసిన అసంకల్పిత చర్యా? ఎంతోమందిని నేను దుఃఖానికీ, మృత్యువుకీ ఎర చేశనా? కేవలం వ్యక్తిగత ఆశలని సంతృప్తి పరిచేందుకేనా నేను ఆపని చేసింది?' సందేహాలు నన్ను వదల్లేదు. నా మెదడు మొద్దుబారిపోయింది.

'నాకు నా ప్రజలమీద ప్రేమ ఉంది. ఏమీ లేకుండానే నేనింత పెద్ద సామ్రాజ్యాన్ని నిర్మించగలిగానా? అణచివేతకి గురై దెబ్బతిన్న జనానికి నేను మళ్లీ ఆత్మగౌరవాన్నీ ఆత్మాభిమానాన్నీ అందించలేదా? కానీ ఒకవేళ ఇవన్నీ స్వార్థబుద్ధితోనే తప్ప ఆదరాలతో సాధించి ఉండకపోతేనో?' నేను ఇలా ఎందుకు ఆలోచిస్తున్నాను? ప్రగతికి అన్నిటికన్నా ఎక్కువగా స్వార్థమూ, లోభమూ అనే రెండు స్తంభాలే ఆధారమని నేను వాటిని ప్రశంసించలేదా? మరి అయితే నాకెందుకు నన్ను చూస్తే ఇప్పుడు రోత కలుగుతోంది? తన ప్రజలని చీకటిలోకీ, నరకంలోకీ తీసుకువెళ్లిన మోసగాడిననీ, అబద్దాలకోరుననీ ఎందుకు అనిపిస్తోంది నాకు?

తలుపు కిర్రుమని తెరుచుకుంది. ఒక్క క్షణం నిశ్శబ్దం తరవాత తెరిచిన తలుపులోనుంచి వాలుగా పడుతున్న సూర్యుని వెలుగులో నా భార్య కనబడింది. నెమ్మదిగా ఆమె నా దగ్గరికి నడిచివచ్చి కూర్చుంది. ఆమెవైపు చూసే ధైర్యంలేక కదలకుండా ఉండిపోయాను. నా కళ్లు చెమ్మగిల్లి ఉన్నాయనీ, ఏమాత్రం కదిలినా కన్నీళ్లు కనురెప్పలని దాటి ప్రవహించటం మొదలుపెడతాయనీ నాకు తెలుసు. ఆమె నా భుజాలమీద చేతులు వేసింది. అంతే నా బుగ్గలమీదనుంచి కన్నీళ్లు ధారగా కారసాగాయి.

"నేను ఎప్పటికీ మీవెంటే ఉంటాను. సీతని ఆమె భర్త దగ్గర వదలద్దు. అతను ఆమెపట్ల ఎలా వ్యవహరిస్తాడో మనకి తెలీదు. ఏది ఏమైనా మనిద్దరం కలిసే ఫలితాన్ని ఎదుర్కొందాం. సీత మన కుమార్తె.

నాకు మీ బాధ అర్థం అవుతోంది, రావణా!"

నేను తల అడ్డంగా ఆడించాను. 'నా కుమార్తెకి నా రక్షణ అవసరం లేనప్పుడు, ఆమెకోసం అన్నిటినీ నేనెందుకు త్యాగం చెయ్యాలి?' అంతవరకూ సీతని అనాగరికుడైన ఆమె భర్తకి అప్పజెప్పటం గురించి నేను ఆలోచించలేదు. కానీ మండోదరి ఆ విషయం ప్రస్తావించేసరికి, సీతని ఆమె ఖర్మకి ఆమెని వదిలేసి, నా జీవితం కొనసాగించాలన్న ఆలోచన వచ్చింది. 'నా కుమార్తెని రక్షించాలన్న స్వార్థబుద్ధితో నా ప్రజలని నాశనం చేసే హక్కు నాకెక్కడిది?' ఎటువంటి లోటుపాటూ లేని వ్యక్తినో, పరిపూర్ణమైన రాజునో కాను, కానీ తమ పిల్లలనీ, తమ ఆత్మాభిమానాన్నీ పోగొట్టుకున్న తల్లుల శాపాలు నన్ను శాశ్వతంగా వెంటాడతాయి. ఇక చాలు! విభీషణుడిని పిలిచి, సీతని రాముడికి అప్పగించి రమ్మని చెపుతాను.

నా ఆలోచనలని పసిగట్టినట్టుగా, "వద్దు, రావణా! వద్దు! దేవతలు స్త్రీలతో ఎలా ప్రవర్తిస్తారో మనకి తెలుసు. ఇక ఇప్పుడు మనతో కొన్ని రోజులు నివసించింది కనుక ఆమె అపవిత్రురాలు అయిపోయిందని అంటారు. మనం ఇప్పటికే ఒక కుమారుడిని కోల్పోయాం," అంటూ గట్టిగా నా భుజాలని అదిమి, "ఇంకొక సంతానాన్ని మనం కోల్పోవద్దు," అంది.

"ప్రహస్తుడు మీకోసం సభలో వేచి ఉన్నారు, ప్రభూ!" అని ఒక భటుడు వచ్చి నాకు చెప్పాడు. నా భార్యవైపు చూడకుండా లేచి నిలబడ్డాను, వెళ్లి నా ముఖం కడుక్కుని వచ్చాను. ఆ చల్లటి నీళ్లతో కలిసిన నా కన్నీళ్లని స్వేచ్ఛగా కారిపోనిచ్చాను. అద్దంలోకి చూసుకుంటే ఒక వృద్ధుడు నావైపు చూస్తూ కనిపించాడు. అతనికి మాసిన గడ్డం, నెరిసిన జుటూ ఉన్నాయి. ఉబ్బినట్టున్న అతని కళ్ల చుట్టూ ఉన్న నలుపు, ముఖంమీది ముడతలూ, అతను బాగా దెబ్బతిన్నట్టు తెలియజేస్తున్నాయి. అతని యావనమంతా ఎక్కడికి పోయింది? దేవుళ్లని ఎదిరించిన రావణుడు ఏమయాడు? జీవితంలో ఏదేదో సాధిద్దామనీ, దానికోసం ఇతరుల మనోభావాలని పట్టించుకోనవసరం

లేదనీ అనుకున్న ఆ రాజు ఎక్కడున్నాడు? వరసగా యుద్ధాలు చేసి, నగరాలని మట్టపెట్టి, స్త్రీ పురుషులని హతమార్చి, ఈ ముత్యాలదీవి నుంచి నర్మదానది వరకూ తన సామ్రాజ్యాన్ని నెలకొల్పిన శూరుడైన యువకుడు ఏమయాడు? ఎంతో పేరు ప్రఖ్యాతులు గాంచిన బలిచక్రవర్తికన్నా ఎక్కువగా అసురులకి ఆత్మగౌరవాన్నీ పూర్వవైభవాన్నీ సంపాదించిపెట్టి న ఆ వ్యక్తి ఇప్పుడు ఎక్కడున్నాడు? ప్రకృతినీ, సంగీతాన్నీ కళలనీ, జీవితాన్నీ ప్రేమించే అతనిలోని కళాకారుడు ఏడీ? రావణుడు ఏడీ?

నా ప్రశ్నలకి సమాధానం ద్వారం దగ్గర నిలబడి ఉండటం చూశాను. అతను తల పైకెత్తి, గర్వంగా, పౌరుషంగా నిలబడి ఉన్నాడు. విజయం సాధించాలన్న తపన, జీవితంపట్ల ఆశా ఉన్న రావణుడు. యావనప్రభతో వెలిగిపోతున్న రావణుడు, లక్షలకొద్దీ కలలుకంటూ, జీవితంలోని అన్ని మంచి విషయాల గురించీ తహతహలాడే రావణుడు. అద్దంలో కనబడని రావణుడు, ద్వారం దగ్గర నిలబడి ఉన్నాడు. నన్ను మళ్లీ జీవితంపట్ల ఆశ పెంచుకోమని పిలుస్తున్నాడు. అతనే మేఘనాదుడు. "నాన్నగారూ, మంత్రులందరూ సమావేశమై మీకోసం ఎదురు చూస్తున్నారు," అన్నాడు మేఘనాదుడు. నేను వెనక్కి తిరిగి నా అంగవస్త్రాన్ని సరిచేసుకుని, మేఘనాదుడి భుజంమీద చెయ్యివేశాను. నేను ఇంకా అలా దుఃఖంలో కూరుకుపోయి బాధపడుతూ ఉండిపోలేను. రాజ్య పరిపాలన చెయ్యవలసిన బాధ్యత నామీద ఉంది.

నా కుమారుడి యావన స్ఫూర్తినుంచి శక్తిని గ్రహించి, కొద్దిగా అతనిమీద నా శరీరాన్ని ఆన్చి సభ వైపు నడిచాను. మళ్లీ నా జీవితాన్ని కొత్తగా ప్రారంభించబోతున్నాను. ఏడుస్తున్ననా భార్యని వదిలి గాలిలో తేలివస్తున్న శబ్దాలు వినసాగాను - అసురులు చేసే శబ్దాలు. నా ప్రియతమ పౌరులు, పాశవిక దాడిజరిగిన తరవాత తమ నగరాన్నీ జీవితాలనీ పునర్నిర్మాణం చేసుకోవటంలో మునిగి ఉన్నారు. మళ్లీ నాలో ఆశ చిగురించసాగింది. నా కుమారుడిని వదిలి ముందుకి నడిచి

సభలో ప్రవేశించాను. అక్కడి వ్యవహారాలు ప్రారంభించాను. మళ్లీ ఒకసారి మనసులో, ఈ భూ ప్రపంచంలోకెల్లా గొప్ప చక్రవర్తిగా, సార్వభౌముడిగా మారిపోయాను. నేనింకా ఎన్నో యుద్ధాలు జయించాల్సి ఉంది.

మేము యుద్ధతంత్రం గురించి చర్చిస్తూ కూర్చున్నాం. నా మనసులో వ్యక్తిగతమైన ప్రతీకారవాంఛ రగలసాగింది. నా కుమార్తె కోసం రాముడిని ప్రాణాలతో బంధించాలనీ, నా సోదరిపట్ల ఘోరంగా ప్రవర్తించినందుకు లక్ష్మణుడి గొంతు కొయ్యాలనీ, నా చేతులతో హనుమంతుడిని తుదముట్టించాలనీ ఉన్నప్పటికీ, అన్నీ పద్ధతి ప్రకారమే చెయ్యవలసిన పరిస్థితి ఉంది. అంతులేని యుద్ధతంత్రాలని గురించీ, వ్యూహాలని గురించీ మాట్లాడుతూ ఉండేసరికి నాకు ఓర్పు నశించింది. అలాంటి భావమే నాకు మేఘనాదుడిలో కూడా కనిపించింది. అలాంటి స్థితిలో కూడా విభీషణుడు చివరిసారి శాంతికోసం ఏదైనా చేస్తే బావుంటుందని సలహా ఇచ్చాడు. తనే స్వయంగా ఆంతరంగిక దూతగా వెళ్లి రాముడితో మాట్లాడి ఒప్పిస్తానని అన్నాడు. శాంతి వార్తలకి లంకా రాకుమారుడు ఆ అనాగరికుల దగ్గరకి వెళ్లటం ప్రమాదకరమని ప్రహస్తుడు అభిప్రాయపడ్డాడు. అతన్ని వాళ్లు బంధించి, సీతని అప్పగిస్తే కానీ అతన్ని విడిచిపెట్టమని అనవచ్చని అన్నాడు. చివరికి విభీషణుడు పెద్ద సైన్యంతో వెళ్లాలనీ, వరుణుడు సముద్ర ప్రయాణంలో అతన్ని రక్షిస్తాడనీ నిర్ణయించారు.

రాముడు లొంగి రాకపోతే, అవసరమైతే తను బలాల సాయంతో రాముడిని బంధించి తీసుకువస్తానని విభీషణుడు మాట కూడా ఇచ్చాడు. ప్రహస్తుడు మాత్రం అలా చెయ్యటానికి ఎంతమాత్రం సుముఖత చూపలేదు, "మనం త్వరగా కదిలి, రాముడి చిన్న సేనని అంతం చెయ్యాలి, మనం హఠాత్తుగా, మెరుపుదాడి లాంటిది చెయ్యాలి. ఇక్కడ సామాన్యంగా పాటించే యుద్ధనీతి పనికిరాదు. ఎందుకంటే ముందు దాడిచేసినది వాళ్లు, మొదట అసుర రాజకుమారికి అంగవైకల్యం కలిగించారు. ఆ తరవాత అసుర

సామ్రాజ్యంలో భీభత్సం సృష్టించి అలజడి రేకెత్తించారు," అన్నాడు. విభీషణుడు ఏకీభవించలేదు. నేను అలిసిపోయాను, చివరకి విభీషణుడిని ఆంతరంగిక దూతగా వెళ్లమని అన్నాను, అవసరమైతే సాయం చేసేందుకు సిద్ధంగా ఉండమని వరుణుడికి కూడా చెప్పాను.

ప్రహస్తుడికి చాలా కోపం వచ్చింది, మండిపడ్డాడు. కానీ నేను ఒకసారి నిర్ణయం తీసుకున్నాక, విభీషణుడి వెంట వెళ్లేందుకు మంచి శిక్షణ పొందిన సైనిక దళాలని సమకూర్చే ఏర్పాట్లు చూడటం ప్రారంభించాడు. అలసటమూలాన సభ సమాప్తం చేసి నా మందిరానికి తిరిగి వెళ్లాను. నా కుమారుడికి అంత్యక్రియలు జరిపి కొన్ని గంటలే అయింది. తీవ్రమైన అలసటతో నిద్రముంచుకు వచ్చింది.

33. కమ్ముకుంటున్న యుద్ధ మేఘాలు

భద్రుడు

ఆక్రమణ ప్రారంభమైంది. అంగడివీధిలో నుంచి నిత్యావసర వస్తువులు మాయ మయాయి. ధరలు ఆకాశాన్నంటాయి. చెడ్డరోజులు వచ్చాయి. కానీ నాలాంటి వాళ్లం, కాయలుకాచిన మోటు చేతులూ, మోటు దుస్తులూ ఉన్నవాళ్లు - ఎవరికీ కనిపించక, లెక్కలోకి రాక మౌనంగా కాలం గడపసాగాం. మంచి రోజుల్లో కూడా కష్టాలు పడ్డవాళ్లం మేము. చెడు రోజులు వచ్చినప్పుడు తిండిలేక మలమలమాడి చనిపోయాం. రాబోయే యుద్ధంగురించి రహస్యంగా చర్చించుకునేవాళ్లం. ఈ తరం వాళ్లు యుద్ధాలు కాదు కదా, చిన్న చిన్న పోరాటాలని కూడా ఎరగరు. కొందరు మేఘనాదుడి వెంట ఉత్తరదిశగా దండయాత్రలకి వెళ్లినమాట నిజమే, కానీ ఆ యుద్ధాలు పరాయివాళ్ల ప్రాంతాల్లో జరిగాయి. చనిపోయిన వాళ్లూ బలాత్కారానికీ, దోపిడీకీ గురైన వాళూ అందరూ మాలాంటి వాళ్లే, ఇతర ప్రాంతాల్లో ఉండే తిండికి కూడా గతిలేని పేదవారు, ఇంకొక జాతివారు, వారి చర్మం రంగు కూడా వేరు. కానీ ఈసారి యుద్ధం మా గుమ్మంలోనే జరగబోతోంది. గాలిలో భయం చలికాలపు దట్టమైన మంచులా ఎంతకీ విడటం లేదు.

మా రాజు మూర్ఖుడు. లేకపోతే మమ్మల్ని పరిపాలించే వ్యక్తి ఇంత మూర్ధంగా ఎలా ప్రవర్తించగలడు? దారినపోయే ఏ సామాన్యుడినైనా అడగండి, రాకుమారుడు విభీషణుడు ఎంత వంచకుడో, ఎంత ధూర్తుడో చెపుతాడు. తెలివితక్కువ వాడూ, సులభంగా ఇతరులని నమ్మగల అమాయకుడూ కాబట్టే రావణుడివంటి రాజు ఈ కార్యభారాన్ని విభీషణుడికీ, వరుణుడికీ అప్పజెప్పాడు. కొన్ని రోజుల క్రితమే పెద్ద ఎత్తున ఉత్సవం జరుపుకుని జనం విభీషణుడిని సాగనంపారు. సముద్రతీరాన అసుర ధ్వజాలు పట్టుకుని కొన్ని

వేలమంది సమావేశమయారు. నలభై రెండు యుద్ధనౌకలనిండా మొత్తం నౌకాదళాలూ, మూడు వంతుల అసురసైన్యమూ, రాముడిని బంధించి అతని వానరసేనని మట్టపెట్టేందుకు తరలి వెళ్ళాయి.

శాంతి వార్తలు కేవలం ఒక కపటోపాయమేనని అందరికీ తెలుసు. ఒక పక్షం రోజుల్లో రాముడిని గొలుసులతో బంధించి ఆ నౌకల్లో ఎక్కించి లంకకి తీసుకువస్తారని ఎదురుచూస్తూ ఉన్నాం. కానీ ఇరవై రోజులు గడిచిపోయిన తరవాత కూడా, అసుర నౌకాదళం దగ్గర్నించిగాని, సైన్యం దగ్గర్నించిగాని ఎటు వంటి సమాచారమూ అందలేదు. రకరకాల వదంతులు వేగంగా వినవచ్చాయి. మహాబలిపురం వద్ద సముద్రతీరాన శివాలయం దగ్గర నరవానరులు అసుర సేనలని మట్టి కరిపించారని అందరూ చెప్పుకోసాగారు. నాలాంటి గడుసువాళ్లు మాత్రం విభీషణుడు శత్రుపక్షంతో చేరిపోయాడని ఖాయం చేసుకున్నారు. ఆ తరవాత రాజభవనం నుంచి ప్రకటన వచ్చింది. మేము ఊహించినదే జరిగింది. దీవి నలుమూలలనుంచీ వినవచ్చిన వార్త విభీషణుడూ, వరుణుడూ శత్రువులతో చేరిపోయారన్నది. చక్రవర్తి తమ్ముడు ఏమాత్రం సంకోచం లేకుండా, రావణుడు సింహాసనాన్ని తనకి ఇచ్చెయ్యాలనీ, సీతని రాముడికి అప్పగించాలనీ సందేశం పంపాడు, వరుణుడు కూడా ఒక లేఖ పంపాడు. ఇకమీదట రావణుడు అసురులకి రారాజు కాడనీ, రాముడు విభీషణుడిని లంకకీ, అసురులకీ రాజుగా ప్రకటిసూ ఒక మహోత్సవం మహాబలిపురంలో జరిపాడనీ ఆ లేఖ సారాంశం. ఇద్దరు దుర్మార్గులూ కలిసి సంతకం చేసిన మరో లేఖలో, అసుర సైన్యంలోనూ, నౌకాదళం లోనూ ఉన్న ఎక్కువమంది సైనికులు దేవతలతో చేరిపోయారని ఉంది. రావణుడికి వేరే దారి లేకపోయింది. మరోసారి లంకని విధ్వంసంనుంచి కాపాడేందుకూ, అనవసరంగా రక్తపాతం అవకుండా ఆపేందుకూ రావణుడు తన సింహాసనాన్ని విభీషణుడికి మారుమాట్లాడకుండా ధారాదత్తం చేసెయ్యాలనీ, తన ప్రాణాలమీద ఏమాత్రం తీపి ఉన్నా కుటుంబ సమేతంగా హిమాలయాలకి వెళ్లిపోవాలనీ కూడా ఆ లేఖలో ఉంది. కానీ రావణుడు ప్రతి పౌరుడినీ

ఎదురుతిరగమన్నాడు, తమ రాజ్యాన్ని శత్రువులబారిన పడకుండా కాపాడమని ప్రోత్సహించాడు. లంకలోగాని, ప్రధాన భూభాగంలో గాని ప్రతి పౌరుడూ సమృద్ధిని సమానత్వాన్ని సాధించాడని కాదు, వర్ణ భేదమూ, కులవివక్షా ఉండనే ఉన్నాయి. జాతీ, వర్ణవివక్షక్రమక్రమంగా చొరబడుతున్నప్పుడు మేము కోపంతో రగిలిపోయిన మాట నిజమే, రావణుడి పరిపాలన తీరుచూసి విచారించినదీ వాస్తవమే, కానీ అసుర సమాజంలో ఇటు వంటివి చోటు చేసుకోవటానికి రావణుడే భాధ్యుడుకాడని మాకు తెలుసు. నిజానికి రావణుడూ, ప్రహస్తుడూ ఉత్తరదిక్కునుంచి కులస్పృహ అసురులలోకి చాపకింది నీరులా పాకటాన్ని అరికట్టే ప్రయత్నం చేశారు. విభీషణుడూ, అతని అనుచరులైన బ్రాహ్మణులూ ఈ వివక్షతో కూడిన పద్ధతులని దొంగతనంగా ప్రవేశ పెట్టేందుకు ప్రయత్నించినప్పటికీ, వాళ్లు పూర్తిగా సాఫల్యం సాధించలేకపోయారు. అదే విభీషణుడు ఇప్పుడు దేవతల రాజుతో చెయ్యికలిపి, రావణుడిని పదవీభ్రష్టుడిని చేస్తానని బెదిరిస్తున్నాడు. పూర్తి అధికారం విభీషణుడి చేతుల్లోకీ, బ్రాహ్మణుల చేతుల్లోకీ వెళ్లిపోతే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహిస్తేనే జనానికి వణుకు పుట్టుకొచ్చింది.

అసురులకీ దేవతలకీ మధ్య జరగబోయే అంతిమ యుద్ధానికి సన్నాహాలు ప్రారంభమయ్యాయి- రెండు నాగరికతల మధ్య జరిగే ఆఖరిపోరు ఇది. నిర్ణయాత్మకమైన ఈ యుద్ధంలో, అసురులు తమ ఒక చేతిని వెనక్కి కట్టుకుని పోరాడబోతున్నారు. మునుపు రావణుడు చేసిన దాడులన్నిటిలోనూ మేము పాల్గొన్నది, దోచుకున్న దానిలో వాటాకోసమేనని సామాన్యుడి ఉద్దేశం. ఇంద్రుడు తమ ప్రాంతంమీద దాడి చేసినప్పుడు పదిమంది రాజులు ఎదుర్కొన్నటువంటి ఆక్రమణ లాంటిదే చాలాకాలం తరవాత నిలదొక్కుకుని స్థిరపడ్డ అసుర సామ్రాజ్యం మళ్లీ ఎదుర్కోబోతోంది. ఒక జీవన విధానం, సమానత్వం, స్వేచ్ఛ అనేవాటికి ప్రాధాన్యం ఇచ్చే సంస్కృతి, భౌతిక సుఖాలకి విలువనిచ్చి జీవితాన్ని ఒక ఉత్సవంలా గడుపుకునే సంప్రదాయంగల

అసుర సమాజం మరొక సంస్కృతి తమమీద చెయ్యబోయే దాడిని ఎదుర్కొనేందుకు తనని త్రాను సిద్ధం చేసుకుంటోంది. చాలాకాలం క్రితమే ఇది రావణుడికీ రాముడికీ మధ్య జరిగే యుద్ధం అనే మాటని అధిగమించింది.

రావణుడికి సీతమీద కోరిక ఉందనీ, దానివల్లే అసురులకి ఇన్ని కష్టాలు సంభవించాయనీ అనుకున్న ప్రజలు మొదట్లో రావణుడిని ద్వేషించారు. కానీ సీత అసుర రాజకుమారి అనీ, తమ రాజుకి స్వయానా కుమార్తె అనీ విన్న తరవాత రాకుమారిని రాముడి దగ్గర వదలటం అనే ఆలోచనకే వాళ్లు భయపడసాగారు. కానీ నా పెంపుడు కొడుకు, అతికాయుడిపట్ల, వాడు తన రక్తం పంచుకుని పుట్టినవాడని తెలిసి కూడా రావణుడు ప్రవర్తించిన తీరుకి నేను అతన్ని ఎప్పటికీ క్షమించలేకపోయాను. కానీ సీత విషయంలో జరిగినట్టు కాకుండా, అతికాయుడిని మోసిన గర్భాశయం నల్లటి సేవకురాలిది, కులీనుడైన గొప్ప శాస్త్రవేత్త కుమార్తెది కాదు.

మంచికీ చెడుకీ జరగబోయే అంతిమ యుద్ధానికి అసురులు సన్నద్ధమయారు. రుద్రకుడు కాల్బలాలనీ, అశ్వదళాలనీ వీధులవెంట ఊరేగించాడు. జనం ఒత్తిడిలో ఉన్నట్టు కనిపించారు. సైనికులూ, రక్షకనిలయ అధికారులూ తీవ్రమైన కోపానికి గురై అకారణంగా అందరిమీదా అరవటం, చెయ్యి చేసుకోవటం మొదలెట్టారు. ఆ తరవాత కోట వెలుపల నివసించేవారూ, సముద్రతీరాన నివసించే జాలరులూ కోళ్లనీ, పశువులనీ వెంటపెట్టుకుని వచ్చారు. జనం వీధిపక్కన నివాసాలు ఏర్పాటుచేసుకోసాగారు. ఇంతలో రేవు దగ్గర ఉండే అసురుడు ఒకడు ఒక వార్త మోసుకువచ్చాడు - సముద్రంమీద నరవానరులు వారధి కడుతున్నారు. అది చాలా విచిత్రంగా, అద్భుతంగా, భయం గొలిపేట్టు తోచింది. కానీ కొద్దికొద్దిగా ఆ వారధి మా దీవివైపుకి రావటం మొదలుపెట్టింది. అలా ఆగకుండా అది దగ్గరవుతూ ఉంటే దాని తాలూకు భయంకూడా పెరగసాగింది. జనం గుడి గోపురాలమీదికీ, చెట్ల చిటారు కొమ్మలమీదికీ, ఎత్తుగా ఉన్న ఎటువంటి

ప్రదేశమైనా సరే, దానిమీదికీ ఎక్కి కంగారుగా మాట్లాడుకోవటం ప్రారంభించారు.

అసురుల సంప్రదాయాన్ని అనుసరించి యుద్ధ విద్యాకేంద్రాలు రాత్రికి రాత్రే సిద్ధమై పోయాయి. వీధులనిండా అసురులే, యువకులూ, వృద్ధులూ, పురుషులూ, స్త్రీలూ, కొందరు కత్తులనీ ఇంకొందరు విల్లులూ బాణాలనీ, బల్లేలనీ, రకరకాల ఆయుధాలనీ పట్టుకుని కనిపించారు. తన ప్రజలని ఆయుధాలు పట్టుకుని ఆక్రమణకారులతో పోరాడమని రావణుడు ప్రోత్సహించాడు. ఇంతకు మునుపు అసురులలో సామాన్య ప్రజలకి ప్రవేశంలేని ఆలయాలని తెరిచారు. అవన్నీ సైనిక శిబిరాలుగా మారిపోయాయి. సమాజంమీద బ్రాహ్మణుల ప్రభావానికి గురైన కులీనులు బలవంతంగా రుద్దిన వర్గీకరణా, విభేదాలూ, ఒక్కరోజులో మాయ మయాయి. ఎందుకంటే వారిలో అధికసంఖ్యాకులు రాముడి బలాలతో చేరేందుకు లంక వదిలి వెళ్లిపోయారు. పాతరోజుల్లోలాగ అసురులలో సమానత్వం అనే భావన మళ్లీ చోటుచేసుకుంది.

ఈ అంతిమ యుద్ధం రాజ్యంలోని పేదలూ, అణచివేతకి గురయినవారూ సమానత్వాన్ని సాధించే అవకాశం ఇంకా మిగిలి ఉందా లేదా అనే విషయాన్ని నిర్ధారణ చేస్తుంది. ఇది ఎంతమాత్రం దయలేని కులవ్యవస్థమీదా, అస్పృశ్యతమీదా చెయ్యబోయే యుద్ధం. అవమానించే బ్రాహ్మణీకానికి వ్యతిరేకంగా జరగబోయే యుద్ధం. ఆ విపరీతమైన ఆలోచనలకి నాకే నవ్వు వచ్చింది. బ్రాహ్మణీకానికి విరుద్ధంగా జరిగే ఈ పోరుకి నాయకత్వం వహిస్తున్న రాజు మనసులో తను బ్రాహ్మణుడికి పుట్టిన సంతానమని గర్విస్తాడు. అయినా మా పేద, నల్లని, దురదృష్టవంతులకి వేరే మార్గం ఏముంది? మా నల్లజాతిని పాలించిన రాజులూ, నాయకులూ అందరిలో రావణుడే ఉత్తముడు. అతనిలో ఎన్ని లోటుపాట్లు ఉన్నప్పటికీ, అతను దయామయుడు. ఇక రావణుడు కాకుంటే విభీషణుడు రాజ్యం ఏలుతాడు. అది ఊహించుకునేందుకే భయంకరంగా అనిపించింది.

మహాదేవుడు, శివుడు దుష్టులకి విజయం లభించనీయడని మేము

నమ్మాం. కానీ నా మనసులోతుల్లో ఏదో ఒక మూల, మేము దేవుడి దృష్టిలో కూడా తక్కువ వాళ్లమే అనే నమ్మకం ఉంది. ఎంతో సానుభూతిపరుడూ, సర్వశక్తిమంతుడూ అయిన శివుడు కూడా మా శరీరం రంగు చూసి ముఖం చిట్టిస్తాడనీ తెలుసు. బహుశా మేము జన్మించటమే తప్పుడు రంగు చర్మంతో జన్మించి ఉండాలి.

34. నా ప్రజల కోసం

రావణుడు

భవనంలో అంతటా చీకటి కమ్ముకుంది. తేమగా ఉన్న గాలి వింత శబ్దాలను మోసుకొస్తోంది. ఒక్క ఆకు కూడా కదలటం లేదు. ఈ వసారాలో కూర్చుని చాలాసేపటినుంచీ సముద్రంవైపు చూస్తున్నాను. ఓటమీ, మృత్యువూ కళ్ల ఎదురుగా నాకేసే చూస్తూ కనిపించాయి. చాలాకాలం క్రితమే వరుణుడిని ఉవ్వెత్తున లేస్తున్న సముద్రపు అలలోకి విసిరివెయ్యనందుకు నన్ను నేను తిట్టుకున్నాను. నా మెదడు మొద్దుబారిపోయింది. కన్నీళ్లతో, కడగండ్లతో, మృత్యువుతో పోరాడుతూ నేను నిర్మించుకున్న జీవితం ముక్కలు చెక్కలైపోవటం మొదలెట్టింది. కొన్ని గంటల క్రితమే భవనంలోని సేవకులు వెలిగించిన కాగడాలూ, దీపాలూ ప్రస్తుతం మినుకు మినుకుమంటూ ఆరిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. బైట ఉద్యానవనాల్లో అక్కడక్కడా దీపాలు ఇంకా వెలుగుతున్నాయి. ప్రాణాలు నిలుపుకునేందుకు అంతిమ పోరాటం చేస్తున్నట్టు ఉన్నాయి అవి.

కొన్ని గంటలుగా నా మనసులో ఎటువంటి ఆలోచనా లేకుండా శూన్యం చోటు చేసుకుంది. ఇంతలో కణతల దగ్గర చిన్న నొప్పిలా ప్రారంభమై అది తలనొప్పిగా మారినట్టు, కొన్ని భావాలు నెమ్మదిగా తలెత్తసాగాయి. 'నాకు నా కుమార్తెని చూడాలని అనిపించింది.' ఆ ఆలోచనని తుడిచెయ్యాలని ప్రయత్నించాను, కొంతసేపు అది మళ్లీ తలెత్తలేదు. కానీ కొద్దిసేపట్లోనే అది మళ్లీ నా మనసుని ఆక్రమించింది. నేను లేచి, నా కుమార్తె నివసిస్తున్న బ్రహ్మాండమైన అశోకవృక్షం వైపు కదిలాను. అక్కడ అంతా చీకటిగా ఉంది. భవనం కిటికీలలోనుంచి వస్తున్న వెలుతురు అక్కడి పొదలమీద పెద్దపెద్ద నీడలని పరుస్తూ ఉంటే, అవి భయంకరాకారంలో కనిపించాయి. నేను చెట్టుని సమీపిస్తూ

ఉంటే ఒక పక్షి పెద్ద చప్పుడుతో రెక్కలు టపటప కొట్టుకుంటూ ఎగిరిపోయింది. ఎలుకలు అటూ ఇటూ పరిగెత్తసాగాయి. ఒక గబ్బిలం నా తలకి మరీ దగ్గరగా వచ్చి ఎగిరింది, వెంటనే మరో దిశగా ఎగిరి చీకటిలో మాయమైంది.

ఆమె నిద్రపోతోంది. నిద్రపోతున్న ఇద్దరు అసుర స్త్రీ సైనికులకీ నేను అక్కడికి వచ్చినట్టే తెలీలేదు. 'ఇదన్నమాట సీతని వీళ్లు రక్షించే పద్ధతి!' అనుకున్నాను. నా చేతులు కంపించటం చూసి నన్ను నేను అసహ్యించుకున్నాను. ఆమెని తాకి, నేను చూడని ఆమె బాల్యంలోకి వెళ్లాలని అనిపించింది నాకు. నా చిన్నారి పాపాయి లేత వేళ్లని తాకాలనీ, ఒడిలోకి తీసుకుని లాలించాలనీ, ఆమె ఎదుగుతూ ఉంటే చూడాలనీ అనిపించింది. నల్లటి మబ్బులలోనుంచి చంద్రుడు తొంగిచూశాడు. ఒక వెన్నెల కిరణం అయిష్టంగా అశోకవృక్షం ఆకుల సందుల్లోంచి తొంగిచూసి నా కుమార్తె ముఖాన్ని వెలిగించింది. ఆ ముఖం అతిలోక సుందరంగా ఉంది. మసక వెన్నెల ఉద్యానవనంలోని చీకట్లతో దోబూచులాడింది. సన్నగా గాలివీచి ఆకులు గలగలలాడాయి. ఆమె నిద్రలో కదిలింది. ఆమె కళ్లలోనుంచి కారిన ఒక కన్నీటిబొట్టు అందమైన ముక్కుమీదికి జారి, ముక్కుకొనమీద నిలిచి, కింద పడిపోయింది. నా ప్రియమైన కుమార్తెని చూస్తూ ఉంటే నా మనసులో ప్రేమ ఉప్పొంగింది. ఆమె తన భర్త ప్రేమకోసం తహతహలాడుతోంది. తను ప్రేమించిన వ్యక్తినుంచి దూరంగా తీసుకువచ్చి ఈమెకి నేను అన్యాయం చేశానా? హఠాత్తుగా నాకు కోపం వచ్చింది. ఈమె తన తండ్రి ప్రేమని ఎందుకు తెలుసుకోలేదు? రాముడిలో ఏం చూసి నేను సంపాదించిన ఐశ్వర్యాన్నంతా మరిచిపోయింది? మరుక్షణం నాలోని కోపమంతా పోయి దానిస్థానే అసహాయత చోటుచేసుకుంది. ఈమెకినేను అన్యాయం చేశాను. నా అవసరం ఎంతో ఉన్న సమయంలో ఈమెని వదిలేశాను. సామ్రాజ్యాన్ని స్థాపించటంలో నిండా మునిగిపోయాను. సాఫల్యాన్ని సాధించాలన్న వెర్రి వ్యామోహంలోపడి, నా కుమార్తె బాల్యాన్ని చూడలేకపోయాను. ఇప్పుడు ఈమె తన భర్తని ప్రాణంకన్నా

మిన్నగా ప్రేమిస్తోంది, అలాంటి సమయంలో అతనికి దూరం చేశాను. ఆ పని చేసినందుకు నామీద నాకే రోత పుట్టింది. కానీ ఈమె ఒక విషయం అర్థం చేసుకోదెందుకని? ఈమె భర్త ఈమెని తిరిగి స్వీకరించడు. తన భార్యని అంతగా ప్రేమిస్తున్నందుకేనా అతను నా నగర ద్వారం దగ్గర నిలబడి వృద్ధుడనైన నన్ను తుదముట్టించి నాశనం చేస్తానని గర్జించాడు? ఏమో చెప్పలేం!

నా కుమార్తెని మళ్లీ కోల్పోవటం నాకు ఇష్టంలేదు. నా దగ్గర్నుంచి అతను ఈమెని తీసుకెళ్లటం నేను భరించలేను. ఒకసారి ఈమెని పోగొట్టుకున్నాను, మళ్లీ అలా జరగనివ్వను.

అసంకల్పితంగా ఆమెకి మెలకువ వచ్చింది. నేను అక్కడ నిలబడి ఉండటం, విచారం, అయోమయం నా ముఖంలో తాండవించటం చూసింది. ఆమెని ఇక్కడే, తన తలిదండ్రులతో, ఉండిపొమ్మని ఒప్పించాలని అనిపించింది నాకు. కానీ ఆమెవైపు రెండు అడుగులు వేసేసరికి ఆమె గట్టిగా అరిచింది. నిద్రలోంచి లేచినవాడిలా తడబడుతూ రెండు అడుగులు వెనక్కివేశాను. నామీద నాకే చికాకు వేసింది. ఆమె నన్ను దుర్భాషలాడుతూ, పిచ్చిదానిలా ఏడుస్తూ వచ్చి తనని కాపాడమని రాముడితో మొరపెట్టుకుంది. అసుర సైనిక స్త్రీలు ఉలిక్కిపడి లేచారు. వాళ్లకి ఏమీ అర్థం కాలేదు. కానీ వాళ్లు నన్ను చూసేలోపల, నేను నీడలోకి తప్పుకుని నా భవనానికి వెళ్లిపోయాను. నా శయన మందిరంలోకి ప్రవేశించాను. అక్కడ మంచంమీద మండోదరి కూర్చుని ఉండటం కనిపించింది. ఆమె ఎదుట పడటం నాకు సాధ్యం కాలేదు.

"ఎక్కడికెళ్లారు?" ఆమె గొంతులో విసుగు ధ్వనించిందా? నేను భుజాలు ఎగరేసి, ఆమెవైపు వీపుపెట్టి పడుకున్నాను. ప్రతిదానిమీదా కోపంతో రగిలిపోయాను. 'ఆమె నా జీవితంలోకి ఎందుకు వచ్చింది?' పక్కమీద కదిలాను, కానీ ఆలోచనలు మాత్రం నన్ను వదల్లేదు. ఇంతలో నా భుజంమీద వెచ్చని చెయ్యి పడింది. నేను నా భార్యవైపు తిరిగి ఆమెను ఆలింగనం చేసుకున్నాను.

అలా ఎన్ని గంటలు పడుకునే ఉన్నామో చెప్పలేను, కానీ నెమ్మదిగా ఆమెని నిద్ర తన ఒడిలోకి తీసుకుంది. తన పక్కమీదికి జరిగి నిద్రలోకి ఒరిగిపోయింది. కానీ నన్ను మాత్రం నిద్రాదేవత అంత సులభంగా కరుణించలేదు. కొన్ని లక్షల ఆలోచనలు వాటిలో చాలావరకు అర్థంలేనివే, మనసులో తలెత్తసాగాయి. అలసటో, ఓటమో తెలీని ఏదో భావం మనసులో జొరబడింది. అన్నిటినీ అంతమొందించాలని అనిపించింది. జీవితానికి అర్థం లేదనిపించింది. దేనికీ విలువ లేదని తోచింది. నేను అటూ ఇటూ పొర్లుతూ నిద్రలోకి జారుకున్నాను.

తూర్పు తెల్లవారే సమయానికి చెమటతో పూర్తిగా తడిసిపోయి, ఉలికిపాటుతో నిద్రలేచాను. మయుడి దగ్గర నేను జ్యోతిషం, ఖగోళశాస్త్రం నేరుస్తూ వచ్చాను. వయసు పెరిగినకొద్దీ నా అసహాయత ఈ అస్పష్టమైన శాస్త్రాలపట్ల నా ఆసక్తిని పెంచింది. ఏ విషయమైనా నన్ను ఆకట్టుకుంటే దాన్ని గురించి గంటలు గంటలు అధ్యయనం చేస్తూ గడిపేవాడిని. జీవితం అతి చిన్నది, నేర్చుకునేందుకు ఎంతో ఉంది. ఒక పుస్తకాన్ని సంహితని, రాయటం మొదలుపెట్టాను. అది జ్యోతిషం, శకునాలకి సంబంధించినది. బహుశా నా కుమార్తె గురించి నాకు వచ్చిన పీడకలలే దానికి ప్రేరణ అయి ఉండాలి. సీతని పొడవుగా, తెల్లగా ఉన్న పురుషులు ఈడ్చుకు పోయి అగ్నిగుండంలో పడవేస్తున్నట్టూ, రాముడు ఎత్తైన వేదికమీద దుఃఖిస్తూ కూర్చుని ఉన్నట్టూ, పక్కనే మరొక అగ్నిగుండం మండుతున్నట్టూ కలలు వచ్చేవి. నా కుమార్తెకి పట్టిన దుస్థితికన్నా కూడా మంటల్లో కాలిపోతున్న భయంకరమైన ముఖం నా నిద్రని చెదరగొట్టేది. గుండె దడదడలాడేది. ఆ ముఖం అసుర చక్రవర్తిది. అది శకునమా? జరగబోయేదానికి ముందుగా అందిన సూచనా?

జ్యోతిషం అనేది చాలా అస్పష్టమైన శాస్త్రం, నాకు శకునాల్లో నమ్మకం లేదు. నిద్రాదేవి మళ్లీ నన్ను తన గుండెలకి హత్తుకుంటుందని ఆశించాను, కానీ మనసుని కలతపెట్టే ఏవేవో దృశ్యరూపాలు నన్ను నిద్రపోనివ్వకుండా అలసట కలగజేశాయి. రెండుసార్లు నా సేవకులు నన్ను నిద్రలేపేందుకు వచ్చారు, కానీ నేను పట్టించుకోలేదు. నిండా

ముసుగుతన్ని భయంతో ముడుచుకుపోయిన చిన్నపిల్లవాడిలా వాళ్లు వస్తేనే భయపడసాగాను. చివరికి మండోదరి వచ్చి నన్ను కుదిపి లేపింది. ఆ ఉదయం చలి ఎక్కువగా ఉంది. ఆకాశంనిండా మబ్బులు కమ్ముకున్నాయి, ఎగసిపడుతున్న సముద్రంమీద కూడా చీకటి పరుచుకుంది.

"మహాప్రభూ, మంత్రుల సభ వేచి ఉంది," ప్రహస్తుడి గొంతు విని ఉలిక్కిపడ్డాను, అలసట నిండిన కళ్లతో అతనివైపు చూశాను.

నేను పూర్తిగా డస్సిపోయాను, దేన్ని చూసినా విసుగు కలగసాగిందితుచ్ఛమైన రాజకీయాలూ, అహంకారాలూ, జగడాలూ, కొట్లాటలూ, అంతులేని సమావేశాలూ, నా మెప్పుపొందేందుకు భట్రాజుల్లా నన్ను ప్రవేశించేవాళ్ళూ తాము ఎంత గొప్ప దేశభక్తులో తెలియజేసేందుకు ప్రయత్నించేవాళ్లూ, రాముడితో తప్పనిసరిగా నేను చెయ్యవలసిన యుద్ధం... నాకు జీవితంమీదే విరక్తి కలిగింది. ప్రహస్తుడిలాంటి వాళ్లు నా జీవితంలోనుంచి, నా ప్రపంచంలోనుంచి మాయమై పోవాలని కోరుకున్నాను. 'నేను రాజుని అవాలని అసలు ఎందుకు అనుకున్నాను?' ఇంకా సరళమైన జీవితాన్ని ఎంచుకోవలసింది. అందమైన పూర్ణానది తీరాన హాయిగా జీవితం సాగిపోయేది. చిన్నచిన్న కలలు కనవలసింది, అలాగే ఈ ప్రపంచంలోని ఎందరో లక్షలమంది సామాన్యుల్లాగ జీవించి చనిపోవలసింది. ఒక చిన్న పాక, నమ్మకస్తురాలైన భార్య, చక్కటి సంతానం, దున్నుకునేందుకు కాస్త భూమి, జీవితాన్ని ఆనందంగా గడిపేందుకు కావలసినంత తీరిక– కానీ అలాంటి కలలు కేవలం కలలే అని నాకు తెలుసు. ప్రహస్తుడు వెళ్లిపోయాక పరమశివుడి విగ్రహం కాళ్లదగ్గర సాష్టాంగపడి మనసారా నాకు ధైర్యాన్ని ప్రసాదించమని ప్రార్థించాను.

చివరికి నేను సభకి చేరుకునేసరికి మంత్రులందరూ దగ్గరగా కూడి వలయాకారంగా నిలబడి ఉండటం కనిపించింది. వాళ్లు చిన్నపిల్లల్లా భయం భక్తి లేనట్టు ఏమిటో మాట్లాడుతున్నారు. నేను సభలో ప్రవేశించగానే ఒక్కసారిగా అందరూ మాట్లాడటం ఆపి వారివారి

స్థానాల్లో వెళ్లి కూర్చున్నారు.

"శత్రువు మనకి అతి సమీపంలోకి వచ్చాడు. వరసగా నమ్మకద్రోహాలకి గురవుతున్నాం. నా ఈ చేతుల్లో పెరిగిన నా కుమారుడి లాంటి తమ్ముడు, విభీషణుడు శత్రువులతో కలిసిపోయాడు. పాములాంటి వరుణుడిని నమ్మి నా నౌకాదళాలని అప్పజెప్పాను, అతను నాకు ప్రాణస్నేహితుడని అనుకున్నాను. అతను నడమంత్రపు సిరిని పొందిన దేవజాతి వాడికి బానిస అయిపోయాడు. మన సైన్యంలో సగంమందీ, పూర్తి నౌకాదళం శత్రుపక్షంలో చేరిపోయింది. మన అసుర సామ్రాజ్యం, మన జాతి గొప్పదనం అంత అధ్వాన్నంగా ఉంది! దీనికోసం నేను నా రక్తాన్ని ధారపోశాను, నా వాళ్లనీ, నా కలలనీ, నా జీవితాన్నీ అర్పించాను," అన్నాను.

"మనం సుబేల పర్వతాలకి వెళ్లిపోవాలి. అక్కడి కోట ఎటువంటి శత్రువు దాడినైనా తట్టుకోగలదు. ఎన్నో నెలలపాటు సరిపోయే సరుకులు కూడా అక్కడ ఉన్నాయి. అక్కడే వేచి ఉండి శత్రువ అలసిపోయేట్టు చేద్దాం," అన్నాడు ప్రహస్తుడు జోక్యం చేసుకుంటూ.

ప్రహస్తుడు చెపుతున్న మాటలు మనసులో ఇంకేదాకా ఆగాను. మరుక్షణం నాకు కోపంవచ్చింది. "ఇద్దరు దేవతాజాతి పురుషులకీ, పనికిమాలిన నరవానర సైన్యానికీ భయపడి నేను పారిపోను. నేను అసుర చక్రవర్తిని. నేను వెళ్లి ఆ కొండల్లో దాక్కోను. శత్రువుని అణచివేస్తాను."

మంత్రులు వాళ్లలో వాళ్లు గొడవగా ఏదో మాట్లాడుకోసాగారు. ఆ తరవాత జంబుమాలి అతికష్టంమీద లేచి నిలబడి, "మహాప్రభూ! ఆ కొండలలో మళ్లీ వర్షాకాలం వచ్చేవరకూ ఉండగలిగితే రాముడి సైన్యాన్ని ఎగసిపడే సముద్రానికీ నగరానికీ మధ్య చిక్కుకునేట్టు చెయ్యగలుగుతాం. మనం హఠాత్తుగా మెరుపు దాడులు చేసి శత్రువుని బలహీనపరచగలుగుతాం," అన్నాడు.

"అంటే నా నగరాన్ని శత్రువులకి వదిలి వెళ్లమనా మీరు చెప్పేది?

మీరందరూ చరిత్ర నేర్చిన పాఠాలు మరిచిపోయి మూర్ఖుల్లా మాట్లాడుతున్నారు. ఎన్ని గొప్ప అసుర నగరాలని దోచుకుని, కాల్చి బూడిద చేశారు వాళ్లు, గతంలో మనం వాళ్ల నగరాలని ఎన్నిటిని అలా చేశాం? ఇంద్రుడి సంతతి మన అద్భుతమైన నగరాన్ని ఊరికే వదిలిపెడతారని అనుకుంటున్నారా?"

"కానీ మహాభ్రూ! ప్రస్తుతం మనం శక్తిహీనులం అయిపోయాం. మనం యుక్తులూ, వ్యూహాలూ పన్ని యుద్ధం చెయ్యవలసి ఉంటుంది. సుబేల పర్వతాలు అభేద్యమైనవి. వర్షాకాలం ఏ సమయాన్నైనా ప్రారంభం కావచ్చు. అప్పుడు సుబేల కోట ఎత్తైన గోడలు నరవానరులు కూడా ఎక్కలేకపోతారు. అంతేకాక వరుణుడి నౌకలో అగ్నిబాణాలు వేసేవారికి కూడా మనం అందుబాటులో లేకుండా పోవచ్చు?" అని ప్రహస్తుడు ఓర్పుతో నా సమాధానం కోసం ఎదురు చూశాడు.

ఆ సభాభవనంలో ఒత్తిడిని గమనించి కూడా నేనేమీ అనలేదు. నా ప్రధాన మంత్రి చెప్పింది నిజమే. సుబేల పర్వతాలని చేరుకుంటే రాముడిని శాశ్వతంగా దూరంగా ఉంచవచ్చు. అప్పుడు వరుణుడి సేనకి లంచం ఎరచూపి మాతో చేరమని అడగవచ్చు, గ్రీష్మ రుతువు రాగానే వాళ్లతో కలిసి రాముడి మీదికి దండెత్తి వెళ్లవచ్చు. నా పాలనాధికారి, ఖరుడు నా రాజ్యం ఉత్తరదిక్కు సరిహద్దుల దగ్గర, వెనకనుంచి రాముడిని చుట్టుముట్టేందుకు వేగంగా కదులుతున్నాడని నాకు తెలుసు. రాముడు శక్తిహీనుడు అవగానే వరుణుడు మళ్లీ మా పక్షాన పోరాడేందుకు మాతో వచ్చి కలుస్తాడనీ నాకు తెలుసు. కానీ తన అతిపెద్ద సేనతో మమ్మల్ని కలిసేందుకు రావటానికి అతనికి కొన్ని నెలల సమయం పడుతుంది. అంతవరకూ మేము నిలదొక్కుకుని ఉండగలమా? ఒకవేళ అలా ఉండగలిగినా నా నగరం, నా ప్రజలూ ఏమవుతారు? లేదు, రావణుడు పిరికిపందలా పారిపోడు. వ్యూహాలూ వద్దు ఏమీ వద్దు, ఇక్కడే ఉండి నా ప్రజలని కాపాడుకుంటాను.

హఠాత్తుగా వీధిలో పెద్ద కోలాహలం వినబడింది. ముందు అది సన్నగా ప్రారంభమై నెమ్మదిగా తారస్థాయికి చేరుకుంది. సభలోని

మంత్రులు భయపడుతూ తమ ఆసనాల్లోనుంచి లేచారు. ఏం జరుగుతోందో తెలుసుకోవాలన్న కుతూహలం నన్ను నిలవనివ్వలేదు. రాముడి సేన దాడి చేసిందా? సాధారణంగా ఉదయం పూట నా ప్రజలకి దర్శనం ఇచ్చేందుకూ, వాళ్ల కష్టాలు వినేందుకూ నేను ఎప్పుడూ వెళ్లి నిలబడే మండపంలోకి పరిగెత్తాను. కనుచూపుమేర వరకూ జనసమూహం రాజభవనంవైపు వస్తూ కనిపించింది. ప్రధానద్వారం దగ్గర ఉన్న ద్వారపాలకులు వాళ్లని ఆపేందుకు ఎంత ప్రయత్నించినా జనం ముందుకి తోసుకుంటూ వస్తూనే ఉన్నారు.

"శత్రువులు నశించాలి!" "హరహర మహాదేవ!" "రావణుడికి జయము జయము!" అంటూ ఆవేశంతో జనం చేసే నినాదాలు మిన్నుముట్టాయి. వాళ్ల చేతుల్లో పది అడుగుల పొడవు ఈటెల దగ్గర్నుంచీ, ఖడ్గాలూ, తోటలోవాడే పరికరాలూ, గునపాలూ, పారలూ, చివరికి వంటశాలల్లో కూరలు కోసే కత్తులూ లాంటి రకరకాల ఆయుధాలు ఉన్నాయి. ఢంకాలు ఆగకుండా, యుగయుగాలుగా అసురులు వాయిస్తున్న దరువులని మోగిస్తున్నాయి.

'ఈ నా ప్రజలని వదిలి కొండల్లో వెళ్లి దాక్కోవాలన్న ఆలోచన అసలు నాకెలా వచ్చింది?' నేను చేతులు ఊపేసరికి దానికి సమాధానంగా జనం ఎలుగెత్తి అరిచారు. జనాన్ని లోపలికి రానివ్వమని భటులకి సైగ చేశాను. 'వీళ్లని ఆపటానికి నేనెవర్ని?' జనం లోపలికి తోసుకొచ్చారు. చక్కగా పద్ధతి ప్రకార పెంచిన మొక్కలని తొక్కేశారు, కుండీల్లో పూల మొక్కలని కిందకి తోసేశారు. కొందరు ఆలగా కుర్రవాళ్లు జలాశయాల్లోకి దూకారు. భవనం ద్వారాలు నా ప్రజలకోసం తెరుచుకున్నాయి. నాకు సంతోషం వేసింది. నేను చేతులు పైకి ఎత్తేసరికి అకస్మాత్తుగా నిశ్శబ్దం ఆవరించింది. ఆ క్షణాన నేను దేవుడిని అయిపోయినట్టు అనిపించింది. అధికారం అనే చక్రవ్యూహంలో పడి నేను కోల్పోయిన సమ్మోహనశక్తి మళ్లీ నాకు లభించినట్టు తోచింది, నా ప్రజలతో మళ్లీ నేను మమేకం అయిన భావన కలిగింది. నా యౌవనాన్ని తిరిగి సంపాదించుకున్నాను.

"చాలాకాలం క్రితం, నాకు పదిహేడేళ్లు కూడా నిండని తరుణంలో, నేను మీకు ఒక వాగ్దానం చేశాను. స్త్రీలూ, పురుషులూ, అందరూ సమానత్వాన్ని సాధించే ఒక ప్రపంచాన్ని మీకు అందిస్తానని అన్నాను. మహాబలి కాలంనాటి స్వర్ణయుగాన్ని మీకు తిరిగి ఇస్తానని మాట ఇచ్చాను. మన పూర్వవైభవాన్ని తిరిగి సంపాదించుకోగలమని ఆశించాం. మన దగ్గర ఆశ తప్ప ఇంకేమీ లేకపోయింది. నా నాయకత్వం మీద మీకూ, మీ విశ్వాసపాత్రత మీద నాకూ నమ్మకం ఉండేది. మనమందరం కలిసికట్టుగా దేవతల సామ్రాజ్యాన్ని ఎదిరించాం. అసమానత్వం, అణచివేత, అర్థంలేని ఆచారాలకి వ్యతిరేకంగా కొద్దిమంది కలిసి పోరాటం సాగించాం. మీ చెమట, రక్తం ఓడ్చి ఈరోజు మనం చూస్తున్న ఈ రాజ్యాన్ని నిర్మించుకున్నాం. ఈ ముత్యాలదీవినుంచి వింధ్యపర్వతాల పాదాలదాకా, మన అసుర ధ్వజాన్ని ఆకాశంలో ఎగరేశాం. జనం సమృద్ధిని సాధించారు. అద్భుతమైన నగరాలని నిర్మించాం. విజ్ఞానశాస్త్రంలోనూ, కళలూ, సంస్కృతి రంగంలోనూ అంచెలంచెలుగా ప్రగతి సాధించాం. మన గొప్ప దేవాలయాలు శివుని కీర్తి పతాకా లయాయి. అసురుల శ్రమతో ధాన్యాగారాలు పొంగిపొర్లాయి. విద్యాలయాలు నిర్మించి ప్రతి ఒక్క అసురుడికీ అక్షరజ్ఞానం అందేటట్టు చూశాం. వైద్యశాలల్లో రోగులకి చికిత్స జరిగింది. వీధులూ, కాలువలూ నిర్మించాం. ప్రస్తుతం ఈ ప్రపంచంలోనే అన్నిటికన్నా ధనిక సామ్రాజ్యం మనదేనని మనం ఆత్మవిశ్వాసంతో ప్రకటించుకోగలం." అని నా మాటల ప్రభావాన్ని గమనించేందుకు ఆగాను.

అందరూ జయజయ ధ్వానాలు చేశారు. "అయినప్పటికీ ప్రగతిపథంలో ముందుకి పోయేటప్పుడు మనం కొన్ని పొరపాట్లు చేశాం. మన పూర్వీకులు, ఘనత వహించిన నాయకులు, ఎంతో శ్రమకోర్చి నడిచిన ధర్మమార్గాన్ని మనం అనుసరించలేక, దారితప్పాం. ఆలోచనల్లో స్వచ్ఛత కోల్పోయాం, జీవితంలోని సరళమైన అంశాలని మరిచాం. దేవతల లాగానే కొంతమందికి ప్రత్యేకమైన అధికారాలు

ఉంటాయని అనుకోవటం ప్రారంభించాం. ఆ ప్రత్యేక అధికారాలు నేర్పూ, నైపుణ్యాలమీదా, ప్రతిభమీదా ఆధారపడి ఉంటే బావుండేది. కానీ ఎంతో శక్తివంతమైన అసుర ఆయుధాల ధాటికి తట్టుకోలేక దేవతల నాగరికత మట్టి కరిచినప్పటికీ, దాని తాలూకు ప్రభావాలు నెమ్మదిగా మన మనసుల్లోకి ఇంకి వాటిని విషపూరితం చేశాయి. వాళ్లలాగే, మనం కూడా కొందరు జనులకి దైవత్వాన్ని ఆపాదించసాగాం. కొందరు పవిత్రులనీ, ఇతరులు కారనీ, దానికి కారణం వాళ్ల చర్యలో, ఆలోచనలోకాక, వాళ్ల జన్మే కారణమనీ అనుకోవటం ప్రారంభించాం. మీ నాయకుడిగా కులం అనే దుష్టశక్తి తాలూకు ఆలోచనలు మన సమాజంలోకి చాపకింద నీరులా పాకి రావటం నేను గమనించాల్సింది. కానీ, నేను నా గొప్పలు చెప్పుకోవటంలోనే మునిగిపోయాను, హతవిధీ!" అని నేను చెపుతుండగా జనం బాధగా మూలిగారు.

"మన విలువలని నేనే మరిచిపోయాను, ఇక సమాజాన్ని ఎలా తప్ప పట్టగలను? కొద్దిమంది అన్ని లాభాలనీ తమ గుప్పిట్లో పెట్టుకున్నారు, మీలో అధిక సంఖ్యాకులు దీనావస్థలో పడి కొట్టుకున్నారు. మీ నాయకుడిగా నేను మీకు అన్యాయం చేశాను, ఎందుకంటే నా సోదరుడు, దేశద్రోహి విభీషణుడు కొద్దిమందికి మాత్రమే ప్రత్యేకమైన అధికారాలూ, అర్హతలూ ఉండాలని ఆలోచిస్తూ ఉంటే చూస్తూ ఊరుకున్నాను. నేను సగం బ్రాహ్మణుడిని కాబట్టి మీకన్నా ఉన్నతుడినని గర్వపడ్డందుకు ఇప్పుడు సిగ్గుపడుతున్నాను. నా తెల్ల రంగుకి మనసులోనే గర్విస్తూ, నల్లరంగు చర్మం అపరిశుభ్రమైనదనీ, చెడ్డదనీ అనుకున్నాను."

అలా నా నోటివెంట అనాయాసంగా ఈ మాటలు వస్తూ ఉంటే జనం తదేక ధ్యాసతో వినసాగారు. "ఈరోజు మన సమాజం ఎటుపోవాలో తెలీని అయోమయంలో ఉంది. నేను ఒక చక్రవర్తిగా కాకుండా, నన్ను తప్పదారి పట్టించేవారు పిలిచే గొప్ప విజేత అయిన రాక్షసుడిలా కాకుండా; ఒక సామాన్యుడిగా, ఒక అసురుడిగా, నా

మనసు విప్పి మీ ముందు పరుస్తున్నాను. నేను పాపాలు చేశాను, ఎందుకంటే నేను దేవుడిని కాను. మీలాగే మామూలు అసురుడిని. నేను చేసిన పాపాలకి శిక్ష అనుభవించేందుకు వచ్చాను. నా నాయకత్వంలో అమాయకంగా మీరందరూ నమ్మకం ఉంచినందుకు వినమ్రుడనై వచ్చాను. ఈ బరువైన బాధ్యతని వహించే శక్తి సామర్థ్యాలు ఇమ్మని శివుని ప్రార్థిస్తున్నాను. దీన్ని గురించి అందరూ ఏమనుకున్నప్పటికీ, ఈ యుద్ధం దేవతల రాకుమారుడు రాముడి భార్య సీతకోసం జరగటం లేదు. అలాగే పరాయి పురుషుడి భార్యమీద వ్యామోహంతో కాముకుడైన మీ వృద్ధ రాజు ఈ యుద్ధం చెయ్యబోవటం లేదు. రాముడి సోదరుడు లక్ష్మణుడిచేత ఘోరంగా అవమానింపబడ్డ నాసోదరి శూర్పణఖకోసం ప్రతీకారం తీర్చుకునేందుకు కూడా ఈ యుద్ధం జరగటం లేదు. ఇది..." అని ఆగాను. హఠాత్తుగా నాకు మాటలు కరువయాయి. జనం నేను ఏదో చెపుతానని ఎదురుచూస్తూ ఉండిపోయారు.

"నా ప్రియమైన మిత్రులారా, అసురులారా... సీత... నా కుమార్తె," అనగానే జనం ఉవ్వెత్తున కోలాహలంగా అరిచారు. అది సర్దుమణిగేదాకా ఆగాను. మిట్టమధ్యాన్నపు సూర్యుడు నిప్పులు కక్కుతున్నాడు. నా శక్తినంతా పీల్చేసి, నా మెదడు మొద్దుబారేట్టు చేస్తున్నాడు. చెమటలు నా ముఖంమీద ధారలు కట్టాయి. కింది కొన్నివేలమంది నల్లటి, తడిగా ఉన్న ముఖాలు మెరుస్తున్నాయి. కోపంతో, అయోమయంతో, ఆవేశంతో జనం ఊగిపోయారు. వెనక్కి తిరిగి నా మంత్రులవైపు చూడాలని నాకు అనిపించలేదు, కానీ వాళ్లకి సీత విషయం ముందే తెలుసని మాత్రం ఊహించాను. ఇప్పుడు వాళ్లవైపు చూసే ధైర్యం లేకపోయింది. కొద్ది నిమిషాల క్రితం అసుర నాగరికత భవిష్యత్తు గురించి చెప్పి నా ఉపన్యాసంతో జనాన్ని ఉర్రూతలూగించాలని అనుకున్నాను. కానీ ఇప్పుడు ఆ మాటలన్నీ ఎక్కడో పోయి దాక్కున్నాయి. నాముందు ఉన్న స్తంభాన్ని ఆసరా చేసుకుని నిలబడి అలాగే ఉండిపోయాను. ఇలాంటి సమయంలో జనం

ప్రమాదకరంగా స్పందించే అవకాశం ఉందని నాకు తెలుసు.

"సిత్రా మాత్రకి జయము జయము! అసుర రాకుమారికి జయము జయము!" అంటూ ఒకే ఒక గొంతు గట్టిగా పలికింది. ఆ తరవాత పూర్తి నిశ్శబ్దం. ఆ శబ్దం వచ్చినవైపు అందరూ ఆశ్చర్యంగా తలలుతిప్పి చూశారు. ఎండ కళ్లలో పడుతూ ఉంటే చెయ్యి అడ్డుపెట్టుకుని నేను కూడా అటు చూశాను. అది ముసలి పీనుగ భద్రుడు కాదు కదా! ఒక చేతికర్ర మీద ఆనుకుని వడిలిపోయిన ఒక వృద్ధుడు నిలబడి ఉండటం నాకు కనబడింది. అతని పక్కనే మంచి యౌవనంలో, బలంగా, కండలు తిరిగిన శరీరంతో ఒక నల్లటి యువకుడు కనిపించాడు. కానీ అతని ముఖం నాకు స్పష్టంగా కనిపించలేదు. మళ్లీ ఆ వృద్ధుడు, "సీతామాతకి జయము జయము!" అని అరిచాడు. అంతే జనం ఏకగ్రీవంగా సీతకీ రావణుడికీ జయజయ ధ్వానాలు పలికారు. అంతవరకూ మౌనంగా ఉన్న ఢంకాలు అసుర దరువులని ఉత్సాహంగా మోగించసాగాయి. జనం ఒక పెద్ద మహాసర్పంలాగ వంకర్లు తిరుగుతూ, ఎగిరెగిరిపడుతూ నా భవనంనుంచి బైటికి కదిలారు. వాళ్లు కాళ్లతో రేపిన దుమ్ము అంతటా పరుచుకుంది.

నినాదాలు దూరమయాక నా మంత్రులవైపు తిరిగి, "అయితే అంతా నిర్ణయం అయిపోయినట్టే కదా! మనం ఇక్కడే ఉండి పోరాడదాం." అన్నాను. ప్రహస్తుడు తప్ప మిగతా అందరూ అంగీకారసూచకంగా అభివాదం చేశారు. నేను దర్పంగా నా మందిరంవైపు నడిచాను. ప్రహస్తుడి కళ్లు గాజుకళ్లలా, శూన్యంగా ఉండటం గమనించాను. నేను అతని కళ్లలోకి చూడగానే అతను అస్పష్టంగా తల ఆడించాడు. తరవాత కొంతసేపటికి చీకటిగా, చల్లగా ఉన్న నా మందిరంలో, నా శరీరంలో నా ప్రజలు రగిలించిన జ్వాలలు చల్లారిపోయాక, నాలో పెరిగిపోతున్న భయాందోళనని ఉపశమింపజేయమని శివుడిని ప్రార్థించాను. లంకలోని వాతావరణంలో, వినాశనం తాలూకు ఛాయలు మనసుకి తెలియసాగాయి. వాటిని నేను పసిగట్టాను. నా శరీరంలో వాటి

తాలూకు ప్రభావం కనిపించింది. ఎప్పటిలాగే బహుశా ప్రహస్తుడు చెప్పినదే సరి అయినదేమో. నా ప్రజలని భయంకరమైన ఆ వానరసేన వాత పడవెయ్యటంకన్నానేనే చనిపోయి, ఉన్నదంతా కోల్పోయేందుకే సిద్ధంగా ఉంటాను. ఇప్పుడు వెనక్కి తగ్గటమే బుద్ధిమంతులు చెయ్యవలసిన పని అని నాకు తెలుసు, కానీ అహంకారమూ, మనోభావాలూ అలా చెయ్యనీయలేదు. నాకున్న సగం సేనతో ఇక్కడే ఉండి పోరాడతాను. నా ప్రజలకి నేను ఆమాత్రం రుణపడి ఉన్నాను. ఆ ఏకాంత ఘడియల్లో, బుద్ధికీ మనసుకీ మధ్య నలిగిపోతూ, నా రాజ్యం గురించీ, అసురుల గురించీ, లక్షలమంది నల్లజాతి వారి గురించీ ఏమీ తేల్చుకోలేని స్థితిలో కూడా ఒక నిర్ణయం తీసుకోక తప్పలేదు. నా బుద్ధి చెప్పిన మాట విని ఉంటే, విధి మరోలా ఉండేదేమో. కానీ నేను ఎప్పుడూ భావోద్వేగాలకే ప్రాధాన్యం ఇస్తూ వచ్చాను. రావణుడిగా జీవించాను, రావణుడిగానే మరణిస్తాను. నాకు రాముడిలా మారాలని లేదు. అతను సంపూర్ణ మానవుడు, దేవుడు. నా రాజ్యంలో దేవుళ్లకి కొదవలేదు. మనుషులే తక్కువయిపోయారు.

35. నైతిక నియమాలు లేని యుద్ధం

భద్రుడు

సాధ్యమైనంత గట్టిగా ఎలుగెత్తి అసుర రాకుమారిని పిలిచాను. కనీసం ఒక రాజైనా నిజాన్ని ఒప్పుకునేంత ధైర్యం చేశాడనీ, నిజాయితీ చూపించాడనీ ఆనందించాను. ఆ తరవాత జనం ధోరణి మారిపోయింది. ఎవరికి తెలుసు, ఆ రోజు నేను రావణుడిని కాపాడానేమో? నేను కూడా జనంతో కలిసి వెనక్కి మళ్లాను, కానీ నా గుడిసెదాకా నడిచివెళ్లే ఓపిక లేకపోయింది నాకు. అందుకని పట్టు వస్త్రాలు అమ్మే ఒక దుకాణం ముందు, వీధి పక్కన పడుకున్నాను. చాలామంది నాలాగే వీధిపక్కన పడుకున్నారు. యుద్ధావేశం ప్రబలినందున రక్షకభటుల జోరు కాస్త తగ్గింది. హఠాత్తుగా అర్ధరాత్రివేళలో అగ్ని బాణాలు అంగడివైపు దూసుకుని రాసాగాయి. పెద్ద ఎత్తున యుద్ధం మొదలయింది. అంగడికి నిప్పు అంటుకుంది. సముద్రతీరానికి కొన్ని వందల అడుగుల దూరంలో లంగరు దించిన వరుణుడి నౌకలలోనుంచి ఆ అగ్ని బాణాలు మావైపు రాసాగాయి. బాణాలు గాలిలో రివ్వుమని ఎగిరి, శరీరాలని ఛేదించి, రెల్లుగడ్డి కప్పిన పాకలమీద పడి వాటిని కాల్చి బూడిద చెయ్యసాగాయి. వేలకొద్దీ జ్వాలల నాలుకలు లేవటంతో నల్లటి ఆకాశం ఎర్రగా వెలగసాగింది. వర్షాకాలపు జడివానలా మృత్యువు లంకని ముంచెత్తుతూ ఉంటే ఆ జ్వాలలు భీభత్సంగా, ఆనందంతో నృత్యం చేస్తున్నట్టు కనిపించాయి. ప్రాణాభయంతో పారిపోతూ ఉండకపోయినట్టయితే, వరుణుడు తన పూర్వపు మిత్రులకోసం ఏర్పాటు చేసిన ఈ అద్భుత ప్రదర్శనని చూసి నేను ఆనందించేవాడినే.

జనం బైటికి పరిగెత్తారు. హాహాకారాలు మిన్నుముట్టాయి. మాంసం కాలసాగింది. ఇళ్లు తగలబడిపోతూ ఉంటే, దట్టమైన నల్లని పొగసుళ్లు

తిరుగుతూ పైకి లేచింది. నరకంలో ఉన్నట్టు అనిపించింది. మొదటిసారి సైనికుడిలా కాకుండా ఒక సామాన్యుడిలా యుద్ధం జరగటం చూశాను. యుద్ధభూమిలో ఉన్నప్పటికన్నాఇలా ఉన్నప్పుడే ప్రాణాలతో ఉండేందుకు ఎక్కువ ధైర్యం అవసరమని నాకు అనిపించింది. అక్కడ కనీసం శత్రువు ఎవరో తెలుస్తుంది. ఇక్కడ మృత్యువు రకరకాల రూపాల్లో వస్తుంది. పైనించి కూలిపడే దూలాలూ, దోపిడీ చెయ్యటానికి వచ్చే సైనికదళాలూ, ఊపిరి అందకుండా చేసే దట్టమైన పొగా, నాలుకలు చాచి ఎగసిపడే జ్వాలలూ, లేక బాణాలు. ఇక్కడ మమ్మల్ని వెతికి పట్టుకునే మృత్యువుకోసం వేచి ఉంటాయి.

శత్రువులు ముందుగా పౌరులమీదికి బాణాలు వదులుతున్నారు. అలజడి సృష్టించాలన్నది వాళ్ల అభిమతం. మమ్మల్ని బలహీనులని చేసి, మాలోని ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేందుకే అలా చేస్తున్నారు. తెల్లవారగానే వాళ్లు వారధిదాటి వచ్చి తమ కాల్బలాలతోనూ, అశ్వదళాలతోనూ దాడి చెయ్యటం ప్రారంభిస్తారు. 'మా రాజు ఏం చేస్తున్నట్టు?' అని మాటలు చెప్పి చివరికి పారిపోయి సుబేల కొండల్లోని కోటలో దాక్కుని ఉండడు కదా! ఈ రాజులని నమ్మలేం. అతికాయుడు ఏడీ? నా పేగులు మెలిపెట్టినట్టు బాధ కలిగింది. పారిపోతున్న జనానికి వ్యతిరేక దిశలో పరిగెత్తాను. పడిపోతూ, లేస్తూ, తొక్కుకుంటూ, మట్టగిస్తూ జనసముద్రం భయపడిన ఎలుకల్లా పారిపోతున్నారు. 'అతికాయుడు ఎక్కడున్నాడు?' నాకు ఏడుపు ముంచుకొచ్చింది. ఒక దీపస్తంభానికి ఆనుకుని రొప్పుతూ నిలబడ్డాను. ఆకాశంనిండా నల్లటి పొగ కమ్మేసింది.

బెదిరిపోయి పరిగెత్తుతున్న జనం మనసుల్లో విపరీతమైన నిస్సహాయతా, తమని పరిపాలించేవారి పట్ల ఏహ్యభావమూ నిండాయి. వాళ్లు భయపడటం నాకు తెలుస్తోంది. నా ప్రశ్నలకి సమాధానంలాగ దట్టమైన పొగని చీల్చుకుంటూ హఠాత్తుగా ఒక అశ్వదళం ప్రత్యక్షమైంది. పారిపోతున్న వాళ్లలో కొందరు ఆగి వెనక్కి తిరిగి చూశారు, కానీ అశ్వదళం ఆగకుండా జనాన్ని తొక్కుకుంటూ

గుర్రాలని పరుగు తీయించింది. వాళ్ల ధాటికి చాలామంది పక్కకి పడిపోయారు. కనిపించిన వారినల్లా నరుకుతూ, కొరడాలతో కొడుతూ సైనికులు ముందుకి పోయారు. 'ఓరి దేవుడా! ఇది రాముడి సేన!' అనుకున్నాను. కానీ ఇంతలో ఒక్క క్షణం నాకు వజ్రదంష్ట్రుడు కనిపించాడు. అతనే అశ్వసేనకి నాయకత్వం వహిస్తున్నాడు. నరవానరులని కలుసుకునేందుకు వెళ్తున్న అసుర సేన అది.

ప్రాణాలు పోయీ, గాయాలు తగిలీ జనం వీధుల్లో పడి ఉన్నారు. రాముడి బాణాలకీ, రావణుడి బాణాలకీ సమానంగా భయపడుతూ నేను రాజభవనంవైపు నడిచాను. మంటల్లో కాలిపోయిన శవాలూ, జంతువుల కళేబరాలూ ఇంకా చుట్టూ పడిఉన్నాయి. కొన్ని వందల గజాలు నడిచాక ఆకాశం కాస్త నిర్మలంగా మారింది. నేను స్వచ్ఛమైన గాలిని గుండెలనిండా పీల్చుకున్నాను. రాజభవనంలో అంతటా శ్మశాన నిశ్శబ్దం అలుముకుని ఉంది. వరుణుడి అగ్నిబాణాలు భవనాన్ని తాకేటంత దూరం రాలేకపోయాయి. అందుకని దురదృష్టవంతులైన అతని ప్రజల్లా కాకుండా ప్రస్తుతానికి రాజు సురక్షితంగానే ఉన్నాడు. నేను సముద్రంవైపు చూశాను. వరుణుడి నౌకలు అలలమీద సుతారంగా ఊగుతూ కనిపించాయి. వేలకొద్దీ సాయుధులైన సైనికులు అంగళ్లమీదా, నివాసస్థానాలమీదా అగ్నిబాణాలు వర్షించటం కనబడింది. ఒక చిన్నగుట్టమీదికి ఎక్కాను. అది ప్రధానవీధినుంచి కొంతదూరంలో, సముద్రంలోకి చొచ్చుకుపోయినట్టు ఉంది. అక్కడ నిలబడితే సముద్రం ఇంకా బాగా కనిపిస్తుంది.

రాముడి వారధి దాదాపు పూర్తికావచ్చింది. ఏనుగులూ, గుర్రాలతోపాటు జనం నౌకల్లోంచి కిందికి దిగారు. పొడవాటి కాల్బలాల పంక్తి ఒకటి పాములా మెలికలు తిరుగుతూ లంకవైపు రాసాగింది. విష్ణువు శంఖం బొమ్మ ఉన్న దేవతల ధ్వజం నాకు కనిపించింది. మొదటిసారి ఐశ్వర్యంతో తులతూగే అసుర రాజధానిని చూసి ఆ సైన్యంలో ఉత్సాహం ఉరకలు వెయ్యటం కూడా గమనించాను.

అందమైన తెల్లని ఇసుకనిండిన తీరంలో వజ్రదంష్ట్రుడి అశ్వసేన

వేగంగా వస్తున్న నరవానరులతో కలబడటం చూశాను. కొన్ని రోజుల క్రితం వరకూ ఆ తెల్లటి ఇసుకలో ప్రేమికులు చెట్టాపట్టాలు వేసుకుని తిరిగేవారు, బుడిబుడి అడుగులతో నడిచే తమ పసివాళ్లని చూసి తల్లులు ఉప్పొంగిపోయేవారు. జీవితం అంత అందంగా గడిచిన అదే సముద్రతీరపు ఇసుకలో కాళికాదేవిలా మృత్యువు నర్తించసాగింది. దగ్గర్లో ఉన్న కొండమీదినించి అసురులు విసిరిన బ్రహ్మాండమైన బండరాయి సూటిగా తగలవలసిన చోట తగిలింది.

ఇంకొక రాయి, తరవాత ఇంకొకటి వరసగా బండరాళ్లు పడసాగాయి. ఒక నౌక అటూ ఇటూ ఊగుతూ కనిపించింది, అది మునిగిపోయేదాకా ఆ దాడి ఆగలేదు. అసురసైన్యం ఆనందంతో కేకలు పెట్టింది. కోట ద్వారం తెరుచుకోగానే మిగిలిన అసుర కాల్బలాలూ, అశ్వసైన్యమూ, సాయుధులైన కొన్నివేలమంది సైనికులు, 'హరహర మహాదేవ!' అని యుద్ధానికి సిద్ధమై నినాదాలు చేస్తూ ముందుకి ఉరికారు. నేను చుట్టూ చూశాను. ఆ ఉదయం చాలా ఆహ్లాదకరంగా ఉంది. సముద్రం గాజు ఫలకంలా నిశ్చలంగా ఉంది. అందులో ముదురు నీలం రంగు ఆకాశం ప్రతిబింబిస్తోంది. నా చుట్టూ ఎక్కడచూసినా పూచిన పూవులే, వాటిమీద ఎగిరే తూనీగలే, రక్తం, మృత్యువు వాసనని నివారించగలిగితే నాకు మట్టివాసనా, మంచు బిందువు వాసనా తెలిసేదే. ఇంతలో ఆశ్చర్యకరంగా ఒక్కక్షణం కళ్ల ఎదుట ఎంతో స్పష్టంగా నాకు అన్నీ కనిపించాయి. మనుషులు చేసే తుచ్ఛమైన ప్రయత్నాలని ఈ ప్రపంచం పట్టించుకోదు. రాముడు గెలిచాడా రావణుడు గెలిచాడా అనేది కూడా దానికి పట్టదు. ఒక చిరుతపులికి చిక్కిన జింక చావు బతుకుల్లో ఉంటే ఎంత నిర్లిప్తంగా ఉంటుందో అసురుల దుస్థితి గురించి కూడా అంతే నిర్లిప్తంగా ఉంటుంది. ఈ మట్టి మనుషుల రక్తంతో, పశువుల రక్తంతో, లేక ప్రాణంతో ఉన్న ఏ జీవి రక్తంతోనైనా తడవనీ. ప్రతిక్షణం, ఎవరో ఒకరు, ఏదో ఒకటి, ఎక్కడో ఒకచోట హత్యగావింపబడుతూనే ఉంది - యుద్ధభూమిలో శత్రువు చేతిలోనో, ఒక ఇంట్లో ఎవరినైనా హత్య చేసేందుకు దూరిన హంతకుడి

చేతిలోనో, లేక ఒక పులివాతపడో. లేక ప్రమాదవశాత్తూ వీధిలోనో, లేక దేవుళ్ల రక్తపిపాస తీర్చేందుకు బలిపశువుగానో. హింస ఒక్కటే ఈ ప్రపంచంలో రాజ్యమేలుతోంది. మిగతావన్నీ క్షణికంగా ఏర్పడే విరామాలే, హింస మరింత ఘోరంగా దాడి చేసేవరకూ ఉండే వ్యవధానం మాత్రమే. చిత్రంగా, అది లెక్కలోకి రాదు. గౌరవం, ఆత్మాభిమానం, కులం, చర్మం రంగు, నైతికతా, సంప్రదాయం, గెలుపు ఓటమి, ఈ బ్రహ్మాండమైన సృష్టి పరిణామక్రమంలో ప్రాధాన్యతలని అనుసరించి చూస్తే ఇవేవీ ముఖ్యంకావు.

అయినప్పటికీ నా గుండె దడదడలాడింది. భయమా? ఆశా? ప్రతీకార వాంఛా? ఈ అర్థంలేని ఆలోచనలతో అలసట కలిగి తలదిమ్మ వచ్చింది. అదుపు చెయ్యటానికి వీలుకాని భావోద్వేగాల నడుమ ఎక్కడో, పిచ్చెక్కించే, ఈ జీవితం అనే వివరణకి అందని యదార్థం తాలూకు అర్థం తెలుసుకోవాలని శతవిధాల ప్రయత్నించాను. చాలాకాలం తరవాత, జీవితానికి అర్థం అది అర్థరహిత మైనది, అని గ్రహించాను. కానీ అప్పటికే చాలా ఆలస్యం అయిపోయింది. కాళ్లీడ్చుకుంటూ, అనాసక్తంగా రాజభవనంవైపు నడిచాను. ఘోరయుద్ధం జరుగుతున్న సముద్ర తీరంనుంచి అరుపులూ, కేకలూ వినిపిస్తున్నాయి. ఆకాశంలో దుమ్ములేగుతోంది. అతికాయుడు ఎక్కడైనా కనిపిస్తాడేమోనని మునివేళ్లమీద నిలబడి చూశాను. 'నా కొడుకు ఏడీ? వాడు మృత్యువు వాతపడేలోపల వాడెక్కడున్నాడో వెతికి పట్టుకోవాలి.'

నాకు ఇంటికి మాల దగ్గరకి వెళ్లాలనిపించింది. అతికాయుడు కనబడితే ఎలాగో ఒకలాగ రాముడూ, రావణుడూ లాంటి వాళ్లు ఉంటున్న ఈ వెర్రిలోకంలో నుంచి తప్పించుకోమని నచ్చజెప్పి ఒప్పించాలనీ అనుకున్నాను. 'ఎక్కడున్నాడు వాడు? ఒకవేళ సముద్రతీరాన మరణించి పడి ఉండడు కదా?' భారంగా అడుగులు ఎత్తివేస్తూ, రాజభవనంవైపు నడిచాను.

రేగుతున్న దుమ్ము మబ్బుల్లా కమ్మేస్తూ ఉంటే దాని వెనక ఉన్న

భవనం కనబడలేదు. ద్వారాలు మూసి ఉన్నాయి. ఒత్తిడికి గురైన భటులు అప్రమత్తంగా ఉన్నారు. వగరుస్తూ ఆగి బుద్ధిలేని నా కొడుకునీ, ఈ యుద్ధాన్ని మొదలుపెట్టిన వాళ్లనీ తిట్టుకున్నాను. ఇది త్వరగా ముగిసిపోవాలని ప్రార్థించాను, ఫలితం ఎలా ఉన్నా పరవాలేదు. ఎండకి నా వీపు అట్టుడికిపోతోంది. పెద్దపెద్ద కణుపులు ఉన్న నా చేతివేళ్లని కళ్లకి అడ్డం పెట్టుకుని, భవనం వసారాల్లోనూ, మేడమీదా అతికాయుడు కనిపిస్తాడా అని వెతికాను. భవనం నిర్మానుష్యంగా కనిపించింది. తరవాత నెమ్మదిగా ఎండతాలూకు మిరుమిట్లు తగ్గి భవనంలోపలి చీకటికి కళ్లు అలవాటు పడ్డాక, మేడమీద చక్రవర్తి ఒంటరిగా నిలబడి ఉండటం కనబడింది. ఆయన ఏ భావమూ లేకుండా సముద్రతీరంవైపు చూస్తున్నాడు. తనకోసమూ, తన ప్రజలకోసమూ నిర్మించుకున్న గొప్ప జీవితం తన చుట్టూ ధ్వంసం అవటం చూస్తూ నిలబడ్డాడు ఆ వ్యక్తి. అయినప్పటికీ ఆయన తెల్లని ముఖంలో ఉదాత్తత, భావశూన్యతా ఉన్నాయి. ఆయన నిటారుగా, హుందాగా నిలబడి ఉన్నాడు.

వెండిలాంటి ఆయన దట్టమైన కేశాలు గాలికి ఎగురుతున్నాయి. దైవత్వం ఉట్టిపడుతూ ఉన్నట్టు కనిపించాడు ఆయన. అప్రయత్నంగా వంగి నమస్కరించాను. ఆయన నావైపు చూశాడు. ఇద్దరి కళ్లూ కలుసుకున్నాయి. ఆయన తల ఊపేసరికి సంతోషంతో నా మనసు ఉప్పొంగింది. ఈ పేద సేవకుడు, పనికిమాలిన దరిద్రుడు భద్రుడు, ఆయన తుఫానులా దేవతల కోటబురుజులని బద్దలు కొట్టినప్పుడు ఆయన పక్కనే ఉన్నాడు. అది జరిగి చాలా కాలమయింది, అప్పుడు మేమిద్దరం యువకులం. ఒక భటుడు నావైపు రావటం కనిపించింది. చక్రవర్తి మేడమీదనుంచి మాయమయాడు. భటుడు నన్ను భవనంలోకి రమ్మన్నాడు. రావణుడి భవనం స్వర్ణద్వారాలలోనుంచి లోపలికి అడుగుపెట్టి, ఆ భవనం ఆవరణలోని అందాలని గ్రోలుతూ ఉండగా, ఎవరో దురుసుగా నన్ను పక్కకి తోశారు. నేను అభ్యంతరం చెప్పేలోపల ఒక రథం వేగంగా నా పక్కనుంచి వెళ్లింది. గుర్తుపట్టలేనంతగా తల

పగిలిపోయి, ప్రాణంలేనట్టు రథంలో పడిఉన్న వ్యక్తిని చూడగానే నోటిదాకా వచ్చిన తిట్ల వెనక్కిపోయాయి. రథం మలుపు తిరుగుతూ ఉండగా ఆ వ్యక్తి ముఖం నాకు కనిపించింది. అది వజ్రదంష్ట్రుడి శరీరం.

36. పుత్రులందరిది ఒకటే తీరు

రావణుడు

ఆరోజు విజయవంతంగా ముగిసింది. వజ్రుడు చనిపోయాక సైన్యాధిపతి స్థానాన్ని చేపట్టిన రుద్రకుడూ, సుమాలీ, ప్రహస్తుడూ తెప్పలమీద వెళ్లి రాముడి సైన్యాన్ని అద్భుతమైన శక్తియుక్తులతో అడ్డుకుని అసురుల నగరాలనీ, ప్రాణాలనీ కాపాడారు. రాముడి నరవానర సేనని మట్టుపెట్టారు. ప్రహస్తుడు కూడా వరుణుడి మూడు నౌకలని తిరిగి తన ఆధీనం చేసుకున్నాడు. రాబోయే రోజుల్లో ఇది మాకు లాభసాటిగా ఉండగలదు. భవన ద్వారం దగ్గర ఉంచిన వజ్రుడి శవానికి ఎంతోమంది నివాళులు అర్పించారు. అతను జీవించి ఉండగా అతన్ని చూసి హడిలిపోయిన వాళ్లు, ఇప్పుడు మరణించిన ఆ అసుర సేనాధిపతిని చూసేందుకు తండోపతండాలుగా బైలుదేరి వచ్చారు. అతని అహంకారాన్నీ ధైర్యసాహసాలనీ, ఎవరిని చూసినా భయం లేదు అనేట్టుండే అతని వైఖరినీ నేను ద్వేషించేవాడిని. అసుర సమాజంలో నిలకడ కరవైన సమయంలో అతను ప్రదర్శించిన నిరంకుశత్వం, అసురులు ధర్మవర్తనులు, సానుభూతిపరులు అన్నపేరుని శాశ్వతంగా పాడుచేసింది. కానీ నేను నా సామ్రాజ్యాన్ని నిర్మించింది వజ్రదంష్ట్రుడిలాంటి వారి భుజాలమీదే. అతనివంటి వాళ్లు లేకపోయి ఉండి ఉంటే సామ్రాజ్యం నిర్మించాలన్న ఆశ, సంకరజాతిలో పుట్టి, తిండికి కూడా గతిలేని ఒక పేద అసుర రాకుమారుడి కళ్లల్లో మినుమినుకుమనే చిన్న దీపంగా మిగిలి ఉండేది. వజ్రదంష్ట్రుడు మరో ఆలోచన లేకుండా ఎవరి ప్రాణాలైనా తీసేసేవాడు, క్రౌర్యం అతనికి ఒక వినోదం, ఆ గుణాలవల్లే నా సామ్రాజ్య నిర్మాణానికి అతను ఉపయోగపడ్డాడు.

నా మంత్రులూ, బంధువులూ వెంటరాగా నేను బైటికి నడిచాను.

మరణించిన సేనాపతిని చూసేందుకు వచ్చిన జనసమూహాలు మధ్యలో చీలి నాకు దారి ఇచ్చాయి. నా సేనానాయకుడి ప్రాణంలేని శరీరం ముందు నేను తలవంచి నిలబడ్డాను. అతని భార్యా, కుమార్తె నోటికి చెయ్యి అడుపెట్టుకుని రోదించటం ఆ నిశ్శబ్ద వాతావరణంలో ఇబ్బందికరంగా వినిపించసాగింది. శవం పాదాలు చల్లబడ్డాయి. వాటిని తాకుతున్నప్పుడు నా చేతుల్లో పుట్టిన వణుకుని నేను ఆపలేక పోయాను. అన్ని పాపాలనీ క్షమించే శివుడిని తలుచుకుని ప్రార్థించాను. తన వాళ్లు కోల్పోయిన గౌరవాన్ని తిరిగి పొందాలనే ఆలోచనతో ఘోరాతిఘోరమైన నేరాలు చేసిన ఆ వ్యక్తి ఆత్మశాంతికై ప్రార్థించాను.

వీధిలో శవాలని ఊరేగిస్తూ వచ్చారు కొందరు. సేనాపతితోబాటు అసువులు బాసిన సామాన్య సైనికుల శవాలని అక్కడకి తీసుకువచ్చారు. ఎర్రటి రక్తబింబం లాంటి సూర్యుడు సముద్రంలోకి కుంగిపోతూ ఉంటే, నా సైనికుల శవాల చితులలోనుంచి దట్టమైన నల్లటిపొగ పైకి లేచింది. వాళ్లందరూ రాముడిసేన నుంచి తమ రాజ్యాన్ని కాపాడేందుకు పోరాడుతూ ప్రాణాలు అర్పించిన వాళ్లు. సముద్రం అవతలివైపు సగం కూలిన వంతెన చివర శత్రువుల చితులమంటలు అస్పష్టంగా కనిపించాయి. కానీ మారణకాండలో చనిపోయిన వారి బంధువుల సామూహిక దుఃఖం, మా శిబిరంలో నిండిన ఉల్లాసం ముందు నిలవలేకపోయింది. మాకన్నా గొప్పవారైన దేవతలని ఎదిరించి ధైర్యంగా నిలబడి, వాళ్లు ఎన్నటికీ మరిచిపోలేనంత పెద్ద దెబ్బ కొట్టాం. నా కుమార్తెని నా దగ్గరే వదిలి వాళ్లు వెళ్లిపోతారని ఆశించాను. అర్థంలేని ఈ యుద్ధంలో మిగిలి ఉన్న కొద్దిమంది ముఖ్యమైన వారినీ బలిచేసేందుకు నాది చిన్నవయసు కాదు, వయసుమీద పడింది. దేవతలమీద నాకు ఉండిన ద్వేషం తాలూకు తీవ్రత చాలాకాలం క్రితమే తగ్గిపోయింది. యుక్తవయసులో గౌరవం, ప్రతీకారం, యుద్ధం, దండయాత్రలూ, జాత్యహంకారంకోసం ప్రయత్నించాను, కానీ ఇప్పుడు వాటన్నిటినీ అధిగమించేటంత పరిపక్వత సాధించాను. ఈ ప్రపంచం దేవతలకీ, అసురులకీ కూడా

సరిపోయేటంత పెద్దది. రాముడికీ, రావణుడికీ స్థానం కల్పించేంత విశాలమైనది. అతను నా కుమార్తె జోలికి రాకుండా ఉంటే చాలు. ఆమెపట్ల అతను ఎన్నడూ మంచిగా ప్రవర్తించలేదు, ప్రవర్తించడు కూడా. ఈ రామలక్ష్మణులు చాలా విచిత్రమైన జంట. ఒకరు తన భార్యకోసం యుద్ధంచేసి కొన్నివేలమందిని హతమార్చేందుకు సిద్ధంగా ఉంటే, మరొకరు పధ్నాలుగు సంవత్సరాల దీర్ఘకాలం తన భార్యని రాజభవనంలో కుంగి కృశించేందుకు ఒంటరిగా వదిలి వచ్చాడు.

చితులు క్రమక్రమంగా చల్లారిపోయాయి, జనసమూహం పల్చబడింది. నేను నా మందిరంవైపు నడిచాను. శుక్లపక్షమి దగ్గర పడుతూ ఉంది. చంద్రుడు వెండి వెన్నెలతో లంకలో ఇంద్రజాలం సృష్టిస్తున్నాడు. సముద్రం ప్రశాంతంగా ఉంది సన్నగా గాలి వీస్తూ కొబ్బరిచెట్ల ఆకులని గలగలలాడిస్తోంది. సన్నని కొబ్బరాకుల అంచులమీద వెన్నెలపడి, వాటి నీడకింద ఇసుకలో రకరకాల ఆకారాలని సృష్టించసాగింది. ఈ మధ్యనే కొందరు స్త్రీలు భర్తలను కోల్పోయారు, కొందరు పిల్లలు అనాథలు అయారన్న బాధ తప్ప, ఆ రాత్రి చాలా ఆహ్లాదకరంగా ఉంది. యుద్ధం సృష్టించిన భీభత్సాన్ని గురించి నేను ఆలోచించదల్చుకోలేదు. నా మనసులో రాగాలు రూపొందసాగాయి. నా మందిరం ప్రవేశిస్తూనే రుద్రవీణ తంత్రులమీద ప్రతిఫలించే వెన్నెల కిరణాలు నాకు కనబడ్డాయి. ఆ వాయిద్యాన్ని వాయించి చాలా కాలమైంది. ఈ వాయిద్యాన్ని నేను హిమాలయాల పర్వతపాద ప్రాంతంనుంచి తెచ్చుకున్నాను. ఆ ప్రయాణంలో మేమందరం కొండమీదనుంచి పడిన హిమపాతంలో కూరుకుపోయాం. ఆ గొప్ప పర్వతాల ఘనత ఎంత అద్భుతం! నాకు ప్రీతిపాత్రుడైన దైవం, శివుడి నివాసస్థానం అది. దాన్ని చూసి నేను భయాశ్చర్యాలకి గురయాను. మృత్యువుకి వెంట్రుకవాసి దూరం వెళ్లటం, మళ్లీ ఒక మునీశ్వరుడి ఆశ్రమంలో ప్రాణాలు కాపాడుకోవటం నాకు వినయం నేర్చాయి. మనిషి జీవితం ఎంత అల్పమైనదో కూడా తెలిసివచ్చింది. జీవితం తాలూకు సౌందర్యాన్ని గురించి తెలుసుకున్నాను. ఎక్కడో

దూరాన ఉన్న ఆ హిమాలయ ప్రాంతాల గ్రామంలో నాలోని సంగీతజ్ఞుడిని కనుగొన్నాను. రుద్రవీణ తంత్రుల నాదం మొదట్లో నాకు చికాకు పుట్టించేది. కానీ నెమ్మది నెమ్మదిగా అది నా మనసుని వశం చేసుకుంది. దక్షిణాన ఉన్న నా గృహానికి తిరిగి వెళ్లేందుకు విమానం ఎక్కేలోపల నేను ఆ వాయిద్యంలో గొప్ప ప్రావీణ్యం సాధించాను. ఆ తరవాత సంగీతం అంటే పిచ్చి వ్యామోహం ప్రారంభమైంది. ఢంకా, మృదంగం, తూర్యం, మద్దెలవంటి వాయిద్యాలతోనూ, వదలకుండా వెంటపడే గంధర్వుల వేణుగానాలతోనూ ప్రయోగాలు చెయ్యటం ప్రారంభించాను. నాకు మంచి సంగీతం వినటంలో ఆసక్తి ఉందనీ, కళాపోషకుడిననీ పేరు సంపాదించుకునేసరికి, నా రాజ్యంలోని కళాకారులూ, బైటి ప్రాంతాలలోని కళాకారులు నా దగ్గరకి రాసాగారు. ఎన్నో అద్భుతమైన సాయంకాలాలు సంగీతం తాలూకు ఇంద్రజాలంలో మైమరచి లంకాపురి ఉద్యానవనాల్లో గడిపాను. నా ఒత్తిడులని అన్నిటినీ, ఒక సామ్రాజ్యాన్ని పరిపాలించటంలో ఉన్న సాధకబాధకాలనీపూర్తిగా మరిచిపోయి సంగీత విద్వాంసుల రాగాల్లోనూ, తాళాల్లోనూ నన్ను నేను మరిచిపోయాను. ఒక్కొక్కసారి నా చురుకైన సన్నని వేళ్లు రుద్రవీణ తంత్రులని మీటుతూ సంగీతాన్ని సృష్టిస్తూ ఉంటే అందులో మునిగి తేలేవాడిని.

ఈ రోజు కూడా అలాంటి ఇంద్రజాలం పరుచుకున్న రోజే. ఆ రాత్రి నాకు వంపులు తిరిగిన నా రుద్రవీణని వేళ్లతో సున్నితంగా తాకాలన్న తీవ్రమైన కోరిక కలిగింది. ఒక ప్రియుడు తన ప్రియురాలిని ఎత్తుకున్నట్టు వీణని ఒడిలోకి తీసుకున్నాను. ఆ తరవాత యుద్ధాన్ని గురించి మరిచిపోయాను, రాముడినీ అతని నరవానరసేననీ మరిచిపోయాను, చనిపోయిన వారినీ, జీవించి ఉన్నవారినీ, చివరికి నన్ను నేనే మరిచిపోయాను. గాలిలో తేలే ఈకలాగ, ఏ చింతా లేకుండా, ఏ మూలాల గురించీ, ప్రయోజనాల గురించీ ఆలోచించకుండా, ఏవో లోకాల్లో తేలికగా విహరించసాగాను. ఈ భూమితోగాని, ఆకాశంతోగాని నాకు సంబంధం లేకుండా పోయింది. నేను కేవలం నేనుగా మిగిలాను.

ప్రియమైన నా భార్య మండోదరి నన్ను తాకటం తెలిసీ తెలియనట్టుగా తోచింది. ఆమె నా పక్కనే వచ్చి కూర్చుని తన అందమైన ముఖాన్నినా భుజానికి ఆనించింది. కింద ఉద్యానవనంలో జరగుతున్నవేడుకలు, తాత్కాలికమైన అసుర విజయాన్ని పండగలాగ జరుపుకోవటం నా చెవులకి సోకలేదు. తంత్రులని నా వేళ్లు మీటుతూ ఉంటే వాటినుంచి వచ్చే అలౌకికమైన నాదంతో నేను మమేకం అయిపోయాను. నేను అంతకన్నా ఎక్కువ ఏమీ ఆశించలేదు.

"నా కుమారుడు ఎక్కడున్నాడు, ప్రభూ!" నా అందమైన ఊహాలోకంలో నుంచి యుద్ధాలూ, మరణాలతో నిండిన ఈ అనాకారి ప్రపంచంలోకి వచ్చిపడ్డాను. వెంటనే నా కళ్లలో క్రోధ జ్వాలలు రగిలాయి. తెరల నీడలో ఉన్న భద్రుడి ఒంగిపోయిన అనాకారి రూపం ఇవతలికి వచ్చింది. "ఈ బికారిగాడికి నా అంతఃపురంలోకి ప్రవేశించేందుకు ఎంత ధైర్యం? వీడిని లోపలికి రానిచ్చింది ఎవరు?" అలా నేను ప్రతిస్పందించే లోపలే వాడు నా కాళ్లమీదపడి రెండు కాళ్లనీ గట్టిగా పట్టుకున్నాడు. ఏం చెయ్యాలో తెలీక నేను కదలకుండా నిలబడ్డాను. తరవాత వాడిని నెమ్మదిగా పైకి లేవదీశాను. భద్రుడు దూరంగా తొలగి బెదిరిపోయిన ఎలుకలాగ ముడుచుకుపోయాడు.

"భయపడకు," అన్నాను. నా గొంతులో అతనికి ధైర్యం చెపుతున్న భావం పలకలేదు.

"మిమ్మల్ని తాకి అపవిత్రం చేసినందుకు మన్నించండి," అన్నాడు కిందికి చూస్తూ, వాడి గొంతు అస్పష్టంగా పలికింది.

మండోదరి గబగబా వాడి దగ్గరకి వెళ్లి వాడి రెండు చేతులూ పట్టుకుంది. వాడు విడిపించుకునేందుకు ప్రయత్నించాడు. ఆమె ఎంతో సానుభూతి నిండిన గొంతుతో, "ఏం జరిగింది భద్రా?" అంది. నా జన్మలో అటువంటి సానుభూతి నేను కనబరచలేను.

సమాధానం చెప్పటానికి ప్రయత్నించిన వాడి నోటివెంట వెక్కిళ్లే వచ్చాయి. భద్రుడు తన దత్తపుత్రుడికోసం వెతుకుతున్నాడని ఎవరో

చెప్పుకుంటూ ఉండగా విన్నట్టు గుర్తు. అతికాయుడు నా రక్తం పంచుకు పుట్టినవాడేననీ, కావాలనే నేనా విషయం విస్మరించాననీ నా మనసుకి తెలుసు. అలాంటి చిరాకు పుట్టించే జ్ఞాపకాలని నా మనసులోని చీకటి కోణాల్లోకి నెట్టివేశాను. ఈ బికారిగాడు నా సొంత ఆలోచనలున్న ఆ చీకటి కోణంలోకి జొరబడుతున్నాడని అనిపించింది. అక్కడ నా రహస్యాలని లోకం కళ్లబడకుండా ఇన్నాళ్లుగా దాచి ఉంచాను.

ఇంతలో నా కుమారుడు నా మందిరంలోకి దూసుకువచ్చాడు. వాసనబట్టి వాడు పూర్తిగా మద్యం తాగి ఉన్నాడని గ్రహించాను. మద్యం తాలూకు మత్తూ, అహంకారపు మత్తూ వాడిలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. వాడి నీడలా ఒక నల్లని ఆకారం లోపలికి ప్రవేశించింది. ఆ ఆకారాన్ని చూడగానే భద్రుడు అటువైపు పరిగెత్తాడు. అతికాయుడు దురుసుగా ఆ వృద్ధుడిని పక్కకి నెట్టాడు. భద్రుడు నిలదొక్కుకోలేక పడిపోయాడు. నా ముఖం కోపంతోనూ, అవమానంతోనూ ఎర్ర బడింది. దుర్మార్గుడు, నల్లటి, అనాకారి అతికాయుడు, తనతో సరిసమానమైన వాడిలా మేఘనాదుడి మీద వాలాడు. చక్రవర్తి అంతఃపురంలోని ఆంతరంగిక మందిరంలో వాళ్లు అల్లరి చేస్తున్నారు.

"నాన్నగారూ, ఆ వెధవలని చావబాదాం! ఒకడి అంగవస్త్రానికి నేను ఎలా నిప్పు ముట్టించానో మీరు చూడలేదు... హాహాహా..! ఇక అతికాయుడు వేసిన బాణం లక్ష్మణుడి వీపుని గాయపరిచింది!" అన్నాడు మేఘనాదుడు. అతికాయుడు కూడా మేఘనాదుడు చేస్తున్న అట్టహాసంలో శృతి కలిపి, రాకుమారుడి వెన్నుమీద గట్టిగా చరిచాడు.

"మేఘనాదా..." అని గొంతు చించుకుని అరిచాను." నీ తలిదండ్రుల సమక్షంలో ఇలాగేనా మాట్లాడేది?"

"అతికాయా... నాన్న... గారికి... క్షమాపణ చెప్పు..." అన్నాడు మేఘనాదుడు. తాగుడు మైకంలో వాడి మాటలు గొంతులోంచి సరిగ్గా పలకటం లేదు. నేను రెండు అడుగులు ముందుకు వెళ్లి వాడి చెంప పగలగొట్టాను. ఒక్క క్షణంపాటు వాడు బిత్తరపోయాడు, ఆ తరవాత

ఒక్క మాట కూడా మాట్లాడకుండా సిగ్గుతో తలవంచుకుని బైటికి వెళ్లిపోయాడు. అతికాయుడు వాడిని అనుసరించాడు. భద్రుడు ఒక్క ఉదుటున ముందుకి దూకి వాళ్ల దారికి అడ్డం వెళ్లబోయాడు. "అతికాయా, వెళ్లిపోకు. నావెంట రా. మనం వెళ్లిపోదాం. మనం ప్రధాన భూభాగానికి వెళ్దాం. నా వెంట రా," అన్నాడు.

"ఒరే ముసలిపీనుగా, నా దారికి అడ్డం రాకు," అని అతికాయుడు భద్రుడిని బలంగా తోశాడు. ఆ దెబ్బకి భద్రుడు మళ్లీ పడిపోయాడు. "నరకంలో కుళ్లి చావు!" అని శాపనార్థాలు పెడుతూ అతికాయుడు వెనక్కి తిరిగి మేఘనాదుడి వెంట చీకట్లోకి నడిచాడు.

మండోదరి నాతో ఏదో అనబోయింది. నేను చెయ్యి పైకెత్తి ఆమెని వెళ్లమని సైగ చేశాను. నాకు ఏకాంతం కావాలనిపించింది. వెన్నెల రాత్రిలో ఏదో భయం కరమైన సౌందర్యం కనిపించింది, దాన్ని చూస్తూ ఉండిపోయాను. రాజభవనంలో పుట్టినా, పూరిగుడిసెలో పుట్టినా ఏమీ తేడా ఉండదు, పుత్రులందరిదీ ఒకటే తీరు. కానీ ఇటువంటి పొగరుబోతుతనం వినాశానికి సంకేతం. హఠాత్తుగా ఒక పెనుకేకా, వెనువెంటనే కోలాహలం రాజోద్యానవనంలోనుంచి వినవచ్చింది. వేడుకలు జరుగుతున్న అదే ఉద్యానవనంలోనుంచి. ఏదో జరగకూడని ఉపద్రవం జరిగి ఉండాలి. నా గుండె నా పక్కటెముకలని కొట్టుకుంటూ దడదడలాడింది. ఉద్యానవనంవైపు పరిగెత్తాను. మనసు దెబ్బతిని కింద పడిఉన్న భద్రుడిని చులాగ్గా దాటుకుంటూ, నా మందిరం బైటికి వేగంగా పరిగెత్తాను.

37. మృత్యువు మళ్లీ తలుపు తట్టింది

భద్రుడు

కొంతసేపటికి నేను లేచాను. నా మనసు భారంగా ఉంది. దేనివల్లైనా ఇంక ప్రయోజనం ఏముంది? ఇక భవిష్యత్తు మీద ఆశపెట్టుకోవటం వృథా. నా కుమారుడు నాకు శాశ్వతంగా దూరమయాడు. ఇక ఎన్నటికీ వాడిని చూడబోననీ, చూసినా శవమై మాత్రమే కనిపిస్తాడనీ నాకు తెలుసు. చిత్రంగా, చక్రవర్తి పట్ల నాకు సానుభూతి కలిగింది. అది ఆయన ఒక చక్రవర్తి అనీ, అసురజాతి కోసం తన జీవితాన్నీ శౌర్యాన్నీ సమర్పించిన గొప్ప నాయకుడనీ కాదు, ఒక తండ్రికి మరొక తండ్రిపట్ల కలిగే సానుభూతి, రాజసాన్ని సూచించే దుస్తులూ, మెరిసే కిరీటం తీసేస్తే ఆయనకీ నాకూ తేడా లేదు. లేక నన్ను నేను మభ్యపెట్టుకునేందుకు ఇలా ఆలోచిస్తున్నానా? శక్తిమంతులూ, అధికారంలో ఉన్నవారూ భిన్నంగా దుఃభిస్తారా?

భవనాన్ని నిశ్శబ్దం ఆవరించింది. సభాభవనంలోనుంచి వస్తున్న మసక వెలుతురులో ఉద్యానవనంలోని పొదల్లోనూ, చెట్లగుబురుల మధ్యా నాకు నీడలు కదలటం కనిపించింది. అక్కడ ఏదో గూడుపుఠాణీ జరుగుతోంది. ముఖ్యమైన వ్యక్తుల వ్యవహారాలతో నాకేమీ సంబంధంలేదని నేను ఎప్పుడో నిశ్చయించుకున్నాను. కానీ కుతూహలం ఆ నిశ్చయాన్ని సడలించింది. తెరిచి ఉన్న కిటికీల్లోంచి లోపలికి తొంగిచూశాను. చక్రవర్తి తన సింహాసనం మీద కూర్చుని ఉన్నాడు. ఆయన ముఖంలో కత్తివాటుకి నెత్తురు చుక్కలేదు. నేలమీద నిర్జీవంగా పడి ఉన్న కొన్ని శవాలచుటూ మంత్రులు గుమిగూడి ఉన్నారు. నాలో ఒత్తిడి పెరిగిపోయింది. ఎవరైనా పక్కకి కదిలితే స్పష్టంగా చూడవచ్చు అనే ఆలోచనతో ఊపిరి బిగబట్టి వేచి చూశాను. "ఇది క్షమించరానిది!" అన్నాడు చక్రవర్తి ఆయన గొంతులో బెదిరింపు

ఉంది. మంత్రులు ఇబ్బందిగా కదిలారు.

"నేను అక్కడికి చేరుకునేసరికి అక్కడి దృశ్యం భీకరంగా ఉంది. మనవాళ్లని ఎవరో ఊచకోత కోస్తూ కనబడ్డారు. చిమ్మచీకటి, ఎవరు ఎవరిని హతమారుస్తున్నారో స్పష్టంగా కనిపించలేదు. మొదట విజయం తాలూకు మత్తు బాగా తలకెక్కి మనవాళ్లే ఒకరినొకరు నరుక్కుంటున్నారని అనుకున్నాను. నేను అక్కడినుంచి వెళ్లి కాపలా భటులని పిలుచుకు వచ్చాను. మేము మళ్లీ అక్కడికి చేరువ అవుతూ ఉండగా నాకు రెండు నల్లని ఆకారాలు కనిపించాయి. ఖచ్చితంగా చెప్పలేను కానీ, అవి అంగదుడూ, వాడి మిత్రుడి ఆకారాలని ఎంతో కొంత నమ్మకంగా చెప్పగలను. వాళ్లని పట్టుకుందామని ప్రయత్నిస్తూ అంగదుడి మీదికి నా బాకు విసిరాను. అతను గాయపడ్డాడు, కానీ ఆ తరవాత అంతా గడబిడ అయి, వాళ్లు పారిపోయారు. సరిగ్గా ఆ సమయంలోనే ప్రభువులు ఇక్కడికి వేంచేశారు. బహుశా అంగదుడు పెట్టిన కేక మిమ్మల్ని అప్రమత్తులని చేసి ఉంటుంది," అని ప్రహస్తుడు వివరించాడు. ఆ తరవాత ఒత్తిడితో కూడిన నిశ్శబ్దం నెలకొంది.

"ఇది మనలో ఎవరో ఒకరు చేసిన పనే. మనం అసురుల పద్ధతిలో మళ్లీ దిగజారుతున్నట్టు ఉన్నాం. ఈరోజు దాదాపు విజయాన్ని అందుకునే స్థితికి చేరుకుని కూడా దాన్ని చేజార్చుకుని అపజయాన్ని పొందాం. మనం బానిసలుగా జీవించేందుకే తగినవాళ్లమేమో అనుకుంటున్నాను. అనుభవజ్ఞులైన నా ఇద్దరు మంత్రులని నా ఉద్యానవనంలోనే హతమార్చారు. అన్యాయం చేసేందుకు ఎటువంటి సంకోచమూ లేని, ధర్మం, న్యాయం గురించి ఎంతమాత్రం అవగాహన లేని శత్రువులతో వ్యవహారం నడుపుతున్నాం. వాళ్లు క్రూరులు, తమ లక్ష్యాలని సాధించుకునేందుకు ఎంత నీచానికైనా దిగజారేందుకు సిద్ధంగా ఉంటారు. ఇక మనచుటూ గూఢచారులూ, దేశద్రోహులూ మనని పట్టి పీడిస్తున్నారు. నా సోదరుడే నాకు ఎదురుతిరిగి ద్రోహం చేశాడు, నా మిత్రుడు మిత్రద్రోహం చేశాడు. ఇంకా ఎవరెవరు దేవతలకి సాయం చేస్తారో అని అనుమానంగా ఉంది నాకు. సుమాలీ,

మాల్యవంతుడూ సజ్జనులు. వాళ్లు యోధులు కాకపోవచ్చు, వాళ్లు ఇలా అంతమొంది ఉండకూడదు. రుద్రకా, మనం శత్రుసేనలకి వీలైనంత అధికసంఖ్యలో నష్టం కలిగించాలి. మనం వాళ్ల స్థాయికి దిగజారి ఉగ్రవాదుల్లా రహస్యంగా దాడులు చెయ్యటం, నిద్రపోతున్న వాళ్లని సైతం చంపటం నాకిష్టం లేదు. కానీ వాళ్లని యుక్తితో ఉపయోగించి, కపటోపాయంతో పట్టుకోవటంలో తప్పలేదను కుంటాను. నా కుమారుడు ఎక్కడ ఉన్నాడో వెతికి, వాడి మత్తు వదిలి ఉంటే ఇక్కడికి పిలుచుకు రండి. ప్రహస్తా, శాంతి నెలకొనేదాకా సుమాలీ, మాల్యవంతుడూ వహించిన బాధ్యత ఇకపై మీదే అవుతుంది. మనం వ్యూహం పన్ని వాళ్ల పద్ధతిలోనే వాళ్లకి గుణపాఠం నేర్పుదాం." ఈ మాటలు చక్రవర్తి చాలా దృఢసంకల్పంతో, గంభీరంగా అన్నాడు.

నేను గుండెలనిండా ఊపిరి పీల్చుకున్నాను. ఆ ఇద్దరు వృద్ధ మంత్రులూ మంచివాళ్లు తమ రాజకీయ జీవితంలో నిజాయితీగా ప్రవర్తించేవారు, కానీ వారి మరణాలు నాకు సంబంధించినవి కావు. ప్రపంచం నిండా వారిలాంటి వ్యక్తులు ఉన్నారు. ఒక్కక్షణం కూడా ఆగి ఆలోచించకుండా వారి స్థానే ఇంకొకరిని నియమించవచ్చు, ఆ తేడా ఎవరికీ తెలీదు. కానీ సభలో జరుగుతున్నది నాకు అద్భుతంగా తోచింది, నేలకి అతుక్కుపోయినట్టు నేను నిలబడ్డచోటినుంచి కదల్లేదు. మేఘనాదుడూ, అతికాయుడూ సభలో ప్రవేశించటం కనబడింది. మంత్రులు తమతమ ఆసనాల్లో కూర్చుని ఉన్నారు, కానీ యుద్ధంలో చంపబడ్డ ఇద్దరు మంత్రుల శవాలనీ, వాళ్ల తలలు దక్షిణంవైపు ఉండేటట్టు నేలమీద పడుకోబెట్టారు. తలల దగ్గర కొబ్బరి చిప్పలతో చేసిన నూనెదీపాలు వెలుగు తున్నాయి. ఆ శవాలని చూసి మేఘనాదుడూ, అతికాయుడూ మ్రాన్పడిపోయారు. కొంతసేపు ఎవరూ మాట్లాడలేదు. ఇద్దరు యువకులూ నేలమీద తలలు ఆనించి చనిపోయినవారికి నివాళులు అర్పించారు. తరవాత తన ఆసనంమీద మేఘనాదుడూ అతని పక్కనే నేలమీద అతికాయుడూ కూర్చున్నారు.

అతికాయుడిని చూసి రావణుడి కనుబొమలు పైకి లేచాయి, కానీ ఆ యువకులు పెద్దవారి అయిష్టాన్ని పట్టించుకోలేదు.

"రేపు రుద్రకుడు తూర్పువైపునుంచి దాడి చేస్తే ప్రహస్తుడు సముద్రంమీద తన అధీనంలోకి తీసుకున్న నౌకల మీదనించి దాడిచేసి, సముద్రపు దొంగల నౌకలలో మరికొన్నింటిని ముంచనైనా ముంచేస్తాడు లేదా తన సొంతం చేసుకుంటాడు. ఇద్దరు సోదరులూ ఆ ఆక్రమణకి నాయకత్వం వహిస్తారని నమ్ముతున్నాను. నిన్న వాళ్ల వారధి కూలిపోయినందున, ఈ రోజు వాళ్లు తెప్పలని ఉపయోగించవచ్చు, నగరం ఉత్తరదిక్కునించి వచ్చి ఎడమపక్కన ఉన్న సైన్యంతో కలబడవచ్చు. మనం కొండలని అనువుగా చేసుకుని బండరాళ్లని వీలైనంత బాగా వాడుకునేందుకు ప్రయత్నిద్దాం. శత్రువులని మన నగరద్వారం దాకా రానిచ్చి అప్పుడు రాళ్లతోనూ, మరిగే నూనెతోనూ వాళ్లమీద దాడిచేద్దాం. రాళ్లు విసిరే యంత్రాలనీ, అగ్నిగుండ్లనీ గురితప్పకుండా వాడండి. ప్రహస్తుడు వాళ్లని సముద్రం వైపునుంచి చుట్టుముట్టి పారిపోయే మార్గం లేకుండా చేస్తాడు లేదా కనీసం సముద్రంవైపునుంచి శత్రువులకి సాయం చెయ్యకుండా వరుణుడిని అడ్డుకుంటాడు. సేనానాయకుడి సహాయకుడు, ధూమ్రాక్షుడికి ఆ పని అప్పగించండి. అతను వీలైనంత శౌర్యం ప్రదర్శించి వానరసేనలలో కలకలం, భయం సృష్టించాలి. వాళ్ల మీద అన్నివైపులనుంచీ దాడి జరుగుతూ ఉన్నప్పుడు, అశ్వశాల అధికారి, సురాంతకుడు, కోటద్వారాలు తెరిచి ఆస్థానంలోని ఏనుగులని బైటికి వదులుతాడు. మనం కోట ద్వారాలు తెరుస్తామని వాళ్లు ఊహించరు. వాళ్లని లోపలికి రానివ్వండి, అసురుల దుర్గాన్ని ఛేదించామని వాళ్లని అనుకోనివ్వండి. కొండలకీ, నగరం గోడలకీ మధ్యన ఉన్న ఇరుకుస్థలంలో వాళ్లు చిక్కుకున్న తరవాత జంతువులని వదిలిపెట్టండి. మన సామర్థ్యం ఏమిటో వానరులకి చూపిద్దాం. ఇక మేఘనాదా, నీతో నేను ఏకాంతంగా మాట్లాడాలి. దేవతల సేన వెన్ను విరగగొట్టే పనిని నేను నీకు అప్పగిస్తాను. హత్యకు గురైన మన సైనిక వీరులకి అంత్యక్రియలు చేసే

ఏర్పట్ల విషయం చూడండి. ఈ రోజు యుద్ధంలో చనిపోయినవారి ఇళ్లకి వెళ్లి, వాళ్ల కుటుంబాలని ఓదార్చండి. మొత్తం అసుర సమాజం వాళ్ల పక్షానే ఉందన్న నమ్మకం వాళ్లకి కలిగించాలి. వాళ్ల శోకంలో మనం కూడా పాలుపంచుకుంటామనీ, రాజ్యం అమరులని ఎన్నటికీ మరిచిపోదనీ వాళ్లకి తెలియజేయాలి," ఈ మాటలు చెప్పి చక్రవర్తి సింహాసనంమీదనుంచి లేచాడు. వెంటనే సభలోని అంతమందీ లేచి నిలబడ్డారు.

తూర్పుదిక్కుఎర్రబడుతోంది. పక్షులు చెట్లమీద కిలకిలారావాలు చేస్తున్నాయి. అసుర చక్రవర్తి చెయ్యబోయే పనులు నాకు ఒకపక్క భయాన్నీ మరోపక్క ఉద్వేగాన్నీ కలిగిస్తున్నాయి. చివరికి చక్రవర్తి తనే ముందుండి యుద్ధాన్ని నడిపిస్తున్నందుకు ఆనందించాను. ఆయన మళ్లీ తన శక్తిని సంపాదించుకున్నాడు. దానికి ఆయన అనుభవం బంగారానికి తావి అబ్బినట్టు తోడయింది. అది అతి పాశవికమైన, రక్తపాతంతో కూడుకున్న యుద్ధం. అందులోని ఏదో రహస్యవ్యూహంలో నా కుమారుడు కూడా పాలుపంచుకుంటున్నాడు. వాడు యుద్ధంలో పాలుపంచుకోవటం నాకు ఎంతమాత్రం ఇష్టం లేదు. కానీ కొడుకులు చెప్పినమాట వింటారా? వారి దారే వేరు. నేను అలసిపోయాను. వ్యూహాలుపన్నే రాజులనీ, ఆక్రమణలు చేసే రాజకుమారులనీ వదిలిపెట్టి నేను ఇంటిదారి పట్టాను. బాగా తాగి మొద్దునిద్ర పోవాలని అనిపించింది.

38. ఎవరికోసం?

రావణుడు

నా మంత్రులు ఇద్దరు చనిపోవటం నాకు పెద్ద దెబ్బే. నేను చేసిన యుద్ధాలు అన్నిటిలోకీ ఇది విభిన్నమైనది. నా భవనం నిండా గూఢచారులు తిరగసాగారు. హంతకులు విచ్చలవిడిగా, తమకి అడ్డూఆపూ లేదన్నట్టుగా స్వైరవిహారం చేశారు. ఈరోజు అర్థాంతరంగారాజ్యం సంపాదించుకున్న ఆరాముడిని, అంతమొందిస్తామని ఆశించాను. వానరులు అతన్ని విష్ణువు అవతారం అనుకుంటున్నారని విన్నాను. రాముడి దైవత్వాన్ని చాలామంది అసురపౌరులు కూడా నమ్మటం ప్రారంభించారని విని నిర్ఘాంతపోయాను.

ఈ రోజు, శివుడి ఆశీర్వాదం లభిస్తే, ఆ దైవత్వం అనే ముసుగుని తొలగిస్తానని ఆశిస్తున్నాను. నా మనసు ఒకచోట నిలవటంలేదు, త్వరగా కార్య రంగంలోకి దూకి ఆ దేవతల రాకుమారుడిని ముఖాముఖి కలుసుకోవాలన్న ఆత్రుత మొదలైంది. నాకన్నా వయసులో అతను చాలా చిన్నవాడు, కానీ నా చేతుల్లో బలం ఇంకా క్షీణించలేదు. నన్ను యుద్ధభూమికి వెళ్లద్దనీ, అది చాలా ప్రమాదకరంగా మారవచ్చనీ ప్రహస్తుడు ముందే నన్ను హెచ్చరించాడు. మా మధ్యలోనే చాలామంది నమ్మకద్రోహులు ఉన్నారు. నా సైనికులవైపునుంచే ఏదో ఒక బాణం వచ్చి నాకు తగిలితే అసుర సామ్రాజ్యం శాశ్వతంగా అంతమైపోతుంది. కానీ నాకు యుద్ధం చెయ్యాలని తీవ్రమైన కోరిక కలిగింది. నా ప్రజలు తీవ్రమైన ఆపదలో ఉంటే నేను మాత్రం నా మందిరం తలుపులు మూసుకుని ఎలా కూర్చోను? ఒక భటుడిని పిలిచి కాపలావాళ్లని గది బైట వరసగా నిలబడమన్నానని చెప్పమన్నాను. నా అంత ఒడ్డూపొడుగూ ఉన్న ఒకడిని ఎంచుకుని

మిగతావారిని వెళ్లిపొమ్మన్నాను. వాడిచేత తను వేసుకున్న దుస్తులు విప్పేయించాను. ఒక చిన్న గదిలో వాడిని పెట్టి తాళం వేశాను. ఆ తరవాత వాడి దుస్తులు నేను వేసుకుని యుద్ధభూమికి బైలుదేరాను. నేను చేస్తున్నది చాలా తెలివితక్కువ పని అనీ, పరిపక్వతలేని పిల్లలు చేసే పని అనీ నాకు తెలుసు. కానీ యుద్ధానికి వెళ్లకుండా ఉండటం నాకు సాధ్యం కాలేదు. నేను యుద్ధరంగంలోకి దూకి, మా సేన ఎలా పోరాడుతోందో చూడాలనుకున్నాను.

అశ్వశాలకి వెళ్లి కంటికి కనిపించిన మొదటి గుర్రాన్నెక్కి తూర్పుద్వారాల వైపు దౌడుతీశాను. అక్కడ ఒక ధూళి మేఘం ఆకాశంలోకి లేవటం కనిపించింది. యుద్ధస్థలంలోకి ప్రవేశించగానే అక్కడ కనిపించిన అయోమయం, హింసా ఊహకి అందనట్టు ఉంది. ముందుగానే అనుకున్నట్టు సురాంతకుడు ఏనుగులని నరవానరులమీదికి వదిలాడు. కోట గోడలకీ, పక్కనే 300 అడుగుల ఎత్తు ఉన్న కొండ శిఖరానికీ మధ్యన, ఇరుకైన ప్రదేశంలో చిక్కడిపోయారు. కోట ద్వారాలు తెరిచి ఉండటం చూసి లోపలికి హడావిడిగా వచ్చిన వానర కాల్బలాలు దాడిచేస్తున్న ఏనుగులకీ, రుద్రకుడి శక్తిమంతమైన అశ్వదళ సైన్యానికీ మధ్య చిక్కుకుపోయాయి. కోటలోపల ఉన్న చిన్న గుట్టమీదికి ఎక్కి అక్కడినుంచి స్పష్టంగా కనిపించే దృశ్యాలని చూడసాగాను. వానరుల సంహారం జోరుగా సాగుతోంది, శిఖరం పైనుంచి పెద్దపెద్ద బండరాళ్లు వాళ్లమీదికి దొర్లినప్పుడు, వాటికింద ఘనోరంగా నలిగి చనిపోతున్నారు. రుద్రకుడి సైనికులు బాణాల వర్షం కురిపిస్తున్నారు. అసహాయులైన వానరుల మీదికి పెద్దపెద్ద పీపాలతో మరిగేనూనె కుమ్మరిస్తున్నారు. ఆ నూనె కొంత చింది విధ్వంసం సృష్టిస్తున్న మదపుటేనుగులమీద పడి అవి బాధతో పిచ్చెక్కిపోతున్నాయి. శత్రు ఆక్రమణకి సుగ్రీవుడు నాయకత్వం వహిస్తున్నాడు. తన సైనికులని ఒకచోట సమకూర్చి ఉంచేందుకు విఫలప్రయత్నం చేస్తున్నాడు. బాణాలు అతని తలపక్కనుంచి చాలా దగ్గరగా దూసుకుపోసాగాయి. కొన్ని అతని భుజాలలోనూ,

తొడలలోనూ దిగబడ్డాయి, కానీ ఆ వానరరాజు పోరాటం కొనసాగిస్తూనే ఉన్నాడు. అయినప్పటికీ అతనికి పారిపోయేందుకు మార్గం లేకుండా పోయింది. ప్రాణాలతో ఈ ఉచ్చునుంచి బైటపడటం అతనికి అసాధ్యమే. రుద్రకుడు ఆ విషయం చూసుకుంటాడు. మా వ్యూహంలో ఈ భాగం చక్కగా పనిచేసింది. నేను ఉత్తరదిక్కు అంచుకి గుర్రాన్ని పరిగెత్తించాను. అక్కడ రాముడూ, లక్ష్మణుడూ యుద్ధానికి నాయకత్వం వహిస్తున్నారు.

శత్రుసైన్యం ఉత్తర ద్వారాలను చేరేదాకా మేఘనాదుడు ఎదురుచూశాడు. అప్పుడు అసురుల రథాలు కోట బైటినుంచి లోపలికి ప్రవేశించాయి. అర్ధరాత్రి గుర్రాలని దగ్గరలో ఉన్న అడవిలోకి నడిపించి అక్కడ దాచి ఉంచారు. ఉత్తర ద్వారం దగ్గర ఒక చిన్నపాటి సైనికదళం మాత్రం ఉంది. రథాలని కూడా భాగాలు వేటికవి విడదీసి అడవిలోకి మోసుకువెళ్లారు. తరవాత తెల్లవారే లోపల, రథాలని మళ్లీ కూర్చి, సూర్యుడు బాగా పైకి వచ్చేవేళకి మేఘనాదుడి రథసారథులు లోపలికి ప్రవేశించి రాముడిమీద వెనకనుంచి దాడిచేశారు. ఈ లోపల ప్రహస్తుడు వరుణుడి నౌకాదళాలని దూరంగా తరిమివెయ్యటంలో కృతకృత్యుడయాడు. ఇక రాముడి సేనలకి నౌకాదళాల సాయం లేకుండా పోయింది. అద్భుతమైన వేగంతో మేఘనాదుడి రథసారథులు వానర సైన్యాన్ని చుట్టుముట్టి వాళ్లని ఊచకోత కొయ్యసాగారు. ఉదయం జరిగిన దాడి సమయంలో చెట్లలోనూ, దుర్గంలోనూ దాగి, బైటికి రాని అసురులు ముందే పన్నిన వ్యూహం ప్రకారం ఒక్కసారిగా విరుచుకుపడి రాముడి సైనికులమీద బాణాల వర్షం కురిపించారు. అన్నదమ్ములిద్దరూ చిక్కుకుపోయారు. ఒక సైనిక పార్శ్వాన్ని మేఘనాదుడు ఆపివేశాడు. 'మరి మరో పార్శ్వాన్ని ఎవరు నిర్వహిస్తున్నారు?' నేను మెడ చాచి చూడటానికి ప్రయత్నించాను. అది ఎవరైనప్పటికీ మేఘనాదుడికన్నా మెరుగ్గానే నిర్వహిస్తున్నాడు. తరవాత దుమ్ము అణగిపోయాక, నాకు ఆ వ్యక్తి కనిపించాడు. వాడెవడో కాదు, నా కుమారుడు, అతికాయుడు! వానరసేనని

అన్నివైపులనుంచీ ముట్టడించి అసురులు వానరులని అధికసంఖ్యలో తెగనరుకుతున్నారు. హనుమంతుడి కాల్బలాలు మాత్రం చాలా ధైర్యంగానూ, దృఢనిశ్చయంతోనూ ఇంకా పోరాడుతూనే ఉన్నాయి. రాముడి సైన్యంలో అధికభాగం సగం కూలిపోయిన వంతెనకి అటువైపు చిక్కుకుపోయింది.

రహస్యంగా తిరుగుతున్న తెప్పలూ, ప్రహస్తుడు హస్తగతం చేసుకున్న నౌకలూ, రాముడి సేనలో ముందువైపు నిర్లక్ష్యంగా చొచ్చుకువచ్చినవాళ్లని అప్రమత్తంగా వెనక ఉండిపోయిన వాళ్లనీ - వేరుచేశాయి. వెనకవైపు, జిత్తులమారి అధముడైన జాంబవంతుడి నేతృత్వంలో, ప్రధాన భూభాగంలో సగం సేన ఉండిపోయింది. జాంబవంతుడి వయసు ఎనభై పైనే ఉంటుంది. వాలి దగ్గర సేనానాయకుడిగా పనిచేసిన ఆ ద్రోహి ప్రస్తుతం ఇంకా సుగ్రీవుడి కొలువులోనే ఉన్నాడు. నా అపరిపక్వమైన మనసు ఇంకా శౌర్యం నిండిన పనులు చెయ్యాలని ఉవ్విళ్లూరటం చూసి విస్తుపోతూ నేను మళ్లీ భవనంవైపు బైలుదేరాను. నా సైన్యం వ్యూహం ప్రకారమే పోరాడుతోంది. అంతా సవ్యంగా జరిగితే ఈ రాత్రికే మేము విజయోత్సవం జరుపుకుంటాం. భవనం ద్వారం దగ్గరకి చేరుకోగానే మారువేషాన్ని తొలగించాను. కానీ జాంబవంతుడి మౌనం నన్ను కలతకి గురిచేసింది. 'ఆ జిత్తులమారి, శత్రుసైన్యాధిపతి, ముసలితొక్కు ఎందుకు తన సైన్యాన్ని వెనక్కి నిలిపి ఉంచాడు? ఇది ఇంకొక పన్నాగమా? అన్నట్టు, వరుణుడు ఏడీ?' నాకు అందిన సమాచారం బట్టి అతను సముద్రంలోపలికి దీవికి దూరంగా, ప్రధాన భూభాగంవైపు చాలాదూరం తన నౌకలతో వెళ్లిపోయాడని తెలిసింది. కానీ సముద్రపు దొంగల రాజు అలా ప్రవర్తించటం ఆశ్చర్యమే. 'ఎక్కడో ఏదో ఉంది, దాన్ని నేను చూడలేకపోతున్నాను,' ప్రహస్తుడు లేనిలోటు నాకు తెలిసొస్తోంది.

నా కుమార్తెని చూసేందుకు ఉద్యానవనం వైపు నడిచాను. అక్కడ ఆ ఉద్యానవనంలోని ప్రపంచమే వేరు. ఎంతో జాగ్రత్తగా వినగలిగినవాళ్లకే అస్పష్టమైన యుద్ధకోలాహలం వినిపిస్తుంది. దాన్ని

అవతలపెడితే, సామాన్యంగా ప్రతిరోజూ ఉండే వాతావరణమే కనిపించింది అక్కడ. యుద్ధం గురించీ, రాముడి గురించీ తలెత్తే ఆలోచనలని అణచివేసి, విశాలమైన ఒక చింతచెట్టు నీడలో నిలబడి, నా చుట్టూ ఉన్న అందమైన ప్రపంచాన్ని చూడటంలో నిమగ్నమైపోయాను. సముద్రం అలల చప్పుడు మంద్రస్థాయిలో వినబడుతోంది, ఆకులు గాలికి రెపరెపలాడు తున్నాయి. నా పెరటిలో కీచురాళ్లు సృష్టిస్తున్న వాద్యబృందం లయ వినిపించ సాగింది. ఈ దీవి అడవులలోనూ, ప్రధాన భూభాగంలోని సహ్యాద్రి ప్రాంతాల్లో నేను గడిపిన బాల్యం హఠాత్తుగా నా మనసులో మెదిలింది. ఈ మనసు బాధా కరమైన గతాన్నీ నిరుపేద జీవితాన్నీ రోజూ భరించిన అవమానాలనీ, ఆకలితో అలమటించిన రోజులనీ ఎంత సులభంగా మరిచిపోయి, శాశ్వతంగా చేజారిపోయిన చిన్నచిన్న ఆనందాలని మాత్రం ఎలా గుర్తుంచుకుంటుందో! చిత్రంగా, ఊహల్లో సృష్టించుకున్న అద్భుతాలు నిజంగా జరగకపోయినా, రహస్యంగా అల్లుకున్న ఆశలూ, తీయని కోరికలూ చెదురుమదురుగా గుర్తుండిపోతాయి. మనసుతో వినగలిగితే, ఈ లోకంలో ఎన్నో చిన్నచిన్న విషయాలు ఉన్నాయి - కోయిల కూతలు, ఉడతల కిచకిచలు లాంటివి - వాటిల్లో బాధాకరమైన విషయాలు నీడల్లో దాక్కున్నట్టు మాయమైపోతాయి. ఏనాడో మరిచిపోయిన ఆనందం మళ్లీ వెల్లివిరుస్తుంది.

అశోకవృక్షం కింద కూర్చున్న ఆమె అలౌకిక సౌందర్యంతో మెరిసిపోతోంది. ఆమె పక్కనే త్రిజట కూర్చుని ఉంది. సీత దగ్గర ఆమె ఉండటం నాకు నచ్చలేదు. నా కుమార్తెతో ఒంటరిగా మాట్లాడాలని అనుకున్నాను. త్రిజటలో ఆమె తిరుగుబోతు తండ్రి లక్షణాలు ఎన్నోఉన్నాయి. కుంభకర్ణుడు విడిగా వ్యభిచార జీవితం గడుపు తున్నాడు. దృఢసంకల్పం, మంచి నడవడీ లోపించటం చేత వాడికి ఒకప్పుడు ఉండిన గొప్ప గొప్ప ఆశయాలూ, కోరికలూ ఎటో పోయాయి. తన మందిరంలో ఎప్పుడూ మద్యం మత్తులో పడి ఉంటాడు. తరగని కీర్తికోసం, తన సొంత సామ్రాజ్యం కోసం తహతహలాడాడు కానీ

జీవితంలో గొప్పగొప్ప విజయాలని సాధించాలన్న పట్టుదల లేకపోయింది. బహుశా అన్నగా నేనే ఎప్పుడూ పెత్తనం చెయ్యటంవల్ల వాడు పైకి రాలేకపోయాడేమో. ఇక మీరు సాఫల్యం సాధిస్తే మీ తోబుట్టువులకి కలిగినంత బాధ ఇంక ఎవరికీ కలగదు. బహుశా నేను ఇలా రూపొందటం నా దురదృష్టమేనేమో. కష్టపడి పనిచెయ్యటం, దృఢసంకల్పం, గొప్ప ఆకాంక్ష - ఒక వ్యక్తి భవితవ్యాన్ని నిర్ణయించేవి ఇవేనని నమ్మలేని వయసులో ప్రస్తుతం నేను ఉన్నట్టున్నాను. నాలోని నాస్తికుడు మరణించాడు. ఎటువంటి గుర్తింపుకీ నోచుకోని ఆ మరణం సంభవించి చాలాకాలం అయింది. మనిషే తన తలరాతని సృష్టించుకుంటాడు తప్ప ఇంకేదీ కాదని అమాయకంగా నమ్మేటంత మూర్ఖుడిని కాను. నేను జీవితంలో చాలా చూశాను. ఎన్నో సంవత్సరాలక్రితం ఆ చీకటి గుహలో నిజమైన అసుర చక్రవర్తితో చిన్నపిల్లవాడిలా నేను మాట్లాడిన మాటలు తలుచుకుంటే ఇప్పుడు నాకు సిగ్గనిపిస్తుంది. నా తెలివితేటలు ప్రదర్శించి ఆ వృద్ధుడిని ఆకట్టుకునేందుకు నేను మూర్ఖంగా, పొగరుగా ఊకదంపుడు వేదాంతం చెప్పటం గుర్తుకొచ్చి నవ్వొచ్చింది. మనిషి మనసుతో గ్రహించలేనిది, లోకజ్ఞానాన్ని ధిక్కరించేది ఏదో ఉంది. దృఢసంకల్పం, శ్రమలాంటి గురువులు చెప్పేవన్నీ అనుకోకుండా జరిగే సంఘటనలకి ఎలా ప్రతిస్పందించాలన్నది నిర్ణయించటానికే పనికివస్తాయి. కానీ నాకు ఈ ప్రపంచంలోని విషయాలలో ఒక పద్ధతీ, తీరూ కనిపించాయి. రాత్రీ, పగలూ ఒకటి తర్వాత మరొకటి రావటం, ప్రాణులు పట్టటం, జీవించటం, మరణించటం లాంటివి పద్ధతి ప్రకారమే జరుగుతున్నాయి. అయినప్పటికీ కొన్ని యాదృచ్ఛికంగా జరిగే సంఘటనలకి వివరణ ఇవ్వాలంటే వాటిని విధి, తలరాత అనక తప్పదు.

సీత నవ్వు నన్ను నా ఆలోచనల్లోంచి బైటపడవేసింది. ఆమెవైపు చూశాను. ఆమె అందం అలౌకికంగా కనిపించింది. తన స్ఫూర్తినీ, భావోద్రేకాన్నీ నానుంచీ, బాహ్యసౌందర్యాన్ని తన తల్లినుంచీ పుణికిపుచ్చుకుంది.

"ఓ, రాజాధిరాజా, అసుర సార్వభౌమా... నన్నుకలుసుకునేందుకు వచ్చావా? రావణా, ఇక ఘడియలు లెక్కపెట్టుకో. నా రాముడు నిన్నూ పాపకూపంలాంటి నీ సామ్రాజ్యాన్నీ అంతమొందించేందుకు వచ్చాడు. మీరందరూ, రాక్షసులూ, మీరు నిర్మించుకున్నవి అన్నీ మీరు చూసుకునిగర్వించే సమస్తం, త్వరలో బుగ్గిపాలవుతాయి. నన్ను విడిపించేందుకు నా భర్త వచ్చాడు, నీ దుష్ట సామ్రాజ్యం కూలిపోవటం తథ్యం. నీ కుటుంబసభ్యుల ప్రాణాలమీద నీకు ఏమాత్రం తీపి ఉన్నా వెళ్లి ఆయన కాళ్లమీద పడు. కానీ నువ్వు ఆ పని చెయ్యవని నాకు తెలుసు. నీలో అహంభావమే తప్ప అటువంటి తెలివితేటలు లేవు. నా మాటలు గుర్తుంచుకో, రాక్షసుడా! నీకు సమయం ఆసన్నమైంది," అని ఆమె వికటాట్టహాసం చెయ్యసాగింది. ఆమె ముఖంలోని ద్వేషం చూసేందుకు రోతపుట్టించింది. త్రిజట సంకోచంగా, భయంగా నాకేసి చూసింది.

నిరాశకి గురై ఇబ్బందిగా వెనక్కి తిరిగాను. 'నేనే ఆమె తండ్రినన్న నిజం ఎందుకు చెప్పులేకపోతున్నాను?' ఆమెని తన భర్తనుంచి కాపాడేందుకు ప్రయత్నిస్తున్నాను. కానీ ఆమె ముఖంలోకి చూసి ఏవో మూఢనమ్మకాలవల్ల ఆమెని వదిలిపెట్టేశానని ఎలా చెపుతాను? పైగా ఆమెకి తన భర్తమీద ఉన్న తీవ్రమైన ప్రేమని ఎలా నిర్లక్ష్యం చెయ్యను? భర్తకన్నా తన తండ్రే తనని ఎక్కువ ప్రేమిస్తున్నాడు అని ఈమెకి ఎందుకు అర్థం కాదు? ఆమె సంతోషం కోసం నాదగ్గర ఉన్నదంతా పణం పెడుతున్నానని ఎందుకు గ్రహించదు? కానీ తను తన భర్తతో సుఖంగా ఉండలేదనీ, తనకి నేను కల్పిస్తున్న భద్రత తొలగిపోగానే తన కష్టాలు మొదలవు తాయనీ కూడా ఆమె తెలుసుకోలేకపోతోంది కదా? బహుశా నన్ను నేనే మోసగించుకున్నానేమో. అందరికన్నా ఆదర్శదంపతుల్లా వాళ్లిదరూ ఆనందంగా జీవిస్తారేమో - నల్లని దేవతా రాకుమారుడూ, అప్సరసలాంటి అతని భార్యా - వాళ్ల ఆనందాన్నిపాడుచేసిన దుష్ట రాక్షసుడిగా నేను పేరు సంపాదించుకుంటానేమో, అన్ని శకునాలూ, జ్యోతిష్కులు చెప్పిన భవిష్యత్తూ ఆమె తీవ్రమైన దుఃఖంతో జీవితం

గడుపుతుందని సూచించాయి. నాకూ నా వాళ్లకీ ఘోరమైన భవిష్యత్తు ఉంటుందని కూడా చెప్పాయి. మరి ఈ రావణుడు జరగబోయేదానిని మార్చగలడా? బహుశా యౌవనంలో నేను అనుకున్నదే నిజం అయి ఉండవచ్చు. జ్యోతిషం ఉత్త బూటకమే అయి ఉంటుంది. నా భవిష్యత్తుని నేనే నిర్ణయిస్తాను. ఎక్కడో దూరంగా చిక్కటి నల్లటి కాశంలో ఉదయించి అస్తమించే నక్షత్రాలకి ఏం పట్టింది? కానీ నా కుమార్తె నామీద అంత ద్వేషాన్నీ ప్రతీకార వాంఛనీ ఎందుకు పెంచుకుంది? ఏ తండ్రీ కూడా ఇటువంటి చిత్రహింసకి గురికాకూడదు. బహుశా నాకు చివరిరోజులు దగ్గరపడ్డాయేమో. లేకపోతే ఈమెకోసం నా మొత్తం జీవితాన్ని ఎందుకు పందెం కాస్తాను? ఈ క్షణాన వేలమంది హతమార్చబడుతున్నారు - తండ్రులు, సోదరులు, పుత్రులు - నన్ను నమ్మి నాకోసం యుద్ధం చేస్తున్న కుటుంబాలు. బహుశా నా మృత్యువు సమీపించటం సమంజసమేనేమో. నేను ఒక అప్రయోజకుడైన రాజుని, నా ప్రజలని అనవసరమైన యుద్ధంలోకి ఈడ్చాను. వాళ్లకి మృత్యువునీ, నాశనాన్నీ కలగజేశాను. కానీ రాముడు సీతతో ఎలా వ్యవహరిస్తాడో తెలిసి కూడా నా కుమార్తెని అతనికి ఎలా అప్పగించను? విధి ఎలా ఉంటే అలా జరగనీ, చివరిక్షణందాకా పోరాడతాను. బహుశా జయిస్తానేమో.

భవనం బైట యుద్ధం తీవ్రస్థాయికి చేరుకుంది. నీడలు పొడవుగా మారి, అద్భుతమైన కెంపురంగు నగరమంతటా పరుచుకుంది. అన్నీ ఆ అలౌకికమైన వెలుగులో మునిగితేలాయి. నా కుమార్తె అన్న మాటలు నా చెవుల్లో మారుమోగ సాగాయి, “నువ్వు నిర్మించినదంతా నాశనమౌతుంది, నీ ప్రజలందరూ బుగ్గిపాలవు తారు.” తాగుడు మైకంలో అన్నీ మరిచిపోవాలని అనుకున్నాను. నా భవనంలో ప్రవేశించానో లేదో వాళ్లు నా సేనాపతి, రుద్రకుడి నిర్జీవ శరీరాన్ని మోసుకువచ్చారు. బహుశా నా కుమార్తెకి నాకన్నా ఎక్కువ తెలుసేమో.

39. ఒక వీరుడి పునరాగమనం

భద్రుడు

నా పూరిపాక బైటి అరుగుమీద కూర్చున్నాను. పొగలుకక్కుతున్న గంజీ, మామిడి కాయ పచ్చడీ నా భార్య నా పక్కన పెట్టి వెళ్లింది. అది కాస్తా చల్లారిపోయింది. ఈగలకి ధైర్యంవచ్చి పాత్ర అంచుమీద ఎక్కువసేపు వాలి ఉండటం మొదలు పెట్టాయి. వాటిని తోలే ఓపిక కూడా నాకు లేకపోయింది. వంటగదిలో నా భార్య తన పనులు చేసుకుంటూ ఉంది. బాగా పరిచయమున్న పాత్రల చప్పుడూ, కుండలలో పదార్థాన్ని కలియబెడుతున్న చప్పుడూ వినిపిస్తున్నాయి. నాకు సన్నగా తలదిమ్మ రావటం మొదలైంది - నిన్న తాగుడు తాలూకు ప్రభావం. నా పని మందకొడిగా సాగుతోంది. రేపు ప్రాణాలతో ఉంటామో లేదో తెలీనప్పుడు బట్టలు ఎవరు ఉతికించుకుంటూరు?

నా కొడుకుని వాడి ఖర్మకి వదిలెయ్యక చేసేదేమీలేదని నేను నిశ్చయించు కున్నప్పటికీ, ఆ పొడవాటి, లావుపాటి ఆకారం ఎప్పుడు కనిపిస్తుందా అని చూసేందుకు తహతహలాడుతూనే ఉన్నాను. ఒక్కోసారి వాడు గాయపడైనాసరే ఇంటికి వస్తే చాలనీ, వాడికి చికిత్సచేసి మళ్లీ ఆరోగ్యంగా తయారుచేద్దామనీ అనుకుంటాను. కానీ వాడు యుద్ధభూమినీ, తన సోదరుడూ, స్నేహితుడూ అయిన మేఘనాదుడినీ వదిలి రాడని నాకు తెలుసు. యుద్ధం మొదలైనప్పటినుంచీ మృత్యువు చాలాసార్లు మా వీధిలోకి కదంతొక్కుతూ వచ్చింది. మా ఇరుగుపొరుగు వారిలో చాలామంది తమ వారిని కోల్పోయారు. గాలిలో ఒక విధమైన జడత్వం చోటుచేసుకుంది. ప్రారంభంలో అందరూ భావోద్రేకాలకు గురయారు. మరణించిన వీరుల శవయాత్రలను వీధుల్లో చూసి జనం తట్టుకోలేక ఉద్రేకానికి గురయారు. కానీ శవాల సంఖ్య పెరుగుతూపోయేసరికి

మృత్యువు, మరణించటం అనేది పాతబడిపోయి శౌర్యం విలువ తగ్గిపోయి అది సామాన్య విషయంగా మారింది. మహాకావ్యాల్లోని వీరుల్లా అసువులుబాసిన యోధుల సమీప కుటుంబసభ్యులు మాత్రం వాళ్లకోసం విచారించారు. అయితే అది అంత చెప్పుకోదగ్గది కాదు. మరణించినవారిపట్ల అంతటా నిర్లక్ష్యభావమే ప్రదర్శించబడింది. మొత్తం రాజ్యంలోని వారందరూ తప్పించుకోలేని పరిణామాలని నివారించే ప్రయత్నంలో ఒక డిప్పలోకి ముడుచుకు పోయారా అనిపించింది. తండ్రులు ఛిద్రమైన తమ పుత్రుల నిర్జీవ శరీరాలని చితులమీద పేరుస్తున్నప్పుడు వాళ్ల మనసులు తీవ్రంగా మొద్దుబారి పోయాయి. తల్లులు ఒకచోట చేరి, ఒకరినొకరు పట్టుకుని మౌనంగా కన్నీరు కార్చారు. వితంతువులు తమ ఏకాంతగృహాల్లోకి బాధగా ఒదిగిపోయారు. మొద్దు బారిపోయిన ఈ భావోద్రేకాల మీద భయం, ఇంకా భయంకరమైన భవిష్యత్తుపైన వేలాడే కత్తిలా, పాపం, విభీషణుడి అధీనంలో ఉన్న అసురులని భయపెట్టసాగింది.

వీధులు ఎప్పుడో నిర్మానుష్యంగా మారాయి. చాలామంది అసుర పౌరులు పారిపోయారు. కొందరు అడవుల్లో దాక్కుంటే, ఇంకొందరు తెప్పల్లోనూ, పడవల్లోనూ ప్రధాన భూభాగానికి పారిపోయారు. కానీ ఎక్కువమంది తమ ఇళ్లల్లో తలుపులు అన్నీ మూసుకుని ఉండిపోయారు, ఏ క్షణాన్నైనా విరిగిపోయేందుకు సిద్ధంగా ఉన్న వీధితలుపలకి గడియలు పెట్టి, భారీ వస్తువులు అడ్డంపెట్టి రక్షణ కల్పించుకున్నారు. కులీనులు గ్రహించే లోపలే, పేద అసురులకి ఓటమి తప్పదన్న విషయం, సర్వనాశనం జరిగి తీరుతుందన్న అనుమానం కలిగాయి. కానీ ఎవరూ ఆ విషయం గురించి బాహాటంగా మాట్లాడుకోలేదు. రాత్రిళ్లు భయపెట్టాయి. నీడలు పొడవుగా మారాయి. ఎన్నడూ లేనంత హడలు పుట్టుకొచ్చింది మాకు. యుద్ధం ప్రారంభమై పదిరోజులు అయింది, రెండువైపులా భారీ నష్టం జరిగింది. శత్రువు గురించి సమాచారం ఏమీ అందలేదు. మా మంత్రులూ, సేనానాయకులూ - రుద్రకుడూ, వజ్రదంష్ట్రుడూ, సుమాలీ,

మాల్యవంతుడూ - అందరూ మరణించారు. అసురసేనలో నాయకులు ఒక్కరొక్కరే మరణిస్తున్నారు. గొప్ప ధీశాలి ప్రహస్తుడు మాత్రం వరుణుడిని అడ్డుకొని రాముడు సముద్రమార్గంలోనుంచి పారిపోకుండా చూస్తున్నాడు. యువరాజు మేఘనాదుడు కూడా జీవించి ఉన్నాడు. యుద్ధవిద్యల్లో ఆరితేరిన ఈ ఇద్దరు యోధులు మాత్రమే మిగిలాడు. వృద్ధుడు మయుడు ఎప్పుడూ తన లోకంలో తానుంటాడు, కానీ నాయకులు ఎవరూ లేనందున ఆయనని నాయకత్వం వహించమని కోరారనీ, ఆయన నిరాకరించాడనీ విన్నాం. ఆర్థికమంత్రి, జంబుమాలి కూడా నడిచే ఓపిక కూడా లేని వయోవృద్ధుడు. ఎనభైయ్యోపడిలో ఉన్న శాస్త్రవేత్తలని సైన్యంలో చేరి నాయకత్వం వహించమని అడుగుతున్నారంటే పరిస్థితి ఎంత విషమించిందో అర్థమవుతుంది. రావణుడే స్వయంగా సేనాధిపత్యం వహించాల్సింది, కానీ ఆయన కూడా వయసుపైబడటంచేత ఆ పని చేసేందుకు పనికిరాడేమో.

ఎందుకో అప్రయత్నంగా రాజభవనంవైపు వెళ్లాలన్న ఆలోచన వచ్చింది. బహుశా అతికాయుడు అక్కడే ఎక్కడో గాయపడి, ఇంకా ప్రాణాలతో ఉండి ఉంటాడు, వాడిని ఇంటికి తీసుకుపోవచ్చు అనిపించింది. నా చేతులు మురికిగా ఉన్న అంగవస్త్రానికి తుడుచుకుని, నా భార్యకి కూడా చెప్పకుండా, భవనంవైపు నడిచాను. కాసేపు ఆ వీధిలో నేను తప్ప ఇంకెవరూ లేరు. తరవాత దారిపక్కన తినుబండారాల అంగళ్లలో కొందరు గుమిగూడి ఉండటం కనిపించింది. వాళ్లు ఏవో కబుర్లు చెప్పుకుంటున్నారు. దాదాపు అన్ని ఇళ్లూ తలుపులు మూసేసి, ఇంట్లో ఎవరూ లేనట్టే ఉన్నాయి, కానీ అక్కడక్కడా కొన్ని మాత్రం, తమకి ఏమీ లెక్క లేదన్నట్టు వీధితలుపులు తెరిచిపెట్టి ఉన్నాయి. మూసిన తలుపుల వెనక కొన్ని ఇళ్లల్లోంచి అస్పష్టమైన ఏడుపులు వినిపిస్తున్నాయి. బహుశా ఎవరి భర్తో, కుమారుడో మరణించి ఉంటాడు. పైన ఎండ మండిపోతోంది, నాకు చెమటలు కారిపోతున్నాయి. స్నానంచేసి ఉండవలసింది అనుకున్నాను. రాజభవనం దగ్గరకి చేరుకునే వేళకి అతికాయుడికి

రాజభవనం లోపల చికిత్స జరుగుతూ ఉండవచ్చు అన్నఅసంబద్ధమైన ఊహ తలెత్తింది.

దూరంనుంచి ఎత్తైన రాజభవనం, అభేద్యంగా, అమంగళకరంగా కనిపించింది. దాని బంగారురంగు గోపురాలూ, కలశాలూ ఎండలో తళతళ మెరుస్తున్నాయి. 'బంగారం - చక్రవర్తి తన భవనం పైకప్పని అలంకరించేందుకు బంగారం ఉపయోగిస్తాడు. మాలాంటివాళ్లం ఒక పూట భోజనానికే మొహంవాచి జీవిస్తూ ఉంటాం!' ఆయన ఇలా దిగజారిపోవటం సమంజసమేనేమో. అయినా ఆయన క్రూరుడు కాదు. తన ప్రజలని ఉద్ధరించేందుకే ప్రయత్నించాడు. నాకు ప్రత్యేకమైన వ్యక్తిత్వం అంటూ ఏమీలేదు. శీఘ్రంగా బ్రాహ్మణ ప్రభావానికి లొంగిపోతున్న ఒక రాజ్యంలోని లక్షలమంది పేదప్రజల్లో నేను కూడా ఒకడిని. యుద్ధం ముగిసిన తరవాత నేను అస్పృశ్యుడిగా, ఈ భూమిమీద ఏమీ ఉపయోగం లేనివాడిలా మిగిలిపోతాను. ఎవరైనా ప్రముఖుడైన అధికారి అటుగా వచ్చి నన్ను గుర్తుపట్టి భవనం లోపలికి తీసుకువెళ్లకపోతాడా అనుకుని అక్కడే కూర్చుని వేచి చూడసాగాను. నా కొడుకు లోపల ఉన్నాడో లేదో తెలియాలి.

ఆ రోజు యుద్ధం అయిపోయిన తరవాత కోటలోకి తిరిగివస్తూ సైనికులు చేసే అడుగుల చప్పుడూ, వాళ్ల ఆయుధాల చప్పుడూ విని సాయంకాలం బాగా పొద్దుపోయాక నాకు మెలకువ వచ్చింది. అప్పటిదాకా బాగా డస్సిపోయి నిద్రపోతూనే ఉన్నాను. గాయపడినవారిని మరణించిన ప్రముఖులని లోపలికి మోసుకువచ్చారు. మామూలు సైనికులని రాబందులకోసం యుద్ధభూమిలోనే వదిలివచ్చారు. నా గుండె నాకే వినిపించేంతగా దడదడ కొట్టుకుంటూ ఉంటే నా అతికాయుడు ఎక్కడైనా కనిపిస్తాడేమోనని చూశాను. సైనికులందరూ ఉత్సాహంతో ఉరకలు వేస్తున్నారు. వరసగా కదనుతొక్కుతూ వస్తున్న సైనికుల మధ్యకి దూరి, మళ్లీ బైటికి వసూ మరణించిన వారి ముఖాలూ, గాయపడినవారి ముఖాలూ మెడ సారించి చూడసాగాను. అన్నివైపులనుంచీ వాళ్లు

నన్ను తోశారు, పక్కకి నెట్టారు, కానీ నేను దాన్ని పట్టించుకోలేదు. ఇంకా ఆత్రుతగా నా కొడుకుకోసం వెతకసాగాను. అప్పుడు కనిపించాడు వాడు, మేఘనాదుడితోపాటు రథంలో వస్తూ ఉన్నాడు. పొడుగ్గా, నల్లగా, లావుగా, మేఘనాదుడి పక్కనే నిటారుగా నిలబడి ఉన్నాడు. రాకుమారుడి ఒంటిమీది గాయాలనుంచి రక్తం కారుతోంది. అతికాయుడి ఛాతీకి లోతైన గాయం కనిపించింది. రక్తం మరకలున్న గుడ్డని వాడు దానికి పైపైన చుట్టుకున్నాడు. రథంవైపు పరిగెత్తాను, కానీ రాజకుమారుడి అంగరక్షకులు దురుసుగా నన్ను నెట్టివేశారు. "అతికాయా... కుమారా..." అని నేను అరిచిన అరుపు సైనికులు చేస్తున్న రొదలో వాడి చెవులకి వినిపించలేదు. పొడవుగా, భారీగా ఉన్న అసుర సైనికుల మధ్య నేను పొట్టిగా ఎవరికీ కనబడకుండా ఉండిపోయాను. 'ఈకాలం కుర్రవాళ్లు ఎంత పొడవుగా ఎదిగిపోతున్నారు!' వాడి దృష్టిని ఆకర్షించేందుకు రెండుచేతులూ పైకి ఎత్తి పిచ్చివాడిలా ఆడించాను. హఠాత్తుగా వాడు నావైపు చూశాడు. చేతులు ఊపుతూ రథంవైపుకి తోసుకువెళ్లటానికి ప్రయత్నించాను. ముందు ఆశ్చర్యంతో వాడి కళ్లు పెద్దవి అవటం, ఆ తరవాత ఆశ్చర్యం సంకోచంగా మారటం కనిపించింది నాకు. నా కొడుక్కి యువరాజుతో కలిసి అతని రథం ఎక్కి ఊరేగే అరుదైన అవకాశం లభించింది, నేను ఎటువంటి గుర్తింపూ లేని పేద చాకలిని, వాడి గొప్ప జీవితంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్నాను. ఆ ఒక్క చూపుతో నేను ధైర్యంగా నాలో పెంచుకున్న ఆ చిన్నపాటి ఆశని తుంచేశాడు వాడు. అయినా నేను పెంపుడు తండ్రినే కదా! వాడు ఒక నల్లటి అసురుడి పూరిపాకలో ఉండవలసినవాడు కాడు. వాడి ఒంట్లో చక్రవర్తి రక్తం ప్రవహిస్తోంది. అక్రమసంతానమే అయినప్పటికీ వాడు సగం రాకుమారుడే. వాడు ఉన్న ప్రపంచంలో నాలాంటి కీటకాలకి స్థానం లేదు. అక్కడ శక్తిమంతులైన పురుషులూ, పేరుప్రతిష్టలు సంపాదించుకున్న వీరులూ ఉంటారు. వాళ్లు చనిపోయాక కూడా వేల సంవత్సరాలదాకా వాళ్ల గురించి జనం గొప్పగా చెప్పుకుంటారు. భద్రుడిలాంటివాళ్లు అక్కడ లెక్కలోకి రారు.

హఠాత్తుగా రాకుమారుడి దృష్టి నామీద పడింది. అతను సైగ చెయ్యగానే బారులుతీరిన అంగరక్షకులు పక్కకి తొలిగారు. అప్పుడు నేను భయంభయంగా రథంవైపు నడిచాను. 'ఈ సైనికుల వరుస మొత్తం నాకోసం ఆగిపోయిందా? దగ్గరకి వెళ్ళాక నాకు పరాభవం ఎదురవుతుందా?' రాకుమారుడు అలసటతో కూడిన చిరునవ్వు నవ్వుతూ నాకేసి ఆప్యాయంగా చూశాడు. నేను గౌరవంగా కొద్ది దూరాన నిలబడ్డాను. నా కొడుకు నావైపు చూడకుండా ముఖం తిప్పేసుకున్నాడు. ముడతలుపడ్డ నా వృద్ధ శరీరం వాడికి అవమానకరంగా తోచినట్టుంది. నామీద నాకే సిగ్గు వెయ్యటం ప్రారంభించింది. నేను స్నానం చేసి బైలుదేరవలసింది. నా ఒళ్లంతా కుళువాసనతో కంపు కొడుతోంది. రాకుమారుడు నన్నుదగ్గరకి రమ్మన్నాడు కానీ నేను అక్కడినుంచి కదల్లేదు. నా పక్కనే ఉన్న ఒక సైనికుడు మొరిగినట్టుగా, "ఒరే దద్దమ్మా! ప్రభువు నిన్ను పిలుస్తున్నారని తెలీటం లేదా?" అని అరిచాడు.

భయంభయంగా రథం దగ్గరకి నడిచాను. నేను దగ్గరకి వెళ్లగానే రాకుమారుడు నావైపు తన చేతిని చాచాడు. రాజసం ఉట్టిపడుతున్న ఆ వేళ్లని తాకలేకపోయాను. కానీ ఇంతలో ఆయనే గబుక్కున నా చెయ్యి అందుకుని రథంలోకి నన్ను లాక్కున్నాడు. అందరూ నిర్ఘాంతపోయారు. ఒక తుచ్ఛుడైన బికారి అసుర రాకుమారుడి రథంలో ఆయనతోపాటు ఎక్కటమా? నాకు గర్వంగా అనిపించింది. ఇతని తండ్రి నా స్నేహితుడని అనుకునే సాహసం చేశాను, కానీ ఆయన ఒక్కసారి కూడా ఇటువంటి పని చెయ్యలేదు. పక్కకి తిరిగి చూసేసరికి నా పెంపుడు కొడుకు కళ్లలో నామీద ద్వేషం కనిపించింది. వాడిలో అవమానం అనే భావనకి కారణం నాకూ తెలిసింది. రాకుమారుడు ఒక నిమ్నకులంవాడిని తనతోపాటు రథం ఎక్కించి విజయోత్సవ వేళలో సమానంగా చూస్తున్నాననప్రదర్శనతో రాజకీయంగా ఒక అడుగు ముందుకి వేశాడు. అది ఒకవేళ ఉదాత్త హృదయంలోనుంచి వచ్చిన నిజాయితీగల చేష్టే అయి ఉండవచ్చు, కానీ జీవితంలో ఇంతక్రితం

జరిగిన అనుభవాలవల్ల అలాంటి మంచి ఆలోచన నాకు రాలేదు. ధనవంతులూ బలవంతులూ ఏ పనిచేసినా, అది దానధర్మాలే అయినా, సానుభూతీ ఉదారతా అయినా, దాని వెనుక స్వార్థమే ఉంటుంది. నా పనికిమాలిన జీవితంలో నేను తెలుసుకున్న పచ్చినిజం అది. ధనవంతుల కళ్లలో జాలి చూశాను, నావంటివారిపట్ల మంచిగా ఉండటంలో వాళ్లు గర్వం అనుభవించటం చూశాను, కానీ వీటన్నిటికన్నా ఎక్కువగా భయం చూశాను, చివరికి ఎంతో శక్తిమంతుడైన రావణుడి కళ్లలో కూడా. మేమంటే వాళ్లకి భయం, సాధుజంతువుల్లా, అజ్ఞానంతో, నల్లగా ఉండే ఈ లోకంలోని పేదప్రజలం మేము. జాలి, మమ్మల్ని తామే పోషిస్తున్నామన్న భావన, దాతృత్వం, అహంకారం, గర్వం, నిర్లక్ష్యం - ఇవన్నీ ధనవంతులు తమ భయాన్ని అధిగమించేందుకు ఉపయోగించే ఉపాయాలు.

అకస్మాత్తుగా ఆ అసుర రాకుమారుడి మీద నాకు ఆధిపత్యం ఉన్నట్టు అనిపించింది - అతిసామాన్యమైన విషయానికి అద్భుతమైన ఒక విషయం మీద ఉండే ఆధిపత్యం. అంతా నాకు స్పష్టంగా అర్థం అవసాగింది. ఇతను ఇంకా పూర్తిగా వికసించని పుష్పంలాగ యుద్ధంలో యౌవనంలోనే వాడిపోతాడు కానీ నేను జీవించే ఉంటాను. నేను వీధుల్లో అడుక్కుంటూ, నా రోజువారీ పోరాటాలతో సతమతమవుతూ జీవించే ఉంటాను. అతను శాశ్వతంగా ప్రతిష్ఠని సంపాదించుకుని చరిత్రపటల్లోనుంచి తొంగిచూస్తూనే ఉంటాడు. నా గురించి ఏ కవీ గానం చెయ్యడు, కానీ కవుల గురించి నాకెందుకు? నన్ను ఎవరూ కూడా దేవుడిగా ప్రతిష్ఠించరు, కానీ దేవుళ్లు ఎందుకూ పనికిరానివారు, వాళ్లలా తయారవాలని ఎవరికి ఉంటుంది? ఈ యుద్ధం త్వరలో ముగిసిపోతుంది. దానివెంటే వీరుల యుద్ధ జీవితాలూ, దుర్మార్గుల యుద్ధజీవితాలూ కూడా అంతమొందుతాయి. కానీ నా జీవితం కొనసాగుతూనే ఉంటుంది. నాలాంటి కొన్ని లక్షలమంది ఈ భూమి నలుమూలలా తిండికోసం, నీటికోసం, గాలికోసం, గూడుకోసం, కాస్తంత ఆత్మాభిమానం కోసం చిన్నచిన్న యుద్ధాలు చేస్తూనే ఉంటారు.

నేనింకా ఇలా ఆలోచనల్లో మునిగి ఉండగా, "ఈ రోజు మీ కుమారుడు నా ప్రాణాలని కాపాడాడు. ఒక వీరుడి తండ్రి మీరు. నేను మీకు తలవంచి నమస్కరిస్తున్నాను!" అన్నాడు రాకుమారుడు. నాకు రోత పుట్టింది. నాకు అతని పద్ధతి బొత్తిగా నచ్చలేదు. రాకుమారుడు రాజకీయాల్లో నన్నుపావుగా ఉపయోగించు కోవటం నాకు ఎంతమాత్రం నచ్చలేదు. జీవితం నాలో ఎంత అపనమ్మకం నింపితే నేను ఈ ఉదాత్తుడైన రాకుమారుడిని అనుమానిస్తూ ఉండాలి! ఇతను నాలాంటి కంపుకొట్టే బికారికి తన రథంలో చోటు ఇచ్చాడే? నేను మాట్లాడకుండా నా కళ్లల్లో పొంగిన కన్నీళ్లని కార్చకుండా ఉండేందుకు ప్రయత్నిస్తూ ఉండిపోయాను. కంపించే నా పెదవులని అదుపులో పెట్టుకునేందుకు శాయశక్తులా ప్రయత్నించాను. కానీ ఆపుకోలేక భోరుమని ఏడ్చేశాను. రాకుమారుడు నన్ను కౌగలించుకుని, సానుభూతితో నా బుగ్గలని ముద్దుపెట్టుకున్నాడు. నా కొడుకు ముఖం పక్కకి తిప్పుకున్నాడు. నేను అలా ఏడుస్తూనే ఉన్నాను. రథం మళ్లీ బైలుదేరింది. రెండువైపులా నడుస్తున్న సైనికులు హర్షధ్వానాలు చేశారు.

కోటద్వారాలు తెరుచుకోగానే రాజభవనంలోకి వెళ్లే మెట్లలో పై మెట్టుమీద రాజూ, రాణీ నిలబడి ఉండటం కనిపించింది. మేడ మొత్తం ఆస్థానంలో ఉండే సభ్యులూ, సేవకులూ ఇతర సభాసదులతో పూర్తిగా నిండిపోయింది. అందరూ రాకుమారుడిని చూడగానే జయజయ ధ్వానాలు చేశారు. అస్తమిస్తున్న సూర్యుడు రావణాసురుడిమీద తన అరుణకాంతిని ప్రసరించాడు. రావణుడు ముమ్మూర్తులా అసుర చక్రవర్తిలా మెరిసిపోయాడు. వెండిలాంటి పొడవాటి కురులు గాలిలో ఎగురుతూ ఉంటే ఆజానుబాహుడు రావణుడు నిటారుగా, గర్వంగా నిలబడి తన కుమారుడికి స్వాగతం పలికాడు. అప్పుడు అనిపించింది నాకు ఇది విజయం సాధించిన తరవాత తరలివచ్చిన ఊరేగింపని. 'యుద్ధం ముగిసిందా?'

రావణుడు తన రెండుచేతులూ పైకెత్తగానే జనం "హరహర మహాదేవ!" అంటూ నినాదాలు చేశారు. అవి గాలిని చీల్చుకుంటూ ప్రతి

ఒక్క అసురుడినీ విద్యుత్తులా తాకాయి. జనంలో ఎవరో సంతోషంగా, ఇద్దరు శత్రు రాకుమారులూ మరణించారనీ, వాళ్లని చంపినది మేఘనాదుడే అనీ రహస్యంగా చెప్పుకోవటం నాకు వినిపించింది. ఢంకాలు ధనధనా మోగాయి, విజయం సాధించి తిరిగివచ్చిన సైనికుల మీద పూలవర్షం కురిపించారు. నా హృదయంమీద ఉన్న ఒక పెద్ద బరువు తొలగిపోయింది. ఇక మాకు ఏ ఆపదా లేదు, సురక్షితంగా ఉండవచ్చు, నా కుమారుడు సురక్షితంగా, ప్రాణాలతో ఉంటాడు. అసురులకి ఇక కులం అనే కాడి మోయాల్సిన అవసరం ఉండదు.

ఇక నా కుమారుడు కూడా ఈ విజయంలో పాలుపంచుకున్నాడు. ఈ విజయానికి కారకుడైన వీరుడు వాడు. ఇక మేఘనాదుడు నన్ను తన రథంలో ఎక్కించుకోవాలనుకోవటంలో ఆశ్చర్యం ఏముంది? నిజానికి ఒక వీరుడి తండ్రిగా నాకు ఇంకా ఎక్కువ గౌరవం దక్కాల్సింది. రథం మెట్ల దగ్గరకి వచ్చి ఆగగానే చక్రవర్తి పరిగెత్తుకుంటూ మెట్ల దిగి వచ్చాడు. గర్వంతో ఉప్పొంగుతూ ఆ తండ్రి తన కొడుకు దగ్గరకి చేరుకునే లోపల తల్లి గబగబా వచ్చి అతన్ని గట్టిగా కౌగలించుకుంది. మేఘనాదుడి తండ్రి కొంత దూరంలో నిలబడ్డాడు. తన కొడుకుని హత్తుకుని అతని కాళ్లలోనూ, చేతుల్లోనూ ఉన్న బలాన్ని తెలుసుకోలేక పోయినందుకు ఆయనకి కోపం వచ్చింది. అతికాయుడు - తెల్లటి రాకుమారుడి నల్లటి నీడలా - ఏం చెయ్యాలో తెలీనట్టు కొంత వెనకగా ఉండిపోయాడు. సిగ్గుపడుతూ నవ్వటంవల్ల వాడి ముఖకవళికలు విచిత్రంగా మారాయి. మండోదరి తన కుమారుడిని వదిలిపెట్టాక తండ్రీకొడుకులు ఒకరినొకరు కన్నార్పకుండా చూస్తూ ఉండిపోయారు. కొన్నిక్షణాలు ఏం జరుగుతోందా అన్న ఒత్తిడిలో గడిచాక రావణుడు మేఘనాదుడిని గట్టిగా వాటేసుకున్నాడు. జనం ఆనందంతో హోరెత్తి పోయారు. ఆ తరవాత వాళ్లు భవనం లోపలికి వెళ్లిపోయారు. తన యజమాని వెంట వెళ్లే కుక్కలా నా కొడుకు వాళ్లని అనుసరించాడు. నాతో ఒక్క మాట మాట్లాడలేదు, అసలు నేను అక్కడ ఉన్నానన్న స్పృహే లేనట్టు ప్రవర్తించాడు. నేను మ్రాన్పడినట్టు అక్కడే

నిలబడిపోయాను. కింద జనం వేడుక జరుపుకోవటం ప్రారంభించారు. నాకు ఏం చెయ్యాలో పాలుపోలేదు. కొంతసేపటికి ఒక భటుడు నా భుజం తట్టాడు. "రాకుమారుడు ఇమ్మన్నారు," అంటూ నాకు ఒక మూటని అందించాడు. పైన కప్పిన వస్త్రం తొలగించి చూశాను. అందులో రకరకాల వస్తువులు ఉన్నాయి. కొన్ని పాతబట్టలు - పట్టువే కాని ఎవరో వేసుకుని విడిచినవి - కొన్ని రాగిపాత్రలూ, కొన్ని మిఠాయిలూ, ఒక వీరుడిని పెంచి పెద్దచేసినందుకు దొరికిన బహుమతి ఇది. ఇంద్రుడిని ఓడించిన మేఘనాదుడు ప్రేమతో నాకు పంపిన కానుక. తన ప్రాణానికి రాకుమారుడు స్వయంగా కట్టిన వెల ఇంతే. భటుడు ఈర్ష్యతో నన్ను చూశాడు కానీ నిర్లక్ష్యంగా ఉన్నట్టు పైకి నటించాడు. తనకి నేనేమైనా ఇస్తానేమో అని వేచిచూశాడు. 'ఈ జనం ఇక ఎప్పటికీ మారరు. వీలైనప్పుడల్లా అన్నీ లాక్కోవటమే – అదే మంత్రం!' ఈ రాజ్యం పునాదే లోభం, అందుకే కుళ్లిపోయింది. ఏమీ మాట్లాడకుండా ప్రభుత్వం నా ముఖంమీద పారవేసిన బహుమానాన్ని పట్టుకుని నిలబడ్డాను. బహుమతి తెచ్చి ఇచ్చిన ప్రభుత్వోద్యోగి నా దగ్గర్నుంచి ఏదో ఒకటి తీసుకుంటేగాని వదలదలుచుకో లేదనిపించింది. ఆ మొత్తం బహుమతి మూటని వాడి చేతుల్లో పడవేసి అక్కడి నించి కదిలాను. ఏమీ సంకోచించకుండా ఆ భటుడు ఆ మూటని తీసుకుని రాజభవనంలోకి వెళ్లిపోయాడు. రాముడి మరణాన్ని ఉత్సవంలా జరుపుకుంటున్న జనసముద్రంలో కలిసిపోయాను.

40. ఒక ప్రధానమంత్రి నిర్వహించిన బృహత్కార్యం

రావణుడు

చివరికి అంతా ముగిసిపోయింది. మా బద్ధశత్రువులని నా కుమారుడు ఓడించాడు. నాకు వాడిని చూస్తే చాలా గర్వంగా ఉంది. కానీ మరోపక్క మనసులో ఆందోళన కూడా లేకపోలేదు. ఎక్కడో ఏదో లోటు ఉన్నట్లు తోచింది. నా కుమారుడూ, అతికాయుడూ కలిసి రాముడినీ, లక్ష్మణుడినీ వారి సేనాధిపతులనుంచి విడదీయటంలో కృతకృత్యులయారు. భయంకరమైన ముష్టియుద్ధంలో వాళ్లు ఆ ఇద్దరు రాకుమారులనీ చేజిక్కించుకున్నారు.

ప్రహస్తుడు తన సగం సైన్యాన్ని దీవి తూర్పుదిక్కుకి పంపివేశాడు. వాళ్లు నిన్నటి దినం రాత్రిపూట దేవతల సైన్యంపై వెనకనుంచి దాడి చేసేందుకు, కాలినడకన బైలుదేరారు. అతను సుగ్రీవుడినీ, హనుమంతుడినీ వారి ప్రభువులకి దూరంగా తీసుకుపోగలిగాడు. అసురసైన్యం వెనక్కి వెళ్లిపోతోందన్న భ్రమని వాళ్లకి కలిగించాడు. అది చూసి నరవానరులు ఇనుమడించిన ఉత్సాహంతో అసుర సైన్యం వెంట పడ్డారు. వాళ్లని రాముడికి బాగా దూరంగా తీసుకువెళ్లిన తరవాత అసురులు వెనక్కివచ్చి వాళ్లమీద దారుణంగా దాడిచేశారు. నా దుర్గం నుంచి నేను యుద్ధాన్ని చూస్తూ, ప్రహస్తుడి సైన్యాధిపత్యానికి ముగ్ధుడనయాను.

రాముడి వెంట కొద్దిమంది భటులు మాత్రమే మిగిలారు. కొద్దిసేపట్లోనే మేఘనాదుడూ, అతికాయుడూ పెద్ద సైన్యంతో వాళ్లని ఆక్రమించారు. దృఢ నిశ్చయంతోనూ, పట్టుదలతోనూ పోరాడుతున్న రాముడి సైన్యాన్ని నరుకుతూ వాళ్లు లోపలికి చొచ్చుకుపోయారు. తమకి ఎక్కువ సమయం లేదని గ్రహించి మేఘనాదుడు శత్రువుని

తుదముట్టించేందుకు ఉరికాడు. కానీ దేవతల రాకుమారులు అతిచురుగా తమ గురితప్పని బాణాలతో నా కుమారుడినీ, వాడి అనుచరుడినీ చాలాసార్లు గాయపరిచారు. అతికాయుడే త్వరగా శత్రువులకి సమీపంగా వెళితే ఆ బాణాలని తప్పించుకోగలుగుతామని సలహా ఇచ్చాడు. మేఘనాదుడూ, అతికాయుడూ రథం దిగి కత్తులు ఝళిపిస్తూ ముందుకి దూకారు. పోరాడుతున్న సైనికుల మధ్యనుంచి వంకరటింకరగా దూసుకుపోతూ హఠాత్తుగా రాకుమారుల ఎదుట ప్రత్యక్షమయారు. రాముడు విలువిద్యలో ఎంత నిపుణుడో, ఎంత వేగంగా సంధించగలడో నిరూపించాడు. క్షణాంశంలో విల్లు పట్టుకుని, బాణం సంధించి మేఘనాదుడి భుజాన్ని గాయపరచగలిగాడు. మేఘనాదుడు కూడా ఒక కత్తివేటుతో రాముడిని గాయపరిచాడు. రాముడు కింద పడిపోయాడు. అతికాయుడు లక్ష్మణుడితో భీకర ద్వంద్వయుద్ధం చేయసాగాడు. లక్ష్మణుడు విల్లంబులు పక్కకి పడవేసి కత్తి తీశాడు. దేవతల ఖడ్గం చాలా భయంకరమైన ఆయుధం. అసురులు వాడే ఇనపఖడ్గం వంపు తిరిగి భారీగా ఉంటుంది. కానీ దేవతల ఖడ్గం సన్నగా పొడుగ్గా కటారిలా ఉంటుంది. మేఘనాదుడు అతికాయుడికి సాయం చేసేందుకు పరిగెత్తి వచ్చాడు, కానీ వాడు ఇటు తిరగగానే, చనిపోయాడని అనుకున్న రాముడు వాడి కాలు పట్టుకుని లాగి కింద పడదోశాడు. అతికాయుడు పక్కకి తిరిగి మేఘనాదుడివైపు చూసిన రెప్పపాటు కాలంలో, లక్ష్మణుడు తన ఖడ్గంతో అతికాయుడిని పొడిచాడు.

లక్ష్మణుడు వేగంగా తిరిగి రెండు చేతులతోనూ ఖడ్గాన్ని పైకి ఎత్తి పట్టుకుని, నేల మీద బోర్లబొక్కలా పడిపోయిన నాకుమారుడి గుండెని చీల్చేందుకు పరిగెత్తాడు. వెంటనే అతికాయుడు తన మోకాళ్లమీదకి వంగి కూర్చుని మేఘనాదుడిని పక్కకి జరిపి అక్కడినుంచి దూరంగా లాక్కుపోయాడు. వెంట్రుకవాసిలో లక్ష్మణుడి ఖడ్గం గురితప్పింది, అది అసుర రాకుమారుడిని గాయపరచటానికి బదులు నేలలోకి లోతుగా దిగబడింది. మేఘనాదుడు తన ఖడ్డాన్ని లక్ష్మణుడి కడుపులోకి

లోతుగా పొడిచాడు. లక్ష్మణుడు కిందపడిపోయాడు. పక్కకి దొర్లి బాధతో గిలగిల్లాడి అతను స్పృహకోల్పోవటం మేఘనాదుడికి కనిపించింది.

ఈలోపల వానరుల సేనాధిపతి తను దాక్కున్న కొండల్లోంచి బైటికి వచ్చి కొద్దిమంది సైనికులు మాత్రమే ఉన్నచిన్న అసురసేన మీదికి లంఘించాడు. ఎత్తైన కొండమీదినుంచి కుత్సితబుద్ధితో వాడు కింద జరుగుతున్న యుద్ధాన్ని గమనిస్తూ ప్రహస్తుడి వ్యూహాన్ని గ్రహించాడు. సరైన అదను చూసుకుని రాముడికి సాయం చేసేందుకు తన సేనతో కిందికి దిగివచ్చాడు. ప్రమాదాన్ని పసికట్టిన అతికాయుడు వెనక్కివెళ్లిపోదామని మేఘనాదుడిని హెచ్చరించాడు. కానీ అప్పటికే మేఘనాదుడు స్పృహ కోల్పోయాడు. అతికాయుడు రాకుమారుడిని భుజాలకెత్తుకుని కదిలాడు. తన గాయంనుంచి రక్తం ధారలు కడుతున్నా లెక్కచెయ్యలేదు. అడ్డంవచ్చినవారిని అందరినీ నరుక్కుంటూ రథాన్ని సమీపించి అసుర రాకుమారుడిని స్పృహలోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నించాడు.

జాంబవంతుడి సైనికులు చుట్టుముట్టటం వాడికి కనిపించింది. వెనక్కివచ్చి తమ నాయకుడికి సాయపడమని సుగ్రీవుడికీ, హనుమంతుడికీ జాంబవంతుడు సందేశం పంపాడు. వానరసేన మొత్తం కలిసికట్టుగా వెనక్కి తిరిగి మేఘనాదుడు తప్పించుకుపోకుండా అడ్డుకునేందుకు దాడిచేసింది. వెనకాలే వస్తున్న ప్రహస్తుడి సేన వాళ్లవెంటపడింది. నా కుమారుడు చిక్కుకుపోవటం నాకు కనిపించింది కానీ వాడు స్పృహ కోల్పోయాడని తెలీలేదు. నా దుర్గంమీదినుంచి వాడి రథం మీద ఎగిరే పతాకం మాత్రమే కనిపించింది. ఆ రథం యుద్ధభూమి మధ్యలో ఉండటం చూసి నేను కంగారు పడ్డాను. 'వీడు అంత నిర్లక్ష్యంగా రథాన్ని వదిలివేసి శత్రువుతో తలపడేందుకు ఎలా వెళ్లిపోయాడు?' అనుభవజ్ఞులైన యోధులు యుద్ధం చేసే పద్ధతి అది కాదే. అది కేవలం ప్రమాదకరమే కాదు, తెలివిలేని పని కూడా. అయినా ఉడుకురక్తం ఉన్న కుర్రవాళ్లు ఎవరిమాటా వినరు. దుస్సాహసంతోనూ,

అదృష్టం కలిసిరావటంవల్లనూ చివరికి వాడు శత్రువులని అణచగలిగాడు. అప్పుడు అతికాయుడు గొంతుచించుకుని, "రామలక్ష్మణులు మరణించారు. రాకుమారుడు మేఘనాదుడికి జయము జయము!" అని అరిచాడు. అసురసేనలలో జయజయధ్వానాలు మిన్నుముట్టాయి. అదంతా నాకు అస్పష్టంగా వినిపిస్తూనే ఉన్నప్పటికీ, యుద్ధాలు చూసీచూసీ ఆరితేరిన నా కళ్లు వానర సైన్యం దాడిచేస్తున్న పద్ధతిని గమనించాయి. జాగ్రత్తగా చూస్తే గాని తెలియనంతగా వాళ్లు తమ వేగాన్నీ ఉధృతాన్నీ కోల్పోయారు. అసురులకి ఆమాత్రం వెసులుబాటు సరిపోయింది. జాంబవంతుడు మళ్లీ తన సేనలని కూడగట్టుకునేందుకు ప్రయత్నించసాగాడు. ఇదేదో అసురుల వ్యూహం అని ఎలుగెత్తి అరుస్తూనే ఉన్నాడు. కానీ ఆ వార్త చాలా వేగంగా పాకిపోయింది. వానరులు ఆ వార్తని నమ్మలేకపోయారు. వాళ్ల దృష్టిలో రాముడు దేవుడు, ఎవరూ ఓడించలేని ప్రకృతి శక్తి అతను, ఒక సాధారణ అసుర రాకుమారుడు రాముడిని చంపాడన్న వార్త వాళ్లకి నమ్మశక్యమైనదిగా అనిపించ లేదు. హనుమంతుడి నేతృత్వంలో కదులుతున్న సేన వేగం బాగా తగ్గిపోయింది. ప్రహస్తుడి సైనికులు వాళ్లని చేరుకుని పోరాటం ప్రారంభించారు. అతికాయుడి భటులు ఆ అయోమయంలో కోటవైపుకు దౌడు తీశారు. ఈ లోపల మేఘనాదుడు మూర్ఛనించి తేరుకుని లేచాడు. అతను కూడా రాముడిని తను చంపివేశానని అరిచాడు. రాముడి సేనల్లో ధైర్యసాహసాలు మరింత దిగజారిపోయాయి. మొత్తం మీద యుద్ధం ముగిసిందనే అనుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. ప్రహస్తుడి సేనలు మిగిలిన వానరులని చుట్టుముట్టటం నాకు కనిపించింది. కానీ జాంబవంతుడు దేవతల రాకుమారుల నిర్జీవ శరీరాలు పడిఉన్న చోటికి చేరుకునేందుకు ప్రయత్నించాడు.

మరణించిన దేవతల రాకుమారుల దగ్గరకి నా సోదరుడు, విభీషణుడు పరిగెత్తటం చూసి నాకు వల్లమాలిన కోపం వచ్చింది. పనికిమాలిన నీచుడు, అసురులు విజయం సాధించారని తెలిసిన

వెంటనే పాకుతూ వచ్చి నా కాళ్లు నాకుతాడు. నిర్జీవంగా ఉన్న రాకుమారుల శరీరాలని జాంబవంతుడి అనుచరులు భుజాలమీదికి ఎత్తుకోవటం నాకు కనిపించింది. 'ఏదో పొరపాటు జరిగింది, ఎక్కడో పెద్ద పొరపాటే జరిగింది.' వానరులలో వచ్చిన పరివర్తన చూడగానే నాకు ఆసంగతి అర్థమైంది. రాకుమారులని రథాలలోకి ఎక్కించి, దుష్టుడైన వానరసేనాపతి తన సేనతో సహా సముద్రంవైపు దూసుకుపోయాడు. ప్రహస్తుడు వెంబడించేందుకు ప్రయత్నం చేశాడు, కానీ సుగ్రీవుడూ, హనుమంతుడూ బలంగా అతన్నిఅడ్డుకున్నారు. ఒక పడవ తీరానికి రావటం, దేవతల రాకుమారుల శరీరాలని అందులోకి ఎక్కించటం నాకు కనిపించింది.

ఆసరికి మేఘనాదుడి ఊరేగింపు కోట ద్వారాల దగ్గరకి చేరుకుంది. గొప్ప ఆందోళనకి గురైన నా భార్య అక్కడికి పరిగెత్తింది. తన పత్రుడు విజేతగా తిరిగివస్తూ ఉంటే స్వాగతం పలికేందుకు రమ్మని నన్ను ఒత్తిడి చేసింది. కానీ నా చూపు సముద్రంలో నడుస్తున్న నాటకం మీదే ఉండిపోయింది. ప్రధాన భూభాగంవైపు వాయవ్యదిశలో ఉన్న ఒక చిన్న ద్వీపం వైపు ఆ పడవ అతివేగంగా వెళ్లసాగింది. ఆ పడవ శత్రువులకి అందనంత సురక్షితమైన దూరానికి చేరుకున్న తరవాత హనుమంతుడి సేన రాముడి వారధి మీదుగా సముద్రంవైపు పరిగెత్తి పారిపోసాగింది. ప్రహస్తుడు ఇంకా వాళ్లని వెంబడిస్తూనే ఉండగా, వెనకవైపు హఠాత్తుగా వరుణుడి సేన కనిపించింది. నరవానరులు పారిపోయే వీలు కల్పించేందుకు పన్నిన పన్నాగం అది. హనుమంతుడి సేన వారధి దాటి దీవితో దానికి సంబంధం ఉండకుండా వారధిని పడగొట్టివేసింది.

మేఘనాదుడు శత్రురాజుని చంపివేశాడన్న వార్త వినగానే అసురసేనలు సమావేశమై ఉత్సవం చేసుకోవటం మొదలుపెట్టాయి. రాముడి సైన్యంలో మిగిలి పోయిన కొద్దిమందిని అంతమొందించాల్సిన చిన్నపని మాత్రం ఉండిపోయింది. కానీ ఆ పని మర్నాడు ఉదయం కూడా చెయ్యవచ్చు. క్రమశిక్షణలేని అసుర సైనికులని ఒకతాటిమీదకి తెచ్చేందుకు ప్రహస్తుడు ప్రయత్నించాడు. వాళ్లు అప్పటికే

విజయోత్సవం జరుపుకునేందుకు కోటవైపు పరిగెత్తారు. కానీ నా మనసుని ఏదో అనుమానం తొలిచెయ్యసాగింది. ప్రహస్తుడు వచ్చి ఎప్పుడెప్పుడు సమాచారం అందిస్తాడా అని ఆత్రుతగా ఎదురుచూడసాగాను. విజయం సాధించామని నాకు సంతోషంగానే ఉంది, కానీ జాంబవంతుడు ఆ ఇద్దరు రాకుమారులనీ ఇక్కడినుంచి తరలించిన పద్ధతి నాకు ఆందోళన కలిగించసాగింది. 'వాళ్లు నిజంగా మరణించారా?' తీవ్రంగా గాయపడ్డారు, అది మాత్రం రూఢిగా తెలుసు నాకు. మేఘనాదుడు రాముడి తలా, లక్ష్మణుడి తలా తెగగొట్టనందుకు నాకు కోపం వచ్చింది. పాపం చిన్నవాడు, విపరీతమైన ఒత్తిడిలో ఉండి కూడా చాలా సాహసంతో పోరాడాడు, కానీ ఇటువంటి చిన్నచిన్న విషయాలే యుద్ధం దిశని మార్చివేస్తాయి. శత్రువు చనిపోయాడని మేఘనాదుడు అనుకుని ఉండకూడదు. కొన్ని కత్తిపోటూ, బాణం దెబ్బలూ అంత సులువుగా యోధుల ప్రాణాలు తియ్యలేవు. అదే శత్రువు తల తెగిపోతే, ఏదైనా మహాద్భుతం జరిగితే తప్ప ఆ వ్యక్తి ప్రాణాలతో ఉండడు. దట్టమైన అరణ్యాలలో చాలాకాలం క్రితం బలిచక్రవర్తీ, బ్రహ్మా చెప్పగా నేను ఆ పాఠం నేర్చుకున్నాను.

నా చిన్నతనంలో ఇటువంటి అవకాశమే నాకు చిక్కి ఉంటే, రాముడి తలా, లక్ష్మణుడి తలా తెగ్గోసి, కర్రలకి గుచ్చి ఎత్తిపట్టుకుని శత్రుసైనికులందరికీ చూపించి ఉండేవాడిని. నాయకుడు పట్టబడిన మరుక్షణం యుద్ధం ఆగిపోతుంది. యోధుల ధైర్యం సన్నగిల్లుతుంది. యౌవనంలో ఉండగా అటువంటి దండయాత్రలని ఎన్నిటినో చూశాను. ఎన్నోసార్లు నా చంద్రహాస ఖడ్గంతో శత్రుపక్ష నాయకుడి తల నరికినప్పుడు, నా ప్రాణాలు పోయే పరిస్థితి ఎదురైంది. యౌవనమదంతో ఆపదని కూడా లక్ష్యపెట్టకుండా పిచ్చి ధైర్యంతో పోరాడిన కాలం అది. నన్ను ఎంతమంది శత్రువులు చుట్టుముట్టినా, మృత్యువుకి వెంట్రుకవాసి దూరం వరకూ వెళ్లినా, శత్రువుల నాయకుడి శిరచ్ఛేదం చేసి, అది శత్రుసైనికులందరూ చూశారని రూఢి చేసుకున్న మరుక్షణం యుద్ధం ముగిసిపోయేది. రాముడి తలా, లక్ష్మణుడి తలా

మొండెం నుంచి వేరుచెయ్యబడ్డాయని నిర్ధారణ చేసుకోకుండా మూర్ఖుడిలా వెనక్కివచ్చేశాడు మేఘనాదుడు. అది యుద్ధతంత్రం బాగా తెలియకపోవటంవల్ల చేసిన పొరపాటు. గొప్ప యోధులకి ఉండవలసిన లక్షణాలు ఇంకా మేఘనాదుడికి అబ్బలేదు. అలా చెయ్యటం క్రూరత్వం అనిపించుకుంటుందా? ఈ కుర్రవాడికి నిజమైన యోధుడికి ఉండవలసిన గుండెధైర్యం లేదు. వీడి మనసు మరీ సున్నితం. నేను ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా ఆ పని చేసి ఉండేవాడిని. వాలి, రాముడు, హనుమంతుడు, ప్రహస్తుడు, రుద్రకుడు లేదా బలిచక్రవర్తి కూడా అలాగే చేసేవారు.

అంటే శత్రువు ఇంకా మరణించలేదన్న మాట. రాముడూ, లక్ష్మణుడూ ఇంకా ప్రాణాలతోనే ఉండి ఉండాలి, లేకపోతే జాంబవంతుడు వాళ్లని ఆ దీవికి ఎందుకు చేరుస్తాడు? అంటే శత్రువు ఏ క్షణాన్నైనా మళ్లీ తిరగబడవచ్చు. 'మేఘనాదుడు ఎంత మూర్ఖుడు' వాడు జీవితం ఎంత కరుణలేనిదో ఇంకా చూడలేదు. నా చెమటతో, రక్తంతో నిర్మించిన సామ్రాజ్యం వాడికి కష్టపడకుండానే దొరికింది. రెండోపూట భోజనం దొరుకుతుందో లేదో తెలీని పరిస్థితిని వాడింకా ఎరగడు. తన పిల్లల కడుపు నింపలేని తల్లి కళ్లలోని ఆవేదన వాడు ఎన్నడూ చూడలేదు. నేను మండోదరిదే తప్పని అనుకున్నాను. ఈ లోకంలో వాడే అన్నిటి కన్నా ముఖ్యం అన్నట్టుగా వాడిని గారాబంగా పెంచింది. వాడు చాలా అందమైన వాడు, ప్రేమగా ఉంటాడు, సానుభూతిపరుడు. అందుకే వాడిని ప్రేమించకుండా ఉండటం ఎవరికీ సాధ్యం కాదు. కానీ నేను వాడిని ఇంకా బాగా పెంచవలసింది. ఒక సువర్ణావకాశం ఈ యుద్ధంలో చేజారిపోయింది. మూర్ఖుడు! వాడి మూర్ఖత్వానికి తలవాచేట్టు చివాట్లు పెట్టాలనుకుని లోపలికి వెళ్లాను. వాడి ముఖం విజయ గర్వంతో వెలిగిపోతూ ఉండగా నన్ను చూసి చిరునవ్వు నవ్వాడు. వాడితో ఏకాంతంగా మాట్లాడాలని కాసేపు అక్కడే వేచి ఉన్నాను. ఇంకొక తెలివితక్కువ దద్దమ్మ అతికాయుడు ఆనందంగా, సంకరజాతికుక్కలా నేలమీద కూర్చుని ఉన్నాడు. వాళ్లు

చేసిన పనికి వాళ్లిద్దరి తలకాయలూ ఒక్క దెబ్బతో బద్దలు కొట్టాలనిపించింది నాకు. అసురులకి లభించవలసిన అతిమంచి అవకాశాన్ని పోగొట్టుకుని వాళ్లిద్దరూ పెద్ద వీరుల్లా అక్కడ కూర్చున్నారు.

"రావణా, చూడండి వీటి ఒంటిమీద ఎన్నికత్తిపోట్లో, నా కొడుకు చనిపోయి ఉండేవాడు!" అంటూ ఏడుస్తూ మండోదరి వాడి శరీరం మీది గాయాలని నాకు చూపించింది. మేఘనాదుడికి అందరూ, తన గురించి మాట్లాడటం ఆనందం అనిపించింది. 'ఈమె ఎదురుచూసింది ఏమిటి? వాడు యుద్ధానికి వెళ్లాడు. అది పోరు. ఈమె ఎందుకు వాడి గాయాలకి అంతగా చలించిపోతోంది?' అప్పుడు నాకు గుర్తొచ్చింది. మండోదరి మొదటిసారి యుద్ధం చూస్తోంది. నేను చేసిన మిగతా పోరాటాలన్నీ దూరప్రాంతాల్లో జరిగాయి. వాడిని ఒంటరిగా పోరాడేందుకు పంపినప్పుడు నేను కూడా ఆందోళన పడ్డాను. యుద్ధభూమిలో రెప్పపాటు కాలంలో ఎలాంటి ఘోరాలు జరిగిపోగలవో నాకు తెలుసు. ఎక్కడినుంచో ఒక బాణం వచ్చి వాడి కంట్లోనుంచి దూసుకుపోయి మెదడుని ఛిద్రం చేస్తుందేమోనని తీవ్రంగా ఆందోళన చెందాను. బుద్ధిహీనులైన పురుషులు ఒకళ్లని ఒకళ్లు తెగనరుకునే యుద్ధభూమిని స్త్రీలు చూసినట్టయితే ఈ లోకంలో అసలు యుద్ధాలనేవే ఉండేవి కావు. అలాంటి దృశ్యంలో జోక్యం కలిగించుకోవటం ఇష్టంలేక నేను అక్కడినించి నిష్క్రమించాను.

ప్రహస్తుడు నా దగ్గరకి వచ్చి నమస్కరించాడు. అతని చేతులు పట్టుకుని పక్కకి తీసుకెళ్లి, "మీ ఉద్దేశం ఏమిటి? రాముడు చనిపోయాడా?' అని నాకు జవాబు తెలిసినా అడిగాను. అతను తల అడ్డంగా ఆడించాడు.

"పిల్లలిద్దరూ పొరపాటు చేసినట్టున్నారు," అన్నాను. అతను విచారంగా చిరునవ్వు నవ్వాడు.

"వాళ్లని తప్పుపట్టటానికి లేదు. మేఘనాదుడు మరీ మెతకవాడు, అనుభవం కూడా తక్కువే. కానీ దీనివల్ల మనకి ఎనలేని నష్టం కలిగే

అవకాశం ఉంది," అన్నాను. ప్రహస్తుడు పక్కకి చూశాడు. అతనిలోని నిస్పృహని నేను గ్రహించాను. "అతన్ని ఆపాలి," అన్నాడు ప్రహస్తుడు, జాంబవంతుడు గాయపడిన తన నాయకుడిని తీసుకువెళ్లిన దీవివైపే తదేకంగా చూసూ. నేను అయోమయంగా అతనికేసి చూశాను.

"మహాప్రభూ! నాకు అందిన సమాచారాన్ని బట్టి రాకుమారులిద్దరూ కొన ఊపిరితో ఉన్నారు. కానీ వానరులకి వైద్యవిద్యలో ఉన్న జ్ఞానం చాలా ప్రసిద్ధి గాంచింది. సాధారణంగా కనిపించే మొక్కలనుంచి ప్రాణాలు కాపాడగల రసాలని తియ్యటం ఎలాగో వాళ్లకి తెలుసు. మనలాగ వాళ్లు రసాయనిక ఔషధాలు ఉపయోగించరు. దానికి బదులు ఆయుర్వేదం అనే వైద్యాన్ని ఉపయోగిస్తారు. అందులో ఓషధులన్నీ మొక్కలనుంచే లభిస్తాయి.

"అయితే ఏం చేద్దామంటావు?"

"రాముడు జీవించి ఉన్నాడో లేదో మనకి తెలీదు. అతను తీవ్రంగా గాయపడ్డాడు. ఈపాటికి అతని ప్రాణాలు పోయినా పోయి ఉండవచ్చు. కానీ అతను జీవించి ఉంటే, లేదా వానరవైద్యులు అద్భుతమైన తమ నైపుణ్యంతో అతని ప్రాణాలని కాపాడాలంటే, వాళ్లు తమ ఓషధులని తయారుచేసుకోవాలి. వాళ్లు ఉపయోగించే మొక్కలవంటివి ఈ భూభాగంలో మూడు ప్రాంతాలలోనే దొరుకుతాయి - లంకలో, నైరుతి దిశలోని ముఖ్యభూభాగాన సముద్రతీరాలలో, లేదా హిమాలయాలలో, హిమాలయ పర్వతాలు మరీ దూరంలో ఉన్నాయి. వాళ్లు లంకలో ప్రవేశించరు, ఎందుకంటే అది అపాయకరం. కానీ వాళ్లు ప్రయత్నించ వచ్చు. దానికి మనం అప్రమత్తంగా ఉండాలి. ఇక మిగిలిన ఒకే ఒక మార్గం పడమటితీరానికి వెళ్లటం. వానరులు వీలైనంత వేగంగా ఈ రెండు ప్రాంతాలలోనూ ప్రయత్నిస్తారు."

"ఈ రాత్రికే మనం దాడిచేసి ఆ దీవిని మన అధీనం చేసుకుంటేనో?" ఈ ఉపాయంమీద నాకే పూర్తిగా నమ్మకం లేదు, కానీ ప్రహస్తుడు ఏమంటాడో చూద్దామని అడిగాను.

"వద్దు. వరుణుడి నౌకలు కాపలా కాస్తున్నాయి. అది చాలా ప్రమాదకరం. రాముడూ, లక్ష్మణుడూ మరణిస్తారని ఆశించటం ఒక్కటే మనం చెయ్యగలిగినది. అప్పుడు మనం వానరరాజు సుగ్రీవుడిని చాలా సులభంగా కొనెయ్యవచ్చు. అతను మహాగొప్ప లోభి. ఈ లోపల మన దీవిలో భద్రతాదళాలని కూడా బలోపేతం చెయ్యాలి. బహుశా అంగదుడు లంకలో ప్రవేశించేందుకు ప్రయత్నించవచ్చు. మహాప్రభూ! మనం వెంటనే లంకిణిని అప్రమత్తంగా ఉండమని చెప్పాలి" అన్నాడు ప్రహస్తుడు.

ప్రధాన భూభాగం దక్షిణ కొసలో లంకిణి అసురుల అధిపతిగా రాజ్యం వ్యవహారాలు చూస్తుంది. అది మూడు సముద్రాల సంగమస్థలి. ప్రధాన భూభాగపు దక్షిణ ప్రాంతాలని ఆమె చాలా న్యాయంగా, నిక్కచ్చిగా పరిపాలించింది. ఆమె నా అధీనంలోనే పనిచేస్తున్నప్పటికీ, ఏటా నా రక్షణకోసం పెద్దమొత్తాలని అంద జేయటంలో ఆమె ఏనాడూ ఉపేక్ష ప్రదర్శించలేదు. రాముడిమీద వెనకనుంచి దాడిచెయ్యటంలో ఆమె నాకు సాయపడి ఉండవలసింది, కానీ నా అధీనంలో పనిచేసే ఇతర అధిపతుల్లాగా, ఆమె కూడా గోడమీది పిల్లి వాటంగా అంతా గమనిస్తూ, ఎవరు జయిస్తే వాళ్లతో చేరాలని వేచిచూస్తూ కూర్చుంది. ఇంకా సేనలని పంపమని ఆమెకి ఎన్నోసార్లు సందేశాలు పంపాను. కానీ వాటిలో ఒక్కదానికీ సమాధానం రాలేదు. నాకు చాలా కోపమూ, బాధా కలిగాయి, కానీ జీవితమంటే అలాగే ఉంటుంది మరి!

"లంకిణికి ఎలా సందేశం పంపగలం?" ఈ ఉపాయం గురించి నా అపనమ్మకం క్షణంక్షణం పెరిగిపోసాగింది, కానీ ప్రహస్తుడు చెప్పినదే సరైనది అని కూడా అనిపించింది. దీవి మీదికి వెళ్లిపోయిన వానరులమీద దాడి చెయ్యాలన్న ఆలోచనలోని మంచిచెడ్డలని తూకంవేసి చూశాను. అది చాలా దుస్సాహసమేమో అనిపించింది. అదృష్టాన్ని మరీ అంతగా పరీక్షించకూడదు. లేదు, అన్నిటికన్నా మంచి మార్గం, రాముడు మరణించాడని రూఢి చేసుకోవటం. నా కూతురి గురించి ఆలోచిస్తే మనసు కలుక్కుమంది, కానీ దాన్ని వెంటనే

మనసులోంచి తొలగించాను.

"మనం త్వరగా కదలాలి. సర్పనావలో నేను స్వయంగా వెళ్తాను," అని ప్రహస్తుడు తనలో తాను గొణుక్కున్నాడు. ప్రధాన భూభాగపు పడమటితీరంలో బలిచక్రవర్తి రాజ్యం చేసినప్పుడు సర్పనావలని ఆయన విశేషంగా ఉపయోగించాడు. అవి పొడవుగా, సన్నగా ఉండి, ఒక్కొక్క నావనీ నడిపేందుకు 120 మంది నావికులు అవసరం అయేవారు. పడమటి తీరాన చెదురుమదురుగా ఉన్న ఉప్పనీటి సరస్సులలో వాటిని ఉపయోగించేవారే కాని, సముద్రం మీదికి వాటిలో వెళ్లేవారు కాదు. పుష్పకవిమానం తరవాత అతివేగంగా ప్రయాణం చేసేందుకు పనికివచ్చే వాహనాలు ఈ నావలే.

"మహాప్రభూ, ఈ బృహత్కార్యాన్ని నేనే నిర్వహిస్తాను. వరుణుడి నౌకలకి కనబడకుండా తప్పించుకుని వెళ్లి తెల్లవారేసరికల్లా ప్రధాన భూభాగం చేరు కుంటాను. ఇది చాలా ప్రమాదకరం, నాకు ఏమాత్రం వీలున్నా ఈ పనికి ఒడిగట్టే వాడిని కాను. కానీ ఈ సముద్రజలాల సంగతి నాకన్నా బాగా తెలిసినవారెవరూ లేరు. తమ రాకుమారులు కోలుకునేదాకా వానరులు దాడిచేసేందుకు తలపెట్టరని నాకు కచ్చితంగా తెలుసు. ఇప్పడే బైలుదేరుతాను. ఈ దాడి నాయకత్వం కుంభకర్ణుడికి ఇస్తే మంచిదని అనుకుంటున్నాను."

అతన్ని నేను ఆపేలోపల నాకు నమస్కరించి వెళ్లిపోయాడు. 'నా సోదరుడికి నాయకత్వం అప్పగించటమా?' అది చెప్పినంత సులభం కాదు. నా తమ్ముడు చాలారోజులుగా మద్యం మత్తులో పడి ఉన్నాడు. నల్లమందు, సారాయికి వాడు బానిస అయిపోయాడు. నాకల్లెదురుగానే వాడు క్షీణించి కృశించిపోవటం చూస్తున్నాను. వాడు నాకు ప్రత్యర్థిగా మారతాడని గ్రహించే నేను చెడు అలవాట్లనుంచి వాడిని తప్పించే ప్రయత్నం చెయ్యలేదా? ఏమో తెలీదు. ఇక ఇప్పుడు, సేనానాయకుడి పదవికి మంచివాళ్లు కరవైపోయిన ఈ సమయంలో, ప్రహస్తుడు నా సోదరుడి గురించి నాకు జ్ఞాపకం చేశాడు. ఈ భవనంలో ఏ చీకటి మూలల్లోనో వాడికోసం వెతకాలి. తన అంధకారంతో నిండిన

సంతోషంలోంచి వాడిని బైటికి లాగి నాకోసం యుద్ధం చెయ్యమని అడగాలి. అది అంత సులభంగా జరిగేది కాదు.

41. అతిక్రమణ

భద్రుడు

సరిగ్గా తెల్లవారేముందు చీకటి ఎంత చిక్కబడుతుందంటే, అది మీ చర్మానికి అంటుకున్నట్టు అనిపిస్తుంది. ఆ వేళప్పుడు నాకు ఎవరిదో అడుగుల చప్పుడు వినిపించింది. వయసుతోపాటు నాలో సహజంగా ఉండేగప్రాణశక్తి బలహీనపడలేదు. పూర్తి తాగుడు మైకంలో ఉన్నప్పుడు కూడా ప్రమాద ఘంటికలు నా చెవులకి వినిపిస్తాయి. నాకు తలఎత్తి చూసే ధైర్యం లేకపోయింది. కానీ ఎవరో చప్పుడు చెయ్యకుండా కదులుతున్నారు, అంటే ఏదో సమస్య రానున్నట్టే నేను చెవులు రిక్కించుకుని ఇంకా ఏమైనా వినిపిస్తుందా అని చూశాను. నూనె దీపాల్లో చివరిది కూడా ఆరిపోయి చాలా సేపయింది. ఆకాశంనిండా మబ్బులు కమ్ముకున్నాయి, రాత్రిపూట మేలుకునే ఏదో పక్షికూత తప్ప ఇంకే శబ్దమూ వినపడటంలేదు. ఊపిరిబిగబట్టి వినసాగాను. ఈసారి అది స్పష్టంగా వినిపించింది. ఒకడు కాదు, చాలామందే ఉన్నారు. రాత్రి చీకట్లో కూడా వాళ్లు అక్కడ ఉండటం నాకు తెలిసింది. వాళ్లు చెట్లపైకొమ్మలమీద ఉన్నారు, కొందరు గుర్రుపెట్టి నిద్రపోతున్న వందలమంది అసుర సైనికులని దాటుకుంటూ నడుస్తున్నారు. నేను నెమ్మదిగా కళ్లు తెరిచాను. రాజభవనం ద్వారం దగ్గర నిద్రపోతున్న కాపలాభటుల ఆకారాలు కనిపించాయి. మొదటి అంతస్తు దగ్గరున్న చెట్ల ఆకుల చప్పుడు వినిపించింది. కొన్ని నల్లని ఆకారాలు అవలీలగా మొదటి అంతస్తులోకి గెంతాయి. అయితే ఆ ఆకారాలు వానరులవే అయి ఉండాలి. నా వెన్ను జలదరించింది. 'వీళ్లు ఇక్కడికి ఎందుకొచ్చారు?'

నిన్నటి విజయోల్లాస వేడుకలలో భటులు పూటుగా తాగి మత్తుగా పడుకున్నారు. నేను పాకుతూ భవనంవైపు కదిలాను. చాలా భయం

వేసింది. ద్వారం దగ్గరకి చేరుకుంటూనే కాపలాభటులు హత్య చేయబడ్డారని గ్రహించాను. వాళ్ల గొంతుకోసి ఎవరో వాళ్లని హత్య చేశారు. శత్రువు లోపలికి వచ్చేశాడు. నేను అరిచి గోల చెయ్యాలా? కానీ ఎవరైనా నిద్రలేస్తారా? రావణుడిని నేను హెచ్చరించాలి. రాజమందిరం ఎక్కడ ఉందో నాకు తెలుసు. కానీ నాకు భయంవేసింది. శత్రువు ఏ మూలైనా ఉండవచ్చు. భవనంలో పరుచుకున్న నల్లటి నీడల్లో మృత్యువు నామీదికి ఉరికేందుకు వేచి ఉంది. నేను ఎప్పుడూ కూడా చనిపోయేందుకు సిద్ధంగా ఉన్నాననే అనుకునేవాడిని. నేను చనిపోయినా ఎవరూ పట్టించుకోరు, బహుశా నా భార్యకూడా, నా కొడుకైతే పట్టించుకోడని నాకు బాగా తెలుసు. అయినా నాకు జీవించాలని అనిపించింది.

అలసిపోయిన నా శరీరాన్ని ఈడ్చుకుంటూ, ఏ చిన్న శబ్దం విన్నా వణికిపోతూ, ఊపిరి తీసుకునేందుకు కూడా భయపడుతూ, రావణుడి పడకగదికి మొదటి అంతస్తుకి వెళ్లాను. అతను ఈసరికే చనిపోయి ఉండకపోతే నిద్రపోతూ ఉంటాడు. నా శరీరంలో ఇంకా శక్తీ, యౌవనం, మనోధైర్యం ఉంటే బావుండునని అనుకున్నాను. మునివేళ్లమీద మెట్టెక్కాను. ఏమాత్రం చప్పుడు చెయ్యకుండా ఉండేందుకు జాగ్రత్త పడ్డాను. అస్పష్టంగా ఎవరో కేక పెట్టటం, దబ్బున పడిన చప్పుడూ, ఆ తరవాత దేన్నో ఈడ్చుకుని వెళ్తున్న చప్పుడూ వినిపించాయి. నా గుండె దడదడలాడింది. తొంగిచూస్తే కొందరు వానరులు పారిపోవటం కనిపించింది. వాళ్ల రాకుమారుడు, అంగదుడిని గుర్తుపట్టాను. వాడు తన భుజాలమీద ఎవరినో వేలాడదీసుకుని గదిలోంచి పారిపోతున్నాడు. అంతగా తాగుడు మత్తులో మునిగిపోని కొందరు భటులు మేలుకోసాగారు. వాళ్లు అంగదుడిని ఆపేందుకు ప్రయత్నించారు. కానీ వాడు తన పరుగు ఆపనేలేదు, కత్తితో అడ్డువచ్చిన భటులందరినీ నరుకుతూ, బిత్తరపోయి చూస్తున్న భటుల మధ్యనుంచి పారిపోసాగాడు. నేను రాజాంతఃపురం ద్వారం దగ్గరకి పరిగెత్తాను. అక్కడ ఉండే కాపలా భటులందరూ రక్తపు మడుగులోపడి

ఉన్నారు. వానర రాకుమారుడిని ఎదిరించే సాహసం ప్రదర్శించిన భటులు కొందరు మరణిస్తే మరికొందరు తీవ్రంగా గాయపడి గిలగిలా కొట్టుకుంటున్నారు. కింద పరిచిన అందమైన తివాసీలమీద వాళ్ల తెగిన పేగులూ, రక్తమూ చింది ఉన్నాయి.

శయన మందిరం తలుపులవైపు చూస్తూ కొన్ని క్షణాలు తటపటాయిస్తూ నిలబడ్డాను. ఆ తరవాత చక్రవర్తిని గుండెల్లో దిగిన బాకుతో చూసేందుకు నన్ను నేను సిద్ధం చేసుకుని తలుపులు తోశాను. ఆ గదిలో ఎవరూ లేరు. ఎక్కడా శవాలు లేవు. కానీ పడక మాత్రం ఎవరో దానిమీద ఘర్షణ పడ్డట్టు బాగా నలిగిపోయి ఉంది. అప్పుడు నాకు తట్టింది, 'అంగదుడు మహారాణీ మండోదరిని ఎత్తుకుపోయి ఉంటాడు. హత్య చెయ్యాలనే ఉద్దేశంతోనే వచ్చి ఉంటాడు, కాని మందిరంలో చక్రవర్తి లేకపోయేసరికి ఆయన భార్యని అపహరించాడు. రావణుడికి ఈ విషయం చెప్పాలి. ఎక్కడున్నాడో ఆయన?' రాజభవనం వసారాలగుండా పరిగెత్తుతూ అన్ని తలుపులనీ తట్టసాగాను, గట్టిగా అరుస్తూ అతికాయుడిని పిలవసాగాను. చాలామంది మేలుకున్నారు. మహారాణిని అంగదుడు అపహరించాడని గొంతు చించుకుని అరవసాగాను. మొదట ఎవరూ స్పందించలేదు. తాగుడు ఎక్కువై పిచ్చివాగుడు వాగుతున్నానని చాలామంది అనుకుని ఉంటారు. ఆ తరవాత కంగారు పడటం మొదలెట్టారు. భటులు లేచి గబగబా అటూ ఇటూ పరిగెత్తసాగారు. చాలామంది భోరుమని ఏడవటం మొదలెట్టారు. కొందరు ఏవేవో ఆదేశాలు ఇవ్వసాగారు, కానీ వాటిని పాటించేందుకు అక్కడ ఎవరూ లేరు. ఇంకొందరు కళ్లు మిటకరిస్తూ, ఏం జరుగుతోందో అర్థంకాని స్థితిలో కూర్చుని ఉండిపోయారు.

మేఘనాదుడినీ, అతికాయుడినీ వెతికి పట్టుకునేసరికి నాకు మరొక అరగంట సమయం పట్టింది. నేను నా కొడుకుని కాళ్లతో తన్ని లేపాను. వాడు ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు. ఎవరైనా లోపలికివచ్చి అసుర రాకుమారుడినీ, అతని సేవకుడినీ హత్యచేసి ఉండవచ్చు, అసురుల

భద్రత అలా ఏడ్చింది! రాకుమారుడు త్వరగానే స్పృహలోకి వచ్చాడు. జరిగినదంతా నేను వివరంగా చెప్పి ముగించేలోపలే అతనికి పూర్తిగా మెలకువ వచ్చేసింది. ఒక్క ఉదుటున లేచి నిలబడి, కత్తి పట్టుకుని బైటికి పరిగెత్తాడు. రాకుమారుడి వెంట వెళుతూ నేను చూసినవన్నీ చెప్పాను. అతికాయుడు కూడా మమ్మల్ని చేరుకున్నాడు, అందరం భవనం ముందున్న ఆవరణలోకి పరిగెత్తాం. మేఘనాదుడు కోటలోని గంట దగ్గరకి గబగబా వెళ్లాడు. రెండేసి మెట్ల చొప్పన పైకి ఎక్కాడు. అలసిపోయి ఉండటంతో అతని వెనకే వెళ్లలేకపోయాను. అతికాయుడు నన్ను దాటుకుంటూ రాకుమారుడి వద్దకి చేరుకునేందుకు పరిగెత్తాడు. కొద్ది క్షణాల్లో ఆ బ్రహ్మాండమైన గంట చప్పుడు కోట నలుదిశలా వినిపించసాగింది. 'నాకే అలా చెయ్యాలని ఎందుకు తోచలేదు?'

నిమిషాలమీద కోట ఆవరణంతా అప్రమత్తులైన భటులతో నిండిపోయింది. "ఏం జరుగుతోంది?" రావణుడి కంచుకంఠం ఆవరణలో ప్రతిధ్వనించింది. ఆయన గంట స్తంభంవైపు గబగబా వెళ్లసాగాడు. జరిగినదంతా మేఘనాదుడి నోటివెంట విన్నాక రావణుడి ముఖం పాలిపోయింది. మరుక్షణం ముఖంలోకి రక్తం తన్నుకొచ్చింది. పట్టరాని కోపంతో గంటస్తంభం గోడని పిడికిలితో గుద్దాడు. ఆ తాకిడికి సున్నం, దుమ్ము రేగాయి. "ఆ దుష్టుడు అంగదుడిని పట్టుకుని నా వద్దకి తీసుకురండి!" అన్నాడు.

"నాన్నగారూ, నేనే స్వయంగా వెత్తాను. ఇదేదో పన్నాగం అయి ఉండవచ్చు, మీరు భవనం దాటి ఎటూ వెళ్లవద్దు. నాయకులెవరూ భవనంలో లేనప్పుడు వానరులు దాడిచేస్తే మనం చిక్కుల్లో పడతాం."

"కాదు మేఘనాదా, నువ్వు ఇక్కడే ఉండు. వాళ్లు ధైర్యం చేసి అపహరించినది నా భార్యని. నేనే వెతికేందుకు వెళ్లి ఆ దుర్మారులకి సరైన గుణపాఠం చెపుతాను. అంతేకాదు, కుంభకర్ణుడిని నిద్రలేపవలసిన సమయం కూడా ఆసన్నమైంది. నాకు వాడి అవసరం ఎంతైనా ఉంది. రాత్రంతా ఆ చవట దద్దమ్మ తలకాయలోకి కాస్త బుద్ధిని నింపే ప్రయత్నం చేస్తూనే గడిపాను."

రావణుడు తనకి ఎంతో ప్రీతిపాత్రమైన గుర్రాన్ని ఎక్కి చీకటిలోకి దూసుకువెళ్లాడు. కొన్ని వందలమంది సైనికులు కాగడాలు పట్టుకుని ఆయన్ని అనుసరిస్తూ అతివేగంగా వెళ్లే ఆయన్ని అందుకునేందుకు ప్రయత్నించసాగారు. కాల్బలాలు ఈటెలూ, గదలూ పట్టుకుని, గోలచేస్తూ ఆ గుర్రాలవెంట పరిగెత్తసాగారు. ఎలాగూ వాళ్లు ఇతరులకి ఇబ్బంది కలిగించేందుకు తప్ప ఇంకెందుకూ పనికిరారు. నేను కూడా వాళ్లవెంట వెళ్లాను. మేము సుబేల పర్వతం అంచుకి చేరుకునే వేళకి, గుర్రాలని కిందే వదిలి, సైనికులు ఎత్తైన ఆ కొండని కొంతదూరంపైకి ఎక్కేశారు. దట్టమైన కీకారణ్యంతో నిండిన సుబేల పర్వతం, బైటికి పొడుచుకువచ్చే దాని పెద్దపెద్ద బండరాళ్లతో చూసేందుకు భయంకొలిపేదిగా, ప్రకృతి తాలూకు విశ్వరూపంలా ఉంది. అలసిపోయిన నా వృద్ధశరీరం ఆ పర్వతాన్ని ఎక్కే శ్రమకి తట్టుకోగలదని నాకు అనిపించలేదు. కానీ కుతూహలాన్ని మించిన ప్రేరకశక్తి మరొకటిలేదు, నేను కష్టపడి శరీరాన్ని ఈడ్చుకుంటూ, రొప్పుతూ రోజుతూ పర్వతం ఎక్కసాగాను. ముందు దారి చూపుతూ వెళ్లిన వారివెంట వయసులో చిన్నవాళ్లైన భటులు ఉత్సాహంగా పర్వతం ఎక్కుతూ ఉంటే, వాళ్లని చేరుకునేందుకు నేను కూడా ప్రయత్నం చెయ్యటం మొదలుపెట్టాను. కాగడాలనుంచి అప్పుడప్పుడూ వచ్చే వెలుతురు మాకు దారి చూపించసాగింది. రెండుసార్లు జారిపడిపోయాను, అయినా నొప్పిని లెక్కచెయ్యకుండా, ఆ అరణ్యాలనిండా ఉండే విషనాగుల గురించి నాకున్న భయాన్ని అణచుకుంటూ, నాకన్నా పాతిక సంవత్సరాలు చిన్నవాళ్లతో సరిసమానంగా పర్వతం ఎక్కేందుకు ప్రయత్నించసాగాను.

మేమందరం చెమటలు కక్కసాగాం. చెట్ల గుబురులోనుంచి ఖాళీ ప్రదేశానికి చేరుకునేసరికి ఆయాసంతో రొప్పటం మొదలెట్టాం. అది శిఖరానికి కొన్ని వందల అడుగుల కింద ఉంది. దూరంగా మాకన్నాముందు వెళ్లినవాళ్లగుంపు కనిపించింది. తూర్పు దిక్కుకొద్దిగా తెల్లబడసాగింది, నక్షత్రాలు మసకబారసాగాయి. చాలామటుకు

కాగడాలు ఆరిపోయాయి. ఆ ఖాళీ జాగా అంచున ఉన్న తమ మిత్రులని కలుసు కునేందుకు యువకులు పరిగెత్తారు. నేను మాత్రం ఊపిరి పీల్చుకునేందుకు అక్కడే కూలబడ్డాను. కాసేపటికి మళ్లీ లేచి భారంగా కాళ్లీడ్చుకుంటూ పైకి ఎక్కసాగాను. పైకి చేరుకున్నాక గుంపుని చీల్చుకుంటూ ముందుకెళ్లాను. అక్కడ కనిపించింది మహారాణి, ఆమె నగ్నంగా ఉంది, స్పృహ కోల్పోయి ఉంది. రావణుడు మ్రాన్పడి పోయాడు. నిశ్శబ్దంగా ఏడవసాగాడు. నేను ముందుకెళ్లి చిరుగులతో నిండిన నా శాలువని ఆమె నగ్నశరీరం మీద కప్పాను. నెమ్మదిగా ఆమె కళ్లు తెరిచింది. రావణుడు ఆమెని పొదివి పట్టుకుని గుండెలకి హత్తుకున్నాడు. జనం తననే కన్నార్పకుండా చూడటం గమనించిన అసుర మహారాణికి ఒక్క క్షణం ఏమీ అర్థం కాలేదు. మరుక్షణం ఆమెకి తను నగ్నంగా ఉన్నాననీ, అవమానించబడ్డాననీ, అత్యాచారానికి గురయాననీ గుర్తుకొచ్చింది. గాయపడ్డ జంతువులా పెనుకేకపెట్టి కంపుకొడుతున్న నా శాలువని మరింత గట్టిగా తన ఒంటికి చుట్టుకుంది. తడబడుతూ లేచి పారిపోయేందుకు ప్రయత్నించింది. రావణుడు ఒక్క ఉదుటున ఆమె చెయ్యిపట్టుకుని ఆమెని గట్టిగా వాటేసుకున్నాడు. అతని భుజంలో ముఖం దాచుకుని ఆమె వెక్కి వెక్కి ఏడ్చింది. జనం అయిష్టంగానే అక్కడినుంచి కదిలారు. కొందరు నీళ్లు తెచ్చేందుకు పరిగెత్తారు, ఇంకొందరు తమ మహారాణి కోసం వస్త్రాలు వెతికి తెచ్చారు, ఇంకా కొందరు ఆమెని రాజభవనానికి మోసుకు వెళ్లేందుకు కర్రలతో ఒక పల్లకీని తయారుచెయ్యసాగారు. విధి లీల గురించి ఆలోచిస్తూ, నేను ఒక పక్కగా నిలబడిపోయాను. ఈ అవమానాన్ని భరిస్తూ ఇక తనకి జీవించి ఉండాలని లేదని ఆమె పదేపదే అనసాగింది. ఆమె సీతకాదని గ్రహించిన వెంటనే అంగదుడూ, అతని అనుచరులైన దుండగులూ ఆమె మీద అత్యాచారం చేశారు. ఆమే సీత అనుకుని ముందు వాళ్లు ఆమెని అపహరించారు. మండోదరి, తనకి రావణుడి భార్యగా ఉండేందుకు ఇష్టం లేదనీ, చనిపోవాలని ఉందనీ అంది. ఆమె అగ్నిసాక్షిగా తను వివాహమాడిన భార్య అనీ, ఎప్పటికీ ఆమె స్థానం అదేననీ అనటం తప్ప రావణుడు

ఇంకేమీ మాట్లాడలేదు. అతని విషాదం వ్యక్తిగతమైనది. అలాంటి తీవ్రమైన బాధని చూడటం నాకు సంకోచంగా అనిపించింది. కానీ అటువంటి పరీక్షా సమయంలో కూడా తన భార్యకి అండదండగా నిలిచిన ఆ మహనీయుడిమీద నాకు గౌరవం పెరిగిపోయింది. ఒక రాజ్యాధిపతిగా ఆయనకి ఇంతకన్నా పెద్ద ఘోరం ఏదీ జరగటానికి వీలులేదు, ఆయన మరణించినా అది ఇంత పెద్ద విషాదం అనిపించుకోదు. మహారాణి శాశ్వతంగా మైలపడింది. ఆమెని చింకి గుడ్డలా ఉపయోగించుకున్న తరవాత పారవెయ్యటం ఆయనకి అన్నిటికన్నా సులభం అయేది. కానీ ఆయన సులభ మార్గాన్ని ఎంచుకోలేదు. తన అధీనంలో పనిచేసేవారు ఆయన వెళ్లిపోగానే ఆమె గురించి దుర్భాషలూ, వెటకారాలూ ఆడతారనీ, ఆ సమస్యని జీవితాంతం భరించాలనీ తెలిసి కూడా ఆయన ఆ మార్గాన్నే ఎంచుకున్నాడు. బహుశా అటువంటి ఎంపికలలోనే ఆయన గొప్పతనమూ బలహీనతా కూడా ఉన్నాయేమో! రావణుడి గొప్పతనం తెలిసేందుకు చాలాకాలం తరవాత ఇంకొక వ్యక్తి తను ప్రేమించి వివాహమాడిన భార్యతో, ఇంత పెద్ద ఘోరం జరగకపోయినప్పటికీ, ప్రవర్తించిన తీరు నా కళ్లు తెరిపించింది. రావణుడు ఎప్పుడూ కూడా దేవుడు ఎందుకు కాలేడో అర్థమైంది. ఆయనలోని మానవత్వమే ఆయన్ని దేవుడిని చెయ్యలేదు.

మౌనంగా అక్కడినుంచి జారుకుందామని అనుకున్నాను. "భద్రా!" అని పిలిచాడు ఆయన. వెనక్కి తిరిగి చూశాను. పూర్తిగా ఏకాంతంలో చూడవలసిన విషయాన్ని నేను చూశానని ఆయనకి సంకోచమూ, ఆగ్రహమూ ఒకేసారి కలిగాయి. నావైపు చూడకుండా, "మేఘనాదుడు ఎక్కడ?" అని అడిగాడు. నాకు తెలీలేదు, కానీ మేఘనాదుడూ, అతికాయుడూ అంగదుడికోసం, వాడి దండుకోసం వెతుకుతూ వెళ్లారు.

"ఆ త్రాష్టుడు ప్రాణాలతో పట్టుబడితే బావుండు," అన్నాడు రావణుడు. ఆయన్ని చూస్తే నాకు జాలివేసింది. చెదిరి ముక్కచెక్కలై పోయిన తన గౌరవాన్ని ఆయన మళ్లీ సమకూర్చుకోవాలని

ప్రయత్నిస్తున్నాడు. కొద్దిసేపట్లో పల్లకీలాంటిది తయారైంది. రాజుగారినీ, రాణీగారినీ అందులో ఎక్కించి దుర్గమమైన పర్వతమార్గాన రాజభవనానికి మోసుకుపోయారు.

రాజభవనం సమీపిస్తూ ఉండగా, నేను రాణీగారి మీద కప్పిన శాలువ దారిలో పారవేసి ఉండటం కనిపించింది. దాన్ని నేనే గుర్తు పట్టలేనంతగా మరింత చిరిగిపోయి, అలుగుడ్డలా తయారైంది. ఎందుకంటే సైనికులు దాన్ని తమ కాళ్లకింద మట్టగిస్తూ నడిచివెళ్లారు. దాన్ని దారిపక్కనున్న మురిక్కాలవలోకి తన్నేద్దామని ముందు అనుకున్నాను, కానీ మళ్లీ ఎందుకో వంగి దాన్ని తీశాను. రాజవంశంలోని వారికి ఈ పేదవాని శాలువతో పని అయిపోయి ఉండవచ్చు కానీ నాలాంటి నిరుపేదకి ఇది ఇంకా పనికివచ్చేదే. దీని చిరుగులని కుట్టుకునో, అతుకులు వేసుకునో వాడుకోవచ్చు. ఇదికాక నా దగ్గర మరొక శాలువ లేదు. అందుచేత ఉన్నదానితోనే సరిపెట్టుకోవాలి. దాన్ని జాగ్రత్తగా ఉతుకుంటే, దానికి అంటిన అంగదుడు, రావణుడు తాలూకు వాసన నీళ్లతోపాటు తొలగిపోతుంది.

42. ఒక ఆదర్శవాది అంతం

రావణుడు

సూర్యాస్తమయం అవుతూ ఉండగా ప్రహస్తుడి నిర్జీవ శరీరాన్ని రాజభవనానికి తీసుకువచ్చారు. నా భార్యతో నేను దాక్కున్న ఏకాంత నరకంలోనుంచి బైటికి వచ్చేసరికి సభాభవనంలో చల్లగా ఉన్న నేలమీద అతని శవం కనిపించింది. అతని శరీరం నీలంగా మారింది, ఉన్నవయసుకన్నా ఎక్కువ కనిపించాడు. సామ్రాజ్యానికి సంబంధించిన సమస్యలూ, కుట్రలూ, వ్యూహాలూ, తీరని ఆకాంక్షలూ, ఎప్పుడూ నిజాయితీగా ఉండేందుకు ప్రయత్నించటం తాలూకు ఒత్తిడులూ, ధర్మం తప్పక ప్రవర్తించాలనే అసాధ్యమైన కోరికా, పూర్తిగా ఎటువంటి మార్పూలేకుండా రసహీనమైన జీవితం, వీటన్నిటి ప్రభవమూ అతన్ని వృద్ధుడిలా తయారుచేసింది. నా ప్రాణస్నేహితుడూ, బద్ధశత్రువూ అయిన ప్రహస్తుడికోసం రాలబోయిన కన్నీటి బొట్టని నేను అణచివేశాను. అతని నిర్జీవ శరీరం మీదికి వంగాను. ఎంతో కష్టపడి అభ్యసించిన ఆత్మనిగ్రహాన్ని చీల్చుకుంటూ కొన్ని కన్నీటి బొట్లు నేలమీదపడి వింత ఆకారాన్ని సృష్టించాయి. 'ఎవరీ వ్యక్తి?' ఒకానొకప్పుడు, చాలాకాలం క్రితం నేను ఇతన్ని చూసి భయపడేవాడిని. ఇతను నా సింహాసనాన్ని ఆశిస్తున్నాడని పూర్తిగా నమ్మేవాడిని. నేను ఎలా ఉండాలని అనుకునేవాడినో, ఆ లక్షణాలన్నీ ఇతనిలో ఉండేవి. ఆ లక్షణాలు నాలో లేక, అతనిలా నేను ఉండలేకపోయాను. నాలోని అడవిమృగాన్ని అదుపులో ఉంచిన కళ్లెం అతను. అతనే నా అంతరాత్మ.

అతనివల్లే నేను రాక్షసుడిలాగ తయారవకుండా ఉండగలిగాను. అందరికన్నా నేను అతనికే భయపడేవాడిని. అతనే అసురులకి నాకన్నా మంచి నాయకుడు అయి ఉండేవాడని నా మనసుకి తెలుసు.

అతను ఒక ఆదర్శ అసుర నాయకుడు, బలిచక్రవర్తికి నిజమైన వారసుడు. ధైర్యం, నైతిక విలువలూ, నిజాయితీ, న్యాయ వర్తన, ఎటువంటి ప్రలోభాలకీ లొంగని దృఢచిత్తం అతనిలోని గొప్ప గుణాలు. నాలాగ రాముడు అనే విధ్వంసాన్ని అతనైతే ఆహ్వానించి ఉండేవాడు కాదు. సత్యమార్గాన్ని వదిలిపెట్టి ఉండేవాడు కాదు. ఇంత గొప్ప సామ్రాజ్యాన్ని అతను నిర్మించేవాడు కాదేమో, కానీ అంతగా నిగ్రహాన్ని కోల్పోయి వేదవతి ప్రేమలోపడి ఉండేవాడు కాదు. అసురుల ప్రయోజనం కోసం తన కుమార్తెనైనా సరే బలి ఇచ్చేందుకు సంకోచించేవాడు కాదు. జ్యోతిషం బూటకమని నమ్మితే, దాన్ని ప్రపంచానికి చాటేందుకు ధైర్యం చేసేవాడు. తన కుమార్తెని పోగొట్టుకున్నా జనకుడు ఆమెను పెంచి పెద్ద చేసినా, బలప్రయోగంతోనో, చాతుర్యంతోనో ఆమెని తిరిగి తన దగ్గరకి తెచ్చుకునే ధైర్యం అతనికి ఉంది, చాలాకాలం క్రితమే ఆమెని తన ఇంటికి తెచ్చుకుని ఉండేవాడు. తన భార్యని నరవానరుల అత్యాచారానికి బలిచేసేవాడు కాదు. కానీ... బహుశా ఆమెని మళ్లీ స్వీకరించేవాడు కాడేమో! ఆ అవమానం జరిగిన తరవాత మునుపటిలా ఆమెని ప్రేమించగలిగేవాడు కాదు. నేను చేసిన ఎన్నో పనులు అతనైతే చేసి ఉండేవాడు కాదు, కానీ అలాంటప్పుడు అతను ప్రహస్తుడూ, నేను రావణుడినీ ఎలా అవుతాం.

నా సభాసదులందరూ మౌనంగా ఉండిపోయారు. జంబుమాలి అందరికన్నా ఎక్కువ కలత చెందాడు. చిన్ననాటినుంచీ ప్రహస్తుడూ, అతనూ మిత్రులు. ఇద్దరూ ఒకే తరానికి చెందినవాళ్లు – ముఖ్యంగా వాళ్ల ఆలోచనా విధానంలో పాత మిత్రులు మరణించినప్పుడు మీలో కొంత భాగాన్ని వాళ్లు తమవెంట తీసుకుపోతారు. ఆ వృద్ధుడు విచారిస్తూ ఉంటే నాకు అతన్ని కౌగలించుకుని ఓదార్చాలని అనిపించింది. కానీ ఎవరికీ నా ముఖం చూపించే ధైర్యం నాలో కొరవడింది. నేను భావోద్రేకానికి గురి కాకూడదు. ముందు పనిజరిగేట్టు చూడాలి. సూర్యాస్తమయం అయేలోపల ప్రహస్తుడి దహనక్రియలు

పూర్తి కావాలి. ప్రహస్తుడి శవాన్ని ఆలింగనం చేసుకుని అందరికన్నా మిన్నగా నేను అతన్నే ప్రేమించాననీ, గౌరవించాననీ చెప్పాలనిపించింది. అలాగే, ఎప్పుడూ అతను ఉచిత సలహాలని ఇస్తూ, ధర్మంగురించి బోధిస్తూ నాకు చికాకు కలిగించాడని కూడా అతనికి చెప్పాలని అనిపించింది. హఠాత్తుగా నా మనసులోతుల్లోంచి అతనిమీద ద్వేషం పెల్లుబికింది. 'నీ ధృష్టి ఎప్పుడూ నా సింహాసనం మీదే ఉండేది. నువ్వు నాకన్నా చాలా మంచివాడివి, అందుచేత నాకన్న మంచి రాజువే అయిఉండేవాడివి' ఒకవేళ అతనే రాజయి నేను ప్రధానమంత్రిని అయిఉంటే ఎలా ప్రవర్తించి ఉండేవాడిని? అది నా ఊహకి అందలేదు, ఎందుకంటే ఆ పదవిలో నేను ఎక్కువకాలం ఉండగలిగేవాడిని కాదు. నా ప్రభువుని తొలగించి ఆ స్థానాన్ని నేనే ఆక్రమించి ఉండేవాడిని. 'ఇతనికి అలాంటి అవకాశాలు ఎన్నో వచ్చాయి. నాకు అతను విషం ఇచ్చి ఉండవచ్చు, దండయాత్రలు చేసిన సమయంలో ఒకే శిబిరంలో ఇద్దరం నిద్రపోయినప్పుడు కత్తితో నన్ను పొడిచి చంపి ఉండవచ్చు. నన్ను తుదముట్టించటానికి అతనికి వంద మార్గాలు దొరికి ఉండేవి.' దేనినీ సులభంగా నమ్మని నేను కూడా ప్రహస్తుడు అటువంటి పని చేసి ఉండేవాడని ఊహించలేకపోయాను. అతన్ని నేను పూర్తిగా నమ్మాను. రాజసింహాసనం చేజిక్కించుకునేంత బలహీన మనస్కుడు కాడు అతను. నీతికీ, నిజాయితీకీ, ధర్మానికీ కట్టబడిన వ్యక్తి. రక్తసిక్తమైన సింహాసనంకన్నా తన అంతరాత్మకే అతను ఎక్కువ విలువ ఇచ్చాడు.

నేను లేచి నిలబడగానే ఒక అధికారి నావద్దకి వచ్చి నమస్కరించాడు. దహనక్రియలకి వీలైనంత త్వరగా ఏర్పాట్ల చెయ్యమని ఆదేశించాను. ఆ తరవాత జరిగినదేదీ స్పష్టంగా గుర్తులేదు. అంత్యక్రియల్లో నిష్ణాతులైన వాళ్లు వ్యవహారాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నారు. నా ప్రధానమంత్రిమీద ఎర్రటి అసుర పతాకాన్ని కప్పి అతని పాడెని పైకి ఎత్తుకున్నారు. నేను కూడా వెళ్లి ఒకవైపు మోద్దామని అనుకున్నాను, కానీ అది మరీ అతినాటకీయంగా ఉంటుందేమోనని మానేశాను. ఎంతైనా నేను ఇంకా రాజునే. ఆ చిన్న శవయాత్ర వెనకాలే

నడవసాగాను, జనం వీధికి ఇరువైపులా బారులు తీరారు, మేడలమీదా, చెట్లమీదా ఎక్కిచూడసాగారు. యుద్ధంవల్ల ఛిన్నాభిన్నమైన ఆ వీధిలో, వేలకొద్దీ ఘోరమరణాలు చూసిన దారుల్లోంచి శవయాత్ర ముందుకి సాగింది.

నా అందమైన నగరం ఏ స్థితికి వచ్చిందో చూసి నిర్విణ్ణున్నయాను. ఈ వ్యవహారం త్వరగా ముగిసిపోతే ఇంటికివెళ్లి నిద్రపోవాలని అనుకున్నాను. నేను బాగా డస్సిపోయాను. అయినా నా కర్తవ్యం నెరవేర్చక తప్పదు. హత్యకి గురైన నా మిత్రుడికి, నా ప్రియమైన శత్రువుకి, ఆ మాత్రం రుణపడి ఉన్నాను. ఏడుస్తున్న జనం మధ్యనుంచి నడుస్తూ, అతనికి ఎంత మంచిపేరు ఉందో చూసి ఆశ్చర్య పోయాను. అతను ఎప్పుడూ జనం దగ్గరకి వెళ్లలేదు, ప్రజాభిమానాన్ని పొందలేని ఎన్నో నిర్ణయాలు చేశాడు. కానీ అందరికీ నచ్చేపని చెయ్యటంకన్నా అందరికీ మంచి చేకూర్చేపని చెయ్యటం అనే విషయానికే ప్రాముఖ్యతనిచ్చి ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ నిర్ణయానికి కట్టుబడే ఉన్నాడు. ఎప్పుడూ కూడా అతను న్యాయమార్గాన్ని విడవలేదు. అది నాకు కొత్త విషయం. తాత్కాలికంగా ప్రజాభిమానాన్ని చూరగొనే పనులు చేసినంత మాత్రాన సరిపోదు. జనం రాజుని ప్రేమించాలంటే అతను న్యాయవర్తనుడై ఉండాలి. దండించైనా సరే, పిల్లలని సరైన దారిలో పెట్టే ఒక తండ్రిలా తమతో ప్రవర్తించిన ప్రహస్తుడికోసం కంటతడిపెట్టనివారు లేరు. హఠాత్తుగా నాకు గతం గుర్తొచ్చి భయంవేసింది. నా సింహాసనానికీ ప్రహస్తుడికీ అడ్డుగా నిలిచినవి, కేవలం అతని న్యాయబుద్ధీ, రుజువర్తనం. ప్రహస్తుడిని ఒక్కసారి చూస్తే చాలు అనుకుని ఉప్పొంగిన ఈ ప్రజావెల్లువలో ఉండే చాలామంది, కొన్ని ఘడియల క్రితం తమ ప్రియ బాంధవులకి అంత్యక్రియలు జరిపించి వచ్చిన వారే, అయినా, ప్రహస్తుడిని సాగనంపేందుకు రావటం ముఖ్యమని అనుకున్నారు వాళ్లు. అతను ఒక్కసారి వీళ్లని ఎలుగెత్తి పిలిచి ఉంటే నేను గాలివీస్తే ఎగిరిపోయే ఈకలా ఎగిరిపోయే వాడినే. కానీ ప్రహస్తుడు ఎప్పుడూ రాజభవనంలో నివసించ లేదు. అవకాశం

దొరికినప్పడల్లా నగరానికి దూరంగా గ్రామప్రాంతంలో ఉన్న తన ఇంటికి వెళ్లిపోయేవాడు. గ్రామీణ వాతావరణం తనకి అనుకూలంగా ఉంటుందని అతను ఎప్పుడూ అనేవాడు.

వెనక్కి తిరిగి ఆలోచిస్తే, అతను ఎప్పుడూ కూడా తన కుటుంబం గురించి ఒక్కమాట కూడా మాట్లాడేవాడు కాదు, ప్రభుత్వోద్యోగానికి తన బంధువులలో ఎవరినీ నియమించమని కోరలేదు, నా చుట్టూ ఉండే మిగతావారిలాగ నానుంచి ఎటువంటి ఉపకారాలూ ఆశించలేదు. దానికి కారణం అతనికి ఉన్నదురభిమానమని అనుకుని నేను కోపం తెచ్చుకునేవాడిని, కానీ ఇప్పుడు ఈ శవయాత్ర గ్రామంలో ఉండే అతని ఇంటివైపుకి కదులుతూ ఉంటే, అతని ఆ ప్రవర్తనకి కారణం అతని దృఢనిశ్చయం తప్ప ఇంకేమీ కాదని అనిపించింది. అతను నివసించిన ప్రాంతం ధనవంతులూ, ఐశ్వర్యవంతులూ ఉండేది కాదు, కానీ గ్రామీణ అందాలతో అలలారుతూ ఉంది. అక్కడి జనంకూడా గ్రామీణులే. ఒక రైతు నివాసం లాంటి ఇంటిముందు ఊరేగింపు ఆగింది. అది ప్రహస్తుడి ఇల్లు, పరిశుభ్రంగా ఉన్న ఒక పర్ణకుటీరం. రెల్లు గడ్డి కప్పిన పైకప్పవల్ల ఆ ఇల్లు చూడముచ్చటగా ఉంది. ఇంటి ఆవరణ శుభ్రంగా ఉంది. దగ్గరలోనే గోశాలా, బావీ ఉన్నాయి. కొన్ని పళ్లచెట్లూ పూలతీగలూ, ఒక చిన్న కొలనూ, దానిలో బాతులూ ఉన్నాయి. అనవసరమైన అలంకరణలతో నిండిన నా రాజభవనం నుంచి తప్పించుకుని ప్రధానమంత్రి ఇంతదూరం ఎందుకు వచ్చేవాడో ఇప్పుడు నాకు అర్థమైంది. ఇది గ్రామీణ వాతావరణంతో నిండిన ఆహ్లాదకరమైన ప్రదేశం. అతను పేదరికాన్ని కావాలని ఎంచుకోలేదు, ఇది సరళమైన జీవన విధానం. ఇది చాలా విలువైనది. ఒకప్పుడు నేను ఎవరినైతే ద్వేషించానో, ఎవరిని చూసి భయపడ్డానో ఆ వ్యక్తిలోని ఈ పార్శ్వం నాకు తెలీలేదు. అక్కడ చాలామంది గుమిగూడారు. సమాజంలో పేరు ప్రతిష్టలున్న వారూ, ధనికులూ కాదు - పేద గ్రామీణులూ, చిన్న చిన్న అధికారులూ! నేను అక్కడికి రాగానే అందరూ నిశ్శబ్దంగా ఉండిపోయాను. వాళ్ల సొంత విషాదంలో నేను జోక్యం

చేసుకుంటున్నానేమో అనిపించింది నాకు. ప్రహస్తుడి పోలికలు ఉన్న ఒక వ్యక్తి వచ్చి నాకు నమస్కరించాడు. అతను ప్రధానమంత్రి కుమారుడని ఎవరో రహస్యంగా చెప్పారు. నేను అతని భుజం తట్టి లోపలికి నడిచాను. చీకటిగా ఉన్న ఆ పర్ణశాలలో కొందరు స్త్రీలు శోకంతో ముడుచుకుని కూర్చుని ఉండటం కనిపించింది. ఒక స్త్రీ నెమ్మదిగా లేచి నావద్దకి వచ్చింది. వెలుతురు ఆమె ముఖంమీద పడగానే హత్యగావింపబడిన నా ప్రధానమంత్రి భార్యే ఆమె అని గుర్తుపట్టాను.

"నాకు చాలా బాధగా ఉంది," అన్నాను, కానీ నా మాటలు నాకే చాలా బోలుగా తోచాయి. ఆమె అక్కడే కదలకుండా నిలబడింది. నాకు ఇబ్బందిగా అనిపించసాగింది. మృత్యువు ప్రవేశించినచోట జరిగే కర్మలు నాకు ఎప్పుడూ ఇబ్బందినే కలిగిస్తాయి. నేను కూడా ఏదో ఒకరోజు మృత్యువు వాత పడవలసిన వాడినే అని గుర్తు చేస్తాయి అవి. చితి పేర్చేందుకు ఆ కుటుంబంలోని కొంతమంది పురుషులు ఒక పెద్ద మామిడి చెట్టుని కొట్టివేస్తున్న చప్పుడు నాకు వినిపించింది. మా అసుర ఆచారం ప్రకారం బిడ్డ పుట్టగానే మామిడి మొక్కని నాటుతారు. ఆ బిడ్డతోబాటు చెట్టకూడా పెరిగి పెద్దదై అన్ని జీవరాసులకీ ఫలాలని ఇస్తుంది. దానివల్ల ఈ ప్రపంచం జీవించేందుకు మరింత మెరుగైనదిగా తోస్తుంది. పుట్టినబిడ్డ కూడా ఆ చెట్టలాగే ఈలోకానికి ప్రయోజనకారిగా ఉండాలని దాని ఉద్దేశం. ఇక ఆ బిడ్డ అంతిమయాత్రకి సిద్ధమైనప్పుడు, తనతో జీవితాన్ని పంచుకున్న ఆ వ్యక్తికోసం తనని తాను సమర్పించుకుని, చితిమంటల్లో పొగగా మారి, ఈలోకాన్ని వదిలి వెళ్లిపోతుంది.

చివరికి అంతా అయిపోయింది. ప్రహస్తుడూ, అతను నమ్మిన సిద్ధాంతాలూ, అన్నీ అగ్నికి ఆహుతి అయి, రూపం కోల్పోయి, పొగలా మారి గాలిలో కలిసిపోయాయి. జనం మనసులు శోకంతో దడదడలాడటం చూసి నాకు ఈర్ష్య కలిగింది. కానీ వాళ్లు నెమ్మదిగా అక్కడినుంచి కదిలి తమతమ పనులమీద, తమ బాధలతో సహజీవనం చేసేందుకు వెళ్లిపోయారు. చీకటిపడింది కీచురాళ్లు రొద

చెయ్యటం ప్రారంభించాయి. నా సేవకులు బైట నిలబడి నేను ఎప్పుడు అక్కడినుంచి కదులుతానా అని చూస్తున్నారు. నా సమాధిలోంచి బైటికి వచ్చాను. నా మనసు భారంగా అయింది. ప్రహస్తుడి భార్యకీ, కుమారుడికీ, లేదా కుమార్తెకీ నాలుగు ఓదార్పు మాటలు చెప్పాలనిపించింది. 'నేను ఎటువంటి నాయకుడిని? నా ప్రధానమంత్రికి ఎంతమంది సంతానమో కూడా నాకు తెలీదు. యౌవనదశలో చేసిన గొప్ప గొప్ప ఆలోచనలన్నీ ఎక్కడికి పోయాయి? అందరినీ కంటికి రెప్పలా చూసుకునే నాయకుడిలా ఉండాలనీ, సానుభూతితో, దయతో ప్రవర్తించే వ్యక్తిగా ఉండాలనీ నేను అనుకున్నదంతా ఏమైంది? నా ప్రధానమంత్రి తన కుటుంబాన్ని ఎంత పేద స్థితిలో వదిలి వెళ్లిపోయాడు! వాళ్లు ఇప్పుడు వ్యవసాయం చేసుకుని జీవించే మట్టిమనుషులు, నిరుపేదలు.' ఈ ఇంటియజమాని సామ్రాజ్యానికి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు, వాళ్ల సాదా జీవితానికి ఒక అందం ఉండేది. బహుశా రాజకీయ దృష్టితో చూస్తే దానివల్ల మంచే జరిగింది. కానీ ఇప్పుడు వాళ్లు నిరుపేదలుగా మారారు. వాళ్లకి సాయం చెయ్యటం నా కర్తవ్యం.

నేను ప్రహస్తుడి కుమారుడిని రమ్మని కబురు పంపాను. అతను వచ్చి గౌరవంగా నాకు నమస్కరించాడు. కొద్దిగా సంకోచిస్తూ పట్టుబట్టలో కట్టిన ఒక మూటని నా పాదాల దగ్గర ఉంచి, మళ్లీ వంగి నమస్కరించాడు. ఒక భటుడు నాకేసి చూశాడు. నా అంగీకారాన్ని గ్రహించి నాముందే ఆ మూట విప్పాడు. నాకు ఒళ్లు మండిపోయింది, అందులో ఒక బంగారు కంకణం ఉంది. దానిమీద అసురుల ముద్ర ఉంది, పులిగోరు పతకంతో ఒక బంగారు గొలుసు ఉంది. ఇంకా కొన్ని పట్టు వస్త్రాలు చక్కగా మడతపెట్టి ఉన్నాయి. అవన్నీ ప్రహస్తుడి సొంత వస్తువులు. నా ఆస్థానానికి వచ్చినప్పుడు వాటిని మాత్రం అతను తన గొప్పతనం చాటుకునేందుకు ధరించేవాడు.

"ఏమిటిది?" అన్నాను. నా చెయ్యి కత్తి పిడి మీదికి వెళ్లింది.

ఆ యువకుడు కాసేపు మౌనంగా నిలబడ్డాడు. నేను అతన్ని

భయపెట్టి నట్టున్నాను. ఆ తరవాత నెమ్మదిగా తలపైకి ఎత్తి, "మమ్మల్ని క్షమించండి, మహాప్రభూ! ఇది మా నాన్నగారి కోరిక. ఆయన ఎప్పుడూ, "నాయనా, ఇది మన వస్తువులు కావు, ఈ రాజ్య ప్రజలవి", అని అనేవారు. రాజభటులలాగే ప్రజలు వీటిని ఆయన పదవికి సంబంధించిన ఆభరణాలూ, దుస్తులుగా భావించి వేసుకోనిచ్చారు అనేవారు. ఆయన పదవి వదిలేసినా, పదవీ విరమణ చేసినా, మరణించినా వీటిని మళ్లీ రాజుగారికే తిరిగి ఇచ్చెయ్యాలనీ, వాటిని ఆయన ప్రజల తరపున తన దగ్గర దాచి ఉంచుతారనీ చెప్పారు. నేను కేవలం మా నాన్నగారి కోరిక ప్రకారం నడుచుకుంటున్నాను," అన్నాడు.

కాసేపు మ్రాన్పడిపోయి మాటలురాక అలాగే ఉండిపోయాను. ఆ తరవాత పగిలిపోయిన పాత్రలోనుంచి నెమ్మదినెమ్మదిగా నీరు బైటికి కారిపోయినట్టు నా ఆగ్రహం కరిగిపోయింది. కళ్లలో నీళ్లు నిండాయి. అసురుల చక్రవర్తి అయే అర్హత ప్రహస్తుడికే ఉండింది. కానీ నాలో ఉన్న ఆకర్షణ అతనిలో ఉందా? నాలాంటి పాషాణ హృదయం అతనికి ఉందా? బహుశా ఈ గుణాలు అతనిలోనూ ఉండే ఉంటాయి, కానీ అతను వాటిని అధిగమించి జీవించాలనీ, మరణించాలనీ నిశ్చయించుకున్నాడు. అన్నిటికన్నా ముఖ్యంగా ఈ రాజ్యం అతన్ని కాకుండా నన్నే రాజుగా ఎంచుకుంది, అదే చేదు నిజం. అది అతనికి కూడా తెలుసు. నేనే రాజునయాను. ఈ రాజ్యమూ, అందులోని మూర్ఖులైన ప్రజలూ ప్రహస్తుడిని రాజుగా పొందే అర్హత లేనివారు. నన్నో నాకన్నా హీనుడినో, లేక నా సోదరుడు స్వార్థపరుడైన విభీషణుడిలాంటి త్రాష్టుడినో ఇష్టపడ్డారు. సముద్రం ఆవల ఉంటే తెల్లతోలు ఆక్రమణదారులకి గుప్పెడు బంగారంకోసం తన రాజ్యాన్నీ తన వాళ్లనీ అమ్మకునేంత విభీషణుడివంటి నీచులే వీళ్లకి తగిన ప్రభువులు.

ప్రహస్తుడి పర్ణశాలనుంచి బైటికి నడిచాను. ఈ కాస్త సేపట్లోనే అతని వాదనలనీ, అతని మొండితనాన్నీ అతని సలహాలనీ ఇంక పొందలేను కదా, అని వాపోయాను. యావనంలో మేమిద్దరం పంచుకున్న ఒత్తిడితో

కూడిన అనుబంధం కోసం నా మనసు తపించింది. ఈ యుద్ధం ముగిసి నేను ప్రాణాలతో బైటపడితే నా సామ్రాజ్యాన్ని మళ్లీ నిర్మించుకుంటాను. కానీ ఈసారి ఎక్కువ సానుభూతితో, ప్రభుత్వోద్యోగుల్లో ఎక్కువ న్యాయబుద్ధి ఉండేలా, పరిపాలనలో పారదర్శకత ఉండేట్టుగా, పాలనా రంగానికి సంబంధించిన నియమాలని నిక్కచ్చిగా పాటించటం మీద కన్నా ప్రజల సుఖ సౌకర్యాల గురించి ఎక్కువ పట్టించుకునే విధంగా పునర్నిర్మిస్తాను. ప్రహస్తుడి ప్రభావం అతను జీవించి ఉన్నప్పటికన్నా మరణించిన తరవాతే నామీద ఎక్కువగా ఉండేట్టు ఉంది. అతని త్యాగం వృధా అవకూడదని అనుకున్నాను. కానీ, ఏ త్యాగం ఇంతవరకూ వృథా అవకుండా ఉంది?

లంకిణి మాకు నమ్మకద్రోహం చేసింది. అయినా అది నేను ఊహించినదే. నమ్మకద్రోహం చెయ్యని అసురులు అసురులే కాదు. అందుకే కన్యాకుమారిలోని దుష్ట రాజ్యాధిపతి సాయంతో హనుమంతుడిని నిరోధించమని ప్రహస్తుడికి చెప్పాను. ఇదంతా ఒక్కరోజులో ఎలా జరిగిపోయింది? నిన్నటికి నిన్న మేము ఒక గొప్ప విజయం అంచుకి చేరుకున్నాం. ఇప్పుడు అంతా తలకిందులైంది. నాకు అందిన సమాచారం వివరంగా లేదు, కానీ ఆ సమాచారంలోనుంచి నేను గ్రహించిన విషయం మాత్రం విలక్షణంగా ఉంది. వాతావరణం అనుకూలించ నందువల్ల ప్రహస్తుడి ప్రయాణం మధ్యలో ఆగిపోయింది. అతను ప్రధాన భూభాగానికి చేరుకునేసరికి లంకిణి హనుమంతుడితో ఒప్పందం చేసుకుంది. రాముడిపక్షాన చేరటంవల్ల లంకిణికి చాలా లాభం ఉంది. అందుకని హనుమంతుడు ఇంకా ప్రధాన భూభాగానికి చేరుకోలేదనీ, అతను కాసేపు సేదతీరవచ్చనీ ఆమె ప్రహస్తుడిని నమ్మించింది. ప్రహస్తుడు తినే భోజనంలో మత్తుపదార్థం కలిపి, అతను స్పృహ కోల్పోయిన తరవాత అతన్ని పొడిచి చంపింది. ఆలోపున హనుమంతుడు ఔషధ మొక్కలు తీసుకుని వెనక్కి వచ్చాడు. గాయపడిన రాకుమారులకోసం వాటిని తీసుకురమ్మని అతన్ని పంపించారు. రాముడినీ, లక్ష్మణుడినీ సృహలోకి తీసుకురావటంలో

వాళ్లు కృతకృత్యులయ్యారో లేదో తెలీదు కానీ, లంకిణి ఎంతమాత్రం సిగ్గూ, బిడియం లేకుండా నా ప్రధానమంత్రి మృత శరీరాన్ని నాకు పంపించింది. ఒకసారి రాముడిని తుదముట్టించాక, లంకిణిని ఈ విషయానికి సంబంధించి కొన్ని ప్రశ్నలు అడగాలని నిశ్చయించుకున్నాను. నాకు యుద్ధమంటే విరక్తి కలిగింది, కానీ దాన్ని ఆపే శక్తి నాకు లేకపోయింది. రథచక్రాలు వాటంతట అవే తిరిగిపోతున్నాయి. యుద్ధంలో పాల్గొనేవారి ఇష్టాయిష్టాలబట్టి కాకుండా, సరైన సమయం వచ్చినప్పుడే అవి ఆగుతాయి. పైగా వాటికి అడ్డంవచ్చిన దేన్నైనా అది నాశనం చేస్తూ ముందుకి సాగిపోతాయి - అది గర్వమైనా, అధికారమైనా, జీవితమైనా, పరువు ప్రతిష్టలైనా, ఏవైనా సరే.

నేను రాజభవనం చేరుకునేసరికి చీకటి పడింది. చలికి కాగడాలు చిటపటలాడుతున్నాయి, సముద్రంమీదనుంచి ఉప్పగాలి వీస్తోంది, నిరంతరం మారుతూ ఉండే చీకటి వెలుగుల చుట్టూ ఈ లోకం నాట్యం చేస్తోంది. ఆకాశం నల్లటి దుప్పటిలాగా, అందులో ఉన్న రంధ్రాలలోనుంచి కనిపించే నక్షత్రాలు, ఒకసారి మినుకుమినుకుమంటూ, మరోసారి మసకబారుతూ, మళ్లీ దేదీప్యమానంగా వెలుగుతూ తొంగిచూస్తున్నాయి. నేను బాగా అలసిపోయినప్పటికీ, శయన మందిరంలోకి వెళ్లి నా భార్యకి ఎదురుపడేందుకు సంకోచించాను. అందుకే అటు వెళ్లకుండా నా కుమార్తెని చూసేందుకు వెళ్లాను. చలిరాత్రి, ఆమె అశోకవృక్షంకింద ఒంటరిగా ఉంది. ఆమె ఇంకా అక్కడే ఉంటోంది. నా కుమారులు మేఘనాదుడూ, అక్షయుడూ గుర్తుకొచ్చారు. అతికాయుడు కూడా జ్ఞాపకం వచ్చాడు. రాముడు చనిపోయి ఉండాలనీ, నరవానరులు అరణ్యంలోని తమ రాజ్యానికి తిరిగి వెళ్లిపోయి ఉండాలనీ కోరుకున్నాను. అన్ని ఆలోచనలూ ఇక రావటం మానివేశాక కొన్ని క్షణాలు బ్రహ్మానందస్థితిలోకి వెళ్లిపోయాను.

సుదూరాన, సముద్రం బూడిద రంగు జంతువులా కదులుతున్న చోటి నుంచి, చీకటిలో దాగి ఉన్న దీవినుంచి, హర్షధ్వానాలు లీలగా

చెవులకి సోకాయి. నా ప్రశ్నకి జవాబు లభించింది. రాముడు ప్రాణాలతోనే ఉన్నాడు, రేపే అతను ప్రతీకార వాంఛతో నామీద దాడి చేస్తాడు. ఎందుకోగాని ఆ ఆలోచన నా మనసుని స్థిమితపరిచింది. ఎంతైనా యుద్ధం మొద్దుబారిన నా అంతరాత్మకి ఆత్మప్రక్షాళన లాంటిది. త్వరలో ఏదో ఒక ఫలితం తెలియరాకపోదు.

ఒక భటుడు నా ఎదుటికి వచ్చి నిలబడి నమస్కరించాడు, "మహాప్రభూ, రాకుమారులు కుంభకర్ణులవారు మేల్కొన్నారు. మీ దర్శనం చేసుకోవాలని అనుకుంటున్నారు," అన్నాడు. తల పంకించి అనుమతి ఇచ్చాను. కుంభకర్ణుడు లోపలికి ప్రవేశించాడు. అతని ముఖం చూసిన మరుక్షణం, ఏదో సమస్య తల ఎత్తబోతోందని గ్రహించాను.

43. కుంభకర్ణుడి ఆక్రమణ

భద్రుడు

ఏదో అద్భుతమైన ప్రభావం కల వానరుల ఔషధివల్ల రామలక్ష్మణుల ప్రాణాలు నిలిచాయి. మా మనసుల్లో రెపరెపలాడిన ఆ కాస్త ఆశా అడుగంటింది. నిలబడే ఓపిక కూడా లేక, మూగవాడిలా, మళ్లీ కోట ద్వారాలు తెరుచుకోవటం, నరవానరులనీ, రాముడినీ ఎదిరించేందుకు అసురసేనలు బారులు తీరి వెళ్లటం చూస్తూ ఉండిపోయాను. ఆ వరుసల మధ్యలో ఎత్తైన ఏనుగుమీద కూర్చుని ఉన్న కుంభకర్ణుడు కనిపించాడు. ఈ సేనల ప్రస్థానం భిన్నంగా ఉండింది. ఎక్కువమంది సైనికుల చేతుల్లో విల్లంబులు కానీ, ఖడ్గాలు కానీ లేవు. ముందు నడుస్తున్న సైనికుల దగ్గర చివర్లు బాగా పదునుగా చెక్కిన వెదురు బొంగులు ఉన్నాయి. వాళ్ల వెనక కుంభకర్ణుడూ, అతని గజసేనా కదిలాయి. ఈసారి రథాలు లేవు. లంకలోని సముద్రతీరాన ఇసకలో వేగంగా కదిలేందుకు అవి పనికిరావు. ఒక్కరోజులో కుంభకర్ణుడు అసురసేనలోని లోటుపాట్లు గుర్తించాడు. ప్రధాన భూభాగపు మైదాన ప్రాంతాల్లో యుద్ధం చేసినట్టు అసురసేనలు ఇంతవరకూ చేస్తూ వచ్చాయి.

శత్రువులని ఎదుర్కొనేందుకు ఇది మంచి ఉపాయం. హఠాత్తుగా నాకు కూడా ఉత్సాహం కలిగి, ఆపదని నిర్లక్ష్యం చేస్తూ, నేను కూడా ఆ సైనికుల వరసలో చేరిపోయి ముందుకి సాగాను. ఎంతోమంది సామాన్య పౌరులు అలా సేనలో వచ్చి చేరటం గమనించాను. కొందరు నాకు పరిచయం ఉన్నవారే, వాళ్లే నన్ను వచ్చి వాళ్లతో చేరమని అడిగారు. అది బుద్ధిలేని పిచ్చి పని, అయినా నేను వెళ్లి వాళ్లతో కలిశాను. మా వెనక కొన్ని యోజనాల వరకూ సైనిక దళాలు విస్తరించాయి. అప్పుడు చూశాను మెరిసిపోతున్న రెండు ఆకారాలు గుర్రాలమీద స్వారీ చేస్తూ

ఉండటం. సూర్యుడు వాళ్ల వెనక ఉండటంవల్ల వాళ్ల ముఖాలు నాకు కనిపించలేదు. నా ఇంటి దగ్గర్లో ఉన్న వీధిగుడిలోని పూజారికి సాయం చేసే క్షురకుడు అకస్మాత్తుగా, "అదుగో, రాకుమారుడు మేఘనాదుడూ, అతని సేవకుడూ వస్తున్నారు," అన్నాడు.

క్షురకుడి చేతిలో అతను మోయలేనంత పెద్ద గద కనిపించింది. భయంతో బిక్కచచ్చిపోతూ తెల్లగుర్రంమీద ఉన్న మేఘనాదుడినీ, అతని వెనకే నల్లగుర్రం ఎక్కి వస్తున్న అతికాయుడినీ గమనించాను. గదలు తిప్పతూ వస్తున్న నల్లగా మెరిసే అసురుల శరీరాలు సముద్రమంత విశాలంగా విస్తరించి ఉన్నాయి. వాళ్ల మధ్య రాకుమారుడూ, అతని భృత్యుడూ తమ మెరిసిపోయే ఆభరణాలతో ప్రత్యేకంగా కనిపిస్తున్నారు. 'వానర విలుకాళ్లకి వాళ్లిద్దరూ సులభంగా దొరికిపోతారు. యౌవనంలో ఉన్నవాళ్లు ఎంత తెలివితక్కువగా ప్రవర్తిస్తారు?' నా కుమారుడివైపు తోసుకుంటూ వెళ్లేందుకు ప్రయత్నించాను. కానీ వీలు కాలేదు. ముందుకి పోతున్న సైనికులతోపాటు ముందుకే సాగిపోవలసి వచ్చింది.

వానరుల వరుసలు బారులు తీరి సముద్రం వరకూ విస్తరించటం కనిపించింది. పడిపోయిన వారధిని పునర్నిర్మించారు. దానిమీద చాలామంది వానరులు ఉన్నారు. వరుణుడి నౌకలు క్షితిజం వరకూ విస్తరించి ఉన్నాయి. సముద్రతీరాన ఎక్కడ చూసినా వానరులే కనిపిస్తున్నారు. కేకలు పెడుతూ గోల చేస్తున్నారు. నౌకల్లోనుంచి దింపుతున్న పడవల్లో కూడా వాళ్లే కనిపించారు. వరుణుడి నౌకల్లో ఒకదానిలోనుంచి ఒక అగ్నిబాణం మాపైనుంచి దూసుకుని వెళ్లింది. అసురులు అరిచారు. అసుర సేనలోని విలుకాండ్రు కొండమీది చెట్లలో దాగి సముద్రతీరాన పడవల్లోనుంచి దిగుతున్న వానరులమీద బాణాల వర్షం కురిపించారు. చాలామంది వానరులు గాయపడ్డారు, కిందపడి ప్రాణాలు కూడా పొగొట్టుకున్నారు, కానీ మిడతల దండులా ఇంకా ఎక్కువమంది వస్తూనే ఉన్నారు.

సముద్రతీరాన బహిరంగ ప్రదేశానికి రాగానే కుంభకర్ణుడు తన

సేనలని ఆగమన్నాడు. త్వరత్వరగా ఆదేశాలు అందసాగాయి, అందరూ అయోమయానికి గురయారు. దళపతులు గొంతుచించుకుని ఆజ్ఞలు జారీ చేస్తూ ఉంటే సైనికులు ఒకరినొకరు తోసుకోవటం ప్రారంభించారు. చివరికి సేన మొత్తం అర్ధచంద్రాకారంగా నిలబడింది. కానీ ఇసుకలో కాకుండా చెట్లకింద నిలబడ్డారు. అసురులు వేచి ఉన్నారు. ఏనుగులు తొండాలతో పెద్దపెద్ద దుంగలనీ, చెట్లనీ పట్టుకుని అడవికీ సముద్రతీరానికీ మధ్యలో నిలబడి వేచి ఉన్నాయి. మేఘనాదుడు గుర్రంమీద కూర్చుని అస్థిమితానికి గురవటం, గుర్రంతోపాటు దళపతి దగ్గరకి ముందుకి తోసుకువెళ్లటం కనిపించింది నాకు. చివరికి రాకుమారుడు కుంభకర్ణుడి దగ్గరకి ఎలాగో ఒకలాగ మేఘనాదుడు చేరుకోగలిగాడు. అతనివెంట విశ్వాసపాత్రుడైన అతికాయుడు ఉండనే ఉన్నాడు.

హఠాత్తుగా అసురసేనల్లో గుసగుసలు సద్దుమణిగాయి. ఇద్దరు రాకుమారులూ వాదించుకోసాగారు. కుంభకర్ణుడికి ఆవేశం పెరగసాగింది, అయినా మేఘనాదుడు తన పినతండ్రిమీద గట్టిగా అరవటం మానలేదు. అతికాయుడు కూడా మేఘనాదుడికి తోడువచ్చి కుంభకర్ణుడిని నానా మాటలూ అనసాగాడు. మేఘనాదుడు వెంటనే దాడి చెయ్యాలని అన్నాడు, కానీ కుంభకర్ణుడు మరో పన్నాగం సూచించాడు, అది మేఘనాదుడికి నచ్చలేదు, అది అంత తెలివైనది కాదని అన్నాడు. కుంభకర్ణుడిని పిరికిపంద అనీ, వృద్ధనారి అనీ దుర్భాషలాడాడు. కుంభకర్ణుడు వెంటనే ఆ ఇద్దరినీ బంధించమని తన భటులని ఆదేశించాడు. భటులు వెంటనే విచ్చుకత్తులతో మేఘనాదుడినీ, అతికాయుడినీ చుట్టుముట్టారు. మేఘనాదుడి అనుచరులు పోరాడుతూ తమ నాయకుడిని సమీపించారు. వెనువెంటనే ఈ పోరాటం సేన మొత్తానికీ పాకింది. అసురులు అపజయం పాలయేందుకు దేవతలు అక్కర్లేదు. నాకు అక్కడినుంచి వెళ్లిపోవాలని అనిపించింది.

సరిగ్గా ఈ అదను చూసుకుని అడవిలోని చెట్లలోంచి కొందరు

వానరయోధులు పరిగెత్తి వచ్చారు. వానరుల సేనాపతి, జాంబవంతుడు వాళ్లని వెనక్కి తగ్గమని కేక పెట్టాడు, ఆ మతిలేని దాడికి నాయకుడు అంగదుడు నాకు కనిపించాడు. 'తమకన్నా వయసులో పెద్దవారూ, అనుభవజ్ఞులూ ఏదైనా చెపితే యువకులు దానిని వినిపించుకోకుండా తెలివిమాలిన పనులు ఎందుకు చేస్తారు?'

కుంభకర్ణుడు శత్రువులమీద దాడి ప్రారంభించమని ఆదేశించాడు, దానితో అసురులు తమలోతాము కొట్లాడుకోవటం మానారు. ఏనుగులు ముందుకి నడిచాయి, కొండలవంటి తమ శరీరాలతో, తొండాలతో దుంగలని మోసుకుంటూ నమ్మశక్యంకాని వేగంతో వానరసేనమీదికి వెళ్లాయి. అంగదుడూ, అతని అనుచరులూ ఉప్పొంగే ఉత్సాహంతో, మొండి ధైర్యంతో అంతకుముందే అసురసేనని ఎదిరించేందుకు ముందుకి వచ్చినా, గజసేనని చూడగానే తమ వారితో కలిసేందుకు కాలికి బుద్ధి చెప్పారు. కానీ బలశాలులైన ఆ పర్వతాకారాలు ఆగకుండా ముందుకి సాగాయి. వానరసేనని ఛిద్రం చేస్తూ, హడిలిపోయి పరిగెత్తే నరవానరులని సముద్రంలోకి తోసివేస్తూ ముందుకి ఉరికాయి. వెనకనుంచి అసురసైన్యం ముందుకి దూకి పారిపోతున్న వానరులని చేజిక్కించుకుంది, గదలతో మోది వాళ్లని తుదముట్టించింది. ఏనుగులు వానరసేనలలో విధ్వంసం సృష్టించాయి. పొడవాటి ముల్లకర్రలు పట్టుకున్న అసురులు వానరులని వాటితో పొడవసాగారు. అంతే, ఆ వానరులు దిక్కుతోచని స్థితిలో బెదిరిపోయి పరుగులు పెట్టారు. కొండ శిఖరంమీదనుంచి పెద్దపెద్ద శిలలు పారిపోతున్నవానరులమీదికి దొర్లిపడసాగాయి.

ఒక ఏనుగు అంగదుడిని తొండంతో ఎత్తి దూరంగా విసిరివేసింది. ఆ అహంకారి వానర రాకుమారుడు పారిపోతున్న తన అనుచరుల మధ్యకి వెళ్లి దభీమని పడ్డాడు. తన సైనికుల కాళ్లకిందే వాడు నలిగిపోయి ఉండేవాడే, కానీ ఎలాగో తప్పించుకుని యుద్ధభూమినుంచి పారిపోతున్న ఒక సైనికుడిని గుర్రంమీద నుంచి తోసేసి, ఆ గుర్రాన్నెక్కి దౌడు తీశాడు. ఆ పిరికిపంద ప్రాణాలు అరచేత పట్టుకుని తన

శిబిరానికి పారిపోతూ ఉంటే, అతను తోసి పడవేసిన సైనికుడు గుర్రాల కాళ్లకింద పడి నలిగిపోయి చనిపోవటం చూస్తే నాకు అంగదుడి మీద రోత పుట్టింది.

నౌకలమీదనుంచి అగ్నిబాణాల వర్షం ఆగిపోయింది. వాళ్లు సముద్రం మధ్యలోకి వెళ్లిపోయారు. కొద్దిసేపట్లోనే అసురులదే యుద్ధంలో పైచెయ్యిగా మారింది. నేల మీదా, సముద్రం మీదా కూడా వాళ్లే విజృంభించారు. నేను ముందు వరసలలోకి వెళ్లే ధైర్యం చెయ్యలేకపోయాను, కానీ వానరులని ఏనుగులు ఏ కీలు కా కీలు విరిగేట్టు, తొక్కి చంపటం నాకు కనిపించింది. మధ్యాన్నం అయేసరికల్లా అసురులు రాముడి వారధిని చేరుకున్నారు. పారిపోయే వానరులని మరింత దూరం తరిమికొట్టసాగారు. ధీశాలి హనుమంతుడి నాయకత్వంలో ఉన్న కొందరు వానరులని తప్పిస్తే రాముడి సేనలో ఎక్కువభాగం నాశనమయారు. హనుమంతుడు తన సేనని ఎంతో నేర్పుతో ఉపయోగించుకున్నాడు. పెద్ద పెద్ద నగారాలు మోగించి ఏనుగులని భయపెట్టసాగాడు. అవి బెదిరిపోయి ఆగిపోయేసరికి వాటిమీద కూర్చున్న సైనికులని గురి తప్పని బాణాలతో కొట్టమని తన సైనికులని ఉత్సాహ పరిచాడు.

మేఘనాదుడు ఎక్కడున్నాడా అని కంగారు పడ్డాను. ఇంతలో ఒక వింత ధ్వని గాలిని చీల్చుకుంటూ వచ్చింది. ఆ ధ్వని రానురాను పెరగుతూ ఉండటంతో సైనికులు ఒకర్నొకరు నరుక్కోవటం మాని పైకి చూడసాగారు. ఈ సైనికుల సమూహాల తలలపైన మయుడు తయారుచేసిన విమానంలో ఎగురుతూన్న మేఘనాదుడు కనిపించాడు. విమానంలో అమర్చిన పెద్దపెద్ద చక్రాలు గిర్రున తిరుగుతున్నాయి. వాటి ధాటికి కింద ఇసుకా, సముద్రపు నీరూ పైకి లేచి మళ్లీ కింద పడటం మొదలుపెట్టాయి. అతికాయుడు కూడా విమానంలో కూర్చుని ఉండటం నాకు కనిపించింది. ఇద్దరూ వానరులమీద అగ్నిబాణాలు వేస్తున్నారు. కొందరు అసురులు తమ వీరులని ప్రోత్సహిస్తూ హర్షధ్వానాలు చేశారు, కానీ నాకు మాత్రం

కుంభకర్ణుడి ముఖం కోపంతో వివర్ణం అవటం కనిపించింది. అతను గట్టిగా ఏదో అన్నాడు కానీ ఎవరికీ అది వినిపించలేదు. అప్పుడు పుష్పక విమానం వైపు చూసి కంగారుగా చేతులు ఆడించాడు, కానీ దానికి జవాబుగా విమానం కుంభకర్ణుడి కిరీటాన్ని తాకేటంతగా క్రిందికి వచ్చింది. కుంభకర్ణుడు అతికష్టంమీద తన ఏనుగుని అదుపు చెయ్యగలిగాడు.

ఏనుగులు బెదిరిపోయి మావటివాళ్ల మాట వినటం మానేశాయి. ఎన్నో అగ్నిబాణాలు గురి తప్పకుండా వానరులకి తగిలి, వాళ్లు మరణించారు. అయినా అసురులు ఆకాశంలోని దృశ్యాన్ని చూడటంలో మునిగిపోవటంవల్ల, దాడి తాలూకు ఉధృతి బాగా తగ్గిపోయింది. అప్పుడే పెద్ద విధ్వంసం జరిగిపోయింది. హఠాత్తుగా విమానం వింత శబ్దం చెయ్యటం ప్రారంభించింది. అందులోంచి చిటపటలాడుతున్న ధ్వనిలాంటిది వచ్చింది. చక్రాల రెక్కలు వేగంగా తిరగటం మానేశాయి, అంతే పైనించి పెద్దరాయి పడినట్టు విమానం వేగంగా వారధి దగ్గర ఉన్న నీటిలో పడిపోయింది. ఒకసారి మునిగి మళ్లీ పైకి తేలింది. నా మనసు అగాథంలోకి కుంగిపోయింది. 'నా కొడుకు, అతికాయుడు!' నేను ముందుకి పరిగెత్తాను, కానీ నాకన్నా దృఢకాయులు నన్ను వెనక్కినెట్టేసి ఆ దృశ్యాన్ని చూసేందుకు పరిగెత్తారు.

నేను అంతా స్పష్టంగా చూడగలిగే వేళకి, మేఘనాదుడు వారధి మీదికి ఎక్కటం, విమానాన్ని పైకి లాగేందుకు ప్రయత్నించటం కనబడింది. అదే సరైన అవకాశం అని గ్రహించిన హనుమంతుడు తన బలాలని ముందుకు పోయి రాకుమారుడిని బంధించమని ఆజ్ఞాపించాడు. అతికాయుడు కూడా రాకుమారుడికి సాయంవెళ్లి ఆ ఎగిరే యంత్రాన్ని పైకి లాగేందుకు ప్రయత్నించసాగాడు. ఉత్సాహంతో బైలుదేరిన కుంభకర్ణుడు సైన్యాన్ని వెనకే వదిలేసి చాలాదూరం ముందుకి వచ్చేశాడు. తన సోదరుడి కుమారుడిని హనుమంతుడు బంధించే లోపల అక్కడికి చేరుకోవాలని ప్రయత్నించాడు.

కుంభకర్ణుడి మహాగజం మేఘనాదుడికి ఇంకా పది అడుగుల

దూరంలో ఉందనగా, ఒక ఇనుప ములికి గల బాణం దాని కుంభస్థలాన్ని త్రాకి దాదాపు రెండు మూరలు లోపలికి దిగబడింది. కింద పడిపోతూ దాని పర్వతకాయం కనిపించింది, అది పెద్దగా ఘింకరించటం ప్రారంభించింది. కుంభకర్ణుడు దాని వీపుమీదనుంచి కిందకి విసిరివేయబడ్డాడు. మేఘనాదుడి పక్కనుంచీ, అతికాయుడి పక్కనుంచీ బాణాలు రివ్వమంటూ దూసుకుపోసాగాయి, కానీ అదృష్టవశాతూ ఒక్కటికూడా వాళ్లకి తగలలేదు. ఈలోపల వాళ్లు దాదాపు ఆ విమానాన్ని వారధి మీదికి చేర్చి, దాని వెనక దాగి బాణాలనుంచి తమనితాము రక్షించుకోసాగారు. ఎన్నో బాణాలు విమానాన్ని తాకాయి, కొన్ని రెండు పక్కలనుంచీ వెళ్లిపోయాయి. కుంభకర్ణుడు తన గదకోసం చనిపోయిన ఏనుగువద్దకు పరిగెత్తాడు. రామలక్ష్మణులు బలశాలురైన నరవానరుల భుజాలమీద కూర్చుని కుంభకర్ణుడిమీదా, మేఘనాదుడి మీదా బాణాలు వెయ్యటం నాకు కనిపించింది. తమ కల్లెదుట జరుగుతున్నది నమ్మశక్యం కానిదిలా కనిపించటంతో కొయ్యబారిపోయిన అసురసేనలు కాస్త వెనక్కి తగ్గాయి. కుంభకర్ణుడు తన గదని అతిభారంగా ఉన్న ఏనుగుకిందనించి లాగటానికి ప్రయత్నిస్తున్నపుడు హనుమంతుడూ అతని అనుచరులూ మేఘనాదుడికి కొన్ని అడుగుల దూరానికి వచ్చేశారు.

నాలో కంగారు పెరిగిపోసాగింది. నేను చూస్తూ ఉండగానే ఆ ముసలి పీనుగ, దుష్ట జాంబవంతుడు, తెలివిగా ఆ క్షణాన్ని ఉపయోగించుకుని తన సేనకి ఏనుగులమీద అగ్నిబాణాలు వెయ్యమని ఆజ్ఞాపించాడు. సముద్రతీరాన ఏనుగులు ఒక బలమైన గోడ కట్టినట్టు కలిసి కదలసాగాయి, అక్కడ వాటిని అదుపు చెయ్యటం సులువు. ఇరుకైన వారధిమీద అవి ఒకదాని వెనక ఒకటి నడుస్తూ, కింద ఉప్పొంగే సముద్రం ఉండటంచేత, అంత సులభంగా కదలలేకపోయాయి. ఏదైనా ఒక అగ్నిబాణం గురిగా తగిలినపుడు, ఆ ఏనుగు బెదిరిపోయి వెనుతిరిగి పారిపోసాగింది. దాని వెనకే వస్తున్న ఏనుగుని అది గుద్దుకుంది, అప్పుడు ఆ రెండోది కూడా బెదిరిపోయింది. అంతే ఈ

రకంగా ఆ గజసేనలు అస్తవ్యస్తంగా తయారయాయి. ఏనుగులు గుడ్డిగా పరిగెత్తి దారిలో కనిపించినదానినల్లా ధ్వంసం చేసి పారేశాయి. కొన్ని వానరసేనలవైపు కూడా పరిగెత్తాయి. అవి వెళ్లిన దారి మొత్తం శవాలతో, విధ్వంసంతో నిండింది. కానీ మేఘనాదుడూ, కుంభకర్ణుడూ మాత్రం వెంట్రుకవాసిలో తప్పించుకున్నారు. ఎక్కువభాగం ఏనుగులు పరిగెత్తింది అసురసేనలవైపుకే, కొన్ని సముద్రంలో పడిపోయాయి.

నేను ప్రాణభయంతో పరిగెత్తి ఒక కొబ్బరిచెట్టు ఎక్కేశాను. కింద సైనికులు ఒకరితో ఒకరు కాకుండా ఆ ఏనుగులతో పోరాడసాగారు. చివరికి వారధి పెద్దగా శబ్దంచేస్తూ కూలిపోయింది. మేఘనాదుడూ, అతికాయుడూ, కుంభకరుడూ అవతలివైపు ఉండిపోయారు. కొన్నివేలమంది శత్రువుల మధ్యన చిక్కుకున్నారు. తమవైపు వచ్చిన కొన్ని ఏనుగులని వానర సైన్యం చంపివేసింది. కుంభకర్ణుడు ఎలాగైతేనేం తన గదని చేజిక్కించుకుని, దాన్ని గిరగిర తిప్పతూ మేఘనాదుడూ, అతికాయుడికీ హనుమంతుడి సేనకీ మధ్యన నిలబడ్డాడు.

అసుర సేనలు చెదిరిపోయాయి. మేఘనాదుడూ, అతికాయుడూ మళ్లీ విమానం ఎక్కిదాన్ని పైకి లేపే ప్రయత్నంలో పడటం చూసి నేను ఆశ్చర్యపోయాను. 'వీళ్లు తమ పినతండ్రికి సాయం వెళ్లటం లేదు!' హనుమంతుడి సేనని మట్టుపెట్టేందుకు వేగంగా ముందుకి నడుస్తూ కుంభకర్ణుడు తనమీదికి వచ్చే బాణాలని గదతో పక్కకి తోసేస్తున్నాడు.

కుంభకరుడు మరీ సమీపానికి వెళ్లాడు. దాదాపు వాళ్ల సేనలతో కలిసిపోవటంవల్ల రాముడుకాని, లక్ష్మణుడుకాని, వాళ్ల సైనికులుకాని అతనిమీద బాణాలు వెయ్యలేకపోయారు. తన గదతో అతను వానరులని మోదసాగాడు. వాళ్లు తమ కత్తులని చేతిలోకి తీసుకునే లోపల, బాణాలని సంధించే లోపల కుంభకర్ణుడు గదతో మోది వాళ్ల తలలు బద్దలుకొట్టాడు.

అంటే ఒకే ఒక వ్యక్తి, ఒంటరిగా, అంతపెద్ద వానరసేననీ ఆ ఇరుకైన వారధిమీద ఆపి ఉంచాడు. పడవల్లో ఉన్న తన సైనికులకి

కుంభకర్ణుడిని చుట్టుముట్టి వెనకనుంచి దాడి చెయ్యమని జాంబవంతుడు ఆదేశాలు ఇచ్చాడు. కానీ ఈలోపల కొందరు అసురులు అప్రమత్తులై జాంబవంతుడి పడవలు కుంభకర్ణుడిమీద దాడిచేసే దూరానికి చేరుకోకుండా ఆపారు. మళ్లీ సముద్రంలో యుద్ధం ప్రారంభమైంది. వరుణుడి నౌకలు వెనుతిరగటం నాకు కనిపించింది. దూరంగా తిప్పాలని సముద్రంలోకి వదిలారు, అవి వేగంగా తీరాన్నిచేరుకోసాగాయి. 'మేమింకా ఎంతసేపు శత్రువు ధాటికి తట్టుకోగలుగుతాం? పరిస్థితులు ఎంత త్వరగా మారిపోయాయి? అంతా ఆ మేఘనాదుడు మూర్ఖంగా తన గొప్పని ప్రదర్శించేందుకు ప్రయత్నించినందుకేగా?'

ఆసరికి వానరరాజు సుగ్రీవుడూ, హనుమంతుడూ మా సేనలని ఛేదించి, తమ చేతుల్లోనూ ఇనప గదలని పట్టుకుని వీరంగం సృష్టించారు. శత్రువుల నాయకుడి మీదే నా దృష్టి నిలిపి ఉంచేందుకు ప్రయత్నించాను. 'రాముడూ, లక్ష్మణుడూ ఎటు వెళ్లారు?' వాళ్లు మాయమై పోయినట్టున్నారు. విమానం రెక్కలు తిరగటం ప్రారంభించాయి. కొద్దిసేపు చప్పుడుచేసి ఆగిపోయాయి. మళ్లీ కొద్దిక్షణాలకి తిరగటం ప్రారంభించి మళ్లీ ఆగిపోయాయి. అంతసేపూ కుంభకర్ణుడు సుగ్రీవుడి తోనూ, హనుమంతుడితోనూ ద్వంద్వ యుద్ధం చేస్తూనే ఉన్నాడు. ఒంటరిగా ఆ ఇద్దరు మహాయోధులనీ కదలకుండా ఆపాడు. ఆ సమయంలో అతని అన్న కుమారుడు విమానంతో కుస్తీ పడుతూ ఉండిపోయాడు. ఇక అసురసైన్యానికి ఒక నాయకుడంటూ లేకుండా పోయాడు. తమ ఇద్దరు రాకుమారులూ శత్రుసేనకి చిక్కి ప్రాణాలకోసం పోరాడటం వాళ్లకి కనిపించింది.

కుంభకర్ణుడు ఒకబలమైన దెబ్బతో సుగ్రీవుడిని నీటిలోకి విసిరివేశాడు, కానీ హనుమంతుడు ఈలోపల తప్పించుకుని మేఘనాదుడివైపు పరిగెత్తాడు. కుంభకర్ణుడు వెనుతిరిగి హనుమంతుడి కాళ్లు పట్టుకునేందుకు ఉరికాడు. ఇద్దరు యోధులూ పోరాడుతూ నేలకి ఒరిగారు. కొన్ని బాణాలు కుంభకర్ణుడిని గాయపరిస్తే ఇంకొన్ని

హనుమంతుడిని కూడా గాయపరిచాయి. పడమర ఎర్రబారుతూ ఉండగా కుంభకర్ణుడు హనుమంతుడిని రెండు చేతులతో పట్టి పైకి ఎత్తి మితిమీరిన బలంతో నేలమీదికి విసిరికొట్టటం నాకు కనిపించింది. హనుమంతుడు కదలక మెదలక అలాగే ఉండిపోయాడు. నా నోటినుంచి ఆనందం పట్టలేక, ఒక పెనుకేక వెలువడింది. సరిగ్గా అదే సమయంలో వెనకనుంచి ఒక బాణం వచ్చి కుంభకర్ణుడి మెడలో గుచ్చుకుంది. ఆ బాణం ములుకు మీద అస్తమించే సూర్యుడి అరుణ కిరణాలు ప్రతిఫలించాయి. నెమ్మదిగా ఆ ధీశాలి, అసుర రాకుమారుడి శవం వారధిమీద కూలి, సముద్రంలోకి దొర్లింది. అతనితోబాటు వారధిలో ఒక పెద్దభాగంకూడా నీట మునిగింది.

చివరికి జాంబవంతుడికి తన వ్యూహరచనకి అనువైన స్థలం లభించింది. రాముడుకూడా ఆ అవకాశాన్ని జారవిడుచుకోలేదు.

తమ సేనాధిపతి ఆవిధంగా చనిపోవటం చూసి అసురులు హడిలిపోయారు. విమానంలో చిక్కుకున్న మేఘనాదుడినీ, అతికాయుడినీ తుదముట్టించేందుకు వానరసేన పరిగెత్తి వచ్చింది. నా కళ్లు బైర్లు కమ్మాయి. నా కుమారుడిని శత్రువులు నరకటం నేను చూడవలసిందేనా? ఇంతలో హనుమంతుడు కదిలాడు. తమ సేనాపతి మరణించాడని అనుకున్న వానరసేన ఆశ్చర్యపోయింది. నెమ్మదిగా హనుమంతుడు సృహలోకి రావటం చూసి వాళ్లు ఆగిపోయారు. హనుమంతుడు తడబడుతూ, తూలుతూ వెళ్లి ఆ విమానం ఎక్కి నిలదొక్కుకున్నాడు. అదే సమయంలో దాని రెక్కలు మళ్లీ తిరగసాగాయి. హనుమంతుడి గాభరాపడి వెనక్కి గెంతాడు. ఏం జరుగుతోందో గ్రహించేలోపల ఆ రెక్కలు పూర్తివేగంతో తిరగ నారంభించాయి. విమానం పైకి లేవటం చూసి, దాన్ని ఆపమని జాంబవంతుడు కేకలు పెట్టాడు. వానరులు బాణాలు వేస్తూ ముందుకి పరిగెత్తారు, గదలు విసిరారు, కొందరు వేగంగా పైకి లేస్తున్న విమానంమీదికి లంఘించారు. కొందరు ధైర్యశాలురు విమానాన్నే పట్టుకుని ఉందామని ప్రయత్నించారు, కానీ వేగంగా తిరుగుతున్న

రెక్కలు వాళ్లని ఖండఖండాలుగా నరికాయి.

సూర్యాస్తమయం అవుతూ ఉండగా రాకుమారుడూ, నా కుమారుడూ విమానంలో ఎగురుతూ తప్పించుకుని రావణుడి భవనంవైపు వెళ్లిపోయారు. సామాన్య సైనికులని వానరులకి వదిలిపెట్టేశారు. తమ జాతి అభివృద్ధికోసం తమ కుటుంబాలని వదిలివచ్చిన వాళ్లు చంపారు, చంపబడ్డారు. పాపం వానరులదీ అదే పరిస్థితి. కొన్ని నెలల క్రితం పేరు కూడా వినని వారికోసం ఈనాడు వాళ్లు పోరాడుతున్నారు. వాళ్ల పోరాటం ఇంకెవరికో కీర్తి ప్రతిష్టలు సంపాదించి పెట్టేందుకే! తరవాత చాలాసేపటికి జాంబవంతుడు తన సేనలని వెనక్కి రమ్మని పిలిచినప్పుడు వానరులు తమ దీవికి వెళ్లిపోయారు. నేను కూడా చెట్టమీదినుంచి దిగి ఇంటికి వెళ్లిపోయాను.

కుంభకర్ణుడు ప్రస్తుతం సొరచేపలకి ఆహారంగా మారి ఉంటాడు. అదృష్టవశాతూ సొరచేపలకి శార్యం తాలూకు విలువ తెలీదు. శవం వీరుడిది అయినా, శత్రువుది అయినా అవి అంతే ఇష్టంతో తింటాయి. ఒక్క పాత్ర మద్యంకోసం నేను దేన్నైనా త్యాగం చేసే స్థితికి చేరుకున్నాను. ఆ రాత్రి చాలా అందంగా ఉంది, చీకటిగా, వింతగా, మత్తు ఎక్కే వరకూ తాగి ఒళ్లు తెలీకుండా నిద్రపోయేందుకు అనువైన రాత్రిలా ఉంది.

44. వాళ్లు ప్రార్థిస్తూ ఉండగా...

రావణుడు

నేను మండోదరిమీద మండిపడ్డాను. నాకుమారుడి అంతుచూడాలని అనిపించింది నాకు. మూర్ణుడు! వాడిని ఏం చెయ్యాలో నాకు అర్థం కాలేదు. ఒక్కోసారి గొప్ప శార్యాన్ని ప్రదర్శిస్తాడు, పరిపక్వతతో ఆలోచిస్తూ, ప్రవర్తిస్తూ నిజమైన నాయకత్వ లక్షణాలని ప్రదర్శిస్తాడు. మరో సందర్భంలో ఎంతో తెలివితక్కువగా ప్రవర్తిస్తాడు. నాకు అందిన సమాచారం చాలా స్పష్టంగా ఉంది. ఈ మూర్ణుడి దుస్సాహసంవల్లే మాకున్న అతిగొప్ప సేనాపతిని యుద్ధంలో కోల్పోయాం. ప్రహస్తుడూ, మారీచుడి మరణాలకన్నా కుంభకర్ణుడి మరణం నాకు ఎక్కువ బాధ కలిగించింది.

గత రెండు రోజుల్లో రెండుసార్లు నా కుమారుడు విజయం సాధించే అవకాశాన్ని నిర్లక్ష్యంగా పోగొట్టుకున్నాడు. పైగా ఆ దద్దమ్మ ప్రతిసారీ తన తల్లి కొంగుచాటున దాక్కునేందుకు వచ్చేస్తాడు. ఇక ఆ నల్లమొదుగాడు రాజమందిరంలో ఏం చేస్తున్నట్లు? వాడు తన పెద్ద ఆకారాన్ని మరుగుపరిచేందుకు ఒక పక్కకి ఒదిగి నిలబడ్డాడు. నేను మేఘనాదుడి దగ్గరకి వేగంగా వెళ్లాను, కానీ మండోదరి మళ్లీ అడ్డువచ్చింది. "రావణా, వాళ్ల జోలికి వెళ్లకండి!" అంది.

"వాళ్ల జోలికి వెళ్లకూడదా, అలాగా? ఈ మూర్ణుడికి ఎప్పుడు బుద్ధి వస్తుంది? వాడు స్నేహం చేసేవారివల్లే వాడి బుద్ధి మందగించింది," అంటూ అతికాయుడివైపు ఉరిమి చూశాను. చిత్రంగా వాడి ముఖంలో బాధ కనబడింది.

"రావణా, నా నోటివెంట ఎలాంటి మాటలు వస్తాయో నాకే తెలీదు. తరవాత బాధపడవలసిన మాటలు నాచేత పలికించకండి. ఈ యుద్ధం

ఎందుకు ప్రారంభమైందో నిజంగా నేను మీకు గుర్తు చెయ్యాలా? మీ మొండితనం, అహంభావంవల్లే మొత్తం అసురజాతి నాశనం అవుతోందని అనమంటారా? వద్దు, నాచేత అటువంటి మాటలు అనిపించవద్దు."

ఆగ్రహంతో రేగిపోతున్న నాకు నేనెంత నిస్సహాయుడినో తెలిసొచ్చింది. ఆమె మాటలు బాధపెట్టాయి, ఎందుకంటే ఆమె చెప్పిందే నిజం. "మండోదరీ, ఆలోచించి మాట్లాడు. నువ్వు అసుర చక్రవర్తితో మాట్లాడుతున్నావని గుర్తుంచుకో!" అన్నాను. కానీ, ఆ మాటలు నాకే అర్థంలేనివిగా అనిపించాయి.

ఆమె నావైపు కోపంగా చూసింది. తరవాత, "రావణా, మీరు వెళ్లి విశ్రాంతి తీసుకోవటం మంచిది," అంది. కాసేపు ఏం చెయ్యాలో తేల్చుకోలేక అక్కడే నిలబడ్డాను. ఆ తరవాత అక్కడినుంచి కదిలాను. ఒంటరివాడిలా, ఎవరో నన్ను మోసం చేసినట్టు, కోపం, నిస్పృహతో వీగిపోయాను. ఇటువంటి భయంకరమైన అనుభవాలు నాకే ఎందుకు ఎదురవాలి? జీవితంలో ఇంత దుఃఖం, ఇంత దురదృష్టం ఎందుకు అనుభవించాల్సివస్తోంది? ప్రతిదానికోసమూ ఇంత సంఘర్షణ ఎందుకు చేయవలసి వస్తోంది? అతిగారాబంవల్ల చెడిపోయిన నా కుమారుడు చేసిన తప్పిదాలు నేనెన్నడూ చేసి ఉండేవాడిని కాదు. ఏదో ఒకరోజు ప్రపంచంలోకెల్లా పెద్ద సామ్రాజ్యం వాడికి వారసత్వంగా లభించబోతోంది.

సోదరా! కుంభకర్ణా! నిన్ను చాలాకాలం క్రితమే నిర్లక్ష్యం చెయ్యటం ప్రారంభించాను. నువ్వు దిగజారిపోతున్నావని తెలిసికూడా నిన్ను ఆపాలని నేను ఎన్నడూ ప్రయత్నించలేదు. బహుశా దానివల్ల నాకే లాభం అనుకుని ప్రోత్సహించి కూడా ఉండవచ్చు. నేను నిన్నుచూసి భయపడేవాడిని. నీ మనసులో ఉన్న అత్యాశనీ, అసూయనీ నేను గ్రహించాను. నీకు కూడా రాజు అవాలని ఉండేది. కానీ రాజ్యం ఏలటంలోగల ప్రమాదాలు నీకు తెలియవు. అధికారం ఆత్మని ఎలా భ్రష్టుపట్టిస్తుందో, కొద్దికొద్దిగా ఎలా హరించివేస్తుందో నువ్వు ఎరగవు. నీ ఆకాంక్ష లన్నిటినీ నల్లమందులోనూ, మద్యంలోనూ ముంచేశావు, కానీ

అధికారం అనే నల్లమందు నేను సేవించాను, నువ్వు సేవించిన అన్నిరకాల మత్తు పదార్థాలకన్నా కూడా అది ఎక్కువ శక్తివంతమైనది. నువ్వు విషపదార్థాలు తీసుకోవటం అలవాటయి నిరంతరం మత్తులో ఉండేవాడివి, నాకు రకరకాల నిరంకుశ చర్యలు చేస్తే మత్తెక్కేది. నువ్వు నీ అజ్ఞానాంధకారంలో నిద్రపోయే ఒక పర్వతాకారుడివి, నేను నిరంతరం నా అధికారమదంతో మెలకువగా ఉండే మరుగుజ్జుని. నీ ఆకాంక్షలు స్పష్టంగా తెలిసిపోయేవి, నీ మనసులోని భావాలుకూడా పారదర్శకంగా ఉండేవి. నాకు నీమీదకన్నా నా సింహాసనం మీదే ఎక్కువ ప్రేమ కాబట్టి నిన్ను చూస్తే భయంవేసేది. నామీదకన్నా నా అధికారంమీదే నాకు ప్రేమ ఎక్కువ. ఏదో ఒకరోజు నువ్వు నిద్రలోనుంచి మేలుకుని నాకు తెలియకుండా నా సింహాసనాన్ని హస్తగతం చేసుకునేందుకు కుట్రపన్నుతావేమోనని భయపడేవాడిని. నిన్ను మద్యం తన వశం చేసుకునేసరికి నేను స్థిమితపడ్డాను. అయినా ఎప్పుడూ నీమీద ఒక కన్నువేసే ఉంచాను. ఎప్పుడూ నువ్వు మత్తులోపడి నిద్రపోతూ ఉండేలా చూసుకున్నాను. నిజానికి కుంభా, నువ్వే నాకు నిద్రపట్టకుండా చేశావు. కానీ ద్రోహం జరిగినప్పుడు దానికి కారణం నువ్వు కాదు. మనమందరం ఎంతో ప్రేమగా చూసుకున్న మన అనుంగు అనుజుడే ఆ ద్రోహం తలపెట్టాడు. మనం వాడిని ఎంత ఏడిపించేవాళ్లం! వాడిని చూసి వాడికి తెలీకుండా నవ్వుకునేవాళ్లం. బ్రాహ్మణుడిలా ప్రవర్తించటానికి తాపత్రయపడే ఒక అసుర కుమారుడి గురించి కథలు కల్పించి చెప్పేవాళ్లం. ఇప్పుడు మనం చేసిన వెటకారం మనకే తిప్పికొట్టింది. శత్రువులు గుమ్మంలోకి వచ్చేశారు, మన చిట్టి తమ్ముడు కాగడా పట్టుకుని వాళ్లకి దారి చూపిస్తున్నాడు. మన కలలని దోచుకుని వాటిని పీడకలలుగా మార్చేందుకు సిద్ధంగా ఉన్నాడు. నాదే తప్ప, తమ్ముడూ, నాదే తప్పు! నన్ను క్షమించు. అసలు ప్రమాదం నీనుంచే వస్తుంది అనుకుని, పాములాంటి వాడిమీద కన్నువేసి ఉంచటం మరిచాను. కుంభా, నువ్వెప్పుడూ నిజమే చెప్పేవాడివి. చాలాకాలం క్రితమే విభీషణుడి నిజాయితీ గురించి నీకున్న అనుమానాన్ని వ్యక్తం చేశావు. కానీ నేను తెలివితక్కువగా, నువ్వే

నామీద కుట్ర పన్నుతున్నావనీ, చిన్న తమ్ముడికీ నాకూ విరోధం పెడితే సింహాసనం సంపాదించుకునేందుకు నీ దారి సుగమం అవుతుందని చూస్తున్నావనీ అనుకున్నాను. కానీ నాకు నీ అవసరం పడినప్పుడు, దిక్కూమొక్కూలేని ఈ అసురజాతికి ఒక దిశానిర్దేశం అవసరమైనప్పుడు, నేను నీ సాయమే కోరాను. నా తప్పుని ఎత్తి చూపేంత ధైర్యం నీలో ఉండింది, కానీ నాకు మరీ ఎక్కువగా సలహాలు ఇవ్వకుండా ఊరుకున్నావు. ఇప్పుడు నువ్వు ఎవరో నాకు తెలిసివచ్చింది, కానీ చాలా ఆలస్యంగా తెలుసుకున్నాను. యుద్ధం మనకి సానుకూలంగా సాగటంలేదు. త్వరలోనే మనం మళ్లీ నిర్మించాలనుకున్న నాగరికత, అందరూ సమానమే అనే ఆదర్శవాద ధోరణి, అందమైన నగరాలూ, భవనాలూ, భవ్యమైన ఆలయాలూ, రాజసం ఉట్టిపడే ప్రధాన రహదారులూ, అత్యుత్తమమైన సుగంధ ద్రవ్యాలకోసమూ, వస్తాలకోసమూ వాణిజ్య నౌకలు వేచి ఉండే ఓడరేవులూ, కళలూ, నాట్యశాలలూ, అన్నీ మన శత్రువుల కాళ్లకిందపడి ధ్వంసమైపోతాయి. నువ్వు అదృష్టవంతుడివి. అసురుల మహాస్వప్నం రూపులేకుండా మాయమవటం చూసేందుకు నువ్వు ఉండవు. బ్రాహ్మణులు మెదడుగా, దేవతల యోధులు అవయవాలుగా, వక్రబుద్ధిగల కుబేరుడిలాంటి వ్యక్తులు మన గొప్ప సమాజంలో మొండాలుగా తయారవటాన్ని నువ్వుచూడవు. మన శవాలమీద మన చిట్టితమ్ముడు నిర్మించాలని అనుకుంటున్నది అలాంటి సమాజాన్నే సోదరా, నువ్వు మర్త్యులు అనుభవించే దురదృష్టాలని దాటుకుని వెళ్లిపోయావు. త్వరలో నేను కూడా నీవెనకాలే రావచ్చు. నాకు ఒకటే భయం–మళ్లీ నేను నిన్ను కలుసుకున్నప్పుడు, నీ కళ్లలోకి చూడగలుగుతానా?

మండోదరి వచ్చి నా పక్కన నిలబడింది. ఆమె స్పర్శ నా ఆలోచనలకి ఆనకట్ట వేసింది. “రావణా, తన పినతండ్రికి జరిగిన ఘోరం పాపం మన కుమారుడి మనసుని వికలం చేసేసింది. తన తప్పవల్లే అలా జరిగిందని బాధపడుతున్నాడు” అంది.

"అది వాడి అపరాధమే. యుద్ధభూమి ప్రదర్శనశాల కాదు. అక్కడ తన సాహసకృత్యాలు చూపించి అందరినీ మెప్పించాలని అనుకోవటం అవివేకం. కుంభకర్ణుడిని పోగొట్టుకోవటం మనకి తీరని నష్టాన్ని కలగజేసింది. దానికి నా కుమారుడే కారణం అవటంచూసి నేను చాలా సిగ్గుపడుతున్నాను. వాడు ఇంక యుద్ధభూమికి రావక్కర్లేదు. అసురులు ఇంకా అటువంటి పొరపాట్లు జరిగితే తట్టుకోలేరు," అన్నాను.

'రావణా, వాడు ఇప్పటికే చాలా కుంగిపోయి ఉన్నాడు... వాడిని మన్నించలేరా?"

మళ్లీ నాకు ఆగ్రహం ముంచుకువచ్చింది. "వాడు చేసే స్నేహాలు అలా ఉన్నాయి. ఆ నల్ల బానిసని ఎప్పుడూ వెంటపెట్టుకుని వెళ్లవలసిన అవసరం ఏముంది వాడికి...", మండోదరి కళ్లలోని భావం చూసి ఆగిపోయాను.

"చాలు రావణా చాలు! ఎందుకింకా ఈ యుద్ధాన్ని కొనసాగించటం? మనం సంధి చేసుకోకూడదా? రాముడికి అతని భార్యని తిరిగి ఇచ్చేస్తే సరిపోదా?" అంటూ ఆమె యించుమించు ఏడుపు లంకించుకుంది.

"నాకు ఆత్మగౌరవం, అభిమానం ఏవీ లేవనుకుంటున్నావా? నాకున్న అతి గొప్ప యోధులనీ, నా సోదరుడినీ, నా స్నేహితులనీ, అందరినీ కోల్పోయిన తరవాత రాముడి పాదాలమీద పడమంటున్నావా? అసుర చక్రవర్తిని అయిన నేను ఒక కొద్దిపాటి సాహసికుడు, చిన్న రాజ్యానికి రాకుమారుడైన అతన్ని దయాభిక్ష వేడాలనా నీ ఉద్దేశం?"

"ఆ చిన్న రాజ్యానికి చెందిన రాకుమారుడే, ఆ అనాగరికుడే సగం అసుర సామ్రాజ్యాన్ని మింగేశాడు. ఈ బుద్ధిలేని యుద్ధాన్ని ఆపేలోపల ఇంకా ఎంతమంది ప్రాణాలు పోగొట్టుకోవాలని మీరు అనుకుంటున్నారు? అసలు ఈ యుద్ధం ఎవరికోసం చేస్తున్నారు?"

"ఈ యుద్ధం అసురుల ఆత్మగౌరవానికి సంబంధించినది.

కులవాదాన్ని ఆపేందుకు ఈ యుద్ధం..."

"మీ రాజకీయ ఉపన్యాసాలతో మీరు ప్రజలని మోసం చెయ్యగలరు. కాని మీరు ఈ యుద్ధం చేస్తున్నది స్వార్థపూరితమైన ఉద్దేశంతోనే కదా"

"మండోదరీ, నా చెల్లిని అనాకారిగా చేసి అవమానించినది ఈ రాకుమారుడే అన్న విషయం నువ్వు మరిచిపోతున్నావు. అవమానాన్ని మింగి ఊరుకోమంటావా?"

"మీరు ఆ చెల్లినేగా వితంతువుని చేశారు..."

"చాలించు! అయినా స్త్రీలకి ఇవన్నీ ఏం తెలుస్తాయని..."

"నాకు బాగానే తెలుస్తోంది, రావణా, మూర్ధులైన మీ ప్రజలముందు మీరు ఉదాత్తంగా ఉన్నట్టు నటించగలరేమో. మీకు ఆవేశంతప్ప మరొకటి తెలీదు. అసందర్భంగా, అహంకారంతో ప్రవర్తించే కాముకులు మీరు. మామూలుగా అసురులకి ఉండే మూఢనమ్మకాలూ, అహేతుకమైన విశ్వాసాలూ మిమ్మల్ని ప్రభావితం చెయ్యలేవనీ, మీరు ఒక గొప్ప హేతువాదిననీ పాపం వాళ్లదగ్గర గొప్పలు పోతారు. కానీ మనసు లోతుల్లో మీకు కూడా అటువంటి మూఢనమ్మకాలు లేకపోలేదు. ఒక సామాన్యుడికి ఉండే అర్థంలేని భయాలన్నీ మీలో కూడా ఉన్నాయి. అధికారం మళ్లీ మీ చేతికి వచ్చాక జనకుడి దగ్గరనుంచి మన కుమార్తెని వెనక్కి తీసుకురాలేదెందుకని? మీరు దండెత్తి వెళ్తే మిథిల కొన్ని ఘడియల్లోనే మీ ఆధీనంలోకి వచ్చి ఉండేది కాదా? కానీ మీరు భయపడ్డారు. మన కుమార్తె వెనక్కివస్తే, ఆమె వెంట దురదృష్టం కూడా వస్తుందనీ, అది అసుర స్వప్నాన్ని నాశనం చేస్తుందనీ భయపడ్డారు. అందుచేతే ఆమెకి తల్లి ప్రేమ అందకుండా చేశారు. అధికారమదం బాగా తలకెక్కిన మీకు కుటుంబంకన్నామీ కిరీటం మీదే మక్కువ ఎక్కువయింది. జోస్యం గురించి భయపడ్డారు. కానీ వాళ్లు శూర్పణఖ ముక్కూ చెవులూ కోసినప్పుడు, అది మీ అహంభావంమీద పెద్ద దెబ్బకొట్టింది, అందుకే మీ కుమార్తెని ఆమె

భర్తవద్దనుంచి అపహరించుకు వచ్చారు. ఎంత సిగ్గుపడాల్సిన విషయం అది! రాముడి భార్యని అపహరించుకువచ్చే బదులు అతనితో యుద్ధం చెయ్యవలసింది... ఆమె మన కుమార్తె అయినా సరే. ఇప్పుడు శత్రువులు మన గుమ్మందాకా వచ్చేశాక కూడా, ఇంకా మీ మూర్ఖపు పట్టుదలా, అహంభావం మిమ్మల్ని వదల్లేదు. ముందు మీరు ఒక రాజనీ, తరవాతే తండ్రి అనీ మరిచిపోయారు. నేను ఇంతవరకూ మౌనంగా మీ అహంభావాన్నీ, దురహంకారాన్నీ భరిస్తూ వచ్చాను. నా దాసీని మీరు బలాత్కరించి గర్భవతిని చేసినప్పుడు కూడా నేను నోరువిప్పలేదు. ఒక బ్రాహ్మణ స్త్రీని మోహపాశంలో బంధించాలని ప్రయత్నిస్తున్నారు అని విన్నప్పుడు కూడా ఇదేమిటని మిమ్మల్ని నిలదీయలేదు. ఆమె మరణించాక మీరు నిద్రలో వేదవతి పేరు ఉచ్చరిస్తున్నా నేనేమీ మాట్లాడలేదు. మీ సామ్రాజ్య నిర్మాణం పనుల్లో, భీకరమైన యుద్ధాలు చెయ్యటంలో, ఏ క్రూరమైన పనులు చేస్తున్నారని దేవతలని తప్పుపట్టారో అవే చెయ్యటంలో, దూర ప్రాంతాలలో దండయాత్రలు చెయ్యటంలో మునిగిపోయి నన్ను దీర్ఘకాలంపాటు ఒంటరిగా వదిలేసి వెళ్లినప్పుడు కూడా నేను మౌనంగా భరించాను. మూర్ఖులైన మీలాంటి పురుషులు ఈ భూమిని రక్తంతో ఎర్రబడేట్టు చేస్తున్నప్పుడు, ఇతర స్త్రీలలాగే నేనూ మౌనం పాటించాను. ఇప్పుడు చూడండి... మమ్మల్ని ఏ స్థితికి తీసుకువచ్చారో! ప్రాణనాథా, ఈ ఒక్కసారికి నామాట వినండి... సీతని ఆమె భర్తకి అప్పగించండి."

'నోరు మూసుకో మూర్ఖురాలా! నువ్వు అతిగా మాట్లాడుతున్నావు." అంటూ మండిపడ్డాను.

నాకు మరేమనాలో తెలీలేదు. వీధిలో నగ్నంగా నిలబడి ఉన్నట్టు అనిపించింది. నా మనసులో దాచుకున్న మాటలన్నీ బైటపెట్టినట్టు అనిపించింది. అవి అంత అందమైనవి కావు.

"సీతని రాముడివద్దకు పంపటం అనే ఆలోచన నాకు నచ్చుతుందని అనుకుంటున్నారా? కానీ రావణా, మన కుమార్తె మీద కన్నా నాకు మీమీదే ప్రేమ ఎక్కువ. మిమ్మల్ని కోల్పోవటం నాకు

ఇష్టంలేదు. ఈ యుద్ధంలో మనకి ఓటమి తప్పదు, రావణా! మీరు ఆమెని లంకకి తీసుకువచ్చిన మరుక్షణం నాకు భయం వేసింది – ఆమె గురించి, మీగురించి, నా గురించి. ఆమెని వెంటనే ఆమె భర్త దగ్గరకి పంపివేస్తే మంచిదని అనుకున్నాను. కానీ నేను ఏమైనా చేసేలోపలే మీరు యుద్ధం ప్రారంభించారు.

"కొన్నివేలమంది చనిపోయారు. అలాంటి సమయాల్లో మేము స్త్రీలం ఎంత బాధకి గురవుతామో ఒక్కసారైనా ఆలోచించారా? నేను ఒక కుమారుడిని కోల్పోయాను. కానీ తమ కొడుకులనీ, భర్తలనీ, తండ్రులనీ, సోదరులనీ, తమ ఇళ్లనీ, మానాన్నీ గౌరవాన్నీ కోల్పోయిన అంఖ్యాకమైన స్త్రీలలో నేను కూడా ఒకతెని, గౌరవం అనేది మీకు మాత్రమే ఉందా? మీ శత్రువులు నాకు ఎలాంటి అవమానం చేశారో మీకు తెలుసు. మరి మీరేం చేశారు? అసలు మీరు యుద్ధ భూమికే వెళ్లలేదే? లేదు! మీ కుమారుడిని పంపారు, మీ సోదరుడినీ, మిత్రులనీ, మంత్రులనీ పంపారు. కానీ మీరు మాత్రం పిరికిపందలా ఇక్కడ దాక్కున్నారు..."

"నోరు ముయ్యి..." అంటూ ఆమె గొంతు పట్టుకున్నాను.

"ఊఁ, ఆగారేం? నన్ను చంపెయ్యండి!"

అసహ్యాన్ని అణచుకోలేక ఆమెని కిందికి తోసివేసి గదిలోనుంచి వేగంగా బైటికి వెళ్లిపోయాను. ఏమీ చెయ్యలేక కోపంతో రగిలిపోయాను. నేను ఒక పనికిమాలిన వాడిలా, నామీద నాకే ద్వేషం కలిగింది. అసంకల్పితంగా సీత కూర్చున్న అశోకవృక్షం దగ్గరకి నడిచాను. చీకట్లో ముడుచుకుని కూర్చున్న ఆమె ఆకృతి కనిపించింది. ఒక చిన్న దీపంనుంచి మసక వెలుతురు పడుతోంది. నేను సమీపించగానే ఆమె తలపైకి ఎత్తి నన్ను చూసి అటువైపు తిరిగింది.

నాకు ఆమెని తాకాలనీ, గుండెలకి హత్తుకోవాలనీ అనిపించింది. "చూడు, నీకోసం ఎన్నిటిని త్యాగం చేస్తున్నానో," అందామనిపించింది. కానీ ఏదో అడ్డుపడి నిని, విమి చెయ్యనివ్వలేదు.

చాలాసేపు అక్కడే నిలబడిపోయాను. నా కుమార్తెతో మాట్లాడే ధైర్యాన్ని కూడగట్టుకోసాగాను. తరవాత ఆమెకి వినిపించనంత నెమ్మదిగా, "అమ్మా...!" అని పిలిచాను.

కొంతసేపు ఆమెవద్దనుంచి ఎటువంటి సమాధానమూ రాలేదు. మరోసారి పిలిచే ధైర్యం నాకు లేకపోయింది. ఇంతలో ఆమె సుకుమారమైన మేను వణకటం కనిపించింది. నెమ్మదిగా ఏడవటం కూడా వినిపించింది.

"సీతా, నువ్వు నా కూతురివి... మీ అమ్మని ప్రేమించినంతగా ఈ లోకంలో నేను వేరెవరినీ ప్రేమించలేదు. కాని ఇప్పుడు నామీదకన్నా నీమీదే నాకు ఎక్కువ ప్రేమ కలుగుతోంది," అన్నాను.

ఆమె వెక్కిళ్లు తప్ప ఇంకేమీ వినబడలేదు. ఇంక ఏం మాట్లాడాలో నాకు తెలీలేదు. కానీ, "నువ్వు లంకా రాజ్యపు రాకుమారిగా ఇక్కడే ఉండిపోగలవా? నీ తండ్రి దగ్గరే ఉండిపోతావా? దీనికి నువ్వు ఒప్పుకుంటే... నేను సంధి ప్రస్తావన పంపుతాను... రాముడు నీకు భర్తగా ఉండేందుకు తగడు. నువ్వు ఎప్పటికీ నీ తండ్రి దగ్గరే ఉండిపో!" అన్నాను.

దీనికి కూడా ఆమె సమాధానమేమీ ఇవ్వలేదు. వెనక్కి తిరిగైనా చూడలేదు. "నామాట విను తల్లీ... దయచేసి నీ భర్త వెంట వెళ్లకు."

నేను అలా అనగానే ఆమె కోపంతో గిరుక్కున వెనుతిరిగి, "నేను ఆయన్ని ప్రేమిస్తున్నాను. ఆయనని వివాహమాడిన భార్యని," అంది.

ఆమె అలా హఠాత్తుగా ఆగ్రహం వెలిబుచ్చేసరికి నేను వెనక్కి తగ్గాను. ఏమనాలో తెలీలేదు, కానీ చివరి ప్రయత్నం మాత్రం చేశాను.

'సీతా, నేను నీ తండ్రిని..."

"నా తండ్రి జనకమహారాజు, నా భర్త శ్రీరాముడు."

నిస్సహాయంగా అక్కడే నిలబడిపోయాను. దుఃఖం నా మనసుని ఛిద్రం చేస్తూఉంటే వెనక్కి తిరిగాను.

ఇంతలో త్రిజట నన్ను పిలవటం వినిపించింది, అప్పుడు గమనించాను ఆమెని. ఆమెతో మాట్లాడాలని అనిపించలేదు నాకు. ఆమె తన తండ్రి గురించిన వార్త వినే ఉంటుంది. "మా నాన్న ఈరోజు ధీశాలి అసురుడిలా పోరాడారా?" అని అడిగింది.

"నన్ను మన్నించు, త్రిజటా..." ఆపైన ఏమనాలో నాకు తెలీలేదు.

"మా తండ్రి గొప్ప యోధుడని మా అమ్మ ఎప్పుడూ చెప్పేది. ఒకప్పుడు మీకన్నా మెరుగైన యోధుడట కదా? కానీ మద్యం దుష్ప్రభావానికి గురయారని విన్నాను. నేను పెరిగి పెద్దదాన్ని అయే సమయంలోనే ఆయన పరిస్థితి క్షీణించింది. ఒక తాగుబోతు కుమార్తె అనే పేరు తెచ్చుకుని జీవించటం నాకు కష్టంగానే ఉండేది. నా మిత్రురాళ్ల తండ్రుల్లాగ ఆయన కూడా సామాన్యంగా, మత్తులో కూరుకుపోకుండా ఉంటే బావుండునని అనుకునేదాన్ని నాకు ఆయన్ని చూస్తే రోతగా ఉండేది. కానీ ఇప్పుడు, ఇలా..."

"త్రిజటా, మీ నాన్న ధీశాలి. చాలామందికన్నా మెరుగైనవాడు..." అంటూ త్రిజటని అక్కున చేర్చుకున్నాను. ఆమె వెక్కి వెక్కి ఏడవసాగింది. అక్కడ బాగా చీకటిగా ఉండటంచేతా, చుట్టుపక్కల చూసేవారు ఎవరూ లేకపోవటంచేతా నేను కూడా కన్నీరు కార్చాను. పరువు ప్రతిష్టలూ, అహంభావం ఎంత దుఃఖాన్ని కలిగిస్తాయి! ఈ దిక్కుమాలిన యుద్ధం, ఈ పనికిమాలిన జీవితం, శార్యాన్ని గురించీ, హింస గురించీ శాఘించటం - ఇదంతా నాకు వెగటు పుట్టించింది.

నన్ను చూసి నేను అలా జాలిపడుతూ ఉండగా రొప్పుకుంటూ ఒక భటుడు నా దగ్గరకి ఏదో సందేశం తీసుకుని పరిగెత్తుకుంటూ వచ్చాడు. ఆ తరవాత జరిగినదంతా అర్థంలేనిదే. ఇక ఏదీ పట్టించుకోనవసరం లేదని అనిపించింది. కాలచక్రంలో నేను కూడా ఒక పల్లుగా మారిపోయాను. ఒక వ్యక్తి ఉన్నతస్థితికి చేరుకుని దైవత్వాన్ని పొందేందుకు నేను ఒక మెట్టుగా మారాను. ఆ తరవాత రాముడి సాహసగాథలో ప్రాముఖ్యతలేని పాత్రగా మిగిలిపోయాను. ఆ క్షణంలో

సమస్తం మారిపోయింది.

'మహాప్రభూ!" పాపం ఆ దౌర్భాగ్యుడు చెమటలు కక్కుతూ అన్నాడు. వాడి ముఖంవైపు ఒక్కసారి చూడగానే నా కాళ్లు తడబడ్డాయి. నా ఒంట్లోని రక్తం మొత్తం కారిపోయింది. "ప్రభూ, మేఘనాదుడికి ఏదో జరిగింది..." అన్నాడు వాడు నేలకేసే చూస్తూ, నేను త్రిజటని పక్కకి తోసేసి పరుగు లంకించుకున్నాను. భటుడు నన్ను అనుసరించాడు.

"ఎక్కడున్నాడు వాడు? ఏం జరిగింది?" అంటూ భటుడి జవాబుకోసం ఎదురుచూడకుండా గాభరా పడసాగాను. జరగకూడనిది జరిగిపోయిందా అని ఒక పక్క హడిలిపోతూనే ఆ ఆలోచనని మనసులోనుంచి తీసివేసేందుకు ప్రయత్నించసాగాను. కాపలాభటులని దాటుకుంటూ వెళ్లి ఒక గుర్రాన్ని ఎక్కాను. కోట ద్వారాలు తెరుచుకున్నాయి. పిచ్చివాడిలా కొండమీదున్నదుర్గంవైపు గుర్రాన్ని పరిగెత్తించాను. నగర పొలిమేరలని దాటుతూ భగభగమందే మంటల హోరు విన్నాను. నా నగరం మొత్తం మంటలకి ఆహుతి అయిపోవటాన్ని వెనుతిరిగి చూశాను, కానీ ఆగలేదు. 'నగరం కాలిపోనీ, మానవజాతి మొత్తం సమసిపోనీ నా కుమారుడెక్కడ? నా మేఘనాదుడెక్కడ? హే భగవాన్ శివా!, నా కుమారుడికి ఎటువంటి ఆపదా రాకుండా చూడు!' నురగలు కక్కే గుర్రం ఒంటి చెమట చిక్కగా అతుక్కుంటోంది. అయినా ఇంకా అది నెమ్మదిగానే పరిగెత్తుతోందని అనిపించింది నాకు. దుర్గాన్ని చేరుకున్నాను, దాని ద్వారాలు బార్లా తెరిచి ఉండటం కనిపించింది. ప్రాణాలు వదిలిన సైనికుల పక్కనుంచి గుర్రాన్ని పరిగెత్తించాను. తమ రక్తంలోనే తడిసిపడి ఉన్నారు వాళ్లు, దుర్గం పూర్తిగా శ్మశాన నిశ్శబ్దంలో మునిగిపోయి ఉంది. గుర్రందిగి కాళ్లు ఈడ్చుకుంటూ భవనంవైపు నడిచాను. లోపలికి వెళ్లాలని నాకు అనిపించలేదు. అక్కడ నా కోసం ఎలాంటి దృశ్యం వేచి ఉందో తెలుసు. అయినా తలలు లేని మొండాల పక్కనుంచి నడిచాను. కొందరి చేతులూ కాళ్లూ తెగిపోయి ఉన్నాయి. గోడలనిండా రక్తం మరకలు

కనిపించాయి.

"మహాప్రభూ!" అనే పిలుపు విని ఉలిక్కిపడ్డాను. నా ఆర్థికమంత్రీ, దుర్గ సంరక్షకుడూ, జంబుమాలి స్తంభానికి ఆనుకుని నేలమీద కూర్చుని ఉన్నాడు. ఆయన ఒంటినిండా రక్తం. లేచేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నాడు.

సమాధానం నాకు ముందే తెలిసినా "మేఘనాదుడెక్కడ?? అని అడిగాను. ఆయన పూజాగృహంవైపు చూపించాడు. నా కుమారుడు ఎప్పుడూ అక్కడ ఉన్న శివుడి నటరాజ విగ్రహానికి పూజలు చేసేవాడు. నా మనసులో చిన్న ఆశాకిరణం మెరిసింది. "మేఘనాదా! మేఘనాదా! కుమారా!" అని పిలిచాను. వాడు సిగ్గుపడుతూ నవ్వుతూ బైటికి వస్తాడని ఏమూలో ఆశకలిగింది. కంపించే చేతులతో తలుపులు తోశాను. నా కుమారుడు నిర్జీవంగా అక్కడ కనిపించాడు. నేను నేలమీద కుప్పకూలిపోయాను. ఆ ఘోరమైన దృశ్యాన్ని నా కళ్లతో చూడలేక చూపులు తిప్పుకున్నాను, కానీ నా మనసు అటే చూడమని పోరసాగింది. మేఘనాదుడి తల శివుడి పాదాలమీద ఆని ఉంది. తల మొండెంనుంచి విడివడింది. వాడి మిగతా శరీరం కొద్ది అడుగుల దూరంలో పడి ఉంది. వెన్నులో నాలుగు బాణాలు దిగబడి ఉన్నాయి. ఏం జరుగుతోందో తెలిసేలోపలే వాడి ప్రాణాలు పోయి ఉంటాయని స్పష్టంగా తెలిసిపోతోంది. వాడిని వెనకనుంచి బాణాలతో కొట్టారు. వాడు కింద పడిపోయిన తరవాత వాడి శరీరాన్ని ముక్కలు ముక్కలుగా నరికారు.

"కోటలోకి జొరబడినవాడు లక్ష్మణుడు. దాదాపు నలభైమంది అతనివెంట వచ్చారు. వాళ్లు కోటలోపలికి ఎలా వచ్చారో, రాకుమారుడు ప్రార్థనామందిరంలో ఉన్నాడని వాళ్లకి ఎలా తెలిసిందో, ఎవరూ చెప్పులేకపోయారు." వృద్ధమంత్రి వలవల ఏడవసాగాడు. "రాకుమారుడు ఇక్కడికి వచ్చినప్పుడు చాలా నిరుత్సాహంగా కనిపించాడు. తను యుద్ధంలో ఓడిపోయాననీ, తన పినతండ్రి మరణానికి తనే కారణమనీ అన్నాడు. దేవుడిని కాసేపు ప్రార్థించాలని

ఉందని అన్నాడు... కానీ... చూడండి... అతను... ఎలా..."

"రెండోవాడు ఎక్కడున్నాడు?" అన్నాను. నా మెదడూ, శరీరం మొద్దుబారి పోయినట్టు అనిపించింది.

"చంపేసి ఉంటారు. బహుశా బైట ఎక్కడో పడి ఉంటుంది వాడి శవం. అందరినీ వాళ్లు చంపివేశారు. నన్ను మాత్రం, వృద్ధుడినని వదిలిపెట్టేసినట్టు ఉన్నారు."

నటరాజు విగ్రహానిది పెద్ద ఆకారం. దానివెనక ఎవరో కదిలినట్టు తోచింది నాకు. కానీ అటువైపు వెళ్లే సాహసం చెయ్యలేకపోయాను, ఎందుకంటే మేఘనాదుడి శవాన్ని దాటుకుని కాని అటు వెళ్లటం సాధ్యంకాదు. ఒక పెద్ద నల్లటి చెయ్యి విగ్రహాన్ని పట్టుకుంది, మరుక్షణం నెమ్మదిగా అతికాయుడు లేచి నిలబడ్డాడు. వాడు విగ్రహం వెనక నక్కాడు. వాడి ఒంటినిండా రక్తం, అయినా మావైపు నడిచి రావాలని ప్రయత్నించాడు. వాడి కళ్లు మేఘనాదుడి మీద పడగానే దెబ్బతిన్న జంతువులా పెద్దగా ఆర్తనాదం చేశాడు. నావైపూ, జంబుమాలివైపూ ఏమీ అర్థంకానట్టు చూశాడు. వాడి ముఖం కోపంతో వికృతంగా మారింది. నా వృద్ధమంతివైపు చూశాను. ఆయన ముఖం పాలిపోయింది. జంబుమాలి లేచి పరిగెత్తటానికి ప్రయత్నించాడు, అతికాయుడు తన బలాన్నంతా కూడ గట్టుకుని ఆయన మీదికి వచ్చాడు. జంబుమాలి పారిపోయే లోపల ఆయన జబ్బులు పట్టుకుని వదలకుండా ఆపాను. కానీ అతికాయుడు మా వద్దకి చేరుకునే లోపలే నేలమీద కుప్పకూలాడు. వాడి ముఖం తడిగా ఉన్న నేలకి కొట్టుకుంది. మళ్లీ లేచేందుకు ప్రయత్నించి కింద పడిపోయాడు. జంబుమాలిని దూరంగా ఒక మూలకి నెట్టాను. అక్కడినుంచి నన్ను దాటుకునిగాని ఆయన బైటికి పరిగెత్తలేడు. భయంతో గజగజ వణికిపోతూ ఆయన ఆ మూలనే కూలబడిపోయాడు. అతికాయుడి దగ్గరకి నడిచి వాడి ముఖం నావైపుకి తిప్పకున్నాను.

"ఆయన... ఆయనే కోట ద్వారాలు... తెరిచాడు... రాకుమారుడిని

రక్షించాలని శాయశక్తులా ప్రయత్నించాను... నన్ను మన్నించండి... నాకు సాధ్యం కాలేదు... ప్రయత్నించాను... నిజంగా ప్రయత్నించాను... లక్ష్మణుడు ఇక్కడికి వచ్చాడు... జంబుమాలే వాళ్లకి ఇక్కడికి దారి చూపించాడు... నేను అప్పుడు బైట ఉన్నాను... అంతా చూశాను... రాకుమారుడు... ఏకాంతంగా ఉండాలని అనుకున్నాడు... అందుకే... నేను అతన్ని వదిలి వెళ్లాను... బైట... ద్వారం దగ్గర ఉన్నాను... మళ్లీ నేను లోపలికి వచ్చి చూసేసరికి... లక్ష్మణుడు కనబడ్డాడు... వంగి... శరీరాన్ని చూస్తూ... నేను పోరాడాను... కానీ... వాళ్లు పారిపోయారు... నేను ప్రయత్నించాను... చాలా కష్టపడి ప్రయత్నించాను..." వాడు కొసప్రాణంతో ఉండికూడా వివరాలు చెప్పసాగాడు. వాడిని ఎత్తుదామని ప్రయత్నించాను, కానీ అంత భారీ శరీరాన్ని ఎత్తటం నాకు సాధ్యం కాలేదు. నెమ్మది నెమ్మదిగా, నేను చూస్తూ ఉండగానే నా అక్రమ సంతానం, నా కుమారుడు నా ఒడిలోనే చివరి శ్వాస విడిచాడు. వాడిని సుతారంగా నేలమీద ఉంచాను. గట్టిగా ఏడవాలనిపించింది, కానీ అలాటిదేమీ చెయ్యకుండా ఊరికే లేచి నిలబడ్డాను. ఎలుకలా వణుకుతూ ముసలితొక్కు జంబుమాలి ఆ మూలే కూర్చున్నాడు. దగ్గరకెళ్లి తొడలమధ్యలో గట్టిగా తన్నాను. నా కాలు పట్టుకుంటూ, "మన్నించండి... దయ చూపించండి... మహాప్రభూ!" అంటూ ఆర్తనాదాలు చేశాడు. బాకుని నాచేతిలోకి తీసుకుని, చాలా నెమ్మదిగా, ఏమాత్రం తొందరపడకుండా, తాపీగా కసితీరా అతన్ని ముక్కలు ముక్కలుగా నరికాను. ఇక నాకు అంతా తీరికే. ముందు ఆయన కళ్లతో ప్రారంభించి కిందివైపుకి వెళ్లాను. ఆ పని నాకు చాలా సంతోషాన్ని ఇచ్చింది. ఆయన బాధగా అరిచిన అరుపులు నా చెవులకి సంగీతంలా వినిపించాయి.

45. మృతవీరులకు దహన సంస్కారం

భద్రుడు

నేను భయపడినంతా జరిగిందన్న వార్త వినగానే రాజభవనానికి పరిగెత్తాను. అప్పుడే తెల్లవారింది. ఇక అంతా అయిపోయింది. రాకుమారుడితోపాటు మూర్ఖుడు, నా కొడుకు తన ప్రాణాలు కూడా కోల్పోయాడు. ఏదో ఒకరోజు ఇలా జరుగుతుందని అనుకుంటూనే ఉన్నాను. దీన్ని గురించి ఏమీ చెయ్యలేకపోయాను. కొడుకులపట్ల తండ్రులకి ఉండే ప్రేమ ఎప్పుడూ ఏకపక్షంగానే ఉంటుంది. అక్కడికి చేరుకోగానే భోరుమని ఏడుస్తూ, గుండెలు బాదుకుంటూ, వీధిలో కిందపడి దొర్లాను. దుఃఖాన్ని ఆపుకోవటం నావల్ల కాలేదు. కనిపించిన వాడికల్లా, రాకుమారుడికోసమే నా కొడుకు ప్రాణాలు పోగొట్టుకున్నాడని చెప్పాను. కానీ ఎవరూ వినిపించుకోలేదు. అందరూ రాకుమారుడి మరణానికి శోకం ప్రకటించేందుకూ, పెద్ద ఎత్తున జరగబోయే అంత్యక్రియలు చూసి ఆనందించేందుకూ పరిగెత్తుతున్నారు. వీధికి రెండువైపులా జనం కిక్కిరిసి ఉన్నారు. ఇవాళ యుద్ధం ఎందుకు జరగటం లేదా అని నాకు అనుమానం వచ్చింది. అది ధైనందిన విషయంగా మారింది, అందుకే సూర్యోదయమైనా ఎవరూ యుద్ధం మొదలుపెట్టకపోవటం అనేది విచిత్రంగా ఉన్నట్టు తోచింది. నన్ను భవనంలోకి పోనివ్వకుండా వాళ్లు అడ్డుకున్నారు. బతిమాలాను, డబ్బు ఆశచూపి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించాను, కానీ భటులు మునుపటికన్నా దురుసుగా ప్రవర్తిస్తూ నన్ను అవతలికి నెట్టేశారు. 'నా కొడుకు చనిపోయాడు. రాకుమారుడికోసం నా కొడుకుని చంపేశారు. నా కొడుకు..."

"ఒరే బికారి వెధవా, దారికి అడ్డు లే!" ఒక భటుడు నన్ను తోసిన తోపుకి కింద పడ్డాను. నా ముఖం నేలకి గట్టిగా కొట్టుకుంది. కానీ

కోపంతో లేచి నిలబడ్డాను. రాజ్యంకోసం నా కొడుకు తన ప్రాణాలు అర్పించాడు, అలాంటి మృతవీరుడి తండ్రికి చూపవలసిన గౌరవం మాట అటుంచి, నన్ను బిచ్చగాడిలా చీదరించుకుంటున్నారు!

'దయచేసి నన్ను లోపలికి పోనివ్వండి."

"ఒరే, మూర్ఖుడా! రాకుమారుడి మృతదేహాన్ని ఉంచిన శవవాహనం సుబేల పర్వతంనుంచి బైలుదేరి వస్తోంది."

కఠినాత్ముడైన ఒక భటుడు నన్ను పక్కకి తోశాడు. అసహాయంగా, రొప్పుతూ నిలబడి ఉండిపోయాను. నా మాట ఎవరూ వినిపించుకోలేదు. నా కొడుకు చనిపోతే ఒక్కడు కూడా చిన్నపిసరు జాలికాని, సానుభూతికాని కనబరచటంలేదు. నాకు క్షణం క్షణం ఆగ్రహం పెరిగిపోసాగింది. రావణుడినీ, గుర్తుకొచ్చిన మిగతా అందరినీ తిట్టకోసాగాను. కొంతసేపు జనం నన్ను, పట్టించుకోలేదు. కొంతసేపు గడిచాక ఒక భటుడు నావద్దకు వచ్చి నా చెంప పగలగొట్టాడు. నా తలగిర్రున తిరిగింది. పక్కనే ఉన్న మురికి కాలవలో పడిపోయాను. లేచే శక్తి, కోరికా లేకుండా మూలుగుతూ అలాగే ఉండిపోయాను. దూరంగా రథచక్రాల చప్పుడు వినిపించ టంతో, మురికి కాలవలోనుంచి పాకుతూ బైటికి వచ్చాను. జనాన్ని తోసుకుంటూ ముందుకివెళ్లేందుకు ప్రయత్నిస్తూ ఉంటే, వాళ్లు పక్కకి తప్పకోవటం మొదలుపెట్టారు. రథాలు సమీపించసాగాయి, జనసందోహం వెల్లవలా ఉరికింది. జనం ఒకరినొకరు తోసుకుంటూ నినాదాలు చెయ్యసాగారు. ఆ విషాదాన్ని తనివితీరా గ్రోలసాగారు. మృతుల దేహాలున్న శవవాహనాలు నెమ్మదిగా రాజభవనంవైపు కదులుతూ ఉంటే జనం హాహాకారాలు చేశారు. ఒకరికన్నా ఇంకొకరు గట్టిగా ఆర్తనాదాలు చేసేందుకు జనం పోటీపడ్డారు. శవాలమీద పూలవరం కురిపించారు. అందరూ మేఘనాదుడి కోసం కన్నీరు కార్చారు. 'నా కొడుకు మరణిస్తే, వీళ్లు దీన్ని ఒక ఉత్సవంలా జరుపుకుంటారు.'

ఆ ఊరేగింపుకి ముందుభాగంలో రావణుడు తల వంచుకుని

కూర్చున్నాడు. ఆయన ఒళ్లో మేఘనాదుడి శవం ఉంది. తన కన్న కొడుకు ముఖంమీద రావణుడి కన్నీరూ, చెమటా కారుతున్నాయి. రాకుమారుడి ముఖం రక్తసిక్తంగా, వికృతంగా ఉంది. మృత్యువు అతని యౌవనాన్నీ అందాన్నీ హరించివేసింది. వాళ్లు నాకు చేరువకాగానే నా గుండె దడదడ లాడింది. ఇంతకీ నా కొడుకు ఏడీ? నా అతికాయుడు ఎక్కడ? ఊరేగింపు సమీపించినకొద్దీ జనంలో అలజడి ఎక్కువయింది. నేను ముందుకి వెళ్లేందుకు ప్రయత్నించాను కానీ జనం నన్ను వెనక్కి తోసేశారు. రాజుగారి రథం వెనకే ఎన్నో ఎద్దుబళ్లు వెళుతూ కనిపించాయి. వాటిలో సామాన్య సైనికుల శవాలు గుట్టలుగా పడి ఉన్నాయి. బహుశా అతికాయుడు కూడా ఏదో ఒక బండిలో ఉండిఉంటాడు.

చాలామంది ఆ బళ్లవెనక పరిగెత్తారు. కొంతమంది హృదయవిదారకంగా ఏడుస్తున్నారు. నేను కూడా వాళ్లతో కలిసిపోయాను. చివరిబండి దగ్గరకి చేరుకునేసరికి నాకు బాగా ఆయాసం వచ్చింది. కూరల బస్తాలని కుక్కినట్టు మనుషుల శవాలని బళ్లలో కుప్పపోశారు. ఆ శవాలనుంచి రక్తం వీధిలోకి ధారగా కారసాగింది. కాకులు దొంగతనంగా బళ్లమీద వాలి మానవుల మాంసం రుచిచూడసాగాయి. మృత్యువు చాలా చవక అయిపోయింది. కానీ నా కొడుకు చనిపోయాడు. 'వాడి శవం ఎక్కడుంది? వాడి శవాన్ని తీసుకురావటం వీళ్లు మరిచిపోయారా?' శవాల ముఖాలని చూసేందుకు నానా అవస్థాపడసాగాను, కానీ చనిపోయిన వారందరూ ఒకేలాగ కనిపించారు. నా కళ్లు మసకబారాయి. 'వాడు నా మాట ఎందుకు వినలేదు?' వాడు చెడు సాహసం చేశాడు. నేను ఎప్పుడో లంక వదిలివెళ్లిపోవలసింది. పూర్ణానదీ తీరాన ఉన్న నా చిన్నపల్లెకి వెళ్లిపోయి ఉండవలసింది. ఎందుకు ఇక్కడే ఉండిపోయాను? ఈ లోకానికి సంబంధించిన రావణులతో, రాములతో నాకేంపని? వాళ్లూ వాళ్ల యుద్ధాలూ! రావణుడు నా భార్యని చెరచి నాకొక కుమారుడిని ఇచ్చాడు. వాడిని నేను ప్రేమించటం నేర్చుకునే సమయానికి నా

దగ్గర్నించి వాడిని తీసుకుపోయాడు.

చనిపోయినవారిని వరసగా పడుకోబెట్టారు. దహనక్రియకి కావలసిన కట్టెలని ఒక బండిలోనుంచి కింద పడవేశారు. కొందరు చితిపేర్చటం మొదలు పెట్టారు. నా కొడుకు కూడా చనిపోయిన వారిలో ఎక్కడో ఉంటాడనీ, ఆఖరిచూపు చూడనిమ్మనీ భటులని బతిమాలాను. చివరికి ఒక భటుడు నామీద జాలిపడి, నా చెయ్యిపట్టుకుని శవాల దగ్గరకి తీసుకెళ్లాడు. ఈ నిరర్థకమైన యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన దురదృష్టవంతుల ముఖాలను ఒకటొకటిగా పరిశీలించసాగాను. కానీ అతికాయుడు ఎక్కడా కనిపించలేదు. 'నా అతికాయుడు ఎక్కడ? వాడు ఇంకా జీవించే ఉన్నాడా?' చిన్న ఆశాకిరణం నా మనసులో మెరిసింది. 'ఒకవేళ వాడికి యుద్ధభూమికి వెళ్లేధైర్యం చాలక ఎక్కడైనా దాక్కున్నాడేమో? కొన్నిరోజుల తరవాత బాగుపడి వెనక్కి వస్తాడేమో?'

ఇంతలో పెద్దపెద్ద రాజభవనం ద్వారాలు నెమ్మదిగా మూసుకుంటూ, లోపలికి తోసుకెళ్లే జనాన్ని నెట్టివెయ్యటం కనబడింది నాకు. లోపల పక్కపక్కనే రెండు చితులు పేర్చటం కూడా కనిపించింది. ఒకదానిమీద రాకుమారుడు మేఘనాదుడి శవం ఉంది. రెండో దానిమీద ఉన్నపర్వతకాయుడు నా కుమారుడేనని స్పష్టంగా అర్థమైంది. మూసుకుంటున్న ద్వారాలవైపు పరిగెత్తాను. కాళ్లతో తంతూ, కేకలు పెడుతూ, జనాన్ని తోసేస్తూ ఎలాగో ఒకలాగ ద్వారాల వద్దకు చేరుకోగలిగాను. ఏమిచేసినా లొంగని జనంతో విసిగిపోయిన భటులు చెమటలు కక్కుతూ అలసి పోయినట్టు కనిపించారు. చిన్నసందులోంచి లోపలికి దూరదామని ప్రయత్నించాను, కానీ వాళ్లు నన్నుదురుసుగా బైటికి నెట్టేశారు. నా దారికి అడ్డంగా నిలబడ్డ భటుడి ముఖంమీద పిడికిలి బిగించి గుద్దాను. నా బలం చూసి నాకే ఆశ్చర్యం వేసింది. అంతపొడవు భటుడూ, ఒక వృద్ధుడు కొట్టిన దెబ్బకి బురదలో వెల్లకిలా పడ్డాడు. మిగతా భటులు తెప్పరిల్లే లోపల, వాళ్లని దాటుకుంటూ పరిగెత్తాను. నావెనక ఉన్నవాళ్లు అదే అదను అనుకుని లోపలికి వచ్చేందుకు ప్రయత్నించారు. మిగతా భటులందరూ వాళ్లని

తరమటంలో మునిగిపోయారు. ఆ అవకాశం చూసుకుని నేను చితి దగ్గరకి చేరుకున్నాను.

రాజుగారు వాడికోసం తయారుచేయించిన గంధపు చెక్కల చితిమీద నా కొడుకు ప్రశాంతంగా పడుకుని ఉన్నాడు. వాడి ఒంటినిండా కొన్ని వందల గాయాలు ఉన్నాయి. వాడి ముఖం కళావిహీనంగా ఉంది. మృత్యువు ఒడిలో వాడు ఒక అనాకారి రాక్షసుడిలా కనిపించాడు. అయినా వాడు నా కొడుకు, నా జీవితానికి గల ఒకే ఒక ప్రయోజనం వాడే. ఏ రాజూ వాడిని తన సొంతమని అనలేడు. జీవించి ఉన్నప్పుడు వాడిని వాళ్లు నాకు దూరంచేశారు. చనిపోయాక నాకు అందనంత దూరం తీసుకుపోతున్నారు. మా పూరిగుడిసెలో వాడి తల్లి వాడికోసం ఎదురుచూస్తోంది. నా కొడుకుని వాడి తల్లి దగ్గరకి తీసుకువెళ్లేందుకు ఏ రావణుడూ నన్ను ఆపలేడు. మహారాజు అక్కడే నిలబడ్డాడు. ఆయన ముఖంలో దుఃఖం, వేదన. మహారాణీ నేల మీద పడి వణుకుతూ మౌనంగా ఏడుస్తోంది. ఆమె జుట్టు ముడి విడిపోయి చెదిరిపోయింది. రాజభవనంలోని భట్రాజులు గట్టిగా శోకాలు పెడుతూ, ఒకరితో ఒకరు పోటీలుపడి మరీ తమ దుఃఖాన్ని చాటుకుంటున్నారు. వాళ్లవల్ల అక్కడ వాతావరణం రోత పుట్టించేదిగా తయారైంది. కొందరు మనుషులు గంధం చెక్కలని పేరుస్తున్నారు. అవి రాకుమారుడినీ, నా కుమారుడినీ నామరూపాల్లేకుండా చేసేస్తాయి. అసలు ఈ రాజభవనంలో నా కుమారుడికి ఏనాడూ స్థానం ఇవ్వలేదు. జీవించి ఉండగా వాడు నా మాటలు ఏనాడూ చెవిన పెట్టలేదు. రాజభవనంలో ఒక శునకంలా పడి ఉండేవాడు. కనీసం చనిపోయాకనైనా వాడి పౌరుషం వాడికి దక్కితే చాలు. నేను మహారాజు వద్దకి వెళ్లి, ఆయన్ని లెక్కచెయ్యనట్టుగా పక్కనే నిలబడ్డాను. ఆయనకి నమస్కారం కూడా చెయ్యలేదు. 'కావాలంటే నా తల తీసెయ్యనీ!' అనుకున్నాను.

"నా కొడుకు నాకు కావాలి," అన్నాను, కానీ రావణుడు అసలు నేను చెప్పింది తనకి వినపడనట్టే, నావైపు శూన్యంగా చూశాడు.

"నా కొడుకుని నాకు ఇచ్చెయ్యండి!" అని అరిచాను. అందరూ నావైపు చూశారు. నా ఉనికిని మహారాజు అప్పటికీ గుర్తించినట్టు కనిపించలేదు. ఈయన జట్టు పట్టుకుని చెవిలో గట్టిగా కేకపెట్టాలా? అనుకున్నాను. అలా చేసే మానసిక స్థితిలోనే ఉన్నాను. నెమ్మదిగా తలతిప్పి మహారాజు నావైపు చూశాడు.

నేను ఏడుపు ఆపుకోలేక వెక్కి వెక్కి ఏడ్చాను. ఆయన నా భుజంమీద చెయ్యివేశాడు, కానీ నేను దాన్ని తోసేసి, "నా కొడుకుని నాకిచ్చెయ్యండి!" అని గొంతు చించుకుని అరిచాను.

దుఃఖంనుంచి కొంచెం తేరుకున్న మహారాణీ మా దగ్గరకి వచ్చింది. మాట్లాడితేనే బాధ కలుగుతున్నట్టు, చాలా నెమ్మదిగా, "రావణా! వాడికి వాడి కుమారుడిని ఇచ్చెయ్యండి. వాడు అతికాయుడిని తీసుకువెళ్లేందుకు అనుమతించండి," అంది.

మహారాజు ముఖం ఆగ్రహంతో వికృతంగా మారింది, "వాడు నాకుమారుడు," అన్నాడు రహస్యంగా మాహారాణితో "కానేకాదు. వాడు జీవించి ఉండగా మీరు ఆమాట అని ఉండవలసింది. మీ కుమారుడు ఒక్కడే... మేఘనాదుడు. మీ తప్ప ఒప్పకుని అతికాయుడు పసివాడుగా ఉన్నప్పడే రాజభవనంలో వాడికి చోటు ఇచ్చి ఉంటే, మేఘనాదుడితోపాటు వాడిని కూడా నేనే పెంచి ఉండేదాన్ని కానీ మీరు వాడిని వదిలిపెట్టేశారు. ఇప్పుడు వాడిమీద మనకి ఎలాటి హక్కూలేదు. నిజానికి ఏనాడూ మనకి వాడిమీద హక్కులేదు," అంది మహారాణి.

రావణుడు నావైపూ, మహారాణివైపూ కల్లెర్రచేసి చూశాడు. కానీ మహారాణి ఏమాత్రం తొణకకుండా ఆయన కళ్లలోకి చూసింది. నాకు ఆయనవైపు చూసే ధైర్యంలేక దీనంగా ఏడుస్తూ ముఖం తప్పించాను. "తీసుకుపో... తీసుకుపో. వాడు మేఘనాదుడి మిత్రుడు కాకపోయినట్టయితే కుక్కలు కూడా వాడి చావుని లెక్కచేసి ఉండేవి కాదు," బలశాలి రావణుడు పళ్లు కొరుకుతూ నాతో అన్నాడు.

'అవును మహారాజా నా కొడుకులాంటి వారు చనిపోతే కుక్కలు కూడా పట్టించుకోవు. వాడు మీకోసం ప్రాణాలు కోల్పోయాడు. మీరు ఇచ్చే గుండ్రటి పతకాలూ, మీకోసం మరణించినవారి కుటుంబ సభ్యులకి మీరు ఇచ్చే చిన్న చిన్న ఉద్యోగాలూ పొంగిపొర్లే మీ కోశాగారాలలోనుంచి మీరు దయతలిచి నష్టపరిహారం కింద పారేసే చిల్లర నాణాలూ, అవన్నీ మరిన్ని కుక్కలు మీకోసం చనిపోయేందుకు వాటికి మీరు ఎరగా వేసే ఎముకలు తప్ప మరేమీ కావు. నా ఈ చిన్న కుక్కని మీదగ్గరనుంచి తీసుకుపోనివ్వండి. వాడితో మీకిక ఏ ప్రయోజనమూ లేదు. రాజ్యంకోసం, జాతి గౌరవంకోసం ప్రాణాలు అర్పించటం లాంటి అస్పష్టమైన, అర్థంలేని ప్రయోజనాలు ఎంత గొప్పవో చెప్పి మీరు ఎంతోమంది యువకులని ఆకట్టుకున్నారు. వాళ్లని గౌరవించి జనాన్ని మోసం చేశారు. చనిపోయినవారికోసం బ్రహ్మాండమైన ఊరేగింపులు ఏర్పాటు చేయించారు. తమ రాజ్యంకోసం ప్రాణాలు త్యాగం చేసినవారిని రాజుగారు మరిచిపోలేదని జనం సంతోషించారు. ప్రతి ఒక్క మృతవీరుడినీ గుర్తుంచుకుంటాం – మళ్లీ భోజన సమయం అయేదాకా. చాలా గొప్ప ప్రదర్శన, మహారాజా! ఇక మరింత మంది యువకులు ప్రాణాలు అర్పించేందుకు ముందుకొస్తారు. మీరు పారేసే ఎముక ముక్కలకి ఆశపడి, రెండు నిమిషాలపాటు పేరు ప్రతిష్టలతో వెలిగిపోయేందుకు, కుక్కలు మూత్రం విసర్జించే వీధి మొగలోని స్మారక శిలలుగా నిలిచేందుకు, ఇంకా ఎక్కువమంది యువకులు ప్రాణాలు బలిచేసేందుకు సిద్ధంగా ఉంటారు. నా కుమారుడితో ఇంక మీకు పనిలేదు. వాడిని వాళ్లమ్మ దగ్గరకి తీసుకు వెళ్లనివ్వండి.' - ఇవన్నీ మనసులో అనుకున్నానే తప్ప పైకి అనలేదు. అలా చెప్పే ధైర్యమే నాకు ఉండి ఉంటే నాలాంటి ఎంతోమంది నాతో గొంతు కలిపి ఉండేవారు. అప్పడిక ఈ లోకంలో రావణులూ, రాముళ్లూ మిగిలేవారేకారు. నా కొడుకు నిర్జీవ శరీరాన్ని అక్కున చేర్చుకున్నాను. వాడిని నా చేతులతో పైకి ఎత్తేందుకు ప్రయత్నించాను, కానీ వాడు చాలాకాలం క్రితమే నా చేతుల్లో ఇమడనంతగా పెరిగిపోయాడు. ఇద్దరు భటులువచ్చి వాడిని ఎత్తుకునేందుకు నాకు సాయం చేశారు. వాడి శరీరం కట్టెలా

బిగుసుకుపోయింది. వాడి తండ్రి ముసలి భుజాలు మోయలేనంత బరువున్నాడు వాడు. ఒక తోపుడు బండిని నా పక్కన తెచ్చి నిలిపారు. నేను సుతారంగా నా కొడుకు శరీరాన్ని అందులో ఉంచాను. ఆ బండిని మా పూరిగుడిసెవైపు తోసుకెళూ ఉంటే, ఆ శ్రమకి నా చేతి నరాలు ఉబ్బాయి. వాడి తల్లి వాడికోసం ఎదురు చూస్తూ ఉంది.

రాజభవనం ద్వారాలు దాటివెళ్లేలోపల, మేఘనాదుడి చితికి విషాదంలో కూరుకుపోయిన రావణుడు నిప్పముట్టిస్తూ ఉంటే రాణివాసపు స్త్రీలు గొల్లమని ఏడవటం వినిపించింది. రాజవీధిలోనుంచి మలుపు తిరిగి నా ఇంటికి వెళ్లే మట్టి బాటలోకి రాగానే అసుర రాకుమారుడు దట్టమైన నల్లటి పొగలో మాయమయాడు. అతని మిత్రుడు, సహచరుడు, భృత్యుడు, సవతి తమ్ముడు అతికాయుడిని ఈ పేద అసురుడు తన కొడుకు అని చెప్పగానే వాడిని అందరూ మరిచిపోయారు. నేను ఒంటరిగా నా కొడుకు మృతదేహం ఉన్న ఆ బండిని లాగుతూ నడిచాను. సూర్యుడు నిర్ధయగా వంద పిడికిళ్లతో నా శరీరాన్ని బాదుతూ ఉంటే, చెమటలు కక్కుతూ నడిచాను. నా మిత్రులుకాని ఇరుగుపొరుగువారు కాని ఒక్కరు కూడా కనిపించలేదు. ఒక రాకుమారుడికి దహనక్రియలని చూసేందుకు అందరూ వెళ్లారు. ఇంటిని సమీపిస్తూ ఉండగా ఒకప్పుడు అందంగా ఉండిన నా భార్య ఆకారం తలుపు దగ్గర వంగిపోయి కనిపించింది. తన కొడుకు రాకకోసం ఎంతో ఆత్రుతగా వేచి ఉంది ఆమె. మా వద్దకు పరిగెత్తుకుంటూ వచ్చి బండి దగ్గరకి రాగానే ఆగిపోయింది. మరుక్షణం ఆమె ఆనందం ఆవిరైపోయి దాని స్థానంలో దిగ్భ్రాంతి చోటుచేసుకుంది. అంతలోనే జరిగినది అంగీకరించినట్టు ముఖం పెట్టి, మళ్లీ విధి ఆమెని కొట్టిన దెబ్బకి తల్లడిల్లిపోయింది. అతికాయుడి శవంమీదపడి పిడికిళ్లతో కొట్టింది, కుదిపింది. దుఃఖం పట్టలేక తన జట్టు పీక్కుంది. శోకాలు పెడుతున్న తల్లినీ, చనిపోయిన కొడుకునీ వదిలి నేను అక్కడినుంచి వెళ్లిపోయాను. కొన్ని వ్యవహారాలు చూడవలసిన పని ఉంది నాకు. నా కుమారుడికి తగిన దహనక్రియలు చేయించాలని అనుకున్నాను.

సూర్యుడు అస్తమిస్తున్నాడు, పెద్దగా తంతు ఏమీ చెయ్యదలుచుకోలేదు నేను. సూర్యాస్తమయం అయేలోపల అంత్యక్రియలు ముగించాలని అనుకున్నాను, అంతే. దుఃఖాన్ని భరించే శక్తి ఇక నాకు లేకపోయింది. నా కొడుకు చనిపోయాడు, నేను జీవించి ఉన్నంతకాలం ఆ దుఃఖం నా మనసులో ఒక బండరాయిలా ఉండనే ఉంటుంది. వాడిని కాల్చేందుకు కట్టెలకోసం తెగవెతికాను. ఎక్కడా ఏమీ కనబడలేదు. అసలు మేము వంట వండుకునే చాలా కాలమైంది. అప్పుడప్పుడూ నేను పట్టిన ఎలుకలనీ, నాకు దొరికిపోయిన ఉడతలనీ, కుందేళ్లనీ తిని కడుపు నింపుకుంటూ వచ్చాం. దూరంగా జనం చేస్తున్న హాహాకారాలు నాకు వినిపిస్తూనే ఉన్నాయి. ఎవరో ఒక ఔత్సాహికుడు గొంతు చించుకుని మేఘనాదుడి శౌర్యం గురించి అరుస్తున్నాడు, జనం అతనికి వంత పాడుతున్నారు. ఆ అరుపులు తారస్థాయికి చేరుకునే కొద్దీ నాలో కోపం కూడా పెరిగిపోసాగింది. దేన్ని చూసినా రోత కలగసాగింది. నా జాతి, నా నిరుపేదరికం, రాకుమారుడికోసం తెలివితక్కువగా తన ప్రాణాలు అర్పించిన నా కొడుకు మృతదేహానికి అంత్యక్రియలు కూడా జరపలేని నా దుస్థితి - ఇవన్నీ నామీద నాకే ఏవగింపు కలిగించాయి.

నా పేద 'భవనం' లోని నిట్టాడిమీద గొడ్డలితో మొదటి దెబ్బ వేసినప్పుడు నా మనసులో రావణుడి ముఖం మెదిలింది. ఆ తరవాత ఒక్కొక్క వేటుతో, నాకు తెలిసిన ఒక్కొక్క ప్రముఖుడి తల నరికివేస్తున్నట్టు అనుకోసాగాను. నా భార్య ఏడవటం మాని నా దగ్గరకి పరిగెత్తుకుని వచ్చింది. నాకు పిచ్చిపట్టిందా అని కేకలు పెట్టసాగింది. కానీ నేను నా "భవనాన్ని ముక్కలు ముక్కలు చెయ్యటం మానలేదు. అది నాకు ఒక వినోదంలాగ అనిపించింది, ఆ పని నాకు చాలా ఆనందాన్ని కలగజేయసాగింది. విభీషణుడినీ, కుంభకర్ణుడినీ, ప్రహస్తుడినీ, రాముడినీ, లక్ష్మణుడినీ, సీతనీ, మండోదరినీ, జంబుమాలినీ, విద్యుజ్జిహ్వుడినీ, కుబేరుడినీ, వరుణుడినీ, ఇలా ఒక్కొక్కరినీ ఒక్కోదెబ్బ వేస్తున్న ఆనందం అనుభవించాను. కానీ వాళ్ల తలలని నరికెయ్యాలన్న నా కోరిక తీరేలోపల, నా గుడిసె నేలమట్టం

అయిపోయింది.

నా కొడుకు శవం ఉన్న బండి దగ్గరకి వెళ్లి బండితో సహా వాడి మృతదేహాన్ని కూలిన నా గుడిసెలోకి తోశాను. బండి ఒరిగిపోయి, నా కొడుకు శవం కర్రముక్కల కుప్పమీద పడింది. వెంటనే నా పొరుగింటికి గబగబా వెళ్లాను. వాళ్లింట్లో ఎప్పుడూ పూజాగృహంలో ఒక దీపం వెలుగుతూనే ఉంటుంది. తలుపు తోసుకుంటూ ఆ దీపం ఉండే మూలకి వెళ్లి నా అంగవస్త్రాన్ని విప్పి, నూనెలో ముంచాను. అది వెంటనే అంటుకుంది. దాన్ని పట్టుకుని బైటికి పరిగెత్తాను.

కొన్ని నిమిషాల క్రితం వరకూ మేము మా ఇల్లు అని పిలుచుకున్న ఆ కుప్పలోనుంచి ఏవేవో చిన్న చిన్న వస్తువులని నా భార్య ఏరుకుంటోంది, ఆమెని పక్కకితోసి ఆ కుప్పమీద మండుతున్న అంగవస్త్రాన్ని పడవేశాను. ఒక్క క్షణం మంట ఆరిపోయేసరికి నాకు ఊపిరి ఆగినంత పనయింది. మరుక్షణం ఇనుమడించిన తీవ్రతతో జ్వాలలు పైకి లేచాయి. నా సొంతం అనుకున్నది మొత్తం ఆ జ్వాలలకి ఆహుతి అయిపోయింది. ఆ మంటలు ఆబగా నా కుమారుడి శరీరాన్ని మింగేశాయి. అతికాయుడు తన మిత్రుడు రాకుమారుడి వెంట వెళ్లిపోయాడు. తన సవతి సోదరుడిలాగే సగౌరవంగా మరణించాడు. వీరోచితమైన మరణాన్ని పొందాడు. కానీ పాపం వాడు పుట్టినది నల్లరంగు శరీరంతో పెరిగింది నగరంలోని పనికిమాలిన ప్రాంతంలో, అందుకే వాడి గురించి ఎవరూ నినాదాలు చెయ్యలేదు, వాళ్లతో గొంతుకలిపి, భూమీ, ఆకాశం దద్దరిల్లేట్టు ఎవరూ కేకలు పెట్టలేదు. అయినా నిప్పుకి ఎటువంటి తేడాలూ లేవు. నా కొడుకైనా, రాజుగారి కొడుకైనా ఒకేరకమైన ఆకలితో కబళించింది. అగ్ని పూర్తిగా అన్నిటినీ కాల్చి బూడిద చేసెయ్యటం చూస్తే నాకు సంతృప్తి అనిపించింది. లోతుకుపోయిన నా బుగ్గలమీద వేడి కన్నీళ్లుపడి మంట పుట్టింది. అగ్నికీలలు చల్లారుతూ ఆరిపోయి, బూడిద లంకలోని ఎర్రమన్నుతో కలిసిపోయాక, ఆకాశం విరిగిపడ్డట్టు ఏనుగు తొండాలవంటి ధారలతో వర్షం కురవటం ప్రారంభమైంది. ఆ వర్షం ఉధృతి తగ్గేవేళకి, దాని ధాటికి

నా కొడుకు తాలూకు చివరి అవశేషాలూ నా గుడిసె గుర్తులూ కొట్టుకుపోయాయి. నేను కోల్పోయిన వాటి తాలూకు బాధ మనసులో ఏ మూలో కలతపెట్టసాగింది. నా కొడుకు చితికి నేను నిప్ప అంటించినప్పుడు నా భార్య ఎక్కడ పడి ఉందో ఇంకా అదే చోటులో అలాగే ఉంది. నాకు ఆకలి వెయ్యటం మొదలెట్టింది. రాజభవనం ద్వారం బైట భోజనాలేమైనా పెడుతున్నారేమో అన్న ఆలోచన వచ్చింది. అలాంటి సందర్భాలలో సామాన్యంగా బీదా బిక్కీకి వాళ్లు భోజనాలు పెడతారు. లేచి నిలబడి ఒంటికి అంటిన వాన నీటిని విదుల్చుకున్నాను. త్వరగా వెళితే తినటానికి ఏమైనా దొరకవచ్చు. ఇంకా అదృష్టం బావుంటే ఒక ఆహారం మూట దక్కించుకుని ఇంటికి తెచ్చి నా భార్యకి కూడా ఇవ్వవచ్చు. ఎవరైనా నాకు తాగేందుకు ఏమైనా ఇస్తారేమో! రాజభవనంవైపు నడవటం ప్రారంభించాను.

46. ఒక రాజుగా నేను వైఫల్యం పొందానా?

రావణుడు

శత్రువు సమీపానికి వచ్చేశాడు. ఒప్పుకునేందుకు ఇష్టం లేకపోయినా, అది నాకు కనబడుతూనే ఉంది. నిన్న నా కుమారుడి చితికి నిప్ప పెట్టాను. ఇప్పుడిక ఏదో ఒకటి తేలిపోయేదాకా రాముడితో పోరాడటం తప్ప మరొక లక్ష్యం లేదు నాకు. నేనో, అతనో ఎవరో ఒకరు అంతం కావలసిందే. 'కానీ నేను దేనికోసం పోరాడు తున్నాను? నా సామ్రాజ్యం విచ్చిన్నమై పోయింది, నా కుమారుడు మరణించాడు, మహారాణి మానం మట్టిలో కలిసిపోయింది. ఇక ఏం మిగిలింది?' ఎంతో జాగ్రత్తగా, ప్రణాళిక ప్రకారం నేను నిర్మించుకున్న ఈ నగరం ఉంది, నిజమే. ఇది చాలాకాలం క్రితం దేవతలవద్దనుంచి నేను దోచుకున్న గొప్ప నిధి. చివరిగా మిగిలింది నా కుమార్తె, నా శత్రువు భార్య.

కానీ ఒక్కొక్కటే నా దగ్గర్నుంచి చేజారిపోతూ ఉంటే, మిగిలిన వాటిని నేను మరింత ఆర్తితో పట్టుకోసాగాను. అయినా, దృఢంగా తీరాన నిలబడ్డ శిలని ఉవ్వెత్తున లేచే అలలు తాకి ఒరిపిడి కలిగించినట్టు, నన్ను అన్నివైపులనుంచీ కష్టాలు కూలదోసేందుకు ప్రయత్నించసాగాయి. నేను లోలోపలే క్షీణించిపోసాగాను. జీవించి ఉండాలన్న కోరిక తగ్గిపోవటం ప్రారంభించింది. ఎంతో ప్రాణప్రదంగా భావించి, ఎప్పటికీ అవి నా సొంతమే అనుకున్నవి అన్నీ నిరర్థకంగా కనిపించసాగాయి. ఎక్కడో ఉత్తరాన ఉన్న ఒక అనామక రాజ్యానికి ఎటువంటి పరిపక్వతా లేని రాకుమారుడు, రాముడు. నా మేఘనాదుడికన్నా కొద్దో గొప్పో వయసులో పెద్ద, అంతే, నేనేమో చక్రవర్తిని, ఈ ప్రాంతంలో ఇంతవరకూ నాకన్నా బలశాలిఅయిన రాజు ఇంకొకడు పరిపాలించలేదు. అయోధ్య కేవలం ఒక సామంత రాజ్యం, ఎక్కడో మారుమూల ప్రాంతంలో ఉంది. అయినప్పటికీ నా సామ్రాజ్యం

ఇలా ఎలా నేలకూలింది?

వాలి చనిపోవటంవల్ల అంతా తలకిందులైందా? లేక విభీషణుడి నమ్మక ద్రోహంవల్ల కలిగిన ఫలితమా? నా మనో దృక్పథాన్ని ఎప్పుడు కోల్పోయాను? అన్ని అసుర సామ్రాజ్యాలూ దేవతల ముందు దాసోహం అన్నాయి. ఆర్థికంగా, సాంస్కృతికంగా, సాంకేతికంగా మేము ప్రతిష్ట సాధించినప్పటికీ, మాలో మేము నిరంతరం పోరాడుతూ ఉండటంవల్ల ఇలా జరిగింది. నా చరిత్ర, నా ప్రజలూ నాకు బాగా తెలుసు. ఉక్కు పిడికిలితో నా రాజ్యాన్ని పరిపాలించాను, అధికార పదవులలో నమ్మకస్తులు మాత్రమే ఉండేటట్టు జాగ్రత్తపడ్డాను. నాకు ఎదురు తిరుగుతారని అనుమానం ఉన్న వాళ్లమీద ఒక కన్నువేసే ఉంచాను. వాళ్లందరూ నీతీ నియమాలు లేని వాళ్లు, నా సింహాసనాన్ని ఆక్రమించుకోవాలని వేచి ఉండిన ధూర్తులు. కాని నేను ఎంత పెద్ద మూర్ఖుడిని!

ప్రహస్తుడిలాంటివాడిని అనుమానించాను, కుంభకర్ణుడు ఎప్పుడూ మద్యం, నల్లమందు సేవిస్తూ స్పృహలేని స్థితిలో ఉండేట్టు చూశాను, స్వభావరీత్యా క్రూరులైన రుద్రకుడిలాంటి వాళ్లు మరీ ఎక్కువ అధికారాన్ని చేజిక్కించుకోకుండా జాగ్రత్త పడ్డాను. 'సప్తసముద్రాలకి సేనాపతి,' 'అసుర నౌకలకి యుద్ధనౌకాధికారి' వంటి బిరుదులతో వరుణుడి వంటి సముద్రపు దొంగని కొనగలనని అపోహ పడ్డాను. నా బావ విద్యుజ్జిహ్వుడిని హత్య చేశాను. ఎంతో పవిత్రుడిలా కనిపించే విభీషణుడివంటివారు నాకు ద్రోహం చేశారు. జంబుమాలి వంటి వారు, తమ లెక్కలూ, పద్దులలో మునిగి ఉండే ప్రభుత్వోద్యోగులు, లంకిణీలాంటి స్త్రీలు – బహిరంగంగా రాజ్యంపట్లా, రాజుపట్లా తమకి ఉన్న ప్రేమనీ, ఆపేక్షనీ ఎలుగెత్తి చాటుతూనే - నా వెనకాల గోతులు తవ్వారు. నాకు శక్తిమంతులైన మిత్రులు ఉండేవారు, కానీ నాకు వాళ్ల అవసరం పడినప్పుడు మాత్రం, నేను ఒంటరిగానే మిగిలాను. నా సామ్రాజ్యం ఉక్కు పునాదిమీద నిర్మితమైందని అనుకున్నాను, కానీ దాన్ని శత్రువులు కూలదోసే సందర్భం వచ్చినప్పుడు తెలిసింది, దాని

పునాది గడ్డితో చేసినది అని. నేను నమ్మిన వాళ్లు అందరూ నాకు ద్రోహం చేశారు. నా తెలివితేటలని చూసుకుని ఎంతో గర్వించేవాడిని, మరి అవతలివారిని అంచనా వేయటంలో అంత ఘోరమైన తప్పిదాలని ఎలా చేశాను?

మళ్లీ ప్రారంభించాలని ఉంది. కానీ ఈ జీవితం చాలా చిన్నది, రెండోసారి అవకాశం దొరకదు. ఒకసారి అవకాశం ఇచ్చింది, దాన్ని రెండు చేతులా అందుకున్నాను. ఒక గొప్ప నిర్మాణం చెయ్యగలిగాను, కానీ ఇప్పుడు రోజులు మారిపోయాయి. నా చుట్టూ అన్నీ కూలిపోతున్నాయి. నాకు విచారంగా లేదు. సంపూర్ణమైన జీవితాన్ని అనుభవించాను. ఇక ఇలా దిగులుతో కుంగిపోవటం అనవసరం.

నాకు సాధ్యమైనంతలో ఏమైనా చెయ్యవలసిన సమయం ఆసన్నమైంది. నాకు వైఫల్యం ఎదురవచ్చు, కానీ నా ప్రజలకి చివరిసారిగా ఒక గొప్ప ఓటమిని అందించాల్సిన బాధ్యత నాకు ఉంది. వాళ్ల రుణం ఆ విధంగానైనా తీర్చుకోవాలి. నాకు ద్రోహం చెయ్యనిది వాళ్లు మాత్రమే. వాళ్లు నాపట్ల ప్రేమ చూపించినందుకు నేను వాళ్లకి ఏమిచ్చాను? నా అసురజాతికోసం గొప్ప సామ్రాజ్యాన్ని నిర్మించానని గర్వపడ్డాను, వాళ్లకి గౌరవాన్నీ స్వేచ్ఛనీ ఇచ్చానని అనుకున్నాను, కానీ బహుశా నేను పొరబడ్డానేమో. నేనొక నిరంకుశుడిని, కొద్దిగా దయగల నిరంకుశుడిని అయి ఉండవచ్చు, కానీ నేను మలి మహాచక్రవర్తిలాంటి వాడిని కాను. నా కళ్ళూ చెవులూ మూసుకుపోయాయి. నా ప్రజల కష్టాలని చూడలేని అంధుడినయాను. నేను ఇంకా పెద్ద, గొప్ప విజయాలు సాధించాలని ప్రయత్నించాను - గొప్ప నగరాలు, భవ్యమైన ఆలయాలు, విశాలమైన వీధులు, మెరుగైన రేవులు, ఇంకా పెద్ద నౌకలు, వాణిజ్యంలో మరింత వృద్ధి, వర్తకంలో అభివృద్ధి, ప్రపంచ రాజ్యాలలో పేరు తెచ్చుకోవటం, ప్రపంచంలోకెల్లా ధనిక రాజ్యంగా నా రాజ్యాన్ని తయారుచెయ్యటం - కానీ ఆ వ్యామోహంలోపడి చిన్న చిన్న ప్రాథమిక అవసరాలని మరిచాను. నా ప్రజలని విస్మరించాను. ప్రకాశించే నగరాలే ప్రగతికి నిదర్శనాలని భావించాను. మురికి కాలవల్లో జీవించే వాళ్లని

మరిచిపోయాను. పెద్దపెద్ద విందుభోజనాలని ఏర్పాటు చేసినప్పుడు, నా ప్రజల్లో అధికశాతం తినేందుకు ఏమీలేక అలమటిస్తున్నా రన్న విషయాన్ని మరిచిపోయాను.

ప్రహస్తుడు ఈ విషయాన్ని నా దృష్టికి తెచ్చాడు, కానీ అప్పుడు దాని ప్రసక్తి నాకు విసుగు పుట్టించేది. సంపద దానంతట అతే అందరికీ అందుతుందని అనుకున్నాను. తమ ఆలోచనలను వెలిబుచ్చే స్వేచ్ఛా, వీధుల్లోకి వచ్చి దేన్నైనా ఎదిరించి తమ అసంతృప్తిని వెలిబుచ్చే వెసులుబాటూ నా ప్రజలకి లభిస్తేచాలనీ, దానితో వాళ్లు తృప్తి పడతారనీ భావించాను! ఇతర రాజుల్లాగ నేను నిరంకుశుడినీ, పశుప్రాయుడినీ కాననీ, ఆయుధాలతో భయపెట్టీ, మారణకాండలు జరిపించీ జనాన్ని హడలగొట్టి అదుపులో పెట్టే స్వభావం నాకు లేదనీ గర్వించేవాడిని. అసురులు రూపొందించిన పరిపాలనా వ్యవస్థలో రాజు ఎంత బలవంతుడైనప్పటికీ, అతనికున్న అధికారం నామమాత్రమేననీ, అసలు అధికారం పంచాయితీల అధీనంలోనూ, గ్రామాలలో ప్రజలే ఎంచుకున్న నాయకుల చేతుల్లోనూ ఉందనీ, ఈ వ్యవస్థని ప్రపంచానికి ఒక ఆదర్శంగా నేను స్థాపించాననీ గర్వించాను. అయినా పేదలూ, దీనులూ, వాళ్లని నేను నిర్లక్ష్యం చేసినప్పటికీ, నాకు వెన్నుదన్నుగా నిలిచారు. అందరికన్నా తామే ఎక్కువ నష్టపోతామని తెలిసికూడా, జీవితాన్ని మెరుగుపరుచుకునేందుకు నేను వాళ్లకి ఇచ్చిన స్వేచ్ఛని కూడా కోల్పోతామని తెలిసికూడా వాళ్లు నా పక్షానే నిలిచారు. నేను ఎంతో ప్రేమగా చూసుకున్న మధ్య తరగతీ, ధనికవర్గం, ఏమాత్రం సంకోచించకుండా ప్రతిపక్షంలో చేరిపోయారు, కొందరు గోడమీది పిల్లిలా యుద్ధంలో గెలిచిన వారిపక్షాన చేరిపోయేందుకు వేచి చూస్తూ ఉన్నారు. ఈ రోజు అటో ఇటో తేలిపోవాలి. నామీద కుట్రపన్నుతున్న ఏదైనా అతీతశక్తి ముందే ఏమవాలో నిర్ణయించి ఉంటుందా? నా జీవితంలో విషాదం నేను చేసిన తప్పేమిటో నాకు తెలియకపోవటమే. వ్యక్తులని అంచనా వెయ్యటంలో పొరబడ్డాను, కానీ అంతమాత్రాన ఇంతపెద్ద సామ్రాజ్యం కూలిపోతుందని అనుకోను. నేను ఆమాట అంటే

నవ్వుతారేమో కాని, సంఘటనలు యాదృచ్ఛికంగా జరుగుతున్నాయనీ, గాలివీచినప్పుడు ఎగిరే ఎండుగడ్డి పరకలలా మనుషులు వాటిలో చిక్కుకుని చెల్లాచెదరుగా విసిరివేయబడతారనీ అర్థం చేసుకునేంత వయసూ, అనుభవం నాకు ఉన్నాయి.

మధ్యతరగతి ప్రజలు నేను మహాపాపిననీ, ఇంకొకరి భార్యని నా భవనంలో ఉంచుకోవటం నేరమనీ, నాకు ఆ హక్కులేదనీ అన్నారు. అందరూ అనుకునేది ఏమిటంటే, గతంలో నేను చాలామంది స్త్రీలని బలాత్కారం చేశానట, ఇప్పటికీ నా అంతఃపురంలో ఎంతోమంది స్త్రీలు ఉన్నారట. నా ప్రభుత్వం భ్రష్టమైనదనీ, లంచాలు మరిగిన నా ప్రభుత్వోద్యోగులు ప్రజాధనాన్ని దోచుకుని ధనాన్ని కూడబెట్టారనీ వాళ్లు అంటున్నారు. ఈ లోకంలో నన్ను మించిన మూర్ఖుడు మరొకడు ఉండడు. వీళ్లకి అన్ని సౌకర్యాలూ కల్పించటం నేను చేసిన పొరపాటు. బంగారు తాపడం చేసిన వీళ్ల రథాలు సులభంగా కదిలేందుకు పాపం నిరుపేదలు ఎలాగో పొట్టనింపుకుంటూ నివసించే పూరిగుడిసెలని పడగొట్టి వీధులని విశాలం చేయించాను. పంటభూములలోనుంచి రైతులని తరిమివేసి, అక్కడ ఈ దుర్మారులు తమ మేడలనీ, ఉద్యానవనాలనీ నిర్మించుకునే అవకాశం కల్పించాను. వీధి పక్కన తలపైన ఎటువంటి పైకప్పూ లేకుండా బతికేవాళ్లు మధ్యతరగతి జనానికి కంటగింపుగా ఉన్నారని, రక్షకభటులని వాళ్లమీదికి పంపాను. బతుకుతెరువు కోసం నగరాలకి తరలివచ్చిన పేదవారిని వాళ్ల కుటుంబాలతో సహా వెళ్లగొట్టి, ధనికుల రథాల వైశాల్యం కన్నా తక్కువ ఉన్న వాళ్ల స్థలాలని ఆక్రమించాను. పొలాలనుంచి నీటిని నగరానికి మళ్లించి, ఈ తిండిపోతుల ఇళ్లల్లో జలధారా యంత్రాలని నిర్మించేందుకు సాయం చేశాను. నదులని పాడుచేసి, గ్రామసీమలకి నీటిని అందించే నదీజలాలని నగరాలకి మళ్లించి, ఈ జనం జలాశయాలు నిర్మించుకుని జలకాలాడే సౌకర్యం కల్పించాను. పేదవారికి తాగునీటికి కూడా కరువు ఏర్పడింది, దాహంతో ప్రాణాలు విడవటమో, నగరాలకి వచ్చి ఒకరి మోచేతికింద నీరు తాగటమో, ధనికుల ఇళ్లలో భృత్యులుగా,

వంటవాళ్లుగా, తోటమాలులుగా, కట్టెలుకొట్టేవాళ్లుగా పనిచెయయటమో తప్ప వారికి వేరే దారి లేకుండా పోయింది.

నా ఏనుగుల చేత పూరిపాకలు పీకివేయించి, వాటి స్థానంలో పట్టువస్త్రాలూ, బంగారు ఆభరణాలూ, విలువైన రత్నాలతో తయారుచేసిన నగలూ అమ్మే అంగళ్లని కట్టించాను. అవన్నీ ఈ మందబుద్ధిగల మధ్యతరగతి వారికోసమే. ఈ వర్తక వ్యాపారస్తులు అందరి దగ్గరనుంచీ పన్నులు వసూలు చేస్తూ నా కోశాగారాలని నింపుకుంటూ వచ్చాను. వాళ్లు పన్నులు కడుతూ ఉండటంవల్ల, ఇంకా మెరుగైన వీధులు నిర్మించమని ఒత్తిడి తెచ్చారు. రేవు పట్టణాల్లో తమ వాణిజ్య నౌకలకి స్థలం సరిపోవటం లేదని ఫిర్యాదు చేశారు. తమకి తగినంత వినోదం అందించే సాధనాలు సమకూర్చలేదని తప్పపట్టారు. ఈ రాజ్యంలో ఏదీ సరిగ్గా పనిచెయ్యటం లేదని కోపగించుకున్నారు. వ్యవస్థ భ్రష్టుపట్టిపోయిందనీ, నా పరిపాలనని సమర్థించుకునేందుకు నేను ఏమైనా చెయ్యవలసి ఉంటుందనీ నన్ను నిలదీశారు. అప్పుడు నేను మరిన్ని గుడిసెలని కూలదోయించాను, కొత్త ఆనకట్టలను నిర్మింపజేశాను, మరింతమంది పేదరైతులని నిర్వాసితులని చేశాను, ఆ ప్రక్రియలో నా నగరాలనిండా జనాభా కిక్కిరిసిపోయింది. ఇంకా పెద్ద దేవాలయాలు నిర్మింపజేశాను, అక్కడ ఉండే పురోహితులు జనాన్ని ఎడాపెడా దోచుకున్నారు. వీధులని విశాలం చేయించాను. పూలమొక్కలు అంతటా నాటించాను. తినటానికి తిండిలేనివాళ్లు వాటి అందాలని చూసి ఆనందిస్తారని అనుకున్నాను. వేశ్యావాటికలని అనుమతించాను. అక్కడ మదిరా, మగువా మధ్యతరగతికి చవకబారు మత్తునీ, భోగాలనీ అందించే ఏర్పాటుచేసేసరికి నేను వాళ్లకి అత్యంత ప్రీతిపాత్రుడిని అయిపోయాను. వాళ్ల పొగడ్తలు వినీవినీ ఆ మత్తు నా తలకెక్కింది. రాజ్యాన్ని అంతగా అభివృద్ధిచేసినందుకు వాళ్లు నన్ను పొగిడారు, నేను బుద్ధిహీనుడిలా నా రాజ్యాన్ని ముందుకు తీసుకుపోతున్నానని అనుకున్నాను. నా రాజ్యంలో మిరుమిట్లుగొలిపే వెలుగులనే చూశానుకాని దుర్గంధమూ, క్షయమూ ఉన్న చీకటి నీడలని

చూడకుండా కళ్లు మూసుకున్నాను. ఆ వెలుగులు మాత్రమే ఉంటే చాలునని భావించాను. ఆ తరవాత రాముడు వచ్చి మా కోట ద్వారం దగ్గర నిలబడగానే అంతా పూర్తిగా మారిపోయింది. శత్రువు తలుపు తట్టగానే మధ్యతరగతి కనిపించకుండా మాయమైంది. తమ ఇంటి మొగసాలలో దాక్కున్నారు, యువకులూ, బలిష్టులూ అయిన తమ కుమారులని ఎవరికంటూ పడకుండా దాచివేశారు. రాజ్యం వాళ్ల సంతానానికి విద్య పొందేందుకు సాయం చేసింది. రాజ్యానికి వాళ్ల అవసరం కలిగినప్పుడు వాళ్లు తమ శరీరాలనీ, బుద్ధినీ రాజ్యం శ్రేయస్సుకోసం వినియోగిస్తారని ఆశించింది. కానీ దురదృష్టంకొద్దీ వాళ్లెవరూ రాజ్యాన్ని ఆదుకునేందుకు రాలేదు. రాజభక్తి పేరిట తమ కుమారులని అర్పించినది రైతులూ, ఇలూ వాకిలీ లేని నిరుపేదలూ, వేరే ప్రాంతాలకి వెళ్లి విద్యని ఆర్ధించి, సంస్కృతభాషలో మాట్లాడుతూ, తాంబూలం సేవించే ధనికులు వాళ్లు దాక్కున్న బొరియల్లోనుంచి నాకు సలహాలు ఇవ్వటం తప్ప ఇంకేమీ సాయం చెయ్యలేదు. పేదలు నేను విదిలించిన మెతుకులకే రుణపడ్డామనుకుని తమ రక్తాన్ని నాకోసం ధారపోశారు. నా రాజధాని నగరం కాలిపోతే, దాన్ని పునర్నిర్మించేందుకు చుట్టుపక్కల ఉన్న గ్రామసీమల్లోంచి రైతులే వచ్చి సాయం చేశారు. వారిలో కొందరు చేతికి అందినవి దోచుకుని పోకపోలేదు, కానీ మొదటిసారి నా రక్షకభటులతో చూసీచూడనట్టు పోనిమ్మని చెప్పాను.

నాకు మళ్ళీ ఒక అవకాశం దొరికితే ధనికులకి గుణపాఠం నేర్పుతాను. ఒక ధనిక వర్తకుడి కుమారుడైనా, పురోహితుడి కొడుకైనా, పేదబిచ్చగాడికి పుట్టినవాడైనా, సేనలో తప్పక చేరి రాజ్యానికి సేవ చెయ్యాలన్న నియమాన్ని విధిస్తాను. సాంకేతిక విద్యనీ, వైద్యవిద్యనీ, పూర్తిచేసిన వారందరూ ఐదు సంవత్సరాలపాటు గ్రామాలలో ఉచితంగా తమ సేవలని అందించాలన్న నిర్భంధం ఏర్పాటు చేస్తాను. ఇంకా నేను... అయినా ఇప్పుడు ఇదంతా ఎందుకు?

ఇలా ఆలోచిస్తున్నాను అంటేనే నాకిక రెండోసారి అవకాశం దొరకదు అన్నది స్పష్టమైపోయింది. అవన్నీ ఒక స్వాప్నికుడి కలలు- నా సొంత

మధ్యవర్గపు కోరికల అవశేషాలు. యౌవనంలో నేను ఊహించుకున్న కల్పనల తాలూకు మరిచిపోయిన జ్ఞాపకాలు. మునుపు జరిగినట్టే అధికారం మళ్లీ నన్ను భ్రష్టుడిని చేస్తుంది. ఆదర్శాలు ఎప్పుడూ మరణిస్తాయి, పూడ్చిపెట్టబడతాయి, మళ్లీ అదే జరుగుతుంది. ఆదర్శవాదం అధికారం చేతిలోని ఒక పరికరం మాత్రమేనని అర్థం చేసుకోవటమే వివేకవంతుల లక్షణం. రేపు నేను కాని రాముడు కాని చనిపోవచ్చు, కానీ ఈ ప్రపంచం ముందుకి పోతూనే ఉంటుంది. నిరుపేదలు నిరుపేదలుగానే, దౌర్భాగ్యులు దౌర్భాగ్యులుగానే ఉండిపోతారు. కొత్త విప్లవాలు తలెత్తవచ్చు, కొత్త భావజాలం చోటుచేసుకోవచ్చు పాత నీతులూ, నియమాల స్థానంలో కొత్తవి రావచ్చు, కొత్త ప్రవక్తలు జన్మించవచ్చు, భూమిని కొత్త రాజులు పరిపాలించవచ్చు, కొత్త మతాలు మొలకెత్తి పరస్పరం ఘర్షణ పడవచ్చు, కొత్త ఆవిష్కరణలు జరగవచ్చు, కానీ పరిస్థితులు మాత్రం అన్నీ అలాగే ఉంటాయి. ఇక అపరాధం చేశానేమో అన్న బాధ ఎందుకు నాకు? నాకు సాధ్యమైనది నేను చేశాను. ఇంకా బాగా చేసి ఉండవచ్చు, కానీ అలా చెయ్యలేని వారెవరున్నారు?

యుద్ధంలో విజయం సాధించిన వారికే సమస్తం దక్కుతుంది– పేరు ప్రతిష్టలూ, సంపదా, అధికారం. అతనివైపే సత్యం ఉంది అని అందరూ భావించి, జయించినవాడే సత్యసంధుడని అంటారు. విజేత గురించి కవులు కీర్తిగానం చేస్తారు. కాలం గడచినకొద్దీ వాళ్లగురించి ప్రసిద్ధగాథలు పెరుగుతూ పోతాయి. విజేత సర్వగుణ సంపన్నుడవుతాడు, పురుషోత్తముడని కీర్తించబడతాడు. ప్రతివ్యక్తిలాగే అతను కూడా జీవితంలో మంచి పనులూ చేస్తాడు, చెడ్డపనులూ చేస్తాడు. కానీ ప్రపంచం తనకున్న స్వభావాన్ని అనుసరించి మంచిపనులని ఆకాశానికి ఎత్తేసి, చెడ్డపనులని మనసుల్లోనుంచి తుడిచిపారేస్తుంది. ఒకవేళ ప్రస్తుత సామాజిక నీతినియమాల దృష్ట్యా విజేత చేసిన పనులని సమర్థించలేని పరిస్థితి తలెత్తితే, అతన్ని దేవుడి స్థానానికి తీసుకెళ్లిపోతారు. ఇక దేవుడు చేసే పనులని ఎవరు ప్రశ్నించగలరు? ఈ

రకంగా నా రాజ్యం చాలామంది దేవుళ్లని సృష్టించింది. ఏరకమైన పనులు చేసి విజయం సాధించినప్పటికీ విజేతని దేవుడనీ, అవతారమనీ కొనియాడారు. పరాజయం పొందిన వారి పరిస్థితి దీనికి పూర్తి భిన్నంగా ఉంటుంది.

అయినా విచిత్రంగా, ఇదంతా నాకు సంబంధించినది కాదని అనిపించింది. సృష్టిలోని అతి ఉన్నతమైన క్రమవిధానంలో నా స్థానం నిరర్థకమైనదని తెలుసు కున్నాను. అయితే చిత్రంగా ఆ భావనే నన్ను మరింత ఆత్మాభిమానిగా చేస్తోంది. ఈ విశాల విశ్వంలోని ప్రాణికోటిలో నేను కేవలం ఒక అణువులాంటివాడినే అయినట్టయితే ఇక నాకు నా గురించే తప్ప ఇంకేమీ పట్టనక్కర్లేదు. నా మరణంతో నాకు సంబంధించినది సమస్తం అంతరిస్తుంది. నా మరణం తరవాత నా ప్రజలు ఏమవుతారు అనేది నాకు సంబంధించిన సమస్య కాదు. మృత్యువే ఆఖరి విడిది అనీ, ఆ తరవాత ఇంకేమీ లేదనీ నాకు తెలుసు. ఆత్మలేదు, స్వర్గంలేదు, మోక్షం లేదు, నరకం లేదు, దేవుడు లేడు, మృత్యువు తరవాత ఇక పరలోక జీవితం నాకోసం ఎదురుచూస్తూ ఉండదు. నేను మాయమైపోతాను, పంచభూతాలతో మమేకం అయిపోతాను. అన్నీ ముగిసిపోతాయి. కానీ, నాకే అవకాశం లభిస్తే మళ్లీ ఈలోకంలో జన్మించాలనే ఉంది. ఎవరికి ఆ కోరిక ఉండదని?

నా కుమార్తె సీత మొండిగా ఇంకా అలక వహించి కూర్చుని ఉన్న ఉద్యానవనంవైపు నడిచాను. ఆమెని చూడాలని అనిపించింది. ఆ తరవాత ఇంకా సమయం మిగిలి ఉంటే కొద్ది నిమిషాలు మండోదరితో గడపాలని అనుకున్నాను. ఆ పనులన్నీ ముగించాక యుద్ధభూమిలో రాముడిని ముఖాముఖి కలుసుకుంటాను.

47. నేను కోరుకున్నది నీ చావునే!

భద్రుడు

నిన్న రాత్రి నేను రాజభవనం ద్వారాల దగ్గరకి చేరుకునేలోపల ఆహారం పంచటం అయిపోయింది. కేటాయించిన మొత్తం ఆహారంలో సగంకూడా పేదలకి అందలేదన్నది అందరికీ తెలిసిన సంగతే. రైతుల దగ్గర ధాన్యం కొనటం మొదలుకొని పేదలకి అన్నదానం చేసేలోపల వరసగా మోసాలూ, కుతంత్రాలూ చాలానే జరిగాయి. రైతులు కూడా తక్కువ తినలేదు, ధాన్యం తూచటంలోనూ, నాణ్యత విషయంలోనూ కొనుగోలు అధికారులని మోసం చేశారు. రాజ్యానికి అందించిన ధాన్యంకన్నా ఎక్కువ మొత్తానికి లెక్కలు రాయమని వాళ్లు అధికారులకి లంచాలు ఇచ్చారు. అధికారులు ఆ ధాన్యంలో కొంత దొంగిలించి దొంగతనంగా అమ్మకున్నారు. ఆ ధాన్యం రాజభవనం ధాన్యాగారానికి చేరేసరికి కొనుగోలు చేసిన దానికీ, చేతికి అందిన దానికీ పెద్ద వ్యత్యాసం కనిపించింది. అందుచేత పర్యవేక్షకులు నల్లబజారులో రెండింతల ధరకి ధాన్యం కొనవలసి వచ్చింది. మళ్లీ ఒకసారి లెక్కలు రాయటంలో మోసాలు చేసి, ఎలుకలూ, పురుగులూ ధాన్యం తినేశాయని చెప్పి, పర్యవేక్షకులు రాజ్యం కోశాగారంనుంచి డబ్బు తీసుకుని మరికొంత ధాన్యాన్ని అధికధర ఇచ్చి కొనవలసి వచ్చింది. పర్యవేక్షక సిబ్బంది దగ్గర లోటుని పూడ్చేందుకు డబ్బు ఉండదు. అందుకే తప్పుడు లెక్కలు రాస్తారు. బీదల సంఖ్యని పెంచుతారు, సహాయం అందుకునే వాళ్ల సంఖ్యని ఉన్నదానికన్నా ఎక్కువ చూపిస్తారు. ఆక్రమంలో మోసంతో కొంత ధాన్యాన్నితమ సొంతం చేసుకుంటారు. ప్రతిదశలోనూ లంచాల ప్రవాహం నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది.

ధాన్యం ముట్టుకున్న ప్రతి ఒక్కరూ లాభం చేసుకున్నారు. ప్రహస్తుడివంటి ఆదర్శాలని నమ్మకున్న మంత్రులని ఈ దొంగలు మోసం

చేశారు. రావణుడు తను ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి సంతృప్తి చెందాడు. జంబుమాలిలాంటి ఇతరులు వాటిని తమ లాభానికి వాడుకున్నారు, విపరీతంగా ధనం సంపాదించారు. అనైతికంగా ధనం సంపాదించే వరుణుడివంటి వాళ్లు రాజ్యంలోని అధికారుల దగ్గర బోలెడంత బంగారాన్నీ పెద్ద మొత్తాలలో రుసుమనీ రాబట్టుకుని ఉత్తర దిక్కున ఉన్న రాజ్యాలకి చేరవేశారు. అది చాలా దుర్మార్గమైన మోసాల వలయం. అందులో నష్టపోయిన వాళ్లందరూ నిజాయితీపరులూ, అమాయకులూ, ప్రతీఒక్కరూ ఎవరికి సాధ్యమైనంత వాళ్లు మోసం చేశారు. ఏం జరుగుతోందో అందరికీ తెలుసు. పేదరైతు దగ్గర్నించి అందరూ దొంగలే, రైతు తన పూర్తి పంట వివరాలు ఇవ్వకుండా ప్రభుత్వాన్ని మోసం చేశాడు, పొలంలో పనిచేసే వాళ్లు వీలైనప్పడల్లా రైతుని మోసం చేశారు, ప్రభుత్వోద్యోగులూ, పద్దులు రాసేవాళ్ళూ వర్తకులూ, అధికారులూ, మంత్రులూ, అందరూ ఎవరిస్థాయిలో వాళ్లు దొంగల్లాగే ప్రవర్తించారు. కానీ జనానికి ఆగ్రహం రాలేదు. వ్యవస్థలో ఉన్న అవినీతిని గురించి వాళ్లు నవ్వుకున్నారు, రాజకీయవేత్తల గురించి ఆసక్తిగా మాట్లాడుకున్నారు. ఎరవేసే రాజకీయ నాయకులు అసురులకి వినోదాన్ని కలిగించారు.

అందుచేత, నాకు తినేందుకు ఏమీ దొరకలేదని నిరాశపడినప్పటికీ, అది నిజానికి నాకు ఆశ్చర్యం కలిగించలేదు. అసలు ఆహారం పంచే వ్యక్తి నాతో కటువుగా మాట్లాడనందుకు సంతోషించాను. నన్ను పొమ్మని చెప్పి, తలుపులు మూశాడు, అంతే. వాళ్లని అలా దానం చెయ్యమని నేను యాచించిన ప్రతిసారీ, నా ఆత్మాభిమానం దెబ్బతినేది, కానీ ఆత్మాభిమానంతో కడుపు నింపుకోలేను అని ఏనాడో తెలిసింది. నాకు ఎంతో ఇష్టమైన మర్రిచెట్టుకింద వేచి ఉండాలని నిశ్చయించుకున్నాను. రేపు నేనే వరసలో ముందు ఉండి, ఆహారం సంపాదించుకో గలుగుతానేమో.

యుద్ధం ముగిసి ఏదో ఒక ఫలితం కనబడేట్టు అనిపించలేదు, కానీ అది ముగియాల్సి ఉంది. యుద్ధంలో నా మిత్రులూ, పరిచితులూ

చాలామంది మరణించారు. మా పక్షాన్ని బాగా ప్రోత్సహించాను. ప్రాణనష్టం జరగటం విషాద కరమే, కానీ అది అవసరం. మేము ఏదో ఒక ప్రయోజనంకోసం పోరాడలేదూ? ఇతరుల కుమారులు మరణిస్తున్నప్పుడు, ఆ మృతవీరులకి జయజయ ధ్వానాలు పలికేందుకు నేను కూడా జనంతో గొంతు కలిపాను. మా పొరుగిళ్లలో మృత్యువు తలుపు తట్టినప్పుడు, నా కుటుంబం సురక్షితంగా ఉన్నందుకూ, నా కుమారుడు ఆరోగ్యంగా ఉన్నందుకు మనసులో సంతోషించాను. ఏదో ఒకనాడు నా కుమారుడిని కూడా కోల్పోతానన్న భయం ఉండేది. కానీ మూర్ఖంగా, నాకొడుకు మరణించకుండా దేవుడు కాపాడతాడన్న నమ్మకంతో జీవించాను. నేను ఇంతవరకూ భరించిన బాధలు చాలవా? నాకు ఉన్నంతలో దేవుడికీ, పురోహితులకీ సమర్పించుకుంటూనే ఉన్నాను కదా? నా దగ్గర ఉన్న చిన్న మొత్తాలతో ఆలయాల్లోని హుండీలని కొంతవరకూ నింపాను. నిజం చెప్పాలంటే, దేవుళ్లకి లంచాలు ఇచ్చాను. కానీ వాళ్లు మా దేవుళ్లు, వాళ్లు కూడా మావంటి వారే. మా కానుకలూ, మేమిచ్చే లంచాలూ స్వీకరించేవారు, కానీ మాకు మంచి చేస్తారన్న నమ్మకం మాత్రం ఉండదు. అసలు జీవితమే లంచాలమయం - దేవుళ్లకి, పురోహితులకి, చిన్నచిన్న అధికారులకి, ప్రభుత్వోద్యోగులకి, రాజుకి, కుటుంబానికి, స్నేహితులకి, పుట్టినప్పటినుంచీ చనిపోయేదాకా మా సంస్కృతి మాకు లంచాలు ఇవ్వటం, లంచాలు తీసుకోవటం, లంచాలని సమర్థించటం నేర్పింది. అతికాయుడి ముఖం నన్ను వెంటాడసాగింది.

నేను గట్టిగా మూలిగినట్టున్నాను, ఎవరో నా దగ్గరకి వచ్చారు. చూపు మందగించటంవల్ల ఆ నల్లని ఆకారాన్ని నేను గుర్తించలేకపోయాను. నేను భయంతో వణికిపోయాను. ఆ నల్లని ఆకారం నామీదికి వంగేసరికి నా పై ప్రాణాలు పైనే పోయాయి. ఆ ఆకారం ఇంకా దగ్గరగా వంగి వంకరపోయిన తన నల్లని వేళ్లని నా ముక్కు దగ్గర ఉంచింది. నేను ఊపిరిబిగబట్టాను. తడిగా ఉన్న ఒక అరచెయ్యి నా నుదుటిని తాకి చూసింది. వెంటనే ఆ ఆకారం నిటారుగా

నిలబడి, కేకవేసింది. ఇద్దరు భటులు మావైపు పరిగెత్తి వచ్చారు. 'నన్ను వీళ్ల బంధించ బోతున్నారా?' జ్వరతీవ్రతలోనే నేను చేసిన అపరాధం ఏమై ఉంటుందా అని గుర్తు చేసుకునేందుకు ప్రయత్నించాను.

"వీడు చనిపోతున్నాడు. జ్వరం చాలా తీవ్రంగా ఉంది," అంటూ ఒక గరుకైన ముఖం నామీదికి వంగింది. ఆ వ్యక్తికి తెల్లటి నిడుపాటి గడ్డం ఉంది. నేను స్థిమితపడ్డాను. ఈయన ఆ వెర్రి శాస్త్రజ్ఞుడు, మయుడు. ఆయనకి వేపకాయంత వెర్రి ఉన్నమాట నిజమేకానీ, మనిషి సౌమ్యుడు. "వీడిని కోట లోపలికి తీసుకువెళ్లండి." అని ఆయన అనటం వినిపించింది.

"కానీ, అయ్యా వీడు ఒక తాగుబోతు, మరి మేము." భటుడి గొంతు విసుగ్గా, హేళనగా పలికింది.

"చనిపోతున్నాడు వీడు, వెంటనే వైద్యం చేయించాలి. లోపలికి తీసుకువెళ్లండి. పాపం ఆకలికి అలమటిస్తున్నాడో ఏమిటో, ఈ పనికిమాలిన యుద్ధం. ఎందుకు వీళ్లు ఒకళ్లనొకళ్లు చంపుకుంటారు? శని ఉచ్చదశలో ఉన్నాడు, అంగారకుడు కూడా బలంగా ఉన్నాడు. ఆ గ్రహాలని ఇంకా స్పష్టంగా చూడగల యంత్రాన్ని నేను నిర్మించగలిగితే... ఇన్ని లక్షల గ్రహాలకీ, మానవుడి తలరాతకీ ఏమైనా సంబంధం ఉందా? కొన్ని లక్షల గ్రహాలూ, నక్షత్రాలూ ఉన్నాయి... ఈ గ్రహసముద్రంలో మనం కేవలం అణుమాత్రమే..."

ఆ వెర్రి శాస్త్రజ్ఞుడు అలా తనలోకంలో పడి గొణుక్కుంటూ దూరంగా వెళ్తూ ఉండటం నాకు తెలిసింది. ఆయన ఏమన్నాడో నాకు బొత్తిగా అర్థంకాలేదు. భటులు ఎందుకో వెనకాడుతూ నిలబడిపోయారు. నన్ను తాకటం వాళ్లకి ఎంతమాత్రం ఇష్టంలేదన్న విషయం నాకు స్పష్టంగా అర్థమైంది. కానీ ఒక ఉన్నతస్థాయి మంత్రి ఆజ్ఞని ధిక్కరించటం కూడా వాళ్లకి సాధ్యం కాలేదు. ఆసరికి బహుశా మయుడు నాగురించి పూర్తిగా మరిచిపోయే ఉంటాడు, కానీ అలా అనుకుని భటులు ఆయన మాట జవదాటి ముప్పు కొనితెచ్చుకోలేరు. నేను మధ్య మధ్య స్పృహలోకి

వస్తూ వాళ్లని అస్పష్టంగా చూడగలిగాను. కోటవైపు నన్ను సగం దూరం మోస్తూ, సగం ఈడ్చుకుంటూ తీసుకెళ్లారు వాళ్లు, ద్వారం దగ్గర నన్ను కింద పడవేసి ప్రధాన ద్వారపాలకుడితో కోపంగా ఏదో వాదించసాగారు. అతను నన్ను లోపలికి తీసుకువెళ్లేందుకు అనుమతించలేదు. అందుచేత నన్ను కందకం పక్కన పడవేసి పోయారు. తల ఎత్తి చూసేందుకు కూడా శక్తి లేక నేను అలాగే పడి ఉండిపోయాను. చాలాసేపటికి మయుడు ఎక్కడెక్కడో తిరిగి మళ్లీ నా దగ్గరకి వచ్చాడు. ఈలోపల దోమలు నా రక్తం తాగి లావెక్కాయి, పురుగులూ, కీటకాలూ నా చర్మాన్ని తొలిచి వదిలిపెట్టాయి.

"ఆc, బావుంది. బావుంది! అయితే వీడిని ఇక్కడికి తెచ్చారన్నమాట? సరి... సరి... నా నివాసం వసారాలోకి తీసుకెళ్లండి వీడిని." అని నిస్సహాయంగా చూస్తున్న ప్రధానద్వారపాలకుడిని ఆదేశించి మయుడు అక్కడినుంచి వెళ్లిపోయాడు. ప్రధాన ద్వారపాలకుడు నన్ను శాపనార్థాలు పెట్టాడు. తన ఉద్యోగాన్నీ, మంత్రినీ, తన జీవితాన్నీ పది నిమిషాలపాటు తిట్టుకున్నాడు. తరవాత నన్ను మయుడి నివాసంలోని వసారాకి తీసుకెళ్లమని తన అనుచరులకి చెప్పాడు. నేను ఎంత నీరసంగా ఉన్నానంటే, అక్కడివరకూ వాళ్లు నన్ను మోసుకు వెళ్లవలసి వచ్చింది. చల్లగా, నునుపుగా ఉన్న వసారా నేలమీద నన్ను కొబ్బరికాయల బస్తా పడవేసినట్లు పడవేశారు. కొంతసేపటికి ఆ శాస్త్రవేత్త ఒక సహాయకుడిని వెంటపెట్టుకుని, దుర్వాసన వేస్తున్న ఒక ద్రవాన్ని తీసుకుని వచ్చాడు. ఆయన సహాయకుడు తనవేళ్లతో నా ముక్కుమూశాడు, ఊపిరి ఆడక నేను నోరు తెరిచేసరికి ఆ చేదు ద్రవాన్ని నోటిలో పోశాడు. నేను వాంతి చేసుకోబోయేలోపల మయుడు నా నోరు మూసేశాడు. ఆ మందు కరిగించిన సీసంలా నా గొంతుని కాలుస్తూ పొట్టలోకి జారింది. బాధతో మెలికలు తిరిగిపోయాను. శరీరం ఎగిరెగిరి పడసాగింది. నేను చనిపోతున్నామేనని భయంవేసింది. మెలికలు తిరుగుతున్ననా శరీరాన్ని వాళ్లిద్దరూ గట్టిగా నొక్కిపెట్టారు. చివరికి ఒంట్లో ఎంతమాత్రం

శక్తిలేకుండా నేను స్పృహ కోల్పోయాను.

మళ్లీ మెలకువ వచ్చేసరికి నా తల పగిలిపోతోందా అన్నంత నొప్పిగా అనిపించింది. మత్తుగానూ, అలసటగానూ అనిపించినా క్రితం రోజుకన్నా ఒంట్లో బాగా ఉన్నట్టు అనిపించింది. బహుశా మయుడికి కొద్దోగొప్పో ఔషధాల గురించి తెలిసి ఉండాలి. నెమ్మదిగా లేచి నిలబడ్డాను. నా పక్కనే కొంత ఆహారమూ, ఒక పాత్రలో మట్టిగా పెట్టి ఉండటం కనిపించింది. ఆహారాన్ని అందుకుని నోట్లో గబగబా కుక్కుకుంటూ తినేశాను. శరీరంలోకి మళ్లీ బలం వచ్చినట్టు అనిపించింది. ఆ వృద్ధుడికి కృతజ్ఞతలు తెలిపి సాధ్యమైనంత త్వరగా ఇంటికి పోవాలనుకున్నాను, కానీ ఆయన ఎక్కడా కనబడలేదు. ఎత్తుగా ఉన్న ఆయన ఇంటి పెద్ద తలుపులు తట్టే ధైర్యం నాకు లేకపోయింది. వీళ్లు చాలా ముఖ్యమైన వ్యక్తులు. నావంటి ఊరూ పేరూ లేని వాళ్లు వాళ్ల తలుపులు తట్టకూడదు. వాళ్లు ఎంతో శక్తి సామర్థ్యాలూ, అధికారమూ గలవాళ్లు. ఇక ఆ వృద్ధుడి గురించి పట్టించుకోకుండా అక్కడినుంచి వెళ్లిపోవాలని మనసు తొందరపెట్టసాగింది.

బైటికి వెళ్లబోతూ ఉండగా మహారాజు రావణుడు కనిపించాడు. మొండిగా ఆయన అశోకవృక్షం కిందే నివాసం ఉంటున్న సీత దగ్గరకి వెళ్తున్నాడు. ఆయన ఒక్కడే, అంత వేగంగా నడిచి వెళ్తూండటం చూస్తూంటే విచిత్రమనిపించింది. ఆయన ఏం చెయ్యబోతున్నాడా అన్న కుతూహలంతో ఆయన్ని అనుసరించాను, కానీ ఆయనకి కనపడకుండా ఉండేందుకు జాగ్రత్తపడ్డాను. నేను ఒక మల్లెపొద చాటున దాక్కునేవేళకి మహారాజు మౌనంగా తన కుమార్తె ఎదుట నిలబడ్డాడు. రావణుడూ, సీతా, వేదవతితో గతంలో నాకు ఏర్పడిన అనుభవాన్ని తల్చుకుని నిలువెల్లా వణికిపోయాను. ఎన్నో ఏళ్లక్రితం చంపివెయ్యమని నాకు అప్పజెప్పిన ఆ పసిపాప ఇక్కడ నా ఎదుటే ఉంది. ఆ జ్ఞాపకాలు ఇంకా నా మనసులో స్పష్టంగా ఉన్నాయి. తండ్రీ కూతుళ్లు ఒకళ్లనొకళ్లు ద్వేషంతో, గర్భశత్రువుల్లా కళ్లెర్రజేస్తూ చూసుకున్నారు. ఆమె ఆయన

కలని ధ్వంసం చేసింది. ఆమె వల్లే ఆయన తన సమస్త రాజాన్నీ, దాని భవిష్యత్తునీ బురదలోకి ఈడ్చాడు. మూడు దశాబ్దాల క్రితమే నా నల్లని చేతుల్లో దడదడా కొట్టుకుంటున్నప్పుడే ఆ చిన్నారిని చంపివేసి ఉండవలసింది. దాని ముక్కు మూసేస్తే క్షణాల్లో సూనాయాసంగా ప్రాణాలు విడిచి ఉండేది. కానీ అలా చెయ్యకుండా, ఆ పసిదాన్ని చూసి జాలిపడ్డాను. మూర్ఖుడిని! వాళ్లజోలికి వెళ్లకుండా అయినా ఉండవలసింది, లేదా రుద్రకుడిలా, ధూమ్రాక్షుడిలా చెప్పిన పనిని ఆసాంతం ముగించి హత్యకి పాల్పడి ఉండవలసింది.

"నాకు నా భర్త మీద ప్రేమ ఉంది. నువ్వు ఏం చెప్పినా అతనిమీద నాకు ఉన్న ప్రేమ సమసిపోదు," అంది కోపంతో మండిపడుతూ సీత.

"నీ రాముడి రక్తంతో నా చేతులు తడవటం నాకిష్టంలేదు. ఇప్పటికే శూర్పణఖ భర్తని చంపానని నన్ను అందరూ నిందిస్తున్నారు. నీకు వాడితోకలిసి బానిసలా జీవించాలని ఎందుకు ఉంది? దేవతా పురుషులు తమ స్త్రీలని పశువుల్లా చూస్తారు. భారంగా భావిస్తారు."

"నీకు దేవతల సంస్కృతి గురించి ఏం తెలుసు? స్త్రీలని దేవతలుగా పూజిస్తారు వాళ్లు. మా ప్రపంచానికీ నీ ప్రపంచానికీ సామ్యమా? మీ స్త్రీలకి నీతీ జాతీ లేదు. ముఖంమీద ముసుగు వేసుకోకుండా తిరుగుతారు. స్త్రీలూ పురుషులూ విచ్చలవిడిగా కలుసుకుంటారు. నీరాజ్యంలో వివాహాన్ని పవిత్రబంధంగా భావించరు. మీ స్త్రీలు చవకబారుగా ప్రవర్తిస్తారు. పురుషులతో కలిసి తాగి తందనాలాడతారు. మీ లోకంలో హుందాతనం కొరవడింది. తమ తలిదండ్రులపట్ల విధేయులై ఉండక మీ స్త్రీలు తాము ఎంచుకున్నవారినే వివాహమాడతారు. మీ స్త్రీలు గొప్పలు పోతూ, ఈ లోకంలో తమకన్నా తెలివైనవాళ్లు ఎవరూ లేనట్టు ప్రవర్తిస్తారు. అసురుల్లో పురుషులూ స్త్రీలలాంటివాళ్లే. మీకు వినోదాలూ విలాసాలే ముఖ్యం. ఈ పాపకూపం లాంటి రోత కలిగించే నగరాన్ని ఒక నరవానరుడు భస్మీపటలం చేసేశాడు. మరి మీ బలాఢ్యులైన సైనికులు ఏం చెయ్యగలిగారు? మీ రాక్షసజాతిలో జన్మించిన స్త్రీలని ఒకసారి చూడు. నీ సోదరినే తీసుకో,

హేయమైన వ్యభిచారిణిలా ప్రవర్తించ లేదూ? ఈ నల్లని, లావాటి అపరిశుభ్రంగా ఉన్న త్రిజటని చూడు, నీ తమ్ముడి కుమార్తె కదా ఈమె? ఇలాంటి చోట, నా రాముడిని వదిలి... నన్ను ఉండి పొమ్మంటున్నావా...?

నాకు ఒళ్లు మండిపోయింది. కొద్దిదూరాన నిలబడి అంతా వింటున్న త్రిజట వెక్కివెక్కి ఏడవసాగింది.

సీతని లంకకి తీసుకువచ్చిన రోజునుంచీ త్రిజట ఆమెకి సహచరిగా, స్నేహితురాలిగా మెలిగింది. ఈ సీత కోసమే రావణుడు తన సామ్రాజ్యాన్నీ, కలలనీ వదులుకుంటున్నాడు. ఈ సీతకోసమే అంతమంది అసురులు అసువులు బాశారు. ఆ క్షణాన ఆమెని గొంతు నులిమి చంపెయ్యాలనిపించింది నాకు.

రావణుడు కాలితో నేలని తన్ని విపరీతమైన ఆగ్రహావేశంతో ఒరలోనుంచి కత్తిని బైటికి తీశాడు. "నువ్వు... నువ్వు... నీ కోసం సమస్తాన్నీ పణంగా పెట్టాను. నా కుమారులని, నా ఆత్మగౌరవాన్ని, నా నగరాన్ని... అన్నిటినీ కోల్పోయాను. ఎందుకు? నా కుమార్తె సంతోషంగా ఉండటంకోసం... నీకోసం... అలాంటిది నువ్వు నన్ను ఇన్నిమాటలంటావా? నీకోసం కొన్నివేలమంది ప్రాణాలని బలిచేశాను," అంటూ కత్తి పైకి ఎత్తాడు. ఒక వేటుతో ఆమె తల తెగి పడుతుందని ఎదురుచూశాను. ఆమె తన తండ్రివైపు ఏమాత్రం తొణక్కుండా, అతన్ని ఎదిరిస్తున్నట్టు, ప్రశ్నిస్తున్నట్టు చూసింది. 'ధైర్యం ఉంటే నా తల తీసెయ్యి,' అన్నట్టు ఉన్నాయి ఆమె చూపులు. రావణుడి ఖడ్గం ఆమె కంఠానికి అంగుళం దూరానికి వచ్చింది, కానీ హఠాత్తుగా అక్కడే ఆగిపోయింది. మరుక్షణం గత నాలుగు దశాబ్దాలుగా ఎంతోమంది శత్రువుల తలలు తెగనరికిన రావణుడి బలమైన చెయ్యి నెమ్మది నెమ్మదిగా బలహీనమైపోయి కిందికి వాలిపోయింది.

'సీతా... నువ్వు నా కూతురివి..." ప్రసిద్ధికెక్కిన చంద్రహాస ఖడ్గం లంకలోని ఎర్రమట్టిలో పడిపోతూ ఉండగా రావణుడు నెమ్మదిగా

గొణిగాడు.

దానికి సమాధానంగా ఎగతాళితో నిండిన నవ్వు వినిపించింది. "కూతురినా? ఇబ్బందికరమైన పరిస్థితుల్లో బైట పారవేసిన కూతురిని! నీ వాళ్లు అక్కరలేదని అనుకున్న కూతురిని కదూ? ఆహా, ఎలాటి తండ్రిని నువ్వు!"

రావణుడు తలవంచుకుని నిలబడటం చూసి దిగ్భ్రాంతికి గురయాను. ఎర్రబడిన కళ్లలోంచి మౌనంగా కన్నీరు కారుస్తూ అలాగే ఉండిపోయాడు. ఆ తరవాత నెమ్మదిగా వెనుదిరిగి తన భవనంవైపు నడుచుకుంటూ వెళ్లిపోయాడు.

"నువ్వు మరణించాలని కోరుకుంటున్నాను! అణువణువుగా, చిత్రహింసలాంటి మృత్యువు," అని అరిచింది సీత.

అసుర సార్వభౌముడు బరువుగా అడుగులు వేసూ అక్కడినుంచి నిష్క్రమించాడు. నేను చూస్తూ ఉండగానే, నా కళ్ల ఎదుటే రావణుడు పది సంవత్సరాలు వయసు పెరిగినట్టు అయిపోయాడు. వృద్ధ మహారాజుకోసం మృత్యువు వేచి ఉంది. ఆయన కుమార్తె కోరినట్టుగానే ఎంతో బాధాకరమైన, చిత్రహింసలాంటి మృత్యువు! ఈ కుటుంబ కలహంలో నేను ఎటువంటి జోక్యమూ కలగజేసుకోదలచలేదు - తండ్రీ, కుమార్తె, జామాతల మధ్య జరిగే భయంకరమైన పోరాటం అది. కానీ నావంటి వారికి ఎప్పుడూ మా ఇష్టప్రకారం నడుచుకునే వెసులుబాటు ఎక్కడుంది? అసలు ఎన్నడైనా ఉందా అది?

48. ఒక కల ముగిసింది

రావణుడు

చాలా నిరాశా నిస్పృహలతో నేను యుద్ధభూమికి బైలుదేరాను. మండోదరి మనసు మనసులో లేదు. నేను వెళ్లటం ఆమెకి ఇష్టంలేదు. సీతని రాముడికి అప్పగించి సంధి చేసుకోమని నన్నుకోరింది. సంధి... శాంతి... ఇవి పిరికివాళ్లు ఉపయోగించే పదాలు. 'స్త్రీలు! వాళ్లకి ఎన్నడూ ఒక పని ఎందుకు చేస్తున్నారు అనేది అర్థంకాదు.' నన్ను వాటేసుకుని ఏడ్చింది, కేకలు పెట్టింది, జుట్టు పీక్కుని గుండెలు బాదుకుంది. బలవంతాన ఆమెని విడిపించుకోవలసి వచ్చింది. అదీ నా సైనికులందరి సమక్షంలోనూ అలా చెయ్యవలసిన పరిస్థితి ఏర్పడింది. నాకు చాలా సిగ్గు వేసింది. నా ఆత్మాభిమానం కోసం అందరి ప్రాణాలూ బలిచేస్తున్నానని నన్ను తప్పుపట్టింది. నేను ఆమెమీద అరిచి గొడవ చేసేసరికి పాపం ఆమె భయపడి ఊరుకుంది. కుమారుడి మరణం తాలూకు దుఃఖంనుంచి ఆమె ఇంకా కోలుకోనేలేదు. నేను అంత కఠినంగా ప్రవర్తించి ఉండకూడదు. 'అయితే ఇంతవరకూ ఆమెపట్ల ఎన్నడూ సరిగ్గా ప్రవర్తించలేదు నేను. ఆమె మాత్రమే అనేమిటి, నా జీవితంలోని ఏ స్త్రీతోనూ నేను మర్యాదగా, మంచిగా ప్రవర్తించలేదు.'

ఆగ్రహావేశంలో నా వీణని రెండు ముక్కలుగా విరిచివేశాను. నాకు సంగీతం అంటే విపరీతమైన ప్రేమ. నేను చనిపోయాక ఎవరైనా నరవానరుడు నా వాద్యాన్ని ఆటవస్తువుగా ఉపయోగించుకోవటం నాకిష్టంలేదు. నేను సృష్టించిన రాగాలనీ, పాటలనీ ఒక సంగ్రహంగా కూర్చాలని ప్రయత్నించాను. నేనూ, నా సామ్రాజ్యం అంతరించాక కూడా అవి బతికి ఉంటాయని ఆశించాను. చిన్న పిల్లలకి అవసరమైన మందులు తయారుచేసేందుకు ప్రయోగాలు చేశాను, ఖగోళశాస్త్ర పరిశోధనలు చేపట్టాను. నేను కనుగొన్న విషయాలన్నిటినీ పద్ధతిగా

తాళపత్రాల మీద రాసి ఉంచుకున్నాను. వాటిని మయుడికి అందజేశాను. బహుశా ఆ వెర్రి శాస్త్రవేత్తకి అవి ఉపయోగపడవచ్చు. యుద్ధానికి వెళ్తే దుస్తులు ధరించే వేళకి మండోదరి తన మందిరం తలుపులు మూసేసుకుంది. నేను ఎన్నిసార్లు పిలిచినా తలుపు తియ్యలేదు. చివరికి ఆమెని తిట్టుకుంటూ నా రథంవైపు నడిచాను. ఆమె తలుపు తీయడం వినిపించింది, నన్ను దీనంగా పిలుస్తూ నావైపు పరిగెత్తసాగింది. నేను వెనక్కి తిరిగి చూడలేదు. మళ్లీ ఆమె ముఖం చూడాలంటే భయం వేసింది. నా అహంభావం, బూటకపు ఆత్మవిశ్వాసం అన్నీ కరిగిపోయి ఉండేవి. అసుర మహారాజుకి బదులు నేను మధ్యవయసూ, బానపొట్టా, బట్టతలా ఉన్న ఒక సగటు వ్యక్తిగా, దయార్ద్ర హృదయురాలైన ఒక స్త్రీకి భర్తగా మిగిలిపోయేవాడిని. ఒకసారి వెనక్కి తిరిగి ఆమె ముఖం చూశానంటే ఇక నా నిర్ణయం నీరుకారిపోయి ఆమె చెప్పినట్టు చేస్తానని నాకు తెలుసు. రథంలోకి దూకి, సారథిని రథం తోలమని అరిచాను.

కోట ద్వారాలు తెరుచుకుని నా సైన్యం దేవతలతో తలపడేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో ఒక నిండు జీవితం వ్యర్థంగా గడిచిపోయిందనీ, ఇది మరోలా ఉండి ఉండవచ్చనీ అనుకోగానే కలిగిన విపరీతమైన దిగులుని అణచివేయాలని ప్రయత్నించాను. మూడున్నర దశాబ్దాలకి పైగా నన్నూ, నా చేతలనీ మౌనంగా భరిస్తూ వస్తున్న భార్యని ఒంటరిగా వదిలి వచ్చాను. అదుపు చేసుకోలేని భావోద్రేకాలవల్ల తన భర్త మూర్ఖంగా ప్రారంభించిన పనికిమాలిన యుద్ధంలో తన సంతానాన్ని కోల్పోయిన తల్లి ఆమె. లోకమంతా భయపడే తన భర్తని ధైర్యంగా ప్రశ్నించగల స్త్రీ ఆమె. నా కళ్లు నీళ్లతో నిండాయి. ఈ లోకంలో అన్నిటికన్నా మిన్నగా నేను నా భార్యని ప్రేమించాను. ఆమె దగ్గర కనీసం వీడ్కోలైనా తీసుకో వలసింది. ఇప్పడిక ఆలస్యం అయిపోయింది. రాముడు నాకోసం వేచిఉన్నాడు.

చుటూ ఒకసారి పరికించి చూశాను. నా చుట్టూ నల్లగా, చెమటతో తడిసి మెరుస్తున్న శరీరాలు కనిపించాయి. ఈ రోజు వీళ్లలో ఎంతమంది

ప్రాణాలతో వెనక్కి వస్తారు? సాయంకాలానికల్లా ఎంతమంది ప్రాణాలతో వితంతువులు అవుతారు? పాపం ఈ దురదృష్టవంతుల్లోని ఎంతమంది రక్తంతో లంకలోని ఎర్రమట్టి నేల మరింత ఎర్రగా మారుతుంది? ఎంతమంది పిల్లలు అనాథలవుతారు? ఈ పిచ్చివాళ్లు ఎవరికోసం పోరాడుతున్నారు? పాపం, ఈ అమాయకులని మోసం చెయ్యటం ఎంత సులువు! దూరంగా, సముద్రతీరాన రాముడిసేన ఎదురుచూస్తూ ఉంది. నరవానరులు దేనికోసం పోరాడుతున్నారు? ఎవరో ఒక రాకుమారుడికోసం, అతని భార్య కోసం? పాపం ఆ దురదృష్టవంతుల్లో ఎవరూ కూడా సీతని ఇంత వరకూ చూడలేదు, అసురులతో వాళ్లకి ఎటువంటి వైరమూ లేదు. అయినా మరణించటానికి సిద్ధమై ఇక్కడికి వచ్చారు. వీళ్లలో కూడా చాలామంది తమ పిల్లలని అనాథలని చేస్తారు, తమ తలిదండ్రులకి తలదాచుకునేందుకు చోటులేకుండా చేస్తారు.

మేము మలుపు తిరిగి వాళ్లవైపు శీఘ్రంగా కదిలేసరికి రాముడిసేన గట్టిగా కేకలు వేస్తూ ముందుకి ఉరికింది. నేను ఏనుగులని ముందు వరసలో ఉంచాను. అది ఒక జూదం లాంటిదే. ఏనుగులని ఎప్పుడూ నమ్మలేం. అవి వెనుతిరిగి నా సైనికులవైపే రావచ్చు. అప్పుడు తొక్కిసలాటలో నా సైనికులే నష్టపోతారు. కానీ నాకు వేరే దారి లేకపోయింది. నా సేనలు పల్చబడ్డాయి, పైగా వరుణుడి నౌకలు సముద్రంమీదినుంచి నా కోటమీదికి ఆపకుండా రాళ్లు విసురుతున్నాయి. అగ్నిబాణాలు వేసేవారిని నేను సముద్రతీరాన ఉన్న కొండమీద వ్యూహాత్మకంగా నిలబెట్టాను. వాళ్లు ఎత్తున ఉండటం మూలాన రాముడి విలుకాండ్రకీ, వరుణుడి రాళ్లు విసిరే యంత్రాలకీ అందరు, కానీ వాళ్ల బాణాలు గురితప్పకుండా శత్రువుల ప్రాణాలు తీయగలుగుతాయి. వాళ్లు వానరసేనని ముందుకి రాకుండా ఆపి ఉంచి, ఎన్నో తెప్పలనీ, పడవలనీ అగ్నిబాణాలతో కొట్టి మంచివేశారు. నా ఏనుగులు ఘింకరిస్తూ వానరసేన మీదికి దాడి చేసినప్పుడు, శత్రుసేనలో భయం తాలూకు ఛాయలు నాకు కనిపించాయి.

బలహీనమైన వానర సేనలని అవి ఛేదించాయి. ఎందరినో కాళ్లకింద తొక్కి చంపివేశాయి, తొండాలతో పట్టి ఎత్తి పడవేశాయి. అసురుల సేన ముందుకి ఉరికింది. అశ్వదళాలు మూడువైపులనుంచి వానరులని ఆక్రమించాయి.

నేను ముందుండి సేనని నడిపించి చాలాకాలం అయింది. నాకు ఇంకా ఆ నేర్పు ఉందో లేదో అన్న అనుమానం వచ్చింది.

కానీ రాముడిసేన బెదిరిపోవటం చూసి నా నరాల్లో రక్తం ఉప్పొంగింది. హఠాత్తుగా ఆరవ దశకంలోకి అడుగిడబోతున్న అలసిపోయిన వృద్ధ మహారాజు నుంచి నా నరనరానా ఉద్రేకం, ఆకాంక్షా ఉరకలెత్తే పదహారు సంవత్సరాల బాలాకుమారుడిలా మారిపోయాను. రాముడనగా ఎంత? ఈ లోకంలోకెల్లా శక్తిమంతుడైన చక్రవర్తిని ఎదిరించేందుకు నాగరికత పూర్తిగా సాధించని సంకర జాతి తెగలని వెంటబెట్టుకుని వచ్చిన పొగరుబోతు. ఈరోజు నేను అటువంటి అహంభావంతో విర్రవీగే వాళ్లందరికీ అతన్ని ఒక ఉదాహరణంగా చూపిస్తాను. ఇలాంటివాళ్లు అసుర చక్రవర్తిమీదికి దండెత్తివస్తే మళ్లీ సురక్షితంగా తమ ఇళ్లకి తిరిగి వెళ్లకుండా ఉండేట్టు చూస్తాను.

నేను ఆదేశాలు ఇచ్చేసరికి నలువైపులకీ సందేహవాహకులు పరిగెత్తారు. రాముడి సేనానాయకులు ధైర్యంగా పోరాడినప్పటికీ ఫలితం లేకపోయింది. అతను నాకు దొరికి అతని కంఠాన్ని గురితప్పకుండా బాణంతో కొట్టగలిగితే ఈ పనికిమాలిన యుద్ధం ముగుస్తుంది. ఎడమవైపున్న సైన్యంగుండా రథం నడపమని సారథికి చెప్పాను. అన్నివైపులనుంచీ వేగంగా బాణాలు దూసుకువచ్చాయి. నేను చేస్తున్నపని సాహసమే, కానీ నా మనసులో ఆగ్రహమూ, ఉత్సాహమూ ఎగసిపడుతూ ఉండటంచేత ఇంకేమీ ఆలోచించే స్థితిలో నేను. అతన్ని వశం చేసుకోవటాన్నుంచి నన్ను ఏ శక్తి ఆపలేదు, అంత ఉద్రేకంలో ఉన్నాను. ఒక అసురరాజుని దేవతల రాకుమారుడు ఎదిరించటం అనేది ఇదే చివరిసారి అవుతుంది.

హఠాత్తుగా వెనకనుంచి బెదిరిపోయి పరిగెత్తుతూ వచ్చినవాళ్లు నన్ను చుట్టుముట్టారు. ఎలుగు రాచుకుపోయేట్టు అరుస్తూ వాళ్లందరినీ మళ్లీ ఒకచోట కూడమని చెప్పాను. రాముడు ఒక ఉచ్చు పన్నాడు. వెనుకనుంచి మామీద ఆక్రమణ జరిగింది, నగర శివార్లనుంచి విభీషణుడు అశ్వదళాలకి నేతృత్వం వహిస్తూ వచ్చాడు. వెనుకనుంచి మామీద ఒత్తిడి కలిగించేందుకు ప్రయత్నించాడు. మళ్లీ కొండశిఖరం మీదికి వార్తాహరులని పంపి, మా వెనక ఉన్న సైన్యంమీద అగ్నిబాణాలు కురిపించమని ఆదేశించాను. అలా వేసిన బాణాలు నా సైనికులకి కూడా హాని చెయ్యవచ్చు, కానీ అది తప్పనిసరి పరిస్థితి. వెనక్కి తగ్గుతున్నప్పటికీ సముద్రంవైపునుంచి భయంకరంగా పోరాడుతున్న వానరసేనకీ, నేలమీద మామీద దాడిచేస్తున్న విభీషణుడి బలాలకీ మధ్యన చిక్కుకుపోయాం. నా అశ్వదళాలని విభజించి ఒక భాగాన్ని విభీషణుడితో పోరాడేందుకు పంపాను. దీనివల్ల వెనక ఉన్న ఒత్తిడి తగ్గింది. అనుభవజ్ఞులైన నా దళపతులందరినీ కోల్పోయానే అని విచారించాను. రాముడి శక్తిని తక్కువగా అంచనా వేశాను. హనుమంతుడు నా రాజధాని నగరానికి వచ్చి దాన్ని అగ్నికి ఆహుతి చేసిన వెంటనే నేను వానర రాజ్యంమీదికి యుద్ధానికి వెళ్లవలసింది. కానీ మాకు ఏమీ కాదన్న ధీమాలో ఉండిపోయాం. నేను అలా చేసి ఉంటే వానరులని నాశనంచేసి, రాముడిని బంధించటం సాధ్యమయేది. అందుకు మారుగా ఇప్పుడు అతను నా రాజ్యం మీదికి దండెత్తి వచ్చాడు, అతన్ని అడుకునేందుకు నేను ప్రయాసపడవలసి వస్తోంది. ఈరోజు అతన్ని తుదముట్టిస్తాను.

రెండు సేనలూ ప్రాణాలకి ఒడ్డి సాహసంతో పోరాడుతున్నాయి. ప్రతీ నిమిషమూ వీరులూ, అమరులూ సృష్టించబడుతున్నారు. ఇంతలో లంకిణి వెంట ఉన్న అసుర సేనలు కొండమీది నా సేనలమీద దాడి చేశాయి. అలలు ఒకదానివెంట మరొకటి లేచినట్టు ఆ దళాలు నా సైనికులని ఎదుర్కోసాగాయి. ప్రమాదాన్ని గ్రహించాను. వాళ్ల సైనికులు మా సైనికులకి ఆరురెట్లు ఉన్నారు. అంటే మావైపు సైనికుడు ఒకడు

మరణిస్తే మేము శత్రుసైనికులని ఆరుగురిని చంపవలసి ఉంది. అప్పుడే కొండమీద మా స్థావరం నిలబడగలదు. శత్రు సేనాపతిని పట్టుకుని చంపటం మరో మార్గం. కానీ రాముడు ఎక్కడున్నాడో నాకు కనిపించలేదు. హనుమంతుడు ముందుండి సేనని నడిపిస్తున్నాడు. రామలక్ష్మణులకోసం వెతికాను. కానీ వాళ్లు ఎక్కడా కనిపించలేదు. ఎటువంటి ఫలితమూ లేకుండా యుద్ధం ఉధృతంగా సాగుతూనే ఉంది.

మధ్యాహ్నం మూడు ఘడియలు గడిచిపోయాయి. రెండువైపులా చాలామంది చనిపోయారు. నా సేనలు పల్చబడిపోయాయి. సామాన్య పౌరులూ, యుద్ధంలో శిక్షణ పొందని నా నగరవాసులూ చేతికి దొరికిన ఆయుధం పట్టుకుని నా సైన్యంలో చేరిపోయారు. ఉత్తమమైన శిక్షణ పొందిన వానరసేనముందు వాళ్లు నిలవలేకపోయారు. కానీ దూరంనించి వానరులకి నా పౌరులు ప్రమాదకరంగానే కనిపించారని నాకు రూఢిగా తెలిసిపోయింది. అది మాకు మనోస్థైర్యం కలిగేందుకు పనికివచ్చింది, కానీ అసురుల సైనికుల సంఖ్య తగ్గిందన్న నిజాన్ని వానరులు గ్రహించలేకపోయారు, అందుకే వాళ్లమీద అది చెడు ప్రభావాన్నే కలిగించింది. అయినా ఈ పరిస్థితి శాశ్వతంగా కొనసాగదని నాకు తెలుసు. అప్పటికే రెండు మూడు కొండలని లంకిణి సేనలు ఆక్రమించి మామీదికి అగ్నిబాణాలు సంధించటం మొదలుపెట్టారు. కాగా మా ఏనుగులు కొన్ని శత్రుసేనలని ధ్వంసం చేయగలిగాయి, వారధిలో కొంతభాగాన్ని పడగొట్టాయి. ఉత్సాహంతో ఉరకలువేస్తున్న నా సైనిక దళాలు వరుణుడి నావలని ఎన్నింటినో స్వాధీనం చేసుకున్నాయి. మళ్లీ సముద్రంమీద యుద్ధం చెయ్యటం కొనసాగించాం. యుద్ధంలో అనిశ్చితస్థితి ఏర్పడి ఎవరు గెలుస్తారు అన్నది తెలీకుండా పోయింది.

కాలం గడిచిపోతోంది. పడమటి ఆకాశంలో నల్లని మేఘాలు కమ్ముకో సాగాయి, సముద్రపు అలలు ఎగసిపడుతున్నాయి. వరుణుడి నావలు అలలఢాటికి కిందికీ మీదికీ ఊగిపోసాగాయి. ఆ వాతావరణంవల్ల ఏనుగులు చికాకుకి గురవుతున్నాయి, ఏ క్షణాన్నైనా

పరిస్థితులు విషమించవచ్చని నేను భయపడటం మొదలుపెట్టాను. ఏదో ఒక సాహసం చెయ్యకతప్పదు. శత్రువులని అది నివ్వెర పరిచేదిగా ఉండాలి. 'కానీ రామలక్ష్మణులు ఎక్కడ ఉన్నారు?' ఆ దేవతల రాకుమారుడిమీద మెరుపుదాడిలాంటిది చేసి అతన్ని పట్టి చంపటం ఒక్కటే నాకు అనువైన మార్గం. అతనిలాగే నేను కూడా శత్రువు కళ్లకి కనబడకుండా దాక్కుని ఉన్నాను. ఈ వ్యూహంలో భాగంగా ఏడెనిమిది రథాలమీద అసుర ధ్వజం ఎగరవేయించాను. ఏది నా రథమో తెలుసుకోలేక శత్రువ తికమక పడాలని నా ఉద్దేశం. నేను ఎలాగో ఒకలా ఈ యుద్ధంలో గెలవాలని అనుకున్నాను. అయితే నాకు వయసు మీరింది, కొన్ని బాణాలు నాకు గుచ్చుకున్నాయి, రక్తస్రావంవల్ల బాగా నీరసపడిపోయాను.

మొదటిసారి పిడుగులు సముద్రంలో పడ్డాయి. నాకు వాళ్లు కనబడ్డారు. వారధి దగ్గర ఉన్నారు, దాన్ని పునర్నిర్మించమని వాళ్లు వానరులని తొందర పెడుతున్నారు. హనుమంతుడు బ్రహ్మాండమైన అగ్నిగుండాన్ని తయారుచేశాడు. దానివల్ల ఏనుగులు తమదరిదాపులకి రావని అతని ఉద్దేశం. గాలి దిశమారి ఆ అగ్నిగుండంలో లేచే మంటలు పక్కకి కదిలాయి. వరుణుడి ప్రధాననౌక వారధి దగ్గరకి రావటం నాకు కనిపించింది. రాముడికి సాయం చేసేందుకు మరింతమంది సైనికులు రావటం చూసి భీతిల్లిపోయాను. నౌకలోనుంచి గుర్రాలని దింపారు. తాళ్లసాయంతో సైనికులు వారధి మీదికి దిగారు. కిందికి జారుతున్న వానర సైనికులమీదికి మా సైనికులు బాణాలు వదిలారు, అయినా శత్రుసైనికుల సంఖ్య పెరుగుతూనే పోయింది. నా వెనక విభీషణుడు నా పౌరులని నరుకుతూ ముందుకి రాసాగాడు. నాకు సమయం మించిపోతోంది. నేను పూర్తిగా ఓటమిలో మునిగిపోయేలోపల రాముడిని కడతేర్చకపోతే సర్వనాశనం అయిపోతుంది.

నా అత్యుత్తమమైన యోధులని సమావేశపరిచి వడిగా ఆయుధాలు ప్రయోగించే ఒక దళాన్ని ఏర్పాటు చేశాను. నా వ్యూహం గురించి వాళ్లకి చెప్పాను. వాళ్ల కళ్లలో భయంచూసి నాకు

చిర్రెత్తుకొచ్చింది. నేను పన్నిన వ్యూహాన్ని కార్యాచరణలో పెట్టాలంటే విపరీతమైన ధైర్యసాహసాలు కావలసివస్తాయి. కానీ పరిస్థితి చెయ్యి దాటిపోయేట్టు ఉందని వాళ్లకి వివరించి, వాళ్ల సమ్మతికోసం ఎదురు చూడకుండా నాకు ఎంతో ఇష్టమైన కత్తిని చేతపట్టుకుని రథంలోనుంచి కిందికి దూకాను. నాకు ప్రీతిపాత్రమైన గుర్రానికి కట్టిన కళ్లేలు విప్పాను. నా రథసారథి కన్నీరు మున్నీరుగా విలపిస్తూ ఉంటే వాడిని కౌగలించుకున్నాను. వృద్ధ స్త్రీలా ఏడుస్తూ వాడు నా కాళ్లమీద పడిపోయాడు. వాడిని పట్టించుకోకుండా, గుర్రాన్ని ఎక్కి చంద్రహాసాన్ని చీకట్లు ముసురుతున్న ఆకాశంవైపు పైకెత్తి ఝళిపిస్తూ, "హర హర మహాదేవ!" అంటూ అరిచాను.

నా చుట్టూ వంద కంఠాలు నా కేకని ప్రతిధ్వనించాయి. ఉవ్వెత్తుగా లేచిన అలలు తీరంమీది శిలలమీద విరిగి పడుతున్నాయి, ఆకాశంలో మెరుపులు మెరిసి అక్కడక్కడా పిడుగులు పడుతున్నాయి. దాదాపు అంతటా చీకటి కమ్ముకుంది, భోరున వరం మొదలైంది. నేను అగ్నిగుండంవైపు గుర్రాన్ని దౌడు తీయించాను. తోవలో చంపబడ్డ సైనికుల శరీరాలనీ, తడినేలమీద అవయవాలు తెగి గిలగిల లాడుతున్న వారినీ, రక్తపు మడుగులనీ, కొన ఊపిరితో ఉన్నవారినీ, కాళ్లకింద నలిగిన మాంసపు ముద్దలనీ దాటుకుంటూ రాముడు ఉన్నవైపు శరవేగంతో వెళ్లాను. నా వెనక అనుచరులు గర్జించసాగారు. నా చెవుల్లోకి రక్తం పొంగి హోరెత్తించింది. గుర్రపు కళ్లేలు కంపించసాగాయి. నా గుర్రం నురగలు కక్కసాగింది, అయినా పట్టించుకోకుండా దాన్ని ఉసికొల్పాను. ఇంకా వేగం పెంచుతూ దౌడు తీయించాను. నా తొడలకీ, జబ్బలకీ తగులున్న బాణాలని లెక్కచెయ్యలేదు. మంటలని చూసి, ఆ వేడికి నా గుర్రం వెనకంజ వెయ్యటం గ్రహించాను, అయినా దాన్ని తంతూ వేగంగా వెళ్లమని ఉత్సాహపరిచాను. ఒక్క బలమైన ఊపుతో అది ఆ మంటలలోనుంచి లంఘించి రాముడివైపు దూకింది. నా అనుచరులు కూడా నన్ను అనుసరించారు. హడిలిపోయి చూస్తున్న వానరుల ముందు అందరం

ప్రత్యక్షమయాం. నా కేశాలకీ, గుర్రం జూలుకీ నిప్పంటుకుంది. నా రూపం వాళ్లకి ఎంత హడలు పుట్టించిందో రాముడి కళ్లు చూస్తే నాకు అర్థమైంది.

ఆ క్షణంలో కూడా నాలో కలిగిన భావం ఆశ్చర్యమే. ఇతని శరీరవర్ణం ఎంత నల్లగా ఉంది!" అతను విపరీతమైన భయంతో తడబడుతూ వెనక్కినడిచాడు. నా కత్తిని ఎత్తి నేను అతని గుండెల్లో పొడవబోతూ ఉండగా, హనుమంతుడు గెంతి నా కాళ్లు పట్టుకున్నాడు. గుర్రంమీద నిలదొక్కుకోలేక నేను దానిమీదనుంచి కిందపడిపోయాను. నరవానరుడి ముఖాన్ని కాళ్లతో తన్నాను. పందిలా గుర్రుమంటూ వాడు సముద్రంలో పడ్డాడు. నేను లేచి సర్దుకుని అడ్డంవచ్చిన వాళ్లనందరినీ నరుకుతూ రామలక్ష్మణులవైపు కదిలాను.

వాళ్లు ఏం చెయ్యాలో తెలీక బెదిరిపోయి నామీదికి బాణాలు వేస్తున్నారు. మేము అమితవేగంగా దేవతల రాకుమారులవైపు ముందుకి కదిలాం. సరిగ్గా అదే సమయంలో ఆకాశం కుంభవృష్టిని కురిపించసాగింది. వర్షం మా అందరినీ ముంచెత్తింది. కదలటం కష్టంగానూ, నేల జారుడుగానూ తయారైంది. బ్రహ్మాండమైన అలలు ఉధృతంగా వారధిని ఢీకొనటంవల్ల రెండువైపుల సైనికులూ ఆ అలల్లో కొట్టుకుపోయారు. వారధిలో మరికొంతభాగం విరిగిపడింది. దాంతో రాముడూ, కొంతమంది అతని అనుచరులూ, ప్రధాన సేనతో విడివడ్డారు. అతను చిక్కుకు పోయాడు. నేను అతన్ని సమీపించాలి, అంతే. అతని పని అయిపోయింది. కొత్త ఉత్సాహంతో మేము పోరాడుతూ రాముడివైపుకి బైలుదేరాం.

ఆ క్షణంలో యుద్ధం ముగిసిపోయిందనీ నేను విజయం సాధించాననీ అనుకున్నాను. మళ్లీ ఒకసారి ధైర్యమూ, సంకల్పబలమూ కూడగట్టుకుని నా తలరాతని మార్చుకోగలిగాను. గతంలో చాలాసార్లు అసాధ్యమని అనుకున్న పరిస్థితుల్లో నా సేనలని విజయంవైపు నడిపించాను, ఇది కూడా వాటిలో ఒకటి మాత్రమే. ఇంక కొద్ది నిమిషాలలో రామలక్ష్మణులు సముద్రగర్భంలో ఉన్న నా సోదరుడు

కుంభకర్ణుడిని చేరుకుంటారు. వాళ్లముఖాల్లో నాకు భయం కనిపించింది. బరువైన వాళ్ల ధనుస్సులు వాళ్ల భుజాలమీదినుంచి జారిపోసాగాయి. ఉవ్వెత్తుగా అలలు వారధిని ఢీకొంటూ యోధులమీద ఉప్పనీటిని కుమ్మరిస్తున్నాయి. గాలి హోరున వీస్తోంది, నల్లటి ఆకాశంలో మెరుపులు ఫెళఫెళారావాలు చేస్తున్నాయి. ధారాపాతంగా పడుతున్న గాలివాన రాముడి గురిని చెడగొడుతోంది.

బాణాలు నా పక్కనుంచి రివ్వమని దూసుకుపోయాయి, నా అమితోత్సాహంలో వాటిలో ఏదైనా ఒకటి నాకు తగలవచ్చన్న ధ్యాసకూడా నాకు లేకుండా పోయింది. నా శత్రువు వైపు దూసుకుని వెళ్లసాగాను. వాన ధాటికి చాలామంది వానరులు నేలకూలారు. వారధి అదరసాగింది. ఇంకా కొంతమంది తలలు తెగితే చాలు, నా చంద్రహాసంతో రాముడి తల తెగనరుకుతాను. ఆ ఆలోచన నాకు చాలా బావుందని అనిపించింది. నేను చేసిన భయంకరమైన పొరపాటుని గ్రహించేందుకు సమయం మించిపోయింది. హనుమంతుడు నిర్మించిన అగ్నిగుండాన్ని దాటటంలో ఇంక వెనకనుంచి నాకు ఎటువంటి ప్రమాదమూ లేదనీ, భయపడనక్కరలేదనీ అనుకున్నాను. రాముడి మీద ఉన్న క్రోధంతో కళ్లు మూసుకుపోయి, అతి ముఖ్యమైన విషయంలో ఒక తప్పుడు నిర్ణయం తీసుకున్నాను. కుంభవృష్టిగా కురుస్తూన్న వాన అగ్నిగుండంలోని మంటలని పూర్తిగా ఆర్చివేసింది. ఇక నా వెనుక ఉన్న భాగం ఎవరైనా సునాయాసంగా నామీద దాడి చేసేందుకు అనువుగా ఉంది. నా సోదరుడు విభీషణుడి గురించి మర్చిపోయాను. వాడు ఇంకా పోరాటం సాగిస్తూ నన్ను వెంబడిస్తూనే ఉన్నాడు. ఇక వాడి దారికి మంటలు అడ్డలేకపోవటంతో వాడు రహస్యంగా నా సమీపానికి వచ్చేశాడు. వాడి కత్తి నా వెన్నులో లోతుగా దిగబడినప్పుడు గాని నాకు నా తప్ప తెలిసిరాలేదు.

వెనుతిరిగి నా కత్తితో వాడి మీద దాడి చెయ్యటానికి ప్రయత్నించాను, కానీ వాడు కిందికి వంగేసరికి నేను తడబడి పడిపోబోయాను. విభీషణుడు నన్ను కాలితో తన్నేసరికి నేను గర్జిస్తున్న

సముద్రంలో పడిపోయినంత పనయింది. ఎలాగో నిలదొక్కుకున్నాను కానీ, వెన్నులో వాడు చేసిన గాయం నుంచి రక్తం కారసాగింది. నా చేతులు తెమ్మిర్లెక్కాయి. నేను తొడుక్కున్న భారీ కవచం నన్ను కిందికి లాగసాగింది. ఆ అవకాశాన్ని వినియోగించుకుని రామలక్ష్మణులు నామీద బాణాల వర్షం కురిపించారు. కానీ ఆ బాణాలు నా కవచానికి తగిలి కింద పడిపోయాయే తప్ప ఛేదించలేకపోయాయి. నాకింక ఎక్కువ సమయం లేదు. స్పృహ కోల్పోయే స్థితికి చేరుకున్నాను. ఇంకా బలహీన పడేలోపల రాముడిని చేరుకోవాలి. విభీషణుడిని బలంగా తన్నేసరికి వాడు వెళ్లి సముద్రంలో పడ్డాడు. నా కత్తిని ఎత్తిపట్టుకుని రాముడి మీదికి లంఘించాను, కానీ విభీషణుడు ఎలాగో మళ్లీ వారధి మీదికి చేరుకున్నాడు. నేను అది గమనించలేదు. నా ధ్యాస పూర్తిగా రాముడి మీదే లగ్నమై ఉంది. నేను ముందుకి ఉరికేసరికి విభీషణుడి కత్తి మళ్ళీ నా వెన్నుమీద దాడి చసింది. కానీ ఒక్క వెంట్రుకవాసిలో తప్పించుకున్నాను. అయినా నా శరీరం మీద కవచాన్ని గట్టిగా పట్టి ఉంచిన తాళ్లని అది కోసేసింది. అసంకల్పితంగా వెనుతిరిగి మళ్లీ విభీషణుడిని తన్నాను. వాడు సుళ్లు తిరుగుతూ గర్జిస్తున్న సముద్రంలో పడి మాయమయాడు.

మళ్లీ రాముడివైపు తిరిగేసరికి నా కవచం ఊడి పడిపోయింది. శత్రువుల బాణాలకి ఎదురుగా ఎటువంటి రక్షణా లేకుండా నిలబడ్డాను. రాముడు అదే అదనుగా బాణాన్నినా కడుపుకి గురిపెట్టాడు. అయినా నేను ఓటమికి అంగీకరించ లేదు, కానీ నా ఒంట్లోంచి ఎక్కువ రక్తం కారిపోవటం వల్ల తలగిర్రున తిరగ సాగింది. నా కాళ్లు తడబడసాగాయి, త్వరగా ముందుకి కదలటం ప్రాణాంతకంగా అనిపించింది. వరసగా బాణాలు నా పేగుల్లో దిగబడుతూ ఉంటే నా మనసులో ఎదురు తిరగాలన్న ఆలోచన తప్ప మరేదీ రాలేదు. ఒక్కొక్క అడుగు ముందుకి వేస్తూ ఉంటే, నా అనాచ్ఛాదిత శరీరాన్ని మరిన్ని బాణాలు ఛేదించసాగాయి. నెమ్మదిగా కిందికి ఒరిగిపోయాను. నాకు గుర్తున్న చివరి దృశ్యం, ఒక ఆకుపచ్చ అల నన్ను మింగెయ్యటం. ఆ తరవాత

అంతా శూన్యమే.

మళ్లీ కళ్లు తెరిచే వేళకి, అంతటా శ్మశాన నిశ్శబ్దం అలుముకుని ఉంది. నేల నల్లగా, చల్లగా ఉంది. ఎవరో కొందరు నా చుట్టూ నిలబడి ఉన్నారు. కానీ నాకు వాళ్ల ముఖాలు కనబడలేదు, తరవాత పొడవుగా, నల్లగా ఉన్న ఒక ఆకారం నా తలవద్దకి వచ్చి నిలబడింది. 'రాముడు...' నాకు అతని గొంతు పట్టుకోవా లనిపించింది, కానీ నేల నన్ను గట్టిగా పట్టుకుంది. అది నా శరీరాన్ని మళ్లీ తన సొంతం చేసుకోబోతూ ఉంది. రాముడు సంస్కృత భాషలో ఏదో గొణిగాడు. స్వర్గంలో చోటు చూసుకోమనో, దొరుకుతుందనో ఏదో అన్నాడు. నాకు పగలబడి నవ్వాలనిపించింది. వ్యంగ్యంగా రెండు చేతులనీ వినమ్రంగా జోడించాను. మళ్లీ స్పృహ కోల్పోయేముందు, నా మనసులో మెదిలిన చివరి ఆలోచన - భయంకరమైన నా వ్యంగ్యం రాముడికి అర్థమే కాలేదు అన్నది.

49. విజేతలూ, వారి తీరుతెన్నులూ

భద్రుడు

ఈరోజు ఆయనకి అంత్యక్రియలు జరుగుతాయి. మధ్యాహ్నం దాటింది. నేను కూడా జనంతో కలిసి నిలబడ్డాను. ఆ ఉక్కపోతకీ, వేడికీ నాకు నిద్రమత్తు రాసాగింది. వాతావరణంలో ఒక రకమైన విషాదం, భయం వ్యాపించి ఉన్నాయి. క్రితంరోజు రాత్రి విజేత సేనలు నగరంలో ప్రవేశించాయి. ప్రవేశిస్తూ ఆ వానరులు కనిపించిన ప్రతిదీ దోచుకున్నారు. ఎక్కువమంది అసురులు అరణ్యాలలోకి పారిపోయారు. చాలా కొద్దిమంది తమ విలువైన ఆస్తిని రక్షించుకునేందుకు ధైర్యంగా పోరాడారు. మిగిలిన వాళ్లు విజృంభించిన వానరసేనకి లొంగిపోయారు, కానీ వాళ్లకి ఎవరినీ బంధించాలన్న ఆలోచనే లేదు. తెలివితక్కువగా కరుణించమని వేడుకున్న వారిని ఒక్క వేటుతో నరికిపారవేశారు. వాళ్లు అందమైన రావణుడి భవనాన్ని దాదాపు నేలమట్టం చేసేశారు. అంతకుముందు విభీషణుడు జోక్యం చేసుకుని రాజభవనం లోపల ఉన్నవారందరూ సురక్షితంగా ఉండేటట్టు జాగ్రత్త తీసుకున్నాడు. అంటే మళ్లీ కులీనులకే తమ వాళ్లనీ, తమ ఆస్తినీ కాపాడుకోవటం సాధ్యమైంది.

ఉదయం బాగా పొద్దెక్కేసరికల్లా పరిస్థితి కొంచెం చక్కబడింది. చుట్టుపక్కల ఉన్న అరణ్యాలలోనుంచి పాపం చాలామంది అసురులని వానరులు పట్టుకుని నగరానికి లాక్కువచ్చారు. సముద్రతీరాన సైనికులు చంపి పడవేసిన వాళ్ల దగ్గర విలువైన వస్తువులు ఏమైనా దొరుకుతాయా అని వెతికేందుకు నేను అక్కడికి దొంగతనంగా నక్కుతూ వెళ్లాను. అది చాలా పెద్ద సాహసమే, కానీ సులభంగా ధనాన్ని సంపాదించేందుకు అదొక మార్గం. పైగా అది ఉన్నంతలో సురక్షితమైన ప్రదేశం. ఒక అసురుడు అక్కడ ఉంటాడని శత్రువులు ఊహించను

కూడా ఊహించలేరు. చనిపోయిన వారి దగ్గరా, తీవ్రంగా గాయపడిన వారి దగ్గరా విలువైన వస్తువులకోసం నాలాగే మరి ఇద్దరు అక్కడ తచ్చాడుతూ, నాకు మరీ దగ్గరగా రాకుండా జాగ్రత్తపడటం కనిపించింది.

సరిగ్గా ఆ సమయంలోనే సాక్షాతూ చక్రవర్తి నాకు కనిపించాడు. అమావాస్య రాత్రి మసక చీకటిలో నా మహారాజుని, నా యజమానిని గుర్తు పట్టాను. ఆయన భారంగా ఊపిరి పీలుస్తూ, బాధతో గిలగిల్లాడుతున్నాడు. నక్కలు ఆయన్ని జీవించి ఉండగానే పీక్కు తింటున్నాయి. నన్ను ఆయనవైపు ఆకర్షించినవి ఆయన చేతులకి ఉన్న మెరిసే స్వర్ణకంకణాలు. మొదట్లో ఆయనేనని తేల్చుకోలేకపోయాను, కానీ ఆయన మీదికి వంగి చూస్తూ ఉంటే, ఆయన గట్టిగా మూలిగాడు. 'ఎంత శక్తిమంతుడికైనా పతనం తప్పదు కదా!' ఈ వ్యక్తి పోరాడినది ఆత్మగౌరవాన్నీ, స్వేచ్ఛనీ, విలువలనీ, సంస్కృతినీ కోల్పోయిన తన ప్రజలకోసం. రావణుడు అసురులకి ఆత్మగౌరవాన్నీ, ఆత్మవిశ్వాసాన్నీ కలిగించాడు, మా ప్రాచీన సంస్కృతి పట్ల నమ్మకాన్నీ, గర్వాన్నీ మాలో రగిలించాడు. మా నాగరికతని ఎన్నడూ లేనంత ఎత్తులకి తీసుకువెళ్లి మాకు అపార గౌరవాన్ని సంపాదించిపెట్టాడు. నిజమే, అతను నిరంకుశుడే అయి ఉండవచ్చు. అసురుల సమాజంలోని ప్రజాస్వామ్యాన్నీ, సర్వజన సమాన భావాన్నీ నాశనం చేశాడు. దాన్ని ఒక తుచ్ఛమైన యుద్ధయంత్రంగా మార్చివేశాడు. అవును, ఆయన ఐశ్వర్యంతో తులతూగాడు, తన ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించాడు. ఆయన సృష్టించిన సమాజంలో లోటుపాట్లు లేకపోలేదు. మాలో ఎక్కువమందిమి పేదగానే జీవించాం. కష్టపడి పనిచేస్తే, అదృష్టం కలిసివస్తే మేము కూడా ధనవంతులం, బలశాలులం అవగలమని మాకు తెలుసు, నిజమే. పుట్టుకతోనే కొన్ని ప్రత్యేకమైన అధికారాలూ, వెసులుబాట్లూ ఉన్న దేవతాజాతి బ్రాహ్మణులలాగ మాలో అటువంటి కులాలు లేవు. మమ్మల్ని అనుక్షణం అణగదొక్కే పేదరికంలో జీవిస్తున్నప్పటికీ, ధనవంతుల పట్ల మా గుండెల్లో క్రోధం రగులుతూనే

ఉండినప్పటికీ, దేవతల రాజ్యంలో మావంటి వారికి లేని ఒక సౌకర్యాన్ని మేము అనుభవించాం - మమ్మల్ని మనుషులలాగా చూసేవారు. ఎంత నిరుపేదల మైనప్పటికీ, ఆ పేదరికంలో కూడా గౌరవంగానే జీవించగలిగాం, ఇప్పుడు నేలకొరిగిన నా రాజు మీదికి వంగి చూస్తున్నప్పుడు, నాకు ఈ విషయాలేవీ తెలీలేదు. తరవాత, చాలాకాలం తరవాత నాకు ఇవన్నీ స్పష్టంగా అర్థమయాయి. కాని ఆసరికే చాలా ఆలస్యం అయిపోయింది.

ఆ వృద్ధమహారాజు ఏదో నెమ్మదిగా గొణిగాడు, కానీ ఆయన ఏమంటున్నాడో నాకు అర్థం కాలేదు. ఆయన నుదుటిని తాకి చూశాను. పెనంలా కాలిపోతోంది. తీవ్రమైన జ్వరంతో ఊపిరి పీలుస్తూంటే గురక శబ్దం రాసాగింది. ఆయన కొనఊపిరితో ఉంటే చూడటం భరింపశక్యం కాకుండా ఉండింది నాకు. మళ్లీ ఆయన అస్పష్టంగా ఏదో అన్నాడు. తనని ఎక్కడికో తీసుకువెళ్లమంటున్నాడు, అనేది మాత్రం నాకు అర్థమైంది. పాపం, అనిపించింది. నాకు తెలీకుండానే నా కళ్లలో కన్నీళ్లు నిండాయి. ఆయన తలని రెండు చేతులతోనూ పట్టుకుని గుండెలకి హత్తుకున్నాను. 'నేను నిజంగా ఒక రాజుగారిని గుండెలకి హత్తుకుంటున్నాను!" ఎంత ఆనందం అనిపించిందో చెప్పలేను. ఆ అత్యుత్సాహంలో నేను శత్రువు మీద పగతీర్చుకుంటానని ఆయనతో అన్నాను. "మీరు మొదలుపెట్టిన పనిని నేను పూర్తిచేస్తాను ప్రభూ! విచారించకండి. ప్రశాంతంగా తరలిపొండి. మన జాతికోసం నేను బాధ్యతగా పని చేస్తాను." అన్నాను. మరణిస్తున్న మహారాజుతో అలా అంటున్నానని నేనే నమ్మలేకపోయాను. "నా పద్ధతులు వేరుగా ఉండొచ్చు. మీతో పోలిస్తే అవి అంత ఉదాత్తంగా కూడా ఉండకపోవచ్చు."

రావణుడు మళ్లీ గట్టిగా గుర్రుమంటూ శ్వాసతీసుకున్నాడు. జంతువులు సగం కొరికి తినేసిన ఆయన చెవిదగ్గరగా నా నోటిని తీసుకువెళ్లాను. కుళ్లిపోతున్న మాంసం వాసనకి నాకు వాంతి వచ్చినంత పనైంది, కానీ దాన్ని అణచుకుని ఆయన చెవిలో, మీకూ,

మన జాతికీ కలిగించిన ఈ విధ్వంసానికి రాముడిని, ఊరికే వదిలేది లేదు," అన్నాను. అలా అంటూ ఉంటే నా జీవితానికి ఒక ప్రయోజనం సమకూరినట్టు అనిపించింది. పూర్తిగా ఎటువంటి గుర్తింపూ లేని నా జీవితానికి ఇక ఏదో ఒక ప్రయోజనం ఉండబోతోంది. నా ప్రభువు నుదుటిని ముద్దుపెట్టుకుని, సుతారంగా ఆయన తలని తడి నేలమీద ఉంచాను. ఆయన మళ్లీ బాధగా మూలిగాడు. ఆయన చనిపోతూ ఉంటే చాలాసేపు అక్కడే నిలబడి చూస్తూ ఉండిపోయాను. తూర్పు దిక్కున వెండి వెలుగు రేఖలు కనబడగానే, ఉదయించే సూర్యుడికి కోడిపుంజులు స్వాగతం పలకటం ప్రారంభించగానే, బలశాలి రావణుడు భారంగా, బాధగా కొనఊపిరి విడిచాడు. అరగంట పాటు అక్కడే వేచి ఉండి, మోకాళ్ల మీద కూర్చుని ఆయన శరీరం మీది బంగారు ఆభరణాలన్నిటినీ తొలగించాను. ఆయన ఏ చోటికి వెళ్లాడో గాని, అక్కడ ఆయనకి వీటి అవసరం ఉండదు. పెద్ద నిధే దొరికింది నాకు, అనుకోకుండా మహారాజు నా కంటపడినందుకు చాలా సంతోషించాను.

వెనక్కినగరంవైపు నడుస్తూ, నేను మరణిస్తున్న రావణుడితో అన్నమాటలు ఎంత డాంబికంగా, ఎంత తెలివితక్కువగా ఉన్నాయో అనుకుని సిగుపడ్డాను. 'నేను ఏ మాటనీ నిలుపుకోవక్కర్లేదు- చనిపోయిన వ్యక్తికి ఇచ్చిన మాటని కూడా,' నగరం పొలిమేరల్లోకి ప్రవేశించగానే, రావణుడికి నేను ఇచ్చినమాటని నిలుపుకోకపోయినంత మాత్రాన అది పెద్ద అపరాధమేమీ అనిపించుకోదని నన్ను నేను సమర్ధించుకున్నాను. రాముడిమీద ప్రతీకారం తీర్చుకునేందుకు దండెత్తి వెళ్లేంత వీరుడినేమీ కాను. ఇంతలో వానర సైనికులు నన్నుపట్టుకుని నగరంలో జరుగుతున్న విజయోత్సవాల ఊరేగింపు చూసేందుకు తీసుకుపోయారు. మిట్టమధ్యాన్నం అయేలోపలే ప్రతీకారం గురించి పూర్తిగా మరిచిపోయాను.

జనాన్ని బలవంతంగా రాజమార్గంలోకి తరలించి, వీధికి అటూ ఇటూ మండుటెండలో కూర్చోపెట్టారు. ఏమాత్రం కదిలినా వానర సైనికులు నిర్ణయగా చావబాదుతున్నారు. సూర్యోదయమైనా విడని

మొండి పొగమంచులా అంతటా భయం వ్యాపించి ఉంది. ఆశ్చర్యం ఏమిటంటే ఆరోజు వాతావరణం మాత్రం నిర్మలంగా ఉంది. గాలి జోరుగా వీస్తూ ఉంది.

క్రితంరోజు కురిసిన వర్షంవల్ల ప్రకృతిలో కొత్తచైతన్యం వచ్చినట్టు ఉంది. చెట్ల పచ్చదనం కళ్లకి కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. నీలంగా ఉన్న ఆకాశంలో దూదిపింజెలలాంటి తెలిమబ్బులు స్వేచ్ఛగా విహరిస్తున్నాయి. ప్రపంచమంతా దేదీప్యమానంగా వెలిగిపోతున్నట్టు ఉంది. ఒక్కరోజులో, రావణుడూ, అతని అద్భుతమైన కలలూ అసలు లేవేమో అన్నట్టుగా అంతా మారిపోయింది. రావణుడి మృతశరీరం మీదినుంచి నేను దొంగిలించిన ఆభరణాలని కౌపీనం లోపలికి తోశాను. దొంగిలించినవి అని అనకూడదేమో, వెనక్కి తీసుకున్నాను అనేదే సరైన పదం, ఎందుకంటే రావణుడు సొంతం చేసుకున్నవన్నీ మావే - అంటే నానుంచీ, నాలాంటి వాళ్ల దగ్గరనుంచీ తీసుకున్నవి. మేమేమో ఇప్పుడు ఇక ఎవరు మమ్మల్ని పరిపాలిస్తారా అని రాబోయే రాజుకోసం ఎదురుచూస్తున్నాం.

మధ్యాన్నానికల్లా, ఎండలో కూర్చున్న వాళ్లు ఆ తాపానికి మూర్ఛిల్లసాగారు. మధ్యభూభాగంలో ఉండే వానరులకి సూర్యతాపం అలవాటే కనుక కేవలం చెమటలు కారుస్తున్నారు, ఇక్కడి ఎండ వాళ్లకి లేతగా, ఉక్కపోసేదిగా మాత్రమే అనిపిస్తోంది. కానీ ఈ వాతావరణం వాళ్లకి ఎక్కువ చికాకుని కలిగించి కోపం తెప్పిస్తోంది. కొంచెం కదిలినా మమ్మల్ని చావబాదుతున్నారు. నా పక్కన కూర్చున్న కోడెవయసు కుర్రవాడు కొద్దిదూరంలో ఉన్న వానరులవైపు తదేకంగా చూస్తున్నాడు. ఏదో సమస్య తలెత్తబోతోందని నాకు బాగా అర్థమైంది. ఆ కుర్రవాడి మనసులో సుడులు తిరిగే ఆలోచనలని పసికట్టాను. ఈ చోటినుంచి వీలైనంత వేగంగా వెళ్లిపోవటం శ్రేయస్కరం, అనుకున్నాను. కానీ ఎవరికంటా పడకుండా వెళ్లటం ఎలా? పారిపోయేందుకు నేను మార్గం వెతికే లోపల ఆ కుర్రవాడు తను కూర్చున్నచోటినుంచి ముందుకి ఉరికాడు, హఠాత్తుగా సైనికులమీదికి లంఘించాడు. అలజడి వినిపించి

సైనికులు అటు తిరిగేసరికి కుర్రవాడు కొట్టిన దెబ్బ తిన్నగా వెళ్లి వాళ్ల ముఖాలకి బలంగా తగిలింది. వాళ్లు నిలదొక్కుకోలేక కింద పడ్డారు. వాళ్ల చేతుల్లోని ఈటెలని లాక్కుని వాడు వాళ్లని పదే పదే పొడిచాడు. అది చూసి అక్కడ ఉన్న అనేకమంది యువకులు వానర సైనికులమీద దాడిచేశారు. కానీ అక్కడ ఉన్న చాలామంది మాత్రం నాలాగే జరుగుతున్నదాన్ని నాటకం చూస్తున్నట్టు చూస్తూ ఉండిపోయారు. తమ తోటి వారికి సాయం చేసేందుకు కోటలోనుంచి మరింతమంది వానర సైనికులు పరిగెత్తుకుంటూ వచ్చారు. కొద్ది నిమిషాలలోనే ఎదురు తిరిగిన యువకులని అందరినీ వాళ్లు తుదముట్టించగలిగారు.

ఈ దాడికి మూలకారణమైన కుర్రవాడి శరీరం ముక్కచెక్కలైంది. వాడి అవయవాలని అన్నివైపులకీ జనంలోకీ విసిరేశారు వానర సైనికులు. వాడి తెగిన చెయ్యి ఒకటి వచ్చి నా పక్కన పడింది. దాన్ని నేను కాలితో తన్నేసరికి అది వెళ్లి నా పక్కన ఉన్న వాడి దగ్గర పడింది. వాడు అసలే హడిలిపోయి ఉన్నాడు. మరుక్షణం వాడు వాంతి చేసుకున్నాడు. ఆ కుర్రవాడి రక్తం కొంత నా ముఖం మీదా, భుజాలమీదా చిందింది, దాన్ని అరచేత్తో తుడిచి, అరచేతిని నా మొలకి చుట్టుకున్న వస్త్రానికి తుడిచేసుకున్నాను.

మధ్యాహ్నంవేళ దాటిపోయే సరికి వానరులకి తమ ఆట విసుగు పుట్టించసాగింది. బద్ధకంగా అటూ ఇటూ తిరగసాగారు. మధ్యాహ్నం సూర్యుడు అందరినీ మాడ్చేస్తున్నాడు. కొందరు తాగేందుకు నీళ్లు ఇమ్మని వేడుకుంటూ స్పృహ కోల్పోవటం మొదలెట్టారు. నేను కూడా జోగుతూ నిద్రలాంటి స్థితికి చేరుకున్నాను. అంతలో ఢంకాల మోత విని ఉలిక్కిపడి లేచాను. దూరంగా కోట ద్వారాలు తెరుచుకున్నాయి, ఒక ఊరేగింపు రాజమార్గంలోకి ప్రవేశించింది. జనం అందరూ మెడలు సాచి ఏం జరుగుతోందో చూడసాగారు. ఊపిరిబిగబట్టి చూస్తున్న జనసమూహాల మధ్యనుంచి ఊరేగింపు సాగిపోతూ ఉంది. వాళ్లు ఒక కర్రమీద దేన్నో ఎత్తి పట్టుకోవటం, అది కిందికీ పైకీ కదలటం మాత్రం నాకు కనిపించింది. బాధతో కూడిన ఒక ఆక్రందన కోటవైపునుంచి

ఊరేగింపుని అనుసరించింది. ఆ ఊరేగింపు సమీపించింది. ఆ కిందికీ పైకీ ఊగేది రావణుడి తల అనీ, అది ఒక కర్రకి గుచ్చి ఉందనీ, ఆ కర్రని మోస్తున్నది అంగదుడనీ గ్రహించేసరికి నా పై ప్రాణాలు పైనే పోయాయి. ఒకప్పుడు రాజసం ఉట్టిపడుతూ ఉండే ఆ అందమైన ముఖం ఇప్పుడు చూసేందుకే వికారంగానూ, భయం గొలిపేదిగానూ ఉంది. ఆ మృత శిరస్సులో కళ్లు లోపించాయి, బుగ్గలని ఎలుకలు కొరికి వదిలాయి, ముక్కు ఉండవలసినచోట గడ్డకట్టిన రక్తం మద్ద ఉంది, నక్కలు ముక్కులో సగభాగాన్ని తినేశాయి. అంగదుడి వెనక కిష్కింధ రాజు ఉన్నాడు. ఆ కర్కోటకుడు బాగా మద్యం తాగి ఉన్నట్టు తూలుతున్నాడు. తన గదని చాలా కష్టపడి మోయగలుగుతున్నట్టు ఉంది అతని వాలకం. తమ రాజు వెనక ఎంతోమంది వానర ప్రముఖులు మోటుగా ఉన్న గదలనీ, లావుపాటి కర్రలనీ పట్టుకుని నడుస్తున్నారు. ఒంటిమీద పెరిగిన వెంట్రుకలతో వాళ్లంతా చూసేందుకు అంద వికారంగా ఉన్నారు. అసుర ప్రముఖులని అనుకరించే ప్రయత్నంలో సామాన్యంగా వాళ్లు తొడుక్కునే జింక చర్మాలకి బదులు రాజభవనం నుంచి దోచుకున్న నాణ్యమైన పట్టు వస్త్రాలు ధరించారు వాళ్లు. ఆ దుస్తుల్లో వాళ్లంతా చూసేందుకు హాస్యాస్పదంగా కనిపించినప్పటికీ, వాళ్ల చేతుల్లో ఉన్న రాతి గదలని చూసి భయపడి ఎవరూ నవ్వలేదు. వాళ్ల వెనుక అసురులు ఢంకాలనీ, తూర్యాలనీ, కొమ్ములనీ మోగిస్తూ తమ కొత్త ప్రభువుల విజయానికి హర్షం వెలిబుచ్చుతున్నారు. వాళ్ల వెనుక రాముడు, అతని సోదరుడు, విజయగర్వంతో ఉన్న సీత-రావణుడి రథంలో ఉన్నారు. తన భర్త సరసన కూర్చున్న సీత ముఖం ఆనందంతో వెలిగిపోతూ ఉంది.

రాజుగారి రథం పక్కనే విభీషణుడు పరిగెత్తి వస్తున్నాడు. లక్ష్మణుడు ఏవేవో పనులు పురమాయిస్తూ ఉంటే వినయంగా వాటిని చేస్తున్నాడు. రాముడి తలమీద వజ్రాలు పొదిగిన రావణుడి స్వర్ణకిరీటం ఉంది. తన అరచేతులు రెండూ కొద్దిగా పైకి ఎత్తి మమ్మల్ని ఆశీర్వదిస్తున్నట్టు కూర్చుని ఉన్నాడు అతను. తన వింటినీ,

అమ్ములపొదినీ తనకీ తన భార్యకీ మధ్య ఉంచాడని గమనించాను. అలాగే అతను తన భార్యవైపు కావాలనే చూడటం లేదనీ, అప్రయత్నంగా కూడా ఆమె శరీరం తన శరీరాన్ని తాకకుండా ఉండేందుకు జాగ్రత్తపడుతున్నాడనీ కూడా గమనించాను.

అప్పుడు అతని ప్రవర్తన నాకు వింతగా తోచింది, కానీ ఆ కొత్త సంస్కృతి కొంచెం కొంచెంగా అర్థం అవటం మొదలుపెట్టాక, నాకు స్పష్టంగా దానికి కారణం తెలిసింది. ఆ సాయంత్రం జరిగిన సంఘటనలు నాకు గొప్ప జ్ఞానోదయాన్ని కలిగించాయి. రాముడి రథం వెనుక అంతఃపుర స్త్రీలని మోసుకొస్తున్న పల్లకీలు ఉన్నాయి. వాటిలో ఒక పల్లకీలో మండోదరి కూర్చుని ఉంది. వైదిక కార్యంగా ఆమె తలమీది శిరోజాలని పూర్తిగా తీసేశారు, ముఖాన్ని మేలిముసుగువేసి కప్పి ఉంచారు. ఆమె తెల్లటిచీరలో ఉంది. కర్రచివర కిందికీ పైకీ ఊగే రావణుడి శిరస్సుకన్నా, అసురుల మహారాణిని ఒక దేవతల వితంతువు వేషంలో చూడటాన్ని జనం తట్టుకోలేక పోయారు. అయితే ఆమె చాలా హుందాగా పల్లకీలో కూర్చుంది, తన భావోద్వేగాలను ఎంతమాత్రం వెలిబుచ్చలేదు. మార్గానికి ఇరువైపులా నిలబడ్డ అసురులు అలల్లా ఎగసిపడుతూ, కిందికి వంగుతూ, నేలని తాకి అభివాదం చేస్తూ ఆమె దుస్థితికి ఆర్తనాదాలు చేశారు. వానర సైనికులు వాళ్లని కాళ్లతో తన్నారు, వాళ్లమీద అరిచారు, అసురుల ఆర్తనాదాలని ఆపించి వాళ్లచేత 'జయము జయము శ్రీరామా' అనిపించాలని గట్టి ప్రయత్నం చేశారు. కానీ తమ కలలు విచ్చిన్నం అయినందుకు ఏడవగలగటం అనే ఒక చిన్నపాటి సుఖాన్ని కూడా అనుభవించ నీయక, తమని బాధపెడుతున్న వానర సైనికుల మాట వినేందుకు అసురులు నిరాకరించారు. కలలు విచ్చిన్నమవటంతో పోలిస్తే ఎముకలు విరిగితే కలిగే బాధ చాలా చిన్నది. నేను కన్నీళ్లు ఆపుకోలేక నా పక్కనున్న వారితో కలిసి గుండెలు బాదుకుంటూ భోరుమని ఏడవసాగాను.

ఢంకాలూ, కొమ్ము బూరలూ ఎంత గట్టిగా వాయించినా అవి

అసురుల వేదననీ, అరుపులనీ అణచలేకపోయాయి. నిర్మూలనం అనే లోతైన అగాధం అంచున్న ఉన్న ఒక జాతి తాలూకు ఆర్తనాదం అది. ఒక సంస్కృతి మరణ వేదనతో అరిచే అరుపు అది. చాలా సంవత్సరాల క్రితం అసురులు పునర్నవీకరణం అనే ఆశాజ్యోతిని కళ్లారా చూశారు, కానీ ప్రస్తుతం అది ధ్వంసమైపోయింది. అల్లకల్లోలంగా ఉన్న సముద్రాన్ని అస్తమిస్తున్న సూర్యబింబం రక్తవర్ణంలోకి మారుస్తూ ఉండగా, ఎల్లలు లేని ప్రపంచం గురించీ, సమానత్వం గురించీ మేము కన్న కలలని పాతిపెట్టెయ్యవలసి వచ్చింది. కొన్ని యుగాలుగా ఈ భూభాగంలో నివసించిన అసురులు ప్రపంచానికి ఒక ఆశాజ్యోతిని వెలిగించి ఆదర్శంగా నిలిచారు. ఆ ఆశాజ్యోతి దాస్యమూ, కులమూ లేని ప్రపంచాన్ని సృష్టిస్తామనీ, మనసులో ప్రజ్వరిల్లే ఆవేశాగ్ని, కలలు కనే గొప్ప ఆకాంక్షా ఉన్నవారెవరైనా సరే తన భవితవ్యాన్ని తానే నిర్మించుకుంటాడన్న సందేశాన్ని ప్రపంచమంతటికీ అందించింది. సరస్వతీ సింధునదీ తీరాలలో మా నగరాలు కిరాతకమైన దేవతల ఆక్రమణలకి గురయినప్పుడే ఆ కలలు ధ్వంసమయాయి. అయినప్పటికీ అవి మళ్లీ బలి చక్రవర్తి, రావణుడి వంటి గొప్ప నాయకుల నోటి మాటల రూపంలో వెలువడ్డాయి. వారిలో ఒక వీరుని తల ఇప్పుడు ఒక పశువు చేతిలోని కర్ర కొసమీద పైకీ కిందికీ ఊగులాడుతోంది! ఆ ఊరేగింపు సముద్రం ఒడ్డు వరకూ వచ్చి ఆగింది. సముద్ర తీరాన ఏం జరుగుతుందో చూసేందుకు జనం పరిగెత్తారు. కొన్ని ఘడియల క్రితం వానరులతో పోరాడిన అసుర సైనికులు ప్రస్తుతం శత్రువులతో చేరి జనాన్ని అదుపు చేస్తున్నారు. ప్రస్తుతం వాళ్లు కొత్త పాలకులకి తమ సేవలని అందించి జీతాలు తీసుకోవాలనీ, పై పదవుల్లోకి వెళ్లాలనీ, అదనపు సంపాదన చేజిక్కించు కోవాలనీ, సురక్షితంగా జీవించాలనీ ప్రయత్నిస్తున్నారు. వాళ్లు ప్రభుత్వోద్యోగులు, తమ యజమాని చిన్న సైగ చేస్తే చాలు ప్రజలని చావ బాదేందుకు సిద్ధంగా ఉన్నారు. వాళ్ల దుడ్డుకర్రలు అసహాయులైన సామాన్యుల వీపులని చిట్లగొట్టాయి. నాయకుల సమీపానికి పోకుండా వాళ్ల చుట్టూ ఆ అసురులు రక్షణ వలయాన్ని ఏర్పరచారు. ప్రముఖులు మా ముందు ఉపన్యసించేందుకు

ఒక వేదిక సిద్ధమైంది. మమ్మల్నందరినీ సముద్రతీరాన ఇసుకలో కూర్చోమని ఆదేశించారు. మమ్మల్నినెట్టారు, అణగదొక్కారు, కొట్టి కింద పడవేశారు. రాముడిని పొగిడే భట్రాజులూ, ఆ భట్రాజుల భట్రాజులూ అటూ ఇటూ పరిగెత్తుతూ, అడిగినవన్నీ తెచ్చి ఇస్తూ తమ పైవారి ముందు వంగి వంగి నమస్కరిస్తూ, కిందివారి మీద కేకలు పెడుతూ సమయాన్ని వృథా చేశాక, రాముడు వేదికనెక్కాడు. అతని ముఖం మీద ఏదో ఆలోచనా, ఆందోళనా క్షణకాలం కనిపించాయి. అంతలోనే చిరునవ్వు నవ్వుతూ చెయ్యి ఊపాడు. దానికి సమాధానంగా జనంలో నుంచి కొందరు చేతులు ఊపారు. మళ్లీ అతని భృకుటి ముడిపడింది. కొద్ది సేపట్లో మేమందరం రాముడిని చూసి చేతులు ఊపుతూ, అతను సంస్కృతంలో మాట్లాడే ఒక్కమాట కూడా అర్థం కాకపోయినప్పటికీ, ప్రతి మాటకీ హర్షధ్వానాలు చేశాం.

కొంతసేపయాక విభీషణుడు లేచి రాముడి చెవిలో ఏదో చెప్పాడు. ఆ తరవాత రాముడు మాట్లాడిన విషయాన్ని ఏమాటకామాట అనువదించి మా అందరికీ చెప్పాడు. దుష్ట రాక్షసుడు రావణాసురుడి నిరంకుశత్వం నుంచి మమ్మల్నందరినీ విడిపించినందుకు మేము సంతోషించాలని చెపుతూ మళ్లీ రాముడు మాట్లాడటం ప్రారంభించాడు. మంచి ఎప్పుడూ చెడుని జయిస్తుంది అని తాను నమ్ముతానని అన్నాడు. అతను చెప్పినది గొప్పగానూ, అర్థవంతంగానూ ఉందనిపించి మేము చప్పట్ల చరిచాం. ఆ తరవాత విభీషణుడి వంతు వచ్చింది.

ప్రజలందరినీ నాలుగు కులాలుగా విభజించి, ఒక్కొక్క కులానికీ ఒక్కొక్క వృత్తిని కేటాయించటం జరుగుతుందని అన్నాడు విభీషణుడు. దేవుడి ముఖం నుంచి జన్మించిన బ్రాహ్మణులు నాలుగు కులాలలోకీ ఉన్నతమైన కులానికి చెందుతారు. వాళ్లు జ్ఞానాన్ని పంచుతారు, ఈ లోకంలో దేవుడి ప్రతినిధులుగా వ్యవహరిస్తారు, ఇక వాళ్ల మాట విని వాళ్లు చెప్పినట్టు చెయ్యటం అందరికీ తప్పనిసరి అవుతుందని అన్నాడు. దేవుడి చేతులూ కాళ్లనుంచి జన్మించే గొప్ప

అదృష్టానికి నోచుకున్న క్షత్రియులు, బ్రాహ్మణుల సలహాలని పాటిస్తూ సమాజాన్ని పరిపాలిస్తారు. దేవుడి తొడలనుంచి జన్మించిన వైశ్యులు వర్తకం చేసుకుంటారు, వర్తక వ్యాపారాలూ, వాణిజ్యమూ చేసుకునేందుకు రాజ్యం అనుమతి పొంది, మిగతా రెండు కులాలకీ అణగిమణగి ఉంటారు. దురదృష్టవశాత్తూ దేవుడి పాదాల నుంచి జన్మించిన శూద్రులు, పనివాళ్లుగా, చిన్న చిన్న స్థలాల యజమానులుగా, సామాన్య సైనికులుగా మిగతా మూడు కులాల వాళ్లకీ తమ సేవలని అందిస్తారు. ఆయన చెప్పింది చాలా అయోమయంగా ఉన్నా అందరం చప్పట్లు కొట్టాం. ఏ పనీ చేతకాని వారికీ, రైతుల వంటి వారికీ, నల్ల చర్మం వారిలో కూడా మరీ నల్లగా పరిగణించబడే నా వంటి వీధులు తుడిచే, బట్టలు ఉతికే, బరువులు మోసేవారి గతి ఏమవుతుంది అన్న అనుమానం వచ్చింది నాకు. నావంటి వారు దేవుడి ఏ శరీరభాగంలోంచి వచ్చారో తెలుసుకోవాలన్న కుతూహలం కలిగింది. నాకు సమాధానం వెంటనే లభించింది. మిగతావాళ్లు అందరూ, పైన చెప్పిన వర్గాలలో ఇమడని జనం, అస్పృశ్యులుగా, సంఘం నుంచి బహిష్కరింపబడిన వారిగా ఉంటారు అని ప్రకటించాడు విభీషణుడు. మా దుస్థితికి తాను విచారిస్తున్నానీ, కానీ దానిని ఆ దేవుని ఆశీర్వాదంగా భావించవలసిందనీ కోరాడు. ఆ ఉపన్యాసం సుదీర్ఘంగా కొనసాగింది. దేవతల మహత్తు గురించీ, వారి జీవన విధానం గురించి విస్తారంగా వివరిస్తూ మాకు విసుగు పుట్టించాడు విభీషణుడు. రాముడు తన కొత్త మిత్రుడిని ఉపన్యాసం ఆపమని చెపుతాడని అనిపించింది. ఎందుకంటే విభీషణుడు వేదాలగురించి చెపుతున్న అనేక విషయాలు అతను సొంతంగా సృష్టించినవే. కానీ బ్రాహ్మణులు ఆ విషయాలని చాలా తృప్తిగా వినటం గమనించి యుద్ధంలో గెలుపొందిన ఆ రాకుమారుడు రాముడు మౌనంగా ఉండిపోయాడు.

చివరికి రాముడు, విభీషణుడి చేతిని పట్టుకుని పైకి ఎత్తి, "చూడండి! ఇతనే అసుర మహారాజు!" అని ప్రకటించటంతో ఆ

ఉపన్యాసం ముగిసింది. రక్షకభటులు అసురులని ఇంకా కొన్ని దెబ్బలు వేయటంతో వాళ్లు కొద్దిగా చప్పట్లు కొట్టటం వినిపించింది. విభీషణుడు రాముడి పాదాలమీద పడ్డాడు. మా కొత్త రాజు చేసిన పనిని రోతగా చూశాం. మా దుస్థితి ఇది, ఒక వెన్నెముక లేని బలహీనుడైన రాజు, పరాయి ప్రాంతపు వ్యక్తి సలహాలతో మమ్మల్ని పరిపాలించబోతున్నాడు.

అయిపోయింది అనుకున్న విభీషణుడి ఉపన్యాసం మళ్లీ ప్రారంభమైంది. దేవతలకి ముందుగా క్షమాపణ చెప్పుకున్నాడు. రాముడి దైవత్వాన్ని అవిధేయులైన తన సోదరులు రావణుడూ, కుంభకర్ణుడూ గుర్తించలేదని వాపోయాడు. సూర్యాస్తమయం అయి లంకలో చీకటీ, వ్యాకులతా అలముకున్నాక, దేవతల వైదీక కర్మలని అనుసరించి తన అన్నకి శాస్త్రోక్తంగా అంత్యక్రియలు జరుపుతానని విభీషణుడు అన్నాడు. ముందు అభ్యంతరం చెప్పేందుకు జనం గొంతులు విప్పారు కానీ మరింత మంది రక్షకభటులు విచ్చుకత్తులతో చుట్టుముట్టటం చూసి నిశ్శబ్దంగా ఉండిపోయారు. కొందరు బ్రాహ్మణులు వేదికమీదికి వచ్చేసరికి రాముడూ, లక్ష్మణుడూ, విభీషణుడూ, సీతా గౌరవంగా లేచి నిలబడ్డారు. రామలక్ష్మణులూ, విభీషణుడూ వాళ్ల కాళ్లమీద పడి ఆశీర్వాదాలు అందుకున్నారు.

కానీ సీత వాళ్ల పాదాలు తాకబోయేసరికి వాళ్లు వాటిని వెనక్కి తీసుకుని ఆమె వైపు అసహ్యంతో చూశారు. అదిచూసి జనం హఠాత్తుగా నిశ్శబ్దంగా ఉండిపోయారు. ఏదో సంచలనాత్మకమైనదీ, నాటకీయమైనదీ జరగబోతోందని అనుకున్నాం. బ్రాహ్మణులలో ఒకడు రాముడితో రహస్యంగా ఏదో అన్నాడు, అది వినగానే రాముడి ముఖం వివర్ణమైంది. రాముడు లక్ష్మణుడితో మాట్లాడిన మరుక్షణం లక్ష్మణుడి ముఖం పాలిపోయింది. ఒక్క క్షణం ఎవరూ ఏమీ చెయ్యలేదు. మరుక్షణం లక్ష్మణుడు సీత చేతిని పట్టుకుని వేదికమీది నుంచి కిందికి ఈడవటం ప్రారంభించాడు. ఆమె విడిపించుకునేందుకు పెనుగులాడింది. అతను ఆమె చేతిని మరింత బలంగా పట్టుకున్నాడు. ఆమెని వేదిక కింది భాగానికి నెట్టాడు. అవమానంతో రగిలిపోతూ,

కోపమూ, కలవరమూ చుట్టుముట్టగా ఆమె అక్కడే నిలబడిపోయింది. ఒక బ్రాహ్మణుడు ముందుకి వచ్చి సంస్కృతంలో ఏదో అన్నాడు.

అప్పుడు విభీషణుడు ముందుకి వచ్చి బ్రాహ్మణుడు చెప్పినదాన్ని అసుర భాషలోకి అనువదించాడు. బ్రహ్మానందంతో మురిసిపోతూ ఇలా చెప్పటం ప్రారంభించాడు, "చూశారా, పౌరులారా, బ్రాహ్మణులు ఎంత న్యాయపరులో! నా ప్రభువు రాముడు ఈ లోకానికే మహారాజు, అయినా ఆయన కూడా న్యాయానికి లోబడే ఉంటాడు. ఆయన భార్య, సీత రాక్షసుడు రావణుడి చెరలో ఉండిందని మనందరికీ తెలుసు. ఒకప్పుడు నేను సోదరా అని పిలిచిన అతని వల్ల గుణవంతురాలైన నా ప్రభువు భార్యకి దోషం అంటింది. నా మాటలు విని నన్ను సందేహించకండి, సీతాదేవి నాకు తల్లితో సమానురాలు. కానీ జ్ఞానసంపన్నులైన ఈ పండితులు తమ న్యాయాన్ని అందరికీ సమానంగానే పంచటం చూసి మనం గర్వించాలి. వాళ్లు వివేకంతో ఆలోచించి చిరకాలంగా దేవతలు పాటిస్తూ వస్తున్న పద్ధతిలోనే సీతాదేవి తన పవిత్రతని నిరూపించుకోవలసి ఉంటుందని నిర్దేశించారు." విభీషణుడు నీళ్లు తాగేందుకు ఆగాడు. కొత్త పాలనా విధానాన్ని అందరిముందూ ప్రదర్శించే ఆ అవకాశం అతనికి చాలా సంతృప్తిని కలగజేస్తోందని తెలుస్తూనే ఉంది.

సీత ఏడవటం మాని, ఎదిరిస్తున్నట్టు నిలబడింది. తన భర్తవైపే కన్నార్పకుండా చూస్తూ ఉన్న ఆమె ముఖం మీది మేలిముసుగు జారిపోయింది. అప్పుడు ఆమెలో పోలికలు స్పష్టంగా కనిపించాయి. చూసేందుకు ఆమె తల్లి పోలికే అయినప్పటికీ, ఆమె నిలబడిన భంగిమా, కళ్లల్లోంచి వెలువడుతున్న అగ్నిజ్వాలలూ... ఆమె అణువణువూ తన తండ్రి రావణుడినే పోలి ఉంది అని చెప్పకనే చెపుతున్నాయి. ఇంతకాలం ఎంతో ఓరిమితో తను ఏ భర్తకోసం ఎదురుచూసిందో, అతనివైపు కళ్లెర్రజేసి చూసింది. రాముడు ఆమె కళ్లలోకి చూడలేక ముఖం తిప్పకున్నాడు. అతని చేతులు వణుకుతున్నప్పటికీ పెదవులమీద అతుక్కున్న కృత్రిమమైన చిరునవ్వు

మాత్రం చెరగలేదు. తన భావోద్రేకాలని అదుపులో పెట్టుకునేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నాడు. ప్రపంచంలోకెల్లా అతిశక్తిమంతుడైన రాజుని ఓడించిన యోధుడిలా లేడు అతను. విధి వంచనకి గురైన వ్యక్తిలా కనిపించాడు.

కొద్ది దూరంలో కూర్చున్న మండోదరి, ఈ కొత్త పరిణామం చూసి నివ్వెర పోయింది. ఆమె లేచి నిలబడబోయింది, కానీ బ్రాహ్మణులు ఆదేశించటంతో ఆమెని సైనికులు వెనక్కితోసి కూర్చోపెట్టేశారు. వితంతువులు సూర్యుడి వెలుగులోకి బైటికి రాకూడదని కరకుగా ఆజ్ఞాపించారు వాళ్లు. తన భర్త అంతిమయాత్రని చూసేందుకు అనుమతించి అప్పటికే వాళ్లు మహాపాపం చేశారు. ఆమె వెలుతురులోకి వచ్చే చివరిరోజు ఇదే. చితిని పేర్చి కర్రకి గుచ్చిన రావణుడి తలని దించి దానిమీద ఉంచారు. రావణుడి శరీరమేనని భావించి ఒక మొండాన్ని నలుగురు నల్లవాళ్లు, నా తోటి అస్పృశ్యులు, మోసుకుని వచ్చారు.

సూర్యాస్తమయం అయింది. పడమటి ఆకాశంలో నల్లని మేఘాలు కమ్ముకు వచ్చాయి. సాయంకాలాలు వర్షం కురిసే రుతువు అది. భూమి తన మంగళస్నానానికి సిద్ధంగా ఉంది. చేతిలో నిప్పముట్టించిన కర్రతో విభీషణుడు తన సోదరుడి చితి వద్దకు నడిచాడు. రావణుడి చితి పక్కనే మరొక చితి పేర్చమని విభీషణుడు ఆజ్ఞాపించాడు. రెండో చితి పవిత్రకార్యం కోసం కాబట్టి దానికి చందనపు చెక్కలని ఉపయోగించమని చెప్పాడు. మేము ఊపిరిబిగబట్టి చూస్తున్నాం. రెండో చితి కూడా త్వరగా సిద్ధం చేశారు. ఆమె పవిత్రురాలో కాదో లోకానికి చాటే ఆ రెండో చితి వైపుకి ప్రత్యేకంగా ఎంపిక చేసిన అసుర స్త్రీలు సీతని లాక్కుని వచ్చారు. ఏం జరుగుతోందో మాకు అర్థం కాలేదు. చిరకాలంగా దేవతా స్త్రీల పవిత్రతని పరీక్షించే ఈ పద్ధతి ఏమిటి? బ్రాహ్మలు బెకబెకలాడుతూ మంత్రాలు చదువుతూ అందరి మీదా నీళ్లు చిలకరిస్తూ ఉంటే, విభీషణుడు రావణుడి చితి చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణలు చేశాడు. కొన్ని నీటి చుక్కలు నామీద కూడా పడ్డాయి.

అసంకల్పితంగా వాటి వాసన చశాను. ఆ నీళ్లు దుర్గంధపూరితంగా ఉన్నాయి. నా పక్కనున్న వాడు నాతో రహస్యంగా, "ఇది గోమూత్రం, ఇందులో గోమయం కూడా కలిపారు. శుద్ధి చేసేందుకు వాళ్లు దీనిని ఉపయోగిస్తారు," అన్నాడు. అస్పృశ్యులమైన మేము గోమయంతో పావనమయాం.

సన్నగా చినుకులు కురవసాగాయి. ఇంకాసేపటిలో ఆకాశం విచ్చుకుంటుంది. మెరుపులు మెరిసి ఆకాశాన్ని ముక్కలుగా విడదీస్తాయి. చితికి నిప్ప పెట్టే ముందు విభీషణుడు నాటకీయంగా జ్వాలని పైకి ఎత్తి, "ఒక నిరంకుశుడి, రాక్షసుడి శకం ముగిసింది. ధర్మానికి ఉన్న శక్తిని నిరాకరించేవారికందరికీ ఇతని జీవితం ఒక గుణపాఠం కావాలి. ధర్మానికి మారురూపం వంటి వాడు అయోధ్యా రాజ్యప్రభువు, శ్రీరామచంద్రుడు. అసురుల దుష్టప్రవర్తనకీ, నైతిక పతనానికీ ఈ రోజుతో రుణం తీరింది. విష్ణువు అవతారమైన శ్రీరాముడు తన అపారమైన దయని మన మీద కురిపించే ఈరోజు అన్ని రోజులకన్నా పవిత్రమైనది. రామచంద్ర ప్రభువు అంతులేని సానుభూతితో మన జీవితాలని ఉన్నతస్థితికి చేరుస్తాడు. పాపభూయిష్టమైన రావణుడి శరీరం బూడిదగా మారే వేళకి, అంధకారంతో నిండిన మనక్షితిజరేఖపై కొత్త ధర్మం ఉదయిస్తుంది. ఆ ధర్మం అనుసరించే ప్రతి వ్యక్తీ తన స్థానాన్ని తెలుసుకుంటాడు, జ్ఞానానికి విలువ ఉంటుంది, యోధుల నైపుణ్యానికి గౌరవం లభిస్తుంది, వ్యాపారంలో మెళకువలకి మెప్పు లభిస్తుంది. జీవితంలో సాఫల్యం సాధించేందుకు కష్టపడవలసిన పని లేదు, మన పొరుగువాడిని అధిగమించాలనే వెర్రి పోటీతత్వం కూడా మనకి ఉండదు. రావణుడి పాలనలో, కష్టపడి పనిచేస్తేనే తప్ప, ప్రతిభ ఉన్నంత మాత్రాన ఎవరూ సంతోషాన్ని సాధించలేరనే భావన ఉండేది. అతనిది దుష్టసమాజం, మనం అటువంటి ధోరణిని తొలగిద్దాం. ఈ క్షణం నుంచీ మనం చాలా తుచ్ఛమైన ప్రాణులమన్న విషయాన్ని విస్మరించం. దేవుడి సర్వోత్కృష్టమైన శక్తి ముందు మనం చేసే పనులూ, మన ప్రతిభా

పాటవాలూ ఎందుకూ పనికిరానివన్న విషయం గుర్తుంచుకుంటాం. ఆయన సానుభూతి నుంచీ, ప్రేమనుంచీ మన భౌతిక విజయాలూ, ఆధ్యాత్మిక సాఫల్యం ప్రవహించి వస్తాయి. దురదృష్టవశాత్తూ మీరు అస్పృశ్యులుగా జన్మిస్తే విచారించకండి. గత జన్మలో పాపాలు చేసినందువల్లే ఈ జన్మలో మీరు కష్టాలు అనుభవిస్తున్నారు. మీ గతజన్మ కర్మఫలం వల్లనే అస్పృశ్యుడిగానూ, శూద్రుడిగానూ జన్మించారు. మీ కర్తవ్యం నిర్వర్తించండి, విశ్వాసంతో మీ ప్రభువుని సేవించుకోండి, మీ కన్నా ఉన్నతస్థానంలో ఉన్నవారు గౌరవాన్నీ, ఐశ్వర్యాన్నీ అనుభవించటం చూసి ఈర్ష్య చెంది అత్యాశకి గురికావద్దు. అంతులేని సానుభూతీ, వివేకమూ ఆ దేవుడిలో ఉన్నాయి. వినయ విధేయతలతో నడుచుకున్నప్పుడే రాబోయే జన్మలో మీరు ఈ వర్ణవ్యవస్థలో ఒక మెట్టు పైకి వెళ్లేలా ఆయన చూస్తాడు, మీ పట్ల దయగా ఉంటాడు.

"ఈ సామాజిక వ్యవస్థని పరిరక్షించేవాడు విష్ణువు. ఈ వ్యవస్థకి భంగం వాటిల్లే ప్రమాదం సంభవించినప్పుడల్లా ధర్మాన్ని పునరుద్ధరించేందుకు మనలో ఒకడుగా మానవజన్మ ఎత్తి అవతార రూపంలో ఈ లోకానికి వస్తానని ఆయన వాగ్దానం చేశాడు. రావణుడూ, అతను స్థాపించిన ఆదర్శాలూ ప్రమాదకరమైనవి. అవి వ్యవస్థకి భంగం వాటిల్లజేశాయి. తనకే సొంతమైన ధైర్యసాహసాలతోనూ, శ్రమతోనూ, తెలివితేటలూ, చాతుర్యముతోనూ, కొద్దిమంది సాయంతో తను - కేవలం ఒక రైతు కుటుంబం నుంచి వచ్చిన సంకరజాతి కుర్రవాడు - లోకంలోనే అతి శక్తివంతమైన సామ్రాజ్యాన్నిస్థాపించానని రావణుడు అనవచ్చు. తాత్కాలికంగా అతను సాధించిన విజయం చూసి జనం అచ్చెరువొంది ఉండవచ్చు. కానీ నాకు దేవుడిలోనే నమ్మకం ఉంది. ప్రస్తుతం రావణుడు సాధించినదంతా నాదే. దీనికోసం నేను పాటు పడ్డానా? అద్భుతమైన తెలివితేటలని ఉపయోగించుకున్నానా? ప్రహస్తుడు, కుంభకర్ణుడు, రుద్రకుడి వంటి దుష్టులతో సాంగత్యం చేశానా? నేను చేసిన ఒకే ఒక పని, దేవుడిలో విశ్వాసం ఉంచటం.

రావణుడు మరణించాడు. అతని రాజ్యం, సంపదా అంతా ఇప్పుడు నాదే.

"ఒకానొకప్పుడు ఈ సామాజిక వ్యవస్థని అన్యాయంగా అపహరించిన ఒక రాజు పడమటి తీరాన్ని పరిపాలించేవాడు. అందరు మనుషులూ సమానం అని అతను మూర్ఖంగా అభిప్రాయపడేవాడు. ముచిరపట్టణం రాజధానిగా ఈ భూభాగాన్ని పరిపాలించిన బలి చక్రవర్తిని మీరు ఎరుగుదురు. అతను విష్ణువు ఏర్పరిచిన సామాజిక వ్యవస్థని ధిక్కరించాడు. ఆ కాలంలో అంత గొప్ప చక్రవర్తినీ ఒక బ్రాహ్మణ బాలుడు వామనుడు, పరాజితుడిని చేశాడు. ఆ వామనుడు వేరెవరో కాదు, విష్ణువు అవతారమే. అది రావణుడికి గుణపాఠమై ఉండవలసింది. ఒకానొకప్పుడు నేను అతన్ని సోదరుడిలా ప్రేమించాను. కాబట్టే రావణుడిని హెచ్చరించాను. కానీ మితిమీరిన అహంకారమూ, గర్వమూ వల్ల మంచి సూచనలని అతను వినిపించుకోలేదు. జీవితంలో మరీ ఎక్కువగా మునిగిపోయి మృత్యువు గురించి ఆలోచించలేదు. తన సేనలు తనని రక్షిస్తాయని అనుకున్నాడు. తన ప్రజలకి తాను మంచి జీవితాన్నిఅందించాననీ, అందువల్ల వాళ్లే తనని కాపాడతారనీ అనుకున్నాడు. మహాశివుడి ఆలయాలని గొప్ప శిల్పకళానైపుణ్యంతో నిర్మించినందుకు శివుడు తనని రక్షిస్తాడని అనుకున్నాడు. కానీ కాలం మృత్యురూపంలో ఎదుటికి వచ్చి నిలబడినప్పుడు అతని దగ్గర సమాధానం లేకపోయింది. దిక్కులేని దీనులూ, నిరుపేదలూ తపొప్పలు అర్థంచేసుకోలేరు. అందుచేత వాళ్లు తప్ప ఇంకెవరూ కూడా అతన్ని రక్షించేందుకు రాలేదు.

'రాముడు రాగానే నేను ఆయన పాదాలమీద పడ్డాను. ఆయనలోని దేవుడిని గుర్తించాను. వరుణుడూ, లంకిణీ, జంబుమాలీ వంటి పండితులూ, జ్ఞానులూ కూడా అదే పని చేశారు. ఇప్పుడు చూడండి, మాకు దానివల్ల కలిగిన ఫలితం. ప్రభుత్వోద్యోగులూ, వర్తకులూ, రక్షకభటులూ, రావణుడి సేనా వీళ్లందరూ ఇప్పుడు తమ పొరపాటుని గ్రహించి రాముడి పేరుతో నేను పరిపాలన కొనసాగిస్తే నాకు

పక్కబలంగా ఉంటామని ప్రమాణం చేశారు. ఇన్నాళ్లుగా రావణుడూ, అంతక్రితం బలిచక్రవర్తీ తమ ఊహల్లో ఏవేవో ఆదర్శాల గురించి కన్న కలలని తెలివితక్కువగా నమ్మిన మీరందరూ ఇకమీదట మన స్మృతులు నిర్దేశించిన జీవిత విధానాన్ని అనుసరించి జీవిస్తారని నమ్ముతున్నాను. దేవుడి ఆజ్ఞకి పూర్తిగా లొంగిపోతే తప్ప ఎవరూ మోక్షాన్ని సాధించలేరు. మహాముని మనువు బోధించిన ధర్మసూత్రాలు శాశ్వతమైనవి, దైవత్వంతో నిండినవి. ఈ సూత్రాలు జీవితంలోని ప్రతి పార్శ్వాన్నీ స్పృశిస్తాయి. పుట్టిన దగ్గరనుంచీ గిట్టేవరకూ ఈ ధర్మసూత్రాలు మీకు సరైన మార్గనిర్దేశం చేస్తాయి.

"దానిని ఎలా ఉపయోగించుకోవాలో తెలియనివారి చేతుల్లో ఉన్న జ్ఞానం చాలా ప్రమాదకరంగా మారుతుంది. ఇంతవరకూ అసురులు అందరికీ విద్యని అందించి పెద్ద తప్పు చేశారు. దుష్టులకీ, అజ్ఞానులకీ జ్ఞానాన్ని అందిస్తే కలిగే పర్యవసానం గురించి వాళ్లు ఆలోచించనేలేదు. ప్రతీవ్యక్తినీ సమానంగా చూసే పొరపాటు మేము చేశాం. కానీ ఇకనుంచీ పద్ధతులు మారిపోతాయి. ఈ పొరపాటుని ఇంక మేము కొనసాగించబోము. మొదటి మూడు కులాలకి మాత్రమే విద్య అందుకునే అర్హత ఉంటుంది. వాళ్ల వృత్తికి అవసరమైన మేరకే వాళ్లకి ఆ విద్య అందించబడుతుంది. మిగతా వాళ్లు తమ ప్రభువులని శ్రద్ధగా, నిజాయితీగా సేవించుకుంటూ, తమ కర్మ గురించి విచారించకుండా ఉన్నప్పుడే వాళ్లకి తరించే యోగం ఉంటుంది. ఈ సూత్రాలని విధించినది సాక్షాతూ ఆ మహావిష్ణువే. ఈ సూత్రాలని మార్చగలననీ, ధిక్కరించగలననీ ఎవరైనా అనుకుంటే, దాని పర్యవసానానికి అతనే బాధ్యుడు. ఆపదని ఎదుర్కొనే సాహసం ఉంటేనే ఆ పనికి తలపెట్టాలి."

విభీషణుడు ఆగి, ముఖం చిట్టించి జనంవైపు చూశాడు. మేము మా ముఖాల్లో ఏ భావమూ వ్యక్తం చెయ్యకుండా రాతి ప్రతిమల్లా కూర్చున్నాం. తరవాత పెదవులని నాలుకతో తడుపుకుంటూ అతను మళ్లీ ఇలా అన్నాడు, "ఈ భూమి పవిత్రంగా మారింది, ఎందుకంటే స్వయంగా మహావిష్ణువు ఇక్కడ అవతారమై వెలిశాడు. ఇక్కడి జనం

విధిని ధిక్కరించారు, దేవుళ్లని ధిక్కరించారు. రావణుడు ధీశాలి, కానీ అహంకారమూ, దురభిమానంతో తను విష్ణువుని ఎదిరించగలనని అనుకున్నాడు. రావణుడి దుష్ట మేధస్సు వల్ల వ్యాపించిన అస్తవ్యస్త పరిస్థితిని దేవుడు అంతమొందించాడు. వర్ణాశ్రమ ధర్మం అనే శాంతియుతమైన వ్యవస్థ పునరుద్ధరించబడింది. సంస్కృతం నేర్చుకునే వాళ్లతోనూ, వేదాలని వల్లించేవాళ్లతోనూ తాము సమానులమని మురికి కాలవలూ, మరుగుదొడ్లూ శుభ్రం చేసేవారెవరూ ఇకమీదట అనుకోరు. తాటికల్లు తయారుచేసే మనిషి, పట్టువస్త్రాలు అమ్మే వర్తకుడూ తనూ సమానులే అని అనుకోడు. నేలదున్నే వ్యక్తి కోశాగారంలో గణకుడితో తాను సమానమని అనుకోడు. ప్రతి వ్యక్తికీ ఒక స్థానం ఉంటుంది, ఆ స్థానం ఏమిటో అతనికి తెలుస్తుంది. ఒక గుణవంతురాలైన వితంతువు నడవడి ఎలాంటిదై ఉండాలి అనే విషయానికి ఉదాహరణగా మండోదరి ఇతరులకి దారి చూపింది.

"మహారాణికి కలిగిన విపత్తు దురదృష్టకరమే, రాముడు దానికి కారణమైన వారిని శిక్షించాడు. కానీ అంత ఘోరం జరిగిన తరవాత కూడా, నా సోదరుడు తన భార్యని స్వీకరించాడు. అది మాకు చాలా పెద్ద అవమానం. మిగతా అసురులలాగే స్త్రీ పవిత్రతనీ, పాతివ్రత్యాన్నీ పాటించాలన్న ఆలోచనకి అతను ప్రాముఖ్యం ఇవ్వలేదు. అంత జరిగాక కూడా అతను ఆమెని ఎలా స్వీకరించాడు? కానీ అతనికి మంచేదో చెడేదో తెలీలేదు. ఈ యుద్ధం అసలు ఎందుకు ప్రారంభమైంది? ఇంత వినాశనం జరగటానికి అసలు కారణమేమైనా ఉందా? దేవదేవుడు శ్రీరాముడికి సామంతుడిగా అతను రాజ్యాన్ని పరిపాలించి ఉండవచ్చు. నా సొంత చెల్లెలు, శూర్పణఖ వల్లే ఈ యుద్ధం ప్రారంభమైందని చెప్పేందుకు సిగ్గు పడుతున్నాను. అయినా తప్పంతా ఆమెదే అని కూడా అనను. మా సంస్కృతే అటువంటిది, స్త్రీలని విచ్చలవిడిగా తిరగనిచ్చి స్వేచ్ఛనిచ్చే సంస్కృతి మాది. అందగాడైన లక్ష్మణుడిని ఆకర్షించి తనవాడిని చేసుకోవాలని ఆమె ప్రయత్నించింది. ఒక వితంతువు తనతో మళ్లీ ప్రేమలో పడటం అనే సిగ్గుచేటు ప్రవర్తనని ఏ

పురుషుడూ సహించలేడు. ఆమె ముక్కూ, చెవులూ కోసి ఆయన ఆమెని కురూపిని చేశాడు.

"నీతిలేని మా సోదరికి దేవుడు నిర్దేశించిన ఆ స్థితిని అంగీకరించక రావణుడు శ్రీరామప్రభువు మీద యుద్ధం ప్రకటించాడు. ఎంత దురహంకారం, ఎంత దురభిమానం! ఇప్పుడు చూడండి, అతనికి ఎలాంటి గతి పట్టిందో. శూర్పణఖని నేను రాజ్యంనుంచి బహిష్కరించాను. ఆమె నా సోదరి, కానీ అసురులు తమ పాతపద్ధతులని విడనాడుతున్నారని నా ప్రభువుకి నిరూపించు కునేందుకే నేను అలా చేశాను. సముద్రానికి ఆవలివైపు అనాగరికులు ఉండే ప్రాంతానికి ఆమెని తీసుకువెళ్లి వదిలివస్తానని నా మిత్రుడు వరుణుడు నాకు వాగ్దానం చేశాడు. ఇప్పుడు ఆమె ఒక బిచ్చగత్తె, దిక్కూమొక్కూలేని స్త్రీ. బిచ్చం ఎత్తుకుని కడుపు నింపుకుంటోంది. నా సోదరి దుస్థితికి నేను విచారిస్తున్నాను, కానీ అది ఆమెకి తగిన శిక్షే. ఆ తరవాత మా అన్న, రాముడి భార్యని అపహరించాడు. సీత రావణుడి కుమార్తె అనీ, ఆమెని రక్షించేందుకే అతను ఆమెని అపహరించాడనీ జనం చెప్పుకోవటం నా చెవులదాకా వచ్చింది. అంతకన్నా గర్హించదగ్గ విషయం మరొకటి ఉండదు. నీచజాతిలో పుట్టిక ఒక అసురుడు దేవతల రాకుమార్తెకి తండ్రి కావటం ఏమిటి? రాముడు రావణుడి వంటివాడు కాడు. ఆయన తన ప్రియసతి, సీత కోసం యుద్ధం చేసి తన ప్రాణాలనీ, తనవారి ప్రాణాలనీ పణంగా పెట్టాడు. కానీ సీత కూడా పాపం చేసింది. ఒక దేవతా రాకుమారి అయినందువల్లనూ, శ్రీరాముడి భార్య అయినందువల్లనూ, సీత పవిత్రురాలని నేను నమ్ముతున్నాను. రావణుడికి ఆమెపైన అత్యాచారం చేసే ధైర్యం లేదు. కానీ పవిత్రమైన తన భార్య శరీరాన్ని కామంతో నిండిన రావణుడి కళ్లూ, మిగతా అసురుల కళ్లూ తడిమాయని రాముడికి తెలుసు. ఏ భర్త అలాంటి దానిని సహించగలడు? అత్యాచారానికి గురైన భార్యని స్వీకరించిన నా చనిపోయిన సోదరుడిలా కాకుండా, శ్రీరాముడు తన భార్య పాతివ్రత్యాన్నీ, పవిత్రతనీ లోకానికి నిరూపించి ఒక

ఆదర్శపురుషుడినని చాటుకోవాలనుకుంటున్నాడు. ఇది లోకంలో అందరికీ ఒక ఆదర్శాన్ని ప్రతిష్టించేందుకే తన భార్య శరీరంలో నుంచి ఆత్మలో నుంచి రావణుడివంటి పురుషులందరి కాముక భావాలనీ శాశ్వతంగా దగ్ధం చెయ్యటమే ఆయన ఉద్దేశం.

ఇది చాలా బాధాకరమైన వ్యక్తిగత వ్యవహారం, అయినప్పటికీ లోకమంతా అనుకరించదగ్గ ఈ గొప్ప ఉదాహరణ దేవతల రాజు ఈలోకానికి అందించాడు. అసురులలాగ కాకుండా దేవతలకి అగ్ని, జీవితం, ఈ రెండింటిలోని పవిత్రతా తెలుసు. అగ్ని పరమశ్రేష్టమైన దేవుడు. ఆయన ప్రాణాన్నీ, శక్తినీ అందిస్తాడు. అగ్ని అన్నిటినీ శుద్ధి చేస్తుంది. సీత అసురుల రాజ్యంలో నివసించింది, కామాతురుల దృష్టికి గురయింది, చాలా కాలం భర్తకి దూరంగా ఉండిపోయింది. ఆమె రావణుడి కుమార్తె అనేది నిరాధారమైన వదంతి. వీటన్నిటినీ అగ్ని ప్రక్షాళన గావిస్తుంది. మీ అందరి ఎదుటా అసురులూ, వానరులూ, వీళ్ల ఎదుటే కాక సమస్త లోకాల సమక్షంలో సీతాదేవి అగ్నిప్రవేశం చేస్తుంది. స్త్రీల పవిత్రతని పరీక్షించేందుకు ఈ అగ్నిపరీక్షని దేవతలు నిర్ణయించారు. నా సోదరుడి చితి సమీపంలో రగులుతున్న ఆ అగ్ని సీతమ్మ తల్లి ఎంత పవిత్రంగా ఉందో నిర్ధారిస్తుంది. ఆమె నిజంగా పతివ్రతా, పవిత్రురాలూ అయితే అగ్ని ఆమెకి ఏమీ హాని చెయ్యదు. అదే ఆమె అపవిత్రురాలయినట్టయితే అగ్ని దేవత ఆమెని దహిస్తుంది". జనం భయంతో నోటమాట రాకుండా బిగుసుకుపోయారు. అందరూ తలతిప్పి ఉన్నతాసనం మీద కూర్చున్న రాముడివైపు చూశారు. ఆయన కళ్లు దించుకుని కూర్చున్నాడు. ఆయన బాధతో, అధైర్యంతో కూర్చుని ఉన్నట్టు నాకు స్పష్టంగా కనిపించింది. అయినా కూడా ఆయన లేచి నిలబడి, "చాలించండి! నాకు నా భార్యమీద నమ్మకం ఉంది!" అనలేదు. హనుమంతుడి ముఖంలో ఒత్తిడీ, భయం కనిపించాయి కానీ విభీషణుడు మాత్రం సంతోషంగా తన కర్తవ్యం నిర్వర్తిస్తున్నట్టు కనిపించాడు. లక్ష్మణుడి ముఖం పాలిపోయింది, మనసులో కంగారుగా ఉన్నప్పటికీ మనోభావాలని దాచుకునేందుకు తనదైన పద్ధతిలో

ఎప్పటిలాగే కోపం ముఖంతో ఉన్నాడు. మండోదరి క్షౌరం చేయబడ్డ తన తలమీద తెల్లటి ముసుగు కప్పుకుని ఒక మూల కూర్చుని దుఃఖాన్ని ఆపుకోలేక వెక్కివెక్కి ఏడుస్తోంది.

వాతావరణంలో విపరీతమైన ఒత్తిడి చోటు చేసుకుంది, దానికి తగ్గట్టే ఆకాశంలో మొదటి మేఘగర్జన వినిపించింది. నల్లటి మేఘాలతో ఉరుములు మెరుపులతో దీవివైపు పెద్ద వాన రాబోయే సూచనలు కనిపించాయి నాకు. సూర్యుడు మబ్బులవెనక దాక్కుని వాటి అంచులని వెండిలా మెరిపిస్తూ తన ఉనికిని చాటుకుంటున్నాడు. బలంగా గాలి వీచి కొబ్బరి చెట్లు ఊగసాగాయి. పెద్ద ఎత్తున అలలు ఎగసి తీరాన ఉన్న బండరాళ్లమీద విరిగిపడసాగాయి. వాళ్లు సీతని రగులుతున్న అగ్నివైపుకి లాక్కువెళ్తూ ఉండటం చూసి జనం లేచి నిలబడ్డారు. ముందు ఆమె రోదిస్తూ తనని కాపాడమని భర్తకి మొరపెట్టుకుంది. కానీ తన భర్త తనని చెయ్యమని అంటున్న పనిలోని రాక్షసత్వం ఆమెకి అర్థం అయినవెంటనే, తను పవిత్రురాలు అని తనని నిరూపించుకోమని అడుగుతున్నాడని తెలియగానే, ఆమె వేలాడబడిపోతూ అతనివైపు జాలిగా చూసింది. అతను చూపులు మరల్చుకుని ఆమెనీ, తన సైనికులనీ, మమ్మల్నీ దాటి ఎక్కడో శూన్యంలోకి చూడసాగాడు. అతని కళ్లలో నీళ్లు చిప్పిల్లాయి. అతనికీ, విసుగ్గా ముఖం పెట్టిన అతని సోదరుడికీ పక్కనే ఉన్న బ్రాహ్మణులు సంస్కృతంలో మంత్రాలు గట్టిగా వల్లిస్తూ, జనం మాటలనీ, మండోదరీ, మిగతా స్త్రీల ఏడుపులనీ వాళ్ల వెక్కిళ్లనీ వినిపించనీయలేదు.

సముద్రతీరాన కొత్తగా పట్టాభిషిక్తుడైన అసుర రాజు, రాముడి సామంతుడు, విభీషణుడు చేతిలో వెలుగుతున్న కాగడాతో, పెదవులమీద చిరునవ్వుతో నిలబడ్డాడు. అతని ఎదుట ఒకప్పుడు అసురుల రాజైన రావణుడి శవం ఉంది. క్రూరజంతువులు కొరికివేసిన అతని ముఖమూ, కుళ్లిపోతున్న మెండెం నుంచి విడివడిన తలా చితిమీద ఉన్నాయి. అతని పక్కనే పవిత్రత గురించి తెలిసిన అగ్నిజ్వాలలు తమ వంద చేతులు చాచి రగులుతూ ఉన్నాయి.

అసుర సైనికులు సీతని విభీషణుడి దగ్గర వదిలి వెనక్కి నడిచారు. జనంలో కుతూహలం ఆకాశాన్నంటింది. ఇంతక్రితం ఎన్నడూ వాళ్లు ఇలాంటి దృశ్యం చూసి ఉండలేదు. ఉవ్వెత్తున లేచి పడుతున్న సముద్రాన్ని సూర్యాస్తమయం ఎర్రబడేట్టు చేసింది. వెండి అంచులున్న నల్లటి మేఘాలు ఆకాశాన్ని ఆవరించి భయంకరమైన సర్పాలతో లోకం నిండిపోయినట్టూ, అవి మెలికలు తిరుగుతూ తగ్గిపోతున్న సూర్యరశ్మిని రకరకాల రంగుల్లో ప్రతిబింబిస్తున్నట్టూ భ్రమ పుట్టిస్తున్నాయి. "ఇంతటితో రావణుడి దుష్ట పరిపాలనని ముగిస్తున్నాను. దేవుళ్లని ఎదిరించే సిగ్గుమాలిన రాజు నిర్భయత్వానికి ఇదే తుది క్షణం. ఈ లోకాన్ని దాదాపు నాశనం చేసినంత పనికి ఒడిగట్టిన ఒక రాక్షసుడి వ్యభిచార జీవితానికి మంగళం పాడుతున్నాను. శ్రీరాముడికి జయము, జయము...!"

విభీషణుడు అక్కడ ఉన్న వారితో గర్జించినట్టుగా అలా అని, వర్షం కురుస్తూ ఉండగా తన సోదరుడి చితికి నిప్ప ముట్టించాడు. రావణుడు బూడిదగా మారటం చూస్తూ ఉంటే నా మనసుని వివరించలేని దుఃఖం లోతుగా గాయపరిచింది. ఒక యుగం అంతమయింది. వానరులు పెనుకేకలతో హర్షం వ్యక్తం చేస్తూ ఉంటే, అసురులు సిగ్గుతో తలలు వంచుకున్నారు. నమ్మకద్రోహం జరిగిందన్న విషాదంలో కూరుకుపోయి, తన దుఃఖంతో ఏ భావమూ లేకుండా సీత తన తండ్రి చితి పక్కన నిలబడింది.

"అసురుల రాజుగా నేనొక విషయాన్ని వెల్లడి చెయ్యదలిచాను. ఈ దినాన్ని ఇకమీదట ప్రతి సంవత్సరమూ రాజ్యంలోని అన్ని గ్రామాలలోనూ విజయోత్సవ దినంగా జరుపుకుంటామని చాటుతున్నాను. ఈ రోజు విష్ణువు అవతారమైన మన ప్రభువు శ్రీరామచంద్రుడు రావణుడు అనే దుర్మార్గం పైన సాధించిన విజయాన్ని స్త్రీ పురుషులూ, పిల్లలూ, అందరూ గుర్తుచేసుకుంటారు. ప్రతి ఏటా ఈరోజున రావణుడు కొన్ని లక్షల మరణాలు పొందాలి. ఆ మరణాలు ప్రతి ఇంటా, ప్రతి వీధిలోనూ ఉత్సవంగా జరపబడాలి..." విభీషణుడు

మండుతున్న కాగడాని ఆకాశం వైపుకి ఎత్తాడు. వానరులూ, కొందరు అసురులూ ఉత్సాహంగా హర్షధ్వానాలు చేశారు.

ఆకాశం ఆగ్రహంతో గర్జించి అతనికి సమాధానం చెప్పింది. వానజల్లు కురవసాగింది. చితి సంకోచిస్తూ మండసాగింది. నల్లటి దట్టమైన పొగ వంపులు తిరుగుతూ పైకి లేచింది. గాలికి నిప్పురవ్వలు పైకి లేచాయి. మధ్యమధ్య పొగ రూపం కోల్పోతూ, మళ్లీ రూపాన్ని సంతరించుకుంటూ పైకి పోసాగింది. "ఇక ఇప్పుడు గౌరవనీయురాలు, మన ప్రభువుకి ప్రియమైన భార్య అయిన సీత అగ్ని పరీక్షా సమయం ఆసన్నమైంది," అని ప్రకటించాడు విభీషణుడు. ఒక అసుర భటుడు మండుతున్న చితిలో మరికొంత నేతిని పోశాడు. మంటలు ఎగసిపడి గాలిలో చిటపటలాడాయి. తన భర్తకి పవిత్రురాలినని నిరూపించుకునేందుకు తాను ప్రవేశించవలసిన, భగభగమండే ఆ మంటలని చూసి సీత కాస్త వెనుకంజ వేసేసరికి, మేమందరం హడిలిపోతూ కుతూహలంగా ఏం జరుగుతుందా అని చూడసాగాం. రాముడి దృష్టిని ఆకర్షించేందుకు ప్రయత్నిస్తూ సీత అతనివైపు చూసింది. కానీ అందరు దేవుళ్లలాగే, అతని అవసరం ఎంతో ఎక్కువ ఉన్న సమయంలోనే, ఆ దేవుడు కూడా చూపులు మరల్చుకున్నాడు. ఇక వేచి ఉండటం సాధ్యంకాక విభీషణుడు మరికొంత నేతిని చితిలో పొయ్యమని ఆదేశించాడు. సీత ఇంకా కొన్ని క్షణాలు అలాగే నిలబడింది. ఆ తరవాత నెమ్మదిగా నేలమీదికి ఒరిగిపోయింది. జనం నిశ్శబ్దంగా ఉండిపోయారు, ఆమె అగ్నిపరీక్ష నుంచి తప్పుకుంటోందా? అన్న అయోమయంలో పడ్డారు.

నేను కోపంగా, "ఏమిటిదంతా? ఒకవేళ ఆమె అపవిత్రురాలైనా, మండుతున్న అగ్నిలోకి ప్రవేశించినంత మాత్రాన దాన్ని నిరూపించటం ఎలా సాధ్యం? ఎవరు పవిత్రులో ఎవరు కాదో అగ్ని తెలుసుకోగలదా?" అన్నాను.

నా పక్కన ఉన్న వ్యక్తి నా మాటలకి కోపం తెచ్చుకుంటూ, "అయితే అక్షరం ముక్క రాని బైతువి నీకు అగ్ని గురించి అంతా తెలుసన్నమాట!

పండితులైన బ్రాహ్మణులు ఈమాట చెప్పారు. వాళ్లని ప్రశ్నించేందుకు మనమెవరం?" అని అరిచాడు. కొంతమంది అతని మాటలు నమ్మలేదు కానీ ఎక్కువమంది అతనితో ఏకీభవించినట్టు తలలు ఊపారు. ఆ మూర్ఖులతో మాటల్లో పడి అక్కడ జరుగుతున్నది కొంత గమనించలేదు నేను.

సీత లేచి నిలబడింది. మళ్లీ ఏదో జరగబోతోందని జనానికి అనిపించింది. ఇంతలో హఠాత్తుగా శక్తినంతటినీ కూడదీసుకుని ఆమె మండే అగ్నివైపు పరిగెత్తింది. మేము నిజంగా విన్నామో లేక నేను విన్నానని ఊహించుకున్నానో తెలీదు కానీ ఆమె అగ్నిలోకి దూకే ముందు "నాన్నా..." అని పిలిచినట్టు వినిపించింది. జనం ఊపిరి బిగబట్టి చూడటం మొదలుపెట్టారు. సరిగ్గా అదే సమయానికి ఆకాశం పగిలినట్టు కుంభవృష్టి కురవసాగింది. ఈదురుగాలి తుఫానుగా మారింది. కొబ్బరిచెట్లు ఊగి ఊగి వంగిపోయాయి. కొబ్బరి మట్టలు - నీటిలో మునిగిపోతున్న మనిషి చేతుల్లా -పిచ్చిగా ఊగిపోసాగాయి. పట్టపగలే కారుచీకటి అలుముకున్నట్టు అనిపించింది. మొరిసే మెరుపుల వెలుగులో అందరూ భూతాల్లా కనిపించసాగారు. జనం తమ రాజు చితివైపు తోసుకెళ్తూ అదుపు చేసేందుకు వీలులేనంతగా విజృంభించారు. రక్షకభటులు జనాన్ని వెనక్కి నెట్టసాగారు, అక్కడ పరిస్థితి అల్లకల్లోలంగా తయారైంది. చితి ఆరిపోయింది. హనుమంతుడు సీతని ఎత్తుకుని రాముడి వద్దకు తీసుకెళ్లాడు. ఆమె వేలాడిపోతున్నట్లు ఉన్నా, ఎంతో అనుభవం ఉన్న నా కళ్లకి ఆమె జీవించే ఉందని అర్థమైంది. అంటే, మొత్తం మీద ఆమె పవిత్రురాలే అన్నమాట!

వింధ్య పర్వతాలలో అసురుల ముఖ్యులు చంపమని ఆజ్ఞాపిస్తే ఆమెని ఒక చిన్న మూటలా నా చేతులతో ఎత్తుకుని వెళ్లటం గుర్తిచ్చింది నాకు. ప్రధాన పాత్రధారులందరూ మరోసారి పండగ జరుపుకునేందుకు కోటలోకి వెళ్లిపోగానే జనం కూడా అక్కడినుంచి నిష్క్రమించారు. జనం పల్చబడేదాకా అలా కుండపోత వర్షంలో తడుస్తూ అక్కడే నిలబడ్డాను.

తరవాత నెమ్మదిగా రావణుడి చితివైపు నడిచాను. ఇంకా వర్షం పడుతోంది కాని ఉధృతి తగ్గింది. చితి పాడయిపోయింది, బూడిదా, బురదా, పైకి పొడుచుకొచ్చిన సగంకాలిన ఎముకలూ, పుర్రె అడ్డదిడ్డంగా ఉన్నాయి. ఏం చెయ్యాలో పాలుపోక అలాగే నిలబడిపోయాను. తరవాత ఆ మహనీయుడైన అసుర చక్రవర్తి అవశేషాలని సుడులు తిరుగుతున్న సముద్రంలో పడేటట్టు కాలితో తన్నాను. కొంతసేపు గడిచాక నిద్రపోయేందుకు ఇంటికి బైలుదేరాను.

50. జీవితం మళ్లీ మొలకెత్తింది

భద్రుడు

రావణుడు మరణించాక అసురుల జీవితం కొన్ని నెలలపాటు దుర్భరంగా గడిచింది. కొత్తగా ఏర్పడిన కులవ్యవస్థ ఎవరికీ సరిగ్గా అర్థం కాలేదు. కులాలమధ్య కుమ్ములాటలు ప్రారంభమయాయి. అన్నిటికన్నాపైకులంగా పరిగణించబడుతుంది అనుకున్న కులంతో సంబంధం పెట్టుకునేందుకు ప్రతీ కుటుంబమూ ప్రయత్నించ సాగింది. నాలుగు వర్గాల ఆధారంగా స్పష్టమైన విభజన జరిగిఉంటే, కులాలని గుర్తించటం అంత కష్టం అయిఉండేది కాదు. వర్గశ్రేణి క్రమపద్ధతిలో ఉండి ఉంటే దాన్ని పాటించటమో, దానికి ఎదురు తిరగటమో సాధ్యమయేది. కులాలనీ, వాటిలో మళ్లీ శాఖలనీ సృష్టించిన వాళ్లు మేధావులో, లేక తికమక ఆలోచనలు కలవారో చెప్పలేను, కానీ అది అందరినీ అయోమయానికి గురిచేసింది. సమాజాన్ని లక్ష ముక్కలుగా విడగొట్టింది. బ్రాహ్మణులు అందరికన్నా ఉన్నతస్థానంలో ఉన్నా రన్నది స్పష్టమైంది. నేను చాకలి కులానికి చెందినవాడిననీ, కంసాలి, వడ్రంగి మొదలైన కులాలవారికన్నా నాది తక్కువ కులమే అయినా సంచార గాయకులూ, కట్టెలు కొట్టేవాళ్ళూ, కుమ్మరులూ లాంటివాళ్లు నాకన్నా తక్కువ కులాలనీ తెలుసు కునేందుకు నాకు దాదాపు మూడునెలలు పట్టింది. నాకన్నా పై కులాలవాళ్లు వీధుల్లో సంచరిస్తున్నప్పుడు నేను వీధుల్లో నడవటానికి వీలులేదు. కానీ ఒక కుమ్మరి నా దారికి అడ్డువస్తే నేను అతన్ని కాలితో తన్నవచ్చు. ఒక కట్టెలుకొట్టే వాడిని నేను తాకితే అపవిత్రుడినైపోతాను. అదే నేను ఎప్పుడైనా వడ్రంగిని తాకితే అతన్ని అపవిత్రుడిని చేసే ప్రమాదం ఉంది. ఈ అట్టడుగు కులాలకి చెందిన వాళ్లు ఎవరూ కూడా వీధుల్లో నడవరాదు, మంచి దుస్తులు ధరించరాదు, అందమైన ఇళ్లలో ఉండరాదు, దేవాలయాలలో వాళ్లకి

ప్రవేశం నిషిద్ధం. అవన్నీ మిగతా మూడు కులాల వాళ్లకి మాత్రమే అందుబాటులో ఉండగలవు. అదొక వికృతమైన వ్యవస్థ, మనిషి తన కిందివారిని అవమానించే నీచాతినీచమైన స్వభావంమీద ఆధారపడి ఉంటుంది అది. నా పై కులం వాళ్లు నన్ను ఎంత అవమానించినా నేను భరించవలసిందే, ఎందుకంటే నాకన్నా తక్కువ కులం వారిని చిత్రహింసలు పెట్టే హక్కు నాకుంది కనక, ఇదికాక పిశాచంలా పట్టిపీడిస్తున్న పేదరికం అసలే యమయాతనకి గురిచేస్తూంటే అసురులు పూర్తిగా ధైర్యాన్నీ, ఉత్సాహాన్నీ కోల్పోయారు.

ఇలా తొమ్మిది నెలలు గడిచాక దక్షిణ ప్రాంతాన్ని భయంకరమైన కరువు తన పిడికిట్లో బంధించింది. మేమున్న దీవి కూడా దాని ప్రభావానికి లోనయింది. సముద్ర జలాలని దాటివెళ్లిన వాళ్లు కులబహిష్కరణకి గురవుతారని బ్రాహ్మణులు ప్రకటించటంతో వర్తక వ్యాపారాలు దెబ్బతిన్నాయి. ఒకరకంగా చెప్పాలంటే అవి పూర్తిగా ఆగిపోయాయి. ఇదే అదనుగా చేసుకుని చైనీయులూ, పసుపురంగు జుట్టు ఉన్న అనాగరిక జాతులూ సుగంధద్రవ్యాల వ్యాపారాన్నీ, పట్టువంటి నాణ్యమైన వస్తువుల వర్తకాన్నీ చేజిక్కించుకున్నారు. తమకి కొత్తగా దొరికిన సదుపాయాలనీ, హక్కులనీ వదులుకోవటం ఇష్టంలేని వర్తక సమాజం సముద్రాన్ని దాటటానికి నిరాకరించారు. కొద్ది కాలానికే ఎవరికీ తినటానికి తిండికూడా లేని పరిస్థితి ఏర్పడింది. అయినప్పటికీ విభీషణుడు పంపే పన్ను వసూలు చేసే అధికారులు ఎంతమాత్రం జాలి చూపించలేదు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన దానిలో చివరి ముక్కదాకా వసూలు చేసుకునే వెళ్లారు. నీళ్లు వృథాగా కారిపోతున్న ఆనకట్టలనీ, కాలవలనీ బాగుచేసి గ్రామసీమల్లో మళ్లీ వ్యవసాయాన్ని ప్రారంభించే అద్భుతమైన ప్రయత్నం చెయ్యగల వ్యక్తి ఒకడు ఉన్నాడు. కానీ మతిలేని ఆ వెర్రి శాస్త్రజ్ఞుడు మయుడు ప్రస్తుతం గొలుసులతో కట్టివేయబడి చీకటికొట్లో మగ్గుతున్నాడు. ఆయన సిద్ధాంతాలని చూసి బ్రాహ్మణులు నవ్వారు. ఆయన సాధించినదంతా అసురుల హానికరమైన ఇంద్రజాలం ఫలితమే అని ప్రకటించారు.

అవి నిజంగా చీకటి రోజులు. మరణం తప్ప తప్పించుకునేందుకు మరో మార్గం కనిపించలేదు. వారానికి ఒక పూట తిండి దొరికినా అదృష్టవంతులమే అనుకోసాగాం. రావణుడి మరణం తరవాత నెలకొన్న అస్తవ్యస్త స్థితిలో నేను దొంగిలించిన దుంగలతోనూ, కర్రసామానుతోనూ ఒక పాక కట్టుకోగలిగాను, అదొక్కటే నాకు జరిగిన మంచి. రావణుడి శవంమీద నుంచి తీసుకున్న ఆభరణాలని నా ఇంటిలోపల పాతిపెట్టాను. వాటిని బైటికి తీసేందుకు భయం వేసింది. చాకలి కులంలోని మనిషి దగ్గర విలువైన వస్తువులు ఉండకూడదు. తను సింహాసనం ఎక్కిన మొదటివారంలోనే విభీషణుడు తక్కువ కులాల వారి ఆస్తినంతా లాగేసుకున్నాడు. కానీ చాలామంది తమ ఆస్తులని నాలాగే పాతిపెట్టుకున్నారు.

అన్నీ కోల్పోయామాని అనుకుంటూ ఉండగా ఒక వదంతి రూపంలో చిన్న ఆశాకిరణం మెరిసింది. సుదూరాన ఉన్న తూర్పు ప్రదేశాలకి వరుణుడు చట్టవిరుద్ధంగా జనాన్ని తీసుకువెళ్తున్నాడని తెలిసింది. వరుణుడిలాంటి వారిని వేదాలు తాకలేవు, బ్రాహ్మణులు వాళ్లని సమాజంలోనుంచి బహిష్కరించలేరు. కుబేరుడూ, రావణుడూ, రాముడూ... వీళ్లలో రాజు ఎవరైనప్పటికీ అతను ధనం కూడబెట్టగలడు. అతను సేవించే దేవుడు ఒక్కడే - అదే ధనం. మొదట్లో నేను నమ్మలేదు, కానీ ఆకలి బాధ పెరిగి, నా భార్య ఎత్తి పొడవటం భరించశక్యంకాక పోయేసరికి, నేనూ ఒకసారి ప్రయత్నించి చూద్దామని అనుకున్నాను. ఈ ప్రదేశం విడిచి మరోచోటికి వెళ్లాలని అన్నానోలేదో, దాని ఏర్పాట్ల చూసేందుకు ఒక కార్యకర్త నా దగ్గరకి వచ్చాడు.

అతను మధ్యవయస్కుడు, బహుశా నా వయసే ఉంటుందేమో. కానీ నాలాగ అతను పేదరికంతోనూ, ఆకలితోనూ బాధపడకపోవటంవల్ల నేను అతనికన్నా పెద్దవాడిలా కనిపించి ఉంటాను. అతను నన్ను పెద్దాయనా? అని పిలవటం నాకు విసుగునీ, నా భార్యకి నవ్వునీ తెప్పించింది. అతను కుబేరుడి ఆస్థానంలో

ప్రభుత్వోద్యోగిగా ఉండేవాడు, ప్రస్తుతం విభీషణుడి పరిపాలనలో ఉన్నతాధికారి. కొత్తగా ఏర్పడిన కులవ్యవస్థకీ, దాని నియమాలకీ తాను పెద్ద ప్రాముఖ్యం ఇవ్వననీ, ఉదారవాదిననీ అన్నాడు. కానీ తను నాకన్నా కొన్ని మెట్లు పైకులం వాడు కనుక, ముఖ్యంగా తన భార్యకి ఇటువంటి పట్టింపులు ఉన్నాయి కనుక, నా ఇంట్లోకి రానని అన్నాడు. ఒక చాకలి తయారుచేసిన పదార్థాలు తను తింటే తన భార్య ఊరుకోదని చెప్పి, నేను అతని ముందు ఉంచిన ఆహార పదార్థాలని కూడా అతను తాకలేదు. నేను కోపంతో రగిలిపోయాను, కానీ నా భార్యకి ఇదేమీ పట్టలేదు.

అయిష్టంగానే ఇంటికి తిరిగివెళ్లి, అరగంటసేపు నేలని తవ్వి, రావణుడి ఆభరణాలని వణికే చేతులతో తీసుకెళ్లి ఆ పరమలోభికి ఇచ్చేశాను. ఆ పని చేస్తున్నంతసేపూ నా మనసు రగిలిపోతూనే ఉంది. వెన్నెలలో ఆ బంగారం తళతళ లాడుతూ ఉంటే ఆ కార్యకర్త కళ్లు కూడా మెరిశాయి. అంతవరకూ అతను నా భార్యతో రాజ్యంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులగురించీ, మధ్యవర్గం కుటుంబాల జీవితం కష్టాలతో నిండి ఉండటం గురించీ, పెరిగే ధరలూ, చదువు సంధ్యలకి ఖర్చుపెట్టవలసి వస్తున్న పెద్ద మొత్తాల గురించీ మాట్లాడుతూ ఉండిపోయాడు. ఆభరణాలని చేతిలోకి తీసుకుని వాటి బరువుని అంచనా వేశాడు. వెంటనే అతని ముఖం చిరునవ్వులతో నిండిపోయింది. అంతా నిర్ణయం అయిపోయింది. ఇక రెండు రోజులుపోయాక సముద్రం మధ్యలో లంగరుదించి ఉన్న ఓడ దగ్గరకి ఒక చిన్న నావ మమ్మల్ని తీసుకువెళ్తుంది. ఓడ ఎక్కటంవరకే మేము చెయ్యవలసింది. తరవాత మేము చక్కటి సౌకర్యాలతో సుఖంగా ప్రయాణం చేసి సుదూర తూర్పు ప్రాంతాలకి చేరుకుంటాం అని నమ్మకంగా చెప్పాడు.

నందనవనానికి వెళ్లేందుకు అనుమతి పత్రం లభించిందని విన్నాక త్వరగా మా దగ్గరున్న నాలుగు వస్తువులూ సర్దుకుని, ఒక మూటగా కట్టి నది దగ్గరకి నడిచాం. అక్కడ పడవ మాకోసం వేచి ఉంది. ఇంకొక

జంటకూడా మాతోబాటు పడవలోకి ఎక్కింది. పడవ నెమ్మదిగా నదీముఖంవైపు కదిలింది. ప్రవాహం దిశగా వెళ్లసాగింది. నేను నివాసం ఏర్పరుచుకుని, నా జీవితంలోని ఎక్కువ భాగం గడిపిన లంక నెమ్మది నెమ్మదిగా నాకు దూరం కాసాగింది. రకరకాల భావోద్వేగాలతో నోట మాట రాక, కూర్చుని ఉండిపోయాను. చుట్టూ అంతమంది ఉన్నా ఒంటరితనం అనిపించింది. అందరూ ఎవరి ఆలోచనల్లో వారు మునిగి ఉండిపోయారు. ఏవేవో కలల్లో తేలిపోయారు.

దూరంగా ఒక పెద్ద ఓడ కనిపించింది. నెమ్మదిగా మా పడవ దాని దగ్గరకి చేరుకుంది. దానిలోనుంచి నీళ్లలోకి ఒక తాటినిచ్చెన వేలాడుతూ ఉంది. ఒక్కొక్కళ్లుగా మమ్మల్ని పైకి లాగారు. కొంతసేపటికి ఒక వ్యక్తి వచ్చి మమ్మల్ని గదులలోకి పంపాడు. మాతో ఉన్న జంటని కబుర్లలో పెట్టి, ఈ మధ్యనే వాళ్లకి వివాహం అయిందని తెలుసుకున్నాను. ఆ పిల్ల సిగ్గుపడుతూ కూర్చుంది. ఆమె కళ్లు చాలా అందంగా ఉన్నాయి. ఆ యువకుడు అమాయకంగానూ అందంగానూ ఉన్నాడు. వాళ్లు తమ కొబ్బరితోటని అమ్మి ఓడలో ప్రయాణం చేసేందుకు రుసుము చెల్లించారు. ఆ అమ్మాయి పేరు అరసి, అబ్బాయిపేరు శివ అని తెలిసింది. మాకు గదులు కేటాయించిన వ్యక్తి రాగానే మాకు లంకలో అధికారి ఇచ్చిన తాళపత్రాలని మర్యాదగా అతనికి అందించాం. అతను ముఖం చిట్టించి, "నీ కులం ఏమిటి?" అన్నాడు శివతో,

"దాని విషయం మీకెందుకు?" అన్నాడు శివ విసుగా,

"మీరు చూసేందుకు నల్లగా, అసహ్యంగా ఉన్నారు. మీరు అస్పృశ్యులేమో అని అనుమానంగా ఉంది. ఓడలోకి మిమ్మల్ని అనుమతించను. పై కులం వాళ్లు అభ్యంతరం చెపుతారు."

"ఏమిటి మీ ఉద్దేశం? ఈ ప్రయాణం చేసేందుకు మేము పూర్తి రుసుము చెల్లించాం కదా?" శివ తొందరపడి మూర్ధంగా ఏదైనా అనే లోపల నేను కల్పించు కున్నాను.

"నాకు తెలీదు, ఎక్కడో పొరపాటు జరిగినట్టుంది. మీ రుసుము

మీకు వెనక్కి ఇస్తాం. మిమ్మల్ని ఈ ఓడలో ప్రయాణించేందుకు అనుమతించలేను. పడవ ఇంకా వెనక్కివెళ్లిపోలేదు కనుక మీరు ఓడ దిగిపోవచ్చు. లేకపోతే తీరందాకా ఈదుకుంటూ వెళ్లవలసి వస్తుంది." అనేసి ఆ వ్యక్తి వెళ్లిపోయేందుకు వెనుదిరిగాడు.

"నీ హారం నాకియ్యి" అంది నా భార్య అయోమయంగా చూస్తున్న అరసితో, తనవద్దనున్న ఒకే ఒక విలువైన వస్తువుని అయిష్టంగా మెడలోంచి తీసి ఆమె మాలకి ఇచ్చింది. మాల దాన్ని వెంటనే నా చేతికి ఇచ్చి "అతన్ని కాళ్లు పట్టుకుని ఎలాగో ఒకలాగ బతిమాలి ఒప్పించు, మనం వెనక్కి వెళ్లటం సాధ్యం కాదు," అంది.

నేను ఎంతో దీనంగా "స్వామీ! దయచేసి మమ్మల్ని వెనక్కి పంపకండి. మేం వెళ్లలేం. కావాలంటే మీ మొత్తం ఓడని తోమి తోమి శుభ్రం చేస్తాం. మీరే మా దేవుడు. ఇదుగో మీకు దీన్ని నైవేద్యంగా సమర్పించుకుంటున్నాం... చిన్నకానుక, మీకు పుణ్యం ఉంటుంది, మామీద దయ చూపండి!" అన్నాను. హారాన్ని అతనికి బాగా కనిపించేట్టు పైకి ఎత్తి పట్టుకున్నాను. హారాన్ని చూడగానే అపవిత్రం, అస్పృశ్యత అనేవి పూర్తిగా మరిచిపోయి, చటుక్కున నా దగ్గర్నించి దాన్ని లాక్కున్నాడు.

అతను మళ్లీ ఒకసారి తన దగ్గర ఉన్న తాళపత్రాన్ని పరిశీలించాడు. హారాన్ని దుస్తులలోపల దాచిపెట్టుకున్నాక, మమ్మల్ని ఉద్దరిస్తున్నట్టు తల ఎత్తి చూస్తూ "ఓడ కింది భాగానికి వెళ్లండి. సింహపురికి వెళ్లేదాకా మీ నల్లముఖాలు నాకు కనిపించ కూడదు. వంటశాల నేలని బాగా రుద్ధి కడగండి, మురికి బట్టలు ఉతకండి, మరుగుదొడ్లు శుభ్రం చెయ్యండి, త్వరగా కదలండి!" అన్నాడు.

ఆ తరవాత ఓడ కింది భాగానికి వెళ్లే మెట్లమీద నన్ను తన చేతిలోని ఆయుధంతో పొడుస్తూ కిందికి తోసుకెళ్లాడు. మాలో ఎవరినీ తాకకుండా జాగ్రత్తపడ్డాడు.

ఆ వరుణుడి ఓడలో చేసిన చాకిరీకి మా శరీరాలు నుజ్జు నుజ్జు

అయిపోయాయి. చివరికి దాదాపు ఒక నెలరోజుల ప్రయాణం తరవాత ఓడ పై భాగంనుంచి జనం సంతోషంగా అరవటం మాకు వినిపించింది. వాళ్లకి ఒడ్డు కనిపించింది, అందుకే అంత ఆనందం. మేము నెమ్మదిగా ఓడ పైభాగానికి చేరుకున్నాం. సూర్యుడి వెలుతురు మా కళ్లని మిరుమిట్లు గొలిపించింది. నదీ ముఖం కనిపించింది, దానికి రెండువైపులా పచ్చటి అడవులు పరుచుకుని ఉన్నాయి. నీటి ఒడ్డున పెరిగే చెట్లు కనుచూపుమేర వరకూ పెరిగి ఉన్నాయి. విశాలమైన నదీతీరంలోకి ఓడ ప్రవేశించ గానే, ఆలయగోపురం మాకు కనిపించింది. అంత విశాలమైన నదిని మేము ఇంతకుముందు ఎన్నడూ చూడలేదు. అందుకే మా నరాలలో ఉత్సాహం ఉరకలు వేసింది. కొంతసేపటికల్లా ఓడ రేవుని చేరింది. అక్కడ మనుషులు వింతగా కనిపించారు. తెల్లని తలపాగాలు చుట్టుకుని ఓడలలోకి సరుకులు ఎక్కిస్తూ, ఇంకొందరు సరుకులు దింపుతూ చలా హడావుడిగా ఉన్నారు.

మాకు ఓడలో ప్రయాణం చేసేందుకు అనుమతించిన వ్యక్తి దొంగనవ్వు నవ్వుతూ మెట్లదిగి ఎక్కడో మాయమయాడు. కొంతసేపు తటపటాయించిన తరవాత మేము కూడా కిందికి వెళ్లాలని నిశ్చయించుకుని నెమ్మదిగా ఓడ దిగాం. వరుణుడి నౌకల కార్యాలయం వద్ద ఆసరికే అందరూ బారులు తీరి వరసగా నిలబడ్డారు. తూర్పు దిక్కున ఉన్న సింహపురి ఇదేనా అని కనుక్కోవాలని నిశ్చయించుకున్నాను. ముందుగా కొందరిని అడిగితే వాళ్లు నావైపు అర్థం కానట్టు చూశారు. చివరికి మాలాగ నల్లచర్మం వ్యక్తి ఒకడు కనిపించేసరికి అతన్ని సమీపించేందుకు ధైర్యం కూడగట్టుకున్నాను. పొడవుగా ఉన్న ఇద్దరు తెల్లని వాళ్లతో అతను ఏదో మాట్లాడుతున్నాడు. నాకు మాట్లాడే అవకాశం దొరికేదాకా ఎదురు చూశాను. ఆ తరవాత తమిళంలో అది సింహపురి నగరమేనా అని అడిగాను. నన్ను ఒక పిచ్చివాడిని చూసినట్టు చూస్తూ, "మీరందరూ వరుణుడి ఓడలో వచ్చారా?" అని అడిగాడు.

అందరం ఒకరి ముఖాలు ఒకరం చూసుకున్నాం. మాకు

విపరీతమైన కంగారు పుట్టింది. "ఏమిటి స్వామీ! ఎందుకలా అడుగుతున్నారు?" అన్నాను.

ఆ నల్లటి వ్యక్తి తన తోటివారితో సంస్కృతంలో ఏదో అన్నాడు. వాళ్లందరూ పొట్ట చెక్కలయేట్టు నవ్వారు. తరవాత అతను మమ్మల్ని "మీది ఏ కులం?" అని అడిగాడు.

అరసి, శివ ఏ కులానికి చెందినవారో నాకు కచ్చితంగా తెలియకపోయి నప్పటికీ, 'రజకులం స్వామీ!' అన్నాను.

"అందుకే అంత తెలివి తక్కువ వాళ్లలా ఉన్నారు. ఇది కాళీమాత నగరం. ఎంతోమందిని మోసగించినట్టే వరుణుడు మిమ్మల్ని కూడా మోసం చేశాడు."

శివ ఆ నల్లటి వ్యక్తిని పరిష్కారం సూచించమని కోరాడు. అతను మమ్మల్ని అవతలికి నెట్టేందుకు ప్రయత్నించాడు, కానీ శివ అతన్ని వదల్లేదు. చివరికి ఆ నల్లటి వ్యక్తి తన మిత్రులకి వీడ్కోలు తెలిపి, మావైపు తిరిగి నోరుమూసుకోమనీ, ఆలోచించుకునేందుకు తనకి కాస్త సమయం ఇవ్వమనీ గట్టిగా అరిచాడు. రెండు నిమిషాలు ఆగి "చూడండి, మిత్రులారా, ఇది చాలా చిన్న ఊరు. మీకు ఇక్కడ ఏదైనా పని దొరకచ్చు, కానీ ఇక్కడికి వాయవ్యదిశలో మరొక పెద్ద నగరం ఉంది. దాని పేరు అయోధ్య, అక్కడ రాముడు రాజ్యం చేస్తున్నాడు. మీవంటి శ్రామికులకి అక్కడ పనులు దొరుకుతాయి. వేతనాలు కూడా బాగానే ఇస్తారని విన్నాను. అక్కడ మీ అదృష్టాన్ని పరీక్షించుకోండి. ధాన్యం మోసుకెళ్లే పెద్ద పడవ సరయూనదీ మార్గాన అయోధ్యకి వెళ్తుంది. దాని యజమాని దక్షిణ ప్రాంతానికి చెందినవాడే. అతనితో ఒకమాట చెప్పి చూస్తాను. మీ అదృష్టం బావుంటే అందులో ఎక్కించుకోవచ్చు ఈ రాత్రికి కాళికాదేవి ఆలయం దగ్గర పేదవారికి అన్నదానం చేస్తారు. అక్కడ కడుపునింపుకుని సేదతీరండి. సూర్యోదయం అవగానే ధాన్యం రేవు చేరుకోండి. జరిగిన దానికి ఇప్పుడు విచారించి లాభం లేదు. అంతా మీ మంచికే జరిగిందేమో!"

అంటూ మాకు కాళికాదేవి ఆలయంవైపు చెయ్యి చూపించాడు.

"అన్నట్టు ముందువైపు ఉన్న వీధిలోకి వెళ్లకండి. దేశ బహిష్కరణ పొందిన వాళ్లని ఆ వీధిలోకి అనుమతించరు. వెనకవైపు ఉన్న కాలిబాటలో వెళ్లండి." అంటూ గట్టిగా అరిచి చెప్పి, నదిలో వెళ్లేందుకు బైలుదేరిన పడవలోకి దూకాడు అతను.

ఆ రాత్రి కాళికాదేవి ఊళ్లో గడిపాం. ఆకలితో పడుకోవాల్సిన అగత్యం పట్టలేదు మాకు. రాత్రి మాకు ఆలయంలో భోజనం దొరికింది. దగ్గర్లో ఉన్న అడవుల్లోనుంచి పులుల గాండ్రింపులూ, చెవుల్లో దోమలు చేసే రొదా నన్ను సరిగ్గా నిద్రపోనివ్వలేదు. పైగా అయోధ్య గురించి మనసులో కుతూహలంగా కూడా ఉంది. దాదాపు సంవత్సరం క్రితం రాముడు తన సోదరుడినీ, సీతనీ వెంటపెట్టుకుని పుష్పకవిమానంలో అయోధ్యకి వెళ్లాడు.

తెల్లవారగానే ధాన్యం పడవలో ఎక్కి మేం అయోధ్యవైపుకి సాగిపోయాం. మూడు రోజుల తరవాత రాముడి రాజధానికి చేరుకున్నాం. మూడు దశాబ్దాల క్రితం రావణుడు తన సేనతో దాడిచేసి జయించినప్పుడు నేను చూసిన అయోధ్య చిన్న ఊరు. ఇప్పుడు అది ఒక పెద్ద నగరంగా అభివృద్ధి చెందింది. సుభిక్షంగా ఉన్న కాలంలో త్రికోటా, ముచిర పట్నంతో పోలిస్తే ఇది అంత గొప్పగా లేకపోయినప్పటికీ, ఇక్కడ కూడా కొద్దో గొప్పో అభివృద్ధి కనిపించక పోలేదు.

మేము నగరంలో తిరుగుతూ, ఏ వీధిలోకి వెళితే ఏం ప్రమాదం ముంచు కొస్తుందో, అస్పృశ్యులు వెళ్లకూడని వీధుల్లోకి వెళ్తున్నామేమో అన్న అనుమానంతో భయపడుతూనే ఉన్నాం. కొద్దిసేపట్లోనే నగరంలోని రక్షకభటుల దృష్టిని ఆకర్షించాం, వాళ్లు రకరకాలుగా మమ్మల్ని ప్రశ్నించారు. అయితే వాళ్ల భాష మాకు రాదు, మేం చెప్పింది వాళ్లకి అర్థం కాలేదు.

చివరికి వీధికి అటువైపున ఉన్న అంగడి యజమానిని

పిలిపించారు. అతనికి మా భాష వచ్చు. మేము ఏవిధంగా అయోధ్యకి చేరుకున్నామో అతనికి చెప్పాం. అతను దాన్ని అనువదించి వాళ్లకి చెప్పాడు. మా బుద్ధితక్కువకి రక్షకభటులు నవ్వారు, వేళాకోళం చేశారు. మేము రజకుల కులానికి చెందినవాళ్లమని తెలిశాక, మా కులంవాళ్లు నివసిస్తున్న ప్రాంతానికి మమ్మల్ని పంపించారు.

రజకులవాడ నదీతీరాన తూర్పుదిశగా చాలాదూరం విస్తరించి ఉంది. ఈ ఉత్తర ప్రాంతంలో కులవ్యవస్థ చాలాకాలంగా పాతుకుపోయి ఉంది. పక్షం రోజులకి ఒకసారి నగరం వెలుపల ఉన్న అంగడివీధికి వెళ్లి మాకు కావలసిన వస్తువులు కొని తెచ్చుకునే వాళ్లం. సరళంగా, ఒడిదుడుకులు లేకుండా జీవితం గడిచిపోసాగింది. అసుర నాగరిక ప్రపంచంలోని స్వేచ్ఛా స్వాతంత్ర్యాల వల్లనూ, తీవ్రమైన పోటీతత్వంవల్లనూ నెలకొన్న క్లిష్టతలేవీ ఇక్కడ లేవు. కులవ్యవస్థ చాలా పాశవికంగా తక్కువ కులాలకి చెందిన వారిమీద అమానుషమైన అవమానకరమైన ప్రవర్తన కనబరిచేది. కానీ తమ కులానికి చెందినవారితో కలిసి గడిపే జీవితంలో విచిత్రమైన సమానత్వం ఉండేది. ఒక్క కులపెద్దా, ఆయన కుటుంబం మాత్రం మాకన్నా మెరుగ్గా ఉండేవాళ్లు. పై కులాల వాళ్లెవరూ మా వాడలోకి వచ్చేవాళ్లుకారు.

ఈ దేవతా వ్యవస్థలోని అన్నిటికన్నా మంచి విషయం పోటీ లేకపోవటం. ప్రతిపనీ ఒక కులానికి కేటాయించబడి ఉండేది. ఆ కులంలోని వారందరికీ పనులూ, రెండు పూటలా తినటానికి తిండీ దొరికేవి. ఈ వ్యవస్థలో కలలకి స్థానం లేదు, ఆకాంక్షలు ప్రమాదకరమైనవిగా భావించబడతాయి. వలసవచ్చిన మాకు త్వరగానే ఈ విషయం అర్థం అయింది.

జీవితం ఒడిదుడుకులు లేకుండా సాగిపోయింది. అరసి ఒక మగ శిశువుని ప్రసవించింది. శంబుకుడని వాడికి పేరు పెట్టాం. పగలంతా నేను నింపాదిగా పారే నదికేసి చూస్తూ గడిపేవాడిని. నిర్మలంగా ఉన్న స్వచ్ఛమైన ఆకాశాన్నీ, నదిలో నెమ్మదిగా, బద్ధకంగా కదిలే పడవలనీ, చేపలకోసం నీళ్లలో వేటాడే కొంగలనీ, లకుముకి పిట్టలనీ చూస్తూ

ఆనందించేవాడిని.

ఇలా నేను బైలుదేరి నది దగ్గరకి వచ్చినప్పుడు చాలాసార్లు శంబుకుడు నా వెంట వచ్చేవాడు. తాతగారూ అని నన్ను పిలుస్తూ ఏదో ఒకటి కావాలని మారాం చేసేవాడు. వాడి ముద్దు ముద్దు మాటలు వింటూ ఉంటే నా మనసు ఆనందంతోనూ, గర్వంతోనూ నిండిపోయేది. మళ్లీ ఒకసారి అందమైన ఈ జీవితంతోనూ, అద్భుతమైన ఈ ప్రపంచంతోనూ ప్రేమలో పడసాగాను.

51. ధర్మఖడ్గం

భద్రుడు

అంతా ఒక కలలాగానూ, జీవితంలో అంతులేని ఆనందం చోటు చేసుకున్నట్టు గానూ కనిపించినప్పుడే మనుషుల మనసుల్లో తెలివితక్కువ ఆలోచనలూ, ప్రమాదకరమైన ఆశలూ తలెత్తుతాయి. శంబుకుడు తెలివైనవాడు, అందగాడు. కానీ అంత మాత్రాన వాడు పెద్దవాడయాక చాకలి పని చెయ్యకూడదని అరసి అనుకోవటంలో అర్థం లేదు. ఒకసారి ఒక తల్లి మనసులో అటువంటి ఆలోచనలు వచ్చాయంటే, తన సంతానం మిగతా వాళ్లకన్నా భిన్నమైనదని అనిపించిందంటే, ఆ ఆలోచనని ఏదీ కదిలించలేదు. ఆమె తన కుమారుడు ముఖ్యమైన అధికారి అవాలనీ, లేక ప్రసిద్ధుడైన కవిగా తయారవాలనీ, పోనీ గొప్ప వర్తకుడిగా ఎదగాలనీ - నీచమైన రజకుడిగా కాక ఇంకేమైనా సరే - అనుకుంది. మనవంటి వాళ్లు కలలు కనే సాహసం చెయ్యకూడదని ఆమెని హెచ్చరించాను. శివ కూడా ఆమెకి నచ్చజెప్పేందుకు ప్రయత్నించాడు, కానీ ఆమె ఎవరి మాటా వినిపించుకోలేదు. శంబుకుడికి విద్యా బోధన జరిపించాలన్న అరసి కోరికని మాల బలపరిచింది. "మన దగ్గర ధనం ఉంది, కుర్రవాడిలో ప్రతిభ ఉంది, మరి అలాంటప్పుడు వాడికి చదువు సంధ్యలు ఎందుకు నేర్పించకూడదు?" అని ఇద్దరు స్త్రీలూ వాదించారు. కానీ అప్పటికే వాడికి ఎనిమిదేళ్లు దాటాయి, విద్య ప్రారంభించే వయసు దాటిపోయింది. ఇదే అసుర రాజ్యంలో అయితే ఈపాటికి వాడు చదవటం, రాయటం, గణితంలో నేర్పు సాధించి ఉండేవాడే. కానీ అరసీ, మాలా అదేపనిగా వెంటపడేసరికి, నేను ఎంత వారించినా, శివ వాళ్ల మాటలకి తల ఒగ్గి శంబుకుడిని విద్యాలయానికి పంపే మార్గాన్ని వెతకసాగాడు. అది నాకు నచ్చలేదు, కానీ రజకుల కులంలో పుట్టిన

బాలుడికి ఎవరూ చదువు నేర్పరన్న నమ్మకం నాకు కలిగింది. అందుకే నేను మరీ ఎక్కువ ఆందోళన చెందలేదు. కానీ ఎంత పెద్ద నిషేధాన్నయినా ధనం అధిగమించగలదన్న వాస్తవాన్ని నేను మరిచాను. నదికి అవతలి వైపు ఏకాకిలా, సన్యాసిలా నివసిస్తున్న ఒక గురువుని శంబుకుడు సంపాదించుకున్నాడు.

సరయూ నది ఆవలి తీరాన దట్టమైన అరణ్యం ఉంది. పక్షులూ, జంతువులతో కలిసి కొందరు సన్యాసులు అక్కడ సహజీవనం చేస్తున్నారు. ఒంటినిండా బూడిద పూసుకుని, కపాలాలనీ, ఎముకలనీ ఆభరణాలుగా ధరించి ఒక్కోసారి గంటల తరబడి కష్టమైన భంగిమల్లో కాళ్లూ, చేతులూ శరీరమూ వంచి నిలబడటం తప్ప వాళ్లు ఇంకేమీ చెయ్యరు. తాము దేవుడి కోసం అన్వేషిస్తున్నామని అంటారు. తమ అంతరాత్మనీ, బ్రహ్మాన్నీ తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని అంటారు. కానీ దేవతల కుల వ్యవస్థలో ఇమడలేని ఆ గుంపు ఏకాంతనివాసాన్ని ఏర్పరచుకుంది. సామాన్య ప్రజలకి ఈ వింత సమూహాన్ని చూస్తే భయం. వాళ్లకి ఏవో మంత్రాలూ తంత్రాలూ తెలుసునని రహస్యంగా చెప్పుకునేవాళ్లు, నేను చాలాసార్లు ధైర్యంచేసి ఆ ప్రాంతానికి వెళ్లి వాళ్లతో మాట్లాడాను. ఆశ్చర్యకరంగా వాళ్లకి కులవ్యవస్థ గురించి ఏమీ తెలీదు. వాళ్ల సాంగత్యంలోని స్వేచ్ఛని అనుభవించేందుకు తరచు అక్కడికి వెళ్లేవాడిని. నా కులం గురించి నన్ను అడగనివాళ్ళ వాళ్ళు మాత్రమే కనిపించారు. కులం తాలూకు పవిత్రతని ఎంతమాత్రం లెక్కచెయ్యని ఒక సన్యాసి శివకి కనిపించాడు. అతను మంచి విద్యావంతుడు. సంస్కృతంతో పాటు అసుర, నాగ, గంధర్వ, కిన్నెర భాషలన్నీ మాట్లాడగలిగేవాడు. కొన్ని సంచార తెగల భాషలు కూడా అతనికి తెలుసు. వేదాలూ, జ్యోతిషం, ఇంకా ఇతర శాస్త్రాలూ క్షుణ్ణంగా వచ్చు. శంబుకుడికి ఇంతకన్నా మంచి గురువు దొరికి ఉండేవాడు కాదు. ఆ సన్యాసి కోరినది ఒక్కటే, తనని 'గురువు' అని సంబోధించమని అన్నాడు.

ఒకసారి తన పూర్వ జీవితం గురించి ఆ గురువు చెప్పాడు.

పంచనదీ క్షేత్రంలో అతను ఒక బ్రాహ్మణుడిగా జన్మించాడు. యుక్తవయసులోనే అయోధ్యకి వచ్చేశాడు. ఆస్థానంలో మంచి పదవిని చేపట్టాడు. కానీ కులవ్యవస్థ అతనికి రోత్ర పుట్టించింది. తన తండ్రి ఇచ్చిన మాట కోసం రాముడు రాజ్యాన్ని వదిలి వెళ్లినప్పుడు అతను అక్కడే ఉన్నాడు. రాముడు జాబాలి మునిని కలుసుకోవటం అతను చూశాడు. రాముడితో జాబాలి — దైవం, పునర్జన్మ, ఆత్మ లాంటివి ఏవీ లేవనీ, ప్రతి వ్యక్తీ తనకి లభించిన ఈ జీవితాన్ని మరణం వరకూ ఆనందంగా అనుభవించాలని చెప్పటం, కఠోరనైతికవాది రాముడు, జాబాలి చెప్పినదాన్ని తిరస్కరించటం అతను విన్నాడు. కానీ జాబాలి వలన ప్రభావితుడై ఆయన శిష్యుడిగా మారిపోయాడు. దశరథుడు రాజుగా ఉన్నంతకాలం ఆయన అన్ని రకాల అభిప్రాయాలనీ సహించేవాడు. జాబాలి స్వేచ్ఛగా నగర వీధుల్లో తిరుగుతూ కులవ్యవస్థ ఎంత పనికిమాలినదో అందరికీ చెప్పేవాడు. కానీ భరతుడు రాముడి పేర రాజ్యం చేస్తున్నప్పుడు కులవ్యవస్థని అంగీకరించని వారిని వెతికి పట్టుకుని తొలగించి పాత సంప్రదాయాలు కొనసాగేట్టు చూశాడు. జాబాలినీ, ఆయన శిష్యులనీ సరయూనది ఆవలి తీరానికి బహిష్కరించాడు. భరతునితో విభేదించిన వాళ్లూ, స్వతంత్రంగా అభిప్రాయాలు ఏర్పరచుకున్న వాళ్లూ ఆ తీరానికే వెళ్లి నివసించసాగారు. జాబాలి మరణించాక ఆయన శిష్యులు కులాలని పట్టించుకోకుండా విద్య నేర్చుకోవాలని అనుకున్న వారందరికీ విద్య నేర్పటమే పరమావధిగా జీవిస్తున్నారు. కానీ కాలక్రమాన కులవ్యవస్థ మరింత పటిష్టమై తన ఇనప పిడికిలిని మరింత బిగించటంతో కొద్దిమంది మాత్రమే విద్య నేర్చుకునే ధైర్యం చూపించారు. అలా ధైర్యం చేసిన వాళ్లు ప్రధాన భూభాగాన్నీ, పర్వతాలనీ దాటి చైనాకీ, సముద్రాలకావల ఉన్న ప్రాంతాలకీ పారిపోయారు. మనిషిలోని ప్రతిభని మాత్రమే గుర్తించే ఆ ప్రాంతాలలో యాదృచ్ఛికంగా, జన్మని బట్టి కులాన్ని నిర్ణయించే పద్ధతి లేదు.

ఈ వివరాలన్నిటినీ శంబుకుడు విప్పారిన కళ్లతో ఆశ్చర్యంగా

విన్నాడు. వాడి కళ్లలోని వింతకాంతిని చూసి నేను కంగారు పడ్డాను. ఆ తరవాత నేను పడవలో సరయూ నది దాటుకుని వెనక్కి వస్తున్నప్పుడు వాడు తన కలల గురించి మాట్లాడాడు. గొప్ప కవిగా మారి అద్భుతమైన కవిత్వంతో శ్రోతలని ముగ్ధులని చెయ్యాలని ఉందని అన్నాడు. తరవాత ఒకరోజు రాత్రి నక్షత్రాల సాక్షిగా, సరయూ నదీ జలాల అలలమీద వెన్నెలకాంతి పరుచుకుని అల్లల్లాడుతూ ఉండగా, శంబుకుడు శ్రావ్యంగా పాడసాగాడు. స్వేచ్ఛాయుత ప్రపంచం గురించీ, ఆశతో నిండిన లోకం గురించీ, ఎప్పుడూ రాని రేపటి గురించీ పాడాడు. అతని పాట గాలితో కలిసి పేదవారు నివసించే పూరిపాకలని ముద్దాడింది. మనుషుల వేషంలో దేవుళ్లు నివసించే రాజమహలు కోట బురుజులని చుట్టి వచ్చింది.

రోజులు గడుస్తున్నకొద్దీ ఆ బాలుడు అద్భుతంగా తయారవసాగాడు. వాడి గొంతు గాంభీర్యాన్ని సంతరించుకుంది, వాడి కవిత్వంలో గేయాత్మకత చోటు చేసుకోసాగింది. రాత్రి మా పడవ కోసం రేవు దగ్గర జనం వేచి ఉండటం మొదలుపెట్టారు. చిన్న చిన్న అలలతో ప్రవహిస్తున్న నీటిమీదుగా వినిపించే వాడి మధురమైన గానాన్ని వింటూ స్త్రీ పురుషులు పరవశించిపోయేవాళ్లు. వాడు సంస్కృతంలో పాటలు పాడేవాడు, కానీ ఆ పాటల్లో భావాలు సార్వజనీనంగా ఉండేవి. వెలువడే వేదనలు ఆదిమమైనవిగా ఉండేవి. ఒక్కసారి విన్నవాళ్లని కూడా అవి వెంటనే ఆకట్టుకునేవి. మనుషుల మనసుల్లో పేరుకున్న మతం, కులం, సంప్రదాయం అనే మందమైన కుళ్లుని అవి ఛేదించేవి. మనసు లోతుల్లో ఉండే మంచితనాన్ని తట్టిలేపేవి.

వాడికి పేరు వచ్చినకొద్దీ నా భయం కూడా ఎక్కువయింది. మా చిన్నవాడ నుంచి వాడిని బైటికి పోకుండా ఆపేందుకు ప్రయత్నించాను. బైట ఒక చీకటి ప్రపంచం, క్రూరమైన లోకం వేచి ఉందనీ, వాడిని చటుక్కున గాయపరిచేందుకు అది సిద్ధంగా ఉందనీ, తమ ఆధిపత్యాన్ని ఎదిరించే ఎవరినీ వదిలిపెట్టని దేవుడికి ప్రియమైన జనం ఆలోకం నిండా ఉన్నారనీ నచ్చచెప్పబోయాను. కానీ వాడు స్వేచ్ఛలోని

మాధుర్యాన్ని చవిచూశాడు. ఒక వెలివేయబడ్డ మురికివాడకి వాడిని సంప్రదాయం గొలుసులతో కట్టిపడేయడం అసాధ్యం. ఇప్పుడు వాడు ఉన్న పరిస్థితుల్లో వాడికి లోకమంతా కాంతితో నిండినట్టూ, ఎంతో ఆశావహమైన భవిష్యత్తు ముందు ఉన్నట్టూ కనిపిస్తుంది. విద్యవల్ల వచ్చే ప్రమాదం అది. అది కలలని పట్టిస్తుంది, కానీ ఈ వాస్తవ ప్రపంచంలో కాళ్లూని నిలబడేందుకు ఆ కలలకి కాళ్లుండవు.

తన గురువు వేదాలలో ఉన్న నిజమైన అర్థాలు బోధించేసరికి శంబుకుడి ఆలోచనలు భిన్నమైన మార్గాన పోసాగాయి. అవన్నీ వాస్తవాలే అనుకున్నా ప్రమాదకరమైనవి, ఒంటరిగా ఉన్నప్పుడు కూడా తలుచుకోకూడనివి. ఆ గురువు శంబుకుడి చేత బహిరంగంగా అటువంటి పాటలు పాడిస్తున్నాడు. అది కూడదనీ, ప్రమాదమనీ ఎంత చెప్పినా వాడుగాని, వాడి తలిదండ్రులుగాని వినలేదు.

వాడు ఆ ఊరి బైటికి వెళ్లి ఆ పాటలు పాడసాగాడు. పాటలతోపాటు వేదాలని వల్లిస్తూ తర్కసంగతమైన జానపదగాథలని జోడించి చెప్పసాగాడు. వాడి పేరు రోజురోజుకీ అందరినోటా వినబడసాగింది. జనం తండోపతండాలుగా వాటిని వినేందుకు వచ్చేవారు.

ఒకరోజు నేను అనుకున్నట్టే జరిగింది. రాజమార్గాన వాడు యధాప్రకారం జనాన్ని కూడగట్టి పాటలు పాడుతూ ఉండగా కొందరు మతాధికారులు అటుగా వచ్చారు. ఒక నీచకులంలో పుట్టిన బాలుడివల్ల రాజమార్గం అపవిత్రం అవటం భరించలేకపోయారు. కానీ ఆ బాలుడు ఎదురు తిరిగాడు. మండిపడి ప్రధానాచార్యుడు ఏవో మారుమూల వేదమంత్రాలని వర్ణించాడు. ఈ నీచకులం పొగరుబోతు దానితో ఠారుకుని నోరుమూసుకుంటాడని అనుకున్నాడతను. కానీ ఆ కుర్రవాడు వాటికి సరైన అర్థం చెప్పటమే కాక తను కొత్తగా కనుక్కున్న అర్థం కూడా చెప్పేశాడు.

అక్కడ గుమిగూడిన జనం, బ్రాహ్మణులు విధించిన నిషేధాజ్ఞలన్నీ

మరిచిపోయి, ఆ బాలుడి మాటలకి హర్షధ్వానాలు చేశారు. అన్ని కులాల వాళ్లూ తోసుకుంటూ, ఒకరినొకరు తాకుతూ కులవ్యవస్థని భ్రష్టు పట్టించారు. అలా ఒక పక్క జనం విరగబడుతూ ఉంటే ఆ బాలుడు మతాచార్యులకి ఎదురు తిరిగి కులవ్యవస్థ అభ్యంతరకరమని తార్కికంగా వాదిస్తూ వాళ్లని వేధించాడు. అది చూసి జనం వాడిని మరింత ప్రోత్సహిస్తూ హర్షధ్వానాలు చేశారు. దాంతో వాళ్లకి బాగా కోపం వచ్చి ఆవేశంతో ఊగిపోయారు. వాడు అనర్గళంగా వేదాలలోంచి శ్లోకాలు వల్లిస్తూ ప్రజల భాష ప్రాకృతంలో, వాటి అర్థం చెప్పటం ప్రారంభించాడు. ప్రజలు అడగాలనుకున్న ప్రశ్నలన్నిటినీ వాడు అడిగాడు. సత్యం తెలుసుకోవాలని ఉందని అన్నాడు. సత్యాన్ని అన్వేషించేవాళ్ల తలరాత ఎలా ఉంటుందో నాకు తెలుసు. ఇంతలో సైన్యం జనాన్ని చుట్టుముట్టటం చూసి భయంతో వణికిపోతూ ఉండిపోయాను. కానీ శంబుకుడు తన ధోరణిలో ఏదేదో మాట్లాడుతూ తన చుట్టూ వచ్చిన మార్పుని గమనించనేలేదు.

చక్కటి శ్రావ్యమైన గొంతుతో శంబుకుడు వేదాలని వల్లిస్తూ ఉండగా అక్కడికి ఒక రథం వచ్చి ఆగింది. ఆ రథంలోంచి రాముడు దిగాడు. మతాధికారులు అతని దగ్గరకి పరిగెత్తుకుని వెళ్లి అతని చెవిలో ఏదో చెప్పారు. అతను ఆందోళనతో తల అడ్డంగా ఆడించాడు, వాళ్లతో ఏదో బతిమాలుకోసాగాడు. ప్రధాన మతాచార్యుడు కోపంగా రాముడితో ఏదో అన్నాడు. అంతే రాముడి భుజాలు కుంగిపోయాయి. మైమరచిన స్థితినుంచి శంబుకుడిని బైటికి రప్పించేందుకు అతను ప్రయత్నించాడు. జనం ఊపిరి బిగబట్టి చూడసాగారు. శంబుకుడు తనంతట తానే హఠాత్తుగా వేదాల పఠనంనుంచి బైటికి వచ్చి అయోమయంగా చుట్టూ చూశాడు. వాడికి భయంవేసి ఏడవసాగాడు. అంతే, వాడు అలా ఏడ్చేసరికి పాటలు పాడే గాయకుడూ, వేదాలని వల్లించే పండితుడూ కాక, పధ్నాలుగేళ్ల బాలుడిలా, ఏ గుర్తింపూలేని నల్లని అసురజాతి పిల్లవాడుగా జనంముందు నిలిచాడు. తన రాజుని, సంరక్షకుడిని గుర్తించి బాగా వంగి నమస్కరించాడు. రాముడు నిస్సహాయంగా

మతాధికారులవైపు చూశాడు. వాళ్లు కోపంగా వాడివైపు చూపించి గట్టిగా అరవసాగారు. రాముడు చెయ్యి ఎత్తి వాళ్లని ఊరుకోమని, సౌమ్యంగా వాడిని, "నాయనా! ఎవరు నువ్వు?" అని అడిగాడు.

"నా పేరు శంబుకుడు. మా నాన్న పేరు శివుడు," అని గొణిగాడు వాడు.

"నీ కులం ఏది?" మతాచార్యుడు అడిగాడు.

"నాకు కులం లేదు, మీకూ లేదు," అంటూ వాడు రాముడి కళ్లలోకి చూశాడు.

"నువ్వు అస్పృశ్యుడివని అన్నారు, నిజమేనా?" అన్నాడు మతాచార్యుడు గొంతు పెంచి. "కాదు, ఎవరూ అస్పృశ్యకారు," అన్నాడు వాడు అతనివైపు చూడకుండా రాముడి కళ్లలోకి చూస్తూ, రాముడు చూపులు మరల్చుకున్నాడు.



“నువ్వు నాస్తికుడివా?” అని గట్టిగా అరిచాడు మతాచార్యుడు.

"కాదు, నేను దైవాన్ని గాఢంగా నమ్ముతాను. నేను నమ్మే దైవం ప్రతి మనిషిలోనూ ఉన్నాడు. నేనూ దేవుడినే, మీరు కూడా దేవుడే!"

"ఒక శూద్రుడు వేదాలు చదువుకునేందుకు ఎవరు అనుమతించారు?" అని అడిగాడు మతాచార్యుడు కోపంగా,

"పక్షులకి ఎగిరేందుకు అనుమతి అవసరమా? చేపలు ఎవరి అనుమతి తీసుకుని ఈదుతాయి? మనుషులు చదువు నేర్చుకోవటం కూడా అలాంటిదే."

'ఓరీ పొగరుబోత్రా మూరుడా! కులధర్మాన్ని ఎదిరించే వాళ్లకి ఈ రాజ్యంలో ఎటువంటి శిక్ష పడుతుందో తెలుసునా నీకు?" ప్రధాన మతాధికారి శంబుకుడిని కసిరాడు.

ఆ బాలుడు చెపుతున్నది నిజమేనని రాముడు గ్రహించాడు. వినేవారి మనసులని చూరగొనే శ్రావ్యమైన పాటలు పాడే ఆ బాలుడిమీద రాముడికి వల్లమాలిన సానుభూతి కలిగింది. మళ్లీ ఒకసారి మతాధికారులవైపు చూశాడు.

ప్రధాన మతాధికారి అందరికీ వినిపించేట్టు గట్టిగా, "ఈ శూద్రుడు, ఈ అహంకారి అస్పృశ్యుడు, కుల నియమాలన్నిటిలోకీ ముఖ్యమైనదాన్నిధిక్కరించాడు, వీడు చదువు సంధ్యలు నేర్వటమే కాకుండా, పవిత్రమైన వేదాలని కూడా అధ్యయనం చేశాడు. ఆ పవిత్ర గ్రంథాల్లో రాసిన విషయాలని వీడు వక్రీకరించి భాష్యం చెపుతున్నాడు. ఇటువంటి పొగరుబోతులకి పట్టే గతి ఒకటే..!" అన్నాడు.

మరుక్షణం ఆ మతాధికారి రాముడికేసి చూశాడు. నేను చెప్పవలసింది అయిపోయింది, ఇక చెయ్యటం మీ వంతు," అన్నట్టు ఉంది ఆ చూపు. కొద్ది విరామం తరవాత సైనికులు విచ్చు కత్తులతో, ఈటెలతో జనాన్ని చుట్టుముట్టారు. రాముడి కత్తికూడా ఒరలోనుంచి బైటికి వచ్చింది. శంబుకుడి బుగ్గలమీద కన్నీళ్లు చారికలు కట్టాయి. అంతే, ఒక్క క్షణంలో రాముడి కత్తి బలంగా కిందికి దిగి నా చిన్నారి మనవడి తలని ఒక్క వేటుతో నరికివేసింది.

అంతా అయిపోయింది. శంబుకుడి తలా, మొండెం విడివిడిగా నేలమీద పడి ఉన్నాయి. రాముడి రథం నా పక్కనుంచి సాగిపోయింది. దేవుడి వేషం వేసి 53, అలసిపోయినట్టు ఆ రథంలో కూర్చుని కనిపించాడు రాముడు. తను అలాంటి పని చెయ్యవలసి వచ్చినందుకు సిగ్గుపడుతున్నట్టు అతను ముఖం చాటు చేసు కున్నాడు. నేను విషాదంలో కూరుకు పోయి స్థాణువులా నిలబడిపోయాను.

52. ఆరంభం

భద్రుడు

కొన్నిదశాబ్దాల క్రితం నేను ఒక యువకుడితో కలిసి నా పయనాన్ని ప్రారంభించాను. అతను మాకోసం ఒక కొత్త లోకాన్ని సృష్టిస్తానని వాగ్దానం చేశాడు. మాకు ఆశలు కల్పించి మా కలలకి కొత్త ఆకాంక్షల మొగ్గలు తొడిగాడు. ఒక సామ్రాజ్యాన్ని నిర్మించిన తరవాత దాన్ని కోల్పోయాడు. అతను సాధించదలుచుకున్న విజయాల కోసమే నేను నా యౌవనాన్ని మొత్తం వెచ్చించాను. తనకు ముందు తమ ధైర్య సాహసాలతో ఎన్నో సాధించి వాటిని పోగొట్టుకున్న వారిని కలుసుకునేందుకు అతను వెళ్లిపోయాడు. తియ్యగా మాట్లాడే రావణుడిలాంటి వారు నా అమాయకత్వాన్ని ఆధారం చేసుకుని స్వలాభం కోసం నన్ను ఉపయోగించుకున్నారు. ఆ తరవాత అమాయకత్వంనుంచి బైటపడి ఈలోకం నేర్చిన పాఠాలని ఎన్నింటినో నేర్చుకున్నాక, నేను పోగొట్టుకున్నవన్నీ లంకలోనే వదిలి, మిగిలింది కాస్తా మూటగట్టుకుని మళ్లీ ధైర్యంగా మరో మార్గాన ప్రయాణం మొదలుపెట్టాను. దేవుళ్ల బాహువుల్లో నా తుచ్ఛమైన జీవితం చిక్కుకుని, నలిగి నాశనమైంది. వాళ్లు నా శరీరంలోని ఆఖరిబొట్టుదాకా పీల్చికాని నన్ను వదల్లేదు.

శంబుకుడి మరణం తరవాత అయోధ్యలో మా జీవితం నరకప్రాయమే అయింది. శివ తన దుఃఖాన్ని మద్యంలో మంచివేసేందుకు ప్రయత్నించాడు. నాకు ఎలాగూ మద్యం అలవాటు ఉంది. ఇద్దరం పూటుగా తాగి, మా నిరాశా నిస్పృహలని పాపం మా భార్యలమీద తీర్చుకునే వాళ్లం. వాళ్లని ఉత్తపుణ్యానికి చావబాదే వాళ్లం.

ఒకనాడు నేను అంతగా తాగలేదు. నా భార్య ఎప్పటిలాగే నన్ను

విసిగించటం మొదలుపెట్టింది. నా కోపం నషాళానికి అంటి ఆమెని తన్నాను. ఆమె గత చరిత్ర నంతా తవ్వాను. లంకలో వేశ్యలా ఆమె ఎంతమంది వీటులతో సంబంధం పెట్టుకుందో, రావణుడు ఆమెని ఎలా బలాత్కరించాడో మా వాడలోని వాళ్లంతా లొట్టలు వేసుకుంటూ వినేలా వివరించాను. ఆమెని ఇంట్లోంచి వీధిలోకి ఈడ్చి, కళంకితురాలైన భార్యని ఏలుకోవడానికి నేను రాముడినీ, రావణుడినీ కాదన్నాను. భార్యని బదులుగా ఇవ్వటం నాకు చేతకాదని అన్నాను. నీతీ, గౌరవం నాకు అన్నిటికన్నా ముఖ్యం అని గర్వంగా గుండెలు చరుచుకున్నాను. నన్ను చూసి ఎగతాళిగా నవ్వుతున్న జనాన్ని పట్టించుకోలేదు. మళ్లీ పానశాలవైపు నడిచాను.

రెండు ఘడియల తరవాత నన్ను రక్షకభటులు వచ్చి పట్టుకుపోయారు. నన్ను వాళ్లు రాజభవనంవైపుకి లాక్కుపోతూ ఉంటే చాలా భయం వేసింది నాకు. తిన్నగా నన్ను రాజు రాముడి దగ్గరకే తీసుకువెళ్లారు. ఆయన సింహాసనం మీద దేదీప్యమానంగా వెలిగిపోతూ కూర్చుని ఉన్నాడు. వేదాలలో చెప్పిన ఏ నియమాలని నేను ఉల్లంఘించానో, నాకు ఎలాటి శిక్ష విధించబోతున్నారో నాకు బొత్తిగా తెలియని పరిస్థితి. నేను బాగా కిందికి వంగి నమస్కరించాను. నా ముక్కు దాదాపు నేలని తాకింది. ఒక భటుడు నన్ను పొడిచి లేచి నిటారుగా నిలబడమన్నాడు.

రాముడు ముఖం చిట్టిస్తూ నావైపు చూసి నన్ను ప్రశ్నించమని అతని మంత్రులలో ఒకరికి సైగ చేశాడు. ఆ నల్లటి బ్రాహ్మణుడే ముందుకి వచ్చి, ఒక అస్పృశ్యుడికి ఎంత దూరంలో నిలబడాలో అంత దూరాన్ని పాటిస్తూ నిలబడ్డాడు. ఆ తరవాత 'రాముడి గురించి ఏమన్నావు?' అని అడిగాడు నన్ను. మొదట నేనేమీ అనలేదని బుకాయించాను. కానీ నామీద ప్రశ్నల ఒత్తిడి పెరిగిపోసాగింది. రావణుడి ఆగర్భశత్రువైన రాముడి ఆస్థానంలో రావణుడి పేరు ఉచ్చరించే ధైర్యం చెయ్యలేక, పాతివ్రత్యం కోల్పోయిన భార్యని రాముడిలా నేను ఏలుకోలేనని అన్నాను. అంత విశాల హృదయం

నాకు లేదని కూడా అన్నాను.

అది పూర్తి నిజం కాదు, అర్థ సత్యం. కానీ ఆ పరిస్థితుల్లో అంతకన్నా ఇంకేమీ చెప్పలేకపోయాను. సభలో పూర్తి నిశ్శబ్దం నెలకొంది. ఎందరి ముఖాల్లోనో అసంతృప్తి, కోపం కనిపించాయి. రాముడి ముఖం అవమానంతో ఎర్రబడింది.

నాకు ఏ శిక్షా విధించకుండా వదిలెయ్యటం చూసి ఆశ్చర్యపోయాను. అక్కడినుంచి బైటికివచ్చి రావణుడి విమానాన్ని ఉంచిన ఆలయం చేరుకున్నాను. కొంతదూరంలో నిలబడి పూజారులూ, పురోహితులూ పుష్పక విమానానికి భక్తి శ్రద్ధలతో ప్రణామాలు చెయ్యటం చూస్తూ ఉంటే నాకు నవ్వు వచ్చింది. ఇంతలో ఒక రథం శరవేగంతో నా పక్కనుంచి దూసుకువెళ్లింది. రథంలోపల వికల మనస్కురాలైన సీత కూర్చుని ఉంది. రథాన్ని నడుపుతున్న లక్ష్మణుడు విపరీతమైన ఆవేశంతో గుర్రాలని కొడుతున్నాడు. ఆ సమయంలో నేను దాన్ని పెద్దగా పట్టించుకోకుండా పానశాలవైపు నడిచాను. తరవాత ఎవరో నాతో, రాజ కుటుంబం నావల్లే ఛిద్రం అయిందనీ, రాముడూ సీతా విడిపోవటానికి నేనే కారణమనీ నన్ను నిందించినప్పుడు, తాగిన మత్తులో నేను అన్న మాటలవల్ల జరిగిన అనర్థం నాకు తెలియవచ్చింది.

రాజ పురోహితులు సీత అపవిత్రురాలు అనే నిర్ధారణకు వచ్చారు. లంకలో పాతివ్రత్యాన్ని నిరూపించుకునేందుకు సీతకి జరిగిన అగ్ని పరీక్ష సరిపోదనీ, రాముడు తనమీద పడిన ఈ మచ్చకి తరుణోపాయం ఆలోచించాలి అనీ వారు అతనికి సూచించారు. అందుకే రాముడు గర్భవతి సీతని అడవులకి పంపివేశాడు.

పది సంవత్సరాలు గడిచిపోయాయి. ఆ పది సంవత్సరాలలో మా జీవితాలు మరింత దుర్భరంగా తయారయాయి. పనులు దొరకటం తగ్గిపోయింది. ఉన్నది కాస్తా మేము మద్యం త్రాగేందుకే ఖర్చయిపోసాగింది.

ఆ సమయంలోనే రాముడు మొత్తం భూభాగాన్ని తన ఏకచత్రాధిపత్యం క్రిందికి తెచ్చుకోవాలని అనుకున్నాడు. అతని మంత్రులు అశ్వమేధయాగం చెయ్యమని సూచించారు. ఆ యాగం ప్రారంభించిన తరవాత చుట్టుపక్కల ఎన్నో చిన్న చిన్న రాజ్యాలతో యుద్ధంచేసి రాముడు వాటిని తన రాజ్యంలో కలిపివేసుకున్నాడు. కానీ అతని గుర్రం అరణ్యంలోకి ప్రవేశించినప్పుడు రాజభవనం తాలూకు రాజకీయాల ప్రహసనం ప్రారంభమైంది. ఆ గుర్రాన్ని ఇద్దరు బాలకులు ఆపారు. వాళ్లు అడవిలో సీతకి జన్మించిన కవలలు. ఆ కవలలని గెలవటం ఎవరి తరమూ కాదని అందరూ అనేవారు. అది విని రాముడు సంతోషించాడు. ఆ ఇద్దరు బాలకులనీ కలుసుకునేందుకు అరణ్యానికి వెళ్లేందుకు అంగీకరించాడు. రాజకుటుంబం మళ్లీ కలుసుకుంది. వాల్మీకి ఆశ్రమంలో ఉంటూ ఆ కవలలకి జన్మనిచ్చిన సీతని రాముడు మళ్లీ కలుసుకున్నాడు.

ఆ కలయిక ఎంతో ఆనందాన్ని ఇవ్వవలసింది, కానీ రాముడికి సలహాలిచ్చే వారి జోక్యంవల్ల ఆ కథ మళ్లీ విషాదంగా ముగిసింది. వాల్మీకి ఒక కవి. ఆయనతో ఒకే పర్ణకుటీరంలో కలిసి జీవించిందన్న విషయాన్ని ఆమె పవిత్రతపట్ల సందేహించదగినదిగా వాళ్లు ఎత్తి చూపారు. వాల్మీకి అన్నీ త్యజించిన రుషి. ఆయన సీతని తన సొంత కుమార్తెలా భావించాడు. కానీ పండితుల తర్కాన్ని ప్రశ్నించే ధైర్యం ఎవరికీ లేదు. మళ్లీ సరయూ నదీ తీరాన సీతకి అగ్నిపరీక్ష సిద్ధం చేశారు.

ఆ అగ్నిపరీక్షని చూసేందుకు నేను కూడా వెళ్లాను. నా కులం వాళ్లకి కేటాయించిన స్థలానికి నన్ను పంపించారు. జరగబోయే నాటకాన్ని ఆసక్తితో ఎదురుచూశాను. లంకలో చూసిన ఇదేవిధమైన నాటకం నాకు మళ్లీ మళ్లీ గుర్తు రాసాగింది.

సూర్యుడు పశ్చిమాద్రికి చేరుకునే సమయానికి రాముడు తన రథంలో వచ్చాడు. అతను అన్యమనస్కంగా తనకోసం ఏర్పాటుచేసిన వేదికమీదికి చేరు కున్నాడు. భట్రాజులు అతని చుట్టూ చేరినా అతను

పట్టించుకోలేదు. అగ్నిజ్వాలలు పది అడుగుల ఎత్తుకి లేచి ఎగసిపడుతున్నాయి. దాన్ని మరింత రగిలించేందుకు దానిలో నెయ్యిపోస్తూ వీవనలతో విసురుతున్నారు. పది సంవత్సరాల వయసున్న ఇద్దరు బాలకులు సీతవెంట నడిచి వచ్చారు. తమ తల్లి సజీవదహనానికి గురి అవబోతోందని వాళ్లకి తెలీదు.

ఎటువంటి భావమూ కనబడనీయకుండా సీత అక్కడికి వచ్చి నిలబడింది. మళ్లీ ఒకసారి ఇటువంటి అవమానానికి గురౌతున్నందుకు ఆమె మనసులో తప్పక బాధపడుతూనే ఉండాలి, కానీ దాన్ని మౌనంగా భరించింది. కాలం ఆగిపోయి నట్టయింది.

ఆ తరవాత అన్నీ త్వరత్వరగా జరిగిపోయాయి. సీత గబగబా అగ్నికి ప్రదక్షిణం చేసి ఒక్క క్షణం కదలక మెదలక ఉండిపోయింది. నెమ్మదిగా తలతిప్పి తన భర్త ముఖంవైపు చూసింది. అందరం ఊపిరి బిగబట్టి ఏం జరుగుతుందా అని చూస్తున్నాం. మరుక్షణం మా అందరినీ ఆశ్చర్యపరుస్తూ సీత నదివైపుకి పరిగెత్తింది. వెంటనే కొండ అవతలివైపున మాయమై పోయింది. ఒక్క క్షణం తటపటాయించి కొందరు సీత మాయమైన కొండ అవతలివైపుకి పరిగెత్తారు. రాముడు దిగ్భ్రాంతికి గురై తన ఆసనంలో కూలబడిపోయాడు.

వృద్ధాప్యంవల్ల నా కాళ్లలో బలం సన్నగిల్లింది. అయినా వీలైనంత వేగంగా పరిగెత్తాను. ఎలాగైతేనేం అసుర రాకుమారి ఈ క్రూర ప్రపంచం కోరలకి చిక్కకుండా తప్పించుకుందని ఆనందించాను. నగర ద్వారాన్ని దాటి బైటికి పరిగెత్తుతూ నా పాత మిత్రుడు, ప్రభువు, రావణుడికి నా కోరిక నెరవేరిందని ఎలుగెత్తి చెప్పాలనిపించింది. ఇది నేను ముందే ప్రణాళిక వేసుకుని చేసిన పనికాదు. మద్యం మత్తులో నేను ఏదో వాగినందువల్లే ఈ సంఘటనలన్నీ జరిగాయి. నా ప్రతీకారంలో హింస లేకపోవచ్చు, కానీ దాని ప్రభావం మాత్రం తక్కువదేమీ కాదు. నా గురించి ఎవరూ పుస్తకాలలో రాయరు, కవిత్వం అల్లరు, మహాకావ్యాలు సృష్టించరు- అసలు అటువంటి పేరు ప్రతిష్ఠలు కావాలని నేను కోరను. నేను వీధుల్లో నాట్యం చేశాను, కిందపడి దొర్లాను. ఇల్లు చేరుకునేసరికి

ఆనందంతో అలసిపోయాను. ఇంట్లో ప్రవేశించగానే నా భార్యని గట్టిగా వాటేసుకున్నాను.

ఊళ్లో పెద్ద ఎత్తున గొడవలు జరిగాయి. తరువాతి పక్షం రోజుల్లో అకారణంగా ఎంతోమంది చనిపోయారు. సీత శరీరం దొరకనేలేదు. సరయూనది లోపలి బురదలో ఆమె కూరుకుపోయి ఉంటుందని అందరూ అనుకున్నారు. చివరి అసుర రాకుమారి భూమాత ఒడిలో సేద తీరటం సరైన ముగింపే అని అనుకున్నాను. ఇప్పుడు ఆమెని కాపాడేందుకు జనకుడి లాంటి వాడు ఎక్కడా లేడు. ఏనాడో ప్రహస్తుడి మాట విని ఆ చిన్న పాపని నేను చంపివేసి ఉంటే ఏమయేదో కదా అని అనిపించింది నాకు. మనిషి ఏం తలిచినా, విధి కోరుకున్న ప్రకారమే బహుశా అన్నీ జరుగుతాయేమో! ఎవరికి తెలుసు?

రాముడు పూర్తిగా కుంగిపోయాడు. అతనికి రాజ్యకాంక్షలేకుండా పోయింది. అతని పేరుతో అతని భట్రాజులు పరిపాలించసాగారు. రోజురోజుకీ పరిస్థితి అధ్వాన్నంగా తయారవటం మొదలుపెట్టింది. రాజు ఏకాంతవాసంలో ప్రార్థిస్తూ, ఉపవాసాలు ఉంటూ, బహుశా తన ప్రియమైన సీతని క్షమించమని కోరుతూ గడపసాగాడు. అసలు విచిత్రం ఏమిటంటే, ప్రపంచంలోనే అతి బలవంతుడైన చక్రవర్తి వద్దనుంచి సీతని విడిపించగలిగినవాడు, ఆమెని రక్షించటంలో విఫల మయాడు. రాముడు తన ప్రజలకోసం, వాళ్ల సుఖసంతోషాలకోసం చాలా పాటుపడ్డాడని అయిష్టంగానే అంగీకరిస్తున్నాను. కులవ్యవస్థని పాటించినంత కాలం ఆయన పరిపాలనలో ప్రజలు ప్రశాంతంగా జీవించగలిగారు. శంబుకుడిలా ఎదురు తిరిగిన వాళ్లు రాముడి ఖడ్గానికి ఎరకాక తప్పలేదు.

రాముడిపట్ల ప్రజలకి గౌరవ మర్యాదలు ఉండటంవల్ల అతను పరిపాలించి నంత కాలం అన్ని కులాలవాళ్లూ అయిష్టంగానైనా కలిసిమెలిసి జీవించారు. కానీ సీత మరణించిన తరవాత రాముడు పరిపాలనకి స్వస్తి చెప్పి రాజ్యాన్ని ఏలటం మానివేశాడు. ఘోర సంప్రదాయవాదులైన మతాధికారులు రాజ్య భారాన్ని తమ చేతుల్లోకి

తీసుకున్నారు. కుల నియమాలు మరింత కఠోరంగా తయారయి, జనజీవనం అణచివేతకి గురయింది. దాన్ని భరించటం అసాధ్యం అనిపించి కొన్ని కుటుంబాలు నగరాన్ని విడిచివెళ్లాయి. మేము కొంతకాలం అక్కడే ఉండి మా వృత్తిని కొనసాగించాం. నేనూ, శివా మళ్లీ మద్యం తాగటం ప్రారంభించాం. ఒకసారి బాగా తాగేసి శివ తన భార్యతో గొడవపడ్డాడు. ఆ గొడవ చిలికి చిలికి గాలివానగా మారి, మితిమీరిన ఆవేశంలో అతను ఆమెని కత్తితో పొడిచాడు. రెండు రోజుల తరవాత ఆమె చనిపోయింది. శివని రక్షకభటులు పట్టుకుపోయి చెరసాలలో పెట్టారు.

కొన్ని నెలలు భారమైన మనసుతో అక్కడే గడిపి మేము నగరం వదిలి దక్షిణదిశగా ప్రయాణమయాం. కాలి నడకన అరణ్యాలనీ, బీడు భూములనీ దాటుకుంటూ ప్రయాణం కొనసాగించాం. దారిలో దోపిడీ దొంగలు మమ్మల్నీ, మాలాగే నగరం వదిలిపోతున్న మరిన్ని కుటుంబాలనీ అటకాయించి ఉన్నది కాస్తా ఊడ్చేశారు. చివరికి నర్మదానదీ తీరాన సహ్యాద్రి పర్వత సమీపంలో ఉన్న హైహయ నగరానికి చేరుకున్నాం. అది కార్తవీర్యార్జునుడి రాజధాని. నగరం సుభిక్షంగానే ఉన్నట్టు కనిపించింది. ముసలి రాజుని పరశురాముడి ఉగ్రవాదుల బృందం హతమార్చింది. ప్రస్తుతం ఆయన కుమారుడు పరిపాలిస్తున్నాడు. ఆ నగరంలో కులవ్యవస్థ అంత కఠోరంగా అమలుకాకపోవటం చూసి, అక్కడ కొన్నాళ్లు ఉండిపోయాం. ఏడాది గడిచేసరికి స్థానికులకి మేము అక్కడికి రావటం నచ్చలేదన్నది అర్థం కాసాగింది. కొందరు దుండగులు మామీద దాడిచెయ్యటం ప్రారంభించారు.

మళ్లీ ఆ నగరం వదిలి బైలుదేరాం. కొంతకాలం ప్రయాణం చేసి గోకర్ణ నగరం చేరుకున్నాం. రావణుడి ఆదేశాన్ని అనుసరించి మయుడు అక్కడ బ్రహ్మాండమైన శివాలయాన్ని నిర్మించాడు. ప్రయాణంతో అలసిపోయిన మేము మరి ముందుకి పోలేక అక్కడే ఆగిపోయాం. నగరానికి చాలా దూరంగా అరణ్యం అంచున, వెలివేయబడిన వాళ్లలా

స్థిరపడ్డాం. మమ్మల్ని నగరంలోకి ప్రవేశించనివ్వలేదు. ఏదోవిధంగా మేము పొట్టపోసుకుంటూ ఉండగా, మాలకి జ్వరం వచ్చి చనిపోయింది. అప్పుడు ఆమె వయసు డెబ్భై సంవత్సరాలు. ఆమె మరణంవల్ల నా మనసులో పెద్ద శూన్యం ఏర్పడింది. అలా నన్ను ఒంటరిని చేసి వెళ్లిపోయిన మాలని నది ఒడ్డున పూడ్చిపెట్టాను.

గోకర్ణ నగరంవైపు నడవసాగాను. నగరాన్ని సమీపిస్తూ ఉండగా రాముడు లక్ష్మణుడికి మరణశిక్ష విధించాడనీ, మతాచార్యులే రాముడిని ఆపనికి బలవంత పెట్టారనీ విన్నాను. ఎందుకంటే వాళ్లు నెలకొల్పిన కఠోర నియమాలని లక్ష్మణుడు ప్రశ్నించసాగాడు. పరిపాలనలో ఆసక్తి చూపించి, ఆ నియమాలు విచిత్రంగా ఉన్నాయనీ, వాటివల్ల ప్రజలు అష్టకష్టాలూ పడుతున్నారనీ గమనించాడు. వృత్తులు చేసుకునే జనం నగరాన్ని వదిలిపోవటంచేత ఆర్థిక పరిస్థితి దెబ్బతింది. అస్తవ్యస్తంగా ఉన్న రాజ్యం పరిస్థితిని చక్కబరచేందుకు ప్రయత్నించసాగాడు లక్ష్మణుడు. మతాధికారులకు అది నచ్చలేదు. లక్ష్మణుడిమీద పగ తీర్చుకునే అవకాశంకోసం చూడసాగారు. రాముడే ఆ అవకాశం కల్పించాడు. లక్ష్మణుడు చేసిన ఒక తప్పు రాముడికి కోపం తెప్పించింది. అది వాళ్లకి సంతోషాన్ని కలిగించింది. కొందరు మహర్షులు రాముడిని ఏకాంతంగా కలుసుకోవాలని అనుకున్నారు. అంతకుముందే బ్రాహ్మణుల ఒక వర్గం తనతో మాట్లాడుతుండటం వలన లోపలికి యింకెవరినీ పంపించవద్దని రాముడు లక్ష్మణుడికి ఆదేశించాడు. కానీ ఇంతలో మరొక మహర్షి తనను కూడా లోపలికి పంపించమనీ, తనని వెళ్లనివ్వకపోతే మొత్తం రాజవంశాన్ని శపిస్తాననీ బెదిరించాడు. లక్ష్మణుడు ఆయన మాటలకి భయపడి ఆయన్ని కూడా లోపలికి పోనిచ్చాడు. ముందు లోపలికి వెళ్లిన బ్రాహ్మణులకి కోపం వచ్చి పవిత్ర గ్రంథాలని సాక్ష్యంగా చూపించి, ఆ ఘోరాపరాధానికి లక్ష్మణుడికి శిక్షపడవలసిందే అని నిర్ధారించారు. రాముడు కూడా లక్ష్మణుడు చేసిన 'అపరాధానికి అతనికి మరణశిక్ష విధించాడు. ఆ విధంగా లక్ష్మణుడు - మేఘనాదుడిని హతమార్చిన గొప్ప యోధుడు,

అన్నగారికోసం యావనవతి అయిన తన భార్యని వదిలి వనవాసానికి ఏగిన అనుజుడు, చిన్నతనంనుంచే రాముని ఎడల భక్తి శ్రద్ధలతో మెలుగుతూ వచ్చినవాడు - అంతమొందాడు. లక్ష్మణుడు చేసిన త్యాగాలూ, చూపిన భక్తి శ్రద్ధలూ, సోదర ప్రేమా, తనకి సలహాలిచ్చే బ్రాహ్మణుల మాటలువినే రాజు పాదాల దగ్గర బలి అయాయి.

పయస్వినీ నదిని దాటుతూ ఉండగా రాముడి మరణం గురించి ఒక సాధువు చెప్పగా విన్నాను. రాముడు తన ధర్మాన్ని నెరవేర్చటంకోసం తను అందరికన్నా ఎక్కువగా ప్రేమించిన ఇద్దరు వ్యక్తులని బలి ఇచ్చాడు. ఆ తరవాత క్రమక్రమంగా నిరాశలో కూరుకుపోతూ, అన్నిటికీ దూరంగా ఉంటూ చివరికి సరయూనదీ జలాలలో శాశ్వత ఉపశమనం పొందాడు. పవిత్ర గ్రంథాలలో చెప్పిన నియమాలకి కట్టుబడి రాముడు అన్నీ కోల్పోయాడు. ప్రపంచంలోకల్లా గొప్ప చక్రవర్తిమీద విజయం సాధించిన రాముడి జీవితం అప్రతిష్ఠాకరంగా ముగిసిపోయింది. నా మనుమడు శంబుకుడి మీదికి కత్తిదూసి వచ్చిన రాముడి కళ్లలోని నిస్సహాయతనీ, దైన్యాన్నీ నేనిప్పటివరకూ మరిచిపోలేదు.

రావణుడు తన జీవనవిధానాన్నితను అనుకున్నట్టే మలుచుకుని జీవించాడు. మతాచార్యులూ, మునులూ, రుషులూ పూర్వకాలంలో రాసిన విధానాలని లెక్కచెయ్యకుండా తాను సరైనవని అనుకున్న వాటినే అనుసరించాడు. జీవితాన్ని సంపూర్ణంగా అనుభవించి యోధునిలా మరణించాడు. రాముడూ, రావణుడూ నమ్మిన సిద్ధాంతాలూ, విలువలూ, ధర్మానికి వాళ్లు ఇచ్చిన నిర్వచనాలూ, వాళ్ల జీవితాల విషయంలో లాగే మరణం విషయంలో కూడా భిన్నంగా ఉన్నాయి. కానీ అంతిమ సత్యం మాత్రం ఒకటే - ఒక బ్రహ్మాండమైన ప్రహసనంలో వాళ్లు ఇద్దరూ నటులు. ఇక ఎవరు గెలిచారు అనే చిన్న అంశం మాత్రమే మహాకావ్యంలాంటి వాళ్ల జీవితగాథల్లో నాయకుడు ఎవరు, ప్రతినాయకుడు ఎవరు అనే విషయాన్ని నిర్ధారిస్తుంది.

కాలక్రమాన రాముడు దేవుడనీ రావణుడు రాక్షసుడనీ అందరూ అనుకోవచ్చు. ఎందుకంటే ఒకరు మతాచార్యుల చేతుల్లో

బంకమన్నులా ఉంటే, మరొకరు మొండిగా, శిలలాగ, సంప్రదాయాలని ధిక్కరిస్తూ తనమాటనే నెగ్గించుకుంటూ బతికాడు. వేదాలలాంటి పవిత్ర గ్రంథాలని తమ స్వార్థానికి ఉపయోగించుకుంటూ, అందరినీ దోపిడీకి గురిచేస్తూ పెత్తనం చెయ్యాలని అనుకునే వారికి రావణుడిలాంటి వారెవరైనా ప్రమాదకరమైన వాడిలాగే కనిపిస్తారు. అటువంటి వారు తమ విధానాలని సమర్థించుకోవటానికి రాముడిలాంటి వారిని ఒక ఆదర్శంగా ఉపయోగించుకుంటారు. కానీ కాలం గడిచేకొద్దీ రాముళూ, లక్ష్మణులూ కూడా, తమలోని మానవత్వం ఎదురు తిరగటం ప్రారంభించి, ప్రమాదకరంగా మారిపోతారు. ఒక బాలుడి తల నరికే సమయంలో రాముడి చేతులు వణకటం చూసిన దైవత్వం ఏమాత్రం లేని మతాచార్యుల కూటమికి, రాముడు తరవాత ప్రమాదకరంగా మారగలడని తెలిసింది. రాముడి శత్రువులకి ఆసరికే కళంకం అంటగట్టి ఉండటంచేత వాళ్లు రాముడికి దైవత్వాన్ని ఆపాదించారు. వాళ్లకి అదొక్కటే మార్గమని అనిపించింది. రాముడిలాంటి వారితో వాళ్లు కొంతకాలం వేగగలరేమో కాని రావణుడిలాంటి వాళ్లు కొరుకుడు పడరు. కానీ వాళ్లకి అందరికన్నా ఎక్కువ సంతోషం కలగజేసేది విభీషణుడు, కుబేరుడు, వరుణుడిలాంటి వాళ్లే. తీవ్ర ధోరణి గలవారి అడుగులకి మడుగులొత్తే వారికే ఈ లోకం కాని, రాముడిలాంటి ముక్కుసూటి వారికీ, రావణుడిలాంటి తిరుగుబాటుదార్లకీ పనికిరాదు. హత్యలూ, అంగచ్ఛేదనలూ, పోరాటాలూ, లేక వేదాలు, మతం పేరుతో ఎటువంటి అమానుష మైన చర్యలైనా చేసేందుకు వెనకాడని వాళ్లే ఈ లోకాన్ని సొంతం చేసుకోగలరు. నా వంటి అనామకులు ఈ పాఠాన్ని నేర్చుకుంటే గాని ఈలోకంలో మనలేరు. ఒక్కొక్కసారి రావణుడు, రాముడు, బలి చక్రవర్తి, శంబుకుడి గురువులాంటి వాళ్లు మాకు చూపించే కలల ప్రపంచం మమ్మల్ని దారి మళ్లిస్తుంది, కానీ అందుకు ఎప్పుడూ కూడా మూల్యం చెల్లించాల్సిన పరిస్థితి వస్తుంది. కానీ ఒక్కోసారి కలలు నశించవు, జీవించి ఉండటం అంత ముఖ్యం కాదని అనిపిస్తుంది. రావణుడిలాగ, మేఘనాదుడిలాగ జీవించటంలోనూ మరణించటంలోనూ గొప్పదనం ఉండవచ్చు. రాముడిలా ధర్మంలాంటి

అస్పష్టమైన విలువకోసం నిలబడటంలో అన్నీ కోల్పోవటంలో సంతృప్తి ఉండవచ్చు. కానీ మావంటి వారికి అవి ఆకాశ కుసుమాలు... సాధ్యం కానివి.

నెలరోజులు నడిచి ప్రయాణం చేశాక నేను పుట్టిన స్థలానికి చేరుకున్నాను. లోయలో వెండి రేఖలా పూర్ణానది కనిపించగానే నా మనసు ఆనందంతో ఉరకలు వేసింది. జ్ఞాపకాలు తరుముకు రాగా ఉక్కిరిబిక్కిరి అయాను. వీలైనంత వేగంగా కిందికి దిగి నది దగ్గరకి చేరుకున్నాను. స్వచ్ఛంగా స్ఫటికంలా ఉన్న నీటిలోకి దూకి బాతులా ఈదాను. మళ్లీ యౌవనంలోకి అడుగుపెట్టినట్టు అనిపించింది. అలా కలల్లో తేలిపోతూ ఎంతసేపు ఈదుతూ ఉండిపోయానో నాకే తెలీదు. హఠాత్తుగా ఒక రాయి వచ్చి నా నుదుటికి తగిలింది. "అస్పృశ్యుడా, ఈ పవిత్ర జలాలని అపవిత్రం చెయ్యటానికి ఎన్ని గుండెలురా నీకు?" అని ఎవరో అరవటం వినిపించింది.

నేను మెట్లు ఎక్కిపైకి వచ్చాను. పై కులం వాళ్లు కొందరు నావైపు గుడ్లరిమి చూడటం కనిపించింది. నేను కాలికి బుద్ధి చెప్పాను. దేవుడికి సొంతమైన ఆ నదీజలాలనుంచి దూరంగా తప్పుకున్నాను. ఆ తరవాత నా ప్రాంతం భగవంతుని స్వంతదేశం అయిందనీ, అక్కడ మనుషులకి చోటు లేదనీ తెలిసింది.

అసురుల ఆఖరి ప్రతిఘటనని పరశురాముడు విజయవంతంగా అణచివేశాడు. అతను ఎంతో క్రూరమైన, కఠోరమైన కుల వ్యవస్థని స్థాపించాడు. పరశురాముడు సృష్టించిన ఈ నరకంతో పోలిస్తే రాముడి రాజ్యం స్వర్గం అనాలి. ప్రతీరాయి వెనకా, ప్రతీచెట్టూ కొమ్మమీదా, ప్రతీ మలుపులోనూ దేవుళ్లు వెలిసి మానవులకి స్థలం లేకుండా చేశారు. పరశురాముడు ఉత్తర దిక్కునుంచి అరవై నాలుగు బ్రాహ్మణ కుటుంబాలని తీసుకువచ్చాడు. నా జన్మస్థలం రకరకాలకుల పట్టింపులతో, నిషేధాలతో మానసిక రోగుల నిలయంలా మారిపోయింది. చాలామందిలాగే నాకు కూడా ఈ ప్రదేశాన్ని వదిలి పడమటి దిక్కున ఉన్న ఎడారి ప్రాంతాలకి పారిపోవాలని అనిపించింది.

కానీ మళ్లీ ప్రయాణం చేసే వయసు కాదు నాది. ఇక్కడే జన్మించాను, ఇక్కడే మరణించాలని ఉంది నాకు. ఇక్కడ నేల సారవంతమైనది. చర్మం రంగులోని తేడాలని అది పట్టించుకోదు. కొబ్బరికాయలూ, పనసపళ్లూ, కుందేళ్ళూ ఉసిరికాయలూ, పూర్ణానదిలోని చల్లని నీళ్లూ- నా ఒంగిపోయిన వృద్ధ శరీరంలో ప్రాణాలు నిలుపుకునేందుకు ఇవి చాలు.

అప్పుడప్పుడూ నేను కొండలమీదికి ఎక్కి గంభీరంగా కిందికి దూకే పూర్ణానది జలపాతాన్ని చూస్తూ కూర్చుంటాను. ఎందుకో తెలీదు కానీ అలా చేస్తే నా మనసుకి శాంతి లభిస్తుంది. చిన్నపిల్లవాడిగా ఉన్నప్పుడు అక్కడినుంచి అంత ధైర్యంగా ఆ జలపాతంలోకి ఎలా దూకేవాడినా అని ఆశ్చర్యం వేసేది. జలపాతం పైన పొడుచుకువచ్చిన నల్లని రాతిమీద వెల్లకిలా పడుకుని నీలాకాశాన్ని చూస్తూ ఆకాశంలో దూదిపింజెల్లా ఎగిరే మబ్బులని చూస్తూ గడుపుతాను. జలపాతం చప్పుడుతోపాటు చిలకల అరుపులు కూడా వినబడుతూ ఉంటాయి. ఈ విశ్వం అనంతమైనదిలా, శాశ్వతమైనదిలా, ఎటువంటి అవరోధాలూ లేనిదిలా కనిపిస్తుంది. ఒక్కోసారి మనిషి చేసే తుచ్ఛమైన ప్రయత్నాలూ, పడే అగచాట్లూ దానికి పట్టనట్టు కనిపిస్తుంది. కానీ ఒక్కోసారి ఒక బ్రహ్మాండమైన కన్ను మనని గమనిస్తోందా అన్న అనుమానం వేస్తుంది. నేను జీవితానికి అర్థం వెతకటం మానేసి చాలాకాలమైంది. నా రంగు నలుపు కాబట్టి నేను బహుశా మూర్ఖుడినేమో!

కానీ కొన్ని రోజులు గడిచాక, ముఖ్యంగా వర్షాలు కురిసి వెలిశాక, ప్రకృతి వివిధ రంగులలో సరికొత్తగా అలంకరించుకున్నప్పుడు, గడ్డిపూల పరిమళం గాలిలో నిండినప్పుడు నది అవతలిగట్టునుంచి పాటలు తేలివచ్చి నా చెవులకి సోకుతాయి. బలిచక్రవర్తి ఆ ప్రదేశాన్ని పరిపాలించిన స్వర్ణయుగం గురించిన పాటలు- ప్రతి వ్యక్తీ సమానమని తలచిన రోజులు అవి, ఎల్లప్పుడూ శాంతి నెలకొని మోసాలూ, కుట్రలూ లేని కాలం అది అని - పాడే వాళ్ల అమాయకత్వం చూసి నేను

అప్పుడప్పుడూ నవ్వుకుంటాను. కానీ తరచు వేదన, ఆశ కలగలిసిన భావమేదో నా మనసుని కమ్మేస్తుంది. నదికి ఆవలివైపు నావంటి నల్ల చర్మం గలవారి గ్రామాలు ఉన్నాయేమో! వాళ్లు స్వర్ణయుగం మళ్లీ వస్తుందన్న ఆశతో పండుగలు జరుపుకుంటున్నారేమో! ఎప్పుడో చనిపోయి ఉత్తరాన ఉన్న సహ్య ప్రాంతంలోని ఏదో గుహలో పూడ్చిపెట్టబడిన మహారాజు మళ్లీ వస్తాడని ఎదురుచూస్తున్నారేమో! అయినా వాళ్ల ఆశల్లో మాధుర్యం ఉంది. మనుషుల మనసుల్లో దాగిన మాటల్లో వివరించలేని కలలు అందంగా ఉంటాయి. ఏ పవిత్ర గ్రంథాలూ ఆ అందాన్ని చెరిపివెయ్యలేవు. ఏ నిషేధాలూ వాటిని ఆపలేవు. ఏ దేవుళ్లూ ఆ కలల సౌందర్యాన్ని అపహరించలేరు. మనుషులు చనిపోవచ్చు, కానీ ఆశలు జీవించే ఉంటాయి. నేను వృద్ధుడినై పోయాను. లక్షలమందిలాగే ఏదో ఒకరోజు అనామకంగా చనిపోతాను. నా ఆనవాళ్లేవీ ఈ లోకంలో మిగిలి ఉండవు. బ్రాహ్మణులు చెప్పినట్టు నేను మళ్లీ మళ్లీ పుడతానేమో. అలా జరిగితే అంతకన్నా గొప్ప ఆశ ఇంకొకటి ఉండదు. జీవితం అనే స్వరసమ్మేళనంలో ప్రతి మరణం ఒక విరామం. మళ్లీ మళ్లీ ఈ అద్భుతమైన లోకంలోకి తిరిగి వస్తామనే ఆలోచనలో అంతులేని సౌందర్యం ఉంది. అలా ఏదో ఒకసారి ఈలోకంలోకి నేను మళ్లీ వచ్చినప్పుడు ఆ అద్భుతమైన పాటలోని మాటల్లో నిజం ఉందని తెలుసుకుంటానేమో, ఎవరికి తెలుసు!

కృతజ్ఞతలు

'అసురుడు' చాలామందికి ఎంతో రుణపడి ఉంది. ముందుగా నా తలిదండ్రులు, స్వర్గీయ ఎల్. నీలకంఠన్ కీ చెల్లమ్మాళ్ నీలకంఠన్ కీ చాలా రుణపడ్డాను. భారతీయ పురాణాల అద్భుత ప్రపంచాన్ని వాళ్లే నాకు పరిచయం చేశారు. నా సోదరులు, లోకనాథన్ కీ, రాజేంద్రన్ కీ కూడా కృతజ్ఞతలు చెప్పుకోవాలి. ఎన్నో సాయంకాలాలు, నా తలిదండ్రులతోనూ, సోదరులతోనూ కలిసి కూర్చుని భారతీయ తత్త్వశాస్త్రం గురించీ, మహాకావ్యాల గురించీ, జానపద గాథల గురించీ చర్చించి, అభిప్రాయ భేదాల గురించి వాదించుకునేందుకు కూడా అవకాశం కల్పించినందుకు వాళ్లకి కృతజ్ఞతలు. ఒక వ్యక్తిగానూ, రచయితగానూ నేను అభివృద్ధి సాధించటంలో నా సోదరి చంద్రిక, ఆమె భర్త పరమేశ్వరన్ వహించిన పాత్రలు నాకు కృతజ్ఞతలు తెలుపకుండా ఉండటానికి సాధ్యం కానివి. మామూలుగా ఊహాలోకాల్లో తేలిపోయే ధోరణి నాది. కానీ నేను అడగకపోయినా నా సోదరీసోదరుల పిల్లలు, దివ్య, రాఖీ, దిలీప్ చేసిన అల్లరి, విమర్శలూ, అధికప్రసంగం నన్ను అదుపులో ఉంచాయి. నా ప్రాణస్నేహితుడు సంతోష్ ప్రభుకీ నాకూ మధ్య పాతికేళ్లుగా జరుగుతూన్న వాదనలు నాకు అప్పటినుంచీ ఇప్పటివరకూ సరదాగానే అనిపిస్తాయి, అవే లేకపోతే ఈ పుస్తకం సాధ్యమయి ఉండేది కాదు. నా మొదటి రాతప్రతిని శ్రమ తీసుకుని సరిదిద్దిన లక్ష్మీనాయర్కి ధన్యవాదాలు తెలపాలి. చివరి రాతప్రతిని చదివి తప్పులని సరిదిద్దిన నా సహోద్యోగి ప్రేమ్జీత్ కి ధన్యవాదాలు. పూర్తి కథని చదివేందుకు తీరిక చేసుకుని, అచ్చుతప్పులనీ, పొరపాట్లనీ ఓపిగ్గా ఎత్తిచూపిన రాజీవ్ ప్రకాష్ కి రుణపడి ఉంటాను.

రావణుడికీ, భద్రుడికీ మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు లీడ్స్టార్ట్

సిబ్బంది మొత్తానికీ కృతజ్ఞతలు. లీడ్ స్టార్ట్ ఎడిటర్, డైరెక్టర్ చంద్రలేఖ మైత్ర ఇచ్చిన ప్రోత్సాహం అసాధారణమైనది. ఆమెకి ఎంతగా ధన్యవాదాలు తెలిపినా సరిపోదు. ఆమె సమర్థించి సహకరించి ఉండకపోతే 'అసురుడు' నా ల్యాప్ టాప్ లోనే ఇంకా నిద్రపోతూ ఉండేది. మొదటిసారి ఒక పుస్తకం రాసిన రచయిత రాతప్రతిని ఎంతో శ్రమపడి సరిదిద్ది మార్పులూ చేర్పులూ చేసినందుకు ఆండ్రియా బారటన్ డిసూజాకి కృతజ్ఞతలు. ఆమె ఓర్పుకి పురస్కారం ఇవ్వవలసిందే. అద్భుతమైన ముఖచిత్రం వేసి ఇచ్చి మిష్టా రాయ్ కీ, పుస్తకం లోపల చిత్రాలు వేసి ఇచ్చిన ఆంపిల్ క్రియేషన్స్ స్టూడియో సుబుకీ, అశోక్ కీ కృతజ్ఞతలు.

నా జీవన సహచరి అపర్ణ సహకారం, ప్రోత్సాహం, ప్రేమ లభించి ఉండక పోతే ఈ పుస్తకం రాయటం సాధ్యమయేది కాదు. ఆమెకి ప్రేమాలింగనంతో కృతజ్ఞతలు. ఇక నా ఇద్దరు అల్లరి పిల్లలు అనన్యకీ, అభినవ్ కీ రాబోయే వంద రాత్రులలో వంద కథలు బాకీ ఉన్నానని తప్ప ఇంకేమీ చెప్పలేను. వాళ్లకి నేను రాసే కథల కన్నా నేను చెప్పే కథలంటేనే ఎక్కువ ఆసక్తి. చివరిగా, భారతదేశంలో ఎందరో అనామకులైన కథలు చెప్పేవారికీ, మూడువేల ఏళ్లుగా కథ చెప్పటం అనే సంప్రదాయాన్ని సజీవంగా ఉంచిన వారందరికీ మనసారా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. అన్నిటికన్నా ఎక్కువగా, నా దేశానికీ, నా దేశంలో తరగని నిధిలా కొనసాగుతున్న మతసంబంధమైన పురాణ సాహిత్యానికీ సదా సర్వదా రుణపడి ఉంటాను.